THE BOOK WAS DRENCHED

శ్రీరస్తు

కంబరామాయణము

(ద్వితీయ సంపుటము)

పూతలపట్టు శ్రీరాములు రెడ్డి

కర్త.

UNIVERSAL
LIBRARY
OU_206057
UNIVERSAL
LIBRARY

OUP—24—4-4-69—5,000

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T81 S77K   Accession No. P. G. T875

Author శ్రీరాములురెడ్డి, పూతలపట్టు.

Title కంబ రామాయణము. 1953.

This book should be returned on or before the date last marked below.

సాహిత్య ప్రచారిణి 33.

శ్రీరామ.

కంబరామాయణము.

(ఆంధ్రానువాదము.)

Post Graduate Library
College of Arts & Commerce, O. U.

ద్వితీయ సంపుటము

(సుందర, యుద్ధకాండములు)

గ్రంథకర్త:

[illegible]

చిత్తూరు

శ్రీ [illegible] ముద్రాక్షరశాలయందు ముద్రితము.

1953

మూల్యము 12-8-0.



కవిచక్రవర్తి కంబకవి

శ్రీరామ.

విజ్ఞప్తి.

ప్రథమ సంపుటము ముద్రణ మంత శ్రమ యొసఁగలేదు. కాలము సుభిక్షమై జనుల హృదయములు విశాలములై యుండెను. మిత్రుల సాయమున నది సులభముగ నెఱవేఱెను. తరువాతి కాలము తాఱుమాఱైనది. వానలులేవు. బావులును త్రవ్వ కొలఁదిని చిత్రముగా మఱిమఱి నీరడుగంటుచుండెను. చిత్తూరుజిల్లా ప్రజలు పొంద రాని హృదయ విదారక దశను పొందిరి. తినఁగూడు త్రాగనీరు కఱవయ్యె. పల్లెటూళ్లలో ముప్పాతిక మువ్వీసము జనము గంజికేంద్రములవలన ప్రాణములు నిలుపుకొనఁగలిగెను. ఇట్టి స్థితిలో ద్వితీయ సంపుటము ముద్రణము తలపెట్టుటయు నపచారమగునని యూరకుంటిని. ఇట్లుండ, ఎన్నఁడో కోరియుండిన కాగితములు కలకత్తానుండి వచ్చి దిగినవి. పైస చేతలేని యేను వేయిమ్మన్నూట యేఁబదిరూపికలెటనుండి తెత్తు? వలదని వదలుట యెట్లు? అని డోలాందోళిత మనస్కుఁడనై యుండ నా ప్రాఁతశిష్యుఁడును గురుభక్తి యుక్తుఁడును ఆప్తుఁడునై యున్న శ్రీ L. G. వెంకటమునినాయఁడు తన కెన్నియో చిక్కులుండినను ధైర్యవాక్కులాడి ధనసాహాయ్యముచేసి కాగితములను దించుకొనెను.

అట్టియెడ నెల్లూరఁ బ్రతి వత్సరము జరపు తిక్కన వర్ధంతికి శ్రీ శ్రీ తిక్కవరపు రామిరెడ్డిగారు నన్ను (7—3—53) పిలిపించి నూటపదునాఱు లొసఁగి సమ్మానించిరి. శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు మఱునాఁడు కంబరామాయణము నందలి కొన్ని ఘట్టములు చదువఁగోరిరి. విన్నవారందఱు సంతసించి రెండవభాగముకూడ త్వరలో అచ్చగుట మేలని యభిప్రాయము లొసంగిరి. అచ్చటి న్యాయవాదులును సరసులు నగు శ్రీ ఎం. సుబ్బరావుగారు (బి. ఏ., బి. ఎల్., అడ్వొకేటు) ఇట్టి సద్గ్రంథముల కెన్నింటికో సాయపడిన శ్రీ తి. రామిరెడ్డిగారే దీనికిని పూనుకొనఁగలరని యాశించుచుంటిమనిరి. దానికి శ్రీ రెడ్డిగారొక చిఱునవ్వు కటాక్షించిరి. అది అంగీకార సూచకమో మఱియేమో అప్పటి నామంద బుద్ధికందలేదు.

ఇయ్యది జరిగిన మఱి పదిదినములలో మదరాసున, కారైకుడివాసులు కంబకవిభక్తులు నగు శ్రీ. సా. గణేశన్‌గారు శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారిని సంధించిన తఱిఁ దామేఁటేఁట నడపుచున్న కంబన్ తిరునాళ్లకు ఆహ్వానింపఁగా 'నన్ను పిలుచు

కంటె కంబరామాయణము నాంధ్రీకరించియున్న మా శ్రీరాములురెడ్డిగారిని పిలుచుట అన్నివిధముల ప్రయోజనకరము కదా?' యనుడు నాతేఁ డపరిమిత మోదమంది నాఁడే పెద్దయుత్తర మొండు వ్రాయుచు తంతులపై నన్నువారి తిరునాళ్లకు పిలిపించి యతిథి సత్కారములతోడ నామహాసభలో (28—3—53) 'మహాదాతలు' 'కుబేరులు' అని విఖ్యాతి గడించిన శ్రీ డాక్టరు అళగప్పసెట్టిగారి హస్తముల మీఁదుగా నాకొక్క కనకాంబర మొసఁగి సత్కరించె. ఆసభకు దక్షిణదేశమందంతట నుండియు మహానాయకులు పండితులు కవులు నాలుగైదు వందలకు పైఁగా వచ్చియుండిరి. ఆ యందఱితో నాకు పరిచయ భాగ్యము లభించినది. వేలకొలఁది నిండిన ఆ సభ జరగిన నాలుగు దినములు నన్ను స్వర్గ సభావాసు ననిపించినవి.

ఇంతటి సన్మానమునకు కారకులు శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారే కద! యని వారికొక కృతజ్ఞతా లేఖ వ్రాయుచు కంబరామాయణము ద్వితీయ సంపుట ముద్రణ మొండు రెండు వారములలో నారంభింప యత్నించుచున్నాఁడనని సూచించితి. ఆయుత్తరమును వారి మామగారగు శ్రీ తి. రామిరెడ్డిగారు తిలకించి రెండువేల రూపికలు (Draft) పంపుచు 'దీని నుంచుకొని ముద్రణ మారంభింపుఁడు. కొఱవడినది మరల నంపెద' మని వ్రాసిన లేకను గాంచి యాశ్చర్యచకితుఁడనై 'లోకము కోరకున్నను ఉపకరించుచుండుట ఘనుల లక్షణము కదా!' యని నన్ను నేన సమాధాన పఱచుకొని యీ ముద్రణము వ్యయశ్రమము నుంతేని లేక నెఱవేర్పఁగలిగితి. కాఱైక్కుడి సన్మాన వృత్తాంతము అన్ని ఆంగ్ల పత్రికలును ఛాయాచిత్రములతోడ అన్ని అఱవ పత్రికలును వెల్లడించినవి. అది గాంచి 'తిరువాన్కూరు రెడ్డియార్ ఐక్య సంఘమువారు నా పరిశ్రమము శ్లాఘించుచు నూటయొక్క రూపికలు కానుకగా నంపిరి. అంతకు మున్నె గనే చెన్నరాష్ట్ర ప్రధానామాత్యులుగా నుండిన మాననీయులు శ్రీ ఓమందూరు పెద రామస్వామి రెడ్డిగారొక నూట పదునాఱు రూపాయ లంపిరి. ప్రథమ సంపుట ముద్రణానంతరము నూట పదునాఱులు పంపిన రాజపోషకులు.

శ్రీమతి ఇనుగుర్తి జానకమ్మగారు, పరమేశ్వర మంగళము.

శ్రీ T. N. విశ్వనాథరెడ్డిగారు, (M. P.) మదనపల్లె.

ఏఁబది రూపికలంపిన పోషకులు.

శ్రీ L. G. వెంకటమునినాయుఁడుగారు, చిత్తూరు.

,, G. బాలగురప్పనాయుఁడుగారు, చిత్తూరు.

,, D. రామలింగారెడ్డిగారు, విజయకుమార ఆయిల్ మిల్స్, తిరుత్తని.



విద్యాపోషకులు

శ్రీ శ్రీ తిక్కవరపు రామిరెడ్డిగారు

నెల్లూరు.

ఇరువది యైదు రూపికలంపిన ప్రోత్సాహకులు.

శ్రీ క. సుబ్రహ్మణ్యపిళ్లగారు, పట్రపల్లి.
,, క. నాగరత్నపిళ్లగారు, పట్రపల్లి.
,, క. నాగరత్నపిళ్లగారు, పుత్తూరు.
,, పెద్దబ్బనాయఁడుగారు, మోదుగలపల్లి.
,, S. నరసింహారెడ్డిగారు, సంతెపల్లి.
,, మణియం శ్రీరాములురెడ్డిగారు, పుణ్యాసముద్రం.
,, క. సుబ్రహ్మణ్యపిళ్లగారు, పుణ్యాసముద్రం.
,, వెంకటసామిరెడ్డిగారు, ద్వారకాపురం.
,, దొరసామిరెడ్డిగారు, ద్వారకాపురం.
,, అగరం రఘునాథరెడ్డిగారు, అగరంపల్లి.
,, ఎ. కృష్ణమనాయఁడుగారు, అగరంపల్లి.
,, గాం. గోవిందశెట్టిగారు, కాణిపాకు.
,, క. సుబ్రహ్మణ్యపిళ్లగారు, కాణిపాకు.
,, జి. శ్రీనివాసులునాయఁడుగారు, కాకర్లవారిపల్లి.
,, జి. నల్లచెంగమనాయఁడుగారు, కాకర్లవారిపల్లి.
శ్రీ గ. చిన్నయ్యనాయఁడుగారు, తిమ్మాజిపల్లి, (కాణిపాకు).
,, మణియం. నారాయణసామిరెడ్డిగారు, చినకాంపల్లి.
,, కరింరెడ్డిగారు, చినకాంపల్లి.
,, రా. చంద్రయ్యనాయఁడుగారు, మారేడుపల్లి.
,, మొ. చిన్నచిన్నమరెడ్డిగారు, పుత్తూరు.
,, మణియం. మొ. జయరామరెడ్డిగారు, పుత్తూరు.
,, నడిపి. కృష్ణారెడ్డిగారు, పుత్తూరు.
,, కరణం. గంగాధరపిళ్లగారు, రేగల్లు.
,, చ. చెంగమనాయఁడుగారు, గారంపల్లి.

ఏఁబది రూపికలంపిన పోషకులు

శ్రీ ఎత్తేపల్లి. దొరసామిరెడ్డిగారు, చినకాంపల్లి.
,, P. మునిరెడ్డిగారు, పులికల్లు.
,, K. మణ్ముగంగారు, బెంగళూరు.

శ్రీ C. రాజగోపాలపిళ్లగారు, మైసూరు.

" దేవరాజులురెడ్డిగారు, వెణ్ణంపల్లి మిట్టూరు.

" D. కృష్ణమూర్తిరావుగారు, బి. ఏ. బి. ఎల్. అడ్వొకేటు, చిత్తూరు.

ఇరువదిరైదు రూపికలంపిన ప్రోత్సాహకులు.

శ్రీ టి. నరసింహారెడ్డి, మట్టిపాడు, వాయల్పాడు తాలూకా

" టి. సి. మల్రెడ్డి, మట్టిపాడు, "

శ్రీ శేషయ్యనాయుఁడుగారు, మండి, చిత్తూరు.

" P. తులసిరెడ్డిగారు, వెణ్ణంపల్లి మిట్టూరు.

" మణియం తిరుమలప్పనాయుఁడుగారు, వడ్రాంపల్లి.

" R. శంకరరావుగారు, బి ఏ. బి. ఎల్. అడ్వొకేటు, చిత్తూరు.

" G. శ్రీరామరెడ్డిగారు, చింతపర్తి.

" P. రామనాథరెడ్డిగారు, సింహారాజపురము, రామకృష్ణరాజుపేట.

శ్రీ అప్పిరెడ్డిగారు, నాగేంద్రపురము.

" నటకల రామనాథంశెట్టిగారు, జవిళి వ్యాపారులు, చిత్తూరు.

" T. K. T. వీరాచారిగారు, బి. ఏ. బి. ఎల్. అడ్వొకేటు, చిత్తూరు.

" K. సదాశివశెట్టిగారు, జవిళి, చిత్తూరు.

" బీరం రామారెడ్డిగారు, పర్లపాడు.

" గోవిందరాజులునాయుఁడుగారు, సంతపేట, చిత్తూరు.

" వాటంబాటి వెంకటరమణయ్యశెట్టిగారు, చిత్తూరు.

" అ. చిన్నసామినాయుఁడుగారు, పరమేశ్వరమంగలము.

" K. చిరంజీవులుగారు, కాగితములవ్యాపారి, 4. బందరువీథి, మదరాసు.

" G. రఘునాథరెడ్డిగారు, గుండ్లపల్లి.

" G. V. గోవిందసామినాయుఁడుగారు, Mg. Agent, S. V. Mills Ltd.,
ఉడుమలపేట, కోయంబుత్తూరుజిల్లా.

" N. రామచంద్రశెట్టిగారు, జవిళివ్యాపారులు, చిత్తూరు

" మిట్టా కృష్ణయ్యశెట్టిగారు, బి. ఎ, అండు బ్రదర్సు, చిత్తూరు.

వీరి యపారాదరమును శ్లాఘించుచు వీరి శతాధి కాయురారోగ్య భాగ్యాదికములొసంగుఁ గాత మని శ్రీరామచంద్రుని బ్రార్థించుచున్నాఁడను.

మదీయ హితైషులు ఆప్తబంధువులునగు శ్రీ డాక్టరు కట్టమంచి రామలింగారెడ్డిగారు నన్నత్యంత ప్రేమతో మైసూరికిఁ బిలిపించికొని కంబరామాయణమునకు పీఠిక వ్రాసియిచ్చిరి. వారు రెండవ భాగ ముద్రణ ప్రతిని చూడకయే పరమపద మలంకరించినందులకు మిక్కిలి చింత గలిగెను. కాలము నద్దుకొన నెవరి వశము ? వారి యాత్మ పరమ పదమున నున్నతశాంతి సౌఖ్యమునందుఁ గాతమనుట కంటె చేయఁగల దేమి కలదు ?

మహాభారతమును భాసమహాకవి నాటకములను అధ్యాత్మ రామాయణమును కంబకవి చక్కఁగా ననుసరించెననుటకుఁ గొన్ని యుదాహరణములు కలవు.

భగదత్తుని ఏనుఁగునుచూచి యుద్ధకాండమున ఉన్మత్తుని ఏనుఁగును పిశాచుని గుఱ్ఱమును కల్పించె ననఁదగియున్నది. భాసుని అభిషేకనాటకమున నొకచో వాలి సముద్రమును మథించెనని కలదు. కంబకవి వాలి పౌరుషము నభివర్ణించు పట్టులందా విషయము నుటంకించి యున్నాఁడు.

పటలములకడ వ్రాయఁబడిన యంకెలా పటలము నందున్న అఱవ పద్యముల సంఖ్యలు.

ప్రథమ సంపుట మందొండు రెండు మార్పులు కావింపఁబడినవి. అవి, ౨౧ పుట ౧౭౨ పద్యమున మొదటి రెండవ పాదములు.

అధికమై యుప్పొంగు ♦ నర్థిపాథోరాశి
సీవియఁగ తెప్పచే ♦ నీఁదినాఁడు
జ్ఞానార్ణవంబు ససంఖ్యాక సద్గ్రంథ
తతియను నొకచే ♦ దాఁటినాఁడు

అనియు, 333 పుట, ౬౩౧ పద్యము మొదటిపాదమును

నరవిన్నమ్మది నూరకుండఁ జనదో ♦ సాధింపఁగా రానివో

అనియు, నాల్గవపాదమును

కృశించి కందిరిలలో నీర్ష్యాళువుల్ గెల్తురే ?

అనియు మార్చుకొననగును.

ప్రథమ సంపుటమందే మఱికొన్ని అచ్చు తప్పులు, వ్రాతప్పులును.

పుట.	పంక్తి.	తప్పు.	ఒప్పు.
(9)	(దక్షిణ) 7	రాలు	రాల్చు
(14)	,, 22	లక్షణమము	లక్షణమను
(16)	,, 8	సంకేతమా	సంకేతా

పుట.	పంక్తి.	తప్పు.	ఒప్పు.
౧౦౩	౨	దయణి	దయణీ
౧౨౮	౫	దాల్చిశ	దాల్చిన
౧౩౦	౧౧	సరో	సరో
౧౪౧	౫	కిర్చ	కిర
౧౫౬	౧౯	పనితల	వనితల
౧౯౭	౨౦	నినిచెను	నిలిచెను
౨౦౭	౨౧	(౩౭)	(౭౭)
౨౨౫	౨	ముండింగె	ముడింగె
౨౩౨	౨౫	వాతఁడు	రాముఁడు
౨౪౬	౨౭	కునిపయి	తత్తువు
౨౫౫	౨౩	అడిక	అడిక
౨౬౮	౨	ప్రేతి	ప్రీతి
,,	౨౭	వగాని	వరాజి
౨౮౧	౧౦	యుక్త	యుక్తి
౨౮౪	౧	తనయుల	తనయుల
౨౯౪	౯	నంచయ	సంచయ
౨౯౬	౧౨	బలుక్రుచుక	బలుక్రుచు
౩౦౬	౧౯	ద్ర	ద
౩౨౮	౧	బాగుగా	బాగుగ
౩౫౧	౨౪	ససమూ	సమూ
౩౬౬	౭	దెలియం	దెలియఁ
౩౭౪	౩	లందుడి	లందుండి
౩౭౯	౨౨	మిం్రగ	ప్రమింగ
౩౮౦	౨౩	మరణింస	మరణింప
౩౯౮	౨	కందోయియుక	నేత్రద్వయిక
౩౯౯	౧౩	దుఃఖ	దుఃఖం
౪౧౩	౨	పాయుంగ	పాయుఁగ
,,	౧౯	దలఁచి	దలంచి
౪౧౪	౨౬	నిర్ఘర	నిర్ఝర
౪౩౯	౨	ఁగారు	నొవ్వ
,,	,,	మూఁగెక	మూఁగక
౪౬౯	౭	యున్న	యన్న
,,	౩౧	ముబోలుం	ముంబోలు
౪౭౬	౫	గూర్చుం	గూర్చుఁ
౪౭౮	౧౩	వెన్న	కెన్న
౪౩౪	౬	వీచుఁడేనిరాయున	పాటిదీరుఁడొవ
౫౦౦	౩౦	నోష్మ	నొష్మక

ద్వితీయ సంపుట మందలివి.

పుట.	పంక్తి.	తప్పు.	ఒప్పు.
౪౧	౨౪	సెమొ	సేమొ
౧౧౨	౨	వరు	సరు
౨౦౮	౧౬	మస	మన
౩౭౬	౩౦	విథు	విధు

ఇట్టివి మఱియు నుండవచ్చు. చదువరులు నన్ను తిట్టుచున్నైన దిద్దుకొందురుగాక.

పండిత శ్రేష్ఠుల యభిప్రాయములు తెప్పించి ముద్రించు కోరిక నాకు లేదు. అట్లయ్యు నొండు రెండు తప్పని సరిగ వేయవలసివచ్చె. నాకెల్ల విధముల నిట్లు తోడుపాటు చూపి గౌరవించి ప్రోత్సహించిన పూజ్యులకు నా హృదయపూర్వక కృతజ్ఞతాభి వందనము లర్పించుచున్నాఁడ. వారికి జగద్రక్షకుఁడగు శ్రీరామ చంద్రమూర్తి ఇతోధిక చిరాయురున్నతు లొసఁగుఁగాత.

ఇట్లు

సుధీ విధేయుఁడు,

పూతలపట్టు శ్రీరాములు రెడ్డి.

శుద్ధాశుద్ధ పత్రికలో మఱికొన్ని

పుట.	పంక్తి.	తప్పు.	ఒప్పు.	పుట.	పంక్తి.	తప్పు.	ఒప్పు.
xvii	౨౯	శారదా	భారతీ	౨౧౩	౨	నంసారి	సంసారి
xviii	౨౧	మాంధ్ర	ఆంధ్ర	౨౫౬	౧	చుండ	చునుండ
౧౫	౨౬	బ్రథి	ప్రథి	౨౬౦	౧౬	దాంచెక	దాఁచెక
౬౪	౭	చెడ	చెడ	౩౦౩	౧౯	యిద్ర	యింద్ర
౭౭	౧౫	బాహులు	గరములు	౩౧౬	౧౫	కేశు	కీశు
౭౯	౨౧	కతవ	కతన	౩౨౬	౨౪	తోరంవు	తోరంపు
౭౯	౨౭	వచ్చిప	వచ్చిన	౩౭౭	౨౫	దను	తను
౮౯	౨౮	సత్వుఁడై	సత్త్వశాలై	౩౯౨	౨౯	విలసిం	విలపిం
౧౦౪	౩౨	పఁగా	పగా	౩౯౪	౨౧	చీఁక	చీఁక
౧౧౪	౨	లఘిం	లంఘిం	౩౯౯	౨	పోయుఁగి	పోయుకి
౧౧౮	౨౧	మలయు	మలయు	౪౦౦	౬	కర	కర
౧౨౫	౧౪	నమ్మాన్య	సమ్మాన్య	౪౧౭	౭	యువయం	యువయువం
౧౫౩	౨౯	మాయ	మాయా	౪౨౨	౩౨	కిసి	కిటి
౧౭౭	౨౯	తోరఁపు	తోరపుఁ	౪౪౪	౨౪	నగ	నగా
౧౮౦	౨౩	గోప	గోప	౪౫౪	౩౦	ఖగేద్ర	ఖగేంద్ర
౧౮౦	౨౪	నగ	నగా	౪౫౫	౨౬	తెగినవి	తెగినది
౨౦౬	౧౧	దుష్కృథా	దుష్కృథా	౪౬౨	౨౭	నిభుండుతా	మృగేంద్ర! నీవు
౨౧౧	౭	చనుడెం	చనుదెం			మరణ - మం	మృతి నం

౨౪౬ పుటలో ౧౨౩౫ పద్యములో మొదటి రెండు పాదము లిట్లు మార్చుకొనునది.

చ॥ అని మఱి చేరఁదీసి ప్రియ ♦ మారఁగ బిగ్గఁగవుంగిలించి మైఁ
బుణుకుచుఁ దేపతేపలుగఁ ♦ బొంగెడి ప్రాఁతిని బాష్పపూర్ణవీ

పొరపాటున విడిచిపోయిన పద్యములు.

సుందర కాండమున ౧౦౦ పుట

తే॥ తప్పి దనుజసుతుఁడు ♦ తడఁబడ కవలీల, గగనమునకు నెగసె ♦ గాడ్పుపట్టి
యంతలోన నున్న ♦ యరదంబు లన్నింటిఁ, గాలఁదన్ని విఱిచి ♦ కూలఁద్రోచె. ౯౩౫

యుద్ధకాండము పూర్వభాగమున ౨౦౯ పుటలో 'తాలును చెట్లు'
అను పద్యమునకుఁ దరువాత

ఉ॥ వీని బలాధికంబు తల ♦ పెట్టిన వాలునఁగట్టు గోత్రభి
త్సూను నురఃస్థలంబు నొక ♦ తూపున ద్రచ్చిన రామచంద్రుఁడే
పూని వధింపవచ్చు ననఁ ♦ బోలును గాని మనంగ నాన లో
నూనిన యొక్కప్రాణి యొక ♦ యొప్పమి వీనికిఁ జేయనెంచునే? ౮౩౭

యుద్ధకాండము ఉత్తరభాగమున ౩౪౪ పుట ౨౮౩ పద్యమున 'ఋషభుండు'
అను సీసకమున కెత్తుగీతి.

తే॥ గంధమాదనుఁ డూర్ధ్వశిఁ ♦ గలయ నేగెఁ, దక్కువానరులెల్ల న ♦ స్త్రములు గ్రువ్వఁ
బజ్జచెడఁగఁ బ్రాణంబులఁ ♦ బాసినారు, వజ్రివైరి బ్రహ్మాస్త్రంబు ♦ వైచుకతన ౨౮౩

౫౮ పుట ౮ వ పంక్తిలో

తప్పు॥ తొలఁగు నిధి నొందు మానవు ♦ తోయమనియొ

ఒప్పు॥ పోయి యేడ్చి కన్నులఁగన్న ♦ పోల్కి-యనియొ

పుట.	పంక్తి.	తప్పు.	ఒప్పు.	పుట.	పంక్తి.	తప్పు.	ఒప్పు.
౪౬	౩౧	బ్రహ	బ్రహ్మ	౨౪౩	౭	తెకి	తేకి
౨౦౧	౫	కుడ	కుడి	౨౭౫	౨౨	నిట్టి	గట్టి
౨౨౪	౯	సోఁకుచ్చు	సోఁకు	౩౬౩	౭	క్రమ	కి క్రమ
౨౩౫	౧	విని	విన	౩౪౮	౬	గానం	గానఁ
౨౩౬	౧	దాని	దాన	౪౧౯	౧౮	చుద్రి	చుంద్రి
౨౫౮	౭	వెల్చు	వేల్పు	౪౭౧	౧౯	విథి	విథి
౨౯౮	౨౬	సైన్య	సైన్యం	౪౭౬	౧౪	తెకు	తేకు

ప్రథమ సంపుటములో

పుట.	పంక్తి.	తప్పు.	ఒప్పు.
౧౨౯	౨	రాముసందును	యుశముసందును
౩౦౨	౧౦	గల తాళఫలంబు తో`ట్టిల	గనుపట్టెడి తాటి బొప్పె ల

డాక్టరు కట్టమంచి రామలింగారెడ్డిగారు.

శ్రీరామ.

పీఠిక.

జాతిచేత తెనుఁగువారును అఱవవారును ఒక్కరయని శాస్త్రజ్ఞుల సిద్ధాంతము. వీరిరువురకును ఎన్నియో తరముల క్రిందట సామాన్యమైన తెగ ఒక్కటి యుండెడిది. ఆయాదిమకాలములో దానిపేరెద్దియో అది యెంత విస్తీర్ణముగ మన దేశమందు వ్యాపించియుండెనో నిర్ధారణముగ నిప్పు డెఱుంగఁజాలము. సింధునదీ తీరమున మూడునాలుగువేల యేండ్ల క్రిందట ప్రసిద్ధిగ నుండినట్లు మొహెంజో దారో ఇత్యాదిస్థలముల నిప్పుడు బహిరంగ పఱుపఁబడిన పురాతనవస్తు సామగ్రులు ఇత్యాది చిహ్నములచే ఇది దేశమంతట వ్యాపించియుండిన జాతియని యేర్పడియెడిని. దాక్షిణాత్యము మాత్రము కాదు. ఈ జనము నిప్పటివారు ద్రావిడులని పేర్కొనుచున్నారు. ఈ మహా వృక్షముయొక్క శాఖలో అనేకములు. ఎన్నియని, ఎంతదూరము ఎన్ని దిక్కుల వ్యాపించినవని, యిప్పుడు నిర్ధారణచేయ వీలులేదు. అయిన, ఒక్కటి మాత్రము నిస్సంశయముగ నిజము. అనఁగా తెనుగువారు అఱవవారు నీశాఖలోని వారని.

ఇట్లు జాతిచేత అఱవవారితో ఐక్యము నెక్కువ చెందిన వారయ్యును ఆంధ్రులకు విద్యాది నాగరకతా సంపర్కము ఆర్యులతోనే యధికము. ఆర్యుల అమోఘమైన నాగరకతను గుఱించి విస్తరించి యిటఁ జెప్పవలయుట అనావశ్యకము. వారిభాష, వారివేదములు, ఉపనిషత్తులు, భారత రామాయణాది వీరకావ్యములు, భాసకాళిదాస భవభూతి శూద్రకాది మహాకవుల నాటకములు, వారిసంఘ నిర్మాణము, ధర్మశాస్త్రములు మనదేశము నందితర నాగరకతల నంతర్ధానమందునట్లు నిజప్రకాశప్రభావములచే చేసినవి. ఇందున ఆశ్చర్యముగాని విషాదముగాని మనము చెందఁబనిలేదు. సంస్కృత భాషామాహాత్మ్యము దానియందుద్భవించిన మాగధి మొదలగు భాషల మహనీయత లోకమంతయు నాకర్షించియున్నది. ఆర్యులయు వారియందుండి యుద్భవించి నూతన మార్గముల లోకప్రసిద్ధిని వ్యాప్తిని చెందిన బౌద్ధులయు జైనులయు వాఙ్మయము, నాగరకత, వర్ణము మతము మొదలైన భేదములచే అన్యజాతులనఁబడు పాశ్చాత్యులలో సైతము గౌరవాదరణములకు పాత్రములై యున్నవి. ఇంక సమీపస్థులమైన మనవిషయము చెప్పనేల? ఆర్యులలో

సాయుజ్యమందిన జాతులలో ఆంధ్రులొక్కరు. మన దేశములో ఒక్క తమిళులు మాత్రమే తమ విశిష్టతను సంపూర్ణముగా కోలుపోక ఇంకను నిలుపుకొనియున్నారు.

ఆంధ్ర వాఙ్మయములోని రచనలలో ముక్కాలు మువ్వీసము సంస్కృతానుకరణములు, అనువాదములు. భారతము భాగవతము ప్రబంధము లనఁబడు మనువసుచరిత్రాదులు ఇతి వృత్తమునందు సంస్కృతము ననుకరణములు. స్వతంత్రించి వ్రాయఁబడిన గ్రంథములు మనలో చాల తక్కువ. ఒక్క గ్రంథములే కావు. తత్త్వములును ఆధ్యాత్మికాది విచారములును స్వయంభవములైనవి లేవు. ఈ మాటకు అపవర్గములైనవారు నాకుఁదెలిసి యిరువురు మాత్రమే. వేమన్న, పింగళి సూరనార్యుఁడు. అనగా వేమనపద్యములు, కళాపూర్ణోదయము తప్ప తక్కిన మన కృతులన్నియు ప్రతిబింబములు ప్రతిధ్వనులే. వేఱు కావు.

తమిళులు తమ విశిష్టతను అనేకవిధముల నమోఘముగఁ బ్రదర్శించి యున్నారు. కావ్యసృష్టిలో వారు అద్వితీయులైన ప్రతిభావంతులు. తత్త్వశాస్త్రమున శైవసిద్ధాంతమును ప్రతిష్ఠించిన ఆధ్యాత్మిక ప్రభావులు. నీతి బోధనమందు శ్రీవల్లువరువ్రాసిన కుఱళను గ్రంథమునకు మించినది ప్రపంచమున నెద్దియులేదని చెప్పవచ్చును. పైవీనికి నిదర్శనముగా కొన్నింటిని స్థాలీపులాక న్యాయముగా పేర్కొనియెదను.

కావ్యములలో శిలప్పదికారము, మణిమేఖల అను వీనికి మించినవి ఉండుట అరిది. తెనుఁగున వానికి సమానమైనవియు లేవు. శతాంశమైనను పోలునవి లేవని మొగమోటము లేక పలికినను సత్యవికల్పము కలుగనేరదు. శైవ సిద్ధాంత గ్రంథములలో ముఖ్యములైనవి తేవారములు. నేను చిత్తూరు హైస్కూలులో చదువుచున్నప్పుడు శ్రీరంగసామప్ప అను తమిళ విద్వాంసుని మొట్టమొదటి ద్రావిడోపాధ్యాయునిగా నియమించిరి. వారికి మాతండ్రిగారు కట్టమంచిలో మాయిండ్లలో నొకదాని నివాసమున కిచ్చిరి. బాడుగ పుచ్చుకొనలేదు గాని వారివల్ల మాకుఁ గలిగిన ప్రయోజన మింతింత యని చెప్పఁజాలము. వారు తేవారములు, శ్రీ ఆండాళమ్మ పాశురములు, పెరియ పురాణము మొదలగు గ్రంథములనుండి అప్పుడప్పుడు మాకు చదివి వినిపించెడు వారు. అదియు మొట్టమొదట నాకు తమిళుల విశిష్టతను ఔన్నత్యమును గుర్తించుటకుఁ గలిగిన అవకాశము. పిమ్మట కనకసభాపతిచే వ్రాయఁబడిన వేయేండ్లక్రిందటి తమిళుల చరిత్రము, కృష్ణస్వామయ్యంగారు, మాధవయ్య, దీక్షితులు మొదలగువారు పరివర్తించి తెలిపిన మణిమేఖల, శిలప్పదికారము మున్నగు గ్రంథములవలన తమిళుల భావగాంభీర్యమును కొంతకు కొంత తెలిసికొను వాఁడనైతిని. తంజావూరు పుస్తక భాండాగారములోనున్న ముద్దుపళనిచే తెనిఁగింపఁబడిన ఆండాళమ్మ పాశురములను కొన్నిటిని చదివి ఆనంద తన్మయత్వము

చెంది ఆపాశురములన్నింటిని తెనిఁగింపవలయునని శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారిని ప్రార్థింపఁగా వారు అట్లే యొనర్చి ఆంధ్రులకు మహోపకారముతో మహానంద సిద్ధిని గలిగించిరి.

ఆంధ్రుల చరిత్రములను విమర్శించి చూచినచో ఒక్క వైపరీత్యము గోచరింపకపోదు. సంస్కృతమునుండి ఆర్యమత గ్రంథములను కావ్యములను నాటకములను అట్లు తెనిఁగించినవారు ద్రావిడ వాఙ్మయమునేల మనకు ప్రదర్శింపక పోయిరో కారణము మృగ్యము. సంస్కృతమునుండి తెనిఁగించుటే కాదు. తెనిఁగించిన వానిన పునః పునః తెనిఁగించుట. రామాయణమునకు శాకుంతలమునకు తర్జుమాలెన్ని యున్నవో యోచింపుఁడు. ఇంకను ఎన్ని కానున్నవో! అఱవమునుండి ఏల యీరీతిని తుదకు ఆ జగన్మోహన మూర్తియైన మణిమేఖలనైన తెనిఁగించి ప్రత్యక్ష పఱుపక పోయిరో! రుచిలేకయా? స్మర్శలేక పోవుటచేతనా?

సంస్కృతమునుండి అట్లాంధ్రీకరించిన వారు పాళీ మున్నగు ప్రాకృతములనుండి బౌద్ధమత గ్రంథములను తెనిఁగింపరైరి. తుదకు కాళిదాసునకు మార్గదర్శకుఁడైన అశ్వఘోషుని బుద్ధచరిత్రమును గూడ మనవారికి తెనుఁగుచేసి తెలుపరైరి. కారణమేమియై యుండవచ్చును ఇట్టి నిరోధములకు?

నాకుంజూడ మతభేదమని తోఁచెడిని. ఇది తప్పుగాదు. దోషముగాదు. పాపమునుగాదు. మఱి సహజమును. ఒకేవిధముగఁ జూచిన సద్ధర్మము నైనయది. హిందువులలో దృష్టిని బట్టి మతమేర్పడుటకంటె మతమును బట్టి దృష్టిపోవుట ఎక్కువగ వ్యాప్తము. మతమును బట్టి దృష్టిపోవుట మనలోను అందఱిలోను ఎక్కువ అలవాటు. దృష్టినిబట్టి మతము పోవుట తక్కువ. మొత్తము మీఁద ఆంధ్ర వాఙ్మయము మంత్రము లట్లు బ్రాహ్మణాధీనము. అందు వలననేగదా వీరశైవ కవులైన నన్నెచోడుఁడు పాల్కురికి సోమనాథుఁడు మొదలగువారికి మనయందు వ్యాప్తి లేకపోవుట. ఇటువంటిదే యేమో ద్రావిడ వాఙ్మయమును మనము అస్పృశ్యమని తలంపక పోయినను స్పృశింపకుండుటకు హేతువు. హేతువెట్లున్ననేమి? మనకుఁ గలిగిన విఫలత్వము చాల విషాదకరము. తమిళులనుండి అన్నదమ్ములట్లు మనము హక్కుమై దాయభాగముగ ననుభవింప వలసిన శైవ సిద్ధాంతము ఆళ్వారుల చరిత్రములు పెద్దపురాణము ఇత్యాది జ్ఞానభక్తిరసములను పోఁగొట్టుకొంటిమి. మఱియు వీనికంటె ముఖ్యమైనది ఆనందము, అనగా సాహిత్యానందము. ఆ యానందము నమేయముగఁ బ్రసాదింపఁగల మణిమేఖలాది మహోత్కృష్ట సాహిత్యానందము ననుభవింప నేరమైతిమి. ఇయ్యది మన దురదృష్టము. తమిళులియ్యకపోవుటచేఁగాదు మనము గ్రహింపక పోవుటచే.

సాహిత్యమునందు తెనుఁగుభాష ఇతర భాషలతోఁ బోల్చి చూచిన యెడల చాల వెనుకఁబడినదని చెప్పక తప్పదు. ఈలోటు సంగీతమునందు నష్టపరిహారము సంపూర్ణముగా చెందియున్నది. భాషావేత్తల నిర్ణయ ప్రకారము సంగీతమునకు ప్రశస్తముగ ఎత్తిన భాషలు రెండే. అందొక్కటి తెనుఁగు. రెండవది ఇటాలియన్. ఈ ఫలసిద్ధికి హేతువులు నాలుగు.

మొదటిది మనయందు సరళము లెక్కువగ నుండుట. రెండవది అచ్చు లెక్కువగా నుండుట. మూడవది సంస్కృతమునకు నించుమించు సమానముగా ఏవోకొన్ని అపురూపములగు స్వరములకుఁ దక్కఁ దక్కిన స్వరముల కన్నింటికిని విస్పష్టముగ సూచింపఁగల సంజ్ఞలుండుట. సంజ్ఞాపరిచ్ఛేదమునందు సంస్కృతమునకు రెండవది తెనుఁగు. అఱవ మధ్యమము. నాల్గవది గురులఘువులకుండు భేదమును వ్రాయునప్పుడే విదితపఱచుట. ఇంగ్లీషునందు చెప్పి నేర్చుకొనవలయునేగాని చూచి యుచ్చరించుట అసాధ్యము. ఈ నాలుగు హేతువులవలనఁ గలిగిన ఫలము శ్రవణానందము. దానినుండి కలుగునట్టిది ప్రాణసుఖము.

తమిళ గ్రంథములు తెనిఁగించి మన విద్యావికాసమునకు దోహద మొనర్చిన వారిలో కాలక్రమమునుబట్టి చూచిన ఈ కంబరామాయణము ననువదించిన నామిత్రులు బంధువులునైన పూతలపట్టు శ్రీరాములురెడ్డి ప్రథముఁడుకాఁడు. పూర్వులున్నారు. అనఁగా ఇందు సంతతి పారంపర్యము కలదని కాదు నా యుభి ప్రాయము. కొన్నియేండ్ల క్రిందటను విశాల దృష్టి విశాల హృదయముగల ఆంధ్రులు కొందఱు తమిళ భాషావిశారదులు కొద్ది తమిళ గ్రంథములు తెనుఁగునకు పరివర్తించి ప్రకటించియున్నారు. మనదోషమో దురదృష్టమో వానికి మనయందు అర్హతకొలఁది ప్రాధాన్యము ప్రాబల్యము కుదురలేదు. ఇఁకముందైన మనము సంస్కృతముతోఁగూడ తమిళమును ఆక్రమించుకొని భాషా పరాక్రమశక్తిని ప్రకటింతుముగాక.

ఇఁక ప్రకృతమునకు వత్తము. పూతలపట్టు శ్రీరాములురెడ్డిలోని విశిష్టత యేమన, ఒకటి పీరనేక ద్రవిడ గ్రంథములను తెనిఁగించియుండుట. వీరికి అఱవముతోడి సంధి బహుళము. వీరాంధ్రులకు మనగిపుష్టికై యొసఁగిన అఱవ నైవేద్యము లివ్వి.

1. శ్రీవల్లువరుగారి 'కుఱళ్' అను నీతిబోధక గ్రంథములలో లోకఖ్యాతి గడించి ప్రాథమిక వర్గమునకుఁ జెందిన మహోత్కృష్ట సద్బోధక కావ్యము.

2 నాలడియార్ (చతుష్పది) అను పేరెన్నిక గన్న కుఱళును పోలిన నీతిమాల. ఇది వ్రాఁతలోనున్నది కాని యింకను అచ్చుపడ లేదు.

3. సన్నీతి (సన్మార్గప్రబోధిని) ముఖ్యముగా బాలకుల కత్యంతోపయుక్తమైన పాఠ్యగ్రంథము.

4. కొన్రైవేందన్. ఇందలి యితిహాస మేమన శివుఁడు తన జటాజూటమున చాల ప్రీతితో ధరించుకొను పూలఁట యివ్వి! విషయము నీతిబోధ. ఈ అఱవవారికి, మనకు శృంగారమెట్లో, నీతిబోధ అట్లున్నదని తోఁచెడిని. దౌర్భాగ్యులు! లోక సుఖమునందు మనకుండుఆసక్తిలేనివారు. పరధ్యానము లోకధ్యానము ఎక్కువ. ఇదే కారణమేమో కొంతవఱకు వారు పొరుగువారైన ఆంధ్రులచే జయింపఁబడుటకును మనవారు తంజావూరు మధుర మొదలగు స్థలములందు వారినేలియుండుటకును.

5. కంబరామాయణము. ఈ మహోన్నత గ్రంథము నఱవమున రచించిన కవి కంబుఁడు. ఈయన వ్రాసిన గ్రంథము విషయమునందు లోకారాధ్యము. శైలియందు లోకానందము. అట్లుండియు శ్రీరంగములోని వైష్ణవోత్తములు దీని నంగీకరించుటకు సమ్మతింపలేదఁట! అప్పుడు వారిదాక్షిణ్యము సంపాదింపఁ గొన్ని వైష్ణవ గ్రంథము లితఁడు వ్రాసెనఁట! దానిపై వారు దీని నంగీకరించి కంబుని గారవించిరని జనవదంతి. ఇది ఎంతమాత్రము నిజమో చెప్పలేము. ఇట్టి కతలు అనేకుల గుఱించికట్టుట మన ఆగమ సంప్రదాయము. సూత్ర మొక్కటి; మొడలు మెండు.

చిత్తూరుజిల్లాయందు కంబరామాయణము సామెత కెక్కినది. "ఏమిరా! కంబరామాయణము మాట్లాడుచున్నావు" అని పరిహాసము చేసినచో దానియర్థమిది. విపరీతములైన దీర్ఘవర్ణనలు చేయుచున్నావేల? అందును అసంబద్ధములు కథాప్రవాహమున కడ్డులైనవానిని. అనఁగా కంబమహాకవి కొన్ని కొన్నిచోట్ల విషయమునకంటె వర్ణనకే యెక్కువ ప్రాధాన్యమిచ్చినట్లు తోఁపఁజేయు ఘట్టములు మితము మీఱి యున్నవని ఆరోపణ. ఇదియెంతమాత్రము విమర్శకులు సమర్థింతురో చెప్పలేను. నాకును ఈయారోపణలో కొంతసత్యమున్నట్లు తోఁచెడిని. ఇది నా పొరపాటు కావచ్చును. నా విభ్రాంతి కాఁబోలు! తమిళులకేమో ప్రతి పద్యము ప్రతివాక్యము ఆనందమొసఁగుట నేను ప్రత్యక్షముగఁ జూచియున్నాను. నేను క్రిస్టియన్ కాలేజిలో చదువునప్పుడు రెండవ స్టూడెంటు హాస్టలులో నానివాసము. నాసహవాసులలో ననేకులు ద్రావిడులు. అందొక్కరుఁడు కంబరామాయణ పారాయణ పరాయణుఁడు. నాకర్థముకాదు వదలిపెట్టుమని బతిమాలినను విడువక 'మీ తెనుఁగునకు మించినది మా అఱవము' అని నాకు నిరూపించుటకై బలాత్కరించి కంబరామాయణము చదివి ఇంగ్లీషున వివరించెడివాఁడు. ఆవర్ణనా ఘట్టములు నాకెంతవిసుగో వానికంత సుఖము మహానందము. "లోకోభిన్నరుచిగ భిన్నభావగ"

కంబుఁడు వ్రాసినది అఱవలకు. ఆంధ్రులకుఁ గాదు. వారికి సంపూర్ణముగ నచ్చినప్పుడు మన కేమి హక్కున్నది ఆక్షేపించుటకు? తమిళుల కంబరామాయణ మనఁగా సాహిత్యచక్రవర్తిత్వమునందు కిరీటము దాల్చిన మహత్తు.

శ్రీ రాములు రెడ్డి పరివర్తనము సంస్కృతమునుండి కావింపఁబడు పరివర్తనముకంటె చాల కష్టమైనది. సంస్కృతమునకు తెనుఁగు పురాకృతముతో సరిసమాన మనదగు సమీప సంబంధముగల భాష. జాతిచే మనము ద్రావిడుల మయ్యును విద్యాది సంపర్కములచే అఱవలకంటె ఆర్యులకు సమీపస్థులము. కొన్ని గీతములు అక్కరలు సీసములు తక్కఁ దక్కిన మన ఛందస్సులన్నియు తత్సమములు. ఇఁక భాషయన్ననో అమేయముగా సంస్కృత ప్రతి బింబము. సంస్కృత వృత్తములును, అందలి పదములను మార్పులేకయు కొంత మార్పుచేసియు మన సాహిత్యమునందు కవులు ప్రవేశ పెట్టుట సులభమైనపని. 'గమికర్మీకృతనైక నీవృతుఁడనై' ఇందు 'డనై' మాత్రమే గదా తెనుఁగు!

"అశ్రాంత శ్రుతి పాఠపూత రసనా విర్భూత భూరిస్తవా
జిహ్మ బ్రహ్మముఖౌఘవిఘ్నిత నవస్వర్గక్రియా కేళినా"

అను దానిని,

వేదాభ్యాస విశేషపూత రసనా విర్భూత భూరిస్తవా
పాద బ్రహ్మ ముఖౌఘ విఘ్నిత నవ స్వర్గక్రియాకేళిచే

అని తెనిఁగించుటలో కవిచేసినది యతి ప్రాసముల కొఱకైన యలంతి మార్పే గదా!

ఆదిని తెనుఁగునకును అఱవమునకును సన్నిహిత సంబంధమెక్కువగ నుండి యుండక తప్పదు. కాలక్రమమున మనజీవితముతో సాహిత్యమును ఉత్తర వాహినిగా మాఱినది. దక్షిణవాహినిగను ఉండి యుండిన రెండు విధములను లాభముచెందిన వారమై యుందుము. గతమునకు వగవనేల? అటుకాకపోయె. అఱవములో ఛందగపద్ధతి భిన్నము. వారి సాహిత్యములోని భాషయు ప్రకృతి ప్రత్యయ సంబంధములును వేఱు. అక్లే ఎరవలి తెచ్చి పెట్టుకొనుటకు సాధ్యము కాదు. మనస్త్రీల కమ్మలు మలయాళస్త్రీల చెవులకువలె! ఇక్కడ నిజమైన పరివర్తన క్రియ ఆవశ్యకము. అట్లక్లే మార్పులేక వినియోగింపఁజాలము. కాఁబట్టి ఇది నిజమైన భాషాంతరీకరణము. సుగమమైనపని కాదు. దుర్గమము దుస్తరము.

ఇట్టి యీ క్లిష్టకళను ఎంత చక్కఁగా అనాయాసమని తోఁపించునట్లు శ్రీరాములురెడ్డి చేసియున్నాఁడు! అది ఉభయ భాషావేత్తలకుఁగాక యితరులకు సంపూర్ణముగా విదితము కాదు.

సాహిత్యములోను సంగీతమునందుంబలె మనకు వలసిన పరమార్థము సౌఖ్యము, ఆనందము. యాథార్థ్యమంతగఁగాదు. ఈ తత్త్వము ప్రకారము చూచిన యెడల మా శ్రీరాములురెడ్డి కంబరామాయణము స్వతంత్రముగ రచించిన కృతి యట్లు ఐక్యమును వహించి ఏకధారగాఁ బ్రవహించి పాఠకులకు సంతతాహ్లాదకారి యై యున్నది. కంబుని స్మరణలేకయే దీనిని చదివి ఆనందింపవచ్చును. బింబమునకు ప్రతి బింబమాయను విచారణ కవకాశమీయనట్టి ఆనందకరమైన కళ. దీనిని చదివి నపుడు చూచినపుడు హృదయమిందే నిమగ్నమై లీనమై యుండుటయు దీని మాహాత్మ్యము. ఇదియే కవితా కళయొక్క సిద్ధియు పరిపూర్ణత్వమును.

శ్రీరాముఁడు సేతువును గట్టి లంకకు మనకు యాన సౌకర్యము గల్పించి నాఁడు గాని యది సంహారక్రియకై. ఈ శ్రీరాముఁడు ఈ భాషాసేతువును గట్టి తమిళులకు మనకు పరస్పర విద్యాజ్ఞాన వికాసములకై సౌకర్యము గల్గించి యున్నాఁడు. ఆ సేతువును సముద్రము ముంచి మ్రింగివైచినది. ఈ వాఙ్మయసేతువు ఆచంద్రార్కము శాశ్వతముగ నిలిచి అఱవలకు నాంధ్రులకు నాగరకతా సాంగత్యమును పెంపొందింపఁగలదు.

పద్మప్రభాస,
చిత్తూరు,
2—2—1951.

ఇట్లు,
క. రామలింగారెడ్డి

శ్రీరస్తు.

ఉదార ప్రశంస.

సీ॥ భువి నెఱ జాణల ♦ పుట్టినిల్లనుపేరు
పొందిన నెల్లూరు ♦ పుట్టినిల్లు
సార్థకాఖ్యంబయి ♦ సౌధరాజంబు 'సు
దర్శన మహ' లనఁ ♦ దనరుచుండు
పారాయణము సదా ♦ భారతమ్ము గురుండు
తెలుఁగు తామరచూలి ♦ తిక్కయజ్వ
ప్రతి వత్సరము తిక్క ♦ వర్ధంతి పండిత
సమ్మాన కార్యముల్ ♦ సమ్మతములు
తే॥ ఎంతటి కృతార్థజీవి మ ♦ తెంత సుకృతి
తిక్కవర వంశవన లస ♦ ద్వీథి మొలచి
పండ్లతో నిండి పొలుపారు ♦ పారిజాత
వృక్షమయ్యారె శ్రీ రామ ♦ నృపవరుండు. ౧

సీ॥ కరముల వేఁడిమిఁ ♦ గడఁకఁజూపి ధరణి
యలయఁ దపింపఁజే ♦ యని యినుండు
ఇంద్రు వాకిట నిల్చి ♦ యిచ్చమైఁ గొలువంగ
నిచ్చగింపని ధనా ♦ ధీశ్వరుండు
అలఘు జీవనదాన ♦ మమరంగఁ జేయుచో
నడరి గర్జిల్లని ♦ యట్టి ఘనుఁడు
కలఁకయు హెచ్చు త ♦ గ్గులు ప్రదోషమున ను
దయము గాంచని కువ ♦ లయ హితుండు
తే॥ కావ్య చాతుర్య విముఖత ♦ గనని బుధుఁడు
ఆకులత నొందని గుణ ర ♦ త్నాకరుండు
విషమదృష్టి యొప్పని రాజ ♦ విమలమౌళి
ప్రథితయశుఁడు తిక్కవరపు ♦ రామవిభుఁడు. ౨

సీ॥ అతఁడు కవిస్తుత్యు ♦ డితఁడు కవిస్తుత్యు
డనువైన లోకహి ♦ తానురక్తి

నతఁడు భాస్వద్వంశ్యుఁ ♦ డితఁడు భాస్వద్వంశ్యుఁ
డరుదైన విభవ జ ♦ న్మాదికముల
నతఁడు వర్ధిత ధర్ముఁ ♦ డితఁడు వర్ధితధర్ముఁ
డతిశయ సాధు హి ♦ తాదరముల
నతఁడు ఖండిత ఖరుం ♦ డితఁడు ఖండిత ఖరుం
డక్షిపర్వాదికా ♦ పేక్షగతులఁ

తే॥ గాన శ్రీరామ విభుఁడె యీ ♦ కలియుగమున
రామ విభుఁడయి నెల్లూరఁ ♦ బ్రభవమంది
యుండఁగాఁబోలు లేకున్న ♦ నుర్విఁగలదె?
యిట్టి గుణము లిట్టి కలిమి ♦ యిట్టి యీవి. 3

సీ॥ గర్వంబునకు మూల ♦ కారణంబులు దండి
గానున్న గర్వ సం ♦ గతుఁడుగాఁడు
విషయ భోగంబులు ♦ వివిధంబులుగ నున్న
నింద్రియ లోలత ♦ నెనయఁబోఁడు
భవ్యవైభవములు ♦ బహుళంబుగా నున్న
దాంభికవృత్తులఁ ♦ దలఁపు గొనఁడు
పనులు సొంతంబులు ♦ పైపయి నలమిన
విద్యావినోదముల్ ♦ విడువఁబోఁడు

తే॥ జీవితంబు తెనుఁగు ♦ సేవకై యందును
తిక్కయజ్వ పూజ ♦ తివిరిసేయ
నర్పణంబు సేసి ♦ నట్టి గుణాఢ్యుండు
ప్రథిత తిక్కవరపు ♦ రామనృపతి. ౪

సీ॥ కోరి యర్థించినఁ ♦ గూర్మి మాటలతోడ
విసుగెత్తు దాఁకఁ ద్రి ♦ ప్పించువారు
రమ్మని పల్కి గృ ♦ హమ్మున నుండక
కనుచాటగుచుఁ దప్పి ♦ కొనెడివారు
తమ పని నెఱవేఱు ♦ దనుక నాసానలఁ
గొసరి యావల రొప్పి ♦ కసరు వారు
పేరచ్చు పడఁగోరి ♦ పేరాసతో వచ్చి
యిచ్చెదమని వెన్క ♦ నీనివారు

తే॥ కలుగు నీ కలికాలానఁ ♦ గవుల కష్ట
మరసి వేఁడకున్నను తఱి ♦ యెఱిఁగి యొసఁగు
రసిక దాతలు భూమి నా ♦ రసిన దొరకు
టరిది తిక్కవరాన్వయ ♦ వర సదృశులు. ౬

సీ॥ పార్టీలు బలియ టీ ♦ పార్టీలు పెట్టింప
వేలకొలఁది కర్చు ♦ పెట్టువారు
గౌరవ పదవుల ♦ కై ప్రాఁకు లాడుచు
నప్పుచేసి వ్యయింప ♦ నడరువారు
తమ వారు పస్తులఁ ♦ దాఱంగఁ బరదేశ
ములకు సాయపడంగ ♦ మొనయువారు
తన కుటుంబము దిద్దు ♦ కొన లేక యున్నను
దేశంబు దిద్దంగఁ ♦ దివురు వారు

తే॥ కలుగు నీ కలికాలానఁ ♦ గవుల కష్ట
మెఱిఁగి భాషోద్ధరణ మెవ్వ ♦ రెంతురయ్య?
కృతయుగం బిప్పుడే యుద ♦ యింపఁబోలు
ఘనుఁడవై యుంటి కవి చాత ♦ కముల కీవు. ౭

సీ॥ కాల మెయ్యెన్ని వం ♦ కరలఁ బోయినఁ గాని
ధర్మమార్గంబును ♦ తలఁచువారు
నీచులకే మేల్మి ♦ నెగడుచుండినఁ గాని
తప్పు త్రోవలఁబోక ♦ తలఁగువారు
సుస్థిర ధర్మంబు ♦ సుడిసి నల్లగపడ
సుడియదంచు దృఢత ♦ నడచువారు
అల్ప సుఖంబుల ♦ కాసించి శాశ్వత
విజ్ఞాన సుఖముల ♦ విడనివారు

తే॥ కలరు కోటి కొక్కరు ♦ కలికాలమందు
కోరకున్నను తఱిగాంచి♦కోరి సాయ
పడెడి పుణ్యులు కలరె యీ ♦ పుడమియందు
వెలయు తిక్కవరవు రామ ♦ విభు సదృశులు. ౮

ఉ॥ శ్రీయును దాతృతం జెలఁగు♦శిష్టుఁడు నే రచియించు కంబ రా
మాయణ పూర్వభాగమును ♦ మక్కువతోఁ బఠియించి నిత్య భ

ద్రాయత బుద్ధి తిక్కన జ ♦ యంతికి నన్ బిలిపించి సత్కృతుల్
హాయిగఁ జల్పి ద్రోవది గుణావలి వీనుల విందుగా వినన్. ౯

చ॥ విని కడు మోదమంది పెను ♦ వేడుక నా మఱునాఁడు నిల్పి కం
బని కవితావిశేషములఁ ♦ బ్రాఁతిగ నెమ్మది నాలకించి ప్రే
మను మఱి సాగనంపి రొక ♦ మాటయుఁ జెప్పక పంపె వెన్క డ
బ్బును ఘను నీవి యెప్పుడును ♦ మున్న యెఱుంగఁగ రాద యేరికిన్, ౧౦

తే॥ అచ్చు వేయఁ బూనుట తాన ♦ యరసి రెండు
వేల రూపిక లంపుచు ♦ పిదపఁ గడమ
పదున దనిపెద ననుచుఁ బ్రే ♦ ముడిని తెలిపె
నరయఁ గృష్ణత్వముం గూడ ♦ నెఱుకపడఁగ. ౧౧

ఉ॥ భూమిజ భోగ భాగ్యములఁ ♦ బొందిన రాముఁడు తన్నుపోలు నీ
రామవిభుం డితోధిక త ♦ రస్ఫుట సౌఖ్యములుం జిరాయువున్
శ్రీమహిళా సరస్వతుల ♦ సేవయు శాశ్వత కీర్తి రాజతే
జో మహిమంబు లెచ్చిరిలఁ ♦ జూచుత మెప్డుఁ గటాక్ష దృష్టులన్. ౧౨

౩౦.

శ్రీరామచంద్రాయ నమః

శ్రీ కంబరామాయణాంధ్రీకర్త్రభినందనము.

శ్రీ కవిచక్రవర్తి, శతావధాని, విద్వాన్, దోమా వేంకటస్వామి గుప్తగారు.

శా॥ శ్రీమత్పూతలపట్టు వంశమునకున్ ♦ శీతాంశు బింబంబు శ్రీ
రాముల్ రెడ్డి మహానుభూతి మెయి ది ♦ గ్రంగద్యశోవైభవ
ప్రామాణ్యంబుగ ద్రావిడోక్తిఁ గల స ♦ ద్గ్రంథంబు శ్రీకంబు శ్రీ
రామోదార కథన్ యథార్థగతి నాం ♦ ధ్రంబున్ రహిం దెల్పి యీ
భూమిన్ సర్వదిగంత కీర్తిగనఁగాఁ ♦ బొందెన్ సుపాత్రత్వమున్.

తే॥ కంబరామాయణం బనఁ ♦ గాఁదుది మొద, లుండనట్టి "బాతాఖాని" ♦ కొనరుపేరు
గాథలోక్తిగాఁ దెలుఁగున ♦ గలదు నాను, డియలనుడిలోని నిజము క ♦ డింది తేట
తెల్లముగఁ దెలియంజేసి ♦ యొల్లలిఁ గవి, చక్రవర్తి కంబరు ద్రావి ♦ డ క్రమమున
వెలిఁగె నలవాఙ్మయ విధులఁ ♦ దెలుఁగువారి, కెంతో తివిరి పూతలపట్టు ♦ హృద్యవంశ
రాజమూర్తి శ్రీరాములు ♦ రడ్డి సుకవి, మౌళి ద్రమిళాంధ్ర వాఙ్మయ ♦ మహితుఁడయ్యో
శారదా తదధీశులా ♦ భవ్యమూర్తి, నెల్లవితముల నరసి ర ♦ క్షింత్రు గాత.

మ॥ అల మాఘుండు వణిక్కుఁడయ్యె బహు తం ♦ త్రానీకముం బూని య
య్యలఘుం డగ్రజుఁడంచు నగ్రజులు ప్రా♦యంబొల్చు నందందు శ్రీ
లలియా చూడికొడుత్త దేవికత య ♦ ల్పానయ్యె నిర్మించి రా
యల పేరుంచె నటందు రమ్మెయిని యే♦యొనొక్క దినాల్పోవఁ బూ
తల ప్రెడ్డి ధరామరుండనియొ ఏ♦ధాత్రీ సురుండో యొన
ర్చి లసద్దక్షిణఁగొంచు రెడ్డికృతిగా ♦ శ్రీరామగాథాది ని
య్యల రాజిల్లఁగఁజేసె నండ్రో ? కవి కా♦లాత్యద్భుతంబెట్లొకో ?.

చ॥ తెలిసిన వార మేముగద ♦ తీర్పఁగఁ జిత్తురునందు నోలి నీ
వాలయఁగఁ బండితుండవయి ♦ యుండిన స్కూలు చెలంగు నీకు న
త్యలఘుతరాపదల్ గొలిపి♦నట్టి రెసంగుదు రివ్వియెల్ల సా
క్షులు నిరతంబునై భవ ద♦కుంఠిత కీర్తిని జాటునయ్య పూ
తలపటు వంశ వారినిధి ♦ ధన్యమణి ప్రభ ! సత్కవీశ్వరా !

చ॥ అఱవల కాంధ్రమందుఁ గత♦మబ్బని వైరముఁజేసి యాంధ్రమం
దొరసినపాటఁ బాడమని ♦ యొక్కరెవళ్లొ వచింత్రుగాత నీ
తెలుఁగున నాంధ్రపుం జవిని ♦ దీర్చి యొసంగిన మేటి కెంతయుం
"గరకుడి" యందు గారవ మ ♦ ఖండముగా నొనరించి ఆంధ్ర వ
స్తు రుచిర భక్తిఁ జూపి రిది ♦ చొక్కము నీవల త్యాగరాజు వి
ద్వరు నటు ద్రావి డాంధ్ర జన ♦ వర్గము లాదరమున్ వహింప సు
స్థిరతర కీర్తినొందితివి ♦ చెన్నుగఁ బూతలపట్టు వంశజా !

శ్లో॥ శ్రీరామ సూరీశ్వర మౌళిరత్నం, పాయాత్సదా పూతలపట్టు వంశ్యం
నానా మహాగ్రంథ నిబంధనాఢ్యం, శ్రీరామ మాంధ్ర ద్రమిళోక్తి విజ్ఞమ్.

బెజవాడ,
12—6—53.

దోమా వేంకటస్వామిగుప్త.

అఱవము, తెనుగు, మలయాళము, కన్నడములందు పండితులై వెలసి
మదరాసు యూనివర్సిటీ ద్రావిడోపన్యాసకులుగా నుండిన
శ్రీ. వే. వేంకటరాజులురెడ్డిగారు ఇట్లు వ్రాసిరి.

మహాకవివర్యులు శ్రీరాములురెడ్డిగారి దివ్యసమ్ముఖమునకు నమస్కార పూర్వకముగాఁజేయు విజ్ఞాపనము. తాము పరమ కృపతోఁ బంపిన కంబ రామాయణము చేరినది. తమ రామాయణము అఱవ కంబరామాయణము కంటె మిక్కిలి మనోహరముగా నున్నది. సరళమైన శైలియును ప్రసాద గుణమును మీగ్రంథమందు విశేషముగానున్నది. విహారపటలమున మూఁడవ పద్యమందు 'కాంతలార' మున్నగు సంబోధనములు మూలముకంటె మిక్కిలి మనోరమ్యములుగా నున్నవి. మూలగ్రంథముననున్న యభిప్రాయముల నెంత మాత్రమును విడువక యీలాగున పరివర్తనము చేసినవారు నేనెఱిఁగినవఱకు వేఱెవరును లేరు. "முல்லையைக் குறிஞ்சியாக்கி" అనెడి పద్యము మాత్రము తెలుఁగున నిట్టి భూ విభాగములు లేనందువలన మూలగ్రంథాభిప్రాయమునకు సరిగాలేదు. కొన్ని స్థలములందు మూలముకంటె లెస్సగా నున్నది.

ఆంధ్రులును ద్రావిడులును దేవర వారిని కొనియాడవలయును. అట్లు చేయని యెడల వారు తమ కర్తవ్యమును చేయఁదప్పిన వారగుదురు. తా మొనర్చి యున్న మహత్తరమైన కార్యము నెప్పుడైన నెఱిఁగి కొనియాడఁగలరు.

నమస్కారములు.

మదరాసు,
7—9—52.

దాసుఁడు
వే. వెంకటరాజులు.

కర్నూలు ఉస్మానియా కళాశాల యందలి
హిందీ తెలుఁగు ఉపన్యాసకులు
జనాబ్ షేక్ దావూద్‌సాహెబుగారు ఇట్లు వ్రాసిరి.

నివేదన.

తమిళ దిగంతములను దన మాధురీ విలసనముచేఁ దన్మయత్వమున ముంచి, యచటి మానవులను భక్తి భాజనులఁ గావించి, ఆత్మోల్బణ రస ప్రవిష్టతచేఁ బరిసర ప్రాంత రస పిపాసుల మనస్సులందు కాంక్షా పల్లవములను తేకెత్తించి యువ్విళులూరఁ జేయుచున్న యీ కంబరామాయణ మను కావేరీ ప్రవంతికిఁ గాల్వలు దీర్చి మనయాంధ్ర పండిత దివ్యకర్షకుఁడు ఎడ తెగని కృషితో నిజవాఙ్మయ క్షేత్ర మునకుఁ బాఱించి యద్భుతమగు నొక యధునాతన కావ్యసస్యమును పండించినాఁడు. సోదర మానవులకు దాని రుచిఁజూప సమారాధన గావింప మహత్తర యత్నము గావించు శ్రీ పూతలపట్టు శ్రీరాములురెడ్డిగారు భావివర్తమాన లోకమునఁ బసిఁడి పూలతో నభిమాన గంధముతోఁ బ్రఖ్యాతియనెడు ధూప దీపములతో సౌహార్ద మనెడు నైవేద్యముతో నారాధింపఁదగిన ప్రణయ స్వరూపులు.

అయ్యది కావేరీతోయము. నవరస పరిపూర్ణ కుల్యాలతో మన క్షేత్రమునకుఁ బ్రవహించి మెఱుఁగదు. మన యుర్వరయాంధ్ర క్షేత్రము. అట్లయ్యు నయ్యది భాషా భావరూపమున గీర్వాణమును, శబ్ద ధ్వని రూపమున ద్రావిడమును, సంగీతాది స్వరవిశిష్టతా రూపమున నన్యదేశ పదార్థములను సేకరించు కొన్నది. మొత్తముగఁ గాని యఖండ రూపముగఁగాని యనువదించు కొనలేదు అన్యభాషా కావ్యములను. ఇది తనలోనికిఁ గేవల సంస్కృతమునుండియే కావ్యాది శాస్త్రముల గ్రహింప నను వదింప ననుకరింపఁగడఁగినది. గీర్వాణమునకు నాంధ్రమునకు వాసనా ప్రాబల్యమున నవినాభావ సంబంధ మున్నది. దీన నేమున్నను అది మాతృభాషా సంస్కృతియే యగును. ఇంచు మించు తెనుఁగున సంస్కృతమందు లేని క్రొత్తది కానరాదు. అట్లే దేనియున్న రామరాజ భూషణుని కవితా సాధనమే; కథగాదు.

ద్రవిడభాషలలో ముఖ్యముగఁ దమిళమున కొక ప్రత్యేకత యున్నది. గీర్వాణ భాషా గంధము నది తనకుఁ బట్టించుకొనక అభినవాభిజాత్యముతోఁ

బురాతనాత్మాభిమానముతో సముచిత స్వతంత్ర ప్రతిభతోఁ దన సంస్కారమును విలక్షణముగ నెలకొల్పినదిట్టి. ప్రకృత మాంధ్ర వాఙ్మయము అన్య సంస్కృతుల నవగాహన మొనర్చుకొనుటకు వివిధ భాషలనుండి జాతీయములను నానుడులను లోకోక్తులను సామెతలను న్యాయములను గేయములను అనివార్యములగు శబ్ద జాలములను సంగ్రహించుకొని శ్రావ్యసౌభాగ్య సంగీత ధ్వని సౌకుమార్యముల నన్నింటిని ప్రోగొనర్చికొని "ఎల్ల బాసలందు ఎఱుఁగవే బాసాడి- దేశ భాషలందు తెలుఁగు లెస్స" అని తన సహజ గర్వమును విశిష్ట దర్పమును దశ దిశల నెఱపి పలుకుం దీయందనమున, నుచ్చారణ పటుత్వమున, గమన గాంభీర్యమున, శైలీ సౌలభ్యమున, శ్రుతి మాధుర్యమున, సర్వజన శ్లాఘాపాత్రతచే నెఱజాణయై మనల నానందాబ్ధి నోలలాడించినది. శ్రీ రాములు రెడ్డిగారీ యుభయ భిన్న సంస్కృతులకు సమన్వయమును సాధించి, ద్రావిడ సంపత్తిని పరిసర ప్రాంతీయు లనుభవించు స్వత్వము గలదని నిరూపింప భగీరథ ప్రయత్న మొనర్చి నేటికి అనువాద రూప మున మనభాగమును మనకుఁ బంచిపెట్టి - తామాంధ్రజాతి సంస్కృతికి దోహద మొనర్చిరి. అక్కటతన నిత్యగౌరవమును, భావ్యున్నత స్థానము నలంకరించిరి. ఏతన్మహత్త కృషియందు సఫలతను భజించిన యీ రామచంద్రునకుఁ గావ్య జగద్యాత్రికులగు రస పిపాసువులు, ముఖ్యముగఁ బశ్చిమాంధ్రులు ముత్యాల నివాళు లర్పింపకున్న కృతఘ్నులగుదురు. తమ ప్రాంతీయ పురాతన గౌరవమును గోల్పోదురు. అన్యభాషల నున్న యీ యభినవ సారస్వతమును దాని విలక్షణ వైభవమును దమ సాహితీ భండారమునఁ జేర్చుకొన్ననాఁడే గదా మానవ విజ్ఞాన సంపత్తి పెరిఁగి - సంకుచితతా దైన్యమును గోలుపోయి - మనోబలమును ప్రబల మొనర్చుకొను చేతనతా కిరణముల స్పర్శ నందఁగలదు.

సంస్కృతానువాదములు నేఁటిదనుక నధ్యయన మొనర్చుచున్న రసిక సమాజము మాతృకకున్న గౌరవము తెనుఁగున గొనఁగునది కాదు. భాషా సంస్కృతుల విషయమున తల్లి బిడ్డలుగ నున్న యీ యనువాద మాతృకలకే యంతటి విభిన్నత లున్నచో నికఁ దన ప్రత్యేకతనే నిలఁబెట్టుకొన నుబలాట పడు నట్టి తమిళ భాషనుండి తెలుఁగునకు దిగు నీకృతి తీరుతీయములు చెప్పవలయునా? హాస్యాస్పదము సుమా. అని ప్రప్రథమమున నేనీ గ్రంథనామమును విన్నతోడనే యూహాకల్పన మొనర్చితిని. అయ్యది బహుశః మానవ మనో దౌర్బల్యము కావచ్చును. కాని సంప్రదాయముగా వచ్చు నాయాచారమును దాని కలవాటు పడిన నేను కాదనఁ గలనా! కవినైనను కాదనఁ గలఁడా! ఇంటఁ బుట్టినది. కాని యీ సతత ప్రథకు అపవాదము కూర్చినవారీ పూతలపట్టు శ్రీ రాములురెడ్డిగారు మాత్రమె. దువ్వూరి రామిరెడ్డిగారు సైత మసదృశ ప్రతిభతోఁ బారసీక కావ్యము

ననువదించిరి గాని యది త్రిశతికి మించని కావ్యము పానశాల; వీరొక మహాకావ్యమునే యనువదించి యసమ ప్రతిభ చూపిరి.

సర్వసాధారణముగ గీర్వాణవాఙ్మయ మనెడు మున్నీటినుండి యనువాద కుల్యలద్వారా ఆంధ్ర కేదారములకు రసములను పారించునపుడు అనివార్యముగ యతిప్రాస విశ్రాంతులనెడు మునుములలో విపరీతమగు (ధరణి - వారిరి - సలలిత - అరయగ - సరవి - విలసిల్లు - ఇల - కడక - పృథివి - ధరాతలము - సరస) వ్యర్థపదములను దుబ్బుగడ్డి పెరిగి కావ్య సస్యశోభకు వీలగునంత నష్టమునుగూర్చి యానందమను పంటను చెడగొట్టెడిది. ఈ కృషికుడు గడిదేరి, యనుభవమును సంపాదించి, నన్నుబోలు కృషికులనే యనంతముగా నిర్మింపగన్న మేధాబలసంపన్నుడు గాన మెలకువతో నాకలుపు మొలకలనే పెరుగనీయక, పాదములను మునుములను చెదరనీయక, వ్యాకరణచ్ఛందోమార్గ సాధన విశేషముల కాపువెట్టి యఖండమగు రామాయణ రాజనములను చక్కగ బండించినాడు. మచ్చునకని పరికించినను ఈ కాపు కళ్ళమునందూక గన్పట్టదు. ఇంతటి జాగరూకతకు గారణమేమాయని గాఢముగ నాలోచించితిని. ఆచంద్రతారార్కము నిలుచునట్టి మహాకావ్యసృష్టియం దలతి యలంతి దోసము లుంట గని రసిక పాఠకలోకము తన్ను మధుర హాస్యము పాల్గావించునని యెఱింగిరి. కావున వీరు ప్రతిభా పారంగతులు.

శ్రీరాములురెడ్డి శిష్యకోటియె వ్యాకరణచ్ఛందోలంకారములకు జక్కని వ్యాఖ్యానములు రచించి సమర్థులని ప్రసిద్ధివహించియుండ నిక వీరి పాండిత్యమును గూర్చి వేఱుగా నడుగనేల? ఇదియొక యధునాతన తపస్సు. నూతనకృషి. ప్రాచీన సంస్కారము - సాంప్రదాయిక వ్యుత్పత్తి - మానసిక ప్రతిభ - కాకున్నచో నిక్కాలమున నింతటి యఖండ గ్రంథము సిద్ధమై యాంధ్రజన సమక్షమునకు వచ్చుట సామాన్యముగాదు. నేటిదనుక నింతటి పెద్దపని నెవరును ఈ రూపమున దలపెట్టలేదు. ఇక గవిత్వమునుగూర్చి కొంత చర్చింప వలసియున్నది.

అనువాదముల కవిత సలక్షణముగనుండునుగాని చెవికి నింపు గూర్పదు. శాస్త్రములను పట్టించియుండునుగాని మనసునకు బట్టదు. అర్థవల్లి భావతాత్పర్య సౌరభ్యములు రాజమార్గమున వ్యాపింపవు. చదువుచున్న వికారమేదో మనోవీథిం బ్రవేశించినట్లుండును. ఇది కొందఱియనువాదములలోని విలక్షణత. ఇక్కారణముననే యనువాదమును పరిత్యజించి కొందఱనుకరణముం బూనిరి. ఏమయినను బిఱ్ఱుగ నీలుగుకొని మూన్నాళ్ళనాడు చచ్చిన పీనుగువలె నీరసమై నిర్జీవమై భీభత్సశోభతో

ప్రత్యక్షమగుట మనము చూచినది. కొన్నియెడల యనువాదకుఁడు దిగివచ్చునంత వఱకు దాని యర్థము తెమలదు.

ప్రకృత కంబరామాయణ కవిత ధారాపాతము నిరుద్ధము. దానికంటె సారళ్యమెక్కువ. అంతకంటె రసస్ఫోరకతలో సద్యయానంద ప్రదము. అర్థగాంభీర్య సహితయయ్యు మధుర మధురస స్రవంతిక - పండితుల కలభ్యమగు విశిష్టశైలి యిక్కవి కయాచితముగ నలవడినది. ఇది సంపాద్యముకాదు. సంస్కారజన్యము. అట నట తమంతట తాము దొరలిన శబ్దాలంకారములు - రసము కొఱకై అప్రయత్నముగఁ గుదిరిన తెలుగు నుడికారములు, ప్రతిభాసాధ్యములగు గీర్వాణ సమస్తపద గర్జనలు - వింతవింత కూర్పులు ప్రమదావన సౌభాగ్యముం జాటుచున్నవి.

ఇస్లామీయుఁడనగుట నాకుఁ గథయందును రామాయణ కావ్యమునందును విశ్వాసముగల్గి గాదుకాని అనువాదముపట్ల నుభయ సంస్కృతుల సమన్వయముపట్ల నిక్కవి యెంతటి కృషిసల్పి వ్యుత్పత్తి ప్రతిభలను చాటినాఁడాయని గట్టిగఁ బరికించితిని. హనుమంతునియెదుట కుప్పిగంతులు సాగవనుకొంటిని. ఎచ్చటను జాతీయతను జాఱనీయక సంస్కృతిని మాఱనీయక యధునాతనయుగమునకొక నూతనాదర్శముం జూప నీ గ్రంథము ననువదించినాఁడు. ఈ కవి యసమాన ప్రతిభ దాఁగియుండి యొక్కుమాఱు వెలి కుబికినది. కావుననే మా యాంధ్ర సారస్వతము చిరకాలమునుండి మనోలోకము మథనపడుచున్న కొఱంత దీర్చుకొన్నది.

తెలుఁగున వివిధ రామాయణములు పుట్టినవి. భాస్కర - రంగనాథ రామాయణములుతప్ప మిగిలినవి చర్విత చర్వణములు. పౌనరుక్త్యములు. పిష్టపేషణ సదృశములు-ఒకే ప్రవాహమునుండి యిన్ని కాల్వలు, పిల్లకాల్వలు, గుంటలు, త్రవ్వితీయంబసిలేదు అనుట నా మనోభిప్రాయము. కాని తరములనుండి కొనియాడఁబడుచున్న యీ తమిళ కంబరామాయణము మహిమాకందళము, బీజాక్షర ఘటితము, ఆంధ్రులకొక ప్రత్యేక సౌభాగ్యమును సమకూర్చినది. ప్రస్తుత యుగ సారస్వతమున వాంఛనీయరసవృష్టి. దీన నామహాకవికావ్యరసాస్వాదన కుతూహాలురు మిక్కిలి యానందించి తత్సాహిత్యగత వైశిష్ట్యమును గ్రహించి రసాదిక మార్దవ ప్రకృతుల నవలోకించి హర్షించి గర్వింపఁగలరు. ఇది యావశ్యకకృషి - అన్యభాషా సహజ సంస్కారమును మన సాంప్రదాయిక సంస్కృతితో నరిపోల్చిచూచి యాచితిని గొని యనౌచితిని దిగవిడిచి, దానిని మనదానినిగఁ జేసికొన్న యపుడేగదా జాతికి జాతీయవిజ్ఞానము పెరుఁగును. అభినవ భావసౌరభము గుబాళించును. అన్యభాషావిశిష్టత సాకారతను భజించి మనవాఙ్మయ మందిరమున శోభించును. అట్టిదే

యారాధ్యము. ఇంతటి విశ్వగౌరవ ప్రయత్నమున సఫలుఁడగు నిక్కవికి నేను హస్తములు మోడ్తును.

ద్రుత ప్రకృతిక విషయమునఁ గవిగారి నిర్ణయము శాస్త్ర సహజము. అజంతమగుతఱి దానికి ద్రుతత్వనామముండిన నుండుంగాక. దానిమీది పరుషములు సరళములగుట వింతగనేయున్నది. భాష్యకారులుసైత మీవిషయమున నిదమిత్థ మని నిర్ణయముచూపమి ప్రాచీనతా విస్మృతియనక తప్పదు. నేనీ విషయమున శ్రీరాములురెడ్డిగారితో మనస్ఫూర్తిగ నేకీభవించుచున్నాను. వారి యభిప్రాయము నాహృద్గత ధ్వనియే.

అనన్యసామాన్య ప్రతిభతో నిరంతర నిష్ఠాపూర్వక కృషితో నిర్నిద్ర ప్రవచన సౌభాగ్యముతో నీకావ్యము ననువదించి యాంధ్రుల మన్ననల గ్రహించు శ్రీయుత - పూతలపట్టు శ్రీరాములురెడ్డిగారు నేఁటియుగమున నద్వితీయులు. ఆకాశ గంగ వడువున ఘుమంఘుమ ధ్వనులతో నాంధ్రభూమికి దుముకుచున్న వీరి కవితలో ధారావాహికయేగాక శాస్త్రమర్యాదలు సంస్కృతి భూషలు సంస్కృత మర్యాదలు త్రిలిఙ్గ పద వివేక విశేషములు తఱచు తమ యునికిని ప్రతిబింబింపఁ జేయుచు నాకర్షించుచున్నవి. ఈ కవిగారి సిద్ధహస్తతకు నోపికకు మనోవైశాల్య విజ్ఞానములకు వేయిమార్లు నేను కృతజ్ఞత లర్పింతును.

ఇట్లు,

షేక్. దావూద్ సాహెబ్

హిందీ, & తెలుఁగుపండితుఁడు

ఉస్మానియా కళాశాల

కర్నూలు.

28—3—1953 తేది కారైక్కుడిలో కంబకవి వర్ధంతి సందర్భమున జరిగిన కవి సన్మానము.



1. డాక్టరు అళగప్పశెట్టిగారు సన్మానప్రదాత. 2. పూతలపట్టు శ్రీరాములురెడ్డి ఆంధ్ర కంబరామాయణ కర్త. 3. కున్రక్కుడి స్వాములవారు సన్మాన సభాధ్యక్షులు. 4. సా. గణేశ్ గారు కంబకవి వర్ధంతి కార్యనిర్వాహకులు.

శ్రీ

విషయసూచిక.

సుందరకాండము.

౧. సముద్ర లంఘన పటలము.		౧
కడలినుండి మైనాకుఁడు లేచుట	...	౫
సురస హనుమంతు నడ్డగించుట	...	౭
అంగారధార హనుమంతుని మ్రింగుట	...	౮
ఆంజనేయుండు ప్రవాళగిరిం జేరి లంకను గాంచుట	...	౯
౨. పురాన్వేషణ పటలము.	...	౧౦
సూర్యాస్తమయము	...	౧౪
చంద్రోదయము	...	౧౫
హనుమ లంకా ప్రాకారమును సమీపించుట	...	౧౬
లంకాధిదేవత హనుమంతు నడ్డగించుట	...	౧౭
హనుమ లంకను నిగ్రహించి లోని కరుగుట	...	౧౮
స్త్రీల సమూహములో హనుమ సీత నన్వేషించుట	...	౧౯
హనుమ కుంభకర్ణుని గాంచుట	...	౨౧
హనుమ ఇంద్రజిత్తు గృహమును గాంచుట	...	౨౨
అంతర్మందిర పరిఖ నాంజనేయుండు దాఁటుట	...	౨౩
నిద్రితులగు రక్కసుల హనుమ గాంచుట	...	౨౪
హనుమ రావణుని మేడఁ జేరుట	...	౨౫
హనుమంతుండు విద్యాధరాంగనలఁ గాంచుట	...	౨౭
,, మందోదరిని గని సీతయని భ్రమయుట	...	౨౮
,, రావణుని గాంచుట	...	౨౯
,, రావణుని చంపఁ దలంచుట	...	౩౦
,, సీతం గానమికి చింతిల్లుట	....	౩౧
౩. సీతా సందర్శన పటలము.	...	౩౨
సీత స్థితి	...	,,

సీత రాముని దలంచి పరితపించుట ... ౩౩

రాక్షస స్త్రీలు నిద్రింపఁగా సీత త్రిజటతోఁ దన నిర్వేదముఁ దెలుపుట ౩౪

త్రిజట సీత కూఱట కలుపుట ... ౩౫

,, తన స్వప్నమును సీతకుఁ దెలుపుట ... ౩౬

హనుమ సీతను గాంచి యుత్సాహవంతుఁ డగుట ... ౩౭

౪. నిందన పటలము. ... ౩౮

రావణుఁడు సీతను బతిమాలుట ... ౪౧

సీత రావణుని*కటూక్తు లాడుట ౪౨

౫. స్వరూప సందర్శన పటలము. ... ౪౭

హనుమ శ్రీరాముని రూప మభివర్ణించుట ... ౫౧

సీత యుంగరముం గని యానందించుట ... ౫౩

హనుమ స్వస్వరూపముం జూపుట ... ౫౭

౬. చూడామణి పటలము. ... ౫౯

సీత రామునకు పంపు సందేశము ... ౬౨

హనుమంతుడు సీతకు ధైర్యవాక్యము లాడుట ... ౬౩

సీత ఆనవాళ్లు తెలుపుట ... ౬౭

౭. వన భంగ పటలము. ... ౬౮

౮. కింకర వధ పటలము. ... ౭౪

౯. జంబుమాలి వధ పటలము. ... ౮౦

౧౦. సేనాపతి పంచక వధ పటలము. ... ౮౫

౧౧. అక్ష వధ పటలము. ... ౯౦

౧౨. పాశ పటలము. ... ౯౫

హనుమంతుఁడు బ్రహ్మాస్త్రముచేఁ గట్టుపడుట ... ౧౦౦

౧౩. పాశ ముక్తి పటలము. ... ౧౦౧

హనుమంతుడు రావణునకు నీతి గఱపుట ... ౧౦౭

౧౪. లంకా దహన పటలము. ... ౧౧౪

౧౫. శ్రీ పాద వందన పటలము. ... ౧౧౯

వానరులు మధువనమును పాడుసేయుట ... ౧౨౦

మారుతి శ్రీరామునకు సీతా వృత్తాంతము తెలుపుట ... ౧౨౩

యుద్ధ కాండము :: పూర్వ భాగము.

౧. సముద్ర దర్శన పటలము. ... ౧౨౯

౨. రావణ మంత్ర పటలము. ... ౧౩౦

కుంభకర్ణుఁడు హితము పలుకుట ... ౧౩౪

ఇంద్రజిత్తుని ప్రతాపోక్తులు ... ౧౩౫

విభీషణ నీతి ... ౧౩౬

౩. హిరణ్యకశిపు వధ పటలము. ... ౧౪౧

తండ్రి ప్రహ్లాదుని వివిధోపాయముల శిక్షించుట ... ౧౪౭

నృసింహామూర్త్యావిర్భావము ... ౧౫౧

౪. విభీషణ శరణాగతి పటలము. ... ౧౫౫

సుగ్రీవాదులు తమతమ యభిప్రాయములఁ దెలుపుట ... ౧౬౦

హనుమంతుఁడు తనయుద్దేశమును దెలుపుట ... ౧౬౨

శ్రీరాము నభిప్రాయము ... ౧౬౩

శ్రీరాముఁడు విభీషణున కభయ మొసఁగుట ... ౧౬౬

౫. లంకా వృత్తాంత పటలము. ... ౧౬౯

౬. వరుణ ప్రార్థన పటలము. ... ౧౭౪

వరుణుఁడు రాముంజేరి శరణు వేఁడుట ... ౧౭౯

౭. సేతు బంధన పటలము. ... ౧౮౧

౮. చార శ్రవణ పటలము. ... ౧౮౬

రావణుఁడు రహస్యమందిరముచేరి యాలోచించుట ... ౧౯౦

౯. లంకా దర్శన పటలము. ... ౧౯౨

రాముఁడు సువేలాద్రి శిఖరముఁ జేరుట ... ౧౯౫

రాముఁడు లంకానగర సౌందర్యము లక్ష్మణునకుఁ దెలుపుట ... ,,

౧౦. వానర సైన్యదర్శన పటలము. ... ౧౯౭

౧౧. మకుట భంగ పటలము. ... ౧౯౯

శ్రీరాముని చింత ... ౨౦౧

౧౨. వ్యూహ నిర్మాణ పటలము. ... ౨౦౪

౧౩. అంగద దౌత్య పటలము. ... ౨౦౭

౧౪. ప్రథమ యుద్ధ పటలము.	...	౨౧౨
సుగ్రీవుఁడు వజ్రముష్టిం జంపుట	...	౨౧౫
తూరుపు వాకిటి యుద్ధము	...	౨౧౬
ప్రహస్తుని యుద్ధము	...	౨౧౭
రావణుఁడు రణమున కేగుట	...	౨౧౮
రాముఁడు రణసన్నద్ధుఁ డగుట	...	౨౧౯
లక్ష్మణ యుద్ధము	...	౨౨౨
హనుమ ద్రావణ ముష్టి యుద్ధము	...	౨౨౪
రావణశక్తిచే లక్ష్మణుఁడు మూర్ఛిల్లుట	...	౨౨౮
రామ రావణ ప్రథమ యుద్ధము	...	,,
౧౫. కుంభకర్ణ వధ పటలము.	...	౨౩౨
రావణుఁడు మాల్యవంతునకు రాముని పరాక్రమాదులు తెలుపుట	...	౨౩౩
కుంభకర్ణుని మేలుకొలుపుట	...	౨౩౬
రావణునకుఁ గుంభకర్ణుఁడు హిత ముపదేశించుట	...	౨౩౮
విభీషణుఁడు రామునకుఁ గుంభకర్ణు నెఱిఁగించుట	...	౨౪౧
విభీషణ కుంభకర్ణుల సంభాషణము	...	౨౪౨
కుంభకర్ణుని యుద్ధము	...	౨౪౬
లక్ష్మణ కుంభకర్ణుల సమరము	...	౨౫౦
సుగ్రీవ కుంభకర్ణుల యుద్ధము	...	౨౫౪
రాముఁడు కుంభకర్ణుని గూల్చుట	...	౨౫౭
౧౬. మాయా జనక పటలము.	...	౨౬౨
సీత రావణు దూషించుట	...	౨౬౪
సీత మాయాజనకుం బదరుట	...	౨౭౦
రావణుఁడు కుంభకర్ణ మృతికై విలపించుట	...	౨౭౧
౧౭. అతికాయ వధ పటలము.	...	౨౭౩
దేవాంతకుండు హనుమంతునిచేఁ గూలుట	...	౨౮౨
అతికాయుఁడు లక్ష్మణుచేఁ గూలుట	...	౨౮౩
నరాంతకుఁ డంగదుచేఁ జచ్చుట	...	౨౮౬
ఉన్మత్తుఁడు నీలునిచేఁ గూలుట	...	,,
బలమత్తుఁడు ఋషభునిచేఁ జచ్చుట	...	౨౮౮
సుగ్రీవుఁడు కుంభుని చంపుట	...	,,

నికుంభుని హనుమంతుఁడు కూల్చుట ... ౨౮౯
ధాన్యమాలిని రావణు నిష్ఠురోక్తులాడుట ... ౨౯౦
౧౮. నాగపాశ పటలము. ... ౨౯౨
ఇంద్రజిత్తుఁడు శపథవాక్యములాడుట ... ౨౯౩
వానర సేనానాయకుల సమరము ... ౨౯౬
ఇంద్రజిత్తు వానరులపైఁ గవిమసఁగుట ... ౨౯౭
ఇంద్రజి ల్లక్ష్మణ యుద్ధము ... ౩౦౦
ఇంద్రజిత్తు నాగపాశముచే లక్ష్మణాదుల బంధించుట ... ౩౦౭
విభీషణుఁడు లక్ష్మణు నవస్థంగని దురపిల్లుట ... ౩౦౯
గరుడుఁడు రాఁగా నాగపాశము వీడుట ... ౩౧౨

యుద్ధ కాండము :: ఉత్తర భాగము.

౧౯. సేనానాయక వధ పటలము. ... ౩౧౯
రావణుఁ డింద్రజిత్తుని చక్రరక్షకుల ముక్కులు గోయ నాజ్ఞాపించుట ,,
ధూమ్రాక్షుండు హనుమంతునిచేఁ గూలుట ... ౩౨౪
మహాపార్శ్వుఁ డంగదునిచేఁ జచ్చుట ... ,,
నీల మాల్యవంతుల యుద్ధము ... ౩౨౫
ఋషభ వజ్రదంష్ట్రిల సమరము ... ,,
పిశాచుని యుద్ధము ... ౩౨౬
౨౦. మకరాక్ష వధ పటలము. ... ౩౨౬
మకరాక్షుఁడు రామునితోఁ బోరి మడియుట ... ౩౨౮
రక్తాక్షుఁడు శంఖుఁడు నల పనసులచే నంతమొందుట ... ౩౨౯
౨౧. బ్రహ్మాస్త్ర పటలము. ... ౩౩౦
తన సైన్యముపాటు నింద్రజిత్తుండు కాంచుట ... ౩౩౨
హనుమని సింహనాదము ... ౩౩౩
లక్ష్మణుఁడు రాము ననుజ్ఞంగొని యింద్రజిత్తునితోఁ బోరుట .. ౩౩౪
మహోదరుని యుద్ధము ... ౩౩౮
ఆంజనేయుండు కుంభకర్ణుని వజ్రదండముం గొని దైత్యుల నుఱుమాడుట ౩౩౯
హనుమంతుఁ డకంపనుం జంపుట ... ౩౪౦
మారుతి లక్ష్మణుని వెదకుచుఁ బోవుట ... ౩౪౧

ఇంద్రజిత్తు లక్ష్మణాదులపై బ్రహ్మాస్త్రి వేయుట	...	౩౪౪
శ్రీరాముఁడు మరలివచ్చి పాలికలనిం గాంచుట	...	౩౪౫
శ్రీరాముఁడు లక్ష్మణుంగని పరితపించుట	...	౩౪౬
వేలుపుల విలాపము	...	౩౪౭
౨౨. మూర్ఛిత రామ లక్ష్మణ సందర్శన పటలము.	...	౩౪౯
త్రిజట సీత నూఱడించుట	...	౩౫౨
౨౩. సంజీవన శైల పటలము.	...	౩౫౩
ఆంజనేయుండు సంజీవనిం దేఁబోవుట	...	౩౫౬
జాంబవ ద్విభీషణులఁ గాంచి రాముఁడు పరితపించుట	...	౩౫౯
జాంబవంతుఁడు రాముని తేర్చుట	...	౩౬౦
౨౪. హాలాపాన నటన పటలము.	...	౩౬౩
౨౫. మాయా సీతా పటలము.	...	౩౬౪
వానరులు లంకం గాల్చుట	...	౩౬౬
ఇంద్రజిత్తు మాయాసీత తల దఱుఁగుట	....	౩౬౮
ఇంద్రజి త్తయోధ్య కేగెనని విని రాముఁడు చింతించుట	...	౩౭౧
విభీషణుఁడు తుమ్మెదయై జానకిం గాంచి వచ్చుట	...	౩౭౩
౨౬. నికుంభిలా యాగ పటలము.	...	౩౭౪
హనుమంతుఁ డింద్రజితు నుపాలంభించుట	...	౩౭౯
మేఘనాదుఁడు హనుమనికిం బ్రత్యుత్తర మిచ్చుట	...	౩౮౦
ఇంద్రజి ల్లక్ష్మణ యుద్ధము	...	౩౮౨
మేఘనాదుఁడు విభీషణుని నిందించుట	...	౩౮౮
౨౭ ఇంద్రజి ద్వధ పటలము.	...	౩౯౦
౨౮. రావణ శోక పటలము.	...	౩౯౮
౨౯. సేనా సందర్శన పటలము.	...	౪౦౩
మాల్యవంతుఁడు సేనాపతులకు రామ విక్రమాదులు తెలుపుట	...	౪౦౭
౩౦. మూలబల వధ పటలము.	...	౪౦౯
వేలుపు లసుర బలముఁ గాంచి శంకించుట	...	౪౧౦
వానరులు మూలబలముఁ గాంచి పాఱుట	...	౪౧౧
శ్రీరాముఁడు రాక్షసబలము మట్టుమాడుట	...	౪౧౬
వహ్ని దానవసేనలఁ బ్రోత్సహించుట	...	౪౨౧

రాముఁడు గాంధర్వాస్త్రము సంధించి విడుచుట	...	౪౨౫
౩౧. రావణ శక్తి పటలము.	...	౪౩౦
రావణశక్తిచే లక్ష్మణుఁడు మూర్ఛిల్లుట	...	౪౩౨
౩౨. వానర రణరంగ దర్శన పటలము.	...	౪౩౪
౩౩. రావణ రణరంగ దర్శన పటలము.	...	౪౩౭
౩౪. రావణ రథారోహణ పటలము.	...	౪౪౦
౩౫. రామ రథారోహణ పటలము.	...	౪౪౨
౩౬. రావణ వధ పటలము.	...	౪౪౪
రామునిచే మహోదరుఁడు కూలుట	...	౪౪౫
రామ రావణ సమరము	...	౪౪౭
రాముఁడు రావణుని తలలఁ దెగ నేయుట	...	౪౫౫
రావణుఁడు మూర్ఛిల్లుట	...	౪౫౬
రాముఁడు బ్రహ్మాస్త్రముచే రావణుఁ గూల్చుట	...	౪౫౮
రాముఁడు రావణుని వీఁపునందలి గాయములఁ గాంచి శంకించుట		౪౫౯
విభీషణుని చింత	...	౪౬౦
మండోదరి విలాపము	...	౪౬౨
౩౭. శ్రీరామ నివర్తన పటలము.	...	౪౬౪
హనుమంతుఁడు సీతకు రామ విజయము తెలుపుట	...	౪౬౫
అప్సరసలు సీత నలంకరించుట	...	౪౬౮
శ్రీరాముఁడు సీతను కఠినోక్తు లాడుట	...	౪౭౦
సీత అగ్నిం జొచ్చుట	...	౪౭౨
రాముని పురుషోత్తమత్వమును నలువ వెల్లడించుట	...	౪౭౪
శంకరుఁడు దశరథు నటకుఁ బిలిపించుట	...	౪౭౬
వేలుపులు రాముని కోరిక లొసఁగుట	...	౪౭౮
సీతారామలక్ష్మణులు పుష్పకము నధిరోహించుట	...	౪౭౯
రాముఁడు సీతకు త్రోవలోని చిత్రములఁ జూపుట	...	౪౮౦
భరద్వాజుఁడు శ్రీరామాదులకు విందు పెట్టుట	...	౪౮౨
భరతుఁడు రాముని రామికిఁ బరితపించుట	...	౪౮౪
కౌసల్య భరతు సమాధానపఱచుట	...	౪౮౫

హనుమంతుఁడు భరతుని చేరుట	...	౪౮౭
భరతుఁడు రాముని రాక విని యానందించుట	...	,,
భరతున కాంజనేయుండు రాము నుదంతము తెలుపుట	...	౪౮౯
గుహుఁడు రాముని కానవచ్చుట	...	౪౯౩
భరతుఁడు శ్రీరామాదులం గాంచుట	...	౪౯౪
౩౮. శ్రీరామ పట్టాభిషేక పటలము.	...	౪౯౭
సుగ్రీవాదులు నగరునందలి చిత్ర దృశ్యములఁ గాంచుట	...	౪౯౯
రాముఁడు పట్టాభిషిక్తుఁ డగుట	...	౫౦౧
౩౯. వీడుకోలు పటలము.	...	౫౦౨



ఇలువేలుపు

పూతలపట్టు శ్రీకోదండ రామచంద్రమూర్తి

శ్రీరస్తు.

కంబ రామాయణము.

సుందరకాండము.

—: ౧ సముద్ర లంఘన పటలము :— (౯౫)

మ॥ క్రలఁకం జీఁకటి రజ్జువే భుజగమై ♦ కన్పట్టు చందాన నీ
యిల మాయం జనియించు మోహ నిచయం ♦ బీగుఁ సమస్తంబు నే
విలసత్తేజముఁ గన్న నట్టి పరుఁడే ♦ విల్లంది లంకాపురిఁ
గలనఁ గెల్పు వహించె నంద్రు విబుధుల్ ♦ గణ్య ప్రమాణంబులఁ ౧

ఉ॥ అత్తఱి వీరరత్నము మ ♦ హాబలపుత్రుఁడు దేవలోకముఁ
జిత్తము రంజిలంగఁ దన ♦ చేరువఁ గాంచి యిదేమి లంకయా?
మత్తిలినాఁడనే? యనుచు ♦ మాన్యులు వొందెదు నాకమిద్ది రా
జోత్తముదేవి యిందరయ ♦ నుండదు యంచు మరల్చె భావముఁ. ౨

శా॥ లంకాద్వీప వనంబులుఁ గనక ♦ మాలా విస్ఫురద్ద్వారముల్
పొంకంబౌ మణిసౌధవీథులును పెం ♦ పుం గాంచు దుర్గంబులుఁ
శంకాతంకము లేక గాంచుచు జగ ♦ త్సందోహముల్ దిక్కులుఁ
సంకోచించి వడంక బాహువుల నా ♦ స్ఫాలించె క్ష్వేడించుచుఁ. 3

మ॥ విమలాత్మ్యం డట నూది త్రొక్క గిరియుఁ ♦ వ్రేఁగుంగి గర్భంబు చీ
లి మహిఁ వ్రాలిన ప్రేవులంబలె గుహా ♦ లిఁ దుర్విష జ్వాలికా
సముదగ్ర స్ఫుట దంష్ట్రికా భయద దు ♦ ష్ట వ్యాళ సంఘుంబు క్ష్వే
ళములం గ్రక్కుచు దోర్లుచుఁ వెలువడెఁ ♦ లావేది దుర్భీతిమై. ౪

ఉ॥ నెమ్మదిఁ గందరంబులను ♦ నిద్ర యొనర్చు మృగేంద్రపాళి ర
క్తమ్ములు గ్రక్కుచచ్చుటనె ♦ క్రందడఁగ న్నశియించెఁ బక్షి సం
ఘమ్ములు సాగరంపు లయ ♦ కాల విఘోషము సిగ్గిలంగ శ
బ్దమ్ము లొనర్చుచుం బఱచె ♦ భానుని కాంతి మఱుంగుపుచ్చుచుఁ.

చ॥ కరిణులు తోఁకలఁ ముడిచి ♦ గాత్రములఁ గుదియించి కర్ణముల్
పరపగు వెన్నుదాఁక వడిఁ ♦ ప్రాణభయంబునఁ గంపమంద త
మ్మొరయుచు వెంటనంటఁ గరి ♦ యూథము తొండము తోడఁ బాదఃపో
త్కరములఁ గెల్లగించికొని ♦ దవ్వుల కేగెను గేఁక వెట్టుచుఁ. ౬

తే॥ అమ్మహేంద్రాన మించునా ♦ నతిశయిల్లు, కొమ్ములుం బోడిగా మిడుఁ ♦ గుఱులు చెదర
వెన్ను లగలంగ బెబ్బులుల్ ♦ బెదరి పాఱె, కనులు విప్పని కోదములఁ ♦ గవ్వికొనుచు

ఉ॥ భూధరరాజ మప్డు తన ♦ పొల్పు చెడంగ వడంకి క్రుంగ వి
ద్యాధరులెల్లఁ గేల నడి ♦ దంబులతోడను డాళ్లతోడ భూ
మీధరమందునుండి వడి ♦ మీఁదికి లేచుట చూడ నొప్పె నా
యోధనమందు కాలి యడు ♦ పుజ్జగిలం బయికేగు వైఖరిన్ ౮

చ॥ శరదము లర్కచంద్రు లుడు ♦ సంతతి నిల్కడ దప్పఁ గ్రుంగి యు
ర్వర దిగఁబడ్డ పర్వతము ♦ వాఁడి నఖంబులు లావు బాహువుల్
మురువుగ నొప్పు వాయుజుఁడు ♦ మూఁపునఁ గంబము వోలె నుండఁగా
శరధి మునుంగు నోడయను ♦ జానునఁ దోఁచెను చూడ్కి కబ్రమై. ౯

ఉ॥ గైరిక మింగిలీకమును ♦ గంధము పుష్పాడి చెందిరంబు నిం
డారఁగఁ బూసికొంచు నచ ♦ లావగ లెల్ల ధరిత్రిపై వడిం
గాఱుట చూడ నొప్పె గిరి ♦ గర్భము వ్రీలఁగఁ ద్రొక్క రక్తముల్
ధారణిఁ జింది వెల్లువయి ♦ తర్లిన విస్నను వొంది యత్తఱిన్. ౧౦

చ॥ శరనిధిఁ ద్రచ్చు మందరము ♦ చాడ్పున నగ్గిరి రాజ మప్డు ది
ర్దిరఁ దిరుగంగ నందలి య ♦ తిప్రవరుల్ తపముల్ ముగించి చె
చ్చెర విలయంబొకో యనుచుఁ ♦ జింత వహించుచు దేహబంధముల్
విరియక మున్నె తామెగిరి ♦ వెళ్లిరి మోక్షము చేరు వైఖరిన్. ౧౧

ఉ॥ భానుని పోలు కాంతిగల ♦ పర్వత ముబ్బి పటాలుమంచు బీఁ
టూనఁగ సుందరుల్ వడఁకి ♦ యొక్కటఁ గాఁగిలిఁ జేర ఖేచరుల్
మానుగ వెండికొండ దశ ♦ మస్తకుఁ డెత్తుడు నల్లలాడ శ
ర్వాణి పరిష్వజింపఁ గను ♦ పట్టిన శంభుని పోలి రయ్యెడన్. ౧౨

చ॥ ఒడలిని చేరు మాధవక ♦ మోరిమితోఁ దెలివిన్ వదల్పఁ గిం
కడరిన వేల్పు టింతులు భ ♦ యంపడి యల్కల వీడి యూఱటం
బడసి నిజేశులం గలిసి ♦ పైకి వడిం జనుచుండి విస్మృతిన్
విడిచిన కీరపోతములఁ ♦ బిల్చుచు సంకట మంది రత్తఱిన్. ౧౩

తే॥ నాకులును తాపసులుఁ దక్క ♦ లోకపతులు, జ్ఞానులును వచ్చి వరుసలై ♦ పూని నిలిచి
పూవులం జల్లి పావనీ! పోయిరమ్ము, యనుచు హనుమయు వేగిర ♦ మందె నెడఁద.

మ॥ విజయప్రాభవశీల! శైలనిభహాం ♦ వీరా! పొనుంగైన కుం
భజుఁడే గ్రోవిన వారిరాశి యన నే ♦ మాత్రంబు నాకిద్ది యు
క్కజమే దాఁటఁగ నంచు నెంచుచు నల - త్యుస్ఫూర్తిమై దాఁటి భూ
మిజ నాలంకను కాంచి రమ్మనుచుఁ ద - న్మిత్రుల్ ప్రశంసింపఁగన్. ౧౪

ఉ॥ పావని తాల్చినట్టి ఘన ♦ బంధుర రూపము లంక దాఁటనే?
యావలికేని పోవఁ దగి ♦ నట్టిది యంచు మహాద్భుతంబునన్
దేవతలెల్లఁ జూడఁ గపి ♦ ధీరుఁడు మున్నుగ వంగి పాదముల్
లావున నూని త్రొక్కి విపు ♦ లన్ దిగఁబాఱె మహేంద్ర మయ్యెడన్.

ఉ॥ వాలము పైకి నెత్తి బలు ♦ పాదములం గుదియించి వక్షముం
బోలఁగఁ గ్రుంచి యంసములు ♦ పొంగఁగఁ గంఠము వంచి బాహువుల్
వాలిక ముందు చాఁచి తల ♦ బ్రహ్మపదంబును ముట్టఁ బెంచి నే
త్రాలల లంకపై నిగుడ ♦ దర్పముతో వెస దాఁటె మింటికిన్. ౧౭

తే॥ హనుమ యారీతి నెగయంగ ♦ నతనితోడ, విభుని కార్యంబుకై పోవు ♦ విధము దోఁపఁ
దరువులును పెనుశిలలును ♦ ద్విరదములును, తక్కు ఘన వస్తువులు వియ ♦ త్స్థలికి నెగసె.

ఉ॥ మారుతవేగుఁడైన హను - మంతుఁడు నింగికి నట్లు దాఁటగా
బోరున వెంటలేచు విట ♦ పుల్ పెనుగుండ్లును తక్కు ప్రాణులున్
వారక దక్షిణం బరిగి ♦ వైళము లంకను చేరు శక్తి పెం
పారమిఁ ద్రోవఁబడ్డ క్రియ ♦ నంబుధిలోఁ బడియెన్ గుభాలునన్. ౧౮

చ॥ గగనమునన్ వడిం బఱచు ♦ గాడుపు పట్టి మహాశుగోద్ధతిన్
మృగములు మ్రాఁకులున్ లతలు ♦ మిక్కిలి సంద్రము పొంగునట్లుగా
దిగఁబడి యెల్లెడం బరవి ♦ ధీరుఁడు రాముఁడు కిన్క నూను ముం
దుగనె పయోధి యందయిన ♦ తోరపు సేతువు వోలె నేర్పడెన్. ౨౦

చ॥ ఉరవడిచేత భేదిలె మ ♦ హోదధి క్రిందటి నాగలోకమున్
విరివిగఁ గాసనయ్యె మణి ♦ బృందము కన్నుల మిట్టి పాటుగా
మెఱసెఁ దదున్నతిం గని స ♦ మీరణ పుత్త్రకుఁ డేను నాగరా
డ్వరభువనంబు గాంచఁ దగు ♦ భాగ్యము గాంచితి నంచు మోదిలెన్.

ఉ॥ ఱెక్కలతో మహార్ణవము ♦ ప్రీలఁగ నేగి సురామృతంబు పె
రుక్కునఁ దెచ్చినట్టి విహ ♦ గోత్తము సత్త్వము నెల్లవేళలన్
మిక్కిలి పల్కుచుండెడుః స ♦ మీరణ భోజులు వెండి తార్క్ష్యుఁడే
యిక్కడ కేగుదెంచె నని ♦ యెక్కువ భీతిలి పాఱి రెల్లెడన్. ౨౨

మ॥ లయకాలానలుపోల్కి నేగు కపిజా ♦ ల వ్యాఘ్రు వేగోన్నతిన్
సయిఁపన్ లేక చలించి తూలు తిమి మ ♦ త్స్య గ్రాహ పాఠీన సం
చయముల్ తెట్టెలు దేల నంబుధి మహా ♦ సంక్షోభముం బొందఁ ద
ద్రయ వీచీ నికరంబు మున్నుగనె మోఁ ♦ దం జొచ్చె లంకాపురిన్.

చ॥ సకల చరాచరంబుల ద ♦ శల్ వచియింపఁగ నేల? దిక్కరుల్
కకవికలయ్యెఁ బంతమున ♦ గాడుపు మేరువు నూఁపువేళ నా

సికరము పెల్లగిల్లి కడు ♦ శీఘ్రగతిన్ జలరాశిమీఁదఁ గం
దుకగతిఁ జిమ్మనం జరుగు ♦ తోయము దోఁచెఁ గపీంద్రుఁ డేగుచోన్.

ఉ॥ మండలధార నేగు వెలి ♦ మావుపయిం జను వజ్రి కంటికి
న్నిండుగ భారమై పరఁగు ♦ నెవ్వడిఁ గొండలు వారిరాశి భూ
మండల మొక్కయంజగొను ♦ మాత్రముగాఁ గనుపట్టుచుండ బ్ర
హ్మాండములెల్ల నొక్కటగు ♦ నట్లుగ నేగెను పుష్పకంబు నాన్. ౨౯

తే॥ వేల్పులు నుతింప మునులు దీ♦వింప జనులు, మొక్క మారుతి పగమది♦మును కొనంగ
దానవుని కసిదీఱ మ♦ర్దనము సేయ, శివుని విడి చను కైలాస♦శిఖరిఁ బోలె.

తే॥ బ్రహ్మకంటె విజ్ఞాని యా♦బ్రహ్మచారి, ధర్మవర్తనుఁ డేగుచోఁ♦దడవునుండి
యెడసియున్న త్రికూటమున్♦గొడుకుఁజూడ, మేరు వాశుగగతి నేగు♦తీరుదోఁచె.

చ॥ పలపల బ్రుంగఁదారకలు ♦ స్వర్గము క్రుంగఁ బయోధి పొంగ ది
క్కులు వడి భ్రమంగఁ బెన్గుహలు ♦ కొండలు పాదగలంగ మేరువున్
వెలవెల చెంగ రాఘవుని ♦ విశ్రుత సాయక మట్టు లేగు క
ర్వాలి కొడుకొప్పెఁ గల్పమునఁ ♦ బర్వు ప్రచండ సమీరణుం డనన్.

తే॥ పంక్తికంఠుఁ డింద్రియములఁ♦బడిల పఱచి, తివిరిచేయు తపంబు పూ♦ర్తిగ నశించె
ననెడు సూచన నుత్తర♦మున జనించి,దక్షిణము వోవు భాను చం♦దమ్ము దోఁచె.

తే॥ క్రూరులు వసించు లంకను♦చేర జంకి, యితర పురముల నుండంగ♦నిచ్చ లేక
రాము శరణంబు నొంది మ♦రల వసింప, నరుగు ధర్మునాజ్ఞాచక్ర♦మనఁగ నొప్పె.

తే॥ ఒడలికాంతి పెంజీఁకటి♦నెడలఁ దోలఁ, గనకగిరి సిగ్గిలంగ నా♦కసము నంటు
దీర్ఘభుజుఁ డంతవేళ ను♦దీచి దిశను, వికటముగఁ బుట్టి వచ్చెడు♦విధుని పోలె.

తే॥ వెన్నునాజ్ఞచే లావు చూ♦పింపఁ గోరి, గిరులు వెన్నంట మొగుళులు♦కెరలి తూల
జలధులు గలంగ దైత్యుల♦తెలివి చెడఁగ, వడిగ నెగసెడు గరుడుని♦పగిదిఁదోఁచె

చ॥ సురుచిర పుణ్యులొందుటకు - సూటిగఁ బేర్పుగ నొప్ప, నొక్కటే
చరణమునన్ ముకుందుఁడు వ ♦ శంపడఁ గొల్చిన లోకజాలముః
బెరయుచు దాఁటి యెల్లరును ♦ బెగ్గడిలంగ మరుత్సుతుండు తా
నురవడిఁ గాలపాశమన ♦ నొప్పిన వాలునఁ గొల్చె నత్తఱిన్. 33

ఉ॥ క్ష్వేళితముం బొనర్చి వడిఁ ♦ గ్రీడగ నంబుధి దాఁటు వీరు లాం
గూలము చూడ నొప్పె శ్రుతి ♦ గోచరు రాము దయాబలంబుచేఁ
జాలిన యాంజనేయుఁడను ♦ చక్కటిఁ దోడుగఁ గొంచు గర్వ దై
త్యాలికి జంకి వెంటఁ జను ♦ నంతకు పాశముఁ బోలి యయ్యెడన్. 3౪

తే॥ శౌరి యాజ్ఞచే గరుడుండు ♦ చేరినంత, కనకగిరిఁ జుట్టి గట్టిగాఁ ♦ గవ్వికొన్న

చిలువఱేఁడు చలించి కుండలము వీడి, యవలికేగు బాగున నొప్పెననుమ వాలు.

క॥ హనుమంతుఁడు వెడలెడు వేగంబునఁ బుట్టిన గాలివీవఁ బొలుపఱి యొండొం
టిని తాఁకి విఱిగి పడి జడధిని మునిఁగె విమాన చయము దివ్యులు బెగడన్.

క॥ పడి నేగు మారుతిం గని, చిడిముడి పడి విబుధులితని చింతన మేదో ?
బెడిదులు గల పురిదాఁకనె, నడచునొ కడచునొ యటంచు నడిఁకి రెడఁదలన్.

తే॥ హనుమ మేనివాయువున దిశాంతములకు, నడరు కడలియుఁ గలగుండు వడి చెడంగఁ
బొడవుపని గ్రంథములఁ జెప్పఁబడుచునుండు, తిమి తిమింగిలములు చచ్చి తెప్పదేలె.

తే॥ అసదృశాత్ముఁ డఖ్ఖగుచోనలవు వేగ, మొనఁగు నిశ్చల దీర్ఘ బాహువులు రామ
లక్ష్మణులు కరుణాళువులు కడఁక ముందు, పోవు పోలిక గనిపించె పొలుపు మీఱ

—: కడలినుండి మైనాకుఁడు లేచుట :—

తే॥ మదకరీంద్రముఁ బోలిన మారుతి యటఁ, బవనువలె నేగ మైనాక పర్వతంబు
నడుమ లేచెను కలశాబ్ధి నడుమ నుండి, త్రచ్చుతఱి లేచు నైరావతంబు కరణి.

తే॥ వేయి బంగరు శిఖరముల్ ♦ వెలయ నతము, పాఱు సెలయేళ్లు తెలివల్లె ♦ వాటుగాఁగ
నసుర బాధల నడఁగింప ♦ నష్టనిద్ర, వీడి వెసలేచి వచ్చిన ♦ వెన్నుఁ డనఁగ ౪౧

చ॥ నెఱిఁ జదువంగ లేక విన-నేరక యింద్రియలోలుఁడైన వే
దుఱు మెడ నిక్కకై వడిని - తోరపు భ్రాంతముచేఁ బయోనిధిన్
విఱిగి మునుంగుచుండు తఱి - వెన్నుఁడు కచ్ఛపమై వహింపఁగా
నురవడిఁ బైకి లేచిన మ-హోన్నత మందర శైల వైఖరిన్ ౪౨

తే॥ నెగయ ననువుగా ఱెక్కలు-నెగడుచుండఁ, గ్రమకాంతితో గంభీర ♦ కంధిఁ జీల్చి
కొనుచుఁ జని సుధ నాగుల ♦ కొసరనిచ్చి, లేచునట్టి సుపర్ణుని ♦ లీల యనఁగ.

తే మొదలు తుది యెఱుంగఁగరాక ♦ మొనయు విష్ణు, కరుణచేఁ దొల్త జలమందు ♦ గలిగి సకల
జగములను సృష్టి సేయంగఁ-జాలినట్టి, యజుని కన్నట్టి యాహిరణ్య ♦ గర్భాండ మనఁగ

తే॥ తన్నుమును నీటఁ గాంచిన ♦ తండ్రిఁ గనక, సత్కృతులఁ జేయలేనని ♦ స్రష్ట తలఁచి
యందమునిఁగి మహాతపం ♦ బాచరించి, పూర్త గావించికొని లేచు-పొలుపు దోఁప

ఉ॥ తానిదుమాల లెక్కడని ♦ తప్పున కోర్వఁగలేని మానికో
పానఁ బయోనిధిం బడిన ♦ భాగ్యము లెల్లను వెండి యీయ శ్రీ
శానుఁడు పూనునాఁడు కెల ♦ సంబున దివ్యులు దైత్యులున్ వడిన్
జానుగఁ జిల్కఁ బాల్కడలిఁ ♦ జయ్యనఁ దోఁచిన చంద్రుఁడో యనన్.

సీ॥ ఒకవంక నెఱుపు వే ♦ ఱొకవంక నలుపునా, ఘన శరీరచ్ఛాయ ♦ గడలు కొనఁగ
పవడంపుఁ దీవల ♦ పఱపు గాత్రముతోడ, కమనీయ ఘనశిఖ ♦ రములు వెలయ

గుహల నక్రములు మే♦ల్కొని నిశ్వసింపంగ, ముత్తెంపుఁ బుర్వులు♦ మొనసి మొరయ
పటిక బండల మీఁది ♦ పండు మౌక్తికములు, తివిరి చందురు డాలు♦ దీలు సేయ

తే॥ రత్నరాశి వెలుఁగు శిఖ♦రములు హస్తముల విధంబునఁ గానరా♦జలధి మునిఁగి
మణుల ముత్తముల్ చేవారి♦కొనుచుఁ బైకి, లేచి వచ్చెడు మానిసి♦లీలఁ దోఁప.

తే॥ సౌధములమీఁద వెలయు ధ్వ♦జంబులట్లు, నిర్ఝరశ్రేణి తెల్లనై ♦ నెఱసి పఱవఁ
బనిగ వనధివలన వెలి♦వడిన కతనఁ, దుల్లి దోనలలోఁ బెను మీలు♦ త్రొక్కటపడ.

తే॥ శత్రు షట్కంబు ముప్పగ♦సమయఁ జేయు, జ్ఞాన మొప్పార శంకలు♦ మానువారి
కరణి సర్పముల్ గుహలలోఁ గష్టమొంది, బయల నప్పు డూర్చుచు హాయి♦ వడసి నిలువ.

చ॥ అతులిత ధీరుఁడౌ హనుమ♦ యద్దముపై నొక యుద్దిగింజ యొ
క్కతడవ దోర్బలోపల స ♦ కాశమునన్ గగనంబు నంటి ది
క్తతులకుఁ బర్వి నిల్చిన యు ♦ దగ్ర మహీధ్రము నక్కజంబుతోఁ
గొతుకుచుఁ గాంచి యేమిది యొ♦కో యని యించుక చర్చ సేయుచున్.

ఉ॥ ఇయ్యది వార్ధినుండి పయి♦కెక్కి నిలంబడెఁ గారణంబు లే
కియ్యెడఁ బాద మూన్చుటయు-నెగ్గగు నంచెద నిశ్చయించి దా
నయ్యవనీధరం బెగసి-యవ్వల డొల్లఁగ ఱొమ్ముతో వెసన్
ద్రయ్యఁగఁ దాఁకి యవ్వల ది♦వంబును దాఁకఁగ దాఁటె మింటికిన్. ౫౧

తే॥ జలధినుండి లేచిన గిరి-వరుఁడు తలరి, యురలి చలియించి చింతించి మరల లేచి
మనుజరూపంబుతో నిల్చి మానసీయ! విన్నపం బొండు వినుమని - వినిచె నిట్లు.

సీ॥ పగవాఁడనుచు మది భావింప వలదయ్య, తొల్లి కొండలు ఱెక్కలుల్ల సిల్ల
భువనంబులకుఁ గీడు పొనరించు చుండ నింద్రుఁడు వాని యెఱకలు తుంట్లుగాఁగఁ
ద్రెంచిన తఱి వాయు దేవుండు ప్రేమతో, నీచోట నను చేర్చి కాచినాఁడు
మిత్రపుత్త్రుఁడవను మేల్మి ప్రేరేఁప నా, వలన వేఱగు మేలు కలదె యనుచు

తే॥ నరసి యిట వచ్చినాఁడ మహాత్మ! నీవు, రమ్యకాంచనమయ శిఖరంబులందు
కొంత విశ్రాంతి గొని పొమ్ము-కూర్మి మీఱ, నేను ధన్యుఁడ నౌదు నీహితమువలన.

తే॥ నీతినిధి రాముసాజ్ఞఁ బూనిన కపీంద్రుఁ, డమరులు సుఖింప జానకి నరయ వచ్చె
మంచియదను నీ భాగ్యమ్ము మోఁగె ననుచు, వాహినీపతి సెలవిచ్చి పంపినాఁడు.

తే॥ తల్లికంటె మేలని నన్ను దలఁచి యిందు, కొంత శ్రమ దీర్చికొని విందు గొందుగాక
యింటి కేగుదెంచినపుడె హితుల నక్కు-, రింపకున్న వేఱొండేది యింపు నింపు.

క॥ అను నాతని నయ వాక్కుల, విని పావని యతఁడు హితుఁడు విమలుఁ డనుచు నె
మ్మనమునఁ దలఁచి స్మితుండయి, తను చూడఁగ నెదుట నిలిచి తద్గిరివరుతో.

చ॥ శ్రమ మొక యింత లేదు రఘు ♦ రామ పదాంబుజ చింతనంబుచే

సమల మనస్క! నాయకుని యానతి నాదగు కోర్కె తృప్తిగా
సమరక మున్నె యోగిరము నాదటఁ గైకొనఁజాల నీదు ప్రే
మమె నను తృప్తుఁ జేసె వినుమాన్యత నన్నియుఁ గొన్న యట్లికా?

ఉ॥ వేఁడకమున్నె పిల్చి యిడు - వీరుల, వేఁడిన నిచ్చువారలన్
బోఁడిమి సంస్తుతింప నిడు - పూరుషులందు గుణంబె ముఖ్య మీ
పాడగు దేహమం దిడెడు - పాటికి నెమ్మొకకంటె నున్నదే ?
ఊడిగ ముందునేమి మఱి - యుర్విని మక్కువకంటె హెచ్చుగన్? గిర

తే॥ వడిగ నేగి త్రికూటాద్రి పైని లంకఁ, జేరి యేలిక పని పూర్తి చెందునేని
మరలి వచ్చుచో నీ విందు పెరిమఁ గొందు, ననుచు సత్యప్రతిజ్ఞుఁడా హనుమ వెడలె.

చ॥ గగనమునందు ప్రొద్దు నెద గందును రిక్కలు స్వర్విమానముల్
మొగుళులు నొక్కచోఁ గలిసి ముద్దగఁజేరఁగనయ్యె వేఱు వే
ఱుగఁ గల వస్తుజాలములు ఉవ్వన వీచెడు గాలిచేత నొ
క్క గమిగఁ జేరు నప్పగిది గాడుపుపట్టి గమించు నుర్విడిన్. ౬౦

చ॥ జడనిధి నుద్ధతిం జను ప్ర జాహితు వేగముఁ గాంచి భాస్కరుం
డడుగిడలేని శైశవము నందె మదీయ రథంబు మీఁదికిన్
దుడుకున దూఁకె నేరి పయి దూఁకఁగ నిప్పుడు నిశ్చయించె నీ
జడియని దిట్టయంచు మది జంకు వహించుచు నుండెనయ్యెడన్. ౬౧

ఉ॥ కత్తినిపోలు వాఁడి పలు కాంతి నభోమణిచెంత వెల్గఁ బై
కెత్తిన తోఁకతోడ విరి యించిన మేను నభంబుఁ గప్పఁగా
నత్తఱి రాహుఁబోలె నతఁ డద్గునఁ జీఁకటి పైని కాంతి రే
కొత్త మహోపరాగ దిన మో యన నొప్పె జగంబు చూడఁగన్.

—: సురస హనుమ నడ్డగించుట :—

తే॥ ముజ్జగంబుల కష్టంబు లుజ్జగింప, నమ్మతించి వచ్చిన కపిచంద్రు సత్త్వ
మెంత కొలఁదిదో యెఱిఁగి రమ్మా యనంగ, సురల యనుమతి నెదుటికి సురస వచ్చె.

తే॥ బాకి నోరు రక్కసి రూపు పడసి వచ్చి, కాల భీకర మూర్తి శాఖామృగంబ!
నాకు నామిషంబై వచ్చి నాఁడ వింక, నెచటి కేగెద వని యెట్ట యెదుట నిలిచె.

క॥ అడరుచు మండెడు నాఁకలి, నడఁపగ మత్కుటిల దంష్ట్ర కా కీర్ణంబై
బెడిదమగు కడుపుఁ జొరుమా, విడివడ నొక త్రోవ లేదు వినుమా యనుచున్.

తే॥ ఆఁడుదాన వాఁకలి బాధ నలసి తీవు, దేవదేవు నాజ్ఞను తీర్చి తిరిగివచ్చి
నీకు నాహుతి యయ్యెద నిజము విడువు, మనుచు మారుతి నవ్వి నయంత నామె.

మ॥ భువనంబుల్ గనుఁగొంచు నుండఁగనె నీ ♦ పొంగార్చి భక్షించెదం
జవు లూఱంగ నటంచుఁ బల్కెఁ గపి వం ♦ శ శ్రేష్ఠుఁ డుద్దండుఁడై
నవుచున్ నీ యుదరంబు చొచ్చెదను వి ♦ న్నాణంబుమై నీవు జా
ణవ యేనిన్ గ్రసియింపుమా యనుడుఁ గి ♦ న్కం బొంది యన్నారియున్.

సీ॥ పెక్కండములఁ బట్టి ♦ పుక్కిలి గొనఁజాలు, విరివియౌ వదనంబు ♦ విరిసి నిలువ
నదిగని యవ్వీరుఁ ♦ డన్ని దిశలఁ బర్వ, నామె నోరే చిన్న ♦ దనఁగఁ బెరిఁగె
సురసయు మఱిమఱి ♦ విరియుచు నుండ నా, తఁడు తటాలున సూక్ష్మ ♦ తనుఁడు గాఁగఁ
గుదిసి కడుపుఁ జొచ్చి ♦ కుఱుచ యూపిరి విడు, నంతలోఁ గుప్పించి ♦ యవల దాఁటె
తే॥ వేలుపులు మెచ్చి కురిసిరి ♦ విరుల వాన, కార్యదీక్ష ననుమ వోవఁ ♦ గడఁగ నామె
స్వస్వరూపంబుతో మెచ్చి ♦ చనవుతోడ, ముచ్చటించి దీవనలిచ్చి ♦ పుచ్చె నతని.

కం॥ పాడిరి పాటలు కిన్నరు, లాడిరి రంభాదు లుబ్బి ♦ యభినయములతోఁ
గూడిరి పొగడుచు విబుధులు, వీడిరి దీవించి మునులు ♦ వేదోక్తులతో. ౧౯

కం॥ మందార కుసుమ వాసన, చిందించుచు వీచె గాలి ♦ చెమ్మట వీడన్
జందముగా విద్యాధర, సుందరులును వాదనమునఁ ♦ జొక్కించి రొగిన్. ౨౦

—: అంగారధార హనుమంతుని మ్రింగుట :—

సీ॥ హాలాహలముఁబోలు ♦ నంగారధారయున్, రక్కసి యొక జల ♦ రాశి ముంప
వేఱొక్క జలరాశి ♦ విరిసిన తెఱఁగున, లేచి యెవ్వరు నను ♦ లీల దాఁటు
వారంచు గర్జించి ♦ పాదాంగదమ్ములు, మున్నీరు పొంగిన ♦ మొగిని మొరయ
వేదవేద్యుని త్రోప ♦ వెదకి యుదధినుండి, పొడచూపు మధుకైట ♦ భులను పోలి
తే॥ క్రొన్నెల బెడంగు చిందించు ♦ కోఱలొప్ప, నభవు చందాన గజచర్మ ♦ మమరఁగప్పి
బ్రహ్మగోళంబునకుఁ జను ♦ ద్వారమనఁగఁ, దెఱపి వదనంబు విప్పి యా ♦ తెఱవ నిలిచె.

తే॥ జలధి పాదముల్ గడుగ శీ ♦ ర్షంబు మింటి, సోఁడుముట్టంగఁ బెరిఁగిన ♦ చొప్పు గాంచి
యధిక మేధావి మారుతి ♦ యాత్మఁ దలఁచె, దయయు ధర్మంబు మ్రింగిన ♦ దైత్య యనుచు

ఆ॥ దాని నోటఁ జొరక ♦ తప్పించుకొని పోవు, దారి గనక చింతఁ ♦ దవిలి తేఱి
గుహానుపోలు కడుపుఁ ♦ గ్రొచ్చి యవ్వలి కేగు, టుచితమంచుఁ దలఁచి ♦ యొయ్యఁ బలికె

శా॥ ఛాయాగ్రాహక శక్తి నొందిన గతిన్ ♦ సాధించుచున్నావు న
న్నీయీ చందములన్ గ్రహించియు బలం ♦ బింతేఁ గనన్ లేవు నో
రే యాకాశముఁ బోలఁ గవ్వికొని దా ♦ రిం బట్టి బంధించి తి
ట్లే యేరీతిఁ జరింతు వెవ్వతవు నీ ♦ వెందుండు తెల్పంగదే?

చ॥ అనవుడు దైత్య యిట్లనియె ♦ నాఁడుది యన్న తలంపు వీడు డా
సిన యవి జీవముల్ గొనుచుఁ ♦ జెల్లఁగఁ జాలవు కాలుఁడైన నేఁ

దినఁ దలకొన్న ప్రాణులను ♦ తేఁకువతో విడిపింపలేఁ డహో
వనచర! నీవనంగ నొక ♦ పాటియె నాకని నోరు విప్పుచున్ ౭౫

చ॥ గుటుకున మ్రింగ మారుతియుఁ ♦ గోరికతోడనె దైత్యగర్భమున్
దటుకునఁ జేరి వేలుపులు ♦ ధర్మువు చాలఁ దపించుచుండఁగాఁ
బుటుకున వెల్వడెన్ నృహరి ♦ భూరి భయంకర మూర్తి పోలికన్
బటుకున దాని గర్భమును ♦ వ్రచ్చిన చేతుల నాంత్రరాజితో. ౭౬

చ॥ మదవతియైన దైత్య యటు ♦ మాసెను జోలుచుఁ బ్రేవులెల్లఁ ద
త్పదములఁ జేతులం బెనఁగఁ ♦ బావని మింటికి నెక్కె ముండ్లతోఁ
బొదలు పొద ల్గలట్టి గుహఁ ♦ బూనికఁ జొచ్చి మహోరగంబులన్
బొదివి పడిం బయల్పడిన ♦ ప్రోద్ధత పక్షుని తార్క్ష్యుకైవడిన్. ౭౭

తే॥ ప్రేవులంగొని వైళంబ♦వింటి కెగురు, హనుమ ఘన చిరంజీవుల-యందు మేటి
వాలపాశమ్ముతోడ నం-బరమునందు, దిరుగు గాలిపడగఁ బోలి♦తేజరిల్లె. ౭౮

క॥ దురపిల్లిరి దైతేయులు, సురలు ప్రహర్షించి యార్చి ♦ సాటసాట విరులం
గురిసి రజుఁడు మెచ్చెను శం, కరుఁ డచ్చెరువందె మునులు ♦ గని రగ్గలికన్.

తే॥ చెడుగు నోటిని కడుపును ♦ చీల్చివైచె, దనుజ గూలె నభంబున♦హనుమ యేగె
మేరువును మీటి పెరుఁగు సా♦మీరి పడియు, నెడఁద పడికంబె హెచ్చని♦నుడివె రవియు

తే॥ కవుల యూహలమించి యీ♦కడలియొప్పె,విఘ్నములవెన్ని యొదవిన♦వీఁగఁ కేగఁ
జేరుదును లంక, చేరిన♦సిద్ధి యొదవు, ననుచు మారుతి చింతించె♦మనమునందు.

చ॥ తిరమగు ధర్మముం గొనక ♦ తెక్కలి దైత్యులు చేయు పాపముల్
భరమయి లోకముల్ బహుళ ♦ బాధల నొందుచునుండెఁ దీఱు చొ
ప్పరయగ వేఱు లేదు సక ♦ లాపదలం దొలఁగించు లోక సుం
దరుఁడగు రామచంద్రు శుభ ♦ తారక నామము దక్క నీ భువిన్.

—: ఆంజనేయుఁడు ప్రవాళగిరిం జేరి లంకనుగాంచుట :—

ఉ॥ ఊటలు పాఱు తేనియల ♦ నొప్పగు కల్పక వాటి దేవతా
వాటము డాసి మింటఁ జను ♦ వాయుతనూజుఁడు ధర్మకూటహా
కోటలు పేఁటలుం గనక ♦ కోరిక లంకకు నేగ కివ్వలన్
దోఁటలు దోర్వ్యాలున్ విరిసి ♦ తోఁచు ప్రవాళగిరిన్ వెసన్ దిగెన్.

ఉ॥ అంబర వీథినుండి పడి ♦ నాశుగ సూనుఁడు శీఘ్ర నగ్గిరిం
ద్రంబు చలించి పట్టుడిగి ♦ తద్దయు నుఱ్ఱటలూఁగె వస్తు జా
లంబులు నిండఁగల్గి విపు ♦ లంబగు నబ్ధిని గాలివాన చై
దంబున వస్తువుల్ దొరలఁ ♦ దాళక యూఁగెడి నావ కైవడిన్.

చ॥ ఇల యదుగున్న యంతయు వ ♦ హించి పునాదిని మేలి పై జగం
బులవఱకుం బెరింగిన య ♦ భూత విచిత్రిత లంక ముందటన్
గల గిరిమీఁద నిల్చి యటఁ ♦ గన్నుల మేరకుఁ దేఱి చూచె స్వ
ర్గ్లలన ముఖంబుఁ గాంచు ముకు ♦ రంబన నొప్పిన యమ్మహాపురిన్.

చ॥ ప్రియముగఁ గాంచి ముక్కుపయి ♦ వ్రేలిడి యింద్ర పురంబు దీనికో
ప్పయినది యంచుఁ బల్కు మతి ♦ హైన్యము చెల్వు జగంబు లెల్ల వే
జయము గడించి యెల్ల సుఖ ♦ సంపదలం గొని యేలుసట్టి దు
ర్జయుఁడగు రావణుం డిచట ♦ రాజిలుచుండఁగఁ దీక్ష్ణభావుఁడై. ౮౬

చ॥ అమరపురంబు భోగముల ♦ కాలయమంట యథార్థవార్త కా
దమరిక నెల్ల భోగము ల ♦ నంతములై తమ కోరినంత దూ
రము తగనొందుచున్ నిలువ ♦ రంబయి వేసరకుండు టెందు గం
డు మొ యదియే దివంబగు క్రమ♦క్రమల్ వచియించెదు సర్థ మద్దియే. ౮౭

చ॥ పఱపగు లంక రెండయిదు ♦ వందల యోజన విస్తృతంబుచే
నుఱవగునందు రిందు భువ ♦ నోన్నత వస్తువులెల్లనుండుఁ గ
లెఱిఁగిన మాత్ముబుద్ధులు స ♦ హింపఁ గాంచఁగఁ గోరినంత పె
ద్దఱికము నొందునే కనులు ? ♦ దండడి వింతలు మేర నొందునే ? ౮౮

—: ౨. పురాన్వేషణ పటలము :— (౨౩౪)

చ॥ మొగుళుల దాఁటి చంద్రముని ♦ ముట్టెడు మేడలు పైఁడి మేడలో ?
సొగసగు రత్న సౌధములో? ♦ చూడఁగఁ జాలని మించు తిప్పలో ?
తొగల విరోధి దీధితుల ♦ తో ఘటియించినవో ? మతేవియో ?
తగ నెఱుఁగంగఁజాలని వి ♦ ధంబున నున్నవి నా యెడందకున్. ౮౯

క॥ అమరావతి మేడలతో, నమరిన దిందొక్క భాగ♦మునఁదగి మిగులం
గొమరారు సౌధములు మల, యమారుతము వచ్చు మాడ్కి♦నడరుచునుండెన్.

ఉ॥ తీయని పల్కులం జెలఁగు ♦ దివ్య మృగాక్షులు మించు తీఁగలన్
బాయక పట్టి పట్టి యొక ♦ పాటిగఁ జేఁపురు గట్టె మేడలన్
మాయఁగఁ జేయు గందవొడి ♦ మాటికిఁ జిమ్మి తోలంచి స్వర్నదీ
తోయము ముంచి తెచ్చి యటఁ ♦ దోఁగఁ గలాఁపి విదుల్తురెప్పుడున్.

ఉ॥ నృత్యముఁ జేరఁ దాళము గ ♦ ణించెదు గజ్జెలచేత లక్కచే
స్తుత్యములైన కాళ్ల సొగ ♦ సుం గొను వ్రేళ్లు ప్రవాళకాంతులన్
నిత్యము వీవ నెఱ్ఱనయి ♦ నీరదముగ్ తను దేహ సామ్య సాం
గత్యము వీడి యాచెలుల కై శిక ♦ సామ్యము నొందు నయ్యెడన్. ౯౨

ఉ॥ కస్తురి తావి వీచు నవ ♦ కల్ప పరీమళ పుష్పగుచ్ఛ వి
స్రస్త మరంద మాని భ్రమ ♦ రంబు లతృప్తిని పొంది వేగ వి
న్యస్త వినూతన ప్రియము ♦ లై సురలోకము లీలఁ జేరుచున్
నిస్తుల చంద్రశాలలను ♦ నెమ్మదిమై విహరించుచుండెడిన్. ౬౩

చ॥ నిరుపమ మాధురిం జెలఁగు ♦ నీటు మృదూక్తులు కీర శాబకో
త్కరములకు న్నయంబున ము ♦ దంబున నేర్పుచునుండు కాంతలన్
విరివిగ రత్న దీధితులు ♦ విచ్చిన కుడ్యములందు దోఁచు నా
తరుణుల నీడలం దెలిసి ♦ తథ్యముగా వచియింప శక్యమే? ౬౪

ఉ॥ డంబుగ నింద్రుఁ డుండఁగ నె ♦ డంబుగఁ గట్టిన వైజయంత సౌ
ధంబును బోలు నియ్యవన ♦ థంబు లనం గొఱయే యగుం జుమీ
యింబుగ నాపచన్ను సరి ♦ యే యన దైత్యుల భోగ భాగ్య సం
ఘంబుల కొక్క మేరయును ♦ కల్గును పోలికయుం బొసంగెడిన్. ౬౫

తే॥ ఎట్టి మేటి రత్నములైన ♦ నీడ్యమైన, కౌస్తుభంబునకున్ సాటి ♦ గాంచనిక్రియ
విశ్వకర్ముఁడే స్వయముగా ♦ వేడ్కతోడఁ, దీర్చి కట్టు సౌధములకు ♦ దీటు నున్నె?

తే॥ ఎల్లప్రాణులు చొచ్చి ల ♦ యింపఁ దగిన, భువననాయకు నుదరంబుఁ ♦ బోలు లంక
అర్క తేజులు దక్క న ♦ జాండమందు, తసరు హరులెల్ల నిందున్న ♦ వనఁగఁదగును.

తే॥ తరువు లెల్లను కల్పక ♦ తరువులె యగు, మేడలెల్లను బంగరు ♦ మేడలె యగు
దాసదాసీ గణంబు త్రి ♦ దశ గణంబ; పరుల కరుదిద్ది బహు తపః ♦ ఫలము యగును.

చ॥ దురమున నోడఁగాఁ దొలఁగఁ ♦ ద్రోయుటచే దవుదవ్వ దిక్కులం
జరుగుచు నిల్చినట్టి వగు ♦ సామజముల్ తగ నైదు హస్తముల్
పరఁగు వినాయకుండును వి ♦ భావసుఁ డెక్కెడు నొంటికంటి పె
న్నరదము నన్న యివ్వి పుర ♦ మందునఁ జేరనివై యెడంపఱున్. ౬౬

తే॥ అసురవరులం దెవండు లం ♦ కాధిపునకు, సేవసేయక తప్పిన ♦ శివికాఁడు
ముగురు మూర్తుల మించియు ♦ నెగడు నితఁడు, చేయు తప మెట్టిపాటిదో ♦ చెప్పవశమె?

తే॥ ద్విరదముల ఘీంకృతులు దుందు ♦ భి స్వనములు, శరధిఘోషంబు మార్కొని ♦ మొరయుచుండు
మధురవాణుల నూపుర ♦ మంద్ర విరప, మన్ని రవముల నడఁగించి ♦ యడరుచుండు.

తే॥ రత్నమయ రథశాలలు ♦ రవియు విడియ, మొంను కాంతులతో వెల్గు ♦ చుంటచేత
దీనిపుందర మేటియా ♦ త్రిదివ జగము, నరకలోకంబుపలెనె గా ♦ నంగఁబడును.

ఉ॥ అందముఁ ద్రావు చందమున ♦ నారసి యట్టి గుటుక్కమంచు ద్రిం
గం దమి గొల్పు నంగవునఁ ♦ గ్రాలెడు నిప్పరి సిందుకాంతు లిం
పొందఁగ వీచు ద్వేపగుణ ♦ భూషులు దైత్యులు మేనిరంగు నీఁ

గం దరిసేగు చందురుఁడు ♦ కందును నీఁగఁ బయోధి పైఁడిగాన్. ౧౦౩

చ॥ నగర నిశాంతకాంతి కిర ♦ ణంబులు చీఁకటి మ్రింగుచేతనున్
జగములనిండు సంధ తమ ♦ సం బడఁగించు దినేశు చేతనున్
దగ నుపమింపరా దటులు ♦ తప్పి వచించుట న్యాయనరన్ గనున్
దొఁగల విరోధి ముందఱ మి ♦ ణుంగుఱు లట్టుల నంచు నియ్యెడన్.

తే॥ గందమును తేనె కస్తురి ♦ కల్పతరుల, క్రొవ్విరులు కరిమదమును♦కూడి పాటి
కడలిఁ గలియుటచే నందు♦గలుగు మీలు, పరవు కౌచు వాసన వీడి♦పరిమళించు.

క॥ పొగడుదమ విశ్వకర్మను, బొగడుదమా పంక్తి కంఠు♦పూజ్య తపంబున్
బొగడుదమ యజుని వరములఁ, బొగడ వలంతులమె బ్రమయు♦ములుచల మెదియున్.

చ॥ అడవులు తోఁటలున్ మణుల♦హాటకమందు ఖచించి చిత్రకా
రుఁడు తగ నిల్ప నయ్యవి యు ♦ రుస్థితిఁ బూవులు పండులిచ్చు గా
రడము క్రియన్ విచిత్రగతి ♦ రంజిలు నిచ్చటి సోయగంబు వెం
గడమగుఁగాక పొందుటయుఁ ♦ గల్గునె స్వర్గము నీ ధరిత్రియున్.

తే॥ అవని జలమగ్ని గాలియు♦నాకసంబు, తమ మహోన్నతిచే గొప్ప♦తనము గనవు
గోవు రౌన్నత్యమును కనఁ♦గొనియెనేని, పొన్నుమల యెంత లజ్జించి♦పుల్ల సిలునో?

చ॥ తిరమగు వప్ర కుడ్యముల ♦ దీధితులే మిఱుమిట్లు గొల్పఁగాఁ
దరణి కనుంగవ న్మొగిచి ♦ తద్దయు సిగ్గిలి యిప్పురంబుపై
నరుగమి నేరకే జనము ♦ లందురు క్రూరగుణుండు పంక్తికం
ధరుఁ డలుకన్ వహించునని ♦ దద్దఱి పోవఁడ యన్న యూహమై.

తే॥ జన్మవైరులై నత మెగ్గు ♦ నలుపువారు, నిర్జరులెయంచు వారల ♦ నిలువరింప
దానవేంద్రుఁడు కట్టించె ♦ దారికడ్డు, గోడయన నొప్పుచున్నది ♦ కోట పొడవు.

ఉ॥ పోవదు కోటదాఁటి జగ ♦ ముం జడిపించెడు చుట్టుగాలియున్
బోవవు భాను దీధితులు ♦ పోవదు కాలుని దార్ఢ్యబుద్ధియున్
బోవదు ధర్మదేవతయు ♦ భూజనులిచ్చెడు యాగభుక్తి కా
పోవక వేచు వేలుపులు ♦ పోవుదురంటయు వ్యర్థవాక్యమున్. ౧౧౧

చ॥ అనదృశ భంగ సంగత మ ♦ హాంబుధి మధ్యమునందునిల్చి యా
కస మొరయంగ మేర యిడఁ ♦ గానక యున్నతమై పెరింగి యొ
ప్పెనఁగు విమాన సుందరత ♦ హెచ్చిన లంక సనాతనుండు నా
భి సరసిజంబునుండి తగ ♦ వీడిన యండముఁబోలి వెల్గెడున్. ౧౧౨

క॥ పాడెదు వారలు పెక్కం, డ్రాడెదు వా రంతకంటె ♦ నధికులు చెలులన్
వీడిన వేల్పుల నాటక, మాడించుచు వేడ్క గనుదు ♦ రచ్చటి యసురల్.

ఉ॥ హార్వ్యగా నటింతు రచట ♦ నమరకాంత లెపుడు గం
ధర్వవనిత లంతకంటెఁ ♦ దరముగా నటింత్రు పై
మర్వ్యగా నటింత్రు దైత్య ♦ ముగ్ధలందు వారలన్
బర్వి చూచువారు తక్కు ♦ పడఁతులెల్ల వేడుకన్. ౧౧౪

చ॥ నవనిధు లెప్పుడు న్నిలిచి ♦ నాఁడెపు భూషణ వస్త్రమాల్య సాం
కవ మృగనాభికాదుల ర ♦ కంబుగ నిచ్చుచు నూడిగీంద్ర కం
దువము వహించి కొల్చునన ♦ ద్రోక్కుట నొందు నుతింప నాల్కయున్
దవిలి తలంపఁగా మదికిఁ ♦ దట్టము పూనిన దోసమే యగున్. ౧౧౫

చ॥ తలఁచిన యట్లు నల్వయు ము ♦ దంబున నమ్ముఖమందు నిల్పి తా
వలచిన రీతిఁ బద్ధతులు ♦ పాటిగఁ దెల్పుచునుండ, వేలుపుల్
తెలచి నుతించు మేరువునఁ ♦ దేర్చిన మిన్నుల వారి తెచ్చి తా
మలచిన యట్లు చల్లి పురి ♦ మానుగ శిల్పి ఘటించె నాఁడగున్. ౧౧౬

తే॥ వాద్య గంభీర రవముల ♦ వార్ధి రావ, మడఁగెఁ బరమేష్ఠి తనకేలఁ ♦ దడవఁదగిన
పొడవు శిఖర సౌధంబులఁ ♦ బోలఁతు లెగచు, నగురు పొగచేత మొగిళుల ♦ పొగరు లడఁగె

చ॥ స్ఫటిక శిలామయంబులగు ♦ సౌధములందును కల్పకాది రా
డ్విటపులు గల్గు తోఁటలను ♦ వేఱగు తక్కిన చోటులందు ను
త్కటముగఁ గల్గువాని ప్రమ ♦ దప్రద మత్తత నాడువారె గా
కిటనెటఁ గానరారు మది ♦ 'నించుక చింత గలార లోకరున్. ౧౧౭

చ॥ అసురమృగాక్షులం గలిసి ♦ యవ్వనులందు విహారలీలలన్
వినువక సల్పుచున్ మధువు ♦ వేడుకఁ ద్రావుచుఁ బాడుచుండ సం
తసమున విన్చు మోవిగొని ♦ తన్పుచు సొక్కుచుఁ గిన్కనూనియు
న్న సకులు తేఱ మ్రొక్కి దయ ♦ నల్వఁగ గాంచెదు వారలే చుమీ.

తే॥ స్తనగిరులపైని వ్రాయు చి ♦ త్రంబులంట, నలుపు మేనుల నలముచుఁ ♦ బోలయువారు
అలుగు పడఁతుల పారాణి ♦ యంటియున్న, కేశములను రాక్షసవరుల్ ♦ కిఱుకువారు.

తే॥ చిన్ని పెదవుల విద్రుమ ♦ శ్రేణిఁబోలె, వాడి చూపుల గములఁగ ♦ ల్వలనుపోలె
వదన వితతిచేఁ జెందమ్మి వనముఁ బోలెఁ ♦ జెలువుమీఱినయాలంక ♦ చెలులవలన

చ॥ అతిశయ చిత్రమయ్యె ద్రుహి ♦ ణాండము మొత్తము నేఁటిదాఁక నొ
క్కతలమి భారమెల్లఁ బడి ♦ క్రందుగఁ ద్రొక్కఁగఁ జీలకుండ, నే
వితథముగా శ్రమించి మితి ♦ వెట్టుట యెట్లగు? నెల్లప్రాణు లీ
దితిజుల సంచయంబు గణు ♦ తింపఁగ నల్గకుఁ జాల వెన్నఁడున్. ౧౨౨

సీ॥ ఒడలిచే నున్నతి ♦ నొందినవారుపీ, ర్యంబున మితిమీఱి ♦ యలరువారు
జగము లయమునకు ♦ నంసిద్ధులగువారు, వరబలంబున సాటి ♦ వడనివారు

మాయావులైన దై ♦ తేయులు వసియించు, లంకకు మేర వ ♦ ల్కఁగవశమె ?
కాళుల మణిపీఠ ♦ కటకాంగదంబులు, హస్తంబులందు క్రూ ♦ రాయుధములు
తే॥ కనుల నెఱ్ఱఁదనంబును ♦ కలుగకుండు, వారలే లేరు; వారలఁ ♦ బదరి మొదలఁ
దలల లత్తుక దగులంగఁ ♦ దన్నకుండు, మత్తకాశినుల్ దొరకరు ♦ మందునకును.
సీ॥ అసక్తిమైఁ దేఁటు ♦ లలమ నొప్పెడు నవి, యొడలి నీచదరంగ ♦ వెడలునవియు
వెల్లదంతంబులు ♦ నల్లని మేనులు, నెఱ్ఱని శిరములు ♦ నెసఁగునవియు
మత్తిల్లి కొండల ♦ మాడ్కి నుండునవైన, వేదండ తండముల్ ♦ వీఁక తోడఁ
దేనియ గాఱు వ ♦ ర్థిల్లిన యెఱ్ఱని, వెండ్రుకల్ గల దైత్య ♦ వితతిఁబోలు ;
తే॥ స్త్రీలుపురుషులు విసుగుచేఁ♦జెదరవీచు,హారములు కుండలములుమా♦ల్యమ్ములెల్లఁ
గరుల మదజలమును తుర♦గముల నురుగు, నదులగుచుఁ గొనిపోవఁగ♦నుదధి నడఁగు
తే॥ మధువు సేవించి మొగమున♦మందహాస,మమర నసుర కాంతలు వాచి♦కాంగికవులు
గతులు దప్పక చూప దే♦వతల సతులు, సిగ్గుపడి మదిసోల వీ♦క్షించుచుండ్రు
తే॥ నాశపఱచు టటుండనీ♦నగచరేంద్ర, బలము లీట వచ్చుటయు నల♦వడునుగాక
భూరి భీకర దైతేయ ♦ వీరరక్ష, యుడరు నివ్వీట వారడు ♦ గిడఁగ వశమె ?
చ॥ మరలి దినాధినాథ కుల ♦ మండనుతో వివరించుచో ధను
ర్ధరులబలంబె యన్నిట వ ♦ రంబగునందునో ? ఖడ్గి వారమే
యుఱివగునందునో ? బరచి ♦ యొప్పిన సేనయె దొడ్డదందునో ?
బిరుదు వజీర్ల కూట మది ♦ పెద్దది యందునో ? యేమి యందునో !

—: సూర్యాస్తమయము :—

తే॥ లంకఁ గూఱిచి యిట్లు ద♦లంచి హనుమ, మత్తు లిచటికి వచ్చిన♦ పత్తు రనుచు
మేను క్రుంగించికొని గిరి♦మీఁదనుండె, భానుఁడును క్రుంకె నప్పుడు♦పశ్చిమాబ్ధి
సీ॥ మనసు పోయిన పోక♦లను పోయి జనుల హిం, సించి విత్తమ్ము నా♦ర్జించువాఁడు
తలఁపు విచక్షణ ♦ త్వము వివేచనము మా, నినవాఁడు సూక్తుల ♦ విననివాఁడు
కాఁగల చెడుగు లె♦క్కగొనని వాఁడు వా, స్తవహీనుఁడగు నొక్క♦జనుని కలుచ
విరిసిన పోల్కి ♦ నసురకూటములమాడ్కి, ఋషులు వేలిమి నుండి ♦ రేఁచి పంపు
తే॥ కుంభి చర్మంబుఁ త్రిపురాంత♦కుండు తీసి, లోకముల కొక హావడి♦లేక సేయఁ
గప్పియుంచిన కైవడి♦నొప్పి యంధ, కార మబ్జాండ కుహరంబుఁ ♦ గమ్ముకొంచె.
తే॥ చిరముగా వేయి నోళులఁ♦జిలువ ఱేఁడు, విడుచు విషము జగంబులఁ♦గడి గొనంగ
నెగడి తనవంటి నిప్పుతోఁ♦బొగలతోడ, నెదురులేకేచెనన నొప్పె♦నిరుల గములు.
తే॥ సముదుదారుఁడౌ రవికుల♦స్వామి దేవి, మాననీయ క్రొత్తడి యగు♦జానకిఁ గొని
దోర్బలుఁడు రావణుఁడు కారఁ♦ద్రోచుకతనఁ, జెడ్డకీర్తి వ్యాపించెనాఁ♦జెలఁగెఁ దమము

తే॥ అట్లు చీఁకట్లు పరగ దై ♦ త్యాళి యెల్ల, మంచిపద్ధతిఁ బడసిన ♦ మంత్రబలము
వలన దశదిశల్ జరుగంగ ♦ వలఁతులయ్యెఁ, దమము విరిసిన వేళనే ♦ తరలినారు.

క॥ సహజక్రూరులు రాక్షసు, లహమహమిక నమర నగరి ♦ కరిగెడువారు
త్సహనమున విధుజగమునకు, సహఃపతి తనూజు పురికి ♦ నరిగెడి వారల్.

క॥ సురరిపు సేవకు విద్యా, ధర పన్నగ యక్ష సిద్ధ ♦ తరుణులు బలు తో౦
దరపడి మెఱుపుల గములం, బరమున బఱతెంచు లీల ♦ వచ్చిరి సొరిదిన్. ౧౩౪

క॥ సురనాగ యక్ష విద్యా, ధర కిన్నర భుజగ సిద్ధ ♦ దానవులు వడిన్
వరుసలుగా నేతెంచిరి, పురుహూత విరోధి సేవ ♦ పొఁడిమిఁ జేయన్. ౧౩౫

క॥ ప్రతిమలవలెఁ జేరిన దే, వత లింతగఁ దామసించి ♦ వచ్చితిమి కదే !
దితిజేశుఁడు కినియునె యని, కొతుకుచుఁ బరుగిడిరి కొనిన ♦ కోలము లురలన్.

—: చంద్రోదయము :—

క॥ తనకం దగని యఘౌఘము, తనకి దహింపంగ నల్లఁ ♦ దనమును గొని మాఁ
డిన ధర్మబీజము హనుమ, యను వాసను మొలచుపోల్కి ♦ నబ్జుఁడు పొడమెన్.

క॥ తోతెంచిన శశి రాముని, దూత యరుగుదెంచె దొసఁగు ♦ తొలఁగిన దంచున్
జేతము తనిసిన ప్రాగ్ది, క్స్త్రీతరుణీవదన మసఁగఁ ♦ జెలఁగెను రుచులన్. ౧౩౭

క॥ జలనిధి వీచులు వింజా, మరలవలెం జుట్టి పడఁగ ♦ మా పగకొలమే
పొలిసెనని లేచు నింద్రుని, వెలి గొడుగనఁ దూర్పుదెసను ♦ విధుఁ డుల్లసిలెన్.

తే॥ అంబరంబను వాఁడు హి ♦ మాంశుఁడనెడి, వెండికుండను గొని పాల ♦ వెల్లి ముంచి
తెచ్చి పోసెననఁగ జ్యోత్స్న ♦ దిశల వెలసెఁ, జుక్క లాపాల చుక్కల ♦ చొప్పు దోఁచె.

తే॥ గగనమనుసురభియుదయ ♦ నగమనియెడు, పొదుఁగునం జంద్రుఁడనుచనుల్ ♦ వదలినట్టి
కన్నెలను క్షీరధారలు ♦ వెలయ జ్యోత్స్న, దృశ్యమప్పుడు పాలంబోలి ♦ పృథివిఁ బరవె.

తే॥ హనుమపై సురల్ చల్లిన ♦ యలరులెల్ల, రావణునకుఁ దలంకి ధా ♦ రణిని పడక
దాఁగికయు జోతిరూపముల్ ♦ దాల్చిమింట, మెఱసెననఁ జుక్కలెల్లెడ ♦ మీఱి వెలసె.

తే॥ మల్లికలమీఁద మధుపముల్ ♦ మలయుచుండఁ, గౌముదీప్రకరంబు చీఁ ♦ కట్ల గములు
జన్మవైరంబుగొని పర ♦ స్పరము దాఁకి, పోరు సలిపెడు చందంబుఁ ♦ బోలియుండె.

తే॥ గ్రథిత రత్న ఖచిత వప్ర ♦ వలయితంబు, వీరరక్షితంబగు పుట ♦ భేదనమున
కొఱగఁ జెల్లనివలువ మా ♦ యుటనుపోలి, హిమమయూఖుని కరము లె ♦ ల్లెడలఁ బరవె.

ఉ॥ రామ ధనుర్విముక్త శర ♦ రాజమువోలె మరుత్సుతుండు శ్రీ
రామునిదూత నిర్భయత ♦ రావణ పాలిత లంకఁజేర, నా
రామునికీర్తి కందకము ♦ రాజిలదాఁటి యుదగ్రసాలము
ద్దామ నిరూఢి దాఁటె ననఁ ♦ దత్పురిఁ బర్వె నఖర్వ చంద్రికల్. ౧౪౫

తే॥ అంత హనుమంతుఁ డెంతయుఁ♦జింత సేసి, చొరఁగరాని యాలంకను♦చొరఁగ నొక్క
నిశ్చయం బొనరించి యా♦నెఱిఁ జనంగ, నమరులు నుతింప నుద్యుక్తుఁ♦డయ్యె నపుడు.

—: హనుమ లంకాప్రాకారమును సమీపించుట :—

తే॥ కంధి సహజ సిద్ధమగు న♦గర్తగాఁగ, దివ్యలోకము లేడింటిఁ దీడి ♦ పెరిఁగి
విలయమందును చెడకుండు♦లలిఁదనర్చు, పెద్ద ప్రాకారమును సమీ♦పించి నిలిచె.

తే॥ నిలుకడగ మింట వెల్గు గా♦ములు దశాస్యు, నకు భయంపడి లంకపై♦నడవవనుట
తగదు వప్రంబు దాఁటుస♦త్వంబులేమిఁ, దొలఁగి చనుచున్నవని కపి♦తలఁచి మెచ్చె.

తే॥ పగ ఆసంఖ్యాకు లిటనిల్వఁ♦దగిన దనుట, యంతకాదిది బ్రహ్మాండ♦మంత వెలుపు
నంతకంటెను పొడవునై♦యడరుఁగోట, యహాహా! లంకేశ్వరుం డెంత♦యధికుఁడొర!

తే॥ సింగమును మదగజమును♦సిగ్గుపడఁగ, నెక్కటిఁ డయి నడచు క♦పీశ్వరుండు
అలవిలేని సేనలు గల్గి♦యముని నోటిఁ, బోలు గోపురద్వారంబు♦ముందు గాంచె.

తే॥ కనకగిరిఁ దెచ్చి తొలిచి మా♦ర్గంబుచేసి, నిలిపిరో ? సురపురి కేగు నిచ్చెనయొకొ ?
సప్తలోకాశ్రయంబగు♦స్తంభ మొకొ ? కడలి నీరోవఁ గట్టిన♦కలుజొ? యేమొ?

తే॥ ఏడులోకంబు లొక్కటై♦యెదిరెనేని, సొరిదిగాఁ దక్క లోనికిఁ♦జొరఁగరాదు
అరుల వాడుక తెరువిది♦యందమన్న, సైన్య జలధి సప్తక మిందు♦సాగునేమి ?

తే॥ వీరవరులు మాయావులు♦ధీరగుణులు, కత్తులును కోఱ లిరుగడఁ♦గలయ మెఱయ
రెండు వందల వాహినుల్♦క్రేవలందు, గాచి నిల్చుట పావని♦గాంచె నెదుట.

తే॥ ముసల తోమర కుంత కా♦ర్ముక నిషంగ, వక్ర దండ కులిశ చక్ర♦భల్ల భింది
పాల కంటక ముద్గర ♦ శూల ఖడ్గ, ధారులగు క్రూర రాక్షస ♦ వీరవరులు.

తే॥ గుదియలును పాశములు బరి♦గోల లొడిసె, లలును తళ తళ మెఱయఁ జే♦తులధరించి
రక్తరోములు రోష సం♦యుక్తులగుచు, ప్రూచినట్టి మోదుగులట్లు♦పొలిచినారు

తే॥ గణనకందని దివియల♦కాంతు లిరుల, మ్రింగ యముఁడును బెగ డొంది♦మిడుకునట్టి
గోపురద్వారమున వడి♦క్రుంగకడరు, జడధి వడువునఁ గల సైన్య♦చయముఁగనియె

తే॥ ఔర! కలకలమార నీ♦ద్వారమందు, చొరనమర్థుఁ డొక్కఁడు సురా♦సురులయందు
గలఁడె? కాకుత్స వర్యుండు♦కపివరులును, పోరొనర్ప నేకై వడి♦ముగియు నొకొ!

తే॥ కడలిదాటు టరిదిగాదు ♦ కావలియను, కడలిదాఁటుటె యరిది నా ♦ కర్జమందు
పొరపడిన దుర్ఘటంబగుఁ♦బూర్తి సేయఁ, దడవుపట్టును సమరమే♦తొడరునేని.

ఉ॥ ద్వారముఁనంద వెళ్లెదు ని ♦ ధంబది దుస్తరమై బయల్వడున్
శూరులు చేసి యుంచు దరిఁ ♦ జొచ్చుట నాకెమికాదు గావునన్
సూర మయూఖముల్ చొరని ♦ చొప్పగు వప్రము దాఁటి యేగెదన్
ధీరత నంచు నా విమల♦తేజుఁడు వోయె మఱొక్క ప్రక్కకున్. ౧౪౯

—: లంకాధిదేవత హనుమంతు నడ్డగించుట :—

చ॥ చిరముగఁ గావలిం గలిగి ♦ చెన్నగు తత్పుర జీవితంబు నాఁ
డరుగుటచే బలిష్ఠుఁడగు ♦ నాశుగ సూనుని గాంచి సూర్యు మే
దురముగ మ్రింగవచ్చెడు వి♦ధుంతుదుపోల్కిఁ బురాధిదైవ ము
ద్ధురగతి లంకపేరుగల ♦ తొయ్యలి నిల్చి యదల్చె సన్నిధిన్ ౧౬౦

సీ॥ భుజము లొక్కనిమిది♦మోములు నాలుగు, నేడులోకంబుల ♦ కెగయుకాంతి
తిరుగుడు కన్గుడ్లు♦త్రిజగముల్ దాఁకిన, మొదలితోఁ గట్టి యం♦బుధిని గలుపు
సత్త్వం బమర్ష మ♦క్షమమును బెడిదంపు, టలికిడి గలుగు పా♦దాంగదములు
చెంది పల్వురు దవ్వు♦నం దోడువత్తురో, యని పాఱఁజూచుచు♦నరుగుదెంచి

తే॥ కారుమొగులునా గర్జించి♦ఖడ్గశూల, పాశకుంత గదాదులఁ♦బట్టి మొగము
పొగలుగ్రక్కఁ గోఱలు పొడ♦వగుచు వెలుఁగ, జముఁడు దిగులూన నడ గొండ♦
సరణి నొప్పి ౧౬౧

తే॥ పంచవన్నె వస్త్రంబు ధ♦రించి నాగ, భయదుఁడగు గరుఁడునివంటి♦పరువుతోడఁ
గ్రొన్నెలంబోలు వంకర♦కోఱలొప్పఁ, గడలి ముత్యాలహారముల్♦కాంతులీన.

తే॥ గందమలఁది తారస్థాయి♦కంఠరవము, పొసర భ్రమరముల్ గాంధార♦మునను పాడి
తనివినొందు మందారంపు♦దండ లడరు, ఘన కిరీటమ్ము శిరమునఁ♦గలదియగుచు.

తే॥ వనధివేష్టిత లంకను♦నెసరుతోడఁ, గాచు దేవత యొఱపొలెఁ♦గాచుకనులు
గలది భయదరావంబుతో♦నిలునిలుమని, యదలుచుచువచ్చెఁ గపియు ర♦మ్మనియెఁ
ద్వరను. ౧౬౪

తే॥ వెడఁగుపని చేసితేల వి♦వేకహీన!, ప్రాణముల నొల్లవో? భయ♦పడవా? చనవా?
క్షుద్రమృగమవా నీమీఁదఁ♦గోపమేల?, తొలఁగిపొమ్మని గర్జించి♦పలికె లంక.

తే॥ ఆసలేని యప్పావని ♦ రోస మడఁచి, నయవిధంబునఁ గార్యంబు ♦ నడపనెంచి
చూడఁగోరిన యీలంకఁ♦జూచునంత, నష్టమేమి నీకబ్బున♦నంగ నదియు.
పొమ్మనంబోక వాదాడఁ♦బూని తేమి? యెవ్వఁడవు నీవు? లయురుద్రు♦నెనయువార
లేని రానోడుదురు కాంచ♦నిచ్చగించి, నంత నీకు రాఁదగిన దే♦యనుచు నవ్వె.

ఉ॥ నవ్విన లంకఁగాంచి కపి ♦ నాథుఁడు నవ్వఁగ నోరి నవ్వెదే?
యెవ్వరు పంపవచ్చితి; వ ♦ హింపకు సాహస మింక జీవముల్
నొవ్వగ వీడదేల? విడి ♦ నూల్కొను లాభమ దేది? యింతకుం
జివ్వునఁ బాఱకే నిలిచి ♦ చెంగఁగఁ జూచెదె? యంచు గర్జిలన్. ౧౬౫

ఉ॥ చూడక పోవఁగాఁగలనె? ♦ చూచెదఁగా కనువానిఁ గాంచి హా!
వీఁడొక కోఁతికాఁడు కడు ♦ వేఱుఁడియో? కపటాత్ముఁడో యగున్

వేఁడి గరంబు మ్రింగిన ఫ ♦ ణిప్రభు భూమణుఁబోలె నవ్వుచు
న్వాఁడు జముండు నట్గని వ ♦ ణంకుఁ జలింపఁడు నిల్చి గుండునాన్.

ఉ॥ చంపెద వీని నేఁ డటులు ♦ చంపఁగఁ జాలనయేని లంకయే
సంపదతో నశించుటలు ♦ సత్యమ యంచెద నిశ్చయించి యో
తెంపరి! జాణవేనియు నె ♦ దిర్చి జయింపుము పోవువాఁడ వా
పెంపగుదారిఁ బోవకిటు ♦ భీతిని చోరుని రీతి డాసితే? ౧౨౧

—: హనుమ లంకను నిగ్రహించి లోని కరుగుట :—

మ॥ అనుచుం గోపము పొంగ శూలమొగి న ♦ త్యంతోద్ధతిన్వైచినన్
ఘన విద్యుల్లతనా మిడుంగుఱులు గ్ర ♦ క్కన్వచ్చు నద్దానిఁ బా
వని సర్పంబును పట్టి చీల్చు ఖగరా ♦ డ్వర్యంబలెం ద్రుంచెఁ గ్ర
క్కున లంకాహృదయంబు ఝల్లనఁగ లే ♦ ఖుల్ మోదముం బొందఁగన్.

తే॥ శూల మట్టులు నుగ్గయి ♦ క్షోణిఁ బడఁగ, నగ్నివలె మండి లంక ది ♦ వ్యాయుధములఁ
గొనుచుఁ బోరఁగఁ దొడఁగ నా ♦ హనుమ చూచి, నింద కెడమని విఱిచె నన్నింటిఁ
గొనుచు.

తే॥ కైదువులు లేని యాలంక ♦ కసలి యుఱిమి, నగము లచ్చనగాయల ♦ పగిది నాడు
కేలు పైకెత్తి ముష్టి వా ♦ తూలసుతుని, పొడువ నుంకించు నంత నా ♦ తఁడును కినిసి

తే॥ చేతు లన్నింటి నొకచేతఁ ♦ జేర్చిపట్టి, వనిత యిది చంప నాఱడి ♦ వచ్చునంచుఁ
బిడికిటం బట్టి వక్షంబుఁ ♦ బొడువ లంక, పిడుగు వడ్డ నాగమువలెఁ ♦ బుడమిఁ గూలె

క॥ పడి బొళుకు బొళుకుమని వె, ల్వడ నెత్తురు గ్రక్కి నలువ ♦ వచన మెడందం
గడు తెలివి గూర్చఁ గరువలి, కొడుకున కాలంక మ్రొక్కి ♦ గురుతరభక్తిన్

తే॥ కమలజుని యాజ్ఞ నీలంక ♦ గాచు దానఁ, గాన నీరీతి నీవయిఁ ♦ గడఁగవలసెఁ
గరుణ మన్నింపు చంపకు ♦ కలదొకండు, విన్నవింపంగఁ దగు వార్త ♦ వినుతచరిత!

క॥ ఈపురము నెంతకాలము, కాపాడుదు ననఁగ నలువ ♦ కపి యొక్కఁడు ని
న్నేఁపుతఱి రమ్ము విడి లం, కాపురి కానాఁటినుండి ♦ క్షయమగు ననియెన్.

తే॥ బ్రహ్మయన్నట్లియయ్యె ధ ♦ ర్మము జయింపుఁ, బాపము నశించుఁ ననుట న ♦
వ్యంపుఁబలుకె?
తలఁచినది యెల్లఁ గొనసాగుఁ ♦ దప్పదయ్య, యేగుమని మ్రొక్కి సెలవంది ♦ యేగె లంక.

ఉ॥ మారుతి సంతసించి ఋజు ♦ మార్గమె ధన్యత గాంచునంచు సీ
తారమణీ హృదీశ పద ♦ తామరసంబు లెడంద నిల్పి ప్రా
కారము దాఁటి లోనెడమ ♦ కాలిడె మున్నుగ నిర్భయాత్ముఁడై
క్షీరపయోధిలోన నొక ♦ చేమిరి చుక్క ప్రవేశమందెనాన్. ౧౨౯

ఉ॥ అంబర చుంబితంబులగు ♦ హాటక మందిర పాళి రత్నసం
ఘంబుల కాంతి జాలములు ♦ గాఢ తమంబును పాఱఁదోలి రే
యింబవ లొక్కరీతి వహి ♦ యించిన సొగసుగాంచి దిగ్భ్రమం
బుం బొరసెన్ మరుత్సుతుఁడు ♦ ప్రొద్దుదయించెనకాఁ దలంచుచున్.

చ॥ అరుదగు రత్నసౌధమయ ♦ మై యలరారిన యీపురమ్ము పె
న్నరులను ద్రింగుచుండుట ది ♦ నేశుఁడు గాంచిన సిగ్గు నొందఁడే?
మెరమెర చెంది యీ ప్రహరి ♦ మీఱఁగఁ జాలక తొంగి చూచి తా
నరిగెను పోలు నెందులకు ♦ నచ్చటికేనని యెంచి లజ్జమై ౧౮౧

ఉ॥ ఇఁదలివారు కేలఁ జరి ♦ యింతురు గావున నంతతంబు వె
ల్గొందు స్వభావముంగల న ♦ మున్నత మేరువువంటి సాలమం
దందములైన రత్ననిచ ♦ యంబులచేత వెలుంగు సౌధముల్
చెందిన లంక యెన్నఁడును ♦ చీఁకటులేవొ యెఱుంగలేనిదే. ౧౮౨

చ॥ అమృతము దేవతావళికి ♦ నర్మిలి నిచ్చిన మందరంబుఁబో
లి మనుకులాధినాథు నమ ♦ లీమన కీర్తిని పోలి వెల్గు కే
తమణి యిటుల్ దలంచుచు వి ♦ శంకటవృత్తిని వీథులందు తా
గమనము సేత యొప్పదని ♦ కైకొనె నన్నువరూపు నత్తఱిన్. ౧౮౩

తే॥ స్యందనాశ్వగజాదిక♦శాలలందు, పసులకొట్టము లంగళ్ల♦వాడలందు
కడలిదాఁటిన కాళ్లతోఁ♦గడచి విరుల, వ్రాలు భ్రమరంబుపోలిక♦వ్రాలిచూచె.

మాలిని॥ రిక్కలరోచులు రెక్కొను పెక్కగు♦రీతుల నన్మణి భిత్తికలన్
గ్రక్కిన కాంతులఁ గర్వలిబిడ్డఁడు ♦ కానఁగనచ్చుచుఁ గానకయున్
నక్కుచు నిక్కుచు నెట్టిన తెల్లన ♦ నల్లనయై హృదయస్థితుఁడౌ
నక్కజివేలుపుఁబోలి వెలింగె న ♦ హా! సులభుండయి దుర్లభుఁడై.

—: స్త్రీల సమూహములో హనుమ సీత నన్వేషించుట :—

ఉ॥ కాంచెను వానరోత్తముఁడు ♦ కమ్మని తేనియగాఱు తోఁటలన్
మించులఁబోలు వేలుపుల ♦ మొత్తలు స్వర్నదినుండి నీరమున్
గొంచు వహించి తెచ్చి వడిఁ ♦ గుంకుమ పంకముఁవోవ నార్చఁగా
నంచలు కేళు లట్టు లసు ♦ రాంగన లంబువు లాడుచుండుటల్. ౧౮౬

తే॥ తపముచేఁగాక వేలుప♦ద్ధతిని గాంచు, సత్ఫలము లేమి దీనిచేఁ♦జాలె బమ్మ
చూడుఁ డాడించువారలు♦సురవనితలు, స్నానమాడువారలు దైత్య♦చంద్రముఖులు.

చ॥ క్రమగతిఁ దంత్రులం దిగిచి ♦ కమ్ర కరాంగుళి పల్లవాగ్రముల్
కమనఁగఁ దాళసంగతులఁ ♦ గాచుచు వీణలఁ బల్కరించు న

బ్జముఖుల పాటలన్ విని న ♦ భంబు రవంబని సంభ్రమించి సౌ
ధములపయిం దనర్చు జల ♦ దమ్ముల నోళులు మూయు తొత్తులన్.

ఉ॥ పార్వ్యఁగఁ గాంచువారు ప్రమ ♦ దాతిశయంబునఁ దాళమేయ గం
ధర్వవిలాసినుల్ జన ను ♦ తంబుగ నాట్యము సేయ దేవతా
పర్వమణి ప్రభన్ విరుల ♦ పందిరి నంచలతెక్కు పాన్పుపై
మూర్ఛ్యఁగఁ బవ్వళించి కని ♦ మోదిలు పార్వణ చంద్రబింబలన్.

తే॥ స్ఫటిక వేదికలందు భా♦వములఁ దెలుపు, చాలుగనులతో నెడఁబాటు♦వలనఁ బెరుఁగు
కామసస్యంబునకు నీరు♦గట్టు కరణి, సంఘువు నానెడు దైతేయ♦మానినులను.

చ॥ కలువలఁబోలు నేత్రములు ♦ కాంతుల కన్నుల నైజసంపదన్
దెలుపఁగ నోష్ఠబింబములు ♦ తెల్లఁదనంబు భజింపఁ బ్రీతిమై
చెలువలు కాంతులం గలిసి ♦ చిందెడు ప్రేమముఁబట్టి త్రావు జో
కలఁగొని మార్చిమార్చి చష♦కంబుల హాలలఁ ద్రావువారలన్. ౧౮౧

క॥ సురతరువు లొసఁగు లత్తుక, యరుణచరణములను తడవి ♦ యంజనమును సొం
పొరయఁ గనులనిడి కస్తురి, పరిమళములలంది నగలఁ ♦ బెట్టిన వారిన్.

చ॥ ఫులులను పట్టి చీల్పఁగల ♦ పూరుషవర్యుల క్రొత్తనేరముల్
తలఁనుల మొద్దనొంప నమ్మ ♦ తంబును పొలిననోట క్ష్వేడముల్
వెలువడ నూర్చి కౌనులు చ ♦ లింపఁగ నందెలు క్రందుసేయఁ గా
ళులఁ దలఁ దన్నునప్పుడు క ♦ లుక్కునఁ బల్కుల నొందు దైత్యులన్.

ఆ॥ కనులు కైపువలనఁ♦గడు నరుణములుగా, మొగము వెల్లగాఁగ♦బొమలు ముడిచి
చెమటవాఱ మోము♦చెన్నద్దమునఁగని, ప్రియులకొఱకు వగచు♦బింబముఖుల.

తే॥ చెఱకుగానుగలందు నం♦దరములందు, విరులవనముల మ్లేచ్ఛుల♦వేశ్మములను
కల్లుపాకలఁ బాలేటఁ♦గాంచరాని, జోట్ల యధరామృతము నాని♦చొక్కువారి.

తే॥ మగలపై నల్గి కుచకుంకు♦మంబు చిటిలి, పెటుల విరిదమ్మిపై నోరు♦విడని మొగ్గ
పూచుకరణిఁ గేల్దామర♦మోముదమ్మి, నూని యూఁగుప్రాణములతో♦నుండువారి

తే॥ అల్కఁగొని సుమతల్పంబు♦లందు పొరలి, వలపుకాఁక రేఁపగఁ జూపు♦వాకిలిపయి
నుంచి దూతిక చిఱునవ్వు♦గాంచి యునుఱు, పడయుక్రియ లేచి తత్తఱ♦పడెడువారి

తే॥ పెక్కు వాద్యముల్ మొరయంగ♦వేల్పుచెలులు, భవ్యగీతముల్ పాడంగఁ♦బైఁటతోడ
రశన లింతజాఱఁగ నూఘు♦రములు మ్రోయ, నింటివేల్పుల రహిఁ భజి♦యించుచెలుల.

ఉత్సాహ. కుండలములఁ దాఁకు కనులు ♦ కోడెకాంద్రఁ గ్రువ్వఁగా
మెండునగల కాంతు లిరుల ♦ మీఁట మేటి వాద్యముల్
నిండ నీరదములవెంట ♦ నిమ్నగములపోల్కి వే
తండములుగ భవ్యవస్తు ♦ తతులు దెచ్చువారలన్. ౧౮౯

తే॥ పొలయలుక వీడి ప్రియులతోఁ ♦ గలయఁబూని, ఱెప్పలను నొఱలను దీసి ♦ కప్పులనెడి
నేయిపూసి కాంతియు మాయ ♦ నెగడు కన్నులనెడి కత్తుల దూయుదురై ♦ త్ర్యాంగనలను

చ॥ కినుక వహించుచుం బ్రియులఁ ♦ గీటునఁబుచ్చి మనంబు తెల్పి త
క్కినయవి వారితోఁ జరుగఁ ♦ గీడ్వడి దూపిలి మించుకై వడిన్
దనువులు సంచలింపఁగ ము ♦ దంబఱి యుంచలఁబోలి మెల్లనం
జెనసి కవాటముల్ మొగుచు ♦ చిత్ర నిభాంగ విలాసినీ తతిన్. ౨౦౧

సీ॥ కిన్నరకామినుల్ ♦ గీతముల్ పఠియింప, నాగకన్యకలు మం ♦ గళము చదువ
శారదాబ్దముల నే ♦ పారు సౌదామినీ, తతులన నొప్పి ము ♦ త్యాల శిబిక
లెక్కి చెల్వలు గొల్వ ♦ నింపుగా నూత్నగృ, హప్రవేశమ్ముల ♦ నందువారి
మంగళరవము చె ♦ లంగ సురాళి ను, తింప సన్న్యాసులు దీ ♦ వింప ఘనుల
తే॥ తరుణులారతులెత్త వి ♦ ద్యాధరాలి, విజయగీతము లాడ స్వ ♦ ర్వేశ్యలాడఁ
జుట్టపక్కాలతోడను ♦ సొంపుగాఁగఁ, గ్రొత్తపెండ్లిండ్లు నెఱవేర్చు ♦ కొనెడువారి.

—: హనుమ కుంభకర్ణుని గనుట :—

తే॥ యక్షరాక్షస నాగవి ♦ ద్యాధరాది, కాంతల కలంకులేని మొ ♦ గంబులెల్ల
శంకదీఱఁ గాంచుచు నేగి ♦ శైలమట్లు, కలఁకలేక నిద్రిలు కుంభ ♦ కర్ణుఁగనియె.

సీ॥ పెనుపుగా నేడు యో ♦ జనముల విస్తీర్ణ, మై బిడౌజుని వైజ ♦ యంతమట్లు
తనరిన మంటపం ♦ బు నడుమ నొకతల్ప, మున నాగరాజన ♦ వనధి యనఁగ
నిరులకుప్పయనఁగ ♦ వెరవునఁ దలఁపంగఁ, గానికర్మంబులు ♦ కరువు గట్టి
పురుషస్వరూపంబుఁ ♦ బొందె ననఁగనొప్పి, కుంభకర్ణుండటఁ ♦ గూరుచుండ
ఆ॥ వనధి మునిఁగి లేచి ♦ తనకుఁ దగిన మూఁడు, వగల నడలతోడఁ ♦ బ్రజనవరజము
పరవు కల్పవనిని ♦ పడిలేచివచ్చిన, మలయపవనుఁ డతనిఁ ♦ గలయ నొరయు.

తే॥ నాకినులు పాదసంవాహ ♦ నంబుసేయ, వారి పూర్ణేందుఁబోలిన ♦ వదనములను
గాంచి యచ్చటి చలువఱా ♦ ల్గరఁగిచెలుల, యొడలిపై నీటితుంపురు ♦ లురలిపడును.

ఉ॥ ఆతని నాసికాంతరము ♦ లందు బయల్వెడి వచ్చు నమ్మహా
వాతము వాయుపుత్రకుని ♦ వాఁకిటికిం గొనిపోయి యంతటన్
లోఁతగు ముక్కులోపలికి ♦ లాఁగఁగఁదీయఁగఁ బోవ రోయుచున్
జేతులు వీఁగ నూఁదికొని ♦ చెచ్చెర నాతఁడు దాఁటె సవ్వలన్. ౨౦౬

ఉ॥ ధూళిచయంబుపై దెనకుఁ ♦ దోడన లేవఁగ బైటికేగుచున్
దాళక వ్రేటిలం దిరుగఁ ♦ దార్చెడు తోరపుటూర్పు లోకహృ
ద్వేళ నెనంగు మారుతము ♦ తేఁకువ నప్పటిదాఁక వీసి హృ
ద్గోళమునందు నెక్కొనిన ♦ తోయము దోఁచుఁ దలంచి చూచినన్.

కం॥ పగవాఁడని దోషాకరుఁ, దెగఁజీలిచి నోటఁగవ్వ ♦ తీరున దొగనై
పొగ లెగయు నూర్పుతోనవు, దగులని మొగమందు వజ్ర ♦ దంష్ట్రలు వెలయున్.

తే॥ మంత్ర బద్ధమైన భుజంగ♦ముంబుఁబోలెఁ, గల్పవేళ నిరీక్షించు♦కంధివోలె
నడుమ మెలఁకువలేని వి♦న్ననువు నిద్ర, గాంచుచున్నట్టి యాకుంభ♦కర్ణుఁగాంచి.

తే॥ అతఁడు లోకకంటకుఁడగు♦నసురవిభుఁడ,టంచు ముమ్మూర్తులందొకఁ♦డనఁగనొప్పు
నాంజనేయుండు కరుణామ♦యంబులైన, కనులనుండి రాలిచె వహ్ని♦కణము లపుడు

కం॥ పదితల లిరువది చేతులు, పొదలవు రావణుఁడు కాఁడు♦పొరపాటున నే
బదరితి నని కోపాగ్నిని, వదలిచి చల్లార్చె జ్ఞాన♦వార్ధి జలముచే. ౨౧౧

మ॥ శ్రవణానందముగూర్పు రాఘవుని వి ♦ శ్వస్తుత్య సుశ్లోక మె
క్కువ వర్ధిల్లఁగఁ జేయు పావని జ్వల ♦ త్కోపంబు చల్లార్చి వీఁ
డెవఁడో నేమి యటంచు ముష్టిగొని మా ♦ యింపంగ లోనెంచి మ
క్కువ నిద్రించెడి నాయువున్నదని యా ♦ కూటంబు వీడెన్ వడిన్.

ఉ॥ రామునికీర్తి రూపముగ ♦ రాజిలు మారుతి పుష్ప వాటికల్
హేమ వినూత్నత సౌధము ల ♦ హీన గృహంబులు పాకశాలలున్
రామల గాన నృత్యముల ♦ రంగగు సాలలు దేవళంబులున్
స్వామిహితాగ్రగణ్యుఁడు వె ♦ సన్ వెదకెన్ బహు సూక్ష్మబుద్ధియై.

చ॥ మణిమయ చిత్రదేహళుల ♦ ప్రమాఁగు గవాక్షముల్ సుమంబులన్
దృణములఁ బూలకాఁడలను ♦ తేఁకువ ధూమముపోల్కి వాయు వ
ట్లణఁగుచు సూక్ష్మరూపుఁడయి ♦ యంతట నిక్కుచు స్థూల రూపుఁడై
యణువున మేరువందు హరి ♦ యట్లు చొరంగ సమర్థుఁడై చనెన్.

చ॥ ఇదియది యంచు నెంచ కట ♦ నెల్ల తలంబుల కేగి శ్రద్ధయై
మదవతులన్ మనోజ్ఞ సుమ ♦ మాయుతలన్ బరికించి బుద్ధి సం
పదగల నాగ యక్ష సుర ♦ పార్థివ మాని జనార్థ్యజన్మమై
పొదలిన యవ్విభీషణుని ♦ పుణ్యగృహంబునఁ జొచ్చె నంతటన్. ౨౧౫

తే॥ స్ఫటిక వేదికన్ విపులచ♦ప్పరముక్రింద, గట్టివారిలోఁ దెలిరూపు♦గాంచఁదగని
దంచు నల్లనిరూపంబు♦నవధరించి, దాఁగి తిరుగు ధర్మంబు నాఁ♦డినరువాని.

తే॥ దాసి యతని సుశీలతఁ♦దన సుశీల, తను గ్రహించి నిష్కల్మషుఁ♦డనుచుఁ గినుక
నూనకనిల సూనుండు వే♦ఱొక్కప్రక్కఁ, జొచ్చియొక కోటిమేడలఁ♦జూచెఁద్రుటిని.

—: హనుమ ఇంద్రజిత్తు గృహమును గాంచుట :—

తే॥ శశిముఖుల సుధాధరల న♦చ్చటులఁగాంచి, హృదయవేగంబుకంటె ముఁ♦
పరమపావని పావని♦జరగి జరగి, బలవిరోధి చెఱంబడ్డ♦తలము చేరె. [దేగుచుండు

తే॥ క్రూరదంష్ట్రులు సాయుధుల్ ♦ క్రోధమూర్తు, లురు రణోత్సాహయుతులు లో ♦ కోక్తులు విడి
కథలఁ జెప్పికొనుచునుండు ♦ కావలీంద్రు,లగ నసంఖ్యాకులగువారి ♦ దాఁటి చనియె.

మ॥ పొగయుం దూఱఁగలేని కానములకున్ ♦ బోవంగఁ జాల్జాణఁ డా
శుగమానుం డటఁగాంచె లీలఁ గరిభి ♦ త్తూనుండు పంచాస్యముల్
నగ సంకాశ భుజార్గళీదళకమున్ ♦ మైదాఁచి యొప్పారు న
ప్పగిదిం జెన్నరు మేఘనాదు బహుళ ♦ స్వర్గాంగనా సంయుతున్.

చ॥ బిలమున నిద్రసెందు నహి ♦ భీషణ కేసరివంటి వీఁడు పోఁ
కొలఁదియొడయుఁడు రావణుని ♦ కూరిమిపట్టియొ? శంభుసూనుఁడో?
తెలియఁగరాదు క్లేశమున ♦ దెవ్వరమా పెనుపోరు వీనితోఁ
గలుగఁగవచ్చు రేపు మన ♦ కాగ్నికవీరుల కంచు నెంచుచున్. ౨౨౧

ఉ॥ ఇమ్మగవాని భౌనటగ ♦ నేత్రైఱ నొందిన రావణుండు లో
కమ్ముల గెల్చెనంటయు నొ ♦ కానొక చోద్యమె? శర్వ మాధవుల్
బమ్మయుఁదక్కఁ దక్కుజన ♦ పాళుల నీతని కీడుగల్గ నం
చిమ్ముగఁ బల్కువాని వెడఁ ♦ గే యని చెప్పఁగవచ్చు గట్టిగన్. ౨౨౨

క॥ అని ముక్కుమీఁద వ్రేలిడి, కొని కాలము నిచటఁగడపఁ ♦ గొఱలు ఫలంబే
మని హనుమఁ డాస్థలము విడి, చని నెమకెను వేలకొలఁది ♦ సౌధము లవలన్.

సీ॥ అక్షకుమారుని ♦ హర్మ్యంబు పరికించి, యతికాయు భవనంబు ♦ నందు వెదకి
యోధవరుల సౌధ ♦ వీథు లన్వేషించి, మంత్రుల మేడల ♦ మలసి కాంచి
రాజబంధుల మంది ♦ రంబులు శోధించి, తక్కువారలయిండ్లు ♦ తరిచి చూచి
దానవనాథు నం ♦ తర్మందిరముగనఁ,దలపోసి మూఁడుకో ♦ టలకు నడుమ
తే॥ నున్న పరిఖ వీక్షించి వా ♦ యుజుఁడు తాను, జలధిదాఁటిన యవమతి ♦ సైఁపకిట్లు
సప్తవారిధు లొక్కపై ♦ చలము మీఱ, వచ్చి చేరెనో యని యబ్ర ♦ పడియె లోన.

—: అంతర్మందిర పరిఖ నాంజనేయుఁడు దాఁటుట :—

చ॥ పొడవును గాతమున్ వెలుఁగు ♦ పొందిన కందక మిద్ది యంచనం
గడఁగుదురేని పల్వురు యు ♦ గప్రళయంబు ఘటించుదాఁక నీ
పుడమిని మెల్లఁ గ్రొచ్చినను ♦ బ్రోవడి సేయఁగలేరు తేనికిన్
జడిసి పయోధు లేడిటులు ♦ జానుగ నూల్కొని నిల్చెఁ గావలెన్.

తే॥ అంచితముగ రాముని కీర్తి ♦ యలముచోట్ల, నెల్ల వ్యాపించి నాతఁడి ♦ క్లెన్ని దీని
జడధి దాఁటుటకంటె ని ♦ మ్మదుగు వడిని, దాఁటినను దాఁట రాదంచుఁ ♦ దలఁచె మదిని.

తే॥ నాల్గువగల యాగడపల ♦ నాణెముగను, పిలువఁ దలలెత్తినట్లున్న ♦ యలల తోడి

నీరుగలిగి రావణుసేస♦తీరుదాల్చు, నగడిత నుతింప వాక్కున♦కలవి యగునె?

తే॥ కరుల మదము హరుల నోటి♦నురుగు వెల్లు, చెలుల కుంకుమపంకంబు♦పొలసుదిండ్ల
సకుల కస్తూరి తేనెయుఁ ♦ జందనంబు, గందవొడిగల తావులు ♦ కడలు వీచు.

తే॥ చక్ర బక హంస టిట్టిభ ♦ సారసములు, నీరుకోళ్లు నుల్లంకులు ♦ నారణములు
కలియఁబలికెడి పెలుచని ♦ కలకలంబు, వీనులకు నత మచ్చట ♦ వినఁగవచ్చు.

తే॥ కస్తురియు లత్తుకయుఁ దావి♦గందమగురు, చేరుకతన మునింగెడి♦వారణముల
తోడి కలయిక తమిగొల్పు♦తోయమొదవఁ, బిడులకయ్యగడిత దూతి♦విధముదోఁచు.

ఉ॥ కమ్మని తావి తేనియ సు ♦ ఖమ్ముగ నిమ్ముగఁ గ్రమ్మ తమ్మిమొ
త్తమ్ములు నెమ్మొగమ్ముల ము♦దమ్ము తొలంగి మొగిడ్చ నెమ్మి సీ
తమ్మ ముఖమ్ము తీరున న♦యమ్ము సమమ్ము గణించుచుండు చెం
దమ్ములు రామ తీరుఁగని ♦ తాము నమోముల మోడ్పకుండునే? ౨౩౧

తే॥ పటికబండలు మలిచి సో ♦ పానములుగఁ, దీర్చఁ దీరమ్ము నీరమ్ము ♦ నేర్పరింప
రాకయుండెను; జడులు వి♦వేకులసభఁ, జేర సులభమ్ముగా వేఱు♦సేయనగునె?

తే॥ మీఁదగ్రిందను శర్కర నీ ♦ లాదికములు, వేఱువేఱు కాంతుల నీన ♦ క్షీరవారిఁ
దొట్టి పాథోనిధులు వాత ♦ ఘాతగతుల, నొక్కటై తోఁచుకైవడి ♦ నుల్లసిల్లె.

తే॥ అంత హనుమంతుఁ డెంతయు♦సంతసమునఁ, దొలిసముద్రంబు దాఁటిన♦తోయమున నె
ప్రహరి వెనుకఁబడంగ నా♦పరిఖ దాఁటి, యరిది కాఁపగు నంతర్గృ♦హమ్ము చేరె.

—: నిద్రితులగు రక్కసుల హనుమ కాంచుట :—

క॥ యముఁడును దిగులునఁ బొఱి భ, యముఁ గొల్పు సురారివరుల♦కరయఁబడని తో
యమున న్నిమకెను మారుతి, తమి ద్వాదశయోజనములు ♦ తనరిన వీథుల్.

క॥ అడఁగె మధుసేవనమ్ములు, మడఁగెఁ గడలి పగిది నడరు ♦ మాటల రవళుల్
ముడిఁగెను తూర్యత్రయరవ, ముడిగెను కార్ముకుల చెయువు♦లోనరె నిదురయుఁ.

క॥ వారువములు గూరికెఁ బ్రొ, కారమ్ములఁ గాచువారి ♦ కటు ఘోషణముల్
మీఱెను కాంతలు కాంతులు, తోరపు బడలికను కూర్కు♦దొడఁగి రవశతఁ.

క॥ పొలయలుక విడిస పొలఁతులఁ, గలిసి యువకు లనఁగి పెనఁగి♦క్లమమగు నవలఁ
గలయిక నలయిక నెలువడఁ, జెలువల వక్షముల వ్రాలి ♦ చెందిరి నిదురఁ.

ఉ॥ ఇంపగు హాలఁ ద్రావి కయి ♦ పెక్కినవారును ధూప వాసనల్
నింపిన పూలసెజ్జలను ♦ నీటుగ ద్రుక్కెడి కామ సౌఖ్యముఁ
మంపు రసంబునాని తలి ♦ మంబులఁ దృప్తిని పొందువారునై
పెంపులు దక్కి కూలఁబడి ♦ పెచ్చగు నిద్దురఁ బూని రత్తఱిఁ. ౨౩౯

మత్త॥ త్రాఁగి యాడెడి పెక్కురీతుల ♦ దైత్యవర్యుల యాటలున్
మూఁగి పాడెడి హెచ్చుతీగల ♦ ముద్దు గుల్కెడి పాటలున్
మ్రోఁగి కూడెడి వాద్యరావము ♦ మ్రొగ్గి తగ్గెను దీటులన్
వీఁగి వేఁడెడి కోడెకాండ్రుర ♦ వేడ్క గ్రుంగెను పూటలన్.

మృగమదంబుచందనమును♦మేఁగియున్న,ఱొమ్ములందునమలయమా♦రుతముసోఁక
విరహిణుల ఖండితల కనుల్ ♦విడిచె జలము, మనసులెల్లఁ దాపంబుచే♦మాఁడి క్రందె

ఉత్సా. వైరి గ్రుంగినప్పు డడంచు ♦ వారిపోల్కి దివెల నా
ధారమైన సెయిసొగ్గు ♦ తటిని తీర్చె వాయువుల్
వారిజాస్య లొడలి కాంతి ♦ వార్ధిఁ గొలువఁ దివ్వుగకే
కోరి దెసలఁ గొలువఁబోయి ♦ కూల్చె నిరుల గుంపులన్. ౨౮౨

తే॥ నిత్యకర్మానుసారులై♦నిర్మలులగు, జ్ఞానులును యోగులు సుషుప్తి♦నూనినారు
మదగజములు నిద్రించె ను♦న్మాదులెల్ల, గునికిరనఁ దక్కువారలఁ♦గొనర నేల ?

తే॥ ద్వంద్వములను నిర్జించిన ♦ దండిమగఁడు, రాజవీథిని చని దైత్య ♦ రాజ నగరి
చెంగలి యగడ్తతోఁ గోటఁ♦ జెంగలించి, దాఁటి లోనికిఁ జనియె ను♦దాత్తదృష్టి.

—: హనుమ రావణుని మేడఁ జేరుట :—

సీ॥ సమరశీలుండగు ♦ నమరారి బంగారు, మేడ రాకాచంద్రు ♦ జాడనొప్ప
రిక్కలగములునాఁ ♦ గ్రిక్కిఱిసి వెలుంగు, నీరజాక్షులయిండ్లఁ ♦ దారసించి
కందునొందకయుండు ♦ కలువరాబింబంబు, డీలుపడఁగఁజాలు ♦ డాలునేలు
మోములతో యక్ష♦రామా లలామలు, వసియించు నొకవాడ♦వాంఛఁ జేరి

తే॥ కాంతు లీనెడు వజ్రాల♦గడియలున్న, కడల నూలికంటెను గాలి♦కంటె సూక్ష్మ
రూపమూధరించితూఱెమ♦రుత్కుమారుఁ, డాసగొలుపు దుష్కర్మముల్ ♦గోసినతఁడు.

క॥ కొందఱు దశకంధరుపై, డెంద మునిచి మోమునంచి ♦ దిగులున నూర్పుల్
క్రందుగఁ బుచ్చుచు తెప్పల, చిందార్పక యుండి రచటఁ ♦ జిత్రములక్రియన్.

క॥ కొందఱు కలగనుకొఱకో, కందర్పున కడలియో గుబ♦కం డదియేమో
కందుమనరాదు కనులన్, చెందమ్ములు ముడ్చి యుఱక♦ చెలఁగిరి సెజ్జన్.

క॥ కొందఱు మరుశరముల పో, టొందిన కుచకుట్మలాంగు♦లూఁగెడి శ్వాసం
బంది వగచి చేయునదే, మందురు చిత్తరువు వ్రాయ♦నగునే యనుచున్.

క॥ కొందఱు కన్నీరొలుకుచు, సుందరు రమ్మనవు పోవు♦చొప్పరయవు నీ
కిందలి పని యేమని చెవి, విందుగఁ బలుకుదురు గోర♦పిట్టల తోడన్. ౨౮౯

క॥ కొందఱు మందానిలమునఁ, గండ వలుందైన చనులఁ♦గని తము వీడిం
పం దొడరు దనుజవరు భుజ, మందము నెదఁ దలఁచి తలఁచి♦యులయుదురు వగన్.

క॥ కొందఱు పెనుమానికములు, చిందిస నచ్చలపు డాలు♦సెజ్జలఁ జొరఁ జా
లం దినములు సిర్వ్ణిణ్ణత, నందురి కనఁబడిరి సంజ♦పఱలు శశివలెన్. ౨౫౧

క॥ కొందఱు తమ భుజములవలెఁ, జిందిలు మంచముల నిద్ర♦సెందెడుచో భీ
తిందార్చు వీణరవమను, పెందే లటఁ జెవులఁ గుట్ట♦బెగ్గిలు వారల్. ౨౫౨

క॥ కొందఱు కనకాద్రి ధనువు, నందగ్ని శరంబు గూర్చు♦నభవుసి నుల నె
త్తందనరు భుజము లలఁదిన, చందనము కుచంబులంటు♦చాఱలవారల్. ౨౫౩

క॥ కొందఱు జలధి యుబుక నా, నంద నటన సేయు భవు గు♦ణంబులఁ గైనా
రిం దంతిగ బహురాగము, లొందఁ బొగడువాని వినుతి♦యొనరుచు వారల్.

క॥ పలు తెఱఁగుల జక్కను లిట్టు, వెలయు వసతు లెల్లఁగాంచి♦వృక్షచర లస
త్తిలకము లంకానాథుని, కులపాలిక లున్నయిండ్లఁ♦గోరికఁ జేరెన్. ౨౫౫

చ॥ హరువుగఁ జీఁకటిన్ దఱిమి ♦ యాఱక పెల్గెడు కెంపు దీపముల్
మురువుగ నొప్పు నోవరుల ♦ ముగ్ధలు సల్పెడు నాడిగంబులన్
బరువుగ వీడఁగా నసుర ♦ పాటలగంధు లి కాంక్ష మున్నగాఁ
దరువుగ నేగఁ దల్పములఁ ♦ దాఱి రెడందలతోఁ బెనంగుచున్.

తే॥ అగ్నికీలపై మృగనాభి♦యలఁదినట్టు, లలరు జడలలోఁ బొగవలె♦నళులు ముసరఁ
గ్రొవ్విరుల పానుపులను పై♦రులుఁగ నెంచి,పటిక బండల నారట♦పడెడువారు.

తే॥ తనువు మిన్నగా ముత్యాల♦దండ బుకు, ములుగ జడలు మోదుగురంగు♦
మొగులుగాఁగ
నడుము మెఱుముగాఁ గన్నులు♦జడిగ నొసలు,క్రొన్నెలగ సంజవిన్ననాఁ♦గొఱలువారు.

తే॥ పొడవుమేడల వెన్నెల♦ముంగిళులను, చేటికలఁ గూడి కన్నుల♦నీటుగ్రాల
నెఱికురులు ప్రీల రిక్కల♦నెఱిగఁగొనుచు, హావణిలంగ నచ్చనగాయ♦లాడువారు.

తే॥ దేవకాంతలు స్వర్నదిం♦దెచ్చినట్టి, జలము చల్లగా లేదని♦యలిగి మేడ
లలఁత నెక్కి మొగుళ్లను♦తొలిచి కాఱు, నంబువులయందు జలకంబు♦లాడువారు.

ఉ॥ శేష ఫణామణుల్ బలిమి ♦ జీవితనాథుఁడు తెచ్చియిచ్చె నం
తోషమెలర్ప మేమె తగు ♦ తోయలులంచు వచించుకొంచు వి
ద్వేషుల గెల్చి కైకొనిన ♦ దివ్య కిరీట లలంతికాది స
ద్భూషలఁ బన్నిదంబులిడి ♦ పోఁడిమి జూదము లాడువారలున్. ౨౬౧

చ॥ కుసుమ వనంబులం బసిఁడి ♦ కూటములందున ముత్తెపందిరిన్
బసగను సిద్ధకన్యకలు ♦ పాడ మృదంగము నాగకన్య లిం
పెసఁగ వహింప నప్సరస ♦ లీడ్యగతి న్నటియించుచుండ సం
తసమునఁ బూలపందిళులఁ ♦ దార్కొని వేడుక గాంచువారలున్.

చ॥ ఇనుప సలాకవోలె నెద ♦ కెక్కిన మోహ మలంగఁ జేయఁ గ
న్గొన లల కొండవాఁగులను ♦ కోఁదగి నిద్రనుపీడ నిండ్ల ప్రాం
గణముల వీణియల్ గొనుచుఁ ♦ గంఠముతోడ లయింపఁగా సుధా
కణములు చింద శ్రావ్యముగ ♦ గానము సేయుచునుండువారలున్.

తే॥ ఇంచు నఱచట్టవలుప చ♦లించి తొలఁగఁ, గుండలమ్ములు గదలికఁ♦గొరదు లీనఁ
గల్లుద్రావంగ నుడివడు♦కనులతోడ, మేనెఱుంగని నృత్యాల♦మెలయువారు.

తే॥ విసమువంటి మద్యము ర క్త♦మెసఁగఁ ద్రావి, గుజరి పద్ధతిఁ గంఠంబు♦గూర్చి వదరి
ఝుర్ఝరీ వాద్యసరణి హ♦స్తములు దట్టి, యందమే చెడ వెఱ్ఱిగా♦నాడువారు.

తే॥ పెరుఁగు రంగైన కల్లు త♦బ్బిబ్బు సేయ, బొబ్బలిడుచు నిట్టూర్పులు♦పుచ్చి కురులు
విరియ నొడలెల్ల వడఁకించి♦వేల్పుసోకె, ననుచు నిచ్చవచ్చిన యట్టు♦లఱచువారు.

తే॥ ఇట్టి పెక్కుతీరులనొప్పు♦నిగురుఁబోండ్ల, యిండ్లు వీథులు గనిదాఁటి ♦ యేగిసిద్ధ
సాధ్యవనిత లున్నట్టి వే♦శ్మములఁ గడచి, చేరె విద్యాధరాంగనల్ ♦చెలఁగువాడ.

—: హనుమంతుఁడు విద్యాధరాంగనలఁ గాంచుట :—

సీ॥ చొఱవిమానముహా పొంది♦మెఱయు సీసకము ధ, రించిన గోఁకుల♦ తేఁడు రామి
కధిక మోహమున మ♦ధ్యంబుకంటెను మనం, బులు చలింపఁగ జీవ♦ములును వాడ
గాయనుల్ దగ జంత్ర ♦ గాత్ర లయలుగల్పి, పాడిన గీతముల్ ♦ పాములట్లు
చెవిఁజొరఁ గలఁగిన ♦ చెలువలు కొందఱు; వాని కోపాగ్నికి ♦ వడఁకి సురలు

తే॥ మునులు బుధులును దిక్కేది♦మొనసి యోర్వఁ, బగవహించి చంద్రుఁడు దైత్య♦
వర్యునందు
ప్రేమగలవారనుచుఁ జాల♦వేఁడి వెలుఁగు, లీన నెడఁదలఁ దపియించు♦నిగురుఁబోండ్లు.

సీ॥ అల్పకాలము కల్ప ♦ మట్లుగ మదిదోఁప, నుడుకుచు మరుబారి ♦ కడలువారు
మును కౌఁగిలింగొన్న ♦ చనులపైఁ జందన, మంటిన యదిగని ♦ యులయువారు
చెక్కిళ్ల వ్రాసిన ♦ చిత్రముల్ ప్రాణంబు, లం జీల్చుచుండఁ గ ♦ లంగువారు
కన్ను లెఱ్ఱగఁ జేసి ♦ కాంతు నింక నిటకు, రానిత్తుమే యని ♦ రగులువారు

తే॥ నైన విద్యాధరాంగన ♦ లలఁగుచున్న, వీథులంగని త్రిభువన ♦ వీరుమేడ
ప్రాంతి చందురు నొప్పిన♦వదనములరు, వ యునికూఁతురు వసియించు♦మాళిగఁ గనె.

ఉ॥ కాంచి యెలర్చి కార్యముస ♦ కాఁదగుఁబూనితియిందు చిత్రమొ
క్కించుక కద్దు మత్ప్రభున ♦ కెక్కుటి ప్రాణమయైన దేవి నిం
దుంచినవాఁడు రావణుఁడు ♦ ప్రోన్నతజాతి మహాశ్మసంతతిన్
మించిన కౌస్తుభంబువలె ♦ మేటి గృహాంబిది యంచు నెంచుచున్ ౨౭౦

సీ॥ రంభాది జంభారి ♦ బంభర వేణులు, మృదులపాదముల మె ♦ ల్మెల్లనొత్త

మణిరాజ భూషలు ♦ ఫణిరాజరోషలు, వింజామరము లల్ల ♦ విసరుచుండఁ
జెంకురసంబును ♦ చేదనిపించి గం, ధర్వసుందరులు గీ ♦ తములఁ బాడ
బంధముల్ నీఁగిన ♦ పావనులయ్యు ద, క్కువ వారి కినుకకు ♦ గుఱియరైనఁ
తే॥ బొందు లగ్గాలగ్గో యని♦పొడము శంక, మలయపవనుండు చేటులు♦పిలువనేగి
యాజ్ఞగొని వచ్చుఁబోవు ను♦య్యాలపగిడి, చనవెయైన సరుదు మీఱి♦చనరు బుధులు.

—: హనుమంతుఁడు మండోదరింగని సీతయని భ్రమయుట :—

చ॥ వెలిఁగెడు రత్నదీపికల♦వెల్గుచెడం దన మేనికాంతి ది
క్కులఁ జరియింప స్త్రిదిలు చ♦కోరపయోధరఁగాంచి యా యన
ర్గళ చరణుండు సీతయని ♦ గట్టిగ శంక యొనర్చి పొంగు పే
రలుక శరీర జీవ హృద ♦ యంబుల మాడ్పఁగ నెంచె నీగతిన్. ౨౭౨
చ॥ ఎమకపయిన్ రహించు నొడ ♦ లెత్తు ఫలంబు వహింపనైతి నా
తమకటులుండనీ; స్వకుల ♦ ధర్మము ప్రేమలతన్ విదిర్చి స
ద్విమల సతీత్వ మగ్గిసెగఁ ♦ ద్రేల్చిన జానకి యీమె యన్నచో
నమరిన రామకీర్తి యమ ♦ రారులు లంకయు నేనుఁ గూలమే?
ఉ॥ ఆయమ సుందరాంగి మను ♦ జాధిపకన్యక, చెప్పఁ బూనుచో
నీయలివేణి యక్షిణియొ? యాసురియో? యగు మీననేత్ర లా
నాయకు మేనియందము మ ♦ నంబున నొక్కపరిన్ గణింపఁ బం
చాయుధునైన లెక్కిడుదు ♦ రా? మతిమాలి యిటుల్దలంచితిన్
చ॥ అమల సతీత్వలక్షణము ♦ లారయఁ గొండొక యున్న యీమె దే
హమె యొక యంగదం బొదువ ♦ నందిక నున్నదియంచుఁ దెల్పెడిన్
సుమయుతవేణి వీడినది ♦ చొప్పఱు పల్కులఁ గల్పించు ని
య్యమపతి వేగ తీఱు క్షయ ♦ మందును లంకయు నిశ్చయంబుగన్
తే॥ అనుచు నూహించి నాసంది♦యంబు నింత, తొడశాంతిలఁగాకని♦తొలఁగిపోయి
మేరువును చిన్నదనదగు♦మేడఁ జొచ్చె, ననుఁ యెత్తనిగిరిఁ బోలి♦యలరు ఘనుఁడు.
చ॥ పుడమి చలించె శైలములు ♦ ప్రుంగె వడుక్కగుపోలు కొను కై
వడి భుజముల్కనుల్బొమలు ♦ పాటలగంధుల దక్షిణాంగముల్
వడఁకె దిశల్ బెడంకెఁ బొల ♦ పంబుగ మించులులేక పల్బలన్
బిడుగులు రాలె నూరకయె ♦ ఛేదిలె మంగళ పూర్ణకుంభముల్. ౨౭౭
ఉ॥ మారుతి కన్నులారఁ గని ♦ మానసమందు దలంచి యింతయున్
జేరికయయ్యె నీపురము ♦ నేగికి; నేకులమందు పుట్టి యె
వ్వారయినన్ గడించిన య ♦ భంబొ శుభంబొ ఫలింపకేగునే?
కారడవిం జరించినను ♦ కర్మముకంటె బలీయముండునే?

—: హనుమంతుఁడు రావణుని గాంచుట :—

చ॥ వినుతకళా విశారదుఁడు ♦ విశ్రుత ధర్మ కుశాగ్రబుద్ధి పా
వని యట సైన్యసంతతులు ♦ వాకిటఁ గావలిగాయ క్షీరవా
ర్ధిని పెరవార్ధి పైకొనిన ♦ రీతిని తెల్లని తల్పమందు న
ల్లని జిగి నొప్పు రాక్షస ల ♦ లాముని రావణుఁ గాంచె నయ్యెడన్.

సీ॥ బాలసూర్యులు పూర్వ ♦ పర్వతాగ్రస్థులో, రాణఁ గిరీటముల్ ♦ రాజిలంగ
నొడలిపై వెలలేని ♦ తొడవులు లేమెండ, గాసి రేయిని పూర్తి ♦ గాఁగ గ్రమింగఁ
గనకకశిపుఁ జంపి ♦ కనకాద్రి గుహలోన, నిద్రించు బహుశీర్ష ♦ నృహరి యనఁగ
ధర్మమయ స్వర్గ ♦ వాసులో వేల్పుల, పడఁతులు పెక్కండ్రు ♦ బారుతీరి
తే॥ పొన్నకాఁడలు చామరాల్ ♦ పొసఁగ వీవ, సుడియు లేగాలిచేఁ గల్ప ♦ సుమములందు
మధుకణంబులు పడ మేను ♦ మఱఁగి సీతఁ, దలఁచి నిట్టూర్చి కృశియించు ♦ దైత్యనాథు

ఉ॥ కంతుని క్రూర బాణములు ♦ కంతువిరోధి నగంబునెత్తు బా
హాంతర మందు గ్రుచ్చికొని ♦ యవ్వల డుయ్యుటచేత మున్ను ది
గ్దంతుల దంతముల్ సమర ♦ ధారణి నాఁటఁగనైన యావ్రణా
క్రాంత తదంతరంబుల ని♦ రంతరముల్ రసి గాఱుచుండఁగన్.

చ॥ కలపపుఁ బూఁతపై మృదువు ♦ గాఁ బడు చల్లని గాలి దర్పకా
నలమును భస్త్రివోలె జత ♦ నమ్మన ఘుమ్మని రెచ్చగొట్ట మై
థిలిపయి నంతరింద్రియ గ ♦ తి ప్రతిపత్తులు పర్వవెట్టఁ బా
ములు విడిపోవు పుట్ట యనఁ♦బోలిన యుల్లము వట్టి పాడుగాన్. ౨౮౨

తే॥ ఉత్సుకత మీఱి పైపయి నుల్లసిల్ల, నాఁడు చేసిన యుగ్ర ర♦ణంబులందు
వారివారి త్రావఁగ మితి♦మీఱి కాఱు, సురల కీర్తి నాఁ గోఱల♦సొబగువాని.

తే॥ పూలపానుపు మాఁడి ని♦ప్పుకలు రాల, మయిని బొబ్బలయట్లు చె♦మ్మటలు గ్రమ్మఁ
దేనియలు గాఱు మాలలఁ♦దివురు తేంట్లు, కలఁగ నూర్పులు పుచ్చుచు♦ మలయువాని

తే॥ చక్రివలెఁ దనయెద సీతఁ♦జక్క నిలిపి, తలిమమునఁ గల్లకూఁకి♦దవులువాని
నెలఁతపైఁ గల వలపను♦సీసుపోసి, యూరుపను సన్నెఁ బ్రాణముల్♦నూఱువాని.

తే॥ కలఁత మీఱుటచే రూపు♦గానరాఁగ, నవ్య గంభీరముఖుని మ♦నంబువోలెఁ
జెలువ ముదమునఁ దనసెజ్జఁ♦జేరె ననుచుఁ, జెలఁగి యుబ్బగ గుర్వాటు♦చెందువాని.

తే॥ బర్హిసంఘమ్ము లొక్క ప♦ర్వతమునుండి, వేఱుకొండకు శ్రమ నేగు♦విధముదోఁచఁ
బాలఁతులు బలిష్ఠజయశీల♦భుజము నొత్తి, వేఱు భుజమున కేగు స♦వ్వితమువాని.

తే॥ కడలిపైఁ దోఁచు రవినాఁగఁ♦గాంతులొలుకు, మణిసరులు గ్రాల జగములు♦
తనియఁగాచు

హరిహరేంద్రుల చక్రశూ♦లాశనులను, వ్యర్థపఱచిన గురువక్ష♦మమరువాని.

సీ॥ మాలికాతళములు ♦ మలయు తుమ్మెదలు ది, క్కరుల మదంబుల ♦ నెరయు తేంట్లు
చెలరేఁగి లేచి ప్ర ♦ క్కలప్రక్కలం దాఁకి, రాజులఁబోలి ఘో♦రముగఁబోరఁ
గలపంబు సిందూర ♦ తిలకంబు లొండొండఁ, గదిసి నిమయవృత్తి ♦ గండరింప
నాశాగజేంద్రదం ♦ తావళి నాఁటిత్రి, వ్విన వ్రణంబులు వక్ష ♦ మెనయువాని

తే॥ హస్తములఁగల భల్లముల్ ♦ వ్యర్థములని, తలఁకి పదముల వ్రాలు శా ♦త్రవ కిరీట
ఘర్షణములచేఁ గాయలు♦గాచియున్న, చరణయుగళంబు వెలయు రా♦క్షసవరేణ్యు.

తే॥ వామనునికంటెఁ బిన్నయా♦ వాయుసుతుఁడు, తలలు పదిచేతు లిరువది♦కలయఁజూచి
తెలియునంత మనస్సున♦తీక్రమించి, కనులు లోకముల్ దహియించు♦కరణి మెఱసె.

—: హనుమ రావణుని చంప నెంచుట :—

ఉ॥ వీని భుజాబలంబు బరు ♦ వేయగు నైన నొనగ్చునేమి? యి
వ్వాని యశంబదేమి ఫల ♦ వంతమగున్? రఘురాముగేహినిన్
బూనికఁ దెచ్చు క్రొవ్వు తల♦బొమ్మికముల్ పడఁదన్ని త్రొక్కి నే
వీని వధింపనేసి తగు ♦ బీరపు బంటగుటెట్లు స్వామికిన్? ౨౯౧

ఉ॥ వేసము పైకిఁజూపి పని ♦ వేఱుగ నెంచుట భృత్యధర్మమే?
మోసముచేసి దేవిఁ గొని ♦ పోయిన చోరుఁడు నేను గాంచియున్
దోసమువీఱ జీవితము ♦ తోడ వసించుటె? వీనిఁ జంపి నా
రోసము దీఱ మాడ్తు నగ ♦ రున్ బయి మూఁడునదెల్ల మూఁడనీ.

చ॥ అని మది నుత్సహించి కన ♦ లారఁగఁ బండ్లను గీఁటి కేలు నె
ట్టన విదిలించికొంచు నక ♦ టా! రఘునాయకు నాజ్ఞలేదు నా
పని యటు డించి వేఱొకటి ♦ పట్టుట జ్ఞానుల రీతికాదు యో
చన యొనరింపఁ బెక్కు కలు ♦ షంబుల కియ్యది మూలమే యగున్.

చ॥ ఎఱిఁగి విసంబు ద్రావిన గి ♦ రీశుని పోలిన శక్తిగల్గు ధీ
వరు లెద నాత్మశక్తిఁ గని ♦ పర్వను గాచుకొనంగనెంచి యే
ర్పఱుపక పూనువారె? బల ♦ వంతుఁడు నేర్పరి యయ్యు నాతఁడా
తెఱఁగున వేళవేచి వడిఁ ♦ దేఱెఁ బయోధి యడంగు చాడ్పునన్.

శా॥ ఆలంబుం బెడరేఁచు నీయలుక నా ♦ యందే యడంగాఱనీ
హా! లంకాధిపు నొక్కవానరము మా ♦ యం జేసె నన్నన్ జయ
శ్రీ లక్ష్మీవరు రాముకార్ముక కలా ♦ సీమాంత విద్వత్తకే
క్రాలు న్న్యూనత గాన నాకు నిది క ♦ ర్తవ్యంబు గాదెట్టులున్.

క॥ చెలులెవ్వరు సీతనితోఁ, గలిసి నిదురసేయువారు ♦ కారీతని మై

పాలము తపించెడి రాఘవు, కలికి సతీత్వదశ దీనఁ ♦ గానఁగనయ్యెన్. ౩౦౨
క॥ అని తలఁచి యింక నేఁ డడ, సిన ఫలితము లేదటంచుఁ ♦ జింత నవలికిం
జని యకటా! యిందెందును, జనకజఁ గననైతి ననుచు ♦ ఖాగిం బడియెన్.

—: హనుమ సీతం గానమికిఁ జింతిలుట :—

తే॥ క్రొత్తడి మహాభిజాత నీ ♦ క్రూర దైత్యుఁ, డొకటఁ ద్రుంచెనో భక్షించె♦నో యెఱుంగ
నేవిధమున నెఱుఁగలేని♦యేను పోయి, యేమి పలుకుదు? మఱియు నే♦యిందు తగవు
చ॥ కని యరుదెంచుఁ; గాదు మఱి ♦ కాంతనె తోఁగొని తెచ్చునంచుఁ దాఁ
గను లఱచేత నుంచుకొని ♦ కాచిన రాముని మోము నేవిధం
బునఁ గననేర్తుఁ? గార్య మిటు ♦ మూఁడెఁ గపీంద్రులు చావనున్న వే
ళనె మరణింప కిప్పుడిటు ♦ లంకను వ్యర్థుఁడనై మరింతునే?
చ॥ గడువు దినాలు మున్నె కడ ♦ గాంచెను జానకిఁ గాంచనైతి నే
మడిసియు నేమి? యంగద కు ♦ మారకుఁడాది కపీంద్రపాళి న
క్కడనె నిలుండటంచు బలు ♦ కాఱులు పల్కుతిఁ జేయనైతి నా
పొడుపుడివోయెఁ బూర్వమునఁ ♦ బుణ్యమె చేయనొకో జగంబునన్?
తే॥ ఏడువందల యామడల్ ♦ గోడ గలుగు, లంకలోన నేఁగాంచని ♦ లవము లేదు
రామదేవి మాత్రము గాంచ♦నోమనైతిఁ, గడలి దాఁటియు దాఁట నీ♦యడలు కడలి.
తే॥ క్రూరుఁడగు రావణుని గట్టి♦కొట్టి నోళ్ల, నెత్తురులు గ్రక్క గ్రుద్ది కా♦న్పింపుమనుచు
జానకిని గాంతునా? లేక ♦ వానితోడ, లంకఁ జిచ్చిడి కరఁతునా ♦ లక్క పగిది.
చ॥ సురల నలంచి భూమిజను ♦ చూపుఁడి యన్నను దుష్ట భీతిచే
సురుఁగుచు సాహసింప రటు ♦ చూపరు తక్కిన వారలెట్లుఁ జె
ప్పరు మయిసోల సన్నిడని ♦ ప్రాణములన్ భరియించి యిందు ధీ
విరహితుఁడైన యేను పృథి ♦ వీవరనందన నెట్లు కాంతునో? ౩౦౩
ఉ॥ కంక కులాధినాథుఁడటఁ ♦ గాంచుచునుంటిని రామగేహినిన్
లంక నటంచుఁ బల్కె విష ♦ లం బదియయ్యెను; లోనె దాఁచు నీ
లంకను వార్ధిఁగల్పి తగు ♦ లన్ వడిఁగట్టెదఁ గానకున్న నే
వంకనొ వాఁగునో వెదకు ♦ వాఁడ మెయిన్ భరియింప నేర్తునే? ౩౦౪
చ॥ ధరణిజ దొంగిలించి కొని ♦ దైత్యుఁడు పోవుటఁగాంచి రిమ్మహిన్
నరులు సురల్ నిజంబిది చె ♦ నంటిగఁ జావఁగనేల? తొల్త నీ
పురి మొదలంటఁ ద్రివ్వి పరి ♦ పూర్తిగ వారిధిఁ గల్పి రావణున్
గరములు మస్తకంబు లెడ ♦ గా నుఱుమాడెద నంత మాఁడెదన్.

చ॥ నవ్వు గిజురంతయే నెడము ♦ నూకక నిండి స్వచిత్త కంజముం
దవిలిన రాముఁబోలి సిర ♦ త ప్రతిపత్తిని రోసినట్టి యా
పవనజుఁ డట్లు లోఁదలఁచి ♦ పైకటుచూచి శిలీముఖంబు లా
రవ మొనరించు నొక్క నని ♦ రాజిలఁ గాంచి రహించెఁ గాంచఁగన్.

౩. సీ తా సం ద ర్శ న ప ట ల ము . (౨౨)

—: సీత స్థితి :—

ఉ॥ చూచితి నెల్లచోటులను ♦ చూడఁగలేదది యిందు నెమ్మదిఁ
జూచినఁ జింత దీఱునను ♦ చొప్పు మనంబు వచించు నియ్యెడన్
జూచినమీఁదఁ జూడఁదగు ♦ నూటియుఁ గర్జములేద యిప్పుడిన్
మోచు త్రికూటముం బెకలి ♦ మొత్తెద నంబుధి నేను సీగ్గెదన్. ౩౦౭

క॥ అని రామదూత వంజుళ, వనిఁజేరెను సురలు విరుల ♦ వాన కురిసి మో
దన మొందిరి; రక్కనుచే, వనిత యచట నున్న తెఱఁగు ♦ పరికింత మిఁకన్.

తే॥ స్థూలమధ్యలు రాకాసి ♦ జోట్లు ఖడ్గ, హస్తలై జడిపింపంగ ♦ నశ్మమందు
తోఁచి యొండిన మందునాఁ ♦ దోఁచి సౌరు, చెడి నడుమువలె వాడి కృ ♦ శించి యుండె.

తే॥ నెమలి చాయయుఁ గలకంఠ ♦ మమరు సీత, నిద్రియని తెప్పమూయుట ♦ నీఁగి యొండ
మలయు దీపమువలె జిగి ♦ మాసి పులుల, మధ్యఁ దగులుకొన్న కురంగి ♦ మాడ్కి నుండె.

తే॥ పడుట యేడ్చుట వడఁకుట ♦ యుడుకుటయును
మలఁగుటయు లేచుటయు మది ♦ కలఁగుటయును
క్రుంగుటయు నుక్కి సోలు టా ♦ ర్చుటయు ఱోలు
టయును తక్క వేఱొక్కండు ♦ చెయిది లేదు.

తే॥ బిలమునుండి వెల్వడి కాలు ♦ వలుగఁ బాఱి, కుచగిరుల దాఁటి నేలను ♦ గుంటలు వడఁ
జాలుచాలుగాఁ గురియు భూ ♦ జాతకనులు, వాన కనులంట సార్థక ♦ పడియె నచట.

తే॥ పృథివియందు సమంజస ♦ ప్రేమ గల్గుగు, దంపతీవియోగార్తి యే ♦ తనువుదాల్చె
ననఁగ నొప్పిన సీత స ♦ ల్లని మొగుళ్లఁ, గాటుకనుగన్నఁ గనులబ్ధి ♦ గాఁగ నేడ్చు

చ॥ పవడముఁ బోలు హస్త పద ♦ పద్ధతినొప్పు పయోదవర్ణు రా
ఘవుని దలంచుచో వెడఁద ♦ కన్నులు రాల్చిన నీటఁదోఁగి య
వ్యవహిత దుఃఖతాపమున ♦ వచ్చిన యూర్పుల వేఁడి నెండు చ
వ్యవసిత రీతి నొప్పెఁ గమ ♦ లాప్త కులేంద్ర కళత్ర మయ్యెడన్. ౩౧౪

తే॥ చావ విధిదాఁటు టరిదని ♦ జంకి వెగచి, కాంతుఁ డెట్లైనఁ దనకుల ♦ గరిమనైనఁ
బ్రబ్బునైనను గమనించి ♦ వచ్చు వచ్చు, ననుచు దిక్కులఁ గనుచుండు ♦ కనులతోడ.

తే॥ ఓర్పుగలదియై చంద్రము♦నొడిసి మ్రింగి, వెలివఱచు రాహువుంబోలి♦పిడుచ గట్టి
యొక్కటైయున్న జడతోడఁ♦జెక్కిలిపయిఁ, జేయిచేర్చి విసుగులేని ♦ చింతతోడ.

ఉ॥ మిక్కిలి ధూమమంటి కడు ♦ మేవిన పొల్పగు నొంటిచీరతో
జెక్కలువచ్చు హంసల పి ♦ ఱింది మునుంగని సన్న మేనితోఁ
జక్కెర వింటివాఁడు సుధఁ ♦ జక్కఁగ జేసిన ముద్దుబొమ్మ న
ల్పెక్కఁగ ధూమమంటిన ర ♦ హిం గనుపట్టెడి మేనిసొరుతో　　౩౧౭

—: సీత రాముని దలంచి పరితపించుట :—

చ॥ మఱఁదియుఁ జూడఁడేమొ దశ ♦ మస్తకుఁ డీడకు నన్ను దెచ్చుటల్
పఱపగు నబ్ధిమధ్యమున ♦ భాసిలు లంక నెఱుంగరేమొకో?
యెఱిఁగియు వచ్చు టెట్లనుచు ♦ నేడ్గడ సేయుట మానిరోక్కొ? యం
చొఱలుచుఁ గ్రుంగి క్రుంగి యెద ♦ నొందిన దుస్సహమైన బాధతో.

చ॥ జనకుని వంటి పక్షికుల ♦ చంద్రుఁడు వారలు కాంచునంతలో
నని మరణించెనొక్కొ? విజ ♦ నస్థలి నాగతి నెవ్వరెట్లు రా
మున కెఱిఁగించువార? లిఁకఁ ♦ బొందుగ నీభవమందు రాఘవుల్
నను గనిపెట్టుటే యరిది ♦ నాదురవస్థితి యిట్లుఁ జెల్లునే?.

ఉ॥ దూఱితి లక్ష్మణాఖ్యు నట ♦ దోసము నాక తదుక్తి వించు నీ
వేఱిఁడి ఱాఁగయంచుఁ బలి ♦ పీడునొ? నావిధి యెట్టుబుండునో?
దూఱిన పాపకర్మ మిటు ♦ దుర్దశకుం గొని తెచ్చె వట్టి యీ
కోరికలేల? యంచు నలఁ ♦ గుఁ నలఁగుఁ మలఁగుం గలంగుచుఁ　　౩౨౦

ఉ॥ వేళకు నెవ్వ రాతనికిఁ ♦ బ్రీతిగ లక్ష్మణుఁ డిచ్చు కందముల్
మూలములుఁ ఫలంబులును ♦ ముందట నుంచెదువారు? విందుల
వ్వేళకు రాఁగ నెంత దుర ♦ సిల్లునొ? యంచుఁ దలంచి నేలపైఁ
గాలు కదల్పకుండిన సు ♦ కాసి వహించు దురంత తాపముఁ.　　౩౨౧

ఉ॥ వంచకులుఁ దురాత్ములును ♦ పాపులు దైత్యులు సీత నిన్నినా
ళ్లుంచరు నాఁడె చంపి తిని ♦ యుందురు కర్జ మిఁకేది? కానరా
దంచు మదాశ వీడెనొకొ? స్వాన్వయ ధర్మమయైన యోర్పుఁ దా
నంచిత మంచుఁ బూనెనొ? క ♦ టా! యిఁక నేమని యందు దైవమా!

తే॥ కన్నతల్లులు తమ్ములు♦క్రమ్మఱిల్లి, వచ్చి తోడ్కొనిపోయిరో? ప్రతిన గడువు
కడవకుండఁగ నగరికే♦గఁడు నిజంబు, ససముసంద యుండు ననుచు♦వసటనొందు.

ఉ॥ వీరులు మున్ను పోరునకు ♦ వీఁకను వచ్చువరీతిఁ బిమ్మటఁ
దారుటచేత నందు బెడి ♦ దంటగు సంగరమే ఘటించెనో?

యేరహిం నెందు నాకొఱకు ♦ నెంత తపించుచునుండువారొ? యిం
దారటవొందు నాయెడఁద ♦ వ్యాధికి మందెది? యంచుఁ జింతిలుఁగ.

తే॥ నీకు లేదు రాజ్యము తమ్ము♦నికె యటంచుఁ, గైక పల్క ముమ్మఁడుఁగు మొ ♦
గంబు వెలయు
పురుషసింహుని యప్పటి♦పొలుపు దలఁచి, తలఁచి మదిలోన మిక్కిలు♦తాప మొందు.

తే॥ అవని పూర్తిగ నేలుమా♦యన్న యపుడు, నడవులకు నేగుమాయని♦యన్న యపుడుఁ
జిత్రమున వికసించిన♦చెందొవవలె, వెలయు నెమ్మొగంబును మదిఁ♦దలఁచి తలరు.

తే॥ తాఁకియెత్తుటయే యొక♦తడవుగాఁగ, స్వర్నదీ జటాధరుఁడు హ♦స్తమున వంచు
మేటి మేర్వంశమగు విల్లు♦మిడిసి రెండు, తుండ్లు గాఁజేయు భుజముల♦దొడ్డఁదలఁచు.

తే॥ విబుధవైరులు పదునాల్గు♦వేలమంది, కవియ మూఁడుగడెలలోనఁ♦గలను మగియ
రెండుకొనలును వంగు కో♦దండ గరిమఁ, బొగడి పొగడి దూపిల్లును♦వగలఁబొగలు.

తే॥ లోఁతునీట మందాకిని♦లోనఁ గలము, నడపు గోల యా గుహునకు♦నాయనుజుఁడు
నీకు ననుజుఁ డీ జానకి♦నీకు వదిన, యని వచించిన స్నేహకా♦ర్యంబుఁ దలఁచు.

తే॥ తండ్రి ప్రేమతోఁ దన్నిచ్చు♦తరుణమందు, తండ్రి చేనున్న తనకేల♦తండు గొనుట
దర్భవలెఁ బవిత్రంబైన♦దక్షిణ పద, మెత్తియుంచుట దలపోయుఁ♦జిత్తమందు.

తే॥ విరులసరులు తాల్పఁగఁదగు♦శిరమునందు, రత్నమకుటంబు గొనక వి♦రాగియగుచు
జడలు దాల్చు తమ్ముని గని♦జాలినొంది, పరితపించుట దలఁచి తాఁ♦బరితపించు.

తే॥ రాజ్యసంపద నీఁగి య♦రణ్యములకుఁ, దరలు నాఁడు యాచించిన♦ధరణిసురున
కాలమందల నొసఁగి పే♦రాసమేర, లేమిగని సుస్మితంబైన♦మోముఁ దలఁచు.

తే॥ నరవరుల గండ్రగొడ్డట♦నిరువదొక్క, తడవ తిరిగి వధించి ర♦క్తమునఁ దండ్రి
తర్పణము సేయు భార్గవు♦ధనువు తోడఁ, దపము బలమును గొను పేర్మిఁ♦దలఁచి సొలరు.

తే॥ కాకమగు జయంతున కొక♦కన్నువోవ, నలుఁగు నేయుట గాక కా♦కులకు నెల్ల
నొంటికన్నొసరించిన♦యుగ్ర జయము, శిరమునఁ దాల్చి మించిన♦చింక సేయు.

తే॥ దుష్టుఁడగు విరాధుని పెను♦దోసములను, ద్రోచి ఘోర శాపమ్మును♦పాచినట్టి
ప్రాణనాథుని శ్రీరామ♦భద్రు భద్ర, గుణములఁ దలంచి యారీతిఁ♦గుములుచుండ.

—: రాక్షసస్త్రీలు నిద్రింప సీత త్రిజటతో నిర్వేదము దెలుపుట :—

తే॥ శీలవతి ప్రియవాక్య సం♦స్కృతియుఁ గలుగు, త్రిజట తక్కఁ దక్కిన దుష్ట♦దితిజకాంత
లర్ధరాత్రంబుగా నిద్ర♦యనెడి చొక్కు, నీరు ద్రావి మత్తిల్లిరి♦నేలఁబడిరి.

తే॥ అంతఁ దల్లికంటెను ప్రియు♦రాలిఁ ద్రిజటఁ, గాంచి నీవు పవిత్ర గు♦ణాంచితవును
చెలివిఁ గావునఁ జెప్పంగఁ♦దలఁతు నీకు, విను మనుచు నిట్లుపలికె నా♦విమల చరిత.

తే॥ చెలియ! నాకును మేలొండు♦గలుగు నేమి? నాదు పాపంబు లింకను♦మోఁదుచున్న?
కనులు బొమలు మున్నగు నంగ♦కమ్ము లెడమ, ప్రక్క నదరె శుభంబేది♦వచ్చునాకు?

క॥ ప్రేమమయుఁడు కౌశికముని, తో మిథిలకు వచ్చునాఁడు♦తోడ్తో నేయే
నేమమున నెవ్వి యదరెనొ, యామాడ్కిని నేఁడుగూడ♦నదరెడిఁ గంటే!

క॥ తెలుపఁగ మఱచితి నిదియును, చెలి వినుమా ధర్మమూర్తి ♦ జీవితనాథుం
డిలఁ దప్పుఁ డొందవిడిచి వ, నల కరిగిన నాఁడు వలను♦నొసలే యదరెన్

తే॥ గరళనిభుఁడు దశాస్యుండు♦ తవమున, వనమునందు నాకగపడు♦దినమునందు
వలకెడస యదరెను వాని♦ఫలము దెలిసె, నిప్పు డెడమవై పదరెడి♦నేమి కలదొ?

—: త్రిజట సీతకూఱట గఱపుట :—

క॥ అనుడుఁ ద్రిజట యిట్లను నోద, విన శకునము నీకు మేలె♦వెలయించును నా
థుని చేరఁగలవు నిక్కము, వినుమా యని ప్రియముమీఱ♦వినిచెన్ మఱియున్.

తే॥ పసిమి నీమేనువొంద జీ♦వంబులిందఁ, బొన్నవన్నియ భ్రమర మిం♦పునను వచ్చి
యించురంగుల తేనియ♦నించు పాట, నీదు చెవినూఁదిపోయెఁ గాం♦చితివె మగువ?

తే॥ కాన దీని యోచింప నీ♦కాంతుఁ డంపు, దూతవచ్చుట నిక్కంబు♦దుర్జనులకుఁ
జెడుగు తొడరుట తప్పదు♦పుడమితనయ! మఱియు విను మొక్క కలగంటి♦మంచిదద్ది.

తే॥ కలఁతచే నిద్రలేమిని♦ కలలురావు, నీకు; నేనొక కలగంటి ♦ నీరజాక్షి!
దుస్స్వభావమా నీపురిఁ♦దోఁచు కలలు, నిక్కలలు వినుమని పల్కె♦నిక్కువముగ.

తే॥ రావణుఁడు తలలను నూనె♦రాచికొనుచు, రాసభపిశాచములు లాగు♦రథముమీఁద
రక్తమాల్యాంబరములు గా♦త్రమున వెలుఁగ, జరిగె దక్షిణదిశకు ని♦శ్చయముగాఁగ.

క॥ తనయులు బంధులు తక్కిన, యనుచరులును దైత్యు వెంట♦నరిగిరి మరలం
గనలేదు తిరిగివచ్చుట, జనకసుతా! భయము విడుము♦జరగుట వింటే. ౩౮౭

ఆ॥ అమిత శౌర్యవంతుఁ♦డగు రావణుఁడు వేల్చు, హోమకుండవహ్ని♦లొకట నాఱె
రత్న దీప వితతి♦రాజిల్లు ప్రామేడ, పిడుగు పడుటకతన♦ప్రీలి కూలె. ౩౮౮

ఆ॥ పిడులు మదముగార్చె♦భేరి వాయింపకే, పిడుగు పగిది మ్రోఁగె♦నుడువు లురలె
మెఱుపుతోడి మొగులు♦మింటను లేకయే, పిడుగు లవనిఁ బడియె♦బెడిదముగను.

తే॥ ఇరులు తొలఁగ నద్దమరేయి♦యినుని బింబ, మర్ధభాగంబు కాలిన♦యట్లుదోఁచె
బలియురగు వీరులు ధరించు♦ప్రసవమాలి, కలును మాంసంపుఁ గంపును♦వెలువరించె

తే॥ మఱియు లంకయుఁ గోటలు♦నెరిసె దిశలు, తెలియ గంధర్వనగరంబు♦పొలిసె నిండ్లు
విఱిగె మంగళ కుంభముల్♦తఱిఁగెఁ గలిమి, ద్రింగెఁ జీఁకట్లు దివియలఁ♦గ్రుంగెఁ దెలివి

క॥ తోరణములు తుండ్లైపడె, వారణములు పఁడ్లురాల ♦ వసుధం గెడసెన్
పీరణములు ప్రీలెఁ గలి, ప్రేరణమున, గలశజలము ♦ విరిసెను కల్లై.

తే॥ కలువ తేనిఁజిల్చికొనిరి♦కక్కులును వెలలె, పూయరక్తముల్ గురిసెను♦ మొగులుగములు
అసిగదాది సాధనము ల♦న్యోన్యతాడ, నముల భేదిలఁ బోరె ఘో♦రముగఁ దామె.

తే॥ ఐదువల సూత్రములు పరు♦లంటకుండఁ, దమకుఁ దామె తెగుచుఁ బయో♦ధర తటముల
దొరలె నిట్లిప్పు డేర్పడు♦దుర్నిమిత్త, ములు మహాద్భుతములు మఱి♦కలవు వినుము

తే॥ రాజు పట్టపుదేవి శి ♦ రోజ పాశ, మెడలిపడి కీలలంటిన ♦ వడిని కమరెఁ
జేటు నిక్కువమంచు నేఁజెప్పినట్టి, కారణము లివి వింటివే? నీరజాక్షి!

—: త్రిజట తన స్వప్నము సీతకుఁ దెలుపుట :—

తే॥ నేఁడు గాంచితి నొకకల ♦ నియతి వినుము, జంటవీడని బహుబలి ♦ ష్టంబులైన
సింగముల జత యనుపమ♦శిఖరిమీఁద, వ్యాఘ్రయూథంబుతోఁ గూడి♦శీఘ్రగతిని.

తే॥ అలవిలేనట్టి పెను మదా♦వళములుండు, వనము వేష్టించి నిలిచి పీ♦డనముచేసి
పీన్గుపెంటలు చేసె న♦వ్వేళ నందు, గల మయూర మొగిరిపోయెఁ♦గటకమునకు.

చ॥ వినుత సుభాషిణీ! వినుము ♦ వేయి దివెల్ వెలిఁగించినట్టి స
న్మణి దివియల్ గరంబున న ♦ మర్చి యొకానొక సుందరాంగి రా
చనగరునుండి వెల్వడుచుఁ♦జక్క విభీషణు మేడఁజేరె నే
మనఁగల దింతయుల్ బహు శు♦భావళి నీకగునంచుఁ జూపెడిన్. ౩౫౭

తే॥ అమ్మహాత్మురాలట్లు హ♦ర్మ్యమునఁ జొచ్చి, నపుడె నను నిద్ర లేపితి♦వంతు గనదు
కలయనంగ జానకియును♦కరము మోడ్చి, కొఱఁతయును గాన నిద్రింపు♦కోమలి! యనె.

—: హనుమ సీతను గానవచ్చుట :—

తే॥ అట్టియెడ శ్రీరఘుప్రభుఁ♦డంపినట్టి, కోఁడెఁబోలిన మారుతి♦కుసుమ వనముఁ
జూచు చరుదెంచు నాతఁడ ♦ చ్చోటఁజేరి, ధారణీజాత యున్నట్టి ♦ తీరుగనియె

తే॥ దనుజకాంత లప్పుడు మేలు♦కనుచు నమ్మ! తృప్తిలేని యీనిద్ర బా♦ధించె మనసు
ననుచు శూలదండాసి కుం♦తాదులైన, కైదువులఁదాల్చి గము లయి♦కదిసినారు.

సీ॥ కడుపున నోళులు ♦ గలవారు నొసలిపైఁ, గన్నులు గలవారు ♦ కఱకుచూపు
గలవారు పండ్లసం♦దులఁ బిశాచములు నే, నికలు చొఁగంటులు ♦ నిద్రసేయఁ
దగు బిలంబులఁబోలు ♦ తలనోళ్లు గలవారు, పదిచేతు లొకతల ♦ పరఁగువారు
తల లిరువది హస్త ♦ ములు రెండు గలవారు, వికృత వేషిణులును ♦ భీకరాంగ

తే॥ లద్రులంబోలు చనులు వ్రే♦లాడువారు, శూల ఖడ్గ చక్రాంకుశ♦చ్ఛురిక లొప్ప
విసమెరూపుగాఁ గొనియున్న♦విధమువారు, భర్గుఁడును బెగ్గడిలఁదగు♦బలమువారు.

తే॥ తురగ గజ సింహ భల్లూక ♦ శరభ ఖడ్గ, మహిష శార్దూల శునక గో♦మాయు కిటి పి
శాచ ముఖములవారుపృ♦ష్ఠమున నోరు, గలుగువారలు పొగనోరు♦గలుగువారు,

తే॥ డెందమున శంకకుందు శ ♦ డిందిబలము, నరసి లెక్కిడరాని దృ ♦ శ్యములు గలిగి
యింతులయ్యును మగంటిమి ♦ నెనయువారు, తటుకునవ్వచ్చి మైథిలిఁ ♦ దఱిసినారు.

తే॥ అపుడు రామునిసతి పల్కు ♦ లడఁచి వారి, భీకరాస్యంబులం గని ♦ విహ్వలించె
రాముదూత యున్నత కుజా ♦ గ్రంబు సేరి, వారి కలకల మాలించి ♦ పలికె గనుల.

క॥ రాకాసులు పలువురు ఘో, రాకారలు సాయుధలు మ ♦ హా రభసమునన్
నూకికొని గుంపుగొను వా, రే కారణమో యనుచుఁ బ ♦ రీక్షించెఁ దగన్.

—: హనుమ సీతను గాంచి యుత్సాహవంతుఁ డగుట :—

ఉ॥ కారు మొగుళ్లఁబోలు ఘన ♦ కాయుని యచ్చ్యుతు పేరురంబునన్
జేరి మదీయభ క్తికిని ♦ సేవధియై జగ దేకసూ త్రయై
శ్రీరమయైన జానకిని ♦ చిత్తము రంజిలఁ గాంచె రాక్షసీ
సీరదముం బెకల్చికొని ♦ నిక్కిన మైథిలియన్ శశప్రహదన్. ౩౬౮

ఉ॥ తాఁకఁగరాని రక్కసులు ♦ తార్కొని కావలికాయ నూష్మమున్
దాఁకిన వాడు పూలత వి ♦ ధంబగు నీమె సముద్రమంత లై
యాకులమందు కన్నుల బ ♦ యల్వడి నిండు తటాక మధ్యమం
దాఁక వహించు హంసిక్రియ ♦ నందుట మత్ప్రభు దేవియో యగున్.

ఉ॥ దమ్మము కూలలేదు వడిఁ ♦ దాటి నశింపను నేను రోసి యి
య్యమ్మల దేవిఁగాంచితి వ ♦ హించితిఁ గీర్తి ముదంబు సర్వమున్
గ్రమ్మఱ నంచు వేడ్కయను ♦ కల్లు భజించి మదించి యాడి మో
దమ్మునఁ బాడి గంతులిడి ♦ దాఁటెను కొమ్మల నీవలావలన్. ౩౬౯

తే॥ లలి ననింద్యములగు రూప ♦ లక్షణములు, రాముఁడు వచించినట్టులీ ♦ రామ కమరె
నౌర! మాయావియైన ద ♦ శాననుండు, రాము జీవముల్ దాఁచిన ♦ రాణ యిదియొ!

తే॥ మూఁడుజగముల ధర్మంబు ♦ మూలముట్టఁ, దొలఁచు పాపి రాఘవు జీవ ♦ ములనుడీయ
నెంచి చేసిన దుష్కృతి ♦ యిద్ది నిక్క, మీమె లక్ష్మియే రాముఁడు ♦ పేంద్రుఁడె యగు

చ॥ మసటు వహించు రత్నము క్ర ♦ మమ్మున నున్నది సూర్యకాంతులం
బసచెడు చంద్రుఁబోలినది ♦ మాసిన వేణియె దాల్చియున్న దీ
కుసుమ సుగంధి గౌరవము ♦ కోర్కియుఁ దత్కృతి రక్షణంబునం
దొసఁగొక యింతలేదు; భువిఁ ♦ దోరపు ధర్మము నాశమొందునే?

ఉ॥ శ్రీ రఘువర్యు దొడ్డవగు ♦ చేతులనో? పొగడంగఁదగ్గ యీ
వారిజగంధి సద్గుణ వి ♦ పాకమునో? ప్రభుయోగ్యసద్గుణో
దారు విదేహరాజు కుల ♦ ధన్యతనో? మఱి దేనినో? మనం
బార నుతించువాఁడ? నివి ♦ యన్నియు రూపయి యొప్పె నీమెయై.

చ. అమరులు నొక్క-కావలము♦నందరు జ్ఞానులు పాపయుక్తులై
యమరరు ధర్మముఁ జగము ♦ నందు నశింపదు మా ప్రభుండు లో
కమున నొనర్పఁదగ్గ యొక♦కార్యముగల్గునె? యన్నియుఁ భువిఁ
నమరుఁ సీతగల్గ మఱి ♦ నాదగు సేవయు ధన్యమేకదా? ౩౪౮

తే॥ దీటులేని యీదేవి స♦తీత్వమించు, కంత చెదరిన శ్రీరాము♦నలుక యనెడు
కడలి పొంగి కల్పాంతంబు♦ గానొనర్చు, ననుచు జడిసితి నీఁక లోక♦మమరుశాంతి.

చ॥ ఇలువడి రెయొంది శీలము మ ♦ హేడ్యతఁ బొంది మనోదృఢత్వముం
గలుగు తపంబు పేరిమి ని ♦ కంబుగ సన్నుతిసేయ శక్యమే?
యలవున నగ్నినిల్చి విష ♦ యంబుల గెల్చి జలాదులూడ్చియుఁ
జలుపు తపస్విలేని కుల ♦ సాధ్విల ముందట నిల్వ వారలే?

చ॥ ఇలపయి నీశుభాంగి జని ♦ యించుటచేఁ దపమూనిపొందు స
త్కు-ల జననంబు స్త్రీపొడుపు ♦ తోరపు ధన్యత గాంచినట్లు చె
ల్వల ధనమైన లజ్జయుఁ ద ♦ పం బొనరించి పవిత్రయయ్యె నీ
లలి నిట నీమె సత్తప మె ♦ లర్చుట రాముఁడు నోచఁ డారయఁ.

తే॥ రాక్షసులఁ నీతిమాలిన♦రాజసాత్మ, లీమె యొకతయే సాధ్వి మ ♦ తేరు లేగు
స్త్రీత్వమును తపం బేకాకి♦నీత్వ మిదియు; చెలువలకె ధర్మఫలమెల్లఁ♦ జెందఁగాక!

ఉ॥ ధర్మమె కాచుచున్నదొ? య ♦ధార్మికుఁడైన దశాస్యుచేయు దు
ష్క-ర్మమె కాచుచున్నదియొ? ♦ కాక మహాత్వ సతీత్వమే తగఁ
శర్మ మొసంగునో? అరుదు! శక్యమె యీగతి నోర్వ నేరికిఁ?
నిర్మల నీతి నీస్థితి గ ♦ ణింపఁగ సాధ్యమె నన్నుబోఁటికిఁ? ౩౪౯

ఉ॥ నెట్టన దైత్యసంపద గ ♦ ణింతమ? నిర్జర సేవితంబ యా
నట్టిది; వారి దుష్కృతము ♦ లందమ? యిట్టివి! యిందు మానముం
దొట్టి వసించుటన్నఁ గడు ♦ దుర్భర; మిట్టుల నున్న యీమె కీ
పట్టున నేది కష్టమగుఁ? బాపము పుణ్యమునే జయించునే? ౩౫౦

తే॥ ఇట్లు పలుపలు విధముల♦నెంచి వృక్ష, మధ్యమున గుబురగు చోట♦మఱుఁగునుండి
హనుమ కాంచుచునుండిన♦యంత నటకు, దానవేంద్రుండు వచ్చుట♦గాన నయ్యె.

౮. నిందన పటలము. (౫౨)

సీ॥ కూటయుతోన్నత♦కుధరంబు లొకకొన్ని, చెలువార నొకచోటఁ♦జేరెననఁగ
వజ్రాల కుండలా♦వళి చలించుచు నుండు, వింశతి భుజములు ♦ విరిసి వెలుఁగ
సాగరోదయ భాను♦చందాన నొక్కొ-క్క-, మకుటంబు లేయెండ♦మలసికాయ
గంధ మాల్యాదిక♦క్రమ ఘుమం ఘుమల్, దిక్క-రీంద్రంబుల ♦ ముక్కు-నింప

తే॥ ఖడ్గ మూర్వశి మోచి ప♦క్షమున రాఁగ, నడపముం గొని మేనక♦యందియాయఁ
బాదుకలు తిలోత్తమ చేతఁ♦బట్టి తేఁగఁ, జుట్టి క్రేవల రంభాది♦సుదతు లరుగ

సీ॥ ఒడళులు వెలిఁజిమ్ము♦తొడవుల కాంతులు, చీఁకట్ల గుంపులఁ♦ జేర్చిమ్రింగ
నూపురములు కింకి♦ణులు మేఖలలు పెక్కు, పక్షుల కలకల♦ధ్వనుల నెనయ
తావి నూనియు కర♦దీవియల్ ధరియించి, వడి నసంఖ్యాకలౌ♦వనిత లరుగ
విఘ్నంబు గలుగఁ గో♦పించి నిద్రను మానె, నాకోపమెంత ద♦వ్వరుగునొక్కొ

తే॥ ధరణిజాత వనము దాఁక♦జరుగునో? మఱి, యెవరి మీఁదికినేగునో♦యేమిగతియో?
యనుచు ననిమేషనయనము♦లమరవరులు, మూసికొని చూచుచుండఁగ♦ముదముతోడ

సీ॥ నీల భూధర గళ♦న్నిర్ఝరంబునుపోలి, పట్టోత్తరీయంబు♦పరిఢవిల్ల
జలధిపై బాలభా♦స్కరకాంతి పరవిన, రహి హారరుచులు గా♦త్రమున వెలయ
కారుమబ్బులను వి♦దారించు కొనివచ్చు, నెఱిమించునాఁగ జ♦న్నిదము వెలుఁగ
హీరమాణిక్యకే♦ యూర రోచులు గ్రహ, తారకౌఘంబులఁ ♦ దాఁకి పోర

తే॥ భర్మనూపురరుతులు భూ♦భాగమందు, పరవి పణిహారులట్లు ముం♦దరుగుచుండ
బంధు మందహాస జ్యోత్స్న♦పరిధి గట్టి, రాత్రులందును ముఖపద్మ♦రాజివిరియ.

సీ॥ ఒడలి వన్నెకు వేఱు♦పడి డాలు మీఱి మ, ధ్యమున నొప్పారు పీ♦తాంబరంబు
నల్లని పెనుగొండ ♦ నడుమఁబడిన ప్రొద్దు, పొడుపు నీరెండ నా ♦ నడరుచుండ
వ్రేళులందలి మించుఁ♦బోలు నుంగరముల, మణులవెల్గులు పూచు♦వనము నెనయ
కల్పాంతమున నిల్చు♦కనకాద్రిపైఁ బొల్చు, గ్రహముల హార తా♦రములు పోల

తే॥ మస్తకముల శీర్షకములు♦మలసి యుదయ, గిరిని పన్నిద్దఱినుల ని♦ద్దఱు తొలంగఁ
బదురు భానులొక్కటఁదోఁచు♦పగిదివెలుఁగ, రావణుఁడువచ్చెలోకవి♦ద్రావణుండు.

సీ॥ కోఱలు విఱిగి కే♦కుల పాదములఁబోలెఁ, జందంబు చెడిన ది♦క్సామజములు
భువన భీకరుఁడయి♦పొలిచిన కనకక, శిపుని వరంబుల♦చేవ చెఱుచు
నిశిత దంష్ట్రాభీల ♦ నృహరి పాదాంకముల్, తడవిన గజముల ♦ వడిని బెగడ
జక్కనుల్ నిద్దుర♦నమసిన రంభాది, గణికలును భుజంగ♦కన్యకలును

తే॥ సిద్ధ విద్యాధరాసుర ♦ స్త్రీలు వాలు, గంట్లు కువలయ నేత్రలు ♦ కంజముఖులు
కుంకుమాంకితోరస్కలు♦కోమలాంగు, లద్రిఁజుట్టిన నెమిళుల ♦ యట్లు మలయ.

సీ॥ సుషిర వాద్యంబుల ♦ సుస్వరంబుల తోడఁ, బొరలిక లేక సొం♦పుగ లయించు
చామల గాత్రముల్♦శ్రావ్యంబు గాఁగఁ గి, న్నర గీతములు తాళ♦నాదములును
ఝల్లరుల్ మద్దెలల్♦సొరుగా వినిపింపఁ, బాములు నమృతంబు♦బయలుపఱుప
శృంగాటకములందు♦హేమ రత్న విభూష, లందాల్చు హారిణుల♦చందమందు

తే॥ హరిసుమధ్యలు చామర♦లాలవట్ట, ములను దాలిచి జీమూత♦ములనుగాంచి
ప్రీతి నటియించు నట్టువ ♦పిట్టల వలెఁ, దళుకు బెళుకులఁ జూపుచుఁ♦దరలిరాఁగ.

ఉ॥ వీణలు మీఁటి వైణికులు ♦ వీనుల విందొనరింపఁ బొందుగా
గాణలుఁ శ్రావ్యరీతిఁ గల ♦ కంఠములం బలెఁ బాడఁగా సుప
ర్వాణులు మర్దళాదిక ర ♦ వమ్ములఁ గొల్వఁగ దేవతా పికీ
వాణులు శాస్త్రసమ్మతిని ♦ భావములం బ్రకటించి నర్తిలన్. ౩౭౭

ఉ॥ కాలిన పుంటిలో గొరక ♦ కట్టియ చొన్పిన మాడ్కి దర్పకుం
డోలిని తమ్మిగుమ్మితిక ♦ నొమ్మిక యొమ్మనఁ గ్రుమ్మఁ గౌముదీ
జాలము వేఁడిసేయ ఘన ♦ చందనశైల సమీరణుండు కుం
దాల మరందముల్ గరఁచు ♦ తామ్ర కణంబుల పోల్కి రాల్పగన్.

ఉ॥ తంతువుఁబోలు మధ్యములు ♦ తప్పక భేదిలునంచుఁ దోఁపఁగా
గంతులువైచి పైకుబుకు ♦ గబ్బి చనుంగవ పైఁడి గిండ్లు నాఁ
జింతన సేయఁగప్పి చెవిఁ ♦ జేరిన కన్నులుగల్గు స్త్రీల శ్రీ
మంతములౌ కటాక్షములు ♦ మాటికి యొమ్మన బాహులం బడన్.

సీ॥ కల్పకంబులు నిధుల్ ♦ గంధ మాల్యాంబర, భూషణావళిఁగొని ♦ మొనసిరాఁగ
కలశాబ్ధి వీచికల్ ♦ కాటుక కొండపై, మలసిన వనఁగఁ జా ♦ మరలు బెరయ
కందుగానని నిండు ♦ చందురుఁ బోలిన, ధవళాత పత్రము ♦ ద్ధతిని వెలయ
నడుగు లిడెడు వేళఁ ♦ గడలి చుట్టిన త్రికూ, టస్థమా లంక గుం ♦ ట వడి యందు

తే॥ వీచికలు పాఱిదిక్కుల ♦ విరిసి పరవ, భుజగరాజును భారంబు ♦ మోవలేక
మెడను క్రుంచఁగ వారిధి ♦ మేఖలయును, వెన్ను నెటుకున విఱిగి నో ♦ ర్విడిచి యఱవ.

ఉ॥ తాటక కంటె నిమ్మడుఁగు ♦ దార్ఢ్యముతోఁ గుధరంబునే నిరా
ఘాటముగా వహింపఁదగి ♦ గాజులు పూనిన కాంతలెట్టి జం
జాటము లేనివారు ఘన ♦ చక్రగదాసి శరాస సర్వలా
ఖేటక కుంతశూలములు ♦ కేల ధరించి బిరాన వెంటరాన్. ౩౯౧

చ॥ విరియు చివుళ్లు పూవులును ♦ వేళ్లును మొగ్గలు కాఁడ లాకులున్
హరువుగ నెల్ల యంగములు ♦ హైమములై విలసిల్లు వృక్ష సం
భరిత వనంబు మాఁడువహి ♦ శ్వాసము పుచ్చుచు సీతయున్న చో
టరసియు దోఁపు వోవు మణి ♦ నారయు పన్నగమట్లు రోయుచున్.

ఉ॥ వచ్చెడు దైత్యరాజుఁగని ♦ వాయుకుమారుఁడు చింతసేసి నేఁ
డిచ్చట వీనివంచనయు ♦ నిచ్చయుఁ జేష్టితముల్ బయల్పడున్
జెచ్చెర మీఁదఁ జేయఁదగు ♦ చెద్దియు నేర్పడు నంచు రామ నా
మోచ్చరణంబు తోడనట ♦ నుండు నశోకమహామందు డాఁగొనెన్. ౩౯౪

ఉ॥ అసురమ్మృగాక్షులంత నెడ ♦ యం జన నన్నులలోన దీపమై
యొసఁగిన రాము దేవి గల ♦ యిక్కకు నిర్జరవైరి చేరె న

వ్వసుమతిపుత్త్రి బెగ్గడిలి ♦ వన్నెల చాఱలు చేవ కిన్క దీ
మస మెసలారు వేఁగిఁగని ♦ ప్రమాలుమెకంబు వితాన బెగ్గరెన్. ౩౯౨

తే॥ వడఁకి జీవముల్ చలియించు ♦ వనజనయన, మోహమునఁ గ్రుంగి తపియించు ♦ మూర్ఖ దైత్యు
నను మయొక సాక్షిగాఁ దన ♦ కనులఁ గాంచి, చిత్తమొక్కనిల్కడ లేక ♦ తత్తళించె.

ఉ॥ దేవికి భద్రముల్ సకల ♦ దేవత లిత్తురుగాత! వేదముల్
తావలమొందె వర్ధిలుత! ♦ ధర్మము నిశ్చల మందుఁగాత! శ్రే
యోవిభవంబు రామునకు ♦ నొందుతమంచనె నా దినేంద్ర దో
షావర నిత్యకీర్తి సువి ♦ చార గుణుం డనుమంతుఁ డత్తఱిన్.

—: రావణుఁడు సీతను బతిమాలుట :—

తే॥ విసము నమృతంబుగఁ దలంచి ♦ వేఁడువాఁడు, పంక్తికంఠుఁడు డాసియో ♦ పద్మగంధి!
కోకిలా! యెప్పు నాయెడ ♦ గొప్పకరుణ, యమరుతువా వచింపుమ యని ♦ యణఁగిపలికె

తే॥ పురవిరోధిసన్నిధి నేని ♦ పరువు ద్రుంచి, యించు కేని తగ్గని దిట్ట ♦ యెడఁద తలఁపు
బిడియమును తన్ను మిక్కిలి ♦ జడను పఱుప, జంకిజంకి యిట్లనియె నా ♦ జవ్వనికడ.

క॥ ఆకర్ణాయతలోచన!, వే కడచనె నిన్ని నాళ్లు ♦ వెడలునొ మఱియున్
నీ కరుణ యిట్టులున్నది, నాకడ నిఁకఁ గెడయు పిదప ♦ నన్నన సెదవే?

క॥ వనితాతిలకమ! జగముల, మునుకొని వహియించు నాయ ♦ మోఘ శ్రీపా
లనమున నీకై కలిగిన, మనసిజు షోరొందు దక్క ♦ మఱి కొఱ గంటే! ౪౦౧

తే॥ హేమ పల్లవమా! కీర్తి ♦ మెసఁగు కలిమి, కోరకయు పేక్షచేసితి ♦ ఘోరవనుల
నీ మగండు చావకెడరు ♦ నీఁగి యేగి, పడయునది యల్పమనుజ సం ♦ పదయెకాదె?

తే॥ పెరిమతోఁ దపస్వులు శాస్త్ర ♦ విదులుపొందు, ఫలమునించుక నీమదిఁ ♦ దెలియనరయు
దేని నాయాజ్ఞ శిరసావ ♦ హించు సురలఁ ♦ జేరి వసియించు టేకదా! ♦ చిగురుఁబోఁడి.

తే॥ వస్తువులలోన మేలుగా ♦ వఱలు బిడ్డఁ, గోకిలరవంబు వీణను ♦ గోరువంక
నడఁచు మృదుభాషిణీ! నీకు ♦ వెడఁగు బ్రహ్మ, కరుణనడుముతో సృష్టింప ♦ మఱచెనెమొ?

చ॥ పరువము నాయువున్ మరలి ♦ వచ్చుట భిన్నఘటంబు నీరముల్
మరలి ఘటంబు నించుసను ♦ మాటకు దీటగుఁ; గానఁ గాచు చం
దిరిక వితంబునన్ వయసు ♦ తేరకుఁబోయిన సౌఖ్యమందు టె
క్కరణిని? దుఃఖమాందె యిటు ♦ కంది కృశింతువె యోవి నేకిసీ! ౪౦౨

తే॥ తరుణి! బతిమాల నీమది ♦ కరఁగదేని, నిక్కువముగ నా జీవముల్ ♦ నిల్వ వవల
నీసమాజ శీల సౌందర్య ♦ నియుతికిఁ దగు, సుందరుం డెవ్వఁడున్నాఁడు ♦ చూపు మబల!

తే॥ కలికితనము సందంబుఁ బ్రగల్భగుణము, మొదలుగాఁ గలవన్నియుఁ గుదిరియుండి
నెనరు నీవి దాక్షిణ్యంబు ♦ జనకకులము, నందు సళియించు కారణ ♦ మరయరాదు.

చ॥ పలుకు శుకంబ! నీవిభుని ♦ పట్టి వధించిన యప్పు డార్తిమైఁ
బిలిచిన వానికూయివిని ♦ బిమ్మిటితో విభుఁ జూచు కోరికన్
దలఁపున నుంచితే? పిలిచి ♦ దానముసేయఁ గులంబు గోత్రముం
బలుకుమ యన్న యట్లనుట ♦ భావ్యమె యారయ నిన్ను బోఁటికిన్.

తే॥ నీవలన నాదు జీవముల్ ♦ పోవునేని, నానమస్త సంపదలప్డె ♦ నాశమొందు
వచ్చివఢిల్లె ననుకీర్తి ♦ వదలి చెడిచె, ననెడి యపవాదు నొందదే ♦ యబ్జవదన!

తే॥ వేలుపులు వేల్పు పడఁతులు ♦ కేలుమోడ్చి, నీపదాబ్జముల్ భజియింప ♦ నేపుమీఱు
త్రిభువనప్రాజ్యరాజ్య సు ♦ శ్రీ లభింపఁ, గాలఁద్రోచెదు నీవంటి ♦ బేల గలదె?

తే॥ అపయశమునకు వెఱవని ♦ యసురవిభుఁడు, సకల జగతీజనముల నా ♦ జనులుఁగాఁగఁ
జేకొనిన నాదు సేవ నం ♦ గీకరింపు, మనుచుఁ గేల్మోడ్చి చాఁగిలి ♦ యవనిఁ బడియె.

చ॥ అనలమునందు గ్రాఁగిన శ ♦ రాహతిఁబోలు కటూక్తు లేగుముం
దునె చెవిమూఁడె డెందమును ♦ తోడనె మూర్ఛడెఁ గన్నుదోయి న
ల్లను వెలిగ్రక్క జీవముల ♦ లక్ష్యమొనర్చక మానినీ గుణం
బును తలమీఱు కక్కసపుఁ ♦ బోటగు మాటల సీత యిట్లనెన్.

—: సీత రావణుని కటూక్తులాడుట :—

మ॥ తృణమా! విందురె నీకటూక్తులు కుల ♦ స్త్రీ లెన్నఁడే నోర్పుమై
గుణమా! సాధ్వితనంబు కంటె మృదువుల్ ♦ కొండల్ యథార్థంబు; దు
ర్గుణముల్ కీర్తిఁ దెచ్చునే? చదువుచేఁ ♦ గొన్నట్టి తెల్వింతయే?
క్షణసౌఖ్యంబునకై యశోగరిమ గం ♦ గం గల్పఁగా నెంతువే? ౮౧౩

మ॥ ములుచా! మేరువుఁ ద్రోల్వఁగా గగనముల్ ♦ భూమిన్ విదారింపఁగాఁ
జలమారన్ బదునాల్గు లోకముల వం ♦ చాళించి కూల్పంగ న
జ్జలజాతాప్త కులేశు బాణములు పె ♦ ల్పంజాలు టూహించియున్
దల లొక్కమ్మడిఁ ద్రుంగఁ జూచికొనదే ♦ దర్పోద్ధతిన్ బాలిశా! ౮౧౪

మ॥ అతి భీతింగద నాఁడు నీవు బలుమా ♦ యన్ జింక నంపించి నా
పతి లేనప్పుడు మాయవేషివయి బ ♦ ల్పచ్చెంబుతో దాఁగి వ
చ్చితి జీవింపఁ దలంచితేని విడుమా ♦ శ్రీరామచంద్రుండు దృ
గ్గతుఁడై నిల్పినఁ దేటి చూడఁగలవే ♦ కష్టాత్మ! నీ చక్షువుల్. ౮౧౫

ఉ॥ నాఁడు ఖగేంద్రు చేతనె ఘ ♦ నంబగు మూర్ఛగడించినాఁడ వీ
నాఁడు మహాధనుర్ధరుఁ డ ♦ నల్ప పరాక్రమ లీలలం దగం

బోఁడిమిఁజూప నీదు కర♦మూర్ధము లొందఁగఁ గట్టు చిత్ర చి
త్రోడక లక్ష్యపాళులె య ♦ గుఁ దిజమన్య విధంబుఁ బోలునే? ౮౧౬

ఉ॥ పందవు నాఁడె యోడితివి ♦ పక్షికులేంద్రున కాల రుద్రుచే
సందిన చంద్రహాసమున ♦ నాతనిఁ జంపితి కాక యున్నచో
ద్రుందవా? జీవితంబును వ ♦ రంబులు కాలుని చేఁతకే చుమీ
కొందెదు రామబాణముల ♦ కుఁ గుఱిగాక మనంగఁ గూడనా?

తే॥ వరబలము సహాయ బలంబు♦నరబలంబు, నలువవార్తలు రాముఁడు♦నారిగూర్చు
వఱకె కాని యావల ఫలిం ♦ పంగఁ గలవె?, భానునెదుటఁ జీకట్లును♦ప్రబలునేమి?

శా॥ కైలాసంబుఁ గదల్చునాఁడు మృదుప ♦ త్కంజంబుచే నీ మిడిఁ
ద్రీలం జేసిన శంకరుండు పురముల్ ♦ వేకాల్చు నారాచముఁ
లీలం గూర్చిన మేరు కార్ముకము ద్రీ ♦ లెఁ రాఘవస్వామికిఁ
గేలం బట్టఁగ నిల్వ కప్పటి ధ్వనిఁ ♦ గించిజ్ఞ! యాలింపవో? ౮౧౯

శా॥ తారాద్రిం బెకలించి దిగ్గజములఁ ♦ దాటించి జంకించు నా
కారా! యెవ్వరు సాటివారలని వ్య ♦ ర్థాలాపముల్ సేయు నీ
వారామానుజుఁడుండు వేళ నట డా ♦ యం గొంకి డాఁకొంటి వి
స్ఫీ! రామాచరణంబులం బడెదవో ♦ సిగ్గింత లేకిమ్మెడఁ. ౮౨౦

ఉ॥ నీవు కలంగి దాఁగి మన ♦ నెక్కొను చోటిది యంచెఱింగి మ
జ్జీవవిభుండు వచ్చునెడఁ ♦ జెందిన కోపదవాగ్ని యిమ్మహా
రావముతోడి వారిధిఁ బు ♦ రంబు దహించి యడంగునో? దశ
గ్రీవ! జగంబులెల్ల నుడి ♦ కించిన జీవముతో నడంగునో? ౮౨౧

చ॥ చెడుగరులైన రక్కసుల ♦ జీవములం గొనియే యడంగునో?
దుడు కొకరుండు సేయ గుణ ♦ ధూర్వహు కోపముచే నజాండమే
చెడ నగు నేమొకోయనుచుఁ ♦ జిత్తమునఁ భయమందుచుంటి నా
యెడఁదకు ధర్మముఁ శశి ది ♦ నేశులు సాక్షులు సత్యమీ నుడుల్.

ఉ॥ అందముచెందు నీపుడమి ♦ యందలి జీవులు వేలుపుల్ భయం
బందఁ జరించు బాలిశ! దు ♦ రాత్మ! సమంచిత చేష్టవీడి యీ
దుందుడుకేల గొంటి విఁక ♦ దొరుట నిక్క మజేశ విష్ణు సం
క్రందన సన్నిభుం డనియొ ♦ రాఘవునెంచెదు నీ మనంబునఁ?

చ॥ ఇనకులు మానవుండనుచు ♦ నెంచెద వేని మహాబలిష్ఠు న
ర్జును నొకమానవుండె కద ♦ రూపడఁగించెను వానిచేవయుఁ
మనమున నెంతుకాదె? జన ♦ మాన్య చరిత్రుని రాము సత్త్వముఁ
ఘనమగు దూరదృష్టి నెఱుఁ♦గందగు దీవును గర్వపర్వతా!

చ॥ పలువతనంబుచే ననమ ♦ భాగ్యము గోల్పడనున్న మూఢ! వా
రలు నొకయిర్వురే యని ని ♦ రాకృతి సేయుదు వేని సర్వలో
క లయము వేళ నొక్కరుఁ ♦ డంతుఁడ కాఁడె సమాప్తి సేయు నా
పలుకులలో నిజమ్ము పిద ♦ పఁ బవరాన నెఱుంగఁగా నగున్. ౪౨౭
తే॥ గుణకిణాంకిత భుజులు స♦కుంఠిత జయు,లగు హిరణ్యాక్షుఁడును హిర♦ణ్యకశిపుఁడును
పూజ్య పద్ధతుల్ వీడిన♦ప్పుడును పరుల, యాంద్రయెడ మేరదాఁటకే♦యడఁగినారు.
చ॥ స్థిరులయి నిల్చువారలును♦చెట్టలుచేసి నశించువారలున్
సురలొ? నిశాటులో? తెలియఁ ♦ జూడుము సర్వ జగంబు లోఁగి నా
కురవడి సేవసేయు మహి ♦ మోన్నతి నందితి నందువేని య
ప్పురువు తపఃఫలంబొ మఱి ♦ పాపఫలంబొ? తగన్ గ్రహింపవూ.
ఉ॥ భాగ్యము నీకొసంగిన క ♦ పర్దియు సంతతమున్ భరించు స
ద్భాగ్యము సుస్థిరంబగు త ♦ పః ఫలమందుట చేతఁగాదె? త
ద్భాగ్యము నీఁగఁగా సుతులు ♦ బంధుజనంబులతోడఁ గూలు దౌ
ర్భాగ్యముఁ గోరి ధర్మమును ♦ పాడొనరించితి వేల దుర్మతీ! ౪౨౮
ఉ॥ వీర్యము సర్వదా జయము ♦ వీకునఁ గల్గిన వారలేని దు
ష్కార్యము సేయువారలును ♦ కారుణికత్వము వీడువారలై
శ్వర్యము వోవ నాశిలుట ♦ సత్యము; కామముఖారి వర్గ జి
ద్వీర్యులు గాక దుఃఖముల ♦ వీడినవారు మఱేరు? దానవా! ౪౨౯
సీ॥ రాముండు దండకా♦రణ్యంబు చేరుచో, ద్రవిడభాషకుఁ బ్రోది♦తనియఁజేయు
ముని మొదలగుమహా♦త్ములు వచ్చి దుష్ట రా,క్షసులకృత్యములు దు♦స్సహము లయ్యెఁ
దపములు సాగ వా♦దనుజులఁ బరిమార్చి, పాలింపు మమ్ము నీ♦వలన వారు
నీల్గుట నిక్క మ♦నిరి నేను వింటిని, తగినట్లె నీ యన♦త్కార్మ మమరె
తే॥ నీబలము జీవితంబును♦నియత బలము, నెఱిగఁ దెలిపిన పిదపనే ♦ నీచెలియలి
ముక్కుకోఁత నీ తమ్ములఁ♦జక్కడుచుట, రవ్వయేని యోచింపవో♦రాముబలిమి.
చ॥ ఎఱుకువలేని మూర్ఖ! నిను ♦ హేళనసేయుచు నీకరంబులన్
విఱిచి ముఖంబులన్ రుధిర ♦ భీషణ ధారలు గ్రక్క గ్రుద్ది పైఁ
జెఱనిడు కార్తవీర్యుని వి ♦ శిష్ట భుజంబులఁ ద్రుంచు భార్గవుం
డుఱుకుచు వచ్చి రామునకు ♦ నోడుట నీవు వినంగ లేదొకో? ౪౩౦
సీ॥ కఱచి చంపెడు క్రూర♦కాలాహియైనను, మంత్రంబునకు లొంగి♦మడఁగియుండు
నిదితగు నిధి తగ♦దిది పోలు నిదికూడ, దని మందలించి స♦జ్జన పథంబు
కఱపెడు వారు నీ♦కడ నెవ్వరును లేర, యున్నట్టి వారొ నీ♦వన్న దెల్ల
సరియని మోమోట♦సంస్తవనము నేయు, క్రించులై నిన్ను ము♦గించువారె

యింక నీకు ముగింపు గా♦కెవ్విధమున, ముగియు నదియునుకలదె ధ♦ర్మువు చెడంగఁ
గర్కశాత్మ! చెట్టుచెడెడు♦కాలమునకు, గుక్కమూతి పిందెలు పుట్టు♦కోపువిదియ.

మ॥ ధరణీజాత వచించు పాడి వినినఁ♦త న్నేత్రముల్ గ్రక్కె నె
త్తురులన్ మించులపోల్కి వెల్గె దశవ♦క్త్రుం డన్ని యాస్యంబులన్
గిరులుం జూర్ణముగాఁగ గర్జిల వడం♦కెన్ భూమియుం గోపమా
స్మర విక్రాంతిని మాఱిపోయె వివరిం♦పన్ శక్యమే తత్స్థితిన్ ? ౮౩౩

చ॥ నెగసిన లజ్జయున్ దెసల♦ నెక్కొని కొల్చు భుజంబు లగ్నులన్
బొగలను గ్రక్కు కన్నులును♦ భూరిభయంకర రీతిఁ గ్రాల నీ
మగువను జీల్చి మ్రింగెద న♦మాంతముగా నని నిల్గి కోపమో
హగతులు పోరు సల్పఁ గది♦యం జనఁ బోవును పోవఁ డొక్కటన్.

తే॥ హనుమయప్పుడుమాస్వామి♦నినిదురాగ్ర,హమునసీచుండుతాఁకుట♦కరుగుమున్నె
నలఁచి వీనిని చంపి యు♦వ్యలఁ జరింపఁ, దగిన చందము చూచుకొం♦దమని తలఁచె.

ఉ॥ ఎక్కటిమైన వీని తల♦లే డ్తెఱ గ్రక్కున నూడఁద్రుంచి వే
యిక్కడలిన్ మునుంగఁ బురి♦ నిట్టులె కాల నడంగఁ ద్రొక్కి యే
నొక్కఁడ పూతశీలను ర♦ఘూత్తము దారను మోచికొంచుఁ బే
రుక్కునఁ బోవుటే యుఱవు♦నొప్పని చేతులు నల్చుచుండఁగన్.

క॥ అండమ్మొల నుద్దండతఁ, దుండములుగఁ జెండఁదగిన♦ధూర్తుని కోపం
బండజయాన పయింగల, మొండు వలపుటేఱు పాఱ♦మెల్లన నాఱెన్. ౮౩౪

చ॥ నలఁచెద నంచు నల్గితిని♦ నల్పఁగఁజాలక యుంటిఁ దొయ్యలీ!
పలికితి కొన్నియయ్యవి సు♦బద్ధములే యగుఁగాక యిమ్మహిన్
చులుకనయంచు నొక్కటియుఁ♦ జూడఁగ డెప్పఁగ మంచు నొక్కఁడుం
గలదె? జయంబు నోటమియుఁ♦ గ్రాలె విహార విలీలలై తగన్.

చ॥ ఒక పలుకాలకింపు మిట♦ నుగ్మలి! రాముని చంపి నిన్ను నే
నకుటిల లీలఁ దెచ్చిన ర♦యంబునఁ బ్రాణము వీడి తేని యే
నకట! మరింతు నిక్కముగ♦ నట్లగుటం గికురించి తెచ్చితిన్
వికచ సరోజలోచన! భు♦వి న్నను దాఁకెడు వాఁడుఁ గల్గునే? ౮౩౫

మ॥ హరిణంబంచుఁ దలంచి యేగిన మను♦ష్య ప్రాకృతుల్ నన్ను తా
రరయంజొచ్చిరయేని యిచ్చటికి రా♦ నంకించి యుంకింప రా
నరులం గూరిచి కుందికుంది యెదురన్♦ లాభంబె? నా చేఁతకున్
సురలైనం బయిలోటగాక తగదం♦చున్ వైరముం గొందురే?

చ॥ అగుదురుగాక నన్ను సమ♦రాంగణమందు జయించునట్టి గే
యుగుదురుగాక నాశమును♦ నందని వారలయై త్రిమూర్తులున్

జగముల నేలు నింద్రుఁ డని ♦ శంబుడిగం బొనరింప నేనె ము
జ్జగములఁ గీర్తినించితి ని ♦ జంబుగ నెవ్వరి కిట్టు లబ్బెడిన్ ? ౪౪౧

సీ॥ అలికుల వేణిరో ! యజహరి హరులయు, సురలయు బలములు ♦ స్రుక్కునట్లు
జగముల నిండిన♦జయము వ్యర్థంబుగ, నీకొఱకై యొక ♦ నింద నొంద
నిష్ఫల వ్రతముల ♦ నియతిఁ జేయుచునుండు, బలహీన నరులఁ జం ♦ పంగఁజాల
వారి నిచ్చటికి నే ♦ వారక రప్పించి, సేవలు గొందుఁ గాం ♦ చెదవు గాక

తే॥ అల్పగుణ మల్పకార్యంబు♦లల్పఫలము, గలుగు నల్పుల కడ నీకుఁ♦గానఁబడిన
తెలివి బలము నా యెడఁజూడఁ♦దెలియ రాదొ?, వారినొక కేలఁగొని తెత్తుఁ♦గోరిచూడు

చ॥ కనిసిన పక్వజన్ములగుఁ ♦ గావుత నాకిటు నిన్నొసంగు మే
ల్పని దలఁపంగఁ జంపఁదగు ♦ వారె? విలాసిని! వారి నాశమే
మనమున నెంతువేని యది♦మానుగ నీకు శుభంబయేని నా
కనుమతి యిమ్ము చేసెద ర ♦ యంబున నయ్యది యెంత కార్యమో ?

మ॥ అవురా! యింతగ వేఁడ సమ్మతిల వ ♦ ల్పాయుష్కరాలా! యయో
ధ్య విలాతిం భరతాదులం గెడపి క ♦ ల్పాంతాగ్ని నాఁ బేర్చి కా
ల్చి విదేహంబొగి నశ్రమంబున మృగా ♦ క్షీ! నీదుప్రాణంబులన్
జవులూరన్ వెడలించి మ్రింగఁదగు నా ♦సామర్థ్యముం గావవో? ౪౪౪

చ॥ అని విలయాంతకాలు క్రియ ♦ నల్గి కరాచురి వంకఁజూచి నా
కును వశమౌఁదవేని యటఁ ♦ గొందును ప్రాణము రెండు నెల్లలో
ననువెదియో మనంబున న ♦ యంబునఁ జూడుము బుద్ధిమంతు లొ
ప్పిన నెఱిఁగాంచుమంచు జడి ♦ పించి తలంచిన యట్లదల్చుచున్. ౪౪౫

తే॥ దీనిఁ దర్జించి భర్జించి♦ తెలియఁబలికి, వశపఱచి తేకయున్న మీ♦పాలి విషమ
యగుదునని గఁటువకు మొగ♦మడర రక్క, సీంద్ర కసురరాజు తెలియ♦ఁజెప్పిమరలె.

తే॥ పంక్తిముఖుఁడేగ రాహువు♦వట్టి విడుచు, మందుదొరను వెన్వెంట నె♦మబ్బుగములు
క్రమ్ముక్రియ దైత్యకాంతలు♦క్రమ్మికాఱు, లన్నివిధములఁ దలఁచి న♦ట్లఱచినారు.

తే॥ ముందునిలిచి చక్షువులని♦ప్పుకలురాలఁ, జుఱచుఱం జూచి కుంతముల్ ♦శూలములను
చూపి చంపుఁడు చంపి న♦జ్జుగను కొండి, యొల్చి తినుఁడని కొందఱ♦దల్చినారు.

సీ॥ నలువ మన్మఁడు లోక ♦ నాయకుఁడు సహస్ర, శాఖాన్వితంబగు ♦ సామవేద
పారగుఁడును మహా♦ప్రాజ్ఞుండు పాపముల్, తుదముట్టఁ ద్రోచిన♦దొడ్డవాఁడు
నీకేమి చెడుగు గా ♦న్పించెనే రావణుఁ, డంచిత ప్రేమ చూ♦పించుచుండఁ
బోఁగాలమే యిట్లు♦వుండునఁ గోలఁ జొ, న్పించి నట్టులు ప్రలా♦పించి తీవు

తే॥ అతని కోపాన లోకంబు ♦ లంతరించు, నీవు నీవార లెల్లరు ♦ నీల్గునట్టి
చెడుగు తెచ్చుకొంటి విఁకేమి♦చెప్పఁగఁదు? సుదతి! యని కొందఱాడిరి♦మృదులఫణితి

చ॥ మెలఁతరో! పుట్టినింటికిని ♦ మెట్టిన యింటికి నింగలంబవై
పలువ తనంబు మై నిటులు ♦ పాడొనరింపఁగఁ బూనితేల? నీ
విలుగుట నిశ్చయంబు కల ♦ దెల్లను తేటపడంగ నింతగాఁ
బలికితి మిందుపై మనసు ♦ వచ్చిన రీతిఁ జరింపుమా యనన్. ౪౫౦

మ॥ వధియింపం గమకించు క్రూర దనుజ ♦ వ్యాపారముల్ దేవతా
మథనున్ దానవ చక్రవర్తి నెదిరెన్ ♦ మర్దింపుఁడీ చంపుఁడీ
కథ లింకేలని దూఱు వాక్యములు ర ♦ క్షస్స్త్రీల యాకారముల్
విధివోల్ దానవు నానతిం దలఁచి న ♦ వ్వెన్ సీత నిర్విణ్ణయై.

ఉ॥ అయ్యెడ డాయుచుం ద్రిజట ♦ యమ్మరో! స్వప్నఫలంబు పూర్వమే
నెయ్యము మీఱఁ దెల్పితిని ♦ నీవిటు లంగద నొందితేని యో
తొయ్యలి! నీస్థిరత్వమొక ♦ దోసము నొందెడి నూఱడిల్లు మం
చొయ్యనఁ బల్కునంతఁ దగ ♦ నుమ్మలికించుట మానె సీతయున్.

చ॥ ప్రభునకు జంకి యప్పగిదిఁ ♦ బల్కుచుఁ గ్రౌర్యమె రూపునొందె నా
రభసము సేయువారు విన ♦ రంబుగ రాఘవపత్ని సీతకున్
శుభముల నొప్పఁగాఁ ద్రిజట ♦ జోస్యమువోలె వచింపఁగాఁ గరం
బు భయము గొల్పుటన్ వదలి ♦ పూనిన కోపము మాని రంతటన్.

స్వరూప సందర్శన పటలము. (౧౧౭)

చ॥ అవనిజఁ గాంచదగ్గ సమ ♦ యం బిదె తర్జన భర్జనంబులన్
దవిలిన దైత్య కాంతలును ♦ దాయరు నిద్రకుఁ గోరినంతనే
యెవరును నిద్రవోరని క ♦ పీంద్రుఁడు మాయ ఘటించె దాన మృ
త్యువు తలదాఁకినట్లు మయి ♦ దుం గొని యెల్లరు వ్రాలి రయ్యెడన్.

చ॥ చిరము తపించుచున్ వనరు ♦ సీత యొకప్పుడు నిద్రవోని యా
సుర వనితాలి నిద్రిలుట ♦ చూచి మనోవ్యథ నోర్వలేనిదై
విరియు నుపాయమున్ దలఁచి ♦ వే కనఁ జాలనిదై భయంబుచే
విరవిరవోయి క్రుంగి రఘు ♦ వీరునిపైఁ గల ప్రేమఁ జింతిలున్. ౪౫౫

మ॥ మనమా! దుర్విధి రామచంద్రు నిటకున్ ♦ మన్నించి తోడ్తెచ్చునే?
ఘన కోదండ గుణారవంబు గురు ని ♦ ర్ఘాతంబు నా వచ్చునే?
తన కష్టేసి విమోచనంబు గలదే? తథ్యంబు వాక్రుచ్చుమా
యనుమానింపక చూడు నావలని భా ♦ గ్యాధిక్య మెట్లున్నదో?

సీ॥ వెడఁగు నిశాకరా! వెల్లని వెన్నెలా!, నన్నేల యుడికించి ♦ నలఁచువారు
తఱుఁగని రాతిరీ! తగ్గని చీఁకటీ!, నామీఁద నలుగుట ♦ న్యాయ మగునె?

పిరితీవలారా! చి ♦ చ్చుఱ వీచు వడగాలి, తోడుగా నీరీతిఁ ♦ దూలుతురేల?
నీరదశ్యాముని ♦ తో రహిం విహరించు, మీరు నాస్థితి దెల్ప ♦ మేరగాదొ?

తే॥ ఎంచి రాఁడని యతని వే♦ధించువారె?, ఆమహాత్ముఁడు రాకుండఁ♦డని యుదార
కరుణఁగూర్చి యేఁ బెక్కు దుః♦ఖముల కోర్చి, ప్రాణముల వీడకుంటి నీ♦వఱకుఁ దమిని.

సీ॥ వలదు వృక్షాకీర్ణ♦వనులకు రాఁ దలం, పకు కొన్ని నాళ్లలో ♦ మరలి వత్తు
నిలుమంటి నిండిన ♦ నెనరిదియేని ని, న్నెడఁబాసి దిక్కు లే♦కిట్లు లలయు
ప్రాణంబులను బాధ ♦ పఱచుచు నూరకు, పేక్షించి యుండుట♦యాద్యగుణమె?
యింతేల నీతండ్రి ♦ చింతించి చింతించి, నీకొఱకయి మర ♦ ణించునట్లు

తే॥ లోకమెల్లను దుఃఖంబు ♦ లోన మునిఁగి, తుది గనని త్రోవ విలపింపఁ ద్రోచి యేగి
కానఁ జేరు కట్టెఁడివి నగ ♦ గాతు వనుచు, విశ్వసించెడు నాకంటె ♦ వెడఁగు లెవరు?

ఉత్సా. మను నపేక్షఁగొన్న జీవ ♦ మా! వివేకమా! వెతగ
నను భజించి లజ్జలేక ♦ నలఁగుచున్నవారు నా
థుని మొగంబు గాంచు దనుకఁ ♦ దొలఁగ రేమి? నేను నిం
దను భరించి బ్రదుకు మీకుఁ ♦ దగవుగానె దోఁచెనే? ౪౮౮

తే॥ పలువిధంబులుగా నిట్లు ♦ పలవరించి, ప్రాణ మొక్కటి కలదేని ♦ బాము గలదు
దాని వీడిన నన్నియుఁ ♦ దలఁగఁగలవు, కీర్తియును నిల్చు ననుచుఁ బం♦ కేజనయన.

తే॥ చూడఁగలమను నాసచే ♦ నురిఁగి యోర్చి, ప్రాణముల తీపియెంచి కా♦పాడుచుంటిఁ
బలుదినంబు లిచ్చటఁ జెఱ ♦ వడ్డ నన్ను, ప్రేమఁ బావనుఁ డంగీక ♦ రించునేమి?

తే॥ పరులు వలచిన పిమ్మట ♦ బ్రతికియుండి, పలువిధంబుల ప్రల్లద ♦ ములను వినియు
బ్రతుకు నింతకాలంబు భా ♦ రముగఁ గడపు, కఠిన రాక్షసుల్ నాకంటెఁ ♦ గలరె యొరులు?

చ॥ జనముల నోళ్లనుండి పలు ♦ చందన మొందిన నిందమోచి కుం
దొనరని యాభిజాత్య మొఁగి ♦ యోరిమి లజ్జయు నౌర! యెంత సం
తనగఁ బొసంగి యున్నయవి! తక్కటి క్రొత్తదులందు నావలెగ
బెనిమిటి వీడి ప్రాణములఁ ♦ బ్రీతిని దాల్చిన వార లుందురే? ౪౯౩

మ॥ పరవేశ్మంబునఁ జేరుదాని మరలం ♦ బాటించి కైకొంట స
త్పురుషశ్రేష్ఠుల కర్హమే యనుచుఁ జే ♦ తో నాయకుం డిట్టు లో
ప్పరికించం గద యాతఁ డాఱడి వడగ ♦ బన్నంబులం బొంది దు
ర్భర జీవంబుల నేను నిల్పుకొను టే ♦ భాగ్యంబు గైకొంటకో? ౪౯౪

తే॥ ఎపుడు నిందలపాలై తి♦నప్పుడె జీవ, ములను విడువంగఁదగు నేను ♦ భువి జనములు
ప్రువ్వఁదిట్ట గౌరవమును ♦ పాలిసి పోవ, బ్రదికియుండుట స్వర్గంబు ♦ వడయుకొఱకె?

ఉ॥ ప్రేమములేని వీరులఁ బ ♦ విత్ర చరిత్రుల రాఘవేంద్రుఁ గ
భామిని గొప్ప అట్టు పడిఁ ♦ బొందినఁ బొంబెడుఁగాక దుస్తర

స్తోమములైన దుఃఖములఁ ♦ జూడని యున్నత వంశ్యనై గుణ
స్తోమము నొందు నా వనట ♦ దీర్చు నదెవ్వరు నేనుగాకిలన్ ? ౪౬౯

క॥ కపట మృగము వెంబడిఁ బ్రా, ణపతిఁ దఱిమి మఱఁదిఁ దిట్టి♦నాన చెడఁగ దై
త్య పురము చేరిన మనుగడ, విపులకు బరువగుచు వెతల♦వితగాకున్నే ?

ఉ॥ వీరులు రామలక్ష్మణులు ♦ వీకున నింద తొలంపఁగోరి యా
ర్యేరము పూని గెల్చిన స ♦ రే మరణించిరయున్ సరే భువిన్
వేరిమినొంది యిల్వడిని ♦ వీసరచేసి మెలంగు నేను దు
ర్భారముగా వహించు నడి ♦ వారల నొందునె యెన్నఁడేనియున్ ?

తే॥ మానహాని గల్గెడుచోఁ జ♦మరి మృగంబు,వంటి గుణమబ్బు సత్పతి♦వ్రతల యెదుట
మగనిఁ బాసి మాయావుల♦నగరమందు, బ్రదికెనంచు జగము నవ్వ♦బ్రదుకఁదగునె.

మ॥ తత కల్యాణ గుణాలయుండు ఘనకో♦దండంబు చేనంది దై
త్యతతిన్ మూలముమట్టఁ ద్రుంచియును కా ♦ రాగారము న్గ్రీన్ గలం
కిత నంటం దగదన్నచో నతని సం ♦ దేహంబు వాయంగ నే
గతి మద్భూషణమౌ సతీత్వమును తా♦ర్కాణింతు నప్పట్టునన్ ? ౪౭౦

ఉ॥ కావునఁ జచ్చుటే తగిన ♦ కార్యము వేఱొక దారిలేదు నా
చావునకున్ నిరోధలగు ♦ చానలు మత్సుకృతంబుచేత ని
ద్రావతులైరి మంచితఱి ♦ దక్కిన దంచును మాధవీ లతా
ప్రావరణ స్థలంబునకు ♦ రామ కళత్రము పోయె మెల్లనన్. ౪౭౧

చ॥ హనుమయుఁ జూచె నామె హృద♦యంబు నెఱింగె భయంబు పైకొనన్
జెనకి నిరోధముం జలుపఁ ♦ జెందెను జంకు; జగన్నియంత రా
ముని వరవుండ సాహసము ♦ పూనకు మమ్మరొ యంచు సీత వె
న్కనె చని యడ్డుగా నిలిచి ♦ కై ముకుళించి వచించె నివ్విధిన్. ౪౭౨

శా॥ అమ్మా ! రాముఁడు పంప వచ్చితి ననం ♦ ఖ్యాకుల్ కపుల్ నావలెన్
నెమ్మి న్నిన్ను గనంగఁ బెక్కుడలకున్ ♦ వే పోయియున్నారు లో
కమ్ముల్ రోసెడువారు పూర్వకృత భా ♦ గ్యప్రోన్నతిం జేసి లం
కమ్మీ పాదసరోజ దర్శనమునన్ ♦ గణ్యుండనైతిన్ ధరన్. ౪౭౩

శా॥ తల్లీ ! యిచ్చటి యిట్టి నీ యునికి చిం ♦ తా వ్యాకులుండైన శ్రీ
ఫుల్లాబ్జాక్షుఁ డెఱుంగఁడమ్మ ! నిజ మీ ♦ భూలోక దైత్యాన్వయం
బెల్లం గూఁకటి వేళ్లతోఁ దునిసి పో ♦ కీమూడ్కి నిల్చుండుటే
తెల్లంబై తగుసాక్ష్యమౌ మఱి నిబ ♦ ద్ధింపంగ వేఱేలొకో ? ౪౭౪

శా॥ సందేహింపకుమా సతీతిలకమా ! ♦ సర్వేశ్వరుం డంపుచోఁ
జందంబారఁగ నమ్మఁ బంపిన యభి ♦ జ్ఞానంబు వార్తాళియుం

డెందం బుల్లసిలంగ నున్నయవి పా ♦ టింపంగ హస్తామృతా
స్పందప్రక్రియఁ దెల్లమైఁ దెలియు మెం ♦ చం బోకు వేఱొండుగన్.

తే॥ ఇట్లు పలుకుచు వినతుఁడై ♦ యెదుట నిలువఁ, గరుణఁ గాంచి యీతండు ర♦క్క-సుఁడు గాఁడు
విజితవిషయుండు శుద్ధుండు♦వినయపరుఁడు, వాణి సంస్కృతమగు మహా♦ప్రాజ్ఞ వరుఁడు.

చ॥ దనుజుఁడె యౌనుగాక మఱి ♦ దైవతమే యగుఁగాక కానిచో
వనచరుఁడౌనుగా కితని ♦ వల్ల నపాయమె వచ్చుఁగాక మే
లొనరునుగాక నాపతి మ ♦ హోన్నత నామము నుచ్చరించి నా
మనము గరంచి జీవముల ♦ మన్పె శుభోదయ మున్నె యింతకున్?

చ॥ అని తలపోసి సీత కను ♦ లారఁగఁ గాంచి కృపన్ మనంబు పొం
దిన దితఁడెన్న వంచకుల ♦ తీరగు పల్కులవాఁడు కాఁడు భా
వనములతోడి వాక్యముల ♦ బాష్పము లుర్లఁ దపించుచున్నవాఁ
డని తలపోసి నీవెవఁడ ♦ వయ్య యెఱుంగ వచింపుమా యనెన్.

శా॥ దేవీవాక్యముతోడ హస్తములు నె ♦ త్తిందాల్చి శ్రీరామ భూ
దేవేంద్రుండు వనంబులో నిను మహా ♦ ర్తిన్ రోయుచున్ వచ్చి భా
నూవామాపతిపట్టి వానరకులా ♦ ధ్యక్షుండు నిర్దోషి సు
గ్రీవాభిఖ్యునితో నొనర్చె దృఢమై ♦ త్రిన్ ఋశ్యమూకాద్రిపై. ౪౭౯

ఉ॥ ఆతనియన్న వాలి యొక ♦ యప్పుడు రావణు చేవ్రకుంగ ని
ర్భీతిని తోఁకఁ జుట్టికొని ♦ వీఁకను దిక్కులఁ జుట్టినట్టి వి
ఖ్యాత యశుండు వేలుపుల ♦ ప్రార్థన మందర మంథ దండమున్
బ్రాఁతిగఁ బాఁపత్రాడుగఁ ♦ బట్టి మథించిన దోర్బలిష్ఠుఁడున్. ౪౮౦

ఉ॥ అంత బలాఢ్యు వాలి నొక ♦ యమ్మునఁ గూలఁగ నేసి రామభూ
కాంతుఁడు కీశరాజ్యము వి ♦ కర్తన సూనునకుం బ్రియంబునన్
సంతసగాఁగ నిచ్చె నట ♦ శ్వానముఁ బోలిన యేను వానికిన్
మంతిరినౌదు మారుత కు ♦ మారుఁడఁ బేరున నాంజనేయుఁడన్. ౪౮౧

సీ॥ డెబ్బది వెల్లువల్ ♦ డీకొని జగములఁ, జేతుల నెత్తెడు ♦ చేవగలిగి
జడనిధి నవలీలఁ ♦ గడచు సామర్థ్యంబు, వినుదాఁకఁ బెఱిఁగెడి ♦ వీఁకగలిగి
శ్రీరామభద్రుండు ♦ చేయఁదలంచిన, సంజ్ఞలఁ గని యట్లు ♦ జరపువార
లేడు జలధులందు ♦ నేడు దీవులయందు, నాకంబునందును ♦ నాగమందు

ఆ॥ కలయవెదకి నిన్ను ♦ గాననిచో నండ, గోళములను దాఁటి ♦ లీలఁబోయి
నెమకి చూచి రాఁగ ♦ నెల గడువుంగొని, పోయి యున్నవారు♦పూతచరిత!

చ॥ నిను దశకంఠుఁ డెత్తికొని ♦ నింగిని పోయెడినాఁడు నీవు చే
లను ముడివైచి భూషణము ♦ లం బడవైచితి వాని మాకడన్
గని గుఱుతించి రాఘవుఁడు ♦ క్రచ్చఱ నన్గొని వేఱుచోటికిం
గొని కొని పల్కె యామ్యదిశ ♦ కుం జనఁబంచెఁ గుతూహలస్థితిన్.

ఉ॥ నీవట జార్చు భూషలను ♦ నీపతి చూచిన నాఁటి తద్దశన్
నే వివరింప నైతి యగు ♦ నే? మఱి నీవు గ్రహింపలేవె? య
మ్మా! వెయి యేల? నీదయిన ♦ మంగళ సూత్రము నేఁటిదాఁక సు
శ్రీవహమై రహించుటయుఁ ♦ జెల్వగు భూషణకార్యమే సుమీ.

తే॥ వాలి ప్రియపుత్రుఁ డుత్సాహ♦వంతుఁ డగుచు, రెంచు వెల్వలతోఁడను♦గండు మిగిలి
యామ్యదిశ కరుదెంచి స♦న్నతఁడు లంక, వెతకఁ బంచి నాఁ డనుచు మా♦రుతి వచింప

తే॥ మేర లేని కౌతుకమున♦మీఱి సీత, మేను పూరింప జీవించు♦మిఱియుఁ గలదె?
యని పలికి బాష్పములు రాల్చి♦యాంజనేయ, ఆర్య చెలువ మెట్టులు గను♦దనుచు నడుగ

—: హనుమ శ్రీరాముని రూప మభివర్ణించుట :—

మ॥ ఉపమావస్తువులెల్ల నచ్చట మహా♦న్యూనత్వముం బొందవే?
యుపమాతీతము రాముమేను జననీ! ♦ యూహింతుఁగా కట్టులే
యుపమాన క్రమ హేతు భూతములచే ♦ నొప్పారఁగా నంచు న
య్యుపవర్గాధిపుఁ బల్కె నిట్లనిలజుం ♦ డాపాద మస్తంబు దాన్. ౮౭౭

చ॥ ఉపమగ నెఱ్ఱదామరల ♦ నుత్తమవిజ్ఞులు పల్కువార ల
య్యుపమను రామపాదములు ♦ కొప్పుగఁ గొంటిను గొని నిచమా
నుపమితి దానికంటె మఱి ♦ యుర్వర నున్నె? ప్రవాళకాంతి నీ
లపు జలజమ్ము కైవడి క ♦ లంకు వహించును వాని ముందఱన్. ౮౭౮

తే॥ పల్లవిత కల్పకలికా ప్ర♦వాళ లతల, నుపమ గొని యేమియును ఫల♦మొందఁబోదు
బాలభాను మయూఖముల్ ♦ కాలిప్రేళ్ల, కుపమగా నొప్పినను గొంత♦యొప్పవచ్చు.

తే॥ చిన్నవై పెద్దవై పొచ్చె ♦ మెన్నలేని, బంతి జాబిల్లి బిల్లికల్ ♦ వసుధ లేవు
నిలక యగు కాంతి వజ్రాలు♦కలవి కావు, కాన ప్రేళ్లకు సాటి జ♦గానఁ గాన.

తే॥ నేల నడవని కాలి మీఁ♦గాళ్లు లడవు, లందు దిరిగినఁ బుస్తంబు♦ననువు పెందు
నిఖిల లోకంబులకు శర♦ణీయములగు, నతని పదముల వర్ణింప ♦ నలవి యగునె?

తే॥ కంబు చక్రంబులం దాల్చి♦గాలిఁ గ్రోలు, పాఁపపడకఁ బరుండిన ♦ వాఁడెయైన
జంఘలకుఁ దూణరూపంబు♦నవతుచేసి, పలుకఁబూనిన నయ్యది ♦ పసగ నున్నె?

తే॥ ధర్మమూర్తియౌ తార్క్ష్య సం♦దంపు మెడను, దొరసి దిఙ్మదావళి పీన♦తుండములును
సిగ్గిలఁగ నొప్పు తొడలకుఁ జెనయికరయు, భూమియం దొక్కఁడైనను♦పొందు పడునె?

తే॥ తమ్మిలో సర్వజగములు♦తనరు హేతు, వైన నాభికి వలముఱి♦యైన గంగ
సుడులు పొగడలు సుంతయు♦సూటిగావ, యుపమ యెందుండి తెత్తు నీ♦యుర్వియందు.

క॥ అతిసుందర మరకత ప, ర్వతమును వెనుదీయ వెడఁద ♦ వక్షమ్మున ను
న్నతినుండ ఘన తపము సం, గతిఁ జేసిన లక్ష్మికంటెఁ ♦ గలరే పుణ్యుల్ ?

తే॥ బంభరములు చెందమ్ములన్ ♦ భ్రమను ముసర, వర్తులలయి పీనములయి♦వఱలు దీర్ఘ
బాహువులకు పేలుపుగొరు♦బలుపుచేయి, పోలు నొకకొంత వేఱొండు♦పుడమిలేదు.

ఉ॥ పచ్చని క్రింది పత్రములు ♦ భాసిల నెఱ్ఱని పంకజాతముల్
విచ్చినరీతి నొప్పు చెయి ♦ వ్రేళుల యందలి గోళ్లు దుష్ట సం
పచ్చరితున్ †సురారివిభు ♦ వజ్రశరీరము నెట్లు తుండ్లుగా
వ్రచ్చెనొ యన్న సందియముఁ ♦ బాపఁగఁజాలుఁ బతివ్రతామణీ!

ఉ॥ గట్టివికావు కాంతులును ♦ గల్లవు సంగర జైత్రలక్ష్మిఁ జే
పట్టవు మేరుకార్ముకము ♦ భగ్నముగా గొనయమ్ము నీడ్వవున్
నిట్ట యశంబు నొందవు జ ♦ నింపవు రెండు సమానరీతులన్
గట్టుల నెట్లు పోల్పఁదగుఁ ♦ గాంతుని బాహు విలాస లీలకున్ ? ౪౯౯

తే॥ శేషశయను నెడమచేతి♦చింద మొందు, పొదలఁ గడలిశంఖమ్ము లేఁ♦బోఁకమ్రాఁకుఁ
గంఠమున కుపమించు వెం♦గలుల పలుకు, లియ్యకొనఁగ మావలనఁ గా♦దింతయేని.

క॥ శ్రీరాము నెమ్మొగముతో, నీరజములఁ బోల్తమన్న ♦ నేత్రంబులకున్
వేరుపమ దేనిఁ జూపుదు, నీరజుఁడును దఱుఁగుచుండు♦నెఱి నెలనెలకున్. ౫౦౦

చ॥ ఇనకుల వార్ధి చంద్రముని ♦ యెఱ్ఱని నోటికి నీరుద్రావి ని
చ్చిన యెఱదమ్మిఁ బోల్ప నది ♦ సిగ్గిలు దేవ సుధాభమైన చ
ల్లని నుడిలేని దంత విర ♦ శంబగు హాసములేని విద్రుమం
బును గొని పల్కుచో జగము♦ మూర్ఖత నాపయి మోపకుండునే ? ౫౦౧

సీ॥ వెలయ మొలచు ధర్మ♦బీజాంకురంబులా !, యమృతబిందు శ్రేణి♦యా ? వచింప
సత్య భూమిజ సి♦శ్చల కోరకంబులా !, యమృతాంశు శకల సం♦ఘములః తలఁప
ముత్తెంబులా? తక్కు♦ మొల్ల మున్నగునవా ?, ఎదియని తెలుపుదు ♦ రదనపంక్తి
సుక్షేత్రమునఁ బుట్టు ♦ సురరాజమణికాంతి, మరకతమును పోలు♦మావి చిగురు

తే॥ కొసరి కొనరి వేఁడఁగఁజాలు♦కొమరుకాంతి, గలుగు రాము మైఛాయకుఁ♦గలదె
సవతు ?
తొడరియింద్రగోపముఁ బట్టు♦తొండమైన, నాసికకుఁ బోల్పఁదలఁచుట♦నయముకాదు.

ఉ॥ దండకలో ఖరాదు లెడఁ ♦ దన్ వడఁకంగఁ బిశాచపంక్తి కో
దండము వేలుపుల్ మునులు ♦ ధర్మము వేదము లెల్ల విద్విష

---

† హిరణ్యకశిపుని

త్తండము దుంపతోఁ దెగెఁ గ ♦ దా యని మోదముతో నటింపఁగాఁ
గొండొక ప్రాలు కన్బొమల ♦ కుఱ దగుపోలిక నీవుఁగాంతువే? ౯౦౩

తే॥ అష్టమీందుండు సహజ చి♦హ్నంబు వృద్ధి, తఱుఁగుటలు పుట్టు ప్రకుంకుటల్ ♦ తొలఁగునేని
చీకటుల నిశ్చలుండయి ♦ చెలఁగునేని, రాము నెన్నొసటికి సాటి ♦ రాఁగలండు.

తే॥ పొడవులై నెఱులై నీల♦ములయి విరిసి, కొనలు వంకరలై ప్రాలి♦కుసుమములును
తావిపొగయుఁ గోరకపుట్టు♦తావివీచు, కురులు జడలయ్యె మొగుళుల♦కొ్కమరుగలవె?

ఉ॥ లచ్చియు భూమిదేవియుఁ ద ♦ లంపునఁ బొందఁగఁ దగ్గయట్లుగా
నిచ్చ నిరేడు డీవుల ♦ వహింపుమ యన్నపుడుల విలాతి లే
దచ్చుగఁ గానకేగుమసి ♦ యన్నపుడుల దడఁబాటులేని యా
ప్రకచ్ఛటు పోక గిబ్బయెడఁ ♦ గద్దన వారణ మేద్వకుండునే? ౯౦౬

తే॥ ఇట్లు పలుకు పల్కులు విని♦యింగలమున, మైన మట్టులు కరఁగుచు♦మఱుఁగుచుండు
సీతఁగని తల్లి! నీపతి♦చెప్పినట్టి, యానవాళ్లను వినుమని♦యనియె నిట్లు. ౯౦౭

చ॥ అడవుల ద్రోవలందు నడ ♦ యాడుట కష్టతనుంబు పట్టుగాఁ
గడపు దినంబు లిందు యెస ♦ కంబుగఁ దల్లుల కెల్లసేవలల
నడపుచునుండు మన్న తరు ♦ ణంబున వాడిన మేనితో నొకే
యుడిచిన చేలతోఁ గినుక ♦ యొప్పఁ గుఱంగట నిల్చు టాడుమా. ౯౦౭

చ॥ ధరణిపునాజ్ఞ నొదలను ♦ దాలిచి పేరిమి సమ్మతించి రా
జ్యరమను వీడి యేగు సమ ♦ యంబున జానకి కోటవాకిటల
దటియకమున్నె యింత కడు ♦ దవ్వొకొ కాన! మఱెంత దూర మం
చరుదుగఁ బ్రశ్నసేయుటయు ♦ నాదటఁ దెల్పుదుగాక మారుతీ! ౯౦౯

ఉ॥ నావిభు నూఱడింపు వచ ♦ నంబులఁ దేఱితి మానసంబు నం
దేవగయైన చింత వహి ♦ యింపను చిల్కల గోరువంకలల
నావలెఁ జూచు కొండనుచు ♦ నాచెలియంద్రకుఁ బ్రేమతో సుమం
త్రా! వచియింపుమంచుఁ దగ ♦ నాడిన పల్కులు జ్ఞప్తి సేయుమా.

చ॥ మఱిమఱి పల్కనేల? హను ♦ మా! యిది యిమ్ము మదీయనామ మ
చ్చెరువుగ హీరరత్నములఁ ♦ జెక్కిన యుంగర మంచు సద్గుణో
త్తరుఁడు ప్రియంబుతో నొసఁగెఁ ♦ దల్లిరో! కైకొను మంచుఁ జూపె వా
నరవరుఁ డంత మైథిలియు ♦ నర్మిలిమైఁ గనె నంగుళీయముల. ౯౧౧

—: సీత యుంగరముం గని యానందించుట :

సీ॥ అర్థేందుఫాల యా ♦ యంగుళీయముఁ గాంచి, పొందిన స్థితి దేనఁ♦బోల్పనగును?
వచ్చిన వారలు ♦ జన్మ సాఫల్యంబు, గాంచిన సంతృప్తిఁ ♦ గాంచె ననియొ?

మఱచిన వారలు ♦ మఱచిన సంగతి, సభ జ్ఞప్తిగొని పొందు ♦ చంద మనియొ?
విడిచి యేఁగిన జీవ ♦ వితతి మరలి వచ్చి, బొందిఁ జేరిన నొందు♦నంద మనియొ!

తే॥ పీడు మణిఁగన్న సర్పంబు♦పీఁక ననియొ?, తొలఁగు నిధి నొందు మానవు♦తోయ మనియొ ?
లేక లేక బిడ్డను గన్న ♦లీల యనియొ ?, తొలఁగు నిధి నొందు మానవు♦తోయ మనియొ?

తే॥ అందికొనియెను ఱొమ్మున♦నలమికొనియె, నెత్తిని ధరించెఁ గన్నుల♦నొత్తికొనియె
బాహు లుబ్బెను కృశియించె ♦ బాళి గొనియెఁ, గుండె నిట్టూర్చెఁ దెలిసి వా ♦ క్రువ్వఁదరమొ? [యడరిచూచుఁ

తే॥ మూఁకొను నక్కునం జేర్చు♦మొగిని తడవు, నశ్రువులఁ దుడ్చుకొని యట్టి♦
బలుకనుంకించు నేమియుఁ♦బలుకకుండు, మేను పొంగార దానిఁ♦బ్రేమింగఁజూచు.

క॥ మించుం బోలిన యొడలున, గాంచన సంకాశ రుచులఁ♦గాన్పించె నటన్
మించిన రాముని యుంగర, మంచితమగు స్పర్శవేధి♦యగు నేమొ కదా!

తే॥ క్షుధితునకు మంచి భోజ్యంబు♦చొప్పడొఁచె, గేస్తునకు మంచి విందబ్బు ♦ క్రియఁ దలిర్చె
మరలఁ బ్రాణంబు రప్పించు♦మందుఁ బోలెఁ, బడఁతి కా రామభద్రుని♦భద్రముద్ర.

తే॥ జీవములు నెమ్మనింజెంది♦చెలఁగ సుదతి, కన్నులముదశ్రువులుఱొమ్ముఁ♦గడుగుచుండఁ
బ్రాణ మొసఁగితి వుత్తమా? యనుచు మరల, ననియె నిట్టులు మృదుమధు♦రాక్షరముల

చ॥ జగముల సృష్టిసేయు నల♦స్రష్టకుఁ గారకుఁడైన రాము దా
తగఁ జనుదెంచి జీవములఁ♦దద్దయు నిల్కడసేయు నీకుఁ బొం
దుగ నొసరించు ప్రత్యుపకృ♦తుల్గలవే తలిదండ్రు లట్టి పు
ణ్యగుణ! కృపానిధీ! యిహప ♦ రాధిక సౌఖ్యము లిచ్చితివ్యోడన్. ౯౧౨

ఉ॥ దిక్కొకయింతలేని బలు♦దీనకు దిక్కయి దుఃఖమూడ్చి యి
క్కెక్కడు మోదమిచ్చిన క♦పీంద్ర! చిరాయువు నొందుమయ్య! యేఁ
జొక్కపు మానసంబు గల ♦ జోటినయేని యజాండ గోళముల్
స్రుక్కెడు వేళ నేఁటివలె ♦ శోభిలుచుందువుగాక మారుతీ! ౯౧౩

ఉ॥ ఎచ్చటనున్న వాఁ డినకు ♦ లేశుఁడు తమ్మునితోడ నిన్ను దా
నెచ్చటఁ గన్నవాఁ డరి గ♦జేంద్ర మృగేంద్రున కేరు దెల్పి రే
నిచ్చట నున్కి నాకుఁ దెఱఁ ♦ గేర్పడఁ బల్కఁగదయ్య పావనీ!
సచ్చరితా గ్రగణ్య! యన ♦ జానకికిం గపివర్యుఁ డిట్లనున్.

శా॥ మారీచుండు దశాస్యు ప్రేరణమునన్ ♦ మాయామృగాకారుఁడై
శ్రీరాము న్వడిగొంచు దూర మరుగన్ ♦ జింతించి రాముం డొకే

క్రూరాస్త్రంబున నేయ వాఁడు నిను సం ♦ క్షోభింపఁ జేయంగ నా
ర్తారావంబు చెలంగ ముట్టయిడె న ♦ ట్లమ్మా! జగత్పావనీ! ౫-౨౧

శా॥ ఆకంఠధ్వని లక్ష్మణుండు విని స ♦ త్యం బెంచి రాకుంటకై
కాకుత్థ్సుండు శరాసనోగ్రరవముం ♦ గావించె నట్లయ్యు న
స్తోకంబౌ విధియోగమే గెలిచె నెం ♦ దుం గల్ల కంఠస్వరం
బేకాకొందదొ యేమొ? త్రోవ ననుజుల్ ♦ వీక్షించెఁ దా వచ్చుచున్.

సీ॥ కాంచి లక్ష్మణు ముఖా ♦ కారచిహ్నంబుల, చే లోని తలఁ పవ ♦ లీల నెఱిఁగి
జరిగిన వృత్తంబు ♦ సౌమిత్రిచే నంత, నాలించి వడిఁ బర్ణ ♦ శాలఁ జేరి
నీసౌరుమేను గా ♦ న్పింపమి జీవముల్, చెదరిన గతి సొమ్మ ♦ సిల్లె విమల
కరుణామయుండు దుః ఖంబొంద వేఱొక్క, కత మింతకంటెను ♦ గలదె భువిని?

తే॥ అవల నేనును వెదకి ప్ర ♦ త్యక్షముగను, రమణిఁ గాంచితి నీకుభ ♦ ద్రమగుఁగాక
ప్రభుఁడు రాముఁడు జీవముల్ ♦ పాయలేఁడు, కారణంబును నీవును ♦ గాంచలేవె?

ఉ॥ నిక్కపుఁ బ్రాణమై చెలఁగు ♦ నీవు తొలంగ నసత్య జీవముల్
చెక్కినయట్లు నిల్చు రఘు ♦ శేఖరు చిత్తమునందు నిప్పుడున్
జెక్కుచెమర్పఁ గంటి విఁకఁ ♦ జేటొనఁగూడుట యెట్లు? నీవు ని
ట్లెక్కడనుండ నాతఁ డట? ♦ నేగతి నేయుచి వీడు నమ్మరో! ౫-౨౪

తే॥ అట్టి రాముఁడు కొండలు ♦ నడవు లేళ్లు, వెదక యంత్రప్రతిమ వోలె ♦ వెడలి చనుచు
జగము కీర్తింపఁ దనజీవ ♦ సమితి వీడఁ, గాచియున్న జటాయువుఁ ♦ గాంచెఁ ద్రోవ

సీ॥ అతని మేనిం గాంచి ♦ యడలుచుఁ దండ్రి! నీ, కిట్టి దుస్థితి యెట్టు ♦ లెనసె నను డు
నిను రావణుఁడు దొంగ ♦ నియతిఁ దెచ్చుట తెల్పు, చున్నంతలో సల్క ♦ మిన్నుముట్ట
జగములనెల్ల మ ♦ చ్చరవహ్నికీలల, బూది గావింతు నం ♦ చూఁది నిలిచి
కోదండమును గాంచు ♦ కొమరు జటాయువు, వీక్షించి యొక యవి ♦ వేకి చెడుగు

తే॥ సేయ జగముల నాశంబు ♦ సేయఁదగునె?, శాంతినొందుము తొందర ♦ చనదు తండ్రి!
ధర్మచరితుఁడ వని సమా ♦ ధాన పఱుప, రామచంద్రుండు కోపభా ♦ రంబు వీడి.

ఉ॥ ఎచ్చట నుండువాఁడు? మఱి ♦ యేభువనంబుః నిల్చువాఁడు? వాఁ
డెచ్చటి కేగినాఁడు? దను ♦ జేం[illegible] పోయిన దారియేది? నా
కచ్చుపడంగ దెల్పు జన ♦ కా! యన నాతఁడు చెప్పబూని నో
ర్విచ్చుడుఁ బ్రాణముల్ నెగసె ♦ వీరవరేణ్యులు వంది కుందఁగన్. ౫-౨౭

తరల. తలరి మిక్కిలి రామచంద్రుఁడు ♦ తండ్రికిం దగు నంత్యక
ర్మలు సురావళియున్ భ్రమింపఁ గ్ర ♦ మంబుగా నెఱవేర్చి యా
ఖలుని రోయుచుఁ బర్వతంబులు ♦ కానలున్ భ్రమియించుచున్
దెలివినొందక నిన్ను గానమి ♦ దీనతన్ గడియించుచున్. ౫-౨౮

తే॥ పోవు త్రోవలు కన్నీట♦బురదగాఁగ, వహ్ని మైనంబు కరఁగిన♦ వహిని మనను
కరఁగ రాముఁడు మతిచెడి♦కలవరించి, పలవరించుచు మిక్కిలి ♦ పనవి పనవి.

తే॥ జనులలోఁ గర్మముల దాఁటు♦జాణ లెవరు? వీరలక్ష్మి వసించెడు ♦ వినుతభుజుఁడు
మతి కలంగ సర్వంబు ను♦మ్మెత్తను దాల్చి, చిత్తజాతవైరివలె ను♦న్మత్తుఁడయ్యె.

ఉ॥ నీ వనమందు మాపటను ♦ నిక్కముగా మునిఁగెఁ మదీయ రా
జీవదళాక్షి కల్లయని ♦ చెప్పెదవే? మదిరాక్షి రోసి నా
కేవగనైన నీవలయు ♦ సీయక తక్కితివేని నీవు గో
దావరి! నిప్పవై మఱిఁగి ♦ తప్పక మాఁడెద వీక్షణంబునన్. ౯౩౧

ఉ॥ పర్వతరాజమా! వడిని ♦ బాలకురంగమనేత్ర నేత్ర సం
పర్వముగాఁగఁ జూపు మటు ♦ పాయక చూపవయేని నీవృథా
గర్వము సర్వముం జెడఁగఁ ♦ గాలిచి బూదియొనర్చు మన్మహో
ఖర్వ శరం బొకండె యొడి ♦ కంబుగఁ జాలుఁ జెడంగఁ జూతువే? ౯౩౨

ఉ॥ బంగరులేడి మాయలను ♦ పన్నుటచే హరిణాక్షి నేఁడు నా
కుం గనరాక పోయినది ♦ క్రూరకురంగములార! నాదు త
న్వంగిని చూపరేని కఠి ♦ నాత్ముఁడనై మిము దుంపతోడఁ ద్రుం
గం గసిదీఱఁ జంపెద సు ♦ కర్మము గాకిది ఘోరకర్మమే? ౯౩౩

తే॥ ఊంద మగల నీరీతిఁ దాఁ♦గుందికుంది, రాఘవుఁడు వాడుచుండ ని♦ర్మలమనస్కు
తమ్ము చల్లని వాక్సుధా♦ధారచేతఁ, జిత్త మొక్కింత తేటమై♦చింతవీడె. ౯౩౪

తే॥ కీశకుల శేఖరుండు సు♦గ్రీవుఁ డుండు, ఋశ్యమూకంబు చేరిరి ♦ నృపకుమారు
లచట నెల్లప్రాణుల మనో♦వ్యథ తొలంగ, మిత్రకుల మిత్రపుత్రుల♦మైత్రికుదిరె.

సీ॥ శ్రుతులచే జ్ఞానవి ♦ శ్రుతులచే నిజరూప, మెఱుఁగరాకుండు లో ♦ కేశ్వరుండు
తనకుఁ గల్గిన దుఃఖ♦మునకు హేతువును మా, యెదలు పుండ్లుగఁ జెప్పి♦యుదిలగొనఁగ
నీతొడవులఁ జూప ♦ నాతండు మూర్ఛిల్లి, మావచనంబుల ♦ మరలఁ దెలిసి
యరసి నీతొడవుల ♦ నమృతంబు చల్లిన, నాఱని పెనునొవ్వి ♦ నందినాఁడు

తే॥ ఆమనోవ్యథ మున్నె తా♦నందియున్న, నపుడు మఱిమఱి క్రొత్తలై♦యడరె మేము
మది సమాశ్వాస పడఁజూప♦మఱియుఁ బెరిఁగె, నేమిచెప్పుదు రాముని♦యెడఁద వనట.

సీ॥ ఆపర్వతంబున ♦ కావలిగిరి నున్న, వాఁడు శైలనిభుండు ♦ వాలి యనెడు
కపిరాజు నీదుఃఖ ♦ తతికిఁ గారకుడఁగు, పంక్తికంఠుని దన ♦ వాలమందు
వ్రేలాడఁగాఁ జుట్టి ♦ పృథివీధరంబుల, వననిధులం దాఁటి ♦ వచ్చినతఁడు
వాని నొక్క శరాన ♦ వడిఁ గూలఁగా నేసి, తన మిత్రుఁడగు మిత్ర♦తనయునకును

తే॥ రాజ్యమొసఁగి సేనలఁ గూడి♦రాఁగఁ బనిచి, వచ్చు దాఁక నాలుగు నెలల్♦వానలేగ
మాల్యవంతంబునందు ల♦క్ష్మణునితోడ, జరపె నాలుగు యుగములు♦జరపులీల.

తే॥ కపిబలంబు చేరినది దిక్కతులు వెనుకఁ, బడఁగ వెదకంగ వారలఁ బంపి నన్ను
దక్షిణంబున కంపె నాతరలి రాక, కిదియ హేతువు జనకరాజేంద్రతనయ !

చ॥ చనవున నిట్లు రామ నృప ♦ చంద్రుని తీరు మారుతిస్తుతుండు ప
ల్కిన విని భర్తృ దుఃఖ మగ ♦ లింపఁగ డెందము నొచ్చియుఁ ముదం
బును కుతుకంబు నొక్కదెసఁ ♦ బొందుచు మూలగయుం గరంగ సా
హనుమని నీ యపారమగు ♦ నంబుధి నెట్లు తరించి తీవనన్. ౫౩౯

మ॥ జననీ ! రామ పవిత్ర పాద సరసీ ♦ జాతంబు లుల్లంబునం
దనిశంబున్ జపియించు ధీవరులు మా ♦ యా సాగరంబుం దరిం
చిన చందంబున మీకృపా మహిమచేఁ ♦ జేకూరు చేవన్ దరిం
చిన వాఁడీ కపియన్న శంకయె మదిం ♦ జెందంగఁ జింతించుచున్.

చ॥ కదుకొను నాణిముత్తెముల ♦ కంటెను వెన్నెలకంటె మిన్నయౌ
రదనరుచుల్ చెలంగిన ధ ♦ రాసుత మారుతిఁగాంచి నాయనా !
పొదఁడవు నీవు దొడ్డది స ♦ ముద్రము దాఁటఁగ నెట్టులయ్యె నె
మ్మదిని తపోబలంబుననొ ♦ మంత్రబలంబుననో వచింపుమా. ౫౪౧

—: హనుమ స్వస్వరూపముం జూపుట :—

తే॥ అనుడుఁ గేల్మోడ్చి హనుమంతుఁ ♦ డంబరంబు, దాఁకఁ బెరిఁగి మఱియుఁ బోవఁ ♦ దల దగులునో
యను భయంబున వినతుఁడై ♦ తనదు రూపు, జూపఁ జూపె జానకి శంక ♦ తొలఁగి పఱవ.

తే॥ పొగడఁదగు గురుత్వము పంచ ♦ భూతములకుఁ
గలదొ? కపి వరేణ్యునియందు ♦ గలదొ ? యెంచ
గలదు ? నిజముఁ నూహింపంగఁ ♦ గలమె? యనుచు
ద్రోపులాడంగఁ దగిన దా ♦ రూపమహిమ.

క॥ పెరిఁగిన బంగరు గిరిఁగల, తరువుల ఖద్యోత వితతి ♦ తనరె ననఁగ వా
నరవరు రోమంబులలో, గురుతరగతి మెఱసె ఋక్ష ♦ కూటము లరయన్.

క॥ కనులను జ్ఞానంబును కడ, చిన రూపము గొన్న హనుమ ♦ చెవి కుండలముల్
ఘనముగ గ్రహముల వెలిఁగెడి, దినకర శశధరుల తోడ ♦ దీకొని నిలిచెన్.

చ॥ జగములఁ గొల్చి నిల్చిన భు ♦ జంగమ తల్పుఁడె యొర్పుతోడఁ గ్రీ
డగు నొక వానరంబని య ♦ నాదరముం బొనరింపరాని య
త్యుగ్ర శిఖరాణిఁ బోలు కపి ♦ చంద్రుని యున్నతిఁగాంచెనేని లో
కగురుత యొక్కవానికె స్వ ♦ కంబుగఁ గాదని యెంచి సిగ్గిలున్.

తే॥ అన్నిలోకజాలములందు ♦ నన్నిదిశల, సన్నిప్రాణులు గాంచె నా ♦ హనుమ నపుడు
పాసఁగఁ బైలోకములనున్న ♦ పుణ్యగుణుల, నందఱను దన కన్నుల ♦ నతఁడు గాంచె.

తే॥ పరవి పెరిఁగిన మారుతి ♦ పాదయుగళి, సణఁపఁగా లంక సంద్రంబు ♦ నందు మునిఁగెఁ
బొరలి ప్రబ్బెఁ దెల్లని యలల్ ♦ భూమిమీఁద, మీలు తళతళ మెఱయుచు ♦ మిట్టఁబడియె.

చ॥ గరితలమిన్నయైన జన ♦ క ప్రభుపుత్త్రిక వాయుపుత్త్రుఁ ద
చ్చరణ సరోజ యుగ్మమును ♦ సైతము గానఁగలేక సోఁకు లీ
ల్గిరయని యుత్సహించి సుబ ♦ లీ! భవదీయ మహాస్వరూప బం
ధురతను చూడఁగా జడియు ♦ దుఃఖ నడిగా నుపసంహరింపుమా. ౫౮౯

తే॥ అయ్య! నీయసంతాకృతి ♦ నరయఁదగిన, సత్త్వమొందదు జగ ముప ♦ సంహరింపు
మనుచు జానకి విభు పరి ♦ ష్వంగ సౌఖ్య, సమ ముదము గాంచి పరవశ ♦ త్వము భజించె.

తే॥ అంతఁ జిత్తమనుచు సమీ ♦ రాత్మజుండు, వెంటనే చూడదఁగు నొక ♦ చిన్నరూపు
దాల్చి వినతుఁడై యాయమ ♦ దాసి నిలువ, నిట్టులను మణి దీపంబు ♦ వెనయుసీత.

సీ॥ పవన జవన వీర! భువిఁ గులాద్రులతోడఁ, బ్రిదులక తలను ధ ♦ రించి తన్న
లీల స్వర్గముఁ బెక ♦ లించి యెత్తితివన్న, లోకంబు లన్నింటి ♦ జోక మోచు
శేషుని డాపలి ♦ చేత నీడ్చితివన్న, వనధిని నడచియే ♦ వచ్చితన్న
భవదీయ మహిమకు ♦ ఫలవంతమగు గొప్ప, పని కాదు లజ్జనే ♦ పాదుకొలుపు

తే॥ నీజలధి దాఁటి వచ్చుట ♦ యేమిగొప్ప, విభుని కరుణయు యశమును ♦ పెక్కుకల్ప
ములు తిరంబుగ నెలకొనఁ ♦ బూని సేయ, నీవ యొక్కండవై యుంటి ♦ నియతచరిత.

సీ॥ ఈలంక నీపేర్మి ♦ కేడు మున్నిఖిలల, కవల నుండమియుఁ ద ♦ క్కువయె గాదె
ఇట్టిదే విజ్ఞాన ♦ మిట్టిదే నీమాన, మిట్టిదే శమము ని ♦ ట్టిదియె దమము
కార్యంబు నిట్టిదే ♦ వీర్యంబు నిట్టిదే, తెల్వి యిట్టిదె యిల్లె ♦ తెల్వి ఫలము
తలఁపు నిట్టిదె నీతి ♦ మెలపు నిట్టిదె మతి, గెలుపు నిట్టిదె యిల్లె ♦ కీర్తిగరిమ

తే॥ ఎల్ల సుగుణముల్ నీకిట్టి ♦ వే యటన్న, నింక లోకపాలకులయి ♦ యెసఁగుచుండు
నజహరామరాదులు సద్గు ♦ ణాళియందు, హీనులే యగుదురు కదా ♦ మాననీయ!

సీ॥ మెఱుపుకోఱలు మేర ♦ మీఱిన బలమొందు, కర్బురావళి వృద్ధిఁ ♦ గాంచినప్పు
డమ్మహావీరున ♦ కనుజుఁడొక్కఁడు తక్కఁ, దోడు లేదను చింతఁ ♦ దోఁగుచుండు
వీడితి నాశంక ♦ వీడెఁ బ్రాణాపద, కొదువలేదని తృప్తి ♦ పొదలె నిపుడు
నీయట్టిమహిమాఢ్యు ♦ సాయమబ్బిన మీఁద, నీరక్కసులు లంక ♦ యేమియగునో?

తే॥ ఇంక నేమరణించిన ♦ నెగ్గులేదు, నన్ను నలఁచిన రాక్షసా ♦ న్వయము తూలె
నేఁడె చెఱవీడె నాథుని ♦ నేఁడె గంటి, యశమె గాక నిందయు నాకు ♦ నబ్బునేమి?

సీ॥ అనియిట్టు లామోద ♦ మున నాడు జానకి, పాదంబులకు మ్రొక్కి ♦ పావనియను
నమ్మ! రాముని దాసు ♦ లగు కపివర్యులు, కడలి యిసుక కంటెఁ ♦ గలరు హెచ్చు

వారలలో నొక్క ♦ వనచరుండను భవ, దాజ్ఞలఁ దలమోచు ♦ నడియఁడేను
ఏడుపదుల వెల్వ ♦ లెట్టపో గది సము, ద్రంబందు నీరు మొ ♦ త్తమ్ము నొక్క
తే॥ చేతఁ ద్రావంగఁ జాలునే ♦ సేన కెల్ల, రాక్షసుల లంక కానంగ ♦ రాకపోవు
కతన నింతవఱకు నిల్వఁ ♦ గలిగెఁ గాక, తెలియు పిమ్మట నింకను ♦ నిలుచు నేమి?
సీ॥ కమలాప్తపుత్త్రుఁడం ♦ గదుఁడు మైందుఁడు ద్వివి, దుఁడు నీలుఁడును కుము ♦ దుండు నలుఁడు
వృషభుండు శంఖుండు ♦ వినతుండు గవయుండు, శరభుండు ధూమ్రుండు ♦ జాంబవంతుఁ
డుగ్రుండు కుముదాక్షుఁ ♦ డు సుబలుఁడగు శత, బలి గవయాక్షుండు ♦ పనస కాంబ
దధిముఖ గంధమా ♦ దనులు దుర్మర్షణా, దులు సైన్యనాయకుల్ ♦ దుర్జయులును
తే॥ రామబాణమువలెనె కార్యంబు గొంద్రు, జగములెల్ల నొక్కటిచేయఁ ♦ జాలువారు
వారి లెక్కింప దానవ ♦ వర్గమెల్ల, సలుగకైనను జాలదు ♦ జనని! నిజము. ౧౧౬

౬. చూడామణిపటలము. (౮౯)

తే॥ దుఃఖితయు రాము ప్రాణముల్ ♦ దొరయునదియు, శ్రీసమానయు నగు సీతఁ ♦ జెఱ వెడల్చి
కొంచుఁ బోవుటే తగుకర్జ ♦ మంచుఁ దలఁచె, నట్టి హనుమ కుపమ చెప్ప ♦ నైతియగునె?
తే॥ బంటువార్తను వినుము కో ♦ పంబు వలదు, రావణుని గెల్చు టరిది కా ♦ ర్యంబుగాదు
నిన్ను నీపతి కడఁ జేర్చి ♦ నెమ్మి మీఱ, మీపదంబుల భజియింతు ♦ నేఁ గనుము.
చ॥ అతి మృదురోమముల్ గల మ ♦ దంసముపై వసియించి నెమ్మదిన్
వెతవిడి నిద్రపొ మ్మనిల ♦ వేగముతో నెడ నిల్వ కేగి నీ
పతి గల మాల్యవంతమునఁ ♦ బన్నన ప్రాలెద నీకు భద్ర ను
బ్బుత భవదీయ సేవకుని ♦ పోఁడిమిఁ గాంచుము తల్లి! లెమ్మిఁకన్ ౧౧౯
ఉ॥ దైత్యులు గాంచి యడ్డుపడఁ ♦ దప్పను కార్యమె యందు వేమొ? సం
స్తుత్య బలంబుతో నరుల ♦ దోర్బలముల్ నశియింపఁ గూల్చి నా
యత్యురుకోప మార్చికొని ♦ యప్పుడ తేటఁ దనంబు గాంతు సం
ప్రత్యయ ముంచు మమ్మరో! భ ♦ వత్ప్రతి గాంచియు సైఁపనేర్తునే?
చ॥ పెలుచన లంకతోడఁ గొని ♦ వే చనుమన్నను కెల్లగించి యేఁ
జులుకన నొక్కచేతఁ గొని ♦ చుట్టిన దైత్యుల నొక్కచేతఁ బెన్
జలమున నుగ్గుచేసి రఘు ♦ నాయకు పాదసరోజ సన్నిధిం
బొలఁకక డించువాఁడ నిది ♦ దొడ్డగు కార్యము కాదు చేయఁగన్.
చ॥ నురలుచు లోకమోహనుని ♦ మందట మాయమృతంబుఁ బోలు సుం
దరి దితిజేంద్రుఁడైన చెఱ ♦ దప్ప నుపాయము లేక మిక్కిలిం

బరిపరి రీతులన్ మనసు ♦ మాఁడఁ దపించుచు నున్నదన్న నా
వైరవరి దాత్మ్యమేమి యొద ♦ వించినదా? వచియింపు మమ్మరో!

ఉ॥ గాయములేని పీనభుజ ♦ కాండములో నటకేగి శాత్రవ
స్వీయ బలంబు నేర్పఱచి ♦ చెప్పఁగ నెట్లగుఁ? దోడికొంచు నే
నాయమఁ దేరలేదకట! ప్రాణము మాత్రము గాచుకొంటి మీ
నాయికఁ గాంచి ఫల్క జత♦నం బొనఁ గూడద యందునా? యటన్.

ఉ॥ రక్షితసాంద్రమైన నగ ♦ రఁబును కాలిచి బూదిచేసి యీ
రాక్షసవర్గముం బద క ♦ రంబులతో నలిగాఁగఁ ద్రొక్కి నే
యీక్షణమందె సర్వము న ♦ దీశుని పొట్టను పెట్టి రావణుం
దక్షతఁ జంపుమన్న వడిఁ ♦ ద్రమ్మెద నాజ్ఞ యొసంగు మమ్మరో!

ఉ॥ శ్రీరఘువీరశేఖరుఁడు ♦ చెల్వుగ నిప్పుడె నిన్నుగూడి మున్
గూరిన తాపమెల్ల విడి ♦ కోరికతోడఁ బ్రసన్నవిస్ఫుర
చ్ఛ్రీరమతోఁ జెలంగి మఱి ♦ చెన్నటి దానవ వంశమెల్లఁ బో
కారిచి లోకజాలముల ♦ కష్టములం దొలఁగించు టొప్పగున్. ౧౬౧

ఉ॥ ఇందుల కొక్కయుద్దు వచి ♦ యింపఁగఁ దగ్గది లేద యట్టి భా
గ్యేందిర నాకు లభ్యమగు ♦ నిమ్ముల నీవు దలంచితేని రా
ముం దగఁజేరి దుఃఖములఁ ♦ బోకడపెట్టి సుఖింతువమ్మ! న
న్నుం దయఁజూచి మూఁపుపయి♦నూల్కొన నెక్కుమ యంచు మ్రొక్కినన్.

తే॥ పూన్కి యుక్తవాక్యంబులఁ♦బొసఁగఁ బలికి, తల్లికడ నిల్చు లేఁగనాఁ♦దనరి నిలుచు
హనుమఁ గాంచి నిర్దుష్ట వా♦క్యముల మృదుల, ఫక్కి నిట్లనిపలికె నా♦పద్మగంధి.

శా॥ అన్నా! నీకిది దుష్కరంబగునె? యో ♦ గ్యప్రౌఢి నీశక్తికిన్
మన్నింపందగు భంగి నెంచితివి సా ♦ మర్థ్యంబు మెచ్చయ్యె నీ
కన్నన్ దిక్కట లేరు వేరయిన ము ♦ గ్ధాత్వంబుచే నిట్టి నీ
పన్నాగం బసమంజసం బనుచుఁదె ♦ ల్పం బూనితిన్ మారుతీ! ౧౬౨

ఉ॥ అంబుధి మధ్యమందు దను ♦ జావళి క్రన్ననఁ జుట్టు ముట్టి క్రూ
రంబుగ నస్త్రశస్త్రముల ♦ రాయిడి చేసిన వారితోడ ఘో
రంబుగఁ బోరెదో? మఱియు ♦ రక్షణచేసెదొ నన్ను? రెండు నం
తంబునఁ గష్టమే యొసఁగఁ ♦ దప్పును కర్జమొకండ వోటచే. ౧౬౩

చ॥ మఱియొకమాట రాఘవు స ♦ మంచిత కార్ముకవిద్య యాడికం
బొరయును చావ మాఱడిని ♦ పొందును పక్వపు టోగిరంబుఁ గు
రుక్కరములు దొఁగిలించుకొనఁ ♦ గోరిన రీతిగ నొప్పఁ గార్యమున్
వెరవరిమైన నీవును ప ♦ విత్ర మనంబున నిట్టు లెంతువే? ౧౭౦

శా॥ ఘోరాయోధనమందు రాఘవు మహా ♦ కోదండ పాండిత్య మే
పారన్ వేల్పులు చూచుచుండ, నను చౌ ♦ ర్యప్రౌఢి సాధించుచుం
గారాగారమునందు కూర్చిన మహా ♦ కష్టాత్ము కన్నుల్ సమి
ద్ధ్వారంగంబునఁ గాకముల్ పొడువ నం ♦ తోషించి వీక్షించెదన్.

ఉ॥ రాముఁడు లక్ష్మణుండును దు ♦ రంబునఁ గాన్క హస్తలాఘవ స్వ
స్థేమముఁ జూపి దైత్యుల వ ♦ ధింపఁగ మక్కువఁ బోలి రాక్షస
స్వాములనెల్ల దైన్య విధ ♦ వాత్వము లొందిరఁగాక నాయెడన్
రామతనంబు నానయును ♦ రాజిలునే? గురుతన్ గడించునే? ౧౭౨

చ॥ కనకమయ త్రికూటమునఁ ♦ గ్రాలెడు లంకయె నేను చూడ దై
త్య నికర శల్య సంచయ యు ♦ తంబుగ నిల్వదయేని జీవితం
బును సుచరిత్రమున్ గరిమ ♦ మున్ మహిమాన్వితమౌ సతీత్వమున్
జనులకు నెవ్విధిం దెలుపఁ ♦ జాలుదు నీవ వచింపు మారుతీ! ౧౭౩

శా॥ ఈ రక్షో నిలయంబ కాదు మఱి యీ ♦ యీరేడు లోకంబులన్
శ్రీరామాస్త్రమువోలెఁ గాల్చు నివృత్తై ♦ చిందన్ సతీత్వాగ్ని చే
నారామప్రభు నేర్చినట్టి విలువి ♦ ద్యా ప్రౌఢికి న్యూనతన్
గూరం జేసిన దాన నౌదు ననియే ♦ కోపక్రియన్ మానితిన్. ౧౭౪

తే॥ మఱి జితాక్షుమునిన్న స♦మ్మాన్యుఁడనుచు, జగము వినుతించు; రాముపద్మాంబుదక్షు
దక్కు మేను దాఁకుట నాకుఁ♦దగదు నీకు, రాముకీర్తికి భంగ మో♦ర్వంగఁదగదు.

తే॥ ఉదరె నను రావణుఁడు తాఁకి♦యుండు నేని, వానిమేన నిన్నాళులు♦ప్రాణమున్న
ప్రాణములు త్రుటిలో వీడు♦ననియె వాఁడు, నేలఁ గెల్లగించికొని వి♦న్వ్వది నేగ.

తే॥ తన్ను చేర నిష్టపడని♦తరుణిఁదాఁకె, నేని శీర్షముల్ తెగి యిల♦పైని గూలు
ననుచు నలువ యిచ్చిన శాప♦మరయ నాదు, ప్రాణముల నిన్ని నాళ్లు కా♦పాడెనయ్య.

తే॥ అట్టి శాపంబు గలదని♦యరసి సత్య, వంతుఁడగు విభీషణు పుత్త్రి♦పరమసాధ్వి
ప్రేమ నాయెడఁ గలదియౌ♦త్రిజట చెప్పె, నాకు భయము దీర్చెడు జత♦నంబుతోడ.

క॥ అది కలుగుటచే ధర్మము, వదలదనుచు నిశ్చయించి ♦ పతి శౌర్యంబున్
మదినమ్మి నిష్కలంకత, పదిలమ్ముగఁ దెలుపనుంటిఁ ♦ బ్రాణమ్ములతో. ౧౭౯

ఉ॥ అచ్చటినుండి రావణుఁ డ ♦ హమ్మతి ధాత్రిఁ బెకల్చి తెచ్చి నాఁ
డిచ్చటనుంచె లక్ష్మణుఁ డ ♦ హీన గుణుం డొనరించి నట్టి యీ
పచ్చని యాకుటింటిని కృ ♦ పామతిఁ జక్షువులారఁ గాంచి నా
యొచ్చెములేని మానస మ ♦ హోన్నతి నమ్ముము నీవు పావనీ! ౧౮౦

ఉ॥ ఇచ్చటువీడి యెచ్చటికి ♦ నేగెదు దానను కాను రాము మే
నచ్చముగాఁగఁ బోలు నమ ♦ లాంబువు లున్న సరోజసద్మమున్

జొచ్చెద వే చలించెదు న ♦ సుప్రకరంబుల నిల్వఁగోరి యు
ద్యచ్చరితుండ రఘూత్తము ము ♦ దంబునఁ బొందెదు నాస నొక్కటన్.
తే॥ కాన నియ్యది యుక్తంబు ♦ గాదు నీవు, వేదనాయకు నెదుటికి ♦ వేగఁబోవు
టెన్నఁ గార్యమనుచు సీత♦యిట్లు పలుక, విని మహామతిమంతుఁ డి♦వ్విధివచించె
తే॥ కలుగు సందేహ తాపముల్♦తొలఁగ హనుమ, రామచంద్రునకుం దగు♦రాణివైతి
తల్లి! నీ తపోనిష్ఠ చం♦దమ్ము మేలు, మేలనుచు నుత్సహించుచు♦మించి పొగడి.
ఉ॥ చింతిలకమ్మ! యిచ్చట వ ♦ సించుట నిక్కము కొంతకాలమే
సంతమసంబు రావణు వ ♦ శంబున నిండిన లోకమెల్ల ని
శ్చింతఁ బ్రసన్నతం బొదలఁ ♦ జేయుము చింతిలుచున్న రామ భూ
కాంతునకున్ వచింపఁదగు ♦ కార్యము నానతి యిమ్మనన్ వెసన్

—: సీత రామునకుఁ బంపు సందేశము :—

మ॥ హనుమా! యింకొకమాసమే యెటులొ నేఁ ♦ బ్రాణంబుతో నుండెదన్
వెనుకన్ రాముని యానసుమ్మి యసువుల్ ♦ నిల్పంగఁ జాలన్ నిజం
బనుమా నావచనంబు లవ్విభునకే ♦ యంగంబునం బల్కఁ దా
నెనరుం బూనునొ యాప్రకారమున వి ♦ న్పింపందగుం బావనీ!
మ॥ అతిలోకుండగు రాఘవేంద్రునకు భా ♦ ర్యారత్న మొక్కర్తె దు
ర్గతిపాలై తపియింపఁ జల్లని కృపా ♦ రంభంబు లేకున్న భూ
పతివంశస్వము క్షత్రధర్మమును గా ♦ పాడంగనైనన్ వరిం
చితిఁ బ్రార్థించితి నంచుఁ దెల్పుము కపి♦శ్రేష్ఠా! దయావారిధీ! ౫౬
తే॥ లలిత గుణ శీలుఁడైన మా♦లక్ష్మణునకుఁ, దేటపడఁగ శ్రీరాముఁ నా♦దేశమునను
నన్ను గాచుచునుండఁగా♦నడుమఁ దొడరు, చెఱను విడిపింప విధియని♦చెప్పుమయ్య.
చ॥ ఒకనెలతోడ నేనిచట ♦ నూను వ్రతంబు సమాప్తి చెందు నం
తకు మును రాముఁ డిచ్చటికి ♦ దాత్తమతిం జనుదేర లేనిచో
నకలుషమైన గంగదరి ♦ నాతని కెందలి రాకుచేతఁ ద
ప్పక తిలతర్పణం బొనరు ♦ పం బతిమాలితి నంచుఁ బల్కుమా. ౫౭
మ॥ వరధర్మాధికృతుండు రాఘవుఁడు నా ♦ పై నించుకంతేనియున్
గరుణాభావము లేకయే మఱచినన్ ♦ నామీఁద నిండారు ప్రే
మరసాత్మల్ ముగురత్తవారలకు మీ ♦ మన్నించు వైదేహి తాఁ
జెఱలో లంకను క్రమ్మఁదుచోఁ గరము మో ♦ డ్పన్ భక్తి నంచాడుమా.
చ॥ మిథిలకు వచ్చి నన్నచట ♦ మీఱిన ప్రేమఁ బరిగ్రహించుచో
బుధులు వచించు మార్గమునఁ ♦ బోయెద రెండవ కన్యహస్త మీ

ప్రథిత భవంబునం దొడరి ♦ పట్టను నెమ్మదినైన నెంచ నం
చధిక ముదంబుతో నేనుట ♦ యార్యునకున్ వినిపింపు మారుతీ! ౫౯౦

ఉ॥ చిక్కులఁబొంది యిచ్చటనె ♦ జీవములం ద్యజియింతునేని వే
ఱొక్క భవంబునందయిన ♦ నుత్తమవీరు పవిత్ర దేహమున్
దక్కఁగ దాఁకు నిష్కలుషి ♦ తంపు వరంబును కేలుమోడ్పుతో
మిక్కిలి కోరుదాన నని ♦ మేదిని భర్తకు విన్నవింపుమా. ౫౯౧

చ॥ నలువుగ రాజ్యపాలన మొ♦నర్చ ననర్ఘమణుల్ ఖచించు తా
వళములఁ దాల్చు భద్రమద ♦ వారణ రాజముపై రహించి వీ
థులఁ దగ నేగు వేడుక కు ♦ తూహలినై కన నోచకుండు నే
నెలసి వృథా వచించి ఫల ♦ మేమి? పురాకృత మిట్టులుండఁగన్. ౫౯౨

తే॥ తన్ను గూర్చి జనంబులు ♦ తలరుచుంట, తల్లిచింతయు భరతుండు ♦ తనకుఁగాఁగ
ననుభవించు నొవ్వియు నెంచి♦యుచటికేగుఁ, గాని యిచటికి నెట్లు రాఁ♦గలుగు నతఁడు.

తే॥ తల్లిదండ్రులకును బంధు♦తతికి నాదు, కేలుమోడ్పు లందింపు సు♦గ్రీవుతోడ
రాముతో నయోధ్యకుఁ జని♦ రాణ చెడిన, పురికిఁ బట్టము గట్టఁ గై ♦ మొగిచెననుము.

—: హనుమంతుడు సీతకు ధైర్య వాక్కులాడుట :—

తే॥ వెగడుపడి యిట్లు పలుకు పృ♦థ్వీజఁ గాంచి, తల్లి యింకను దుఃఖానఁ♦దలరెదేల?
యనుచు మృదు మధురములు స♦మంజసములు, నైన గంభీర వాక్కుల♦ననియె హనుమ.

క॥ స్రుక్కెదు నీవిలంకనె, స్రుక్కక రాముండు బ్రతికి♦చొచ్చు నయోధ్యన్
జక్కని మకుటము దాలుచు, నెక్కుడి మాటలివి! చింత ♦ యేటికిఁ దల్లీ!

చ॥ విడివడి పోవ మానవులు ♦ వేడ్క వహించెదు కారయందె క్రో
త్తడితన మించుకేనియును ♦ తాఁకని నిన్ను గలంచు పంక్తికం
ఠుఁడు తనశీర్షముల్ భువిని ♦ దుల్లక కాచికొనున్ రఘూత్తముల్
వడి ననినుండి పాఱుదురు ♦ పాతక మిట్లును సిద్ధిఁ బొందునే? ౫౯౭

ఉ॥ అన్నుల మిన్న! యెల్లరము ♦ నక్కటికం బిసుమంత లేక నిన్
బన్నము నొంద జేయు బలు ♦ పాపులఁ గూల్పక మాశరీరముల్
మన్ననఁ గాచికొంచు నృప ♦ మాన్యుని ముందఱి కేగ నాతఁడున్
గ్రన్నన వింటితోఁ దన పు ♦ రమ్మునకున్ మరలం దలంచునే?

క॥ భరియింపరాని వెతలం, బరితాపము నొందనీక♦ప్రాభవమును మా
కిరవుగ నొసఁగిన నృపతికి, మరల న్నిన్నొసఁగకున్న ♦ మహితులమె కదా!

చ॥ వ్రతులగు మౌనివర్యులను ♦ వ్రచ్చి భుజించెడు దైత్యపాళి శో
ణిత పలలాంత్రరాసుల గు ♦ ణించి పిశాచ సృగాల గృధ్ర సం

తతులు గ్రసింపఁ జంపక స్ర♦ థా విలుపూని యయోధ్య కేగఁగన్
ప్రతిన యొనర్చు వానికొక ♦ పాటియె యీపని? రాజనందినీ! ౬౦౦

క|| అడఁగని పగవారి చెఱం, బడు నిను గైకొనక వదలి ♦ మరలితి మేనిన్
జడులును పెద్దలు పిన్నలు, నడరి హసింపరొకొ? తల్లి! యదియొక బ్రతుకే?

క|| క్రొత్తడియగు గృహిణి మదో, న్మత్తులు తాఁకుటకు మున్న ♦ నాశిలె నంచుం
జిత్తము మదిమది మరలిన, యుత్తము విక్రమ మదెంత♦యొప్పారునొకో?

క|| చెడితిం జెడితి నసువులం, చెడఁబాసితివేని నిశిత ♦ విశిఖమ్ములచేఁ
దొడిఁబడ సకల జగమ్ములఁ, బొడిపొడి సేసినను కొడిమె♦పోవునె తల్లీ? ౬౦౩

క|| మునుపే ముజ్జగములఁ గల, దనుజులఁ బరిమార్తు ననుచుఁ ♦ దలపఁడు నతఁడో
జనకజ! నీస్థితి యెఱిఁగిన, వెనుకను నెమ్మది వహించి♦నిఁగునె? తల్లీ! ౬౦౪

క|| ఊరక రాని యమర్షము, క్రూరుల జీవములమాత్ర ♦ గొని శాంతిలుచో
వేరేది దాని కావలితి?, ధారణియుం దివియుఁ గ్రుంగి ♦ తాఱి నమయదే?

క|| లయకాల వహ్నివోలెన్, రయమున భువనముల సాగ ♦ రముల నివుఱు చే
సియె పీడుఁగాక యడఁగునె? నియమిత రామాస్త్ర వితతి♦నీస్థితి విన్నన్. ౬౦౬

క|| దేవారాతులఁ ద్రుంచెను, కావలముల మాన్చి సుజన ♦ గణములఁ గాచెన్
ధీవరుల కొవఁగె సద్గతి, శ్రీవరలక్ష్మి యను కీర్తి♦చెలఁగఁ దలఁపవో? ౬౦౭

ఉ|| నీవలనన్ జగంబులు వి ♦ నిర్భల వృద్ధి భజించునమ్మ! కో
కావలినే గ్రహించి శ్రమ ♦ లంది యొకించుక కాల మిట్టులే
త్రోవుము లోక మంగళము ♦ తూకొని చేసెడు వారి పెక్కులౌ
హావడు లొందువారు భువి ♦ హాయికి నోర్చుట భావ్యమేకదా!

తే|| రోయఁదగు లోక కంటక♦రుధిర పూర, మునను ప్రేతభూతాదులు♦మునిఁగి క్రీడ
సేయ దాఁగిన సురలు హ♦ర్షించి పొంగు, సత్కృతిని నీవు చూడంగఁ♦జాలవేమి?

మ|| ప్రళయాంభోద తటిన్మహారుచుల ని ♦ ర్ఘాతంబులం బోలె రా
మ లసద్భీకర బాణరాజి దనుజ ♦ క్ష్మాపాల సైన్యంబులన్
దొలువం గాఱెడు నస్రపూరము పయో ♦ ధు ల్నిండి ఘూర్ణింప వీ
నుల విందారఁగ నుత్సహింపుము విన♦న్గొన్నాళ్లలోఁ దల్లిరో! ౬౧౦

చ|| కరువులు జాఱు నట్లసుర ♦ కాంతలు కద్పుల మోఁదికొంచు వం
దురుచును దుఃఖబాష్పములఁ ♦ దోఁగుచుఁ ద్రెంచిన తాలికూటువల్
గిరులయి మింటి నంటి పడి ♦ ఖేచర లోకవిమానముల్ చనన్
దెరువున కడ్డమై నిలువఁ ♦ దేఁకువఁ జూడఁగ నుత్సహింపుమా. ౬౧౧

తే|| నింగి కానఁబడక కప్పి♦నిండు భూత, ములును కంకగృధ్రము లగ్ర♦జలధి మునిఁగి
దైత్యవనితల బాష్ప న♦దంబులందు, స్నానమాడుట గాంచ ను♦త్సాహముంచు

ఉ॥ వీణల మించి గాత్రపులు ♦ వెల్వడ మర్దళముల్ ధ్వనింపఁగా
జాణలు వేల్పుసానులు ప ♦ సందుగ నాట్యము సేయుచోటులన్
ప్రీణన ముల్లసిల్లఁ గపి ♦ వీరులు వీరరవంబు సేయుచున్
శ్రేణిగ మోదనృత్యమున ♦ రేఁగుటఁ జూడఁగ నుత్సహింపుమా. ౬౧౩

చ॥ కొడిమలు మీఱ నైచ్యములు ♦ గూరిన క్రూరుల మేలు ప్రీలఁగా
వెడలెడు రక్తవాహినులు ♦ వే కొని పోయెడు కొండలట్టి పె
న్బీనుఁగుల కుప్పతిప్పలు సు ♦ పర్వులు వెక్కసమంది చూడఁగాఁ
గడలిని నిండి పొర్లుటను ♦ కాంచఁగ నీమది నుత్సహింపుమా. ౬౧౪

తే॥ అవనిజా! వహ్ని రామశ ♦ రానిలమున, నల త్రికూటమున్ కుంపటి ♦ యందు పేర్చి
క్రూర దానవు లనెడి బొ ♦ గ్గులను కాల్చ, లంకయను పైఁడి కరఁగుట ♦ లక్ష్మి! కనుమ

తే॥ భువన కంటకుఁడగు దశ ♦ ముఖుని తలల, వ్రాలి పుణ్యఫలముఁ బోలి ♦ పావన మగు
నీశరీరంబుఁ గాంచిన ♦ నేత్రపంక్తి, నొలిచి కాకులు దినఁ జూడ ♦ నుత్సహింపు.

చ॥ మును సురవైరి కోడి బిడె ♦ ముంగొని మాఱు మొగంబుగొన్న ది
గ్ఘన గజ వాల సన్నిధి ది ♦ గాలు మనంబడ రాఘవాంక మా
ర్గణములు పంక్తికంఠుని శి ♦ రంబులఁ ద్రెంచి తొలంగఁ ద్రోవఁగా
గుణవతివైన యోజనని! కోరికఁ గాంచఁగ నుత్సహింపుమా. ౬౧౭

ఉ॥ ఖంబు చెమర్చెనేమొ యని ♦ గాదిలి నప్పు డల్ల వీచు శ్వే
తాంబరముం బలెన్ వెలయు ♦ నట్టి ధ్వజావళి యొప్పు లంకలో
నంబుల వర్షముం గురియ ♦ నల్లరి సేయుచు లేచు భూతముల్
పంబిన ధూళిలో వికృత ♦ భంగుల నాడుట గాంచు మమ్మరో!

ఉ॥ నల్లని రేయి ద్రిమ్మరుల ♦ నల్లల వెల్గువలెల్ల వార్ధి జొ
బ్బిల్లి తలంబులేమి నటు ♦ వెన్కకు మళ్లుటయున్ సమస్తమున్
ద్రెళ్లు యుగాంత వేళలను ♦ తృప్తి వహింపని మృత్యుమూర్తియున్
గొల్లగ మెక్కి క్రక్కుటయుఁ ♦ గూరిమిఁ గాంచెదు గాక తల్లిరో!

ఉ॥ వేలుపుబోట్లవంటి యలి ♦ వేణులతో నసురాళి క్రీడలం
దేలు సుగంధ కల్పవన ♦ దీర్ఘికలన్ గపిమూఁక వక్ర లాం
గూలము లొండొకళ్ల వడిఁ ♦ గూరిచికొంచు వినోద లీలలం
బోల మునుంగుచుండుటలు ♦ పోఁడిమిఁ గాంచెదుగాక తల్లిరో! ౬౨౦

ఉ॥ పెక్కులు పల్కనేల? రఘు ♦ వీరుని దివ్య శరాళి లంకలో
నెక్కొను దైత్యకాయముల ♦ నిల్వక యవ్వల దుస్సి పోఁకు లె
య్యెక్కడ నుందు రయ్యచటి ♦ కేపున నేగఁ ద్రిలోకవాసులా
రక్కసి మూఁక లెల్ల సమ ♦ రంబునఁ గూలుటఁ గాంతు వమ్మరో! ౬౨౧

చ॥ ఒకనెల తీఱు లోపలనె♦యుమ్మలికంబు రవంతయేని పొం
దక సుఖియింతు వమ్మ త్వరి ♦ తంబున నేఁ జని రాముఁ గాంచు టే
యొక తడ వంత మీఁద నిట ♦ కొందఱగ రాఁ దరితీపు గల్గునే?
యొక క్షణమేని భారమగుఁ ♦ డొప్పరికించునె యింకఁ దల్లిరో! ౬౨౭

తే॥ ప్రాణ మున్నదని వచించు♦నంతెకాని, తన శరీరము తాఁకి మాఁ♦డని సుమములు
చివుళులును లేవు పేలాలు♦చెదరకుండు, తరువులును లేవు పల్లు లం♦తకును లేవు.

తే॥ తెలివి తేటలుండిన గదా♦తివురు వంత, మొగులు పిడుగులతోడఁ బైఁ♦దగులుచున్న
నైదుతలల సర్పము జో♦మ్మునంటి కఱచు, చున్న నెఱుకగల్గదు రాఘు♦వోర్విపతికి.

తే॥ చిలుకఁబడు దధికై వడిఁ♦గలఁతనొంది, యెడను తడఁబడు ప్రాణంబు♦లింద్రియములు
గందనగు పైత్యమును వియో♦గంపు వంత, యెంత కలదో లెక్కగ వచి♦యింపనగునె?

తే॥ ఇట్టి శోచనీయస్థితి♦నెనయు రాముఁ, డుండె సుఖముగ ననుమాట♦యొప్పకాదు
పలుకునవి యెల్లఁ గరతలా♦మలకముగను, చూపెదను చూచెదవు గాక♦సుగుణచరిత!

శా॥ తల్లీ! నిర్మలుఁడైన దాశరథి యు ♦ ద్దండుండు సుగ్రీవుఁడున్
డెల్లం బారఁగ నీదువార్త విని తృ ♦ ప్తిం జెందు మున్నే కపుల్
ప్రోల్లాసంబున వార్ధి దాఁటి నగరం ♦ బుం జుట్టి హుంకారముల్
మొల్లంబొప్ప నొనర్చుచుంట విని స ♦ మ్మోదింతు నిక్కంబుగన్ ౬౨౮

శా॥ దేవీ! లెక్కిడరాని వానరులు ప్రో ♦ దీప్తిన్ దగన్ రేపె లం
కావాటిన్ వడిఁజేర మధ్యమున నా ♦ కాశంబునం దాక్షస్సై
శ్రీనిష్ణాంబలె నా భుజంబుపయిం ♦ జెన్నారు రామ ప్రభున్
సేవింపారఁగఁ గాంతువుగాక కను లు ♦ న్మేషస్థితిం జెందఁగన్. ౬౨౯

ఉ॥ అంగదు మూఁపుమీఁద సుద ♦ యాద్రిపయిం గనుపట్టు బాల భా
నుం గనులీల లక్ష్మణుఁ గ ♦ నుఁగొని మోదము నొందెదమ్మ! పో
రుం గొన వానరేంద్ర నికు ♦ రుంబము నాయితమై చెలంగు నీ
యంగదయుం దొలంగు నరి ♦ యాటయు నీఁగు వియోగ ముం జెదున్.

ఉ॥ ఈమెయి నీవు పల్కఁ గదు ♦ పిచ్చిన మానసములోనె వచ్చి శ్రీ
రాముఁడు నీ చెఱన్ విడుగ ♦ రం బొనరింపఁడయేని నిందచే
రాముఁడె రావణుండగును ♦ రావణుఁడున్ మఱి రాముఁడే యగున్
శ్రీమహిళామతల్లి! కొఱ ♦ చెందెదవేల? వహింపు నెమ్మదిన్. ౬౩౦

తే॥ తొడరి మోదకరములు ని♦ర్దుష్టములును, పౌరుషోచితములు నగు♦పలుకు లాంజ
నేయుఁడాడఁగ నుప్పొంగి♦నెమ్మది గొని, యుర్వితనయ యిట్లని పల్కె♦నుత్సుకతను

—: సీత యానవాళ్లు తెలుపుట :—

శా॥ అయ్యా! యేగెదుగాక వైళముగ శ్రే♦యఃపాళి నిన్నొందఁగా
కయ్యైవిఘ్నములం దరించెదవుగా ♦ కార్యంబు శ్రీరాముతో
నెయ్యంబారఁగ నానవాల్లడరు వా ♦ నిం బ్రీతి వాక్రుచ్చు మా
యయ్యాదం దొలఁగించు భారమది నీ ♦ దే కాదె ప్రాభంజనీ! ౯౩౨

ఉ॥ ముందటఁ జిత్రకూటమున ♦ మ్రుక్కడికాకము వాఁడి ముక్కుతోఁ
డం దగ నాయురమ్మునఁ గ ♦ డంగి పుటుక్కునఁ గాటు సేయ నేఁ
గుందఁగఁ జూచి నెత్రుగని ♦ కూర్మివిభుం డొకపూరిఁ గొంచుఁ బ్రేఁ
పొందఁగ బ్రహ్మమంత్రమున ♦ నుగ్రత నేయుచుఁ గాకి భీతిమై ౯౩౩

చ॥ కొదుకుచు సత్యలోకమున ♦ కుం జని ధాతయు రొప్పి త్రోలనా
ప్రదరము వెంటనంట వడిఁ ♦ బాఱుచు శంభుని డాసి యాతఁడుం
బదరఁగ మల్లి దిక్పతుల♦వల్లను రక్షణ మొందలేక యె
య్యదియును దోఁప కేడ్చు నెడ ♦ నాత్మల వేల్పులు పిచ్చలించుచున్.

ఉ॥ ఇంద్రసుతా! జయంత! యిటు ♦ లేల చరించితి నీతిమాలి ని
న్నింద్రుఁడె కాఁడు సర్వభువ♦నేంద్రులు చేరియుఁ గావనేర్తురే?
రుంద్ర యశస్వి శ్రీరఘువ♦రున్ శరణంబని చేరు మా దయా
సాంద్రుఁడె కాచు నిన్ను రభ ♦ సంబునఁ బొమ్మని పల్కినాతఁడున్.

చ॥ భయమునఁ బాఱివచ్చి రఘు♦వర్య! భవత్పద పంకజంబులే
దయగల నంచు నే నభయ ♦ దానము వేఁడితి నన్ను సత్కృపా
శ్రయుఁడు క్షమించి వానిదగు♦చక్షు వొకండు గ్రహించి యస్త్రమా
పయి నుపసంహరించుటలు ♦ పావని! నాథునకున్ వచింపుమా.

తే॥ నీ చరణములే శరణముల్♦నిఖిలనాథ!, యనఁగ దోసఁగు మన్నించితి♦నవనియందు
కాక రెండుకన్నుల కొక్క♦కంటిపాప, యుండు నీవల్ల ననుటయు♦నొగి వచింపు.

తే॥ మ్రొక్కి సెలవంది కాకంబు♦పోయె దివికి, సురలు పువ్వుల వానలు♦కురిసినారు
దీని సౌమిత్రి సుంతయుఁ♦దెలియఁడయ్య, యింపు పలుకులతో వచి♦యింపు మిదియు.

ఉ॥ ప్రేముడిఁ బెంచు నాచిలుక ♦ పిల్లకు నెవ్వరిపేరు పెట్టుదున్
శ్రీ మహితా! యన న్నిగులఁ ♦ జిర్నగవాక మదీయమాతృ స
త్ప్రేమమయాత్మనామ కయిక ♦ పేరిడుమా యని నాఁడు పల్కు నా
యా మెత గూర్చు వాక్యముల ♦ యాదరమున్ వినిపింపు మారుతీ!

ఉ॥ ఇన్నియుఁ బల్కుమీఁద వచి ♦ యింపఁగఁ దగ్గది యొండు లేద యం
చెన్ని ధరించు వస్త్రమున ♦ నింపుగఁ గట్టిన మానికంబు పై

నున్న జగంబు క్రింది జగ ♦ మొప్పుగఁ గల్గిన కాంతి సంతతిన్
గ్రన్న జయించు దాని నటఁ ♦ గైకొనె మారుతియున్ భ్రమింపఁగన్.
తే॥ హనుమ యచ్చెరు పాటొంది ♦ యరయుచాఁగె, సప్తలోకంబుల తమంబు ♦ సమసిపోయె
రవియు భయపడ కీనగ ♦ రంబు చేరె, నేమి! యని దైత్యులును శంక ♦ నెనసినారు.
ఉ॥ శోకమునొందు జక్కవలు ♦ సొక్కుట వీడ ముడింగియున్న ప
ద్మాకరమందు పంకజము ♦ లన్ని యెలర్చెను సూర్యకాంతముల్
తూకొని నిప్పు లుమ్మెనవి ♦ దుఃఖముతో ముకుళించెఁ గల్వలున్
వే కనుపట్టె నయ్యెడ ర ♦ విప్రభఁ దోఁచెడు చిన్నె లన్నియున్.
చ॥ మృదువగు కేశపాశమును ♦ మేఘముపై గ్రహరాజుఁ బోలి య
మ్మదిత మనోజ్ఞసంహనన ♦ ముంబలె రాగమునొందె రాగ సం
పదగల రామపాదముల ♦ బాగున వెల్గు శిరోమణిం గుణా
స్పదయగు సీత చూపెఁ గనె ♦ వాయుసుతుండు ప్రమోదమందుచున్.
చ॥ వెదకుచు వచ్చి జీవముల ♦ విందుగ నిచ్చిన పుణ్యమూర్తి! నా
కిది యొక కంటిపాపవలె ♦ నింబుగ నుంచుఁ జిరంబు వల్వలో
విదులక చుట్టియుంచితి న ♦ భిజ్ఞగఁ గైకొను మంచు సత్యవా
క్ప్రదయగు సీతయిచ్చెఁ గడు ♦ భక్తిని గాడుపుపట్టి చేకొనెన్.
ఉ॥ కైకొని వస్త్రమందు దుసి ♦ క్రమ్మక యుండఁగ ముడ్చి పీడకోల్
కైకొని మ్రొక్కి ముమ్మఱు వ ♦ లంగొని చాఁగిలి లేచి దీవనల్
కైకొని ధీరవాక్యములు ♦ క్రమ్మఱఁ బల్కి మఱిన్ మఱిన్ నుతుల్
కైకొని యుబ్బి గంతులిడి ♦ గంధవహాత్మజుఁ డట్లు క్రమ్మఱెన్. ౩౮౫

౭. వనభంగ పటలము. (౬౦).

చ॥ వనమును గూర్చి యుత్తరపు ♦ వైఖునకుం జననెంచి దొడ్డ రూ
పును ధరియించినట్టి కపి ♦ ముఖ్యుఁడు స్వల్పకృతిం బొనర్చి యేఁ
జనుట వివేకలక్షణమె? చయ్యన నచ్చటికేగి రాఘవుం
డును ముదలించు వాని కొకఁ ♦ డున్ సరి పల్కమి దూత లక్షమే?
ఉ॥ ఏపునఁ గాలుసేతులనె ♦ యెల్లర నీచులఁ ద్రొక్కి చంపి లం
కాపురి వార్ధి నూఁకి జన ♦ కప్రభు పుత్త్రిని గొంచు రాఘవ
శ్రీపదపద్మ సన్నిధిని ♦ చేర్చనయేని తలంప నెవ్విధిన్
లోపములేని యుత్తమ గు ♦ ణుండగు దూతుఁడ నౌదు నిద్ధరన్.
ఉ॥ వంచకుఁడైన రావణుని ♦ వాలముచే దశ మస్తకంబులున్
మించిన చేతు లిర్వదియు ♦ మిడ్కఁగ నుక్కఁగఁ గట్టి కారలో

నంచిన వాఁడఁగాను గడు ♦ నుద్ధతిఁ దాఁకి జయింపలేదు మా
ప్రాంచిత రామ భానుజ ప ♦ రస్పరమైత్రి ఫలించు టెట్లగుఁ? ౬.౪౮
చ॥ బలయుతమైన యీ యసుర ♦ వర్గముఁ గాడ్పడఁజేసి కూల్చి దో
ర్బలు దశకంఠుఁ బట్టికొని ♦ క్రక్కున మోఁది యతండు కన్నులం
బులుకునఁ జూచుచుండ మయ ♦ పుత్త్రి శిరోజములం గదించి వె
ళ్వలగొన నీడ్చితెచ్చి చెఱ ♦ వేయుట దోసముఁ గూర్చుకార్యమే?
ఉ॥ వీరల హింస చేసి పృథి ♦ వీభరముల్ రఘువీరు భారముల్
దీఱ నడల్చి దూతకృతి ♦ తీరుగఁ బూర్తి యొనర్చుటే తగం
గా రియు మంచు భావమున ♦ గట్టి యొనర్చి దితి ప్రజాతతిన్
బోరొనరింప కేఁపు విధ ♦ ముం దలపోసె మనంబు లోపలన్. ౬౫౦

తే॥ కడఁగి యిప్పుడే యివ్వనిం ♦ గాఁపుపఱుతుఁ, బఱచు పెనుదోని చెవిఁబడఁ ♦ బలలభుజులు
కోపులై యెదిరింపంగఁ గూల్చువాఁడ, నిదియ తగిన యుక్తి యనుచు ♦ నెంచె మదిని.

చ॥ పొదివిన దైత్యులన్ మరలి ♦ పోవఁగ నీయక కూల్తుఁ గూలి కే
నెదురఁగ రావణాసురుఁడు ♦ నేఘన దుస్సహ సైన్యయుక్తుఁడై
కదలును వచ్చునేని కడు ♦ కావరముం జెడ మస్తకంబులన్
జిదురలు చేసి నాకసి న ♦ శింపఁగ నెమ్మదినంది మళ్లెదన్. ౬౫౧
చ॥ అని తలపోసి కేవగలి ♦ కాధ్యులు త్రిమ్మరు మేరుశైలమున్
జెనయు భుజార్గళుండు మను ♦ చెన్నుగఁ గొమ్మున భూమినెత్తు నా
ఘనకిటిఁ బోలి దొడ్డ యడ ♦ గైకొని వేలకువేలు కావలిన్
గనిన యశోకికా వనిఁ ♦ గంబులఁ గాళులఁ ద్రొక్కి ప్రీలఁగన్.

తే॥ విఱిగెఁ జీలెను వ్రాలెను ♦ పెల్లగిల్లె, నడఁగెఁ బొడియయ్యె మడఁగెఁ బె ♦ ల్లవిసె నెగసెఁ
జెదరె మండెను మాఁడెను ♦ ప్రిదిలెఁ ప్రేలె, బొగ్గులగుచు భిన్నాభిన్న ♦ ములుగ రాలె.
తే॥ కొన్ని వేళ్లతో లేచెను ♦ కొన్ని కాలెఁ, గొన్ని మొగుళులలోఁ జేరెఁ ♦ గొన్ని చీలె
కొన్ని మున్నీటఁబడిపోయెఁ ♦ గొన్ని తేలెఁ, గొన్ని దేవలోకముఁదాఁకెఁ ♦ గొన్ని తూలె.
తే॥ చుట్టి విసరిన మబ్బుల ♦ సుడిసి కొన్ని, దిక్కరుల కాకు మేఁతగా ♦ దిగువ వ్రాలె
నడుగు పట్టి వీచిన కొన్ని ♦ యాకసంబు, దాఁటి యింద్రు నందనమును ♦ త్రొమ్ము చేసె.
తే॥ వాలి యలలచే జలధి క ♦ ల్లోల మయ్యె, దైత్యుల విశాల సౌధముల్ ♦ ధరణిఁ గూలెఁ
గులగిరులు తుమురయ్యెను ♦ కుసుమచయము, పట్టు దప్పి దిక్కులతోడఁ ♦ బడి యడంగె.
చ॥ పొడవగు వేళ్లతో నడరు ♦ భూజములన్ వడిఁ బెల్లగించి త్రొ
క్కుడుపడి లోకముల్ ప్రిదుల ♦ గోఁటున వైచిన కొన్ని దిక్కరుల్
పిడులకు నందియీయఁ దమ ♦ బెట్టిదమౌ రదనాంతరంబునన్
బెడఁకుచు వ్రేలు తుండముల ♦ వీఁక ధరించిన రీతి భాసిలెన్. ౬౫౮

ఉ॥ క్రూరుసి పంక్తికంధరుని ♦ కోమల వృక్ష వనంబులోనివౌ
సౌరభ పుష్పసంచయము ♦ జక్కుల పర్వతమందు దేవతా
వారములుండు స్వర్గమునఁ ♦ బద్మదళాక్షులు మూఁగి వచ్చి యిం
పారఁగ నొళ్లునిండఁ జిదు ♦ మాడిరి యొండొరు మించి వేడుకన్.

తే॥ కనకరత్నమయంబులై ♦ క్రాలు తరులు, దిక్కులకు మించులం బోలెఁ ♦ దిరుగుచుండెఁ
గొన్ని సూర్యకాంతులఁ బోలెఁ ♦ గొన్ని నడుమఁ, దాఁకి రాలురిక్కలవలెఁ ♦ ధరణిఁ గూలె

తే॥ పక్షులునుజంటి యీఁగలు-భ్రమరములును, మొగ్గలుఁ జివుళ్లుఁ బోనెయుఁ-బూలుపంక్తు
కడలిఁ బడ మీలు మ్రింగుచు ♦ మిడిసియాడెఁ, బచ్చి చెట్లంతలోఁ బడఁ ♦ బచ్చడయ్యెఁ.

క॥ చెదరిన పూవులఁ దాలిచి, సదమల గంధంబు వీచి ♦ జలధులు వేల్పుల్
సుదతులతోఁ గ్రీడించు గ్ర, మదావన సరోవరముల ♦ మాడికి నొప్పెన్.

మ॥ హనుమంతుండు పెకల్చి వైచు మణిహే ♦ మాంచత్ప్రభా వేదులున్
ఘన భూజ వ్రజముం బొదళ్లు పెనుపి ♦ క్కంజొచ్చి నిండారుటన్
జనముల్ దాఁటియె పోవఁగాఁదగు వనం ♦ జాల్పంద్ర మవ్వేళఁ గా
లి నడన్ దాఁటఁగఁ దగ్గదయ్యె వనఁ జా ♦ లెన్ జూక్కి క్రొంబుగన్.

తే॥ గ్రీష్మభానుని పోలి య ♦ గ్రిమమకీచు, లడర మింటికి కెగసి యుర ♦ వడిని మరలు
తరులవలన దానవుల సౌ ♦ ధములు తునుకలయ్యె నశనిచేఁ గుధరంబు ♦ లవియునట్లు.

తే॥ హనుమ పెకలించి వైచిన ♦ యగచయంబు, క్రిక్కిఱిసి మబ్బువలెఁ గోఁపఁ ♦ గినుకచేత
రావణుని వనమెల్ల స్వ ♦ ర్గంబుచేరఁ, బంపు క్రియఁగోఁచె నప్పటి ♦ యుతని చెంగటి

ఉ॥ తేనియ తుంపరుల్ చెదర ♦ దిక్కులఁ బక్షులు రంపు సేయఁగా
సూనచయంబు సింధుకొన ♦ శోభిలు రత్నమయావనీజముల్
మానుగ మింటఁ గ్రిక్కిఱిసి ♦ మంజుల కాంతులు నిత్తులట్లు సిం
గాణులరీతిఁ గ్రాలి పడి ♦ గాఁ జనె మేటి విమానపంక్తినాన్. ౬౬౬

ఉ॥ వారణరాజముం బెనయు ♦ వాయుకుమారుఁడు చుట్టివైచు భూ
మీరుహముల్ సుడించుడుచు ♦ మింటను నిల్వక క్రమ్మఱిల్లి పెన్
వారిధి వ్రాలుచుండుటలు ♦ పట్టిలి తోయదముల్ పయోధిలో
నీరము నానఁగా దొడఁగి ♦ సింధుగ వ్రాలిన లీలఁ గన్పడెన్. ౬౬౭

ఉ॥ పాపముచేసి మధ్యమ భు ♦ వంబున జన్మముఁ గాంచి జ్ఞానులై
తాపములన్ జయించి విను ♦ తంబగు ముక్తిని పొందు వారి య
స్తోపము నూడ్చి పైకెగుర ♦ నేసిన కల్పకజాల మప్పు స్వ
ర్గోపరి భాగమేగి మఱి ♦ యొందెను మున్నటి స్వస్థలంబులన్. ౬౬౮

తే॥ గుఱిగ మణికుట్టిమంబులఁ ♦ గూలఁదన్ని, చదిపి చవికలు దీర్ఘికల్ ♦ చదునుచేసి
కుడ్యములను క్రీడాద్రులఁ ♦ గుదియ ♦ ద్రొక్కి, చేయు నుప్పొంగమునెల్లఁ ♦ జేసివైచె

తే॥ సాల సర్జకాదులఁ ద్రోచి♦ పూలతోడఁ, జంపకశ్రేణి గెలఁకి ప♦జ్జను గెంట్టి
చూత సాలంబు లూడ్చియ♦ చొప్పటఁ జెలఁగు, ఫలతరూత్కరం బెల్లను♦ పాడుచేసె.

ఉ॥ కంతు వసంతు మోహముల వి♦ కానము లెల్లఁ గృశింప నా హనూ
మంతుని పాదముల్ దగుల♦ మంజుల పుష్పవనంబు తారు మా
ఱెంతయు నొందఁ జందన మ♦ హీజము లింధనభంగిఁ గాల న
య్యంతర భాగమెల్లఁ బొగ♦ యై నివృత్తి కనెఁ గాడు పోలికన్. ౬౭౧

క॥ రొదసేయుచు భ్రమరంబులు, చెదరఁగ భూజములు గలసెఁ♦ జేడ్పడి మఱలన్
మదవతుల నృత్యశాలలు, కదిసిన విరి లతలతోడఁ♦ గాలెఁ బదడుగాన్. ౬౭౨

చ॥ తలరెడు పూలకొమ్మలు ల♦ తావితతుల్ పికముల్ రహించు క్రొం
దలిరులు గల్గు మావులును♦ తావులఁ జిమ్ముచు సల్లిబిల్లిగా
సలమిన తీఁగలం జెలఁగి♦ యందము చింద సమర్పు ద్వారముల్
పులుగులతోడ గుల్మముల♦ పుంజములున్ జెడె నుగ్గు నూచమై. ౬౭౩

ఉ॥ వైచు ప్రవాళ వల్లరులు♦ వారిదపంక్తిని మించు లట్లు చు
ట్టచిన కొండలంబడి ర♦ హించె మహీధ్రము వంటి యేనుఁగుల్
మోచిన మోము పట్టములఁ♦ బోలి హిరణ్మయ చూత శాఖకల్
వే చని యందు దంతులకు♦ వేడుక యోగిరమయ్యె నయ్యెడన్. ౬౭౪

తే॥ పిట్ట లఱచు శబ్దంబులు♦ వృక్షచయము, విఱుగు సవ్వడి మారుతి♦ పెలుచఁ జేయు
సింహనాదంబు పెనురొద♦ సిం దరించి, యండగోళంబులం దాఁటి♦ యవలి కేగె.

క॥ కూలెను పాటల కుజములు, వ్రీలెను వర గోఁగులును ద్వి♦ రేఫ రవంబుల్
మాలెను విహగ రుతంబులు, గ్రాలెను రోదనముగాఁగఁ♦ గడలిం బడుచున్. ౬౭౬

క॥ అడఁగెం బొడవగు మేడలు, మడఁగెం బందిళ్ల లతలు♦ మఱి వృక్షంబుల్
పడియెం గావేరీనదిఁ, జెడియెం గంగాజలంబు♦ చేరఁగఁ దేఁకుల్. ౬౭౭

క॥ అందము చిందెడు కొలఁకులు, చందనముం గలిపినట్లు♦ చెడెఁ బంకముగాఁ
బెందరువులు కూలిన యా, సందర మొక పూలతోఁట♦ చందంబయ్యెన్ ౬౭౮

ఉత్సా. సిందువార వారమేగి♦ చెదరి చేరె వారిధిన్
చందనములు ఱివ్వుమంచు జరగి♦ దైత్య సౌధముల్
పొందు మేల్కవాటములను♦ పొడిచి విఱిచె నుగ్గుగా
నందు రక్క సీంద్రు జడిసి♦ యఱచి పఱచి యేడ్వఁగన్. ౬౭౯

ఉ॥ ఆకసమందు మించి వెలుఁ♦ గారెడు రిక్కలఁ బోలి నందన
ప్రాకట వృక్ష పుష్పములు♦ పైఁబఱపై విలసిల్లెఁ దింత్రిణుల్
ప్రేకనఁ జుట్టి చుట్టి కడ♦ లిం దిగబాఁదఁగ శంఖ కీటముల్
వ్యాకులమంది ముత్తెముల♦ నయ్యెడ రాల్చుచుఁ బాఱె భీతిమై

తే॥ ఆకసమునకు వీచిన యందమైన, కొమ్మలం గల్గు మణిమయ ♦ కుజము లచటc
దివిరి దైత్య వినాశ దుర్దిన నిమిత్త, మైన యింద్రధనువు వోలెc ♦ గానcబడియె

మ॥ చతురంభోధులలోc బడక్ విసరు నా ♦ చాంపేయ వల్లీ తతుల్
చితుకంబాఱుచు రాలcచుండుటలు వీ ♦ క్షింపన్ దిగం జొచ్చుచున్
సిత జీమూత వితానముల్ జలములన్ ♦ సేవించు వారాశి నా
తతరీతిం బ్రసరించు భానుకర సం ♦ తానంబునా భాసిలెన్. ౬౮౨

తే॥ ప్రాకులం ద్రిప్పివైవc బు ♦ రంబునందు, లాయములు రథశాల లా ♦ లాన శాల
లాటవట్టులు పానశా ♦ లాదికములు, నేలమట్టంబులై పేరు ♦ మాలికూలె

తే॥ ప్రాకులును కొండలును తారు ♦ మాఱుcగాఁగ, వైచుటం జేసి బంగారు ♦ ప్రహరులెల్ల
జీలిపడ మేడలగ్గిచేc ♦ జిటిలి పెటిలి, యతల కుతలమై పురమెల్ల ♦ నడలు గుడిచె.

చ॥ అవనిజకై వగం బొగుల ♦ నట్లుడికించితి విష్ణు నాకు శా
త్రవులగు వారు నవ్వc బ్రమ ♦ దావన నాశము సేయుచుండ గా
రవమునc గాంచుచుంటివని ♦ క్రాcగి చిరాకు గడించునంచు దా
నవపతి కల్కి డాcకొనె న ♦ నన్ హరిణాంకుcడు డాcగెc బైదెసన్.

చ॥ కనకము రత్నరాజి రవి ♦ కాంతములున్ శశికాంతముల్ మణుల్
మునుకొని వెల్గు ప్రాcకులుగc ♦ బొల్చిన యావనవృక్ష సంతతుల్
హనుమcడు పెల్లగించి కకు ♦ బంతర దేశములం బడంగ వై
చిన కతనన్ జగంబు విల ♦ సిల్లెను పట్టపగంటి చాడ్పునన్. ౬౮౬

చ॥ మెకములు భీతిమైc జెదరి ♦ మిక్కిలి భ్రాంతి వహించి యార్చుచున్
గకవికచెంది ప్రాలె నెఱ ♦ కల్ గల పక్షులు కొన్ని పాఱెc గొ
న్ని కడలిc జెట్లతో నడcగె ♦ నిచ్చలు పాఱిన వెల్లc గొంత మే
రకుc జని తత్తఱిల్లి ధర ♦ వ్రాలెను పక్షములన్ విదుర్చుచున్. ౬౮౭

ఉ॥ పువ్వులతోడ భాసిలిన ♦ భూజములన్ హనుమంతుc డుగ్రుcడై
ఱివ్వన వీవ నత్తరుల ♦ వ్రేలెడు గూcడులతో విహంగముల్
త్రెవ్వక కొన్ని చేరినవి ♦ దివ్యపదంబు నతం డనుగ్రహం
బువ్వన నూనినేని మఱి ♦ యున్ దగనెట్టి ఫలంబు గూర్చునో! ౬౮౮

తే॥ రాక్షసులు కాచుచున్న యా ♦ రామమందు, శ్రమల నొంది తపించు భూ ♦ జాతయున్న
వృక్షమొండు మాత్రము నిల్చె ♦ విలయవేళ, విష్ణుcడు పరుండు వట వృక్ష ♦ విధముదోcప.

ఉ॥ మిక్కిలి కాంతిగల్గు నొక ♦ మేటి శిరోమణి భూమిజాత తా
నిక్కడ నానవాలుగc బ్రి ♦ యేశున కొందcగ నిచ్చి పంచె నిం
కొక్కటియేని భూషణము ♦ నొందద యంచుc దలంచి సాగరుం
డక్కటికంబుతోc బనిచె ♦ నన్నవిధంబునc దోcచె భానుcడున్ ౬౯౦

చ॥ ననిచిన యవ్వనం బటులు ♦ నాశముచేసి మరుత్సుతుండు పొ
ల్పున విలసిల్లె నొక్కఁడయిఁ ♦ బోఁడిగ లోకములెల్ల గాల్చి ని
ల్చిన జగదీశు పోలికను ♦ క్షీర మహోదధి మధ్యనొప్పు మం
థన నగముం బలెం బ్రళయ♦దాహ రుషానల నేత్రు కైవడిన్. ౬౯౧

శా॥ ఈలీలన్ వనమెల్లఁ గూల్చి హనుమం ♦ డేపారు సర్వేశ దై
త్యాలోలాక్షులు లేచి హా ♦యనుచు న ♦ త్యంతంబుగా నుల్లముల్
ప్రేలన్ మేరువువోలె నిల్చు నతనిన్ ♦ వీక్షించి వీఁడెవ్వఁడే?
బేలా! కాంచితి వేమి? యన్నఁ గని పృ ♦ థ్వీజాత దానిట్లనున్.

చ॥ కొంటెమెలు సేయు రక్కసులు ♦ కూడని మాయలు చేయుచుండ నా
చెడుగరులే యెఱుంగ మఱి ♦ చెప్ప సమర్థులు గాక యన్యులున్
నుడువ సమర్థులే? మునుపు ♦ నాలొకని దైత్యుఁడు జింకయై కనం
బడ వలదంచు లక్ష్మణుఁడు ♦ పల్కిన సత్యమ యంచుఁ గోరితిన్. ౬౯౩

చ॥ అని జనకాత్మజాత పలు ♦ కాడఁగ ఱొమ్ములు మోఁదుకొంచు న
వ్వనితలు నేలయుం జదలు ♦ వారిధులున్ వడఁకొందఁ బొఱఁగా
హనుమయుఁ జెంత స్వర్ణమయ ♦ మై పొలుపారెడు హోమ మండపం
బును గని దీనిఁ గూల్తునని ♦ పూనికఁ జేతులు సాఁచి పట్టుచున్. ౬౯౪

సీ॥ కనులఁ జూడను గాదు ♦ కాలువెట్టను గాదు, స్తంభముల్ లెక్కింపఁ♦దరముగాదు
నిసులంను కేకటుల్ ♦ నొంచుపు ధరణియుఁ, గడఁగి మోయుటయన్నఁ♦గానిపనియె
యాకాశమంటు హే♦మాద్రియు సిగ్గిలి, మదినొచ్చి పుండగు♦నూడ్కిఁ బెరిఁగి
క్రమముగా వర్ధిల్లి♦కళల సంపాదించి, దుగ్ధంబుఁబోలు కాం♦తులను గురియు

తే॥ శీతకరుఁ బోఁకు కందను ♦ చీఁకటులను, వారి తినుసట్లు పంశలి♦ బాహునాజ్ఞ
బ్రహ్మదేవుండె స్వయముగా ♦ బంగరు గొని, మానుగాఁ గట్టినట్టిదా♦మండపంబు.

సీ॥ స్తంభంబులెల్ల ర♦త్నమయంబులగుఁ జుట్టు, ప్రక్కలు ముత్తెము♦స్వర్ణ తార
మయములు వెనుక సం ♦ ప్రథిత మహోపల, మయములు రవికిని♦మండనములు
దశకంధరుఁడు మున్ను♦తారాద్రి నెత్తుట, విన్న మారుతి యది♦ వెలిత పఱుప
మేరువునే తోఁడి♦మీఁదికెత్తినయట్లు, దీర్ఘ బాహులతోడఁ♦దివిరి యెత్తి

తే॥ లంకపై వైచె మేడలు♦క్రుంకె నిప్పు, మిడుఁగుఱులు లేచి కొన్నింటి♦నడరి కాల్పెఁ
బూఁడి ప్రమ్గిరి కొందఱు♦పొలసుదిండ్లు, చెడుగరులకు వచ్చెడునవి♦ చెడుగులెకద!

సీ॥ అయ్యశోక వనంబు♦నరసి కాపాడెడు, షడ్మతుదైవతములు♦సాశ్రుపూర్ణ
ముఖపద్మములవస్త్ర♦ములతోఁ దుడిచికొంచు,దుఃఖాగ్ని ♦మనసులఁ♦ద్రొక్కి కాల్ప
వ్రీలి నెత్తురుకాఱు♦పెను దేహములతోడఁ, దడఁబడి పెనఁగు పా♦దములతోడఁ
బురమెల్ల గగ్గోలు♦పొరయ రోదించుచుఁ, బరుగున రావణా♦సురుని దఱిసి

తే॥ చరణములఁ బడి దానవ♦సార్వభౌమ! వనము నేఁడు కావఁగలేని♦వారమైతి
మొక్క పెనుకోఁతియా రామ♦మూడ్చివిఱువ, నగ్గిఁబడువస్త్రముంబోలె♦నవి సెఁద్రుటిని.

కవిరాజ. పలుకఁగఁ దేలికయౌ పని గాదిది ♦ పాద కరంబులతోఁ గసవున్
వలుసులు దూసియులే కఱునట్లు లొ ♦ సర్చి మహా క్రతు మండపమున్
బెలుచ నగల్చి వెసన్ విసరెం బుర ♦ వీథుల మేడలు కొన్నియ పో
నిలువ సమస్తము నాశమొనర్చె వ ♦ నేచర మర్కట! యిక్కరణిన్.

చ॥ అనవిని రావణుండు పరి ♦ హాసముతో నొకకోఁతి చొచ్చి యా
కనక తరూత్కరంబుఁ గడఁ ♦ కన్ విదళించి మఖాగ్నిశాల భూ
మిని పడఁద్రోచి గొప్ప కడి ♦ మి న్నగరంబును కాడుసేసెనే?
దనుజుల పేర్మిమెచ్చఁదగుఁ! దప్పి వెడంగులు సిట్టు లందురే? ౬౯౯

చ॥ అనవుడు వారలిట్లనిరి ♦ యయ్యరో! యాప్లవగంబు మేను మో
చిన ధరణి న్నుతింపఁదగు ♦ శిష్ట గణార్చితులౌ త్రిమూర్తులం
దున నొకఁ డీతఁడన్న నది ♦ తోఁచును న్యూనతగాఁగ నక్కపీం
ద్రుని కడిమిన్ గణింప నెవ ♦ రుం బనియేమిఁకఁ గాంచ నేర్పరున్.

ఉ॥ ధారణి చీలి యానెఱియ ♦ దండడిఁ గంధి జలంబు నిండ ది
గ్వారణముల్ సురాసురులు ♦ కక్కిరిబిక్కిరిగాఁగ దైత్యనా
రీ రమణీయ గర్భములు ♦ వ్రీలఁగ రోదసి బూరటిల్ల న
మ్మారుతి హుంకరించె దశ ♦ మస్తకుతో నటు వారు పల్కఁ దో.

౬ కింకరవధ పటలము. (౬౧)

చ॥ కులగిరి గహ్వరంబున న ♦ ఘోర మహాశని పాత ఘోషమున్
జలనిధి ఘోషణంబు శివ ♦ చాప విదారణ భీషణారవం
బిల సరిపోలు నారుతి స ♦ మిద్ధ మణీమయ శీర్షక స్ఫుటా
కలిత దశాస్య మస్త దశ ♦ కం బదరన్ వడిఁ జొచ్చె వీనులన్. ౭౦౨

మ॥ చిఱునవ్వించుక యోర్వలేమి యలమం ♦ జింతించి యాకోఁతి యం
బరవీథిన్ మఱి యెట్టులుం జనని తే ♦ వన్ జుట్టుముట్టాడి దు
ర్భరమౌ పోరొనరించి యేని త్వరగా ♦ బంధించి తోతెండు పొం
డురవౌ సేనలతోడ నంచు సుభట ♦ వ్యూహాంబులం బంపఁగన్. ౭౦౩

తే॥ శూల కుంత తోమర భిందిపాల ముసల, పరశు పట్టిసాదులఁ దాల్చి♦కఱకుసోఁకు
మూఁక లయకాలమున వార్ధి♦పొంగి లేచు, కరణి నడరి బయలు దేఱెఁ♦గపిని పట్ట

సీ॥ ఆలంబుపేరు వి ♦ న్నంత మద్యముకంటె, నతిశయోత్సాహంబు♦నందువారు
అడవికంటెను పరస్పైన వారలు పెను, ఘోషచే జడధికి♦గొప్పవారు

గిరికంటె నున్నత♦వర దృఢ దేహులు, యశమున నాకస♦మందువారు
దేవదానవకీర్తి ♦ దీధితులను తమ, హుంకృతిచేత నే ♦ యూద్చువారు
తే॥ స్వల్పవైరంబు నిర్లక్ష్య ♦ సరణి విడుట, యాపదలకు మూలంబని ♦ యరసి దాని
కోఁతివలనఁ దీర్చుకొనఁగఁ♦గుందిసిగ్గు, పడినహృదయంబు గలవారు♦ బాహుబలులు.
సీ॥ కత్తులు గలవారు ♦ కవచముల్ గలవారు, వీరచిహ్నంబుల ♦ వెలయువారు
వసుధ నడఁగ ద్రొక్కు ♦ పదములు గలవారు, కడలనంటెడు కేలు♦గలుగువారు
గగనమంటెడు మస్త ♦ కంబులు గలవారు, కాళ్లతో నులలను ♦ గడపువారు
పిడుగులకంటెను ♦ పెడబొబ్బ గలవారు, వారి కరుల ద్రుంగు ♦ నోరివారు
తే॥ క్రొన్నెలంబోలు కోఱలఁ ♦ గొఱలువారు, గుణకిణాంకిత భుజులు మా♦ర్గణ నివిద్ధ
పాద పాణి వక్షఃస్థల ♦ భాగులైన, వారు దివ్యభూషణముల ♦ నఱలువారు.

ఉ॥ కేల గదాది సాధన వి ♦ కీర్ణ మయూఖము లెండగాయఁగా
లీలఁ బోవలేమి నద ♦ లించుచు బొండని త్రోవ ముందు వా
రేలొకొ సాగరంచు బయ ♦ లీదుచు నూకుచుఁ ద్రుల్లి నేలకున్
వ్రాలుచు నల్లు వ్రాలుటకు ♦ నైనము లేక శ్రమంబు నొందుచున్.

ఉ॥ సాధనముల్ తటిత్తులుగఁ ♦ జాపము లింద్ర శరాసనాలుగాఁ
గ్రోధముతోడి యూరుపులె ♦ ఘోరమరుత్తుగ మేనులెల్ల ధా
రాధర పంక్తిగా నడరి ♦ రక్కసి మూఁక యుగాంతకాల వా
ర్ధోధరపాళి తారసిలు ♦ తోయమునం జనుదెంచె నత్తరిన్ ౨౦౮

చ॥ సురుచిర భూజయుక్తమయి ♦ శోభిలు నివ్వని నెల్లఁగూల్చి భా
స్వర మఖ మండపంబు నొగిఁ ♦ బగ్గము పాడుగఁ జేసినట్టి దొం
టరియగు కోఁతియట్టె! విక ♦ టంబుగ నున్నది నిర్జరారి వి
స్ఫురదురు శౌర్యముల్ మన య ♦ శోవిభవంబులు గాల్పనే యిఁకన్?

మ॥ అని అంపిల్లుచు నాయుధ ధ్వనులు శిం ♦ జారావముల్ సింహ గ
ర్జనముల్ దంతుల ఘీంకృతుల్ తురగ హే ♦ షల్ గూడి పెన్ మ్రోఁతయై
ఘనరన్ దర్జన భర్జనంబులఁ గపిం ♦ దట్టుండు కొట్టుండు చం
పిన జంపుండని యార్చి రయ్యమర వి ♦ ద్వేషుల్ వడిం బోవుచున్

సీ॥ వీథులలోఁ జన♦వెరవింతగానక, యెగసి ఖింటనె పోవ♦నెగడువారు
బొమలు విండులు నొక్క♦పోలికగా వంచి, పొగయు నిట్టూర్పులు♦పుచ్చువారు
ఒకరి నొండొకరు త్రో♦చికొని ముందేగుట, గని వీరుఁడే! యని♦కనలువారు
లంకలోఁ దమకుఁ బో♦లఁగఁ జాలినంత తా, వమర దే యని పెద్ద♦యఱచువారు
తే॥ తూణములనుండియమ్ములఁ♦దూయువారు, నొఱలనుండిక త్తులనూడఁ♦బెఱుకువారు
నెఱసి చోటింతలేక క్రి♦క్కిఱియువారు, కుటిలదంతముల్ పటపట♦గొఱుకువారు.

సీ॥ అల్పతపస్వులౌ ♦ నవారులు ♦ పోరఁగ లేక, పాఱుచో నవ్విన ♦ వారువీరు
ధనదుని కీర్తి పైఁ ♦ దెఱవేయ నలకను, పాడొనరించిన ♦ వారు వీరు
దురము సేయుట లేక ♦ దురద పుట్టిన కేలఁ, బోరుగోరి తిరుగు♦వారు వీరు
పూర్వయుద్ధంబుల♦ముక్కాఁకలం దీఱి, వీరమద్దెలఁ గొన్న♦వారువీరు
తే॥ కొండలం బలెఁ జలియింప♦కుండువారు, సమరదోహలులు కృతాస్త్రు♦లమరవరులఁ
బెక్కుసారులు గెల్చిన♦వీరవరులు, పుడమి నడుము వెఱుగునట్లు♦నడచినారు.
ఉ॥ కొండలఁ ద్రోయఁ డన్న వడిఁ♦గుంభిని గూలఁగ ద్రొక్కఁ డన్న మా
ర్తాండుని నేల కీడ్వఁడన♦నబ్ధములన్ వెసఁ బిండుఁడన్న నొ
క్కండొకఁడే సమర్థుఁడయి♦ప్రాలు మరుత్సమ వేగవంతు లు
ద్దండబలుల్ రణక్రమ వి♦దగ్ధులు సాహస శౌర్యధుర్యులున్ ౨౧౩
ఉ॥ పాదరజమ్ము స్వర్గపుర ♦ వాసుల కన్నులఁగప్ప శౌర్యమే
మోదము తోడ రూపమును ♦ పొందిన చందము దోఁప మత్త నా
గాదన సంఘముం బలెను ♦ వ్యాఘ్ర కదంబమువోలె నీల మే
ఘోదయ మట్లు దైత్యులు మ ♦ హోద్ధతి నేగిరి బాణవేగులై. ౨౧౪
చ॥ మిడుఁగులు కన్నులం దురల ♦ మిక్కిలి యూర్పుల ధూమమొప్పఁగాఁ
దొడిబడు నాయుధంబుల ద్యు ♦ తుల్ మిఱుమిట్లు గొలుప రక్కసుల్
పిడుగులఁ బోలె నార్చుచును ♦ వీఁకున నుబ్బుచు గంతులేయుచున్
-సుడిసిరి చూచి పాడగు న ♦ శోక వనంబు మానంబు కాడ్పడన్. ౨౧౫
ఉ॥ భానుఁడు పూర్వచర్య మదిఁ ♦ బాఱఁగ భీతిని మింటఁదాఱఁగా
మానుగ నేఁగి వర్ధిలిన ♦ మారుతి కాహళ తూర్య శంఖ భే
రీ నినదంబు మ్రోఁగ విని ♦ నేఁగి నిశాచరు లాజి సేయఁగాఁ
బూనిక వచ్చుచుండుటలు ♦ పోలునటంచుఁ దలంచి మోదిలెన్.
చ॥ వనమును గూల్చుటే తగిన ♦ పద్ధతియంచుఁ దలంచె మున్న యా
పని యనుకూల మార్గమును ♦ పట్టుటచేఁ బెనుపోరు గల్గె నీ
దనుజుల తోడ నియ్యెడయె ♦ తాఁ దలపోసిన వైనమాట నె
మ్మనమున మోదమంది హను ♦ మంతుఁడు వారలఁ గాంచెఁ దేఁకువన్.
చ॥ పగటనె రాత్రి తోఁచు చెలు ♦ వంబగు నల్లని సోఁకుమూఁక యా
పగతుఁడు వీఁడె వీఁడె వెసఁ ♦ బట్టుఁడు కొట్టుఁడు కట్టుఁడంచుఁ దెం
పుగ నటుచొచ్చి వాఁడిమియుఁ ♦ బోఁడిమి వెల్గడ నార్చిరెల్ల భూ
గగన ధరాధరంబులును ♦ కంధియు లంకయు బిట్టు కంపిలన్. ౨౧౮
సీ॥ జలనిధి బెడిదంపు ♦ టులివు కీడ్పడ శంఖ, భేరీరవములు గా ♦ వించువారు
గుహలఁబోలిన నోళ్లు♦రహిఁ దెఱచినవారు, పొగ రేఁగు చూపుల♦నెగడువారు

భుజగేంద్రు మెడయును♦భుజము లొక్కటిగాఁగ, నడఁగంగఁ బుడమిపై ♦నడచువారు
బహువిధాయుధ మహా♦ప్రభలు వంశాటవి, నలమినగతి వెల్గ♦నడరువారుఁ
తే॥ గని మసంగి యాలము సేయుఁ♦గడఁగినంతఁ, బావనియు నొక పెనుపాద♦పంబు మిత్తు
పగిదిఁగని కేలఁదాలిచి♦వాలి కదలి, నడిమి మందరమన వారి♦నడుమ నిల్చె.

ఉ॥ కొందఱు వ్రీల్చునట్టి పిడు♦గుల్ సహితంబు వడంకు పోటు దో
ర్దండ బలంబునం దరు వ♦రంబున రక్కసి పిండుఁ డాఁపఁగాఁ
గొందఱు వాఁగులం బడెన ♦ కొందలఁబోలు భుజాలు వ్రచ్చి యం
దుండి మహాస్ర ధార లిల ♦ నోడిగిలం బడి చచ్చి రుక్కఱన్. ౨౧౦

తే॥ కొందఱతనిపైఁగ్రిందువ్వుల్ ♦ గూర వినక, పొట్టలవియఁబడ్డనుపోవ♦ మొగము లగలఁ
ద్రొక్కఁబడి రక్తమాంసముల్ ♦ దుక్కిగాఁగఁ, జనిసి రూపఱఁ జచ్చి రా♦స్థలమునంద

చ॥ ఒరపిడిచేత రాఁజిన మ♦హోజ్జ్వలఁల వహ్ని యెసంగి వెండ్రుకల్
చుఱచుఱఁ జూఁడఁ గంతుఱులు ♦ సుక్కఁగ గన్నులుపోవ మూఁపులున్
విరవిరపోవ వీఁపులును ♦ వ్రీలఁగ నిట్టటు పోవలేక దు
ర్భరమగు తాపముం బొరసి ♦ పాసిరి కొందఱు జీవితంబులన్. ౨౧౧

క॥ అక్కఁనఁ దన్నఁగ నెత్తురు, గ్రక్కుచు ఱొమ్ములును పగుల♦ బాహులు విఱుగన్
సుక్కుచు విలవిల పోవుచు, ముక్కుచుఁ గొందఱు సలంగి ♦ ముగిసిరి పోరుల్.

ఉ॥ పొందుగఁ జెంతఁ గానఁబడు ♦ భూధ్రము మీఁదికినైన నందుచేఁ
గొందఱు నాకలోకమునఁ♦గొందఱు గుహ్యక పట్టనంబునన్
గొందఱు వ్యోమమునందు మఱి ♦ కొందఱు సందరమందుచేర యో
చందమునన్ నివర్తిలఁగఁ♦జాలక యుగ్గిడి పోవు ప్రోవలన్. ౨౧౨

తే॥ కాళ్లుచేతులు విఱిచి య♦క్కడనె వైచి ♦ తొక్కులాడిన కొందఱ♦రీతిఁబడిరి
తివిరి వాలంబునన్ జుట్టి♦త్రిప్పివిడువ, గిరిగిరం దిర్గి రుద్దిఁ గిం♦కరములట్లు.

ఉ॥ కొందఱు ఖడ్గముల్ విఱిగెఁ ♦ గొందఱు చాపగదాదు లక్కటన్
గొందఱు బాహువుల్ తెగియెఁ♦గొందఱు మోములు నల్లి రూపఱన్
గొందఱు పండ్లురాలె మఱి ♦ కొందఱు కాళులుపోయె మధ్యముల్
కొందఱు కుక్కి నెమ్ములకు ♦ కొందఱకుం బొడియయ్యె నయ్యెడన్.

ఉ॥ కొందఱు చర్మముల్ చినిఁగెఁ ♦ గొందఱు వర్మము శీర్ణమయ్యె వే
కొందఱు మేలు చీలె మఱి ♦ కొందఱు దేహము లయ్యె నజ్జుగాఁ
గొందఱు మస్తముల్ చిదిసెఁ♦గొందఱు కాయము లయ్యె బజ్జిగాఁ
గొందఱు గాత్రముల్ మునిఁగెఁ ♦ గ్రొత్తగ నొత్తిలి పాఱు నెత్తుటన్.

సీ॥ కాలఁ గొందఱు రాఁచి♦కేలఁ గొందఱఁ దాఁచి, వాలుతోఁ గొందఱు♦వైచి వైచి
చూపులఁ గొందఱఁ♦దాఁపులఁ గొందఱు, రాపులఁ గొందఱు♦వ్రాల్చి వ్రాల్చి

లాగి కొందఱఁబట్టి♦మేఁగి కొందఱఁ జుట్టి, సాఁగి కొందఱఁ గిట్టి♦చదిపి చదిపి
తరువులఁ గొందఱఁ♦ఖురువులఁ గొందఱ, బరువుల గొందఱ♦నుఱిచి నుఱిచి
తే॥ వారి యాయుధముల తోడ♦వ్రచ్చివ్రచ్చి, పేర్చి యొకనిపై నొక్కని♦వ్రేసివ్రేసి
కఱచి విఱిచి నులిమి యొక్కి♦చఱచి చెఱచి, తిరిగి పఱచి రాకాసులఁ♦దివిరి చంపె.

ఉ॥ తాఁకినవారిఁ దాఁకుచును♦దాసిన సోఁకులు మూఁక దాయుచున్
నూఁకిన వారి నూఁకుచును ♦ నూర్చిన వారలఁబట్టి నూర్చుచున్
దూఁకిన మీఁద దూఁకుచును♦తూల్చిన దైత్యులఁ గొట్టి తూల్చుచున్.
గాఁక నెదుర్చు వారలను ♦ గాఁక నెదుర్చుచుఁ గూలఁద్రోయుచున్.

చ॥ మఱిఁగిసఁ జంపు దాఁకినను ♦ మానకచంపుఁ దలంపఁ జంపఁ గ
న్నుఱిమినఁ జంపుఁ బైకెగుర ♦ నుప్పరమందును చంపుఁ బాఱినన్
దొలఁగినఁ జంపుఁ దూకొనిన ♦ తోడన చంపు వియత్పథంబునన్
దఱిమినఁ జంపుఁ దార్కొని యు ♦ దగ్ర మహోగ్రహ భీషణాకృతిన్.

చ॥ మెదడును క్రొవ్వు మాంసము స ♦ మిద్ధర రక్తముతోడఁ బంకమై
నదులుగఁ బాఱి యెల్లెడఁ గ ♦ నంబడ లంకయె వాయుసూను బె
ట్టిదమగు పోటుచే వెత ఘ ♦ టింపఁగ రక్తము బొళ్కు బొళ్కు మం
చదవద గ్రక్కుచున్నదన ♦ నయ్యె రణస్థితియో యఘోరమై. ౨౩౧

చ॥ కరములఁబట్టి వాలమునఁ ♦ గట్టి పదంబులఁ దన్ని నెవ్వడిన్
దరువుల పైకి వ్రేయఁ బడి ♦ దైత్యులు గానుగ లోని యించు వై
ఖరిని నలంగి పాలవలెఁ♦గాఱిన రక్తము పాఱి సంద్రమున్
గరగను నించి చుట్టు నధి ♦ కంబుగఁ బొంగె సురాళి మోదిలన్.

చ॥ అసురుల దేహముల్ విసర ♦ నంబరవీథిని పోయి టెక్కెముల్
కొనరి చలించు మేడలును ♦ గోపురముల్ వర మండపంబులున్
వసుమతిఁ గూలఁజేసినవి ♦ వారణరాజములన్ నలంచె ర
క్కసులను మోఁదె గుఱ్ఱముల ♦ గాత్రములన్ ధరఁజేర్చె నజ్జగన్.

ఉ॥ కొందఱు వారియిండ్లఁ బడఁ ♦ గూల్చెను వారల మేను దూదిగాఁ
గొందఱ వైచె వారి యెల ♦ కూనల వారి నరాజి త్రుంపగాఁ
గొందఱనిచ్చె భార్యలకుఁ ♦ గ్రొత్తగఁ బెండిలియైన వారికిన్
గొందఱనిచ్చె దారకులు ♦ గోరిన వారికి వారి తండ్రులన్ ౨౩౪

చ॥ అరుగులమీఁద నిండ్లపయి ♦ నంగడి వీథులయందు దొడ్లలో
దొరువులయందు వాడల చ ♦ తుష్కముల న్నదుత్రోవలందు నం
బరమున నూతులన్ దిగుడు ♦ బావులఁ బెద్ద జలాశయంబులన్
శరనిధియందు నిండె శవ ♦ సంచయ మా హనుమందు వైవఁగన్.

ఉ॥ వాలి మరుత్సుతుం డొకఁడె ♦ వారక దైత్యులఁ గూల్చుచుండఁగాఁ
గాలుఁడు వాని కింకరులు ♦ కాళులు నొవ్వఁగ మోచు ప్రాణముల్
నేలను వాయు మేఘ రజ ♦ నీకర భాస్కర మండలంబులం
దోలిని నిండె వ్యోమచరు ♦ లోరకు నోర కొమంగుచుండఁగన్. ౨౩౬

తే॥ బవర మిట్లుసాఁగఁగ మతి♦భ్రష్టులైన, వారివై ఖరిఁ గోపించి♦వారిదముల
భాతిఁబర్విన రాక్షస♦వరుల నడుమ, మారుతసుతుండు మార్తండు♦మాడ్కినుండె.

తే॥ వ్యాపనము ఘూర్ణనంబు రా-వంబునల్లఁ,దనముతో మీలఁబోలఁకుం-తములు మెఱయు
కతనఁ గర్బురుల్ సంద్రంబు♦కరణినుండ, నడుమ మందరమట్లు వా♦నరుఁడు తిరిగె.

తే॥ దండఁజేరి చచ్చిన సోఁకు♦పిండు నడుమ, నమృతముంగొనివచ్చుచో♦నహులువెంట
నంట నడుమనుండిన విహ♦గాధినాథుఁ, బోలియుండె నభస్వత్సు♦పుత్త్రుఁ డచట.

క॥ దనుజ సముదయము లిభముల, యనువున వర్తిల్లి నడువ♦నాఁడు తద్వా
రణ మస్తక మస్తిష్కం, బును గొను కేసరి కిశోర♦ముఖ్యత నొప్పెన్. ౨౪౦

సీ॥ వైచుటచేతను ♦ వీచుటచేతను, కొట్టుటచేతను ♦ కోఁతచేతఁ
గ్రుచ్చుటచేతను ♦ వ్రచ్చుటచేతను, పొడుచుట కతమున ♦ విడుచుకతన
నఱుముట వలనను ♦ తఱుముట వలనను, తోలుచుటవలన మే ♦ లోలుచువలనఁ
జీల్చుటం జేసియు ♦ వ్రాల్చుటంజేసియుఁ, బట్టుకతమ్మున ♦ నెట్టుకతనఁ
తే॥ గలిగినట్టి హనుమ మేని♦గాయములకుఁ, గొలతయిడరాదు లెక్కింప♦నలవికాదు
రాక్షసులుసేయు భీకరా♦రవముకంటెఁ,బొగడు వేల్పుల రవములె♦మిగులనెగడె.

తే॥ ఆయుధంబులు పెక్కుకో♦ల్లైనవాని, వలనఁ గల్గిన పెనుగాయ♦ములును వేలు
పులునతత్కాంతలునుచల్లు♦పుష్పములును,భేదమెనయనియనువున♦వెలయుచుండె.

క॥ తిరుగుటచే నెగయుటచే, నఱకుటచే దూఁకుకతన ♦ నసురుల పొలియన్
యిరిగాని హనుమ శ్రమలం, బెరసియుఁ జెమరుపఁడు నూర్పు♦విడువఁడు పెలుచన్.

ఉ॥ రాక్షసరాజు పంపఁగ గ♦రాదుల పోలికఁ బోరికేగు వా
రీక్షణ సేయుచుండ నశి ♦ యించుట గానము నిన్నదాఁక నా
దక్షులు చచ్చి స్వర్గము ము ♦ దంబునఁ జెందిరి కాని యోడ రా
నిక్షితి వారిఁబోలు మగ ♦ లెవ్వరు కల్గరు కల్గరారయన్ ౨౪౪

మ॥ అనికిన్ వచ్చినవార లీల్గుట వనా ♦ ధ్యక్షుల్ పరీక్షించి ముం
దునకుం జంకినకాళ్లు వెన్కకు దడం ♦ ద్రోవంగ నీడ్వంగఁ గ్ర
న్నన రక్షఃకుణపాళిఁ ద్రొక్కికొనుచున్ ♦ జన్నెంచి దైత్యేశ్వరుం
గని భీతిం బలుకాడకే వణఁకునన్ ♦ గైసన్నతోఁ దెల్పఁగన్. ౨౪౫

శా॥ వారల్ పొందిన భీతియే తనకుఁదె ♦ ల్పన్ సర్వవృత్తాంతమున్
ఘోరప్రేక్షణుఁడై కనుంగవల న ♦ గ్నుల్ గ్రక్క దైత్యేంద్రుఁ డా

పోరం గింకరవర్గముల్ మడిసెనా? ♦ పోరాటముల్ మానెనా?
పాఱంజొచ్చెన? యేమి యయ్యె? ననుచుం♦బ్రశ్నింప నవ్వారలున్. ౨౪౭

తే॥ వారు బెగ్గిలి పాఱిన♦వారుగారు, ప్లవగ మని యలక్ష్యంబున ♦ వదలలేదు
తెలిసి కల్ల సాక్ష్యంబిచ్చు♦ములుచగాలము, మాడ్కిఁ గోఁతిచే వారలు♦మాఁడిరనుడు.

మ॥ తనయాజ్ఞన్ దరిఁజేరి సేవ లను వాం ♦ దం జేయు దిక్పాలురం
గని లజ్జించుచు రావణుండు వన ర ♦ క్షాదక్షులం గాంచి కూ
రిన చందం బిది యంచెఱుంగక విచా ♦ రింపంగఁ బ్రాల్మాలి నో
రను వెల్వడ్డదియెల్లఁ బేలెదరె దు♦ర్వాగ్భ్రాంతాత్ములై ముంగలన్. ౨౪౮

తే॥ అనుడు వా రడలున నేమి♦యనఁగలేక, వడఁకుచు న్నిల్వ గోఁతి యీ♦పగిదిచేతఁ
మీరు విన్నదా? కన్నదా? నీరునమల, కంతయును దెల్పఁగోరెద♦ననఁగ వారు.

ఉ॥ ప్రక్క గొదింగి నిల్చి భయ ♦ భావమునం దనువుల్ కుదించి నేఁ
డక్కట! నేమిసెప్ప దను ♦ జాధిప! కోఁతియొకండె కింకరుల్
ద్రిక్కనకుండఁ జూవ నొక ♦ వృక్షముఁగైకొని త్రిప్పి త్రిప్పి య
మ్మక్క! సమస్తముం జదిపి♦యచ్చట నున్నది పాఱ దెయ్యెడన్. ౨౫౦

—: జంబుమాలి వధ పటలము :—

మ॥ వనపాలోక్త విధానము న్వినిన దే ♦ వద్వేషి కోపించి క్ర
న్నన బిట్టూర్చుచు జంబుమాలిఁ గని సై ♦ న్యశ్రేణితో నేగి కో
తిని గర్వం బడఁగించి పట్టుకొని వే ♦ తెమ్మిట్లు నాప్రోలకున్
ఘనమోదంబును నాకుఁ గూర్పు మిది నీ ♦ కార్యంబనన్ దైత్యుఁడున్

ఆ॥ మ్రొక్కి లెక్కలేని♦మూఁకలో నన్ను నీ, పనికిఁ దేర్చిపంపు♦భాగ్యమొదవె
ధన్యుఁడై తి ననుచు♦దైత్యు కోపంబెఱూ, పొం దెననఁగ నేగె♦యుద్ధమునకు

మ॥ తనసైన్యంబులతోడఁ బంక్తిముఖుఁ డొం ♦ దం బంపు సైన్యంబుతో
జనకుండంపిన సేనతోడను సుహృ ♦ త్సైన్యంబుతో నేగి నేఁ
డని సేయంగల భాగ్యమబ్బె నను న ♦ త్యానందవృత్తిం బ్రహ
స్తుని పుత్త్రుండగు జంబుమాలి నడచెన్♦దోషాటు లగ్గింపఁగన్ ౨౫౩

సీ॥ పిడుగుల మొగుళులఁ♦బెనచి ప్రాణముపోసి, నిలిపెనా నొప్పు న♦నేకపములు
ఉఱుములు మెఱుములు♦నొక్కటిగాఁ జేయఁ, బరఁగిన వననొప్పు♦నరదములును
గాలిని నాలుగు♦కాళ్లుగా నొనరించి, ధరనిల్పె నన నొప్పు♦హరి చయములు
వజ్రంబు నినుము హృ♦ద్వపువులు గాఁగొని, క్రాలిన వననొప్పు♦కాల్బలములు

తే॥ గుహలనుండి పులులు వచ్చు♦కొంపుదోఁప, ఖడ్గ శర శరాసన తూణ♦ఘనగదాది
సాధనంబులు మెఱయంగ♦జంబుమాలి, సైన్యములు సాగె మేదినీ♦చక్రమదర.

తే॥ చిఱుకటారు లీఁటియలును♦సిడము లంబు, దంబు నొరయంగనైన రం♦ధ్రములనుండి
కాఱు జలములు రజముతోఁ♦గలిసిస్రవము, లందుగాఱుర క్తంబునా♦నతిశయిల్లె.
తే॥ నేమిరవములు శంఖధ్వ♦నియుఁ దురంగ, హేషణములువివిధ వాద్య♦ఘోషణములు
కింకిణుల విండ్లరుతులు ఘీం♦కృతులు మిగులఁ, గలిసివేల్పుల పలుకులఁ♦గలఁతపఱిచె.
తే॥ కనకమయమైనలంకాన♦గరము ప్రిదిలి, యెగురు ధూళిపైఁబడఁ గొండ♦లెల్లస్వర్ణ
గిరిని పోలెను తక్కిన ♦ పురవరములు, నాక లోకంబు బోలి వి ♦ న్నాణమొందె
తే॥ రక్కసులసేనఁ బదివేల♦రథములుండె, వాని కినుమడియై యుండె♦వారణములు
వానికిమ్మడియై యొప్పె♦వారువములు, వానికిబ్బడి యయ్యె గా♦ల్బలములెన్న.
ఉ॥ అందఱు నాఁటి తేఁటిన మ ♦ హాహవ యోధులు మాయలందు పే
రందినవారు నేత్రముల ♦ యందు మహోగ్రత చూపువారు చే
వం దనరారువారు తత ♦ వక్షములం గవచంబు దాల్చినా
రెందును సాటిలేని విజ ♦ యేందిరఁ జేకొనినారు నిచ్చలుఁ. ౨౫౯
తే॥ వారణారోహణక్రియా ♦ ప్రథితు లస్త్ర, శస్త్రవిద్యాప్రవీణులు ♦ చతురమతులు
వ్యూహనిర్మాణచతురులు♦సాహసులును, నిర్భృతివంశ్యులు తరణి స♦న్నిభులువారు
తే॥ రథగజాధిరోహకులశి♦రంబులపయి, నెగిరిపోవు మనోవేగ♦మెనయువార
లాశ్వికులు వారిగుఱ్ఱములు♦లట్టివయగు, వివిధగతులనెఱింగిన♦జవనహరులు. ౨౬౧
చ॥ అరయఁగ జంబుమాలి చతు♦రంగబలంబులు చుట్టిరాఁగ ని
ర్జరులు భయంపడం గనులు ♦ చంద్ర మిడుంగుఱు లట్లు వెల్గఁ బె
న్నరదము మీఁదఁ గొండవలె ♦ నాతఁడు గ్రాలఁగఁ గంకటంబు పే
రురమునఁ గారుచిచ్చువలె ♦ నుజ్జ్వలమై వెలయన్ వెసం జనెన్. ౨౬౨
చ॥ రణమొనరింప రక్కసులు ♦ రారొకొ? యేలొకొ తామసంబు ప
ట్టణమున నున్న వీరుల క ♦ డంక నశించెనొ యింతకం చవా
రణగతి మారుతాత్మజుఁడు ♦ క్రన్న నశోక వన ప్రధాన తో
రణ ముఖసీమ దానవుల ♦ రాకఁ బ్రతీక్షణ సేయుఁగాఁ జనెన్. ౨౬౩
చ॥ స్ఫటిక శిలా హిరణ్మయ వి ♦ భాసుర సౌధ విశేషకాంతి చీఁ
కటులఁ జెదర్పఁగాఁ జకచ ♦ కల్ గల రత్న మయూఖ జాలకం
బటనట వన్నెచిన్నె లెస ♦ లారఁగ మారుతి యందుఁ దోఁచెఁ జొ
క్కటమగు వేవెలుంగు నడు ♦ కంధిని భాసిలఁ దోఁచు రీతిగన్. ౨౬౪
చ॥ పిడుగులతోడ మేఘములు ♦ ప్రేలఁగ సంగ్రము కొందలింప ము
ప్పడరిన దంచు పర్వత గు ♦ హాంతర సీమల సర్పముల్ వినం
బెడలఁగఁ గ్రక్క రక్కసు ల ♦ హీనభయంబు భజింప వేల్పు పిం
డడలఁగ నాంజనేయుఁడు మ ♦ హారవముం బొనరించె నయ్యెడన్. ౨౬౫

తే॥ దిగ్గజములు విశ్రాంతిఁ బొం♦దెను జముండు, దద్దరిల్లె బుత్తుంబులు♦ధరణిరాలెఁ
బర్వతంబులు భూమియు♦బ్రద్దలయ్యె, నలఁగెఁ గడలియు హనుమ బా♦హాప్పళింప.

తే॥ అంతదైత్యులు కదలి పె♦ల్లార్చి పీన్గు, పెంటలును రక్తవాహినుల్♦పెరిఁగివారి
నాఁకపెట్టుటవలన నా♦హనుమఁజేర, ననువుదోఁపక మిక్కిలి♦యడిచిపడిరి. ౨౬౭

తే॥ జంబుమాలి సైన్యము విభ♦జనముచేసి, రెండుప్రక్కలఁబంపి యా♦దండ తాను
రథికుఁడై దాయ హనుమ వా♦రలనుగాంచి, సంతసింపఁ బూరించె భు♦జంబులంత

చ॥ అమలిన దీప్త దీపశిఖ♦యందమునొంది వెలుంగు నూర్ధ్వ పుం
డ్రముగల ఫాలమే మొదటి ♦ రాణువగా నఖరాజి నిట్ట రో
మములు చెలంగు బాహువులె♦మధ్యమసేనగ వాలు వెన్కసై
న్యముగఁ బొసంగఁ బావనియు♦నాయితమయ్యె రణంబుసేయఁగన్.

ఉ॥ కాహళముల్ చెలంగ నెస ♦ కంబుగ వాద్య విరావమొప్ప మా
యాహవ దోహలుల్ బహు వి ♦ ధాయుధ వర్గము నాంజనేయుపై
నోహరిసాహరిన్ వయిచి ♦ రుద్ధతి నాతఁడు చూచి లోక వి
ద్రోహులు కుందఁ దూల్చె నొక ♦ దోరణగంబముతోడ నన్నిటిన్.

ఉ॥ దోరణగంబమున్ సమర ♦ దోహలుఁడై కొని తాను దగ్గుటల్
పోరుట గానలేక వెఱఁ ♦ బొందుచు గుంపులు గూడుచున్ విడం
బాఱుచుఁ దాఱుచున్ మరలి ♦ పైకొనుచున్ దిరుగాడు విద్విష
ద్వీరులఁ గాలనద్మమున ♦ విందులుగాఁ జనునట్లు మోఁదుచున్. ౨౭౧

తే॥ ఏయునవి గ్రుమ్మునవి యగు♦నాయుధముల, నెడమచేత నలంచుచుఁ♦గుడికరమున
పోరు సాగింప నంజనీ♦పుత్త్రకుండు, దొరలె రథములు గజములు♦తురగములును

తే॥ మోఁదుదిన్న యేనుంగులు♦మీఁదికెక్కె,ములనుదంతములనుతొండ♦ములనుచెవులఁ
గాళ్ల మద జలంబులను ఘీం♦కారములను, కినుకలెల్లను పోఁగొట్టు♦కొనియె నపుడు

తే॥ వీరు లెక్కివచ్చిన రథ♦వితతి నొగలు, ప్రక్కలును శిఖరములు చ♦క్రములు కింకి
ణులునుధ్వజములు వారువ♦ములునునలఁగి, మహిని చెదరిపడియె హనూ♦మంతుచేత.

ఉ॥ కొన్నిటి కుత్తుకల్ దెగియెఁ ♦ గొన్నిటి పొట్టలు వ్రీలెఁ బ్రేవులున్
గొన్నిటి కీఁగెఁ గొన్నిటి య ♦ కుంఠితవేగము క్రుంగెఁ గాళ్లు వోఁ
గొన్నిటి ముచ్చటే విఱిఁగెఁ ♦ గొన్నిటి మొమ్ములు వ్రస్సె నుగ్గుగాఁ
గొన్ని నశించెఁ గొన్నివడెఁ ♦ గొన్ని యడంగెఁ దురంగబృందముల్

ఉ॥ కొందఱు విహ్వలించుచును ♦ కొందఱు కుందుచుఁ గొంద ఱేడ్చుచుం
గొందఱు దిగ్భ్రమంగొనుచుఁ ♦ గొందఱు పోరుచుఁ గొంద ఱార్చుచుం
గొందఱు పాఱుచుం బొరలి ♦ కుప్పలు గూలుచుఁ జచ్చుచుండఁగాఁ
గొందఱు దవ్వునుండి కని ♦ కొంకుచుఁ జాఱిరి తిగ్గిచూచుచున్ ౨౭౬

ఆ॥ కరులచేతఁ గరుల ♦ హరులచే హరులను, కాల్బలములతోడఁ ♦ గాల్బలముల
స్యందనములతోడ ♦ స్యందనంబులఁ గూల్చెఁ, గదనమందు హనుమ ♦ కసిమసంగి.

ఆ॥ కాళ్లు తలలు తునిఁగెఁ ♦ గంధరంబులు తెగె, భుజము లూడిపడియె ♦ బురదయయ్యె
మెదడు నెత్తు రురలి ♦ మదగజావళులందు, మునుక వేసి యట్లె ♦ మునిఁగిపోయె.

తే॥ దనుజవరులను వక్రదం ♦ తములతోడఁ, గరులతో విండ్లతోడ ఖ ♦ డ్గములతోడఁ
గడిమితో గర్జనలతోడఁ ♦ గలకుతోడ, నలఁగఁద్రొక్కి చంపెను మరు ♦ న్నందనుండు.

చ॥ మిడుఁగులు ముందుగాఁ జెదరి ♦ మేఁగ జరించెడు వాయుపుత్త్రుఁ డా
సిడములచెంత నేనుఁగులఁ ♦ జెంత రథంబులచెంత గుఱ్ఱపుం
దడములచెంతఁ బర్గ సము ♦ దాయముచెంత మఱేడఁ జూడ న
క్కడఁ గనవచ్చె నచ్చెరువు ♦ గాఁ గనువారల కుగ్రవేగుఁడై. ౨౮౦

తే॥ కరుల తలలపై వీరవ ♦ క్షములమీఁద, వారువముల వీఁపులపయిఁ ♦ దేరులపయి
విలయకాలాశనియొ నాఁగ ♦ వెలసి దుమికె, హనుమ నజ్జునజ్జుగ నవి ♦ నవసిపోవ.

మ॥ జగతిన్ నిశ్చలరీతి వర్తిలు నృపా ♦ జ్ఞాచక్రముం బోలె ము
జ్జగముల్ పొంపిరివోవు సజ్జనుల వి ♦ జ్ఞానప్రభం బోలె బా
డిగన్ దేహము నొప్పగించు ధనచే ♦ టీ చిత్తముం బోలె నా
శుగపుత్త్రుం డెటఁ జూడఁ దానయయి సం ♦ శోభిల్లె రంగస్థలిన్. ౨౮౧

మ॥ భగవద్భక్తులు సర్వదా హరిని సం ♦ భావించి సారూప్య మొ
ప్పుగ సాధించెదరన్న యర్థమును సం ♦ పూర్ణంబుగాఁ జూపుచున్
గగనంబందున ధాత్రియందునను ది ♦ గ్భాగంబులన్ ముందరన్
దగ డెందంబునఁ గానిపించెను మరు ♦ త్సంజాతుఁ డయ్యెయెడన్. ౨౮౩

మ॥ ధ్వజరాజద్రథపంక్తి రథ్యములతో ♦ దాచేత మత్తద్విప
వ్రజముల్ వేలోకచేత గుఱ్ఱముల ను ♦ గ్రక్రోధులై పోరు ఘ
ణ్యాజనాళిం బడ సంప్రఘాతముల భ ♦ గ్న ధ్వంసముల్ చేసి య
క్కుజుఁడై పేర్చె యుగాంతకాల లయరే ♦ ఖం బోల్చు రుద్రుండనన్.

తే॥ చక్రఖడ్గతోమర పర ♦ శ్వథరథాశ్వ, గజ లసచ్ఛత్ర కేతన ♦ కాండమెల్లఁ
గుప్పలై కూలి నెత్తుటఁ ♦ దెప్పదేలె, పూచి విలసిల్లు పెను జల ♦ పూరమట్లు

తే॥ దొరకు నాయుధములఁ గొని ♦ తొడరి యేయఁ, దెగిన తలలును కొండలఁ ♦ బగులు తలలు
నెగురు తలలు నొండొంటికిఁ ♦ దగులు తలలు, తటపటాయించె సంగర ♦ స్థలమునందు.

తే॥ జమునికరణి విజృంభించి ♦ జంబుమాలి, కుపితసింహంబు కరిఘటం ♦ గూల్చుత్రోయ
మిగిలియున్న యూథపమట్లు ♦ మెఱసి తేన, వంటి కన్నుల నిప్పుకల్ ♦ వఱలఁ దాఁకె

ఉ॥ పీనుఁగు లడ్డదిడ్డముగఁ ♦ బెంటగఁ గూలిన సంగరస్థలిన్
జానుగ స్యందనం బరుగఁ ♦ జాలని తీరు నెఱింగి వేఱుగాఁ

బో నెడలేక యుండియును ♦ పోరునకుం ద్వరసేసెఁ బావ మా
దానవవీరు దుస్థ్సితి వి ♦ ధంబది యొప్పెను శోచనీయమై ౨౮౭

ఉ॥ పూచిన కింశుకాకృతిని ♦ పొల్చిన పావని జంబుమాలితోఁ
జూచిన స్యందనమ్మొకటి ♦ సొమ్ముగ నాయుధ మొక్కటయ్యె నిఁక
గాచుట కేగుదెంచిన ని ♦ కాయముఁ గావక యొంటివైతి ని
న్నేఁచుట నీతిగాదు మఱి ♦ యేగుము వీడెద నన్న దైత్యుఁడున్ ౨౮౮

శా॥ కారుణ్యామృతమూర్తి వీ వదియు ని ♦ క్కంబిప్డు నాపైని దై
వాఱం జూపితి మేలుమేలు భళి యె ♦ వ్వాఁడంచు నన్నెంచితో
పోరాటంబున కేను జంకుదునె పో ♦ పొమ్మంచు దర్పించుచున్
గ్రూరాస్త్రంబులు పెక్కులేసి యొడలం♦గ్రుచ్చెం గ్రుధామగ్నుఁడై. ౨౮౯

ఉ॥ మారుతి జంబుమాలిఁ గని ♦ మాయురె యాయుధహీనుతోడ వే
పోర వలంతి వౌదనుచుఁ ♦ బూనిన తోరణ గుంజఁ ద్రిప్పి దే
వారి శరంబులన్ జలక ♦ ణావలి వాయువు దూల్చు లీలఁ బెం
దూరమునం బడంగ వడిఁ♦దూల్చి హసింపఁగ వాఁడు హుంకృతిన్ ౨౯౦

చ॥ అదలిచి తేరు వాయుసుతు ♦ నండకుఁ దోలఁగఁ దెర్వులేమి నం
గదగొని కిన్క వాయుజుని ♦ కాయము మొత్తము నొవ్వఁ గర్కశ
ప్రదరములేసి చేతఁ బోల ♦ పంబగు తోరణగుంజ తున్కలై
చెదరఁగఁ గొట్టి యార్చెఁ గపి♦ శేఖరుఁ డంతట రేఁగి యుద్ధృతిన్ ౨౯౧

ఉ॥ లెక్కకుమీఱి పైఁబడు శి ♦ లీముఖముల్ గణియింపకోర్చి పే
రుక్కున వాని తేరిపయి ♦ కుగ్రతరాకృతి నుద్గమించి వి
ల్లక్కసుతోడ లాగి గన ♦ యమ్మునఁ గొంతు దగిల్చి నెత్తురుల్
గ్రక్కుచుఁ గూలి చావఁగ స ♦ రాలున నీడ్చెను దోర్బలంబునన్ ౨౯౩

ఉ॥ ఆవలఁ దేనుంచి దిగి ♦ యారథమున్ రథచోదకుం దురం
గావళి నుగ్గునూచముగఁ ♦ గాళ్లను ద్రొక్కి విదిర్చి తోరణ
స్థావరగుంధ మెక్కెను స ♦ దాగతి పుత్త్రుఁడు తీఱువృత్తమున్
గావలివాండ్రు కాంచి కలఁ ♦ కం జని రంతయుఁ దెల్ప ఱేనికిన్. ౨౯౪

చ॥ పరుగున శోక విహ్వలత ♦ వచ్చి దువారములందు చూచు న
త్తరుణులు భర్తృదేహముల ♦ దారుణరీతిగ నీడ్చుకొంచు నె
త్తురు వఱదల్ రహింపఁగని ♦ దుఃఖము చెందిరి లంకయెల్ల గు
గ్భరమగు నాలగోడుగను ♦ బాలురగోడుగ నయ్యొ నయ్యొడన్ ౨౯౫

ఉ॥ ఏగిన కావలీంద్రు దను ♦ జేంద్రుని సన్నిధిఁ జేరి తెల్పఁగా
వీఁగుచు వెక్కసంపడుచు ♦ వెక్కుచునుండఁగ భీతియేల? మీ

రేగతి గాంచినారొ? యన ♦ నిట్లని పల్కిరి జంకి వారు దే
వా! గతియించి రెల్ల రొక ♦ వానరుచే మన జంబుమాలితో. ౭౯౬

ఉ॥ ఆపలు కాలకించి దను ♦ జాధిపుఁ డుల్లము మండఁ గన్నులన్
దేపకు రక్తబిందువులు ♦ దీర్ణత రాలఁగ నిట్టులయ్యెనే
నాపని? సేనవచ్చి జత ♦ నంబునఁ బట్టిదఁ గోఁతినన్న సే
నాపతు లేవ్వ రిట్లనిరి ♦ నాయకు కోపము సుంత శాంతిలన్. ౭౯౭

౧౦. సేనాపతి పంచక వధ పటలము. (౬౭)

సీ॥ సార్వభౌమా! నీవు ♦ పాలీఁడులం దిని, మనుకోతితోఁ బోరఁ♦జనెద వేని
వర్షహీనతచేత ♦ వనటిన సెలయేళ్లఁ, గల పర్వతంబుల ♦ కరణి నున్న
దిక్కరుల్ క్రమ్మఱఁ ♦ దివిరి సాగరదాన, నీభువు లొప్పారఁ♦జెలఁగకున్నె?
ఉరుజవ సత్త్వుండు ♦ గరుడుఁ డుద్ధతి మశ, కములపై నేగెడు ♦ కరణిఁగాదె?

తే॥ అల్ప వానరుపై నీవ♦యరిగినంత, నీభుజబలంబుఁ జింతించి ♦ నిసియుఁ బవలుఁ
గొదుకు తారాద్రి తనదు సం♦కోచవృత్తి, మాని యెప్పటి సంస్థితి ♦నూనకున్నె?

సీ॥ ఈవ యాకోఁతిపై ♦ నేగితివేని ని, న్నెదిరించి ఫలమేమి ♦ యొదవకుండ
నీపేరు వినుటకు ♦ నోపక భీతిల్లి, పాఱు త్రిమూర్తుల♦వదనములకు
మందహాస రుచులు♦కందళింపవె? దీన, ఫలము సుంతేనియుఁ ♦ గలదెనీకు?
నదిగాక నీ వన ♦ హోయుఁడవై తెంచుఁ, బరులు తెలఁపఁ దగ్గ♦పని యదేల?

తే॥ మున్ను కొందఱఁ బంపితి♦మోఱకులను♦ఇప్పు డుచితంబుఁ బాటించి, యొలమినించి
మమ్ము పంపుమా యనుచు న♦మస్కరింప, లెస్సయని సమ్మతించె ని♦లింపవైరి

తే॥ అఖిల జగముల కాధిప♦త్యము వహించి, నంత సంతసమంది సే♦నాధిపతులు
వలసినంత బలముగొని♦బవరమునకు, నేఁకరిన వారు రండని♦యొఱుక పఱుప.

తే॥సంద్రముంబలెఁ దెరలెను♦సైన్యసమితి, మొగుళులంబలెదుందుభుల్ ♦ మ్రోఁగెఁ
బెలుచ
కారుమబ్బుల మెఱపుల♦కరణి మిఱిసె, నసురల కరంబులందలి♦యాయుధములు

తే॥ గగనముం దాఁకు పొడవైన♦కాళ్లుగలవి, నింగి హాఁకి యలలఁబోలె♦నెగడునవియు
నైనటెక్కెముల్ చచ్చిన♦యసురకీర్తు, లట్లు గాలికిఁ దటపట♦లాడుచుండె.

తే॥ పసిఁడి గండపెండరములు♦బాణపూర్ణ, తూణ కవచాదుల ధరించి♦గాణనొప్పి
యరదములకు గుఱ్ఱాలకు♦హస్తిఘటకు, స్వేచ్ఛకొలఁది వేడుకగఁ గై♦సేసినారు.

ఉ॥ ఏఱులఁజేసె మార్గము మ♦దేభ గళన్మదధార లేఱులన్
దేరులు త్రొక్కి దమ్ముగను ♦ తీర్చెఁ దురంగ ఖుర ప్రఘాతముల్

మాటిచె దుక్కిగా మరల ♦ మావుల చొంగలు చేసె రొచ్చుగాఁ
దోరము క్రింది వారల గ ♦ తుల్ వివిధంబులు భూతలంబునన్. ౧౦౪

తే॥ స్యందనధ్వని హరుల హే♦షలును కరుల, ఘీంకృతులు తూర్యవాదన♦ ఘాంకృతులును
సింహనాదమ్ము లొక్కటై♦ చేరి యెనఁగి, కడలి ఘోషంబు కంటెను♦ మ్రోఁగుమీఱె

క॥ ఏఁబది వేల రథంబులు, నేఁబదివే లిభచయంబు ♦ నిమ్మడి తేజుల్
ధీబలయుతమై లక్షకుఁ, బైఁబడిన పదాతిసేన ♦ బయలన్ వెడలెన్. ౧౦౬

సీ॥ సేనాపతులు చీరఁ ♦ జెచ్చెరరాఁ ద్రోవ, లేక క్రిక్కిఱిసిన ♦ మూఁకయందు
కైదువు లొఱసెడు ♦ కతన నెల్వడిన యిం, గలములు మొగుళులఁ ♦ గాల్చుచుండ
మదగజ ఘంటికా ♦ మాద్యద్విరావంబు, పిడుగుల కంటెను ♦ భీతిఁగొలుప
నిప్పులవలె నున్న ♦ నేత్రముల్ భూషామ, ణులు మబ్బువిడు రవి ♦ చెలువుదోఁప

తే॥ మద మతంగజంబులపయి♦ మావులపయి, నరదములపయి వెడలు వీ♦రాళిఁగాంచి
చెలులు లోహాభిసారంబు♦ నేయవచ్చి, పతులఁ గనుఁగొని యుల్లముల్ ♦ పల్లటిలఁగ.

చ॥ వెడలిన వార లొక్కరును ♦ వెన్కకు రారు ప్లవంగవీర్యమో
బెడిదము పోవకుండ నుడు ♦ వీరు లుపేక్షయొనర్పఁ జెల్వలున్
బడిబడిపోయి కీశునకె ♦ ప్రాణము నిత్తుము భర్తృమోగమె
య్యెడలను వీడకుండు నని ♦ యేగిరి కొందఱు కొందలంబునన్

సీ॥ కాలమేఘముకంటె♦ ఘనదేహములవారు, పంచభూతంబులే ♦ యంచితముగ
రూపుగొన్నవి యన ♦ రూఢికెక్కినవారు, మహితసైన్యాంబుధి ♦ మధ్యగతులు
పంచసేనాపతుల్ ♦ భాస్వద్రథము లెక్కి, పంచ భాస్కరులు నాఁ ♦ బరిఢవిల్లి
పంచేంద్రియంబుల ♦ పగిది నెల్లర కుప, ద్రవము లెల్లప్పుడుఁ ♦ దడవువారు

తే॥ వజ్రి వజ్రము వరుణుని♦ పాశము యమ, దండమును వ్యర్థపఱచు దో♦ర్దండు లెదుట
మొనసి పెక్కు వాద్యంబులు♦ మ్రోఁగుచుండ, నారి మొరయించుచు బయలు♦ దేఱినారు

తే॥ తారకుని కూల్చినట్టి కు ♦ మారు నెక్కి, రింత యీఁకలంకొడవి ♦ రించియుంచ
ఱెక్కలను పేనినట్టి నూ ♦ త్రికల వీర, పట్టములను ఫాలంబులఁ ♦ గట్టినారు.

తే॥ రావణుని వక్షముం దాఁకి♦ వ్రస్సిపడిన, దిక్కరుల రదనములఁ జి♦త్రింపఁబడిన
కుండలములు గలారు ది♦క్కుంభివదన, పట్టములనె నొసళ్లకుఁ♦ గట్టినారు. ౧౧౧

తే॥ నవనిధీశుని లంకాధి♦నాయకుండు, గెలిచి యలకాపురము కొల్ల♦ గొలుపునాఁడు
తెచ్చిమూట గట్టుకొనిన♦ దివ్యభూష, ణములఁ దాల్చి వెలుంగు నఁ♦గముల వారు

తే॥ అమరవిభుఁ డోడిపాఱ వెం♦న్నంటి తఱిమి, వెల్లచౌదంతి వాలంబు♦ వెనుక కీడ్చి
పట్టి జాణవయేని వేఁ♦పాఱుమనుచు, నిలువఁబెట్టిన ఘన భుజ♦ బలులువారు.

తే॥ బ్రహయాజ్ఞ చే సమవర్తి♦ ప్రాణములను, గొనుచు భవదాజ్ఞ దాఁటినాఁ♦డనుచు లంక
జనులు పల్క విభుని యాజ్ఞ♦ శమనుఁ బట్టి, కట్టి బంది నుంచిన పరా♦క్రములు వారు.

తే॥ కరువలంగేరు పీసవ♦క్షములవారు, ఉదధి యలల హసించు బా♦హువులవారు
జముని మించి తత్కార్యంబు♦జరపువారు, కొలిమి సిప్పులవంటి క♦న్నులుగలారు.

మ॥ విలయోత్పాతముగాఁగ బాడబము పృ ♦ థ్వీభాగముల్ గప్పినన్
బలువాతోద్ధతి ఘోరమై పరవినన్ ♦ వారాసు లుప్పొంగినన్
జలదశ్రేణి భువిం గలంప నడరన్ ♦ సత్త్వంబుచే వాని య
గ్గలికల్ మాన్ప సమర్థులున్ శ్లథగుణ ♦క్లాంతి వ్యథాదూరులున్. ౧౧౬

తే॥ వెడలితోరణంబునుసమీ♦పించిచుట్టి, వాహినులవ్యూహముగ నిల్చి♦పతులునిలువ
వారి పనులను కనుల నే♦పారఁగాంచి, హనుమ యొకసారి గర్జించె♦నసురు లడల.

తే॥ దశమొ యధికంబు మొనగాండ్ర♦బలమొ పెచ్చు, పావనియొ యొంటియయ్యె నే♦పగిది ముగియు
ననుచు నింద్రాదిదేవత♦లాకసమున, జంకుగొంకును పొంది రా♦సమయమందు.

తే॥ వచ్చిరీరక్కసులు జము♦వాతఁబడఁగ, ననుచు మారుతి చుట్టు సై♦న్యములఁగాంచి
తనభుజంబులఁగసి మది♦వనజనేత్రుఁ, గొని మహోత్సాహమున లేచి♦కొప్పరించె.

తే॥ కోఁతియొక్కటి జరిగిన♦ఘోరసమర, మందు జయమంది వేలుపు♦లొందుకీర్తిఁ
గ్రుంగఁజేసిన రాకాసి♦కూటువలన, డంచెనే యని కుందె న♦క్తంచరాళి.

తే॥ నందనమునుండి తెచ్చివ♦నంబునందు, రావణుండు నాటించు తో♦రణముమీఁదఁ
గౌతుకంబునఁ బెరిఁగెను♦గగనమంట,భువనభీకరుఁడై వాయు♦పుత్రుఁడపుడు. ౧౨౧

తే॥ వర్ధిలిన మారుతిని కని♦భ్రమమునొంది, విమతులై బొమల్ ముడివైచి♦వింఢ్లువంచి
నిశిత నారాచముల నాంజ♦నేయు మీఁదఁ, బరపి రయ్యెడ శంఖరా♦వంబుప్రబల.

తే॥ తక్కురక్కసు లగ్నులు♦గ్రక్కువాఁడి, కైదువుల నేసి రవి కపి♦కాయ మంట
దురదవోవ గీఱినగతి♦దొరయ హనుమ, కొంతసేపు కనుల్ మూసి♦కొనియెసైఁచి

తే॥ మఱియుఁగొట్టవచ్చినయంత♦మారుతియును,తక్కువారలుపోరరాఁ♦దరుణమొసఁగి
యెదుటివారలవడిమడి♦యింపఁదలంచి, యందుగలయుక్కుకంబంబు♦నందికొనియె.

తే॥ కంబమును గొని వైచిన♦కైదువులను, వీరులను వారువంబుల♦వారణముల
రథచయంబుల బలు దుమా♦రంబు సేఁగఁ, జితుకఁగొట్టి క్షణంబునఁ♦జెలఁగియార్చె

తే॥ రథసమూహంబువిఱిచిచ♦క్రములఁగొంచు,దంతులఁజదిపివానిదం♦తములఁగొనుచు
నసురులం జంపి వారి క♦రాసులఁగొని, చీల్చె నశ్వచయంబు నా♦శ్వికులతోడ.

తే॥ రెండుపెద్ద తేర్ల ♦ రెండుచేతుల నెత్తి, రెండు కరులు చదిసి ♦ ప్రీలవైచె
రెండు కరుల నెత్తి♦ రెండు గుఱ్ఱంబుల, నలఁగఁగొట్టె వీర♦నాద మొనర ౧౨౭

ఆ॥ పెద్దకొండ యొందు♦పెకలించి కొని వేయు, పొడవుతేరు లడఁగఁ♦బూడ్చివైచెఁ
బెద్ద సాల మొందు♦పెకలించికొని వేయు, నాగసముదయంబు♦నలియఁ గొట్టె.

తే॥ ద్వీపములం దన్ని తేరులఁ♦దిరుగవైచి, తేజుల నలంచి పిడుగుల♦యోజ దునికి
వీరవరుల శిరంబులు♦వీఁపు లగల, నలఁచి పొడిచి యిక్కఁ గలఁచి♦పొలియఁ జేసె.

తే॥ వేగముగఁ బాఱు రథముల ♦ నాగములను, వింటికిని దిగంతములకు♦విసరివైచె
స్వారిగుఱ్ఱంబులను వాని♦పైని మగల, బలిమి నొక్కటిగాఁజేసి♦నులిమివైచె.

చ॥ ఎగురఁగ వైవఁబడ్డ ద్విర♦దేంద్రము లంబుధిలోనఁ గూలుచుక్
దగఁ దెఱచాపతో మునిఁగి♦తాఱు కలంబుల భంగిఁ దోఁచె న
ల్లొగసిన స్యందనావళులు ♦ హేమమణి ప్రభ లుల్లసిల్ల నం
దగపడె నప్పుడే పొడము ♦ నంబుజమిత్రు రథంబు కైవడిక్. ౮౩౧

ఉ॥ మారుతి మింటికిక్ విసరు ♦ మావులు రక్తము గ్రక్కుచుక్ మహా
వారిధిఁగూలి వహ్ని విసు ♦ బాడబ సంఘముఁబోలె వాలుతోఁ
దీరుగ దిర్దిరం దిరుగఁ♦ద్రిప్పుచు వైవఁగఁ బడ్డ రక్కసుల్
కోఁటఁ ద్రిప్పఁబడ్డ తఱి♦గొండక్రియం దిరుగాడి రంబుధిక్. ౮౩౨

తే॥ వడిగఁబాఱిన రక్తప్ర♦వాహతతులు, హనుమ విసరివైచిన ద్విర ♦ దాదికములు
కడలిఁ బడుటకు మున్నుగాఁ♦గడచిచేరె, గొప్పధ్వనితోడఁ బంతంబు♦గోరినట్లు.

సీ॥ ఘనతోరణ ద్వార♦మున కిరుప్రక్కల, నెలరేకవంటి కో♦ఱలను గుహలఁ
బోలు నోళులు రక్త♦మును నిప్పులను గ్రక్కు, జంకెన చూపుల♦చక్షువులును
బొమముడి పీడని♦మొగములు పెదవులఁ, గొఱుకుచు నున్నట్టి♦కఱకు పండ్లు
గల రక్కసుల పీనుఁ♦గులు గగనంబును, దాఁకు కొండలమాడ్కి♦వీఁకఁ బెరిఁగి

తే॥ చూచు వారల చూపులు♦సురిఁగిపోవఁ, గాంచువారల మనసులు♦కరఁగిపోవ
మకర తోరణ ద్వారమ్ము♦మఱుఁగుపడఁగ, నిండిపోయెఁ బెఱలు గని♦బెండుపడఁగ

చ॥ తరువులు కంబముల్ గిరులు ♦ దండిగ నుండఁగ దండపాణియుం
దరుణము వేచి పాశియయి ♦ దండనె యుండగఁ గోపమూర్ఖులై
దురమునకు న్నిశాచరులు ♦ దూఁకుచు నుండగ దున్నహంపు దు
ర్మరణముగాక పల్కు మఱు ♦ మాటయు వేఱొకరుండు గల్గునే? ౮౩౩

క॥ భవునకు శూలముకైవడిఁ, బవనసుతునిచేతి కొక్క♦పరిఘము దొరకక్
దవిలి కసిమసఁగి దానవ, నివహముఁ బరిమార్చె నొక్క♦నిముసములోనక్.

క॥ సేనాపతి పంచక సే, నా నివహంబట్ల సమసి ♦ నం దెలిసిన లం
కా నగరమెల్ల గగ్గోఁ, లూనఁగ దళపతులు కినిసి ♦ యుల్లము నోవ్వక్.

చ॥ శవములఁ ద్రొచికొంచుఁ జన ♦ సాగిన నెత్తుటిలోనఁ జక్రముల్
దవిలి నిదానమై చను ర ♦ థంబుల నేవురు డాసి యూర్చుచుక్
బవనజుపై ననేక శిత ♦ భల్లములేసి యలంప నిశ్చలుం
డవు హనుమంతుఁ డంత నొక ♦ స్యందన చక్రము లూడఁ దన్నుడుక్.

సీ॥ రథము పొడగుడు దుర్ధర్షణుఁ డాకాశ, మున కేఁగ హనుమంతు♦కినిసి యొక్క
యినుపకంబముతోడ♦నేసె వాఁడును దానిఁ, దనవింటితో నడ్డి♦తొలఁగఁజేయు
సింగిణి విఱిగెఁ గొం♦డం గొని వాఁడేయఁ, బదరక యినుప కం♦బంబుతోడఁ
జదిపి దుర్ధర్షణుఁ♦జంప నానల్వురు, కాలాగ్ని కీలల♦కరణి మండి
తే॥ కన్నులను పొగల్వెల్వడఁ♦గార్ముకముల, బాణవర్షము గురిసి పా♦వనిని పొదువ
నతఁడు పెనుబండవైవ వా♦రడఁచివైచి, వికటహాసంబుతో విఱ్ఱ♦వీఁగినారు ౮౩౯

ఉ॥ వారల బాణముల్ హనుమ ♦ వక్షము తంగు మనంగఁ దాఁకి ని
స్సారము లౌచు వెన్కలకు ♦ స్రగ్గె మరుత్సుతుఁ డంతఁ గిన్కమైఁ
గూరఁగ డాసి యొక్కరథ ♦ కూబరముం బదిలించి పట్టి యా
హారవమొప్ప దోర్బలత ♦ నంబరవీథికిఁ ద్రిప్పి వైచుచున్. ౮౪౦

ఉ॥ రాక్షసు తేరు నింగి కెగు ♦ రం గని లోపలనున్న యా విరూ
పాక్షుఁడు లాఘవంబున న ♦ హార్యముకైవడి వాయుసూనుపై
కక్షుఁడై వడిం దుముక ♦ నాతఁడు నాగముమీఁది కేఁగు హ
ర్యక్షము మాడ్కి వానిపయి ♦ కామిక దాఁటి నలంచెఁ ద్రొక్కుచున్.

చ॥ నలిగులియై యతండు మర ♦ ణంబు భజింపఁగఁ దక్కు మువ్వుర
త్యలఘుతర ప్రకోపమున ♦ నార్చుచు వానర! యెందువోయెదీ
తులువతనంబు సాగదని ♦ తూపులు కోపులుగాఁగ నాట దో
ర్బలమున నేయునంతటఁ బ్ర ♦ భంజనపుత్త్రుఁడు రేఁగి హుంకృతిన్.

ఉ॥ ఆక్షణమంద డాసిన శి ♦ తాంగయుగంబును రెండుకేల ని
ర్లక్షముగాఁగఁ బట్టి యత ♦ లంబునకుం గొనిపోవుచుండ యా
పాక్షుఁడు భానకర్ణుఁడు త ♦ దంతరమంద తొలంగఁ గాంచి గ
ర్వాక్షయ మొందవైచెను క ♦ రంబుల నుండిన రెండుతేరులన్. ౮౪౩

చ॥ ఖురువులు సారథుల్ నలఁగఁ ♦ గార్ముకముల్ విఱుగంగ వార లు
ద్ధురతర రోష భీషణతఁ ♦ దూకొని మల్లరణంబు సేయఁగా
నురవడి భాను మ్రింగుటకు ♦ నుద్ధతి వచ్చెడు రాహుకేతువుల్
పరిగొను వైఖరిం బొదివి ♦ పట్టుడు మారుతి వాలు పెంచుచున్. ౮౪౪

ఉ॥ కంఠములన్ బిగించి యొడి ♦ కంబున నొత్తుడు నుక్కిబిక్కియై
కుంఠిత సత్త్వుడై ధరణిఁ ♦ గూలి నశించిరి రాహుకేతు లు
త్కంఠతఁబట్టి పీడఁగ వి ♦ కర్తనుఁ డయ్యెడ వెల్గు పోలికన్
శుంఠలు చావఁగాఁ బవన ♦ సూనుఁడు శోభిలె సంగరస్థలిన్. ౮౪౫

తే॥ మిగిలియున్నట్టి ప్రఘసుఁడు ♦ మీఱిరాఁగ, ఘనతరాకృతి నూనిన♦గాలికొడుకు
కరువమీఁదికి దుముకు సిం♦గంబుమాడ్కి, వానితల నలిగులిగాఁగ♦నూనిదుమికె.

ఉ॥ వంచన దుష్కృతంబులు స్వ ♦ భావముగా జనహింససేయు న
క్తంచరు లెల్లరున్ మడియఁ ♦ దత్పతు లేవురు చావఁ జింతలం
గ్రుంచెడు దుఃఖసంతతులు ♦ ఘోరతరేంద్రియ పంచకంబు ని
శ్చంచలతన్ గుదించి చను ♦ జ్ఞానిక్రియన్ హనుమండు భాసిలెన్. ౧౪౭

తే॥ సమరమున నొక్కరైనను ♦ చావుదప్పి, మిగులకుండుట దళపతుల్ ♦ మిడికి యడుట
కన్నులారఁగఁ గని భయ ♦ కంపితులయి, తడయఁ జంపునో యని యెంచి ♦ దవ్వునుండి.

సీ॥ వనపాలకులు వడి ♦ వడి నేగి రావణు, శుద్ధాంతసౌధంబు ♦ చొచ్చియచట
మైథిలిపైఁ బ్రీతి ♦ మమ్మగ్న కన్నెత్తియుఁ, గాంచఁడంచు నెడందఁ ♦ గలఁతఁ జెంది
యున్న కాంతలఁ జూచి ♦ యుడుకుచు దూషించు, చున్న ప్రభునిగాంచి ♦ యుల్ల మెరియఁ
గర్ణరంధ్రంబులు ♦ గాఁడ నేనలును నే, నాపతు లేవురు ♦ నాశమొంది
తే॥ రయ్య! యొకకోఁతిచే నది ♦ యడవినట్టు, గాదు లయకాలుఁడగు నను ♦ కంప మమ్ము
విడువ వచ్చితి మింకను ♦ వీఁకవచ్చు, వారు లేరా యనుచు నుండె ♦ బద్ధకించి.

—: అక్షవధ పటలము :—

మ॥ అను పల్కుల్విని దానవేంద్రుఁ డొడలన్ ♦ వ్యాపించు రోషంబుచే
ఘన హారంబులు మాఁడ నార్చి యటులా ♦ కానిమ్ము! తద్వానరం
బును నేనే యెదిరించి పట్టెద రథం ♦ బుం దేరఁగాఁ బల్కఁడీ
యన నక్షుండు నమస్కరించి యనియెన్ ♦ వ్యాహార గంభీరమున్ ౧౫౦

మ॥ అది ఫాలాక్షుని నందియా? హరికి నా ♦ హంబా? భుజంగేంద్రుఁడా?
పదరన్ దిక్కరులం దొకండొకో? మహా ♦ ల్పంబైన యాకోఁతిపైఁ
బ్రదరంబుల్గొని తేరిపైఁ గదఁగి పో ♦ ర న్నీవు పోఁ జూచుటా?
ఇది నీబోఁటికి యుక్తకార్యమగునే? యీయక్షుఁడుం జచ్చెనే? ౧౫౧

మ॥ మును వృద్ధశ్రవుఁబట్టి తెచ్చుటకు నిం ♦ బున్ డంబు పెంపార మా
యనఁ బంపించి కొఱంత గూర్చి తది యిం ♦ ద్రైనం దొలంగింపుమా
నను శాఖాచరు మీఁదికైనఁ బనుప ♦ న్మానంబు గాదయ్యెనే?
అనుమానింతువె? నక్క యుప్పతిలునే ♦ హర్యక్షు గర్భంబునన్? ౧౫౨

క॥ చిచ్చుఱ కంటియె మసకొక, పొచ్చెము గూర్పఁగఁ బ్లవగ ♦ మూర్తంగొని తా
వచ్చినయేనియు నేఁగొని, తెచ్చెద నీమెచ్చు గొనెద ♦ దితిజాధీశా? ౧౫౩

మ॥ అవనిం గోఱల గ్రుచ్చియెత్తిన వరా ♦ హస్వామి యౌఁగాక దా
నవ సంహారముసేయఁ గంబమున జ ♦ న్మంబంది వంచించు మా
నవ సింహంబగుఁ గాక పోరిన నజం ♦ డం బావలం దాఁటెనన్
దవులం గట్టియె తేకయుండిన నను న్ ♦ దండింపు దైత్యేశ్వరా! ౧౫౪

చ॥ అని యిటుపల్కి యాజ్ఞయిడు ♦ మంచు నమస్కృతిసేయు పుత్త్రకుం
గని రథమెక్కియో నిలుము ♦ కార్ముకముం గొని పోరుసేయు మా
వనచరుఁ డాయఁబోకు మెటు ♦ వచ్చిన యేని నియుద్ధ పద్ధతిం
జనకుము పోయి రమ్మనుచుఁ ♦ జక్రసహాయుఁడు వాఁడు వెల్వడెన్.

చ॥ మునుపటి యుద్ధమందు సుర ♦ ముఖ్యుఁ డొసంగిన దార్ఢ్యమైన తే
రను తగ రెండువందల గు ♦ఱ్ఱాలను గట్టిన దాన నెక్కి దీ
వన లిడి రెల్ల దానవులు ♦ వాద్యరవంబులు మిన్ను ముట్టె వా
హినులును వాహినీ పతు ల♦హీన సముద్రము వోలె నుబ్బఁగన్. ౧౫౬

సీ॥ వనధిని మకరంబు ♦ లను లెక్కవెట్టుచో, వారణంబుల లెక్క ♦ పఱుపవచ్చుఁ
గడలి మత్స్యంబులు ♦ గణనకుఁ దెచ్చుచో, స్యందనంబుల లెక్క♦సలుపవచ్చు
జలధి యిసుకరేణు ♦ వుల నెంచనైనచోఁ, గాల్బలంబుల నెంచఁ♦గడఁగవచ్చు
శరధి వీచీ సము♦త్కరమెన్నఁ దగినచో, నచటివాజుల లెక్క ♦ యరయవచ్చు

తే॥ నన నసంఖ్యాకమై యొప్పె♦నందుమఱియు, దావ కీలలఁ బోలిన♦తన యనుంగు
కాంగ్రుఁడు పండ్రెండువేల ర♦క్కసులుచుట్టి, యరుగు దేరంగఁ జనియె దే♦వారిసుతుఁడు.

తే॥ ప్రగ్గడల కుమారులు దళ♦పతులసుతులు, వేల్పుపడఁతుకలకు నుద్భ ♦ వించినట్టి
రావణుని కొడుకులు చేరి♦రథములందు, నాల్గులక్షల వీరులు♦నడచివారు. ౧౫౭

చ॥ ముసల ముసుండి శూల ఘన ♦ ముద్గర తోమర చక్ర కుంత ప
ట్టిస ధనురాది సాధన ప ♦ టిష్ఠులు కైదువు లెండగాయ ధూ
ళి సముదయంబు పైకెగుర ♦ లేఖుల లోకమువోలె భూమియుం
బసిఁడి మయంబుగా వెలుఁగ ♦ బంధురవైఖరి సాగి రయ్యెడన్ ౧౫౮

సీ॥ కాకులు గ్రద్దలు ♦ ఘన పిశాచంబులు, కాలుండు సంచిత ♦ కర్మచయము
వెన్నంటిరా నన్ను ♦ మిన్నల దృష్టులు, కలువ పూసరముల ♦ కరణి నెఱయ
విధవల యేడ్పు ను ♦ దధి ఘోషమును వాద్య, సేనారవంబులు ♦ చెవుడు పఱుప
పోయిన వారలు ♦ పోవుటె కాని క్ర, మ్మఱ రంచుఁ దమ సతు ♦ లఱచుచుండ

తే॥ దర్పరణదోహలత్వముల్ ♦తెఱుముచుండ, నీర్ష్యయునుకిన్కతమకు ము♦న్నెగుచుండ
వాహినీరాజి బలసి రాఁ♦బంక్తివదన, తనయుఁ డయ్యెడ సంగర♦స్థలికి నడచె.

చ॥ రవి కిరణాళిఁ గప్పె బహు ♦ రత్న విభూషణ కాంతి పంక్తి కై
దువుల వెలుఁగులన్ మఱఁగెఁ ♦ దోరపు భూషలఁ గ్రాలు డాలుఁ దా
నవ ఖర దంష్ట్రికా సుషమ ♦ నాఁడెపు వాలుల యొప్పుఁ గప్పఁగాఁ
బవలును రాత్రియుం గలిసి ♦ భాసిలు చందము దోఁచె నత్తఱిన్. ౧౬౧

సీ॥ కుదిరలు రథములఁ♦గునుకుపా టొందంగ, నెడమ కన్నులు కేలు♦నెడఁ జలింప
రక్తవర్షంబు ని♦ర్ఘాలనంబు గురియంగఁ, బిడుగులు పైనుండి♦పెటిలి పడఁగఁ

బరఁగఁ గృతాంతుండు♦భావి నాలోచింపఁ, గంక గృధ్రంబులు♦కడకుఁ దిరుగ
భూతగణంబులు♦పొంగి నాట్యముసేయ, ఖేచరుల్ మిగుల సం♦కోచమొంద
తే॥ నొక్క వెల్లువ సేన త♦న్నొల్లసిరాఁగ, భువన భీకరుఁ డగుచు వై♦భవము తోడ
వచ్చు దశముఖ సుతు నక్షు♦వాయుపుత్త్రుఁ, డించుకంత దూరాన గ♦ణించికాంచి.

ఉ॥ వచ్చెడువాఁడు రావణుఁడొ ♦ వాని కుమారకుఁ డింద్రజిత్తొ కా
వచ్చు మదీయ పుణ్య ఫల ♦ భాగ్యము నేఁడు ప్రసన్నమయ్యె నీ
వచ్చు రణంబు కీర్తియును ♦ వచ్చును రాముని మెచ్చు వచ్చు నా
కచ్చుగ నంచు మోదిలి భు ♦ జార్గళముల్ తగఁ గాంచి వెండియున్.

ఉ॥ శ్రీరఘు వీర శేఖరుని ♦ సీతను చిత్తమునందు నిల్పి కై
వారముచేసి నాతపము ♦ పండఁగ సిద్ధముగాఁగ నుంటి నా
చేరువఁ గాలుఁడుం బడటు ♦ సేయుచుఁ గాచియె యున్నవాఁడు నా
కారియ మిప్పుడే యదను ♦ గాంచి ముగించెద దాపురించుడున్. ౧౬౪

మ॥ పదిశీర్షంబులు లేవు గానఁ దలఁపం ♦ బౌలస్త్యుఁడా కాఁడు మా
య దల్పీరం బురుహూతుఁ గెల్చిన మను ♦ ష్యాదుండొకో కాఁడు దు
ర్మదుఁ డెవ్వాఁడొకొ సుందరుండగుఁ గుమా ♦ రస్వామియుం గాఁడు పెం
పొదవం గాటుకకొండ యట్టిఁడు మహో ♦ ద్యోగుండు వీఁడెవ్వఁడో ?

మ॥ అని సంతోషము నంది తోరణముపై ♦ నాసీనుఁడై యున్న పా
వని నక్షుండు గణించి చూచి యిదియా ♦ భంజించి యుద్యానముల్
దనుజానీకముఁ గూల్చినట్టి ప్లవగేం ♦ ద్రం బంచు నిర్లక్ష్య భా
వనతో నవ్వఁగఁ గాంచి సారథి యిటుల్ ♦ వాక్రుచ్చె నయ్యక్షుతోన్.

శా॥ ఈ లోకంబునఁ గల్గు వింతలు సదా♦వీక్షింపుచున్ నేఁటికిన్
లీలామాత్రముగాఁ దలంపఁదగ దా ♦ లింపందగున్ వాలియుం
బోలం జూచిన నొక్క కోఁతియె గదా ♦ పొంగార్చె మీతండ్రి నా
పాళంబుం దగ జ్ఞప్తి నంచుకొని సం ♦ భావింపు మియ్యాలముల్. ౧౬౭

ఉ॥ సారథి వాక్కులన్ విని ని ♦ శాచర రాజ కుమారుఁ డిట్లనన్
వారక మాపురంబునకు ♦ వచ్చియు నూరక పోక యిట్టి వ్యా
పారము చేయు దీని నిట ♦ వ్రచ్చుటతో మదమర్ష మింతి చ
ల్లాఱదు రోసి రోసి ప్లవ ♦ గావళి వంశమె రూపు మాపెదన్. ౧౬౮

శా॥ కానిండంచు స్వసైన్యముం దఱుమ లం ♦ కానాథ పుత్త్రుండు త
త్సేనల్ మారుతిఁ జుట్టుముట్టి బహు హే ♦ తివ్రాతముల్ వైవఁగా
భూనాక స్థలు లల్లలాడెను మరు ♦ త్పుత్త్రుండు తప్పించు కొం
చేనుంగుల్ రథముల్ హయంబులను మా ♦ యించెం బడ క్రీడచేన్.

ఆ. ఎందు గడ్డిమీఁద♦నెరగలి పడినట్టు, లసురవరుల మీఁద♦హనుమ యడరె
వారి ప్రాణములను♦వారి కొంపోవఁ గిం, కరులు చాలఁ గలరె♦కాలునకును? ౮౭౦

ఉ॥ వచ్చుట కాయితంబయిన ♦ వారును వచ్చుచు నున్నవారు మున్
వచ్చినవారు లెక్కయిడ ♦ వైనము గామి యటుండఁ బోరిలోఁ
జచ్చినవారుఁ జచ్చుచును ♦ చచ్చియుఁ జావక కూలువారు నై
పెచ్చుగ నెమ్మిలేని మయి ♦ వీఁక నలంగిరి దైత్యులయ్యెడన్. ౮౭౧

ఉ॥ మిక్కుటమైన శోణితము ♦ మీఱి ప్రవాహముగాఁగ దానిలో
నుక్కఱి ప్రీలి కూలిన మ ♦ దోత్కట వారణముల్ తురంగముల్
మిక్కిలి పంకిలంబుగ గ ♦ మించెను మారుతి నాఁడె లంకలోఁ
గొక్కిరి మూఁకఁ గాలునకుఁ ♦ గొల్ల యొసంగిన రీతి దోఁపఁగన్. ౮౭౨

ఉ॥ కొందఱు చచ్చుచుండ మఱి ♦ కొందఱు ముందఱి కేగుచుండఁగాఁ
గొందఱు పాఱుచుండఁగను ♦ కొందఱు దవ్వుల నిల్చి చూచుచుం
గొందలమందెఁ దేరులనిఁ ♦ గూలె మదావళ రాజియంచు వే
ప్రొందెఁ దురంగపాళి యని ♦ మాఁడెఁ బదాతి యటంచుఁ బల్కఁగన్.

చ॥ చిలికెడు కుండలోని దధి ♦ చెన్నున నొప్పె నిశాచరావళుల్
విలుకుచునుండు కవ్వమను ♦ చెల్వున నొప్పె మరుత్కుమారకుం
డిలఁగల జీవసంచయము ♦ లెల్లను సోఁకులె గాఁగఁ దోఁపఁగా
విలయ సముద్ర మట్లయిరి ♦ వీఁకను మారుతి బాడబాగ్నిగాన్. ౮౭౪

ఉ॥ వచ్చెదువారు పైపయిని ♦ వచ్చుచునుండఁగ వెంటవెంటనే
చచ్చుచునుండ నొక్కరును ♦ చావక తప్పినవారు లేమిచే
హెచ్చుగ భీతినొంది యెడ ♦ యీఁగిరి పాఱిరి తక్కువారు వి
వ్వచ్చమె రూపుగొన్న క్రియ ♦ భాసిలి యక్షుఁడు తాఁకె మారుతిన్.

ఉ॥ అక్షుఁ డెదిర్చె నొక్కదిన ♦ మందె నిశాచర రాజినుద్ధ్రుతిన్
లక్షలకొద్ది చంపిన వ ♦ లంతి యొకం డెదురయ్యె దీని నూ
యక్షుల మాయరాని విధి ♦ నందిన మేము కనంగనయ్యె మా
కక్షమ మయ్యె నంచు సుర ♦ లందఱు మూసిరి కేలఁ గన్నులన్.

ఉ॥ అయ్యెడ నక్షుఁడేసె వడి ♦ నగ్నులఁ గ్రక్కు శిలీముఖంబులన్
దయ్యెక వాయుజుం డినుప ♦ దండముతో నెగఁదట్టె నుగ్రుఁడై
దయ్యముఁ బోలు నాయినుప ♦ దండము నుగ్గుగఁగొట్టె దైత్యజుం
డొయ్యనఁ గేల బాణముల ♦ నూడ్చుచుఁ బావనియోగె మందలన్.

చ॥ అరదము మీఁదికిం దుమికి ♦ యాతని సారథిఁజంపి వాజులన్
ధరఁ బడఁదన్న నక్షుఁడు ను ♦ దగ్రతరాస్త్రము లేసి కీశు పై

న్నురము భుజంబుల న్నలఁచె ♦ నుక్కున మారుతి లెక్కసేయ కు
ద్ధురతర రోష భీషణతఁ ♦ దోరపు వింటిని పట్టె గట్టిగన్. ౨౬౯

తే॥ పట్టుకొన్న వింటిని దన♦బలిమి లాగ, పెళ్లుమంచు రెండుగ నది♦విఱిగిపోవె
చిక్కటారితో నక్షుండు♦చీల్పఁ బూన, వీఁకఁ బట్టి దానిని లాగి♦విఱిచివైచె.

ఉ॥ విల్లు కటారియున్ విఱుగ ♦ వీఁకున దైత్యకుమారుఁ డంతటన్
మల్ల రణంబుసేసి పరి ♦ మార్పఁగ మారుతిఁ బట్టఁ బట్టుడున్
గొల్లగ వాఁడి రోమములు ♦ గ్రువ్వగ వాలము వెంచి వాని మే
నెల్లెడ నందులేక బిగి ♦ యించి తటాలున నెక్కె వానిపై. ౨౭౦

ఉ॥ చెంపలఁ గొట్టె దంతములు ♦ శీర్ణములౌఁగ మెఱుంగు లట్టులా
కంపిత దేహమందు మణి ♦ కాంచన భూషలు రాల నాంత్రముల్
జంఫుగ జాఱఁ గ్రుమ్మె రభ ♦ సంబునఁ గంఠము వంచి క్రుంచి వి
ల్పంపుగ మేను వంగఁ గటి ♦ భాగము జానువు నూఁది త్రొక్కుచున్.

చ॥ సమరతలంబు సన్నికలు ♦ జాఱిన నెత్తురు నీరు గాత్రమే
యమరిన నానఁబ్రాలు తన ♦ హస్తమె పాత్రముగాఁగ జీవముల్
యమునకుఁజెంద నూఁత నని ♦ లాత్మజుఁ డక్షుని మిన్నుమన్ను వా
రమర మనుష్యవర్గ మర♦యం గని విస్మృతి చెందకుండఁగన్. ౨౭౧

సీ॥ కొందఱు నెత్తురు ♦ చిందు గాయములతో, డాఁగిరి భూత భం ♦ డారములను
కొందఱు భీతిచేఁ ♦ గుంది గ్రుమ్మందిరి పోవు, వెరవు దోఁపక చాల ♦ విహ్వలించి
కొందఱు సాధన ♦ బృందంబు దిగజాఱఁ, బోయిన పోకగాఁ ♦ బోయినారు
కొందఱు మీఁదలై య ♦ కూపారముం జొచ్చి, రావులై కొందఱు♦త్రోవలందు

తే॥ పూరి మేయసాగిరి కంక♦వారమగుచుఁ, దిరుగసాగిరి కొందఱు ♦ ధరణిసురుల
రూపములు కొంద ఱూనిరి♦పూపచనుల, పడుచులై కొంద ఱరిగిరి♦పతులఁగనుచు.

సీ॥ కొందఱు వారలే ♦ కూడని వారలు, మేము గామనిరి సా ♦ మీరితోడ
గొందఱు సతిసుతు ♦ లొందంగ నలమిన, మేము చుట్టాలము ♦ గాము సురల
మని దూరమేగిరి ♦ మనుజుల మనిరి కొం, దఱు తేఁటులైరి మం ♦ దార వనిని
కొందఱు దిగ్భ్రమఁ♦గొందలించిరి కొంద, ఱరసి దంష్ట్రికలను♦ విఱిచికొనుచుఁ

తే॥ నెంపుఁ(?)కలను నల్లనగఁ గా♦వించుకొనుచు, వేషముల మార్చికొనిరి మ♦ర్త్యతిచేతఁ
గొంద ఱెదురగు వారిని♦గూడఁ ద్రోచి, పరుగులెత్తిరి పోవుచో♦ దెఱుఁగరాక.

సీ॥ కుండలకర్ణలు ♦ కుంకుమపంక ప, యోధరల్ మధుర ర ♦ సాధరలును
గ్రొమ్ముడుల్ వీడి ప♦దమ్ములఁ బెనఁగ ఱొ, మ్ములు మోదికొంచు నె♦మ్ములు నలంగఁ
బలవించు రోదన♦ధ్వని లంకయే గాక, భువి దివిఁ గడచుచుఁ♦దివిరి నిండ
బాలభాస్కరుఁ బోలు♦వదనంబు లొప్పారు, పతుల పాదంబుల♦పైని వ్రాలి

తే॥ తూలి సోలులోలాక్షుల♦తుఱుములూడి, తమయుఁదమపతులయు శరీ♦రములఁగప్పఁ
దచ్ఛిరోజంబులకు రక్త♦ధారలకును, సుంతయేనియు భేదంబు♦చూడలేదు.
తే॥ దురమునందు చచ్చినతమ♦దొరలమీఁదఁ, బ్రతిమలంబోలు చెలువలు♦పడుచునూర్పు
పుచ్చుచును తెప్పలార్పక♦మొత్తు యిడిరి, తనువు వేఱగు కతనఁగా♦మొనయు నిద్ర?
తే॥ అసువులను రోయు దేహంబు♦లట్లు పరుగు, లిడిరి రాణివాసము వార♦లెల్లఁగుణప
నివహమున వెదకిరి ప్రేమ♦నిగుడు కతనఁ, బతులఁ జేరి రంభాదులఁ♦బదరినారు.
క॥ తరలాక్షి గోల యొకతుక, దురమున నటియించు నట్టు♦తోఁ దచ్ఛిరముగా
సరి నిలిపి మ్రొక్కి వేఁడెను, వరుఁ జూపుము నీకుఁ బుణ్య♦ఫలమగు ననుచున్.
క॥ చెలువ యొకర్తుక నాథుని, తల గైకొని యెగురుచుండు♦తనువును గని మే
నలసెను రమ్మని పిలుచుచు, నలమి బిగియఁ గవుఁగిలించె♦నారట పడుచున్.
ఆ॥ వెదకి పతుల మేలు♦సుదతులు గనిపెట్టి, కడఁకఁ బ్రాణములను♦విడిచినారు.
దితిజనాథుఁ జేరి♦ఋతు దేవతలు కడ, చనిన వృత్తమెల్ల ♦ వినిచినారు.
తే॥ మయుని తనయ మండోదరి♦మందగమన, తుఱుముపీడంగ బాష్పబిం♦దువులు గనుల
జాఱఁగా వచ్చి తననాథు♦చక్కిఁ జేరి, కడుపు బాఁదుకొనుచు నేడ్చెఁ♦గళవళించి.
తే॥ లంకలో నున్న కాంత లె♦ల్లరును వచ్చి, యేడ్చి రురలిరి దైత్యేంద్రు♦నెదుట; లోన
ముదము నొందియు నెలుపల♦గదురనీక, తెరలి చాలఁ గుందిరి ఋతు♦దేవతలును

౧౨. పాశ పటలము. (౬౩)

తే॥ శక్రుగెల్చిన యురు కీర్తి♦శాలి తమ్ము, మరణవార్తను విని మది♦మలఁగి మండి
కనుల నిప్పులు రాల జ♦గంబు లడల, రోష భీషణుఁడై చల♦ద్భ్రుకుటి యడర.
క॥ మది యెరియఁగ మిడుఁగుఱులం, జెదరుచు నిట్టూర్పు లుబ్బి♦చెలఁగఁ బురంబుల్
పదటునఁ గలిపిన రుద్రుని, పదురున నెఱిఁ జూడరాని♦పద్ధతి లేచెన్.
చ॥ అమర జగంబు పైనరుదు ♦ నంపెడు వేయి పిశాచ పంక్తు లం
దముగ నమర్చి కట్టిన ర ♦ థంబు పయిన్ వెస నెక్కి వీర వా
క్యములు వచించుచున్ జనని ♦ కాయము భీతిలి పాఱ సింహ నా
దము లొనరించుచున్ జనియె ♦ దారుణ చర్యల నాచరించుచున్.
ఆ॥ వీర మద్దియలును ♦ వీర కింకిణులును, భేరు లులిసె నశని♦బృంద మడల
నింద్రు నసువు లూర ♦ కెగసిపోవఁగ నని, బలిసె నని త్రిమూర్తు♦లలఁగి మలఁగ
ఉ॥ తమ్ము మృతిం దలంపఁగనె ♦ ధారలు ధారలు గాఁగ వేఁడి బా
ష్పమ్ములు గాఱ నొక్కయెడ ♦ వాసము లేక తరూత్కరంబులం
దిమ్ముగ గంతుచుండు నొక ♦ యెల్లిదమా ప్లవగమ్ముచేత నా
తమ్ముఁడు గూలెనా? సమసె ♦ దానవనాథుని కీర్తియుం గదా?

చ॥ అని తలపోయుచుఁ జరుగ ♦ నాతనితోఁ జను విల్లువీరులన్
ఘన గదలన్ ధరించి చను ♦ కర్బురులన్ గుధరంబు రెండుగాఁ
దనుమఁగఁ జాలు దోర్బలులఁ ♦ దోరపు లెక్కలఁ దెల్పలేము స్యం
దనములు వారువంబులును ♦ దంతిఘటల్ పదిరెండు వేలగున్. ౮౯౮

చ॥ మఱియును సైన్యనాయకులు ♦ మానుగఁ జేరుచునుండఁ గన్నులన్
విరివిగ బాష్పముల్ కినుక ♦ పెచ్చుగ నించిన యింద్రజిత్తు త
త్తఱమున వచ్చి చేరెఁ దన ♦ తండ్రి వసించు కన ద్విశాన సుం
దరతర సౌధముల్ గనక ♦ దండ భటాలి మహానిరోధమున్. ౮౯౯

ఉ॥ చేరి నిశాచరేంద్రునకుఁ ♦ జేతులు మోడ్చి యనుంగుఁ దమ్మునకై
యారటమందఁ బంక్తిముఖుఁ ♦ డాదట నాతని గాఁగిలించి క
న్నీరొలికించెఁ జెంతఁ గల ♦ నీరజనేత్రలు దుఃఖమొంద న
వ్వారలఁ దేర్చి యవ్వలకుఁ ♦ బంపి సురేంద్రజితుండు తండ్రితో. ౯౦౦

చ॥ ఇతరుల చేఁగూర్చి యొక ♦ యించుకయైనఁ దలంప కిప్పు దుః
ఖితమతి వోట యేమిటికిఁ? గీశుని చేవయు నేర్పు పెంపు నూ
చితమయి యుండియుం జనుఁడు ♦ సేయుఁడు పోరని పంపి పంపి నీ
దితిజ బలంబు నెల్లఁ గడ ♦ తేర్చిన వాఁడవు నీవ కావొకో? ౯౦౧

ఉ॥ కింకరులాదిగాఁగఁ జని ♦ గీటడఁగం జనినారు కాక యా
వంకకుఁ గ్రమ్మఱిల్లిన దెవండు శరీరముతోడ నయ్య! మా
నాంకుని పోలు సూనుని వ ♦ నాటుని వాతను పెట్టి చూచెదే?
యింక జయింపమా? యనుట ♦ యేటికి? నయ్యది తెల్పికార్యమే?

ఉ॥ దిక్కరులన్ జయించితివి ♦ తేఁకువ నెత్తితి శంభు భూధరం
బుక్కున లోకముల్ గెలిచి ♦ తొక్క ప్లవంగమునకై తపించుటల్
చక్కటియే? వహింపుము ప్ర ♦ శాంతము వానరుఁ బట్టి యేనె నీ
చక్కికిఁ దెచ్చెదన్ బరవ ♦ సంబున నుండుమయంచుఁ గ్రమ్మఱన్.

ఉ॥ ఓడిన చీఁకటుల్ మరల ♦ నుగ్రతపం బొనరించి చేవతోఁ
గూడిన మేను లొంది రవి ♦ ఘోర కరంబులె భూమిఁ గాలిగాఁ
బోఁడిమిఁ దాల్చి శత్రుపల ♦ ముల్ రుచిచూచిన శాత ఖడ్గముల్
నాఁడెముగా ధరించిన వ ♦ నందగి వచ్చెఁ జమూ సమూహముల్. ౯౦౪

ఉ॥ మావులు తేరులుం గరులు ♦ మత్తులు చేరిన దైత్యసైనికా
రావము వార్ధిఘోషముఁ గ ♦ రంబు జయింపఁగ వీర ఘోర సే
నా వనరాశి మధ్యమున ♦ నాణెముగా వెలుఁగొందు మేరువన్
కైవడి నొప్పె వీరవర కర్మము ♦ నూనిన మేఘనాదుఁడున్. ౯౦౫

చ॥ జనములు వేల్పులుఁ మునులు ♦ జంకు వహింపఁ బ్రయాణ భేరికా
నినదముతోడ లేచు రజ ♦ నీచర నాథ కుమారుఁ డప్పు డ
య్యనువునఁ బోరినట్టి యని ♦ లాత్మజు ధైర్య పరాక్రమంబులన్
మనమున మెచ్చి శాత్రవు ను ♦ మాశము శూరులు మెత్తురే కదా!

సీ॥ శవమయమైన యీ ♦ సంగరస్థలి గొప్ప, రక్తపంకమున న ♦ రాజు లోనరఁ
గదలుచుండుటచే న♦గంబులు నదులు కా, వనములు గల భువ♦నంబుఁ బోలి
వెలయుచున్నదిగదా? వీరవర్యులు లోక, ముల జయించిన దైత్య♦కులమువారు
పెక్కండ్రు నశియించి♦రొక్క వానరుచేత, నేమి చోద్యం బిట్టు♦లెన్నఁడయ్యె?
తే॥ నింక రాముఁడే తమ్మునితో♦నిటకు రాఁగఁ, బ్రజ్ఞలం బల్కు యే వీర♦బలము గొనుచుఁ
గలన నెదిరించి విజయమ్ము♦గాంచువార, మనుచుఁ జింతించె గొంత సే♦పసురరేడు.

సీ॥ కనులఁ బోలినవారు♦మనముఁ బోలినవార, లలవు బలము గల్గి♦యరయువార
లైయట నీల్గిన♦యసురవరుల నసం, ఖ్యాకులఁ గని నిల్చి♦యాడు గఱచి
కోలను ప్రణమున♦గ్రుచ్చిన క్రియ నొచ్చి, తపియించి రోషంబు♦దర్పమొంది
వనమున నత్తకు ♦ నొనరిన యవమతి, ఖరదూషణాదుల ♦ కాడుపాటు
తే॥ ప్రాణధనమైన తమ్ముని♦పఱచుపాటు, తక్కువారల మరణంబుఁ♦దలఁచి తలఁచి
నరులచే నొక్కకోఁతిచే♦జరిగె నింత, ప్రాభవం బేటికని చాలఁ♦బరితపించె. ౯౦౮

సీ॥ మరణించు దైత్యులు♦మండెడు చోటుగాఁ, గనిపించు నట నీడ్వఁ♦గాని కుణప
పర్వతంబులు నట్టు♦పఱుపంగ జరగు పు, రందరజిత్తు సూ♦ఱంగఁ బడిన
యనుజు కళేబర♦మును తన కన్నులు, కరఁచిన తామ్రంబు♦కరణి వెలుఁగఁ
గినుకతోఁ గని తార♦కుని నెత్తు రనఁదగు, వెల్లువ బీభత్స♦విధముదోఁప
తే॥ ఖర నృసింహ నఖర దంష్ట్రి♦కా విదారి, తోగ్ర కనకకశిపు తను♦వ్యుత్క్రమంబు
కరణిఁ గనఁబడఁ దన తేరు♦నురక నిలుపఁ, జేతి ధనువును జాఱ ని♦శ్చేష్టుఁడయ్యె.

ఉ॥ నీరును నిప్పు నెత్తురును ♦ నేత్రములన్ వెలివాఱ దుఃఖ దు
ర్వార మనస్కుఁడై యసుర ♦ రాజ నిదేశము మీఱి చంపఁగా
నేరఁడు కాలుఁ డీ జగము ♦ నేరదు తండ్రికి లోఁకువౌట నీ
వే రహి నెందు డాఁగితివో ♦ యించుక నేరను కాదె తమ్ముఁడా! ౯౧౦

చ॥ అని సహియింపలేక మతి ♦ యల్లల నాడఁగఁ గుందు వేళఁ గో
పన గుణమొండె కాదె పరి ♦ భావ వికారములెల్ల మాన్పు? న
య్యనువున నింద్రజిత్తు వగ ♦ యంతయుఁ బైకొను మేకు క్రింది మే
కును వడిఁ గ్రుంచు వైనమునఁ ♦ గోపముచే మఱుఁగయ్యె వ్రేల్మిడిన్.

ఆ॥ అట్టి తరుణమంద ♦ యరదంబుపై నున్న, యింద్రజితుని గాంచె ♦ నీరసమునఁ
ద్రిపుర దాహమునకు♦దీకొని లేచిన, యుగ్రుఁబోలి హనుమ ♦ వ్యగ్రుఁడగుచు

ఉ॥ వచ్చెడువాఁడె గావలయు ♦ వాసవు గెల్చిన జోదు మున్ను నే
నచ్చుగఁ గాంచినట్టి విజ ♦ యంబు సరాలున వీనిఁదెచ్చె నేఁ
డిచ్చట గెల్పుటో యఱుటొ ♦ యెన్నఁగ నొక్కటె తక్కియుండు నా
క్రచ్చును దీఱవచ్చె నిది ♦ గాదె మహోదయ వేళ నాకగుఁన్. ౯౧౩

ఉ॥ వీఁడు నశించెనేని యది ♦ విశ్రుత రావణ నాశహేతువా
వీడును జానకిన్ విడుచు ♦ వేల్పులతేఁడు మనోవిభీతియున్
వీడును దైత్యసంఘ మవి ♦ వేకవుఁ జేష్టల లంక యిప్పుడే
వీడెను రక్షరావణుని ♦ పేరిమి గెల్చినవాఁడ నయ్యెదన్. ౯౧౪

చ॥ అని తలపోయుచుండ దను ♦ జావళి మావులుఁ దేరులుం గరుల్
మొనయుచు మూఁడులోకముల ♦ ముమ్మఱు లోరిచి కాఁక దేఱు మే
ఘ నినదు ముంగలై భయద ♦ గర్జనముల్ పొనరింప నంజనీ
తనయుఁడు కోపగించి యొక ♦ తాలము గైకొని కొప్పరింపఁగన్.

సీ॥ తాఁచిన కరులును ♦ త్రోచిన కరులును, పొరలిన కరులును ♦ మరలు కరులు
దొరలిన కరులు పై ♦ నురలిన కరులును, త్రుళ్లిన కరులును ♦ త్రెళ్లు కరులు
విఱిగిన తేరులు ♦ తఱిగిన తేరులు, ముడిగిన తేరులు ♦ నడిగినవియు
చెదరిన తేరులు ♦ నదరిన తేరులు, పగిలిన తేరులు ♦ నగలినవియు

తే॥ నుగ్గులై బొగ్గులై యిగ్గ ♦ ముగ్గఁ బడిన యిరుసు లూడిన చక్రంబు ♦ లిఱుఁగ్రుంగి
వాలి కూలిన యవియునై ♦ వారణములు, స్యందనంబులు నలఁగె నా ♦ సమరభూమి

సీ॥ తలలు నలఁగి కుత్తు ♦ కలు త్రెవ్వ వైచి క, న్నులిడ్డు చెదరి కాళ్లు ♦ కుదియఁగూలి
నడుములు విఱిగియుఁ ♦ గడుపులు తఱిగియు, ఱొమ్ములు పగిలియు ♦ నెమ్ములగలి
కీళ్లూడి నెత్తురు ♦ బొళ్లున గ్రక్కి కు, ప్పలుగూలె బవరాన ♦ వాహనములు
పట్టువడినవారు ♦ గిట్టి పడినవారు, క్రుంగఁబడినవారు ♦ క్రమ్మువారు

తే॥ కఱచి వాలంబుతోఁ జుట్టి ♦ చఱచి తన్ని, మెడల నుల్చి తోళ్లులనొల్చి ♦ కడుపు ప్రీల్చి
నడుము విఱిచి శిరము వ్రచ్చి ♦ నలఁచుచుండఁ, గూలివారు నక్తంచరు ♦ కోటులెల్ల.

చ॥ గుణునుగ విండ్లు వంచి విడు ♦ కోలలు తక్కిన యాయుధంబులున్
బడి హనుమాను మేనిపయి ♦ వ్యర్థములయ్యె నయశ్శిలాక ను
గ్గడువుగ గ్రాఁగి డాకలిని ♦ గాల్పని తీరున నెట్టి లేచుచున్
మిడుఁగుఱు లుప్పతిల్లి ధర ♦ మీఁదఁ బడెన్ నశియించె వానితోన్.

చ॥ అదిగని యింద్రజిత్తు మది ♦ యట్లుడుకన్ జ్వాలదగ్ని సంయుత
ప్రదరము లాంజనేయు పయి ♦ వైవఁగ నయ్యవి కాలి మాఁడుచుం
జెదరుట గాంచి యొంటిమెయి ♦ నిల్చిన దోర్బలశాలి నవ్వుచున్
బెదరక రమ్మ రమ్మనుచుఁ ♦ బిల్చుచు డాసె మహోగ్రమూర్తియై

ఆ॥ పిడుగులెల్లఁ బెటిలి♦పడఁ బురందర శిర, మదర శేషు శిరము♦లటమటింప
నండ కుహర మడలి♦యల్లలనాడఁ డం, కృతి యొనర్చె గడఁక♦నింద్రజిత్తు.

ఆ॥ అండగోళమెల్ల♦నడలి బ్రద్దలువాఱఁ, గొండ లదరి దొరలఁ♦గువలయంబు
దిశలు పగులఁ దెగయుఁ♦దెగ నార్చె శ్రీరామ, దూత యుప్పళించి దోర్యుగంబు.

ఆ॥ మేలుమేలు మిగుల♦మెచ్చితి నీవంటి, వీరులెవరు తెంపు పెంపునందు?
నేఁడు ముగియ వచ్చె♦నీజీవితపు మితి, యనుచు మేఘనాదుఁ♦డార్చియాడె.

చ॥ తులువల జీవితంబులకు ♦ దుష్ట విచేష్టలకున్ గళంక దు
ష్కులములకున్ సుకార్య విని ♦ షూదన ధృష్ట మహాయుధాళికిన్
జెలఁగె ముగింపుకాల మది ♦ చేయఁగ వచ్చితిఁ జూడు నన్ను నా
బలమున కెల్ల లేదు బల ♦ వైరిని గానవె నాంజనేయుఁడున్. ౯-౨౩

ఆ॥ పరఁగ వీనికున్న♦బలమందు నమ్మిక, తొలఁతునంచు వాఁడి♦తూపు లేసి
యురము శిరము నొంచి♦విరివిగ నెత్తురు, వఱలఁ జేసె నింద్ర♦వైరి యంత.

ఆ॥ చిన్నతల్లి పలుకు♦శిరసావహించి రా, జ్యంబు వదలి ధర్మ♦మందు నిలుచు
రాము కీర్తిపోలె♦రహి నాకసము నంటఁ, బెరిఁగి నిలిచె హనుమ♦భీకరముగ.

తే॥ భూరి దశదిశా యుతమునౌ♦భువనములకు, నాయకుండగు హరిహయు♦నలఁచికట్టి
నట్టి మేఘనాదుఁడు గాలి♦పట్టి రూపు, పూర్తి గనలేక దిగ్భ్రాంతిఁ♦బొంది నిలిచె.

ఆ॥ దీర్ఘ భుజము చాఁచి♦దితివంశ్యుఁ డేసిన, యలుఁగు లొడిసి పట్టి ♦ యతని నేసి
వానిరథము తురగ♦పంక్తితో సారథిఁ, జావమోఁదె రామ♦సేవకుండు. ౯-౨౭

ఆ॥ పవన జవన వాజి♦నివహంబుఁ బూంచిన, వేఱు తేరి నెక్కి♦విదిత బలుఁడు
పవనసుతుని మీఁద♦బహువిధ చక్ర స, న్నిభ శరంబు లేసి♦నించి కప్పె. ౯-౨౮

ఉ॥ మారుతి మేనినంటి పలు ♦ మార్గణముల్ తగ వ్రేలుచుండ న
మ్మాఱిన సాయకావళుల♦మేను విదిర్చి తొలంచి ధీరతం
దేరికి దాఁటి లోకములఁ♦దేఁకువ గెల్చిన వానివిల్లు దో
స్సారముచే వడిం దిగిచి ♦ చాఁగఁబలాడె నిలింపు లుబ్బఁగన్.

ఉ॥ పెళ్ళున చేతి విల్విఱుగు ♦ భీకర శబ్ద మడంగు నంతలోఁ
గ్రుళ్ళుచు నింద్రు నోర్చిన గు ♦ రుద్ధరి సంగరమందు గొన్న పె
న్విల్లు ధరించి రావణియు♦నిందు తెగన్ శరరాజిఁ గూర్చె వే
వెల్లిగ నేయ మారుతియు♦వెక్కస పాటున సోలి యంతలోన్. ౯-౩౦

ఉ॥ లేఖులు సంతసిల్ల వడి ♦ లేచి మహోద్ధతి నార్చె నుల్లస
ద్వైఖరి నొక్కసాలము జ ♦ వంబునఁ గైకొని పేర్చి లోక జీ
వాఖిల భీకరంబుగ సు ♦ రారి శిరంబును చూచి వైచెఁ ద
చ్ఛాఖలఁ జిక్కి నొచ్చి వివ ♦ శత్వము నొంది యతండు తేఁకుచున్.

చ॥ పటపట పండ్లు గీటుచు సు♦పర్వులు దిగ్భ్రమ చెంది నిల్వ ను
త్కట గిరి కైవడి న్నిలుచు ♦ గాడుపు పట్టి యొడల్ చలించి లం
పటగొనఁ బుంఖపుంఖ మను ♦ బంధముగాఁ గొన రింగు రింగునన్
జటపట శబ్దముల్ పఱవ ♦ సాయక జాలము లేసి నొంపఁగన్. ౯౩౨

చ॥ శిరము నురంబు బాహువులు ♦ చివ్వన గ్రుచ్చుచు నొంప నొచ్చి యు
ద్ధురతర రోష భీషణత ♦ దూఁకొని శ్రీ రఘు వీర బాణ వై
ఖరిఁ జని మారుతాత్మజుఁడు ♦ కర్బురు తోడను వాని తేరి నం
బరమున కేగ మీఁటి ఘన ♦ బంధుర గర్జ యొనర్చి మించఁగన్. ౯౩౩

క॥ కనుమూసి తెఱచునంతనె, ఘనుఁ డింద్రజితుఁడు శతాంగ♦గతుఁడై మిన్నె
ల్లను గాంచి నెత్తు రొలుకుచుఁ, దనుకుచు ధరమీఁద బడెడు♦తత్సమయమునన్.

తే॥ ఎక్కటకుఁ దేరు నెదిరింప♦నుక్కు లేమి, మదిని కుములుచు నప్పంక్తి♦వదనసుతుఁడు
వేఱుమార్గంబు గానమి♦మాఱులేక, చంపు బ్రహ్మాస్త్రమును బ్రయో♦గింపఁదలఁచె

—: హనుమంతుఁడు బ్రహ్మాస్త్రముచేఁ గట్టువడుట :—

మ॥ విరి పుష్పంబులు ధూప దీపములు నై ♦ వేద్యంబు ధ్యానంబుతో
స్థిరభక్తిన్ మది నర్చనల్ సలిపి దృ ♦ గ్దృశ్యాది శశ్వచ్చరా
చర సృష్టిం దగఁజేయు ధాతృశరమున్ ♦ సంధించి భూనాక భీ
కర లీలన్ హనుమంతు బాహువుల ల ♦ క్ష్యం బుంచి యేసెన్ వడిన్.

ఆ॥ అమరు లడలు వచ్చి ♦ యయ్యమోఘాస్త్రంబు, సర్పరాజ రూప ♦ సరణి మెఱసి
ఖగకులాధి పతియుఁ♦గదిరి దిగ్భ్రమఁ జెందఁ, బవన సుతుని కేలు♦పట్టి చుట్టె.

మ॥ బల సంపన్న శరీర మావిధమునన్ ♦ బ్రహ్మాస్త్ర బద్ధంబుగా
విలయాంతోగ్ర విధుంతుద గ్రసిత ని ♦ ర్వీర్య ప్రభాయుక్తమై
నిలకుం ద్రెళ్లిన చంద్రుఁడో యనఁగ ను♦గ్రేక్షాంశుఁ డవ్వేళ నో
ర్తిలి వెన్నంటిన ధర్మదేవతయు నా ♦ ర్తిం బొంద భూమిం బడెన్.

మ॥ వనవాటీ బహిరంగణంబున జగ ♦ త్ప్రాణ ప్రమోదుండు త
ద్ఘనపాశంబు విరించనాస్త్రమనియున్ ♦ దన్ముక్తిం, దా నేర్చియున్
వనజాతాసను వాక్యముం దలఁచి ని ♦ ర్బంధంబు నంగీకృతిన్
గనుల న్మూసెను డాసె నింద్రజితుఁడున్ ♦ గౌతూహల స్వాంతుఁడై.

మ॥ అసువుల్ దక్కనఁ జాలునంచు వడి ము ♦ న్నత్యంత భీతాత్ములై
చెనలం దూఱిన దైత్యు లప్పుడు మహా ♦ ధీరాత్ములై డాసి వె
క్కసమై చుట్టిన నాగపాశమును పీఁ♦కం బట్టి యాడించుచుం
గసి దీఱం గని తిట్టి రార్చిరి మహా ♦ గాంభీర్యముల్ సూపుచున్.

ఉ॥ కోఁతిబలంబు క్రుంగె నని ♦ కేరుఁతలు వెట్టుచు గంతులేయుచుం
బ్రీతి వహించు లంక యొక ♦ భీకర వారిధి పొల్పుదోఁచె న
వ్వాతసుతుం గవించు నహి ♦ వాసుకిఁ బోల నిశాచరుల్ సుర
వ్రాతముఁ బోల నొప్పెసఁగె ♦ వాయుజుఁ డయ్యెడ మందరాద్రినాన్.

మత్త. నాగపాశ నిబద్ధ మారుతి ♦ నవ్య కాంచన దేహముల్
బాగుగా గమనించి చూడఁ బ్ర ♦ భంజనుండః కదల్పఁగా
భోగిరాజు కదించి చుట్టిన ♦ భూరి భూధరమో యనన్
రాగిలెన్ స్థిర చిత్రతన్ రుచి ♦ ర ప్రభా లస దంగితన్. ౯౪౩

చ॥ పురుషులు చెల్వలుం గలిసి ♦ మూఁగిరి దిక్కులు భూతలంబు నం
బరమును సందులేక వడి ♦ వాయుజుఁ గాంచిరి పొంగియార్చి ర
ప్పుర మపుడొప్పె మున్ను సుర ♦ ముఖ్యుఁడు పట్టువడంగ నైన నం
బరమును సంతసంబు వెలి ♦ పాటును పొంది రహించు కైవడిన్.

౧౩ పాశముక్తి పటలము (౧౪౦)

సీ॥ ఏయుఁడు నఱకుఁడు ♦ వ్రేయుఁడు పొడువుఁడు, చీల్పుఁడు ప్రేవులు ♦ వేల్పుఁ డనుచుఁ
ద్రెంపుఁడు త్రుంపుఁడు ♦ తినుఁడు మ్రింగుఁడు కొంది, పచ్చడి సేయుఁడు ♦ బ్రదికెనేని
మన జీవితంబులు ♦ మూఁడు ననుచు డాసి, పురుషులు తరుణులు ♦ మునరి కసరి
యిందాఁక నుసుఱుండ ♦ నిత్తురే యనుచును, తలను రోఁకండ్లతో ♦ దంపుఁ డనుచు

తే॥ నగ్నిలోనై చికాల్పుఁడీ ♦ యనుచునంజు, కొనుఁడీయంచు నేలనురాచుఁ ♦ డనుచుఱాలు
కట్టి కడలిఁ ద్రోపుండని ♦ నెట్టుఁ డనుచు, వారివారికిఁ దోఁచిన ♦ పగిది ననిరి.

క॥ నాతండ్రిని నాయన్నల, నాతమ్ముల నొప్పగించి ♦ సదువు మనుచు వీఁ
డీతిరు రాఁగతను న్వ, జ్ఞాతుల దీకనుచు వారిఁ ♦ జంపుం డనుచున్. ౯౪౬

ఉ॥ కొండలవంటి దార్ఢ్యము న ♦ కుంఠిత సత్త్వము గల్గు భర్తలన్
గొండొక వీడియుండ మిఁక ♦ గోడుగ నేడువనేల కోఁతి పె
న్మొండము ద్రొక్కి నిల్చి పెడ ♦ మోముల నూడ్తము తాళిబొట్టులన్
మొండలమైతి మంచు వెత ♦ ముచ్చిరు చెల్వలు పల్వు రయ్యెడన్. ౯౪౭

తే॥ ఈడ్చుకొని పోవువానికి ♦ నెదురు వచ్చు, లంక జనములు సేయు కో ♦ లాహలంబు
పతులు మరణింప విలపించు ♦ సతులకెల్ల, నించుకంత సమాశ్వాస ♦ మొనయఁజేసె.

ఉ॥ వీరుల గొరులన్ హరులఁ ♦ బెంపగు తేరుల నెత్తివైవ బృం
దారకనాథ వజ్రహతి ♦ ధాత్రీధరంబులమాడ్కిఁ బడ్డ సిం
గారము గల్గు వీథుల న ♦ గారములన్ గని సంతసిల్లుచున్
మారుతి పోవుచుండె నల ♦ మానుష భోజను లీడ్చు త్రోవలన్. ౯౪౯

ఉ॥ చీమల కూటువల్ ముసరి ♦ చెట్టును చుట్టిన యట్లు సంగర
స్థేమము నొందు బాహువులు ♦ దివ్య భుజంగ నిబద్ధమౌట కాం
తామణు లారఁ గాంచక వి ♦ తాకున నీకపి వచ్చె నీడ క
మ్మా! మన కేది దిక్కనుచు ♦ మాసిరి చేష్టలు కొంద ఱుత్తలన్. ౯౫౦

చ॥ పలువురు చూచి నివ్వెఱగు ♦ పాటున నేడ్చిరి విహ్వలించుచున్
పలువురు వెన్క నేమిగతి ♦ పట్టునొ యంచొగిఁ బాఱి రవ్వలన్
బలువురు పాఁపత్రాళ్లు లొక ♦ పాటిదె యంచు వచించి రొయ్యనన్
బలువురు కీర్తించి రల ♦ వాయుజ వీర విహార లీలలన్. ౯౫౧

ఉ॥ కొందఱు పిచ్చలించి కని ♦ క్రూర భుజంగమ పాశ మీ మరు
న్నందను మేనఁ బూసరము ♦ నా నెముగాఁ బెనవై చినట్టు లిం
పొంద వెలుంగుచుండెను స ♦ మున్నతి నాస్యము సత్ఫలంబులన్
డెందములందు తేటిచి ఘ♦టించుట మేలని యాడి రయ్యెడన్. ౯౫౨

తే॥ రాజుకడకుఁ గొంపోవుట ♦ రాణ కాదు, క్రుంగి వీఁడుంట కట్టుల ♦ లొంగి కాదు
వెనుక యాలోచనము వేఱు♦ వెతలు గలుగు, ననుచు వాయుజుఁ గని క్రుమ్మొక్కి♦ యణఁగినారు.

తే॥ వైనతేయుని మించిన♦ బాహుబలులు, దైత్యు లేఁబదివేలు గం♦ధవహుతనయుఁ
గట్టిసట్టి పాశంబును♦ పట్టి లాగి, కొనుచుఁ బోవుచుండిరి వేడ్క♦ కొనలుసాగ.

క॥ అంతకుఁడు బల పరాక్రమ, వంతుల దైత్యుల నడంప ♦ స్వాకృతితో రా
స్వాంతమున జడిసి యీ వహి, వింతగు రూపంబు గొని క♦వించెనో యనుచున్.

చ॥ దనుజ చిరంటికల్ ఘన సు ♦ ధా ధవళంబగు సౌధ వీథులన్
మనుకొను చంద్రశాలలను ♦ ముంగిళులందున దిడ్డియందు వా
దనములు గల్గు చోటుల ము ♦ దం బలరారఁగఁ జూడవచ్చి యీ
వనచరుఁ డెందు వాఁ డితనిఁ ♦ బంపిన దెవ్వరొ యంద్రు నివ్వెఱన్.

తే॥ మడఁతి సీత పాతివ్రత్య♦ మహిమచేత, లేఁపఁగా ఖండపరశు పీ♦కృత్రిమంపు
రూపుగొని యందమైన లం♦కాపురంబు, మాలుపంబూని వచ్చెఁ గాఁ♦బోలుననిరి

తే॥ అమరకాంతలు విద్యాధ♦రాంగనలును, భుజగకన్యలు చక్కరఁ♦బోఁడులైన
సిద్ధవనితలు మత్తకా♦శినులు జక్కి, ణులును కలకలమని వచ్చి♦ మొలసిచూచి.

తే॥ వారిధిని యోగనిద్ర నొ♦ప్పారుచక్రి, సృష్టికర్తయై వెలయుఁ వి♦రించియుఁ బగ
పూని తమతమ రూపముల్ ♦మాని యొక్క, దేహముంగొని భూమికి♦ దిగిరొ యనిరి,

ఉ॥ దైత్యులు దైత్యకామినులు ♦ దక్కఁగఁ దక్కిన యక్ష కిన్నరా
దిత్య భుజంగ సిద్ధ సుద ♦ తీమణు లెల్లరుఁ గాంచి డెందమం
దత్యనురాగలై కనుల ♦ నశ్రులు నించిరి ధారణీ సుతా
నిత్యహితంబు గోరుటనొ? నిర్మల ధర్మము నాశ మౌటనో? ౯౬౦

క॥ వీరుఁడు మారుతి యిదియే, కారణముగ నిల్లి వేఱు ♦ గాక చనుచు లం
కా రమణుం గాంచుట నా, కారయ లగ్గనుచు నెంచి♦యటులే యరిగెన్. ౯౬౧

ఉ॥ నాజనకుండు వాయు కరు ♦ ణన్ రఘురామ పదారవింద హృ
త్పూజను తల్లి రామసతి ♦ పూర్ణమతిన్ దయసేయు దీవనన్
జేజె లొసంగు సద్వరము ♦ చేతను వారిజగర్భు నస్త్ర మి
య్యోజనె త్రెంచికొంగలను ♦ ప్రోద్బల పద్ధతిఁ జేయ నియ్యెడన్. ౯౬౨

తే॥ రాక్షసేంద్రుని సంధించి ♦ రాజిత గతి, నెల్ల గెలుఁగంగ రఘురాముఁ♦నీద్యశక్తి
సంభవించు పరిస్థితుల్♦చక్కఁ దెలుప, దిటవు చెడి జానకిని వీడఁ♦దివురవచ్చు.

ఉ॥ అంతియుకాక వాని సచి ♦ వాప్త చమూబల సంపదాళియున్
సంతనగా నెఱుంగనగుఁ♦జక్కటి దెల్పఁగవచ్చు రావణ
స్వాంతము జాడయున్ దిటవు ♦ సంస్థితి గానఁగవచ్చు వాఁడు త
త్స్వాంతము దాఁచినన్ మొగము ♦ తప్పక చెప్పదె యెల్ల రీతులన్ ?

తే॥ వాలి నిధనంబు మఱి సాల♦భంజనంబు, వానర బలంబు రవిజు న♦వార్యగరిమ
తెలియఁ దెలుపఁగవచ్చును♦తెలిసినంత, మదికి నాటినఁ జెడుగులు♦మానవచ్చు.

ఉ॥ కావున నేగుటే తగిన ♦ కార్యము రామ పరాక్రమ స్థితుల్
రావణుఁ డాలకించి తగు ♦ రాణఁ జరించిన లెస్స కాదయే
నావలఁ గొంచెకొంచెముగ ♦ నబ్బిన దానవసేనఁ గూల్చి ధా
త్రీవరుఁ జేరుటే తగిన ♦ తీరని మారుతి యేగె నారితో. ౯౬౬

ఆ॥ గొప్పసేన తన్ను♦గొలిచి రా నృపభంబు, పగిదిఁ గట్టువడిన♦వాయుసుతుని
రాజ సౌధమునకు♦రాణతోఁ గొంపోయె, నెల్లవారు చూడ♦నింద్రజిత్తు. ౯౬౭

క॥ దూతలు మున్నుగ వెసఁ జని, దైతేయప్రభుని గాంచి ♦ తలిరుచు భక్తిన్
వాతూలి కట్టువడె జల, జాతాసను నస్త్రమునఁ బో♦సంగఁగ ననుచున్. ౯౬౮

తే॥ వినిన యంతఁ దుత్సహించి యు♦ప్పొంగుచువారి, కిచ్చె దిగ్గన రదనంబు♦లీడ్చికొన్న
తారహారంబు తనకొమ్ము♦నూర చంద్ర, రహిత గగన స్థలంబను♦రహి వెలుంగ.

తే॥ అమిత కౌతూహలమున బా♦హాలి వొంగ, గండొవలు వికసింప లం♦కావిభుండు
సత్వరంబుగ మీఁ రేగి చంపకుండఁ, గోఁతి నిటకుఁ దోడ్తేరఁ బ♦ల్కుఁడని పంపె.

క॥ వార్తాహరు లరిగి విభుని, వార్తను తనయునకుఁ దెలుపఁ♦బరవిన యది య
వ్వార్తపుర మెల్ల నది విని, యార్తిని మదిగుంది సీత♦యమిత వ్యథచే. ౯౭౧

ఉ॥ కావలిగల్గు నీవనముఁ ♦ గాడుగఁ జేసెను పట్టవచ్చు దై
త్యావళిఁ గూల్చెనంచు విని ♦ యప్పటి కప్పుడ సంతసించితిన్
బావని యిట్టి యాపదల ♦ పాలగుటం దలపోయ దుర్విధుల్
పోవవు నన్ను వీడి యని ♦ బుద్ధిఁ దలంచెద నంచుఁ గుందుచున్ ౯౭౨

ఆ॥ ఒడలు ధూళిఁ గ్రుంగ♦నొడిదంపుఁ జిత్రంబు, పొగచు కరణి నొప్పి♦భూమిపుత్త్రి
చెదుగు మృగయుచేతఁ♦జిక్కిన పోతంబు, కొఱకు నేదు హంసి♦కరణి వగచె.

తే॥ మింటి నంటెడి పొడవగు♦మేను గలిగి, సర్వ విద్యల నేర్చిన♦చదురు గలిగి
జలధి దాఁటిన యలవును♦బలువు గలిగి, యక్కటా! చిక్కితివె యొక♦యసురుచేత

చ॥ తగవె జయించు నిక్కమను ♦ తద్జ్ఞుల పల్కులు పొల్ల యయ్యె నీ
దగు బలశక్తు లిక్కరణి ♦ నాఱెనె? పాపమె గెల్పు నొందెనే?
జగతిని ధర్మమే నిలువఁ ♦ జాలక తాఱెనె? యక్కటక్కటా!
నెగుళులపై నెగుళ్లు లిటు ♦ నిల్వనఁ గాల్చెనె నన్ను నిచ్చలున్? ౯౭౫

ఉ॥ ముద్రిక నిచ్చి ప్రాణములు ♦ ముచ్చట నిల్పిన నీకుఁ బ్రీతిమై
భద్రములం జిరాయువును ♦ పల్కితి నయ్యది తప్పదంచు నీ
క్షుద్రుల గీటడంప భుజ ♦ శూరతఁ జూపఁ దలంచి యిట్లు సో
పద్రవ మార్గగుండవయి ♦ ప్రబ్బు గడించితి వాయునందనా! ౯౭౬

మత్త॥ ప్రాణదాతవు నీవు నాపదు ♦ పాటు లచ్చటఁ దెల్పి నా
ప్రాణనాథుని తోడి తెత్తువు ♦ రాముఁ డాజిని రావణ
ప్రాణముల్ తొలఁగించి నాచెఱఁ♦బాపునే యని యో జగ
త్ప్రాణనందన! నమ్మియుండఁగఁ ♦ బాడు చేసితి వన్నియున్. [వడిన

తే॥ అనుచుఁ బలువార్తలాడుచు♦మనసు కరఁగఁ, బ్రాణములు చలింపఁగఁ గ్రేపు♦కట్టు
గోవువలెఁ దపించుచు గ్రుంగి ♦ కోమలాంగి, సీత మేదినిపై సొమ్మ♦సిల్లి వ్రాలె.

ఆ॥ అట మహాత్ముఁడైన♦యంజనీ పుత్త్రకు, నిఱియఁ గట్టినట్టి ♦ యింద్రజిత్తు
తొలి తపఃఫలమునఁ♦దొడరి జగంబుల, గెలిచినట్టి యసుర♦కొలువుచేరె. ౯౭౭

సీ॥ ముల్లోకములు వెల్గు♦ముద్దు చంద్రుండనఁ, గ్రుచ్చి యెత్తిన వెండి♦కొండ యనఁగ
ముత్యాల గొడుగు స♦మున్నతి వెలుఁగఁ జ, క్ర పవి శూలంబుల♦వ్రణ వితాన
మతివల నఖ రేఖ♦లలరారు వింశతి, బాహుల నంగద ♦ ప్రభలు వెలయ
నురుకోప వహ్నిచే♦నూర్పుల పొగలచే, వడగాలి వడ దెస♦నడరె ననఁగ

తే॥ మరకత ద్యుతి ప్రతతితో♦మణుల శోభ, నరకమున కేగి దాఁగిస♦యిరుల గ్రమింగ
శేషుఁ డన్ని దిక్కులకును ♦ శిరము లలరఁ, ద్రిప్పి పేరోలగంబున♦నొప్పెననఁగ.

ఉ॥ తేర్చి ఖచించినట్టి మణి ♦ దీప్తులు కాసియ నుండి పర్వఁగాఁ
బేర్చి దివాకర ద్యుతిఁ గ ♦ వించు విభూషలు బాహుకీర్తులన్
దీర్చి వెలుంగ వారినిధి ♦ దివ్య సువర్ణ గిరీంద్ర శృంగముల్
మార్చి కిరీట పంక్తిగ న ♦ మర్చి ధరించిన చెల్వు దోఁపఁగన్.

ఉ॥ చెందిర వన్నె మీఱు కటి ♦ చేలము కచ్ఛముతో వెలుంగఁ దా
రెందు నర ప్రకర్ష మురు ♦ హీర మణి ద్యుతి నెచ్చరింపఁగా

డాంధ తమంబు సాంధ్య రవి ♦ నంతరమందు ధరించి తారకా
బృందము భూమిగాఁగఁ జలి ♦ వెల్గును ఛత్త్రముగా ధరించెన్.

తే॥ సౌరునకు వేదములకు గం ♦ భీరిమకును, తావలంబగు మొగములు ♦ దశదిశలకు
దృష్టులం ద్రిప్ప నపుడెల్ల ♦ దిగిభ పాల, కులకు ధ్రువ శేషులకు భీతి ♦ గొలుపుచుండ.

సీ॥ లోకైకనాయకు ♦ కాకుత్థ్సు దేవిని, కాంచిన పిదప నా ♦ గంబునుండి
సత్యమ్ముదాఁక నీ ♦ జగముల తరుణులు, పురుషులవలెఁ దోఁచు ♦ పొలుపు నిలువ
వానర హరి హర ♦ మానవావళి తక్కఁ, బెరవారు కేల్మోడ్చి ♦ బిరుదులాడ
వేణు వీణాదిక ♦ వినుత రవంబుతో, రంభాదు లించు న ♦ ర్తనము సలుప
లయకు ననుగుణంబుగ మద్దె ♦ లయు ధ్వనింప, హస్తములు నేత్రములు బొమల్ ♦ హరువుమీఱ
మునులు సైతము ముక్తిపై ♦ మనసు రోసి, యాడు మేనకపైఁ జూడ్కు ♦ లలర నిలుప

సీ॥ ఒకమోము పొలయల్క ♦ నూనిన సతి ముఖా, బ్జాత మరంద మా ♦ సక్తి నాన
ఒకమోము తనతోడ ♦ నొగిఁగూడి యలసిన, చెలి యధరామృత ♦ మొలసి యాన
ఒకమోము తనియ గీ ♦ తికఁ బాడు కామినీ, తారుణ్య మోహామృ ♦ తంబు నాన
ఒకమోము నర్తన ♦ మొనరించు మగువల, యభినయ రస సుధ ♦ నాన నాన

తే॥ ఒకమొగము వేల్పులకు నాజ్ఞ ♦ లొసఁగుచుండ, నొకమొగము మంత్రణంబుల ♦ నొనరఁ జలుప
నొకమొగము ఘోరపాపచి ♦ హ్నకల వెలుప, నొకమొగము జానకీరూప ♦ మూహ సేయ.

తే॥ ధరణిజాత సతీత్వమున్ ♦ శరధి నీఁది, దరిని చేరు పెట్లని యొక ♦ శిరము దలఁప
మలయజస్తనుల్ తన చుట్టు ♦ నిలిచి చూపు, ముకురమునఁ దన సౌరొక ♦ మొకము చూడ.

చ॥ తొఱటను తేనెకై చను మ ♦ ధువ్రతమట్లు ధరాత్మజాకృపై
పరుగులు వాఱు డెందమును ♦ భావనసేసి తపించువారు చ
న్గిరులను బాష్ప బిందువులు ♦ నెట్టన రాలఁ గృశించువారు నొ
తెఱవల చూపు తూపులు ప ♦ డింబడి బాహులమీఁద వ్రాలఁగన్.

ఉ॥ పుప్పొడిఁ బూసికొంచు మధు ♦ వుం దగఁ ద్రావుచుఁ దమ్మిమొగ్గ ల
ట్లొప్పిన చన్నుదోయి పయి ♦ నొందిన చందనమందు డిందుచున్
గుప్పున వచ్చు తెమ్మెరలు ♦ గొప్ప ప్రతిక్రియ సేయుకై వడిన్
విప్పగు పుష్పబాణ శర ♦ విద్ధ మహా వ్రణరాజిఁ దూఱఁగన్. ౯౮

తే॥ వాలుగంటుల యానన ♦ పద్మములకు, భాస్కరుంబోలు వాఁడై సు ♦ పర్వ వరుల
కేలుఁ దామరలకు శశిఁ ♦ బోలియున్న, వైశ్రవసుఁ గాంచె ముంగల ♦ వాయుసుతుఁడు.

ఉ॥ కాంచి భుజంగముం గను ఖ ♦ గప్రవరుం బలె నుగ్రమూర్తియై
సంచిత కర్మబంధముల ♦ జ్ఞానముచే బలె నాగపాశముం

ద్రెంచి విదిర్చి మైథిలికిఁ ♦ దీఱని శోకము గూర్చినట్టి న
క్తంచర నాథుఁ ద్రుంతునని ♦ తత్తఱమందుచు వెండి యిట్లనున్ ౫౫౦

శా॥ నిద్రం బొందిన వాని యావి గొనుటల్ ♦ నింద్యంబుగా నెంచి యీ
త్కుద్రున్ వీడితి రేయి నిప్పుడో యిటం♦గొల్చున్న వాఁ డేల య
మ్మాద్రిన్ మానుట వీనిఁ జంపి జనక ♦ క్ష్మానాథ సంజాతకున్
భద్రంబుల్ సమకూర్చి రామునకు నో ♦ ప్పంజెప్పుటే యుక్తమా. ౫౫౧

ఉ॥ రాముని దేవిఁ గైకొని చె ♦ ఱం బదిలించుటఁ జూచుచున్న దై
త్యామరపాళి యుప్పు కను ♦ లారఁ గనుంగొన వీని శీర్షముల్
దామెనగట్టి యీడ్చికొని ♦ తామరసాక్షుని చెంతకేగ కి
ట్లేమని రిక్త హస్తముల ♦ నేగుదు? నేమని విన్నవింతున్? ౫౫౨

చ॥ వెదకుచు వచ్చినట్టి యొక ♦ వీర వనేచర ముత్సహించి తా
మది గొను మానినీ మణులు ♦ మస్తములం దగ మోఁదికొంచు ది
క్పదముల కేగఁ బంక్తిముఖు ♦ బంధుర వక్త్రము లుర్విఁ గూల్చి బె
ట్టిదముగ సింహనాదము ఘ ♦ టించిన దన్న యశంబు విన్నయే?

చ॥ ఎదుటనె కాంచి దానవ కు ♦ లేశ్వరు జీవము లుజ్జగించి ప్ర
ల్లదములు గొన్ని పల్కి మఱ ♦ లం జనినాఁడనయేని అవ్వయే
కుదురు; నెదిర్చి గెల్వ కిలఁ♦గూలిన యేనియుఁ గీర్తిగాక వే
ఱొదవునె? యెట్టులైనను శు ♦ భోన్నతి గల్గుట నిక్క మివ్విధిన్.

తే॥ నాగపాశంబు తెగిపడ♦నగము మీఁది, కుఱుకు మగ సింగముం బలెఁ♦గఱుకు టసుర
పైకి లంఘింతునని తల♦పడుచు నుంత, తగదనుచుఁ గూడ వగచె నా♦శుగ సుతుండు.

మ॥ అమరారాతి వధింపఁదగ్గ సులభుం ♦ డౌనేమి? సాహాయ్య సై
న్యములం జూడ నలంతిఁ బోవఁ డితనిన్ ♦ నక్తంచర శ్రేణి వం
శముతోఁ ద్రెంపఁగ రాఘవుండె తగు; నెం ♦ చన్ సాహసోద్యోగి శ్రే
యము.లం గాంచునె? మించిపోవునొకొ దై ♦ త్యాధీశుఁ డింతింతలో?

మ॥ గెలువన్ శక్యముగాదు వీనికి ననున్ ♦ గీర్వాణులుం దోడ్పడన్
బలవంతుండగు వీని నేనును జయిం ♦ పం గాదు డీకొన్నచోఁ
దలఁపం బెక్కు దినంబు లేగు; ధరజా ♦ ధ్యక్షుండు నారాకకై
తలఁకున్ శంకిలు నట్లు సేయుటలు స ♦ త్కార్యంబొకో దూతకున్?

చ॥ జగములు సంతసిల్ల భువి ♦ శాశ్వత ధర్మము పూని నిల్ప న
ప్పగతుని రావణాసురుని ♦ బాహులు శీర్షములెల్ల మేదినిం
దెగిపడఁ గూల్తు నేనని ప్ర ♦ తిజ్ఞ యొనర్చిన రాము వాక్యముల్
తగ విని యిట్టి సేఁతకును ♦ తార్కొను టేటి హితంబు నాకగున్?

ఉ॥ ముమ్మరమైన సంగరము ♦ పూని యొనర్చుచుఁ గాలమెల్ల వ్య
ర్థమ్ముగఁ ద్రోచుచుండిన ధ ♦ రాసుత పక్షము లొక్క రెండె ప్రా
ణమ్ములు నిల్పు దాన నని ♦ నాథుని పేరఁ బ్రతిజ్ఞ సేసె నే
నిమ్మెయినైన నాజనని ♦ యీల్గుట నిక్కము నిక్క మక్కటా! ౯౯౯

తే॥ కాన బవరంబు తగినది♦కాదు నాకు, దౌత్యమే యిందు చూడ ను♦త్తమ మటంచు
నిశ్చయించి రాఘవదూత♦నిర్భయమున, రావణుని కొల్వు లోనికి♦ రాణఁ జనియె.

ఆ॥ దానవేంద్రుఁ గాంచి♦తగ నింద్రజిత్తు పా, వనిని చూపి వీఁడు♦వనచరుండు
కాఁడు హరుని వంటి♦కడిమి గలాఁడు వ, నంబుఁ జెఱచి యక్షు♦నలఁచెననుడు.

మ॥ కన నుంకించిన నేత్ర తారకలఁ బ♦ ల్కం బూను నాస్యంబునన్
ఘన ఖద్యోతము లుప్పతిల్లి హనుమ♦ ద్గాత్రంబు గాల్పంగ నా
ర్చిన నిట్టూర్పుల ధూమజాలము వెనం ♦ జిత్రంబుగా నూత్న బం
ధనమై క్రాల దశాననుండు పలికెన్ ♦ దర్పంబుతోఁ జూచుచున్.

చ॥ కులిశివో శూలివో హరివో ♦ గూఢ పదార్థుఁడవో యముండవో
జలజహితుండవో శిఖివో ♦ శక్తి ధరుండవో పొట్టి మౌనివో
పలువలు మాను లిప్పగిదిఁ ♦ బంపిన కృత్తివో ధాత లంక ని
ట్లలమఁగఁ గొత్తగాఁ బడసి ♦ యంపిన యుద్భట ధైర్యమూర్తివో?

—: హనుమంతుఁడు రావణునకు నీతి గఱపుట :—

చ॥ ఎవఁడవు నీవు? వచ్చుటకు ♦ హేతు వదెయ్యది? పంపినట్టి వా
రెవరు? నిజంబు తేల వచి ♦ యింపుము నావుడు నాంజనేయుఁ డీ
పవిది వచించు నీవనిన ♦ వారల నెవ్వఁడఁ గాను రాజ పుం
గవుఁ డనమాన ధన్వి పని♦కై యిట వచ్చిన దూత రావణా! ౧౦౦౪

చ॥ అతఁ డెవఁ డంచు వేని యజ ♦ రాదు లజాదులు మాని బృందముల్
తత సుగుణాఢ్యులుం బహు వి ♦ ధంబులఁ జర్చ యొనర్చి సేయఁగా
జత పడకుండు నక్కజపుఁ ♦ జక్కటి దీర్పఁగ దీక్షపూని యు
ద్ధతిమెయి నుద్భవించిన యు ♦ దార జగత్పరి రక్షకుండగున్. ౧౦౦౫

చ॥ బలము తపః ఫలంబు పరి ♦ వారము ధాతృవరంబులున్ యశః
కలిత గురుత్వమున్ జయము ♦ గర్వము శౌర్యము ధైర్య కార్యముల్
కలిమియు దుష్టచేష్టలు న ♦ కాండముగా నొక యమ్ముతోన యి
య్యలఁ గలుపం గలట్టి ధను ♦ రింద్రము చేకొనినాఁడు రావణా! ౧౦౦౬

ఉ॥ కాఁడతఁ డాదితేయుఁడును ♦ కాఁడసురుండును కాఁడు దిక్కరుల్
కాఁడల వెండికొండయును ♦ కాఁడు త్రిమూర్తులు కాఁడు దిక్పతుల్

కాఁడు మునీంద్రులుర్ జడలు ♦ కాఁపుల పున్నెము శంబరాదులం
దాడన సేయు నా దశర ♦ థ క్షితిపాలుని పట్టి రావణా! ౧౦౦౭

ఉ॥ జ్ఞానము సర్వశాస్త్రములు ♦ సత్తపముల్ సకలంబు మానుగాఁ
దానెది నిశ్చయించు మదిఁ ♦ దత్ఫలమే యొసఁగుర్ జగత్త్రయిర్
మానవమాత్రుఁడా యతఁడు ♦ మైనడి ధర్మము వేద శాస్త్రముల్
పూని నుతించుచుండు పరి ♦ పూతుఁడు నిర్మల ధర్మ మూర్తియుర్.

సీ॥ వేదంబులందును ♦ వేదశిరస్సుల, యందుఁ బూర్తిగఁ జూడ ♦ నందకుండు
విజ్ఞానమునకును ♦ విజ్ఞాన మగువాఁడు, ముగురు మూర్తులకును ♦ మొదలివాఁడు
మూఁడు కాలములకు♦మూఁడు గుణములకు, మూఁడు తావులకును♦ మొదలివాఁడు
గజరాజుఁ గాచిన ♦ కరుణామయుఁడు సుర, ప్రార్థనంబును విని ♦ వారికొఱకుఁ
తే॥ చక్ర శూల కమండలు ♦ సాధనముల, వదలి విలుదాల్చి ప్రాఁతవౌ ♦ వటదళంబు
వెండికొండను గమలంబు♦వీడి క్రొత్త, దగు నయోధ్యా పురంబున ♦ నవతరించె.

మ॥ తన పాదాబ్జముల న్నిరంతరము చి ♦ త్తంబందు ధ్యానించు స
జ్జన హృద్వాసుఁడు ధర్మ పద్ధతుల సం ♦ స్థాపించి తాఁబోవు తె
న్నున లోకంబు చరింప దుర్జనతతిర్ ♦ నుగ్గాడి సన్మార్గ వ
ర్తనులం గావ జనించె నాతఁడు జగ ♦ ద్రక్షామతిర్ రావణా! ౧౦౧౦

తే॥ అతని దాసుఁడ హనుమంతుఁ♦డంద్రుడనన్ను, ధరణిజనురోయఁజను హరి♦ వరులయందు
వచ్చె దక్షిణదిశకు మా♦వాలిసూనుఁ, డతఁడు పంప వచ్చిన వాఁడ♦ననుడునతఁడు

ఉ॥ వాలి సుతుండు నిన్ననుప ♦ వచ్చిన దూతవౌ నీవు? ధీరుఁడౌ
వాలికి సేమమే? ప్రభుత ♦ పద్ధతిగా నెఱవేఱుచున్నదే?
పోలఁగఁ దెల్పుమా యనుడు ♦ పూత చరిత్రుఁడు రామదూత వా
తూల సుతుండు దంతములు ♦ తోఁపఁగఁ బక్కున నవ్వి యిట్లనుర్.

ఉ॥ ఏల భయంబు రాక్షస కు ♦ లేశ్వర! డెందము నివ్వరింపు మ
వ్వాలి దివంబుచేరె రఘు ♦ వర్యుని శాత శరం బొకంట న
వ్వాలి మరించునాఁ డతని ♦ వాలును తోడనె పోయెఁ గ్రమ్మఱం
జాలదు మాకు నిప్పుడు త్వి ♦ పాంపతి పుత్త్రుఁడు రాజు నావుదుర్. ౧౦౧౩

తే॥ వాలి నొక కోలచే నేల♦కూలనేసె? రాముఁ డిపుడేడ నున్నాఁడు♦రాము దేవి
వెదక నంగదుం డరుదేరు♦విధ మదెట్లు? తెలియఁ గోరెద ననుచు నై♦తేయుఁ డడుగ.

మ॥ ధరజాన్వేషణ తత్పరత్వమునఁ గాం ♦ తారంబులర్ వచ్చు భా
స్కర వంశాఢ్యుల రామలక్ష్మణుల వే ♦ డ్కంగాంచి సుగ్రీవుఁ డ
క్కఱతో స్నేహముచేసి తాఁబడిన దుః♦ఖంబుల్ ప్రసంగింపఁగాఁ
గరుణాళుండయి రాఘవుండు తునిమెం ♦ గా పేయ రాజ్యప్రభుర్. ౧౦౧౫

మ॥ రమతోఁ రాజ్యరమన్ రఘూత్తముఁడు కా ♦ రుణ్యంబుతోఁ నిచ్చి మి
త్రముతోఁ నాలుగు మాసము ల్కడపి చే ♦ రన్ వచ్చియున్నట్టి సై
న్యములం గాంచి ధరాత్మజన్ వెదక నా ♦ నాదిక్కులం బంప నే
మముతోఁ నేమిట వచ్చినార మిదియే ♦ మాకార్యముల్ నావుడున్.

ఉ॥ మీ కులనాయకుం దునిమి ♦ మీ కపకారము చేసినట్టి ని
ర్మకునితోడఁ గూడి కుల ♦ శీలము బూదిని గల్పికొంటి ర
స్తోక యశంబుఁ గోలుపడి ♦ తోరపు నిందను మోచినారలే
కాకయు నిట్టులాటయు జ♦గత్థ్రినతి స్త్రీత్వమె యొందె నంటకా? ౧౦౧౭

ఉ॥ అన్నను చంపఁగాఁ గొలిపి♦యట్టు లొనర్చిన వానితోడ నే
మిన్నక మైత్రి చేసికొను ♦ మీప్రభు పంపున నాకుఁ దెల్పఁగా
నున్నది యేది? నీవు దను ♦ జోత్కరముం బొరిపుచ్చ నేలరా?
నిన్ను వధింప జంకకుము ♦ నిక్కము తెల్పుము వానరాధమా! ౧౦౧౮

ఆ॥ అనుడు సద్గుణాఢ్యుఁ♦డౌ హనుమంతుడు, పంక్తిముఖుఁడు పల్కు♦పల్కుల విని
యించుకంత నగచి♦యిట్లను మాధ్యస్థ, నీతి దెలుపు టుచిత♦రీతి యనుచు. ౧౦౧౯

తే॥ దూతనై వచ్చినది రవి♦సూతి హేతు, పునని యుక్తంబులును ధర్మ్య♦ములును నీతి
మంతములు హితములును సం♦భావ్యములును, గలుగు పలుకులు గలవు పెం♦పలర వినుము

ఉ॥ జీవితమున్ వితావితగఁ ♦ జేసితి వించుకయేని రాజ ధ
ర్మావధి గానకుండితి వ ♦ హా! పలుగాకులు సేయు నైచ్యముల్
హావిరిఁ జేసి తిప్ప దిగఁ ♦ బాతెదు వేళయు వచ్చె నైన నో
రావణ! నాదు మాటవిని ♦ రాజ్యము నేలుము కొంత కాలమున్. ౧౦౨౧

ఉ॥ మిక్కిలి కష్టపెట్టినను ♦ మీఱని నిశ్చల మానినీత్వమున్
జొక్కము గాఁగఁ గల్గినది♦శుమ్మముకంటెఁ బవిత్ర జానకిన్
జిక్కులపాలు చేసితివి ♦ చిక్కని యింద్రియపాళి గెల్చి పెం
పెక్కఁ దపించి తత్ఫలము ♦ నిట్టులు నాశము సేయు టొప్పునే! ౧౦౨౨

తే॥ వఱదఁ బోయెను నీగౌర♦వంబు నేఁడె, యించుకంత శ్రమించిన♦నిఁకియు రేపె
నిర్జరుల జయించితి నని♦నిజ్ఞనీల్గు, గర్వ మగ్గలమౌట నీ ♦ కరణి జరిగె.

ఉ॥ పాపము పుణ్యమున్ గెలిచి ♦ పైకొన లేదను నార్యవాక్యమున్
బాపమతిం దలంపక త ♦ పఃఫల సంపదలెల్ల జానకిన్
దాపము పాలుచేసి విత ♦ థం బొనరించితి వట్టి కృత్యముల్
నీపయి మాత్రమే చనునె?♦నీ యసురాన్వయమెల్లఁ గాల్పదే? ౧౦౨౪

చ॥ తగవు తొలంగినట్టి వల ♦ తాపముచే మతి పాడుగాఁగ నీ
జగతిని నిందనొంది మఱి ♦ చచ్చి యధోగతి నొందినట్టి పీ

నుఁగుల గణింపఁగాఁ దరమె? ♦ నూల్కొని యొక్కఁడు బాగుపడ్డ వా
డగపడునేమి? లోకముల ♦ నారసినన్ బరమేష్ఠి వంశజా! ౧౦౨౫

ఉ॥ కాంచన కాంచనాంగులెడఁ ♦ గామముగాక మహాంధకార మొ
క్కఁడంచుక వేఱు గల్గునని ♦ యెన్న రుదార దయాగుణాన్వితుల్
కాంచన కాంచనాంగులెడఁ ♦ గామము వీడుట గాక వేఱుగా
నంచితమైన తెల్వి గల ♦ దంచుఁ దలంపరు తత్త్వవిద్వరుల్ ౧౦౨౬

తే॥ మరులుగొని పరదారపై ♦ మనసునిల్పి, యెల్లిదంబొంది బిడియంబు ♦ గొల్లవిడిచి
మిసిమి మేను కార్శ్యము నొందఁ ♦ బ్రబ్బనొందు, నీచ పురుషత్వమున మేల్మి ♦ నెగడునేమి?

చ॥ శరధి పరీత భూతలము ♦ జానుగ నేలిన రాజులందు నీ
కరణిని నీతిమంతులును ♦ గానరు వేదము లభ్యసించి య
త్యురుతర ధర్మముం దెలిసి ♦ యున్నతి నొందిన నీవ యిట్లు వెం
బరవలె నీతిమీఱఁ దగ ♦ వా? తలపోయుము సుంత రావణా! ౧౦౨౭

తే॥ ప్రియము లేని యొకర్తును ♦ వేఁడి తెగడు, వడిన పిదప జీవములతో ♦ బ్రతుకుకంటె
ముక్కు తెగి మనుదశయును ♦ మురువు గలదె, యనుచుఁ బలుకుటయును యుక్త ♦
మగునె చెపుమ?

తే॥ జగములనశింపఁ జేయంగఁ ♦ జాలినట్టి, భుజములును శిరంబులు వేయి ♦ పొసఁగియున్నఁ
గావఁజాలునే యవి యూరిఁ ♦ గాల్పరేఁగు, నగ్నిలోఁ బడు వలువల ♦ ట్లగును గాక.

తే॥ మెచ్చి త్రిపుర దాహకుఁడు నీ ♦ కిచ్చినట్టి, గొప్ప వరములు దప్పినఁ ♦ దప్పుఁగాక
పాడి తప్పని శ్రీరామ ♦ భద్రుశరము, తప్పునని మదిఁ దలఁచుట ♦ తప్పు తప్పు.

చ॥ చెదరఁగనీక కావఁదగు ♦ సిగ్గు చెడంగ నహీన రాజ్య సం
పదలు నశింప నీచగుణ ♦ పద్ధతి నన్య సుమాంగి నిట్లు నీ
యెద వలపింతువే మఱియు ♦ నెల్లిదపుం బనులందు చాల బె
ట్టిదుఁడయి యాఱితేఱితి క ♦ డింది యవాంత్రము లబ్బ రావణా!

ఉ॥ పుట్టినవారు పుట్టు చెడ ♦ ముక్తిని పొందినవారు వేల్పులన్
నెట్టి తరించినారలును ♦ నిర్మలబుద్ధులు నీవు తప్ప నే
కట్టిఁడులేని రామపద ♦ కంజయుగంబును విస్మరించు వా
రెట్టులు నెందుఁ బుట్టరిఁక ♦ నెవ్వరుఁ బుట్టనుబోరు రావణా!

ఉ॥ పంబిన రాజ్య సంపదను ♦ బంధు జనంబును జీవితంబులన్
వెంబర విత్తవై చెడఁగ ♦ ఏడెద వేల? విదేహకన్య చి
త్తం బుపశాంతి నొంద విడి ♦ దాశరథిన్ శరణంబు వేఁడు వ్య
ర్థంబుగఁ జావనేల? యని ♦ తావక మిత్రుఁడు తెల్పె నావుడున్. ౧౦౩౪

తే॥ కొండలంబట్టి తిరుగాడు♦క్రోఁతి కాదె? తెలుపఁ బంపె నీ తాఁకు నీ♦తులను నాకు
మేలు మేలని వికటింపు♦లీల నవ్వె, నపజయం బెన్నఁ డెఱుఁగని♦యసురవిభుఁడు.

తే॥ కోఁతి మాటలు మనుజుల♦గురు జయంబు, తోఁపకుఁ గాక యట్లుండనీ♦దూతవగుచు
వచ్చినాఁడవు వనమును♦భంగపఱుప, నేల రక్కసులను చంప♦నేల యనుడు. ౧౦౩౬

తే॥ నిన్ను చూపు వారెవరు లే♦కున్న కతన, రాక్షసేంద్రు దర్శనము దు♦ర్లభ మటంచు
వనము పాడుజేసితిఁ జంప♦వచ్చువారి, నాత్మరక్షణార్థము చంపు♦ననువు వలసె.

తే॥ మరలఁ బాశబద్ధుఁడనై తి♦దరిసెనంబు, కొఱకు నన రావణుఁడు పండ్లు♦కొఱికి వీనిఁ
జంపుఁడన సూనగులు లేచు♦సమయమందు, వీడుఁడని యడ్డువచ్చె వి♦భీషణుండు.

ఉ॥ అన్నకుఁ గేలుమోడ్చి నయ ♦ మారఁగ నిట్లను వేదశాస్త్రసం
పన్న! తపఃఫలంబున భు ♦ వంబులు సృష్టియొనర్చు ధాతయున్
మన్నన సేయఁగాఁ దగిన ♦ మార్గ మెఱింగి త్రిలోక రాజ్యమున్
గొన్న మహాయశుండ వౌర ♦ కోఁతిని దూతను చంపఁ బూనెదే?

చ॥ అవని నజాండగోళముల ♦ కావల లోపల సత్యధర్మముల్
తవిలిన యెల్ల చోటుల ను ♦ దార గుణాశయులందు చూడగా
యువతులఁ జంపినట్టి జను ♦ లుందురు గాని నిబద్ధి రాయబా
రి వధము సేయు పార్థివ వ ♦ రేణ్యుల నెందును గాన మింతకున్, ౧౦౪౦

చ॥ పగఱ పురంబుచేరి తమ ♦ పంపిన వారల వార్తఁ దెల్పి యా
పగఱకుఁ గల్గు కిన్కలకుఁ ♦ బొల్పడి సత్యము ధైర్యవాక్కులన్
సొగసుగఁ జెల్పఁబూను మతి ♦ శూరుల నిష్కపట ప్రబుద్ధులన్
దెగఁ దలపోయ నెల్లిదము ♦ తీఁగలు వాఱదె లోకమెల్లెడన్? ౧౦౪౧

మ॥ పెరవారంపిన దూతఁ జంపునెడ వి ♦ ద్వేషంబు శాంతించునే?
పెరుగం జొచ్చునుగాక శాత్రవులకున్ ♦ వృత్తాంతముల్ సేరమిన్
సురుఁగం బాఱక శత్రుశేష మిల ని ♦ ల్చుంగాన నీతిజ్ఞ లీ
తెరువుం ద్రొక్కరు నింద్యమం చరసి దై ♦ తేయేంద్ర చూడామణీ!

ఉ॥ వీరులు నీతిమంతులు వి ♦ వేకులు ధీరులు రామలక్ష్మణుల్
వారక ముక్కుగోసి తమ ♦ వార్తలు దెల్పఁగఁ జూపునాక నీ
చేరువ కంపినా రటులు ♦ శ్రేయము నాత్మను కోరెదేనియున్
ధీరత నిన్ను దెల్పఁ జను ♦ దేరఁగ వీడుము నేఁడు మారుతిన్ ౧౦౪౩

ఉ॥ నావుడు లెస్సవల్కితివి ♦ నాణెముగాఁ గపిఁ జంపరాదు నిం
దావహమంచు వాయుసుతు ♦ నారసి నీవు బిరాన నేగి యా
కావరులన్ వనేచర ని ♦ కాయము తోడను తెత్తుగాక యో
సేవకులార! రండితని ♦ చెన్నగు వాలముఁ గాల్చి యంతటన్. ౧౦౪౪

చ॥ పురము జనంబు లీ కపిని ♦ పోలఁగఁ జూడఁగఁ ద్రిప్పి త్రిప్పి యీ
నరుదుల దాఁట వీడుఁడని ♦ చయ్యన రావణుఁ డాడ నింద్రజి
త్తురవడి నాగపాశముల ♦ నూడ్చెను మోఁకులఁ దెచ్చి కింకరుల్
తరముగఁ గట్టి లాగిరి ము ♦ దంబునఁ గేకలు వెట్టు చుద్ధతిన్. ౧౦౪౬

క॥ తేరుల గారుల కుదిరల, దారము లుయ్యేలలఁ గట్టు ♦ దారంబులు వే
కూరిచిరి నాఁడు పురమున, దారము కఱవయ్యె వాయు♦తనయుని కతనన్

చ॥ వరములుగాఁగఁ గొన్నవి సు ♦ పర్వులనుండియుఁ దక్కువారలన్
దురమున నోర్చి కైకొనిన ♦ తోరపుఁ బాశము లప్పనంబుగాఁ
బరఁగిన వెల్లఁ దెచ్చి ముడి ♦ వైచిరి కట్టిరి దార కంఠ బం
ధురతర సూత్రరాజములె ♦ త్రెంగక తక్కెను నాఁడు వారిచే. ౧౦౪౭

చ॥ క్రమమును మీఱి త్రెంచుకొను ♦ కష్టములేకయె నాగపాశముల్
దమకముతో విదిర్చికక ♦ దైత్యుల మోదము నొక్క వ్రేల్మిడిన్
జమరుదునా? యకొల! రభ ♦ సంబున వీరలు తోఁకగాల్చి ను
ద్యమమున లంకగాల్పుమను ♦ దారిని నేర్పుట గాదె యారయన్?

చ॥ అని తలపోసి తా నదను♦కై కనుపెట్టుచు వారుగట్ట దీ
నునివలెఁ గ్రుంగి ప్రక్కలకు ♦ నొవ్వఁగ నీడ్వఁగ నోర్చి బ్రహ్మవి
ద్యను ప్రకృతిం జయించియు స ♦ తంబు జగజ్జన సంగ్రహార్థమై
యనువుగ లొంగు నుత్తము క్రి♦యన్ హనుమంతుఁడు లొంగె వారికిన్.

సీ॥ మోఁకులఁ బట్టి యా♦మ్రుక్కడుల్ ముందఱ, కీడ్వ నీడ్చినయట్టు♦లేగుచుండ
దశముఖు మందిర♦ద్వారంబు వెలుపలి, కమ్మారులని దెచ్చి♦యతనివాలు
నిండ చేలికలు చి♦నింగిన వలువలు, పాగాలు పెద్ద దో♦వతులు చుట్టి
చమురు నేయియుఁ బోసి♦సంపూర్తిగా ముంచి, నిప్పువెట్టి రగిల్చి♦నిగుడఁజేసి
తే॥ కోయనుచు నార్చి పెద్దమో♦కులను పట్టి, సోఁకు లీడ్వంగ సాయుధుల్♦సూరెలందు
నడవఁ దేరు నడచు గతి♦నడచె హనుమ, చూచు వారెల్లెడల నిండి♦చూచుచుండ.

సీ॥ వనితతో మాటాడి♦వనభంగ మొనరించి, కర్బురవరులఁ బె♦క్కండ్రఁ జంపి
మనుజుల దిటవును♦మన రాజునకుఁ దెల్ప, వచ్చిన కపి తుదిఁ♦దెచ్చుకొన్న
సిలుఁగులఁ♦గనుల వీ♦క్షింతురు రండని, ప్రతిగృహ ద్వారంబు♦పజ్జ నిలిచి
తప్పెటల్ గొట్టుచు♦దనుజులు కొందఱు, ముందుగాఁ జనుచుండ♦మూఁగె జనము
తే॥ పేర్చి రార్చిరి కొందఱు♦భీతి గొనిరి, కొందఱేగి మైథిలికి వా♦క్రుచ్చినారు
వాఁడె దపియించెఁ బలవించె♦వ్రాలె నూర్చె, జాతవేదుని ప్రార్థించె♦జనకజాత.

ఉ॥ శ్రీరఘురామదూత నిటు ♦ చెన్నఁటి సోఁకులు కష్టపెట్ట ని
ష్కారుణికుండవై కనుట ♦ కర్జమె నిర్మల ధర్మసాక్షివై?

ధారిణి నేఁ బతివ్రతల ♦ ధర్మము దప్పని దాననేని యీ
మారుతికిన్ హిమాంశుక్రియ ♦ మానుగ నుండును వహ్ని! మ్రొక్కెదన్.

తే॥ కుందరదనయా సీత యా ♦ చందమునను, బలుక భయమంది మనమునఁ ♦ బావకుండు
మేను చలిచేఁ గగుర్పా సా ♦ మీరి వాల, మొదలం దాఁకఁ జల్లనై ♦ యొసఁగె నప్పుడు.

సీ॥ పెక్కులాడఁగ నేల? ♦ భీకర బడబాగ్ని, భూమియందు గల జ్వా ♦ లాముఖాగ్ని
అమరలోకపుఁ గరా ♦ శాగ్నియు మునుల త్రే, తాగ్నులు రుద్రు నే ♦ త్రానలంబు
సరసిజగర్భుని ♦ కరతల వహ్నియు, సర్వాగ్నులును భువిఁ ♦ జల్ల నయ్యెఁ
బిడుగులు చల్లనై ♦ వెలసె జ్యోతిర్మండ, లంబు హిమంబు క్ర ♦ మంబునొందె

తే॥ కరువఁ గప్పిన కరణి మైఁ ♦ గప్పినట్టి, యగ్గి కాల్పక యెలయుట ♦ యనిలసుతుఁడు
తల్లి జానకి క్రొత్తడి ♦ తనమువలన, శీతలం బయ్యె నని సంత ♦ సించె మదిని.

చ॥ తొలుతటి రేయి తెల్విమెయిఁ ♦ దూఱని చోటులఁ జూపనెంచి కా
వలయు నొకండొకండుగనె ♦ వాడల వాడల మూఢ దానవుల్
తలకొని త్రిప్పుచుండఁ దొలు ♦ తం జను నింద్రియపాళి వెన్కలన్
మలపున నేగు బుద్ధిక్రియ ♦ మారుతి యేగుచుఁ గాంచె నన్నిటిన్. ౧౦౫౫

చ॥ కడపటి వీథిలో నిలిచి ♦ కావలులం గికురించి యేను వీ
డ్వడ నదనిద్ది యంచు మదిఁ ♦ బావని భావనచేసి గట్టిగా
వడమును పట్టుకొన్న బహు ♦ బాహులు మిన్నున వ్రేల లేచి య
చ్చెడుగరులన్ విదిర్చె వడిఁ ♦ జెట్టునఁ బండులు డుల్చుకైవడిన్. ౧౦౫౬

తే॥ విద్రువ రక్కసుల్ భుజములు ♦ విఱుగ నేలఁ, గూలి మాలిరి పాశబం ♦ ధాలతోడ
మింటఁ గానంగ వచ్చె సా ♦ మీరి సర్ప, వర్గ పరివృతుండగు ఖగ ♦ వర్యుఁబోలి.

తే॥ పగఱ త్రిపురముల్ గాల్చిన ♦ భవుఁడు నతని, సాధనంబులు మిగుల ల ♦ జ్జను వహింప
పాపులకుఁ గాఁపురంబు లం ♦ కాపురంబు, వహ్ని కొసఁగంగఁ దన పెను ♦ వాలు విడిచె

శా॥ వాలం బప్పుడు వాలె బన్నములు స ♦ ల్పంబూను దైత్యాలితోఁ
బ్రోలిం గాల్చెద నంచు రోష కలిత ♦ ప్రోత్తుంగ కాలానలా
భీలంబైన పరశ్వథంబు గిరిశున్ ♦ వెన్నంటు చందంబునన్
జ్వాలాదీర్ఘ కరాళ మాలికలతో ♦ సర్వాంకషోద్వేలమై. ౧౦౫౭

తే॥ ప్రోలి నన్నిదెసల నొక ♦ త్రుటిని గాల్చు, కతన వాలంబు పురములఁ ♦ గాల్చు మేరు
ధనువు తెగ తెగలాగి యు ♦ ద్ధతి మృడుండు, విడుచు వైష్ణవాస్త్రంబన ♦ వెలసె నప్పుడు

సీ॥ కల్పాంతమందు లో ♦ కంబులఁ గాల్పనె, క్కుడు కంటిమంటల ♦ నడర విడుచు
చేయిది నభ్యాసంబు ♦ సేయుటఁబోలి య, ఘంటిత బలుఁడు కా ♦ కుత్స్థదూత
గర్వితులైన రా ♦ క్షసుల పురము గా, ల్పఁగ నెంచి తనదు వా ♦ లంబు పెంచి
మణి కనకాంచిత ♦ మయముగ సురశిల్పి, శిల్ప చాతుర్యంబు ♦ నిల్పియున్న

తే॥ గొప్ప సౌధంబులను పెను♦కుధరములకు, వజ్రపాతంబుఁబోలి యా♦వాయుసుతుఁడు
వాడవాడకుఁ దిరుగుచు♦మేడమేడ, పైకి లంఘించుచుఁ దగిల్చె♦వాలుచిచ్చు.

చ॥ కఱకు నిశాచరావళుల ♦ కార్యముచేఁ గ్రతువుల్ త్యజింప దు
ర్భరమగు నాఁకట న్నలఁగు ♦ పావకుఁడుర్ హనుమంతు వాల మా
దరువుగఁ జేసికొంచుఁ బురిఁ ♦ దత్తఱ మ్రింగఁ దొడంగె నగ్రుఁ డా
దరమున విందువెట్టఁ బ్రమ ♦ దంబున లోకము మ్రింగు చాడ్పునన్.

౧౪ లంకాదహన పటలము. (౬౪)

తే॥ భీకరాగ్ని సుందర సౌధ♦వీథులందు, ధ్వజములం గాల్చి పిదప లో♦పలనుచొచ్చి
మేలుకట్ల దహించి కం♦బాల నలమి, కప్పులం దుల్చి బూడిద♦కుప్పచేసె. ౧౦౬౩

తే॥ రత్న తోరణ ద్వార వా♦రముల ముసరి,వస్త్ర జాలంబుఁ గాల్ప లో♦పలి జనములు
వెలికి రాలేక యీవ లా♦వలకుఁ దిరిగి, యలసి సొలసి రోదనచేసి♦యడఁగి రల్లె.

తే॥మణి కనక వేశ్మ కాంతులు♦మలసి వీవ, మండుచున్న యిండులు మఱి♦మండనివని
తెలియఁ జాలక యన్నియుఁ♦ దీఁడిరించి, రగులు కొనెనని యేడ్చిరి♦మగువ లరసి.

తే॥ఫుల్ల మకరంద తుందిల♦పుష్ప కీర్ణ, సుందరోద్యాన కేకులా♦మందగమన
లెల్లయెడలఁ బొగలు గ్రమ్మ♦నేది త్రోవ,యనుచుఁ దెలియక పలవించి♦రడలునిండ.

తే॥ స్త్రీల కొప్పులఁ బురుషుల♦సిగలయందు, మిడుఁగుఱులు చేరి చిటపట♦నడరియొడలి
మీఁద విరియఁ గేశములకు♦మిడుఁగుఱులకుఁ, దారతమ్యంబు తెలియక♦తల్లడిలిరి.

తే॥ బ్రహ్మవిద్యచేఁ బ్రకృతి సం♦బంధమూడ్చి, స్వస్వరూప విజ్ఞతనొందు♦జనుల పోల్కిఁ
దద్గృహాగ్ను లాజ్ఞప్తి బం♦ధముల వీడి, స్వస్వరూపంబులొందిన♦సరణి మండె.

క॥ ఆ పొగల గములు వామన, రూపములై యలమి యెసఁగె♦రోదోంతరముల్
శ్రీపతి వామన రూపం, బేపున ముజ్జగము లలమ♦నెసఁగిన మాడ్కిన్. ౧౦౬౯

క॥ త్రెళ్లిన యేనుఁగులెల్లను, త్రుళ్లుచుఁ దమమేన నిప్పు ♦ తోట్టగిలంగం
దోఁగ్ర్యాడి యొఱగి యెమ్ముల, గూల్చి యైరావతంబు♦కొమరుందాల్చెన్. ౧౦౭౦

క॥ మంచువలె నడరి ధూమము, మించఁగ నగ్నులును తోట్ట♦మిడుకుచు నెనుముల్
ప్రాంచ న్మేఘ నికాయము, సంచున లోఁతైన కడలి♦జలములఁ జొచ్చెన్.

క॥ మిడుఁగుఱులు చిటపటించుచుఁ, బిడుగులవలె నెల్ల కడల♦విరిసి పడుటచేఁ
గడలి జల ముడికి సందుం, దొడిఁబడి జలచరము లవిసి♦తుప్పలు దూలెన్.

ఆ॥ కాఁగి కాఁగి కరఁగి♦కనక పదార్థముల్, వఱద పాఱిపాఱి♦వనధిఁ జేరి
కమనలీఁడు కరఁచి♦కడ్డీలు చేసిన, కొమరు దాల్చి మరలఁ♦గోవులయ్యె. ౧౦౭౩

తే॥ క్షణములో లోకములఁగాల్చఁ♦జాలినట్టి, బెట్టిదపుఁ జిచ్చుచే రత్న♦వేశ్మసమితి
వనములం బలె బొగ్గుల♦వఱకుఁ గాలి, నిలిచెనే ? పైఁడిమయమౌట♦నిలయు మండె.

తే॥ అమితముగఁ బొగ క్రమ్మ వృ♦క్షౌఘతగముఁ, గటికి చీకటు లలమె లం♦కాపురమున
నాపతాకా రథాంతమై♦స్యందనములు, కాలి బూడిద కుప్పలై ♦గాలిఁ గలసె.

తే॥ పానశాలలలో నిల్చి♦పావకుండు, ముక్కడులు ద్రావు మద్యంబు♦క్రోలె విడక
యుత్తములు దుష్టులం గూడి♦యుండిరేని, చెఱుగు వనుల నభ్యాసంబు♦ సేయరొక్కొ!

ఉ॥ లంకను మ్రింగి మండు నక♦లంక మహోజ్జ్వల వహ్ని వీవ న
ల్లంకలఁ జుట్టియున్న పెను♦వారిధి నీరము తెల్లఁ గ్రాఁగె నా
జంకవజీరు జ్వాలికలు♦జిహ్వలు చాఁపఁగ నీరదంబులన్
గంకణరాజి యత్తెసరు♦కై వడి గ్రాఁగి ధరాస్థలిం బడెన్. ౧౦౭౭

తే॥ ఒడలి నలమిన యగ్ని చే♦నుసికి నింగి, కెగసి రాక్షసస్త్రీలు ద♦వ్వౌలయఁ జూచి
యడవిలోఁ బాఱు వెల్లువ♦యని తలంచి, మొండమూఁపులకడకుఁ బ♦ర్వెత్తినారు

తే॥ మధువనంబుల నిప్పులు♦మలసి రగులఁ, బూలతోఁ గూడియుండిన♦మునరుఁ దేఁటు
లంటుకొని వచ్చు దగ్గతి♦మంటఁజూచి, యెట్టి దామరలని మెంచి♦మొగసిపడియె.

తే॥ నాథుఁ డొక కోఁతిచేఁగూలె♦నాణ్మైన, జీవితము చెడె వీధులఁ♦జేరరాదు
ఇంటఁ జచ్చుటే తగవని ♦ మెంచి కొంద, ఱసుర కాంత లా నిప్పున♦నడఁగినారు.

తే॥ పూలు మాఁడి పల్లవములు♦బూది యగుచు, దళము లెరిసి రెమ్మలు మండి♦ ఫలము లుడికి
కొమ్మలును పలవలు వేళ్లు♦గూడఁ గాలి, తోఁట లయ్యెను బొగ్గుల♦కూటువలుగ.

తే॥ వనదముల ముంచుకొని లేచు♦నసల కీల, లలమి స్వర్గముం గాల్చుట♦వలనఁ గరఁగి
కాఱు బంగారు ధారల♦తీరు చూడ, స్వస్తరువు వేళ్లు విడిచిన ♦ చంద మొందె.

క॥ భీకర కీలలు లేవ సు, ధాకరుఁడుం గలఁగి యమృత ♦ ధారలు కార్చున్
రాకాసుల కొని మేనులు, జోకగ జీవంబు లొందెఁ♦జోద్యముగాఁగన్.

క॥ ఇనబింబము దాఁకఁగ లే, చిన యనలము వలనఁ గాల♦జీమూతంబుల్
గనగన మండెడు బొగ్గుల, యనువుగ నినుఁడొప్పెఁ గరఁగు ♦ నపరంజి యనన్.

తే॥ కాళ్ల త్రాళ్లను గాల్చి తోఁ♦కలను గాల్చి, మూఁపులం గాల్చి తోళ్లూడ్చి♦మొగముముట్ల
గాల్చ భద్ర లక్షణ తురం♦గమ్ము లురలి, కుప్పగూలెను నిప్పులు♦కొప్పరింప.

తే॥ జముని మ్రింగఁ జాలిన నిశా♦చరులు నెగసి, పోవఁజాలక మితిమీఱి♦పొగలు క్రమ్మ
నూపిరాడక మ్రింగుచు♦ నుక్కిబిక్కి, యగుచుఁ గూలి నాశిల్లి రా♦యగ్ని యందె.

చ॥ అసుర లతాంగులన్ బలిమి ♦ నంటి సువస్త్రము లూడ్చి పైఁటలం
దనుకున జార్చి పైనలమి ♦ తక్కక కొప్పులఁ బట్టుచున్ విభా
వసుఁడు భుజంగు పోల్కి నెగఁ ♦ బ్రాఁకఁగ దిగ్భ్రమనొంది చేష్టలున్
వసమఱ లోఁకువై విలయ ♦ భావము నంది కరంగి రచ్చెలుల్. ౧౦౮౭

చ॥ పొడమెను దొండపండునను ♦ ముత్తెపు బంతు లనంగ నొప్పి సొం
పడరిన విస్మితంబు గల ♦ యంగన లొందిన యుల్కు దీరఁగా
విడివడియుండి చేరుతటి ♦ వెన్నెల నాఁజను చేల గాలఁగాఁ
దొడిఁబడి మోద వారినిధిఁ ♦ దూఱక తూఱిరి దుఃఖవారిధిన్. ౧౦౮౮

చ॥ చిలుకలు పంజరంబులనె ♦ చిక్కి తపింపఁగఁ గంటినీరు చ
న్నులపయి మిట్టిమిట్టి పడ ♦ నొచ్చుచు నాథులఁ గొంద ఱంగనల్
వలగొని కౌఁగిలించికొని ♦ వారిదమంమునఁ జంచలా లతల్
మలిగిన కైవడిన్ బొగల ♦ మాటున మున్గిరి దూపటిల్లుచున్. ౧౦౮౯

తే॥ పెద్ద మేడలు గాలఁగ ♦ వింటి కెగయు, మగువ లవ్వేడఁ బొగలలోఁ ♦ దగులుకొనుచుఁ
దెర మఱుంగునఁ దోఁచు పా ♦ త్రికలఁ బోలి, కానఁబడి కూలి మాలిరి ♦ కడఁక చెడఁగ.

తే॥ అగురు చందనాదికముల ♦ యందు పొడము, తావియలముకొనం బ్రమ ♦ దావనములు
ప్రళయ వహ్ని నుడుకు నకూ ♦ పారమట్టు, లుడికి బొగ్గయి మసియయి యుర్విఁ గూలె.

తే॥ లోకముల మ్రింగఁజాలిన ♦ భీకరాగ్ని, విస్ఫులింగ ప్రకీర్ణమై ♦ విరియఁ గల్ప
కములయందు కాలిన వివి ♦ కాలకున్న, విప్రియని యెఱుఁగంగరా ♦ కెనసెఁ బొగలు.

తే॥ కసిమసఁగి ముసరిన పొగల్ ♦ కడలినీటి, నింకఁజేయ మిా లవ్వలి ♦ కేగ మొగులు
గములు తెలియక గిరి శిఖ ♦ రముల వ్రాలి, రాలు పూలునాఁ బలపల ♦ రాలిపడియె.

తే॥ అతిశయంబుగ ధూమంబు ♦ లడరుకతన, వెండికొండ నీలాద్రియై ♦ వెలిఁగె హంస
గములు కాకులె యయ్యెఁ బా ♦ ల్కడలి తుక్కు, కడలులం బోలె నితరంబుఁ ♦ దడవ నేల ?

చ॥ బెడిదపుఁ జిచ్చు మేనులను ♦ వేఁచఁగ జర్మములూడఁ దప్పికో
దుడుకునఁ బాఱి రక్కసులు ♦ దుస్సహ తాపము దీఱ కోర్కిమైఁ
గడలిసి చొచ్చి మున్గుతఱిఁ ♦ గానఁగనయ్యెను వారి కేశముల్
జడలును పర్వె యెల్లెడల ♦ సంద్రమె మండుచునుండు చందమై. ౧౦౯౨

ఉ॥ కొండికవానిఁ జంక నిడు ♦ కొంచు మఱొక్కనిఁ జేతఁగొంచు నిం
కొండొక బాల వెంటఁబడి ♦ యుమ్మలికించుచు రాఁగఁ జుట్టముల్
గుండెలు బాఁదుకొంచుఁ గడు ♦ గోడుగఁ జుట్టును రా శిరోజముల్
చుండఁగ నల్మికొం చసుర ♦ జోటులు వోయిరి వార్ధి దూఁకఁగన్.

తే॥ చాప ముద్గర కుంతాది ♦ సాధనములు, కరఁగి పాళలై క్రమ్మఁఱఁ ♦ గార్మికులకు
వలయు వస్తువులకు నను ♦ గలముగాఁగ, నేరుపడియె మహాయుధా ♦ గారములను.

మ॥ మగయేన్గుల్ తమదేహముల్ కమరుచున్ ♦ మాఁడంగ నాలానముల్
నిగళంబుల్ పెకలించి త్రెంచికొనుచు ♦ న్నిష్యంద గంధంబుతో
రగులం బోలున యంచు వాలములఁ గ ♦ ర్ణద్వంద్వ మల్లార్చ కె
త్తుగఁ దొండమ్ముల నెత్తికొంచుఁ బఱచున్ ♦ దొట్రిల్లి గీపెట్టుచున్.

మ॥ చదలం బోవఁగనీక ధూమ వితతుల్ ♦ సంధిల్లఁగాఁ బుల్గు లం
గదతోఁ దోయధిఁ గూల వాశ్చరము లా ♦ నందించి భక్షించె ది
క్కుడియుం గానక నొచ్చి వచ్చి శరణం ♦ బిమ్మన్న దీనావలిన్
మది శంకింపక చంపి సంతసిలు ధ ♦ ర్మభ్రష్టు చందంబునన్. ౧౦౯౯

మ॥ జలముం ద్రావి వసుంధరం దడవి భూ ♦ జశ్రేణులం గాల్చి కొం
డలఁ గొల్లాడుచు మ్రింగి కాంచనగిరిన్ ♦ డాకొన్న కాలానలుం
బలెఁ జండంబుగఁ బేర్చి ప్రజ్వరిలి య ♦ వ్వాల ప్రభూతాగ్ని యొ
త్తిలి యాపోవక యాక్రమించె దనుజా ♦ ధీశాను శుద్ధాంతమున్. ౧౧౦౦

ఉ॥ వేలుపుబోటులున్ బెర వి ♦ భీత మృగాక్షులు దిక్కు దోఁప కే
లీల మొగఁబువోవు నటు ♦ లే పరుగెత్తిరి సేవసేయు దే
వాలి కకావికం గలఁగి ♦ యార్తత నూడనిఁబాడె దైత్యరా
ణ్మౌలి దివంబుఁ గొల్లయిడు ♦ నాఁటి దశన్ భజియించి యత్తఱిన్.

ఉ॥ కస్తురియుం గలాపములు ♦ కల్పసుమంబులు కాలి ధూమముల్
నిస్తుల లీలఁ బర్వ మధు ♦ నిర్గత మేఘముఁ బోలు దివ్య ది
జ్మస్తక దేవతా లసద ♦ నంత సువాసిత కేశ పాశముల్
ప్రస్తుత భంగిగా మఱియుఁ ♦ బ్రబ్బె గుమంగుమలాడు వాసనల్.

తే॥ దావ వహ్ని శైలముఁ గ్రమ్మ ♦ శేవ దోఁప, నెవ్వరిని చేరనీయక ♦ యేసరేఁగి
కాల భయదాగ్ని యేడు లో ♦ కములఁ గాల్చు, కరణి మేడ నిలువులేదు ♦ గాల్చివైచె

శా॥ ఔన్నత్యంబు విశాలమున్ దిటవు నే ♦ డంతస్తులున్ బ్రన్ననల్
విన్నాణంబు చెలంగు రావణు లస ♦ ద్వేశ్మంబు చొక్కాటపున్
సొన్నంబై తనరారుటన్ గరఁగి య ♦ చ్చుం బోలి హేమాద్రి యు
త్పన్నం బయ్యెనొ దక్షిణంపు దెస న ♦ వ్యస్ఫూర్తి నా రాజిలెన్.

ఆ॥ దానవేంద్రుఁ డపుడు ♦ దారలతోడఁ బు, ష్పకము నెక్కి తప్పి ♦ బ్రదుకఁ గలిగెఁ
దలఁప నార్ప ననువు ♦ దెలియని చందానఁ, బొలుపు గలుగు లంక ♦ బూదియయ్యె.

తే॥ పట్టపగలింటి వేవెల్గు ♦ పగిది మండి, యసుర వర్యుండు సోఁకుల ♦ నట్టెచూచి
విలయకాలంబు డాసెనా? వేఱు హేతు, వుండునే లంక గాలఁ దె ♦ ల్పుండి? యనుడు.

ఉ॥ అన్నలఁ దమ్ములన్ గురుల ♦ నాప్తుల బంధుల నాలు బిడ్డలన్
బ్రన్నని వస్తుసంపదలఁ ♦ బాసి యలంగుచునుండు దుఃఖ సం
పన్నులు దేవ! యీ కనలు ♦ వానర వాలముఁ గాల్చు మంటచేఁ
గ్రన్ననఁ గాల్చివైచెఁ బ్లవ ♦ గంబనఁ బంక్తిముఖుండు మండుచున్.

ఉ॥ కోఁతికి నింతశక్తి యొడఁ ♦ గూడుట యెన్నఁడు గాన మీపురిన్
బ్రాఁతిగ మ్రింగి త్రేనుపులఁ ♦ గ్రక్కుచునున్నది యగ్ని! సాధ సం

ఘాతము మండి బూదియయి ♦ గాలికిఁ బోవుచు నుండె! నిర్జర
వ్రాతము నా పరాక్రమము ♦ రట్టొనరించి యలర్చి నవ్వదే?

మేఘనిస్వనము||
కాల్చిన యగ్నిని ♦ కాంచి వెదకి తే, దుల్చెదఁ బండ్లను ♦ డొక్క యొలిచెదన్
జీల్చెద డాడలఁ♦జేవ దొలఁచెదన్, వ్రేల్చెద దేహము♦వీడకుఁ డతనిన్.

అరవిందము||
పురముం గాల్చిన♦మ్రుక్కడి క్రోఁతిన్, దెరలం బట్టుఁడు ♦ త్రెంపుఁడు వాలున్
సురుఁగం దంచుఁడు♦సున్నము గాఁగన్, బరఁగన్ బ్రింగుఁడు♦పంతము మీఱన్.

ఇంద్రమణి||
అని యసుర విభుం♦డానతి యొసఁగన్, దనుజ వరులు రౌ♦ద్రస్థితి తొనఁకన్
విని సెలవనుచున్ ♦ వీరవచనముల్, మొనసి నుడువుచుం♦బోయిరి పిలుచన్.

పంక్తి|| మేర గణింపక ♦ మీఱిన యా, వీరులు తూపులు ♦ వింట్లను సం
ధారముగాఁ గొని ♦ వాయుజుతోఁ, బోరొనరింపఁగఁ ♦ బోయి రటన్.

పంక్తి|| సారథులం ద్వర ♦ సల్పుచుఁ బె, న్నీరథి పొంగిన ♦ నీటునఁ బెం
పారఁగ నేడుగు ♦ రాఘ్యులు సా, మీరిని పట్ట గ ♦మించి రటన్.

దోదకము||
నింగిని ధాత్రిని ♦ నిండిరి క్రాఁతిన్, బొంగిరి చుట్టుచుఁ♦బోయిరి క్రోఁతిన్
ముంగలఁ గాంచిరి ♦ మూఁగిరి త్రిప్పన్, రంగని నారుల ♦ టంకృతు లొప్పన్.

తే|| మిగులఁ గనలిన దనుజులు♦మిగిలి తగిలి, పట్టు పట్టుఁడు కట్టుఁడు♦కొట్టుఁడనుచుఁ
జూతురేల యనుచు డాసి♦చుట్టినారు, కాంచెఁ జిఱునవ్వుతోఁ వారి ♦గాడ్పుపట్టి.

తే|| చుట్టి డాసిన వీరులఁ♦జుమ్మ చుట్ట, మందుచున్న లాంగూలంబు♦మలయుఁ జుట్టి
బిగియ నీడిచి పైకెత్తి♦పృథివి మీఁద, మోఁది మోఁది తదాయువుల్♦మూఁడఁజేసె.

క|| మారుతి మోఁదఁగఁ జచ్చిన, వీరుల రక్తంబు చెదరి ♦ వీథులలో నే
పారిన చందానల మొక, తీరున నొకవంక నాటెఁ ♦ దేమ యెలర్పన్. ౧౧౧౭

తే|| కంటఁబడు వారిలోపల♦గెంటుకొనక, మిగిలియున్నట్టి మొఱకల♦పగిది నొప్పు
దనుజు లొక్కమ్మడిం దాఁక ♦ హనుమఁ డంత, యమునికంటెఁ గ్రూరుండయి♦
యదరి చంపె

క|| జీమూత సన్నిభులు బల, సామర్థ్యంబులు చెలంగు♦సైనికు లిలుగన్
స్థేమములు చెడఁగఁ దక్కిన, యామినిచరు లడలి పాఱి♦యడఁగిరి కడలిన్.

క|| తడిపెను వాలము పావని, జడధియు నుడుకంగఁ మునుఁగు♦జనములు చావన్
దుడుకున నాయకు లేద్వురు, బిడియము చేటనుచు నెదిరి♦ వేసి రలుఁగులన్.

క॥ విలువిద్దె నేర్పు చూపిన, బలియుర నేడుగుర నొక్క♦పాదపమునఁ గ
ర్వలి కొడుకు గొట్టె వారలు, పొలిసిరి గ్రుద్దులక నాల్గ♦మొదలికిఁ దునుఁగన్.

క॥ మింటఁ జనెడి విద్యాధరు, లంటిన పెనునిప్పు లంకఁ యంతటఁ గాల్చెన్
బంటించి కాల్పదది వా, ల్గంటి ధరాజాత యున్న♦కానన మనుచున్.

హంసశ్రేణి॥

సంతోషించెన్♦శ్వసన సుతుండున్, స్వాంతం బారన్♦జనియెను కాంచన్
శాంతిం బొందెన్♦జరణ సరోజా, క్రాంతుం డయ్యెన్♦గలికి యెలర్పన్.

తే॥ కాంచె జానకి కాంచిన♦క్షణములోన, నారటిల్లిన మానస♦మూఱడిల్లఁ
జెప్పవలసిన దేమిఁక? సెలవు గొనుచు, మరలె మారుతి తలికి న♦మస్కరించి.

తే॥ పావనుండగు పావని♦తావు విడిచి, మరలె వంచకుల్ కాంచిన♦మన్నిగొందు
రనుచుఁ గాఁబోలు నగ్నియు♦నందునుండి, చూడ్కికిం గనరాక ది♦చ్చు మొగమయ్యె.

౧౫ శ్రీపాదవందన పటలము. (౯౩)

తే॥ వడిగఁ జనవలెనని చేరు♦వం గలట్టి, పర్వతంబును భానుని ♦ పగిదిఁ జేరి
హనుమ భువనోదరుండగు హరి విధమునఁ, బెరిఁగి రాముని మదిలోన♦నెరఁగి యెగసె.

చ॥ ఎగసి హిమాద్రి పుత్త్రు నెడ♦కేగి జనించిన వార్త విన్చి యా
శుగగతి నేగుదెంచి తన ♦ చొప్ప ఫణంబుల నిక్క నెత్తు వ్యా
ళ గణము పోల్కి నెత్తి పొడ ♦ లం దిలకించుచుఁ గిశులుండు త
న్నగమును చేరి దూఁకె జత♦నంబున మారుత పుత్త్రుఁ డత్తఱిన్. ౧౧౨౮

క॥ నోరులు తడఁబడ నేగిన, కోరియ మీఁడెత్తె నన్న♦కౌతుకమునఁ బె
ల్లారవము సేసెఁ బోతము, బారూఢిం దల్లిఁ గన్న♦యట్లయి కోఁతుల్. ౧౧౨౯

సీ॥ కొందఱు డాసిరి♦కొందఱు మ్రొక్కిరి, కొంద ఱేడ్చిరి మేలు♦కొంద ఱనిరి
కొంద ఱాడిరి మఱి♦కొందఱు పాడిరి, కొందఱు మ్రింగెదు♦కొమరు చనిరి
కొందఱు కౌఁగిలి♦గొనిరి కొందఱు మూఁపు, పైఁ గొని యిటునటు♦పరుగులిడిరి
కొందఱు నీ మోము♦కొమరు తేటఁదనంబె, తెల్లంబుగా గెల్పు♦దెల్పె ననిరి

తే॥ కనియు పండ్లును మధువును♦గందములును, దెచ్చి యిచ్చిరి కొందఱు♦తివిరి కిసల
మంజరుల వీచి యతని క్ల♦మంబు దీర్చి, రొక్క కొందఱు పాదంబు♦లొత్తినారు.

క॥ కరచరణంబుల నురమున, శిరమునఁ గరతలములందు♦చెందిన వ్రణముల్
పరికించి మనములందున, బరితాపము నొంది రశ్రు♦భరిత నయనులై. ౧౧౩౦

తే॥ మొదట నంగదునకు మ్రొక్కి♦పిదప జాంబ, వంతున కెఱఁగి తక్కిన♦వారి నుచిత
రీతి మన్నించి మారుతి♦నృపుని దేవి, పంపినట్టి మంగళములఁ♦బలికి యంత. ౧౧౩౧

తే॥ లేచి కేల్మోడ్చి నందఱు♦లేచి నిలిచి, కౌతుకంబున నటియించి♦గాడ్పుపట్టి
యేఁగినది మొదలుగ మఱి♦యింత దనుక, జరిగినది తెల్ప వేఁడిరి♦చనవుతోడ.

మ॥ తెలిపెన్ మారుతి జానకీ హృదయ పా ♦ తివ్రత్య దార్ఢ్యంబు తాఁ
దెలియన్ దేవికిఁ బల్కుటాదిగ మణిం ♦ దీపింపఁ దానిచ్చు న
క్కాలఁదిం దెల్పె దురంబు సాగుటలు ర ♦ క్షో వారముం గూల్చుటల్
దెలుపండయ్యెను తన్ను దాఁ బొగడికోల్ ♦ తీయంబు గాకుండుటన్.

చ॥ అది విని వారు నీకచట ♦ నల్పులు దైత్యులతోడ సంగరం
బొదవుట మేని గాయములె ♦ యొప్పుగఁ జెప్పెడి లంకఁ గాల్చుటల్
కదిరిన ధూమ జాలములె ♦ గట్టిగఁ దెల్పెను వారి బల్మియున్
ముడితను తేరకుండుటయె ♦ పొందికఁ దెల్పెను గాదె పావనీ! ౧౧౩౮

శా॥ కర్తవ్యం బిఁక నేదియంచు నడుగన్ ♦ గణ్యుండు శ్రీరామ భూ
భర్తం గాంచి యయోనిజాత సుగుణ♦ప్రఖ్యాత యా సీత యే
వార్తం దెల్పఁగఁ బంపె నయ్యది మహా♦భక్తిం బ్రశంసించి రా
మార్తిం దీర్చుట యుక్తమౌనని జగ♦త్ప్రాణ ప్రియుం డాడుడున్.

తే॥ లెస్సయని వానరావలి♦లేవ వెడలి, రామవిభు ధనుర్ముక్త శ♦రంబు రీతి
గగనవీథిని చనుచు భా♦స్కరుఁడు నడిమి, సీమఁజేర రా మధువన♦సీమ దిగిరి.

ఉ॥ ప్రాణము లింక లేవనుచు ♦ వాడినవాని నొసంగు నో జగ
త్ప్రాణ కుమారకా! గడువు ♦ దాఁటినదంచుఁ దలంచి భీతిచేఁ
ద్రాణచెడంగఁ బస్తుపడి ♦ తాఱితి మాఁకలి మేరమీఱె నం
త్రాణము సేయుమా యన న♦తండొగి నంగదు డాసి యిట్లనున్.

—: వానరులు మధువనమును పాడుసేయుట :—

తే॥ నీదుసేన లాఁకటఁ గ్రుంగి♦నీరసించె, వీనికిం దగు ఫలములు♦తేనె నలయు
ననుదు నతఁడును వలసిన♦యంత గొనుఁడి, యనఁగ వనచరు లుత్సాహ♦మందియార్చి.

సీ॥ కీఁచుకీఁచని పెడ♦కేకలు వెట్టుచు, నొకరికి ముందుగా ♦ నొకరు చనుచు
తేనెపెరలు వ్రేలు♦తీయ మామిళ్లున్న, మధువనంబును చేరి♦మ్రాఁకులెక్కి
కొమ్మల విఱుచుచుఁ♦గూలంగఁ ద్రోచుచు మధుపంబులంబోలి♦మలసి ముసరి
కడుపారఁ దేనియ♦లడరంగఁ గ్రోలి త్రేన్చుచుఁ జిఱ్ఱుమని యుమ్మి♦చును కడంగి

తే॥ చల్లుకొని వెక్కిరించుచుఁ♦గొల్లగొనుచు, నుత్సహించుచు వ్రేలుచు♦నూఁగుచును గ
దించి దాఁటుచుఁ దోఁకలె♦త్తికొనిపరుగు, లిడుచు దాఁటుచు నంటుచు♦నెలమినాడి.

సీ॥ ఒకఁడురాల్చినపండ్ల♦నొకఁడుకైకొను వాని, నొకఁడులాగునువాని♦నొకఁడుమ్రింగు
నొకఁడుకైకొను తేనె♦నొక్కఁడొడిసికొను, నొకఁడందునోరుంచు♦నొకఁడుత్రోచు

వాలుగేలును గాఁగ♦లీల ద్రేలుదురు వీ, డంగఁ గూలుచు లేచి♦యంగవింత్రు
ఆనంద మానంద♦మని యాడుదురు కేక, లిడుదురు పడుదురు♦వడిగ లేతు

తే॥ రిట్లు కోలాహలంబుగా♦నెనఁగుచుండఁ, గావలీంద్రుఁ పరీక్షించి♦కనలి వచ్చి
యుగ్రశాసను సుగ్రీవు♦నోజ వినరొ? జీవముల నొల్లరో? దుష్ట♦చేష్ట విడరొ?.

చ॥ అని యదలించియుఁ ఫలము ♦ నయ్యెడఁ గాంచక వారలేగి య
వ్వనచర చేష్టలుఁ వనము ♦ పాడొనరించుట ధిక్కరించుటల్
గొనకొని మేటియా దధిము ♦ ఖుం గని సర్వము పోలఁదెల్పి వా
రి నడఁచు శక్తి యేల? యెది ♦ రించెడు చేవయు లేదు నాపుడుఁ. ౧౧౪౧

తే॥ ఎవ్వ రెక్కడి వారలొ? యెఱిఁగినారె?, తెలుపుఁడీ చూపుఁ డన వారు♦పలికిరిట్లు
లంగదుం డాదిగాఁగ వి♦ద్యాప్రవీణు, లైన వానర వరులె పో♦యరుగుదెంచి

ఉ॥ అంగదు నాజ్ఞచేతఁ గలి ♦ యం బడి కొమ్మలఁ ద్రుంచి పండులఁ
ద్రుంగఁగ రాల్చి తేనియలు ♦ తొట్టు పెర ల్వదిలించి పాడు చే
యం గని మేము డాసి ప్లవ♦గాధిపు నాజ్ఞను తెల్పి పొండనఁ
జెంగక మమ్ము దూఱి యఱ ♦ చేతుల మోఁదిరి దేవరా! యనఁ.

చ॥ దధిముఖుఁ డుగ్రుఁడై తొడరి ♦ తక్కటి వారలఁ గూర్చుకొంచు న
మ్మధువనిఁ జొచ్చి వాలి మృతి ♦ మర్కట పోత మెఱుంగ దేమొ? యీ
దధిముఖు ముందునా వితథ ♦ దర్పము చూపుట? యంచుఁ ద్రోల నా
ప్రథిత బలుల్ బలీముఖులు ♦ పాఱిరి యంగదుఁ డున్న చోటికిఁ. ౧౧౪౪

ఉ॥ దేవ విభుండు వాలికి న ♦ తి ప్రియమార నొసంగ నెప్పుడుఁ
గావలిగాచు మేము కడఁ ♦ కం బనిసేయఁగ నిగ్రహించి సు
గ్రీవుని చండశాసనము ♦ కీడొనరించెదె? యింత ధైర్యమే?
జీవితమెల్ల నేఁటికె న ♦ శించెనె? ప్రాణము లింత చేదొకో? ౧౧౪౫

సీ॥ అని పెనుగుండు చే♦కొని దధిముఖుఁ డార్చి, వారిపై వైవంగ♦వాలి సుతుఁడు
పాషాణముం దట్టి♦వైచి వానిం బట్టి, కొని ప్రభుతోఁ జెప్పి♦కొనుమ యనుచు
మోము నెత్తురు గ్రమ్మ♦ముష్టి ఘాతం బిచ్చి, దధిముఖు వనినుండి♦తఱిమివైచి
వానివారలఁబట్టి♦మేను లిఱియఁగట్టి, నలఁగఁబొడిచి నెత్తు♦రొలుక విడిచి

తే॥ మీరు మీ మొనగానితోఁ♦జేరిపోయి, తెలిపికొనుఁడు దిక్కగుచోటఁ♦దేఱిచూతు
రేని మీ ప్రాణములు పోక♦మానవనుచుఁ, దఱుమ వారలువడఁకుచుఁ♦బఱచినారు.

తే॥ ప్లవగములు వసంతములాడు♦పగిదిఁ దేనెఁ, గొల్లలాడి చల్లికొనుచుఁ♦గోసినట్టి
ఫలములనునాయకులకుఁగా♦నుకలుగనిడుచు, నెండ వేఁడి తగ్గెడుదాఁక♦నుండె నచట.

తే॥ శూలికేనియు నరుదైన♦లీలయనగఁ, దోఁచు దుష్కరంబులు రామ♦దూత తీర్చి
యిచట నిటులుండ నితనికై♦యెదురుచూచు, చుండెనుత్కంఠ భాను కు♦లోద్భవుండు.

ఆ॥ రవిసుతుండు జనక♦రాజపుత్త్రిని గాంచి, యరసి రండటంచు♦హనుమదాది
వనచరాళిఁ బంపి♦మనుకులాధ్యక్షుని, డెందమలర నూఱ♦డించుచుండె. ౧౧౪౯
ఆ॥ భానుసుతుఁడు ప్రస్ర♦వణగిరియందుండి, యనునయోక్తు లెన్నొ♦యాడుచుండ
రామవిభుఁడు పెక్కు♦ప్రాణంబు లొందిన, తీరుగాఁగ సోలి♦తేఱుచుండె. ౧౧౫౦
ఆ॥ అరయ మూఁడు దెసల♦కరిగిన వానర, వరులు వచ్చి సీత ♦ దొరకదన్న
వార్త కలఁప రామ♦భద్రుఁడు పావనిం, దలఁచి సుంత జీవ♦ములను నిలిపె.
ఆ॥ వనటఁ గుంది భాను♦తనయుని గని మన, యతనమెల్ల విఫల♦మయ్యె నింద
సుస్థిరముగ నిలిచె♦నుడిసెను ప్రాణముల్, మనియు నేను వారు♦కొనున దేది ?
తే॥ గడువుపెట్టిన దినములో ♦ కడచిపోయె, నరయ నేగినవారలో ♦ మరలిరారు
చిక్కులేవేనిఘటియింపఁ♦జిక్కినారొ?మరణమొందిరో?మఱియేమి♦పొరసెనొక్కొ?.
తే॥ ధరజ మరణించె ననువార్త♦మరలివచ్చి, తెలుపుకంటెను చచ్చుటే♦తెఱఁగటంచుఁ
జర్చచేసి ప్రాయోపవే♦శంబు చేసి, రేమొ? వెదకుచునే యుండి♦రేమొ! తెలియ.
తే॥ రక్కసులఁ గని కోపంబు♦మిక్కిలిగొని, ముమ్మరంబుగ జగడించి♦ముగిసినారొ ?
వంచకులమాయఁజిక్కితప్పించుకొనఁగ, లేక చెఱఁజిక్కియచటఁదూ♦లిరొ?మఱేమొ?.
తే॥ గడువు దినములలోన నె♦క్రమ్మఱమికి, వగచి తనువులపై నాస♦డిగిచి తపము
సేయఁబూనిరో? మఱియేమి♦సిలుఁగు గలిగె? నేమి నీమదిఁ దోఁచు? ది♦నేంద్రతనయ
తే॥ అనుచుఁ బరితపించుచునుండు♦నవసరమున, మోము నెత్తుటితో దధి♦ముఖుఁడువచ్చి
కీశనాథుని సన్నిధిఁ♦గేలుమోడ్చి, వినయ భయ సంభ్రమంబులు♦పెనఁగొనంగ.
తే॥ దేవ! నేఁటితో మధువన♦స్థితి నశించె, ననుడు నాతని రక్తసి♦క్తాననంబుఁ
గాంచి జరిగిన దేమి? కా♦వించువార, లెవరొ? తెల్పుమ యనఁగ వాఁ♦డిట్టులనియె.
సీ॥ అంగద జాంబవ♦దాంజనేయ కుముద, నీలాదు లేతెంచి♦లీలఁ బేర్చి
మన మధువనము పా♦డొనరింపఁ దొడఁగిరి, వలదని వారించు♦వారిఁ దఱిమి
వాలిసూనుఁడు మిమ్ము♦తేలికగాఁ బల్కి, తన్నాశమునకుఁ బ్రో♦త్సాహమొసఁగఁ
నేనొక శిలగొని♦యేయ నంగదుఁ డడ్డి, తనకరమున దానిఁ♦దట్టివైచి
తే॥ దావపావకువలె మండి♦దఱిసి నన్ను, తాఁచి క్రుమ్మి నెట్టుచు నీవు♦త్వరగఁ బోయి
దిక్కుగలచోటమొఱనివే♦దించుకొనుమ,యనుచునాడవచ్చితి దేవ♦యనుడునతఁడు.
తే॥ సంతసంబున శ్రీరామ♦చంద్రుఁ గాంచి, వసుమతీజాత యుత్తమ♦వ్రతముతోడ
జీవములతోడ నున్నట్టి♦చెలువు దెలియఁ, బలుకుచున్నవి వారల♦తులువపనులు.
తే॥ శుభచరిత్రను బాగుగాఁ♦జూచినారు, వార లమ్మధువనమును♦పాడుచేసి
తేనె లానుట జనకపు♦త్త్రికను గన్న, కుతుకమునసె యా నిక్కంబు♦కుందు విడుము.
తే॥ అనుడు శ్రీరామవిభుఁడించు♦కంత తనిసి, యేమి తెల్పుదురో వార♦లేగుదెంచి
యని ప్రతీక్షించె నుత్కంఠ♦నర్కసుతుఁడు, దధిముఖుని గాంచి పలికె నా♦దరము మీఱ.

సీ॥ అంగదుండు చెడుగు♦లాచరింపఁడు పావ, నియు జాంబవంతుండు♦నీచమతులు
కారు వారలు రామ♦కార్యంబు తలమోచి, భువియెల్ల ధారణీ♦పుత్త్రి వెదకి
యామెను గొనిపోవు♦నసురుల నాశంబు, గావించి వచ్చిరి♦కడఁక చెడక
కనుక వా రేమిచే♦సినఁ జెల్లుబడి యయ్యె, నదిగాక చిన్న రా♦జంగదుండు
తే॥ అతని నీవెదిరించుట♦యర్హమగునె? ముందు వెనుక లెఱుంగక♦మొనసితింక
మేలు కోరెద వేని య♦వ్వాలిసుతుని, శరణు వేఁడుమ యదె సమం♦జస మనంగ.
తే॥ ముదుఁగు మేనితో వాడిన♦యెడఁదతోడ, వదనమును మూసికొని వన♦పాలకుండు
ప్రభునకుం జాఁగిమ్రొక్కి త♦త్పరిజనముల, తోడఁ గ్రమ్మఱి మధువనిఁ♦దూఱునంత.
తే॥ అతనిఁ గని యంగదుండు క♦ట్టలుక పొంగ, మరలఁ దొడరిన చో నీని♦మన్ని గొందు
ననుచు మనమునఁ దలపోయు♦నంత వాఁడు, శరణు శరణ మనుచుఁ బట్టెఁ♦జరణములను.
తే॥ ఎఱుక మాలి చేసిన తప్పు♦మఱచి కావు, మనుచు వేఁడఁగ నంగదుఁ♦డతని నెత్తి
మిమ్ము నవఱిచినయదియును♦మీరు మఱవుఁ, డనుచు నోదార్చి యంతట♦హనుమఁ గాంచి.
చ॥ గడువు తొలంగె నంచు గతి♦గానని దుఃఖ పయోధి మున్గ మా
కుడుసము వోలె సాయపడి♦యోపికఁ గాచిన యట్లు రాముఁడున్
గడ గనకుండు దుఃఖముల ♦ గాసిలకుండఁగఁ దేర్చు ముందుగా
నడువుమ యంచుఁ బల్కె రఘు ♦ నాథుని గానఁగ నేగె నాతఁడున్.
క॥ సూర్యసుతుఁ డుడిగెఁ గోపము, సూర్యుండును క్రుంచికొని మోఁ♦జూఱుకుఁదనము నిం
కార్యుని గానఁగఁ బోవుట, కార్యంబని నడచెఁ గపి ని♦కాయంబెల్లన్.
క॥ అట రాముఁడు రవిసుతు వి, స్ఫుట శక్తిం గాంచి వచ్చు♦పుణ్యులు సీతన్
బటిమం జూచితి మందురొ? యెటఁ గన మందురొకొ? యేమొ? యెఱుఁగంగలవే?
తే॥ అనుచు నాతనిఁ బ్రశ్నించు♦నంతలోన, హనుమ దక్షిణ భానూద♦యంబు పగిదిఁ
గానవచ్చె రాఘవుఁడు ను♦త్కంఠతోడ, నతని ముఖబింబ మెగదిగ♦నరసి చూచె

—: మారుతి శ్రీరామునకు సీతావృత్తాంతము తెలుపుట :—

ఉ॥ మారుతి చేరఁ జేరి యల♦మాన్యపదంబుల మ్రొక్కలేదు పం
కేరుహ సద్మముల్ దొలఁగ ♦ నీఁగిన యిందిర సీత దిక్కు కై
వారము సేసి భూస్థలిని ♦ వ్రాలి నమస్కృతి సేసి కేలు మో
డ్పార ఘటించి పల్కె విన ♦ యంబున మంగళ వాక్యజాలముల్.
ఉ॥ జాడలచేత నింగితము ♦ చక్క నెఱింగెడి రామచంద్రుఁ డా
గాడుపు పట్టి చేష్టలను ♦ గాంచెను జానకి భద్రయుక్తయే
యాడిక లేక యొప్పు సతి ♦ నారసె సీతఁడు నిక్కువంబు నే
నోడక గెల్చఁగంటి నని ♦ యుత్సహనంబు భజించె నయ్యెడన్. ౧౧౮౭

తే॥ హనుమ చెయ్వులే కొలఁతగా♦హరువుగాఁగ, జరిగినది యొఱింగిన రామ♦చంద్రు కనుల
నీరు నిండఁ బాహువులుబ్బె♦నెంజిలి చనె, వలపు నిండారె; మారుతి♦పలికె నిట్లు.

మత్త॥ కాంచినాఁడ సతీత్వ భూషను ♦ గణ్యవర్తన జానకిన్
గాంచినాఁడ మదీయ దైవముఁ ♦ గన్నులారఁగ లంకలోఁ
గాంచినాఁడను శంక వీడుము ♦ కాంచుమా మది నెమ్మదిన్
గాంచితిన్ మఱి మాటలాడితిఁ♦గ్రమ్మఱిల్లితి రాఘవా!

ఆ॥ మీకుఁ దగిన దేవి♦మీ తండ్రి కోడలు, జనక రాజతనయ ♦ యనఁగఁ దగిన
గారవంబుతోడఁ ♦ గ్రాలుచు నున్నది, నీకు భూషణంబు ♦ నాకుఁదల్లి.

సీ॥ బంగారుతోఁ సాటి ♦ బంగారమే తక్క, నన్యంబు జగతి లే♦దనఁగ నొప్పి
తన సాటివారలు♦తాఁదక్క జగముల, నరసిన లేరు లే♦రనఁగఁ దనరి
తన కన్నివిధములఁ♦దగియున్న నిను పోలు, ఘనుఁడు నీకంటె లేఁ♦డనఁగ నమరి
నన్ను పోలిన వారు♦ నాకంటె లేరను, నాణెంపుఁ గీర్తిని♦నాకొసంగె

తే॥ ధరణి జాత ప్రపూత శ్రో♦త్రదుల పంట, లోక దీపంబు నిఖిల లో♦కైకమాత
భువనవంద్య క్షేమప్రద♦భూరి సుగుణ, రాశి కరుణామయాత్మక ♦ రామచంద్ర!

సీ॥ నీవు జన్మించిన♦నీకులంబును నీకుఁ, దగినదిగాఁ జేసి ♦ ధరణి తనయ
జనకుని కులమున♦కనుపమ విఖ్యాతి, నాచంద్ర తారార్క ♦ మమర నిలిపి
తన్నుడఁ బాపిన ♦ దనుజుని కులమును, మొప్పుగా సమవర్తి♦కొప్పగించి
యిల్లు వాకిలి వీడి ♦ యిక్కట్టులం బడు, వేల్పుల కొలము జీ ♦ వింపఁజేసి

తే॥ నా కులంబున నాకు మా♦న్యత నొసంగె, నింతకంటె నాయమ చేయ♦నేది గలదు?
చేయవలసిన దెల్లను♦చేసి యుంచె, దానిఁ గాపాడుకొన నీకుఁ♦దరుణ మిచ్చె.

ఉ॥ చూచితి లంకలో భువన ♦ సుందర దేవతయైన జానకిన్
శ్రీ చెలువారు జన్మ కుల ♦ శీల మహత్త్వము భూరి శాంతమున్
బూచు తపఃఫలం బనఁగఁ♦బోలిన భవ్య పతివ్రతాత్వమున్
బైచన నేచి లోకనుత ♦ పద్ధతి నుద్ధతిఁ దాండవింపఁగన్.

ఉ॥ ఆయమ కన్నులందు మన ♦ మందును వాక్కునయందు దర్పకుం
డేయఁగ నైన గాయముల ♦ నెక్కడఁ జూచిన నున్నవాఁడ వ
త్యాయతనేత్ర నిన్ను విడ♦నాడిన దంచు వచింపఁబూనుటే
న్యాయముగాఁగఁ దోఁప దది ♦ యర్యమ వంశ పయోధి చంద్రమా!

చ॥ తపమె స్వయంబుగాఁ దప ము ♦ దగ్రతఁ జేసి యపూర్వ రూప మా
తపము ఫలంబుగాఁ గొను వి ♦ ధంబున నున్నది భూమిజాత ర
క్తపుల పురమ్మునం గనక♦కల్ప మహీరుహ వాటి లక్ష్మణుం
డుపమరి కప్పియుంచిన తృ♦ణోత్కర భవ్య కుటీరమందునన్. ౧౧౮౦

చ॥ వలవని సుందరాంగులను ♦ బల్మిని డాఁకితి వేని సీతలన్
వలవల వ్రక్కలై పుడమి ♦ వ్రాలఁగఁ జచ్చెద వంచు నుగ్రతన్
జలజ భవుం డొసంగె మును ♦ శాపము గావున సీత యున్న భూ
తలమును వెల్లగించికొని ♦ తప్పె నిశాచరుఁ డార్య సన్నుతా!

ఉ॥ త్రొయ్యలి నాతఁడంటఁ డను ♦ స్తుత్య వచస్సు నజాండ గోళముల్
వ్రయ్యవు శేషు శీర్షములు ♦ వ్రక్కలు గావు సముద్ర నీరముల్
క్రుయ్యవు సూర్యచంద్రులును ♦ గూలదు లోకము మాయదింక నీ
వొయ్యన పీనిఁ గాంచి నిజ ♦ మొప్ప నెఱింగెదు గాక రాఘవా! ౧౧౨

సీ॥ శో కాకులితచిత్త ♦ కాకుత్స్థ దేవి పా, తివ్రత్య మహిమంబు ♦ తెలుకతన
బ్రహ్మాది విబుధుల ♦ భార్యల కొప్పిదమగు, క్రొత్తడి తనమున ♦ గురుతగనిరి
శివుని సామేన వ♦సించు నుమాదేవి, శిరమునఁ గూడ వ♦సింపఁదగియె
పంకజాలయ విష్ణు ♦ వక్షమందే కాక, వేయి తలల మీఁద ♦ వెలయఁదగియె

తే॥ పురుషులకు గౌరవముడక్కెఁ ♦ బుడమియందు మానినులకును మానంబు ♦ మానమయ్యె
మనసు నిలుకడ యందుట ♦ మానినీత్వ, మహిమ యెల్ల వారలకు న♦ వశ్యమయ్యె

శా॥ లంకాపట్టణ మెల్లెడం దిరిగి యిం ♦ డ్లం జొచ్చి శోధించి యా
తంకం బేమియు లేక రావణుని శు♦ద్ధాంతంబు గాలించి యా
వంకం గల్గు నశోక వాటి నడుమన్ ♦ బాష్పాపగా వీచికా
పంక క్షాళిత శుష్క గాత్రిని మహా ♦ భవ్యాత్మికం గాంచితిన్. ౧౧౪

మ॥ అకటా! దేవి యనేక రాక్షసుల మ ♦ ధ్యంబందు భూతంబు లం
జికనొందం గల గర్వ గర్జనముతోఁ ♦ జేకూర్చు నిర్బంధ లో
పికయే చేడియ రూపమొందె ననఁగాఁ ♦ బెంపొందు శాంతంబుతో
నొకటం దెప్పర మోర్చుచున్నయది నీ ♦ యుద్యోగ మీక్షించుచున్.

చ॥ గురు గుణముల్ స్వభావగతిఁ ♦ గూరిన యుత్తమ సాధ్వి నీపయిన్
మారువుగ నంచు నత్యతిశ ♦ యాంచిత భావముఁ గన్నులారఁగాఁ
బురికొని కాంచఁగా జగతిఁ ♦ బుట్టుటచే నొకరుండ వీవ పో
పురుషుఁడవై జనించుటకుఁ ♦ బోలిన భాగ్యము నొంది తిమ్మహిన్.

చ॥ దనుజపురంబునం దతుల ♦ దైన్యము నొందుచు నూర్పు పుచ్చుచున్
బొనుపడి జీవ సంచయము ♦ ప్రుంగుచు నుయ్యేలలూఁగ దైన్య సే
వనములు సేయుచుండెను సు ♦ పర్వ లతాంగులు మున్ను చూడకుం
డిన నిపు డోర్పుమైఁ దృణకు ♦ టిం గనువారలు సాధ్వి తత్త్వముల్.

ఉ॥ దేవిని గాంచఁగాఁ దగిన ♦ తేఁకువ కాలము వేచియుండఁగా
రావణుఁ డయ్యెడం దొడరి ♦ ప్రార్థనచేసి నమస్కరించి యెం

తో వడి దేవులాడియును ♦ తొయ్యలి వానిఁ దిరస్కరింప నా
పై వడి వాఁడు మైథిలిని ♦ ప్రాణము తీయఁగఁబూనె రాఘవా! ౧౧౮౮

ఉ॥ దేవి పతివ్రతాత్వమును ♦ దీటు గడింపని నీ ప్రసాదమున్
గావలియైన ధర్మమును ♦ కావఁగ రాక్షసకాంతలన్ బ్రభూ
తావహ రోష భీషణత ♦ నారసి యామెకు బుద్ధిసెప్ప నా
జ్ఞా విధి సేసిపోయెఁ దద ♦ నంతర మేనును జెంది నెమ్మదిన్. ౧౧౮౯

ఉ॥ నాదగు మంత్రశక్తి కత ♦ నన్ దనుజాంగన లెల్లఁ గూర్కఁగా
మేదినిపుత్రి యత్తఱిని ♦ మేకొని ప్రాణము వీడఁ దీవియల్
మీఁదుగఁ గట్టి కంఠముఁ ద ♦ మిం గొని కూర్చఁగఁ బోవునంతలో
నీదు పవిత్రనామమును ♦ నే వచియింపుచు డాయఁబోయితిన్. ౧౧౯౦

చ॥ జడిగొని బాష్పముల్ గురియఁ ♦ జాల వెతంబడు భూమిజాత న
న్నొడికముతోడఁ గాంచి యిది ♦ యుత్కట రాక్షసమాయ యంచుఁ దా
నెడఁదఁ దలంచియున్ వపువు ♦ నీఁగెడు వేళను రామనామమున్
గడఁకను పల్క యడ్డుపడి ♦ కాచితి వెవ్వఁడ వీవు తెల్పుమా. ౧౧౯౧

చ॥ అనవుడు నేను పూని యడి ♦ యాలము లెల్లను దెల్ప నామెయున్
దనుకఁగ నాలకించి తమ ♦ దాసుని చిత్త విశుద్ధిఁ గాంచి పెం
పున నడుగంగఁ బూనునెడ ♦ ముద్రిక నిచ్చితిఁ జెప్పనేల? త
న్మనమున కద్ది యాయు విడు ♦ మందుగ నొప్పెను జానకీశ్వరా! ౧౧౯౨

చ॥ క్షణమున రెండుః చూచితిని ♦ సారసలోచన యంగుళీయమున్
గొని తన యొమ్మునం దడఁచి ♦ కొన్నది నీయెడఁబాటుచేతఁ గ్రాఁ
గిన మది తాఁకుచేతఁ గరఁ ♦ గెన్ మఱి చేతము చల్లఁగాఁగ నం
దనుకఁ గరంగినట్టిది య ♦ థాస్థితి నొందినదయ్య! వెంటనే ౧౧౯౩

మ॥ అపవిత్రుల్ గల పట్టనంబునకుఁ బెం ♦ పారంగ నేతేరఁగా
నపవిత్ర స్థితి నొందె నంచుఁ దన హ ♦ స్తాపూర్ణ బాష్పావలిన్
వ్యపనోదం బొనరింప నార్చె నొడలున్ ♦ వర్ధిల్లె నేత్రంబు లా
రుప కుత్కంఠను గాంచె ముద్దులిడె నూ ♦ ర్పుల్పుచ్చె సమ్మోదిలెన్.

సీ॥ పావని నిన్నెడఁ♦బాయుట మొదలుగా, జరిగిన యదియెల్ల♦సారిదిగాఁగ
నెఱిఁగించి తల్లి! నీ ♦ వెట నుండునది యెఱుఁ, గక యింతకాలంబు♦కడచిపోయె
నని నీవు పడు వెత♦లను దెల్ప నామెయు, సాంత్వన మొంది యి♦చ్చటఁ గలట్టి
స్థితిగతు లాలించి♦దేవియు నచ్చటి, తన స్థితియును నాకుఁ♦దనరఁ దెలిపి

తే॥ యింక నొకనెల జీవించి♦యెట్లొ యుందు, నినకులేశుండు కరుణ వ♦హింపఁడేని
విడవఁ దనయాన జీవము♦వీడుచుదాన, ననుచు నీపాదములకు వం♦దన మొనర్చె.

తే॥ ముదిత తన చేలకొంగున ♦ ముడిచియున్న
ఘన శిరోరత్న మానవా ♦ ల్గా నొసంగెఁ
గన్ను లలరఁ గాంచుమ యని ♦ గాడ్పుపట్టి
జానకీజాని కొసఁగె హ ♦ ర్షము తలిర్ప.

సీ॥ కాంచినయంత రో♦మాంచమయ్యెను మేను, కన్నీరు మున్నీరు♦గాఁగఁ బరవె
భుజములు వక్షంబు♦పూరించెఁ జెమరించె, నూపిరి లోపల♦నూఁజడిల్లెఁ
గామంబు మిలమెల్ల♦సోమించి వర్ధిల్లెఁ, దాపంబు దూపిల్లి♦రూపుమాసె
మోదాబ్ధి మది మున్గె♦ఖేదంబు వడి క్రుంగెఁ, దెలుపంగఁ దరమె యా♦తీరులెల

తే॥ చేతనున్న చూడామణి ♦ ప్రాఁతచనవు
తోడఁ జూడంగ జానకి ♦ తొల్లిఁ దన్ను
ముదముతోఁ బట్టు కేలె యఁట ♦ మొగిఁదనర్చె
ధర్మ సంస్థాపకుండగు ♦ దాశరథికి.

తే॥ అప్పు డంగదాదులు వచ్చి ♦ యనఘులైన
రామలక్ష్మణులకు దిన ♦ రాజ సుతున
కెఱఁగి తమ కార్యమునఁ గృత ♦ కృత్యులగుటఁ
బూర్ణచంద్రాభ వదనులై ♦ పొలుపు గనిరి.

తే॥ అవల సుగ్రీవుఁ డలరుచు ♦ నవనిజాత
సులభురాలయ్యె మనమిఁకఁ ♦ జూడ ననుడుఁ
గడచెఁ గాలంబు మఱియును ♦ కడపవలెనె?
యనుచు రాఘవుఁ డనఁ ద్వర ♦ గొనుచు లేచి.

చ॥ తరలఁగ వచ్చు సేన యనిఁ ♦ తప్పెటతోఁ గపివర్గమెల్లఁ ద
త్తఱపడి లేవఁ జాటిరి ము ♦ దంబుగఁ గొందఱు కీశు లంత నో
త్తరముగ వాహినుల్ గదలె ♦ దర్పముతో వనరాశి పొంగి యా
కరణిని లేచి వచ్చెననఁ ♦ గాఁ దగి దక్షిణ దిఙ్ముఖంబుగన్. ౧౨౦౦

తే॥ తగిన రీతిని మ్రోగెఁ బ్ర ♦ స్థానభేరి
శత్రువులనుండి చెడుగులు ♦ జరుగకుండ
నడపుమా సేనలను దగు ♦ నడవ చూపి
యనుచు నీలు నాజ్ఞాపించె ♦ నర్కకులుఁడు.

చ॥ హనుమఁడు కేలుమోడ్చి యిది ♦ యల్ప వనేచరమంచు నెంచ క
త్యనఘమతిన్ మదీయ భుజ♦మందు వసింపుము మోతునంచు వం
దన మొనరించి వేఁడ గుణ♦ధాముఁడు రాముడు మంచిదంచు నా
తనిపయి నెక్కె మారుతి యు♦దార గుణంబుల నగ్గలింపఁగన్. ౧౨౦౧

మ॥ అకలంకాత్మక! నాభుజంబుల పయిం ♦ బ్రార్థింతుఁ గూర్చుండుమా
సుకరస్ఫూర్తి వహింతు నంచు వినతిం ♦ జూపించుచున్ వేఁడు వా
లి కుమారుం డగనెక్కె లక్ష్మణుఁడు నో ♦ లిన్ సైన్య సందోహముల్
ప్రకటానర్గళ రీతి నేగెఁ దగు త్రో ♦ వ న్నాయకుల్ చూపఁగన్. ౧౨౦౩

తే॥ గరుడ వృషభ పృష్ఠము లెక్కు ♦ ఘనులఁబోలి
హనుమపై నంగదునిపై వి ♦ హారరీతి
రామ లక్ష్మణు లిరువురు ♦ రమణ నేగ
సురలు దీవించి చల్లిరి ♦ సుమ చయంబు. ౧౨౦౪

తే॥ ఊరి త్రోవల నడచిన ♦ నొత్తిడి యగు
నంచు రాముఁ డాజ్ఞాపింప ♦ నలరుఁ దేనె
పండ్లు కందముల్ లభియించు ♦ పర్వతముల
త్రోవ నడచెను గీశ సం ♦ దోహమెల్ల. ౧౨౦౫

తే॥ రాక్షసుల సత్త్వములను ప ♦ రాక్రమముల
వాయు సూనుండు తెలుపంగఁ ♦ బ్రీతి వినుచుఁ
జాలదూరంబు నడచెను ♦ శ్రమ మెఱుఁగక
కపి సమూహంబు రామ ల ♦ క్ష్మణులతోడ. ౧౨౦౬

తే॥ పొడవు త్రోవను భాస్కర ♦ పుత్త్రుతోడ
రామలక్ష్మణుల్ ప్లవగ వ ♦ ర్గంబు తోడ
నడచి కనిరి పండ్రెండవ ♦ నాఁడు తమకు
దారి యొసఁగక నిలిచిన ♦ దక్షిణాబ్ధి. ౧౨౦౭

శ్రీ శ్రీ శ్రీ

శ్రీరామ.

కంబరామాయణము.

యుద్ధకాండము :: పూర్వభాగము.

మ॥ విమలంబై యొకటన్న నొక్కటయి వై ♦ విధ్యంబనం బెక్కులై
సుమహాత్తై తగునన్న నౌననుచు నె ♦ చోఁగాదనం గానిదై
రమణన్ నేఁడన నేఁడెయై కలదనన్ ♦ రాజిల్ల నున్నట్టిదై
యమరంగా నెటునమ్మి యేవిధమునన్ ♦ ధ్యానంబు గావింతుమో ? ౧

౧ సముద్ర దర్శన పటలము (౧౧)

మ॥ జలనిధి తీరభూమిఁ గపి ♦ సైన్యము చేరఁగ నుత్తరంబునన్
విలయము వేళ నాశిలసి ♦ పృథ్వీధరంబు పయోధి భూమియుం
జలుకన లేచి యాకసము ♦ నూటిగఁదాఁకెను దక్షిణంపు భూ
స్థలియు మహీధరంబొదిఁగి ♦ తాఁతె రసాతల మంటసిల్లఁగన్. ౨
ఉ॥ చింపము వోలు స్వచ్ఛగుణ ♦ శీల మహీజను పాయు పిమ్మటన్
బందుగులైన తామరస ♦ వర్గము కూరికి మోడ్పు నెందు వే
శం దన కన్ను మూయని ద ♦ శత్కమలాక్షుఁ డపారవాహినీ
బృందము తన్ను చుట్టి చరి ♦ యింపఁగ నయ్యెడఁగాంచె వారిధిన్. ౩
చ॥ అలల సమూహమే విభవ ♦ మైన పయోధి వియోగ మొంది చి
క్కులఁబడి స్వీయతల్పమున ♦ కూరిమిచేఁ జనుదెంచు మాయి ని
శ్చలుఁ డగునంచు బుష్పములఁ ♦ జల్లి యమర్చిన సెజ్జఁబోలె నా
తలమున ఫేన మౌక్తిక వి ♦ తానముఁ జల్లుచుచుండెఁ దెమ్మెరన్. ౪
చ॥ బలితపు దుఃఖవార్ధిఁ బడి ♦ బాష్ప జలంబులఁ దేలు సీత నె
వ్వాలఁబడి వేఁగుచుంట నప ♦ నాదునకున్ స్మర శాత సాయకా
వలికిని లక్ష్యమైన రఘు ♦ వర్యుని సుందర బాహు యుగ్మమున్
గాలిమిని లేచు నిప్పుకల ♦ కోపునఁ గాల్చెను వార్ధి తుంపురుల్. ౫
చ॥ గుఱుతిడరాక ప్రసుక్కిన ర ♦ ఘుప్రభుఁగాంచి మనంబు నంతయుం
గరఁగక భేదబుద్ధిఁ గడఁ ♦ కన్ రొదసేయు మహాబ్ధి నుండి పై

విరియుచునుండు వీచికలఁ ♦ బేర్మి మునుంగుచు లేచి వచ్చు తె
మ్మెర సురపొన్న పుష్పాదిని ♦ మేపక పోవ దొడఁగె సారియున్. ౬

చ॥ పొగడువడన్ శరాసనము ♦ పూనిన బాహులు జానకీ వియో
గ గురుతరార్తిచేఁ గృశతఁ ♦ గాంచి మహీధర సన్నిభంబులై
నెగడుచు నుండు రామ ధర ♦ ణీధవు చెంగట సీత నోటి సో
యగము వహించి కాలుని క్రి ♦ యం గనుపట్టెఁ బ్రవాళ వల్లరుల్. ౭

ఉ॥ మత్తగజేంద్రయాన జన ♦ మాన్య చరిత్ర వసించుచోటు నీ
కిత్తఱి దవ్వులేదనుచు ♦ నిచ్చ గమింపఁగ మాన వీర్యముల్
చిత్తము లాగ మిక్కిలి కృ ♦ శించెడు రాముని చంప నెంచి యో
ముత్తెమ! దైత్య సంగతిని ♦ పూనెదె? జానకి నవ్వుచూపెదే? ౮

ఉ॥ కన్నకుమార్తె శాత్రవుని ♦ కారఁ దగుల్కొని వంతఁ గుందుచున్
గన్నగచాట్లు గొన్నయది ♦ గా యని దుఃఖమునొంది మిక్కిలిన్
గన్నుల నీటి ముత్తెములు ♦ గార్చి కరళ్లను కేలనెత్తి తాఁ
బన్నుగ రామపాదములఁ ♦ బట్టిన యట్లు పయోధి గన్పడెన్. ౯

చ॥ వసుధయె సన్నికల్లుగ ని ♦ వంబను నీరము చల్లి వార్ధిలోఁ
బొనఁగిన ద్రవ్యమున్ మెదిపి ♦ పొందిక ఫేనము పేరి గంధమున్
విసిగి తపించు సూర్యకుల ♦ వీరుని తాపముపోవఁ బూయఁగా
లస దురు వీచికా కరము♦లన్ వడి నూఱిన తీరు గన్పడెన్. ౧౦

చ॥ స్తనములు గల్గు కోకిలము ♦ చందము నొందినసీత దుఃఖముం
బొనుపడఁ జేయఁ వేల్పులకుఁ ♦ బూర్ణసుఖంబుల నీయ హస్తమం
దున శరచాపము ల్గొనుచు ♦ దుర్దమలీలను దాడిసేయు రా
ముని గని వార్ధి సంతసము ♦ పొంగ నటించిన పోరు గన్పడెన్. ౧౧

ఉ॥ వారిధి డాసి రాఘవుఁడు ♦ వారిధి కంటెను మించి మానమున్
గూరిమి దుఃఖముల్ మిగులఁ ♦ గూడఁగఁ జేయఁగఁ దగ్గ చెయ్దియున్
వారక చిత్తమందు తలఁ ♦ పం దొడఁగెం; ద్రిదశారి లంకలో
మారుతి చన్నమీఁదఁ దన ♦ మంత్రులతోఁ దలపోసి యవ్వలన్. ౧౨

౨ రావణ మంత్ర పటలము. (౧౧౮)

ఉ॥ శిల్పిని మామఁగాంచి కడు ♦ శీఘ్రమ బ్రహ్మను గూడి లంక మున్
బొల్పుగ నున్న తీరునకు ♦ ముమ్మడిగా విలసిల్ల మీ మనః
కల్పనము ల్బయల్పడఁ ద ♦ గన్ ఘటియింపుఁడి యన్న వారలున్
వేల్పులు భ్రాంతినొందఁ దమ ♦ నేరుపుచూపి సృజించి రత్తఱిన్. ౧౩

క॥ బంగారము మణి సంతతి, రంగారఁగ వెలుఁగు తనవు ♦ రము త్రిదివము క
న్నం గొమరగుటం గాంచి మ, దిం గల కోపంబు మాని ♦ దితిజాధిపుఁడున్. ౧౪

చ॥ పరఁగఁ ద్రిమూర్తులందు తొలి ♦ వాఁడగు బ్రహ్మయె ముందు నిల్చి సుం
దరతకు మేరచూపి ఘన ♦ తం దగు శక్తియు నిచ్చె ధర్మముల్
కొఱవడ లోకజాలములఁ ♦ గూల్చుచుఁ జేయుచుఁ బెక్కుసార్లు చే
దిరిగిన వానికిన్ సొగసు ♦ దేఱని కార్యము లున్న యిద్ధరన్? ౧౫

క॥ అరుదుగఁ గట్టిన నగరము, నరుదుగ వీక్షించి నిర్జ♦రారి యజుం జే
రరుదుగ నర్చించి మయున, కరుదగు వస్తువుల నొసఁగె♦నాదరణమునన్. ౧౬

తే॥ మెఱుపువంటి యులల మిఱు♦మిట్లు గొలుపు, కెంపు టాకంబముల దీప్తి♦కెరలుచున్న
మండపమున సింహాసన♦మధ్యపీఠి, నిండుకొలువు దీరెను నాఁడు♦నిర్జరారి.

తే॥ సురసతులువైచుచుండు వీ♦చోపు వలనఁ, గదలు పూమాలఁదాల్చిన♦త్రిదశవైరి
సచివు లనుభవవృద్ధులు♦నైన నృపతులు, బంధువులు చుట్టియుండ రా♦వణుఁడు కాంచి.

తే॥ తలఁచు కార్యంబు తగిన ప♦ద్ధతిని తెలిపి, వృద్ధమంత్రుల తలఁపులు♦వేడ్కఁ దెలియ
వెలఁదులను పిన్నవారల♦వేలుపులను, ప్రకృతి జనముల నెల్ల న♦వ్వలికిఁ బంపె.

తే॥ ప్రాభవంబుచే నాజ్ఞ చే♦బంభరముల, తోడ గాలిని సైతము♦తొలఁగఁ బంపి
యనుభవజ్ఞులు వాక్యజ్ఞ♦లైన సచివ, వరులతోడ నాలోచనా♦పరతనొప్పె.

తే॥ వీరలై బహుశ్రుతులయి♦ప్రేమచూఱ, గొన్న వారయ్యుఁ దమ్ములు♦కొడుకులట్టి
యాత్మబంధులఁదక్క వే♦త్రైన జనుల, నెల్లరను వెలికంపె స్వ♦హితము గోరి.

ఆ॥ జగములెల్ల నొక్క♦ మొగినెత్తి వచ్చిన, నలఁపఁదగిన వీర♦నాయకులను
కడలఁ దిరుగుచుండఁ♦గాపుంచె మృగపక్షి, చయము చేష్ట మాని♦జంకునొంది.

తే॥ ఒక్కకోఁతిచే గౌరవ♦మూర్విఁ గలిసెఁ, బాలనము బలగర్వముల్♦పాడుపడియె
నింతకంటె వేఱొండేది♦మొనఁగు సిగ్గు, చేటనుచుఁ బ్రెగ్గడల తోడఁ♦జెప్పఁదొడఁగె.

ఉ॥ అగ్గియె కొల్లవెట్టఁ గపి ♦ యక్కట! యొక్కటి నిప్పువెట్టఁగా
బొగ్గుల కాడ యయ్యెఁ బుర ♦ మున్ జయభూతి వెలార్చు టెక్కముల్
బుగ్గిగఁ దూలె బంధులును ♦ పుత్త్రులు మిత్త్రులు గూలి నార లి
ట్లుగ్గడువయ్యె నిందగొని ♦ యుంటిని నేను శవంబు పోలికన్. ౨౪

తే॥ బావులను నిండి నెత్తురు♦పాఱుచుండె, నగ్ని యింకను ప్రోలఁ జ♦ల్లాఱలేదు
అగురు పొగవీచు మగువల♦యలకలందు, చుండు కంపు కొట్టుచునుండెఁ♦జూచినారె?

ఉ॥ ఏవొ విశేషకార్యముల ♦ నీడ్యతఁ జేయకయున్న మాని నీ
భూవలయంబునం బొడమి ♦ పుట్టనివారలలో గణింపఁ బా
లై వగఁగుంది నిందయు న ♦ పాఖ్యయుఁ గైకొనినార మూజిలోఁ
జావము వానరుం బొదివి ♦ చంప మిఁ కేమి యొనర్ప నేర్తుమో? ౨౬

తే॥ అనుచు రావణుఁ డాడంగ♦నంతరంగ, మందు నొచ్చి సేనాపతి♦యప్పుడు లేచి
కేలుమోడ్చి నామనవిని♦గేలి గొనక, వినఁగ వేఁడెద నని యిట్లు♦విన్నవించె.

ఉ॥ దేవరవా రెఱుంగనివి ♦ తేఱిచి చూచినలేవు ధాత్రి మా
యావిధి మాననీయుల న ♦ రాధ్యుల వంచనచేసి జానకీ
దేవిని తెచ్చు సేఁత యది ♦ ధీరులపద్ధతి గాదటంచు నాఁ
డే వివరించినాఁడ గణి ♦ యింపక తెచ్చితి రీబెడఁదలన్. ౨౮

చ॥ చెలియలి మోము సొరుచెడఁ ♦ జేసి మహాబలుఁలన్ ఖరాదులన్
గలుషముతోడఁ జంపు కడు ♦ కావరులన్ గసిదీఱ భూమికిన్
బలి యొనరించి పక్షులకుఁ♦బారణసేయక పాలనంబు దు
ర్బలమయి కూలెనంచు మది ♦ వందుట పోలునె నిన్ను బోఁటికిన్? ౨౯

ఆ॥ చంపఁదగిన చోర♦సంతతి దొరకినఁ, జంప కూరకుంట♦చనదు పతికిఁ
బగఱ గొప్పబలముఁ♦బరికించి పరిమార్ప, కొదిఁగి యుంట పోరు♦పోచితంబె? 30

తే॥ జయము బల విక్రమములు య♦శమ్ము గురుత, వేలుపుల గెల్చు చేతనా? విక్రమంబు
పీడి యోర్చుట చేతనా? వెలసెమీకుఁ, దెలుపుఁడయ్య నిశ్చయముగఁ♦దేటపడఁగ

క॥ పగఁజంపి తృప్తిపొందుట, తగవుగఁ దలపోయకిట్లు ♦ తగుసౌఖ్యములం
దగిలినఁ గపి వనితో నిది, తెగునే? తోలుదుమె యెదురు♦తిరిగిన దోర్మన్?

ఉ॥ పోయిన కోఁతి వెంబడినె ♦ పోవుచు దానిని పంపువారి పే
రాయువులం గ్రహించి మది♦నందిన దుఃఖము తీర్ప కివ్విధిన్
వాయిడి ప్రేలుచున్న మన ♦ వన్నెయు వాసియుఁ గ్రుంగకున్నె? పై
నేయది యుక్తమో? యెఱుఁగుఁ ♦ డీ యని యాతఁడు కూరుచుండెఁగన్.

తే॥ ఒనర సభఁగాంచి పల్కె మ♦హోదరుండు, సైన్యపతి పల్కుచందంబు♦సర్వవిధులఁ
జక్కనై యుండు; నాపల్కు♦సరణి వినుము, తప్పులున్న మన్నింపుము♦దైత్యరాజ!

క॥ అడఁగిరి వేల్పులు యక్షులు, మడఁగిరి పన్నగులు వైరి♦మర్దన! విడువం
దొడఁగిరి గర్వము లోకులు, కడఁగిరి వడఁకంగ నెదుటఁ♦గన్న త్రిమూర్తుల్.

తే॥ అఖిల జీవంబులం జంపు♦యముఁడుఁ గూడఁ,దనకు నీవ యముఁడవని♦తలఁచి జంకి
నీమహాజ్ఞలఁ దలఁదాల్చి♦నెగడుచుండు, నింతకంటె గౌరవ మిఁక♦నేది కలదు? 3౬

మ॥ భవుతోడన్ రజతాద్రి నింగి దగులన్ ♦ బాహా బలాధిక్యతల్
మివులం దాలిచి సామగానమున పే ♦ ర్మిన్ శర్వు మెప్పించు దా
నవవీరా! భవదీయ శౌర్యమహిమన్ ♦ మాతోడఁ గ్రుంగించి యె
క్కువ ప్రౌఢోక్తుల నొక్కవంది పగిదిన్ ♦ గ్రోఁతిం బ్రశంసింతువే? 3౭

ఉ॥ కంటికిఁ గానరాక త్రిజ♦గంబులఁ దప్పి చరించువారు దు
ష్కంటకులై యజేయులయి ♦ కానఁగవచ్చిరె? దోర్బలాఢ్యులై

యొంటని వారిపట్ల వడి ♦ యోచన సేయఁగఁ దగ్గ తీరు చె
న్నంటుల పట్లఁ జేయఁ దగు ♦ నా? యిదిపోలునె నిన్నుబోఁటికిన్?

ఆ॥ సంకటమ్ము వచ్చెఁ ♦ జావేది? బ్రదుకేది? యనఁగనేల? నన్నె ♦ యంపితేసి
వనచరులను నరుల ♦ వధియించి నీపగ, రూపు మాపి వత్తు ♦ రూఢిగాఁగ. ౩౯

క॥ అనుచు మహోదరుఁ డాడఁగ, విని కన్నుల నెత్తురొలుక ♦ వీక్షించుచు రు
ద్రనిభుండు వజ్ర దంష్ట్రుఁడు, దనుజేంద్రుని దిక్కుదిరిగి ♦ తాత్పర్యమునన్. ౪౦

చ॥ మనుజులు వానరుల్ మిగుల ♦ మాన్యత చూపఁగఁ దగ్గవారె? యో
దనుజ వరేణ్యులార! చని ♦ దర్పముతో వెసఁబట్టి మ్రింగుఁ డం
చనుమతి యిచ్చి యిచ్చటనె ♦ హాయి వహించుట మాని యిట్లు మా
మనమునఁ జింతిలం దగునె? ♦ మాపయి నమ్మిక మీకుఁ బుట్టదో? ౪౧

ఆ॥ ఆజ్ఞ మీఱువారి ♦ నప్పుడ తెగటార్చి, లోకములను మీకు ♦ లోఁగఁ జేయు
నేను మిమ్ము మీఱి ♦ యెన్నఁడు నడచితి? నుత్తరువు నొసంగ ♦ కుండుటేల?

ఆ॥ అనుచు నుంచు మనుచు ♦ నావజ్రదంతు నా, క్షేపణంబు చేసి ♦ భూపు మొగము
గాంచి దుర్ముఖుండు ♦ కడు నల్పువలె నుండ, నేల? యనుచు మఱియు ♦ నిట్టులనియె.

తే॥ దిక్కరులు దుర్బలంబులై ♦ తేజు మాసె, వేల్పు లడిగిరి రజతాద్రి ♦ బెండువడియె
నట్టి నీకు నృపులు కపు ♦ లధికులైన, మెచ్చఁ దగినదే నీ బల్మి ♦ యిచ్చకోలఁది!

తే॥ బాగుగాఁ జూడ నీ తీరు ♦ బలవిహీను, లైన వారల తీరగు ♦ నయ్య నిజము
పగఱు బలవంతులే యైనఁ ♦ బ్రాణరక్ష, ణంబుకై వారి కడఁగి యుం ♦ డంగఁ దగునె?

క॥ మనుజులు నెలుఁగులుఁ గపులును, మన కాహారములు; వాని ♦ మార్కొన దిగులుం
గొనుదుమ యేనిన్ జగమున, మనకంటె పిరికులెవరు? ♦ మగ లెవ్వారల్? ౪౬

తే॥ ఒక్క కోఁతి సంద్రము దాఁటి ♦ యూరఁజొచ్చి, నిప్పు వెట్టి పల్వురఁ జంపి ♦ నెగడి మరలె
రాక్షసులమైన మనకుఁ బు ♦ రంబు కీడి, దాడి సేయుట తగదేమి? దానవేంద్ర!

తే॥ మన పురికి వచ్చి సౌధముల్ ♦ మంటఁ గలిపి, సైన్య బల పరాక్రమముల ♦ సరణిఁ దెలిసి
ప్రాణములతోడ మరలిన ♦ వారలెవరు, గలరు జగమునఁ గోఁతి యొ ♦ క్కండు దక్క?

తే॥ తగవు కర్తవ్య జయములఁ ♦ దలఁచి తీరు, మానముగఁ జేయఁ దగ్గది ♦ మనుజవర్యు
లున్న కడ కేగి వారల ♦ యుసురు లూడ్చు, పద్ధతియె యొప్పు నన మహా ♦ పార్శ్వుఁడనియె

తే॥ కోఁతి యొక్కటి పురి నాల ♦ గోడు బాల, గోడుగాఁ జేసి పోవఁ గ ♦ న్గొనుచునున్న
మనము పొందక నిజముగ ♦ మానియున్న, పేదతనమేది? నిలిపిన ♦ పేర్మి యేది?

తే॥ మొదటిపోరున బలహీన ♦ పురుషులొక్క, కొంద ఱా కోఁతిచేతులఁ ♦ గూలినంత
తక్కువారల చేవయుఁ ♦ దఱిఁగెనేమి? లంకతో శౌర్యమును కాలి ♦ క్రుంకెనేమి?

తే॥ పంపినారలో మనుజులు; వచ్చినదియొ, తరుచరము; చేసినది పుర♦దాహమయ్యొ
దానికై దైత్యవర్యులు♦ తలరిరన్న, నింక నేమేమి తోడరునో♦యెన్నసగున?

తే॥ ఇచట నిలిచి మాటాడుట♦కిష్టపడను, వెంటనే యేగి వారల ♦ పేరు లేక
చేసి తనివారఁ దినుటయే♦చేయఁ దగిన, కర్జ మిఁక వేఱు యోచనల్♦కానివనియె.

తే॥ ప్రభువు జంకి కర్తవ్యంబు ♦ ప్రశ్నచేసె, నేగి తలకొక్క దిక్కుగా ♦ నీల్గుటింకఁ
గొదువ! యని విసుగొంది యం♦గదను మండి, చాలున నేఁ బిశాచుఁడను ని♦శాచరుఁడు.

తే॥ ఇంతగా విభు పేర్మి శం♦కింతుమేని, కార్య మిది యేని మనకంటె♦ఘనులు వారు
మనము తక్కువ వారమే♦యనుచుఁ బలికె, సూర్యశత్రువనెడు దైత్య♦వర్యుఁడొకఁడు.

క॥ మన మాలోచించెదు నది, మనుజులఁ గూరిచియె కాన ♦ మనచేవయుఁ బా
లన శక్తి చెడియె నను వి, న్నన కిది చాలునని యజ్ఞ♦నాశకుఁ డనియెన్.

తే॥ జ్వలిత నేత్రుఁడౌ శివుపైకి♦జరుగుటన్న, నవ్వఁ దగియుండుఁ గపిపైకి♦నరులపైకి
వెడలుకంటెను వారలి♦ర్వ్రీడు సేరు, నంత కోర్చియుండమని ధూ♦మ్రాక్షుఁడనియె.

తే॥ తక్కువారలు పాము చందమున బునలు, కొట్టియిదియె లెస్సనుచు వాక్రుచ్చినారు
పిదప నెల్లర వారించి♦వినతి తోడ, నిలిచి కుంభ కర్ణుం డిట్లు♦పలుకఁ దొడఁగె.

—: కుంభకర్ణుఁడు హితము పలుకుట :—

తే॥ వెనుకముందారయఁగ లేని ♦పిన్నలెల్లఁ, బలుకుకంటె నూరకయుంట♦పాడియగును
తమ్ముఁడని యెంతు వేని హి♦తమ్ము దెలుపు, వాఁడఁ గటు వేని మన్నింప♦వలతు నిన్ను

ఉ॥ పుట్టితి బ్రహ్మవంశమునఁ ♦ బోఁడిమి వేదము లభ్యసించి య
ప్పట్టున విద్యకుం దగిన ♦ ప్రజ్ఞయు శీలము నొందినాఁడ వీ
కట్టిఁడి సేఁత నీకు నవుఁ ♦ గాదననేల? విరాళి వహ్నిపైఁ
బుట్టి నిఁకింత మాత్రయును ♦ పొందకయున్నె ఫలంబు దానిచే? ౬౦

ఉ॥ అందముచిందు లంక యెరి ♦ యంగఁ బ్రభుత్వమె కూలినట్లు నీ
డెందమునం దపించితి క ♦డిందిగ రాముని దేవిఁ దెచ్చి నీ
చందము మంచిదేమి? ములు ♦ చల్ కడుపాపులు పొందఁదగ్గ యీ
నిందకు మించి రోయఁదగు ♦ నీచత ధాత్రి నొకండు గల్గునే? ౬౧

చ॥ నగరము రూపు మాసెనని ♦ నాన వహించెదు ధర్మపత్నులౌ
మగువలు నీపయిన్ రుచిర ♦ మందతర స్మితకాంతు లూన్ప న
న్యగరిత కాళ్లపైఁ బడుచు ♦ నోర్వక యామెయుఁ బుప్వఁదిట్ట నో
ర్పుగొని సహించుచుండుటయు♦రూఢ యశంబు నొసంగఁ జాలునే? ౬౨

శా॥ ఏనాఁడిట్టు లధర్మరీతిని కృపా ♦ హీనుండవై క్రొత్తడిన్
మానంబార్పఁగ నీచపద్ధతుల నం ♦ భావించుచుం దెచ్చితో

యానాఁడే మన వన్నెవాసి తఱిఁగెన్ ♦ హైన్యంబు చేకూరె లో
కానన్ దుష్కృతముల్ పొనర్చి యశముం ♦ గాంక్షింపఁగాఁ బోలునే?

చ॥ అకలుషశీలయౌ నొకని ♦ యంగనఁ దెత్తము కార నంతమున్
బ్రకటిత కీర్తిఁ గోరుదము ♦ వాక్కుల శౌర్యము వెల్లడింతమున్
వికలత గూర్చు కామమునఁ ♦ బ్రీతి వహింతము మానవాలికిన్
గకవిక లౌదమున్ జయముఁ ♦ గాంక్ష యొనర్తము మేలుమేలగున్. ౩౪

ఉ॥ పెద్దలు సేయు కార్యముల ♦ వీఁడితి వంశవినాశ కార్యముల్
పెద్దగఁ జేసి తా పయిద ♦ లిన్ విడిపించుట యొల్లిదంబుగా
బుద్ధికిఁదోఁచెఁ గాన నిఁక ♦ భూపకుమారులు వచ్చి కీర్తియున్
దొడ్డకుఁబోవఁ జంపినను ♦ దోసమె? నిందయు రాదు ధాత్రిపై. ౩౫

చ॥ వనమున నొక్కఁడే ప్రబల ♦ వాహినిఁగూలిచి తమ్ముఁజంపిరేఁ
పెను పెనువైర మియ్యదియు ♦ వెల్తిగనున్నది యింక ముఖ్యమౌ
పని సమరంబు సేయుటకు ♦ వాహిని సిద్ధముచేసి యుంచుటే
మనకు హితంబు; వేఱొకటి ♦ మాన్యత గూర్పదు చింతచేసినన్. ౩౩

తే॥ మనుజు లల్పులేయైనను ♦ వినుము వారు, వచ్చుదాఁక నోర్తమయున్న ♦ వారితోడ
సమరులును లోకములు నొక్క ♦ టైన యెడల, మనకు నాపద తప్పదు ♦ దనుజ నాథ.

తే॥ సేన మితిమీఱ వారికిఁ ♦ జేరుమున్న, వనధిదాఁటి నేఁడే నర ♦ వానరులను
అవలికేఁగనీయక చుట్టి ♦ యవియఁజేయు, కర్జమే ముఖ్యమని కుంభ ♦ కర్ణుఁడనియె.

చ॥ అనవుడు దానవేంద్రుఁ డను ♦ జా! కడు లెస్స వచించి తీవు నా
మనమున నున్నవాని నను ♦ మానము లేక గ్రహించితెల్ల; వే
రనుకొను టేల? నేఁడె విజ ♦ యధ్వజ సుందర సైన్యరాజితోఁ
జని పగఱన్ వధించి పెలు ♦ చం జనుదెంచుట మేలు లెండనన్. ౩౬

—: ఇంద్రజితుని ప్రతాపోక్తులు :—

తే॥ అంత మేఘనాదుఁడు లేచి ♦ యనియెఁ దండ్రి! నీవ వైళమ దండ్తి ♦ నీచజనులఁ
జంపఁ దగినంత స్థితి యేమి ♦ సంభవించె? మా బలంబులు కృశియించి ♦ మాఁడెనేమి!

క॥ భవుఁడును సహస్రదళ సం, భవుఁడు ప్రసాదించి యొసఁగు ♦ పాశాదికముల్
మివులఁగల దనుజు లుండిరి, తవిలి యలయుచుండు నొకఁడు ♦ దానుఁడ నుంటిన్ ౨౦

ఆ॥ మూఁడు లోకములును ♦ మొదటి వేలుపుతోడ, నెదిరినేని గెలుపు ♦ నిత్తు నీకుఁ
గాదయేని కొడుకు ♦ గాను నిజము పులి, కడుపునందు మేఁక ♦ పొడము నేమి? ౨౧

చ॥ వనచరు లాడిఁ గూలఁగఁ గ ♦ బంధము లెల్లెడ నాట్యమాడఁగా
మనుజులు చింతిలన్ జన న ♦ మాజము జాలి వహించు తీరుతో

జనకజ యేడ్చుచుండఁ గడు ♦ జాల్ములు రాఘవుల్ వధించి నేఁ
డనువుగ వారి శీర్షముల♦నర్మిలిఁ గానుక యిత్తుఁ జూడుమా. ౭౩

ఉ॥ చందు ముఖంబు రోఁతపడఁ ♦ జూచెడు కోఁతులు మన్మహోగ్ర కో
దండ విముక్త చండ నిశి ♦ త ప్రదరంబులు ముంచి నొంచఁగాఁ
బందు లిగిల్చి దిక్కులకుఁ ♦ బాఱుట గాంచి మనంబులో పలన్
నిండుగ మోదమంది వెస ♦ నీఁగెదు నీదగు చింత చూడుమా. ౭౪

చ॥ కరిఘటలున్ రథంబులకుఁ ♦ గట్టఁ దురంగములున్ బదాతులున్
బొరపగు పూర్వజన్మ కృత ♦ పుణ్యము రాజ్యములేని శత్రులా ?
విరివిగ గూన్మలైన యట ♦ వీచర వర్గముఁ గూడి గెల్తురా ?
సరిసరి యట్టులైన దను ♦ జవ్రజ శౌర్యములేల కాల్పనే ?. ౭౫

తే॥ పాంచ భౌతికమై యొప్పు♦ప్రాణి కోటి, నెల్లఁ గూఁకుడు వేళ్లతోఁ♦గెల్లగించి
నరులు వానరులను పేరు♦ధరణిలేక, చేసి గాక క్రమ్మఱఁగ నా♦సింపఁ జుమ్ము ౭౬

తే॥ అనుచుఁబదములఁబడిలేచి♦యాంజలిఁగొని, సెలవు వేఁడఁగ నిఖిలుఁడు♦సత్కృత్యములను
గెలిచి తత్త్వజ్ఞుఁడై లస♦త్కీర్తి గను వి, భీషణుం డొడుగఱచి యి♦విధి వచించె

—: విభీషణ నీతి :—

చ॥ నెఱి వివరించి పల్క జత ♦ నించిన కుఱ్ఱఁడ ! మూర్ఖబుద్ధిమై
నెఱఁగిన వారిఁబోలె వచి ♦ యింపఁ దొడంగితి రాఁగలట్టి కీ
డెఱఁగితె? ముందు వెన్కలొక ♦ యించుక యారయ కిట్టు లిచ్ఛమై
వెఱి మొఱి పల్కులాడి యెద ♦ వింతువె కార్యము పిల్ల చేష్టలన్ ? ౭౭

ఉ॥ గ్రుడ్డి యొకండు చిత్తరువు ♦ కుంచియతో లిఖియించు తీరుగా
నెడ్డె తనంబునం బలుక ♦ నెంచితి కార్యము చంద మారయన్
దొడ్డ గుణంబులున్ తలఁపు ♦ తోరము కార్య విచక్షణత్వముల్
బిడ్డలకున్ బలంపడునె ? పెద్దల కూటమి నుండఁబోలునే ? ౭౮

చ॥ విమల గుణమ్ములన్ వెలసి ♦ విశ్రుత సత్య పథానువర్తులై
యమరిన పెద్దలేల ? యను ♦ రావళిలో గుణ శీల సంపదల్
క్రమమునఁ బొందుచేతనొ ? తి ♦ రంబుగ వంచన చేతనో ? పరా
క్రమముననో ? మహత్త్వమును ♦ గాంచిరి కొందఱు నీవ చెప్పుమా ?

తే॥ నిర్జరుల మాయచే గెల్చు♦నేర్పు నీకు, నిచ్చినది తపంబో ? మఱి♦యేదో ? చూడు
కలుషముల నీఁగి ధర్మమా♦ర్గమున నడచు, వారెనుమ్ము నీ కొసఁగిరి♦బలము నలవు.

తే॥ పాప శీలురు జగములఁ♦బరిఢవిల్లి, బ్రహ్మ ముఖ్యామరుల గెల్చి♦పరును ముమురఁ
బాపములఁ జేసి తుదిఁ గూలి♦పడిరిగాక, తిరముగా స్వర్గ మేలిన♦ధీరులెవరు ?

తే॥ పూర్వమును తరువాతను♦బుద్ధి నిలిపి, చెడుగులం ద్రోచి మోక్ష సం♦సిద్ధి గన్న
పెద్దలెందఱు గలరు భా♦వించి చూడ, వారిలో నొక్కరేఁ జెడు♦వారు గలరె?

తే॥ ఎఱుక లేని బాలుఁడ వౌట♦నిట్లుపలికి, తంచు బలయుతు సుతు మంద♦లించి యవల
రావణుం గని పల్కె న♦ర్థంబు గేలి, సేయ కాలింతు వేని వ ♦ చింతు ననుచు.

ఉ॥ తల్లియు నీవె తండ్రియును ♦ దైవము నన్నయు నీవె చూడఁగా
నెల్ల సుఖంబు లీవగుడు♦నింద్రసుఖంబుల నొందుచున్న సం
పల్లలితార్థమా పదవి ♦ పాడఱఁ జేసెద వంచు మించి చిం
తిల్లెద దుష్కృతంబులకుఁ ♦ దీఱకయున్నె సురేంద్ర భోగముల్? ౮౫

చ॥ చదివినదానికిన్ ఫలము♦సచ్చరితంబున లేదయన్న ని
ష్ఠాదవిన కార్యమందు తగు ♦ యోచన శక్తియు లేదయన్న నొ
ప్పిదమగు కార్యనిశ్చయ వి ♦ వేచన లేకయయున్న నానుడుల్
తుదివఱ కాలకించి మఱి ♦ దోసము దోఁచినఁ గోపగింపుమా. ౮౬

క॥ జానకి యను పేరొందిన, మానవతి పతివ్రతాగ్ని ♦ మాడ్చిన యది లం
కా నగరము గాకున్న నొ, కానొక వానరము కాల్చెఁ♦గా యనఁజనునే? ౮౭

క॥ ఎవరెటు యోచించిన గా, రవమును పోఁగొట్టు కొనుట♦రమణుల వలలోఁ
దవిలి; యటుగాక యున్నను, భువినైె; యివి రెండు గాక ♦ పుడమింగలదే?

క॥ శరధిపరిఖమగు లంకా, పురి కధిపు తపః ఫలంబు♦పూర్తిగఁ జెడుటల్
నరతరుణి కొఱకె తక్కై యని, పరులాడఁగ విని సహింపఁ♦బొల్పడ నగునే? ౮౯

క॥ ఉరుతపము చేసి యజుచే, వరములఁ గొనునాఁడు మనుజ♦వర్యులచే నో
టోరయక గెల్పొందుటకున్, వర మడుగవు పోసఁగుటెట్లు♦వారింగెలువన్?. ౯౦

క॥ మనుజుల వలనన్ మన మెం, దిన వానిని చింతసేసి♦తెలుపఁగ వలెనే?
విను వేయికేల వానిం, జెనసి నిలువ కడఁగి లిపుడు♦చేయుట గలదే? ౯౧

చ॥ పొడవయి యంబరస్థలము ♦ ముట్టిన తారగిరిం బెకల్చు నాఁ
డడరి చతుర్భుజుండగు మ ♦ హాత్ముఁడు నంది యొసంగు శాప మి
య్యెడ ఫలియింపఁగాఁ దొడఁగె♦నింతకు హేతువు వాలిచే బలం
బెడలి కృశించునాఁడె గ్రహి ♦ యించితిఁ బెద్దలవాక్కు తప్పునే? ౯౨

ఉ॥ నిప్పునఁగూలి ప్రాణముల ♦ నీఁగిన క్రొత్తడి యిచ్చు శాపమున్
దప్పికొనంగ నేర్తుమొకొ? దందడి దుఃఖము నీకుఁ గూర్తు నం
చప్పుడు పల్కె వేదవతి ♦ యంబుజసద్మ యయోనిజాతయై
యిప్పుడు సీతగాఁగ జని ♦ యించె నిజంబిది దానవేశ్వరా! ౯౩

క॥ దశరథుఁడను నరపతి తన, వశమున నిజగము నడవ♦వర్తించి మహా
యశుఁడయి శంబరుఁ జంపి త్రి, దశపతికిని స్వర్గమును ప♦దంపడి యొసఁగెన్. ౯౪

సీ॥ వృషభ రూపుండై న♦యింద్రుపైఁ జనిదైత్య,కులము రూపడఁచు క♦కుత్స్థ నృపుఁడు
ఉర్వి గోవుగఁ జేసి♦యోషధుల్ పిదికించి, జనులఁ గాచిన పృథు♦చక్రవర్తి
జలనిధిం ద్రవ్విన ♦ సాగరులును గంగఁ, గ్రిందికిఁ దెచ్చు భ ♦ గీరథుండు
పొడమిన కులమునఁ♦బుట్టి జగంబున, శత్రులఁ దునిమి వి ♦ శ్రాంతి నొంది
తే॥ ధర్మముం గాచి న్యాయప♦థమున నిలిచి, యబల కొసఁగిన వరము లే♦దనఁగ లేక
సత్యమునకుఁ బ్రాణము విడు♦జన శరణ్యు, దశరథుని పుత్త్రకులు వారు♦దానవేంద్ర !
క॥ వార లసామాన్యులు ముని, వీరులకును వేలుపులకు♦వేత్తై యెఱుఁగం
గా రాని వారు మన క, ర్మారంభముచేత సులభు ♦ లైరి మనుజులై. ౯౬
తే॥ బ్రహ్మతోడ స్పర్థించి ప్ర♦పంచ మొండు,సృష్టి చేయంగఁ బూను కౌ♦శికుఁడు పూర్వ
మభవువలన నొందిన యమో♦ఘాస్త్రములను,వారికొసఁగె యజ్ఞము గాచు♦పట్టునందు
తే॥ దేవ దానవులకుఁ బోరు♦దివురునాఁడు, గరుడు నెక్కి విష్ణువుగొన్న♦కార్ముకమును
పుర విదాహంబు సేయు శం♦కరు శరమ్ముఁ, గుబ్జుఁడైన యగస్త్యుచేఁ♦గొన్నవాఁడు
చ॥ అతని శరావళులో జగము ♦ లన్నిటి లేహన సేయు దిక్కులన్
జతనముతోడఁ గొల్చును వి ♦ సంబును గ్రక్కను ఘోరదంష్ట్రికా
యుతములు తూణ భూకముల ♦ నుండు మహాత్ముల హింస సేయు దు
ర్మతులను దక్కఁ దక్కగల ♦ ప్రాణుల నావహతి సేయ నొల్లవున్.
చ॥ ధనువులు రామలక్ష్మణులు ♦ దక్కఁ బరుల్ గదలింప లేరు శిం
జినులును చేవయుం జెడవు ♦ శ్రేష్ఠము లౌ మనవింట్లు పెద్దవై
నను తమ విండులన్ విఱువ♦నాటఁగ లేవవి కల్పకంబులో ?
కనుపు వెదుళ్లొ? మేరువులొ? ♦ కాక కులాచల సత్త్వ మూర్తులో? ౧౦౦
తే॥ వాలి వక్షంబు పగిలె భు♦వంబుఁ గ్రమ్మ, నేడు మద్దులు గూలె దై ♦ త్యేంద్రులైన
ఖర విరాధులు మడిసిరి♦కదనమైనఁ, బగఱు తెగి మాలుటయె కాక♦బ్రతుకఁగలదె?
ఉ॥ కాంతులకెల్ల నెల్లయగు ♦ కార్ముక వీరులు రామలక్ష్మణుల్
స్వాంతములం జలింపక వి ♦ శంకట వృత్తిని తోడులేకయో
మంతురు లోక జాలముల♦మానుగ సోఁకులమూఁక గుంపతోఁ
ద్రెంతు రటంచు నమ్మియె త♦జెం గని మానులు వేఁడి రిమ్ములన్. ౧౦౨
చ॥ మనసునఁ జింతచేఁ గుమిలి ♦ మాఁడుచు నీయెడఁ బల్కఁ జంకి యా
దనుజులు రేఁబవల్ నిదుర♦తక్కి కృశించుచుఁ గల్వరింత్రు నె
మ్మనములఁ జింతనూని గతి ♦ మాలిన వేల్పులు సీత యన్విషం
బును గొనువారు నిశ్చయము ♦ బ్రుంగెదరంచు మదించినారలున్. ౧౦౩
ఉ॥ కీరితి మాయ నోర్పుగొని ♦ కీడ్వడి చిర్నవు మాని తేజముం
దేరకుఁ బోవఁ గాంతి చెడి ♦ దీనతఁ బ్రాణము మాత్రమొంది చిం

తారతిఁ గుందుచుం బగటి ♦ తమ్ములదాయను పోలియున్న వా
రారయఁ బూర్ణిమా విధుని ♦ యందము నందిన వారు నిర్జరుల్. ౧౦౪

చ॥ ధరణిని దాఁటి యావలికిఁ ♦ దాటిన కాలుఁడు దేవ యక్ష కి
న్నర ఫణి ముఖ్యులెల్ల రఘు ♦ నాయకుదేవి విదేహపుత్త్రి యా
ఘరిఁ జెఱ నున్న దంచు ♦ విని ♦ మోదమునొంది భయంబు వీడి చె
చ్చెర నపుడప్పు డిందలి వి♦ శేషము లారయుచుండ్రు శ్రద్ధమై. ౧౦౫

చ॥ చెడు శకునంబు లెన్నియొ వ ♦ చింపఁగరానివి కానవచ్చె నొ
క్కెడఁ బగయాని యోటువడి ♦ యేడ్చిన వేల్పులు దానవేంద్రు లిం
డెడనెడఁ గాన వత్తురు మ ♦ దేభ తురంగము లిప్పు డిండ్లలో
నెడను పదంబు వెట్టి చరి ♦ యింపఁగ వచ్చెడు రాక్షసేశ్వరా!

చ॥ వరలెను జిహ్వికల్ దనుజ ♦ పాళికి నక్కలు సంచరించె మం
దిరములలోఁ జిరంటికల ♦ తీరగు ముంగురులందునన్ విప
త్కరముగ మిక్కిలిం గమరు ♦ కంపు జయల్వెడె నింతకంటె దు
ర్భరతర సూచనల్ గనఁగ ♦ వాంఛ యొనర్తువె రాక్షసేశ్వరా! ౧౦౬

సీ॥ ఖరుఁడు దూషణుఁడు త్రి♦శిరుఁడు మారీచుండు, వాలి విరాధుండు♦కూలు తీరు
నారసి చూడంగ ♦ సారంగ పాణియుఁ, జక్రపాణియు వారి♦సములె? చెపుమ
వారితోఁ గూడిన♦వానర వరులు దే, వతలు వారలతోడ♦వైరమేల?
ఇది మంచి పని యని ♦ యెంచుట తగవె? నీ, కీర్తి భోగంబులు ♦ కీడు పడును

తే॥ ప్రాభవము ప్రాలు నపవాదు♦పైకి వచ్చు, నెల్లిదంబగు బంధులు♦హితులు సుతులు
చెడెడి చేతలు తగదయ్య! సీత వీడు, మింతకంటెను మేలు నీ♦కెదియు లేదు.

ఉ॥ మేలు దలంచి తమ్ముఁడిటు ♦ మేవడి నాడిన పల్కులన్ రణా
భీలుఁడు రావణుండు విని ♦ పెద్దగఁ జేతులు దట్టి వక్ర దం
ష్ట్రాళి వెలుంగ నేత్రముల ♦ నగ్నికణంబులు రాలఁగా భుజా
పాళి యురంబు గ్రక్కదలఁ ♦ బక్కున నవ్వి గణింప కిట్లనున్. ౧౦౭

ఉ॥ మేదుర రీతిమై హితము ♦ మీఱ వచించెద నంచుఁ బూని యు
న్మాదుని పోల్కిఁ బల్కితివి ♦ మాయురె! నన్ను మనుష్యులంట! పెం
పేదక గెల్తురంట! విని ♦ యెవ్వరు నవ్వక యుందు వార! లీ
పేదతనంబు గల్గినది ♦ భీతినొ? ప్రేమనొ? యెందు చేతనో? ౧౦౮

తే॥ మనుజ పశువుల గెలుపొందు♦మాడ్కి యడుగ, లేదటంటి దిగ్దంతుల♦లీల గెలుచు
నాఁడు కైలాసగిరి నెత్తు♦నాఁడు నేమి, వరము లొందితిఁ దెల్పంగ♦వలతు నిన్ను.

తే॥ ఇంచుకైన యోచింపక♦యిట్లు వ్యర్థ, వాక్కులాడితి గాక కో♦పంబు గొన్న
త్రిదశు లేమైరి తెలియవే? యిది యటుండ, నిమ్ము నీకంటె మానవు♦లెచ్చువారె?

తే॥ పలుకఁ దగిన వాక్పద్ధతి♦దెలియవీవు, జయము నొకసారియైన ని♦ర్జరులు గొనిరె?
నింగి నెత్తంగ ధరణిఁ జి♦ల్వంగ నేర్తు, నన్ను నరులు గెల్తు రనుట♦న్యాయమగునె?

తే॥ దేవవరములచే నైన♦తేజమందు, వేని హరి హరులను మున్ను♦దేన గెలిచి
నాఁడఁ దెల్పుము? పిఱికి త♦నంబు లేల? నన్ను నరులు గెల్తురని యె♦న్నంగఁ దగునె?

తే॥ నందిశాపంబు గలదని♦యందువేని? కలుగు శాపంబులకు లెక్క♦గలదె? యేమి
చేసె? నింద్రాదు లిపుడు నా♦చెడుగు గోర, కుంద్రెడి? పిల్లి శాపంబుల♦కుట్లు తెగునె?

తే॥ కనకసభను నర్తించెడు♦కాలకంఠు, వలన వరము నొందుట మున్నె♦తెలియనైతిఁ
గానవాలి కోడితిని ని♦క్కంబె? యైనఁ, దక్కుకపులు గెల్తు రటంచుఁ♦దలఁచితేమి?.

క॥ హరిహరులైనను వాలిని, దురమున నెదిరింప వారి ♦ దోర్బలము కపీ
శ్వరుఁ జేరు దాని నెఱిఁగియె, నరుఁడు మఱుఁగునుండి కూల్చె♦నారాచమునన్.

చ॥ చివికిన చాపమున్ విఱిచి ♦ చేవ తొలంగి పగుల్లువాఱు సా
ల విటపవర్గముం దొలిచి ♦ లభ్యపదం బొక ఱాఁగయుక్తిఁ బో
వ విడిచి కానలం బడి యు ♦ పాయము పన్నఁగ నాలిఁ గోలు పో
యి వెతల డిందు మానవుని ♦ యీ వొకరుండవె మెత్తు విచ్చమై

తే॥ అనుచు నజ్ఞాని యని విభీ♦షణుని పలికి, లెండు దాడి సేయుదము రా♦రండటంచు
నుదుటు గొను నన్నఁగని యూర♦కుండలేక, వెండి నుడివె నీరీతి వి♦భీషణుండు.

శా॥ అన్నా! రాఘవుఁ డప్రమేయుఁడు జగ ♦ ద్వ్యాప్తుండు నిర్ద్వంద్వుఁ డా
పన్నానీకశరణ్యుఁ డర్థిజన క ♦ ల్పప్రాయుఁ డాద్యుండు భ
క్తి న్నాకేశులు కోరఁగా దనుజులన్ ♦ గీడ్పాటు సేయంగఁ బు
ట్టె న్నాపైఁ గరుణించి మానుషుని ప♦ట్టెం బాదముల్ ఖిన్నుఁడై ౧౨౦

మ॥ దనుజేంద్రుండు వచించు నిట్టు లనుజా! దైత్యారి లోకేశ్వరుం
డనెదా మోఱకు నెన్నిసారులొ రణ ♦ వ్యామోహినై తాఁక నో
డినవాఁడై యెట డాఁగెనో యెఱుఁగరాఁ ♦ డే! వాఁడు నిర్భీతుఁడై
మనుజాకారము దాల్చి వచ్చెనొకొ? నన్ ♦ బ్రమందింపఁగా నియ్యెడన్?

మ॥ అమరేంద్రుం జెఱసంచుచో దివముఁ గొ♦ల్లాడించుచో దిగ్గజేం
ద్రములం బట్టి రదంబులం బెఱుకుచో ♦ దైత్యద్విషుం దోలుచో
సమరంబందున శత్రులం దునుముచో ♦ సాధింపఁగాలేని బా
ల్యము నందుండెనొ? యేమిగాఁ దలఁచెనో ♦ యంబేదయై? తెల్పుమా.

క॥ హరిహర విరించనులు సుర, వర నర నాగులు నడంగి♦వర్తింపఁగ నేఁ
దిరముగఁ ద్రిజగము లేలుట, నరుఁ డీతఁడు పుట్టకుంట ♦ నా? తెలుపఁగదే?

మ॥ బలవంతుండగు శౌరి వేయిశిరముల్ ♦ బాహా సహస్రంబు ని
య్యిలఁ గొల్వందగు పాదముల్ గలుగు రూ ♦ పెన్నంగఁ బిన్నంచు ని

చ్చలు యోచించి నిశాచరావళికి భ యప్రాయమై యున్న దు
ర్బలమా మానవ రూపముం గొనియెనే ? పల్కాడవే తమ్ముఁడా ? ౧౨౪

మ॥ భవుఁడున్ విష్ణుఁడు సంగరాంగణమునన్ భ్రాంతాత్ములై పాఱుచో
నెవులుం బూనిన నందిపై గరుడుపై నే వీఁపునం బూన్చి బా
ణ విశేషంబులు ప్రహ్లాదినీ సమములై నాయెద్దనే యుండ మా
నవులా నన్ను జయించువారలు ? జగన్నాన్నా ! భ్రమం బొందితే ?

తే॥ రావలదు నీవు మాతోడ రణముసేయ, లంక పెద్దది పెను విశాలంబు గలది
భయపడక యుండుమని పల్కి పరిజనములఁ, గాంచియొకసక్కి యుగనవ్వఁగనలుతోడ

తే॥ అప్పు డా విభీషణుఁడు దశాస్యుఁ గాంచి, పలికె నీకంటె నతిశయబలము గలుగు
వారు బంధులతో వెన్నవలన మున్ను, చెడిరి వినుము వారల కథచెప్పువాఁడ.

—: హిరణ్యకశిపు వధ పటలము :—

చ॥ అకలుషమూర్తి బ్రహ్మ శ్రుతు లన్నియు నేర్పఁ దపంబు మెచ్చి కో
రికల నొసంగె శంభుఁడు వి రించి రమేశుఁడు దొడ్డ భూత పం
చకము వహించియుండు గురు సత్త్వము లెల్లను తాల్చి యా హిర
ణ్యకశిపు దానవేంద్రుఁ డమ రాది విరోధుల గెల్చె ప్రేల్మిడిన్. ౧౨౭

చ॥ కమలజ శౌరి శంకరులు కాంచి భరించి నశింపఁజేయు నీ
కమలజ గోళ మొక్కటియె కాదు గణింపఁగరాని పెక్కు గో
ళములఁ గలట్టి ప్రాణు లవ లంబముగాఁ దననామమే సదా
విమల మనస్కులై తగ జ పింపఁగఁ బాలన సేసె బల్మిమై. ౧౨౯

తే॥ రెండు దిగ్గజములఁ గేలరెంటఁబట్టి, యీడ్చి చేరంగ విసుచు లోఁతెన్నరాని
కడలు లేడింటి నొక యంజఁగడచునట్లు, దాఁటిపోవుచునుండు నాదనుజ విభుఁడు.

ఉ॥ వండలి వెట్టుచుం బొరలి పాఱు తరంగిణులెల్లఁ జిన్నవం
చండకుఁబోఁడు మేఘముల యంబువు చల్లన గాదటంచు వా
డండు పయోధి యుప్పని క డంగి యజాండముఁ దూఁటుచేసి వే
ఱండములోని వారిధి ప యస్సు చొరం జలమాడు నందునన్. ౧౩౧

ఉ॥ నాగభువంబుఁ జేరి యట నాగ వరాంగుల తోడ నింపుమై
నోగిరమాని నాకమున నుండి దినంబును పుచ్చి రాత్రియం
దేగి విరించి లోకమున కిమ్ముగ నచ్చటఁ గొల్వుసేయు ను
ద్యోగి సమస్తలోక భయ దుండు నిశాచరరాజు నిత్యమున్. ౧౩౨

చ॥ ఇనుని రథంబునెక్కి యట నేడ్తెఱఁ ద్రిమ్మరుచుండు శీత భా
నుని చవికం గ్రహించుచు వి నోదముగాఁ బయనించు దిక్ప్రతుల్

మునుకొని సేయు కార్యములు ♦ పూర్తిగాఁ దాని యొనర్చు మేరు భూ
మిని కొలువుండి బ్రహ్మవలె ♦ మేకొని పాలనసేయు వీఁడె. ౧౩౩

తే॥ పంచభూతాధిదేవతా♦పదవులెల్లఁ, దాన కైకొని సకల భూ♦తముల కార్య
ములను మేఘుని పనుల ని♦మ్ముగ నొనర్చు, సర్వశక్తుఁడై యామినీ♦చర విభుండు.

క॥ కమలాక్షుని నామస్మర, ణము నిఖిల జగంబులందు ♦ నడపక తన నా
మమె జపియింపఁగఁ జేయుచు, నమరుల భాగము హవిస్సు♦నతఁడే కొనియెన్.

శా॥ ముమ్మూర్తుల్ తమకార్యపాళి సతత ♦ మ్మిం జేయలే రన్నచో
నెమ్మిం దక్కిన వారి కార్యముల పూ ♦ న్కిం జెప్పఁగానేల? యో
గమ్మిం బూనిన మౌనులుం బదవులం ♦ గాసిల్లి కోల్పోయి ని
త్యమ్మున్ దానవ సార్వభౌము పదముల్ ♦ దక్కొండు పూజింపరున్.

మ॥ అమరుల్ నేరిచి పల్కుచుందురు దై ♦ త్యస్వామికిన్ మేలు! ని
త్యము వేదంబులు సర్వశాస్త్రములు నే ♦ యాద్యున్ జగద్వంద్యు త
త్త్వము వాక్రుచ్చెడు నాహిరణ్యకశిపున్ ♦ దాత్పర్య మేపార స్తో
త్రములం జేయుచు మ్రొక్కుచుందురని యు ♦ ద్యద్భక్తిమై నిచ్చలున్.

తే॥ త్రిదశు లసురులు క్షీరాంబు♦ధిని మథింపఁ, దెచ్చు మందరగిరి తన♦దీర్ఘబాహు
వులను దాలిచి తనదగు ♦ బలముచూపఁ,దగిన దండము కాదని♦తలఁచి విడిచె.

క॥ రవి యుదయాస్తాచల గిరు, లవి చూడ హిరణ్యనేత్రు ♦ నన్నకు సొబగా
జెవి పోఁగులె యగు నాతని, జవ సత్త్వము లుగ్గడింప ♦ శక్యమె? యరయన్.

ఆ॥ అప్రమత్తుఁడై న♦యాహిరణ్యకశిపుఁ, డడుగు మోపెనేని ♦ యహి వడంకు
నిలుచునేని శిరము♦నింగిని దాఁకు భూ, తాలి వెంటఁ దవులు♦నంగ లిడిన. ౧౮౦

సీ॥ స్త్రీలచేఁ బురుషుల♦చే నపుంసకులచే, బృథివిఁ జరాచర ♦ వితతిచేత
దృశ్యవస్తువుల న ♦ దృశ్య వస్తువులచే, సురలచేఁ దక్కుఖే ♦ చరులచేత
నజ హరి హరులచే♦నగ్ని ని గాలిని, పుడమిని చదల నం ♦ బువుల నింట
వెలుపలఁ బ్రాణంబు♦గలవాన లేని వా, నను రేలఁ బగలఁ జా♦వొనరకుండ

తే॥ నస్త్రశస్త్రాదులను వాని♦కటుటలేదు, మునుల తిట్టు లాదిక్కునఁ♦బోవలేవు
శమనుఁ డాదెసఁ జూపులఁ♦జాఁపలేఁడు, వాని యుసుఱు గొనఁగఁ జాలు♦వారలెవరు?

తే॥ చావఁ డభిచారములకును♦జనకుఁడేని, యొంటరిగ వచ్చి చంపిన♦నుసుఱుపోదు
సకలలోకంబులందున♦సాటిలేని, మేటి ప్రభువయి యతఁడొక♦పాటినుండు. ౧౮౨

సీ॥ ఆ హేమ కశిపున ♦ కరుదుగాఁ బుట్టిన, ధీరుఁడు జ్ఞానుల ♦ మేరుపూస
శ్రుతులకంటెను శాస్త్ర♦మతులకంటెను సత్య, సూక్తికంటెను పరి♦శుద్ధ గుణుఁడు
సర్వేశ సంబంధ♦సంపూర్ణ విజ్ఞాని, శీలవర్తనులలో♦మేలుబంతి
భూతదయను తల్లిఁ♦బోలిన సుగుణుండు, యుగముల దాఁటు నా♦యువు గలాఁడు

తే॥ జగములెల్లను బూజింపఁ♦దగినవాఁడు, లలిత మోహన మూర్తి ప్ర♦హ్లాదుఁడనెడు
తనయుఁ గని సంతసించి వి♦ద్యను గడింపు, మనుచు నొక దేశికుని యొద్ద♦నప్పగించె.
తే॥ అంధుపోలిక నున్నవాఁ♦డస్మదీయ, చరిత మీతనికిం దెల్పి♦చక్కఁజేసి
కన్ను దెఱపి తెమ్మని పంపఁ♦గరుణతోడ, నొజ్జగొనిపోయి నేర్పంగ♦నుత్సహించి.
సీ॥ ఓం నమో దనుజ కు♦లోదధి చంద్రాయ, హేమ కశిపవే మ♦హేశ్వరాయ
యనుమన నతఁడు ర♦యంబునఁ జెవులను, మూసి మీపద్ధతి♦పొసఁగ లేదు
వినఁగఁజాల ననుచు♦వేద శిరోర్థమౌ, నిత్యవస్తువు పేరు♦నియతి నుడివి
చేతంబు కరఁగ ని♦శ్చేష్టుఁడై రోమహ, ర్షణమొప్పఁ గనుల బా♦ష్పములు జాఱ
తే॥నొడలు మఱచి నటింప నా♦బుదుతఁగాంచి, చెనఁటి! నిను గాక నన్నను♦చెఱచెదేమి!
వేలుపులకును పలుకంగ♦వీలుకాని, పలుకు పలికితె యని వడ♦వడ వడంకె. ౧౮౫
సీ॥ తత్త్వ విజ్ఞాన ని ♦ ధానంబు ప్రహ్లాదుఁ, డిట్లను నన్ను నీ♦డేర్పుకొంటి
జనకు నీడేర్చితి ♦ నిను గడ తేర్చితి, నెల్లలోకముల నీ ♦ డేర్చునట్టి
నారాయణుని దివ్య♦నామంబు ప్రణవంబు, తోఁ జేర్చి పలుకుట♦దోసమగునె?
నాఁగ నీతండ్రి స♦నాతనులగు సుర, లకుఁ ద్రిమూర్తులకు నా♦యకుఁడుసుమ్ము
తే॥ అతని శ్రీనామమును జపమర్థిఁ జలుపు, విప్రుఁడైన నాకంటెను♦విజ్ఞుఁడగుదె?
యొనర నీపేరు మఱిమఱి♦యుచ్చరించి, నన్ను చెఱుపకుమయ్య! నా♦యన్న కాన!
తే॥అనుచు గురుఁడు వేఁడంగఁ బ్ర♦హ్లాదుఁ డనియె,సకలలోక నాయకు పేరు♦నన్నుతింతుఁ
గాక యొండెఱుంగను నేర్వఁ♦గా నొకండు, లేదు నిక్కచ్చి పఱచిన♦లేదు ఫలము.
చ॥ శ్రుతులకు నెల్లఁగాఁ దెలియు ♦ శుద్ధ పరాత్పరుఁ డెల్లవేళ సం
గతమతి నాయెదన్నిలవు ♦ గాఁ గొని పాయకనిల్చె వేఱు సం
స్తుతమగు వాక్యముం గలదె? సూనృతముల్ సుకృతంబు సుస్థిర
స్థితిగల స్తోత్ర వాక్యములఁ ♦ దెల్పుము నేరిచికొందు భక్తిమై. ౧౮౮
తే॥ శిష్టు లేదైవమును విమ♦ర్శించి పలుకు, వార లుపనిషత్తులు దెల్పు♦వస్తు వేది?
కర్మ ఫలములు నశియింప♦ఘనులు వేని, నామమును జపియింతు రా♦నందమునను?
ఉ॥ వేదము లభ్యసించి క్రతు♦బృందము లెన్నియొ యాచరించి సం
పాదిత తత్త్వ విజ్ఞతను ♦ వాంఛిత సిద్ధి భజించినట్టి వి
ద్యా దయితుల్ జపించు జగ♦దాశ్రయు నామము పల్కనాఁడ నీ
వాదట నేర్చినట్టి శ్రుతు♦లందున వేఱొక వస్తువున్నదే? ౧౯౦
చ॥ వనబిల పర్వతంబులను ♦ వాసముచేసి మృగాజినంబులన్
గొని ధరియించి యాకులను ♦ కోరికతో భుజియించి శీర్షము
డన మొనరించి పెక్కులు జ♦డల్ ధరియించి శ్రమంబులోర్చి కై
కొను ఘనులొందు భాగ్యమును♦కొంటిని వేఱొక టున్నె కోరఁగన్?

తే॥ భక్తులకు సేవసేయు పా♦వనులు శాస్త్ర,విషయ మెఱుఁగక యున్నను♦వేదసార
మైన యర్థ ద్వయంబు మే♦లరసియుండ్రు, వారె కవులు తత్త్వార్థ వి♦ద్వరులునిజము.
తే॥ అవనిసుర! నాకు బ్రహ్మరుద్రామరులకు, నరయరాని యేకైక నా♦యకుఁడు నన్ను
చేరెఁ గామిత సంసిద్ధిఁ♦జెందినాఁడ, నీవు నతని భజింపు మే♦లెనయఁగలవు.
చ॥ అనవిని విప్రుఁడేది బదు♦లాడఁగ లేక యెదం గలంగి నా
కును చెడు కాల మబ్బె నిఁకఁ♦గుఱ్ఱఁడు బాగుపడండు తామసిం
చినఁ జెడునంచుఁ బాఱి విభుఁ ♦ జేరి యనెన్ ; సమయోచితంపు వ
ర్తనము మహీసురావళుల ♦ దగ్గఱకంపెను గల్గునే భువిన్ ? ౧౫౪
తే॥ ప్రభువరా! నీ సుతుండు క♦ర్మద్వయంబుఁ, ద్రెంచు పలుకులు నాకు బో♦ధింపసాగె
నించుకైనను వినఁడు కా♦వించు బోధ, వేఱుమార్గంబు లేదని♦విన్నవింప. ౧౫౫
తే॥ మనకుఁ దగనిది క్రొత్తది♦తన తెలివికిఁ, దోఁచినట్టిది బాలుఁ డే♦తోయమునను
పలికెఁ దెలుపుమాయనవిప్ర♦వరుఁడు వడఁకి, కేలు మోడ్చియిట్లని యెఱం♦కెనయలంప.
తే॥ దానవేంద్ర! నా శ్రవణరం♦ధ్రములయందు, క్రూరవిష సర్పములఁబోలెఁ♦దూఱినట్టి
వాక్యములఁ దెల్పి నరకంబు♦పడయఁజాల, నాలుకయు మొట్టమొదటికే♦వ్రీలుననియె.
తే॥ వానిఁ దోడి తెండని రాజు♦భటులఁ బంప, వారు చని తోడి తేరఁగా♦భక్తవరుల
జనకుఁ డగు విష్ణునామంబు♦సంస్మరించి, యొడలు మఱచు కొడుకు తండ్రి♦కడకువచ్చి
ఉ॥ మ్రొక్కిన సూను మూర్ధమును ♦ మూర్కొని మేని కలాపమంటఁగా
నక్కునఁ జిక్కఁ జేర్చి యొడి ♦ యందునఁ బ్రేముడి నుంచుకొంచు నీ
వెక్కడ నేర్చితో విన న ♦ హింపని వాక్కుల నాడితంచు నే
నక్కజమంద నీ గురు కు ♦ లాధ్యుఁడు పల్కె నదేదొ తెల్పుమా?.
తే॥ అనుడుఁ దనయుఁడిట్లను శ్రుతు♦లభ్యసించు, నెడలఁ దొలుత వచించు లో♦కేశు పేరు
జన్మదుఃఖముల్ దొలఁగింపఁ♦జాలుపేరు, పలికినాఁడ నంతకు మేలు♦గలదె? యరయ.
తే॥ అనఁగఁ దండ్రియిట్లను, గురుఁ♦డరసి యుక్త, మే వచించు నట్లుండనీ♦యీవు పలుకు
పేరదెయ్యది తెల్పుము♦వినఁగవలతు, ననుడుఁ గొడుకు ప్రియంబున♦ననియెనిట్లు.
సీ॥ వలచిన పురుషార్థ♦ముల నిచ్చును త్రివర్గ, మును దాఁటఁ దోడ్పడి♦ముక్తి నొసఁగు
నక్షయం బాద్యంబు♦నజ హరాదులకు స, దా చింతనీయం బు♦దారతమము
సత్యలోకము దాఁక♦సకలలోకంబుల, స్థావర జంగమ♦సమితియందు
దెందంబునం గల్గు♦ తెలివిచే ధ్యానింప, నలవియైయుండు న♦ష్టాక్షరముల
తే॥ మహిమ వివరింప నరిదియౌ♦మఱచువారు, నిజము జీవచ్ఛవములు వి♦న్నింతుఁబూత
నామ మోం నమో నారాయ♦ణాయయగును, అసదృశంబైన మంత్రమి♦య్యదియె తండ్రి!
మ॥ భవ వారాశిని పూర్వ కర్మమను నా ♦ వర్తంబు నందుండి జం
తువులం దీరము చేర్చు నావ జిగి దొం ♦ తుల్ గూర్చు మైమర్వ స

ద్భవికంబుల్ పొసఁగించు నామము మునీం ♦ ద్ర స్తుత్యముఁ వేద శీ
ర్ష వధూ మస్తక రత్న మీ విమల మం ♦ త్రం బన్య దుస్సాధముఁ.

శా॥ నీకు న్నాకు సమస్త జీవులకు గ్లా ♦ ని న్మాన్చి భవ్యంబు ల
స్తోక ప్రాభవ మొప్ప నిచ్చునదియం♦చుఁ విజ్ఞులే పల్కు వా
కేకీభావముతోడ నంచుఁ దనయుం ♦ డిమ్మాడ్కి భాషింప రా
ద్రాకారుండయి చూచి దానవకులా ♦ ధ్యక్షుండు దట్టించుచుఁ. ౧౬౨

శా॥ ఓరీ మోఱకు! నేఁటిదాఁక నొకడే ♦ నొక్కప్డు నా ముంగలఁ
ధీరత్వంబునఁ బల్కలేఁడు పలుకఁ ♦ దీంద్రించి నాయాజ్ఞ దు
ర్వార ప్రక్రియఁ గాల్చివైచుఁగద యె ♦ వ్వారిట్లు బోధించి రె
చ్చో చూఢంబుగ నేర్చితో తెలుపుమా ♦ శుంఠా! వడి న్నిక్కముఁ.

క॥ అజహర ముని దివిజాధిపు, లజస్రము మదీయ నామ♦మర్థి జపింత్రా
రజమున వారలుఁ దెలుపరు, నిజముగఁ జాఁదలఁచి యెపఁడు♦నేర్పెఁ దెలుపుమా?.

క॥ కదనము సేయఁగఁ బలుమా, ఱెదిరించియు విఱిగి గరుడు♦నెక్కి యుదధి నె
ల్లిదముగఁ జేరి యివల రా, కొదిఁగిన యాపంద నామ♦మొసఁగునె మేల్మిఁ?

మ॥ మన వంశంబున వారలెందఱో మహా ♦ మాయావియౌ విష్ణు వం
చనచేఁ గూలిరి నాదు తమ్ముని జగ ♦ జ్జాలంబులం గర్భమం
దునఁ దాల్పం దగువానిఁ బోత్రియయి యా ♦ దుష్టుండె చంపెఁ ధరి
త్రిని సర్వంబును మూషికం బలరు భ ♦ క్తిం గొల్వ మేలౌనొకో? ౧౬౬

చ॥ సకల చరాచరంబులకుఁ ♦ జావును పుట్టువు గూర్చువాఁడ నే
నొకరుఁడ నెందులేఁడు మఱి ♦ యొక్కఁడు కార్యముచేతఁగాక తోఁ
పికల నెఱుంగు టొక్కడి వి ♦ వేకము? నేర్పిన వాఁడెవండు? వా
నికి మఱి నీకు జీవితము ♦ నిక్కము డాసె నిఁకేల చెప్పఁగఁ?. ౧౬౭

చ॥ శ్రుతిహిత కార్యముల్ సలుపు ♦ శూరులు మేల్పడుచుండువారు; దు
ర్గతులకుఁ బోవుచుంద్రు చెడు ♦ కార్యములే యొనరించువారు; ని
శ్చితము జగత్స్వభావమునఁ ♦ జెడ్డది మంచిది రాజు నాజ్ఞచే
గతులు వహించు నాది తుది ♦ గల్గదు లోకమునందు దేనికిఁ. ౧౬౮

ఉ॥ గొప్ప తపంబుచే నమర ♦ కోటి త్రిమూర్తులు మేల్మిఁనొంద నే
నొప్పుగ వారికంటెఁ దప ♦ ముత్కటరీతిగఁ జేసి మించఁగా
నిప్పుడు తాము మేల్పదవు ♦ లెల్లను ముందటఁ గోలుపోయి నా
రప్పటినుండి వారి పను ♦ లన్నియు మానిరి చుల్కనౌటచే. ౧౬౯

ఉ॥ జన్నములుం దపంబులును ♦ శత్రుల కక్షయ సౌఖ్యదంబులౌ
ట న్నెఱిసెంచి వానిని క ♦ డంక నొనర్పఁగనీక మాన్చితిఁ

బన్నుగ వారలిప్పుడు త ♦ పంబు మఖంబులు లేమి సత్త్వసం
పన్నత డింది దిక్కుఁజెరి ♦ పాయక నిన్నిటు కావనేర్తురో? ౧౭౦

తే॥ క్రించ! నీతప్పు నిపుడు మ♦న్నించినాఁడ, వ్యర్థవాక్కుల నింకిటు♦లాడఁబోకు
గురులవాక్కులు శ్రేయంబు♦గూర్చుననుచు, నమ్మిపతియింపుమ నెహిర♦న్యాకశిపుండు

తే॥ చదువులకునెల్లఁ జెమిరి♦చందమగుచుఁ, గ్రతువులకు శ్రుతులకుఁగట్ట♦కడపటిదగు
నెఱి యొకండు దెల్పెదను మ♦న్నించి యరయు, మనుచుఁ దెలుపంగఁదొడఁగెఁ
ప్రహ్లాదుఁడిట్లు.

తే॥ విత్తులేక వృక్షము పుట్టి♦వెలయఁబోదు, భ్రాంతి గొలుపు నజ్ఞానంబు♦వదలి సత్య
మెఱుఁగఁ దలఁచినఁ దెల్పెద♦హెచ్చరికను, తెలియుమా దీనిఁగరతలా♦మలకముగను.

మ॥ తనలోనుండి సమస్తలోకముల ను ♦ ద్యల్లీల సృష్టించి యం
దున వెవ్వేఱుగఁ బెక్కురూపముల జం ♦ తుశ్రేణియై వానిలో
నన హైలంబును నువ్వులంబలెని యు ♦ న్నాఁడైన భేదంబులం
గొనఁ డా యాద్యుని తొంటియున్కి తరమే ♦ గుర్తించి వాక్రువ్వఁగన్?

తే॥ వస్తు తత్త్వంబు విభజించి♦పలుకు సాంఖ్య, యోగములు రెండు త్రోవలా♦యునికి
పూర్తి
గా నెఱింగిన వారికిఁ♦గాక యాది, పురుషు నుచ్ఛస్థితి నెఱుంగఁ♦దరమె? తండ్రి!

సీ॥ వేదాంతశాస్త్రముల్♦విజ్ఞానమయుఁడని, తనరఁ దెల్పెడు పర♦తత్త్వ మతఁడు
తమ్ము దా మెఱింగిన♦తద్జ్ఞ లీయర్థంబు, నెఱుఁగుదు రజ్ఞాను♦లెఱుఁగ లేరు
తెలియనివారు ము♦క్తిని గాంచలేరు ప్ర, త్యక్షాది సుప్రమా♦ణాదులఁ గొని
కొలువంగ రాని యా♦కూటస్థుఁడగు వాని, మాయ నెఱుంగ నె♦వ్వాండ్రికిఁగాదు

తే॥ త్రిగుణరూపుండు త్రిజగదా♦కృతి చరాచ,రాది రూపుఁ దేశాకృతి♦నందియుండి
భిన్నరీతులఁ దోఁచు న♦వ్విభుఁ డనుగ్ర,హించు కర్మముల్ చులుకన♦నెఱుఁగనగునె?

క॥ క్రియలును ఫలములు ఫలదా, తయుఁ గర్తయు భోక్తయైన♦తత్త్వంబును ని
శ్చయముగ నెఱిఁగిన చతురులె, నియతిన్ భవ జలధి దాఁట♦నేర్తురు తండ్రీ!

క॥ తపములు మంత్రములు జపము, తపఃఫలము కుడుపు నగుచు♦ద్రష్టయు దృగ్దృ
శ్య పరి జ్ఞానంబులు నగు, నపరుని మాయాబలంబు♦నగునె తెలియన్? ౧౭౫

మ॥ తొలి కర్మంబులకున్ ఫలానుభవముల్♦తోర్తం బ్రసాదించు న
వ్వలి కర్మంబులకున్ ఫలంబు నవలన్ ♦ ప్రాపింపఁగా జేయుఁ ద
త్ఫలముల్ ముందులు వెన్కలై వెడ తడం♦బాటొందుటల్ తప్పియుం
దొలఁగం బాఱుట లేదు చిత్రముగ నొం ♦ దుం గర్మ సంబంధముల్.

తే॥ పాప పుణ్య కర్మంబుల♦ఫలములెల్లఁ, బరిమితంబులు పరమేశు♦భక్తితోడఁ
దలఁచు ఫలములు కొలఁతలే♦కలరుచుండు, నింతకంటెను మేలేది♦యెఱుఁగఁ గలదు?

ఆ॥ యాగములను తుదిని♦యోగేశ్వరునకొక, వేల్మి వేల్పుచుంద్రు♦విజ్ఞులెల్ల
నది చరాచరంబు♦లందు చేరుననుచు, శ్రుతులు దెలుపు ఫలము♦నూటి యదియ.

సీ॥ ఆ పరబ్రహ్మమే♦యానంద లీలకై, మూల ప్రకృతినుండి♦మొట్టమొదటఁ
గార్య రూపంబైన♦చర్యా ప్రపంచంబు, సృష్టి గావించె వి♦చిత్రరీతి
శాస్త్రంబులందు చ♦ర్చా ప్రసంగంబుతో, నర్థంబులన్నియు♦నాద్యమైన
ప్రకృతియొసంగిన♦వికృతులచేనైన, భేదంబులే కాని♦వేఱుకావు

తే॥ బ్రహ్మ మొదలగు నీ జీవ♦రాసులెల్ల, బంధురంబైన తన్నాభి♦పంకజమున
నతిశయంబైన బీజంబు♦నందయొక్క, భాగముననుండుఁ బూర్తియా♦బ్రహ్మకనెనె!

చ॥ అసదృశుఁ డప్రమేయుఁ డజుఁ ♦ డాద్యుఁడు మేరయె లేనివాఁడు ని
ర్వ్యసనుఁడు కన్నులం గలఁడు ♦ పర్విన చూపులనుండు విజ్ఞ మా
నసముల నిండియుండు గగ♦నంబున భూమిని సర్వభూత హృ
ద్వసతులలోన బాహ్యమున ♦ భాసిలు సర్వ జగత్ప్రపూర్ణుఁడై. ౧౪౩

క॥ తలఁపునఁ బలుకులఁ జేతల, గలఁ డింద్రియములను గలఁడు♦గలఁ డోంకారో
చ్చలిత స్వర సంధులలోఁ, గలఁడు త్రికాలములఁ గలఁడు ♦ కలఁ డసురేంద్రా!

క॥ అరిషడ్వర్గము భక్తుల, దరిఁజేరఁగనీక కాచి♦దరిఁజేర్చెడు స
త్కరుణానిధి నామమె త, త్పరులకు భవ జలధి దాఁటఁ♦దరణి మహాత్మా! ౧౪౫

క॥ వటబీజ న్యాయంబున, విటతాటములేని మహిమ♦వెలసిన హరి యు
త్కటకాలము స్థానమ్మును, పటు సాధన శీలములును♦ఫలమును తండ్రీ! ౧౪౬

క॥ వీణియ సుస్వరముం బలె, నాణెయమగు శీల మడరు♦నారాయణు వి
న్నాణంపు మహిమ సర్వాం, గీణంబగు నంటకుండుఁ♦గించిత్తైనన్. ౧౪౭

సీ॥ ఏకాక్షరంబయి♦యొసఁగు నోంకారంబు, నందాద్యకారమై♦ప్రాణమైన
యక్షరార్థంబగు♦నాదిదేవుఁడు జ్ఞాన, మునకు జ్ఞానంబుగా♦నొనరువాఁడు
నిఖిల లోకములందు♦నిండారియుంటచేఁ, బొగయు నిప్పునుపోలె♦నెగడువాఁడు
నవ్యమాలా సుమ♦నస్సులఁ బోలిన, వివిధ మతములందు♦వివిధగతులఁ

తే॥ దరిచి వాదించువారలు♦తనరుకతనఁ, గలుగు పలుభేదములు గాక♦గలదె యతని
కిన్ని భేదంబు లింతేల♦యెంచిచూడ, కడలి కలలకు భిన్నత♦గలదె?. తండ్రి!

తే॥ ఇట్టి యసమాన విభవు నీ♦వెల్లిదంబు, చేసి సంపదాయువులను♦క్షీణపఱచి
కొందువే యని చింతింతుఁ♦గొదవలేక, వినుతి చేసి ధన్యుఁడనైతి♦ననివచింప.

—: తండ్రి ప్రహ్లాదు వివిధోపాయముల శిక్షించుట :—

మ॥ విని దైతేయ కులేంద్రుఁ డుగ్రుఁడయి ని ♦ ర్భీతిన్ వినాదించు పు
త్రుని ధాత్రీస్థలి ద్రొబ్బి నేత్రముల ఖ♦ద్యోతంబు లుర్లంగఁ జూ

చిన భూగోళము కంపిలెన్ గ్రహములుం ♦ జీకాకులయ్యెన్ గిరుల్
వణఁకెన్ జవ్వడి లేకయుండె సభయుం ♦ బంకించె బ్రహ్మాండముల్.

ఉ॥ ఇంతకు మించి నాకుఁ బర ♦ మేదియు లేదు శరీరమందె దు
ర్దాంత రుజా ప్రరోహము వి ♦ ధంబునఁ బుట్టె నెఱుంగనేల యీ
భ్రాంతుని చిత్తవృత్తి? హరి ♦ భక్తుఁడనంచు వచించువాఁడు ని
శ్చింతముగాఁ దెగం బొడిచి ♦ చీల్పుఁడు త్రుంపుడు చంపుఁ డుద్ధతిన్.

చ॥ అని దనుజేంద్రుఁ డాడ పలుద ♦ యంబున నక్కటికంబు సుంతయుం
గనయని రక్కసుల్ ప్రభుని ♦ చిన్నికుమారు మృగేంద్రు లేన్ను గు
న్నను గొనిపోవు లీల జత ♦ నంబున వాకిటికీడ్చి తెచ్చి యొ
క్కనువున వాఁడి కత్తులు గ ♦ దావళి వీచిరి పిచ్చలించుచున్. ౧౯౩

తే॥ సదయుఁ బ్రహ్లాదు నదయులు ♦ నరగఁ జుట్టి, వైచు కైదువుల్ జగదీశ ♦ భక్తవరుని
శాత్రవులు తిట్టు తిట్టులు ♦ చందమగుచు, నిష్ఫలంబు లయ్యెను రజ ♦ నీచరేంద్ర!.

ఉ॥ కాలిచి వైచి క్రుమ్మ్రి కడి ♦ కండలుగాఁ దెగ నేసి రెండుగాఁ
జీలిచి త్రోచు కైదువులు ♦ చేడ్పడి ఛేదిలి నుగ్గునూచమై
బాలుని మేనిపై దురద ♦ పాపిన క్రొవ్వున నొప్పె నాతఁడున్
దీలక పోలిపోక హరి ♦ దివ్య పదంబుల నిల్పె నాత్మలో. ౧౯౪

ఉ॥ అంతట దానవుల్ చని సు ♦ రారికి నంతయు విన్నవించి యా
వంతయు నొవ్వఁ డాయుధము ♦ లన్నియుఁ జూర్ణములయ్యె నన్న బ
ల్వింతగ నాలకించి పడ ♦ వేయుఁడు నిప్పులగుంటలో ననన్
గంతులు వైచుచుం జనిరి ♦ కట్టడి దైత్యులు సంతసంబునన్. ౧౯౫

తే॥ పెద్దగుంటలోఁ గట్టెలు ♦ పేర్చి చమురు, పోసి నిప్పు రగిల్చి యా ♦ బుడుత డాసి
పట్టి త్రోసిరా మంట శ్రీ ♦ వరుని కరుణఁ, జందనము చందమునఁ జాలఁ ♦ జల్లనయ్యె.

ఉ॥ పోఁకులు తైల వస్త్రములు ♦ చుట్టి రగుల్చ మరుత్తనూజు పెం
డోఁకకు మైథిలేంద్ర సుత ♦ దుర్దమ తీక్ష్ణ సతీత్వ వహ్నిచే
నాఁకయి వేఁడి చల్లనయి ♦ నట్టులు రక్కసి మూఁక రాల్చు నా
భీకర వహ్ని బాలునకుఁ ♦ జేరిన మంచును పోలె నయ్యెడన్. ౧౯౬

ఆ॥ అవల వారలేగి ♦ యసురేంద్రునకుఁ దెల్పఁ, మండిపడుచు జగము ♦ మాడ్చు విసము
గలుగు నహులఁ దెచ్చి ♦ కఱపింపుఁడని యాజ్ఞ, యిడఁగ దనుజ భటులు ♦ వడిగఁ జనిరి

తే॥ అష్టనాగంబు లసురేంద్రు ♦ నాజ్ఞ వచ్చి, విసము లుమియుచు హరిభక్త ♦ వీరు మేనఁ
గోఱలూనంగఁ గఱచె గు ♦ మార వరుఁడు, మదిని వెన్నుని సన్నుతి ♦ మానఁడయ్యె.

ఉ॥ దగ్గఱ నున్న వారలు వ ♦ డంకుచు నెత్తురు గ్రక్క సాంద్రమై
మ్రొగ్గిన నీరదంబునను ♦ క్రొన్నెల చొచ్చినలీల మేనిలో

నిగ్గడి కోటులూనికను♦నీఁగి పదింబది తుండులై ధరన్
ద్రుగ్గెను వానిలో విసము ♦ మా అమృతంబు స్రవించె వింతగన్. ౨౦౦

తే॥ దనుజు లావింత తమ ప్రభు♦వునకుఁ దెలుప, రాక్షసేంద్రుండు కనలి యై♦రావతంబుఁ
దెచ్చి త్రొక్కింపుఁ డన వారు♦త్రిదశరాజు, నడుగ నాతండు భయమున నట్టె♦
యొసఁగె.

తే॥ కాలు సేతుల బొమ్మునఁ గంతమందు, నిటియఁ బాశంబులం గట్టి♦యేన్గు నెదుట
దొరలఁ జేయఁ బ్రహ్లాదుండు♦దొడ్డబుద్ధి, నిట్లు వాక్రుచ్చెఁ జౌదంతి♦ నెసఁగఁ గాంచి.

కం॥ భుజగకులాధిపశయనుఁడు, భుజగారిధ్వజుఁడు భుజగ♦భూషనుతుఁడు మా
గజరాజుఁ గాచినాతఁడు, త్రిజగద్వంద్యుండు నామ♦దిం గలఁ డన్నన్ ౨౦౩

కం॥ దంతి తలవ్రాల్చి యాగుణ, వంతునకున్ మ్రొక్కి మరలెఁ♦బ్రభు భటు లావృ
త్తాంతముఁ దెలుపఁగ మండుచు, నంతకువలెఁ గనలి దాని♦నడుపుం డనియెన్.

కం॥ రక్కసులు చంప డాయుడు, నక్కరి ప్రహ్లాదు నురము♦నంటఁగఁ బొడిచెన్
మిక్కిలి యనంటి బోదెల, ముక్కలవలె విఱిగె మేన ♦ ముట్టిన దంష్ట్రల్.

కం॥ దనుజులు వడివడిఁ జని జరి, గిన వార్తం దెలుప వేసఁ♦గిని మండెడు సూ
ర్యుని పోలె మండి జనకుఁడు, తనయుని వనరాశిఁ ద్రోవ♦ దైత్యులఁ బంపెన్.

ఉ॥ ఈ దనుజేంద్రుఁ డెట్లయిన ♦ నీతని చంపక మానఁడంచుఁ బ్ర
హ్లాదుని పట్టి యొండొక య ♦ హార్యముతో జతగట్టి యగ్గభీ
రోదధి మధ్యమందు సుగు♦ణోత్తరుఁ ద్రోచిరి భక్తవర్యుఁ డా
శ్రీదుని పాదపద్మములఁ♦జింతన సేయుచు నుండె నిచ్చలున్. ౨౦౭

కం॥ జడధి యొక మడువువలె నే, ర్పడ గిరి కలుగుచుఁ దుంబి♦ఫలముపగిది నా
బుడుతను తేల్పఁగ నాతఁడు, కడలిని వటపత్త్రశాయి♦ కరణిని వెలసెన్.

మ॥ కరుణావారిధి! యప్రమేయ మహిమా♦ గంభీర! లోకేశ్వరా!
దురహంకారినొ? దుష్ట మానసుఁడనో? దుర్వంశ జాతుండనో?
యరయం జాలవొ? భారమో? తగఁ బరీ♦క్షార్హుండనో? మాధవా!
వరదా! దీనశరణ్య! యన్య మెఱుఁగన్♦భక్తావనా? ప్రోవవే. ౨౦౯

కం॥ వంచకుల వంచకుండవు, చంచలమతినైన నన్ను ♦ సంశోధింపన్
బ్రాంచ త్పద్ధతి యగునే, పంచముఖాదులకు నెఱుఁగఁ ♦ బడవు మహేశా!

మ॥ పరమేశ న్నిను పొందఁగాఁ దగు మహో ♦ పాయంబె విజ్ఞాన మం
చరయం గల్గిన తత్త్వవేత్తలును ని ♦ న్నందంగ లేకుండి బ
మ్మెరకున్ లోఁగిరి నేనొ పాపిని మదా ♦ త్మీయుండ నై తేయుఁడన్
శరణం బంటిని దీనవత్సలత నీ ♦ స్వామ్యమ్యొ మన్నింపవే! ౨౧౧

క॥ స్థిరుఁడను నేనితరము ల, స్థిరము లహం బ్రహ్మమని వ♦చింతురు పలుకం
జొరవయగుఁ గాని పలికిన, కరణి జరగునే ప్రపంచ ♦ కర్మము లెల్లన్ ? ౨౧౨

మ॥ జగదాద్యంబగు వస్తు వున్నదనుచుం ♦ జర్చింప లేదంచు రెం
డగు రీతుల్ వచియింపుచున్ శ్రుతులు భి ♦ న్నార్థంబులై యొప్ప భూ
రి గుహాంతస్థము ధర్మ తత్త్వ మది గు♦ర్తింపంగ దుస్సాధ మి
ట్లగునే నీకు నిగూఢ పద్ధతిని మా ♦ యా నాటకం బాడఁగన్ ? ౨౧౩

మ॥ తెలియన్నేరని నన్ను బోఁటులు విధా ♦ తృండంచు రుద్రుండుగాఁ
బలుకం జెల్లునె ? కాయలాకులు ఫువుల్ ♦ పంట్లుం గొమల్ బీజమం
దలి వైనట్టులు సర్వ దేవతలు నీ ♦ తత్త్వంబునం దోఁచు వా
రలు నీ వాదిమ బీజమై వెలయు దీ ♦ రాద్ధాంతమే నిక్కమా ౨౧౪

క॥ వెలువడి నీనుండి జగము, పలుభేదము లొందినంతఁ ♦ బరఁగునె వేత్రై ?
పలు భూషలు పలు పేరులు, గలవైనను కనకమగును ♦ గాకేమి యగున్ ?

క॥ తలిదండ్రులక్రియఁ బ్రేమను, కలిగించితి వీవు వెలయఁ ♦ గల హృదయంబే
కలవాఁడను భవ దుఃఖం, బుల నొసఁగిన నీవ తీర్పఁ ♦ బోలుదు తండ్రీ !

క॥ అని వినుతించుచు నుండిన, తనయుని స్థితియెఱిఁగి దనుజ ♦ దయితుఁడు వానిం
గొని తెమ్మని హాలాహల, మును పోలిన విసము నొసఁగె♦మున్నుగఁ ద్రావన్.

క॥ విషధర శయనుని భక్తుఁడు, విషముం గొని త్రావె భవుని♦విధమున నగి ని
ర్విషమై సుధ యయ్యెను ని, ర్విషయునకున్ విషము ఫలము♦వృథ గాకున్నే ?

క॥ రక్కసులు గదల మోఁదఁగ, నుక్కఱఁడును కందికుందఁ♦దుల్లంబునఁ దా
నొక్కొక ముకుంద నామము, చెక్కు చెదరకుండ నిలిచి♦చింతన చేయున్. ౨౧౯

ఆ॥ సాటిలేని మాయఁ♦జావకుండెడు నుపా, యమ్ము నైజముఁగనె♦యమరినాఁడు
వీని నేన చంపి♦విశ్వంబులో నప, ఖ్యాతిఁ దొలతునంచు♦నతని డాసి ౨౨౦

మ॥ అసురేంద్రుం డదలింపఁ దండ్రికి సుతుం♦డత్యర్థిమై మ్రొక్కి నా
యసువుల్ నీయవికావె ? యైనను జగ♦ద్వ్యాప్తుండు నారాయణుం
డెసకంబారఁ దలంచినన్ జరగు గా ♦ కిట్లైన్ని చందాల నీ
రసచేఁ బూనిన నోనొకో భువన సం ♦ త్రాణుండు తా నుండఁగన్ ?

శా॥ చూపం జూడఁ దలంపుఁగొన్న దనుజే ♦ శుం డంత మూఢాత్మకా !
నా పేరే జపియించుచుం బ్రదుకుచు ♦ న్నారైన ముమ్మూర్తులో ?
ప్రోఫుం గొల్పడినట్టి వేలుపులొ ? యా ♦ భోగీంద్రుఁడో ? మానులో ?
యేపాటిం గలవారొ ? తెల్పు జగముల్ ♦ సృష్టించు నానేర్పరుల్ ?

సీ॥ అనిన తండ్రికిఁ బుత్త్రుఁ♦డను లోకములనెల్ల, సృష్టించినాఁడు లె♦క్కిడఁగరాని
ప్రాణులఁ గల్పించి♦వాని యన్నిటిలోనఁ, బూవులఁ దావి నూ♦వులను నూనె

పోఁడిమి నిండి యు♦న్నాఁడు మానాయకుఁ, డతఁడు నాకనులకు♦నరయఁదగిన
కరణి నెల్లెడలను♦కానవచ్చెడువాఁడు, చూడుమా చూచెదు♦చొప్పుదెలుప
తే॥ నమ్మకున్నావు నిజము నీ♦ తమ్ముఁడాఁడు, జీవములఁ గొన్న యాహరి♦నీవుచూడ
దగినయంత చుల్కనయయి♦తనరువాఁడె ?, సర్వజీవాంతరాత్మయా♦సత్యమూర్తి.

ఉ॥ మూఁడు గుణంబు లాతనివె ♦ మూఁడు పనుల్ మఱి మూఁడు మూర్తులున్
మూఁడగు నేత్రముల్ స్థితులు ♦ మూఁడును మూఁడు జగాలు వానివే
మూఁడగు కాలముల్ దెలియు ♦ ముఖ్యుఁ డతండె సమస్తసాక్షియా
ప్రోడ యతండె సత్యమిది ♦ ముమ్మఱు సత్య మనంగ నాతఁడున్. ౨౨౮

మ॥ వినరా మూర్ఖ! సమస్త లోకముల వె ♦ వ్వేతైన వస్తు వ్రజం
బున నొక్కండె కలం డటంచు మిగులన్ ♦ మూర్ఖించుచున్నావు నీ
వను మాటల్ నిజమైన దొంగయగు నా ♦ యజ్ఞాత్ము నీ కంబ మం
దునఁ జూపింపుము పిమ్మటన్ దగిన యు ♦ ద్యోగంబు గావింతమున్.

సీ॥ అనఁడు జగన్నాథుఁ♦డణువున నున్నవాఁ, డణు శతాంశంబున♦నణఁగినాఁడు
మేరువం దున్నాఁడు♦మింట నున్నాఁడు నీ, వాక్కునఁ గలఁడు స్తం♦భమునఁ గలఁడు
చూడంగ వలతేని♦చూచెదుగాకని, ప్రహ్లాదుఁ డనఁగఁ గ్ర♦వ్యాదనాథుఁ
డోరి! నీయనుకూలు♦నొప్పుగ నీస్తంభ, మందఁ జూపుము చూప♦కుందువేని
తే॥ కరి శిరంబును హరి చీల్చు♦కరణి మెఱసి, నిన్ను నీఖడ్గమునఁ♦ జీల్చి నెత్తురాని
మ్రింగి వైచెదనని పెను♦మేఘమట్లు, గర్జనము చేసెఁ దగ్గన♦భర్జనముల. ౨౨౯

మ॥ జనకా! నాయుసుఱంత చుల్కనగునే? సర్వేశ్వరుం డీవు కో
రిన యాతావులనెల్లఁ గానఁబడఁ కా ♦ ర్వేరంబునం డాఁగి యుం
డెనయేనిన్ బ్రదుకంగనొల్లఁ దనువు ♦ న్నేనే విసర్జించెదన్
దన దాసుండను కానటంచుఁ మదిఁ బం ♦ తంబాడఁ బ్రహ్లాదుఁడున్.

—: నృసింహమూర్త్యావిర్భావము :—

తే॥ అసురనాథుండు మేలు మే♦లనుచు నవ్వి, హస్తమున నొక్కకంబంబు♦నంటఁజఱచెఁ
బెలుచ దిక్కులు గోళముల్ ♦బీఁటలెగయ, సింహగర్జన మందుండి♦ చెలఁగెనపుడు.

మ॥ అరవిందాసన శంకరాదులును ది ♦ వ్యాబ్దంబు లెన్నేనియున్
స్థిరభక్తిం దపమాచరించియును వీ ♦ క్షింపంగ లేనట్టి శ్రీ
హరి నవ్వున్ విని యుబ్బి గంతులిడి ప్ర ♦ హ్లాదుండు కేల్మోడ్చి త
త్పరుఁడై పాడెను వేఁడె నేడిచె గగు ♦ ర్పాటొందెఁ జొక్కె న్నగెన్.

చ॥ పటపట పండ్లు గీఁటి సుర ♦ వైరి యదల్చుచు నవ్వినట్టి నీ
విట నట డాఁగినాఁడవుర ♦ యీతఁడు పల్కిన కేశవుండవా?

కిటివయి తమ్ముఁ జంపితివి ♦ కీడ్పడి జంకి పయోధి దాఁగి తి
ప్పటికి మగండవైన వెలి ♦ వాఱుము రమ్మని కాలుద్రవ్వఁగన్. ౨౩౦

శా॥ స్తంభం బప్పుడు పెల్లుసం బగిలె ది ♦ గ్జాలంబు లూటాడ సం
రంభుండై హరి వెల్వడె న్మనుజ హ ♦ ర్యక్షాకృతిన్ వాని పా
దాంభోజంబులు భూమినుండఁ బయి లో ♦ కాలిన్ వెసం దాఁటి యా
యంభోజాసనుఁ డప్డె పుట్టిన విధం ♦ బందెం దదీయస్థితుల్. ౨౩౧

ఉ॥ లెక్కయిడంగరాక పొద ♦ లెన్ శిరముల్ కరముల్ సురారి కొ
క్కొక్కని కొక్క మోము కర ♦ యుగ్మము కన్నులు మూఁడు వారిధుల్
గ్రుక్కగొనంగఁజాలు పెను ♦ ఘోర ముఖంబులుఁ గల్గి యెల్లరన్
జిక్కఁగఁబట్టి నొక్కుచును ♦ జిందఱవందఱ చేసె నుగ్రతన్. ౨౩౧

తే॥ విలయకాలవహ్ని నిమించి♦ వెలిఁగెజూలు, విలయవాయువులనుమించి♦ వలసెనూర్పు
అవ్వి రెండు నృసింహుని♦యందనిలిచెఁ, గాని చిత్రము జగములఁ♦గాల్పలేదు.

చ॥ పొదిఁగి ప్రిదిల్చి పిల్లలను ♦ పోషణ చేసెడు తల్లి కోడి యా
పద తఱి ఱెక్కలం దడఁచి ♦ పట్టుగఁ గాచెడు లీల నండముల్
కుదురుగ లోనఁదాల్చి వెలి ♦ గూర్చ వసించెడు జీవులెల్ల న
య్యదన నృసింహు నాస్యమున ♦ యంద యడంగె భయంబు డిందఁగన్.

చ॥ నలువను దొట్టి వచ్చిన స ♦ నాతన ధర్మపథంబు నుంతయున్
వలవని దుష్ట రాక్షసుల ♦ వారలఁ జేరిన వారిఁ గూల్చి సా
ధుల నుదరంబునంద యిడి ♦ దొడ్డ కృపామతిఁ గాచె; సజ్జనుల్
తొలుత సిలుంగు లొందఁ దుదిఁ ♦ దూకొని సౌఖ్యము గాంతురే కదా!

సీ॥ దంష్ట్రిలఁ జీల్చి కొం♦దఱఁ జంపెఁ గొందఱ, నండ కటాహంబు♦నంటవైచె
ధరణిని రాచెఁ గొం♦దఱఁ గొందఱను మేరు, గిరికిఁ దాఁకఁగఁ బట్టి♦తిరుగవైచెఁ
గొందఱ జలరాశి♦యందు పాఱఁగవైచెఁ, గొందఱ బడబాగ్నిఁ♦గూల్చి కాల్చెఁ
జుఱచుఱఁజూచికొం♦దఱ త్రుళ్లడంచెఁగొం, దఱ హుంకృతిని తూలి♦ తెరలనడఁచె

తే॥ రెండుగాఁజీల్చెశిరములు♦ చెండెఁజర్మ, మొలిచెనలఁచెఁ బ్రేవులఁజుట్టి♦ మెలియనూడ్చె
కన్నుగ్రుడ్లను పెఱికెను♦ కాళ్ల నఱకెఁ, జెలఁగి లయరుద్రుభంగి నృ♦ సింహమూర్తి.

తే॥ దంతి రథ వాజి భటుల ను♦ద్ధతినిమ్రింగుఁ, దోయధిఁ జలంబు చేపల♦తోడఁద్రావు
మేఘములఁ బిడుగులతోడ♦మ్రింగివైచు, ధర్మదేవతయును చాల♦దద్దఱిల్ల ౨౩౮

తే॥ కొందఱనుకులగిరులపైఁ♦గూలమోఁదుఁ, గొందఱనుచక్రవాళాద్రిఁ♦గూలమోఁదుఁ
♦గొందఱనుగోళకుడ్యంబు♦గూలమోఁదుఁ, గొందఱదిగంతములుదాఁటి♦కూలమోఁదు

♦తే॥ శిరములం గిల్లి కొందఱ♦దొరలఁద్రోచు, నిప్పు పుట్టంగఁ గొందఱ♦ నేలరాచు
జలము నింగి కెగురఁబట్టి♦జలధి వైచుఁ, దోఁచినట్టి తెఱంగులఁ ♦దూల వీచు.

తే॥ జగములను మూఁట నసురుల♦మిగులనీక, కడఁకఁ జంపి దైత్యాంగనా♦గర్భములను
నాశ మొనరించి యట వారి♦నలుసులేమి, బయటి యండంబులకుఁ గేలు♦పరఁగఁజాఁచె.

క॥ నరసింగఁడు ప్రహ్లాదుని, హిరణ్యకశిపువును దక్క♦నెల్లరఁ దునుమన్
గురుకోపంబున రాక్షస, వరుఁ దుఱుముచు నతనిఁగాంచి♦వారని కడిమిన్. ౨౪౧

తే॥ వజ్ర ఖడ్గంబు నొఱనుండి♦వఱల దూసి, డాకరంబున దొడ్డ ఖే♦టకముఁదాల్చి
యమరులులుక సంద్రంబులు♦నద్రు లదర, నార్చి పేర్చి యాడుగఱచి♦యతనిడాసె.

మ॥ అమరస్తుత్య యశోభిరాముఁడగు ప్ర♦హ్లాదుఁడు తండ్రీ! జగ
ద్రమణుం గాంచియు నించుకంత హితముం♦దర్కింప వేమయ్యా? డెం
దముసం దప్పులఁ ద్రోచి కాచు భువనా♦ధ్యక్షున్ రమానాథు ము
ఖ్యము మేలొందెదు పాప జాలము తొలం♦గున్ లెమ్మనన్ రౌద్రుఁడై

ఉ॥ పిల్లను గ్రుద్దు గేలి గొను♦వీఁక వచించెదు చిత్రమైన యీ
కల్ల మొకంబు చేతులను♦కాళ్లను త్రుంచి వధించి యంత నిన్
ద్రెళ్లఁగ జంపి యవ్వలనె♦తీవ్ర తరాసిని వ్రాల్తు నాయెడన్
మెల్లన వ్రాలుటల్ గలదె♦మెల్తుక లల్క వహించి నప్పుడున్. ౨౪౪

సీ॥ అని కాలుసేతుల♦నడిదంబున నొక్కటఁ, బొగలు నిప్పులు గ్రక్క♦నెగడి డాయ
దనుజమాయలఁ దల♦దన్నెడి మాయల, యందు నేర్పరియౌ ము♦కుందుఁ డంత
గణకుల కరిది ల♦క్షణములు గల కాలు, సేతులతో వానిఁ♦జేర్చిపట్టి
బెడిదుఁడై నిర్భీతిఁ♦బెనుపారిన హిరణ్య, కశిపుండు మేరు న♦గంబుఁ బోల

తే॥ ఖర నఖరముల తోడభీ♦కర విరావ, గర్జతో నృసింహుఁడు పాల♦కడలి పొంగి
బ్రహ్మలోకంబు దాఁకంగఁ♦బరవు పగిది, నొప్పి మేరువు ముంచిన♦చొప్పుదాల్చె.

మ॥ భుజముల్ ఖడ్గములుం గిరీటమును సం♦శోభిల్లి పైనున్న తో
యజ గర్భాండ కటాహ కుడ్య మొరయన్♦వ్యాపించి జ్యోతిర్గ్రహ
వ్రజముల్ మేరువుఁ జుట్టు చందమున దీ♦ప్యద్రత్న భూషాలి యా
రజమై రాజిల దానవేంద్ర చరణా♦గ్రం బెత్తి త్రిప్పెన్ వడిన్. ౨౪౬

తే॥ వ్రేలుచుండిన పోఁగులు♦రెండు చెదరి, పడినవై యిప్పు డుదయాస్త♦పర్వతములు
గాఁగ వెలసె నందలి పద్మ♦రాగ కాంతి, యే కదా సాంధ్యరాగమై♦యొసఁగుచుండు.

ఆ॥ ఉగ్రమూర్తియైన♦వ్యగ్రు నృసింహుకు, నాగ్ర ఖర నఖరము♦లానినంతఁ
గర్బురేంద్రు వజ్ర♦కఠిన వక్షమునుండి, నల్ల బయలు వెడలె♦వెల్లిగాఁగ. ౨౪౭

శా॥ మాయామేయ జగన్నియామకుఁడు దు♦ర్మానిన్ నిలింపద్విషున్
సాయంకాలమునన్ దదీయ నగరిన్♦రత్నప్రభా దేహళిన్
మాయింపం దొడపైనఁ జేర్చికొని సే♦మంబుల్ జగంబొంద దై
తేయ శ్రీకరమైన వక్షము సము♦ద్భేదించి చంపెన్ వెసన్. ౨౪౮

తే॥ కనఁగరాక దాఁగిన మూఁడు♦నెనిమిదియును, వేయికన్నులు గలవారు♦వెండి దిక్ప
తులును ఋషులును గుంపులై♦కలిసి వచ్చి, చేరి రేకంటితోఁ జూచు♦వారమనుచు.
తే॥ కాంచఁ గాంచఁగ నెల్లెడఁ♦గానవచ్చు, కాలు సేతులు మోములు♦గాఁగ నిండి
మనసుచే వాక్కుచే జ్ఞాన♦మహిమచేతఁ, గడ యెఱుఁగలేని రూపంబు♦కనిరి జడిసి.
తే॥ పండ్ల సందులే దిక్కులు♦పట్టవచ్చు, ననఁగఁదగు మొగములు కోటు♦లగుచు వెలయు
నారసింహు రూపము కను♦లారఁగాంచి, బ్రహ్మ తత్కీర్తి నీరీతిఁ♦బ్రస్తుతించె.
తే॥ నిన్ను సృష్టించు కొనువాఁడు♦నీవ యనెదు, సత్య మీరూపమున నిష్టు♦స్పష్టమయ్యె
నిట్టులైనచో♦ బ్రాణుల♦సృష్టి సేయ, నన్ను పుట్టించు టేటికో ? నారసింహ ! ౨౫౩
తే॥ బుద్బుదంబుల కరణి నీ♦భువన వితతి, ప్రబలు నీయంద యెల్లరూ♦పములు నీవ
యిట్టి రూపంబు నొకదాని♦నీవు పూన, నాది మధ్యాంత రహితత్వ♦మమరు టెట్లు ?
తే॥ పరఁగి యేకమై నామ రూ♦పములు పెక్కు, లందుదువునీవతొలి హేతు♦వగుచునుండ
నెవరి సృజయింతు ? కాచెద♦వెవరి ? నేఁ, సంహరింతువు ? తెలియంగఁ♦జాలనయ్య!
శా॥ నీవే నన్ను సృజించినాఁడవు తొలిన్ ♦ నిన్నుండి నీ సత్కృపా
భావం బబ్బుటచే జగంబుల సృజిం ♦ పన్ గల్గినాఁడన్ జగం
బీవే కర్తవు నీవె భర్తవును నీ ♦ వే హేమ మీవౌదు వం
దావిర్భావము నొందు భూషణము నే ♦ నౌదున్ జగన్నాయకా !
క॥ అని వినుతించుచు బ్రహ్మయుఁ, బినాకియును దిక్పతులును♦వేల్పులు మునులున్
వినతులయి కేలు మోడ్పఁగ, వనజాక్షుం డుగ్ర కోప♦వర్తన మానెన్ ౨౫౪
తే॥ జగము లెల్లను నేఁడె నా♦శంబు నొందు, ననుచు వడఁకెడు దివ్యులఁ♦గని ప్రసన్న
మూర్తియై నరసింహుఁడు♦పూర్ణ కరుణ, తనర హస్తమం దభయ ము♦ద్రను వహించె.
సీ॥ అందంబులకు నెల్ల♦నాభరణంబు స, మస్త జీవులకు సం♦పదయుఁ దోడు
నీడయుఁ గారుణ్య♦నిలయ లోకజనని, యమృతంబు తోఁబుట్టు♦వమృత హస్త
పద్మాలయను హరి♦పజ్జకుఁ జనుమని, ప్రార్థించి వేల్పులు♦పంప నృహరి
తావి గుబాళించు♦తలిరువంటిది యగు, కమలను నెనరున♦గారవించె
తే॥ మునులు వేల్పు లంతట♦మూఁగి వేఁడ, వారిఁ గరుణించి ప్రహ్లాదుఁ♦జేరఁజీరి
వారుకొస వత్స! నీభక్తి♦మేర మీఱె, దీనికిం బ్రతికృతి యెద్ది♦తెలుపుమయ్య!.
సీ॥ నీ యెట్ట యెదుటనే♦నీతండ్రిఁ జంపఁగా, నిశ్చలబుద్ధితో ♦ నిలిచితయ్య !
ప్రాణముల్ వెదకుకై♦ఎడి నొడల్ చీల్పఁగా, దుఃఖమింతయు లోనఁ♦దొడరవయ్య!
నీకులంబున వారి♦నీఱుగాఁ జేయఁగా, నొక్కింత యారాట♦మొందవయ్య !
నీవంశమునఁ బుట్టు♦నిర్జర వైరులు, దుష్టులైనను వారిఁ♦ద్రుంపనయ్య !
తే॥ నీవు నాభక్తవరుఁడవై♦నెగడుకతన, వలయు మేలేదియో తెల్పు♦వలతునయ్య !
దాంతిమై భవ జలధిని♦దాఁటితయ్య! యనుచుఁ బ్రేమతోఁ బలుకఁ బ్ర♦హ్లాదుఁ డంత.

శా॥ ఓ కారుణ్యపయోధి! నీకరుణ న ♦ న్నోమ్మేళ్లు నేనొందితిన్
లోకంబందునఁ బొందఁగాఁ దగిన మే ♦ లుం గల్గునే యొందు? నా
కే కష్ట ప్రభవంబు నిచ్చిన సరే ♦ యింపారు నీభక్తి య
స్తోకంబై విలసిల్లనిమ్ము మది సం ♦ తోషింతు మానాయకా. ౨౬౧

సీ॥ అంజలి ఘటియించి♦యట్లు వేఁడిన దైత్య, తనయుని గని హరి♦తనిసి యనియె
పంచభూతములు న♦శించిన సర్వదా, స్థిరుఁడవై నావలెఁ♦జెలఁగుచుందు
భక్తవరులు నన్ను♦ప్రార్థించి పడసెడు, ఫలము నిన్నర్థించి♦పడయఁ గలరు
లోకత్రయము నీకు♦లోఁబడియుండు నా, భక్తులెల్లరును నీ♦భక్తులగుదు

తే॥ రసురులకె కాదు సురలకు♦నధిపుఁ డగుదు, వితర దుర్లభ మిది చుమ్ము♦క్రతులు ధర్మ
సత్యములు కరుణయు శీల♦సమితి సుఖము, నిన్ను సేవించుచుండఁగా♦నెగడఁగలవు.

క॥ అని వర మొసఁగుచుఁ బ్రహ్లా, దున కభిషేకంబు సేయఁ ♦ దోడ్తోఁ బనులం
బొనరింపుఁ డనుచు వేల్పుల, కనుమతి యిడె నెల్లవార ♦ లానందింపన్. ౨౬౩

చ॥ సురపతి ముఖ్యులెల్లరును ♦ సూటిగఁ గార్యము లొగ్గిసేయఁ దా
మరసభవుండు హోమము క్ర♦మంబుగఁ బూర్తి యొనర్చుచుండ నా
గరకులు సన్నుతింప సుర ♦ కాహళ దుందుభి ఘోష మొప్ప నా
సిరివరుఁ డుల్లసిల్లి యభి ♦ షేక మొనర్చె సురారి సూతికిన్. ౨౬౪

క॥ మును జరిగిన చరితం బిది, మనమున నా వార్త నుంత ♦ మన్నింపక త్రో
చినఁ జెడుగులు తప్పని సరి, యనుచు విభీషణుఁడు పలుక ♦ నన్నయుఁ గినుకన్.

౪. విభీషణ శరణాగతి పటలము. (౧౭౭)

తే॥ విని విమర్శింపఁ జాలక♦వీఁగి నిజము, తెలియనేరక భేద బుద్ధిని గ్రహించి
కనులఁ బారాణి పూసిన♦కరణి నెఱ్ఱ, చేసి నిప్పుక లురియుచుఁ♦జెప్పఁదొడఁగె.

తే॥ మృత్యువిజయ తపోబల! మేటి బలము, గలిగి నాతఁడగు హిరణ్య♦కశిపు నర్థి
జనులఁ గాచెడు హరి చంపె♦నని తలంచి, యతని యెడ భక్తిగొంటి వీ♦వయ్య! లెస్స!

క॥ కని పెంచిన జనకుని ఱొ, మ్మును మాయలమారి చీల్చి♦మోదించిన యా
తనయుఁడు మన శత్రువునెడ, నెనరూనిన నీవు సములు♦నిజము మతేరీ? ౨౬౫

క॥ ఆ రామలక్ష్మణులతోఁ, బోరి మడియ నాదు రాజ్య♦భోగంబులఁ బెం
పారఁ గొనఁ దలఁచితే? పితృ, మారకుబలె నీవు భ్రాతృ♦మారకుఁ డగుచున్.

సీ॥ ఇది ఫలియింప నే♦రద యైనఁ బేరాస, మునుపె వారల యెడ♦నెనరుఁ గొంటి
మనుజులవలె నీవు♦దనుజులయెడ గొప్ప, యోర్వలేని విరోధ♦మూనియుంటి
వెన్నులు కరఁగు ప్రే♦మమ్ము రాఘవులందు, తెలుపుచు నుంటి స్తు♦తించుచుంటి
వానంద బాష్పమ్ము♦లధికమ్ముగా వారి, వినుతింతు నపుడెల్ల♦విడుచుచుంటి

తే॥ శరణమగుదురు వారలా♦నరుల కడకుఁ, బోమ్ము కర్తవ్యమదియ ని♦జమ్ము నన్ను
గెలుచు వెరవు నాలోచించి♦ తెలిసికొంటి, నీకు మించిన శత్రుండు♦నాకుఁగలఁడె?

ఉ॥ నాఁడొకకోఁతి వచ్చి వన♦నాశము సేయుడుఁ జంపుఁడంచు నే
నాడఁగ దూతఁ జంపుటలు♦న్యాయము గాదని పల్కినాఁడ వా
నాఁడె భవిష్యదర్థము మ♦నంబున నెంచియె యడ్డుకొంటివా
నేఁడది వెల్లడించితివి♦నీ కృతకంబు ఫలానుమేయమా. ౨౮౧

చ॥ అరులకు భీతిఁజెంది తటు♦తొటను పోటరి కావు నిక్కమా
నరులకు భక్తిఁ జూపి పెను ♦ నమ్మకముంచితి వంచకుండవై
పురుషుని తోడ వచ్చు గుణ ♦ పుంజము లెల్లను మార్చుకొంటి నీ
గరుసగు చెల్మికంటె భుజ♦గంబు మెడం గొనుటెన్న మేలగుఁ. ౨౮౨

తే॥ జగము నిందకు జంకి నిన్♦జంపకుంటి, పదరుటింకను మానవు♦వడిగ నన్ను
విడిచి పొమ్ము పోవక వెండి♦నుడువఁబూను, దేని నిన్ను చెండాడక♦మాన నను.

క॥ తలపోసి యేమి చేయం, గలనని తమ్ముండు మిత్ర♦తతితో గగన
స్థలమున నిలిచి విడక నయ, కలితములగు వాక్యములను♦క్రమ్మఱ ననియెన్

క॥ బ్రదుకం దలఁచిన యన్నా!, మదిమది సుఖసంపదలను♦మనఁదగియుండన్
వదరల పలుకులఁ జెడియెదు, బ్రదుకు గలదె నీతిచెడిన♦ప్రాణులకెందున్?

చ॥ సుతులును బంధు మిత్రులును ♦ స్తోత్రము చేసెడు బుద్ధిహీనులున్
హితులును శూర కేసగులు♦నెల్లను రామ శరాళిచేత భూ
పతితులు గాఁగఁ జూచి మఱి♦ప్రాణము వీడఁ దలంచినాఁడవే?
హితము వచించు నన్ను గణి♦యింపక శత్రువుగాఁ దలంచితే? ౨౮౬

ఉ॥ తేరుపఁ జూచితిన్ హితము ♦ దెల్పి సహింపక నీతిమాలి న
న్నూరక దూఱులాడితి హి♦తోక్తులు నీచెవిఁ దూఱవయ్యె; ని
న్నారము పూర్వముర్ గరిఁటె♦నాకి వ్రతమ్మును గోలుపోవు చో
ప్పారయనయ్యె నొక్క చెలి♦కై కులనాశము దెచ్చికొందువే? ౨౮౭

క॥ మన్నింపుము నాతప్పుల, నన్నా! సెలవిమ్ము పోదు♦నని వెడలుటయున్
గ్రన్నన మంత్రులు నలువురు, తన్ను విడక వెంటనంటి♦తరలిరి ప్రీతిన్ ౨౮౮

క॥ అనలుఁడు సంపాతి హరుం, డనిలుండను వారితోడ♦ననువుగ నాలో
చనచేసి విభీషణుఁ డ, య్యనకులుతో నెయ్యమాడ♦నేగె ముదమునన్. ౨౮౯

క॥ ఇంబుగ వనధిఁ గడచి దీ, పంబులు విలసిల్ల దుర్గ♦వారాన్నిధి య
బ్జంబులు పూచె ననెడు చం, దంబున వికసిల్లు కపిక♦దంబముఁ గాంచెన్ ౨౯౦

క॥ ఒక ప్రక్కను గపి సంఘము, నొక ప్రక్కను జీవకోటి♦నుంచి గణింపన్
దుకము మిగులు వానర సై, న్య కదంబమె యనుచు మఱియు♦నతఁడిట్లనియెన్.

సీ॥ ధర ధర్మమార్గ సం♦స్థాపకుఁడగు దాశ, రథి యెడ నామనో♦రథము పాతె
కీర్తిదంబగు శుద్ధ♦వర్తనంబునఁ గాక, యే మార్గమున నేగ♦నిచ్చగింప
సోదరుండగు నాదు ♦ సూక్తి గైకొనని మా, యన్న చే వీడంగ♦నసదనైతి
నీయుదనందు నేఁ♦జేయంగఁ దగిన దె, య్యది వచింపుఁడు మీర♦లనుఁగులార!
తే॥ యనుడుఁ బుణ్యపురుష! బురు♦షార్థదాయి, యైన శ్రీరాము దర్శించు♦టధికసాఖ్య
మనుచు శాస్త్ర విజ్ఞానులౌ♦తనదు హితులు, పలుక నాతఁడు సమ్మోద♦కలితుఁ డగుచు.

మ॥ శుభదంబౌ ఘనితిక వచించితిరి మీ ♦ సూక్తుల్ హితంబయ్యె మా
కభయం బిమ్మని వేఁడఁ బోవుదము సీ ♦ తాధీశ్వరుం డర్థిదు
ర్లభుఁడే? వేఱొక తీరు సేసినను ♦ త్రోలన్నెర్తుమే దుష్టదై
త్యభవంబుల్? మన కిద్దియే యిపుడు క ♦ ర్తవ్యంబు చింతింపఁగన్.

మ॥ మును దర్శింపఁగ లేదు విన్నయదియుం ♦ బౌల్పార దెన్నండు న
మ్మనమం దిట్టులు ప్రేమగల్గఁ గతమే ♦ మాత్రంబుఁ గానంగ రా
దనయంబుం దలఁపన్ శరీరము గగు ♦ ర్పందున్ గరంగున్ మనం
బినరాజన్యుఁడు దైత్యదేహి కరి యం ♦ చీమాత్ర చింతించెడిన్ ౨౮౪

తే॥ అయిన సర్వజ్ఞుఁ డీమాత్ర♦మరయకున్నె?, దైవభక్తి ధర్మము నీతి♦తప్పమియును
భూతదయయుఁ బ్రహ్మవలనఁ♦బూర్వమున నె, పడయువరములు ఫలియించు♦నెడయువచ్చె

తే॥ మేలె పల్కితి రీరు స♦మీక్షచేసి, శ్రీశు పదములఁ బొంది య♦భీష్టములను
గొంద మిప్పుడు చీఁకటి♦గొజలు కఱన, నుదయమునఁ గాంతమని వని♦నుండునంత.

తే॥ కడలి దాఁటు నాలోచన♦గలుగఁ గలువ, కంటి జానకిఁ దలఁచి దుః♦ఖమున మనసు
చలన మొందుచునుండ భా♦స్కరుఁడు పొడమె, రాముఁడును వచ్చె వార్ధితీ♦రంబుచేర.

తే॥ తమమునం దటఁ గల యుప్ప♦శముల సైక, తములఁ బున్నాగములఁ దమా♦లములఁ గంజ
ములను కలువల వేడ్కమై♦నలరు హంస, మిథున సంతతిఁ గాంచెను♦మిహిరకులుఁడు

తే॥ పసిఁడి రంగు నిండారిన♦వనచయములు, సికత వేదికా స్థలుల నె♦ట్టుకొని వచ్చి
కెరటములుచేర్చు మణిసము♦త్కరము మదికి, నింపుగూర్పఁగఁ గని జాన♦కీశ్వరుండు.

ఉ॥ అందలి సుందరుల్ మెఱుపు ♦ నందము చిందెడు భూమణావళుల్
చందముగా ధరించిన ప ♦ సందగు వ్రేళులు రాయ బొప్పముల్
క్రిందుగఁ గాఱుటన్ సుడియు ♦ కాల్వలఁ బూడ్చుచుఁ గాలివ్రేళ్ల భూ
మిం దగ గీచు గీఁతలును ♦ మిక్కిలి గల్గు వనంబులం గనెన్. ౨౯౦

తే॥ ఇంచు గేదంగులందుండి♦హిమకణములు, జాజిఁ బెంటులఁ జీరి వ♦క్షముల నదిమి
కొనుచుఁ దూఁగెడి హంసల♦గుంపుగాంచి, యుల్లమున నొచ్చి గొప్ప ని♦ట్టూర్పువుచ్చె.

తే॥ తిన రుచించుమీాలను పట్టి♦ తేరఁ జనిన, గండు పులుఁగువచ్చెడు దిక్కు♦ గాంచి యింపు
మీఱఁ గూయు నారణపక్కి♦ తీరుగాంచి, చింతగొనియె శ్రీరాముఁడు♦ చిత్తమందు.

తే॥ ఒక్క పెట్టపై వలపూని♦ యుల్లమందు, మచ్చరము పెచ్చరేఁగ దీ♦ మసముతోడ
రెండుపుంజులు పోరాడుచుండఁ జూచి, కనుబొమల ముడివెట్టె రా♦ ఘవవరుండు

తే॥ ఆడ నిండిన నెయ్యంపు♦ టల్కయందు, గెలుపు గొనలేని యొకహంసి♦ కలయికందు
జయము నొందుట గని రామ♦ జనవిభుండు, పవడముం బోలు నధరంబుఁ♦ బంటనొక్కె.

తే॥ డాసి హనుమదాదులు సమా♦ శ్వాసపఱుప, చింతవీడి తెలివి తెర♦ చేరు పిచ్చి
వానికై వడి నాచోటు♦ వదలిపోయె, శ్రీవిభుండు సీతాక్రాంత♦ చిత్తుఁడగుచు.

తే॥ ప్రాజ్ఞులైన వానర మిత్ర♦ వరులు బలిసి, రాఁగ నడచు వాహిని కొక♦ ప్రక్క నిలిచి
శంక లేని మదిని విభీ♦ షణుఁడు కడఁకఁ, గాంచుచుండి యిట్లనియె రా♦ ఘవుఁడు వినఁగ

క॥ నీకంటెను సుశరణ్యము, నాకెద్దియు లేదు రక్ష♦ ణం బీవె యనన్
గాకుత్స్థుఁడు విని మిత్ర వ, నౌకసుల మొగమ్ము లరసి♦ యల్లన ననియెన్.

క॥ శరణము తండ్రీ! యని యిపు, డరుదుగ వచియించు వార♦ లరయంగా నే
తరమునవారలొ మీరా, యరసిన తెఱఁగెంత వట్టొ♦ యరయుడ మనుడున్.

తే॥ అచటనవ్విభీషణుఁ గాంచి♦ యసురలిందు, చేరిరిఁకఁ బట్టుకొనుఁడు హిం♦ సింపుఁడుగ్ర
గతులఁ జంపుఁ డనుచుఁ గపి♦ గణము వారిఁ, దర్జనముల భర్జనముల♦ డాసిచుట్టె.

తే॥ పాడి దేవతయే వీనిఁ♦ బట్టితెచ్చె, నితఁడు పాపాలపుట్ట లం♦ కేశ్వరుండు
మన తలంపులు నేఁడె చ♦ య్యన ఫలించె, తెరలకుండని వారి నె♦ దిర్చినారు. 300

క॥ తలలు పది చేతు లిరువది, గలుగవు దౌర్భాగ్యునకును♦ గతియించెనొకో!
తెలియ మనువారు మాతోఁ, దలపడు మని త్రోసికొనుచు♦ డాసెడు వారున్.

క॥ పట్టి పెడకెక్క లీడిచి, కట్టి నలఁగఁ బొడిచి రాము♦ కట్టెదుటికిఁ బో
నెట్టుదమ యనెడు వారును, తిట్టుచుఁ జెడుమనుచు నెదురు♦ తిరిగెడి వారున్.

క॥ గగనమునకు నొకత్రుటిలో, నెగసినఁ జేయునది యేమి? యిప్పుడు వీనిం
దెగటార్తము రూపఱఁ జిదు, కఁగఁ బొడుతము తామసింపఁ♦ గాదను వారున్.

తే॥ పలు విధమ్ముల నీరీతిఁ♦ బలుకుచుండ, గణన కెక్కు నైంద్ర వ్యాక♦ రణ విశార
దుండు హనుమంతుఁ డంప మైం♦ దుండు ద్వివిదుఁ, డనెడు వానర వీరు లా♦ తనిని డాసి.

తే॥ ధర్మపద్ధతు లెఱుఁగు మైం♦ దద్వివిదులు, వానరుల నవ్వాలికిఁ ద్రోచి♦ పదరవలదు
వీరి మోములు వంచనా♦ దూరము లగు, ననుచు వారలతోడ ని♦ ట్లనిరి యవల.

క॥ మీరెవ్వ రిటకు వచ్చిన, కారణ మదియేది? రణము♦ కాంక్షించితిరో?
వేరొక తలఁపు గలదో? మీ, తీరులు మదిదాఁచకుండఁ♦ దెలుపుఁ డనంగన్.

మ॥ అనలుం డిట్లను ధర్మవర్తనుఁడు స ♦ త్యాచార సంపన్నుఁ డీ
ఘనుఁ డబ్జాసన పౌత్త్రుఁ డార్యహిత స ♦ త్కార్యుండు పేరన్ విభీ
షణుఁ డీరాఘవ పాదపద్మములు వాం ♦ ఛం గొల్చి జన్మంబు పా
వనతం గాంచఁగఁ గోరి వచ్చెఁ గరుణా ♦ వష్టంభులారా! వెసన్. ౩౦౮

ఆ॥ పాడి తప్పకుంట ♦ పరమాత్మ పై భక్తి, సత్యవాక్య నిష్ఠ♦శమ దమాదు
లబ్జభవుని వలన♦నరుదైన తపమున, వరముగాఁగఁ గొన్న♦వాఁడితండు. ౩౦౯

ఆ॥ ప్రజ్వరిల్లు నగ్ని♦వస్త్రంబునం జుట్టి, నట్లు లోకనాథుఁ♦డైన రాము
పత్నిఁ గార నిడితి♦వదలి బ్రదుకు గను, మనుచు హితము దెలుప♦నన్న కితఁడు.

తే॥ విగత సద్బుద్ధి దానవ♦విభుఁడు కినిసి, తమ్ముఁడవు గాన బ్రదికితీ♦తావునుండి
తొలఁగి పొమ్ము పోవేని మృ♦త్యువు నిజంబు, పలువ!యని పల్క సీతండు♦వదలివచ్చె.

ఆ॥ అనుచు ననలుఁ డాడ♦ ననుజుని సేనను, గాంచి హెచ్చరికను♦గనుచునుండుఁ
డేను రాఘవునకు♦నీవార్త దెలిపెద, నంచుఁ బలికి మైందుఁ♦డచటు వీడె. ౩౧౧

తే॥ పాడియుఁదపంబుజ్ఞానంబు♦ప్రహరులుగను, గౌరవంబు శాంతంబును♦ద్వారములుగ
కరుణయను దేవళంబునఁ♦బరఁగు లోక, మోహానుని పద కంజాత♦ములకు నెఱఁగి

తే॥ తెలుప వలసిన దొకవార్త♦గలదు దేవ? ఏమి ఫలియించునో మాకు♦నెఱుఁగ రాదు
వంచకుండగు రావణు♦వదలి యతని, తమ్ముఁడగు విభీషణుఁడు మీ♦దరికి వచ్చె.

తే॥ పట్టి కట్టుఁడు కొట్టుఁడు♦ప్రచ్చుఁ డనుచు, మన చమూబృంద మాతనిఁ♦జెనయ నేను
వారి నదలించి వచ్చిన♦మీర లెవ్వ, రేమి పనియన నొక మంత్రి♦యిట్టులనియె.

తే॥ తనకు వ్యతిరేక గుణుఁడగు♦దశముఖుండు, మనసు పోయిన త్రోవనె♦చనెడు కతన
డగిన శరణ ముదారుఁడౌ♦దాశరథియె, యనుచు నాశ్రయింపఁగ నిట♦కరుగుదెంచె.

తే॥ ధర్మమార్గ వర్తనమును♦దైవభక్తి, సత్యనిష్ఠయు ఘన తప♦శ్శక్తిచేత
వీత దానవగుణుఁడు వి♦భీషణుండు, బ్రహ్మవలన వరంబుగాఁ♦బడసినాఁడు ౩౧౬

చ॥ అలఘుపతివ్రతామణి కు ♦ లాంగన రాముని ధర్మపత్ని ని
ట్లలయఁగఁ గారలో నునుప ♦ నక్షయసంపద లీను లంక యె
మ్ములఁ గిరులౌను నీమకుట ♦ భూషిత మస్తక సంఘముల్ ధరా
స్థలి దొరలు న్నిజంబని హి ♦ తంబు వచింపఁగ నన్న కిన్కమై. ౩౧౮

తే॥ ఇటు విరుద్ధవాక్కుల వచి♦యింతువేని, చంపువాఁడఁ బొమ్మవలి కీ♦క్షణమునందె
యనుచుఁ దఱుమఁగొట్టంగ మి♦మ్మాశ్రయింప, వచ్చినాఁడఁట! యిదికల♦వార్తయనుడు.

తే॥ రక్షణీయుఁడొ కాఁడొ యీ♦రావణాను, జుండు మీనూత్నమతులకు♦నూటిగాఁగఁ
దోఁచువిధము దెల్పుండుమి♦త్రులరుమీర,లనినరఘువర్యుఁగనిరవి♦తనయుఁడనియె

—: సుగ్రీవాదులు తమ తమ యభిప్రాయములఁ దెలుపుట :—

తే॥ విధికి మించిన వాఁడవు♦ వేదశాస్త్ర, పారగతుఁడవు నీవిట్లు♦ప్రశ్నసేత
మావలన నెఱుఁగుట కౌనె! మమ్ము గౌర, వించుటకుఁగాక యాగమ♦వినుత చరిత!

తే॥ ఐన వచియింతు నెఱిఁగిన♦యంతవట్టు, వినుము విని సరియైన-చోఁ♦గొనుము పిదప
భావి ఫలితమ్ము తిర్మాన♦పఱచి నీవ, తెలిసికొనఁగల్గుదువు దయా♦కలితచిత్త!

ఉ॥ అన్నను వీడి వచ్చుటిది ♦ యారయ వైరముచేతఁగాదు వ్యా
పన్నత నొందికాదు తన ♦ ప్రాణము గాచికొనంగఁగాదు పే
రెన్నిక గల్గునంచు నెద♦నెంచియు గాదొక కీడుచేసి కా
దున్నతుఁ డొక్కరుండు కలఁ♦డో ఖలులైన నిశాచరావళిన్? ౩౨౪

తే॥ తల్లిదండ్రుల గురుల బాంధవులఁ బ్రభుల, శత్రువులు చుట్టు ముట్టిన♦సమయమందు
చేయి విడిచి వచ్చుట యెట్టి♦శీలమయ్య! హేయమగుఁగాక సజ్జన♦హితము నగునె?

తే॥ వలయు పనులందు నింపగు♦పలుకులాడి, రణము సేయ వలయునెడఁ♦బ్రాణమైన
వీడవలసిన పద్ధతి♦వీడి శత్రు, పక్షమొందు వాఁడొక ధీర♦వర్యుఁ డగునె?

ఉ॥ జ్ఞానము ధర్మమ్ముం దనకు ♦ సమ్మతపద్ధతి నుండవచ్చు న
వ్వానికి భంగముల్ దొరయు ♦ పట్టున వేసరి సన్న్యసింపఁగా
బూనుట భావ్యమైనపని ♦ మూర్ఖులు సైతము నవ్వ శత్రు ప
క్షానకు వచ్చి చేరుటది ♦ సజ్జన సమ్మతమే? యనింద్యమే? ౩౨౫

తే॥ అన్న సుఖియింపఁ దానుసౌఖ్యంబు లంది, ముట్ట వచ్చిన తఱిఁ దోడు♦పూనకిట్లు
వీడివచ్చె నీతడు తగు♦వేళరాఁగ, నెవ్వరికిఁ దోడుపడునని♦యెంచవచ్చు? ౩౨౬

తే॥ వృద్ధుఁడైన మారీచుఁడు♦విభునియాజ్ఞ, చెడుగయైనను విధిలేక♦చేయఁబూనె
రాజధర్మ తత్త్వజ్ఞుఁడై♦రాజు వీడి, వచ్చెనని నమ్మి చే యీయ♦వచ్చునేమి?

తే॥ యమునితోఁ లోకమెల్ల నే♦కముగనగుచుఁ, దాఁకిననుమాఱుకొనఁగసి♦ద్ధముగనున్న
వారమోరామ! మనప్రక్క♦వచ్చితోఁడు,పడునెశత్రుతమ్ముఁడు?నమ్మ♦వచ్చునేమి?

తే॥ అసురులనుసమూలముగ నుక్క♦డఁచిధర్మ, మొనరనిలిపెడు గౌరవ♦మూనియున్న
మీరువీనిఁదోడుగఁగొన♦మీగురుత్వ, మునకెపెనులోటుగాఁదోఁచు♦నినకులాఢ్య!.

తే॥ బందుగులు హితులును వీడు♦పట్టునందుఁ, గూడియున్నెడ సంపదల్♦కొల్లవోవు
నపుడు విందారగించెడు♦నపుడు నొక్క, పద్ధతిగ నుండువారలే♦పరమహితులు.

తే॥ కపట నాటక మాడంగఁ♦గడఁగి వీఁడు, వచ్చెఁగాక శరణమొంద♦వచ్చినతఁడు
కాఁడు శత్రుఁ జేర్చుకొనఁగఁ♦గాదు వీని, తీరు సంశయాస్పదమని♦తెలియఁబలికె.

తే॥ అందుపై బహుశ్రుతులలో♦నసముఁడైన,జాంబవంతుని గని రామ♦చంద్ర విభుఁడు
నీ యభిప్రాయ మేమని♦నెనరు దోఁప, నడుగ ధర్మపద్ధతి నిట్టు♦లాతఁడనియె.

చ॥ పగఱను చేర్చుకొన్న నెటు ♦ వంటి మహాత్ములె యైనఁ గీడులం
దగులుట నిక్కవంబు పగ ♦ ధర్మపదుండని చూతురేని వం
శగత దురాగతంబు విడి ♦ జాఱునె యెన్నఁటికేని? లోక మీ
పగిదిని సమ్మతింప దిది ♦ పార్థివ పద్ధతి గాదు రాఘవా! ౩౩౩

ఉ॥ క్రూర విరోధు లెప్పుడును ♦ కోరుచునుందురు మిత్రభేదమున్
దారి గనంబడం జెడుగు ♦ దార్తురు వేళ గ్రహించి పోరికిన్
ధీరత నెత్తుచుండుదురు ♦ తేఁకువతో జయమున్ గడింతు రి
ట్లారయ దుష్టసంగతి ప ♦ యంబు నొసంగునె? రాఘవేశ్వరా! ౩౩౪

తే॥ వేదములయు యాగములయుఁ ♦ బేరు మాపి, శిష్టులకు వేల్పులకు బల్మిఁ ♦ జెడుగుఁ గూర్చు
పాపులగు రక్కసులు మన ♦ పజ్జఁ జేరి, సజ్జనాచారములఁ గొనఁ ♦ జాలువారె?

చ॥ శరణము సొచ్చి రం చభయ ♦ సంపద పెంపుగ నిచ్చి కాచుచో
దొరకొన వీరి మోసమున ♦ దోసము లెయ్యవి సంభవించినన్
భరమయి ప్రాణముల్ విడువ ♦ వచ్చిన నప్పుడు వీరి వీడినన్
తిరమగు నిందయౌఁ దగవు ♦ దేవతయున్ దొలఁగున్ రఘూత్తమా!

తే॥ ఎక్కువగఁ దెల్పనేల? మీ ♦ రెలమి తోడఁ, గాఁటనుండ బంగరు లేడి ♦ గాఁగ వచ్చి
మోసపుచ్చు మారీచుని ♦ మునుపు రాక, వీని రాకయు నొకతీరె ♦ వీరవర్య!

తే॥ అనుడు బహువిధ శాస్త్ర సి ♦ ద్ధాంతములను, చక్కఁగా విని యెఱిఁగిన ♦ సైన్యపతిని
నీలుఁ గని నీయభిప్రాయ ♦ నిశ్చితంబు, దెలుపుమన నాతఁ డిట్లని ♦ పలుక సాగె.

సీ॥ కూడని వారలఁ ♦ దోడుగాఁ గొను పద్ధ, తులు గొన్ని కలవు రా ♦ ట్తిలక వినుము
తమవంశమున వారి ♦ సమయించు వారల, కడ కెల్లిదమ్ముగ ♦ నడచువారు
వనితల విషయాన ♦ వైరంబు గలవారు, పగఱచే ధనము గో ♦ ల్పడినవారు
మఱవఁగూడని యవ ♦ మాన మొందినవారు, దాయలవలన బీ ♦ దలగువారు
తే॥ సంగరంబున వెన్నిచ్చి ♦ శరణు చొచ్చు, వారు పరుల మిత్రుల బాధ ♦ పఱచువారు
ప్రక్క రాజులచేఁ గీడు ♦ పడయువారు, వైరి సోదరులైనఁ జే ♦ పట్టఁదగును. ౩౩౯

సీ॥ పగఱఁ జేరఁదగిన ♦ భంగంబు లొందని, వారును శాత్రవ ♦ భయద బలులు
చేరిన నదను వ ♦ చ్చినఁ దొలఁగంగఁ దీ, ర్మానించుకొనియుండ్రు ♦ గానఁ దగదు
ఈ విభీషణు రాక ♦ కిందేది కారణ, మగునని యారయఁ ♦ దగును మనకుఁ
గాల దేశములు నృ ♦ పాల నీతియుఁ జూడ, విసిగిన వాని స ♦ ద్వృత్తి యొకఁడె
తే॥ కాంచి నమ్మంగఁ దగదని ♦ క్కముగ నిదియు, నాయభిప్రాయమనఁ గవా ♦ నరులు తక్కు
వార లుచ్చావచంబుగఁ ♦ బలికి తుదకుఁ, బగను చేపట్టఁ దగదని ♦ పలికినారు. ౩౪౦

—: హనుమంతుఁడు తన యుద్దేశమును తెలుపుట :—

సీ॥ సర్వసామాన్య వి♦జ్ఞానంబున కతీతుఁ, డైన శ్రీరామ భూ♦జాని యవల
మతిమంతుఁ డగు హను♦మంతుని గని బహు, శ్రుతుఁడ! నీ తలఁపున♦చొప్పు వినఁగ
నెంతు నీవారెల్ల♦రేక వాక్యులై యయి, రను సూచకంబుగ♦నరయునంత
నాలోచనమున వీ♦రజ్ఞానులైనను, దగు గౌరవింప బాం♦ధవ్యరీతి
తే॥ ననుచుఁ గృతమతి మారుతి♦యవనతాంగుఁ, డగుచు హస్తముల్ముకుళించి♦యాననమున
కడ్డముగఁ జేయి యిడి పెద్ద♦లందఱొక్క, పద్ధతిగఁ బల్కు మీఁద నేఁ♦బలుకవలెనె?
తే॥ కృతమతులు మంత్రులెల్ల రీ♦రీతి తీర్చి, పలుకుచున్న భావ్యంబగు♦ఫక్కియైన
నితఁడు దుర్గుణుఁడని సంశ♦యింపఁ జాల, దీనికిం దగు హేతువుల్♦దెలియ వినుఁడు.
క॥ వంచకుల వక్రవదనము, లంచించి పరీక్ష సేసి♦యరయఁగ వచ్చున్
వంచనము వారు దాఁచిన, నంచిత హృదయంబు మోము♦నం దెడలించున్.
క॥ పగవారు శరణు చొత్తురె?, పగటం జీఁకటులు కానఁ♦బడునే? మదిలోఁ
దగులుకొను చౌర్యమునకున్, మొగమే యద్దమయి స్పష్ట♦ముగ వెలిపుచ్చున్.
తే॥ వాలి స్వర్గలోకముచేర♦నేలయెల్లఁ, దమ్ముఁ డొందఁగఁ జేయు నీ♦ధనువుబలము
జయము శీలము సర్వమ్ము♦చక్క నెఱిఁగి, రాజ్యకాంక్షచే నితఁడు చే♦రంగ వచ్చె.
తే॥ దనుజనుపాలనమునకుఁ♦దాళలేమి, తమ్మునకు రాజ్యమిచ్చు ను♦దారబుద్ధి
సత్య వాక్పాలనము ధర్మ♦సంస్థితియును, తీరుగా నెఱింగియె మిమ్ము♦చేరవచ్చె.
తే॥ ఇతఁడు కాల దేశంబుల♦నెఱిఁగి నీవు, వాలిఁ జంపుట దెలిసి రా♦వణునకింక
నాశమే నిజమని లోక♦నాయకుఁ డగు, నిన్ను చేరఁగోరియె వచ్చె♦నన్నవీడి.
క॥ దానవ నైజము మాయలు, వాని నెఱుఁగు వలఁతు లిపుడు♦వశులైరి జయం
బే నిక్కువమగు మనకిఁక, దీనికిఁ జింతింపనేల? ధీరవరేణ్యా! ౩౪౮

చ॥ దనుజులు మానసంబులను ♦ దాఁచిన క్రూర గుణవ్రజంబులన్
గనుఁగొన దుష్కరంబ యగుఁ ♦ గాక నృశంసులు వీరిలోన నుం
డినఁ దగ నుండవచ్చును క ♦ డింది మగంటిమి గల్గు వైరిచేఁ
దనుకఁగ బన్నమొందిన క ♦ తమ్మున నయ్యవి యెన్నఁగూడునే? ౩౪౯
మ॥ నను దైత్యేంద్రుఁడు చంప నాజ్ఞయిడ న ♦ న్నుంగాంచి యీతండు దూ
తను చంపించుట పాడిగాదు మఱి త ♦ త్కార్యంబుచేఁ బూర్తిగాఁ
జనునే శాత్రవ శేషమంచు నబలా ♦ జాతిన్ బలంబేది యుం
డినవారిన్ వధియింపరాదనుచుఁ జా ♦ టించెన్ సభన్ ధీరతన్. ౩౫౦
తే॥ రాత్రి నీవిభీషణు మంది♦రమున కేగి, నపుడుఁ దరువాత నాత్రోవ♦నరిగి నపుడు
మంచి శకునంబులయ్యె నా♦మదికి నింపె, మఱియు నితని గూర్చి కొంత♦యెఱిఁగినాఁడ.

తే॥ సజ్జనానర్హమైన మాంసంబు నింద్య, మైన మద్యంబు నితని గృహంబునందు
కానరావు ద్విజార్చనల్ దానధర్మ, విధుల నొప్పారె సుకృతాత్ము వేశ్మమనఁగ.

తే॥ ధరణిజాత దుఃఖింప నీతని కుమారి, పాపి యసురకు బ్రహ్మశాపంబు కలదు
నిన్ను బలిమిమై దాఁకంగ నేరఁ డనుచు, డిందుపడవలదని యూఱడించుచుండె.

మ॥ దనుజాధీశుఁడు పొందినట్టి వరముల్ ♦ దర్పంబు మోసంబు త
క్కిన దుర్జాతిగుణంబులన్ వెలికిఁ బ్రక ♦ క్కింపంగఁ దానోపు నీ
ఘన కోదండ విముక్త శాత శర సం ♦ ఘాతం బమోఘంబుగా
నని యూహించియె వచ్చినాఁడు రఘురా ♦ మా! భక్త చింతామణీ!

చ॥ తన వరముల్ గుణంబులు కృ ♦ తార్థత నొందఁగఁ జూచి యందుపై
ననితర సాధ్య కార్యముల ♦ నారసి యాపదవేళఁ గావుమా
జనవర! యంచు వచ్చిన ని ♦ శాచరునైనను పోవ వీడినన్
వననిధి దావి నీటఁ గని ♦ వారని శంక యొనర్చి నట్లగున్. ౩౫౫

చ॥ అరులకుఁ జేరువారలు స ♦ హాయులు కారని యీ విభీషణున్
దొలఁగినచో నయజ్ఞులిల ♦ దొడ్డగ నవ్వరె? యన్నదమ్ములౌ
పురుషులకారె వైరమును ♦ పూనుచు నుగ్రుఁడొక నెంట కోసమై
యిరవిది తెల్పితిం బిదప ♦ నిష్టము వచ్చినయట్లు చేయుఁడీ. ౩౫౬

—: శ్రీరాము నభిప్రాయము :—

చ॥ అను హనుమంతు వాక్యముల ♦ నారసి దేవ సుధం గ్రహించు చొ
ప్పున మది నుల్లసిల్లి కడుఁ ♦ బోఁడిమితోఁ గొనియాడి తక్కువా
రిని గని యీతఁ డాడినది ♦ కృత్యము మీరలుఁ జర్చసేయుఁడీ
వనచరులార! నా తలఁచు ♦ పద్ధతి యియ్యదియే నిజంబుగన్. ౩౫౭

ఉ॥ నిర్వహణ ప్రభావమును ♦ నెక్కొన వచ్చిన వేళయున్ మనః
పూర్వక రాజ్యకాంక్షయును ♦ ముఖ్యములై తగియుండె వీని ని
ర్గర్వము మెచ్చఁ దగ్గది తి ♦ రంబుగ నిల్చిన కార్య దీక్షయుం
బర్వెను బుద్ధి గొప్పయవి ♦ పాపమొకండును లేనివాఁడగున్. ౩౫౮

ఉ॥ మారుతి పల్కులెల్లను స ♦ మంజసముల్ పలుమాట లేటికిన్
వేరగు తీరుచే గెలుపు ♦ వీడినఁ బ్రాణము తేగినన్ జయం
బేరహిఁగల్గినన్ బహు సు ♦ రేశ్వర భోగములబ్బినన్ సతే
కోరికమీఱ నన్ శరణు ♦ గోరినఁ గాచుట నా వ్రతంబగున్. ౩౫౯

చ॥ శరణము గోరి నాతఁడొక ♦ శాత్రవుఁడైనను క్రొత్తయైన ము
ష్కర గుణుఁడైన మాతృ పితృ ♦ ఘాతుకుఁడైనను భ్రాతృ హంతయో

శరణమునొంది పిమ్మటను ♦ జాఱిన దాన యశంబకాక దు
ర్భరమగు దుర్యశంబు మన ♦ పాలఁ బొసంగునె యెన్నఁడేనియున్!. ౩౬౦

చ॥ ఇనకులచంద్రుఁడైన శిబి ♦ యిచ్చెను మేను కపోతపక్షి కా
ఘనుని యశంబు నేఁటికిని ♦ గల్గదె? నాశరణమ్ముఁ గోరి యొ
ప్పిన సుఖమొంద వచ్చిన వి ♦ భీషణు చేవిడునాఁటికంటె నా
యన కపటంబుచే మరణ ♦ మందిన నాఁడెకదా కృతార్థుఁడన్?. ౩౬౧

ఉ॥ హాలహాలంబు మ్రింగి యమ ♦ రావలిఁ గాచిన శంభువృత్తముం
బోల నెఱుంగరో? యిడుమఁ ♦ బొందిన వాసిని వీడువాఁడు భా
గ్యాలిని దాఁచువాఁడు శర ♦ ణార్థిని గావనివాఁడుఁ గాంచఁగాఁ
జాలెడువారె ధర్మఫల ♦ సంపదఁ బిమ్మటఁ జింతనొందినన్. ౩౬౨

ఉ॥ దారను బుట్టఁబెట్టికొని ♦ తన్నును పట్టఁగ నున్న బోయకుం
బేరిమి నగ్నిఁగూర్చి చలి ♦ వీడిచి యాఁకలి బాధవోవ నా
హారముగాఁగ దేహము స ♦ మర్పణసేసిన పిట్ట సత్కథన్
ధీరులు మేలుమేలని ను ♦ తింపరె నేఁటికి మంచి వేళలన్? ౩౬౩

క॥ కరి మకరముతోఁ బోరఁగ, సరిరాక యలంగి నొచ్చి ♦ శరణార్థిని శ్రీ
వర కావవె యన విష్ణువు, కరుణించిన కథను మఱవఁ♦గలరే సుజనుల్?. ౩౬౪

చ॥ కరుణను సృష్టిచేసి తగఁ ♦ గాచెడు విష్ణువు సర్వలోకముల్
చరములు స్థావరమ్ములును ♦ సత్యము ధర్మము తత్ఫలంబులున్
గర మరుదారఁ దానయయి ♦ కావఁగఁ గోరిన వారిఁగాచు శ్రీ
వరదుఁడు గాఁగ నొప్పెనన ♦ వార్తల నాడఁగనేల దీనికిన్? ౩౬౫

తే॥ తక్కువగ జీవితంబును♦దాన యొసఁగి, యవలఁ జావ భీతిలి యభ♦యంబు వేఁడఁ
గాలుఁ గాలమర్దించి మృ♦కండసుతుని, మృతిని మాన్పఁడె శంభుండు♦మేలుగూర్చి?.

ఉ॥ దిక్కొక యింత లేదనుచు ♦ దీనత జానకి యేడ్వ నీకు నే
దిక్కయి యుంటిగా యని యె ♦ దిర్చి సురారి కులేంద్రు దోర్బలం
బుక్కఱఁ జేసి ఘోర కద ♦ నోర్వి యశస్కరరీతిఁ బ్రాణముల్
దక్కిన పక్కిరాయని వి ♦ తంబది మాకును పాటి కాదొకో?. ౩౬౭

చ॥ శరణము వేఁడువానిఁ దన ♦ చందమునం గయికోనివాఁడు మేల్
మఱచినవాఁడు నిష్కలుష ♦ మానసమందునఁ దత్త్వచింతనం
బరమరలేక చేసి భువ ♦ నాధ్యుఁడు లేఁడను నాస్తికుండుఁ బెం
పఱి మరలంగలేని నిర ♦ యంబునఁ గూలెడు వారు నిచ్చలున్. ౩౬౮

చ॥ పనివడి దేవమానుల కు ♦ పద్రవముల్ పొనరించు రావణున్
జెనకి దురంబునందు పది♦శీర్షముల్ దెగవైతునంచు నే

నసుట విదేహకన్య కొఱ♦కా? మునులెల్లరు వేఁడఁ బద్దుగా
ననిన వచస్సు తప్పఁగల♦నా? యని మానులు తప్పనేర్తురే?. ౩౧౯

చ॥ తలఁచిన కార్య మొక్క నుప♦థంబున సంతసగాఁగ సాగనీ
యలవడకుండనీ కృపగ♦లట్టి జనాళికి మేల్మి గూర్పఁగాఁ
గలిగిన కార్య మింతకును♦కల్గునె? కావుమయంచు వేఁడు స
ల్పులకయి జీవము ల్విడుచు♦పుణ్యులు ధారణి నెంద ఱుందురో? ౩౨౦

ఉ॥ కావునఁ గావుమా యని యొ♦కం డభయమ్మును కోరినప్పుడే
త్రోవక కాచుటే తగవు♦త్రోవ సమంచితు లీరు నాయెడఁ
వావిరి ప్రేమచే నిటులు♦పల్కితి రైనను తప్పులేదు సు
గ్రీవ! బిరాన నీవ చని♦ప్రీతిని తేవలయుఁ విభీషణుఁ. ౩౨౧

తే॥ శంక సుంతయు లేక ప్ర♦సన్నమైన, మనసుతో రాముఁ డిట్లు ప♦ల్కినఁ గపీంద్రుఁ
డెడఁద తేటదనంబుతో♦నేగి నతనిఁ, బిలుచుకొని వత్తునని మోద♦కలితుఁడగుచు.

ఉ॥ వచ్చి కపీంద్రుఁ గన్గొని య♦పార కృపారసధాముఁడైన యు
ద్యచ్చరితుండు రాముఁడు స♦మంచిత రీతిని నిన్నుతోడి తే
నిచ్చెను రాజు నంపె నని♦యెఁ ద్విపిదుండు విభీషణుఁడు దా
హెచ్చు ముదఁబుతోడ నదు♦రేగె వికస్వర మానసంబుతో. ౩౨౩

చ॥ చిరముగఁ జేరియున్న మదిఁ♦జేరరు శుద్ధగుణంబులేని వా
రరుదుగఁ జేరినంతఁ గలి♦యం గల వారలు శుద్ధ మానసుల్
త్వరగ మనంబు లొండయినఁ♦దార్కొన నిర్వురు రేయియుం బవల్
దరికొని చేరుసట్లు నము♦దారతఁ జేరిరి కౌఁగిలింతలఁ. ౩౨౪

ఆ॥ తరణి వంశజులకుఁ♦దగినపద్ధతిని ము, దాన నీకు నభయ♦దాన మొసఁగు
రామవిభుని పాద♦రాజీవముల నాశ్ర, యింప వెడలుమనియె♦విన సుతుండు. ౩౨౫

ఆ॥ ఎడఁదవలెనె యొడలు♦కడుఁజల్లనయ్యె దా, నికిని మించి గగురు♦నెఱసెఁ గనుల
నంత కెక్కుడయ్యె♦నానంద బాష్పముల్, ప్లవగనాథు పలుకు♦చెవులఁబడఁగ.

శా॥ పారాణిం దలపంగనే యెఱుపులౌ♦పాదంబులం గల్గు సీ
తారామం బెడఁబాపు పాపమతికిం♦దమ్ముండనౌ నన్ను నిం
పారం జేరఁగఁ బిల్చెనే? యభయ మే♦పారం బ్రసాదించెనే
శ్రీరాముండు? కృతార్థుఁడైతి హరుఁడ♦ర్ధిఁ బ్రమింగు శ్రేయశ్శ్రియఁ.

ఉ॥ రాముని మానసంబునఁ ది♦రంపుఁ దలంపిది యయ్యెనేని త
త్ప్రేమము నిట్టిదైన నవి♦వేకి దశాస్యుఁడు నా హితోక్తులఁ
దామసవృత్తిమైఁ గొనక♦తక్కి చెడఁ జెడితిఁ మహోద్ధతిం
దామరసాప్తుఁడింకఁ బ్రమ♦దంబున లంకపయిం జరింపఁడే? ౩౨౬

తే॥ త్రోవరాని కీడులు సేయ♦దొడ్డవారు, నైజమగు కృపాళుతను మా♦నంగఁగలరె?
మందరము నాటి మిడుఁగుఱుల్♦చిందునట్లు, చిలికినను సురలకు నీదె♦జలధి సుధను.

చ॥ ముని హితుఁడైన రాఘవుఁడు ♦ మోదముతో నను సమ్మతించి చే
కొని యిఁక నెప్పుడుం జెడని ♦ కూరిమి నాకభయం బొసంగె నే
మనఁగలవాఁడ? గీడు లం ♦ యంబును మాయలతోడఁ జేయు నీ
దనుజభవంబు వీడితిని ♦ తప్పెను నారకముం దరించితిన్. ౩౨౦

చ॥ అనవుడు సూర్యపుత్రుఁడను ♦ నయ్యా! రఘుప్రభుఁ డొడ్డయందు స
ద్గుణములు దుర్గుణంబులును ♦ కోరికి నారయు వాఁడయయ్యు న
ర్థిని తనప్రాణముంబలె మ ♦ తించు దయాళువు నిన్ను కాంచు నా
స నెదురు చూచువాఁడగు వె ♦ సం బదమా యని వెంబడింపఁగన్.

తే॥ వడికిఁ దరువులు గిరులును♦వడఁకునొంక, నీలగిరియు మేరువు వచ్చు♦నెతి గహింప
వినుత పూర్వపుణ్యులు కపి♦దనుజ విభులు, చెలఁగి సాలభంజను కడఁ♦జేరినారు.

—: శ్రీరాముఁడు విభీషణున కభయ మొసఁగుట :—

సీ॥ ఇల నాకసంబున♦కెగుర వైవఁగఁ జాలు, బలయుతులగు కపి♦వరులు గొలువ
పొడవైన విల్లు చేఁ♦బూని మేరువుక్రియు, వహియించి సౌమిత్రి♦ప్రక్క నిలువఁ
బాలకడలి చుట్టి♦పరవ వికచ పద్మ, యుత నీలవార్ధి నా♦నొప్పు వానిఁ
జతురబ్ధి వేష్టిత♦సర్వసర్వంసహా, నాయకుఁడగు నర♦నాథ సుతుని

తే॥ వేలుపుల వేఁడికోలునఁ♦బాలవెల్లి, పాఁపపానుపు వీడి యీ♦వ్వసుధ కేగు
దెంచు శ్రీశ్వరుఁబోలెఁ దో♦తెంచువాని, విశ్వ మోహనాకారుఁడై♦వెలయువాని.

సీ॥ భ్రూంతక్రియ వంపు♦పొలుపారు వీచికా, తతుల పరంపరల్♦తాఁకుచుండ
ధరియింపఁదగిన ము♦త్యాలకై వడి డాలు, నవరించు సైకత♦స్థలమునందు
ధవళిమమై యున్న♦తలమును తనమేని, కాంతులు నీలిమ♦గాఁగఁజేయ
నర్ధేందుఫాల సీ♦తాంగన కనుపాప, నలె నొప్పిదంబుగ♦వెలయువాని

తే॥ రతనపున్విల్లులేని నీ♦రదముభాతి, రత్నహారముల్లేని యు♦రంబువాని
నరయఁ దరిత్రాడు లేని మం♦దరముకరణి, బాహుపురిలేని భుజములఁ♦బరఁగువాని.

తే॥ అమృతవృష్టి మానుచుఁ గరు♦ణామృతంబు, గురియు నిందు చందపు మోము♦
పరఁగువానిఁ
దండ్రి యిచ్చిన మకుటంబు♦తమ్ముఁ డొందఁ, దల్లి యిచ్చిన జడలతోఁ♦దనరువాని.

తే॥ఎలమి దర్శించి యొడలెల్లఁ♦బులకరింపఁ, గనుల నీరుకాఱఁగ మది♦కరఁగ నిలిచి
కాంత మినుమును లాగిన♦కరణి నామ, నంబు నీడ్చు నీతఁడు లోక♦నాథుఁడనుచు.

సీ॥ ఎట్టిని కనులతో♦ నెలరారి కనువారి, యాత్మల లాగు నీ♦లాద్రి యేమొ?
రక్తాంబుజంబులు♦ రాణఁ బుష్పించి క్రొ, మ్మించుఁ బూసిన కాల♦మేఘమేమొ?
తనియఁగఁ గరుణామృ♦తంబు వర్షించుచుఁ, బొలుపుమీఱిన ధర్మ♦మూర్తియేమొ?
యననొప్పు శ్రీరాముఁ♦ గనులారఁ గంటిధ, న్యతఁగంటిఁ గలుచు మా♦యంగఁ గంటి

తే॥ మిడుఁగుఱుం బుర్వు పగిదిని♦ మెఱయు భవప, రంపరల నీఁగఁగాఁ బద్మ♦రాగమకుట
మును విసర్జించి పాదుక♦ల్గొని నయితనిఁ, గొలువఁ బంపు నన్న యుఁ జాల♦ కూర్మి కాఁడె.

తే॥ తాపసులకును నీఁగఁగాఁ♦ దరము కాని, భవరుజం బాపు మందునాఁ♦ బరిఢవిల్లు
రాఘవుఁడు తానె వాఁడినా♦ రాచములను, పరపి చంపరక్కసు లెంత♦ భాగ్యయుతులొ?

చ॥ రతనపు బొమ్మకంబు పయి♦ రాజిలు చేతులతోఁ దరుల్ శిలల్
మెతుకనయై కరంగ మితి♦ మీఱిన భక్తిని తన్ను రాఘవుం
డితవుగఁ జూడ నొగ్గుచు మ♦హీస్థలిఁ జాఁగుచుఁ జేరి మ్రొక్క వాం
ఛిత మణు లిచ్చు వార్ధిక్రియఁ♦ జెన్నరు తత్పదకంజ సన్నిధిన్. ౩౮౯

చ॥ తొలఁగెను జన్మబాధలని♦ తోఁచు మొగం బెలరార నుబ్బుచున్
వెలువడ మోడ్చి బాష్పములు♦ పృథ్విని వత్తిముసోక మ్రొక్కఁ జి
ప్పిలు కరుణన్ విభీషణుని♦ శీర్షము దాఁకుచు రాఘవుండు పెం
పొలయఁగఁ గూరుచుండుమని♦ యొప్పుగఁ దావును కేలఁ జూపుచున్.

మ॥ భువనంబుల్ రవిచంద్ర తారలు మహా♦భూతంబులున్ భవ్య రా
ఘవ నామం బది యెంత దాఁక నిలుచున్♦ స్కన్నంబు గాకుండ సం
స్తవలీలన్ భరియింపు మంతదనుకన్♦ దైతేయ రాజ్యంబు నం
చు వచించెన్ గరుణాళుఁడై త్రిదశులున్♦ సూరుల్ ప్రశంసింపఁగన్.

మ॥ అకలంకాత్మకుఁడైన రామ కరుణా♦వ్యాపారముం గాంచియో
ప్రకటాత్ముండగు నవ్విభీషణుని ధ♦ర్మప్రోన్నతిం గాంచియో
యొకటన్ రెంటిని గాంచియో జగతి భూ♦తౌఘంబు సంతోష తా
రకమయ్యెన్ రఘురామ భూవరుని వా♦ర్తల్ విన్న యప్పట్టునన్.

ఉ॥ దాసుఁడు ధన్యుఁడయ్యె నని♦ దండము వెట్టిన యవ్విభీషణున్
డాసిన లక్ష్మణుం గని క♦డంకను నిద్దుర మాను తండ్రి! సం
త్రాసము పాసినట్టి మన♦ తమ్మునకున్ మకుటాభిషేకముం
జేసి ప్రమోదమానసుఁగఁ♦ జేయుమ యంచు ననుజ్ఞ యీయఁగన్.

చ॥ అదను నెఱింగి కార్యఫల♦ మారయునట్టి విభీషణుండు స
మ్మదమున రాముఁ గాంచి జన♦మాన్య! తెఱుంగని శ్రేష్ఠసంపదల్
ముదమున నిత్తువే నసుర♦ ముఖ్యభవంబు తగుల్ తొలంగఁగా
నొదవుచుఁ గైకపుత్త్రునకు♦ నున్నతి నిచ్చు కిరీట మీయవే! ౩౯౪

సీ॥ అనుడు శ్రీరాముఁ డి♦ట్లను విభీషణ! మున్ను, వరసోదరులము న♦ల్వురమె యుంటి
మావల గుహునితో♦నేవురమైతిమి, పదపడి వానర♦ప్రభునితోడ
నార్వురమైతి మీ♦యదనున నీతోడ, నేడ్వురమైతిమి♦ యింపుమీఱ
సీతండ్రి దశరథ♦నేత కాంతారంబు, నాకిచ్చి సుతులచే♦నలువునొంది

తే॥ వెలసె నని పల్క విన్న వి♦భీషణుండు, నన్ను మీసోదరులలోన♦నెన్ను కతన
బానిసలయందు మేటినై♦పరఁగినాఁడ, ధన్యుడైతిని భయములు♦శూన్యమయ్యె.

మ॥ అని సందేహము వీడి రామపద చి ♦ హ్నంబై లసద్రత్నశో
భనమై యొప్పిన హేమశీర్షకము నొ ♦ ప్పందాల్చి భానూదయం
బునఁ బూర్వాద్రి యెలర్చు లీల వెలసెన్ ♦ బుణ్యుండు సౌమిత్రి త
క్కిన కీశాదులు మోదమందిరి దివిన్ ♦ గీర్వాణు లగ్గింపఁగన్. ౩౯౬

క॥ విరిసోనలు వర్షించెను, శరధులు ఘోషించె మేఘ♦సముదయ ముఱిమెన్
సుర దుందుభి శంఖాదులు, మొరసెఁ బసిఁడి కురిసె గంధ♦పొడియును రాలెన్.

చ॥ అమృతము లొల్కు పల్కు లల ♦ రారెడి జానకిపట్ల ధర్మమున్
సమయుటచేఁ గృశించిన ప్ర ♦ శస్తగుణంబును నేఁడు గౌరవం
బమరఁగఁ గాంచె నంచు విధి ♦ హర్షమునొందె దశాస్యు దుష్ట కా
ర్యములును సంపదల్ పొలిసె♦నంచు నెలర్చెను ధర్మదైవమున్. ౩౯౮

తే॥ శత్రురాజ్యసంపద విభీ♦షణుని పొందు, టింబుగా నెల్ల రెఱుఁగఁ బా♦ళెంబునందు
మెఱవడిం జేయుఁ డీవును♦మిహిరసూనుఁ, డనుచు రాముఁ డాజ్ఞాపింప♦నాక్షణమున.

క॥ గుణనిధి విభీషణుని ల, క్ష్మణుఁడు రవిసుతుండు పెను వి♦మానంబునఁ బే
రణితో ముదమున వానర, గణములు మోవఁగ మెఱవణి♦గావించి రొగిన్.

ఉ॥ ఏ జగదీశు పాద రజ ♦ మెల్ల ముముక్షులు పొందఁగోరు వా
రా జనవంద్యు పాదముల ♦ నారసి బ్రహ్మ యజింపఁ బుట్టు గం
గా జలమందు మున్గ నర ♦ కంబును పొందరు తత్పదంబులే
రాజిలఁ దాల్చు వారెనయు ♦ ప్రాజ్యపదంబు వచింప శక్యమే? ౪౦౧

తే॥ సురలు మానులు దానులు♦సోమయాజు, లాత్మవిజ్ఞులు దేవర్షు♦లమరవరులు
తక్కుపెద్ద లీదైత్యుచం♦దమున మేల్మి, నొందినట్టి వారెవ్వరి♦యుర్విఁగలరు?

చ॥ మెఱవడియైన యప్పిదప ♦ మెల్లన నాతఁడు వచ్చి భక్తిమై
నెఱఁగినఁ గేలనెత్తి వసు ♦ ధేశుఁడు దీవనలిచ్చి నిల్వఁగా
నుఱవగు తావుచూపె నట ♦ నుగ్రకరంబులచేత వారలం
బఱచితి నంచు లాగికొనె ♦ భానుఁడు స్వీయ మయూఖజాలమున్. ౪౦౩

—: లంకా వృత్తాంత పటలము (౨౩) :—

తే॥ సాంధ్యకృత్యముల్ రాముఁడు ♦ సలిపికొనియె
మనసుతపియింపఁబూవిల్లు ♦ మదనుఁడెత్తె
నాకసంబెల్ల నెఱ్ఱన ♦ యయ్యె మఱి జ
గమ్మునం జిమ్మ చీఁకటుల్ ♦ క్రమ్మనయ్యె.

తే॥ దిక్కులఁ డాగియుండిన♦తిమిర సమితి, జలధి జలము భూమిని ముంచు♦చందమునను
పరవె నిండు కొలఁకు పూచు♦పగిది మిన్ను, తేజరిల్లె నక్షత్ర దీ♦ధితుల వలన.

తే॥మహిత వివిధ సుందర వేణి♦మహి తనూజఁ, దలఁచి తపియించు రాముని♦నలఁగఁజేసి
నిసులఁ బూచు మల్లికలు రా♦ణించు వనము, ఋక్షయుతమైన గగనంబు♦రీతినొప్పె.

చ॥ తన మొనలేని నెమ్మొగము ♦ తామర నీటుగఁ జూపి నన్ను చు
ల్కనయొనరించి గెల్చిన యి ♦ లాతనుజాత విభుఁ జయింతు నే
నని పెను కందుతోఁ గినుక ♦ నబ్జుఁడు వెన్నెల కత్తి దూసి చో
ర నికర భీతిదుండయి బి ♦ రానఁ గనంబడెఁ దూర్పుదిక్కునన్. ౪౦౭

తే॥ గోచరముగాక యెచ్చోట♦గూఢరీతి, నున్న స్త్రీచ్ఛాయ యేరీతి♦నున్నఁ జాలుఁ
బట్టెద నటంచుఁ జంద్రుండు♦పరవునట్లు, వెన్నె లనిమొడి పెనువల♦విసరివైచె ౪౦౮

ఉ॥ మేలయి యొప్పు నాయొడలి ♦ మేదురవర్ణము గొంటకాక కీ
శాలిని రేఁచి నన్నును ర ♦ యంబునఁ గట్టఁ దలంచి రాముఁ డీ
లీలను డాసినాఁడని చ ♦ లించి యయుత్సుకతన్ దరంగలన్
గేలఁ దటంబు మోఁదుచును ♦ కేరినరీతి నెలర్చె నబ్ధియున్. ౪౦౯

తే॥ ప్రాఁతదై ఘోష మొనరించు♦వార్ధి ముదిమి, గొన్న మేనెల్లఁ దోలొల్చు♦కొమరు దోఁచు
సికతవేదులఁ బాలు పో♦సిన విధానఁ, బండువెన్నెల లెల్లెడఁ♦బరవఁదొడఁగె.

తే॥ మల్లికా విష దంష్ట్రలు♦మధుప దుర్గ, మెఱ్ఱని కసులు శైల వి♦హార్యతియుఁ గలుగు
మలయ మారుత వ్యాఘ్రంబు♦మలయఁజొచ్చె, బెట్టు ధ్వనితో వియోగ హృ♦ద్భేదకముగ.

తే॥ వాలి యురమును ఖరు తొమ్మ♦ సాలములను, తొలిచినట్టిశ్రీరాముని♦లలితవక్ష
మందు మదను నమ్ములతోడ♦నిందుకిరణ, జాలమను శాతఖడ్గంబు♦జాఱఁదూఱె.

తే॥ ఒడలుచూచుఁబుడమిపట్టి♦యొడఁదఁదలఁచుఁ, గష్టములనెంచి చింతించుఁ♦గడలిఁ జూచు
దొంగయై చెలిఁ గొంపోవు♦ధూర్తులంక,దిక్కు చూచు రాముఁడు వింటి♦దిక్కు చూచు.

ఉ॥ చందము చిందు మేలినగ♦చందము నందము నొందుసీత మై
యందము డెందమందు పెను ♦ పందఁ దలంచి తపించి విభ్రమం

బొందిన రాఘవుండు పౌలు ♦ పుం దలపించెడు మౌక్తికంబులం
జెందిన పద్మరాగమనఁ ♦ జెల్లు ముఖంబును విస్మరించునే? ౪౧౪
తే॥ ఇట్లు పరితపించెడు రాము♦నినసుతుండు, డాసి కర్తవ్యమును తల♦పోసి చేయఁ
దగిన నీవిట్లు చింతింపఁ♦దగునె? హితుని, పిలిచి యోచింపు మన రఘు♦వీరవరుఁడు.
తే॥ అంతఁ గొంత తెప్పిఱి మది♦చింతవీడి, యల విభీషణుఁ దోడి తె♦మ్మనుడు నతఁడు
పిలువ రాక్షసత్వము మాని♦వినుతపథము, నొంది నాతఁడు శ్రీరాము♦నొద్దఁజేరె.
తే॥ వికసితాంబుజాత వనంబు♦విధముదోఁచు, పార్థివేంద్రుండు తన పాద♦పద్మములకు
మ్రొక్కిన విభీషణాఖ్యుఁ గూ♦ర్చుండఁబెట్టి, మృదుల ఫణితి నిట్లసి ప్రేమ♦మీఱఁ బలికె.
తే॥ రావణుని స్వీయబలము దు♦ర్గంపు బలము, నంగబలమును మారుతి♦యచటఁ జూపు
విక్రమంబును నే విన♦విశదరీతిఁ, దెలుపుమా యన నాతండు♦నిలుచునంత. ౪౧౮
తే॥ వలదుకూర్చుండియే తెల్పు♦వచ్చుననఁగ, నమ్రుఁడై యంజలిఘటించి♦నయముమీఱ
నడుగు ప్రశ్నములకు సంశ♦యంబు నీఁగఁ, దగు సమాధాన మిట్లు ప♦ల్కఁగఁదొడంగె.
తే॥ హనుమతండ్రియౌ వాయువు♦కనకశిఖరిఁ, బాఁపఁదేఁడూని యుండ లే♦పంగఁ బ్రతిన
చేసి యల త్రికూట శిఖర♦మీసమీప, జలధిలోఁబడవైచె నా♦స్థలమె లంక. ౪౨౦
తే॥ యోజనంబులు నూఱు లోఁ♦తొలయుచుండు, నేడునూఱులౌ నాకోట♦గోడ వెలుపు
పొడవు గలదు జ్యోతిశ్చక్ర♦మునకు మించి, బలసియుండు లంకను చక్ర♦వాళ మట్లు.
తే॥ ప్రహరిపనితనమును యంత్ర♦పద్ధతియును, బురుజులును తక్కఁగలయవి♦పొగడిచెప్ప
మనసువిసుగొందుఁ బరిఖయే♦వనధియగును, మీరుచూడఁగలరు దాని♦మేల్మినింక.
సీ॥ ఉత్తరద్వారమం ♦ దుండు వీరులు రెండు, కోటులు కాలాంత ♦ కునకు సములు
పడమట వాకిట♦వారి కిమ్మడుఁగగు, వారు మృత్యువుఁ బోలు♦శూరవరులు
దక్షిణద్వారానఁ♦దగఁ బదునాఱు కో, టులు జము పంతంబుఁ♦గలఁచువారు
తూర్పు గవని వారు♦తొమ్మిది యేడు కో, టులు దిక్కరుల నేల♦నలఁచువారు
తే॥ నింగిఁ గన్నులు మూయక♦నిలుచువారు, గండు గలవారు ముప్పది♦రెండుకోట్లు
పగఱు నిర్జరు లెప్పుడో♦వత్తురనుచు, ధరణిపై నుంద్రు లెక్కకు♦దాఁటువారు.
తే॥ ప్రహరిలోపల వెలుపల♦బలసి కాచు, వారు తేఁకువగలవారు♦మారుతంబె
కుదుపుగాఁగల్గి పెను గాలి♦పడగలవలె, విన్నువీథిఁ దిరుగువారు♦వేయికోట్లు. ౪౨౪
తే॥ నగర రక్షణ దుర్గముల్ ♦సొగసుమీఱె, మూఁడు గలవు వానిని గూర్చి♦పొగడనేల?
వానిఁ దొంబది కోటు ల♦వార్యబలులు, చెలఁగి రేయిం బవల్లు ర♦క్షించుచుంద్రు.
తే॥ రాజసమ్మాన మొంద వి♦క్రమమునంది, ధర్మదూరులై శత్రువుల్ ♦తాఁకువేళ
వంచనము లేక సాహాయ్య♦పడెదువారు, పదియు నాఱు నూఱుల కోట్లు♦పరఁగుచుంద్రు
ఆ॥ విసముకాదు ఘోర♦వీక్షణ మనఁదగు, కనులవారు తిరుగు♦పనులవారు
అంతిపురము చుట్టు♦నఱువది నాలుగు, కోటు లసుర వరులు♦క్రూరగుణులు ౪౨౭

ఆ॥ వదరి వదరి మఱియు♦వర్ణింప ఫలమేమి?, యుర్విఁ బంక్తివదనుఁ♦డుంచియున్న
సేన లోకముల న♦శింపఁజేయఁగఁజాలి, వేయి వెల్వలగుచు♦వెలయుచుండు. ౬౨౮

క॥ ఒక్కొమ్మడి లోకమ్ముల, నుక్కునఁ బెకలింపఁజాలు♦నురుబలు లసురుల్
మొక్కలులు మణుల వాకిటఁ, గుక్కలవలెఁ గాచువారు♦కోటుల కోటుల్. ౬౨౯

తే॥ పరఁగుఁ దేరులు పదివేల♦పద్మసంఖ్య, అంతకంటె రెండంతలు♦దంతిబలము
అంతకంటె రెండంతలు♦హరుల బలము, అంతకంటె లొట్టియలు రెం♦డంతలగును.

తే॥ నగరికోట యిట్టిదియు సే♦నాబలంబు, నిట్టి దీశ్వరుచేఁ గ త్తి♦నెసఁగఁ గొన్న
రావణునకుఁ దోడగునట్టి♦రక్కసులును, తపము ఫలముగా వర బలో♦ద్ధతి గలారు.

చ॥ యుగములు చెల్లఁగాఁ జెడక ♦ యుగ్రతపం బొనరించినాఁడు పెక్
జగడము లొండు దక్క మఱి ♦ సత్కృతు లేవియు లేనివాఁడు సే
న గలుగువాఁడు వక్ర రద♦నంబులు గోళ్లును లేకయుండు ను
గ్ర నృహరిఁ బోలు వాఁడొకఁడ ♦ కంపనుఁ డబ్ధిని ద్రావు జాణఁడుర్.

తే॥ మేఘవాహను గెల్చిన♦మేటి యొక్కఁ, డున్నవాఁడు నికుంభుఁడర్♦పిన్నవాఁడు
కోపశీలుండు తొమ్మిది♦కోట్ల మత్త, గజ తురంగ రథాదులు♦గలుగువాఁడు.

తే॥ సిద్ధులను చెఱసాల నుం♦చిన ఘనుండు, కుంభుఁ డనెడి దైత్యుఁడు పది♦కోట్ల బలము
తనరువాఁడు కల్పాంత మా♦ర్తాండుకంటె, వేఁడి గలవాఁడు దుస్సహా♦వీరవరుఁడు.

తే॥ కరి పిశాచ తురగ ఖర♦కాండయుక్త, రథము లొక పదికోట్లు ప♦రంగువాఁడు
తల్లినైన పంచనముచేఁ♦దాఱుమాఱు, పఱుపఁజాలు నేర్పరి మహో♦దరుఁడు గలఁడు

ఉ॥ కొండలనుండు రెండు పది ♦ కోటుల సేనకు నాయకుండు నేఁ
డుండెడు వాఁడు రేపు గలఁ ♦ డోయను నానుడి సార్థకంబుగా
మొందుగఁ గన్నవారలను ♦ మ్రింగుచునుండును యజ్ఞనాశకా
ఖ్యుండు భయంకరుండు బలి♦యుండు సురావలి గెల్చె వేమఱుల్. ౬౩౬

తే॥ నరసురాదుల వెవ్వేఱు♦పఱచి నిలుప, నొక్క దినమునఁ దినఁజాలు♦నుక్కడింద్రు
సాయుధులు రెండుకోట్లతో♦నమరువాఁడు, సూర్యశత్రుఁడు క్రూరదృ♦ష్టులు గలాఁడు.

తే॥ఋషులు సుమనస్కులును త్రిమూ♦ర్తులును చేరి,వలకుఁలం జూచి మాటాడ♦వలసినట్టి
బెట్టిదుఁడు మహాపార్శ్వుడర్♦వికృతకోపి, కలఁడు పదునాఱు కోటుల♦బలమువాఁడు.

తే॥తలకుఁబై ప్రక్కసూర్యుచం♦దంపుమోము, గలుగువాఁడెనిమిదికోట్ల♦బలమువాఁడు
వజ్రదంష్ట్రుండు జమునకుఁ♦బైని జముఁడు, శూలపాణి నసాధ్యుండు♦సుకృతవైరి.

తే॥చంచలతలేనిపదికోట్ల♦సైన్యములకు,దొరయనాహూన్యలుఁడసా♦ధ్యుండుయక్ష
సిద్ధసాధ్యగుహ్యాకులహిం♦సించినాఁడు,మదయుతుఁడుపిశాచాఖ్యుఁడు♦స్మర్తుఁడొకఁడు.

తే॥ చదురుగల చతురంగముల్♦పదియు నాల్గు, కోట్ల సైన్యములకు నాయ♦కుండు కొండ
లదర గర్జించువాఁడు తీ♦వ్రవ్రచారుఁ, డధికకోపి దుర్ముఖుఁడను♦నసురవరుఁడు

తే॥ నాయకుఁడు పదికోట్ల సే♦నలకు ఖడ్గ, యుద్ధమునఁ బ్రసిద్ధుండు వి♦ద్యుద్ద్రుశుండు
మాపె విద్యాధరులకీర్తి♦మహిమ లెల్ల, ఘనబలుండు విరూపాక్షుఁ♦డనెడువాఁడు.

ఆ॥ శవ సమూహముల శ్మ♦శానంబునకుఁ బోవ, నీక పట్టి పండ్ల♦నిఱుకువాఁడు
పద్మసంఖ్య సైన్య♦పతి ధూమ్రవరుఁడు ధూ, మ్రాక్షుఁ డొక్కరుం డ♦హార్యబలుఁడు.

తే॥ మందరముఁ బోలువారు దుర్మానయుతులు, కడలిఁబోలిన సైన్యంబు♦గలుగువారు
వారి పేర్విన్న లోకము♦ల్వడఁకుచుండు, రణశిరుండు వ్యమత్తుఁడ♦రక్కసీంద్రు.

తే॥ ఇట్టి యుద్ధవీరుల లెక్క♦యిడఁగరాదు, వీరికంటె నిమ్మడి సేన♦వెలయువాఁడు
సమరదోహలుఁడు సమస్త♦సైన్యములకు, నధిపుఁడు ప్రహస్తుఁడను నిర్జ♦రాంతకుండు.

తే॥ ఇంద్రుచౌదంతి దిగ్భ్రమ♦మొనసి యేడు, సంద్రముల దాఁటి యవలికిఁ♦జావుపరువు
వెట్ట టక్కున కొకరుగా♦వేలువులును, పరుగులిడ శరవర్షంబు♦గురిసె వాఁడు.

ఉత్సా॥ తఱిమి వెల్లదంతి నాల్గు ♦ దంతములను వేరుతోఁ
బెఱికి వానితోడఁ గొట్టి ♦ వేల్పు లెల్ల దెసలకుఁ
వెఱచి పఱవ నరుణనగము ♦ వెట్టియెత్తి తిరుగు నా
కరణిఁ దిరిగి నతఁడు కుంభ ♦ కర్ణుఁ డధిపు తమ్ముఁడా. ౪౪౭

ఉత్సా॥ చంద్ర రవులఁ జెఱనువైచె ♦ జయము వానిసొమ్ము తా
నిఁద్రుఁబట్టి కట్టువాఁత ♦ లిప్పుడుం గనంబడుఁ
సాంద్రకీర్తి గొన్నవాఁడు ♦ చాల మాయలొప్పు వాఁ
డింద్రజిత్తు రావణునకు ♦ జ్యేష్ఠసుతుఁడు భూవరా! ౪౪౮

,, చెనకి పాడివేల్పు తన్ను ♦ చెఱచునంచు నెంచఁడుఁ
వనజభవుని వలన విల్లు ♦ వరముగాఁగఁ బడసె వే
అనఘుఁ డింద్రుఁ డొకఁడు లేమి ♦ నన్నపేరు దాల్పలే
దనఁగనొప్పు నింద్రజితున ♦ కవరజుఁ డతికాయుఁడా. ౪౪౯

తే॥ ముగురు మూర్తులెదిర్చిన♦మొక్కవోని, యరిది సత్త్వంబుగలుగు దే♦వాంతకుండు
త్రిశిరసుఁడు నరాంతకుఁ డనఁ దిరుగువారు, రావణుని ముద్దు కొమరులు♦రాఘవేంద్ర !

సీ॥ అసురేశునకు సహా♦య బల మిట్టిది వాని, దార్ఢ్య మెఱింగి నం♦దాఁక వినుతు
నజుని పుత్త్రుండగు♦నల పులస్త్యుని పట్టి, సుకృతియౌ విశ్రవ♦సుని సుతుండు
బలు తపంబున బ్రహ్మ♦వలనను హరువల, నను వరాలొంది యు♦న్నతి గడించెఁ
బంచభూతంబులు♦పాంచభౌతికములు, నతని స్వాధీనంబు♦లై యడంగుఁ

తే॥ పార్వతీ పరమేశ్వరుల్♦భక్త పాల, నంబు పొంటె వేంచేయఁగ♦నలువుమీఱు
వెండికొండను పాదుతోఁ♦బెల్లగించి, నింగి దాఁకంగ నెత్తిన♦తుంగబలుఁడు.

తే॥ దిగ్గజంబుల దంతముల్♦దివిరి భుజము, లందు డిగ లెక్కసేయని♦యతిబలుండు
సుర గరుడ యక్ష సాధ్య కిం♦పురుష నాగ, వరులు దెసచెడి పాఱంగఁ♦దఱిమినాఁడు.

తే॥ మణి కిరీట మస్తకములు♦మహిని కూలఁ, గాలకేయుల కులములఁ♦గూలఁజేసె
రావణుని పేరు విన్న మా♦త్రాన నిపుడు, నచటి కాంతల గర్భంబు♦లవియుచుండు.

మ॥ ఘన రాజ్యేందిరయున్ మహానిధులు లం♦కా రాజ్య సర్వస్వమున్
ఘనతం గొల్పడి బెబ్బులిం గనిన జిం♦కంబోలెఁ బొల్లాడి భీ
తిని రాజ్యంబును పుష్పకంబు నెడగా♦దీనత్వముం బొంది యా
ధనదుం డిప్పుడు దాఁగినాఁ డలకలో♦దైత్యాన్వవాయాంతకా! ౪౫౪

ఉ॥ త్రాణచెడంగ వీఁపుపయి ♦ రక్తము లొల్కెడు పుండ్లఁ జూచుచున్
బాణ విఘాత జాత హతిఁ♦బాల్పడి యోర్వక యంతకుండు స్వ
ప్రాణములన్ హరించునని♦హాటి దినంబులు లెక్కగొంచు నీ
ర్వాణ విరోధి నామమె జ♦పంబొనరించుచు నుండు రాఘవా! ౪౫౫

క॥ తరణి వఱకేల చెప్పఁగ, నరుణుని కన్నులును బొచ్చి♦యరయవు లంకన్
వరుణుఁడు పాశముఁ గొల్పడి, శరణముకై వడిగఁ బాఱి♦జడధిం దూఱెన్. ౪౫౬

ఉ॥ కొండలు పిండిసేయు రణ ♦ కోవిద కర్కశ బాహు దండముల్
కొండొకయున్నలంగని య♦కుంఠిత విక్రమశాలి రావణో
ద్దండ పరాక్రమంబు తుది♦దాఁక వచింపఁ దరంబె? నీదు కో
దండవిముక్త బాణ శర♦దంబునఁగాక నశించునే యొటుల్? ౪౫౭

సీ॥ పావనిచేఁ గోట♦వాకిటి తోరణ, స్తంభంబుచే బల♦దర్పులైన
దనుజులు చదిసి చ♦చ్చినవారు సంద్రంపు, టినుకకంటెను లెక్క♦కెచ్చువారు
తదితరుల్ వ్యాఘ్రమంబు♦తఱుమంగఁ బాఱిన, జింకలక్రియఁ జెల్ల♦చెదరినారు
రక్త మేదో మాంస♦రాసులు ప్రేవుల, ప్రోవు లెల్లెడలను♦తావుకొనియె
తే॥ వీఁకతోఁ దాఁకు నక్షుని♦వింటితోడఁ, బట్టి నేలకు రాచిన♦ప్పటి యసహ్య
పలల మస్తిష్క శోణిత♦పంక మింక, నాఱకున్నది వర్ణించి♦తీఱునేమి? ౪౫౮

క॥ అమరుల నగరముతో మా, నము చూఱలు చేసినట్టి♦నాయకులను సై
న్యములను చుట్టంబుల ప్రా, ణములఁ జెఱచె దంతి చెదల♦నలఁచిన భంగిన్.

చ॥ ఎనుబది వేల సైనికుల ♦ హీన బలాఢ్యులు కింకరాధిపుల్
హనుమని తాఁకఁగా మిగుల♦నాఁకలిగొన్న మృగేంద్రుకై వడిన్
గినిసి పరాక్రమించి వడిఁ♦గేలను కాలను వాలుతోడఁ గూ
ల్చెను త్రిపురాసుర ప్రతతి♦లీలను రుద్రుఁడు త్రుంచువైఖరిన్. ౪౬౦

ఆ॥ జంబుమాలి గొప్ప♦సైన్యంబుతో వచ్చి, యుంపవాన గురిసి♦హనుమ భుజము
నొంచ నితఁడు వాని♦యుంచిత ధనువుచే, తనె కృతాంతు వేశ్మ♦మునకు నంపె.

తే॥ కనక దుర్గ వేష్టితము లం♦కాపురంబు, నందు నలఁగి తలలు పోయి♦నట్టివారు
లెక్కలేరు హనుమ గాల్ప♦లేచినట్టి, యగిని రక్తప్రవాహంబు♦నిగురఁజేసె.

తే॥ నాఁడు దాల్చిన విరులుఁ జం♦దనము నగలు, వస్త్రములు మార్చకుండి న♦భంబునంద
యేడు దినములు నిలిచె లం♦కేశ్వరుండు, నగరి కాలిన తెఱఁగును♦పొగడనేల?

తే॥ నగరిఁగూర్చి కోటలఁగూర్చి♦తగినరీతి, వినిచితిని లంక కాలిన♦పిదప జేని
యాజ్ఞచే బ్రహ్మ మునుపటి♦యట్లె సృష్టి, చేసియున్నాఁడు జానకీ♦చిత్త నిలయ!

ఉ॥ ఆలమునం దెదిర్చిన ఖ♦రాదులఁ గూల్చుటచేతఁ గాద య
వ్వాలి నమోఘ బాణహతి♦వ్రాల్చుటచేతను గాద సంగరా
భీలుఁడు వాయుసూతి తొలి♦వేల్పుల మూఁకలఁ గూల్చుటల్ పురిం
దేలిక నగ్ని కాహుతిగ ♦ దీల్చుట నమ్మిక గొల్ప వచ్చితిన్. ౪౬౫

ఉ॥ స్నేహముచే నెలర్చిన వి ♦ శిష్టగుణుండు విభీషణుండు సం
దేహము లేని శేవ నిగ ♦ దించిన పల్కుల నాలకించి వై
దేహిని పాయు హేతువున ♦ దీల్పడి సన్ననమైన బాహువుల్
దేహముతోడ నుబ్బ జగ ♦ తీపతి మారుతిఁ గాంచి యిట్లనున్. ౪౬౬

సీ॥ వీరవరేణ్య! వి♦ద్వేషి సైన్యంబులో, సగముపైఁబడ నీవ♦చంపినైచి
రావణుపురము పూ♦ర్ణంబుగాఁ గాల్చి నీ, ఘనపరాక్రమము నే♦వినుచునిండ
శుకవాణి జానకిఁ♦జూచి తోడ్కొని రాక, మరలుట చూడ నా♦శరబలంబు
తెలిపింపఁగోరి యి♦త్తెఱఁగున వచ్చితి, వని మనంబున నెంచి♦తనిసినాఁడ

తే॥ నీవు చూపిన మగఁటిమి♦నిండియున్న, వైరి నగరాన మఱికొన్ని♦వీరకృత్య
ముల నొనర్తము గాని నీ♦పొగడు నెదుట, భాను నెదుటి దీపమువలెఁ♦బ్రబలఁగలదె?

తే॥ మద్బలంబును రావణు♦మహిత బలము, నీదిగాఁ జేసికొంటివి♦నిపుణచరిత!
వనజభవుపద మీజన్మ♦మునకుఁ బిదపఁ, బడయుమా నీకుఁగాఁగ నే♦ర్పఱచినాఁడ.

చ॥ అని రఘురామమూర్తి పలు ♦ కాడఁగ నంజలిచేసి యంజనా
తనయుఁడు సిగ్గునొంది వసు ♦ ధాస్థలిఁ జూచుచు నూరకుండె నె
మ్మనముల నుబ్బి ముక్తిగొను ♦ మాన్యులభంగిని మోదవార్ధిలో
మునుఁగుచు నోలలాడి రిన ♦ పుత్త్రుఁడుఁ దక్కిన కీశబృందముల్. ౪౬౭

—: ౬. వరుణ ప్రార్థన పటలము :— (౨౫)

సీ॥ ప్రథిత విజ్ఞాన సం♦పన్న! విభీషణ! కడలి కట్టునకు లోఁ♦బడునయేని
మూఁడు లోకములును♦భుజ బలంబున నడ, చుటయు నాశంబు సే♦యుటయునరుదె?
ఉత్సాహవంతమై♦యున్న యీ వానరసేన, జలధి దాఁటుట యెట్లొ♦తెలుపుమనఁగ
మఱువడియున్న నీ♦మహిమంబు నెఱుఁగఁడే, శరధి మీకులము సా♦గరుల వలనఁ

తే॥ ద్రవ్వఁబడెఁ గానఁ బ్రేమ వ♦రం బొసంగు, మనము దాఁటంగ మార్గమి♦మ్మని సముద్రు
వేఁడు టుత్తమపద్ధతి♦విమల హృదయ!, యని విభీషణుఁ డాడంగ♦నాత్మ నలరి.

తే॥ లెస్స వచియించి తంచుఁ దా♦లిమిని పొగడి, అర్కసుత విభీషణ పవ♦నాత్మజాదు
లెల్లఁ గ్రేవల రా నాప♦గేశతీర, మునకుఁ జనునంత నినుఁడును♦పొడమెఁ దూర్పు.

తే॥ వేఁడి వెలుఁగుచేఁ జీఁకటుల్♦విరియునంత, షోడశ కలాప్రపూర్ణుఁడౌ♦సుందర శశి
యరయ రాహువు మ్రింగి వె♦ళ్ళఁ జచుచున్న, చందమునఁ దోఁచెఁ గాంతులు ♦
సమసిపోవ

మ॥ యువతీరత్నము సీతఁ దెచ్చుటకునై ♦ యుర్వీశ సింహుండు రా
ఘవ చంద్రుండొక త్రోవ యిమ్మనుచుఁ గాం ♦ క్షన్ వేఁడఁగాఁ గోరి శా
స్త్ర విశిష్టంబగు పద్ధతిం జలుపు ద ♦ ర్భప్రస్తరంబందు వే
డ్క నసించెన్ జపియించె శ్రద్ధ వరుణా ♦ కంబైన సన్మంత్రమున్

ఉ॥ మేనఁ బరాగపుంజ మొలయు ♦ మిక్కిలి యెండ మొగంబుపైఁ బడన్
జానుగఁ గన్ను మోడ్చి యొక ♦ జాము యుగంబుగఁ దోఁప నేఁడు నా
ళ్లూని వసించి తోయములు ♦ నోగిర మంటక వేఁడ నీరధీ
శానుఁడు సంతసింపఁడు ప్ర ♦ సన్నుఁడు గాఁడును పల్కరింపఁడున్. ౪౭౪

మ॥ బలవంతుండయి యీ నదీశ్వరుఁడు నన్ ♦ భంగించుచున్నాఁడు ని
శ్చలితుండై యవుఁ గాదనండు మది నా ♦ సంతాపముం గానఁ డీ
లలి భీష్మించుచు దాఁగినాఁడని కృపా ♦ లంకారుఁ డా రాముఁ డ
గ్గలికన్ జూచెదనంచు వంచె ధనువుల్ ♦ గ్రక్రోధ దుర్వీక్షుఁడై. ౪౭౫

ఉ॥ కోరని వారలైన నొక ♦ కోరిక నొక్కనియొద్దఁ జేరుచున్
గోరికిఁ దెల్పఁగాఁ బిసిని ♦ గొట్టు స్వభావగుణంబు వీఁడు నే?
వారిధిఁ ద్రోవ యిమ్మనినఁ ♦ బల్కఁడు చూడఁడు మేలుమేలు! నా
శూరత వీనికింత రుచి ♦ చూపెదఁగాకని నవ్వెఁ గిన్కమై. ౪౭౬

ఆ॥ దైత్యుఁ డపహరింప♦దారను గోల్పోయి, పరువుచెడిన వింటి♦బరువు మోసె
ననుచు నెంచి చుల్కఁ♦దనము చేసినవాఁడు, గావలయును జడధి♦కరుణమాని

తే॥ తోడుపడికొంటపొగడిత♦తోడఁగొనుట, బలిమికై కొంట యనుమూఁడు♦పద్ధతులె జ
గంబునం గల్గు; వేఁడియు♦గౌరవంబు, పాడిచెడ డాఁగెఁ బలికియు♦ఫలముగలదె?

తే॥ అడవులంజొచ్చి కాయలు♦నాకులుదిని, యొడలు పెంచువాఁడని యెంచు♦జడధి గొప్ప
తనము నల్పమానవుశక్తి♦తగ్గుహెచ్చు, లెఱుఁగుదురు గాక వేలుపు♦లెల్లనింక.

ఉ॥ నింద యటంచు జంకి ఘన ♦ నిష్ఠను వేఁడఁ దిరస్కరించి న
న్నెందును గాక చూచిన న ♦ దీశ్వరు లేద్వరు మండి మాఁడఁగా
డెందమునందు పుట్టిన క ♦ డింది భయంబునఁ బంచభూతముల్
నందడిఁ బ్రాణభిక్ష గొని ♦ సాగఁ జరింతురు గాక వానరుల్. ౪౮౦

ఉ॥ మోక్షము నొందినట్టి ముని ♦ ముఖ్యులె యైనను చూచు వేడ్కతో
నీక్షితిఁ జేరిరేని ధన ♦ హీనత గాంచిన యంత గౌరవ
ప్రేక్షణముల్ వహింపఁ గన ♦ రెవ్వరు; కుట్టకయున్నఁ దేలె? భో
గక్షములెందునే నిపులు ♦ గప్పిన నిప్పును లెక్కగొందురే! ౪౮౧

చ॥ వనచరులెల్లఁ గాల్నడని ♦ వారిధి దాఁటుదు రింక లక్ష్మణా!
ధనువిటు తెమ్ము యంచుఁ గడు ♦ దారుణ కోప పరీతచిత్తుఁడై
కనఁ దన తమ్ముఁడిచ్చినగు ♦ కన్నులతో ఘనచింతతో శరా
సనము నొసంగ రాఘవుఁడు ♦ నవ్విడిగాఁగ గుణంబు నెక్కిడెన్. ౪౮౨

ఆ॥ ధనువు నెక్కువెట్టి♦గొనయమ్ము లాగఁగాఁ, గలిగినట్టి పేరు♦టులివు హారుని
కొమ్మ యొందు ప్రణయ♦కోపంబు నడలించె, జగము లొక్కసారి♦సంచలించె.

ఉ॥ మేలగువానిలో మిగుల ♦ మేలగు తూపులు వర్షధారలం
బోలి యుగాంతకాలమున ♦ భూమి జలంబులఁ ద్రావు భాస్కరుం
బోలి పురారినేత్రమును ♦ పోలి మహాలయ కాల పావకుం
బోలి సముద్రమెల్ల నొక ♦ మూర్తము లోపలఁ గమ్మె దండడిన్.

సీ॥ కులశైలములకంటె♦బలమైన కోదండ, మును మండలాకార♦ముగను వంచి
నిఖిల చరాచర♦నికరంబుఁ బ్రళయ వే, శను కాల్చు నగ్ని కీ♦లలకు మించి
నగములు మత్స్యముల్♦నాగు లింధనముగా, తదితరంబులు చిన్న♦చిదుగులుగను
కడలి నీరము నెయ్యి♦గా రామబాణాగ్ని, గొఱల వారిధి యగ్ని♦కుండమయ్యె

తే॥ నేడు జలధులలోఁ బొగ♦లెగయఁగా న, భంబుఁ గప్పుచుఁ జక్రవా♦ళంబు నవలి
చిమ్మచీఁకటిఁ బోఁగొట్టి♦బమ్మగోళ, మగ్నిగోళమయ్యెఁ బో♦యనఁగఁ జేసె.

క॥ నెఱఁకులు చుఱుక్కుమనఁగాఁ, జొఱమీలును చొక్కి యొఱఁగ♦సురతరువులు చి
చ్చుఱ పిడుగులక్రియఁ బడు తుం, పఱచే మాఁడంగ రామ♦బాణము లడరెన్.

క॥ మిడుఁగుఱులతోడి జ్వాలలు, పొడమఁగ బొగ్గులయి రాలె♦మొగుళుల గముల్
జడధి బడబాగ్నివలెఁగా, వడిఁ గమరె నటించు వేల్పు♦పడఁతుల కురుల్. ౪౮౩

తే॥ లెక్కయిడరాక నెత్తురుల్♦గ్రక్కి తేలె, మకర నికరంబులును పెక్కు♦మడిసి తేలి
కొరలెఁ దిమి తిమింగిల తిమిం♦గిలగిలములు, రామశరములు వారాశిఁ♦ద్రచ్చి కాల్ప

తే॥ బూది యెగయంగ నగ్నులు♦పుట్టి కొండ, లన్నియుం గాల వేలోట్ల♦యంపగములు
చొరఁగ నదులతో బురదతో♦శరధి మాఁడఁ, బాఁపతేని తలలు గాన♦వచ్చెనందు.

తే॥ మాటదప్పిన యొకదొడ్డ♦మనుజకులము, సరణి నిర్మూలమయ్యె మ♦త్స్యముల కులము
స్తంభములతోడ నావలు♦జరగునట్లు, వీఁపుపై బాణములతోడ♦వెలసె మీలు.

తే॥ శ్రేణులై సిత శరములు♦చెలఁగుకతనఁ, గొన్ని యుడుకుచుమాఁడిబొగ్గులయి బూది
యయ్యె నల్లతో బాణాగ్ను♦లలముకతనఁ, గంధి యొప్పె సంధ్యాకాల♦గగనమనఁగ.

తే॥ రామ శితసాయకాగ్నులు♦ ద్రావనీర, మున్నదో లేదో యననొప్పా♦ నుదధి యొక్క
ప్రమిదఁ బోలఁగ నేతిలోఁ♦ గ్రాఁగినట్టి. వానిఁబోలెను జలచర♦ ప్రతతి చూడ.
తే॥ శిత శిలీముఖములు రక్త♦ సిక్తముఖము, లగుచు జలమెల్లఁ ద్రావ ర♦ త్నాళిబయలు
పడఁగ జడనిధియుడుకు చా♦ ర్పంగరాని, మిడుఁగుఱులఁ జెదర్చుచునుండె♦ మితముమీఱి
తే॥ ఎల్లయెడ బయలుగ జల♦ మింకిపోవ, సంబరువున్నైచి దుంపలు♦ శాకములును
నుగులుగఁ జేసి యుంచిన♦ కరణినొప్పెఁ, గ్రొవ్వినట్టి మత్స్యములును♦ కూర్మవితతి.
తే॥ ఉలివుతో వచ్చు బాణమ్ము♦ లొండొకండు, దాఁకి వెదురుటడవిఁబోలె♦ దవము రేఁప
నెల్లజంతువు లుడుకుచుఁ♦ దెల్లుచుండె, నవ్వి క్రక్కిన శోణిత♦ మలలుపాఱె
ఆ॥ కొండగములనుండు♦ కుజములు తుండ్లయి, కడలి జలము పైని♦ బడుచునుండ
మండుచుండెఁ జమురు♦ మఱిమఱి చల్లంగ, నాఱకుండ మండు♦ నంగమునను.
తే॥ రామవిభుఁడు పరపు శర♦ స్తోమ మజుని, యస్త్రమట్లు లమోఘంబు♦ లగుచుమనసు
కంటె వడియయిమిడుఁగుఱుల్ ♦ గలుగఁజేయు, గొప్ప పద్మాకరము క్రియఁ♦ గొఱలె శరధి.
తే॥ ఉత్తములు కోపగించిన♦ నోదవు మేలె, యనుట నిచ్చోట దృష్టాంత♦ మయ్యె వార్ధి
యుప్పుకడలి యనెడిపేరు♦ తప్పి శుద్ధ, జలధియయ్యెను శ్రీరాము♦ చలము కతన.

చ॥ క్రమముగ నండగోళములు ♦ గర్భమునం గొని కాచు విష్ణు నం
శముగు రఘూద్వహుం డసద్భ ♦ శ ప్రదరంబులచేఁ బయోధి తో
యముల నశింపఁజేయు టొక ♦ యబ్రమె? లోకముల౯ జలంబు నీ
రములను వహ్ని మ్రింగునను ♦ ప్రాక్తనవాక్యము నిల్పె గట్టిగ౯. ౪౯౯
చ॥ చిరముగ వార్ధిలోనన వ ♦ సించుచు శ్రీశుని పాదచింత ని
బ్బరముగఁ జేయుచుండు ఋషి ♦ వర్యుల కెగ్గొక యింత లేద; యు
ద్ధురముగ నన్నిదిక్కులను ♦ ధూమ సమూహము పర్వ దట్టమై
తరణి గుఱాలు నల్లనయి ♦ దారి తడంబడ నిల్చె దిగ్భ్రమ౯. ౫౦౦
చ॥ దురమున భీకరుండయిన ♦ తోయజనేత్రుఁడు మా యవస్థ దా
నరసియు లెక్కసేయని య♦ నార్యుని పోలిక నుండెనంచు నం
బరమున సంచరించు జల♦ పక్షులు పెంటులఁ బాసి చింతమైఁ
గరఁగుచు నిప్పుముట్టి యెఱ ♦ కల్ గమరం బడి చచ్చె నంబుధి౯.
ఉ॥ ఓరుపు వీడ హేతువయి♦ యొప్పిన వారిధి నిప్పు నిండఁగాఁ
జేరిచి వేణుకాననము♦ వీఁక వహింప వచింపఁ బోలునే?
తోరఁపు బేర్పులై యడరు ♦ ధూమ సమూహము చుట్టుకొంటచే
నాఱిచెఁ గన్నుదోయి నమ ♦ రావళి మేనులు చెమ్మరింపఁగ౯. ౫౦౧
సీ॥ పూలపైనను పోవఁ♦ జాలని మృదుపద, కంజాత జానకి♦ గతులకోడి
యవమతి నొందిన♦ హంసలెల్లను వహ్ని, నెఱియని త్రోవ గా♦ న్పింపకుంటఁ

బఱవఁ జాలనివయి♦వరుణుని కీర్తి కై, వడి జడధింబడి♦యడఁగి పోయె
మొగుళులు మండెడు ♦ నగముల కై వడి, నింగి నిల్వఁగలేక ♦ క్రుంగిపడియెఁ
తే॥ జచ్చి చచ్చి కూలఁగఁ గొన్ని♦చావకుండుఁ, గొన్ని పులుఁగులు గుడి దిరు♦గుచును పొగలు
గ్రమ్మ గ్రుడ్లు పెట్టిన చోటు♦గానలేక, ముత్తెములఁగాంచి భ్రాంతిచేఁ ♦ బొదుగఁ జేరు.

మ॥ జలజాతేక్షణు రామచంద్రు నరుగా♦సామాన్యగా నెంచియే
చులుకం జూచితి మింతవచ్చె ననుచుః♦శుష్కించుచుం బెక్కు సి
ల్గులకుః లోనయి పండ్లు గుల్ల్చుచును ది♦క్కుల్ దోఁప కల్లాడుచుః
జలశాఖా మృగసంచయం బడలెఁ బ♦శ్చాత్తాపముం బొందుచుః.

ఆ॥ దుష్టకార్యములను♦తూకొని చేయుచు, సంద్రమందు దాఁగి♦సంచరించు
చుండునట్టి వార♦లుగ్ర మాంసాశను, లట్టి యుడికి తెట్టె♦గట్టినారు. ౫౦౫

తే॥ గొప్ప పైఁడి విమానముల్♦కుండ లవిసి, పిదపఁ గరఁగుచుఁ బడినవి♦వేల్పుకోటి
దండిజలము తుంపురులతో♦వందుగట్టి, యెండె నుదు గణ ముడుకుచు♦నిలకురాలె.

తే॥ చేవ గలవి నిప్పులు రేఁచు♦రేవ గలవి, పద్ధతిం జనునవి తప♦స్సిద్ధి గలవి
పెక్కురూపముల్ గొనునవై♦విశిఖ వితతి, కంధి జీవన మానె న♦గస్త్యుఁబోలి.

క॥ వనధిఁ బొడము నగ్గిని దై, త్యుని పురిలోఁ బ్రహరి కరఁగ♦నుప్పరిగలు మం
డినఁ గని పౌరులు పదపడి, హనుమానుఁడు వచ్చెననుచు♦నడలిరి పెలుచః. ౫౦౮

తే॥ ఉదయభానునివలెవెలుఁ♦గొందుచుండు, మలత్రికూటంబుబంగరు♦మాడ్కిఁగరఁగి
శోణితము పడనయ్యెఁగిం♦శుకము కరణిఁ, బొనుఁగువడి ప్రవాళంబులు♦బొగ్గులయ్యె.

తే। కులగిరులవంటివగు కొన్ని♦గొప్పమీలు, నెలవు నెమ్మదిచెడి లోఁతు♦నీటి కేగి
జలముకంటెను వహ్ని యే♦చల్లనైన, దంచు భూమిపైఁబడి తత్త♦ళించుచుండె.

తే॥ కడలి కలగుండు వడ నుద♦కములఁ ద్రావి, మఱియు నీరు లేకుంట చే♦మనుజులెల్ల
దిగ్భ్రమమునొందఁ బాతాళ♦తిమిరచయము, తలఁగనేగె నారాచముల్ ♦తపనుభంగి.

తే॥ అంబుధులలోని యుప్పనీ♦రంబుఁ ద్రావి, చాల దగ మొత్తి శ్రీరామ♦సాయకములు
త్రావ నీరులేమిని యండ♦తతులఁ దొలిచి, కొనుచు వడినేగె నందలి♦వననిధులకు.

ఉ॥ లీల నయోముఖంబులు శి♦లీముఖము ల్గల రామబాణముల్
వాలి సముద్రముః బయలు ♦ వాఱఁగఁ జేయఁగ రత్నసంతతుల్
చీలిన భూమి గర్భమునఁ ♦ జిందెడు రక్తము రీతి వెల్వడెః
మీలును నాగజాలములు ♦ మేచిన ప్రేవుల రేవఁ గన్పడెః. ౫౧౩

తే॥ అంబువులు వట్టిపోవ ర♦త్నాకరములు, భాగ్యశాలి మణులు నించు♦భవనములను
పోలె నారనములు చింద♦ములకుఁ బొడుచు, కొనఁగ నయ్యవి యుబకల♦కొమరు దాల్చె.

తే॥ వేలకొలఁది చీలికలయి♦విద్రుమములు, మౌక్తికంబులు రత్నముల్♦మలసె జగతి
గొప్పవారు కోపించినఁ♦గోపగింపఁ, బడినవారు మేలొందక ♦ చెడుదురేమి?

క॥ సలసలఁ గ్రాఁగిన యాజులు, ములఁ జచ్చిన జీవవితతి♦ముక్తిని పొందెన్
జలజాక్షునిచేఁ జచ్చిన, యలుపులకును ముక్తి దొరకు ♦ టరుదే తలఁపన్?

తే॥ అనల శరములు మిక్కిలి♦యలమికొనఁగ, ధారణీదేవి నీలంపుఁ♦జీర విడిచి
మొగ్గపూల రంగులతోడ♦ నెలమి గులుకు, చీర నడుమునఁ గట్టిన♦చెన్నుదోఁచె

తే॥ విజయ శీలుఁడౌ రాముని♦విశిఖ వహ్ని, త్రావినట్టి కడలి పిడి♦తావు వేఱు
వెదకికొన లేచుక్రియ విజృం♦భించె బడబ, యితర పాండితి మెచ్చు పం♦డితులె యరిది.

తే॥ జగము నడఁగించుకొని యాక♦సంబు గూడ, నలిమి బడబాగ్ని యప్పుడు♦విలయ వేళ
లోకముల నాశమొనరింప♦వీఁక లేచు, పెను మహార్ణవ మట్టులు♦పెటిగి లేచె.

తే॥ ఊర్ధ్వముఖమైప్రఘూర్ణించి♦యుడుకు చూపఁ, గ్రతుభుజులు లేచిసత్యలో♦కంబు దనుక
నెడలుచుండిరి వేఁడిమి♦తోఁడఁకనీక, యింక భూజనములఁ గూర్చి♦యేమిచెప్ప?

తే॥ జగము నిలుగొందునని యెంచఁ♦జాల నిపుడు, వరుణుని చటికిరప్పించు♦వాఁడ ననుచు
నధిక కోప సంయుక్తుఁడై ♦యవని విభుఁడు, చెలసి బ్రహ్మాస్త్రమును కుడి♦చేతఁ గొనియె

క॥ వడఁకిరి వేల్పులు మొగుళులు, పిడుగుల వెడలించెఁ బుడమి♦బీఁటలువాఱెన్
తడఁబడి జీవులు వెలవెల, పడియెన్ నదులెల్ల నింకి♦వండలి గట్టెన్. ౫౨౨

ఆ॥ అండగోళమునకు♦నావలి జలధులే, యుడికెనన్న భూమి♦నున్నవానిఁ
జెప్పనేల? మఱిఁగె♦శివుని జటాగంగ, యజు కమండలు జలఁ♦మల్లనుడికె.

ఆ॥ లోకనాథుఁడైన♦కాకుత్స్థ వర్యుని, యరయలేక నుసలె♦వరుణుఁ డిట్టు
లితనికంటె మూర్ఖు♦లెవరని ప్రాజ్ఞులు, తలఁచి చింతనొంది♦తల్లడిలిరి. ౫౨౪

చ॥ తలఁపునఁ జేసి తొట్టతొలు ♦ తన్ దనుదానె సృజించికొంచు న
వ్వల జగముల్ సృజించి పరి♦పాలనసేయు విభుండు కోప మ
గ్గలముగఁ బూనె నింక బ్రతు♦కం గలవారము? యంచు నెల్ల ప్రా
ణులు తపియింపసాగె వరు♦ణున్ శపియించుచుఁ బ్రాణ భీతిచే. ౫౨౫

—: వరుణుఁడు రాముంజేరి శరణు వేఁడుట :—

మ॥ పొగచేఁ జూడఁగలేని నేత్రములతోఁ ♦ బుంఖానుపుంఖంబులై
తగులం బ్రాకిన మేని బాణములతో♦దైవాఱు జ్వాలాళితో
దిగు లిగ్గాడు మనంబుతో వణఁకుతో♦దీల్పడ్డ కేల్మోడ్పుతోఁ
దగు వేడ్కోలులతో సముద్రపతి సీ♦తానాథుఁ జేరెన్వడిన్. ౫౨౬

తే॥ కడలి కడపలనుంటి లెం♦కనగు నేను, గాన నీపిల్పు విననైతిఁ♦గరుణఁజూడు
మనుచు నిప్పుపై నడతెంచు♦జనుని పగిది, నలపైపై వచ్చె నడచుచు♦జలధిఱేఁడు.

మ॥ సురుఁగన్ మాఁడిన మోముతో వెగపుతో ♦ శోకంబుతో నన్యథా
శరణం నాస్తి యటన్న వాక్యములతో ♦ శంకించుచున్ గ్రుడ్డి వై
ఖరిఁ దొట్రిల్లుచుఁ గ్రుంగు పాదములతోఁ♦గాన్పించు నబ్ధీశుఁ డ
క్కరుణావారిధిఁ గాంచి యిట్లనియె నుత్♦కంపంబు హెచ్చిల్లఁగన్.

సీ॥ లోకేశ నీవె యీ♦జోకఁ గోపించిన, మాకేది శరణ మీ♦లోకమందు
నీకసాధ్యం బేది? నిన్నాదరించు స, త్త్వము మాకుఁ గలదె? నిత్♦యప్రకాశ
నీరధు లీవ య♦గ్నియు నీవ విలయంబు, నీవలననె కదా♦నెగడుచుండు
లోకంబులును నీవ♦లోకాంతరస్థ భూ, తంబులు నీవ త♦త్త్వంబు నీవ

తే॥ జగములను పొడమించి ర♦క్షణము సేసి, యుదరమునఁ బదిలంబుగ♦నుంచుకొందు
నీవు కినిసిన లోకముల్♦నిలువఁగలవె? సర్వలోకాంతరాత్మక♦శరణు శరణు.

తే॥ దిగ్భ్రమకుఁ గారణంబగు♦తిమిరవనముఁ, గిరణ ఖడ్గంబుచేఁ ద్రెంచు♦తరణిలోన
నుండు జ్యోతివి బ్రహ్మాదు♦లొందఁ గలుగు, పొక్కిలి గలట్టి ప్రాక్తన♦పురుష! శరణు.

తే॥ సర్వ భూతాంతరాత్మక♦శరణు శరణు, సకల భూతకారణ భూత♦శరణు శరణు
సాధు జనచయ సంత్రాణ♦శరణు శరణు, సామజేంద్ర సంరక్షణ♦శరణు శరణు.

తే॥ తల్లియును తండ్రియును సమ♦స్తంబు నీవ, మోక్ష నరకము లాద్యంత♦ములును నీవ
యేను దాస దాసుండ ని♦న్నెఱుఁగఁగలనె? నిన్ను నీవ యెఱుఁగకుందు♦నిష్కలంక!

ఉ॥ నేరక పిన్న వార లొక ♦ నేరమి చేసిరయేని పెద్దవా
రోరిచి బుద్ధి చెప్పఁదగు ♦ నో జననాయక! కావుమంచు మే
ల్వాగము సూర్యతేజ నిభ♦మైన దొకండు ధరిత్రినుంచి యా
సారసనేత్రు పాదముల ♦ సన్నిధి వ్రాలె నిలాతలంబునన్. ౫౩౩

తే॥ వ్రాలి మంటలతోడి గా♦త్రంబు చూపి, పిచ్చుకపయి బ్రహ్మాస్త్రంబు♦విడువఁ దగునె?
యనుచు వేఁడ రాముని కోప♦మంతరించె, పొంగు పాలలో నీర్వడు♦పొలుపుదోఁప.

క॥ గోపము వీడితి భయమును, తాపంబును విడుము భక్తి♦తాత్పర్యములం
బ్రాపింప వేఁడ రాకిటు, కోపింపఁగ వచ్చు కతము♦కోరెదఁ దెలియన్.

చ॥ అన వరుణుండు రాముఁగని ♦ యార్య! భవత్సతి శాంతరూప యా
జనకజ చెందినట్టి యగ ♦ చాట్లును నీవును కోరి పిల్చుటల్
మును విననైతి నేడవ స ♦ ముద్రమునం గల మీలు కయ్యముం
బెనుపఁగఁ దీర్ప నేగితి క్షు ♦ మింపుము హేతువు వేఱు లేదిఁకన్. ౫౩౪

తే॥ వరుణుపల్కు చే రాముఁడు♦కరుణ చెంది, యైననగుఁగాక యీయమో♦ఘాస్త్రమునకు
నేది లక్ష్యంబు చూపెదు♦తెలియఁబలుకు, మనిన బ్రతికితి నని యాతఁ♦డనియె నిట్లు.

తే॥ అనఘ! విను మరుకాంతార♦మనెడి దీవి, యందు దైత్యులు పలుకోటు♦లమరినారు
జగములకు నాకుఁ బీడలు♦సలుపుచుండ్రు, వారిపై నీ మహాస్త్రంబు♦వదలు మనఁగ

క॥ పూతుఁడు శాస్త్ర జ్ఞానా, తీతుఁడు రాముండు విడిచెఁ♦దివిరి శరంబుల్
ఘాతుకులను పరిమార్చిచి, సీతాపతి కడకు నదియుఁ♦జేరె క్షణమునన్. ౮౩౯

క॥ పరిశీలన గుణమొప్పఁగ, నెటి దప్పకయుండు జనికి♦నెగడునె కీడుల్ ?
వరుణునిపైఁ బొడమిన కఱ, కరి దుష్టులు రాక్షసులకె♦కష్టము గొలిపెన్. ౮౪౦

తే॥ చాలదూరము పోయి ము♦ష్కరులఁ జంపె, శాంతమూర్తులౌ పెద్దల♦శాపమట్లు
రామచంద్రు నమోఘ శ♦రంబు జగతి, ధర్మమె బలీయమనుట సా♦ర్థకముగాఁగ.

మ॥ జలధీశుం గని రాముఁడిట్టులను ర ♦ క్షన్ వేఁడ మన్నించితిన్
బలుదుష్టుల్ దితిజాళి నాకగడు గూ ♦ ర్పంబూని పాథోధియన్
పలుకాల్వన్ దమ కోటగాఁగొని మహా ♦ మోదంబుతోఁ జేయు తొం
గలి నృత్యంబులు మానునట్టు లోక మా♦ర్గం బీయవే మాకనన్. ౮౪౨

సీ॥ జగముల వ్యాప్తికి ♦ నరుదులు లేనట్లు, లోఁతునకును వెడ ♦ ల్పునకు మేర
లేదు నీరింక నె ♦ న్నోదినంబులు వట్టు, నంతకాలము నిల్వ ♦ నైతిగాదు
బండకై వడి ఘనీ♦భావ మొందుదునన్న, మలఁగి నాలోని ప్రా♦ణులు నశించు
నాపై నిడిన వృక్ష♦నగ శిలాదికములఁ, దొలఁగనీయక తేల్చి♦నిలుపువాఁడ

తే॥ సేతు వొకఁడు నీపేర నా♦శిరముమీఁద, సమర నీసేన నడపింపు♦సమరభీమ !
రామ ! సద్గుణధామ ! దు♦ర్జనవిరామ !. శుభదనామ ! మునిస్తోమ♦సూక్తిసీమ !

సీ॥ అని వరుణుఁడు పల్క♦విని సంతసమునంది, కాకుత్స్థ వర్యుండు♦కడఁకతోడ
నీమహా సత్కార్య♦మే చేయుదము వార్ధి, శ్రేష్ఠత మనచే న♦శించెనేని
తక్కిననాల్గు భూ♦తములును చులుకఁద, నంబు నొందును గాన♦నయముమీఱ
పర్వత ఘనవృక్ష ♦ వారంబులం దెచ్చి, కట్టుఁడు సేతువు ♦ గట్టిగాఁగ

తే॥ ననుచు వానర వరులకు♦నాజ్ఞ యొసఁగి, యిరవునకు నేగ రాముని♦కరుణతోడి
వీడికోలు గైకొని యబ్ధి♦విభుఁడు వోయె, నుత్సహించిరి వనచరు♦లుదధిఁగట్ట.

—: ౭ సేతు బంధన పటలము :— (౭౧)

తే॥ వానరేంద్రుఁడు రాక్షసే♦శ్వరుఁడు జ్ఞాన, సిద్ధులగు కపివరులు యో♦చించి నలుని
పిలిచి సేతుబంధనము గా♦వింపు మిదియ, యిపుడు ముఖ్యకర్తవ్యమం♦చెఱుకపఱుప

క॥ పలుమాటలేల మేసువు, నలునును సమమగు తెఱంగు♦నాజ్ఞంబుగ నీ
జలధిం గట్టెద విరివిగ, శిలలు తరులు గిరులు దేరఁ♦జెప్పుఁడి కపులకున్. ౮౪౬

క॥ అని నలుఁడన నజుపుత్త్రుఁడు, వనధిని పూడ్పంగ రండు♦వనచరులారా !
యని చాటింపఁగ వచ్చిరి, గొనకొని యొండొకరు త్రోసి♦కొని యుత్సుకులై.

తే॥ రామ లక్ష్మణ వానర♦రాక్షసేంద్రు, లరుదుగాఁ జూచుచుండ వ♦నాటు లెల్ల
భుజశిరంబులపై గిరుల్♦మోచి తెచ్చి, రుదధులాఱొక్కటింబూడ్ప♦నొలయుకరణి.

క॥ కొన్ని పెకలించుచుండఁగఁ, గొన్ని ప్లవంగంబు లీడ్చి♦కొనివచ్చెను వే
కొన్ని శిరంబుల మోచెను, గొన్ని కడలి దించెఁ గొన్ని♦కూఁతలు వెట్టెన్ ౫౪౯

క॥ కొన్ని దొరలించెఁ గాళులఁ, గొన్ని కరతలములఁ దెచ్చెఁ♦గుందాడుచు వే
కొన్ని తమ వాలములతోఁ, బన్నుగ నీడ్చికొని వచ్చెఁ♦బటుతరశక్తిన్ ౫౫౦

క॥ అనఘుఁడగు నలుఁడు వడిగాఁ, గొని తెండని త్వరపఱచుచుఁ♦గొండల నొకచేఁ
గొని వరుసలుగాఁ బేర్చుచు, వనధిని కల్లోలపఱచి♦వడఁకం జేసెన్ ౫౫౧

క॥ † కరుణాకరుఁడగు విభుపఱి, శరణార్థుల రహిఁ భరించు♦చందమునఁ గపుల్
తొరతొరఁ దెచ్చిన కొండల, భరియించె నలుండు కార్య♦భరణ నిపుణతన్ ౫౫౨

తే॥ చంద్రముఁడు కాళ్లఁ దడవెడు♦శైలములను, కెల్లగింపఁగ మేఘపం♦క్తియును చెదరె
నందు దిరుగు యక్షిణులును♦యక్షవరులు, పడుచు లేచుచుఁ దడఁబడి♦పరుగులిడిరి.

ఉ॥ పాదగలించి గొప్పగిరి ♦ పంక్తుల వీచుడు నొక్కటొక్కటిన్
మోఁదఁగ నిప్పుకల్ పొడమి ♦ మున్నొకని మాలిక లౌచుఁ బోవఁగా
వేదనచెంది వెండి రఘు ♦ వీరుని భీమ శరాగ్ని వచ్చె నే
మో దరికొంచు నంచు భయ ♦ మొందె సముద్రవిభుండు చూచుచున్.

తే॥ కొండనగలించికొనిగవా♦క్షుండు తెచ్చి, గుభిలుమనవైవ నంబుధిఁ♦గొఱలు మౌక్తి
కములు జలబిందువులతోడ♦గగనవీథిఁ, జేరి నక్షత్ర మండలిఁ♦గేరి వెలిఁగె.

చ॥ కరులు వసింపఁగాఁదగిన ♦ కందర లున్న మహీధరంబులన్
శరధిని వైచుచుండ రభ ♦ సంబున మింటికి లేచు ముత్తెముల్
వరుసలుగాఁగ నేర్పడుచు ♦ వారిద పంక్తికి జల్లియయ్యె న
ప్పురుసు జలేజమిత్రునకు ♦ వైచిన పందిరిఁబోలె నయ్యెడన్. ౫౫౬

తే॥ వెదురుగుములున్న కొండల♦విసరివైవ, నెగయు జలబిందువులఁ దడి♦యెనయువలువ
లంగముల కంటుకొనఁ గాంచి♦యమర వనిత, లెడఁదలందున నాన వ♦హించినారు

తే॥ పెను తరులతోడి కొండలఁ♦బెల్లగించి, జలధి వైవఁగ బిందువుల్♦చాల దవ్వు
పోయి మరలుటచేత వే♦ల్పుల జగమ్ము, వాన కురిసిన చందానఁ♦బరిఢవిల్లె.

తే॥ కడలి మద వారణంబులు♦పడుచునుండ, వాని మొసళులు గాంచి కా♦ల్పట్టిలాగఁ
దొండములనెత్తిగీపెట్టి♦తొల్లి గజవి, భుండు హరిఁగూర్చి మొఱవెట్టు♦పోల్కి నొప్పె.

తే॥ అలరులును తేనెవాఁకలు♦నగురుచంద, నములుతక్కుగందంపుద్ర♦వ్యములుమిస్సు
గప్పుచుం బడి దట్టంబు♦గాఁగఁ బర్వ, శరధి నీచు వాసన వీడి♦పరిమళించె. ౫౬౦

తే॥ ఉత్తములకుఁ బూర్ణ వినాశ♦ముప్పతిలిన, నైజమైన యుదారగు♦ణంబు విడరు
ఫలతరులతోడి శైలముల్♦జలధిఁగూలి, మత్స్యములకుఁ దేనెలుపండ్లు♦మాంస మొసఁగె.

---

† తిరువాణ్ణైయ్ నల్లారి ఱటప్ప నీకే శరణమని వచ్చిన వారిని భరించునట్లు. అని మూలము.

తే॥ క్రమఫలములఁ దినఁ గాంక్ష◆గలిగి నోరు, తెఱచుకొని పేదలట్లు వా◆శ్చరములుండ
బురదలోఁబూఁడుకొనిపోయె◆గిరులు కొన్ని, యాచకులకీక దాఁచులో◆భాలిఁ బోలె.

ఉ॥ గాలిపటంబుకై వడిఁ ద ◆ గం దిరుగాడు ప్లవంగముల్ మహా
శైలములం బెకల్చి రభ ◆ సంబుగ నంబుధివైవ దంతులన్
బోలఁగ నోట వైచుకొను ◆ బుద్ధి భుజంగము లుండి చచ్చె మూ
ర్ఖాలి దొసంగెసంగు తఱి ◆ నైన వివేకము చెందనేర్తురే? ౫౬౩

తే॥ తొండములఁ బెనవైచి దం◆తులును తమ్ము, పట్టవచ్చు నక్రమ్ములఁ◆గిట్టి పొడువఁ
గరులు మకరులు పోరాటఁ◆గలిగినట్టి, విరవ మొప్పారెఁ జెవులు గిం◆గిరులుపోవ.

తే॥ నిప్పు లురలంగఁ దాఁకుచు◆నీరధిఁ బడు, భూమిధర శిఖరము లల్ప◆పుణ్యముగల
జనములం బలె స్వర్లోక◆మునకు నెగసి, నిలువలేక క్రమ్మఱిన వ◆న్నియఁ జెలంగె.

తే॥శరభ సింహ శార్దూలముల్◆శరధిఁ జొచ్చి, మీలచే నోడి గుటుకున◆మ్రింగఁ బడియె
నున్నచోటు వీడిన నెట్టి◆యున్నతులును, బన్న మొందుదు రల్పుల◆వలనఁగూడ

తే॥ బుద్ధి పూర్వకంబుగఁ దోడు◆పొనరకున్న, నుత్తముల సొత్తు బీదల◆కొదవుచుండు
మింటికెగసిన చేఁపలు◆వెంట నెగయు, కొండతెనె ద్రావి కపుల◆కొమరుగొన్వె.

తే॥ మంచునీటిని చిందించు ◆ మలలనుండి, దవమునించు వెదుళ్లు చిం◆దంగఁజేయు
ముత్తెములకు వారిధి ముత్య◆ములు వలమురి, చిందములును ప్రేమంబున◆విందుచేసె.

ఉ॥ అంబరచుంచితంబులగు ◆ నద్రులఁ దెచ్చి కపీంద్ర సంఘముల్
డంబుగవైవ నందలి జ◆డంబులు పొంగి ధరిత్రి ముంపఁగా
నంబుధి పంబు భూస్థలియె ◆ యయ్యె ధరాస్థలి సంద్రమయ్యె లో
కంబున దుర్ఘటం బొకటి ◆ గల్గునె? తారక నామముఁ దెంచినన్. ౫౬౯

తే॥ దట్టముగఁ బడు కొండలం◆దలి మృగేంద్ర, శరభ శార్దూల సంఘము◆ల్దిరుగుకతనఁ
దీరభూమి యధిత్యక◆తీరుదాల్చె, నిఖిలనాథుండు తలఁపఁ గా◆నిదియుఁ గలదె?

తే॥ మేము తిననివే యిచ్చట◆మిగులఁగలుగు, నంచుఁ దిండి మానినవి మృ◆గాదులెల్ల
మెకములంటని నీర్వామి◆మీలచేతఁ, దినఁగఁ బడనివి లేవు ధా◆త్రీస్థలమున.

తే॥ క్రూరమృగములైనను పెంచు◆వారియెడలఁ, దాలు ప్రేమను వీడంగఁ◆జాలఁగలవె?
తమ్ముసాకు కొండలవీడి◆తరలమన్న, చందమునఁ బడె మెకములు◆జలధియందు.

తే॥ తపము సుకరముగాఁ జల్పఁ◆దావలములు, ఫలదములు చల్లనివి యైన◆పర్వతముల
విడువలేక తోడనె పడఁ◆దొడఁగినారు, బంధములఁ ద్రెంచినట్టి తా◆పసులుకూడ.

తే॥ పడెడు కొండలయందున్న◆పలలభుజులు, తలలఁ గేలుంచుకొనిచింత◆యలమికొనఁగ
లంక కేగిరి కాఁణాచి◆లంకె వీడి, జన్మభూమి యేరికిని దు◆స్త్యజము కాదె? ౫౭౪

తే॥ మునిఁగినట్టి మలలమీఁద◆మునుఁగకుండు, శిఖరములఁ జేరి యుండిన◆సింహ శరభ
వితతి గొప్ప సేతువునకు◆వింతయైన, మాలిక లమర్చు తీరున◆మలయుచుండె. ౫౭౫

ఆ॥ వైచు పర్వతములు♦వనధిని మునిఁగెను, చాలవనుచు మరల♦శైలములను
శ్రమము లెక్కయిడక♦చని తెచ్చియిచ్చుచు, నుండినారు కొంద♦ఱుత్సుకతను.

ఆ॥ భూమిదేవి వీఁపు♦పెద్ద రంధ్రము పడఁ, బెల్లగించి తెచ్చు♦పృథ్వీధరము
లందునుండి జాఱు♦నహులు వ్రేలె ధరిత్రి, వ్రేవులవలె గిరుల♦వ్రేళ్లవలెను. ౪౭౭

తే॥ పద్మరాగమయాద్రుల♦ప్రక్క నీల, రత్నమయమహీధ్రములు పే♦ర్పంగఁ బడఁగ
నెనఁగె రిక్తకంఠుఁడు సము♦ద్రేశ్వరునకు, రఘువరుండిచ్చు రత్నహా♦రం బనంగ.

తే॥ స్థిరనివాసంబు నాత్మకుఁ♦దెలియవెదకు, యోగులంబలెఁ దోయధ♦నురలినట్టి
కొండచిలువలువడిఁ బాఱి♦గుహలఁ జేరె,నడఁగునేయెన్నఁడునుకాఁణ♦యాచిమరులు.

తే॥ సేతు మహిమకు నొప్పగాఁ♦జెప్పఁదగిన, వేఱు కారణమొండు భా♦వించు టేల?
రామ దూతవైచిన గిరి♦వ్రజమువలన, స్వర్గముంజేరె మీలును♦జల కణములు.

తే॥ నీలుఁడేపున వైచిన♦నీలనగము, జలధి యడుగు వఱకుఁదాఁకి♦ జలము పొరలి
నేలముంప జీవులు పాఱు♦లీల గొప్ప, కలకలంబును పుట్టించె♦గాటముగను. ౪౮౧

క॥ మైందుఁడు వైచిన గిరిచే, సందరము జలంబు లాక♦సం బొరసి పడన్
దొందరపడి దిగ్గజములు, మందరగతిఁ దిరిగెఁ జెదరి♦మల్లటపడుచున్. ౪౮౨

క॥ పూనిక లక్ష్మణుని శరము, లైనను తొలగింపరాని♦యద్రిని బలభి
త్సూనుని కొమరుఁడు తెచ్చి య, నూనగతిన్ వైచె మఱియు♦నుదధి గలంగన్.

క॥ హనుమని భుజమును పోలిన, ఘనగిరి భల్లూకరాజు♦కడిమిం బెకలిం
చెను వనధివైచెఁ దుంపురు, లనువొందఁగ నెగసి పడఁగ♦నమరుల తలలన్. ౪౮౪

క॥ శైలము కుముదుఁడు వైవఁ గు, శీలవు లాస్యమున కనువు♦చెడక ధ్వనించెన్
దమనగరఁ దుంపురులు వడ, నమరుల కమృతాశ క్రొత్త♦దై యుదయించెన్.

తే॥ పనసుఁ డేపున వైచిన♦పర్వతములు, పిడుగులంబలెఁ బడుచుండ♦వెగడు కుడిచి
యోర్వలేక స్వజీవిత♦ముజ్జగింప, నిరశనవ్రతముం బూనె♦నురగవిభుఁడు. ౪౮౬

తే॥ లెక్కలేని భల్లూకము♦లొక్క మొగిని, పెక్కుమలలను వైవ నొం♦డొక్కదానిఁ
దాఁకి పుణ్యహీనునిప్రయ♦త్నంబు పోల్కిఁ, గకవికలుగాఁగఁ బడిపోయెఁ♦గడలియందు

తే॥ బహుళ యోజన విస్తృతి♦పరవియున్న, యొక తిమింగిల పృష్ఠంబు♦వికలముగను
కొండ యొక్కండు పడ నది♦క్రుంగి యవలి, కేగఁ గొండయు జడధియు♦నిమ్ముదప్పె.

తే॥ నేర్పుతోడ నలుఁడు శిలా♦నిచయములను, పొందికగ నిడి విఱిచి చే♦ర్పుగను చేసి
మలలఁ బేర్చి యిసుక చల్లి♦తలలుగాన, రాక కేలఁ దడవి యెత్త♦రంబు నదుము.

తే॥ వానరులు తెచ్చు భూధర♦పంక్తులెల్ల, నినుప కంబంబులం బోలి♦యొనఁగు కేలఁ
గొనెడు నంతలోఁ దునుకలై♦కుఱుచలగుచు, నలరు నట్లుగఁ గాళ్లతో♦నలఁచి యడఁచు

తే॥ లీల శైలముల్ మోచు వ♦లీముఖములు, పోవఁ జోటు లేకుండ స♦ముద్రమందె
గాక తలలమీఁదనె యొక♦గట్టి సేతు, వొనరి యున్న చందంబున♦నొప్పమీఱె.

తే॥ పెద్దకొండలఁ దాల్చిన♦పెక్కుకపులు, వరుసనై నిల్వఁ దక్కిన♦వారు పోవఁ
ద్రోవలేమిఁగొండలతోడఁ♦దోయధిఁబడి, యీఁది తెచ్చియిచ్చుచునుండి♦ రెసఁగమొనఁగ.

తే॥ పొడవు కొండల మోవంగఁ♦దొడఁగి కాళ్లు, సంచలింప నాఁకలిగొన్న♦శైలచరము
లల్లిమోచు మలల దించి♦యందు గలుగు, మధువు దండిగఁ ద్రావిమై♦మఱచిసొక్కె

తే॥ అన్నిదిక్కులఁ బరవిన♦యగచరాలి, చొచ్చువారు మరలువారు♦వచ్చువారు
నగుచు నెంత దూరము సేతు♦వయ్యెననఁగఁ, గొంద అందురు సగము చే♦కూడె ననుచు

తే॥ ధాత్రిధరముల యందున్న♦ధాతువులును, పేఁటులందున్న పెందేనె♦పెరలుఁ దరుల
మంజరులు తీరమందెల్ల♦మలసియుండఁ, దద్భయంకరాంబుధి మధూ♦దధిని పోలె.

తే॥ కష్టములు రేఁగి మిక్కిలి♦కలఁచుచున్న, నోర్పుమైఁ గుటుంబము గాచు♦నుత్తమువలె
గొప్ప భూమీధరములు పె♦క్కులుగ లంపఁ, గలఁగఁడయ్యెను సుంతైన♦జలధి ఱేఁడు.

తే॥ పరవియున్న ప్రవాళ వ♦ల్లరులు మునుఁగ, నుదధి వైచిన కొండల♦నుండి చెదరి
దరులఁ బడియున్న పెక్కురత్నాలకాంతు, లింద్రధనువుల కై వడి♦నెసఁగుచుండె.

ఆ॥ వానరం బొకండు♦వటవృక్షమును పెక, లించికొనఁగ నట వ♦సించు పులుఁగు
లాదరువుగ నున్న♦యధిపుఁడు మరణింప, నడలు బంధులట్టు♦లఱచుచుండె. ౫౯౮

తే॥ పాంథవిశ్రాంతి కెడమయి♦పరఁగుచుండు, మావిమ్రాఁకులు వనధిలో♦మఱుఁగువడఁగ
రక్షకులు గతియింప ని♦ర్గతికులయిన, సేవకులక్రియఁ దుమ్మెదల్♦చెదరిపోయె.

క॥ చెల్లాచెదరై తుంపురు, లెల్లెడ వ్యాపించుచుండు♦టీక్షింపఁగ సొం
పిల్లు పయోనిధి పూఁడఁగ, మెల్లఁగ వేఁటెడకు జాఱు♦మీలం బోలెన్. ౬౦౦

క॥ వలపుగొని ముసరుచుండిన, యళిబృందము సంభ్రమున మ♦హాద్రులతో దం
తులు గూల విడిచి మరలెను, వలపెద లేకుండు పణ్య♦వనితలకరణిన్. ౬౦౧

క॥ ధరనూనిన వేళులతో, నురలింపఁగఁ బడి సిలుంగు♦లొందిన వయ్యెన్
వరసతుల క్రియను తీవలు, తరువుల విడకుండి శర ని♦ధానమునఁ బడెన్. ౬౦౨

క॥ జలకణము లెగుర నవ్వలి, జలధియు నుప్పయ్యె నశని♦చల్లనయయ్యెన్
జలదములు గురిసె నుప్పని, జలముల వేవెలుఁగు కూడఁ♦జలి వెలుఁగయ్యెన్.

తే॥ పరిమళించు పర్వతముల♦వలన నెగురు, పసిఁడివంటి తుంపురులు గ♦ప్పఁగ నెలర్చి
వడిగఁ బైకి లేచిన తీఁగ♦పగడములు తు, అంగలించెను మింటి మె♦ఱుంగు లట్లు.

తే॥ పన్నిదంబులు వైచుచుఁ♦బరుగులిడుచుఁ, బ్లవగు లడవులఁ గల పాద♦పముల గిరుల
వెదకి వెదకి తెచ్చి కడలి♦విడుచుకతన, మొక్కలును చూడఁ గనరాక♦పోయె ధరను.

తే॥ నెఱవు కీరితి పఱపు వా♦నరుల పఱపు, గిరుల పఱపును వనముల♦పఱపు డాలు
ధరణిఁ బఱపుటంబోలి చి♦త్తముల పఱపు, విరియ నొక శరధి పఱపు♦ తెఱఁగు దోచె

తే॥ అరయఁ బగళులు మూఁడేగు♦నంతలోఁ ద్రి, కూటముం జేరె సేతువు క్రోఁతు లపుడొ
సర్చు కోలాహలము గగ♦నంబు బ్రద్ద, లుగ నొనర్చె; నియ్యది వేఱు♦గగన మేమొ?

తే॥ వేఱ యుపమ లుత్ప్రేక్షలు♦ వెదక నేల ?, ప్రభుఁడు రాముఁడు సీత యా♦పదలఁ దీర్ప
నాపయిం బదాజ్ఞములుంచి♦నడచుఁగాక, యనుచు శేషుఁడు నిల్చె నా♦నలరెఁగట్ట.

తే॥ సత్యవతియగు లంకయన్ సరసిజాక్షి, దైత్యు లొనరించు చెడుగులు♦తాళలేక
జలజనేత్రుని చేసాఁచి♦పిలుచు కరణిఁ, జెలఁగె రణజయ హేతువు♦ సేతు వపుడు

తే॥ తనదు ప్రియ పుత్త్రి పడు బాము♦లను తలంచి, సైఁపలేక భూదేవి హ♦స్తంబు చాఁచి
సీతయునికి చూపిన దనఁ♦జెన్ను మీఱె, బంధవారిధి వారధి♦పాప రోధి. ౬౧౧

తే॥ కడలిపై సేన రాముండు♦నడపవలసి, యుండ నేను కాకెవరిప్పు♦డోదవు వార
లనుచు విష్ణు పాదోద్భవ♦యవనికి దిగి, నట్టి చెలువున వంతెన♦యమరెఁ జూడ.

తే॥ మలలయందుండు రత్న రా♦సులు జ్వలింప, వానరులు గట్టు జలనిధి♦బంధనమ్ము
వేవెలుం గత్తమిల్లిన♦వేళలందు, మెఱుపుఁదీఁగల కైవడి♦మెఱయుచుండె.

తే॥ కపులు పూర్తిగా వంతెన♦గట్టు పిదప, వనచరేంద్రుండు రాక్షస♦వల్లభుండు
తక్కువార లావిషయంబు♦తనియఁదెలుపఁ, జనిరి కుతుకంబుతో రాము♦సన్నిధికిని.

తే॥ డాసి సేతువు నూఱామ♦డల పొడవును, వెలుపు పదియామడలుగాఁగ♦వెలసెననుచు
శ్రీరఘూత్తము చరణ రా♦జీవములకు, మ్రొక్కి విన్నవించిరి మోద♦పూర్ణులగుచు.

౮. చారశ్రవణ పటలము (౬౬)

ఉ॥ వారధియైన వార్తవిని ♦ వారిద వర్ణుఁడు మేరమీఱు ము
ద్వారిధిఁ దేలి వారల స ♦ పార కృపారస మారఁ గౌఁగిలిం
జేరిచి మేనులం డడవి ♦ సేతువుఁ జూడఁగఁబోదమంచు దు
ర్వార విరోధి రాక్షస వి ♦ రాముఁడు రాముఁడు లేచెఁ గ్రన్ననన్.

క॥ ప్రానెలవు కడలి కెదుటను, సేనావారిధికి దిగిన♦జీమూత మనన్
మానుగ నిలుచుచు సేతువు, జానకిఁ గన్నట్లు గాంచి♦సంతసమందెన్. ౬౧౬

సీ॥ పలు తరఁగలచేతఁ♦గలగుండు పడుచుండు, జలధి నిండంగఁగొం♦డలను పేర్చి
వారధి నిర్మించు♦నేరుపు మెచ్చుయ్యొ, దీని లోఁతెంతయో♦ తెలియవశమె ?
నలువ నిర్మింప నె♦న్నాళ్లకు ముగియునో, యీలంక యేడు సం♦ద్రాల కవల
నున్నను నలుఁడింకఁ♦గొన్ని దినాలలో, నిక్కంబుగాఁ గట్టి♦నిల్పఁగలఁడు

తే॥ అనుచుఁగొనియాడి కారుపు♦నర్మిలి మెయి, నలమి నాఁడువరుణుఁడిచ్చు♦హార మొసఁగి
యింక జయము నిశ్చయమని♦ యెఱుఁగఁబలికి, బయలు దేఱఁగఁ ద్వరపడెఁ♦బరమవిభుఁడు.

ఉ॥ మున్ను విభీషణుండు బహు ♦ మోదముతో నడవంగ జ్ఞాన సం
పన్నుఁడు వాయుసూతి కపి ♦ వర్గము వెన్కలరాఁగ లక్ష్మణుం
డన్నను వెంబడింప మద ♦ హస్తి క్రియన్ రఘురామ భూవరుం
డున్నడ తెంచె వంతెనఁ గ ♦ డుంగడు సంతసమంది చూచుచున్. ౬౧౮

ఉ॥ చారు చిరత్న రత్నములు ♦ చందనముల్ చరణాలఁ గ్రువ్వఁగా
హారి వనంబులెల్ల నల ♦ లట్టులు ప్రక్కల నుల్లసిల్లఁ గా
వేరిని పోలియున్న కడు ♦ విస్తృత సేతువుపైఁ గపీంద్ర సం
చారము రామచంద్రునకు ♦ సమ్మతిఁగూర్చె ననేక భంగులన్. ౬౧౯

తే॥ కొండప్రక్కలఁ గల తిను బండములను, వారుకొని మోచి తెచ్చుట♦వలనజలధి
నడచు కతనను ప్లవగసై♦న్యంబుచూడ, గొప్ప కావేరి వఱదనాఁ♦గొమరుమీఱె.

చ॥ నడవఁగఁ బల్లము ల్వడిన ♦ నాఁడెపు జాడలలోఁ దరంగముల్
నడుమను తూఱుచుండ జత ♦ నంబున సంగర రంగమందు ప
ర్విడు తురగాల నెక్కి చను♦రీతి మనోహర లీలలన్ వడిన్
దడములు పోవసాగెఁ గను♦దమ్ముల విందుగ సందడించుచున్

తే॥ ఇటుల గానున్న చోటుల♦నేగలేక, యోరలం బోయి పడనున్న♦వారిఁబట్టి
చేయి యూఁత యొసఁగి దరిఁ♦జేర్చినారు, కరుణ నిండిన కపివరుల్♦కడఁక చెడక.

క॥ పలువురు ప్లవగులు రాఘవు, తలపై నాతపము వేఁడి♦తగిలెడి నని జొ
బ్బిలు జొంపములగు తరు శా, ఖల గొడుగులక్రియను పట్టి♦కడపిరి త్రోవన్.

క॥ కాకుత్థ్సు మేను వాఁడగ, నీక ననిచియున్న విటప♦నిచయమ్ములతో
జోకగఁ జామరలవలెం, జేకొని వీచిరి చెలఁగి ♦ సేనానాథుల్. ౬౨౪

తే॥ జానకీదేవిఁ జేరంగఁ♦జనుటఁ దలఁచి, యుత్కమైన మనంబుతో♦నుర్విభుఁడు
బలసి వచ్చు సేనలతోడ♦జలధి దాఁటి, యవలి దరిఁజేరె వేల్పులు♦హర్ష మొంద.

చ॥ సురలును మానులుం గడఁక ♦ స్రుక్కక గొప్ప తపంబుచేసి య
త్యురుఫలమొందు హేతువున ♦ నుద్భట వానరసేనతోఁ బ్రియా
వరజునితో నరుంధతియు ♦ భక్తిని మ్రొక్కఁగఁ దగ్గ సీత ము
చ్చిరు నగరంబు పొంత విడి ♦ సెన్ రఘువీరుఁడు వేసువేల్పపై. ౬౨౬

క॥ శ్రీరాముఁడు మనసేనా, వారమ్మున కెల్ల వలయు♦పద్ధతి విడుదుల్
నేరుపుతోఁ దీరుపుఁడని, యారఁగ నీలునకుఁ దెలుప♦నతఁ డగుననుచున్. ౬౨౭

చ॥ నలునకుఁ దెల్పు నాతఁడును ♦ నాల్గుముఖంబులుగా సమర్చి సే
నలకును దండనాథులకు ♦ నాణెము లేర్పడ వేఱు వేఱుగా
నెలవు లమర్చి దైత్యకుల ♦ నేతకు భాస్కర సూతికిం గుఱూ
హలమున రమ్యమైన నిల ♦ యంబులు దా సవరించె నెవ్వడిన్. ౬౨౮

తే॥ రామలక్ష్మణులకు మధ్య♦రమ్యములగు, తాలు మలిచి కట్టలు గట్టి♦పూలతలను
గప్పి దర్భలఁ బఱపి చో♦క్షముగఁ జేసి, యెలమి నిట్లు స్కంధావార♦మెల్లఁ దీర్చి.

తే॥ లోకరక్షకు జానకీ♦లోలు నెల్ల, వారు మననుచే వాక్కుచేఁ♦బ్రస్తుతించి
యెఱిఁగి తమతమ విడుదుల♦కేగినంత, రాముఁడును తనవీడు చే♦రంగ నరిగె.

ఉ॥ వ్యాపన శీలులైన కపి ♦ వర్యులు కొండలు తెచ్చివైవ ని
ర్లోపక యబ్ధి వాఃకణము ♦ లుప్పర వీదికి వచ్చి విద్రుమ
శ్రీ పెనుపారు నంశువుల ♦ చెన్ను తొలంగఁగఁ జేసె నంచుఁ దా
నీపరిఁ దానమాడుటకు ♦ నేగిన కైవడి నేగె భానుఁడున్. ౬౩౧

క॥ దార రహితుఁడై యుండెడు, శ్రీరాఘవు నేయఁగోరి♦చిత్తజుఁ డెక్కుం
గూరిచిన చెఱకు విల్లన, వారుణిఁ గనుపించె లేఁత♦పలివెలుఁగంతన్. ౬౩౨

ఉ॥ నీరజ పుష్పరేణువులు ♦ నిండఁగ నూఱుచు మంచు బిందువుల్
చేరిన మందమారుతము ♦ చేతను రేయను దావవహ్నిచే
మార శిలీముఖంబను స ♦ మాఖ్యవహించు కృతాంతుదూతచే
ఘోరతర ప్రతాపమును ♦ కోరికఁ జూపె విధుండు గొబ్బునన్. ౬౩౩

ఉ॥ కోపము చూపినన్ మిగులు ♦ కోమలికం బెడఁబాయకుండు సు
శ్రీ పెనుపారు మోముగల ♦ సీత యెడంపడ నిద్ర సౌఖ్యమున్
ద్రోపడియున్న రాఘవుని ♦ దోర్బలి వెన్నెలపాటుఁ కేకియుం
బైపడి వీడఁగా వెడలు ♦ పాప భుజంగము లీల నేర్పడెన్. ౬౩౪

తే॥ లంక డాయుటచే రాము♦లలితగాత్ర, మతిశయోత్థిత సంతాప ♦ మధిగమించె
నెట్టనోరు నల్లనికను♦లెనయు నగ్ని, కాల్చె దవ్వులనే డాయఁ♦గాల్పకున్నె?

చ॥ తన చెడువేళ డగ్గఱిన ♦ దానవనాథుఁడు రావణుండు పం
పిన కొటికాండ్రు వానరుల ♦ వేషమునం జనుదెంచి పాళియం
బునఁ దిరుగాడుచుండఁ దన ♦ పూర్వులు చేయు తపఃఫలంబు రేఁ
పిన లలి వచ్చి యుండిన వి ♦ భీషణుఁ డొయ్యనఁ గాంచె వారలన్.

తే॥ వానరులవలె సేనలో♦వఱలుచుండు, వారిఁ గనిపెట్టె నప్పుడే♦ప్రాజ్ఞవరుఁడు
కలశ వారాశిలో నీటి♦కణము పడిన, వేఱుపఱచి త్రోచెడు హంస♦విధముగాఁగ.

తే॥ పరఁగ నణువై మహత్తయి♦పరవి నిండి, విద్యలకుఁ గట్టువడి తిరో♦వృత్తిఁ దనరు
జీవు నీశ్వరుఁ గనుల ద♦ర్శించినట్టి, యోగిరీతి విభీషణుఁ♦డొప్పె నపుడు.

చ॥ కడఁకను డెల్ప వానరులు ♦ కాళులు సేతులు గట్టి వారలం
బిడికిటి పోట్లచే నొడలు ♦ ఛేదిల నెత్తురు గ్రక్క గ్రుద్దుచున్
వడివడి రాఘవేశ్వరుని ♦ వద్దకు నీడిచి తెచ్చి చూపఁగా
నెడఁద దయారసం బతిశ♦యింప నతండును గాంచె వారలన్. ౬౩౫

చ॥ కని పగవారలంచుఁ గినుకన్ వధియింపక నిందమైన చో
ప్పున నగచాట్లు వానరులు ♦ పూన్చిరె యంచు దయాంబురాశియై
కని పగవారలైన నొడికంబు చెడన్ శరణంబు వేఁడ నొ
ప్పని పని సేయఁగా దగునె? బంధములన్ విడిపింపుఁడీ యనన్. ౬౮౦

చ॥ మనమున పూర్దవంబుగల ♦ మాన్యుఁడు రాముఁడు గూఢచారులన్
గనులను నీరు చిప్పిలఁగఁ♦గాంచినఁ జూచి విభీషణుండు శ్రీ
వనజదళాక్ష! రావణుఁడు ♦ పంపఁగ వచ్చినవారు వీరు వీఁ
డనయుఁడు సారణుండగు శు ♦ కాఖ్యుఁడు వీఁడగు నంచుఁబల్కఁగన్.

ఉ॥ వంచకులైన వేగులు కృ ♦ పారసధాముని రాముఁగాంచి యో
యంచితరూప! వానర బ ♦ లాతిశయంబు నెఱింగి గెల్వముం
గాంచుట దుర్ఘటం బనుచు ♦ గారడముల్ పచరించి మమ్ము గం
పించఁగ వచ్చినాఁ డితఁడు♦పెద్దరి నిక్క-ము నమ్ముమీ యనన్. ౬౮౨

ఉ॥ భేదము గూర్తురా యని వి ♦ భీషణుఁ డప్పుడు మోహనప్రతి
చ్ఛేదక మంత్రముల్ బఠన ♦ సేయఁగ గుట్టు బయల్పడెన్ వడిన్
బాదరసంబుసోకి తెలి ♦ పాఱిన పైఁడి పుటంబు వెట్టఁగా
నాదిమ వర్ణముం జెనయు ♦ నట్టులు వారు యథాస్థితిం గొనన్. ౬౮౩

తే॥ భీతిచే వడఁకుచునుండు♦వేగులఁ గని, దీనరక్షకుఁడైన యా♦దిత్యకులుఁడు
మోమునన్ మందహాసంబు♦మొలకలెత్త,నలుకు వలదు వచ్చిన పని♦తెలుపుఁడనఁగ.

తే॥ వారలేమియుఁ దోఁపక♦నోరు మెదుక, శ్రీకరా! లోకమాతయౌ♦సీత తనకు
మృత్యువని యెఱుంగని దాన♦వేశ్వరుండు, పంప వచ్చిన వంచనా♦పరులమయ్య!

తే॥ అనుడు రాముఁడిట్లను మీర♦లలుకు లేక, చూడఁదగు వాని నెల్లను♦చూచియువల
మీ దశాస్యుని కడకేగి♦మేము తెలుపు, పలుకులెల్లను మఱవక♦పలుకవలయు.

సీ॥ మేరలేకుండు లం♦కారాజ్య సంపద, కీ మా విభీషణుఁ♦డీశుఁ డనుఁడు
మకరాలయంబును♦మలలచేఁ బూడ్చి పెం, పెచ్చంగ వనచరుల్♦వచ్చిరనుఁడు
నిన్ను నీవారిని♦నీఱుగాఁ జేయఁ బ్ర, తినగొన్న వీరు లే♦తెంచి రనుఁడు
భోగానుభవమును♦భూరి విక్రమ వైభ, వంబులు పూర్తిగాఁ♦బాసె ననుఁడు

తే॥ ఆలుఁ బిడ్డల బంధుల♦నఁగువారి, నింపు దీఱఁగ నిపుడ వీ♦క్షింపు మనుఁడు
అన్ని యాసలఁ దెగఁగోసి♦యనికి వచ్చి, ప్రాణముల నాశరాళికి♦వదలు మనుఁడు

ఉ॥ గుత్తులుగాఁగ మస్తములు ♦ గూడినరావణ! లంక వార్ధిలో
నొత్తిలి కానరాక పడి ♦ యుండుటచే నుసుఱుల్ భరించి పె
న్మత్తున దారపుత్ర హిత ♦ మంత్రులతో మనఁగల్గి తింక నే
యొత్తులు చెల్లవంచు వచి ♦ యింపుము తప్పక రాక్షసేశుతో. ౬౮౪

క॥ హరిహర హిరణ్యగర్భులు, గరుడోరగ సిద్ధసాధ్య ♦ గంధర్వాదుల్
దురమున నినుగాచిన నీ, శిరములు నాశరము లురలఁ♦జేయు ననుండీ. ౬౮౯

మ॥ తన తండ్రిన్ వధియించు హేతువున ను ♦ ద్యత్క్రోధుఁడై భార్గవుం
డనిలో బంధులతోడ నర్జునుని సం ♦ హారంబు గావించు తీ
రున నీవారల నాజిలోఁ దునిమి నీ ♦ క్రొవ్వారు రక్తానఁ ద
ర్పణముం జేసెదఁ బక్కుతేని కని నో ♦ వ్వం బల్కుఁడీ మీరటన్.

ఉ॥ మాయలమారివై తపసి ♦ మానిని యొంటిగఁ గాన నుండ న
న్యాయము మీఱఁ గొంచుఁ జెఱ ♦ యందు వసింపఁగ వైచు నీచు నిన్
న్యాయముతో సమూలముగ ♦ నాశముచేసి దురాన నారకా
ఖ్యాయతకారయందు తిర ♦ మారఁగ నుంచెదనంచుఁ దెల్పుఁడీ

తే॥ వేరు కోరిక లున్నచోఁ♦గోరికొనుఁడు, ప్రాణభీతి మానుండు మా♦వారలెవరు
మిమ్ము బాధింపకుందురు♦మీరు పోవుఁ, డనఁగ బ్రదికితిమని వార♦లరిగినారు

—: రావణుఁడు రహస్యమందిరము చేరి యాలోచించుట :—

ఆ॥ వరుణుఁ డొందు భయము♦వారధి నిర్మించు, నేర్పు కపులు వచ్చు♦నెఱియువినిన
రావణుండు సగము♦రాతిరివేళ నే, కాంత మందిరంబు♦నందుచేరె. ౬౯౩

ఆ॥ రమ్మనంగఁ దక్కఁ♦దెమ్మెరయును రాని, మంతనంబు సేయు♦మందిరమున
నున్న స్త్రీలు పురుషు♦లొగి నవ్వలికి నేగ, నతఁడు హితులతోడ♦నందు చేరె.

ఆ॥ విజ్ఞ లక్షణంబు♦వెలయనివారు మూ, కులును చెవిటివారు♦గూనివారు
కుబ్జులైన వారు♦గూడి యచ్చట దీప, ములను మోచికొంచు♦నిలిచినారు. ౬౯౫

తే॥ వినత దానవ మస్తక♦విమల మకుట, రత్నదీపిత చరణుండు♦రావణుండు
పగఱు నర వానరులు పురి♦పజగడందు, చేరినారు కార్యంబు చ♦ర్చింపుఁడనుడు.

తే॥ మాల్యవంతుఁ డిట్లను దశ♦మస్తకునకు, రామబాణాగ్నిచే నబ్ధి♦రాయఁ డుడికి
నడిఁకి హార మొక్కండు కా♦నక్కగ నొసంగు, తీరు విన నామనంబు వే♦ధించుచుండె.

తే॥ చీలికలుగాఁగ జలనిధి♦చీల్చఁబడఁగఁ, జూపులంబలెఁ బడు రాము♦తూపులకును
భంగపాటొంది భయమంది♦వనధిరాజు, త్రోవ యిచ్చుట నామదిఁ♦దొలుచుచుండె

తే॥ కానవచ్చిన వెల్లఁ బె♦కల్చి తెచ్చి, సృష్టి మల లింక లేవనఁ♦జేసినట్టి
కపులు భుజ మప్పళించుట♦కడలి నడర, నీక యడఁచుట నామది♦నేఁచుచుండె.

తే॥ వలఁతులైన వనచరేంద్రు♦లలవుమెఱయఁ, దెచ్చి యిచ్చు మలలఁజేతి♦తీఁటవోవ
నొక్క కపి యందుకొని యబ్ధి♦నుంచుచున్నఁ, గడుపు చేవెట్టి కలఁచిన♦కరణియయ్యె

క॥ కాల్చినది చూచి సేతువు, దాల్చినయది చూచి కాన ♦ దానవవరుల్
మాల్చినది చూచి యెదుర, న్నిల్చిన యది చూచి తలఁచు♦నియతియుఁ దగునే ?

తే॥ అనుచుమాతామహుఁడుపల్క♦నసురవిభుఁడు, కనులనిప్పులురలనోడు♦గఱచిచూచి
మేలుమేలు నీయోచన♦ చాలమేలు, తమ్మునితోఁ బొమ్ము నీపంద♦తనము మెఱయ.

ఆ॥ అనుచుఁ బరుషవాక్కు♦లాడ నాతఁడు మూర్ఖు, పట్ల హితము హీన♦పఱచు నిజము
సత్యవాది బహుళ♦జన విరోధియకాదె, యనుచు మౌనమూనె♦నంతమీఁద.

సీ॥ దండనాథుఁడు లేచి♦దర్పంబుతోఁ జూచి, నఱువదేఁడులు దాఁట♦నరులో మరులో
యనుమాట నిజమాయె♦వినుము తాతా! కవు, లగడిత దాఁటిన♦యలవు తక్క
దిక్పాలకులు భీతి♦తిగువ నక్కుచువచ్చి, సేవించుచుంట వీ♦క్షింపవేమొ?
పండ్లిగిలించుచుఁ♦బరువెత్తు కోఁతులు, మలల మోచిన వంచుఁ♦దెలుపుచుంటి

తే॥ గౌరి భయమంది పురవైరిఁ♦గౌఁగిలింప, రణజిహ్మైరావణుండగు♦రావణుండు
వెండిమల జల్లివేళ్లతోఁ♦బెల్లగించి, నింగిదాఁక నెత్తుటయు నె♦ఱుంగవేమొ?

చ॥ జరిగిన వానిఁగూర్చి యెల♦నంబుగఁ జర్చలు సేయనేల? ము
ష్కరులగువారు కొందఱు వి♦శంకట దుర్విధి చంపఁబూని యీ
కరణిని త్రోవ సంగర ము♦ఖంబున జావఁగనెంచి సింహ కం
దరమునఁ జొచ్చు గొఱ్ఱెల వి♦ధంబున వచ్చిరి యంచు నుండఁగన్

తే॥ వేత్రహస్తుఁడౌ కంచుకి♦ వేగవచ్చి, దేవరం జూడ వేగు లే♦తెంచిరనఁగ
లోని కంపుఁడనుచు విభుఁ♦డానతీయఁ, జిత్తమని వాఁడు చారులఁ♦జేరఁదెచ్చె.

తే॥ వానరులఁ దలంచిన యంత♦వడఁకువారు, పలుకు నప్డెల్ల నెత్తురు♦లొలుకువారు
చారు లా దశాస్యుం డున్న♦నరస కరిగి, పాదములకడ సాగిలఁ♦బడుచు లేవ.

తే॥ ప్రాణములఁ గొనఁ బెదవు ల♦ల్లార్చుచుండు, యమునివంటి రావణుఁడు న♦యంబు మెఱయఁ
దనుచరులఁ గూడియున్న సో♦మరుల తెఱఁగు, లెఱుఁగఁ బలుకుఁడియన్న వా♦రిట్టులనిరి

ఉ॥ దాసులమైన మేము వసు♦ధావర సేనను పూర్తిచూచు పే
రాసను వానరాకృతుల♦ నంచితరీతి గ్రహించి పోయియున్
దోసముతో విశాలమగు♦ తోయధి విస్తృతి గాంచ బల్కిమై
నాసలఁజుట్టి వచ్చిన ఖ♦ గాధిపుకైవడి లేము దేవరా! ౬౬౯

ఆ॥ జలధి వేల గానఁ♦జాలనిచింత తో, లంగఁ బర్వతములఁ♦గ్రుంగఁ జేర్చి
నప్పు డార్చి లేచు♦నంబుకణంబులే, వచ్చి తెలుప లేదె? పలుకవలెనె?. ౬౭౦

ఉ॥ కుట్టినఁ దేలు కుట్టమిని♦ కుమ్మరిపుర్వనునట్లు వేఁడినన్
నెట్టన గానరాఁడు నది♦ నేత యటంచుఁ బతంగవంశజుం
డట్టి భుజంబులన్ శరశ♦రాసనముల్ తగఁ గాంచినంతనే
బిట్టుడికెం బయోధి కడు♦ భీతములయ్యె జగంబు లన్నియున్. ౬౭౧

క॥ సీతమ్మఁడు శ్రీరాముని, ప్రీతికిఁ బాత్రమయి పొందెఁ ♦ బేర్మిని లంకా
శ్రీ తరుణిని సూర్యేందులు, భూతంబులు రాముపేరు♦పొలిచెడుదనుకన్. ౬౭౨
క॥ దూతగ వచ్చిన హనుమని, ఖ్యాత బలము తెలిసియున్న♦కతమదియుండన్
సేతువు గట్టిన నేరుపు, సీతతఱి తలపోసి వెఱ వ♦హింపఁగ నేలా ? ౬౭౩
తే॥ వేల్పు లమృత పానము సేయు♦వేళయందు, సూర్యచంద్రులు రాహువుఁజూపినట్లు
నీదు తమ్ముండు వానర♦నికరమునకు, మమ్ము గుర్తించి తెలిపె య♦త్నమ్ముతోడ
తే॥ దేహమెల్లను నలఁచి వే♦ధించికట్టి, యీడ్చికొనిపోయి పగలింటి♦యినునిభంగి
వెలుఁగుచున్నట్టి జానకీ♦విభుని యెదుట, నిలిపినారు వానరవరుల్♦నిర్జరారి! ౬౭౫
ఉ॥ పావనుఁడైన రాముఁడు కృ ♦ పాళుఁడు గావున మమ్ము గాంచి స
ద్భావముతో వదల్చి మఱి ♦ పంపుచుఁ జిర్నగ వంకురింపఁగా
రావణు మున్ను పొందిన వ ♦ రంబులు తోడ్పడవంచు నాజి దై
త్యావళి చావు నిక్కమని ♦ యాడెను దైత్య కులాబ్ధి చంద్రమా ? ౬౭౬
తే॥అనుచు రాముఁడు దెలుపువా♦క్యములు సైన్య,బలము దెల్పిదొసంగులు♦తొలగుఁగాత
మసురవిభుఁడు చిరాయుష్కుఁ♦డగుత మనుచు, విజయ గీతంబు పాడిరి♦విపులభక్తి

—: ౬. లంకాదర్శన పటలము :— (౮౮)

ఉ॥ శాపమువంటి మేటి శర ♦ చాపములన్ ధరియించినట్టి యా
తాపసవేషు లీ జలధి ♦ దాఁటి పురంబునఁ జొచ్చుచుండఁగా
నోపికతోడ వేఱొకటి ♦ యోచనసేయఁగఁ బోలదన్న లం
కాపతిఁ గాంచి సైన్యపతి ♦ క్రమ్మఱ నిట్లను ధీరపద్ధతిన్. ౬౭౮
ఉ॥ సీతను వీడినన్ భయము ♦ చెందెనయంచు విరోధులం దప
ఖ్యాతి ఘటిల్లు సంగరము ♦ గల్గిన వైరము తీఱవచ్చు దు
ర్నీతుఁడు నీదుతమ్ముఁ డొక ♦ రీతిని సంధి పొసంగనీఁడు చు
మ్మీ మతిఱి యిక్కుపాటొదవ ♦ నీయక యోచన సేయఁగాఁ దగున్.
తే॥ మనము దండెత్తవలయు ప్రశ♦మమ్ము లేక, పగఱె యిచటికి వచ్చిర♦వాంఛతోడ
వలసినట్టి శైలము పయి♦వానగురిసె, నింతకును మించి యనుకూల♦మేది మనకు?
ఉ॥ రక్కసి వేయి వెల్లువల ♦ రాణువ ప్రాణముఁ దీయఁబూనుచోఁ
ద్రిక్కక నూఱు మృత్యుమయ ♦ దేవతలైనను వచ్చి కావలెన్
దక్కవయేది నీవిచట దా ♦ రుణభంగిఁ గన ల్వహించినన్
గుక్కలు సింగముం గనిన ♦ కోపునఁ గోఁతులు పాఱకుండునే ? ౬౮౧
ఉ॥ వచ్చిన వానరావళులు ♦ వచ్చిన త్రోవనె పాఱి తోయధిం
జొచ్చి నశింప దైత్యకుల ♦ శూరుల తోడుత నేను పోయి పె

న్మచ్చరమూని సేయు కద ♦ నంబును కాంచెదుగాక యానతిం
బుచ్చుము దేవ! నన్నని చ ♦ మూపతి యుత్సహానోక్తులాడఁగన్.

తే॥ మాటలంగాక పోరునఁ♦బోటుచూపు, టుత్తముల లక్షణంబగు♦నుర్వియందు
కాఁగలది కాకమానదు♦కాదె యనుచు, మాల్యవంతుఁడు వాక్రుచ్చె♦మఱియు నిట్లు.

తే॥ జలధివేష్టిత భూతల♦చక్రవర్తి, దశరథ సుతుండు జానకీ♦ధవుఁడు శింశు
మార చక్రంబుకంటెఁ బై♦నారనుండు, దేవదేవుఁడె యని మహా♦ధీరులంద్రు.

తే॥ అతని తమ్ముఁడు పరతత్త్వ♦మందునుండి, వీడకుండియు వీడిన♦విధము తోఁచి
ప్రాణులం బలుతెఱఁగులఁ♦బరిఢవిల్లు, విష్ణుశయనమే యని తత్త్వ♦విజ్ఞు లంద్రు.

తే॥ కులగిరులలోని సారమొ♦క్కొట గడించి, నలువ యారాముని శరాస♦నంబుచేసె
నల్లెత్రాడు శేషుఁడు నిశి♦తాస్త్రతతులు, కాలచక్రంబు సైతంబు♦గడచునంద్రు.

తే॥ అంగదుసురేశుఁడని నీలు♦నగ్నియంద్రు, వాయువనిరుద్రుఁడనియంద్రు♦వాయుసుతుని
నతఁడుపిమ్మట బ్రహ్మయే♦యగు నటంద్రు, సకలవనచరుల్ దేవతాం♦శములవారు.

చ॥ నలువ పదంబు మారుతికి ♦ నల్వుగ నిచ్చిన రాఘవుండు దై
త్యులఁ దుదిముట్టఁ గూల్చుటకె ♦ యొప్పుగ నివ్విధి వచ్చెనన్న యీ
పలుకులు పల్వురాడుదురు ♦ వారి గుణాదులఁ బట్టియో నిజా
కలనముచేతనో తెలుపఁ ♦ గా ఫలమేమది నీ వెఱుంగవే? ౭౮౮

చ॥ నిజము నెఱింగియో తెలివి ♦ నేర్పుననో మఱి భీతిచేతనో
యజహర పూజ్యమైన యమ్మ ♦ తాగ్రజ పద్మిని లోకమాత భూ
మిజ యని పల్కుచుందు రది ♦ మిథ్యయొ సత్యమొ తెల్పనేల? బే
రజముగ నెల్లిదంబుగ ని ♦ రాకృతి సేయఁగరాదు రావణా!. ౭౮౯

చ॥ అడవుల కేగుదెంచుటయు ♦ నక్కట వేల్పుల ప్రేరణంబుచేఁ
బొడమిన కార్యమంద్రు సుర ♦ ముఖ్యులు వేఁడఁగ మాధవుండు కే
రడమున నీవుపొందిన వ ♦ రంబుల లోటు నెఱింగియే యిటుల్
పుడమి నరాకృతిం బడసి ♦ పొల్చె నటంద్రు మహాత్ములెల్లరున్. ౭౯౦

చ॥ పలుమఱు దుర్నిమిత్తములు ♦ పట్టనమందునఁ దోఁచుచుండె న
య్యిల తనుజాత నారయఁగ ♦ నేడ్తెఱవచ్చిన దూత తాఁక నీ
నెలవున నున్న దేవతయు ♦ నీఁగినదందురు కల్గె యుద్ధముం
బొలుపుగ మేలుగూర్చు పని ♦ ముఖ్యముగాఁ దలపోయు రావణా!

మ॥ భవకోదండ విఖండనంబున స్వస ♦ త్వంబున్ బయల్వొచ్చు రా
ఘవ బాణంబులకుం బలాశనులె ల ♦ క్ష్యంబైన వారంద్రు దా
నవ రాజేంద్ర! విభీషణుండు గురుక ♦ న్నన్మించు విజ్ఞాని గా
రవ మొప్పారఁగ మున్నె తెల్పియె కదా ♦ ప్రాపించె సీతావిభున్.

మ॥ వినుమా యియ్యవి యెల్ల నేఁ దెలియుటన్ ♦ వెండిన్ హృషీకేశుచే
మును నావారలు కూలుటన్ మనుమఁడన్ ♦ ముద్దున్ మనోవేదనం
బును నన్నిమ్మడిఁ గష్టపెట్టఁగ శుభం ♦ బుం గూర్చు పల్కాడెదన్
దనయా! సీతను వీడుమా యనుచు నొం ♦ దన్ మాల్యవంతుండనన్.

చ॥ పకపక నవ్వి రావణుఁడు ♦ బ్రాఁతిగ నీవను పల్కులెన్న! త
క్కు కఱుదులుండనీ నరులు ♦ కోఁతులు పట్టుగ నింతకాల మె
య్యొకటియుఁ జేయలేక వెఱ ♦ పొంది మఱుంగుల డాఁగు దేవ నా
యక మణులంట! నే నపజ ♦ యంబును పొందెదనంట! వింతగున్! ౬౮౪

చ॥ అతగుల మానవేశ్వరుల ♦ నల్పులు కీశులే కాదు తోడుగా
నితర మృగంబులన్నియు న ♦ హీనవిధిం గలియంగనిమ్ము నన్
క్షితిపయిఁగాదు నాగులు వ ♦ సించు భువంబునన్నైనఁ దాఁకనీ
క్షితిజకు నైనచోఁ జుణేఁగి ♦ చెంగుదునే ప్రళయంబు గల్గినన్. ౬౮౫

చ॥ చెడుగులకుం బ్రతిక్రియలు ♦ సేయునవై భువనంబులం గడుం
గడిమిని గెల్చి నిర్జర ని ♦ కాయము వీఁపుల దుస్సినట్టివై
యడరిన మన్మహోగ్ర నిశి ♦ తాస్త్రము లక్కట కోఁతిమూఁకపై
వెడలఁగఁజాలవంచు నొక ♦ వేఱిఁడివైయెనఁ దెగించి పల్కునే? ౬౮౬

ఉ॥ శూలియు నొక్కక్రోఁతియయి ♦ సూటిగ నన్నెదిరించి నిల్చినన్
గేలిగ నెల్లవారు నగఁ ♦ గీడ్పడి పాఱునుగాక గెల్చునే?
మేలగు నా శరావళులు ♦ మ్రింగఁబడంగ జగంబు మ్రింగఁగాఁ
జాలిన వారిధిం బొడము ♦ చండతరంబగు హాలహాలమే?. ౬౮౭

చ॥ బవరమునందు మున్నొడఁగి ♦ పాఱిన చక్రియు వెండివచ్చి యు
క్కివుఁడయి తాఁకినంత నను ♦ గెల్వఁగ నేర్చునె? మద్ధను ర్వ్యము
క్త విశిఖ నంతతుల్ శశి వి ♦ కర్తన బుక్ష గణంబు మాడ్చుచున్
నివుడ భరింపఁగా నుదధి ♦ నీటను పుట్టిన కౌస్తుభంబొకో? ౬౮౮

తే॥ జిష్ణుఁడొక కపి రూపొంది♦చెలఁగె నన్నుఁ, దాను వైచిన వజ్రాయు♦ధంబుచేత
ఱెక్కలూడి లేవక పడి♦నక్కియుండు, కొండ లౌనొకో మద్భుజా♦దండపాళి.

సీ॥ అని దశాననుఁడు గ♦ర్వాంధుఁడై నగుచు వీ, రాలాపములఁ దగ♦నాడుచుండ
మనసులే దూతలై♦మునుపేగు నభిసారి, కల మనంబులు చాలఁ♦గలఁతనొందఁ
జక్రవాకంబులు♦సంతోష మొందంగఁ, బద్మినీ వదనంబు♦పరిఢవిల్లఁ
గనకశిఖరి దాఁకఁ♦గ్రమ్మిన యిరులు ప్ర, వాహజలము తగ్గు♦పగిదిఁ దొలఁగె

తే॥ నిట్టిదని తొంగి చూడని♦యినుఁడు నాఁడు, రాము దాఁపున బంగరు♦ప్రహరిఁజూచు
కోర్కి తన డెందమునయందు♦గుదురుకొనఁగ, మెల్లమెల్లన లంకపై♦మెదలసాగె.

—: రాముఁడు సువేలాద్రి శిఖరముఁ జేరుట :—

మ॥ సుదతీరత్నము సీత లంకఁ గలదం ♦ చుం డెందమందున్న పె
ల్లిదమౌ ప్రేమము రేఁప నందమగు ప్రో ♦ లిం గాంచు సాకంబునన్
నిదురన్ వీడిన లక్ష్మణుండు వెనుకన్ ♦ నిర్భీత కీశవ్రజం
బెదురం బ్రక్కలరాఁ గకుత్స్థ కులజుం ♦ డెక్కెన్ సువేలాద్రిపై. ౨౦౧

ఆ॥ కదన వీరవరులు♦కలసి ప్రక్కలరాఁగ, రాజయుగళి తోడి♦రామవిభుఁడు
పెక్కుపులులు చుట్టి♦ప్రక్కల రా మృగ, రాజ మద్రినెక్కు♦రాణదోఁచె. ౨౦౨

చ॥ పుడమి సమస్తముల్ జలధిఁ ♦ బూఁడినకైవడిఁ గ్రమ్ము చీఁకటిన్
దొడిఁబడ లంకయున్ బొదలు ♦ తోరపు సంపదలున్ నశించు పో
బడి దెలుపంగఁ దూర్పుమల ♦ పై నుదయించుటమాని తాఁజుమా
ర్గ్వడ వలదిక్కు దోఁచు కతి ♦ భానునిపోలెను రాముఁ డత్తతిన్. ౨౦౩

చ॥ అసమ మహీధ్రముల్ వయిచి ♦ యబ్ధిని దాఁటిన రమ్య మేరు శై
ల సదృశ ధీరుఁడౌ కపికు ♦ ల ప్రభు లందున నుల్లసిల్లె రా
క్షస కుల కాలుఁడైన ధర ♦జా హృదయాంబుజ భాస్కరుండు మే
ల్పసిఁడి నగంబుపై వెలయు♦పచ్చలు నిండిన కూటమోయనన్. ౨౦౪

చ॥ జనకజ పేరుపొందిన ని ♦ జంబగు ప్రాణము వీడ జంటఁ బా
సిన కురరింబలెన్ వగపు ♦ చే విలపించెడువాఁడు సేతువుం
గనుఁగొను పిమ్మటన్ గినుకఁ ♦ గన్నుల మానినవాఁడు రాఘవుం
డనువుగఁ గాంచె లంక నయ ♦ నాంబుజ యుగ్మముతో వెఱంగుతో.

—: రాముఁడు లంకానగర సౌందర్యంబు లక్ష్మణునకుఁ దెలుపుట :—

మ॥ అనుజన్మా! గమనించితే మన యయో ♦ ధ్యం బోలు సౌందర్య ప
ట్టనముల్ వర్ణనసేయుచో సుకవి కూ ♦ టంబుల్ సురేంద్రస్థలిన్
గొనుచున్నా రుపమాన వస్తువుగ నో ♦ క్కొండేని లంకాపురిన్
గొనమిం జూడఁగ గొత్తదాఁటె యని వా ♦ క్రువ్వందగున్ లక్ష్మణా!

సీ॥ దోసంబులేక వి♦ద్యోతించు నపరంజి, మయమైన స్థలముల♦మణి గణములు
ఖచియింపఁ బడి రవి♦కాంతులు సిగ్గిల, దీప్తిమయంబుగఁ♦దేజరిల్లి
వ్రాయ నలవి కాని♦వైఖరి నొప్పారి, మిన్నంటుచుండు న♦మ్మేడలందు
కల శిల్ప మొకయింత♦కనులపండువుగాఁగఁ, గాంతమన్నను వీలు♦గాకయుండె

తే॥ నధిక రత్నదీప్తులు నింగి♦నంటుచుండ, ధ్వజ పటాంచితమగు లంక♦పవననూనుఁ
డుంచు నిప్పుచే నిప్పుడు♦మించి మండు, చున్న తీరున దోఁచుచు♦నుండెఁ గంటె.

చ॥ మొగుళులు గ్రమ్మి యున్నతిని ♦ మూసిన పచ్చలమేడలన్ ధగ
ద్ధగమను కాంతు లెల్లెడ ను ♦ దంచితలీలలఁ బర్వ మంచి వెం
డి గదులు హంసలట్లు ప్పుర ♦ డింపఁగఁ బచ్చని యాకుజొంపముల్
నెగడి సరస్సునం దలరి ♦ నిండిన తమ్ములఁబోలుఁ జూడుమా! ౨౦౮

మ॥ అనలజ్వాలలవంటి తేజములతో ♦ నంగారు మాణిక్యముల్
మునుఁగం జెక్కిన కంబముల్ గల గృహం♦బుల్ కాంతులన్ జిమ్మఁగా
ఘన సంఘంబులు మింటఁబోవునవి లం ♦ కాపట్టనం బన్న కొ
ల్మిని గ్రాఁగించిన యెఱ్ఱనౌ నినుప ప ♦ ళ్లెంబుల్ బలెన్ దోఁచెడిన్.

తే॥ కరులు కాళ్లతోఁ ద్రవ్విన♦కనకరజము, పైనిఁ జల్లికొనుటచేత♦వన్నె మీఱి
స్వర్ణగిరులవై ఖరి మెల్లఁ♦జనుచునున్న, వింతతీరులఁ గాంచితే ♦వినుతచరిత!

ఉ॥ అందపుఁ బైఁడికాఁడ లల ♦ రారెడు చామరలందునుండి ప
ట్టొందిన గాలిచేఁ గదలు ♦ సున్నమిత ధ్వజముల్ వియత్తలం
బందు చరించు వారిదముఁ ♦ లందలి మైల తొలంగఁ జేయుచున్
బొందిక నంచపిండువలె♦ ♦ బొల్చెడి వింతలఁ గాంతె తమ్ముఁడా! ౨౧౧

ఉ॥ ఈనగరంబు నూలిడిన ♦ యేపున శ్రేణులుగాఁగ నొప్ప మే
లైన కడాని చిత్రముల ♦ నందము చిందెడు సౌధపాళియున్
మానగు తారహారమున ♦ నాయకరత్నముగా దశానన
స్థానమెలర్ప నబ్ధిపతి ♦ దాల్చిన హారముగా వెలింగెడిన్. ౨౧౨

తే॥ మించి గృహ రత్నకాంతులు♦మీఁదఁబడఁగ, వీథులందేగు గుఱ్ఱము♦ల్వింతరంగు
లీన నైజవర్ణము జాతి♦యెఱుఁగరాక, యింద్రధనువులకై వడి♦నెసఁగుఁగంటె.

తే॥ చెఱకు విలుకాని సైతము♦చిక్కువెట్టు, పటికఱాల మేడలు వేఱు♦వర్ణముపడ
నెఱుఁగనగుచుఁదక్కిన యప్పు♦డెఱుఁగరాక, నీటిచేఁగట్టఁబడిన సం♦దియము దోఁచు.

తే॥ పండువెన్నెలఁ బోలిన♦నిండుకాంతు, లొలయుచున్న ముత్యాల పం♦దిళుల నడుమఁ
జెక్కఁబడినట్టి పచ్చలు♦క్షీరవార్ధి, పైని శయనించు వెన్నుని♦మేనిఁబోలు.

తే॥ వీరసింహమా! తారక♦వితతిఁ దాఁకు, మేడలం దొక్కవేలుపు♦మెఱుఁగుఁబోఁడి
గాసెనం దీయ ముకురంబు♦గాననయ్యె, రాహు వెరగొని వీడిన♦రాజుకరణి.

తే॥ ధ్వజములొప్పారు మలల చం♦దమునఁదోఁచు, సౌధములలోనిమాణిక్య♦దీధితులను
మావిచివుళులె యని భుజిం♦పంగఁ గోరి, పొడవు మెడల జాఁచెదునుష్ట్ర♦ములనుగాంతె

తే॥ కైశ్యవాసనకై కంబు♦కంఠు లిడిన, అగురు ధూపమెల్లెడఁ గ్రమ్మి♦యొగయుకతన
దంతిచర్మధారిని పోలి♦తనరుచున్న, పగడపు న్మేడలం గంటె! పావనగుణ!

తే॥ విశ్వకర్మ నిర్మితములై♦వివిధగతులఁ, జెలఁగి లోభులౌ రక్కసుల్♦చేర్చియుంచు
పాపపుం బొక్కసంబుల♦పగిదినున్న, నీలరత్న సౌధంబుల♦నెఱిని గంటె? ౨౧౯

తే॥ హరిణ నిభ భీత దృష్టుల♦యందము చెడి, పతి వియోగముచేఁ జాలఁ♦బరితపించి
మొగులుగను నెమిళులకూట♦ములనుపోలె, దేవసతులుమనలఁగాంచు♦తీరుగాంతె?
తే॥ సురలు సురకాంతలును మన♦చొప్పుగాంచి, మంచిదినములు వచ్చిన♦వంచునెంచి
గొప్ప లంకాపురంబును♦కూల్చి పాడు, చేసి పాతెడి క్రియనున్న♦చెన్నుగంటె?
చ॥ తెలిపిన తీరు వెండియును ♦ తెల్పకయుండెడు తీరు దోఁపఁగాఁ
బలు తెగలన్ దశాననుని ♦ పట్టణపు న్నెఱి నిట్లు తమ్ముతోఁ
బలుకుచు నుండునంత దశ ♦ వక్త్రుఁడు రాముని సైన్యసంఘమున్
దలకొని చూడఁగోరి చనెఁ ♦ దత్పుర గోపుర శీర్షభూమికిన్. ౭౨౨

—: ౧౦ వానరసైన్య దర్శన పటలము :— (౩౫)

సీ॥ సీతయందలియాన♦చేఁ బచ్చవిల్కాని, శరము లుచ్చిన బాహు♦లిరువదియును
శిరములు పది గొప్ప♦శిఖరము లలరారు, పెనుపర్వతంబు నొ♦ప్పిదముతోఁప
వలపుచేఁ గృశియించు♦బాహువు లాలంపుఁ, దలఁపు మాత్రన నుబ్బి♦బలుపుమీఱ
దశముఖుఁ డుత్తర♦ద్వార గోపురముపై, నధిక వైభవమున♦నలరి యపుడు
తే॥ కలశములె శిఖరంబులు♦గాఁగ గొప్ప, రంబె మేరువుగాఁ బన్ని♦దంబు సేయు
ననిలు గెల్వఁగ శిఖరంబు♦నదిమిపట్టి, నిలుచు పాఁపరాయని మదిఁ♦దలఁపఁజేసె.
సీ॥ దశదిశలను వాని♦దాపుల నీడల, మింగు ఛత్రము తల♦మీఁదఁగ్రాలఁ
జామర వాయు వి♦స్రస్తోత్తరీయంబు, కొండకాల్వవలె న♦కుక్కనను వ్రేల
రంభాదిసతులు ధ♦రాజాత కెక్కు డం, దము గలిగించుచు♦దాసిరాఁగ
బాల్కడలి జనించు♦పదునాల్గువేల కా, మిను లింపుగాఁ బాడు♦కొనుచురాఁగఁ
తే॥ బాలచంద్రు లిర్వంద్రొక♦పర్వతగుహ, లందునుండి వెల్వడులీల♦నలరు దంష్ట్రి
కల వెలుఁగు నగలకాంతిఁ♦గలిసిమెలయ, రావణుం డొప్పె నీలాద్రి♦రాజుపోలె.
తే॥ కుండలములు దాల్చిన యొక♦కొండనుండి, శబ్దమే లేక వర్షంబు♦జాఱుతీరు
ననుకరించు వీనులయందు♦నల్ల కలువ, లోలకములు మిక్కలి కాంతు♦లొలయవ్రేల
ఆ॥ సీత సీత యనుచుఁ♦జిత్తంబు తపియించు, చుండుకతనఁ జాల♦నునుఱు క్రుంగ
సామవేద సుధను♦చల్లుచు వీణతో, నారదముని పాడ♦నానెమఁగను ౭౨౬
ఆ॥ క్రూర చాప ఖడ్గ♦ధారులు హరుకంటె, నలవు బలము కలుగు♦నసురవర్యు
లంగరక్షకులుగ♦నధికంబుగాఁ ద్రావి, మైకమెక్కు కనుల♦మలసిరాఁగ
తే॥ జగములం ద్రవ్వి యెత్తంగఁ♦జాలువారు, నగరి లంకయఁ బుట్టిన♦నాఁటినుండి
పేరు పొందినవారు ని♦ర్భీతులు నగు, యక్షవరులు కైవారంబు♦లలరఁజేయ.
క॥ భూచరులు గగనచారులు, నై చెలఁగుచు దుందుభి మురజాదికవుల ని
ర్మోచనముగ మొరయించుచు, నేచు కడలి యులివు చెడ న♦నేకులు రాఁగన్.

తే॥ విసము భీతిల్లు నట్టి చూ♦పెసఁగుచున్న, నాగ కన్యకా మణులును♦నానయొంద
నరసురాంగనల్ పంచమ♦స్వరమునందు, పరభృతంబుల కై వడిఁ♦బాడుచుండ.

తే॥ మేఘ గంభీరరవముల♦మించువారు, నిడుపు టంగీలు కలవారు♦నిర్జరేంద్ర
భీకరులు వేత్రహస్తులు♦వెనుకముందు, హెచ్చరికతోడ దూరాన♦నేగుచుండ.

తే॥ కంఠ గంభీరరవము న♦కుంఠిత భుజ, గిరుల వాసించు చందనా♦కీర్ణ మోద
వాయువుల మోచికొని గంధ♦వహుఁడు దారి, మించి తనరాక మున్నెఱిఁ♦గించుచుండ

తే॥ అగ్నినేత్రులు చంచలు♦లధికబలులు, సూక్ష్మబుద్ధులు వినతిమై♦చొప్పు దెలుపఁ
దోరణ ద్వార శిఖరమం♦దారనిలిచి, వేదవేద్యుని దానవ♦విభుఁడు కాంచె. ౨౩౩

తే॥ ఔడుగఱచిన రావణు♦నక్షులందు, నుండి మిడుఁగుఱుల్ చిటపట♦మండిరాలెఁ
బెను విరావంబు దిక్కుల♦వినఁగవచ్చె, మనసు మాఁడె నెడమ కేలుఁ♦గనులునదరె.

తే॥ ఇట్లు పెక్కు దుశ్శకునంబు♦లెసఁగుచుండ, రామభూవిభుఁ గాంచిన రా♦వణుండు
మర్రి రిక్షుఁడౌ సూర్యునె♦దుర్చు రాహు, పోల్కి నుడుకుఁదనంబుతో♦బొందెఁగినుక.

తే॥ పరవియున్నట్టి యీకపి♦వరులయందు, రాముఁడితఁడని తన శరీ♦రంబె తెలిపెఁ
దక్కువారల నెఱిఁగింపు♦త్వరితగతిని, యనిన విభునకు సారణుఁ♦డనియె నిట్లు.

తే॥ ఇతఁడు లంకాధిపుని చెల్లె♦లీమెయనుచు, విన్నయంతనే తన కేల♦నున్న కత్తి
చేత దర్పితుఁడై ముక్కు♦చెవులుగోసి, లజ్జ నీకుఁ గల్గించిన♦లక్ష్మణుండు. ౨౩౮

తే॥ ధర్మగతి తక్కఁ దక్కిన♦తానములకుఁ, గనుల బోనీయకుండెడు♦కర్మఠుండు
కడలికొక చక్రవాళంబు♦కరణినుండుఁ, దపసుల కసాధ్యమౌ నిద్రఁ♦దఱిమినాఁడు.

తే॥ లక్ష్మణుని కేలు తనదు కే♦లంధరించి, యున్న ఘనభుజుఁ డండంబు♦లదరునట్లు
వాలితో ననిచేసిన♦వలఁతికాఁడు, కీశ కుల వరేణ్యుండు సు♦గ్రీవుఁ డధిప !

సీ॥ వానిప్రక్కనె యున్న♦వానితండ్రియె వేలు, పులు కోరఁ గలశాబ్ధిఁ♦జిలికినతఁడు
ఆ నడచెడువాఁడె♦యర్కుని చెంగట, నెగయుచు విద్దెల♦నేర్చినతఁడు
ఇలను కోఁతులతోడ♦నెత్తిన వెన్నుని, సాటివాఁ డంబుధి♦దాఁటినాఁడు
అతనిచేఁతలు నీవు♦నరసినవే కదా, అట నిలుచున్న వాఁ♦డగ్నిసుతుఁడు

తే॥ దండపాశ శూలంబులు♦తనరకున్న, భయదమైన యొడలి రంగు♦పరఁగకున్నఁ
గార్యమునుబట్టిశత్రువ♦ర్గంబులితని, జముఁడెయనిపల్కుచుండ్రు రా♦క్షసకులేంద్ర !

ఉ॥ వేరుగ నిల్చినాతఁ డతి♦విశ్రుత కీర్తి నలుండు వార్ధి తేఁ
డూరక గర్వమొంది తన ♦ కొప్పుగఁద్రోవ యొసంగఁడంచు నీ
తారగుణుండు పొందిన క్రు ♦ ధా బడబానల మాఱుమున్నె యీ
వారిధి బంధనంబు గరు ♦ వంబుగఁ జేసెను రాక్షసేశ్వరా ! ౨౪౧

చ॥ అరయఁ ద్రికాలవేది యను♦రాముఁ డంబుధిఁ ద్రచ్చువేళ ద
గ్గఱఁ దగ నుండి నాతఁడు జ♦గంబులఁ గొల్చిన వాఁడు విష్ణువుఁ
గురుతర భక్తితోడ వల♦ గొన్న మహాత్ముఁడు వృద్ధుఁడయ్యు ని
ద్ధరణి సమస్త మొత్తఁగల♦ దట్టుఁడు భల్లుకరా జితండగుఁ. ౭౮౨

తే॥ నీలశైలంబు ప్రక్కన♦నిల్చు రెండు, పైఁడికొండలవలె నీలు♦ప్రక్కనిలిచి
రామలక్ష్మణులం బలె♦రాజిలు కపు, లమర వైద్య పుత్త్రులు వార♦లసురనాథ!

సీ॥ ఆదూరమునఁ గాన♦నగువాఁడు కుముదుండు, కుముదాక్షుఁడట నిల్చి♦కొన్న వాఁడు
గవయుఁ డీతండగు♦గవయాక్షుఁ డాతఁడు, బ్రహ్మరుద్రులఁబోలు♦బంటుఁగన్న
సజ్జనహితుఁడు కే♦సరియగు నాతండు, నరసింహు బోలిన♦మురభుఁడతఁడు
పెక్కుకొండలఁ జేర్చి♦పెట్టి యెత్తఁగఁజాలు, శరభుఁ డీతఁ డితఁడు♦శతబలియగు

తే॥ మూఁడుకన్నులు లేని త్రి♦పురదహనుఁడు, పనసుఁ డనువాఁడు దురమను♦పబ్బమెల్ల
జరుపఁ బూనినవాఁడు ఋ♦షభుఁడు వాని, యెదుటివాఁడు సుషేణుండు♦హితగుణుండు.

సీ॥ కపిరాజు డాపలఁ♦గలభంబు కైవడి, నొప్పినవాఁడు మ♦హోద్ధతుండు
కొండల నొకచోటఁ♦గూర్చి భూమధ్యంబుఁ, గ్రుంగింపఁ జేసిన♦గురు బలుండు
దధిముఖుఁ డనువాఁడు♦తత్సన్నిధిని గానఁ, బడువాఁడు శంఖుఁడు♦ప్రథితయశుఁడు
కడలి మీలను లెక్క♦యిడవచ్చు వారిధి, యిసుకను లెక్కించి♦యెఱుఁగవచ్చు

తే॥ చుక్కగమినైన లెక్కించి♦చూడవచ్చు, వానరుల లెక్కయిడ నేరి♦వలనఁగాదు
దనుజ చంద్రమ! మేము గాం♦చిన తెఱంగు, విన్నవించితి మన దైత్య♦విభుఁడు కినిసి.

ఉ॥ చేలఁ జరించుచుఁ వికృత♦చేష్టలఁ జేయుచు నుండు కోఁతులఁ
బోల నుతించుచుంటి వది♦పోలునె? జంకలు కోటి గూడి బ
ద్ధాలస శీర్ణ వార్ధక మృ♦గాధిపుఁ దాఁకి జయింపనేర్చునే?
యేల వృథా వచింప? నని♦యొల్లిద మాడుచు నవ్వె ఫక్కునఁ. ౭౮౩

౧౧. మకుటభంగ పటలము. (గీ౨)

తే॥ రావణుం డట్టులుండ శ్రీ♦రాముఁ డిచట, రావణానుజుఁ గాంచి పు♦రంబునుండి
మనలఁజూచువేడుక ద్వార♦మునకు వచ్చి, నట్టివారి గుణాదుల♦నరయఁ దెలుపు.

చ॥ అనుడు విభీషణుండు ధర♦జాధిపుఁ గాంచి వచించు బంధు లొ
ఘను లను నాఱు నూడ్చి నర♦కంబున నాటఁగ స్వీయవంశముఁ
గొనకొని మిక్కిలిఁ బురద♦గుంటగఁ జేసిన నీచకర్మి పా
వన కులకాంతలఁ జెఱను♦వైచిన రావణుఁ డాతఁడే చుమీ. ౭౮౪

చ॥ అనుచు మఱొక్కనింగుఱిచి♦యాడ దొరంకొను మున్నె భాస్కరుం
గనిసిన పండటంచుఁ దిను♦కాంక్షను దాఁటిన వాయునూను మా

డ్కి-సి కపిరాజు కన్నులతో ♦ డింబడి దూఁకఁగ విస్ఫులింగముల్
మునుకొని దాఁటె రావణుని♦మూర్ధము లంఘ్రులఁ దన్ని కోర్కి-మై

తే॥ కోఁతి తేఁడు సువేలాద్రి♦కొమ్మువీడి, రావణుండున్న పెనుగోపు♦రంబుమీఁద
దాని బలమడంగఁగ దూఁకెఁ♦దరణి యుదయ, గిరి విడిచి యస్తగిరిఁ జేరు♦కరణిదోఁప.

చ॥ అరయుగఁ బల్లమందు వడు♦నంబువులంబలె ధాత్రిఁగూలి కుం
దొరయు త్రికూటముం జలన ♦ మొందఁగ దూఁకిన సూర్యసూతి ముఁ
ధరణిజ దుఃఖమొందఁ గని ♦ దానవుపైఁ దన డెందమట్లు పె
న్నురవడి దూఁకినట్టి విహ♦గోత్తము పోలిక నొప్పె నత్తఱిన్. ౭౫౧

ఉ॥ నీరదగాత్రు తామరస♦నేత్రు ఝషధ్వజజైత్రు రాముఁ జె
న్నారఁగఁజూడ గొప్పవగు♦నక్షులు గల్గుటకున్ మనంబులన్
మీఱిన యుబ్బుగొన్న దివి♦మొత్తలు పిడ్గు పడంగఁ బొఱు మా
యూరములట్లు దిక్కు-నకు♦నొక్క-రుగాఁ బరువెత్తి రోటమై. ౭౫౨

తే॥ ఇన కుమారుండు రావణు♦నెదుటనల్ల, మల యెదుటఁ దెల్లమల యొండు♦నిలుచునట్లు
దిగఁగ హాలాహలము లేవ♦దిగులుగొనక, నిలుచు హరుచందమున నిల్చి♦నిర్జరారి

తే॥ వచ్చుకార్యమేమని కపి♦వర్యు నడుగ, మాఱుపలుక కాతఁడు దశ♦మస్తు నొడలు
పదరఁ దన బలిష్ఠంబగు♦బాహువతని, ఱొమ్మునం దిగఁబడునట్లు♦గ్రుమ్మసంత.

తే॥ వృక్షసాంద్రమహారణ్య♦విధముగాఁగఁ, బెరిఁగియున్న బాహులతోడఁ♦బిడుగుపోల్కి-
దెసలు ప్రతిరావములతోడ♦దిమ్మపుట్టఁ, గినుక దైత్యుఁడు పొడిచె సు♦గ్రీవునురము

క॥ కొట్టినచోటున నెత్తురు, పుట్టఁగఁ గపిరాజు కోప♦పూర్ణనయనుఁడై
కిట్టి పదితలల మోముల, గట్టిగఁదాఁచెను కడింది♦కాలన్ గేలన్. ౭౫౬

తే॥ తన్నినట్టి సుగ్రీవుపా♦దములు రెండుఁ, బట్టికొని క్షణమున దృఢ♦బలము చూపి
మదగజమును హర్యక్షంబు♦మాడ్కి- నసుర, విభుఁడు గోడకుఁ జేరిచి♦విసరి తాఁచె.

తే॥ తాఁప భానుజుఁ డోడికాసఁ♦దప్పికొనుచుఁ, గొట్టినట్టి రావణు మేను♦క్రుంగునట్లు
నేలకుంద్రోచి కందరఁ♦బోలు నోటఁ, గ్రక్కు-ఁ బొడిచి నెత్తురువట్టి♦కడఁకఁ ద్రావె.

ఉ॥ కాటుకకొండవంటి ఘన ♦ కాయము గల్గిన రావణుండు చొ
క్కా-టపు నెత్తుద్రావు ఘన ♦ కర్మని దేహముఁ బాఁప తేఁడు మేల్
హాటకశైలమూనిన న♦యంబునఁ బట్టి బలంబుతోడ ది
క్కూ-ట నగంబుపై నుదుకు ♦ కోపునఁ ద్రిప్పె మిడుంగుఱుల్ వడన్.

చ॥ త్రిపురములన్ దహించుతఱి ♦ రేఁగిన రుద్రునిమాద్రి పొంగి య
క్క-పికులకాంతుఁ డట్లు తన♦కాయముఁ ద్రిప్పిన వాని ఱొమ్మునన్
దపుకున వాఁడిగోళ్లు దిగ ♦ దాయఁగ గ్రుద్ది దశాస్యు మధ్యమున్
ద్రపగొనఁ బట్టి త్రిప్పి వడిఁ♦దాఁచెఁ గడంక నగత్తలోఁ బడన్. ౭౬౦

ఉ॥ రావణుఁడుం బదంపడి తి ♦ రంబుగ నచ్చటి కెక్కి వచ్చి సు
గ్రీవునిపట్టి త్రోచి దరి ♦ కిం జనఁ దెమ్మని పంతమాడ నా
త్రోవన యాతఁడెక్కి వడి ♦ దోర్బలు లిర్వురు బీఱువోక యొ
క్కొనడిఁ బోరిపోరి పడి ♦ యాఁగిరి యొక్క యగడ్తలోనికిన్. ౭౬౧

క॥ ఇరువురు కుడయెడమలుగాఁ, దిరుగుచు డాయుచును డాయఁ ♦ దిగుచుచుఁ దోలఁగం
జరుగుచు నడఁగుచు లేచుచుఁ, బోరిపోరి శ్రమదీర్చుకొనుచుఁ ♦ బోరిరి కడిమిన్.

క॥ అగడిత యను పెనుకడలిన్, సొగసుగఁ జిలుకంగ నొక్క ♦ సుడి యేర్పడఁగా
నగచరపతి వాలిక్రియన్, దగఁ గవ్వపుఁగొండపగిది ♦ దనుజుం డొప్పెన్. ౭౬౩

తే॥ చెఱకుగానుగనుండి పా ♦ ల్గారఁగురీతి, గాయములనుండి రక్తంబు ♦ కాఱుచుండ
వార లెగసిరి పక్షుల ♦ వలెనె మింటఁ, బురజనంబులు భీతిల్లి ♦ పరువులెత్త. ౭౬౪

తే॥ గగనమందు పోరాడెడు ♦ కపివరుండు, కత్తియొడలున్న రాక్షస ♦ కాంతు పెక్కు
బాహువులచేత నడుమంగఁ బడుచుఁ బరిధి, చుట్టియున్నట్టి నడుమింటి ♦ సూర్యుఁబోలె

తే॥ మింటఁ గోపంబుతోఁ బోరు ♦ మిహిరసుతుని, మైకళుకు దన భుజముల ♦ మఱుఁగుపుచ్చ
పంక్తికంఠుఁ డొప్పెనుదిన ♦ ప్రభుని కాంతి, మఱుఁగుపడఁ జేయుదొంతుల ♦ మబ్బుమాడ్కి.

క॥ నూపురములు మ్రోయఁ జెలులు, కాఁపురములు వీడి పాఱఁ ♦ గలఁత వడుచు లం
కాపురము చెడఁగ దాఁటెం, గోపురమడఁగ న్నృసింహు ♦ కోపునఁ గపియున్

తే॥ మెఱుపనెడి దంతములు గల ♦ మేఘ మొక్కఁ, డసదృశంబగు పిడుగు వె ♦ న్నాడుతీరు
తోఁప మ్రింగివైచెదనని ♦ దుడుకుతోడ, వచ్చి రావణుఁ డాతనిఁ ♦ బట్టికొనియె.

సీ॥ దాసిన రావణుఁ ♦ ద్రోసి నేలకు రాచి, సుగ్రీవుఁ డార్వాస ♦ సుర విభుండు
యంత్రంబుక్రియ లేచి ♦ యాతని నెత్తి య, వ్వాలికి దప్పుగ బాఱ ♦ వైవ నతఁడు
చెండువలెనె లేచి ♦ చెలఁగ నాపోరున, ధరణి బీఁటలువాఱెఁ ♦ దరులు విఱిగె
గోడలు వ్రీలెను ♦ గొండలు చలియించెఁ, బ్రాకార మెల్లెడఁ ♦ బగిలి చెడియె
తే॥ గాలిపడగలవలె మింటఁ ♦ గ్రాలుచుండు, వారి దేహస్థితులు దాసె ♦ వదలెఁ గలిసె
నెడసె విసరిరి పొడిచి రం ♦ చెఱుఁగలేక, రక్కసులు నోటగొనిరి దు ♦ రంబు సేయ.

—: శ్రీరాముని చింత :—

తే॥ ఇట్లు వారికి సంగ్రామ ♦ మెసఁగుచుండ, నీల నీరద వర్ణుండు ♦ నీతిమేర
ప్రాణమిత్రుఁడౌ సుగ్రీవు ♦ రాక గనక, తలఁపులెల్లను కలఁగఁ జిం ♦ తను భజించి.

మత్త॥ ఈవు లేక యసూత్కరంబు వ ♦ హించి యేనొక కార్యమున్
దావుకో జరుపంగ నేర్తునె? తత్త్వవిత్తమ! మిత్రమా!
దేవతాళికిఁ గూర్చినాఁడవు ♦ తీవ్రదుఃఖము నీదు కో
పావిలంబగు డెందమిట్లు జ ♦ యంబు దైత్యుల కిచ్చెఁగా! ౭౭౧

మత్త॥ మాయలాని నిశాచరేంద్రుని ♦ మాయఁజిక్కితి తప్పిరా
నేయుపాయములేదొకో? యిట ♦ కీవు రామిని క్రూరదై
తేయపాళి జయించియుం గల ♦ దే సుఖంబు? వియోగినై
మాయుచుండఁగఁ బ్రాణమిచ్చిన ♦ మాననీయ! సుహృద్వరా! ౭౭౨

ఉ॥ కోరిక యొక్కటైన మఱి ♦ కూడిన దొక్కటియయ్యె నక్కటా!
ధారణికిన్ భరంబుగ వృ ♦ థా బ్రదుకన్ మది నిచ్చగింప దే
వారియు నిన్ వధింపఁ గడు ♦ నాఁడిడి చేరఁగ నన్నుఁగూడ నీ
ఘోర రణంబునందు తెగఁ ♦ గూల్చినవాఁడవు నీవ కావొకో? ౭౭౩

ఉ॥ నేఁడిటులీవు బ్రుంగ నిట ♦ నిల్చి సురారులఁగూల్చి ప్రాణముల్
వీడుదునేని యాపదల ♦ వేళలఁ దోడయినట్టి మిత్రుఁ గా
పాడఁగలేకపోయెనని ♦ పామరలోకము నిందసేయదే?
నీడనుపోలె నన్ను విడ ♦ నేరని చెల్వుఁడ! యట్లొనర్తువే? ౭౭౪

ఉ॥ ప్రాణముపోవునట్టి పని ♦ వట్టితి నాపయినున్న ప్రేమచేఁ
ద్రాణ యొసంగి జీవములఁ ♦ దార్చి సుఖంబులఁ గూర్చి నాకు సం
ప్రీణనముం బొనర్చిన య ♦ మేయ గుణాకర! సైన్యమెల్ల వి
న్నాణముగాఁగఁ గ్రమ్మఱిన ♦ నామది నంగద పాయనేర్చునే? ౭౭౫

మ॥ అని శ్రీరాముఁడు దుఃఖమొంద నట వీ ♦ రాగ్రేసరుల్ గెల్పు ని
ల్పును లేకుండఁగఁ బోరుచుండ నిఁక మే ♦ లుంగూర్పఁ జావైన నం
చును లంకేశ్వరుఁడెంచ శీర్షకములన్ ♦ శోభిల్లు రత్నంబులన్
దినరాట్పుత్రకుఁ డూడఁదీసికొని ప్రీ ♦ తింజేరె సీతాపతిన్ ౭౭౬

ఉ॥ చింతఁ దపించుచున్న రఘు ♦ శేఖరు పాదసరోజ రేణు వ
త్యంతము శీర్షమంటఁగ న ♦ మర్పణసేసెను తన్మణీగణం
బంతట నెల్లవారలకుఁ ♦ బ్రాణము లవ్వల వచ్చినట్లు పె
న్సంతసమబ్బె నుబ్బె మది ♦ చక్షుల బాష్పముగ్రమ్మె నిమ్ముగన్. ౭౭౭

ఉ॥ ఎమ్ములదాఁకఁ జీలిన క ♦ పీంద్రుని గాయములందు వచ్చు ర
క్తమ్మును రాక్షసేశ్వరుని ♦ తాఁకిన హైన్యమువోవ రాఘవుం
డిమ్ముగఁ గౌఁగిలించి నయ ♦ నేంద్రియముల్ వెడలించు బాష్పపూ
రమ్మునఁ దానమార్చి యను ♦ రాగముతో వచియించె నివ్విధిన్. ౭౭౮

తే॥ నన్ను నీ వెడఁబాయుట ♦ నామనంబు, భేదన మొనర్పలేకదా ♦ ప్రేమపూర్ణ!
ఒడలు స్తంభించె మది చేష్ట ♦ లుడిగె జీవ, ములును తల్లడిల్లెను దిగు ♦ లలమికొనియె.

మ॥ కరుణాహీనుఁడు రావణుండు నిను వీఁ ♦ కం జంపి యున్నేని త
ద్గురుదోషంబుఁ దలంచి క్రూర శర సం ♦ దోహంబుచే మూలము

ట్టఱ రక్షోన్వయమెల్లఁ గూల్చినను నా ♦ ప్రాణంబులం గాచికో
ధర జీవింతునయేని యోడుటయె గా ♦ దా ? మిత్రవాంఛాశయా !

మ॥ ఒకచిత్తంబున నెంతుమేని యశముం ♦ యోగ్యత్వముం బ్రాయి యో
ర్మికి సత్త్వంబు నొసంగునట్టివిక దా ♦ మేలంబు గారంబు నీ
వకటా ! యెంచ కిహంబు మోక్షమును మా ♦ యం జేసెదే ? యూరకే
యొకటింగోరి మఱొండు చేసితివి నీ ♦ కొప్పారునే యీవిధుల్ ? ౭౮౧

శా॥ సంతాపస్థితిగొల్పి యింతదనుకన్ ♦ జాలంబునే సేయుచో
వంతం గుందెడు సీతచే ధరణిచేఁ ♦ బ్రాణంబుచే నాకిటన్
నుంతైనన్ సుఖమబ్బునే ? యనువులన్ ♦ ప్రుక్కింప లోకంబు వి
శ్రాంతిం గోరక నన్ను వెన్కొనును కా ♦ ర్యంబిట్టులుం గూడునే ?

తే॥ పిల్లతనపుఁజేష్టల నింక ♦ వీడు మనుచు, మందలింప రామునికడ♦మందటిల్లి
శిరము వంచిన సింగంబు♦కరణినుండి, యిట్టు లనియెను సుగ్రీవుఁ♦డీలగొనుచు.

శా॥ కాటంజేసిన గృధ్రరాజుపనియుం ♦ గావింపలేనైతి నా
నాటం జేసిన బోయరాజుపనియున్ ♦ గావింపలేనైతి నీ
నాటం జానకి యొందుచున్న చెఱయున్ ♦ దప్పింపలేనైతి ని
వ్వీటన్ రావణుశీర్షముల్ పదియు న ♦ ర్పింపంగలేకుంటిఁగా. ౭౮౨

మ॥ బలియుండైన విరోధి ప్రాణములతో ♦ భాసిల్లుచున్నాఁడు కీ
శులకుం బోలిన చేష్టఁజూపి తుద కి ♦ చ్చోఁగ్రుంగి నీకీర్తికిం
గలుసుంగొల్పితి నావిరోధి ననిలో ♦ ఖండించి రాజ్యంబు నా
కొలయుంగూర్చిన మీకె మీపగఱ నే ♦ నొప్పించితిన్ లేకినై. ౭౮౩

తే॥ దిక్కరుల దంతములకంటెఁ♦దక్కువయ్యె, నాభుజంబులు నీదుబా♦ణములకంటె
ముందుగానేగి ముష్కరు♦ముగియఁజేయు, వాంఛనేగి వ్యర్థుండనై♦వచ్చినాఁడ.

తే॥ శాస్త్రబలుఁడగు నీదూత♦చనియొనర్చె, సమరమున నస్త్రబలమును♦శస్త్రబలము
బాహుబలము శత్రులు చూప♦వాలుబలము, చూపె నాకాలిబలమిటఁ♦జూపినాఁడ.

తే॥ అనుచు వినతశిరస్కుఁడై♦యర్కవంశ్యు, సన్నిధిని రవిసుతుఁడున్న♦సమయ మరసి
అతనిఁగని రాముఁ డెఱుఁగంగ♦నసుర నేత, యగు విభీషణుఁ డిట్లు ప♦ల్కాడఁ దొడఁగె.

చ॥ పెకలిచి తెచ్చు రత్నములు♦బెట్టిదుఁడౌ దివిజేంద్రవైరి మ
స్తక మకుటాగ్ర సన్మణి క♦దంబము కావున వానికంటె ను
త్సుకతనుకూర్చు వస్తు వికఁ♦జొప్పదునే దనుజేంద్రుకీర్తి పా
దు కలఁగఁజేసినాఁడవు సు♦దుష్కరమియ్యది యెట్టివారికిన్ ౭౮౪

చ॥ నలఁచి భుజంగమేంద్రుని ఫ♦ణామణు లూడఁగఁదీయవచ్చుఁగా
కలఘు ధనుఃకళాచణు ద ♦ శాననుమస్తక రత్నరాజముల్

బలిమిఁ బెకల్చి తెచ్చిన చ♦లంబు మగంటిమి రుద్రమూర్తికే
నలవడునేమి? కీర్తికర♦మైనది యింతకు మించి కల్గునే? ౭౯౦

చ॥ హరుని శిరంబునం దమరు♦నంబుజునైనఁ బెకల్పవచ్చు శ్రీ
హరియురమందు కౌస్తుభము ♦ నైనను బల్మిఁ గొనంగవచ్చు నా
కరణి పనుల్ మగంటిమివి ♦ గావు దశాస్యు కిరీట రత్నముల్
పరువడి తీయుటన్న సుల♦భంబగుకార్యముకాదు మిత్రమా! ౭౯౧

చ॥ మెఱుపులఁబోలు కాంతులను ♦ మించిన యంగద బాహువీర! సం
బరమునఁ జంద్రహాసము ను ♦ మాపతినుండి గడించినట్టి ని
ర్జర రిపు మస్త రత్నములు ♦ రాముఁడు నిల్పు జయేందిరా పదాం
బురుహ మలంకరించుటకుఁ ♦ బూనికఁ దెచ్చిన యందియల్ సుమీ!

చ॥ అనుడు దినేశవంశ్యుఁడను ♦ నయ్యు జయేందిర చంచలాత్మ యొ
క్కనువుగ గెల్పుముల్ శుభము ♦ లందవు మేలును కీడువచ్చుఁ గా
వున నిటు సాహసించి యటఁ ♦ బోవలదంటిని నీవు చేయు ని
ప్పని సులభంబె భూమిఁ గొన ♦ పంట ధరించిన పోత్రికేనియున్?

మ॥ జయశీలుండగు దైత్యరాజ మకుటా ♦ చ్ఛ స్ఫార రత్నావళుల్
భయమున్ వీడి పెకల్చెఁ బుత్త్రుఁడని నన్ ♦ బాధించునో యంచు సం
శయుఁడై యయ్యెడ డాఁగువానివలె భా ♦ స్వంతుండు క్రుంకెన్ విని
ర్దయులౌ వారికి జంకకుందు రెవరీ ♦ ధాత్రిన్ జగత్సేవకుల్? ౭౯౪

తే॥ రాత్రిగాఁగ రావణ శిరో♦రత్నచయము, దీపములవలె మిక్కిలి♦ తేజరిల్ల
నగచరేంద్రుని విజయంబుఁ♦బొగడి యులరి, రామచంద్రుండు తనశిబి♦రంబు చేరె.

ఉ॥ ఎన్నఁడు నిట్టి భంగములు ♦ నించుక యొందని రావణుండు తన్
బన్నగ నిర్జరావళి నె ♦ పంబిడి కాంచెనొ యంచు సిగ్గుతో
నన్నులచూపులెల్ల మగ♦లన్నల చూపులె యౌచునుండఁ ద
త్సన్నయశంబుమాడ్కి దిగె ♦ ధారుణికి న్నడపీన్గు కైవడిన్. ౭౯౬

౧౨. వ్యూహ నిర్మాణ పటలము. (౨౮)

క॥ మానస నిహత మర్త్యుండగు, దానవ విభు మోము ముడుఁగుఁ♦ దామరవలెఁ గా
మానగు సౌధమునకుఁ జని, పానాదికములను వీడి ♦ పడకకుఁ జేరెన్. ౭౯౭

సీ॥ వాఁడి కోలలచేత ♦ వీను మణులచేత, నిట్టూర్పు పెనునోళ్ల♦నియతిచేత
తలల విరివిచేత♦దామోదరుని వీడి, పాలకడలినుండు♦పాముఁబోలె
నుండ జననికంబు♦మెండుగ నలవాటు, పడిన వారలనైన♦భ్రమలువుచ్చు
శార్దూలుఁడను వేగు♦నరగున నటకురా, ద్వారపాలకుఁడు దై♦త్య విభుఁ జేరి

తే॥ వైరులను డాసి వారల♦పసులెఱింగి, రమ్మనిన గూఢచారి ద్వా♦రంబుచేరి
సెలవె? యనఁ దల పంకించి ♦ చేతిసైఁగ, సేయఁ గంచుకి వానిని♦చేరఁబిలిచె.

తే॥ ఎఱిఁగినట్టివృత్తమువచి♦యింపుమనఁగఁ, బ్రభునిమోముజాడనుతాప♦పడుటదెలిసి
జంకుచును వేగుమెల్లఁ దాఁ♦జన్న మొదలు, గాంచినది పద్ధతిగఁ జెప్పఁ♦గాఁదొడంగె.

తే॥ పదియునేడు వెల్వాలతోడఁ♦బవనసుతుఁడు, మొనసి పడమటివాకిలి♦ముట్టఁజనియెఁ
బదియునేడువెల్లువలతోఁ♦బ్లవగరాజు, నుంచుకొనియె రాముఁడుతన♦యొద్దనధిప!

తే॥ పదియునేడు రాణువలతో♦వాలికొడుకు, దక్షిణంపుగవని ముట్టఁ♦దరలినాఁడు
పదియునేడు చేరువలతోఁ♦బరవి నీలుఁ, డరిగెఁ దూరుపువాకిలి♦నాక్రమింప.

తే॥ వాహినీద్వయమును పోరు♦వారికెల్లఁ, బండ్లు గాయలు తేర నే♦ర్పఱచె నీదు
తమ్ముఁ డన్ని గవంకులఁ♦దనరు స్థితుల, నరసి తెలుపుచునుండున♦ట్లాజ్ఞయయ్యె.

మ॥ అని శార్దూలుఁడు పల్క రావణుఁడు రౌ♦ద్రాకారుఁడై రేఁగి పం
డ్లను దర్పమ్మున గీఁటుచుణ్ బగఱఁ జం♦డ ప్రక్రియణ్ రేపె తు
త్తునియల్ సేసి రణాంగణంబున మహో ♦ త్తుంగంబుగా లేచు ధూ
ళిని క్రుంగించెద రక్తపూరమున నా ♦ లీనంబుగాఁ జూడుమా. ౧౦౩

మ॥ తరుసాంద్రంబగు నీలశైలముపయిం ♦ దాఁగొన్న లేమొండ వై
ఖరి రక్తంబుల డాలు మైనొలయ లం♦కానాథుఁడవ్వేగ నం
పి గయంబారఁగ రేఁపు వృత్తిగల పూ ♦ విల్కానిచే మాఁడు పూ
సరముల్ మాఱిచి యేగె మంతనముకై ♦సన్మిత్ర వర్గంబుతో. ౧౦౪

సీ॥ బయలె యయ్యది యసి♦బమ్మెర గొలుపు ప, టికరాలచేతఁగ♦ట్టింపఁబడిన
సౌధంబునందు పి ♦ శాచగణంబులఁ, జుట్టుకావలిగాఁగ ♦ సొరిది నిలిపి
కర్తవ్యమును చక్కఁ♦గా విమర్శించి వ, చించు నుత్తమ కుల♦శీలవరులఁ
గని మహాద్వారంబు♦లను కోఁటిమూఁకలు, ముట్టడించెను పెను♦పోరుగలిగె

తే॥ వచ్చినది వలదన్నను♦వదలఁబోదు, తలఁచి చేయంగ♦దగినది♦తెలుపుఁడనిన
వారిలో నికుంభుండను♦వాఁడులేచి, పంక్తికంఠు మోమును కాంచి♦పలికెనిట్లు.

ఉ॥ డెబ్బదివెల్లువల్ ప్లవగ ♦ డింభకముల్ మనకోట ముట్టుచుణ్
నిబ్బరమొందియుండెనని ♦ నీవిటుఁ జింతిలుచుంటివేల? మే
లబ్బెను వేయివెల్లువలు ♦ హాళిగ సైన్యము వారికోరికల్
దబ్బఱసేయఁ గాంక్షగొని ♦ తత్తఱ మందుచునుంట గాంచవో? ౧౦౫

చ॥ ముసల గదాది సాధన స ♦ ముత్కరముల్ ధరియించి వచ్చి రా
క్షసు లెదిరించి నిల్వఁ ద్రిద ♦ శప్రకరంబులె కేలుమోడ్చి వే
దెసలకుఁ బాఱుచుండు నన ♦ దిక్కఱి ప్రాఁలెడు కోఁటిమూఁక యు
క్కసుగొని పట్టిచేతులను ♦ కాంచు జయంబది మెచ్చఁగాఁదగుణ్. ౧౦౬

తే॥ అనిరణోత్సాహవాక్యంబు♦లాడునతని, మాన్పిమాల్యవంతుఁడు చాల♦మనసునొంచి
వేధ మొనరించు కామమ్ము♦ వేరుతోడఁ, జెఱచె నని యెంచి యీరీతిఁ♦ జెప్పఁబూనె.

సీ॥ మననగరముచొచ్చి♦యనలంబు దరికొల్పి, నీఱుచేసిన యాంజ♦నేయుచేత
శరములుండెనొ శరా♦సనముండెనో పట్టి, కాలును కేలును♦వాలుగాక
మలలట్టి యీాదశ♦మస్తకంబులనున్న, మణులఁ గొంపోయిన♦వనచరునకు
శూలముండెనొ భిండి♦పాలముండెనొ గొప్ప, వాలముండెనొ తలఁ♦పంగవలదె?

తే॥ రామచంద్రుని బాణముల్♦రాకమున్నె, యుర్విజనొసంగి సాయుధీ♦యుల మనాయు
ధీయులను శరణనుచుఁ బ్రా♦ర్థించుటొక్క, యిమ్మెదక్కవేఱొక రక్ష♦కమ్మెకలదె?.

ఉ॥ నాశముగూర్పనున్నవిధి ♦ నాలుకఁద్రిప్పుచునుండఁ జూచి లం
కేశుఁడు తాతపల్కులకు ♦ నీక్షణము ల్కడుఁగెంపుచేసి నా
కీశని దాపురించెఁ జన ♦ విచ్చు కతమ్మెన నంచు దుష్కృధా
వేశము గొల్పు పల్కులను ♦ వీడుము నా నతఁడూనె మానముల్. ౨౧౦

తే॥ అనిని తలసూపు కాలకే♦యాదుల మద, మడఁగఁజేసినవీర! ప్ర♦హస్త! యారి
తేఱియున్న సైన్యముల ని♦న్నూఱు వెల్లు,వలను కొనుచుఁ దూర్పు గవని♦వలనికరుగు.

తే॥ దురమునఁ గృతాంతు మోదంబు♦తూలపుచ్చు, బల! మహోదరా! మన మహా♦పార్శ్వతోడ
రెండువందల వెల్వాల♦నండగఁ గొని, దక్షిణపుఁ గోట వాకిటి♦దండ నిలుము.

ఉ॥ ఇచ్చటఁ బ్రజ్ఞలాడ ఫల♦మేమియుఁ గల్గదు మేఘనాద! నాఁ
డచ్చుగ వాయుసూనుని ప♦రాక్రమముం దగఁగాంచితేకదా!
నచ్చినవారితోడ జత ♦ నంబున రెండగు వంద వాహినుల్
చెచ్చెరఁ గొంచుఁ బశ్చిమము ♦ చేరుము వారలకంటె మున్నుగన్.

మ॥ అరుదా జీవితమెల్ల వేల్పులకుఁ గ ♦ ష్టౌఘంబులం గూర్పనే
యరిగె న్నీసరివీరులెవ్వరు విరూ ♦ పాక్షా! యలంతుల్ వనే
చరులం గూల్పఁగఁబోవు టెల్లిదమగున్ ♦ జర్చింపఁగా నీకు ను
ద్ధురమా మూలబలంబుతోడఁ బుర ము ♦ ద్యోగంబుతోఁ గావుమా.

ఉ॥ ఇమ్మెగ సత్యలోకమున ♦ కేవలనున్న జగంబులందునన్
ముమ్మరమైన పోరులను ♦ మున్ జయమందు శతాంగ వారణా
శ్వమ్ములుఁ గాల్బలంబు లిరు ♦ వందల వెల్వలఁగొంచు నేనె ము
ఖ్యమ్ముగ నుత్తరంపు దెసఁ ♦ గాచెద నంచు వచించి పంచినన్. ౨౧౧

సీ॥ జగము కళంకమొం♦దఁగ హేతువైన త, మంబు రూపొందు క♦ల్పంబుపూయు
సర్వదా సుఖులయి♦సంచరించెడు సుర, గణములు మాత్రమా♦కాదుకాదు

ఇహాభోగములఁ ద్యజి ♦ యించిన మౌని ని కాయంబు మాత్రమా ♦ కాదు కాదు
అడజడి కూడుగా ♦ గడియ యుగంబుగాఁ, గల సీతమాత్రమా ♦ కాదుకాదు
తే॥ కడకు రాముఁడు మాత్రమా ♦ కాదుకాదు, కర్బురేంద్రుండుమాత్రమా ♦ కాదుకాదు
ఎల్లవార లానందాన ♦ నుల్లసిలిరి, తిమిర మడఁగుచు భల్లునఁ ♦ దెల్లవాఱె. ౨౧౬

మ॥ కరుణాహీనుని చండశాసనము నీఁ ♦ గన్ లేక యల్లాడు చి
ల్లర జేఁడుల్ తలయొగ్గి యుండఁదగు వే ♦ ళన్ సార్వభౌముండు ము
ష్కరులం గూల్పఁగవచ్చుచోఁ గనెడు వీఁ ♦ కన్ లోక ముత్కంఠతో
వెరవారం గనుచుండ వెల్వడెఁ దమో ♦ విద్వేషి వ్యోమంబునన్. ౨౧౭

చ॥ తెలతెలవాఱుచుండఁగనె ♦ దిక్కుల ముంపఁగఁ బాదధూళి పే
రులివు నముద్రఘోషణము ♦ నొత్తఁగ వానరసైన్యనాయకుల్
తెలిపిన పద్ధతిం బ్లవగ ♦ ధీరులు మిక్కలి యుత్సహించుచున్
దలకొని ముట్టి నొక్క మొగి ♦ దానవనాథు పురంబు వాకిళుల్. ౨౧౮

తే॥ చుట్టి యుండంబు లగలంగఁ ♦ జుక్క లురల, నార్భటింపఁగ సౌమిత్రి ♦ యుగచరేంద్రుఁ
డొనరముందుగా నడవ దీ ♦ వనలు మఘువుఁ, డొసఁగ జానకీవిభుఁడాజి ♦ కెసఁగ నడచె.

తే॥ పాతకుండగు రావణు ♦ పట్టణంబు, దైత్యసేనయన్ కడలిచేఁ ♦ ద్రావఁబడిన
కరణిఁ గనిపించెఁ గపిసేన ♦ కవియుతీరు, దాని క్షీరాబ్ధిచుట్టిన ♦ వైనమయ్యె.

ఉ॥ లెక్కకు మీఱియుండిన ని ♦ లింప విరోధుల గుంపు లగ్గహా
టుక్కునఁ గోఁతిమూఁక నెగ ♦ డెన్ వల మీలకుఁ బన్నుకై వడిన్
మిక్కలి వాతఘాతమున ♦ మీఱి సముద్రములేదు రేఁగఁగా
నక్కుచుఁ ద్రొక్కుఁడౌ జగ మ ♦ నంగఁగ రెన్ దనుజేంద్రసైన్యముల్.

౧౩ అంగద దౌత్య పటలము. (౪౩)

ఉ॥ జంకొకయింతలేని కపి ♦ చంద్రులతో రఘువర్యుఁ డుద్ధతిన్
లంకను ముట్టడించి యక ♦ లంకను సీతను దొంగిలించు ధూ
ర్తుంకిలిసేయరామి హృద ♦ యంబున భావనసేసి దైత్య కూ
లంకష మాక్తికంఁ నఁ జె ♦ లంగు విభీషణుఁ గాంచి యిట్లనున్. ౨_౨

క॥ ఒకదూతను లంకేశ్వరు, నికటంబునకంపి ధార ♦ ణిజను విడ నొ
ప్పికొనెదొ ? యని నేసెదొ? యని, ప్రకటించుట రాజనీతి ♦ పద్ధతి యనఁగన్. ౨_౩

ఉ॥ మేలని యవ్విభీషణుఁడు ♦ మెచ్చె విభాకరపుత్త్రుఁ డిద్దియే
పోలును సద్గుణాఢ్యులగు ♦ భూపులకంచును సమ్మతించె బా
ణాలిని గాక వాక్యముల ♦ నల్పుని వేఁడుట కూడదంచు సం
శీలుఁడు లక్ష్మణుండు నిర ♦ సించుచు వెండియు నన్న కిట్లనున్. ౨_౪

చ॥ చెడుగులొనర్చి వేల్పులకు ♦ శీలకులాంగన సీతఁ గారలోఁ
బడ నునిచెన్ మునీంద్రులకు ♦ బాధలు వెట్టెను ప్రాణి కోటికిన్
బెడఁదలుగొల్పె లోకముల ♦ వీకున నేలఁగ నింద్రభోగముల్
చెడనొడిసెన్ జరించె బహు ♦ చేష్టలఁ ద్రోవలుకాని త్రోవలన్.

తే॥ సిలుగులం గూర్చి మిగుల వం♦చించి నిను, సతివియోగంబుఁగూర్చెన♦య్యతివకడ్డు
పడు యుగాంతంబుఁ జూడఁజొ♦ప్పడుచిరాయు,వొప్పు తండ్రి జటాయువు♦నుక్కడంచె.

ఉ॥ రావణుఁ డిప్డు నీవలపు♦రాణిని వీడనయేని వాని ర
క్షావిధిఁ గాతువేని త్రిజ♦గంబుల నీదగు పేరునిల్చు నా
లావధి లంకనేలు మను♦జా! యను వాక్యము రిత్తవోవదే?
యేవగ నిల్చుఁ దాపసుల ♦ కిచ్చిన నీ యభయప్రమాణముల్? ౮౨౯

చ॥ నెఱియును గౌరవంబు మది ♦ నిల్పి వచించిన యాప్రతిజ్ఞలన్
మఱచితివేమి? లంకఁగల♦మానిత సంపదలెల్లఁగాంచి యి
త్తెఱఁగునఁ జేటుఁగూర్ప మది ♦ తీరద యేమి? యనేక రీతులం
దఱిమి తలంచినన్ దురమె ♦ నామదికిం దగునంచుఁ దోఁచెడిన్

సీ॥ అనుడు రాఘవుఁ డిట్టు♦లను లక్ష్మణా! నేను, మదిలోన నేదియు♦మఱవలేదు
నిక్కంబుగాఁ దుది♦నెగడునదియుఁ బోరె, కాన నాసడి మనస♦మున నేల?
గురుశుక్రులాదిగా♦గురుధర్మశాసకుల్, పలికిన పద్ధతుల్♦దొలఁగఁదగునె?
వీరవర్యుల కేని♦విజయహేతువు క్షమ, రాచపాడియు క్షమ♦రాఁ నొందు

తే॥ మరలమారుతిఁబంపుట♦యురవుకాదు, పగఱకును చుల్కనగుఁగాన♦వాలిసుతుఁడె
పోయి రాఁదగువాఁడు పా♦పులు కలంగి, విక్రమించిన నోర్చి రా♦వెరవరియగు.

తే॥ అనుచు నెల్లవారలు సరి♦యన్న పిదప, నంగదునిపిల్చి నీవేగి♦యసురయెదుటఁ
బలుకవలసిన యర్థంబు♦నలుకులేక, తెలుపుమన నాతఁ డుత్సాహ♦ధీరుఁడయ్యె.

మ॥ తెలివిన్ జానకి వీడి జీవముల ర ♦ క్షిన్ గాచికోల్మెలొ? కా
కిల నీ మస్తకముల్ దినేశకులు.ను ♦ గ్రేష్వాస నిర్ముక్త శా
త లసత్తూర్కార శరమ్ములం దెగిపడన్ ♦ దర్పించి యాయోధన
స్థలి కేతెంచుట మేలొ? రెంట నొకటిం ♦ దర్కింపుమంచాడుమా. ౮౩౧

ఉ॥ మోదముకై యడంగి వెఱ ♦ పూని వసించుట ధర్మమార్గమున్
గాదు పరాక్రమ క్రమము ♦ గాదు మగంటిమిగాదు మేలిమిన్
గాదు విరోధిపక్షమునఁ ♦ గాఁడ శరంబుల నేయుశక్తి నిం
పాదిగఁ గల్గెనేని పొలు ♦ పార నెదుర్చుమ యంచు నాడుమా. ౮౩౨

చ॥ అని పనుపంగ మారుతికి ♦ నవ్వల నెన్నఁగఁదగ్గవాఁడ నీ
వను గరువంబు గల్గెనని ♦ యంగదుఁ డార్యుని పాదపద్మ వం

దన మొనరించి యంబర ప ♦ థంబున సింగము దాఁటుభంగి రా
ముని శరమట్లు లేగె సుర ♦ ముఖ్యులు గాంచి ప్రశంస సేయఁగన్. ౧౩౩

ఉ॥ ఉగ్ర నిశాచరావళుల ♦ యుక్కఱఁజేయఁగ క్షీరసాగరో
దగ్ర భుజంగతల్పమునఁ ♦ దందరమాని యయోధ్యయందు ను
వ్యగ్రమతిం జనించిన కృ ♦ పాళుని యాజ్ఞను వాలిపుత్త్రకుం
డుగ్ర మయూఖుఁడుం గనని ♦ యున్నతదుర్గము దాఁటి యుద్ధతిన్. ౧౩౪

ఉ॥ రావణు కొల్వు చేరి నగ ♦ రస్థ జనుల్ హనుమండె వచ్చెనం
చీవల నావలం బరుగు ♦ లెత్తుచు బంధులఁ జేరుచుండ సే
నావలిఁ గాంచుచున్ హితుల ♦ యార్యుల మంత్రుల యుక్తవాక్యముల్
భావనసేయు దైత్యకుల ♦ వర్యుని గాంచె సభా స్థలంబునన్. ౧౩౫

ఉ॥ కాలును చెట్లు గల్గె జల ♦ రాశిని పూడ్చితిమన్న గర్వముం
బోలఁగఁ గల్గెఁగాక తల ♦ పోయఁగ రాఘవుకార్ముకంబు నే
త్రాలకు గోచరింప నెడ ♦ దన్భయమందునుగాక క్రొత్తగాఁ
గాలుఁడు పుట్టినేమి దశ ♦ కంఠుని ప్రాణము దీయ నేఁటికిన్? ౧౩౬

ఉ॥ భూషలు లేకయున్ సొగసు ♦ పొందిన జానకిమీఁది యాసయున్
దోషముఁ బాపి రావణుని ♦ ద్రుంచెడువార లెవండ్రు? సర్వవి
ద్వేషిబలెం బయిం దుమికి ♦ పేర్మిమణుల్ గొని తెచ్చినట్టియా
పూషసుతుండు చూడఁ బరి ♦ పూర్ణ బలాఢ్యుఁ డటంచు నెంచెదన్.

తే॥ అంగదుం డిట్లు తలపోసి ♦ యగ్ని విషము, కాలుఁడను మూఁటిచేఁ బద ♦ కరములొంది
యున్న కడలినాఁ జను దశా ♦ స్యుండు వఱలు, సింహపీఠకదగ్గఱఁ ♦ జేరి నిలిచె.

చ॥ నిలిచిన యంగదుం దనుజ ♦ నేత ఖరేక్షణపంక్తిఁ జూచి ని
శ్చలమతి వచ్చుహేతువది ♦ చక్కఁగఁ దెల్పుము నీవెవండ వీ
పొలదిను సేవకుల్ గనక ♦ మున్నె శుభంబగు వార్త లుండినన్
బలుకుమ యన్న నాతఁడును ♦ పక్కున నవ్వి వచించె నిర్వ్యథిన్. ౧౪౦

ఉ॥ నిండిన భూతపంచకము ♦ నేత సమస్త జగత్ప్రభుండు మా
ర్తాండకులుం డయోనిజ ధ ♦ రాత్మజభర్త జితేంద్రియుండు కో
దండధరుండు వేదముల ♦ దాఁటిన వస్తువు ధాతతాత శ్రీ
దుండగు రామచంద్రవిభు ♦ దూతగ వచ్చితి నేను రావణా? ౧౪౧

ఉ॥ అంగదుఁ డిట్లుపల్క నఙుఁ ♦ డా? హరియా? హరుఁడా? వనాటులన్
సంగడికాండ్రఁ జేసికొని ♦ సంద్రపుఁ గాల్వను పూడ్చివచ్చి నీ
తాంగన నిచ్చునేమొ కరు ♦ ణాత్మకుఁడై యని పంపినట్టి యా
వెంగలి యో ముకుందుఁడని ♦ వీకున దానవనేత నవ్వుచున్. ౧౪౨

చ॥ నెలను వియన్నదిన్ నొసటి ♦ నేత్రముఁ దాల్చిన రుద్రమూర్తియున్
మెలుపుగ శంఖచక్రములు ♦ పూనిన విష్ణుఁడు లంకలోనికిన్
దలఁకెడువారు వచ్చుటకు ♦ దర్పముతో నొకమర్త్యుకై భయా
కులుఁడవు గాక వచ్చు మొఱ ♦ కుండ వదెవ్వఁడవో వచింపుమా. ౮౪౩

తే॥ అనుడు నిను తనవాలున♦కంటఁగట్టి, వనములందెల్లఁదిరిగిన♦వాఁడు సురల
కొఱకు క్షీరవారాశిని♦తరిచినట్టి, యగచరేశ్వరు పుత్త్రుండ♦నంగదుండ. ౮౪౪

క॥ అన రావణుఁ డిట్లను నీ, జనకుఁడు నామిత్రుఁ డీవు ♦ చనుదెంచుట మే
లెనసెను నరునకు దూతగఁ, జనునయ్యా రాఁగ మేము♦చచ్చితిమె? కటా!

ఉ॥ నీకిపుడే యొసంగితి వ♦నేచరరాజ్యము తండ్రిఁ జంపు లుం
టాకుని వెంటఁ జేతులు మ ♦ డంచి మొగంబును వ్రేలవైచి ని
శ్శ్రీకునివోలె గారవము ♦ చేటుగ నెల్లిద మొందుటేల? నీ
తా కమలాక్షిఁ గొంటినటు ♦ తప్పక గొందును నిన్ను పుత్త్రుఁగన్.

చ॥ మనుజులు నేఁడె చత్తు రను ♦ మానము మానుము మానసంబునన్
వనచరరాజ్య మీదినమె ♦ పట్టము గట్టెద సింహపీఠిపై
దనుజ నిలింప వానర క ♦ దంబము సన్నుతి సేయుచుండ న
త్యనుపమ భోగసం♦పదల ♦ నందుము కల్పముదాఁక వేడ్కమై. ౮౪౭

చ॥ అనవిని వాలిపుత్త్రుఁడు భు ♦ జార్గళముల్ వదనమ్ము ఱొమ్ము ప
ట్టనమును సంచలింప నగి ♦ టక్కరి! యెంతటి మాటలాడె దీ
దనుజులకెల్ల నిందు మృతి ♦ తప్పనిదంచు నెఱింగి రాదె నీ
యనుజుఁడు నిన్ను వీడి సుఖ♦మందఁగ వచ్చెను మమ్ము చేరఁగన్. ౮౪౮

ఉ॥ నోటికి వచ్చినట్లు పెడ ♦ నుడ్గులు ప్రేలుచు నన్ను లోఁగొనన్
గాటపు యత్నముం జలుపఁ ♦ గా వశమాటకు బేలఁగాను నీ
యాటలు సాగవింక నృపుఁ ♦ డంపఁగ వచ్చుట నీచకార్యమే?
నీటుగఁ గుక్క యీయఁ గొను ♦ నే మృగరాజు మృగాధిపత్యమున్?

చ॥ అనవిని రావణుండు కడు ♦ నల్కను లేచియు నీచు వానరున్
దునుమఁగ నాయుధంబు గొన ♦ న్యూనత గల్గదె యంచు నాయువున్
జినిఁగిన మర్త్యు నమ్మి మృతిఁ ♦ జెంద మనోరథమయ్యెనేని వ
చ్చిన పని తెల్పుమన్నఁ గపి ♦ సింహము దానవుఁ గాంచి యిట్లనున్.

ఉ॥ ఇంకను నెమ్మది న్నెనరు ♦ నీఁగని రాముఁడు నిన్ను గాంచి నీ
లంకఁ గలట్టి నీ కుల బ ♦ లంబుల నాశము గోరి పోరికిన్
జంకి మరింప భీతిలిన ♦ సాగునె? నిప్పులు మ్రింగి యేడ్వఁగా
నింకునె? సీత వీడు మది ♦ యించనిచో నని వీడు ప్రాణముల్. ౮౫౧

శా॥ నీయవ్వన్ మడియించుచో మఖమునన్ ♦ నీమామ నుగ్గాడుచో
దాయన్వచ్చిన నీదుచెల్లియలి సౌం ♦ దర్యంబు పోకార్చుచో
నీయాజ్ఞన్నెఱవేర్చు తమ్ముల ననిన్ ♦ నిర్జించుచో రాని పం
దా! యీనాఁడికఁ జూపు పౌరుషము క ♦ ద్దా? దాఁగి జీవింతువే?

చ॥ బదనిక సంతతంబు పర ♦ పాదప భుక్తి గ్రహించుభంగిఁ జె
ల్లిదమగు కల్పు సస్యతతి ♦ తేబరముం బొనరించుమాడ్కి దు
ర్మదులయి ప్రాణివర్గముల ♦ మాడ్చుచునుండిన నీదు బంధులన్
గదనమునందు చంపుతఱిఁ ♦ గావఁగరా విపుడేని వత్తువే? ౨౫౩

ఉ॥ తమ్ముని నన్ను వంచన వి ♦ ధమ్మున దవ్వులకంపి దారఁ జౌ
ర్యమ్మునఁ గొంచుఁబోవు కలు ♦ షాత్ముఁడు పోరొనరింప వచ్చునే?
నెమ్మది సీతఁగాంచి రజ ♦ నీచరులన్ నమయించి పుత్త్రుఁ బా
దమ్మున రాచి మారుతి ము ♦ దమ్మున లంకను కాల్చినన్ సరే. ౨౫౪

ఉ॥ వేగుల భీతిమాన్చి విడి ♦ పించినయప్పుడు వార్ధిరాయుఁడున్
జాఁగిలి మ్రొక్కినప్పుడును ♦ సమ్మతి లంకను తమ్ముఁడొందుచో
సాగరబంధనమ్ము వడి ♦ సాగెడునప్పుడు రాని పంద యిం
కేగతివచ్చు యుద్ధమున ♦ కేడ్తెఱ డాఁగక యాఁటదింబలెన్. ౨౫౫

చ। చెఱఁగలవేల్పు చెల్వలు హ ♦ సించుచుఁ జూడఁగ నల్వలంకులన్
బఱపుగ నున్న నాగ సుర ♦ పద్మదళాక్షులముందు నిన్న భా
స్వరసుతుచే వడిన్ మకుట ♦ భంగమునొందియు సిగ్గుమాలి వెన్
దఱుముచురాని భీరుకుఁడు ♦ ధైర్యముతో దురముం దలంచునే?

చ॥ అని తెలియంగఁ బల్కుమని ♦ యార్యుఁడు పంపెను మేలుగోరినన్
జనకజనిచ్చి రామ పద ♦ సన్నిధి వ్రాలి సుఖంబునొందు మా
పని తగదందువే వెడలఁ ♦ బాఱుము నావెనువెంట నిప్పుడే
యనిమొనఁ బుత్త్ర బాంధవ హి ♦ తానుజవర్గముతోడఁ జావఁగన్. ౨౫౭

ఉ॥ నీటను మంట మింట నగి ♦ నిం జనియించిన ప్రాణసంచయం
బోట భజింప సంగరము ♦ లోజ నొనర్చిన నీవు నేఁడు నీ
వీటనె చేరి శాత్రవులు ♦ వీరరవంబులతోడఁ బిల్వఁగా
నేటికిఁ గాంతయట్ల చరి ♦ యించెదు రమ్మిఁకఁ జావ రావణా! ౨౫౮

క॥ అను నంగదు పలుకులు విని, దనుజేంద్రుఁడు జగము మ్రింగు♦దారుణ కోపం
బున వీనిని పట్టుఁడు ధా, త్రిని మోఁదుఁడు చంపుఁడని వి♦ధించె నలువురన్.

క॥ నలువురు తను పట్టఁగ వా, రలతో వాలిసుతుఁ డుప్ప♦రమున కెగసి వా
రల తలల గిల్లి రావణు, తలకెదురుగ వైచి త్రొక్కి♦తగ నిట్లనియెన్. ౨౬౦

క॥ పొగలెగచు చగ్గులుమియుచు, వెగడొందఁగ వెడలు రామ♦భీమాస్త్రంబుల్
నెగడి నెఱయుటకు మున్నే నగరి విడిచి పాఱిపొండు♦నాల్గు దెసలకున్. ౮౬౧

తే॥ అని పలికి చిందు నల్లమై♦నలమికొని క, లాపముం బోలెఁ గోలాహ♦లముగ నార్చ్చి
చబ్జ బింబంబు దిగినట్టి♦యనువుదోఁప,నంగదుఁడు వచ్చి మ్రొక్కె రా♦మాంఘ్రులకును

తే॥ రావణునితలంపెదియని♦రాముఁడడుగఁ,బూర్తిగాఁ దెల్పెఫలమేమి? మొఱకువాఁడు
శిరములు పదియు రణభూమి♦దొరలుదాఁక, వలపు మానఁజాలఁడనియె♦వాలికొడుకు.

౧౪. ప్రథమ యుద్ధ పటలము. (౨౫౬)

తే॥ రణము తప్పనిదనియుఁ బ్రా♦రంభమయ్యె, ననియు సూచింప మురజవా♦ద్యములు మ్రోఁగె
సైన్యములఁగాంచి శ్రీరామ♦జనవిభుండు, మొగ్గరములతోఁ గవఁకులఁ♦బొదువుఁడనియె

ఆ॥ వార్ధిఁ బూడ్చి మున్ను♦వాడుకపడియున్న, కేలతోడఁ దరులు♦గిరులు తెచ్చి
నగరి చుట్టునున్న♦యగడిత పూర్తిగాఁ, బూడ్చివేయుఁ డిదియ♦మొదటిచేఁత.

తే॥ తరువులను వైచి రాసిక♦తడయఁజేసి, లగ్గపట్టి వప్రంబుల♦నగ్గపఱచు
కొనుఁడు పేరెత్తి సంగ్రామ♦మునకుఁ బిలుఁడు, వెనుకదీయకుఁడో కపి♦వీరులార!

క॥ అను శ్రీరాముని యానతిఁ, గొని క్రోల్పులులట్లు చెలఁగి♦కుధరచరులు దాఁ
పున నుండు తరుల గిరులను, గొని పూడ్చిరి వనధిఁబోలి♦కొఱలెడు పరిఖన్.

క॥ ఎనిమిదవ వనధియన నొ, ప్పిన సైన్యము పరిఖఁ బూడ్ప♦వెడలు జలము రా
మునకున్ సాయపడిన య, చ్చున వాకిండ్లందు దూఱి♦చుట్టెను నగరిన్.

క॥ గెలుపుగల దనుజు కీరితి, మొలకలతోఁ బెల్లగించి♦ముంచిన క్రియ మొ
గ్గలతోడి యబ్జినుల దుం, పల తోడఁ బెకల్చి పూడ్చి♦వైచిరి ప్లవగుల్. ౮౬౯

క॥ నీరములఁ గప్పులు దుముకఁగఁ, దారంబులఁ బాదు తేంట్లు♦తబ్బిబ్బువడన్
నీరజములఁ గల హంస కి, శోరంబులు బెదర మీలు♦స్రుక్కుచుఁ బ్రుస్సెన్.

క॥ ఇందీవరములు మొగుడఁగ, నిందితుఁడగు దనుజుకీర్తి♦నేఁటికి జలధిం
జెందెనని కనులు మాడిచి, కందక మేడిచిన పగిది♦గన్పట్టె నటన్. ౮౭౧

క॥ తమ్ములు పెకలింపంబడఁ, దుమ్మెదలును రొదలు చెడఁగఁ♦దొలఁగి పఱచె హం
సమ్ములు ముక్కులఁ దమయం, డమ్ములుగొని త్రోవ తడఁబ♦డన్ వడిఁ బాఱెన్.

క॥ శిలలు మలలు గుమురగు తరు, వులు దట్టముగాఁగ నిండి♦పూఁడుటచే నం
దలి జలము పొంగి పలు శా, ఖల నదులై పాఱి కడకుఁ♦గడలిం గలిసెన్.

క॥ కొండలు వైచుకొలఁది నుడి, గుండంబులఁ బూఁడి నీటఁ♦గొంచెముగాఁ బై
నుండి కనఁబడెడు తోయజ, షండము లెనసెన్ మునుంగు♦సతుల మొగములన్.

క॥ గౌరవములకు న్నిలయం, బౌ రావణు పెద్దపరిఖ♦ నగచర బలముల్
దోరుపఁగాఁ దోఁచెను నం, సారికిఁ బేదఱిమి కలిమి♦చంచల మనుచున్. ౮౭౫

క॥ అగడితఁ బూడ్చిన కోఁతులు, జగడించిన దనుజ బలముఁ♦జక్కాడుచుఁ బై
కెగసి బురుజులను చేరుచు, మొగుళులు చెదరంగ మోద♦మున గర్జించెన్

క। బలువౌ కనకాచలమని, తలఁపందగి యాకసంబు♦దాఁకెడు దుర్గం
బులపై నెక్కిన వనచర, బలములు తెల్లని ధ్వజాళి♦పగిదిం దోఁచెన్. ౮౭౭

చ॥ రతనపుఁ డొంకియైన గిరి ♦ రాజము మేరువు త్రాసుగుండుగా
జతనునఁ దూఁచఁగా సమత ♦ సాగు వనేచర బృంద మొక్కటన్
మితి యెడమీఱి మెట్టఁగ న ♦ మేయ భరంబు సహింపలేకయో
కుతికిలఁగ్రుంగె నా ప్రహరి ♦ కూల్పఁగ నక్కజ మూర్పు కత్తఱిన్. ౮౭౮

క॥ మురజముల మోయు మదకరి, వరపుల్పై వెలయు డాలు♦వరుసలచే నం
బరము మఱుఁగయ్యె ధూళిం, గుఱుచయ్యెం దెసలు దనుజ♦కోటి వెడలఁగన్.

ఉ॥ భేరుల మ్రోఁత సంబరము ♦ భేదిలె గర్జనచేసె సింగముల్
హారములుం జలించె నట ♦ దశ్వ గళస్థిత కింకిణీ రుతుల్
తేరుల గంటలుం గలిసి ♦ దిగ్బధిరత్వముసేసెఁ దోడుగా
వారణ కంఠ ఘంటిక ల ♦ వారిత రీతిని వైచెఁ దాళముల్. ౮౮౦

చ॥ కులములతో సమూలముగఁ ♦ గ్రూరులు దానవులెల్లఁ గూల ను
జ్జ్వలగతి దేవ మానవుల ♦ సంఘము తావుకొనంగఁ గాల మ
త్యలఘుగతి న్నిమిత్తముల ♦ నారయఁ దెల్పుచునుండ వానరా
వలియుఁ గుతూహలం బడర ♦ వచ్చిన సోఁకులతోడ డీకొనెన్. ౮౮౧

క॥ వానరసేనలు కరదం, ష్ట్రా నఖ తరు గిరులతోడఁ♦జలమునఁ బెనఁగెన్
దానవసేనలు పోరెను, బాణ ముసల ఖడ్గ కుంత♦పరశు గదలతోన్ ౮౮౨

క॥ అమ్ములచేఁ బాషాణము, లమ్ములు నురు తరులచేత♦నఱిముఱి యయ్యెన్
ఇమ్ముగ దూసి వెడలు కుం, తమ్ములచేఁ దెగిన తరులు♦ధరణిం గూలెన్. ౮౮౩

తే॥ కదనమునఁ గపులైవైచిన♦కఠినశిలలు, తగిలి దైత్యులశిరములు♦పగిలి రుధిర
పూరములతోడ మెదడును♦ముక్కులందు, చెవుల నోటను వెలువడి♦చెదరిపడియె.

తే॥ చీఁకటులె యోడిపాఱుమై♦చెన్నుగలుగు, పొలసుదిండులశిరములు♦పొడువఁగాఱు
రుధిరధారలలో వాన♦రులు మలంగి, కేలఁగల తూలతో ధరఁ♦గూలినారు. ౮౮౫

ఆ॥ కోటకొనలనుండి♦కోఁతులువైచిన, తూలు పిడుగులట్లు♦రాలుకతన
తూలు తగిలినట్టి రాకాసివీరుల, నొక్కరైన బ్రదికి ♦ యుండరైరి.

ఆ॥ మిహిరతేజమట్లు♦మిఱుమిట్లు గొలుపు క, న్నులు గలట్టి రక్క♦సులు కడంగి
వైచినట్టి యీఁటె♦లేచిన కపుల లో, మ్ములకు దవులఁ బ్రహరి♦వెలికిఁబడిరి.

తే॥ కపులు మిక్కిలి కోపులై♦కఱచి పొడిచి, మెడల నులిమియు గోళ్లఁ జో♦నాడలు బరికి
కాలఁదన్ని వాలంబుల♦ లీలఁజుట్టి, కొట్టి పెక్కండ్ర సోఁకులఁ♦గూల్చినారు.

తే॥ వంచకులగు దైత్యులువీచి♦వైచియేసి, కొట్టి పొడుచుచు మూఁగఁ గాఁ♦గోఁతిమూఁక
తగ్గి కాలును కేలును♦తలలు మెడలు, తునిసి వేఱయి నెత్తుట♦మునిఁగిపోయె.

ఉ॥ చిట్టునఁ జిమ్మ నెత్తుటను ♦ చెన్నగు బంగరుకోట చూడఁగా
నెట్టనయై ప్రవాళగిరి ♦ యేపునఁ జుట్టినరీతి నేర్పడెన్
వట్టుగ నెత్తుటేళ్లు శవ ♦ పర్వతపంక్తుల నడ్డుదిడ్డుగా
బిట్టున నీడ్చికొంచుఁ గడు ♦ భీకరలీలఁ జనెం బయోధికిన్. ౨౯౦

తే॥ హరిహయుండేని సాధింప♦ననువుపడని, లంకపైఁ బలుజాతుల♦కంకగృధ్ర
వాయసాదులు గుమిగూడి♦వఱలుకతనఁ, గ్రొత్తపందిరివైచిన♦కొమరుదోఁచె

తే॥ నిప్పులంబోలి వెలుఁగొందు♦నెత్తుటేఱు, లనెడి సంజమింటను తమి♦యను కబంధ
పంక్తిచేతులెత్తికొని యా♦వలకునీవ, లకుఁ బరుగువాఱి నర్తించె♦వికటలీల. ౨౯౨

తే॥ భయదమైపాఱు రక్తప్ర♦వాహమందు, మునిఁగినట్టి పక్షుల పక్ష♦ములను తగిలి
పడిన కణములచేఁ బలు♦వన్నెలున్న, తీఁగలన్నియు నెఱ్ఱనై♦ తేజరిల్లె. ౨౯౩

తే॥ చేవతగ్గి రక్తము మేనఁ♦జిమ్ముచుండ, నిలువలేక ప్రాకారమ్ము♦తొలఁగవిడిచి
ప్లవగములు కనకాద్రిపై♦భాగము విడి, ప్రక్కలకు దిగు సంద్రంబు♦పగిది దిగియె

తే॥ ప్రహరియందును బురుజుల♦వాకిళులను, తక్కువానరుల్ పట్టిన♦తలములందు
రాక్షసబలంబు పైఁబడి♦ప్రబ్బికొనియెఁ, గోఁతిమూకలు వెఱచి ది♦క్కులకుఁ బాఱె.

క॥ నక్తంచరు లొత్తుటచే, రక్తాంబువు లీఁది వాన♦రంబులు పోవన్
శక్తు లుడిగి పడెఁ గొని యట, ముక్తాంబకములను కొన్ని♦ముడిఁగెను త్రోవన్

క॥ కోటంబట్టిన వానర, కోటి బలము తగ్గ నసుర♦కోటి కడంకన్
బాటించియార్వఁ దద్ధ్రుతి, వాటముగా నెగసె విలయ ♦ వారిధి రుతినాన్.

తే॥ పటహ కాహళ శంఖ త♦మ్మట మృదంగ, పణవ భేరీ ప్రముఖ విరా♦వములు చెలఁగఁ
జెవులు చిల్లులువోయె నీ♦చీకలాప, యుత పయోధి సంక్షోభంబు♦నతకరించె.

తే॥ కమలగర్భుని నాల్గుమొ♦గములనుండి, సకలలోకముల్ వెలివడ్డ♦సరణినపుడు
దనుజసేనాసముద్ర మ♦బ్దంబునొరయు, నాల్గువాకిండ్లనుండియు♦నడచె వెలికి

తే॥ మత్తగజఘటల్ నడతెంచు♦మలలపోల్కి, నడచి టెక్కెంబులకుఁ దగు♦ల్వాడిన లతలు
కొమ్మలును త్రుంగిపడఁ ద్రోసి♦కొనుచువచ్చె, బిచ్చికిం దోడు భూతంబు♦రెచ్చినట్లు.

క॥ వారణ మదజలములచేఁ, గూరిన పంకమున విలయ♦ఘోరానిల సం
చారము కరణిం బరుగిడు, తేరులు వన్నియల ధూళి♦తెరలఁగ లేపెన్. ౩౦౧

తే॥ ముట్టడించిన కపులచేఁ♦గొట్టఁబడిన, గట్టి కోటయర్ వలువను♦గట్టినట్టి
లంకయనుచెలి ద్రావిన♦వంకతేని, యలలనఁగనొప్పి వెలువడె♦హయచయములు.

తే॥ జరిగినట్టి దినంబులఁ♦బెరిఁగినట్టి, చీఁకటుల ముత్తమొక్కచోఁ♦జేరియుండి
నడచివచ్చిన చందాన♦వెడలఁబాఱె, దనుజసైన్యంబు ధాత్రియు♦దద్దఱిల్ల. ౯౦౩

తే॥ రేఁగి వెలివడ్డ పెంధూళి♦శ్రేణులైన, తలలమీఁది శేషుని మోఁత♦తగ్గునట్లు
మిన్ను ముట్టడింపఁగఁబోవు♦విధము నండ, భిత్తి వెనుబడ దిక్కుల♦నొత్తి యలమె

తే॥ క్రమ్ముకొని యసురులు నెట్టు♦కతనఁ గపులు, విచ్చి వికవికలైనొచ్చి♦విసిగి కలఁగి
గుట్టకొకరుగఁ దిట్టకొ♦క్కరుగఁ బఱచి, యొదిగి చేరిరి సుగ్రీవుఁ♦డున్నయెడను.

ఉ॥ చేవచెడంగ విక్లమము ♦ చెంది ప్లవంగులు పాఱెరాఁగఁ గ్రూ
రావిల మానసుల్ దనుజు ♦ లంతట నంతట వెంబడింప సు
గ్రీవుఁడు కాంచి దంతములు ♦ గీఁటుచుఁ జెంతఁగలట్టి యొక్కపెన్
రావి యగంబు బీఁకికొని ♦ రక్కసి పిందు నెదిర్చిఁ బోఁడిమిన్. ౯౦౬

క॥ ఒక్కొక రక్కసి పిండున, కొక్కొక సుగ్రీవుఁడగుచు♦నురడించి తొలిన్
వెక్కసమై కనవచ్చిన, యక్కరువలిపట్టివొలె♦నని మొనఁ దోఁచెన్ ౯౦౭

క॥ కరి తురగ పదాతులకుం, జరణంబులు విఱుగఁ దొరలి♦చనఁ దేరులు నె
త్తురు టేర్లు విరియఁ గపిపతి, కెరలుచుఁ గైనున్న తరువు♦గిరగిరఁద్రిప్పెన్. ౯౦౮

ఆ॥ ప్రభువు ముందు చొరఁగఁ♦బ్లవగవీరులు కసి, మసఁగి తెంపుమీఱ♦మరలివచ్చి
క్రూరదానవులను♦కొఱకి చీలిచి తన్ని, ఱక్కి విసరివైచి♦ప్రమాల్చినారు ౯౦౯

ఆ॥ లెక్కయిడఁగ రాదు♦లీల ఱాలను ఱువ్వఁ, బ్రాణములను పిడిన♦రక్కసీంద్ర
లెక్కయిడఁగ రాదు♦లీల ధనుర్ముక్త, బాణవితతిఁ గూలు♦బలిముఖములు. ౯౧౦

ఆ॥ ముమ్మరించినట్టి♦పోరున వాసరుల్, బలము చూపి ఱాలు♦వైవ మదము
తూలి కూలు రాక్ష♦సాలి జీవంబులు, దక్షిణాశ నిండెఁ♦దలము లేక ౯౧౧

క॥ పాడెఁ బిశాచ సముత్కర, మాడెఁ గబంధములు మింట♦నఱచెఁ బతత్రుల్
కూడె జలధి నస్రంబులు, చేడె లచట వెదకినారు♦చెలువుల మేనుల్ ౯౧౨

క॥ ఏనుఁగుల మేనులెల్లెడఁ, బీనుఁగులై పడియె నంప♦వెల్లిని మునిఁగెన్
వానరసైన్యము లొక్కెడ, వానఁ దడియు ప్రజల తేవ♦వఱలెం జముపుల్.

క॥ అలుక వహించిన వనచర, బల గురు ఖర నఖర దీర్ణ♦పలలాశి తనూ
గళ దస్ర పూరముల క, వ్వల నీచును కాఱి కనుల♦బరువయ్యెనటన్. ౯౧౪

—: సుగ్రీవుఁడు వజ్రముష్టిం జంపుట :—

తే॥ అసురబలము క్షీణింపఁగ♦నరసి తక్క, వారు పాఱఁదొడంగిన♦వజ్రముష్టి
కాంచి యుగ్రుఁడై తేరిపై♦గ్రద్దమూఁక, ప్రాలుచుండఁ గడలినావ♦పగిదివచ్చి

తే॥ ఎదిరి బాణవర్షము గురి♦యించి కపుల, జెదరఁగొట్టి దిక్పతులును♦బెదరిపఱవ
భాస్కరసుతుండు నొచ్చియు♦వాని నుగ్ర, వీక్షణంబుల మిడుఁగుఱుల్♦వెడలఁజూచి

ఆ॥ తేరిమీఁది కుటికి♦వారువంబులఁ జంపి, సారథి తలఁ దునిమి♦చండగతిని
విండ్లు తూణములును♦విఱిచి వానిశిరమ్ము, పట్టి యూడఁబెఱికి♦పాఱవైచె. ౯౧౫

తే॥ కొండ దొరలినవడిఁ దేరి♦నుండి దొరలి, వజ్రముష్టి భూమింబడ♦వానిసేన
పదరి లంకాపురముత్రోవఁ♦బట్టిపాఱె, వనచరావళి ఘోషించె♦వార్ధిపోలె

—: తూరుపు వాకిటి యుద్ధము :—

తే॥ విలయ వారాశి యుప్పొంగు♦లలని రేఁగి, దనుజసైన్యంబు పూర్వది♦గ్ద్వారమందు
ముట్టియున్నట్టి ప్లవగ స♦మూహములను, తాఁకి పెనుపోరు గావించె♦దర్పమొప్ప.

తే॥ కాలకూటంబువంటి రా♦క్షస గణంబు, శూల కుంత తోమర భిండి♦పాల ఖడ్గ
శర గదాదులు వర్షంబు♦చందమునను, కురియఁ గాలువాలులు తెగెఁ♦గ్రోఁతిగమికి.

తే॥ కొండలును పెనుమ్రాకులుఁ♦గొంచుఁదెచ్చి, వనచరులు చండ పవనంబు♦పగిదివీవ
పోఁకుమూఁకలోర్వఁగ లేక♦స్రుక్కికూలెఁ, గరులుహరులునుధరఁజాప♦కట్టుగఁబడె.

తే॥ దర్పమున దనుజులు శూల♦దండచక్ర, తోమరాది సాధనముల♦తోడఁ బోర
తఱుచు మైగాయములు నోర్వఁ♦దెఱవ నిలువ, లేక వెనుకకుఁ దగ్గె వ♦లీముఖములు.

తే॥ సీలుఁ డొకగొప్ప నీపావ♦నీరుహంబు, వేళ్లతో లేపికొని ఘోర♦విలయపవను
భంగి వీవఁగ రాకాసి♦బలము కుప్ప, తిప్పలై రణ ధారణిఁ♦ద్రెళ్లిపడియె

తే॥ రథములునురథికులునుసా♦రథులురథ్య, ములునుశరభముల్ పంచాస్య♦ములునువార
ణములు నేలకు దొరల వ్ర♦ణములనుండి, వెడలు రుధిరంబు వఱ్ఱయి♦కడలినించె.

తే॥ పాలికలను బీదుగాఁగ న♦ప్పొలసుదిండి, పటలములు పాఱఁజూచి కుం♦భానుఁడనెడి
సైన్యపతి సహింపక శరా♦సారపూర్వఁ, డగుచుఁ గీశవారంబులఁ♦దగిలి నొంచె.

చ॥ అదిగని యెల్గుబంట్ల కొడ ♦ యందు హిడింబుఁడు చండకోపుఁడై
కదిసి కరంబునం బెను న ♦ గంబును గైకొని వైవఁ దేరిపైఁ
బొదలు పతాకఁదొట్టి హయ ♦ ముల్ రథచోదకుఁడుఁ శతాంగముఁ
జదిసెను వాఁడు భూమికి వె ♦ సఁ డిగియెం గపులెల్ల భీతిలఁ. ౯౨౬

తే॥ డిగ్గి వజ్రమువంటి పి♦డికిలితోడ, ఱొమ్ముమోదుచు కుంభాను మా♦ఱుగను మోఁది
రత్నమకుటంబుతోడశి♦రంబుద్రవాల, వానికేలు హిడింబుఁడు♦పట్టికొనియె. ౯౨౭

తే॥ ఒడిసి నడుముపై రెండుకా ♦ ళ్లూఁది యెక్కి
తలనుపొడువ నాల్కయు గ్రుడ్లు ♦ వెలికిఁ బిదుక
సగము తలయుఁ గంఠమునకు ♦ దిగఁబడంగఁ
బ్రాణములఁబాసి దొరలెఁ గుం ♦ భానుఁడపుడు. ౯౨౮

—: ప్రహస్తుని యుద్ధము :—

తే॥ తనదుదండనాథుఁడుతన♦యెదుటఁబొలియు,నలసుమాలిసూనుండుప్ర♦హస్తుఁడలుక
వింటి నెక్కు వెట్టి గుణంబు♦వీనులదర, మొరయఁజేసి హిడింబుపై♦మోహరించె.

ఆ॥ భుజములుబ్బఁ బ్లవగ♦ముఖ్యులు బెగడొంద, విల్లు గుదుసుపడఁగ♦విస్తరించి
యంపవాన గురియ♦నగచరుల్ మొగతప్పి, యోర్వలేక వెనుక♦కొదిఁగినారు.

ఆ॥ శరము లొడలినిండ♦నెరవ హిడింబుండు, విహ్వలింప సేన♦వీఁగుటయును
కని కపర్ది వోలెఁ♦గనలి నీలుఁడు ప్రహ, స్తుని యెదిర్చి పేరు ♦ కొనుచుఁ బిలిచె.

ఆ॥ ఒకఁడు తెచ్చుచున్న♦యొక తిట్ట గొని చేవ, చూపి యొడిసి వైవ♦సోఁకు మూఁక
పఱచి విఱుగ నచట♦బయలయ్యె దానిఁ బ్ర, హస్తుఁ డమ్ములేసి♦యడఁచివైచె.

ఆ॥ మరల నీలుఁడొక్క♦తరువును గొనివాని, విల్లు పడగ తేరు♦విఱుగఁగొట్టి
వారువములఁ జంపి♦సారథిఁ జదియించి, సింహనాద మొనరఁ♦జేయునంత. ౯-33

తే॥ విరథుఁడైన ప్రహస్తుండు♦వీఁక చెడక, దండముంగొని లంఘించి♦ధరణికి దిగి
పరిధి వీడిన భానుని♦పగిది మెఱసి, దుర్నిరీక్ష్యుఁడై నీలుని♦తొడరి తాఁకె ౯-34

ఆ॥ ఓడు గఱచి కనుల♦నగ్నులు గ్రక్కుచుఁ, దాఁకు దనుజవీరు♦నాఁక పఱచి
వానిఁబట్టి యెగుర♦వైచె నాకసమున, కమరులడలి కాంచి♦యవలఁ బాఱ. ౯-35

ఆ॥ వైవవాఁడు మొలఁకు♦వను నొవ్వకుండఁగ, ధరకు దిగుచు సురలు♦తత్తళింప
దండముగొని మోఁదె♦గండని నీలుని, నేత్రములను నోట♦నెత్తురొలుక. ౯-36

తే॥ మోఁదఁ జలనమందక కపి♦ముఖ్యుఁ డడరి, వాని దండ మొడిసికొని♦పాఱవైచి
నేఁటితోఁ దీఱితని త్రావు♦నెత్తురెల్లఁ, బొళుకు బొళుకని గ్రక్కంగఁ♦బొడిచె శిరము.

తే॥ శోణితము గ్రక్కుచును ప్రహ♦స్తుండు కడఁక, చెడక నీలునివక్షంబుఁ♦బొడువ నతఁడు
కినుక నట్లచేయఁగ నిర్వు♦రును వదలక, పోరి రెచ్చుతక్కువ లింత♦పొందకుండ.

తే॥ వాలమున నీలుఁడవ్వాల♦వాని యొడలు, కదలనీయక చుట్టి వ♦క్షంబు పగుల
గాఢముష్టిఁ బొడువవాఁడు♦కందరాద్రి, పగిది వదనంబు దెఱచి జీ♦వముల వీడె.

తే॥ సైన్యనాథుండు పడఁగని♦చదల వేల్పు, లెలమిఁ బాడి విరులు గురి♦యించినారు
రక్తరోమముల్ వికృతదం♦ష్ట్రలు జ్వలించు, మబ్బుద్రిమ్మరు లుడ్డాడి♦మరలినారు.

తే॥ దక్షిణద్వారమున కేగు♦దనుజవితతి, వేఁచి మేడాటలాడించి♦యేడు నదుల
నీరు త్రావించి దళవాయి♦నిహతుఁ జేసి, యంగదుం డార్వ హతశేషు♦లచటువిడిరి.

తే॥ పోటుబంటుల మేటిదు♦ర్ముఖుఁడు రేఁగి, పశ్చిమద్వారమున గాడ్పు♦పట్టి చేతు
లనెడి జమువాతఁ బడిపోయె♦ననుచరులును, మరలలే దొక్కరైనను♦పురము త్రోవ

తే॥ అంత నాలుగు దిక్కుల♦యందు జరుగు, దురముగాంచి రా నరిగిన♦దూతలేగి
దశముఖునితోడ జరుగువృ♦త్తాంత మెల్లఁ, దెలియబల్కి రేకతమునఁ♦దేటపడఁగ.

క॥ వడి భవదాజ్ఞాచక్రము, నడఁబోలిన సైన్యముఖ్య♦నాయకుఁడు ప్రహ
స్తుఁడు తన బలములతో భువిఁ, బడియెను తజ్జీవములు ది♦వంబున కరిగెన్. ౯౪౪
క॥ శూలకరులు దనుజులు కాం, తాళముతో నడచి దక్షి♦ణద్వారమునన్
వాలికొడుకుచే ధారణి, పాలై రని నడపు మన సు♦పార్శ్వుం డీల్గన్. ౯౪౫
తే॥ ఉత్తరపు గవఁకున కేగి♦యున్న వజ్ర, ముష్టియును పడమటితట్టు♦మొనయు దుర్ము
ఖుండు నేఁబడివెల్వ ల♦కుంఠితబలు, లడరి పెనుపోరు గావించి♦యడఁగినారు. ౯౪౬
ఆ॥ మంటవైచు ఘృతము♦మాడ్కి నవ్వార్తలు, ప్రభుని మనము మిగుల♦రగులఁ జేయ
నుండియుండి యేమి♦యును దోప కెడనెడ, వేఁడి యూర్పులను♦విడుచుచుండి.

ఉ॥ తూరుపు వాకిటన్ సమర ♦ దోహలు సైన్యపతిం బ్రహస్తుతోఁ
బోరిన వీరుఁడెవ్వఁ డది ♦ పోలఁగఁ దెల్పుఁడి యన్న వారలున్
గౌరవకీర్తులన్ దిశలఁ ♦ గప్పిన నీలుఁడు వహ్నిపుత్త్రుఁ డం
గారము వూఁగాల్చిన ర ♦ కంబున నేనల రూపుమాపఁగన్. ౯౪౮
మ॥ విలయాదిత్యనిభంగి రేఁగి సమరో ♦ ద్వేగంబు చూపించి బి
ట్టలుకం దాఁకి ప్రహస్తుఁ డుగ్రతర బా ♦ ణాసారముం గూర్ప మాం
సల దమ్యంబు జడిం జరించు క్రియ రో ♦ సంబార నీలుండు ని
శ్చలరీతిన్ జరియించె నిర్వ్యరకు ము ♦ ష్టాముష్టి యయ్యెం దుదిన్.
ఉ॥ అంత దురంత దుస్సహ మ ♦ హాశనిఁ బోలిన నీలు ముష్టిచే
నంతకు నింటి విందయి ప్ర ♦ హస్తుఁడు వోయెఁ దదీయసేనలో
నింతకు మేము దక్క మఱి ♦ యెవ్వరుఁ గ్రమ్మఱలే దనంగ దు
ర్దాంత పరీత రోషుఁడయి ♦ రావణుఁ డాశలు మండఁ జూచుచున్. ౯౫౦
ఉ॥ వింటిర వింతవార్త యిది ♦ వీనులఁగాల్చె మనస్సు మాడ్చె వే
గంటిని గెల్చినట్టి రణ ♦ కర్కశు నొక్క ప్లవంగుఁ డాజిలో
గెంటెనె? యెల్క పిల్ల హరి ♦ కిం గనకాద్రి ధరిత్రి దొర్లెనే?
మంటను గొల్పు మిడ్డు ఱొక ♦ మాత్రముగాఁ దలఁపంగ రాదెటన్.

—: రావణుఁడు రణమున కేగుట :—

చ॥ అని యొకకొంత చింతిలి ద ♦ శాస్యుఁడు బాణ కృపాణ పాణులన్
గని రణభూమికిం బదఁడు ♦ కంటు సమ స్తము దీర్చికొంద మే
నును తగ వత్తునంచు వడి ♦ నూత్న కలాప మలంది మేలి భూ
షణ కుసుమాంబరాదులు భృ ♦ శత్వరఁ దాలిచి యెక్కెఁ దేరిపై.
సీ॥ ఆ తేరు వేయి హ♦యంబులఁ గలయది, శరనిధి యంతటి♦పరపుగలది
సురలోక మంతటఁ♦దిరిగినయది యింద్రుఁ, డోడి నొచ్చిన యప్పు♦డొసఁగినయది

యిష్టదేవత రుద్రు♦నెలమి ధ్యానించి డా, పలిచేత నున్నట్టి♦ప్రథిత ధనువు
శింజినీ రవ విశే♦షంబున యముని యా, యుష్కాలమును గూడ♦నూడ్పఁగలది

తే॥ మఱియుఁ గేల ధరించిన♦మహిత సాధ, నములు దిగధీశ దార్ఢ్య వ♦క్షములఁ దాఁకి
మొక్కవోనివి తొడిఁగిన♦బొందడంబు, వజ్రమయమై యభేద్యమై♦వఱలిన యది.

తే॥ వీవఁబడు చామరములచే♦విరిసి వార్ధి, నీరు నురుగుగట్టఁగ రజ♦నీచరుండు
రమణ ముత్యాల గొడుగు శి♦రమునఁ గ్రాలఁ, బూర్ణ శశిక్రిందఁగల జల♦ముచముఁబోలె

తే॥ పటహములు మ్రోఁగె వానర♦బలము కలఁగి, పరవ నిర్జరుల్ చెమ్మట♦పట్టి నుసల
నండభిత్తిక లగల శం♦ఖాది సమర, వాద్యములు మొరసెను జీవ♦భయదరీతి.

క॥ వీరులు హరులును కరులును, తేరులుఁ గ్రిక్కిఱియ నడచు♦దితిజుల నడుమన్
వారిధులు పొంగి చుట్టిన, మేరువుక్రియ రావణుండు♦మీఱి వెలింగెన్. ౯౫౬

తే॥ ఏడుతంతుల వీణ యా♦పెసఁగు ధ్వజము, విలయకాలుని నాలుక♦లలినిగ్రాల
దనుజ వారాశి నేఁటికి♦దాఁటఁగలిగె, ననుచుఁ జూడవచ్చిన సుర♦లడలిపాఱ.

తే॥ కనులకోపాగ్నిచేఁ బొగల్♦గ్రమ్మ నల్ల, సోఁకుమూఁకల యెఱ్ఱని♦జుంజులైన
వెంద్రుకలు తెల్లఁబాఱ దా♦పించు బంధు, సంఘములు గాంచి మిక్కిలి♦సంశయింప

క॥ అరదంబుల భటకరముల, ద్విరదంబుల మీఁది సిడము♦తెట్టువ లొరయన్
మరుదంబు శైవలిని ఘన, శరదంబులఁ గల జలంబు♦సమయఁగ వట్టెన్. ౯౫౯

తే॥ పూని వాఁడియాయుధములు♦మోచికొనుచు, వేలకొలఁది పిశాచముల్♦వెంటరాఁగ
గంట లులియుఁ దేరులు వెంటఁ♦గదలిరాఁగఁ, గదనరంగంబునకుఁ బంక్తి♦వదనుఁడరిగె.

తే॥ రావణుఁడు గొప్పసేనతో♦రణముసేయ, వచ్చెనని రామునకుఁ గపి♦వరులు దెలుప
భూమిజకు నేఁడు కారా వి♦మోచనంబు, గలుగునన్న యామోదంబు♦గాంచె నతఁడు.

—: రాముఁడు రణ సన్నద్ధుఁ డగుట :—

తే॥ కర్మముల తొల్లఁ గాంచిన♦ఘనులు దివ్య, దృష్టిచేఁ గాంచుటకు ముఖ్య♦దృశ్యమైన
రామచంద్రుండు నారచీ♦రను దిటంబు, గాఁగఁ జుట్టి మధ్యంబునఁ♦గత్తిఁ జెక్కి.

తే॥ జగములం గొల్వఁజాఁచిన♦చరణములను, పడుకు నొక పడఁతిగఁ జేయు♦పాదములను
భక్త హృదయంబులను వెల్గు♦పదములందు, చెలువు.పనిగల వీరమ♦ద్దెలు ధరించి.

తే॥ ఒత్తుగాఁ జుక్క లలరిన♦యుప్పరంబు, పగిది వెలుఁగొందు కవచంబు♦బిగువుగాఁగఁ
దొడిగె శ్రీవత్సమలరు న♦వ్యోడను లక్ష్మి, యెడయు కతన నొవ్వ దనుచు♦నెంచెనేమొ!

తే॥ శర్మద కరాంబుజములకుఁ♦జర్మ కవచ, మొనయఁజుట్టిన యొప్పిద♦మెంచిచూడ
నీవి మ్రాఁకుఁ గొమ్మల నెడ♦మీఁయకుండ, నల్లత్రాఁచు చుట్టిన లలి♦నల్లసిల్లె.

తే॥ కేలఁబగళుల నొక్కటే♦రీతి వెలయు, తామరలఁ దేఁటులుండు చం♦దమున నొప్పి
శ్రేణులై యొత్తుగా నున్న♦వ్రేళ్లకంత, గోధికాచర్మ కవచంబు♦గూర్చినాఁడు.

తే॥ బహుళపద్ధతుల్ గలిగిన♦భాషలందు, నారితేఱి శాస్త్రంబుల♦ననుసరించు
సుగుణులగు కవీంద్రుల వచ♦స్సులను పోలి, పొల్చు నక్షయ తూణముల్♦దాల్చినాఁడు.

తే॥ మొగులునం దోఁచు మెఱుపను♦పగిది మెఱయు,వీరపట్టంబు నుదుటను♦వెలయఁగట్టి
మలయు లేఁగాంతి గల వన♦మాలతోడఁ, దులసిమాలయు రణమాల♦తో ధరించి.

తే॥ సకలలోకంబులును చరా♦చరచయములుఁ, దాను వేఱుగానున్న ప♦ద్ధతియు నిట్టి
దనుచు నూహింప మనము స♦మర్థులమొకో? అతఁడు చేకొన్న విల్లు వే♦ఱగునె తనకు?

తే॥ సురలు నరులును మోదించి♦విరులు చల్ల, గొప్ప వానరసేనతోఁ♦గూడి రామ
విభుఁడు పాలకడలితోడ♦వెన్నుఁ డరుగు, దెంచి ప్రత్యక్షమైన రీ♦తిగను దోఁచె.

తే॥ ప్రళయవేళను రుద్ర రూ♦పంబునొంద, జగములను నాశ మొనరించు♦పగిదినొప్పి
విపుల సేనాముఖంబున♦విల్లుదాల్చి, నిలిచియున్న లక్ష్మణుని స♦న్నిధిని చేరె.

తే॥ అంత దక్షిణ దిఙ్నాథుఁ♦డగు యముండు, తనదుకృత్యంబు త్వర నెడ♦గొనక నడప
నుభయసేనలు కలసి యొం♦డొంటిఁ దాఁకె, వనధి వనధి యెదిర్చిన♦వైనమడర.

తే॥ అన్ని దెసల దంష్ట్రిల కాంతు♦లలమికొనియెఁ, బడియెఁ గనక రాసులపోల్కిఁ♦గపి శవములు
దనుజ కుణపముల్ సెలతెట్టు♦లనఁగనొప్పె, వింత వాన కురిసినట్లు♦వెలసె దురము.

తే॥ తెగియెఁ దలలు ప్రేవులు జాఱెఁ♦దేరు లురలెఁ, గెడసె ఖురువులు కరులును♦మడిసె నమర
మేదినియుఁ బీనుఁగులచేత♦మిట్టయయ్యె, నెల్లదెసలకు నెత్తురు♦టేఱ్లు పాఱె.

క॥ ఘోరాకారులు వానర, వీరులు హస్తములఁ బొడువ♦విటతాటముగా
వారువము లురలె రాక్షస, వారముల యురమ్ము లగలెఁ♦బడగలు విఱిగెన్.

క॥ తతసేతువు తెగు లలి శో, ణితవాహిని విరియ దనుజ♦నేత యదరి యు
ద్ధతగతిని శింజినీ టం, కృతి యొనరుప బెదరి చెదరెఁ♦గీశచయంబుల్. ౯౭౬

క॥ పిడుగు బెడిదంపు మ్రోఁతకు, నడఁగి యొదుఁగు సర్పరాజి♦యనువునఁ బ్లవగుల్
పడి లేచి పాఱిరి తడఁ, బడిరి వడఁకి రురలి రాస♦వదలిరి భీతిన్. ౯౭౭

క॥ నిర్దయుఁడగు దనుజేంద్రుని, దుర్దమ గుణరవము దివము♦దూఁటింపఁగఁ ద్రా
సార్దితులై రసుకులె యన, నిర్దేశము లేల ప్లవగ♦నిచయము పాటుల్ ?

తే॥ ఖేచరులు పరువిడి తల♦దాఁచుకొనిరి, లక్ష్మణుండును ప్లవగ వ♦ల్లభుఁడు దనుజ
పతి విభీషణుఁడును తగు♦పగిది యరయ, నిలిచి రితరులు పాఱిరి♦నివ్వెఱపడి.

చ॥ అవనిఁ బెకల్పఁజాలిన బ ♦ లాఢ్యుఁడు రావణుఁ డీడ్చు శింజినీ
రవమునఁ బద్మజాండ వివ ♦ రంబును ఝల్లడమందె భీతిమై

దివిజులు కల్పకాల సము ♦ దీర్ణ మహాశని యంచుఁ బాఱి రీ
పవిది నరామరాదులకు ♦ బాధలుగూర్చుట తారకాణగాఁ. ౯౮౦

క॥ చండగతిఁ బడెడి పిడుగనఁ, గొండనొకటి వైచెఁ బ్రొద్దు♦కొడు కద్దానిన్
మండెడు కినుకను దశవద, నుండొక బాణమున నుగ్గు♦నూచము చేసెన్. ౯౮౧

క॥ అందులకు భానుసూనుఁడు, డెందంబున రోసి వసుమ♦తీ గర్భము ప్రి
లం దరు పురవడిఁ బెకలిచి, యందికొనియె హస్తమున న♦హంకృతితోడన్.

క॥ చేపట్టిన పెను కుజమును, తూపులచే రావణుండు♦తునుకలు సేయన్
గోపంబున సుగ్రీవుఁడు, దీపించుచు నొక్కగిరిని♦ తేఁకువ వైచెన్. ౯౮౩

క॥ దాని నొకమ్మునఁ దునియలు, గానేసి వనాటులెల్లఁ♦గలఁగుచుఁ బఱవన్
బూని విలు గుడునువడ నొక, బాణపు మొదలంటి తూఱ♦భానుజు నేసెన్.

క॥ ఆవేఁడియమ్ము చొర ను, గ్రీవుండు కలంగెఁ గలఁగి♦కీడ్పడు మున్నే
పావని తత్స్థితి యెఱిఁగిన, కైవడిఁ జని యడ్డుపడియె♦క్షణకాలమునన్. ౯౮౫

చ॥ తెలిసిన మూర్ఖ! కీశ జగ♦తీపతి క్లేశము తీఱునంతలో
పల నను దాఁకి వీఁక బహు ♦ భంగుల సంగరముం బొనర్త్రుముం
గల ! నని వాయుపుత్త్రుఁ డడు ♦ గంగఁ గృపాళుత మున్నువీడినన్
వలనఱి వెండిఁ జచ్చుటకు ♦ వచ్చితివే యని రావణుండనెన్. ౯౮౬

ఉ॥ శైలమొకండు మారుతి వె ♦ సంగొని వైచిన దానిమీఁది మే
ఘాలియు మాఁడి నింగి కెగ ♦ యంగని పంక్తిముఖుండు సాయక
జ్వాలలచేత బూది సలు ♦ పన్ మఱియొక్క నగేంద్రమెత్తి యు
ద్వేల బలంబునన్ విసరి ♦ వేసె దిశల్ వడి రింగు రింగనన్ ౯౮౭

తే॥ పిడుగుకంటెను వడిగాఁగ♦వెడలి శిఖరి, దనుజు నమ్ముల నొకలెక్క♦గొనకమీఱి
వాని భుజములఁ దాఁకి శా♦పంబువోలె, బాహుపురులతో నదియును♦భగ్నమయ్యె.

ఉ॥ ఇంచుకనొచ్చి రావణుఁడు ♦ హేలగ వేఱొక శైలమెత్తి తా
టించఁగనున్న వాయుజుఁ గ♦డింది బలంబున నారి లాగి పా
టించి యురంబుగాఁడ నిగి♦డించిన నొవ్వక గాడ్పుపట్టి యం
కించి కుజంబు వైచి యడఁ ♦ గించెను సారథి పంచజీవముల్. ౯౮౯

తే॥ మఱొక చోదకుఁ డంతలోఁ♦దఱిసి నడప, నసురనాథుండు వందనా♦యకము లేసి
ఎరియు మోదుగువలెఁ గళే♦బర మొనర్ప, సుంతనొచ్చి కర్వలిపట్టి♦సొమ్మసిల్లె.

ఉ॥ ప్రేలుచు ఱాలు ప్రూఁకులను♦వీచుచు గోళ్ళులతోడఁ బండ్లతో
నాలము సేయు క్రోఁతులని ♦ యక్కటికన్ మదినూని వీడుచో
నేలిద మింత యయ్యె నిఁక ♦ నే ధనువుంగొని యాజి నిల్వఁగాఁ
దూలక మీరు ప్రాణముల ♦ తో జయముం గొని యేగువారలే ! ౯౯౧

చ॥ అని వికటంబుగా నగి యు ♦ గాంత వలాహక భంగిఁ గ్రమ్మ మా
ర్గణ గణ వర్షముం గురియఁ ♦ గాల సమీర మహోరితాబ్ధి మా
ఢ్కిని కలగుండు పొందుచును ♦ కీశులు పర్విడ లక్ష్మణుండు నా
ఘన శరపాళి వీనిఁ గడి ♦ కండలు సేసెద నంచు డాయుచున్. ౮౮౨

—: లక్ష్మణ యుద్ధము :—

మ॥ లయ కాలాంబుద ఘోషణంబుక్రియ లీ ♦ లన్నారి మ్రోయింప దు
ర్భయ సంతాపము లొంది మాయలను దు ♦ ర్వారంబుగాఁ గొన్న దు
ర్నయ దైతేయులు సింహగర్జనము నా ♦ రన్విన్న మత్తేభ సం
చయ భంగిం గడు విహ్వలించిరి రణో ♦ త్సాహంబు చల్లాఱఁగన్.

మ॥ తన సైన్యంబుల తీరుగాంచి యమ నే ♦ త్ర భ్రూనిభంబైన ల
క్ష్మణ బాణాసన రావమున్ విని మదిన్ ♦ జంకొంద కీసీచుఁడున్
మనుజుండే యని నవ్వి రావణుఁడు స ♦ న్మాణిక్య దీప్తి ప్రభా
జనకంబుల్ ముకుటంబు లున్నతములై ♦ సాఁగన్ బడిన్ గర్జిలెన్.

చ॥ పడియెడు వానచిన్కులొక ♦ పద్ధతి లేకయ క్రాలులీల నొ
త్తడిగల లక్ష్మణాశుగ క ♦ దంబము తేరుల గుంపుమీఁదఁ ద
త్తడులపయిన్ మతంగజ వి♦తానముపై దనుజ వ్రజంబుపై
నడర రణాంగణంబు రుధి ♦ రాశయమై కనుపట్టె నెల్లెడన్. ౮౮౫

తే॥ కరుల మదజల ముఖములఁ ♦ గాఁడినట్టి, సెలలు వెనుకటి కాళ్లలో♦వెలలి యరుల
నక్షమ్ములఁ దొల్చి తేరుల♦యక్షములను, విఱిచి నిలువక యటనుంటి♦వెలికినేగు.

తే॥ పగఱు రేఁపినశరులువా♦ర్వములుసమయ,వ్యూహమమరినయసురసం♦దోహమడరి
మొనసి కైదువులను లోక♦పుణ్యఫలము, వంటి శ్రీరాము తమ్మునిపై♦నివైచె.

ఉ॥ వైచి విరోధి మానవుఁ డ ♦ వార్య పరాక్రము దానవేంద్రుపై
నేచుఁచు డాసెనేని మన ♦ కేటికి బీరములంచుఁ బల్కుచున్
దాఁచక యిచ్చుచుండెడు సు ♦ దారుని చుట్టును మూఁగు పేదలౌ
యాచకులట్లు దానవు ల ♦ హమ్మతి లక్ష్మణు చుట్టుముట్టఁగన్. ౮౮౭

చ॥ ఎడపడకుండ దానవుల ♦ నేసి సురారుల వాఁడికైదువుల్
వడిఁ బడఁద్రుంచి తప్పివడు ♦ వాని భరించె సుమిత్రపట్టి ; యు
గ్గడువుగఁ బాణము ల్గొనఁగఁ ♦ గాలుఁడుఁ జేఁదఱనొందె రక్తముల్
కడలిని చేరనీక యన ♦ కట్టగ నేర్పడ నాజిఁ బీనుఁగుల్. ౮౮౮

ఉ॥ త్రుంగెను వీరమస్తములు ♦ త్రుంగెఁ గరంబులు వ్రేళ్లు పాదముల్
త్రుంగె నురంబులున్ గటులు ♦ త్రుంగెను శూలములున్ నరాజులున్

ద్రుంగె శరాసనంబులును♦ద్రుంగె శరంబులు బాణతూణముల్
ద్రుంగెను తక్కువైదువులు ♦ ద్రుంగెను దానవ శౌర్యసారముల్. ౧౦౦౦

ఉ॥ త్రెవ్వె శతాంగ సంఘములు ♦ త్రెవ్వెఁ దురంగమ దీర్ఘ కంఠముల్
త్రెవ్వె మతంగజాంగములు ♦ త్రెవ్వెఁ బదంబుల వీరమద్దియల్
త్రెవ్వెఁ బ్రసూనమాలికలు ♦ త్రెవ్వె హిరణ్మయ వజ్రవర్మముల్
త్రెవ్వె ధ్వజ వ్రజంబులును ♦ త్రెవ్వె సముత్సుకతా విరావముల్ ౧౦౦౧

చ॥ తరమిడి సంగరావనిఁ బ ♦ దాతి వితానము గూల దానిపైఁ
దురగ నికాయముల్ తునిసి ♦ తూలఁగ వానిపయిన్ మదేభముల్
దొరల మదేభరాజిపయి ♦ దొంతరలై పెనుతేరు లుర్లఁగా
శిరములు వానిపైఁ బడఁగఁ ♦ జీమకునేని యెడంబు లేదటన్ ౧౦౦౨

చ॥ వడివడి లక్ష్మణుండు శర ♦ పంక్తుల నెత్తుట కూర్చు టేచ్చుటల్
విడుచుట యేదియుం దెలియ ♦ లేక నిలింపులె మిట్టిఁజూచి రా
విడిచిన బాణముల్ దనుజ ♦ వీరుల మేనులఁ జొచ్చి పోక విం
గడముగఁ గానరైరి మఱి ♦ కాంచిన దచ్చటి పీన్గురాసులే!

తే॥ చండకోపు లసురులేయు♦శక్తి శూల, పరశు పట్టిస కుంత తో♦మర గదాది
వివిధ సాధనములు భిన్న♦భిన్నములయి, పడియెఁగాని తప్పినది క♦న్పడఁగలేదు.

చ॥ సమర ధరిత్రిఁ జేరిన య ♦ సంఖ్యములైన మదేభముల్ తురం
గమములు కేతన స్ఫురిత ♦ గాంగ రథంబులు వ్యాఘ్ర ఖడ్గ సిం
హములును తక్కు జీవములు ♦ నమ్మలఁ గూలెనకాక సుంత స
క్రమమున నిల్చినట్టివియుఁ ♦ గ్రమ్మఱినట్టివి లేవ యయ్యెడన్. ౧౦౦౩

మ॥ తనవారల్ తలలూడి కాళ్లుతెగి హ♦స్తంబుల్ సగంబై రణా
వనిఁ గూలం బెఱవారు డాఁగి పఱి వో ♦ వం బంచబంగాళమై
మొనయన్ నిల్చమి లక్ష్మణుండు విజయా ♦ మోదంబుతోఁ బేర్చుటం
గని రక్షోధిపుఁ డక్షులం దసహనో ♦ గ్ర క్రోధముం జూపుచున్. ౧౦౦౪

మ॥ జవనాశ్వంబులఁ బూన్చినట్టి రథమున్ ♦ సంగ్రామ రంగంబునం
దవలీలం బఱపించి బిట్టులుక డా ♦ యంబోవ నిర్భీతి రా
ఘువు తమ్ముందును గాంచి యోరి జగదొం ♦ గా! యింక నేమార్వ నీ
కవునే? యంచు నిశాత బాణములచే ♦ నంగంబు నొప్పింపఁగన్. ౧౦౦౫

ఉ॥ ఏసిన తూపులెల్ల శపి ♦ యించిన సంచునఁ దాఁక సోఁకు బా
ణాసన మొక్కువెట్టి కొన ♦ లంటఁగ నీడ్చి శిలీముఖంబు లు
ద్భాసిత రీతిగాఁ బఱపి ♦ తచ్ఛరముల్ నడుమన్ హరింప ని
ల్లే సమరాన నిల్వుమని ♦ యేపున లక్ష్మణుఁడేసెఁ దూపులన్. ౧౦౦౬

తే॥ వర్షముం బోలెఁ జఱపిన♦ బాణచయముఁ, దొలఁగఁజేసి సౌమిత్రిని♦ తూణమందు
శరము లెత్తనీయక చేసి♦ మెఱసె ధర్మ, మెల్లఁ జదివియు మఱచు లం♦ కేశ్వరుండు

—: హనుమ ద్రావణ ముష్టియుద్ధము :—

ఉ॥ అత్తఱి సొమ్మదేఱిన మ ♦ హాబల నందనుఁ డడ్డువచ్చి దు
ర్మత్తుఁడ! నీచమాయలను ♦ మానుము పందువుగూర్తు నిప్డు నీ
కెత్తిన కాలదండమిది ♦ యెత్తెఱఁ గల్గిన వాఁడవేని నీ
చిత్తము వేఱువంకలకుఁ ♦ జేర్పక చూడుము నన్ను రావణా! ౧౧౧౦

చ॥ గెలిచితి మూఁడులోకముల ♦ గెల్చితి దిక్కులనెల్ల ద్రేల్మిడిన్
గలఁచితి పింద్రుకీర్తి కల ♦ కాలము చెల్లద యొక్కతీరుగా
నలఁచెదఁ జూడు నేఁడిట వి ♦ నాశము తప్పదు నీకు నంచు న
గ్గలికముతోఁ ద్రివిక్రముని ♦ కైవడి లాయుచుఁ గేలు సాఁచుచున్.

శా॥ చాపాద్యాయుధవిద్యలెల్లను విశే ♦ షస్ఫూర్తి సాధించి తీ
వ్రాపారంగ భుజంబు లిన్ని యతిశా ♦ యిత్వంబునం బొంది దో
ర్వ్యాపారాంచిత సత్త్వముఁ గలిగి వి ♦ క్రాంతిన్ విజృంభించి స
న్నేఁప నిల్చితి నిల్వు మన్నిటిని మా ♦ యింతున్ వెసన్ ముష్టిచేన్

చ॥ పలుకులచే ఫలంబు గను ♦ పట్టదు దిగ్గజ శంభుశైలముల్
బలుపిడి నోర్చు ధీర! యొక ♦ పాటిది కింగిరి కోఁతి ముష్టికిన్
న్నిలుతువె! నిల్చితేని విను ♦ నీ పిడిపోటున కిత్తు బొమ్మ నీ
బలమున కోర్తుఁ గాని మఱి ♦ వాఁడిమి చూపఁ దలంప నీయెడన్.

చ॥ అనవుడుఁ బంక్తికంఠుఁ డని ♦ లాత్మజు పల్కుల నన్నుతించి నీ
గొనములు మెచ్చఁగూడుఁ బలు ♦ కుల్ మగపాడికిఁ దగ్గయట్టి పీ
యనువున నీవుగాక మఱి ♦ యన్యుఁడు నాయెదురన్ వచించునే?
ఘనమగు నీదు కీర్తికి జ ♦ గంబులె కొల్వఁగఁ గొల్తకోలతా! ౧౧౧౪

చ॥ అసదృశ వీరపుంగవుఁడ ♦ వాయుధ మొక్కటి లేక దైత్యులన్
వసమఱఁ జంపినాఁడవు త ♦ పంబునఁ బొందిన చాపఖడ్గముల్
దెసలు భ్రమింపఁబట్టి పెను ♦ తేరున నెక్కిన నాదు సన్నిధిన్
నుసలక పల్కి నిల్చిన ఘ ♦ నుల్ నినుపోలెదు వార లుందురే? ౧౧౧౫

చ॥ క్రతుభుజు లాదిగాఁగఁ ద్రిజ♦గంబులఁ దిక్కులు దక్క నెవ్వరున్
బ్రతుకఁగఁ గోరువారు బవ♦రంబున నన్నెదిరించి నిల్తురే?
కొతుకక నిల్చి వక్షమునఁ ♦ గ్రుమ్ముమటంచు వచించి తిట్లు ధీ
రత నివి పల్కఁగాఁ దగిన ♦ ప్రజ్ఞలుగావు మహాబలాత్మజా! ౧౧౧౬

తే॥ చేతు లిరువది కీర్తిగాం♦చినవి కలవు, శయము లొకరెండె నీకుఁ గే♦సరికుమార!
కఱుదులాడితి జయమింత♦కంటెఁ గలదె? తగిలి నీతోడఁ బోరుట♦తగవుకాదు.

తే॥ దిక్కులం గెలిచిన కీర్తి♦తెఱఁగుమాయ, నింతకంటె వేఱొండునా♦కిలను గలదె?
బాలు నక్షు నేలం బెట్టి♦కాలరాచి, నట్టివైరి నాముమ్నిట్టు♦లాడుచుందె?

ఉ॥ పగ్గెలు పల్కినాఁడ విటు♦పల్కుట సాజమె మాఱెఁ గాలముల్
స్రగ్గిన మాఱుపల్కినఁ బొ♦సంగెడు లాభములేదు అట్టుచే
సిగ్గిలి నిన్నుదుర్వ నిర♦సించుచునుంటి జగంబు చూడఁగా
మ్రొగ్గక వచ్చి నీదు పిడి♦పోటునఁ గ్రుమ్మను ఱొమ్ముమ్రాఁపెదన్

తే॥ అసురవిభుఁ డిట్టులాడ మే♦లనుచు హనుమ, లీలఁ దేరిపై కుఱికి నే♦త్రాల మిడుఁగు
లురల సరులతోఁ గవచంబు♦నొడలు పొడిగఁ, బడఁగ వక్షమ్ముఁ బొడిచెను♦వజ్రముష్టి.

తే॥ కొండ లిసుకమై రాలిన♦కొమరుదాల్చె, పెరుఁగువలెనై మొదడు వచ్చి♦వెలికినుఱికెఁ
దలలు పదియును మెడలపై♦నిలువలేక, వ్రాలెనసురుల జీవముల్♦వ్రాలెఁ దోడ.

ఉ॥ జాఱెను వీరచాపములు♦జాఱె గుణంబులు జాఱె ఖడ్గముల్
జాఱె మనస్థిరత్వమును ♦ జాఱె జయాశయు సత్త్వశక్తియున్
జాఱె శరీర దార్ఢ్యమును ♦ జాఱెఁ దెగింపును జాఱెఁ దేజముల్
జాఱెఁ బరాక్రమంబు దను♦జ ప్రభు ఱొమ్మున నిప్పు జాఱఁగన్.

తే॥ ముష్టిపోటుచే నురమున♦మున్ను విఱిగి, నాటియుండిన దిఙ్మద♦నాగదంత
ములును దశవదను యశంబు♦వలెనె కాని, వీఁపునన్ దుస్సి పుటుకున♦వెలికివచ్చె.

చ॥ చిరిఁగిన కంకటంబున ఖ♦చించిన రత్నచయంబు దిక్కుల
ట్లురవడి దిక్కులం బఱచె ♦ నుల్లమునందలి ప్రాణవాయు సం
చరణము తగ్గ రావణుఁడు ♦ శైలము తల్లడమందు భంగి ని
బ్బర మొకయింత లేక గరు♦వంబు చెడం జలియించె మిక్కిలిన్. ౧౦౨౪

చ॥ అమరులు సంతసిల్లి కడు ♦ హర్ష రవంబులు సేసి స్వర్ణ పు
ష్పములను చల్లి దీవనలు ♦ సల్పిరి రక్కసు లీర్ష్యనొంది రు
ల్లముల ముదాతిరేకమున ♦ లంగలు వేయుచుఁ గీశరాజ పం
క్తిముఖుని కీర్తి మాసెనని ♦ కేకలు వైచెను మైగగుర్పుతోన్. ౧౦౨౫

తే॥ వహ్నినై జగుణము ప్రాణ♦వాయు గుణము, ననుభవించి మొఱింగిన♦ఘనులు, వేఱు
తనువునం జొచ్చి క్రమ్మఱం♦దమ తనువునఁ, జేరుకరణి రావణుఁడు మూ♦ర్ఛిల్లి తెలిసె.

తే॥ తెలివినొంది యూరుపుపుచ్చి♦తెరలి నోట, మాటరాక యుఱిమిచూచి♦సాటిలేని
మేటిమగని మారుతిఁగని♦మిడుకకింక, మద్బలంబును చవిచూడు♦మా కపీంద్ర!

చ॥ జగతిఁగలట్టి సర్వబల♦శక్తులు నీయెడఁగల్గు! నీవ పో
మగల మగండవౌదు హను ♦ మంత! కృతాంతుని చూచివచ్చితిన్

దఁగినఁడె వచ్చి నీవు భయ ♦ దుఃఖములొందెదవన్న నుంతయున్
బెగడని యేను నీవలన ♦ భీతి నెఱింగితి సంచలించితిన్. ౧౦౨౮

ఉ॥ నిక్కము నన్ను గెల్చిన సు ♦ నిశ్చల విక్రమ శాలివైతి; వే
ఱొక్కటియేల? నిల్వుము స ♦ ముత్కట మత్కర ముష్టి ఘాతమున్
దక్కక సైఁచి జీవములఁ ♦ దాల్చితివేనియు నింతదాఁక ని
న్నొక్కఁడుతో నుతించిన స ♦ మస్తము నిశ్చయమంచు నమ్మెదన్. ౧౦౨౯

చ॥ అనుడు మరుత్సుతుండు బిడి ♦ యంబును పొందెద నీవు జీవివై
ననుగని మాటలాడు కత ♦ నన్ జయమొందినవాఁడవే చుమీ
మొనసి మదీయ ముష్టి హతిఁ ♦ బొంగి మరింపక నిల్చి నా బలం
బును వినుతించు దిట్టరిని ♦ మున్నొకసారియుఁ జూడ నెచ్చటన్. ౧౦౩౦

ఆ॥ అప్పుదీర్చికొనుమ♦యని ఱొమ్ము చూప ద, శాననుండు పెదవు♦లంటఁ గొఱికి
నిడుదకేలు మిగులఁ♦బొడవుగాఁజాఁచి పా, వని యురమ్ముఁ బొడిచె♦బద్ధముష్టి.

ఆ॥ విలయమందుఁ జెడని♦విజ్ఞానమతి జగ, త్ప్రాణసుతుఁడు పంక్తి♦వదనుబలము
మునుపుగన్న రజత♦భూధ్రంబుకై వడి, వాని పోటువలనఁ♦బల్లటిల్లె. ౧౦౩౨

ఉ॥ తూలఁగ వాయుసూతి దివి♦తూలెను ధర్మము తూలె సత్యముం
దూలెను సద్గుణావళియుఁ♦దూలెను కీర్తియుఁ దూలె వేదముల్
తూలెను నీతియున్ దయయుఁ♦దూలె దపంబును తూలె భూమియుం
దూలెను బంచభూతములు ♦ తూలెను తూలె సమస్త సత్కృతుల్.

క॥ అక్కడఁగల కపివరు లప్పు, డొక్కొక రొక్కొక్క నగము♦నొగిఁ దెచ్చి వడిన్
రక్కసులతేనిపై బయ, లెక్కడఁ గనరాక ముసరి♦యేసిరి కడిమిన్. ౧౦౩౪

క॥ బలసంపన్నులు ప్లవగులు, విలయాబ్దముభంగి నింగి♦పిక్కటిలఁగ న
ద్రుల పైవ వియచ్చరు లా, త్తిలి చెచ్చెర నవ్వలికి నొ♦దింగిరి భీతిన్. ౧౦౩౫

తే॥ మింటఁ జోటు లేకొండొండు♦గెంటికొనుచు, నవ్వలికిఁబోక నిలిచె నా♦యద్రిచయము
తరణి మఱుఁగ య్యె జగముల♦నిరులుగ్రమ్మెఁ, రక్కసులు తగ్గిరసి సురల్♦క్రమ్మిరవల.

తే॥ కొండ లొకటిపై నొక్కటి♦కూలి విఱుగ, మిడుఁగుఱులు లేవ మెఱుపులు♦మెఱయఁ
లట్లుదాఁకి శిలావృష్టి♦యట్లు రామ, భద్రు దివ్యాస్త్రవర్షంబు♦పగిదిఁ గురిసె. [బిడుగు

తే॥ కర్బురుల పెనుసైన్యంబు♦కలఁగి చెదరి, మలఁగె మింటిరిక్కలతో వి♦మానపంక్తి
రాలె మిడుఁగులచే నబ్ధి♦క్రాఁగి మీలు, తేలి సోఁకుల కనుగ్రుడ్ల♦లీలనుండె.

ఉ॥ లోకము నేఁడె కూలెనని ♦ లొగ్గడిఁ గల్గిన రావ మెల్లెడం
బ్రాఁకఁగ రావణుండు విని ♦ పట్టని రోషభరంబునన్ సురా
స్తోక యశోవిభూతులను ♦ చూఱలు వెట్టిన దొడ్డవిల్లు బిం
బాకృతిఁదోఁపఁ దూపు లొల ♦ యం బఱపించి చెదర్చె నన్నిటిన్.

ఉ॥ అమ్ములు వింట్లు తుంట్లుగ హ ♦ యమ్ములు వ్రమ్మఁగ వారణమ్ము ల
ప్పమ్ములుగాఁగ సింహ శర ♦ భమ్ములు వ్యాఘ్రము లా రణస్థలిన్
దమ్ముగఁజేసి కుప్పలుగఁ ♦ దార్కొను పర్వతముల్ కుజంబులున్
దుమ్మయి గాలిలోఁగలియఁ ♦ దూఱె దశాస్యుని యంపవానచే ౧౦౪౦

క॥ ఔరా! తీరగు శరసం, చారము! గిరి యొకటి లక్ష♦శకలము లయ్యెన్
సౌరగు కర లాఘవ మ, య్యారే! యని విద్రిచికొనిరి♦హస్తము లమరుల్

తే॥ పంక్తిముఖుచేవ పగ్గము♦పాడు వేయ, హరులు వైచిన గిరులఁ ద♦చ్ఛరము లడరి
త్రుంచి యన్ని దెసల వార్ధి♦ముంచివైచె, నేల నెత్రు గప్పెను మేల♦ధూళిగప్పె.

క॥ వానరులతోడ నేఁడే, మానిసు లిర్వురను జూపు♦మాపెద ననుచున్
దానవవిభుఁ డుగ్రుండై, పూనెం బది యెడమ కేలఁ♦బోరిఁ బదివిండ్లన్ ౧౦౪౩

క॥ పది దీర్ఘ బాహువులతో, బది ధనువులవంచి పదులు♦పదులుగ నమ్ముల్
వదలి దశదిశలు కడలియఁ, గదిరి శరమయముగఁ బంక్తి♦కంఠుఁ డొనర్చెన్

క॥ పొలిసెను కపిసైన్యము కు, ప్పలుగా నాకుప్పలపయి♦వ్రాలె వనదముల్
పొలికలను రక్తమయమై, వెలసెను సాయంతనంపు♦విన్ను విధమునన్ ౧౦౪౫

సీ॥ నిలువంగ లేఁడయ్యె♦నీలుండు నడవలేఁ, డయ్యె నలుఁడు లేవఁ♦డయ్యె గజుఁడు
కాలుఁ గానఁగ లేదు♦గవయుఁ డంగదుఁడును, జీవించునా యను♦స్థితి భజించె
చలియింప లేఁడయ్యె♦జాంబవంతుఁడు కొఱ, మాలి పడియె గంధ♦మాదనుండు
గువ్వరీతి ముడింగి♦కుదికిలె శతబలి, పనసుని మెడ తూలి♦పడుచునుండె

తే॥ మఱియుఁగల గొప్పవీరులు♦నెఱఁకులంటఁ, దేజు మాసిరి కూలిరి♦తికమకపడి
పాఱి రదిగని సౌమిత్రి♦భయదరోష, భీషణాకృతితో విజృం♦భించి నడచి

తే॥ రావణుఁడు వైచినట్టి శ♦రప్రకర్ష, మడఁచి వాని యహంకార♦మఁడగఁ బది శ
రాసనమ్ములఁ బదితూపు♦లేసిత్రుంచి, దనుజు లదరంగ సింహ నా♦దమ్ముచేసె.

తే॥ వేలుపులు చాల మోదించి♦కేలుఁగొట్టి, విరులు చల్లిరి మునులు దీ♦వించినారు
ధర్మదేవత యుత్సుక♦త్వమున నాడె, మెచ్చె లంకేశ్వరుండు సౌ♦మిత్రి నేర్పు.

తే॥ మేలు సంగరోత్సాహంబు! మేలువిద్య!, మేలు రణకార్య పద్ధతి! మేలు తెంపు!
మేలు కర లాఘవంబును! మేలు నేర్పు! మేలనుచు మెచ్చె ముక్కుపై♦వ్రేలుచేర్చి.

ఉ॥ దండకలో ఖరాదుల మ♦దంబు నడంచిన రాఘవుండు నా
ఖండలు వ్రేల్మిడిన్ రణ ము♦ఖంబున గెల్చిన నాసుతుండు ను
ద్దండ శరాసనంబు బెడి ♦ దంబుగఁ దాల్చిన యేను దక్క బ్ర
హ్మాండమునందు లేరు సమ ♦ రావని నీ సరివచ్చు దిట్టరుల్

—: రావణశక్తిచే లక్ష్మణుఁడు మూర్ఛిల్లుట :—

తే॥ అనుచు వింటిచే గెలువంగ♦ననువుగాద, టంచు వీనిని విడువరా♦దంచు నసుర
ధాత యొసఁగిన శక్తి హా♦స్త్రమునఁ గొనుచు, వైచె లక్ష్మణుపై నెల్ల♦వారు బెగడ.

ఉ॥ వైచిన శక్తి లక్ష్మణుని ♦ బాణ నికాయములెల్ల లీలగాఁ
బూచికలట్లు ద్రుంచుచును ♦ పోయి యురమ్మున నాటె దానిపై
శాచిక శక్తిఁగన్న గుణ ♦ శాలి దురమ్మున వ్రాలి మూర్ఛలోన్
మోచిన చింతతోఁ గపులు♦ముచ్చిరి రాచ్చిరి సోఁకు లుబ్బుమై ౧౦౪౨

తే॥ ఎల్లసురలును దమసామ్ము♦కొల్లవోయి, నట్లు వెలవెలపోయి ర♦త్యాహితమున
మునులు విసిగిరి ధర్మ చిం♦తనమునందు, ధరణి దిరిగెను మార్పడెఁ♦దరణికాంతి.

తే॥ దీని కితఁడు జంకఁగ లేదు♦ద్రెళ్ళ లేదు, మూర్ఛవోయినాఁడని దశ♦ముఖుఁ డెఱింగి
యితని మేను గైకొని లంక♦కేగెదనని, క్రూరచిత్తుఁడై దిగివచ్చెఁ♦దేరినుండి.

తే॥ బాహు లిరువదింటను కవిఁ♦బట్టి మున్ను, తారగిరి నెత్తుటకు సిగ్గు♦మీఱ నిపుడు
మేరుగిరి నెత్తఁబూనిన♦తీరుదోఁప, నెత్తె బలమెల్లఁ జూపి షం♦డ్లీలకటచి. ౧౦౪౫

తే॥ తాను పీతాంబరుండను♦జ్ఞానగరిమ, మానకున్న హేతువున రా♦మానుజుండు
శివ నగంబును చలియింపఁ♦జేసినట్టి, హస్తముల కెత్తరాని వాఁ♦డయ్యె నపుడు

క॥ దశముఖుఁడు కడలిఁ బోలెను, దశముఖ హస్తంబు లబ్ధి♦తరఁగలఁ బోలెన్
దశరథ సూనుఁడు సాగర, శిశు వనఁదగు శశిని పోలి♦చెలఁగెం జూడన్, ౧౦౪౭

తే॥ ఎత్త యత్నించి కదలింప♦నిమ్ముగాక, యూర్పువిడువ వేఱొక్క చో♦నున్న హనుమ
కని తటాలున వచ్చి రా♦వణుని గెంటి, యువ్విలికిఁ గొనిపోయె రా♦మానుజన్ము.

ఉ॥ పావని జ్ఞానులం దధిక ♦ పావనుఁ డౌటను లక్ష్మణాఖ్యుఁ డా
శ్రీవరుఁ డౌటచే మఱియుఁ ♦ ప్రేమబలంబును దొడ్డదౌట సం
భావిత భక్తిచేతఁ బసి ♦ పాపను తల్లి వహించు కైవడిం
గైవడిఁ గొంచుఁ బోయె♦రఘు కాంతుని సన్నిధికిన్ రయంబునన్. ౧౦౪౯

—: రామ రావణ ప్రథమ యుద్ధము :—

తే॥ జానకీవిభు డాసి ల♦క్ష్మణుని దించు, నంత నతఁడును తెలివంది♦యలరి లేచె
రాముఁ డప్పుడు లయకాల♦భీము భంగి, నడరి రావణుతోఁ బోరు♦నడప నడచె.

తే॥ దంతిమీఁదికి లంఘింపఁ♦దలఁచు సింగ, మట్లు రాముఁడు వచ్చుట♦యసురవిభుఁడు
గాంచి రాఘవు నెదుటికిఁ♦గనక రథము, పోవనిచ్చె నుత్సాహంబు♦పొదలుచుండ.

క॥ రణకోవిదుఁడగు దానవ, గణనాథుఁడు తేరిమీఁదఁ గ్రాలఁగ సమరాం
గణమున రాముఁడు నేలం, గనఁక నిలుచు టనువె? యనుచుఁ గదలె హనుమఁడున్.

తే॥ తనకు మున్నొసంగిన గంగ♦దలను దాల్చి, పావనుండైన శంభుండు♦పాపివితతి
మలయుచోఁ బదచారియౌ♦మామఁ గాంచి, యూరకుండుట తెఁ పంగ♦మేరయౌనె?

తే॥ అసమరీతి రణముసేయ♦నసుర తేరి, పై వెలయ నేల నీవుంట♦పాడిగాదు
సేవకుఁడనగు నాభుజ♦శిఖరియందు, కూరుచుండుమ యని వేఁడు♦కొనియె హనుమ.

తే॥ మంచిదని రామవిభుఁ డెక్కె♦నంచితముగఁ, గొండపై నెక్కుసింగంబు♦కొమరుదోఁప
గనిన బిడ్డను మోచిన♦జనని పగిది, హనుమ యలరె సురాలి దీ♦వనలు చేసె.

తే॥ అల త్రివిక్రమ రూపంబు♦నరసియున్న, హనుమఁ డతిశయానందంబు♦నందఁగాంచి
శ్రీహరికి వాహన శయన♦శ్రీలఁ దాల్చు, గరుడి లజ్జించె శేషుండు♦శిరము వంచె.

ఉ॥ మారుతి క్షీరవారిధి ప్రశ♦మంబున నొప్పె రఘూద్వహుండు నా
క్షీరపయోధిశాయి యనఁ♦ జెన్నగు నన్నను యోగనిద్రకుం
దారఁడు; వాయుసూతి శ్రుతి♦తండము వేదశిరోర్థ మా ధరా
జారమణుండనంగఁ దగు ♦ సామ్యము చొప్పడు నిశ్చయంబుగన్.

తే॥ మఱియుఁ జూడంగ నాహను♦మంతుఁ డొప్పె, నకలలోకమూలంబగు♦ప్రకృతినాఁగ
రామభూపాలుఁడొప్పెఁద♦త్ప్రకృతి శక్తి, కరయ మూలకారణ విరా♦ట్పురుషుఁడనఁగ

తే॥ వనజజాండంబు లెల్ల గ♦ర్భమునఁ గొన్న, దాశరథికిఁ గావలయు ప♦ద్ధతులఁ దిగుగు
మారుతి భుజాగ్రదేశంబు♦మేరుశిఖరి, నెనసె నన్న న్యాయోపమ♦మే ఘటించు.

తే॥ ధర్మ దేవత మోద న♦ర్తనముచేసె, ఋషులు కేలెత్తి దీవన♦లిచ్చినారు
బ్రహ్మ రుద్రాది దేవతల్♦రణము చూడ, వచ్చి మింట మూఁగిరి రఘు♦వరుఁడు కదియ.

తే॥ సంగరోన్ముఖుఁడగు రామ♦చంద్రుఁడపుడు, కేలఁగోదండగుణము లా♦గిన రవంబు
దివియు భువియు సమస్తంబు♦తివిరి ప్రమింగు, రుద్రమూర్తి సేయు మృగేంద్ర♦
రుతముఁ బోలె.

తే॥ యక్షులును రాక్షసులును ప్రా♦ణాసిలములు, వీడకున్నను నిలుకడ♦యూడి నాల్క
లెండఁ గలఁగిరి మలఁగిరి♦యండ భయము, నెలవు దప్పె బ్రహ్మాదుల♦తలలు నాడె.

సీ॥ విద్రుమ వర్ణముల్♦విలయాగ్ని నిభములు, జలధి నీటిని ద్రావఁ♦జాలినవియు
దిక్కులఁ గొలువంగఁ♦దివురునవియు మింటి, మంటిని తొలువ స♦మర్థములయి
యడరు నేడమ్ములు♦నసురవిభుండేసె, వాని నేడమ్ముల♦వనజ నయనుఁ
డేసి తుండ్లుగా♦నడలించి యొక్కొ సా, రిగ నైదు తూపుల♦మొగిఁ దొడింగి

తే॥ పరప దశకంధరుఁడు నైదు♦శరము లేసి, నడుమనే త్రుంచి మఱి♦పది తొడుఁగులంట
నీడ్చి విడువంగ సూర్యకు♦లేశ్వరుండు, విశిఖ దశకమ్మచే వాని♦విఱిచివైచె.

తే॥ దగ్గఱగనున్న రావణు♦దండువైచు, నాయుధమ్ములన్నిటిని పె♦క్కమ్ములేసి
వెండి వైచినఁ బొడిచేసి♦వీరమస్త, కావళుల నొక తిట్టగాఁ♦బ్రోవుచేసె. ౧౦౭౪

తే॥ సైన్యనాథులేసిన యస్త్ర♦జాలములను, రావణాశుగమ్ముల వాన♦రావళిపయిఁ
జెదరనీయక తొలఁగించి♦శిత శరముల, నంగపతుల మస్తములు డు♦ల్లంగనేసె.

చ॥ ఘనతర రామబాణముల ♦ కంటెను డెందముకంటెఁ దొందరన్
జను హనుమానుఁ డీధర నె ♦ నంగెడివాఁ డనునంతలో నభం
బునఁ గనుపట్టు రావణుని ♦ ముందరఁ దోఁచు నెడంద లుడ్కు న
ద్దనుజుల కన్నులందు బెడి ♦ దంబుగ వెక్కసమై కనంబడున్. ౧౦౭౬

ఉ॥ ఆడఁదొడంగె నట్టలను ♦ వందఁగ వేడుకతోఁ బిశాచముల్
పాడఁదొడంగెఁ గంకములు ♦ ప్రబ్బి వియత్తలమెల్లఁ జుట్టి త్రో
పాడఁదొడంగెఁ బీనుఁగుల ♦ యంగములం గొని నెత్రుతోయధిం
గూడఁదొడంగె రామ శిత♦ఘోర శిలీముఖ రాజి పర్వఁగన్. ౧౦౭౭

తే॥ చక్రములు ఖండములయియ♦క్షములువిఱిగి, ఖురువు లురలి ధ్వజంబులు♦కూలి తేరు
బారు లెడసి తార్మ్యాలుగఁ♦బడియెఁ గరులు, తుండములు తెగిపడెఁ గొండ♦పిండులట్లు

తే॥ బండ్లువోవ విండ్లును పోవఁ♦బండ్లు వోవఁ, గరులువోవ హరులువోవఁ♦గంకటములు
పోవ శౌర్యంబుపోవ గ♦ర్బురులు తుదకుఁ, దలలువోవఁ గూలిరి రణ♦స్థలమునందు.

తే॥ సుతనుమధ్యలు రణభూమిఁ♦బతుల తలలు, కరుల హరుల తలలు నొక♦కరణినుండఁ
దెలియనేరక తచ్ఛిరం♦బులను చేర్చి, కొనుచు నేడ్చి యేడ్చి యచటఁ♦గూలినారు.

చ॥ అడఁగెను సింహనాదము ల♦హంకృతు లాఁగెఁ జరాకు చూఁపులున్
మడఁగెను ధూళియున్ డిగియె♦మందటిలెన్ బహుళాయుధా రవం
బుడిగెను టంకృతుల్ కడచె♦నుత్కట ఘీంకృతులిఁకె హేషలున్
ముడిఁగెను సైన్యముల్ దనుజ♦ముఖ్యుఁ డొకండయి నిల్చె నాజిలో. ౧౦౮౧

తే॥ నాల్గు విధముల సేనలు♦నలఁగి తునిఁగి, యొడుదుడుకుగాఁగఁ గొండల♦వడువుఁదోఁప
నున్న శవరాసులను కాంచి♦యుడికి యసుర, వరుఁడు బుసకొట్టసాగె స♦ర్పంబువగిది.

తే॥ నారి నాకర్ణముగ లాగి♦ఘోర శరము, లేసి రాముని భుజముల♦గాసిపఱుప
నతఁడు చిఱునవ్వుతోడ సు♦రాంతకు ధను, వైదు తుండ్లుగ విఱిచె నై♦దంబకముల.

తే॥ వేఱువిల్లందుకొని యెక్కు♦వెట్టునంత, రామవిభుఁ డదియును త్రుంచి♦రాక్షసేంద్రు
పవన జవన తురంగమ♦పంక్తిఁ గూల్చి, సారథిని చంపివైచె ని♦ర్జరులు పొగడ.

తే॥ అసురమఱియు వేఱొకకైదు♦వందికొనెడు, నంతలోనడుమనత్రుంచి♦స్యందనమును
గొడుగుతోడధ్వజముతోడఁ♦గూల్చివాని, దృఢతనుత్రాణమునుగూడఁ♦ద్రెంచివైచె.

తే॥ వేఱువేఱు తేరులు వచ్చి♦చేరుచుండ, నెక్కనీయక నడుమ మా♦యించుచుండె
రాఘవుఁడు; రావణుండును♦రౌద్రమూర్తి, యయ్యెమృత్యువునటియించు♦నాజియందు.

తే॥ రత్న ఖచితమ్ములైన శీ♦ర్షకములపయిఁ, బడి లకోరీలఁ బఱప భా♦స్వరునిమీఁది
కెగయు హనుమనికై వడి♦నేగి విశిఖ, దశక మవ్వాని దోర్చ్ఛ సం♦భ్రమమునఁ బడఁగ.

తే॥ మణులకాంతులు దిక్కుల♦మలయుచుండ, జడధిఁబడినవై త్యేంద్రు శీ♦ర్షకములపుడు
నిగుడు చండ ప్రభంజన♦నిహతిచేతఁ, గూలు మేరువు శిఖరాల♦లీలఁ దోఁచె.

క॥ రాముని నిశాత బాణము, లా ముకుటములఁ గొనిపోయి♦యబ్ధిని విమటల్
ధామనిధిఁ గొంచు రాహువు, దీమసమున జలధిఁ ద్రోచు♦తెఱఁగున నొప్పెన్.

క॥ అపజయ మెన్నఁడు నెఱుఁగని, కృపణుఁడు మకుటముల నీఁగి♦కీర్తియుఁ జెడఁగాఁ
దపన నిశాకరు లలరని, యపకృష్టాహర్నిశముల♦యనువున నొప్పెన్. ౧౯౯౦

తే॥ మకుటములఁ గోలుపడు దశ♦మస్తకుండు, ప్రతిభటాభీల గురుత ను♦న్నతుఁడయ్యెనఁ
బ్రవిమలాత్మకుఁడైన సు♦కవి శపింపఁ, బ్రథితకీర్తిని కోల్పోవు ♦ ప్రభువుఁబోలె.

ఉ॥ క్రిందికిఁ జూచు కన్నులును ♦ కీడ్పడు మోమును రిత్తకేలు ప్రే
లం దిగి యూడమట్టి యన ♦ లంబు శరీరముతోడ నున్నదై
త్యేంద్రు డధర్మచారులకు ♦ నిట్టిదె పాటని లోకులెల్లఁ బ
ల్కం దలవంచి నేలపయిఁ♦గాలను రాచుచు నిల్చె నచ్చటన్. ౧౯౯౨

తే॥ అట్లు నిలిచిన రావణు♦నరసి ధీర, వరుఁడు సుగుణుండు రాముండు ♦ పట్టికేల
నున్నవాఁడని చంపంగ♦నుల్లమందు, తలఁప కిట్లని పల్కె నా♦దార్యఫణితి ౧౯౯౩

ఉ॥ ధర్మపథంబు త్రొక్కక య ♦ ధర్మవిధంబున సంచరించు దు
ష్కర్ములు వేల్పులైనను య ♦ శంబు జయంబును గాంచ శక్యమే?
దోర్మద ముజ్జగిల్లెనె? వి ♦ ధూత బలుండవు నిన్ను చంప నీ
యర్మిలివారిఁ గూడుకొని ♦ యందుము సౌఖ్యములెల్ల నేఁటికే. ౧౯౯౪

శా॥ నీవంశస్థులతోఁ గుమారకులతో ♦ స్నిగ్ధాళితో వెండియుం
జేవంగల్గిన సేనతోఁ దొడరి యు ♦ త్సేకంబుతో నెల్లి ర
మ్మీ వేళం జెనుపోరునం దలసి నీ♦యోపుం బ్రపూర్ణంబుగా
నావంకం గనిపింపవైతి వది గా ♦ నంగోరియే వీడితిన్. ౧౯౯౫

మ॥ సమరోత్సాహము గల్గునేని కడఁకన్ ♦ సైన్యంబుతో రమ్ము ప్రా
ణములం దాఁపఁ దలంతువే జనక క ♦ న్యం దెచ్చి యొప్పించి రా
జ్యము నీతమ్మునకిచ్చి కొల్వు మతనిన్ ♦ జాకుంటకున్ వేఱు మా
ర్గము లే దెన్ని విధాలఁ జూచినను ని ♦ క్కంబిద్ది లంకేశ్వరా? ౧౯౯౬

మ॥ దురమే సేయఁదలంతువేని బలసం ♦ దోహంబు చేకూర్చుకొం
చిరవారన్ శ్రమదీర్చికొంచు వడి నా ♦ యుత్తంబుగా రేపె నీ
శిరముల్ నాశరపాళి కాహుతిగ న ♦ ర్పింపంగ రమ్మింక ని
ల్వ రమున్ లేదు నిజంబు మాయలును చె ♦ ల్లంబోవు రక్షోధిపా!. ౧౯౯౭

తే॥ నేఁడుకాంచితే గాలికి♦నెగయు దూది, పింజలట్టులు నీసేన♦విఱిగి కలఁగి
కూలుటలు నేఁటికేగి రే♦పాలమునకు, రమ్మనుచుఁ గరుణాళుఁడై♦రాముఁడనఁగ.

౧౮ కుంభకర్ణవధ పటలము. (౭౬౩)

సీ॥ దిగ్గజంబుల పోటు♦తిపిరి యోర్చిన ఱొమ్ము, కైలాసమెత్తిన♦ఘన భుజములు
జగడాల తపసి మె♦చ్చఁగఁ బాడు నాల్కయు, శివుఁడిచ్చు కత్తియు♦శీర్షకములు
శౌర్య సంపదయును♦సంగరస్థలి వీడి, త్రిజగంబు లేలిన♦దితిజ విభుఁడు
తలయెత్తనీని యు♦త్తలపాటుతో భంగ, పాటుతో బిడియంపు♦బరువుతోడ
తే॥ భటులఁ గన్నెత్తి చూడక♦పజ్జఁ జేరు, సుతులఁ బ్రేమను గాంచక♦సతులఁ గనక
పరవి యున్న సేననుగూడఁ♦బాటిగొనక, వెంటవచ్చు వారలను భా♦వింపకేగె.
తే॥ కమలవదనల కనులు ఖ♦డ్గములపోల్కెఁ, గష్టములెకూర్చుసుతుల వా♦క్యములు రామ
బాణములవలె నొంచెఁ జె♦ల్వల పయోధ, రములుతన భుజములవలెఁ♦బ్రమదమిడవు
తే॥ మంత్రములు తెల్పువృద్ధులు♦మందయాన, లైన భార్యలు సైన్యనా♦యకులు బంధు
హితులు ప్రతిమలవలె నిల్వ♦దితిజవిభుఁడు, దంతివలె నేగి చేరె నం♦తఃపురంబు
తే॥ అచట నొక పైఁడిపీఁటపై♦నమరి చింత, యించుకంత కుదింపి యో♦చించి పిదప
గంచుకిని పిల్చి వేగ వే♦గరులఁ దోడి, తెమ్మనుచు నాజ్ఞయిడ వాఁడు♦తీవ్రగతిని.
తే॥ వెడలి వాయువేగుఁడుమరు♦త్తుఁడునొక, తియుమహామేఘుఁడాదిగాఁ ♦ దెలివి
దూతల నసంఖ్యజనములఁ♦దోడితేర, వారలకు రావణుం డాజ్ఞ♦వఱలఁ జేసె. [గలుగు
తే॥ ఏడుదీవులయందు మ♦హీధరములఁ, జక్రవాళంబుమీఁదను♦సర్వభువన
మందుగల రాక్షసుల వడి♦నరుగుదేర, నాజ్ఞ దెలిపి తోతెండని♦యనిపి వారి.

చ॥ క్రమముగ నాజ్ఞమోచి యుడి ♦ గంబులు సేయు త్రిలోకవాసులన్
దమవిభు భావమిద్దియని ♦ తత్పరతన్ గమనింపలేక డెం
దములఁ దపింప రామ శర ♦ దారుణ వేదన నోర్వలేక నా
గము తసెజ్జఁ జేరుక్రియఁ ♦ గర్బురనాథుఁడు చేరె శయ్యకున్. ౧౧౦౫

ఉ॥ సుందరియైన జానకి వ ♦ సుంధరపుత్త్రిక నిండియున్న యా
డెందము నందు నిందుగ బి♦డెంబు గడల్కొనఁ దోడఁ జింతయున్
గ్రందుగఁ జేర నించుకయుఁ ♦ గట్టెఁడి కూరుకురాక లోపలన్
గుందుచు భంగపాటు వెలి♦గొల్పఁగ గొప్పగ నిశ్వసించుచున్. ౧౧౦౬

ఉ॥ పాఱిన వేలుపుల్ నరులు ♦ పల్చన నవ్వుదురంచు శాత్రవుల్
మీఱఁగ నవ్వ హారనుచు ♦ మొట్టుకు సిగ్గు వహింపఁబోఁడు లం
కారమణుండు సీత నగుఁగా ♦ యని మిక్కిలిగాఁ దపించె నౌ
నారులు నవ్వ సైఁపనగు ♦ నా మగవారికి నిల్వరంబునన్ ? ౧౧౦౭

ఆ॥ అంత నసుర తాత♦యగు మాల్యవంతుండు, వృద్ధుమేను విల్లు♦విధము వంగ
రావణునకు నగు ప♦రాభవంబును విని, వచ్చి కూరుచుండె♦వానిపజ్జ. ౧౧౦౮

ఉ॥ వాని పరిస్థితిన్ దిగులు ♦ వాఱ నెగాదిగఁ జూచి చూచి య
క్షీణ తపోనిధీ! కడిమి ♦ చేడ్పడ ముమ్మరమైన పోరునం
దూనితి నోటునంచు దిగు ♦ లొంది కృశించెదె? యేమియయ్యె? నా
మానవు లెట్టిరో? తెలుపు ♦ మా విన నామది తత్తఱించెడిన్. ౧౧౦౯

ఉ॥ మనసును మేను కన్నులును ♦ మండఁగ శర్కరయైన ద్రాక్షయై
నను రుచి గానలేని వహి ♦ నాలుకయొండఁగ దైత్యనాథుఁ డి
ట్లనియెను తాపసాకృతుల ♦ నందిన మర్త్యులతో రణంబు కూ
రెను మన వంశగౌరవము ♦ ప్రీలెను నాస్థితి గోడిగంబుగాన్. ౧౧౧౦

—: రావణుఁడు మాల్యవంతునకు రాముని పరాక్రమాదులు తెలుపుట :—

క॥ తాతా! రుద్రుఁడు మొదలుగ, నాతత లోకముల వార ♦ లందఱు పెలుచన్
నాతోడైన సుమిత్రా, జాతుని బాణముల కాఁగ♦జాలరు వింటే. ౧౧౧౧

చ॥ సమరమునం దగణ్యమగు ♦ సైన్య కదంబము రూపుమాపుచో
దమథముమాన్చి యోటమిని ♦ దార్చెడుచో నులి మట్టి యుండలన్
దమకము తోడ మంథరకుఁ ♦ దాలఁగ నేసిన నాఁటి లీల చం
దమునన యుండెఁ గాని భయ ♦ దస్థితిఁ దాల్పఁడు రాముఁ డయ్యెడన్.

ఉ॥ రాక్షససేన దట్టమయి ♦ క్రాలిన లక్ష్యము దప్పకుండ రా
మాక్షయ బాణసంఘము శ ♦ తాంగ తురంగ మతంగజాదులన్
బక్ష శిరోధి మధ్య కర ♦ పాదములన్ వడిఁ గ్రుంచుఁగాక యే
క క్షణమైన నేయెడను ♦ గాఁడుచు డయ్యక యందు నిల్చునే?. ౧౧౧౩

ఉ॥ రాముని చేతినుండి ప్రద ♦ రంబులు వెల్వడు పిమ్మటన్ జగ
త్త్రోన్నమముఁ జొచ్చుఁగాని వెను ♦ ద్రొక్కవు కల్పము దాఁటవచ్చుఁ ద
ద్భీమ శరప్రఘాతములు ♦ పీడవు దిక్కులఁ గాల్చు మాఱు ప
ల్కమనఁ గాల్చు వైర మెద ♦ నెంచినఁ గాల్చు లయాగ్నిఁ గాలుచున్.

ఉ॥ మేరువుఁ జీల్చుమన్న వడి ♦ మింటిని రంధ్రము సేయుమన్న నీ
ధారణి వ్రచ్చుమన్న జల ♦ దంబుఁ జెదర్చుమయన్న వారిధిన్
నీరముఁ ద్రావుమన్నఁ దన ♦ నిస్తుల సాయకపాళి శక్తికిన్
నేరుపుగాఁగఁ దోఁప వవి ♦ నిల్చునో నిల్వవో వాని ధాటికిన్?. ౧౧౧౫

ఉ॥ అమ్ముల నెత్తికొంట గొన ♦ యమ్మునఁ గూర్చుట యేయుటల్ విలా
సమ్ముగఁ దోఁచెఁ గాని కెల ♦ సంబుగఁ గాంచెదు వేల్పులేని న్వ
ల్పమ్మును గానరైరి కర ♦ లాఘవమున్ శర లాఘవంబుఁ బ్రా
ణమ్ములఁ గ్రోలుఁడీ చనుఁడ ♦ నం దన సైన్యము వోలె వెల్వడున్.

క॥ ధరణిజ నాథుని శర సం, చరణమ్ములు సుకవి వాక్య♦చరణ గుణాలం
కరణ ధ్వనులం గలిగియు, విరమణములు లేక విబుధ♦వినుతికి నెక్కెన్. ౧౧౧౮

చ॥ భవుని త్రిశూలముల్ మఘవు ♦ వజ్రము వెన్నుని చక్ర మాజిలోఁ
జవి గనినాఁడ భేదము ని ♦ జంబుగ నెక్కువ యున్నదయ్య! రా
ఘవ శరవేగముల్ సయింపఁ♦గాకయె క్రుంగితి నేనుగాక వే
ఱెవ రిఁకఁ దచ్ఛరాలిఁ గను ♦ లెత్తి కనం గలవార లీధరన్ ? ౧౧౧౯

తే॥ రుద్రు బాహాష్టకంబు నిం♦ద్రుని భుజద్వ, యంబు విష్ణుని బాహు స♦హస్రకంబు
నితని యొక త్రేలి బలిమికి♦నీఁడురావు, తాళఁజాలవు తాఁకి య♦థార్థ మిద్ది.

తే॥ వీరు లెందఱేనియు నుగ్ర♦విక్రములెనఁ, గా త్రవీర్యుఁ బోలిన వారు♦కారు నిజము
అట్టి యర్జునుఁడును రాము♦ననుజు పాద, ధూళికిని పోల్ప సాటి కాఁ♦జాలఁడయ్య !

చ॥ త్రిపురములన్ దహించుతఱి ♦ శ్రీగళుఁ డూనిన విల్లు దాని ముం
దెపుడును వేడ్కకేని ధరి♦యింపఁగ నొప్పదు దానికొక్క వే
ఱుపమితి పల్కలేదు శ్రుతు ♦ లొక్కెడఁ దప్పినఁ దప్పుఁగాక యా
తపన కులేంద్రు చాపము వ ♦ దల్చు శరంబులు తప్ప నేర్చునే? ౧౧౨౧

సీ॥ వెలుఁగుచో నాల్గుమో♦ములవేల్పుఁ బోలును, చెదరుచోట సహస్ర♦శీర్షుఁబోలుఁ
బగఱఁజేర యుగాంత♦భైరవుఁబోలు నా, చిలుకుల పనులు వ♦చింప నరిది!
నా బలగర్వముల్♦నశియింపఁ జేసిన, నన్న వేఱొక సాక్ష్య♦మెన్న నేల ?
వాఁడు పట్టినవిల్లు ♦ పడమటిదో? తూర్పు, దో? దక్షిణంపుదో? యుత్తరపుదో ?

తే॥ మూలలందలిదో? విశాల♦భూమిఁ గలదో?, మింటిదో నమ స్తంబును♦మేవినదియొ?
యొఱుఁగఁజాలకుంటిని కుడి♦యెడమలందు, నిక్క మేవంకనుండెనో ♦ నేర నిఁకను.

మ॥ వసుధాధీశుని వాహనం బనిలుఁడో♦వైశ్వానరుండో విభా
వసుఁడో కాలుఁడొ కావలెం దెలియఁగా ♦ వచ్చుం బ్లవంగంబుగా
వెన నక్కోఁతి యొనర్చు చేఁత లురగ♦ద్వేష్యుండుఁ గావించునే ?
యసమానోన్నతి నొంద దద్దియన నా ♦ యజ్ఞత్వముం దెల్పదే ?

చ॥ కదనతలంబుఁ జేరి యెఱుఁ ♦ గందగు నక్కఱలేదు గారవా
స్పదయగు ధాత్రి కీడయిన ♦ జానకి రాముని మేనుగాంచి భీ
తిదమగు వాని వీర విహా ♦ తింగని యుండుట మన్మథుండు నే
మొదలుగ నెల్లవా రతివ ♦ ముందఱఁ గుక్కలు గాక యన్యులే ?

క॥ నాశము గలిగెడి వేళను, శ్రీశ విరించన మహేశ్వ ♦ రేంద్రాదులచే
నాశిల్లక యుత్తమ వసు, ధేశు నొకని వైరిగాఁగ♦నెనసితిఁ దాతా! ౧౧౨౫

చ॥ అనవిని మాల్యవంతుఁ డను ♦ నన్న! వచించితి మున్నె నీకు నేఁ
జనవున వానిఁగైకొనవు ♦ చాలఁ జిరాకును గొంటి వా యకో

పనుఁడు విభీషణుండు తెలు ♦ పక వినికుంటివి కారణంబు లు
న్నను పరికింప కుంటి వీఁక ♦ నాతరమా వివరింప శ్రేయముల్ ?

చ॥ కటువులుగాఁగ నున్నను సు♦ఖంబులఁ గూర్చెదు పద్ధతుల్ విశం
కటగతిఁ జర్చచేసి యొడి ♦ కంబుగ నిక్కపు బంధులాడ నొ
క్కటియుఁ జెవిం గదింపక ము ♦ ఖస్తుతి చేసెదు మూర్ఖ వాక్కులం
బటిమగ విన్చు నీ గతిని ♦ పాడొనరించుచు నుంటి సర్వముక. ౧౧౨౮

తే॥ అనుడునవ్వలనున్నమా♦యావిమిన్న,యగుమహోదరుఁడెడసొచ్చి♦యతనినుతిమి
చూచినొచ్చిన ప్రభు నిట్టు♦ లేఁచఁదగునె?, యనుచునుత్సాహకరముగా♦నాడఁదొడఁగె

ఉ॥ మేలు దలంచి మంచిదని ♦ మేవడిగొన్న యనంతరంబు గె
ల్పే లభియింపనిమ్ము మఱి ♦ యొడ్డమిచే నసువుల్ త్యజింప నో
ళ్ళే లభియింపనిమ్ము తమ ♦ యెన్నిన పట్టున నిల్చుటే మహా
శీలుల లక్షణంబు వెను ♦ చెంగిన నిందయు రౌరవంబగుక. ౧౧౨౯

తే॥ అల త్రివిక్రముఁడును త్రిపు♦రాంతకుండు, పోరి యోడిరి వైభవ♦స్ఫూర్తి చెడఁగఁ
జంచలీకృత కైలాస♦శైల ? నరుల, తోడి పోరున కీవు వె♦న్నాడుదేమి ? ౧౧౩౦

చ॥ గెలిచిన వార లోడెదరు ♦ గెల్చెద రోడినవార లొక్కచోఁ
గలిమిగలారు క్రుంగెదరు ♦ కల్మి వహింతురు లేనివారలుక
బలమున కొక్కయెల్ల కను ♦ పట్టునె? యల్ప తపః ఫలంబుచేఁ
దొలఁకెడు రామలక్ష్మణుల ♦ దొడ్డగఁ బల్కెదు బట్టు పోలికక. ౧౧౩౧

ఉ॥ సీతను వీడితేని యొక ♦ చెట్టయు రా దటు వీడకున్న చో
నీతముగాఁగ జీవముల ♦ నీఁగిన నీఁగఁగవచ్చు వేఱు సం
పాతము గల్గునేమి? స్థిర ♦ బంధుర గౌరవ మింకిపోవఁ జిం
తా తలిమంబుపైఁ బొరలి ♦ తాపము నొందినఁ దప్పిపోవునే?. ౧౧౩౨

ఉ॥ ఊరక యిట్లు మున్వెనుక ♦ లుయ్యల లూఁగుచునుండ లంకలోఁ
బౌరులతోడ మమ్ము ఫల ♦ పాదపబృందము వోలె రాము దం
డారడ మొప్ప నార్పదె? జ ♦ లార్ణవమందొక కొంత నీరముక
నూరుఁడు త్రావ నంతయును ♦ శోషిలె నంచడలంగఁజెల్లునే?. ౧౧౩౩

మ॥ మును ముమ్మూర్తులు వేల్పులోడి పఱవక ♦ ముల్లోకముల్ నీమహా
జ్ఞను పాలించుచునుండఁగాఁ దృణముపై ♦ నట్టాడు ప్రాలేయముం
జెనయంజాలని మానవాధములఁ వా ♦ సిం బెద్ద కొండాడి నీ
యనుఁగుండమ్ముని కుంభకర్ణు బల గ ♦ ర్వాదుల్ డిగం బూన్చెదే?

తే॥ కుంభకర్ణు రప్పించి సం♦రంభ మొప్పఁ, బంపుదేని యతనిఁ గాంచి♦పాఱి డాఁగు
వారు; నిలిచినచో వారి♦ప్రాణములను, తీసికొని రాఁగలండు దై♦తేయచంద్ర !.

ఉ॥ నావుడు రావణుం డతని ♦ నర్మిలి మెచ్చి కుమార! వైభవ
శ్రీ విలసిల్లఁ బల్కితివి ♦ ప్రేమకు మేరయుఁ గల్గునేమి? ర
క్షో వన పాలకుండ వని ♦ సొక్కి సమాహితచిత్తుఁడయ్యె; వి
ఘ్నావలి వచ్చునేమి నడు ♦ మంతరమందు వినాశవేళలన్? ౧౧౩౬

—: కుంభకర్ణుని మేలుకొలుపుట :—

మ॥ ఇది మేలంచు వచించి రావణుఁడు మీ ♦ రింపారఁగా నేగి యె
వ్విదమైనం దగఁ గుంభకర్ణు నిదురన్ ♦ వేశోలి తోడ్తెండనన్
బదఁడంచున్ యమదూత లట్టు లసుర ♦ వ్రాతంబు నిద్రాళు నిం
టి దరిన్ వాకిట నిల్చి లెమ్మనుచుఁ దా♦టింపంగ వాద్యంబులన్. ౧౧౩౭

ఉ॥ లేవని కుంభకర్ణుఁ గని ♦ లెంకలు లోనికిఁ జొచ్చి తేఁకువన్
గ్రేవలఁబోయి తోమర వ♦రిష్ఠ గదాదుల మస్తకంబుపైఁ
జేవ యెలర్ప మోఁదియుఁ గృ♦శింపని నిద్దుర గాంచు దానవున్
సేవకు లంతఁ గన్గొని వ♦చించిరి చీఁడఱ యగ్గలింపఁగన్. ౧౧౩౮

శా॥ నిద్రాదేవికి ముద్దుకూన! విను ని♦ర్నిద్రుండు కాలుండు నీ
నిద్రాభంగము చేసినాఁ డలుపమా ♦ నిద్రాళుతన్ వీడి పె
న్నిద్రం బొందుము కాలుమందిరమునన్ ♦ నిండారు ప్రేమంబుతో
భద్రంబుల్ సమకూర్చు నగ్రజుఁడు నీ ♦ పాండిత్యముల్ మెచ్చుచున్.

మ॥ కొఱలేకుండిన దానివాలి బ్రదుకుల్ ♦ క్షోభంబులం బొందఁగాఁ
గొఱవిం జేకొని నెత్తి గోఁకికొను మూ♦ర్ఖుంబోలె మీయన్న యి
క్కొఱగాముల్ పొనరించి దీర్ఘమగు కూ♦ర్కున్నీకుఁ జేకూర్చె ని
క్కొఱయౌ నిద్ర యిఁకేల లెమ్మనుచు ర♦క్షోవీరు లుంకించుచున్

ఉ॥ నొచ్చిన కేలు మిక్కిలిగ ♦ నొవ్వఁగఁ గొట్టియు మేలు కాంచమిన్
గ్రచ్చఱఁబోయి రావణుని ♦ గాంచి ప్రభూత్తమ! తమ్ము నెయ్యెడన్
జెచ్చెర లేప మావలనఁ ♦ జెల్లదటంచు వచింపఁగా నతం
డెచ్చుగ దంతిమూఁకలఁ బ♦యిం బఱపించుచు లేపుఁ డీయెడన్.

తే॥ వారణములు త్రొక్కినను లే♦వకయయున్న, మీకుఁగల నేర్పులంజూపి♦ మేలు కొలుపుఁ
డనుచు వేవురు మల్లుర♦ననుప వారు, ప్రభునిచింత నీతఁడు తీర్పఁ♦వలఁతి యనుచు.

చ॥ తలఁచుచు నిద్రలేపఁ జని ♦ ద్వారముతీయఁగ వాని శ్వాస మ
త్యలఘువుగాఁగ వీవ జడు ♦ లందు దగుల్వడి లోనికేగుచున్
వెలి కరుదెంచుచుం దగులు ♦ వీడమిఁ జేతు లొకళ్లొకళ్లు ని
ట్టలముగఁ బట్టికొంచును ది ♦ టంపు బలంబున దాఁటి రంకిలిన్.

చ॥ ఇతనిని లేపు మార్గమిఁక ♦ నేదని నోటిని ముక్కుఁగాంచి భీ
మతులయి తాఁకఁగా వెఱచి ♦ మండలఁ గాహళ శంఖరావముల్
శ్రుతుల కడం గదించుచు ము ♦ సుండి గదాదులతోడఁ గాలు గే
లు తల నలంగ మోఁదియుఁ గ ♦ లుక్కున కంటుట గాంచి వేసటన్.

తే॥ ప్రభునియుత్తరువొంది తు♦రంగములను, తోలి త్రొక్కింప నది తల్లి♦జోలపాడు
కరణి నూఁగింప నా కుంభ♦కర్ణుఁ డంత, గుఱ్ఱువెట్టి గాఢంబుగు♦కూర్కు నొందె.

తే॥ అసురులంత నేలికయొద్ద♦కరుగుదెంచి, చేయఁదగిన యుపాయముల్♦చేయఁబడియెఁ
గేలు నొచ్చె హారులు త్రొక్కి♦సోలిపోయె, నేమియును లాభ మగపడ♦దెట్లు ననుడు.

తే॥ కరులుహరులు తేరులుద్రొక్కఁ♦గదలకున్న, కుంభకర్ణు శూలములతోఁ♦గ్రుమ్మి కదల
మోఁదియైన మీకుం దోఁచు♦నేదియైనఁ, జేసి నిద్దుర లేపి పి♦ల్చికొని రండు.

తే॥ రిత్త రాకుఁడు పొండని♦తత్తఱింప, దనుజు లనుమతి నాతని ♦ యనుజుఁ జేరి
గూఁబలంట శూలములతోఁ♦గ్రుమ్మిగ్రుమ్మి, ముసలములతోడ దంచఁగా♦నుసలి లేచె.

చ॥ తలఁపునకంటె మించిన యు ♦ దగ్రశరీరుఁడు కుంభకర్ణుఁ డ
మ్మొలఁపునఁ జచ్చినట్టి యొక ♦ మేటరి ప్రాణములొంది క్రొవ్వడిన్
మెలఁకువ గాంచి లేచెఁ దల ♦ మింటిని తాఁకఁ ద్రివిక్రమేశ్వరుం
బలెఁ దనమేను దిక్కులకుఁ ♦ బర్వఁగఁ గన్నులు వార్ధి మించఁగన్.

క॥ త్రిజగంబులు వడఁకఁగ ది, గ్గజములు చలియింప రవియుఁ♦గలఁగం బాఱన్
గుజగుజలువోఁ ద్రిమూర్తులు, గజిబిజి సురలొందఁ గుంభ♦కర్ణుఁడు లేచెన్.

ఉ॥ ఆఁకలి మీఱ మేలుకని ♦ యన్నము చాలమిఁ బేదమోముతో
సోఁకులు వండియున్న దిను ♦ సుల్ పలువందల బండ్ల యన్నమున్
మేఁకలఁ దొట్టి యేనుఁగులు ♦ మీలును మద్యము పండ్లు మెక్కి య
ట్టాఁకలి రేఁప దున్నలు స ♦ హస్రము లాన భుజించి తేఁకువన్.

క॥ బెడిదముగఁ గనులు విచ్చెను, పిడుగుల నొకచేతఁ బట్టి ♦ పిండిగఁ జేయన్
జడనిధి వండలిసేయన్, గడిగా రవిఁబట్టి మ్రింగఁ♦గా నగు లీలన్. ౧౦౫౨

సీ॥ కూర్చుండియుండ ర♦క్షోధీశు రావణు, నిలిచినంత పొడవు♦నెగడువాఁడు
కడలి యలలవంటి♦కనుబొమ ల్గలవాఁడు, వరి వెన్నువంటి పా♦ల్పరగువాఁడు
రక్తమాంసములు చ♦ర్మము లెమ్ములును చింద, జవిరి జవిరి తినఁ♦దివురువాఁడు
మీఱిన యాఁకలి♦తీఱ నాయుధములఁ, నమలి వికావిక♦నవ్వువాఁడు

తే॥ కఱకు శూలంబు కేలను♦గలుగువాఁడు, సగము కాలి నిల్చిన తాడి♦పగిదివాఁడు
మదము గలవాఁడు స్తబ్ధరో♦మముల వాఁడు, ఒడలి విఱుపులు త్రేఁపులు♦విడనివాఁడు.

తే॥ ఇంద్రు పండ్లురాల్చిన చేతు♦లెత్తి ప్రహరిఁ, దనరు బురుజుల మెల్లనఁ♦దడవువాఁడు
శక్తి చేతఁదాల్చినవాఁడు♦చవికి సింహ, శరభ మాంసముల్ దిననోరు♦తెఱచువాఁడు.

తే॥ పడకయను వారినిధినుండి♦పైకిలేచు, తనదు నిడుపైన మేనిపైఁ♦జెనకి యలము
బాడబాగ్నికీలలొ యనఁ♦బరఁగు నిడుపు, జేగుఱైన రోమంబులఁ♦జెలఁగువాఁడు.

తే॥ వెనల గెలిచిన దశకంఠు♦నెసకమునకు, జంకి చండ మయూఖుండు♦జాతవేదుఁ
డడఁగి యుండఁ దగిన గుహా♦లనఁగ నిద్ర, కప్పు వీడని లోఁతగు♦కనులవాఁడు.

తే॥ వారణంబులు చరియించు♦పర్వతగుహ,వంటి దోరముల్ గల ముక్కు♦వఱలువాఁడు
కొండ చిలువలు నిద్రింపఁ♦గూడునట్టి, పెద్ద శ్రవణ రంధ్రంబులఁ♦వెలయువాఁడు.

తే॥ ఐన కుంభకర్ణుని గని♦యన్నగారు, పిలుచుచున్నారు మిమ్మని♦విన్నవించు
సేవకులతోఁడ జనె దశ♦శీర్షుఁడున్న, మందిరమునకు నగరానఁ♦గ్రందుపుట్ట.

తే॥ పెద్దకొండ పరుండిన♦విధము దెలియఁ, జాఁగి తమ్ముఁడన్నకు ప్రెమొక్క♦వేగ మెత్తి
గ్రుచ్చి కౌఁగిలించికొనె ర♦క్షోవిభుండు, కొండ కొండను తడవిన♦కొమరుదోఁప.

తే॥ ప్రక్కఁగూర్చుండనిడుకొని♦రక్తమద్య,ఘటఘటలుకొన్ని తెప్పించి♦కాంక్షనొసఁగి
పలల మిచ్చి తెల్లని పట్టు♦వస్త్రములను, రత్నభూషణముల నహా♦రముగఁ బెట్టి.

తే॥ ఇంద్రుఁ డైరావతంబుతో♦నీగిపాఱు, వేళఁ దప్పి జాఱిపడిన♦వీరపట్ట
మమర ఫాలభాగమున లం♦కాధినాయ, కుండు తమ్మున కర్మిలిఁ♦గూర్చికట్టె.

తే॥ మెఱుపుకైవడి మేనెల్ల♦మెఱయుచుండఁ, జెందిర మలందిన గజంబు♦చెలువుదెలుప
మొగులుఁబోని దేహంబున♦బుగులుతావి,చందనముపూసెఁ దనదుహ♦స్తములతోడ

తే॥ వినము కసిమసఁగినరీతి♦విన్నుత్రోవ, యొరయ నిల్చిన తమ్ముని♦యురమునందు
భవుఁడు ప్రేమతోనొసఁగిన♦వహ్నిఁబోలి, వెలుఁగుకవచంబు దొడిఁగెను♦విబుధవైరి.

ఆ॥ ఎడమకన్ను బొమయు♦నెడమ భుజంబును, కంపమొందఁ గుంభ♦కర్ణుఁ డంత
నన్నఁగాంచి సంగ♦రాలంకరణమేల, సేసె దనఁగఁ బంక్తి♦శిరుఁడు తెలిపె.

క॥ నరపతి సుతు లిరువురు వా, నరసేనలతోడ వచ్చి♦నగరమ్మును పెం
పఱ ముట్టి యెవ్వ రెన్నఁడుఁ, బోరయని విజయమ్ము గొనిరి♦పోరిగొను వారిన్.

—: కుంభకర్ణుఁడు రావణునకు హిత ముపదేశించుట :—

ఉ॥ నావుడుఁ గుంభకర్ణుఁడు ఘ ♦ నంబగు యుద్ధము సంభవించెనే?
పావనియైన జానకికి ♦ బన్నము లింకను నీఁగలేదొకో?
దేవ మనుష్య లోకముల ♦ దీపిత రాక్షసకీర్తి మాసెనే?
యీవగ దాపరించెనె స ♦ మిద్ధ కులంబునకున్ వినాశముల్?. ౧౧౬౬

చ॥ సమరము డాసెనే? యదియు ♦ జానకి కోసమె సంభవించెనే?
కమలదళాక్షిపైఁ జెడుగు ♦ కామము వల్దని మున్నెయంటి నే
త్రముల వినంబు గల్గిన పృ ♦ దాకువుఁ బోలిన ధాత్రిపుత్రి పైఁ
దమి విడకుంటివో? విడక ♦ తక్కుటయున్ విధికృత్యమేయగున్. ౧౧౬౭

చ॥ వసుమతిఁ గెల్లఁగించి సుల ♦ భంబుగ నెత్తఁగవచ్చు లోకముల్
కసిగొని మ్రింగవచ్చు రఘు ♦ కాంతుని సంగరమందు గెల్వ మా
నసమున నెంచుటల్ జనక ♦ నందిని మేను పరిష్వజింపఁగాఁ
బొసఁగునటంచు నెంచుటను ♦ పోలును రాక్షస వంశ భూషణా!.

చ॥ గెలుపును గల్గునే? మఱియుఁ ♦ గీడ్పడుఁగాక పులస్త్య ధాత్రి స
త్కులమున మేలిమిన్ జెడఁగఁ ♦ గోరి యొనర్చితి భూగుణంబుచే
జల గుణమున్ విభిన్నమగు ♦ జాసున నుత్తమ వంశ కీర్తి నీ
వలన నశించె సర్వమును ♦ పాడుపడెం బలుభంగులం గటా! ౧౧౬౯

క॥ ఇచ్చితి జయము మఘువునకు, గ్రొచ్చితి పల్లంబు బందు♦గులకు నీర్కున్
దెచ్చితి పలువగలఁ జెఱుగు, వచ్చితి చానిచ్చఁ దొలఁగు♦పద్ధతి గలదే? ౧౧౭౦

తే॥ మంచి ధర్మపద్ధతుల త్రొ♦క్కించిచేసి, వన్నె మున్నుగూర్చితి బల♦భాగ్యములకు
నట్టి ధర్మంబు నీవయి♦యడఁచివైన, నంచితంబుగ నెవ రుద్ధ♦రించువారు? ౧౧౭౧

చ॥ త్రికరణశుద్ధి యుల్లసిలి ♦ దీన శరణ్యత ధర్మవర్తనల్
ప్రకట పరోపకారమును ♦ భాసిలు పుణ్యులట్రోలఁ గల్ల బూ
టకములఁ బాపమందును వ ♦ టారితనంబు వహించినట్టి మో
ఱకులు జయింపనేర్తురె? తో ♦ ఱంగునె ధర్మ మధర్మ పీడచే. ౧౧౭౨

చ॥ మఱియొకమాట విన్నఁ గడు ♦ మంచిదయా వినవేని లెస్స యొ
డ్డొఱకములేల? యున్నది ప ♦ యోధిని దాఁటిన కోఁతి,సీతయుం
జెఱపడె వాలి వక్షమును ♦ చీల్చిన బాణముకద్దు దైత్యులుం
గొఱవడకుండఁగా మనముఁ ♦ గూడితి మేది కొఱంత యెన్నఁగన్?

శా॥ సీతాదేవిని వీడి రామ పద రా ♦ జీవంబులన్ వ్రాలి ప్ర
స్ఫీత ప్రాభవమొందు నీయనుజు సు ♦ స్నిగ్ధుండవై కొల్చి త
చ్చేతోమోదన రీతి వర్తిలుము; నీ ♦ సేనాతతిం బంపి త
ద్వ్రాతంబుల్ నశియింపఁ జింతిలుట భా ♦ వ్యంబౌనె? లంకేశ్వరా!

తే॥ పేర్చి దళములఁ బూర్తిగాఁ♦గూర్చికొంచుఁ, గదనరంగంబునకుఁ జని♦కడిమిఁజూపి
శత్రుల జయించుటో లేక♦సమయుటో తగుఁ, గాక యిది యుక్తమగునె లం♦కాపురీశ!

తే॥ అనిన విని రావణుండు ని♦న్నక్కఱపడి, పిలుచుటెన్న భవిష్యత్తు♦దెలుపఁగాదు
వెడలి యల్పమానవులఁ జ♦క్కడఁపఁగాని, నీహితము లెస్స! తెలిసె న♦త్యాహితంబు.

క॥ విడిచితివి పౌరుషంబును, కుడిచితి వుదరంబు నిండఁ♦గుదురుగ నింకన్
నడవుము చల్లనియెడ కటఁ, బడి నిద్దురపొమ్ము రేలు♦పవళులు ప్రీతిన్. ౧౧౭౭

తే॥ మానవులకుఁ గేల్మోడ్చిన♦మస్కరించి, కూనిమ్రానిమన్కులకుమ్రొ♦క్కులనొనర్చి
బ్రతుకు మనుగడ తిండికై ♦బ్రతుకునట్టి, నీకు నీతమ్మునకుఁ దగు♦నాకుఁ దగునె?

శా॥ ఓరీ సేవక! సాయుధంబగు రథం ♦ బొంటించి తెప్పింపు మ
ర్వార ప్రోద్ధతి దేవ నాగ నర వ♦ర్గంబెల్ల నొక్కుమ్మడిన్
జేరన్వచ్చి మనుష్య వానరులకున్ ♦ జేడ్పాటు గాకుండఁగా
బోరన్ రండని యెల్లవారలకుఁ దె ♦ ల్పుండీ మదీయాజ్ఞచే.

చ॥ అని పయనంబుకై తొడఁగు ♦ నన్న పదంబుల వ్రాలి శూలముల్
మినమినలాడఁ గైకొని క్షు ♦ మింపుము గెల్పునె పొంది వత్తు నే
నని వచియింపఁజాల విధి ♦ యార్చుచు గెంటుచు నుండెఁ జావు త
ప్పని సరి చత్తునేని జన ♦ పాలక నందిని వీడు మేలగున్. ౧౧౮౦

తే॥ ఇంద్రజితుఁడును లక్ష్మణు♦నిష్టువుచేతఁ, బడుట నిక్కము సేనయో♦పవనధూత
భూతియగు; భావిశుభములఁ♦బొందు తెఱఁగు, చర్చచేసి యంచితరీతిఁ♦జలుపుమన్న!

క॥ నను గెలిచిరేని పిమ్మట, నిను గెలుచుట నిజము; పిదప♦నెమ్మి దలఁచి నీ
తను వీడనుట వెడఁగగుఁ, బనిగొని విడుటెన్న నీ త♦పఃఫల మన్నా!

తే॥ నేర్చి నేరక తొలినుండి♦నేఁటిదాఁక, నేనొనర్చు తప్పులు గల♦వేని సైఁపు
మన్న! నీయెదుటికి వచ్చు♦టరిది యింక, సెలవె? యని కుంభకర్ణుండు♦వెలలఁ బాఱె.

తే॥ నిలుచు రావణు కన్నుల♦నీరె కాక, నెత్తురును చిందె నచ్చటి♦నెమ్మి బందు
గులును మిక్కిలి తపియించి♦కుమిలినారు, కుంభకర్ణుండు పోయెను♦కోటదాఁటి.

తే॥ శూలధారియై చను మహా♦శూరుతోడ, వెడలుఁగాక సైన్యంబని♦విభుఁడు పలుక
దనుజ బృందంబు వెడలె వా♦ద్యములతోడ, మింట సురలతలల ధూళి♦మేవుకొనఁగ.

తే॥ స్యందనములపై మాతంగ♦బృందముపయి, గాలిబంటుల కేలను♦గ్రాలు కేత
నమ్ము లాజిని లేచు ర♦జమ్ము దినిసి, మైలపఱుప వానిఁ దుడుచు♦లీలనొప్పె

తే॥ ఆయుధంబు లొండొంటి రా♦యంగ లేచు, నిప్పుకలు వీరుల కనుల♦నిగుడు మిడుఁగు
ఱులును మిక్కిలి వెలుఁవడి♦యులముకతన, వేఁడిచేత జీమూతముల్♦మాఁడిరాలె.

చ॥ కరులు తురంగముల్ రథ ని ♦ కాయము దండడియై కడల్కొనన్
ద్వరపడి ముంగల న్నడచు ♦ దండును వెన్కల నేగు సేన క్రి
క్కిఱిసి కుదించి మధ్య నిఱి ♦ కింపఁగ లోపలి మూఁక నేలపైఁ
జరణము లూనలేక యెల♦సంబున వే చనె సంతరంబునన్. ౧౧౮౧

ఆ॥ వేయి శరభములును♦వేయి సింగంబులు, వేయి భూతములును♦వేయి కరులు
కట్టఁబడిన ఉగిభ♦గణమీడ్వలేని తే, రెక్కి కుంభకర్ణుఁ♦డేగుదెంచె ౧౧౮౨

ఆ॥ పరశు చక్ర భింది♦పాల గదాసి తో, మర నిషంగ చాప♦దర ఖరోగ్ర
ముసల శూల శస్త్ర♦ముద్గరాదులఁ దాల్చి, దనుజసేన నడచె♦ధరణి యదర.

ఆ॥ పరుస పరుసలుగను♦వడివడి చేనూని, యంది యిచ్చు రాక్ష♦సాలి మద్య
పాత్రములను పక్వ♦పఱచిన మాంసంబు, నినుచు బండ్లతోడఁ♦జనియెవెంట.

సీ॥ పెక్కండ్రు పనివాండ్రు♦వేవేగ బడిబడి, యిరుగేల వారి యం♦దిచ్చుచుండ
గుహను చొప్పించు నం♦గున నోట నించుచుఁ, గుంభకర్ణుఁడు రణ♦క్షోణిఁ జేర
వీని యాఁకొలపని♦వానర వితతితోఁ, బూర్తియై నిలుచునో? పొడవుకొనునొ?
వీని కడుపునిండఁ♦బ్రాణివర్గము లెల్లఁ జాలియుండునె యను♦శంక పొడము
తే॥ చరణ మంచినచో నెల్ల♦శవ మయంబు, వీని మూలాన సమవర్తి♦వేఱుత్రోత్త
దారి మెఱిఁగెను యముఁ డెప్ర♦త్యక్షమయ్యెఁ, బాఱుచెట్లని యమరులు♦పరుగులిడిరి
తే॥ సర్పరాజు శిరమునుండి♦జాఱి భూమి, కోడ మేరువు వచ్చిన♦తోయ మొప్ప
కనక రథమెక్కి వచ్చు నా♦ఘనశరీరుఁ, గుంభకర్ణుని శ్యామలాం♦గుండు గాంచె.
తే॥ ఘన పతాకయందున వీఁక♦గానరాదు, సింగ మున్నది వాని వి♦చిత్రతనువు
చిత్తవేగముతోఁ డఁజూ♦చినను పూర్తి, గాదు రాక్షసరూపుఁడీ♦ఖరుఁ డెవండొ?.

చ॥ ఒక్క భుజంబుఁదొట్టి మఱి ♦ యొక్క భుజం బగుదాఁకఁ జూడఁగా
నిక్కము కొన్నినాళ్లు పయ ♦ నించును కాళ్లు జనించినట్టి గ
ట్టొక్కటి యిట్లు వచ్చెనొకొ? ♦ యుద్ధము సేయఁగఁ గోరివచ్చు నెఱ్
మొక్కలుఁ డంచెదం దలఁపఁ ♦ బోలదు ఘోర శరీరుఁ డెవ్వఁడో?.
మ॥ ఉదయాద్రిన్ మొలతెంచు భాను కిరణో♦ద్యోగంబు మట్టార్చి పె
ల్లిదమౌ చీకటి నించు వీని తనువున్♦లెస్సం బరీక్షించి నె
మ్మది భీతిల్లి ప్లవంగముల్ దెసలకుం♦బర్వెత్తె నీసైన్యముల్
జెదరం దోలఁగ రావణుండు గొను నా♦భీల క్రుధారూపమో?

—: విభీషణుఁడు రామునకుఁ గుంభకర్ణు నెఱింగించుట :—

మ॥ అని శ్రీరాముఁడు ప్రశ్న సేయ విని లం♦కాధీశు తమ్ముండు ప
ల్కెను మాయన్న కృతాంతతుల్యుఁడు లయో♦గ్రుం బోలు వాఁడంబుజా
సను గన్నాతఁడు యోగనిద్ర మదిలోఁ జాలింప దైత్యాళి నీ
ల్గును; వేల్పుల్ మరణింతు రీయసుర కూ♦ర్కున్నీడి కన్విచ్చినన్.
తే॥ లేప లేని కల్పముదాఁక♦లేవకుండు, నిదురపోతు గాలికి మించి♦కదలువాఁడు
యమునకు యముండు హరిహయు♦నాజిఁ దఱిమె, రోషశీలుండు కుంభక♦ర్ణుఁడనువాఁడు.
సీ॥ పైనున్న యింద్రుండు♦పడకుండఁ జొరంతిఁ, దేకుఁవ గిరగిరఁద్రిప్పినాఁడు
శ్వాసనుఁబట్టి నలంచి♦సాగంబు దీయంగఁ, బిడుచువాఁడు జలధి♦నడచువాఁడు
చేవకుఁ దగు దృఢ♦చిత్తంబు గలవాఁడు, బ్రహ్మచే వరములఁ♦బడసినాఁడు
శూలిని మెప్పించి♦శూలంబు గొనినాఁడు, సురల వీఁపులె సదా♦చూచువాఁడు
తే॥ ప్రబలి తాటియాకుల గాలి♦పడగవోలెఁ, దిరిగినాఁడు జగంబులఁ♦ద్రిప్పినాఁడు
ఇంతదాఁకను నిద్రయం♦దీతఁ డుంట, వలన జీవించియున్నది♦ప్రాణి వితతి.

తే॥ పాడితెరువు గాదిది దీని♦వలన మనకుఁ, బ్రాణహాని నిశ్చయమని♦యన్నతోడ
రెండు మాటలు పలికె నీ♦తండు దాని, వెడఁగు దైత్యుండు పెడచెవిఁ♦బెట్టినాఁడు.
తే॥ సాధ్యమైనంతవఱకును♦సామమునను, హితము బోధించి తుదకింత♦యేని వినమి
వినుగుచెంది మృత్యువు శిరో♦వీధి నిలిచె, ననుచుఁబల్కి నీయెదుటికి♦నరుగుదెంచె
తే॥ అని విభీషణుఁ డాడ వ♦నాటవిభుఁడు, వీనిఁ జంపిన లాభంబు♦గానఁబడదు
వచ్చునేని చేర్చికొని యు♦వ్వాల వలసిన, పనులు గావింత మిది నీకుఁ♦జనునకాదె?
తే॥ అనుడు నతసురయోద్ధకుఁ♦బోవ నర్హుఁడెవ్వఁ, డనుచు రాముఁడు పల్క న♦త్యల్పన నేగి
కలుపుగోలుతనంబునఁ♦బలికి వచ్చు, నేని తోడ్తెత్తు నని రావ♦ణానుజుండు.
తే॥ మంచిదని రాముఁడన దైత్య♦మాన్యుఁ డేగి, యతనిరాకను విని మోద♦మందుకుంభ
కర్ణు పాదముల్ తన మస్త♦కంబు సోఁకఁ, జాఁగి మ్రొక్క నతఁడు నె త్తి♦కౌఁగిలించె.

—: విభీషణ కుంభకర్ణుల సంభాషణము :—

చ॥ కనుల ముదశ్రు బిందువులు ♦ గాఱ శిరంబును మూరుకొంచు మె
ల్పున నురమానఁ జేర్చి యెద ♦ లుం బలుమాఱులు దువ్విదువ్వి స
జ్జన తిలకాగ్రగణ్య! శుభ♦సంతతులెల్ల నొకండ వొంది తం
చును ముదమందు నాతలఁపు ♦ శోషిల వచ్చితివేల యజ్ఞత? ౧౨౦౬
ఉ॥ నీ వభయంబు నొందుటయు ♦ నిర్జరు లేనియుఁ జెందరాని సం
భావిత సౌఖ్యముల్ చెడని♦పద్ధతిఁ గాంచుట వీనులారఁగా
నే విని పొంగి పోయితి గు ♦ ణీ! జమువాతను చిక్కియున్న మా
తావున కేలవచ్చి తమ్మ ♦ తంబును రోసి విసంబుఁ గోరితే? ౧౨౦౬
చ॥ చెడి కృశియించుచున్న కుల ♦ శిష్ట గురుత్వము నీ కతంబునన్
దొడిఁబడకుండ వర్ధిలును ♦ తొల్లిటి కైవడి నంచు మోదనం
బడర వహించు నాతలఁపు ♦ లాఱడి వోవఁగ నాల్కయెండ ని
య్యెడ కరుదెంచితేల మది ♦ యెంతయుఁ దాపము నొంద నక్కటా!
మ॥ తనప్రాణంబులు వోవునట్టి వశ యు ♦ త్పాదిల్లినన్ లోక పా
వనుఁడౌ రాఘవుఁ డాశ్రితావళిని బ్రో ♦ వన్ సాహసింపండు ము
న్నె నశించెన్ మరణంపుభీతి యిపుడా ♦ సిత్యాత్ము సేవించుటన్
జననోద్విగ్నత వోయె నింక నెదియో ♦ సాధింప నీ వచ్చుటల్?
సీ॥ సద్ధర్మమూర్తి శ్రీ ♦ జానకీనాథుని, కలిసి సేవించు భా ♦ గ్యంబు నోచి
పాపకారణములై♦పరఁగు సజ్ఞానంబు, నన్యథాత్వము సంశ ♦ యంబు ననెడి
మూఁడు దుర్గుణముల♦మూలంబుతోఁ ద్రెంచి, భవ దోషముల నెల్లఁ♦బాఱఁదోలి
నిర్మలమూర్తివై♦నెగడు నీవింకను, పరదారలను గోరు♦దురిత మతుల

తే॥ బంధువులఁగాఁ దలఁతువే? బ్రహ్మవలన, నీతి ధర్మంబు జ్ఞానంబు♦నిర్మలతయు
నమృతజీవితమును పొంది♦యన్న! తుదకు, మన కులాచార వాసన♦మాన వేమి?

మ॥ దనుజధ్వంసి ధరాత్మజాధిపుఁడు కో ♦ దండంబు నెక్కించి హె
చ్చిన కోపంబున మాకుఁగా నటఁ బ్రతీ♦క్షించెఁ దదీయానుజుం
డును కీశాలియుఁ జంపనెంచిన యముం ♦ డు న్నిల్వఁ ద్రోవంగనే
రని మాదుర్విధి కాచియున్నది కుమా ♦ రా! యేల నీవచ్చుటల్ ?

తే॥ నీవు రాము శరణుచొచ్చి♦నిలువవేని, రాక్షసులమేము రామ శ♦రవ్రజమున
నాశమొందంగ నుదక దా♦నమ్ము సేయ, నొక్కఁడైన లేకుండుట♦యొప్పునయ్య?

ఉ॥ లంకకు నీవు వచ్చుట క ♦ లంక వహించిన దైత్య వంశముల్
క్రుంకినమీఁద నెమ్మదిఁ గ ♦ రుత్య్వ మహాన్వయుతోడనే చుమీ
శంకిల నేల? యక్షయ య♦శస్కర సంపద లందుమయ్య! నా
కంకిలి పల్క కింకఁ జను ♦ మా యన నన్నకుఁ దమ్ముఁ డిట్లనున్.

చ॥ వెడఁగగు నాయెడం గరుణ ♦వీ డని రాముఁడు నీవు వచ్చినన్
విడువఁడు ప్రేమఁజూపుఁ బగ ♦ వీడు భవాంబుధి దాఁటఁ జేయుఁ బెం
పడరఁగ నాకొసంగిన స ♦ మస్తము నిచ్చెద లంకతోడ నా
యెడఁ గరుణించి రమ్ము శుభ ♦ మింతకు మించియు నున్నె చూడుమా?

ఉ॥ తప్పికొనంగరాదు నయ ♦ ధర్మవిశారద! పాఱి దాఁగఁగా
నెప్పు గనంగరాదు మర ♦ ణించుట నిక్కము రిత్త చావఁగా
నొప్పునదేది? సత్పథమ ♦ యొందఁగఁదగ్గది నీకు నింతఁగాఁ
జెప్పెడి పాటి వాఁడనె? వి ♦ శిష్ట గుణాకర! యెంచి చూడుమా.

చ॥ చెడుగులె యెల్లవేళలను ♦ చేయుచునుండిరయేని వారు తోఁ
బొడమిన వారలంచు బుధ ♦ పుంగవులంచును బంధులంచు నె
గ్గడి పడి యోర్వనౌనె సత ♦ తంబును ధర్మ పథానువర్తికిన్?
బొడవగు నింటి దీపమని ♦ ముద్దిడ మూతిని కాల్పకుండునే? ౧౨౧౫

ఉ॥ ఉత్తమకార్యముల్ మిగుల ♦ నోర్పునఁ జేయఁగ నింద యబ్బునే?
క్రొత్తగు దుఃఖజాలములఁ ♦ గూర్చును సంసృతియంచు నిచ్చలున్
బొత్తులఁ దల్లిదండ్రులను ♦ పుత్త్రుల భార్యల వీడువారు పె
న్బత్తిని ధర్మమున్ విడరు ♦ వాఁడికి నవ్వియు యిచ్చు మోక్షమున్.

చ॥ చెడు గొకరుండు సేయ నటు ♦ సేయని వారును వానితోడనే
యడఁగుట మేలో? కీడో? వెర ♦ వార వివేకిత గల్గువాఁడవే
నుడువుము కన్నతల్లి నెఱి ♦ నూఁకుటచేఁ గద భార్గవుండు చ
క్కడఁచె; భవుండు బ్రహ్మతల ♦ నక్కట! త్రుంచె దొసంగు గల్గుటన్.

ఉ॥ ఆఱడి యొంద నారకము ◆ నం దడఁగందగు చెడ్డ కార్యముల్
వీఱిఁడి చేయువాఁ డనుచు ◆ విజ్ఞులు చేయుదురే ? శరీరమం
దాఱని పుండునందు చెడు ◆ నంగముఁ గోసి తొలంచి కారముం
దూఱిచి మాడ్పఁగాఁదగును; ◆ తోయధి నింగువ గల్పు టొప్పునే ?

ఉ॥ అన్నను కావఁదగ్గ వెర ◆ వారయ లేద యధర్మ వృత్తముం
గ్రన్నఁ దొలంతమన్న నది ◆ కాదిఁక దిక్పతులెల్ల నవ్వఁగా
బన్నము లొంది ప్రాణములఁ ◆ బాయఁగవచ్చును రౌరవంబునం
దెన్నిక నుండవచ్చు మఱి ◆ యేది యొనర్పఁగ వచ్చుఁ దెల్పుమా !

ఉ॥ లోకములెల్ల గెల్చితివి ◆ లోఁగొని పాలన సేయలేదు భూ
లోకమునందు నిద్దురను ◆ లోలతఁ గొల్చితి నేఁటిదాఁక న
ట్రాఁకలితోడ నాయువును ◆ యౌవనముల్ వృథగా గతించె నేఁ
డీ కరణిఁ ద్యజింపఁదగు ◆ నే యనువర్గ మధర్మవృత్తికై ? ౧౨౨౦

చ॥ నెనరున రాఘవుండు కరు ◆ ణింపఁగ నిద్రయు వీడి సౌఖ్య భా
జనమగు జీవితంబుగొని ◆ సార్వజనీనముగాఁగ రాజ్య పా
లన మొనరింప నర్హుఁడవు ◆ లభ్య పదంబిది కూడివచ్చె నా
మనవిని వ్యర్థపుచ్చక న ◆ మంచితరీతి ననుగ్రహింపుమా. ౧౨౨౧

సీ॥ ధర్మ సంస్థాపనా◆ర్థంబు విష్ణువు రాముఁ, డై జనించెను భాస్క◆రాన్వయమున
నాదిదేవుఁడె యీయ◆నపవాదు గల్గునే ?, యెల్లిదమానె? రా◆యిడియు నున్నె?
నీచుల పద్ధతుల్◆నీఁగి విబుధ సంఘ, నియమముల్ గొని నీవు◆నెగడు దేని
రాక్షసాన్వయ మహా◆వృక్షంబునకు వేఱు, పురువు దశాస్యుండు◆పొలియు పిదప
తే॥ నీ కుమారులతోడను◆నా కుమారు, లన్న కొడుకులు సౌఖ్యంబు◆లరయువారు
మన పులస్త్య వంశంబు ని◆ర్మలినమగును, తెలియవే యింతమాత్రంబు◆ధీరచరిత !

సీ॥ మునులు ప్రేమింతురు◆దనుజ విరోధులౌ, సురలు ప్రేమింతురు◆నూడడంగు
శాత్రవులే నీకు ◆ జగతి లేకుందురు, పిందెలు పుట్టెడి ◆ వేళయందు
పూలు ద్రుంచుట దొడ్డ◆పురుషుల పనియౌనె ? జానకీపతియె నై◆సర్గికమగు
కరుణచే నామెడఁ◆గల ప్రేమచేత ని, న్నర్థించి పిల్వ న◆న్నంపినాఁడు
తే॥ రాముఁ జేరుట మేటి క◆ర్తవ్యమగును, కాన ధర్మంబుఁ గడపక◆కడఁకతోడ
వచ్చి మేలొందుమని వాని◆పాదములను, వినమితుండయి పట్టె వి◆భీషణుండు.

ఆ॥ శిరము భూమి సోఁక◆నెరఁగి కాళులు పట్టి, కొన్న చిన్నతమ్ముఁ◆గ్రుచ్చియెత్తి
యక్కు చేర్చి కనుల◆నస్రముల్ రాల్చుచుఁ, గుంభకర్ణుఁ డిట్లు◆కుదురఁబలికె.

చ॥ జల లిఖితంబు వంటి సుఖ ◆ సంపద లందఁగఁగోరి యెల్లవే
ళలఁ దగఁబెంచి పోరికి న ◆ లంకృతిచేసి జయేచ్ఛచేత న

న్నెలమిని పంపు నన్నుకు వ ♦ హించిన ప్రాణము లీయకుండ శ
త్రులకడఁ జేర నాకొనరు♦దుఃఖముఁ దీర్తువయేని పొమ్మికన్. ౧౨౨౫

తే॥ చెడని ధర్మమార్గము చిరం♦జీవితయును, ధాత వరమునఁ బడసిన♦తండ్రి ! నీవ
జగములకుఁ బ్రభుండవు నీకె♦తగినదదియు, సమర మరణంబె నాకు య♦శస్కరంబు.

ఉ॥ యోచనలేని యొక్క ప్రభు♦వొప్పమి సేయఁ దలంచెనేని యా
లోచన సెప్పి దిద్దుటది ♦ లోకమతంబు వినండయేని వీ
రోచిత వృత్తినుండి విభు ♦ నోరెము మెక్కిన వార లాజిలో
దాఁచక ప్రాణముల్ విడుట ♦ ధర్మము; వీడుట కీర్తిమార్గమే ? ౧౨౨౭

చ॥ చెలఁగుగ దేవదానవులు ♦ సేవలు సేయఁగ మూఁడు లోకముల్
బలిమిని గెల్చినట్టి రిపు ♦ వారణ సింహుఁడు రామబాణ ని
ర్దళిత తనూజ బంధు హిత ♦ తండముతో మరణించుచుండఁ ద
మ్ముల నొకరేని తోడ్పడక ♦ పూర్తిగ నీఁగుట భావ్య మానొకో ?

చ॥ ఎదురొక యింతలేక విజ ♦ యేందిర నల్లెడఁ గొంటచే భయం
బెదగొనియున్న శాత్రవులు ♦ హేళన సేయ నుమా మహేశ్వరుల్
పొదలు నగంబు నెత్తిన ప్ర ♦ పుష్ట భుజంబులు కాలపాశ బ
ద్ధ దశ భజింప నొంటిగఁ గ్రొ ♦ తాంతుని సద్మము సేరఁ బాడియే?

చ॥ బలితపు రాగికోటలను ♦ భాసిలు పట్టణ సంప దుద్ధతిం
దెలిసి మదగ్రజాసువులఁ ♦ దీసిన విద్విషు సంస్తుతించుచున్
గలనిని మార్గణావళిని ♦ కాయలుగాచిన బొమ్మతో వడిన్
వలకడ తేని దుర్మదముఁ ♦ బాపిన యేనును మ్రొక్క నేర్తునే ?. ౧౨౩౦

సీ॥ హనుమంతు నంగదు♦నర్కసుతుని వీర, మనుజులౌ రామల♦క్ష్మణుల నీలుఁ
గాయలు కసరుల♦కై ప్రాఁకులాడు వా, నర బుభుక్షపరులను♦నణుము చేసి
ప్రాలేయహరుఁడై న♦భాస్కరుకై వడిఁ, గదన రంగంబునఁ♦బొదలువాఁడ
హాలాహలముఁ గన్న♦యమగులవలె హరి, సేనలు దెసలకుఁ♦జెదరి పాఱఁ
తే॥ గడలి స్థితిదప్ప నగ్నియు♦గాలి పఱవ, విలయమంచు జగంబులు♦విహ్వలింప
శూలమును కేలఁగొని తాటి♦గాలిపడగ, పదురునం దిరిగెదఁ జూడు♦మెదురు లేక.

తే॥ కలఁగి పాఱక సమర రం♦గంబునందు, నిలుచు వారెట్టివారైన♦జెలగివైతు
నాదు పలుకుల మన్నించి♦వాదు విడిచి, భాను కులుల స్నేహంబు గా♦పాడుకొనుము.

ఉ॥ తమ్ముఁడ ! యేగు మాజి తుది ♦ దాఁకిన పిమ్మట రాము వేఁడి త
త్సమ్మతి సంగరస్థలిని ♦ చచ్చినవారికి శాస్త్రయుక్తి నీ
తమ్ముగ నౌర్ధ్వదైహిక వి ♦ ధానముల న్నెఱవేర్చి మున్ముపే
రిమ్మున నారకంబునకు ♦ నేఁగఁగనీయక యుద్ధరింపుమా. ౧౨౩౩

తే॥ కాకమానదు కాఁగల♦కర్మ ఫలము, నిలిచి కనువిచ్చి కాచిన♦నిలువఁబోదు
కలరె నీకంటె విజ్ఞాన♦ఘనులు? చింత, సేయవలదు మాఱొడఁ; జిరం♦జీవి వగుము.

చ॥ అని మఱి చేరఁదీసి ప్రియ ♦ మారఁగఁ బ్రేమను బాష్పపూర్ణ వీ
క్షణములఁ జూచిచూచి పెలు ♦ చం దెగ నేఁటికి సోదరత్వ మి
ట్లని పనవంగఁ దమ్ముఁ డడ ♦ లాఁపఁగనేరక వ్రాలె నన్నపై. ౧౨౩౫

ఉ॥ నోరు మొగమ్ము డెందము క ♦ నుల్ వడినెండె శరీర జీవముల్
తాఱి తపించె నిర్వురకుఁ ♦ దక్కక వాఁడు పెకుంగ మేలు చే
కూరదటంచు నగ్రజుని ♦ కోరి యనుజ్ఞను వేఁడి సేనఁగం
బేరిమిఁ గేలుమోడ్చఁగ వి ♦ భీషణుఁ డయ్యెడనుండి క్రమ్మఱెన్.

ఉ॥ చౌర్యము గల్గు మమ్ముఁ దన ♦ జాతి గుణంబులు వీడి వేద వి
ద్వర్యుఁడు మా విభీషణుఁడు ♦ బాల్యము సైతము ద్రోసెనంచు నే
చర్యయు లేక క్రుంగిన వి ♦ చారముతోఁ గనునీరు రక్త సాం
కర్యము నొంది వెల్లువలు ♦ గా నటనిల్చెను కుంభకర్ణుఁడున్. ౧౨౩౬

ఉ॥ వచ్చి విభీషణుండు రఘు ♦ వర్యుని పాద సరోజ యుగ్మమున్
హెచ్చిన భక్తి మ్రొక్కి ధర ♦ ణీశ్వర! చావఁదలంచువారికిన్
నచ్చునె ధర్మచింతనలు? ♦ న్యాయము సౌమ్యము నేర్పుచూపి పె
న్మచ్చిక చేసితిన్ మనసు ♦ మాఱదు పోదు కులాభిమానమున్. ౧౨౩౭

తే॥ అంచుఁబలుకంగ శిరము పం♦కించిరామ, చంద్రుఁడనియె నీయెదుటనె♦జాలిమాలి
యాజి నీయన్నఁ జంపు ట♦నర్థమనుచు, మంచిదేయంటి; విధికిని♦మాఱుగలదె?

—: కుంభకర్ణుని యుద్ధము :—

తే॥ అనుచు మెల్లన ననుచుండ♦నసురసేన, వనచరావళిఁదఱిసి పో♦రునకుఁ దిగువ
నెగసినట్టి రజము నిండ♦నీరరాశి, ఘోష మడఁగె దద్విధము కా♦కుత్స్థుఁ డెఱిఁగె

ఉ॥ పాఱెఁ దురంగముల్ కరులు ♦ పాఱె రథంబులు పాఱెఁ గొండలుం
బాఱెను నెత్తు వెల్లువలు ♦ పాఱెఁ గబంధము లెల్లచోటులన్
మీఱి నటించె భూతములు ♦ మిక్కిలి గంతులు వైచెఁ డెక్కముల్
తాఱెను కంక గృధ్రములు ♦ తారె వియత్తల మెల్ల నిండుచున్. ౧౨౪౧

సీ॥ ఎమ్ములు మెదడు మాం♦సమ్ము రక్తము క్రొవ్వు, నలినలిగాఁగ దా♦నవులు పడిరి
శిరములు భుజములు♦తరులను గిరులును, పొడిపొడిగాఁ గపుల్♦కెడసి పడిరి
ఏసిరి రక్కసు ♦ లేసిరి వనచరుల్, విసరిరి దనుజులు ♦ విసరె హరులు
నలఁచిరి దైత్యులు♦నలఁచిరి ప్లవగులు, తిట్టిఁ దిట్టిరి కొట్టఁ♦గొట్టినారు

తే॥ చీల్పఁ జీల్చిరి చెలగంగఁ♦జెలగినారు, క్రుమ్మఁ గుమ్మిరి కొఱుకంగఁ♦గొఱికినారు
హెచ్చుతక్కువ లేకుండ♦నెసక మెసఁగ, రణము సల్పిరి ఖేచరుల్♦భ్రాంతినొంద.

ఉ॥ వానను తోలు గాలియును ♦ వాయుపుత్రకుస కోర్చు వానయుర్
మానగు తారకాణగ స♦మంబుగఁ బోరెడు పోరుగాంచి శ్రీ
మానిని నిర్జరేంద్ర పుర ♦ మార్గముఁ ద్రొక్కఁగనీని శూలముం
బూనిన కుంభకర్ణుఁడు స ♦ ముద్ధతి వచ్చె సమిద్ధరిత్రికిన్. ౧౨౪౩

తే॥ విలయవాతంబునందుజీ♦వులుభ్రమించు, ననువుదోఁపధూళినిదగు♦లొక్కనియునెత్రు
టేఱులం జక్రముల వార♦ణేంద్రములను, తగులుకొని నేలఁగూలెను♦తరుచరాళి.

సీ॥ శైలముల్ వైచుచు♦స్యందనాగ్రమునకుఁ, బఱతెంచు వానర♦ప్రతతిఁ బట్టి
మొనసి యొండొకటితో♦ మోఁదునుతన్నును, నలఁచును మ్రింగును♦నమలి యుమియుఁ
ద్రెంచును చీల్చును♦త్రిప్పి యెగురవైచుఁ, బిడిచి రక్తము మేనఁ♦దడవికొనును
నేల నడఁచివైచి♦కాల రాచును నీట, ముంచును నిప్పున♦నుంచుఁ గ్రుంచుఁ

తే॥ దేరునకుఁ గొట్టు జలనిధిఁ♦జేరవైచు, దిక్తటంబులఁ దవులంగఁ♦దివిరివైచుఁ
బాదల గ్రామఁకులఁబడవైచుఁ♦గుదియవైచుఁ, బర్వతంబులఁ బడవైచుఁ♦బాఱవైచు.

ఉ॥ ఖేచరపాళి భీతిఁ గలఁ ♦ గెన్ మలఁగెన్ దొలఁగెన్ వియత్థ్సలిన్
వేచెను కంకగృధ్రములు ♦ పీనుఁగులం దిన మూఁకమూఁకలై
మోచిన కొండలెల్లఁ బోలి ♦ వోయెఁ గృతాంతుఁడు సాధ్వసంబునం
జూచెను కుంభకర్ణుఁడు వ ♦ సుంధరఁ గోఁతులఁ జక్కడంపఁగన్. ౧౨౪౬

చ॥ విసరుట కొక్క తాయియును ♦ వృక్షముఁ జిక్కదు నేఁడె తెచ్చుకొం
డెసకమునన్ శుభంబు లుడ ♦ యించెను రండని వానరౌఘముల్
వెనఁ గొని తెచ్చి కొట్టినవి ♦ వేసిన తాలు గిరుల్ కుజంబు ల
క్కసపడకుండ దైత్యు భుజ ♦ కాండము లోర్చె నహోయనన్ సురల్.

ఆ॥ విసరుతాలు మట్టి♦పెళ్లలుఁ దరుగిరుల్, నుగ్గునూఁచ ముగుచు♦మ్రగ్గిపడఁగ
వైవ నవియులేక♦వానరుల్ పండ్లీల, కఱచి డాసి త్రుళ్లి♦తెఱలినారు. ౧౨౪౮

ఉ॥ కొందఱు గుంపుగూడి యొక♦కొండను ప్రాలెడి పిట్టతెట్టెలన్
చందమునంది వానిపయిఁ ♦ జయ్యన నెక్కుచుఁ గేలునొవ్వఁగాఁ
గందఁగ గ్రుద్ది అక్క పెడ ♦ కాటులు వైచి ఫలంబులేక చే
యందగ నెద్దియుం గనక ♦ యంతటఁ బాఱిరి మూలమూలకున్.

తే॥ నీలుఁడొక గొప్పముల నప ♦ లీలనెత్తి, నిప్పు లురలంగ గిరగిరఁ♦ద్రిప్పివైవ
శూలమున దానిఁ బొడిచేసి ♦ లీలనవ్వెఁ, గుంభకర్ణుండు వానరుల్♦కుతిలపడఁగ.

తే॥ అవల నొకగిరివైచియు♦వ్యర్థమైనఁ, గపులు గలఁగుదురని శతాం♦గమున కెదురు
నడచి పిడుగును మించిన♦పిడికిలిగొని, కుంభకర్ణుని పొడిచెను ♦ కుతలమదర.

ఉ॥ చేతులు కాలునొచ్చి తన ♦ చేఁతలు వ్యర్థముగాఁగ నీలుఁ డు
ద్ఘాతము సెంది కూలఁ దన ♦ దాపలి కేలను తాఁచె దైత్యుఁ డా

ఘాతముచేత నీలు నను ♦ కాండము తల్లడమందె నాయుధో
పేతుఁడుగామి శూలమున ♦ ప్రేయఁడు నిర్జరవైరి పాడిమై. ౧౨౫౨

చ॥ అదిగని యంగదుండు రభ ♦ సాతిశయంబున వార్ధినుండి బె
ట్టిదమగు కొండఁదెచ్చి పుర ♦ డించి నిశాచరుఁ డీల్గెనంచు స
మ్మదమున వానరావళులు ♦ మానుగ గంతులు వెట్ట వైచె న
ప్పదిలుఁడు తాఁచె దానిఁ దన వామభుజంబున దైత్యు లార్వఁగన్.

తే॥ తాఁప నక్కొండ ముక్కలై ♦ ధరణిఁ బడియె, నేది తెరువని హరులు పెం♦పేది పఱవఁ
జొరెమె ముందుంచు పాదంబు ♦ వెనుకఁ దివక, యక్కనును తానుగా నిల్చె ♦ నంగదుండు.

తే॥ కుంభకర్ణుఁ డంత నమోఘ ♦ ఘోరనిశిత, వజ్రదండ మెడమచేతఁ ♦ బట్టివైచెఁ
బ్రాణములు వీడఁగలవని ♦ పలికి దాని, నంగదుడు పట్టుకొనె వేల్పు ♦ లభినుతింప.

క॥ పట్టిన దండముఁ ద్రిప్పుచు, దిట్టండగు కుంభకర్ణు తీపి ♦ యుసుఱులన్
నెట్టన గొనియెదనని పిడు, గట్టులు మిడుఁగుఱులు సెదర ♦ నతనిం డాసెన్.

చ॥ కదిసిన వాలిపుత్త్రకుని ♦ కర్బురవర్యుఁడు గాంచి చావఁగాఁ
బదరెదు వానరేంద్రుఁడవొ? వాలిసుతుండవొ? లంకయందు ని
ప్పు దవులఁబెట్టి రాక్షసుల ♦ పొంకమడంచిన వాయుజుండవో?
కొడుకక తెల్పుమా? యనఁగఁ ♦ గోరిక నంగదుఁ డంత నిట్లనున్.

మత్త॥ వాలపాశముతోడ రావణుఁ ♦ బట్టి దిక్కులఁ ద్రిప్పు నా
వాలిపుత్త్రుఁడ రామభక్తుఁడఁ ♦ బంతమారఁగ నిన్ను నా
వాలమందునఁ జుట్టి రాఘవు ♦ పాదసన్నిధిఁ జేర్పఁగా
లీల వచ్చినవాఁడ నం చద ♦ లించి పల్కఁగ దైత్యుఁడున్. ౧౨౫౮

చ॥ మఱుఁగున నిల్చి నీజనకు ♦ ప్రమదఁగఁజేయు మహోపకారికిం
బెరసిన నూడు దీర్చి మఱు ♦ మేలొనరింపవయేసి లోకు లె
బ్బెఱికముతో హసింపరె? ప్ర ♦ వీణతఁ జేసితి మంచికార్యమే
తెలిఁగరు లైన శూరులు ను ♦ తింపరె దీనికి నిన్ను? బాలకా!

మ॥ వడి నీలావును వానరుల్ పొగడ నన్ ♦ వాలంబుతోఁ జుట్టి వెం
బడిఁ గొంపోవఁగఁ గాదుగాని సుమనో ♦ వక్షస్థలుల్ గ్రుమ్మి వె
ల్వడు శూలాగ్రమునందు గ్రుచ్చికొని ప్రే ♦ లన్ మింటిపై కెత్తి ని
న్నడరన్ లంకకుఁ గొంచుఁబోవుటకె నీ ♦ యభ్యాగమం బర్భకా!

ఆ॥ అనుచు నుఱిమిచూచి ♦ యా కుంభకర్ణుండు, చేతఁ ద్రేయ నూఱు ♦ చిదురలగుచు
వజ్రదండ మవనిఁ ♦ బడిన నంగదుఁడును, కినుక నాఁపలేక ♦ కేలుసాచి ౧౨౬౧

ఆ॥ పొడిచి కూల్తు ననుచు ♦ మెడవంచి దుముకంగ, నసురవరుడు శీర్ష ♦ మడఁగఁ బొడిచె
వానిపోటుతోడ ♦ వాలిపుత్త్రుఁడు సొలి, నేలఁగూలె నాంజనేయుఁ డడ్డె.

ఉ॥ వెండియుఁ గుంభకర్ణుఁడు క♦పిప్రభుపుత్త్రుని ఱొమ్మునగాఁడఁ జే
నుండిన శూలముల్ విసర ♦ నుజ్జనసేసెదు నంతలో నగం
బొండు వహించి వాని శిర ♦ ముగ్రత మోఁదుచు సింహనాద ము
ద్దండతఁ జేసి వాయుజుఁడు ♦ దాశరథి స్తవ మాచరింపఁగన్. ౧౨౬౩

కం॥ తలపై మఱియొక తలవలెఁ, జెలఁగు మలను చేతఁగొనుచుఁ ♦ జిందఱితోఁ గ
ర్వాలిసుతు ఱొమ్మునఁ సమ్మెట, వలెఁ దగులన్ వైచి దనుజ ♦ వర్యుం డార్చెన్

ఆ॥ అపుడు కీశవీరు ♦ లంజక యంగదుఁ, గొనుచుఁబోవ గొప్ప ♦ కొండఁ గొనుచు
హనుమ కుంభకర్ణు ♦ నదటున నీక్షించి, పన్నిదంబు చఱచి ♦ పలికె నిట్లు.

కం॥ వైచెద నీపై దీనిని, నీచేవయు నెల్లవారు ♦ నియతి నెఱుఁగఁగాఁ
దోఁచితివేనియు నీతో, నేచి దురము సలుప కవలి ♦ కేఁగెదఁ జుమ్మీ. ౧౨౬౬

కం॥ అన విని దనుజాధీశ్వరు, ననుజుఁడు రదనముల కాంతు ♦ లడరఁగ నగి నీ
పెనుమల నను సోలించిన, నని గెలిచినవాఁడ వగుదు ♦ హనుమా! వినుమా!

చ॥ అనుటయుఁ బిన్ననవ్వు నగి ♦ యాశుగపుత్త్రుఁడు నీవు చేవ గ
ల్గిన దనుజుండ వేని తమ ♦ కింపక నిల్వుము నిల్వలేనిచోఁ
జనుము రణస్థలిన్ విడిచి ♦ చయ్యనఁ బ్రాణముతోడ నంచు వై
చినఁ జలియింప కట్టి నిలి♦చెన్ భుజమొండఁగఁ జూపి దైత్యుఁడున్.

చ॥ తిరుఁడయి నిల్చి బాహుల వి♦దిర్చిన నమ్మల వేయి వ్రయ్యలై
ధరణిని రాలఁ గాంచి నయ ♦ దాంతుడు మారుతి వీని చేవకుం
బరిమితి లేదు రాఘవుని ♦ వాఁడి శరంబులె చీల్పఁజాలుఁ గ
ర్బురుని భుజాంతరంబు నని♦పోయెను దవ్వుగ వీడి యాస్థలిన్. ౧౨౬౯

సీ॥ డెబ్బది వెల్లువ♦లుబ్బునఁ దాఁకి చ, చ్చినవారు పోవ శే♦షించియున్న
వానరు లందొక♦రేనియు మిగులక, క్రూరుని శూలమున్♦గొట్టునందు
కెడయుదు రని యొక♦గడియలో జగములు, కలఁగునం చమరులు♦తలఁగినారు
తాఁకినవారిలో♦దర్పించి గెలిచిన, వారు నొప్పించిన♦వారులేరు

తే॥ కదనరంగంబునం గుంభ♦కర్ణుఁ డడరి, యొక్క కపిజాడ యైన లే♦కుండఁ జేసి
బట్టబయలున విహరించి♦పౌరుషమునఁ, గీర్తికిం బ్రోత్తఁదనము గ♦ల్గించె నాఁడు.

తే॥ దుర్దముండగు కపివీర♦మర్దనుండు, కుంభకర్ణుండు తిరిగిన♦గొప్పబయలు
మున్న గస్త్యుఁడు త్రావఁగాఁ♦జెన్నుతఱిగి, యడఁగినట్టి పయోరాశి♦ననుకరించె.

మ॥ యమరాడ్భీకరుఁడైన దైత్యుఁడు మహా ♦ హంకారుఁడై కీశ బృం
దము చావంగని రామలక్ష్మణులు యు ♦ ద్ధక్రీడఁ గాంక్షించి రం
గమునందే కలరా? యెటేగిరి? మఱో ♦ క్కం డున్నదే లంక? ద
ర్పమునన్ రారొకో? యంచుఁ దా భుజము లా ♦ స్ఫాలించుచుం గర్జిలెన్.

—: లక్ష్మణ కుంభకర్ణుల యుద్ధము :—

తే॥ తరులు గిరులును బూలును◆తగ్గిపోయెఁ, గోఁతిమూఁకయు సగముపైఁ◆గ్రుంగిపోయె
ననుచు ఖచరులు చింతింప◆విని చిరాకు, గొనుచు సౌమిత్రి తన్నుఁ బే◆ర్కొనుచుఁ దాఁకె

మ॥ రణరంగంబున నిల్చి లక్ష్మణుఁడు ధ◆ర్మం బెక్కు గావించుచున్
గుణరావం బొనరించె నూడిపడ ర◆క్షోదార కంఠస్థలీ
గుణ సంఘంబులు కర్ణభేరు లగలన్◆క్షోణీధరంబుల్ ప్రతి
క్వణముల్ సేయఁగ భూతజాలము మహా◆కంపంబునం బొందఁగన్

చ॥ పరపిన లక్ష్మణ ప్రదర◆వారము నింగిని భూమిఁ గప్పుచున్
దెఱసి యొకింతలేక కడు◆తీవ్ర దురంత రుషా క్షుధార్తమై
యొఱకలతోడ నోట వడి◆నింగల ముమ్ముచుఁ బోయిపోయి య
మ్మొఱకుల రక్తముల్ వెగటు◆పుట్టఁగఁ ద్రావెను కెక్కి గ్రక్కుచున్.

తే॥ తలలఁ ద్రెంచుచు సర్వాల◆దాఁటెఁ గొన్ని, తలల నొందిన రీతిని◆తనరెఁ గొన్ని
కడలకుం గొనిపోయెను◆కరుల దూసి, యసురులం దూసి యర్వాలి◆కరిగెఁ గొన్ని.

తే॥ మెఱుపుగుంపుల కైవడి◆మెఱయు పైఁడి, మొనలతూపులు పఱచి య◆మ్మొనను గలుగు
దనుజ ముఖ కంఠ భుజ భుజాం◆తర మహోరు, జాను జంఘా చరణ పృష్ఠ◆సమితి నఱకె.

సీ॥ మొదలనుండిన వారి◆మోములఁ దూఁటి వె, న్కలఁగలవారి వీఁ◆పులను దూసి
భేరుల కన్నులఁ◆దూఁటి కాహళముల, నాళంబులం బాఁటి◆కాళెపట్టు
వారి చేతులఁ ద్రుంచి◆వారణ కంఠముల్, తఱఁగి తేరులఁ గూల్చి◆నఱకి హరులఁ
జూచిన కన్నులఁ◆జొచ్చి యేచిన కంఠ, ములఁ ద్రెంచి కడుపులఁ◆గలఁచి వచ్చి

తే॥ దంతములు రాలవాలహ◆స్తములు వ్రీలఁ, గాళ్లువిఱుగఁగన్నులుపోవఁ◆గరులగిరుల
కరణి దొరలించి సౌమిత్రి◆కాండచయము, లెల్లెడం దామయై యిట్టు◆లేపు మీఱె.

ఉ॥ నేలను మింటిపై జరుగ◆నేర్చిన వారువముల్ నిరంతర
జ్వాలలు గ్రక్కుచున్ వెడలు◆బాణ పరంపర నాట బన్నెరం
గూలెను కొన్ని చుట్టికొని◆కొన్ని మడంగెను చాఁపకట్టుగాఁ
దూలెను కొన్ని నెత్తుటను◆దోఁగుచు వ్రాలెను కొన్ని ధాత్రిపై

ఉ॥ పెక్కు శిలీముఖమ్ము లొగిఁ◆బెక్కు విధమ్ములఁ దాఁకి నొంపఁగా
స్రుక్కెను రథ్యపాళి రథ◆చోదకు లీల్గిరి స్యందన స్థితుల్
మ్రక్కిరి రక్తవాహినులు◆ప్రబ్బి రథమ్ములఁ ద్రోచుచుండఁగా
నొక్కటఁ బోవుఁ బోవ వాక◆యోజయుఁ దెన్నును లేక యయ్యెడన్.

తే॥ విధిని పోలిన నారాచ◆వితతి గ్రుచ్చు, కొన్నవియుఁ ద్రెంచినవియును◆కూల్చినవియు
రక్తఘటమువంటివి రక్త◆సిక్తమైన, తలలు మస్తిష్క పంకంబు◆పొలుపుదాల్చె.

తే॥ పొడిచి త్రోచిన♦వడువునఁ బడిన తలలు, తుడుములం బడు జల్లుల♦తోయమొందె
సర్వ లోకనాయకుని వి♦జయ మహోత్స, వమున కుంచిన మొలకల♦పోలిక లన.

క॥ శిరములు నొసళులఁ దగులం, గిరగిర వడఁదిరిగి కరులు ♦ గీపెట్టుచు వా
నరసైన్య మసురసైన్యము, నరయక యరిగినదె పోక♦యై యెడచొచ్చెన్. ౧౨౮౩

ఉ॥ ఆమని మీనకేతనుని ♦ యందము నొందిన సుందరుండు శ్రీ
రాముని తమ్ముఁడేయు ప్రద♦రమ్ములు త్రుంపఁగ యామినీ చర
స్తోమము లేసినట్టి పలు ♦ తోయము లందిన కైదువుల్ రజం
బై మహిరాలె రిక్కలు ర ♦ యంబున రాలిన చెన్ను దోఁపఁగన్.

తే॥ కలికుటమ్ములు శ్రేణులై ♦కరుల హారుల, తలలఁ దూటి తోఁకలడుప్పి♦యిలనుగూల్చి
సిడము లూనిన దడములఁ♦జెండి యరద, ములను దోలిచి జరీన స♦వ్యాలికినేగె.

మ॥ తలఁగించున్ సుఖదుఃఖ సంచితముఁ ద ♦ త్త్వజ్ఞాన మంచాడు పె
ద్దల వాక్యంబునఁ బాపముం దొలఁచు శు♦ద్ధస్ఫార వీరత్వమున్
లలితార్థం బుపలక్షణా విధిని సం ♦ లక్షింపఁగా నయ్యె దై
త్యులకు న్నాక వరాంగనా సుఖ విభూ♦తుల్ మించి చేకూరుటన్.

ఉ॥ పాపులు రక్కసుల్ భయద ♦ వాత్యవలెం జెలఁగి రాఁగ నా
తూపులు వహ్నిగుచ్ఛముల ♦ తోయమునం బురడించి పైఁబడం
గోవులుగాఁగఁ గూలిపడి♦కుత్సితులెల్లరుఁ జేరుచుండఁగా
నేపున నిండకుండు దివి ♦ కెచ్చుగఁ బల్క నొకండు గల్గునే? ౧౨౮౭

ఉ॥ ఒక్కరి పాదముల్ మఱియు ♦ నొక్కరి చేతులు వేఱు పొట్ట లిం
కొక్కరి శీర్షముల్ దొరకు ♦ నొక్కొక యంగము లక్ష్మణాస్త్రముల్
చిక్కిన యంతవట్టరులు ♦ చిక్కని యొద్దడిచే వడిం గొనెన్
ఒక్కొకచోట యాచకుఁడొ ♦ కొక్క పదార్థముఁ గూర్చకైవడిన్.

ఉ॥ కొందఱి ముక్కులన్ మఱియుఁ ♦ గొందఱి వీనులఁ గొంద ఱంఘ్రులన్
గొందఱి దీర్ఘహస్తములఁ♦గొందఱి కన్నులఁ గొన్న బాణముల్
పొందిక విద్యయన్ ధనము ♦ భూస్థలిఁ బెంచు కవిప్రకాండ సం
క్రందన వాగ్విరాజిత ని ♦ రంకుశ ధార విధాన వర్తిలెన్

చ॥ అనువుగ ధర్మదేవతకుఁ ♦ బ్రాణముఁ బోలిన లక్ష్మణుండు గు
ప్పిన విశిఖాలిచే నసుర ♦ వీగులు దాఁగి క్షణంబు నిల్చినన్
గనఁబడు మిత్తియే యని క ♦ కావికలై పరుగెత్తి సంగరా
వని విడిపోయి రవ్వలికి ♦ వారని నెత్తురు టేఱులం బఱెన్. ౧౨౯౦

మ॥ సమరోర్విన్ మరణించినట్టి జనముల్ ♦ సౌమిత్రి దోర్వీర్య దు
ర్దమ పాండిత్యముఁ గన్నులారఁ గని యం ♦ తం గుంభకర్ణుండు లో

కములం దెన్నఁ బురాంతకుం డయిన శ్రీ ♦ కంఠుండు సౌమిత్రియే
సమతం బొందని మేటి ధన్వులని యి ♦ చ్చంబల్కెఁ బల్తోయముల్.

తే॥ గాలియొడఁదలకంటె వే♦గంబుగలది, జయ విలక్షణ సింహ ధ్వ♦జంబుగలది
అన్నిదిక్కుల కేగున ♦ దైన తేరు, వడిగఁ దోలించి లక్ష్మణు ♦ కడకువచ్చె.

క॥ అసురుఁడు రథ స్థితుండయి, కసిమసఁగిన నేలనుండి♦కయ్యము సేఁతల్
పొసఁగదని వాయుసూనుఁడు, కొసరి నిలిచి తనభుజములఁ ♦ గూర్చుండుమనన్.

తే॥ కొదమసింగము గిరినెక్కు♦కొమరుదోఁప, నెక్కె సౌమిత్రి వానరు♦లెలమి విజయ
నాదములుచేసి రమరులు♦మోదపడిరి, హనుమ మూఁపు రథముకంటె♦ననువుమీఱె

తే॥ వెండికొండపై బంగరు♦కొండయట్లు, హనుమమూఁపుపై లక్ష్మణుఁ♦డలరునంతఁ
గడిమికిం దగు విలు కుంభ♦కర్ణుఁ డూని, యెక్కువెట్టి గుణధ్వని♦యొనఁగఁజేసె.

ఉ॥ రాముని తమ్ముఁడీవు మఱి ♦ రావణు తమ్ముఁడ నేను మింట సం
గ్రామము చూడ వేలుపులు ♦ కాంక్షను వచ్చిరి ధర్మపద్ధతిన్
హామిక మీఱ గౌరవ బ ♦ లాతిశయంబులు వెల్లడించుచున్
భీమగతిం దురంబు జర ♦ పింతము వీరులు మెచ్చునట్లుగన్. ౧౨౯౬

ఉ॥ మా కులభూషణం బయిన ♦ మానిని ముక్కును గోసినట్టి వీ
రా! కలుషాత్మ! యాచెలి న ♦ హంకృతిఁ గొప్పఁ గదించు హస్తముల్
గాకులు మెక్కఁద్రుంచెద న ♦ ఖండ పరాక్రమశాలి వైనచో
లోకులు మెచ్చఁ గాచికొను ♦ లోపములేకని కాఱులాడఁగన్. ౧౨౯౭

చ॥ బలమె శరీర మంచె నన ♦ భాసిలు లక్ష్మణుఁ డల్లనవ్వి నీ
పలుకులకున్ నదుత్తరము ♦ బాణము లిచ్చునుగాక ప్రల్లదం
బులకు సు వీర్యసంపదలు ♦ ప్రబుంగఁగ నుత్తరమీయ మీవలెం
బలుకఁగ నేర్వలే దనుడు ♦ బాధ రుషా కలితాత్ముఁడై వడిన్.

ఉ॥ కన్నుల నిప్పుకల్ దొరఁగ ♦ గాటముగాఁ బరికించి ఖేచరుల్
మిన్నగలెం బెడిల్లు మని ♦ మేదిని కొండలు పిండియయ్యె నం
చెన్ని కలంగ వింటఁ బదు ♦ నెన్మిది తూపులు గూర్చి యేయఁగా
నన్నిటి నేసి కూల్చెఁ గమ♦లాప్తకులుం డచలాభ ధీరుఁడై. ౧౨౯౯

తే॥ అంతఁ గుంభకర్ణుఁడు నిర్జ♦రాంతకంబు, బ్రహ్మదత్తంబు బహుళరూ♦పకమునైన
ఘోరశర మభిమంత్రించి♦కూర్చియేసెఁ, జతురుఁడవ యైన మరలింపఁ♦జాలుదనుచు.

తే॥ కన్ను మేర దూరంబది♦కాండవృష్టి, గురియఁ గాంచిన సౌమిత్రి♦కొండొకవడి
సరసి యొక దివ్య శరమున♦నతికివైవఁ, బెక్కు తూపులతో నది♦పుడమిఁబడియె

ఉ॥ వాఁడిమి వేగముం గలుగు ♦ బాణములం బదిరెంట మారుతిం
బోఁడిమి తగ్గనేసి యిరు ♦ ముల్కుల లక్ష్మణు నొవ్వఁజేయుచున్

వేఁడిమిమీఱ నూఱులుగ ♦ వేలుగ నొక్కొకసారి గూర్చి యా
తేఁడి మెలంకువం గనిన ♦ దిట్టరి కప్పె క్షణంబునన్ దిశల్. ౧౩౦౨

చ॥ దిశలను గప్పు బాణవిత ♦ తిం బ్రతి బాణములేసి లక్ష్మణుం
డసమునఁ దూల్చి నెవ్వడి ర ♦ థాంగములన్ విఱుగంగఁ గొట్టి క
ర్కశ విశిఖంబులం బరపి ♦ రథ్యములైన పిశాచ వాజి సిం
హ శరభ వారముం జదిపి♦యయ్యసురోత్తముఁ గొట్టె నొవ్వఁగన్. ౧౩౦౩

మ॥ పరివేషంబు నశించి నట్టి తెఱఁగై♦భగ్నంబుగాఁ గూలె న
య్యరదం బప్పుడ చచ్చె సారథియు ని♦ష్పాసంబు నింద్రాయుధ
స్ఫురణంబున్ మదిఁ గొల్పి త్రుంగె విబుధుల్♦పూరించి రథ్యంబులన్
శరముల్ త్రుంచెనొ ? మంత్రమో ? యనుచు నా♦శంకించి రప్పట్టునన్.

మ॥ విరథుండై విగతాస్త్రచాపుఁడయి య ♦ వ్వీరుండు దైత్యానుజుం
డురు కోపంబున రేఁగి లక్ష్మణు నను ♦ వ్యూహంబు నేఁ డాని నం
గరముం బూర్తి యొనర్తునంచుఁ గొనియెన్ ♦ దర్పించి ముల్లోకముల్
పరఁగన్ గెల్వఁగ నిల్పు చిహ్నమనఁగా ♦ భాసిల్లు శూలంబొగిన్.

క॥ వనధివలె రేఁగి రావణు, ననుజుఁడు లంఘించె ధరణి ♦ యదరఁగ వానిం
గని సౌమిత్రియు మారుతి, ఘన భుజములనుండి దిగియె♦గరువం బెలయన్.

తే॥ తమ్మునకుఁ దోడుగా మున్ను♦దశముఖుండు, పంపు సేనకు నినుమడి♦పంపనపుడు
తత్పృతన సాయుధంబయి♦తరలివచ్చి, యల సుమిత్రా కుమారు ము♦న్నలమికొనియె.

క॥ వానరులు కలఁగఁ బాఱఁగ, దానవ చక్రంబు వచ్చి♦తలపడఁ గని రా
మానుజుఁడు చొచ్చి కలఁచుచు, మానక యెనరేఁగె మారి♦మసఁగిన కరణిన్.

ఉ॥ మోదుగువంటి కేశచయ ♦ మున్ నయనంబులు నొప్పుచుండు క్ర
వ్యాదుల శీర్షముల్ కరుల ♦ హస్తములున్ దురగాంఘ్రులున్ రథాం
గాదులు దొర్లుచుండ రుధి ♦ రాపగలెల్ల శవంబు లడ్డు క
ట్టై దగులంగఁ ద్రెంచికొని♦యంబుధిఁ జొచ్చెను వన్నె మాఱఁగన్. ౧౩౦౯

తే॥ చక్ర తోమర శూలాది♦సాధనములు, యామినీచరుల్ వైవ రా♦మానుజుండు
నడుమనే కూల్పఁ దున్కలై♦పడిన వాన, విఱిగి కూలిన కైదువుల్♦పెక్కులయ్యె.

తే॥ హార కుండల మకుట కే♦యూర కటక, వితతి లక్ష్మణ సాయక♦విద్ధమగుచు
ఖండఖండంబులై మింటి♦కడకునెగసి,యినహిమాంశుఋక్షతతిమా♦ర్కొనివెలింగె.

క॥ సిడములు వింజామరములు, గొడుగులు కేడెములు పీలి♦గొడుగులు విండుల్
సుడిసెడు నెత్తురుటేఱులఁ, బడ నీఁదెడు భూతగణము♦ప్రక్కలఁద్రోఁచెన్.

—: సుగ్రీవ కుంభకర్ణుల యుద్ధము :—

తే॥ లక్ష్మణునకు దానవసేన♦లకును మిగుల, ముమ్మరంబగు పోరిట్లు♦మొనయుచుండఁ
గుంభకర్ణుండు గని కిన్కఁ♦గొప్పరింప, భానుసుతుఁడు వానికి నడ్డు♦పడియెఁ గడిమి.

తే॥ అసురభుజములు విఱిగిన♦వని తలంపఁ, దగిన తీరున ఘన పర్వ♦తంబువైవ
దానినుండి భూమికి జాఱు♦నేనుఁగులను, సేనలోని యేనుఁగులు భం♦జింపఁదివిరె.

తే॥ కొండచిలువలు పెక్కులం♦దుండి జాఱి, మదకరులఁ గవ్వికొనె నట్టి♦మలను పట్టి
కరతలంబున నక్కుంభ♦కర్ణుఁడుంచు, కొనియె దాన రాకాసుల♦గుంపుమసియె.

తే॥ అలవిలేని బలుఁడు రావ♦ణానుజుండు, కోఁతిఱేఁడ ! నీవైచిన♦కొండ యిదియె?
యనిపరిహాసించి పిసికి యు♦ప్పనుచునూఁదె, వేల్పు లదిగని మిక్కిలి♦వెఱగొనంగ.

తే॥ భానుసూనుఁడు మఱియొక♦పర్వతంబు, వెదకుచుండ రావణుతమ్ముఁ♦డుదుటుతోడఁ
జంపుమనఁ దపస్వుల శాప♦సరణినదరు, తన త్రిశూలమ్ము గుఱిచూచి♦తాఁకవైచె.

ఉ॥ కాంచిన వారలెల్లఁ గపి ♦ కాంతుఁడు మ్రందెను మ్రందెఁ గావరే
యంచును మొఱ్ఱవెట్ట వడి ♦ నాశుగపుత్త్రకుఁ డడ్డువచ్చి యే
తెంచు త్రిశూలముం దిగిచి ♦ తేఁకువ జానువునూఁది వంచి కా
వించెను తుండ్లుగా; నిడుమ♦ప్రిల్వని దాసుఁడు దాసుఁడే భువిన్ ? ౧౩౧౯

తే॥ జానకీదేవి సౌందర్య♦మూని రామ, విభుఁడు మిథిలలో శివువిల్లు♦విఱుచునాఁడు
పుట్టినట్టి రావమె నాఁడు♦పుట్టె గాడ్పు, పట్టి దైత్యుని శూలంబు♦పట్టి విఱువ.

మ॥ తన శూలంబు వృథాచనంగ హనుమ ♦ ద్దార్ఢ్యంబు చింతించి నీ
ఘన బాహాబల మన్నిచోటుల నమో ♦ ఘంబై మహాకార్యముల్
పొనరింపం దగియుండ నుద్భటుఁడవై♦పోల్పారుచున్నావు నీ
కెన యెవ్వారలు ? పోరుదేని వినునీ ♦ యిష్టంబ కావించెదన్. ౧౩౨౦

తే॥ అనిన కుంభకర్ణుని గని ♦ హనుమ పలుకుఁ, గలఁకు గావింపనసి తొల్లుఁ♦బలికి పిదపఁ
బోరు నీతోడఁ బూనుట♦తీరుగాదు, వలదటంచుఁ దొలంగి య♦వ్వలికిఁ జనియె.

క॥ శూలము విఱుగఁగఁ బెర కర, వాలము లేకయును కలఁత♦వడక నిలిచె హిం
సా లాలసుండు వానిం, దూలఁగఁ గపిరాజు వొడిచె♦దోర్బల మెసఁగన్. ౧౩౨౨

క॥ నొవ్వక రావణు తమ్ముఁడు, నవ్వి మదము నేఁటితో న♦ణంగు ననుచుఁ దా
నువ్వునఁ గేలం జాఁచుచు, నవ్వలికిం బోవనీక♦యడ్డముపట్టెన్. ౧౩౨౩

క॥ ఇరువురు వలయాకృతిగాఁ, దిరుగుచు దొరకుచును దొలఁగఁ♦ద్రిక్కుచును పర
స్పర ముష్టుల నోళ్లను నె, త్తురు గ్రక్కుచు సొలపులేక♦త్రుంగని కడిమిన్. ౧౩౨౪

క॥ అదలించుచు హుంకృతులం, గదలించుచు బలిమిఁ బోరు♦కడఁకం దనుజుం
డదిమెను సుగ్రీవు నతం, డెడ నొవ్వఁగ సొలసి సత్త్వ♦హీనుండయ్యెన్. ౧౩౨౫

ఆ॥ దురము ముగియు నేఁటి♦తో నాయకుఁడు లేని, సేన చెదరు ననుచుఁ♦జింతచేసి
వైశ్రవసుఁడు ప్లవగ♦వర్యుని గొని లంక, దెసకు నడచెఁ గపు♦దిగులువడఁగ.

తే॥ ఒకటఁ దల్లిని డేగ త♦న్నుకొనిపోవ, నడలు పక్షిపిల్లలవలె ♦ హరిగణంబు
బెగ్గలించుచుఁ జేతులు♦పిసికికొనుచు, నూర్పుపుచ్చుచు నేడ్చె దై♦త్యులుచెలంగ.

తే॥ చెమటపోసి నాలుక యెండ♦నమరులెల్ల, విన్నఁబోయిరి మనసుల♦విసిగికొనుచు
నెడఁద లెరియంగ నుత్సాహ♦మడుగువట్టఁ, గ్రుంగి తపియించి కుమిలెఁ బ్ల♦వంగకులము.

తే॥ మనసు నుడికించు కోపంబు♦గొనిన కుంభ, కర్ణు డప్పుడు రాహువు♦కరణి నుండె
భాస్కరసుతుండు గ్రసియింపఁ♦బడిన చంద్రుఁ, బోనివాఁడయి తేజోవి♦హీనుఁడయ్యె.

తే॥ దానవుని కటిమేసిపై♦భానుసూను, మేను తగ్గుచు హెచ్చుచు♦మేఘమందు
డాఁగుచును వెలివడుచును♦డాలుచూపు, కలువతేని బింబంబనఁ♦గానఁబడియె

క॥ తనతో దుర మొనరింపన, యని పంతము లాడినట్టి ♦ హనుమానుం డా
దనుజన్ముఁ బ్రతిఘటింపక, వెనుచనియెను మనసు పెక్కు♦విధములఁబోవన్.

క॥ వనచరవిభుఁ దనమూఁపు ప, యినుంచుకొని కుంభకర్ణుఁ♦డేగుచునుండన్
మనకింకఁ బ్రభుఁ డెవండని, యినకులు పాదముల వ్రాలి♦యేడ్చిరి ప్లవగుల్

తే॥ నీల నీరద శ్యాముఁడు♦నిప్పుకంటె, నెఱ్ఱనైన కన్నులతోడ♦నిషుధిఁ దొడిగి
ధనువు సజ్యంబు గావించి♦త్వరితగతిని, త్రుటిని పఱతెంచి నగరి వా♦కిటికివచ్చె.

క॥ నానెయ్యుని నాప్రాణము, జానునఁగొని కోటదాఁటి ♦ జరగిన మోసం
బానని రాఘవుఁ డమ్ముల, వానం గురియించి వాని♦పథ మరికట్టెన్. ౧౩౩౪

క॥ శరములు గగనము గప్పఁగ, మఱుఁగయ్యెను దిక్కు లెండ♦మలయదు లోనన్
జరుగఁగ లేవయ్యె వియ, చ్చరములు సైతంబు దాఁటి♦శర దుర్గమ్మున్. ౧౩౩౫

తే॥ నెవ్వడిం జను నయ్యామి♦నీ చరుండు, తెరువు విడువక కుప్పలు♦తిప్పలగుచుఁ
గడకు నిండిన బాణదు♦ర్గంబు చూచి, దీని దాఁటంగ నరుదని♦తిరిగి కాంచె.

తే॥ కాంచి పద్మాకరము కాలుఁ♦గేలు మొగము, కనులు కలుగఁ బూచి సొబగు♦
ధనువునూని
నడచి వచ్చెనా యన నొప్పు♦నలువుకాని, బురుష మోహను శ్రీరామ♦భూపుఁగాంచె.

ఆ॥ మూసియున్న నోరు♦పొగల వెళ్ళఁజిచెను, పెదవు లదరెఁబొమలు♦వికృతి నందెఁ
గనులు నిప్పు లుమిసె♦గర్జనమునఁ గొండ, లగల మాఱుమ్రోఁగె♦నవని వడఁకె.

ఉ॥ వాలి కబంధులం జెనయు♦వాఁడని యెంచి కపీంద్రుఁ గావఁగాఁ
బోలును నన్నెదిర్చితివి ♦ పోరునఁ గీరితి రాదటంచు నే
మ్రోలుపలేదు నీయనుజు ♦ మారుతి వానరనాథు; నిన్నె యీ
యాలమునం జయించి యశ ♦ మందఁగ నారయుచుంటి నెల్లెడన్. ౧౩౩౬

చ॥ వెదకుచుండ నీబలము ♦ వీఁగి దిగంతము దాఁకఁబాఱె వే
ఱొదిఁగెను నీదుతమ్ముఁడు మ ♦ హోద్ధతితో నెదిరించి వాయుజుం
డదరెను వాలిపుత్త్రకుఁడు ♦ నంకిలినొందెను చేవడక్క మూ
ర్ఛ దొరయు వీని నెత్తుకొని ♦ సాఁగఁగ వచ్చితి వీవు దిట్టవై. ౧౩౪౦

చ॥ వనచరుఁ గావఁగాఁ దలఁచి ♦ వచ్చితివేమి? మదీయ భాగ్యమే
గొని యిటు తెచ్చెఁ గావలయు ♦ గొజ్జుగ నిన్ను నలంచి యన్నకుం
జెనకిన వేదనం దొలఁగఁ ♦ జేసెద దివ్యులు చూచుచుండఁ గోఁ
తిని గొనియున్న పట్టు విడఁ ♦ దీసిన సీతయు వీడు బంధముల్. ౧౩౪౧

చ॥ అనవుడు రాఘవుండు దర ♦ హాస వికాసిత సుందరాస్యుఁడై
యను దనుజాధమా! వినుము ♦ ప్రాణహితుం గొనిపోవు బాహువుం
దునుకలు సేయనేని ఘన ♦ దోర్బలమేటికిఁ? జాపమేటికిన్?
మొన వెనుదీయు వాఁడనయి ♦ ముట్టను కార్ముక మింతయేటికిన్?

తే॥ అనుచుఁ గుంభకర్ణుండంప ♦ యాఁకఁ ద్రోవఁ, బూనరెండమ్ములను నొసల్ ♦ పొడువనేసె
నుదుటి యమ్ములతో నెత్తు ♦ నొసలితోడ, దైత్యుఁ డరుణోదయముఁ బోలి ♦ తనరె నపుడు

తే॥ ఫాలమున శోణితమ్ము ప్ర ♦ వాహమట్లు, కాఱఁ దడిసి చల్లనగాఁగఁ ♦ గపివరుండు
నిదుర మేల్కాన్న చందానఁ ♦ గదలి లేచె, దిమ్మదిరుగంగ దైత్యుండు ♦ సొమ్మసిల్లె.

మ॥ నొసట న్నాటి వెలుంగువాని రవి సూ ♦ నుం డొప్పవీక్షించి యి
య్యసమాస్త్రంబులు రామ సాయకము లం చాత్మన్ విలోకించి చు
ట్టెసలారంగని సర్వలోకములకున్ ♦ హేత్వర్థమై యున్న శ్రీ
వసుధాధీశ్వరుఁ గాంచి జేయనుచుఁ జే ♦ నం బొంది యా వెంబడిన్.

తే॥ అసురమానంబు లజ్జయు ♦ నడుగుతోడ, నూడ నాసికయును చెవి ♦ నూడఁబీకి
కొనుచుఁ గపిరాజు మింటిత్రో ♦ వను బిరాన, వచ్చి తనవారలకు మోద ♦ మెచ్చఁజేసె.

క॥ రవణించెఁ గపి సమూహము, రవణించె మహాద్రు లంబు ♦ రాశియు మొగుళుల్
రవణించెను వేలుపుగమి, రవణించెను పాడివేల్పు ♦ రంజిల్లు మదిన్. ౧౩౪౨

క॥ వచ్చిన వానరనాథుని, హెచ్చిన మోదమున జాన ♦ కీశుఁడు కాంచెన్
గ్రచ్చఱ మైథిలి చెఱవిడి, వచ్చిన తఱి నొందునంత ♦ పండుగు నొందెన్.

తే॥ నొసలు పగిలించి ప్రక్కల ♦ దుసికిలిచన, రాముఁడు శరంబులేయఁగ ♦ రాక్షసుండు
చేవచెడఁగ సుగ్రీవుండు ♦ చెవియు ముక్కు, నూడఁగొఱికి కొంచేగెఁ గా ♦ కున్నఁ దరమె?

తే॥ దనుజు ననుజుండు తెలివొంది ♦ వనచరుండు, కరతలమున వాఁడవ్వాలి ♦ కరుగుటయును
చెవియు ముక్కువోవు టెఱింగి ♦ చింతనొంది, చెలియలిఁ దలంచుకొని చాల ♦ సిగ్గునొందె

తే॥ నిర్ఝరమువోలెనొడలశో ♦ ణితము వెడలఁ, గుంభకర్ణుండు ధాతుయు ♦ క్కుధర మొండు
వృష్టి గురియంగ నీఁడతో ♦ వెల్లువలను, బయలు పఱచిన చందానఁ ♦ బరిఢవిల్లె.

తే॥ పరపతిని కోరి వంచన♦పఱచినట్టి, చెల్లెలికి ముక్కుచెవు లూడె♦సిగ్గుచెందఁ
బరసతిని గోరి వంచన♦పఱచువాని, తోడులకు నట్టు లౌటలో♦దోసమున్నె ?
తే॥ తనకుఁ గలిగిన దుస్స్థితిఁ♦దలఁచుకొనుచు, రోసి దైత్యుండు చెంతరా♦కాసులఁ గను
నిక్కి ఖచరులఁగాంచును♦ముక్కుఁగాంచు, మునుపుగొన్న వాసినిగాంచు♦భూమిఁగాంచు

—: రాముఁడు కుంభకర్ణుని కూల్చుట :—

చ॥ చెలియలి ముక్కుపోయె నని ♦ చింతిలు జ్యేష్ఠుఁడు కాంచుమున్నె నా
చెలియలు తగ్గ యన్నవని ♦ సిగ్గఱి డగ్గఱి చూచుమున్నె నా
చెలువఱు మోము రాముఁడు హ♦సించుచుఁ గాంచెడు మున్నె వారికిన్
జెలువఱఁ గర్ణనాసికలఁ ♦జెక్కెదఁ గాకని యాగ్రహోగ్రుఁడై. ౧౩౫౪
చ॥ వడి నొక వాలు పల్కయును ♦ వారక కైకొని చేగ చాల దం
చెడముగఁ బాఱవైవ నుడు ♦ బృందము రాలెను ఖేచరాళి పే
రెడఁదలు ప్రేవులుం గలఁగె ♦ నేచిన యీసునఁ గర్ణ నాసికల్
వడవడ నెత్తు జార్చ బహు♦భంగుల దైత్యులు పల్లటిల్లఁగన్. ౧౩౫౫
తే॥ మూఁడువేల పిశాచముల్ ♦ మోచి తెచ్చు, వజ్ర ఖడ్గంబు వలకేల♦వారుకొనియె
వేయి భూతముల్ మోచిన♦విపుల ఖేట, కంబు నెడమచేతం గొనెఁ♦గనలు తొనఁక.
తే॥ కొండఁబోలిన కుంభక♦ర్ణుండు కేడె, మెలమి నంకించి వైచి చు♦క్కలను రాల్చెఁ
గాల నేలను తాఁచి పా♦తాళభోగి, శిరములును ధరణియుఁ గ్రుంగఁ♦జేసెఁ బెలుచ.
క॥ వీచిన ఖేటక ముఖమున, లేచిన పెనుగాలి కపుల ♦ లేపి దెసలకుం
ద్రోచిన లోఁతగు కడలియు, నేచిన మిట్టయ్యె ఖచర ♦ బృందము పఱచెన్
క॥ ఇతరు లెఱుఁగుటకు మున్నె, మతిమంతుఁడు రామవిభుఁడు ♦ మరలంగొట్టెన్
శితశరమున నదియు మహా, ద్భుతముగఁ బలులాశి హస్త ♦ మునకే మరలెన్
క॥ డాలును నడుమనె క్రమ్మఱఁ, గాలుం బోల్దనుజవరుఁడు ♦ కాలం దన్నన్
గాలికిఁ గలఁగిన జలనిధి, పోలికఁ గపిసేన కలఁగి ♦ పొనుపడి చెదరెన్ ౧౩౬౦
క॥ పోరున నెదురై పడు కపి, వారంబును త్రుంచి రక్త ♦ వాహిను లడరన్
గూరిచి తిరిగెడు డాలును, శ్రీరాముఁడు విఱుగఁగొట్టె ♦ శిత భల్లమునన్
ఆ॥ పాఁపతేని యుచ్చి ♦ పంకంబు గావించు, డాలువోయె నదను ♦ డాయదింక
వీని నిపుడ చంపు ♦ విడువకుమని ప్రోత్స, హించె జాంబవంతుఁ♦డినకులేశు.
క॥ వానర సేనానాశము, దానవ విజయంబు బలము ♦ దర్పము భూజా
జాని గని యముని నేఁడే, వీనియెదుట నుంతు ననుచు ♦ వీఁకం దాఁకెన్
తే॥ వాఁడివడిగల పదుమూఁడు♦బాణములను, రాముఁ డేసెను రణవిశా♦రదుఁడు కుంభ
కర్ణుఁ డవ్వాని గ్రద్దయీఁ♦కల విధమున, రాలి పడఁగొట్టె దన కర♦వాలుచేత.

తే॥ బలిమిఁ దోడరిక వేసంగి ♦ భానుఁబోలు, తీక్ష్ణ శరముల రాముఁడు ♦ తివిరియేయ
నవియుఁ దునుకలై చెదరంగ ♦ నసుర కొట్టెఁ, జేతివాలంపుఁ బిడితోడ ♦ హేతులెసఁగ.

క॥ దరహాసిత వదనుఁడై శ్రీ, వరుఁ డొకబాణమ్ము లాగి ♦ బలిమిని వీడన్
గరుడుఁడు సర్పముఁ ద్రుంచిన, కరణిని త్రుంచె నది ♦ వాని కర ఖడ్గంబున్. ౧౩౬౬

తే॥ విలయవహ్ని యాఁటఁగ నూర్పు ♦ విడుచు కుంభ, కర్ణుఁ డప్పుడు తనచేతి ♦ ఖడ్గమల్లి
యున్నదన వేఱుఖడ్గంబు ♦ నూని ముగిసె, ముగిసె రాఘవుఁడని యెదు ♦ రుగను నడచె.

తే॥ చేతఁబట్టి పట్టక మున్నె ♦ శిత శరమున, నరిగ కరవాలు రెండును ♦ విఱుగఁగొట్టి
కంకటము చొరఁ గ్రూరాంబ ♦ కంబులేసి, యొడలు చలియింపఁజేసె న ♦ ప్పుడమిఱేఁడు.

క॥ చారులచే జరుగు సమా,చార మెఱిఁగి రావణుండు ♦ సత్వరమున దే
వారులఁ బెక్కురఁ బంపెను, వారక తమ్మునకుఁ దోడు ♦ పడ నవ్వేళన్. ౧౩౬౭

తే॥ దానవుని చంప నిదె మంచి ♦ తరుణమనుచు, మదిని రాముఁడుతలఁచిన ♦ యదనునందె
వచ్చె సేనయుఁ; జెడుగులు ♦ వచ్చినపుడ, వచ్చి తోడ్పడు సత్కర్మ ♦ ఫలములట్లు.

తే॥ నాల్గు విధములొందినపదు ♦ నాల్గుకోట్ల, బలమువచ్చి దానవునికా ♦ పాడఁ దొడఁగె
వడిగ రండని రాముడు ♦ వారిఁ బిలిచి, తాఁకె మేను పూరింప ను ♦ త్సాహగరిమ.

తే॥ కాలమిఱియుఁ గాలుఁడు బహు ♦ కష్టము లను, మూఁడు మూలహేతువులె ము ♦ మ్మొనలుగాఁగ
మూఁడులోకంబుల జయింప ♦ మూలమైన, శూలమును కుంభకర్ణుఁ డ ♦ చ్చుగ ధరించె.

సీ॥ మండలీకరణ కో ♦ దండుఁడై రాముండు, భండనమున వీడు ♦ భల్లములకు
అట్టలు నటియించు ♦ టా కాదనుచు గ్రమ్మాని, మొద్దులనుచుఁ గొండ ♦ బ్రద్దలనుచు
నమరులు తలఁపంగ ♦ నాడెఁ గబంధముల్, శిరముల కుప్ప ల ♦ చ్చెరువు నించె
వ్రయ్యంగఁబడనివి ♦ రక్తంబుచే నీడ్వఁ, బడనివి తలలతో ♦ వెడలునవియు

తే॥ నిలిచియున్నవియును తూలి ♦ నిలుచునవియు, జీవములతోడ దురమునఁజెలగు ♦ నవియుఁ
బాఱిపోవునవియుఁ గానఁ ♦ బడవు వెదకి, చూచినను మందునకు రణ ♦ క్షోణియందు.

తే॥ మొగము లగలంగఁ బ్రేవులు ♦ దిగఁబడంగ, రదనములు ప్రీలమావటీం ♦ డ్రకను మించి
సుడిసి కూలునవియె కాక ♦ చూడఁజూడ, మదముతోఁబోవు హస్తు ల ♦ మ్మహిని లేవు.

తే॥ చక్రములు వ్రీలఁ డెక్కెముల్ ♦ జాఱ నిరుసు, లూడ ముఖభాగములు సొంపు ♦ వీడ హారులు
గూల రక్త మేదో మాంస ♦ జాలమందు, మునిగినవి కాక తిరుగు స్యం ♦ దనము లేదు.

చ॥ పదములు కంఠముల్ తునిసి ♦ వ్రస్సిన పొట్టలతోడ హేమలుం
గుదివడ హత్తి పీనుఁగుల ♦ కొండల కొమ్ములఁబట్టు నెత్తు పె

ల్లిదముగఁ బాఱఁగా సుదుల ♦ లీనములై పరుగాడుఁ గాక యా
ప్పిదముగ సంగరస్థలిని ♦ వెళ్లు తురంగము లేదు చూడఁగన్.

ఉ॥ రాముని యస్త్రనైపుణి తి ♦ రంబు నిరూపణ చేయు పెట్లగున్
నేమముతో రణంబుగను ♦ నిర్జరులున్ గలసం గనంగలే
కామెతసేయఁ జూచి రసు ♦ రాలికి స్వర్గమునందు, భర్తలన్
ప్రేమను రోయు కాంతలును ♦ వేసరి కాంచిరి నెత్రుటేళ్లనే. ౧౩౭౭

మ॥ తపనుం గాంచిన మంచుపోల్కిఁ జెడియెన్ ♦ దైతేయసైన్యంబు వే
లుపులున్ మిక్కిలి యుల్లసిల్లి రసురుల్ ♦ దుఃఖింపఁగన్ లోక సం
తపనుండా దనుజేంద్రు తమ్ముఁడొకఁడై ♦ దర్పంబుతో నిల్వఁగాఁ
గృప యేపారఁగ రాఘవుండు గని ప ♦ ల్కెం బెంపు దీపింపఁగన్

మ॥ వినుమా సాయుధసేన గూలె ననిలోఁ ♦ బెంపేది యొక్కండవై
కను మేలున్నదె? మా విభీషణునకుం ♦ గారంపుఁ దోఁబుట్టువౌ
టను గావించెద జీవదానమును వీ ♦ టం జేరెదో? క్రమ్మఱం
జను దెంతో? మఱి యిప్పుడే రణమునం ♦ జత్తో? వివేచింపుమా!

ఉ॥ తక్కులు వీడలేక పిన ♦ తమ్మునిచేఁ బిలిపింప రాక లోఁ
జిక్కితి కాలు నానతికి ♦ జీవితకాలము రాజ్యభోగముల్
దక్కనివయ్యెఁ దెల్పి ఫల ♦ దంబగునే భువి మూర్ఖబుద్ధికిన్?
దక్కక నీమదిం గలుగు ♦ దానిని దెల్పుము రావణానుజా! ౧౩౮౦

చ॥ అనవుడుఁ గుంభకర్ణుఁ డను ♦ నర్కకులంబున నుద్భవించి పెం
పును జయశీలముల్ నయము ♦ పోఁడియుఁ బాడియుఁ గల్గు మీరు మా
యనుజకు ముక్కు గోసితిరి ♦ యట్టులె నాకు నొనర్చినార లే
యనువున నీమొగంబు గొని ♦ ప్రాణముతోడుత నుందుఁ జెప్పరే!

శా॥ మాచే వేల్పులు దుస్థితిం బొరయు దు ♦ ర్మానంబు పాటించుచున్
నీచత్వంబిది సీత వీడుమనుచున్ ♦ నీతుల్ ప్రసంగించియున్
నాచే నన్నకు నొవ్వికూడదను వి ♦ న్నాణంబుతో వచ్చియున్
మీచే నిట్లయి వెండియున్ మరలఁగా ♦ నేరన్ త్రపాహీనతన్. ౧౩౮౨

శా॥ మీ మస్తంబుల దీర్ఘబాహువుల భూ ♦ మిం గూల్చి మాయన్నకుం
బ్రేమం బారఁగ సీత నిత్తు ననుచున్ ♦ బీరంబుతో వచ్చి సు
త్రామాదుల్ గని కేరడింప వినమ ♦ ద్వక్త్రంబుతోఁ జెల్లెలిన్
సోమింపం దనుజేంద్రు సన్నిధికి న ♦ శ్రుల్ గార్చుచుం బోదునే?

శా॥ ఈవిట్లాడఁగనేల? ధీరుఁడవు గా ♦ వే? మానసుం బొందవే?
సేవాధర్మ మెఱుంగవే? యలుపులుం ♦ జిత్తంబునన్ మెత్తురే?

నావాక్యంబులు విన్న మీశిరముల౯ ♦ ఖండించియుం బిమ్మట౯
దేవారాతి పురంబుఁ జేరఁదగునే ♦ తేజో విహీనుండనై ? ౧౩౮౪

మ॥ అనుచు౯ శూలము డా కరంబునకుఁ దా ♦ నంకించుచు౯ ధాత్రి క
ద్భునఁ బ్రేవుల్ పెకలించులీల వలచే ♦ భూద్రంబుఁ గైకొంచు రా
మునకు౯ సూటిగ నైవ నాతఁడును దు ♦ ర్మ్యం జిందనీకుండఁగాఁ
దునియల్ చేసి త్రిశూలము౯ శకల సం ♦ దోహంబుగా వ్రీలిచె౯. ౧౩౮౫

మ॥ కడలిం ద్రావఁగ మిన్ను గూల్ప ఘన ని ♦ ర్ఘాతంబులం గాల్పగాఁ
బుడమిం జీల్పఁగ మేరువుం దొలువఁగా ♦ భూలోకముం దాఁటఁగా
నడర న్నేర్చిన రామబాణతతి యా ♦ ర్యానాయకుండిచ్చు మై
తొడుగు౯ వ్రీల్పఁగఁ జాలదయ్యె మదికిం ♦ దొడ్డయ్యెఁ దచ్చిత్రముల్ ౧౩౮౬

ఉ॥ రాము నమోఘ బాణములు ♦ రాజ కిరీట నభేద్య వర్మము౯
స్థేమముచేతఁ దాఁకియును ♦ చీల్పని హేతు వెఱింగి యంత సు
త్రామనుతుండు రాఘవుఁడు ♦ రౌద్రమహాస్త్రము మంత్రయుక్తమై
భీమబలంబునం దిగిచి ♦ భేదిలనేసెఁ గప్రుల్ చెలంగఁగ౯. ౧౩౮౭

క॥ ఆపగిది మఱువు చెడఁగాఁ, గోపంబున నినుపకట్ల ♦ గుదియంగొని యా
టోపమున రావణానుజుఁ, డేపడఁచెద నంచుఁ గాలి ♦ నిలకుం దాఁచె౯. ౧౩౮౮

తే॥ పరవినవి వేయిపడునవి ♦ పరఁగ వేయి, తొలుచునవి వేయిపొడుచుచుఁ ♦ బొలుచు వేయి
యిషువు లీరీతి మునర లె ♦ క్కిడక భీమ, బలుఁడు తిరిగెను తర్జన ♦ భర్జనముల.

తే॥ వీనిచే దండముండిన ♦ సేన బ్రదుక, దనుచు నొకపెట్టఁ బదియమ్ము ♦ లంటనేసి
తుండములు సేయ వాఁడుమా ♦ ర్తండుడాలు, గలుగుడాలునుకత్తియుఁ ♦ గడఁకఁ దాల్చి.

తే॥ జడియఁ జేయఁగఁ గోఁతుల ♦ దడము కలఁగి, పిక్కబలము చూపిన రామ ♦ విభుఁడు కాంచి
దనుజు బాహుదండం బడి ♦ దంబుతోడఁ, దెగిపడఁగనేసెఁ బ్లవగులు ♦ త్సేక మొంద.

తే॥ తుదకు దుష్కర్మములు నిం చె ♦ దుఃఖములను, ముదము నిండించె సత్కర్మ ♦ ములు నిజంబు
లంకకును రావణునకు బ ♦ లంబు పేరి, చేయి తెగ రాక్షసులు కాంది ♦ శీకులైరి.

తే॥ తెగని చేతితోఁ దెగిన చే ♦ తిని భరించి, గర్జనముతో నసురవైవఁ ♦ గపులు దాని
క్రిందఁ బెక్కండ్రు మడిసిరె ♦ కికురుమనక, దుష్టుచెంత నెట్లుండిన ♦ దోసమె కద ?

చ॥ కడఁకను రాముఁ డక్కపి ని ♦ కాయముఁ గాచుచునుండఁ గాలుఁడే
కడిగొనఁ జూఱలాడు క్రియఁ ♦ గ్రందుగఁ గూలుట గాంచి సైన్యముల్
మడియును వీనిచే నిమిష ♦ మాత్రములోనని త్రుంగకుండఁ బై
నడరిన చేతికంటెఁ దెగి ♦ నట్టి కరంబున కల్కి రెల్లరు౯. ౧౩౯౪

ఉ॥ తక్కిన వానరుల్ చెదరి ♦ తాఱఁగ దూఁకెడి రక్తనిర్ఝరుల్
మిక్కిలి వీన్గులం దిగువ ♦ మింటఁ జరించు సురాళి భీతిమై

దిక్కుఱి పాఱ లంకఁగల ♦ ధీరులుఁ దక్కినవారు దిగ్భ్రమం
జిక్కఁగ రక్కసుండు రఘు ♦ శేఖరుమీఁదికి దాఁటె గ్రద్దనన్. ౧౬౨

చ॥ మఱియొక చేయిగూడఁ దును ♦ మందగు నంచు సురాళి కోరఁగా
వెఱపున డాఁగియున్న జము ♦ బిమ్మిటిదీఱ విజేత రాఘవుం
డఱనెల తూపులన్ దనుజు ♦ హస్తముఁ ద్రుంచి పయోధిలోపలన్
మఱియొక సేతువో యనెడు ♦ మాడ్కిఁ బడం జనఁ గొట్టెదిట్టయై.

క॥ భుజకీర్తి పాఁపతేఁడుగ, భుజమే కవ్వముగ వేలు♦ఫులు మును జలధిన్
గజిబిజిఁ జిలుకఁగఁ గొను నా, రజముగు మఱ యనఁగఁ గలఁచి♦రాయిడిచేసెన్.

తే॥ జలధివైచుటచేతఁ బ♦క్షములతోడఁ, బరుగువాఱుటచే రాము♦పంపుసేఁత
చేతి శరములు గరుడుని♦చనసెఁ గుంభ, కర్ణు భుజము మందరగిరి♦కరణినొప్పె.

మ॥ కనకాద్రీంద్రముఁ దొల్చి తమ్మటముగాఁ ♦ గావించి మేఘంబుఁ గొ
మ్ముసుగాఁజేసి త్రివిక్రముండు కడఁకన్ ♦ మ్రోఁగిరపఁగా లేచు పెం
దొని నా గర్జిలు కుంభకర్ణుఁ డొగి మే ♦ దోమాంస చర్మాస్థు లొ
క్కనువై దమ్మగఁ జేయ వానర నికా ♦ యంబుం గలంచె న్వడిన్.

మ॥ కరువై యొక్కటఁ బంచభూతములు త్రుం ♦ గంజేయఁగా రాని పె
న్నురువుం గైకొని ఘోరమై యమరి ప్రా ♦ ణోత్క్షేపముం జేయు వాఁ
డును కుష్యద్యముఁ బోలువాఁడు రిపుధై ♦ ర్యోత్సాహ సంహారి యా
సురవిద్వేషి పదంబొకండు తునిమెన్ ♦ సూర్యాన్వయుం డయ్యెడన్.

తే॥ దంతములు రిక్కలంబోలెఁ♦దనరి వెలుఁగఁ, గ్రొన్నెలంబోలి వెల్లనై♦కోఱ లలర
నెత్తురున నెఱ్ఱనగు నోరు♦నిగుడఁ దెఱచి, యొంటికాలను డాసెను♦కుంటు చసుర.

తే॥ ఒంటికాలితో నాకస♦మంటఁ బెరిఁగి, ప్రక్కవారిని నోటితోఁ♦బట్టి మ్రింగి
వాత్యవలె సుడియుచుఁ బైకి♦వచ్చువాని, రెండవపదంబు రఘువరు♦న్యుండు నఱకె.

చ॥ కరములతోడఁ గాళ్లు తెగి ♦ కాశ్యపి క్రుంగఁగ దొడ్డకొండ వై
ఖరిఁ బడు కుంభకర్ణు ఘన ♦ కాయమునందున రెండువేల యం
పఱ వడిఁ దూఱిపోవ నొక ♦ మాత్ర చలింపక నోటనొక్క భూ
ధరముఁ బెకల్చి యూఁదె భయ♦దంబుగ వానరసేన నీల్గఁగన్. ౧౮౦౩

తే॥ పెద్దకొండను నాల్కతోఁ♦దద్దయెత్తి, పొలికలను మాఁడఁగా శ్వాస♦బలముచేత
విసరివైవ రాముఁడు కేలు ♦ విదిరిచికొనె, వీని బల మపారంబని♦వింతనొంది.

మ॥ దనుజుం డంతటఁ జింతనొంది యవురా ♦ దైత్యారి విల్విద్దె నే
ర్చునకున్ వేవురు రావణుల్ గలిగినన్ ♦ బొందారఁగాఁ జాల రే
నును కాల్సేతులు కోలుపోయితిఁ దుదిం ♦ దోడ్పాటు సూపంగ నే
యనువుం దోఁప దిఁకేమనంగ నగు దు ♦ ష్టాశా మహారోగముల్ ?

తే॥ అన్నకింకఁ దోడుపడు నాస♦యుడుగువట్ల, దిక్కులకుఁ జాఱు నెత్తురు♦దిక్కుఁజూచి
ఎదుట నిలిచిన శ్రీరాము♦నెనఁగఁజూచి, కుంభకర్ణుఁ డిట్లని పల్కెఁ♦గోప ముడిగి.

మ॥ ఒక పారావత పక్షికై యొడలి మాం ♦ సోత్కృష్ట భాగంబు ను
త్సుకతం గోసి తరాజునం దిడు యశో ♦ ధుర్యాన్వయంబందు పాం
దిక నొప్పారిన రామచంద్ర! విను దై ♦ తేయాపధర్మంబు లో
ప్పక మీ పాదము లాశ్రయించు ననుజుం ♦ బాలింపుఁడీ వేఁడెదన్.

ఉ॥ క్షత్రియరూపముం గొని జ ♦ గంబున స్రుక్కిన సత్యధర్మముల్
ధాత్రిని నిల్పఁబూనిన స ♦ దాతన దేవ! మదీయ జాతికిం
బాత్రవులౌ నధర్మములఁ ♦ బాల్పడకుండిన నాదు తమ్ము నీ
పుత్రునిగాఁ గృపం దలంచి♦పోషణసేయఁగఁ గేలు మోడ్చెదన్ ౧౪౦౮

ఉ॥ నిన్ను జయింప నెంచు రజ ♦ నీచరనాయకుఁ డీ విభీషణున్
బన్నుగఁ జెట్టఁగోరు పగ ♦ వాఁడని యెంచినవాఁడు తమ్ముఁడం
చెన్నక చిక్కనేని వధి ♦ యింపఁగలం డవధానబుద్ధిమైఁ
దిన్నగఁ గావుమంచు మఱి ♦ తేపకు వేఁడి నమస్కరించెదన్. ౧౪౦౯

తే॥ దుర్గుణుండు రావణునకు♦దొరకనీక, నీదు తమ్ముని హనుమంతు♦నియతితోడఁ
దోడుగానుంచి సతతంబు♦వీడనీక, యుండునట్లుగఁ గృపసేయు♦మో గుణాఢ్య!.

మ॥ వినువీథిం గను దివ్యులుం దపసులున్ ♦ విగ్రుండు హీఁడంచు వే
డ్కను వీక్షింపకమున్నె నీశరమునన్ ♦ గంఠంబు ఖండించు పృ
థ్విని ద్రోపాడక సాగరంబునఁ బడన్ ♦ వేయింపు మీ యిద్దియే
నిను నేఁగోరు వరం బటంచుఁ గరుణా♦సిద్ధిద్రుఁ బ్రార్థింపఁగన్. ౧౪౧౧

మ॥ వరముం గోరఁగఁ ద్రోవరాదని యొకే ♦ భల్లంబునం ద్రుంచి త
చ్ఛిరమున్ సంద్రమునందు ద్రోచి మునుఁగం ♦ జేసెన్ రఘుస్వామి యా
శరధి న్నీరము నాల్గుదిక్కులకు హె ♦ చ్చన్ లేచెఁ దర్వాత నా
చెరమల్నిండ మునింగి కాడ్పఱచె నా ♦ శీర్షంబు శైలంబు నాన్. ౧౪౧౨

క॥ పాడిరి రంభాదులు సుర, లాడిరి వీడిరి భయంబు♦నవనీ జనముల్
కూడిరి ప్లవగులు రాఘవు, వాడిరి రక్కసులు తోడు♦పాడగు కతనన్. ౧౪౧౩

౧౬ మాయా జనక పటలము. (౯౫)

మత్త॥ కుంభకర్ణుఁడు సంగరస్థలిఁ ♦ గూరు సక్రమ పద్ధతిన్
రంభఁ గూడఁగఁబోయె నయ్యెడ ♦ రావణుం డొక వంచనా
రంభుఁడై కడు కావరంబున ♦ రామ లోఁగొన నెంచి సం
రంభ మొప్పఁగఁజేసె మాయల ♦ రాశి యొక్కఁడు తోడ్పడన్. ౧౪౧౪

తే॥ పంక్తిమస్తకుండు రహస్య♦భవనమందు, కూరుచుండి మహోదరుఁ♦గూర్మిఁజూచి
నేఁడు సీతను పొందినా♦నెగులు దీర్చు, కొను నుపాయ మొక్కటి దెల్పు♦మనుచుఁగోర.

ఉ॥ ఎంచి యుపాయ మొండు వచి ♦ యించెద జానకి తానుగాఁగ మ
న్నించి వరించునట్లు జత ♦ నించెదఁ జూడు మరుత్తుఁబిల్చి కా
వించెద వానికిన్ జనకు ♦ వేషము వానిని కట్టితెచ్చి చె
ప్పించెద నంతమీఁదఁ జెలి ♦ తప్పక నిన్నుఁగ్రహింపదే ప్రభూ! ౧౪౧౬

చ॥ అని యతఁడాడఁ బంక్తిముఖుఁ ♦ డాదట వానిఁ గవుంగిలించి నీ
వనినది లెస్స వాని వడి ♦ నచ్చటికిం గొని తెమ్మటంచుఁ దాఁ
జనియెఁ గుల ద్వయంబునకు ♦ జానగు దివ్య పతివ్రతా మణిన్
జనకజ నిట్లు లోఁ గొనఁగఁ ♦ జాలెదనంచు విమోహచిత్తుఁడై. ౧౪౧౭

తే॥ మకుట పంక్తులు లేయెండ♦మలసికాయ, నిరులఁ దోలు నంగదముల♦దరుల మెఱయు
సరులు కటిమల సెలయేటి♦సరణిఁ దోఁప, మదగజంబు సిగ్గిలఁ బంక్తి♦వదనుఁడరిగె.

ఉ॥ దీపము వేఱుదీపమును ♦ దెచ్చెడు లీలల నొప్పి చంచలన్
ద్రోపుడు సేసి మేఖలల ♦ తోడఁ గృశత్వము నొందు మధ్యముల్
తేపకు సంచలింపఁగ మ ♦ దించు పయోధర భారవేదనన్
దాపున దేవకన్యకలు ♦ తత్పరతన్ వడిఁదేర దీపముల్. ౧౪౧౯

ఉ॥ రాగముతోడ పూట లధ ♦ రంబు ప్రవాళముతోడ స్త్రీల మే
ల్బాగులనెల్ల నొక్కయెడ ♦ లాలితరీతిని దెచ్చి బ్రహ్మ సం
యోగము గూర్చె నా నలరు ♦ నుర్విజ కొక్క బెడందగూర్ప ను
ద్యోగము సేసి దైత్యవిభుఁ ♦ డుగ్మలిఁ గాంచి మనంబు చల్లఁగాన్.

చ॥ అట నొక పైఁడి పీఁట నల ♦ రారి వెలందుల నొలకన్ని దో
స్తటములె లేమలంబలె న ♦ సంగఁగ డాపలి యూరు పీఠి మీఁ
దటఁ గుడికాలు సేర్చి యడి ♦ దంబు నొఱం దగిలించి రావణుం
డిటులను వేఁడికో లెడఁద ♦ నేచి మొగంబునఁ దొంగలింపఁగన్. ౧౪౨౧

ఉ॥ ఎన్నడు నీదు లెంకపయి ♦ నీడిత సత్కృప యుప్పతిల్లు నిం
కెన్నఁడు భానుతోఁ జనక ♦ యిందుఁడు వేఱయి యుల్లసిల్లు నిం
కెన్నఁడు మారుబాణముల ♦ యేపు లడంగు మదీయ భాగ్యమా!
మన్నన సేసి కావు మను ♦ మానము మాను మనంబు లోపలన్. ౧౪౨౨

ఉ॥ వంచితుఁడైన యేను చెలి ♦ వాలకమై విషయుక్తమా సుధన్
మించి భుజింపఁ గోరితిని ♦ మీదట నాఁటికి నాఁటి కింతొ క్షీ
ణించి మనస్సు సర్వమును ♦ నీఁగెను నీపయిఁ జింతనంబు చా
లించి మరింప జంకెదఁ జ ♦ లించెద మాటికిఁ దత్తఱించెదన్. ౧౪౨౩

ఉ॥ సోలితి నోడితిన్ శరణు ♦ సొచ్చితి వేఁడితిఁ గావుమంచు నా
పాలిటి భాగధేయమయి ♦ వంతలఁ గూర్పఁగనేల ? చల్లనౌ
గాలియె కాల్చెఁ బుష్పములు ♦ కాటులు వైచెను చందనం బహిం
బోలెను కష్టముల్ తెలిసెఁ ♦ బోణిమి నెయ్యవి సేయఁజాలవో ?

ఉ॥ కోరిన స్త్రీలనెల్ల నొక ♦ కోమలిఁ జేసి యభిఖ్య లెల్ల నీ
పేరుగఁ జేసి నా కనుల ♦ వేఱొకచోటికిఁ బోకచేసి యా
మారుని రేఁచి తన్నిశిత ♦ మార్గణ ఘాతములెల్లఁ గూర్చి న
న్నారక యేల కాడ్పఱతు ♦ వో శరణంబని వేఁడుచుండినన్. ౧౫-౨౫

ఉ॥ శంకరుఁ డాదిగాఁగలుగు ♦ సర్వజనంబులు భీతినొంద న
ల్వంకల గెల్చి లోకములఁ ♦ బాలనసేయు వలంతి నేను మీ
నాంకుని కగ్గమై యొకవ ♦ రాంగి పయిం దలకొన్న ప్రేమయే
డింకఁగఁ జేయ నాదగు క ♦ డింది మగంటిమి పొచ్చెమొందదే ?

ఉ॥ వాడి కృశించు జీవములు ♦ బాధల నొందుచుఁ జెక్కు నాళ్లుగా
నాడిక నొందఁ గుక్క బ్రదు ♦ కంచు వచింపదె లోకమెల్ల వె
న్నాడక ? పండిత ప్రభు ల ♦ సంగదశల్ పదియంచుఁ జెప్పరే
నోడక పల్కువాఁడ శత ♦ మో వెయియో యని యంబుజాననా !

మ॥ పరఁగన్ ధర్మమొ ప్రేమచే నొసఁగు సౌ ♦ భాగ్యంబ! మజ్జన్మ సం
తరణీ ! నాయభిమానముం జెఱుప నీ ♦ తారుణ్యసంపత్తి యే
కొఱయున్ లేని శవంబుపోల్కినయితిన్ ♦ గుంభస్తనీ ! యింక నీ
వరదివ్యామథసేవచే బ్రదుకఁగా ♦ వాంఛించితిం బ్రోవవే. ౧౪-౨౭

మ॥ నిజమూహింతము తార పెన్ వలపునన్ ♦ రేరాయనిం బొంది భా
వజ సౌఖ్యంబులఁ దేలదే ? చెడియెనే ? పాపాల పాలయ్యెనే ?
త్రిజగన్మోహిని ? నా మనోరుజల వే ♦ తీర్పంగదే! వేరు మం
దు జగంబందున లేదు నీవెగతి వా ♦ దుల్మాని ప్రార్థించెదన్. ౧౪-౨౮

క॥ అనుచు దశాస్యుఁడు వక్షం, బును బాహువులిర్వది పది ♦ ముకుటంబులు భూ
మినిచేరఁ జాఁగిలంబడి, యెను మడఁతుల కేరికేని ♦ యెదలు ద్రవింపన్.

—: సీత రావణుని దూషించుట :—

మ॥ మృదుశీలాత్మక సీత లేడి పులి బా ♦ రింబడ్డ యట్లై కడుం
బెదరెం గంపము నొందె మ్రానుపడియెం ♦ బెగ్గిల్లె నట్లయ్యు వీఁ
డదయుండై నను చంప వచ్చిన సరే ♦ యాఁగాక మద్భావముల్
మది నే దాఁపఁగఁ జాలనంచుఁ దృణమున్ ♦ మాటొడ్డి తానిట్లనున్.

శా॥ నీ చేష్టల్ కడునింద్యముల్ కృపణముల్ ♦ నిక్కంబు దుష్టాత్మ! యీ
నీచోక్తుల్ వచియింపఁగాఁ దగవు దు ♦ ర్నీతుల్ చెడం ద్రోచురా
నీ చుట్టాలును నీవు నేఁటిదనుకన్ ♦ నిట్టాళ్లు నా నుండఁగా
నాచెన్నారు పతివ్రతాత్వ ఫల ము ♦ న్నన్ మండనా? మాఁడనా?
మ॥ తరుణీ ధర్మము నేను కాచి ఫలమే? ధర్మంబు స్థాపింపఁగా
ధరణీభారము మాన్ప రామవిభుఁ డు ♦ ద్దండించియున్ లాభమే?
విరివారం బఱినోళ్లు నీకుఁ గలుగన్ ♦ పిడ్డూరంపుం బల్కులన్
భరమయ్యున్ విననుండఁగాఁ బలుకవో! బాధింపవో? చంపవో?
మ॥ తపనున్ వెన్నని కార్తికేయు శివు ధా ♦ తన్ జిష్ణుఁ జండాంశు ని
ష్ప్రపులంజేసి జయించినాఁడనని ప్ర ♦ జ్ఞల్పలుకుచున్నావు నా
తపముల్ పండిన పండుఁ శ్రీరఘుకులో ♦ త్తంసంబు దుర్వార బా
ణ పథి న్నిల్వఁగ లేక పాఱితివి మా ♦ నంబొందు నీ కున్న దే? ౧౮౩౪
శా॥ బన్నంబందుచుఁ బస్తులం బడి యశో ♦ భావంబు వోనాడి నా
న న్నగ్గాడి నికృష్టనై నిఁటుచు దా ♦ నంగాను నిర్దుష్ట భా
స్వన్నానాగుణ భూషణుండగు రఘు ♦ స్వామిన్ మహా వాంఛతోఁ
గన్నారం గను భాగ్యమబ్బు నను వే ♦ డ్కం దాల్చితిం బ్రాణముల్
శా ధీరోదాత్తుఁడు లక్ష్మణుండు రణ ధా ♦ త్రిన్ నిన్ను వెన్నిచ్చి యీ
సారిం బాఱఁగనీక యడ్డి నిలుపన్ ♦ త్వన్న భర్త నీ శీర్షముల్
వీరత్వంబునఁ గూల్చి నీయనుఁగులన్ ♦ వేఁటాడి యేకైక దో
స్సారుండై వెలయంగఁ గాంచు ఘనకాం ♦ క్ష న్నిల్పితిం బ్రాణముల్.
మ॥ కరుణాజీవము కంజనేత్రములు జో ♦ కం గల్గి హస్తంబులన్
శరముల్ విల్లు ధరించి యెల్లర హృద ♦ బ్జాతంబులన్ లాగు క
ర్బుర బృందారక వనాంతక ప్రబల జీ ♦ మూతంబు గాకొండు గాం
చి రహింబొందదు మానసాంబుజమునన్ ♦ సీతామయూరం బొగిన్
మ॥ కడఁకన్ జానకి యిట్లన న్నమలి మ్రిం ♦ గందగ్గ కోపంబుతోఁ
పుడమిం దాఁచుచుఁ బంక్తికంఠుఁ డను నో ♦ పూఁబోఁడి! నన్ గెల్చి నీ
పెడఁదల్ పాపిన మీఁద రాఘవునితోఁ ప్రేమంపు జీవంబు లో
కృఁడుగా వాదెదుగాక యంచు నగె ని ♦ ర్ఘాతంబు చందంబునన్
చ॥ నరసుర నాగ తాపసులు ♦ నా క్రుధకుం గుఱియైనవార లె
వ్వరు మని వారు? వెన్నని గ ♦ భావన సేయుచు నీవు మోదముం
బొరయుచు నుండు మానవుఁడు ♦ పూర్తిగ నీమది నాటియుండుచో
మురియలు చేసి తీరుదును ♦ ముగ్ధవు నా బలమున్ గణింతువే? ౧౮౩౫

ఉ॥ కోఁతులు వార్ధిఁ గట్టినవి ♦ కోటను పట్టుగ ముట్టడించె దృ
గ్భృతిగఁ బోరె రక్కసుల ♦ గీటడఁచెం గొఱ యేమి యంచు నీ
చేతములోన సమ్మదము ♦ చెందెదవే? శలభంబు లగ్నిలోఁ
బాతము సెందు లీలఁ బడ ♦ వా? మఱి నాదు ప్రతాప కీలలన్. ౧౪౪౦

మ॥ చని సాకేతమునందు రాజకులమున్ ♦ సంపూర్తిగాఁ బట్టి బం
ధనముల్ సేసియొ తెందు తప్పినఁ దలల్ ♦ దర్పించి ఖండించి తెం
డని యాదేశ మొసంగి పంపితిని దై ♦ త్యవ్రాతముల్ దద్విధం
బున నీతండ్రి వసించుచుండు పురికిం ♦ బుత్తెంచితిం గోమలీ! ౧౪౪౧

చ॥ అని యసురేంద్రుఁ డాడ జన ♦ కావని నాథుని పుత్త్రి సన్ను వం
చనమున నిట్లుసేయు గుణ ♦ శాలికిఁ జేయఁగ రాని దుండునే?
జననిని చంపు పాపికిఁ బ్ర♦జల్ సొరకాయలు గారె? యంచు న
గ్నిని వడి మ్రింగి క్రక్కు కర ♦ ణిం దపియించెను నిశ్వసించుచున్. ౧౪౪౨

ఉ॥ నన్నిటులార్చి త్రిప్పు విధి ♦ నమ్మిన బంట్లని మిమ్ము త్రిప్పఁగాఁ
బన్నుగఁ గష్టజాలములఁ ♦ బాల్పడఁ జేసెదు మీ రలంతులే?
అన్ని యధర్మముల్ మదికి ♦ న్యాయముగాఁగనె మీకుఁ దోఁప నే
మెన్ని ఫలంబు సుంత సహి ♦ యించునె? దుష్టుల కేవి ధర్మముల్?

సీ॥ అని కన్నులందు ని♦రంతర ధారఁగా, బాష్పము ల్గార్చుచుఁ♦బరితపించు
నుగ్మలి యెదుట మ♦హోదరుండు మరుత్తు, జనకునిగాఁ జేసి♦వెనుక కీడ్చి
చేతు లిఱియఁగట్టి♦చేడ్పడఁ దెచ్చి ని, ల్పఁగఁ గాంచి సీత కే♦లను విదిర్చి
నేత్రముల్ మోఁదికొ♦నియె నిప్పు ద్రొక్కిన, విధని పాదంబులు♦విహ్వలించె

తే॥ మానసంబు శరీరంబు♦మాడ్కి వేఁగె, నిలను పడియెను పొరలె నొం♦తె త్తియేడ్చెఁ
బలవరించెను వడఁకెను♦కళవళించె, నేమి సేయంగఁగలుగు న♦య్యిగురుఁబోఁడి?.

ఉ॥ హాయను దైవమా యను మ ♦ హాపద రాదగునా యనున్ వశం
బా యను ధర్మముం జెడియె ♦ నా యను సత్యము మాఁడి బూది యా
నా యను మాయలే బలిసె ♦ నా యను నాపద నుండి ముక్తి లే
దా యను లోకమెల్ల విల ♦ యంబు భజింప శపింతునా యనున్.

మ॥ జనకా! నాకొఱకై యనేక దురవ ♦ స్థల్ నీకుఁ బాటిల్లెనే?
నను గన్నందుల కిద్దియా ఫలము? ధ ♦ న్యత్వంబు ప్రాప్తించె! నే
మనుదానన్ మనుదానఁ గాను బహుదుః ♦ ఖావాప్తి బంధువ్రజం
బునకుం గూర్చినదాన నాయభిజనం ♦ బున్ మెచ్చవచ్చుం గదా?

ఉ॥ పెట్టి భుజించినాఁడవు వి ♦ వేకముతోఁ గ్రమ ధర్మ పద్ధతుల్
నెట్టన యాచరించితివి ♦ నేర్చితి శత్రుల రూపడంపఁగన్

బట్టుగఁ బెక్కు జన్మములు ♦ పారము ముట్ట నొనర్చినాఁడ వీ
కిట్టని బాధలొందఁ బరి♦కించితిఁ గన్నులు కాలిపోవమిన్. ౧౪౪౭

క॥ పలువిధముల నీరీతిం, బలవించుచు సొమ్మసిల్లి♦పడుచుఁ బొరలుచున్
దలఁకుచుఁ దలరుచుఁ గురరిం, బలెఁ గరుణంబుగను మరలఁ♦బలవర మొందెన్.

తే॥ పాడి దప్పని పార్థివ♦వంశమందు, పొడము నీవు పుత్త్రికలకుఁ♦బుట్టినంత
వారు చేయంగఁదగు కార్య♦పద్ధతులకు, రామిఁ జూడఁగోరియొ యిటు♦రాక తండ్రి!

ఉ॥ మాయల మందిరంబగుచు ♦ ప్రమాల్చు చెఱం బురుడించు సంసృతిం
బాయఁగలేక యార్తులయి ♦ ప్రార్థన సేయఁగఁ గాచువాఁడు నా
రాయణుఁ డంద్రు విజ్ఞులు ధ ♦ రాస్థలి నా చెఱఁదీర్చి ప్రోచు వా
రేయెడలేరు నాకొఱకు ♦ నెద్దియున నీ చెఱఁ దీర్చు టెవ్వరో? ౧౪౫౦

చ॥ చెడుగులతోడఁ జేరమిని ♦ చెందెను వైరము దీనికంటె నీ
కడిమిని వీరనాకమును ♦ కాంచిన మేలగు; రాజులందు గా
మిడి వను పేరుతో నడిని ♦ మీఱితి వియ్యది నన్ను పుత్త్రిగాఁ
బడయు ఫలమ్ము సుమ్ము! సుత ♦ పట్టున నెవ్వరు ప్రమంది రీగతిన్?

చ॥ పలుపులచేతఁ గట్టువడి ♦ భారము మోయుచు దున్ని మోఁదులం
బలువుగఁ బొంది పంకమున ♦ మగ్నత నొందు వృషంబువోలె నే
నలయుచు నుంటిఁ బట్టువడి ♦ నప్పుడె చావమి విక్రయించితిన్
నలువుగ మిమ్ము నారకము ♦ నం బడి క్రమ్మఱ నాకుఁ గల్గునే?

చ॥ చెఱవడి శత్త్రునాశమును ♦ చేసి ముదంబును పొందుదాననా?
గుఱుతుగ రామపాదములఁ ♦ గోరిక సేవ యొనర్చుదాననా?
చెఱపన చేటనై చెడుగు ♦ చేసితిఁ దండ్రి కులంబుఁ గూల్చితిన్
గొఱవిగఁ గాల్చితిం బతి య ♦ కుంఠిత వంశ విశేష కీర్తులన్. ౧౪౫౩

చ॥ వనమున జీవితేశునకు ♦ వారని వైర మొకండు కూర్చితిన్
జనకుఁడు బంధితుం డయిన ♦ జానుగఁ జూచుచునుంటిఁ బాతకం
బున విలయంబులే కలిగెఁ ♦ బుట్టిన యింటికి మెట్టి నింటికిన్
బనుపడి జీవితంబు నెడఁ ♦ బాయ! నిఁకెవ్వరి కొంపఁ గూల్పనో? ౧౪౫౪

చ॥ క్రతువు లొనర్చి నన్నరుదు ♦ గాఁ గని పెంచిన తండ్రి బాహువుల్
కుతిలపడంగఁ గట్ట భువిఁ ♦ గూలి యవస్థలఁ బొందుచుండ ని
శ్చితమతిఁ జూచు నేను రఘు ♦ శేఖరు జీవితనాథు నిట్టి దు
స్థితి గనకుండు మున్నగనె ♦ జీవములన్ విడఁజాలనేమొకో?. ౧౪౫౫

సీ॥ జనములారా! వృద్ధ♦జనులార! సోదరు, లార! జనకు దుర్వ్యా♦చార మెఱుఁగ
రేమి? నావలె మీకు♦నిడుమలు గల్గెనే? రా రేల? మరణించి♦నార లేమి?

మేరువునెక్కి స్వ♦ర్మేదినిఁ బట్టిన, సంకించి యీలంక♦యందు చొరఁగ
సుకరంబు గాదు త♦ప్పక వారు చంపిన, వంచనల్ చేసిన♦వార్తఁ దెలుపు
తే॥ వారలెవ్వరు గలరు మీ♦వలన వేఱు, హనుమయొక్కఁడున్నాఁడె?య♦ట్లైనఁ దెలియ
వచ్చుఁ దెలిసియుఁ జేయంగ♦వచ్చునేమి? త్రిప్పి దుర్విధి యిట్లు వే♦ధించుచుండ

చ॥ జనకుని దెచ్చినట్టి నెఱ♦జాణ తపంబున మేనువాడఁ జి
క్కిన సుగుణాఢ్యు సభ్భరతుఁ♦గీడ్పడఁ దెచ్చుటలోన శంకయుం
దనుకునె? యట్టులైన గుణ♦ధాముఁడు రాముఁడు చాలకాల మె
ట్లును బ్రతుకంగఁబోఁ డనుజు♦లుం బడిచత్తురు గుండె వ్రీలఁగన్.

ఉ॥ సేతువుగట్టి లంకఁ బరి♦చేసి యనేకుల దుర్నిశాటులన్
ఘాతకులన్ వధించెనని♦పల్కిన వార్తల నాలకించి నా
చేతమునం బ్రమోదమును♦చెందితి దుర్విధి యిట్లుచేసె వి
ఖ్యాత తపోవ్రతంబులకుఁ♦గల్గిన సత్ఫల మిద్దియే చుమీ! ౧౪౫౮

చ॥ అని పలవించి రామవిభు♦నర్మిలి ప్రాణము సొమ్మసిల్ల రా
వణుఁడును లోన సంతసిలి♦వారిజలోచన దుఃఖ మోర్వఁ జా
లనిదయి తండ్రి జీవితము♦లం జెడనీయక కోరి కాచి తా
నును సుఖమొందునంచు మది♦నూల్కొన జానకిఁ గాంచి యిట్లనున్

ఉ॥ సుందరి! నిన్ను బొందఁదగు♦చొప్పులకై తలఁపంగరాని యి
బ్బందుల నుంచినాఁడ మగు♦వా! యవి యెల్ల క్షమించి నన్ను నీ
కుం దగు బంటుగాఁగఁ గయి♦కొమ్ము విదేహ ధరాధినాథుఁ జం
పం దలపెట్ట నా భయము♦మానుము నమ్ముము నా వచస్సులన్.

ఉ॥ వంతల పాలుసేయు వల♦వంతలఁ బాపుదువేని చెప్పెదన్
జింతలఁ బాపి నీ జనకుఁ♦జేర్చెద సంద్రుని సింహపీఠిపై
నంతకు మించి కోరిన జ♦యంబునఁ గొన్న సమస్తరాజ్య మొ
ప్పింతును కాలఁ జూపు పని♦వేడ్క శిరంబునఁ జేయుచుండెదన్

చ॥ వలసిన లంక నిచ్చెదను♦వారని సేవధులెల్ల నిచ్చెదన్
లలిత విమానమిచ్చెదఁ గ♦లంగక యిచ్చెదఁ జంద్రహాసమున్
దలఁపునఁ గోరె దెయ్యెవి ము♦దంబున నయ్యవి యెల్ల నిచ్చెదన్
గలికిరో! డెంద మిచ్చెదను♦కాదన నీదగు డెంద మిచ్చినన్.

చ॥ పవడముఁ బోలు నోట నొక♦పల్కు ప్రియంబుగఁ బల్కితేని నేఁ
దవిలి మహేంద్రు శీర్షక ము♦దగ్రత దివ్యులు గొల్వఁ దెచ్చి శా
స్త్రవిధి విదేహనాయకు శి♦రంబున నుంచెద సర్వ దిక్పతి
స్తవముల దేవ కామినుల♦దాస్యముఁ గూర్చెద మేల్మి నించెదన్.

ఉ॥ తండిరిఁగన్న తండ్రికిని ♦ తండ్రి విరించియె వచ్చి కూర్మి నీ
తండిరి కోరు కోరికల ♦ దాఁపక యిచ్చు యముండు దాస దా
సుండయి సేవసేయు సుధ ♦ సోదరి లక్ష్మివి నీవు కానిచో
నిండు మనంబుతో సిరియె ♦ నీకును దాస్యము సేయు నమ్మమీ.

తే॥ తండ్రికిం గూఁతురైన మా♦త్రాన ఫలమె? పొందఁదగు మేల్మి జనకుండు♦పొందవలదె?
పరఁగఁ ద్రైలోక్య రాజ్య సం♦పదల నొసఁగి, యీవును సుఖింపుమనసీత♦యీాసడించి.

శా॥ ఈ సౌభాగ్యములెల్ల నొందఁగలవాఁ ♦ డింద్రుండె నిక్కంబు లం
కా సామ్రాజ్యము నా విభీషణుఁడె పేఁ ♦ కంబొందు విష్ణ్వంశమై
వాసిన్ భాసిలు రాము బాణముల నీ ♦ వక్షంబు భేద్యంబు నా
కా సర్వేశుని పాదపద్మములె నే ♦ వ్యంబుల్ జగన్నాశకా! ౧౪౯౯

క॥ బెడిదములగు రామాస్త్రము, లడరి యురముఁ జీల్చి యొడలి ♦ నంతయుఁ బెను జ
ల్లెడగాఁ బొడుచుచు ధర్మముఁ, గడు నేర్పంగలవు నీకుఁ♦గర్కశ హృదయా!

తే॥ కాకములు చంచువులతోడఁ ♦ గనులు పొడిచి, తోఁడఁగలవు; నీవక్షమ్మఁ♦ దోయజాక్షు
శరము లగలింపఁగలవు; పి♦శాచ సమితి, తినఁగలదు నీ శవమ్మును♦తృప్తితోడ.

తే॥ క్రూర దంష్ట్రాయుతంబైన♦ఘోర మస్తకములు కలన రాఘవ సాయ♦కములవలనఁ
ద్రుంపఁబడియె రమ్మనుచు మా♦నతి వచించు, వార్త నేఁట తేపట విన♦వచ్చు నిజము.

ఉ॥ మాత సుమిత్ర వీర వర ♦ మాతగఁ జేసిన లక్ష్మణాస్త్రముల్
నీ తనుజాతు ప్రాణముల ♦ నీఱుగఁ జేయఁగ వాని మేను నం
ప్రీతిని కుక్కలీడ్వ ననిఁ ♦ ద్రెల్లితె పుత్రక! యంచు నీవు దుః
ఖాతురుఁ డౌచు ఱోలుటయె ♦ యర్మిలి నే వినఁదగ్గ పల్కుగుర్.

ఉ॥ క్రూరుఁడు రావణుం డటులు ♦ కోమలి పల్కుట లాలకించి పె
న్నీరసమెత్తి దంతముల ♦ నీడిచి గీఁటుచు సీతపైఁ బడన్
దారున లేవఁగా నెదురు ♦ దాసి మహోదరుఁ డీమె తండ్రియే
తూఱి వచింప నమ్మతిలుఁ ♦ దొందర యేలని క్రమ్మఱించుడున్

తే॥ చచ్చినట్టులుండిన మాయ♦జనకుఁ డపుడు, మొల్లఁ దలయెత్తి యిట్లను♦తల్లి! వీని
వేఁడికోలును త్రోవంగ♦నాడితేని, కులముతో నన్ను గూల్చిన♦కొలయగుఁ జుమి!

చ॥ సిరియును లోఁగి పెక్కురను ♦ చెందదె యుమ్మడిగొడ్డు పోలికన్
వెరవిఁడి! నీకునై యుసురు ♦ వీడుచునుంటిని బందివై వృథా
మరణము నొందనేల? మది ♦ మన్ననచేసి సురేంద్రనాథుఁడై
పరఁగిన వీనిఁ జేకొనుము ♦ పాలనసేయుము మమ్ము మేలుగన్.

చ॥ కరుణను నన్ను నాకులము ♦ గగ్గులకాడుగఁ జేయకుండ ని
బ్బరమునఁ బ్రోచి యగ్గలపు ♦ భాగ్యములన్ సమకూర్చి నీచెలిన్
విరియఁగఁ జేసికొంచు ఘన ♦ విశ్రుత సౌఖ్యము లెల్లవేళలం
బొరయుమ యంచు నయ్యలరుఁ♦బోఁడి పదంబుల వ్రాలె గ్రక్కునన్.

చ॥ చెవులకు హస్తముల్ కదియఁ ♦ జేర్చి జానకి నిశ్వసించి యె
క్కువ దిగులూని దుఃఖమును ♦ కోపముఁ బైపయి నగ్గలింప మై
రవులఁగఁ దండ్రియేని తన ♦ ప్రాణము లెచ్చుగ నిచ్చగించి యీ
పవిదిని పల్కఁ డియ్యది ను ♦ బద్ధము గాదను నిశ్చయంబుతో. ౧౪౭౫

—: సీత మాయాజనకుం బదరుట :—

చ॥ తగవు నశింప శీలము కో ♦ దంబడ క్షాత్రము కూలిపోవఁగా
జగతిని నిందమోవ ఘన ♦ సత్యము చావఁగ సచ్చరిత్రముల్
తెగులుగొనంగ గౌరవము ♦ తీఱఁగ బుద్ధియు మాఁడఁగా నిటుల్
తగిలి వచించు నీవు నొక ♦ తండ్రివె? ధూర్తుఁడ వౌదు దుర్మతీ! ౧౪౭౬

చ॥ కులము నశించినన్ గతులు ♦ గూలిన నాపద లెన్నివచ్చి త
న్నలఁచిన గుండె వ్రయ్యలయి ♦ సందలవోయినఁ బాడి పేరుముల్
వెలలఁగ మానముం జెడఁగఁ ♦ బేరును లోకులు తూరుపెత్త రా
జులు మనువారె? స్వీయకుల ♦ నూదన! యారయ నీవుఁ దండ్రివే?

చ॥ జనకుని యట్లు తోఁప వొక ♦ శ్వానము వీవు నిజమ్ముగ తండ్రివై
నను రఘురాము వింటికి ఘు ♦ నమ్ముగ దీవన లిచ్చి యాతఁడే
నిను విడిపించునేని చెఱ ♦ నీఁగుము తక్కినయేని చావు మ
న్య నియతి లేద యంచుఁ దగ ♦ నాడక యీగతిఁ గాఱులాడెదే?

ఉ॥ నీవును నీదు చుట్టములు ♦ నీ సకలంబును మాఁడి బొగ్గులై
పోవునుగాక నీతి పథ ♦ మున్ మతిఁదప్పి చరింపనేర్తునే?
శ్రీవరుఁడైన రామవిభు ♦ సేవకురాలగు నేను నీచనై
జీవములుండ రావణుని ♦ చెంగట మానముఁబోఁ జరింతునే?

ఉ॥ రామ విభుండు దక్క నను ♦ రాగముతో నను డాయువారు ర
క్షోమరులైన దీపశిఖఁ ♦ జొచ్చిన కీటములట్లు మాఁడరే?
యేమని యెంచితో నను? మృ ♦ గేంద్రుని గూడిన సింహి యొన్నఁడేఁ
బ్రేముడిఁ బాడుగుంటలఁ జ ♦ రించెడు నక్కను గూడియుండునే?. ౧౪౮౦

ఉ॥ క్రూరబలుండు రావణుఁడు ♦ కోమలి పల్కు కఠోర వార్తలన్
దోరపుఁ గిన్కతోడ విని ♦ తోయలి! నీవు తలంచినట్ల యొ

ప్పారుము కాఁగలట్టి దెస ♦ లారకపోవదు వీనిఁబట్టి నీ
వారయుచుండఁ ద్రుంతునని ♦ యత్తఱి ఖడ్గము వేగ యెత్తుడుఁన్.

ఉ॥ చంపఁగలేవు నన్నితనిఁ♦జంపఁగఁజాలవు నిన్ను నీవునుం
జంపుకొనంగలేవు భువ ♦ నంబులఁ గూల్పఁగలేవు రాముఁడే
చంపెడువాఁడు నీకు మొగి ♦ సాయపడంగల నీదుబంధులన్
లంపటలెల్లఁ బూర్తిగఁ దొ ♦ లంగఁగ నన్ గొనువాఁడు కీర్తితోన్.

చ॥ అని ధరజాత పల్కుతఱి ♦ నడ్డము వచ్చి మహోదరుండు పా
వనతర దేవభోగి! యొక ♦ పట్టున నీకయి వేఁడెఁగాక యీ
జనకుఁడు నీకొనర్చిన దొ ♦ సంగొక యింతయు లేదు వీనిఁ జం
పిన వెనుకైన సీత పల ♦ వింపదె నీకు నధీనయౌ తఱిన్ ? ౧౪౮౩

చ॥ అని మొన రామభద్రుఁ డెగ ♦ టార్పుము సర్వము నీకుఁ జక్కనౌ
నని వచియింప దైత్యవిభుఁ ♦ డప్పని మాని తొలంగె నంతలో
వనచరు లార్చుటల్ విబుధ ♦ వర్యుల కేకలతోడి చప్పటల్
విని మదిలోఁ గలంగె రణ ♦ వృత్తము తత్తఱపాటు గూర్పఁగన్. ౧౪౮౪

తే॥ ఇన కులేశుల గుణరావ♦మెక్కుడయ్యెఁ, నమర వానర కలకల♦మతిశయించెఁ
గుంభకర్ణుని సైన్యంబు♦గూల నాతఁ, డొంటిమై యుండెనని దైత్యుఁ♦డుమ్మలించె.

—: రావణుఁడు కుంభకర్ణ మృతికై విలపించుట :—

ఉ॥ ఱెక్కలు గట్టికొంచు నెన ♦ రేఁగి వడిన్ వడి వచ్చి దూత లా
రక్కసితేని కర్ణ విన ♦ రంబుల డాసి మహా రణంబునన్
మొక్కలులైన వానరుల ♦ మొత్తము మొత్తముగా వధించి పై
నుక్కఱి రామబాణముల ♦ నుర్వరఁ దమ్ముఁడు కూలెఁగా! యనన్.

తే॥ పరిధి గల భాస్కరుంబలెఁ♦బైఁడి సరుల, చే నలంకరింపఁబడిన♦శీర్షకములు
జగతిఁ బడఁ బెల్లగిలిన వృ♦క్షంబు పగిదిఁ, గూలె రావణుఁ డవ్వార్త♦కుములఁజేయ.

తే॥ ఉర్విఁ బుట్టుకఁదొట్టి వి♦యోగ దుఃఖ, మెన్నఁ డెఱుఁగని లంకా మ♦హీశ్వరుండు
తనకునై ఘోర రణమునఁ♦దమ్ముఁ డిలిగె, నంచు వినినంత గొంతెత్తి♦యంగలార్చె.

సీ॥ త్రిదశ పద్మాకర♦మద గజేంద్రమ! యింద్ర, వరకీర్తి పూర్ణేందు♦వారిదంబ!
అబ్జజపౌత్ర! శూ♦లాయుధహస్త! యీ, చెడువార్త నేఁడు నా♦చెవులు వ్రీల
విననయ్యె నిన్నంపి♦వెనుక నాప్రాణముల్, గాచికోఁ దలఁచిన♦నీచు నేను
నీస్థితి విన్నచో♦నిర్జరనాథుఁ డై, రావణ మెక్కు న్వ ♦ ర్గంబు చొరఁడె?

తే॥ విమతి నన్ను నీవే యిట్లు♦విడిచి పోవ, నెవరెవరితోడఁ బుట్ట ర♦క్షించువారు?
యెదుటి కేతేర భీతిల్లి♦యొదుఁగువారు, చూచి తొమ్ముపైఁ జేతు లుం♦చుకొని రారె?

తే॥ స్నాన మాడెడి తఱి నీకు♦స్వర్ణశిఖరి, మడమ రుద్దికొనెడు చిన్న♦పడుకె యగును
అట్టి నిన్నొక మనుజుని♦యలుఁగు కూల్చె, ననెడి మాటయే నామదిఁ♦గలఁతఁగూర్చె.
తే॥ శూల చక్ర వజ్రంబులు ♦ సోకి యొడలి, పైని రోమంబునేని రా ♦ ల్పంగలేదు
అల్ప మనుజుని మృదుల సా ♦ యకము త్రుంచెఁ, గుక్క సింగంబు నెదిరించి ♦
కూల్చె నౌర! ౧౪౯౧
సీ॥ తోడఁబుట్టువు ముక్కు♦త్రుంగ మారీచుండు, బ్రుంగ లంకయుఁ బట్టు♦గ్రుంగ భీమ
బలుఁడు తమ్ముఁడు ప్రమంగ♦బ్రదుకుచు నొకచెలి, సౌందర్యమున కాసఁ♦జెందినాఁడ
నినకులునైన నా♦తని తమ్మునైన నే, నానినైనను గపి♦నాథునైన
నంగదునైన మ ♦ హాబల సుతునైన, జాంబవంతుని నేని ♦ చంపి తనుచు
తే॥ వినఁగ నోచనైతి నిఁదేటి♦వింతచావు, రాలు తేలెను బెండ్లు నీ♦రమున మునిగెఁ
నేమి చెప్పంగఁగలదింకఁ♦దామసింప, కరుగుదేరంగఁ దలఁతు ని♦న్ననుసరించి.
చ॥ అతివలు కాళులొత్త మల ♦ యానిల మొయ్యన వీవ నూన సం
గత తలిమంబున న్నిదుర ♦ గాంచెదు సోదర! ప్రేత భూత సం
తతులు నటించుచుం గటు రు ♦ తంబులు సేయు మురంబునన్ రజో
యుతమగు భూమి శయ్య నెటు ♦ లొందితి నిద్దుర మేను వ్రాల్చుచున్.
తే॥ దిక్కులందున నీవు కీ♦ర్తిని రహింపఁ, జేయ మధువాని భోగముల్♦చెందుచుంటి
నీవు వోవంగ నేనెట్లు♦నిలుచువాఁడ? వత్తు నీవెంటఁ దామసిం♦పను నిజమ్ము.
తే॥ అనుచు మిక్కిలి పలవించి♦తనదు కీర్తి, కారణంబెల్ల రిల్లైతుఁ♦గంగఁ జేసె
సీత తననోరు చలియింపఁ♦జెంగలించి, మేనఁ బులకలు గ్రమ్మంగ♦గ్లాని విడిచె.
తే॥ గాత్ర ముప్పొంగెఁ గార్శ్యంబు♦కడకుఁ జనియె, మనసు తెలివొందె జీవముల్ ♦
మరలివచ్చె
సిరియె సేవసేయఁగఁదగు♦శీలచరిత, సీత యొలమికిఁ బొలిమేర♦క్షితిని గలదె?
తే॥ కాంతు లలిత రూపము కుంభ♦కర్ణ ఘోర, తనువుగాంచి భీతిల్లి త♦త్తఱిలి యవలఁ
గెడసెఁ గుంభకర్ణుండను ♦ నుడువు విన్న, సీత పూరించె వేఱొక♦సీత యనఁగ.
తే॥ లోకములఁ గూల్తు లోకపా♦లురను ద్రుంతుఁ, జావకున్నఁ ద్రిమూర్తులఁ♦జావకుండు
మందు దిన్న గీర్వాణుల♦బందివైతు, నని చిరాకు మిక్కిలి యొందె♦నసురవిభుఁడు.
మ॥ తనువున్ వీడిన నాదు తమ్మునకు ను ♦ ద్దామక్రియన్ రామ ల
క్ష్మణ రక్తంబునఁ దర్పణంబు నొగి ము ♦ మ్మాఱుల్ మనశ్శాంతికై
యొనరింపంగలవాఁడ నంచు సమరో ♦ ద్యోగంబునం బోయె రా
వణుఁ డాచోటును వీడి మంత్రులు సఖుల్ ♦ వంటించి వెన్నాడఁగన్.
తే॥ కాక కంక గృధ్రంబులు♦కలయఁదిరుగు, పాలికలనఁ గుంభకర్ణుండు♦పొలిసె ననుచుఁ
గుంది యాజనకుని వేఱు♦బంది నుంచుఁ, డంచు నేగె మహోదరుఁ♦డార్తిమెయిని.

తే॥ పూలు తావియు లేక దు♦వ్వూటలు లేక, యొంటి తిరిమైన కేశంబు♦లొప్ప సీత
కడకుఁ గడఁకతోఁ ద్రిజటయన్ ♦ కాంత వచ్చి, యూఱడించుచు నిట్లని♦ తేఱఁ బలికె.

తే॥ నీ జనకుఁడంచు నీదు స♦న్నిధికి వచ్చి, మలసి నతఁడు మరుత్తుఁడన్ ♦మాయలాఁడు
నిక్కమది యని నమ్మకు♦నీరజాక్షి! దనుజ మాయలు పెక్కులుఁ♦దలరనేల?

తే॥ త్రిజట పల్కులయందు మై♦థిలికి నమ్మ, కంబు గల్గుట నామె దుః♦ఖమ్ము వీడె
సందియము వీడె మనసునఁ♦గుందు వీడె, నెప్ప టట్టులు రామాప్తి♦యెదురుచూచె.

౧౨ అతికాయ వధ పటలము. (౨౭౬)

తే॥ ఉగ్రమై వెల్గు విలయాగ్ని♦యుడుకునట్లు, మండు కోపంబుతో రావ♦ణుండు కొలిచి
యిరుకెలంకులవచ్చు మం♦త్రులఁజూచి, రౌద్రమూర్తియై యిట్లు వా♦క్రువ్వఁ దొడఁగె.

తే॥ అనువుగలవారు పగఱయు♦క్కడఁచువారు, బలియురని పంప శాత్రవ♦బలమడంచి
మరలి రాలేక యూరక♦మరలివచ్చి, నిలుతురేల? సిగ్గిలరె? యీ♦వలికిఁబోండు.

చ॥ గతియొకయింతలేక ప్లవ ♦ గంబుల డంబుగఁ గూర్చుకొన్న దు
ర్మతులను చంపివత్తుమని ♦ మాఱట రుద్రులఁబోలె నేగి పెన్
జతనముతోడఁ దమ్మునకు ♦ సాయముసేయక పాఱివత్తురే?
యతగులు మీరు ప్రాణముల ♦ నంటి చరింతురె యెల్లకాలమున్?

చ॥ మునుపు జయించితిన్ జగము ♦ మొత్తము నేలితి శౌర్యసంపదన్
గొనకొని మీరు నాదు మఱుఁ ♦ గుం గొని గారవ సౌఖ్య కీర్తులం
గని చరియించినా రపుడు ♦ కార్యము గల్గిన మీబలంబు వం
చన మొనరింపకుండ నను ♦ జాతము లిచ్చియుఁ జేయు టొప్పదే?

తే॥ అంతకర్హులమేముకా♦మందురేని, యట్లు చెప్పఁడు నేనేగి♦యముఁడులేక
ప్రాణ మానఁదగిన శక్తిఁ♦బరపి నరులఁ, వీఁపు చూపఁ జేసెద భూత♦వితతి యదర.

తే॥ మఱియునొకమాటయరుదైన♦దురముసందు, గెలువఁగోరిన నేగుఁడుఁ♦చలముమీఱ
నిలుగుటే నిజంబని మీరు♦తలఁతురేని, వలవ దెయ్యది మీకోర్కి♦ తెలుపుఁడనుడు.

తే॥ బ్రహ్మకోపించినను జయిం♦పంగరాని, శూరు డతికాయుఁ డపుడు సి♦ష్టురతతోడఁ
గోపమును సిగ్గు మల్లడి♦గొనఁగఁబలికె, రావణునితోడఁ దనపరా♦క్రమము మెఱయ.

ఉ॥ జంకిన జంకనీ నరులు ♦ జంభ విభేదియు నిర్జరావళుల్
జంకిన జంకనీ యజుఁడు ♦ చక్రియు రుద్రుఁడు తక్కువారలున్
జంకిన నీవు నీకయి వె♦సన్ బిడియంబు వహింతుగాక నే
జంకితినంచు నెంచుటయుఁ♦జక్కటికాను భవన్మనంబునన్. ౧౫౧

తే॥ దానవులయందు ఘనబల♦దర్పితులను, గెలిచి గెలుపును నీకుఁ గ♦ల్గింపలేదె?
నీవును వడంకఁ బోరిన♦నిర్జరులను, గ్రుంచి సారెనాఁ ద్రిప్పి యా♦డించలేదె?

ఉ॥ కైదువు కేలనుండ ధరఁ ♦ గాల నలంపఁగఁబడ్డ యక్షుఁ డం
బేదల సాయకంబులకు ♦ బిద్దిన గద్దఱి కుంభకర్ణుఁడుఙ్
బేదల సత్త్వకీర్తులను ♦ భీతిని నమ్మిన యా విభీషణుం
డో దనుజేంద్ర! నాకు సము ♦ లో? తలపోయుము నీమనంబునఙ్.

తే॥ నీదుతమ్మునిప్రాణముల్ ♦ నీఱుసేయు, వానితమ్ముని జీవముల్ ♦ బ్రాఁతిదీసి
రాము వడఁకింపఁజాలిన ♦ భీమ రణము, సేయనేని నీకొడుకనఁ ♦ జెల్లు టెట్లు? ౧౫౧౪

క॥ ముమ్మరముగఁ బోరి ప్లవం, గమ్ములఁ ద్రుంగించి దళము ♦ గాంద్ర నలఁచి బీ
రమ్మున నిరువురు నరుల క, రమ్ము లిఱియఁగట్టి తెచ్చు ♦ త్రాణం గనుమా.

క॥ బంటులతోఁ బొమ్మందువొ, యొంటరివై పొమ్మటందు ♦ వో సెలవిమ్మా
పంటింప కేగి వారల, దఁటతన మడంతు ననిన ♦ దనుజేంద్రుండుఙ్. ౧౫౧౫

క॥ ముదమంది లెస్స పలికితి, కదనమ్మున లక్ష్మణాఖ్యు ♦ ఖండించినచోఁ
బదపడి మఱునాఁడే నే, సదమద మొనరింతు రామ ♦ చంద్రు దురమునఙ్. ౧౫౧౬

ఆ॥ మూఁడుకోట్ల క్రొత్త ♦ మొన రథ గజ తురం, గములు తోడ రాఁగఁ ♦ గదనతలము
సేరఁ బొమ్మటంచుఁ ♦ జీరి దీవించుచు, నెలస మతిశయింప ♦ సెలవొసంగె. ౧౫౧౭

తే॥ నిర్జరుల కసాధ్యులు మహా ♦ నిష్ఠుర బల, ఘనులు కుంభ నికుంభు ల ♦ కంపనుండు
తేరి రక్షకులుగ వచ్చు ♦ వారు పవన, జవన హయ శతాంగంబుపై ♦ సరగఁ జనుము.

తే॥ తేరు లొక వేయి యొక కోటి ♦ వారణములు, కోటి వారువములు తోడఁ ♦ గూడి వచ్చుఁ
గదలుమన నతికాయుండు ♦ ముదమునంది, కార్ముకము పూనిపసిఁడి కం ♦ కటము దొడిఁగె.

తే॥ కఠినరావముల్ గల వీర ♦ గణము బలయు, వివిధ సాధనముల కాంతి ♦ వింత గొలుప
వీథులెల్లఁ గ్రిక్కిఱియంగ ♦ వెడలె దండు, పాద రేణువుల్ రోదసిఁ ♦ బరవి నిండ.

సీ॥ గిరిదరీ సుప్తకే ♦ సరులు మేలుకొనంగ, గజ బృంహితంబు ల ♦ గ్గలముగాఁగ
కపి నికాయంబుల ♦ కర్ణభేరులు వ్రీల, భేరీ రవంబులు ♦ బోరుకొనఁగ
జీవసంతతి గుండె ♦ చెదరంగఁ బంచధా, రాగత హయహేష ♦ లలమికొనఁగ
త్రుక్కి శేషు నొడలు ♦ మిక్కిలి బడలంగ, స్యందన నేమి ని ♦ స్వనము లులియ

తే॥ కాలిబంటుల ఘనఘోర ♦ గర్జనముల, దారణస్థితి గగనంబు ♦ బూరటిల్లఁ
బాదవిక్షేపముల భూమి ♦ పల్లటిల్ల, నడచె వడిగాఁగ దైత్య సై ♦ న్యబు లనికి.

తే॥ మున్ను మదగజంబులు వడిఁ ♦ బోవుచుండ, వెంటఁబడి పోవుచుండెడు ♦ పిడులనాఁగ
ధ్వజము లొలయు కంపాయుత ♦ వారిదములు, కదలుచుండెను వెనువెంట ♦ గములు గట్టి.

తే॥ అంకుశము పోటుగొన్న సా ♦ రంగములకుఁ, బ్రక్కలఙ్ మదతోయంబు ♦ పాఱుకతన
దారి బురదయై దిగఁబడఁ ♦ దత్తడములు, నేనుఁగులు నేగె నక్టైట ♦ నీఁదుపోల్కి.

తే॥ భానుతోడఁ బరిధి యేగు♦పగిది నడచె, స్యందనంబులు తోయద♦చయమువోలె
నడచె వారణములు నేల♦నడవవయ్యెఁ, బరుగువాఱుచునుండెను♦తురగసమితి.

క॥ గిరి సముదయములు నడచిన, తెఱఁగునఁ దఱుచగుచుఁ బెద్ద ♦ తేరులు నడవన్
గరువంబున నతికాయుం, డిరవుగ నని సేయఁదగిన♦యిక్కువ చేరెన్. ౧౫౨౬

క॥ శ్రీరామ మదగజేంద్రము, వీరవిహారంబు సలుపు♦పృథివిని గని వె
వ్వేత్రై పదములు తునిఁగిన, వీరుని పినతండ్రిఁ గాంచి ♦ విలపించెఁ గదున్.

క॥ ఇది యమ్ములచేఁ దిప్పయి, పొదలినయదిగాదు దిగిభ♦ముల తనువు న్నీ
రదమును శరనిధియును గా, దిది తండ్రి శరీరమనుచు♦నేడ్చెం బెలుచన్. ౧౫౨౮

తే॥ అకట యిట్టిదుస్స్థితిఁ జూడ♦నరుగుదెంచి, నాఁడ నుసుఱులతోనున్న♦నరుల మున్న
తునుమకుండుటచే నింత♦దొసఁగువచ్చె, నూరకుండుట నాకింక ♦ నొప్పుగాదు.

క॥ అని కినిసి యిట్లుకావిం, చిన రామునితమ్ము నిల్పి ♦ చెలగి చెలగి రా
ముని దుఃఖము గనినం గద, మన యంగద సీఁగు ననుచు♦మదిఁ జింతించెన్.

తే॥ మహిషుఁడను దూతఁ బిల్చినా♦మాటగాఁగ, లక్ష్మణునికడ కేగి యా♦లలినిపలుకు
తమ్ముఁకై దురపిలు తన♦తండ్రినెగులు, దీర్ప నతికాయుఁ డాజి కే♦తెంచెననుము.

తే॥ చింతచే మదికలఁగి కృ♦శించుచున్న, తండ్రి నిండుసభను రాము♦తమ్ముఁ డాజిఁ
గాళ్లు తెగి యురలంగఁ దాఁ♦గాంచునట్లు, శపథములు పల్కి వచ్చెను♦నరగ ననుము.

క॥ దురిత మిదియని తలంపను, వరశూరుల కిదియె ధర్మ♦పద్ధతి యనుచుం
దెఱఁగొప్పఁ బలికి యతనిని, దురమునకుం దెమ్ము పొమ్ము♦తోరంపు వడిన్.

క॥ నరులును యుయుత్సువులు నగు, నిరువుర వడిఁ జేరి కలన♦నెదిరించెదు వా
రిరవుగ జము నోటంజొరఁ, బరుగిడువారనుచుఁ దెలియఁ♦బలుకుము మహిషా!

క॥ వానిఁ గొని తెచ్చి విడిచితి, వేని ముదమునంది నీకు♦నిచ్చెదఁ బ్రతిగాఁ
జీనాంబరములు మేలగు, మాణిక్య విభూషణములు♦మహియు నొసఁగెదన్.

క॥ సౌమిత్రిఁ దోడి తెచ్చినఁ, బ్రేమంబున ఖచర నాగ♦విద్యాధర కాం
తామణుల నిత్తు నీవటు, కీమహిఁ ద్రావని నురాదు ♦ లిచ్చెద నీకున్. ౧౫౩౬

క॥ రవిమండలముం బోలిన, యవి వేల్పులు కానుకవెట్టి ♦ నవి యక్షేశుం
డవిరళముగ నిచ్చినయవి, తివిరి యొసఁగువాఁడ రత్న♦దివ్యద్భూషల్. ౧౫౩౭

సీ॥ దానధారలఁ దుమ్మి♦దలు మూఁగు మదగజం, బులు నూఱు వేలు నీ♦ కెలమినిత్తు
రత్నకాంచనమయ♦రథములు పదివేలు, వన్నెవన్నెల వాహ♦నముల నిత్తు
ధనరాశి నించిన♦ఘనశకటంబులు, కోరికమీఱఁగాఁ ♦ గొసరకిత్తు
దాసదాసీజన♦తండంబు లొకవేయి, వలసినచోటఁ గా ♦ వలసినంత

తే॥ నేల యేలంగనిచ్చెద♦నీవుపోయి, లక్ష్మణుని దోడితెమ్మ నీ♦నూత్నమతిని
దగిన తెఱఁగునఁ బలికి క♦ర్తవ్యమెట్లుఁ, జెడకయుండఁ జూడుము పొమ్మ♦శీఘ్రగతిని.

తే॥ అనుడుమహిషుడొంటరియయి♦యరిగియెదురు, వచ్చురామునిగనినంత♦వానరవరు
లలుక లేవ నుత్సాహంబు♦గొలుపునర్థ, మొండు గలదని మహిషాసు♦రుండుపలుక.

తే॥ రాయబారియైవచ్చె ని♦రాయుధుండు, రేఁగవలదని వారి వా♦రించి విభుఁడు
వానిఁగని నీవువచ్చిన♦పని విశేష, మయ్యెనేని తెల్పుమ యన♦నసుర చూచి.

తే॥మాప్రభుఁడు దెల్పఁబంపిన♦మాటయొండు,గలదు లక్ష్మణుతోఁ బల్క♦వలయుననిన
వినెద వాక్రువ్వుమని రామ♦విభునితమ్ముఁ, డనుడు మహిషాసురుండును♦వినిచెనిట్లు.

శా॥ నిన్నే ఘోరరణంబునం జెనక న ♦ న్వేషించుచున్ వచ్చి యిం
దున్నాఁడం బ్రతియోద్ధ శౌర్యమది నీ ♦ కున్నేని వే రమ్ము తం
డ్రిన్నొప్పించిన నొవ్విదీఱ నిను గం ♦ డ్రింతుం దురంబందు మీ
యన్నం బిమ్మట నొంతుఁ బంతమిది ప్ర♦త్యగ్రంబుగాఁ జేసితిన్.౧౫౪౨

మ॥ అనినన్ రాముఁడు నవ్వి యిట్టులను దై♦త్యశ్రేణితోఁ బోర నా
యనుజుం డెప్పుడు సజ్జుఁడై యలరు ధై ♦ ర్యస్ఫూర్తి శోభిల్ల నా
నినకా దాతనితండ్రి వచ్చినను మ ♦ న్నించున్ రణంబిచ్చు ర
మన్మమా మానము శౌర్యమున్ భుజ బల ♦ వ్యాపారము ల్గల్గినన్.

మ॥ అన నాతోడనె పంపుఁడంచు మహిషుం ♦ డాడంగ మేలంచు ల
క్ష్మణుఁ బ్రేమంబునఁ గాఁగిలించికొని రా ♦ మస్వామి పొమ్మన్న స
ద్గుణభూషుండు విభీషణుం డనియెఁ గా ♦ కుత్స్థాన్వయా! యిత్తఱిన్
మనతోఁ గూడియె తమ్ముఁ డాదనుజుఁ జం ♦ పం దగ్గ కార్యంబగున్.

సీ॥ సత్యవిక్రముఁడగు♦సౌమిత్రితోన యు, ద్ధంబుసేయఁబ్రతిజ్ఞఁ♦దాల్చినాఁడు
తపమొనరించి వి♦ధాతచే వరములు, గాంచి వేలుపుల జ♦యించినాఁడు
కైలాసమెత్తిన♦ఘనుఁడు మేరువునెత్తఁ, బ్రేమతో వీనిని♦పెంచినాఁడు
వలయు సాధనములు♦పనిలేకయే కేలఁ, బాలవెల్లిం జిల్కఁ♦జాలినాఁడు

తే॥ విలయమునను నశింపక♦వెలయుచుండు, ప్రథిత దిగ్గజములఁ ద్రోచు♦బాహుబలము
తోడఁ జక్రవాళంబునే♦త్రోవఁజాలు, దోర్బలము సమానమె? దశ♦రథతనయ!

తే॥ చిరము ఫాలాక్షుతోడను♦దుర మొనర్చి, శూల మతఁడు వైవఁగ దానిఁ♦గేలఁబట్టి
యీవు విడిచిన శూలమా♦యిది? యటంచు, నుల్లసములాడె నెఱఁకుల♦నుచ్చిపాఱ

తే॥ పగఱ లోకంబు వేల్పుల♦నగరిఁగాల్చు, తఱిని విష్ణువు వైచు సు♦దర్శనంబు
నిష్ఫలముగా నొనర్చిన ♦ నేర్పులాఁడు, వీని సామాన్యుగాఁగ భా♦వింపరాదు.

తే॥ అమరులేసిన వివిధ ది♦వ్యాస్త్ర సమితి, పంబి రాకుండ నుగ్గునూ♦చంబుచేసి
వారి సామర్థ్యముల వ్యర్థ♦పఱచినట్టి, చండ కోదండ విద్యా వి♦శారదుండు.

తే॥ శంకరుని శిష్యుఁడనితర♦సాధ్యనవ్య, మహిత శస్త్రాస్త్ర విదుఁ డధ♦ర్మంబు దక్క
వేఱెఱుంగఁ డశూరుల♦వీఁక దాఁకఁ, డసమకీర్తికాముఁడు మాయ♦లాజిఁ గొనఁడు.

సీ॥ మాయా విశారదుల్♦మధుకైటభులు తొల్లి, సురలోకమును చొచ్చి♦చూఱలాడి
విబుధుల హింసించి ♦ విధివశంబున నొక్క, దినమున శ్రీరమా ♦ ధిపునిగాంచి
సమరమిమ్మనికోరి ♦ సమ్మతింపఁగ వారు, బహురూపములఁ గొని ♦ వచ్చిపోరఁ
జక్రియు వారితోఁ ♦ జాలకాలంబు మ, ల్లాడంగ వారలు ♦ హరినిగాంచి

తే॥ మమ్మెదిర్చి పోరిచ్చిన ♦ మహితధైర్య, శాలి జగముల నీవలెఁ ♦ జాలువాఁడు
లేఁడు మేమేడులోకాల♦లీల మ్రింగి, క్రక్కఁగల బలియుర మాజి♦కర్కశులము.

తే॥ ఇరువురను మమ్ము డీకొని♦యిన్నినాళ్లు, పోరితివి మెచ్చితిమి నీవు♦కోరు వరము
నొసఁగువారము కోరి మే♦లొందు మనినఁ, జక్రి కోరె వారల గెల్చు♦నరవిఁ దెలుప.

ఉ॥ నీతొడయందు చత్తుమని ♦ నిర్జరవైరులు తెల్పునంతఁ గం
జాత విలోచనుండు భువ ♦ నంబు సమస్తము నొక్క యూరువం
దే తెఱఁగొప్పఁ జేర్చ నను ♦ కేంద్రులు వేర్పడి లొంగినారు త
ర్వాత గదాప్రహారమున ♦ మ్రందిరి లోకము లుల్లసిల్లఁగన్. ౧౫౫౨

మ॥ మధుమేధస్సు ధరాతలంబు నెఱయం ♦ బర్వంగ నిద్ధాత్రి త
ద్విధిచే మేదినియయ్యె ధర్మపథమున్ ♦ ద్రొక్కాడకున్నట్టి య
మ్మధువే యవ్వలఁ గుంభకర్ణుఁడగుచున్ ♦ మాఁడెన్ భవత్సన్నిధిన్
మధుతమ్ముం డతికాయుఁడయ్యె రఘురా ♦ మా! దీన చింతామణీ!

ఆ॥ తగ విభీషణుండు ♦ దైత్యుల చరితంబు, తెలుప నిట్లు మోముఁ ♦ దేటపఱచు
మొలకనవ్వుతోడ ♦ జలజాతనేత్రుండు, పలికె జలద నినద ♦ భాషణముల.

సీ॥ కోటిరావణులైనఁ ♦ గూడ సురాసురుల్, వచ్చి లక్ష్మణుఁ దాఁకి ♦ బ్రదుకువారె?
యితఁడు కోపించిన ♦ నేనేల? హరియేల? హరుఁడేల? యింద్రామ ♦ రాదులేల?
దివ్యాస్త్రములుఁ తప ♦ స్తేజోబలంబులు, సౌమిత్రి కినుకకుఁ ♦ జాలునవియె?
కేల విల్లందిన ♦ నీలోకములనెల్ల, క్షణమున నివుఱుగఁ ♦ జలుపఁగలఁడు

తే॥ మేదినీసుత మాటలు ♦ మీఱలేక, తొలఁగిపోవుటచేఁ గదా ♦ దుష్టరాక్ష
సుండు నేటికి జీవించి ♦ యుండువాఁడు, కాకయున్న నాఁడే జముఁ♦గాంచువాఁడు.

చ॥ తొనఁకక పొమ్ము నీవితని ♦ తో నతికాయు శిరంబు తూపుతోఁ
జని గగనంబుదాఁకి పడఁ ♦ జయ్యన గ్రద్దలు కాకులుం దినం
గనియెదుగాక కంబువులఁ ♦ గంబులతో నెదిరింపఁ బోలునే?
దనుజుల గెల్వవచ్చినది ♦ తక్కక యెవ్వరితో నెఱుంగవే? ౧౫౫౬

మ॥ తలఁపన్ రుద్రుఁడొ చక్రపాణియొ సుమీ ♦ త్రానూనుఁడో కాక యి
య్యిల నెవ్వా రతికాయుఁ గూల్పఁగలవా ♦ రెన్నంగ వేవేల సే

నను దైత్యానుజుతోడ రాఁ జదిపె నిం ♦ కం జంపువాఁ డీతఁడే
గెలుపుం గాంచెడువాఁడు నీతఁడగు శం ♦ కింపంగ నీకేటికిన్ ? ౧౫౫౭

తే॥ కదలుమన రాఘవునకుల♦ కృష్ణుఁడు ప్రమొక్కి, దీవనలుగొని తనతోడ♦ధీరులైన
కపివరులు విభీషణుఁడును♦కడఁక నడవఁ, గదలి యతికాయుఁడున్న రం♦గంబుఁ జేరె.

తే॥ దక్షిణపయోధిమీఁది కు♦ త్తరపయోధి, వచ్చి చొచ్చినతీరునఁ♦బ్లవగసేన
మోహరించిన సోఁకుల♦ మొగ్గరమును, చీల్చుకొని చొచ్చి యురవడిం♦ జెంగలించె.

తే॥ వచ్చినెత్రుచేఁ దేమమై♦పంకమైన, తలము సింహనాదమ్ములు♦చెలఁగ రేఁగు
సైన్యఘట్టన దుక్కయై♦సరగ లేచు, రజమునింగి నెట్టనచేసి♦ప్రబ్బుకొనియె. ౧౫౬౦

తే॥ శంఖ కాహళ దుందుభి♦స్వనములెల్ల, వీర సింహనాదములతోఁ♦ జేరి యవల
శింజినీధ్వనితోడను♦ చెలఁగి జలధి, నోరు మూసికొనఁగఁ జేసె♦బోరు కలఁగి. ౧౫౬౧

ఆ॥ రక్కసులు నశింప♦రక్తంబు సెలయేళ్లు, మాడ్కిఁ బఱవ నాకు♦ప్రమాఁకులట్లు
కేతనములు త్రుంగఁ♦గీశులు కొండల, నెక్కుపోల్కిఁ గరుల♦నెక్కినారు. ౧౫౬౨

తే॥ శాఖలనెడు దంతమ్ములు♦శాద్రమనెడు, మదజలంబును విలసిల్లు♦శాద్రధరంబు
లనెడు నేన్గుల వైవఁగ♦హస్తిహస్తి, పోరు చందమై మదకరుల్♦పుడమిఁగూలె.

తే॥ గట్టిగాఁబట్టిఁ బొడిచెను♦కఱచె రక్కెఁ, ద్రుంచెఁ గపినికాయంబులు♦తురగములను
రక్తపూరంబులో మెడల్♦ప్రాలఁ గాళ్లు,పైకిఁదిరుగఁ దన్నుకొనుచుఁ♦బడియెహరులు

తే॥ వనచరాఖేటమున మద♦వారణములు, వాత్యచేఁ దూలు వారిద♦పంక్తులట్లు
తూలిప్రీలిన దంత సం♦దోహమందు, ముత్యములు పటపట రాలి♦పుడమిఁ జెదరె.

తే॥ వజ్రఘంగంబములఁబోలు♦పాదహతులఁ, గేలఁ గాలపాశముఁబోలు♦వాలహతుల
దానవగణంబు లురలెను♦తత్కఠోర, కుంతఘాతంబులం గపి♦కులము దొరలె.

తే॥ చేతులకుఁ జిక్కు ప్రమాఁకులు♦శిలలుపాము, లేనుఁగులు గుఱ్ఱములుగద♦లీఁటెలు రథ
శకలములు విసరుటచేత♦సాంద్రమగుచుఁ, బరవెఁ గాంతారమట్లు పై♦భాగమెల్ల.

క॥ వనచరవీరులు వైచిన, పెనుగిరితరు లంబరమునఁ♦బెలుచై వన రా
శిని దిగు మొగుళుల వడువున, దనుజబలముమీఁదఁబడి స♦దమదము సేసెన్.

తే॥ పాఱి యీవలావలకును♦జాఱిపడిన, పాఱుఁబోతు రాకాసుల♦పరశు ఖడ్గ
ముద్గరాదిసాధనముల♦ మురియఁజేసి,రుధిరపూరంబులం బడఁ♦ద్రోచినారు. ౧౫౬౯

తే॥ వీరులగు వానరులు రక్త♦పూరమందు, యీఁదులాడుచుఁ దిప్పలై♦యొలయుకరుల
నెక్కి రవియు నీడ్వఁగఁబడి♦యేటిఁజేనిఁ, జేరి దరిగానలేక గా♦సిల్లినారు. ౧౫౭౦

తే॥ కాళ్ల నిలువనీకీడ్చు ర ♦ క్తప్రవాహ, మందు పొడుగుకోలల నూని ♦ కొందఱేగ
వారితోఁకలఁ దక్కిన ♦ వనచరాళి, పట్టికొని యీఁదు చవ్వలి ♦ పట్టుచేరె.

తే॥ సోఁకులును విజృంభించి ము♦నుండి శూల, ముద్గరాదుల మోఁదంగ♦ మొగపు దక్కి-
దిక్కులకుఁ బాఱ నదిగని♦లక్ష్మణుఁడు, కనలుగొని వారి కుత్సాహ♦గరిమఁ గూర్ప.

క॥ జము నుద్యోగంబునకుం, దమయత్నమ్మునకుఁదోఁడు ♦ తనరిన తన చా
పము గుణమును బలువిడి లా, గి మహారావంబు లేపెఁ ♦ గీడ్పడ జగముల్.

తే॥ పంచభూతముల్ తమ తొలి♦ప్రకృతియందు, లీనమైనను బ్రహ్మయీ♦ల్గినను విలయ
కాలమందును నాశంబు♦ గానకుండు, ప్రణవముంబోలె నాధ్వని♦పరిఢవిల్లె. ౧౫౭౮

తే॥వాఁడితూపులువిడువంగఁ♦బడియొఁబడిన, యమ్ములనురులపెనుమేన♦లందుమఱిఁగెఁ
గుణపములు సందులేకుండఁ♦గుప్పలుపడె, వానినుండి రక్తముపాఱి♦ వార్ధిఁజేరె.

తే॥ కరుల కరముల ఖురువుల♦కాళ్లఁద్రెంచి, రథిక శిరములఁ ద్రుంచి వ♦ర్గములు పెంచి
వివిధచిత్ర రూపఁబుల♦వెలయఁజేసె, లక్ష్మణాస్త్రముల్ విధిపోల్కి♦లాఘవమున.

తే॥ పిండ్లు తుండించి శక్తుల♦విఱుగఁ గొట్టి, కవచములఁ జీల్చి విపులవ♦క్షములఁ దొల్చి
గుఱ్ఱముల వ్రాల్చి తేరులఁ♦గూల్చి యేనుఁ, గులను పీనుఁగులంజేసి♦కోల లడరె.

తే॥ దంతిదంతముల్ తెగి నభో♦ంతరముచేరి, విదియచంద్రుల పగిదిని♦వెలయుచుండెఁ
గరములూడినయవి రక్త♦శరధినుండి, భూమిఁ బైకెత్తెడు వరాహ♦మూర్తినెనసె.

తే॥ రెండు నెలరేకలను నోటఁ♦ద్రెంచికొనుచుఁ, గుండలములను దిక్కుల♦గుఁపుతోడ
గగనమండలమే దిగు♦కరణిఁ దోఁచె, రక్కసుల తలల్ వడఁగ ధ♦రాతలమున.

తే॥ రథికబృందంబు మరణింప♦రథములురలి, పడియెఁ బదవి చెడం గర్మ♦ఫలముచేత
మింటనుండి యొడ్డగిలంగ♦మంటఁజాఱి, పడు విమాన సమూహంబు♦పగిదిఁదోఁప.

తే॥ పీడఁగారాని సుఖదుఃఖ♦వితతిఁద్రెంచి, యమరలోకంబు గైకొంటి♦మని తలంచి
యధిక కౌతుకంబున నోడ♦ల్లాడె ననఁగ, నట్టలాడెను రణభూమి♦నిట్టలముగ. ౧౫౮౧

తే॥ ఒక్కపదివేలు మరణింప♦నొక కబంధ, మాడునను శాస్త్రసూక్తి స♦త్యంబయైన
నాఁడు కోటికి నెక్కుడై♦నర్తనంబు, చేసె సౌమిత్రి చాతురి♦చెప్పఁదరమె? ౧౫౮౨

క॥ కరి భట తురగాదుల నె, త్తురు సెలయేళ్లట్లుపాఱి ♦ తోయధిఁజొచ్చెన్
అఱవఱలై యఱిముఱియై, పఱిపఱియై యున్న పరియఁ♦బలుచంబాఱెన్.

సీ॥ గొలుసులలోఁ దగు♦లొక్కన్న కాళులతో ద్వి, పమ్ములఁదోలు క♦బంధవితతి
తురగంబులు నటింప♦దొరలక వానిపై, శివి నర్తించు మొం♦డెముల గుంపు
తలలూడినను గుఱి♦తప్పక యెప్పటిఁ, బ్రదరంబులను వీడు♦రథికచయము
పరుగులెత్తుచునుండ♦శిరములు తెగిపోవఁ, బరుగు వీడని వీర♦భటకులంబు

తే॥ సీత పేరిటిమృత్యువుఁ♦జెడఁగఁగోరి, తెచ్చుకొన్న దైత్యులు తండ్రి♦తెరలఁగొడుకు
మడియ నల్లుండు గూల మ♦న్మండు చావ, నన్నదమ్ము లురలఁ♦దాము నడఁగినారు.

క॥ శరములఁ దునుఁగుచుఁ ద్రుళ్లెడు, శిరములఁ గవ్వికొనిపోవఁ♦జేరిన గ్రద్దల్
చరణాయుధములపోల్కిఁ, జఱియించెం గొంచుఁబోవ♦సాధ్యము లేమిన్. ౧౫౮౫

క॥ వేలై కోల్తో యగ్ని, జ్వాల లుమియు లక్ష్మణాఖ్య♦శర సంచయ మా
భీలంబై పడుచుండఁగఁ, గాలభటుల కపుడు వొడమెఁ♦గాళుల తీవుల్ ౧౫౮౬

క॥ మేరువుఁ గదలింపంగల, వీరులు జ్వాల దస్త్రములను♦విగత ఘన తనూ
భారులయి దివికి దుముకఁగ, వారలఁగని పొందినారు♦ప్రమదంబు సురల్ ౧౫౮౭

సీ॥ దారుకుండను వాఁడు♦దర్పించి తేరు దో, లించి లక్ష్మణు నెది♦రించి నిలిచి
శరవృష్టి గురిసి యం♦బరమెల్లఁ గప్పిన, వాని నన్నింటి నె♦వ్వడిగఁ ద్రుంచి
సౌమిత్రి ఘోర ని♦శాత శరంబున, వాని శిరము ద్రెంచి♦వసుధఁ గూల్చె
కాలుండు కలికుండు♦కాలజంఘుఁడు మరు, త్తుండు మాలియను నైదుగురు రేఁగి

తే॥ పాశ శూల పరశు భింది♦పాల ముసల, ముద్గరాదుల నైవ నా♦పురుషపుంగ
వుండు వానినన్నిటిఁ దగఁ♦జెండి వారి, తలల నొక్కొక్క యమ్ముచేఁ♦దఱిఁగివైచె.

సీ॥ అదిగని రోషించి♦యతికాయు సేనాధి, పతులు వారణ కదం♦బంబు రేఁచి
పరిగొని కైదువుల్♦పఱపి వానరతతి, నటునిటు పోనీక♦యాఁచి నలఁప
వనచరుల్ చేతి క♦బ్బినవానిఁ గొని వైవఁ, బొలసుదిండులు లోనఁ♦బూఁడినారు
సౌమిత్రి శరములుఁ♦సారంగ యూథంబు, నవలికిఁ జననీక♦యలఁచి కొట్ట

తే॥ నంగములు పెక్కుతుండ్లుగాఁ♦ద్రుంగిపడఁగఁ, జదికిలంబడె నొకకొన్ని♦చచ్చెఁ గొన్ని
దిరిగె గిఱ్ఱునఁ గొన్ని మ♦స్తిష్కపంక, మంద యొఱవలుగాఁ గూలి♦యడఁగెఁ గొన్ని.

తే॥ ఒక్కతోడుగున వెడలుమ♦హోగ్రశరము, లొక్కపెట్ట సామజముల♦నుర్విఁ గూల్చె
మావతుల జీల్చెఁ జోడ్డోళ్ల♦మహిని దుల్చె, రక్షకుల మాల్చె బంట్లబీ♦రముల వ్రాల్చె.

తే॥ కైదువులు విఱిగెను యోధ♦గణము తఱిఁగె, కంకగృధ్రజంబుకముల♦కఱవు దీఱె
మావటీంద్రఁ గోల్పోయిన♦మదగజములు, కలఁగి యొండొంటితోఁ బోరు♦సలుపసాగె.

ఉ॥ కొన్నిటి పాదముల్ తునుఁగఁ ♦ గొన్నిటి తుండము లైదు తుండ్లుగాఁ
గొన్నిటి వాలముల్ తెగఁగఁ ♦ గొన్నిటి ప్రేవులు జాఱఁ గన్నులుం
గొన్నిటి కీఁగఁ గొన్నిటికిఁ ♦ గ్రొవ్వు దిగంబడ వచ్చు దంతులున్
గ్రన్ననఁ జచ్చుదంతులును ♦ గా బవాలు భీకరమయ్యెఁ జూడఁగన్.

తే॥ కరిఘటలు గూలుచుండ రా♦క్షసబలమ్ము, లించుకయుఁ బుయిలోడక♦యెడములేక
యాయుధంబుల వైచుచు♦హస్తివితతి, ననువుగా నడ్డుగొనిపోరె♦నగ్గలించి ౧౫౯౩

తే॥ శరదములు భాస్కరుని గప్పు♦చంద మొంది, సామజంబులు లక్ష్మణు♦సరవి ముట్ట
శక్రధనువుఁ బోలిన శరా♦సనమునుండి, యతఁడు కురియించె బెడిదంపు♦టంపవాన.

సీ॥ మోములు చీల వీఁ♦పులు ప్రీలఁ దుండముల్, పఱియలై ధారణిఁ♦బడియెఁ గొన్ని
పొరలుచు దొరలుచుఁ♦దెరలుచు ఘీంకృతుల్, నెఱపుచు ధాత్రి పైఁ♦దెరలెఁ గొన్ని
అర్ధచంద్రాస్త్రంబు♦లలమిన ఫాలభా, గములతో మేదినిఁ♦గడచెఁ గొన్ని
వనధిలోఁ బడెఁ గొన్ని♦వనమునఁ బడెఁ గొన్ని, పర్వతముల మీఁదఁ♦బడియెఁ గొన్ని

తే॥ ఘోరశరములు కన్నుల♦గ్రువ్వ స్వపర, భేదమెఱుఁగక తమవారి♦విఱిచెఁ గొన్ని
లక్ష్మణుఁడు దంతులంగూల్చు♦లక్ష్యశుద్ధి, లాఘవము వేల్పులకును తె♦ల్పంగఁగాదు.

తే॥ ఏనుఁగుల కళేబరముల♦నెనఁగు నెత్రు, టేఱు లాపీన్గు తిప్పల♦మీఱ లేక
కరులవీరులఁ దేరుల♦హరుల నెల్లఁ, ద్రోచికొనిపోయె నిలువక♦తోయనిధికి.

తే॥ లక్ష్మణాస్త్ర చయంబుచే♦లక్షకరులు, గడియలోఁ గూలఁ దెలిసి లం♦కా విభుండు
మిగిలియుండిన కోటి యే♦నుగులఁ బంపె, నతనిమీఁదికి నీరస♦మతిశయింప.

తే॥ ప్రాణములతోడఁ ద్రాణయు♦నధికమదము, గలవియగుసామజంబులు♦కపిసి యతని
మీఁది కుఱికిన దొకటియు♦మిగులలేదు, డాయఁగా లేదు డాసియుఁ♦బాయలేదు.

తే॥ ముప్పదాఱు యోజనములు♦పొలసివచ్చ్చు, కరిఘటలు రాఁగ లోకంబు♦గజమయంబ
యయ్యెనని వేల్పులనిరి వి♦హాయసంబు, ధూళిమయమయ్యె భూమి ని♦ర్ధూళియయ్యె.

తే॥ శాకినీ ఢాకినీ భూత♦సంచయంబు, తుదియు మొదలును గనరాని♦మునగజేంద్ర
రాశిఁ గని మునుమిడక తూ♦ఱంగ దొరకు, వానిఁగొనిపోయెఁ గొండల♦పగిది మోచి.

క॥ ఒకశరమున కొక కరి తె, క్కకురాఁ బదివేల కరులఁ♦గడిమిం ద్రుంపఁ
గిరు లదరె మొగుళు లడలెను, శరనిధులుం గలఁగె దిగ్గ♦జములును వడఁకెన్.

తే॥ గుణరవము లేచెఁ బర్వతి♦గుహాలయంపు, నిదుర సెందు సింగంబుల♦మొదలు గలఁగఁ
బిడుగు లడరిన వసువున♦పిశిఖవితతి, పడియె వేదండ తండ కుం♦భంబు లగల.

శా॥ ఆవేళన్ దనుజేంద్ర నందనుని సై♦న్యంబెల్లనొక్కుమ్మడిన్
వేవే కేకలు వెట్టుచున్ మిగులు కుం♦భివ్రాతముల్ రేప రా
ద్రావేశంబున గాంచి వీరవిహృతి♦వ్యాపార లోలాత్మకుం
డై వచ్చెన్ వయిశంబ కేసరి సుతుం♦డా లక్ష్మణాస్త్రంబునన్. ౧౬౦౩

మ॥ నరసింహుం డితఁడంచు కాంచిన సురలి♦నక్తంచరుల్ భీతిలన్
హర కోదండ విభంజనాంఘ్రియుగముల్♦హత్తించి చిత్తంబునన్
హరిదండంబును బోని తాళవిటపిన్♦హస్తంబునం దాల్చి హుం
కరణం బొప్పఁగఁ జేసె దానవుల కు♦త్కంపంబు నిండారఁగన్.

మ॥ యముఁడున్ భూతములున్ మొగుళ్లు నొకరూ♦పై వచ్చెనా నొప్పి శై
లములం గూల్పఁగ వాలు వజ్రమను లీ♦లన్ వాలి సంహార కా
లమునన్ రేఁగెడు రుద్రుమాడ్కి రిపు వి♦క్రాంతి క్రమాభీలుఁడై
చమరెన్ గాలను గేలఁ దాళమున నా♦సారంగ యూథంబులన్.

సీ॥ త్రొక్కుటచేఁ గొన్ని♦యుక్కుటచేఁ గొన్ని, కాలను గొన్ని మోఁ♦కాలఁ గొన్ని
వాలమ్మునం గొన్ని♦తాలమ్మునం గొన్ని, ఫాలమ్మునం గొన్ని♦కేలఁ గొన్ని
నలఁచి కొన్నింటిని♦మలఁచి కొన్నింటిని, విఱిచి కొన్నింటిని♦కఱచి కొన్ని
యీడ్చి కొన్నింటిఁ దో♦లూడ్చి కొన్నింటి వే, చీల్చి కొన్నింటి మై♦నుల్చి కొన్ని

తే॥ త్రుంచికొన్ని వంచుచుఁగొన్ని ♦ కుంచికొన్ని, యొక్కటొక్కటిపై నేసి ♦ యొక్కకొన్ని
హుంకృతింగొన్ని సమయించి ♦ యుత్సహించెఁ ♦ గేసరిసుతాఖ్య సార్థక ♦ మై సనంగ.
తే॥ నేలకుం దాఁచికొన్ని వా ♦ ర్నిధినిగొన్ని, లంకలోఁగొన్ని దెసలకుఁ ♦ గ్రుంకఁగొన్ని
ప్రేవుప్రోవు లురలఁగొన్ని ♦ త్రిప్పికొన్ని, నదమదము నేసి యెసఁగె ♦ శ్వసనసుతుఁడు.
తే॥ వాలమును కొండ చిలువ నా ♦ వంచువంచి, మావటీంద్రతోఁ గరుల నం ♦ బరము సేర్చు
విలయకాల రుద్రుండన ♦ వీఁకఁ దనరి, శవమయముచేసె నా రణ ♦ స్థలముఁ ద్రుటిసి.
తే॥ కలఁచిమాంసమేదో ♦ స్రపం ♦ కంబునందు, పెక్కుగజములఁ గడిమిమై ♦ ద్రొక్కి వైచె
మిగత తన భాగమనుచు సౌ ♦ మిత్రి వాని, ఘోరసాయక రాజిచేఁ ♦ గొందివైచె.
తే॥ అన్ని దెసల నేన్గులు పీన్గు ♦ లగుచు నురలఁ, జిక్కి రక్కసుల్ స్రుక్కి ♦ స్రుక్కుకుండు
వార లీఁగుకుకొనిరి తక్కు ♦ వారు వెన్ను, చూపుచును చూచుచును పాఱఁ ♦ జొచ్చినారు.

—: దేవాంతకుండు హనుమచేఁ గూలుట :—

తే॥ అసురులక్లాటఁ గన్న దే ♦ వాంతకుండు, తేరుఁ దోలించి కిన్కమై ♦ మారుతిపయి
వాఁడి యమ్ము లురమ్మునఁ ♦ గాఁడ నేసి, సింహనాదంబు దనుజులు ♦ చెలఁగఁ జేసె
క॥ పావని యొకతరువుంగొని, వైవఁగ నసురుండు దానిఁ ♦ బఱియ లొనర్చెన్
దీవరముగ మఱియొక గిరి, వైవ నతఁడు దాని నడుమ ♦ భగ్నము సేసెన్ ౧౪౧౨
తే॥ గరుడుమాడ్కి నదాటున ♦ నరదమునకు, దాఁటి మారుతి దైత్యుని ♦ ధనువు నూడఁ
దీసికొని రెండుగాఁగ ఖే ♦ దింప వాఁడు, మరల హనుమని గొట్టెఁ దో ♦ మరముతోడ.
తే॥ తివిరి యనుమఁ డొడిసి పట్టి ♦ త్రిప్పివైవ, దానిచే సారథియుఁ దేరు ♦ ధరణిదొరలె
యవల శూలంబుఁగొన్న దే ♦ వాంతకు శిర, మూడఁబెఱికివైచెను కపు ♦ లుల్లసిల్ల.

చ॥ అది తన కన్నులారఁగని ♦ యా యతికాయుఁడు రౌద్రదృష్టితో
నదలిచి తేరుదోలుమని ♦ యామున మారుతిఁదాఁకె సేనలున్
జెదరినవెల్ల నిల్కడను ♦ చెంది పదంపడి వచ్చె దైత్యుఁడుం
బదరుచు నాంజనేయుఁగని ♦ పల్కె బయోధర భీషణధ్వనిన్. ౧౪౧౩

మ॥ అనమాన ప్రతివీర నిర్మథన బా ♦ హా దత్తు మా యత్తు ని
వ్వసుధన్ రాచి పయోధిదాఁటి చని నీ ♦ ప్రాణంబు దక్కించుకొం
టి సమిద్ఘోరతలంబునన్ గడిమిమై ♦ డీకొన్న దేవాంతకున్
వెసఁ దున్మాడితి వద్దిగాంచి యని గా ♦ వింపంగ విచ్చేసితిన్. ౧౪౧౪

శా॥ నేఁడే మృత్యువు దాపరించె వినుమా ♦ నీపాలికిన్ నిక్కమీ
నాఁడే పూని వధింపకున్న మఱి యే ♦ నాఁడున్ సమీపింపఁ బె
క్కేఁడాగోడము లాచరించితివి ని ♦ న్నేడాటలాడింపకే
వీడంజాలను పాఱిపోక నిలుమా ♦ వీరుండవే యైనచో. ౧౪౧౫

ఉ॥ మేరు సమాన ధీరుడు స ♦ మీరసుతుం డతికాయు వార్తకుం
గేరుచు నవ్వి వీరుఁడవు ♦ క్రించుఁదనంబు లిఁకేల? నామొదన్
గ్రూరత చూపఁగాఁ ద్రిశిరుఁ ♦ గూడ సహాయత గోరుకొమ్ము నీ
యీరసముల్ ఫలింపవని ♦ యెల్లిదమాడఁ ద్రిశీర్షుఁడున్ వడిన్. ౧౬-౧౮

చ॥ తెరలక నిల్వుమం చరుగు ♦ దెంచి మరుత్సుతుఁ దాఁక నాతఁడున్
దురమొనరింప మీరె వలఁ ♦ తుల్ వెడఁగుల్ చపలాత్ములంచు సం
బరముగఁ బల్కి దానవుల ♦ పాలి యముండగు వాయుసూతి భీ
కరగతి వచ్చెఁ దానరుగు ♦ గాలికి వారల నాల్కలెండఁగన్. ౧౬-౧౯

ఆ॥ వచ్చి వాని తేరి ♦ పైకి లఘించి చే, వమెయి వానిఁబట్టి ♦ వసుధఁద్రోచి
కాలరాచి ప్రతిన ♦ పాలించి పడమటి, గవనుచేరె సేనఁ ♦ గాచుకొఱకు. ౧౬-౨౦

మ॥ త్రుటిలో దాఁటె నిఁకేమిచేయనగు నీ ♦ దుష్టాత్ము నంచార్త సం
కటుఁడై యయ్యతికాయుఁ డశ్రువులు వే ♦ కాఱంగ నిశ్చేష్టుఁడై
కటముల్ కేలువడంక నిల్చి యితఁ డు ♦ గ్రక్రోధుఁడై నిల్వఁగా
నిటలాక్షుండు నెదుర్పఁజాలఁడని ని ♦ ర్ణీతిం బ్రశంసించుచున్. ౧౬-౨౧

మ॥ ఒకకార్యంబున పూని వేఱొకఁ డెదన్ ♦ యోచించుచున్ నిల్క గా
ళ్లకు మేల్చిన్నియగాదు లక్ష్మణు నన ♦ ల్ప స్థైర్య శౌర్యాదులం
బ్రకటోద్గ్రాజిని గానఁగోరి యిటు లో ♦ ప్పన్ వచ్చితిం దేరు ని
ల్పక పోనిమ్మని తూణయుగ్మ మొకతే ♦ వన్ దిద్దుచుం గన్ననన్.

—: అతికాయుఁడు లక్ష్మణుచేఁ గూలుట :—

శా॥ నేమిధ్వానము వార్ధిఘోషమును గ్రే ♦ ణింపన్ ధనుర్నాదముల్
జీమూతధ్వనిఁ గ్రిందుసేయ దెసలుం ♦ జేడ్పాటుగా శంఖ భే
రీముఖ్యస్వన మొత్తరింప రణధా ♦ త్రి న్నిల్చి నర్తించగన్
భీమప్రోద్ధతి లక్ష్మణుండు చెనకెన్ ♦ వేల్పుల్ ప్రశంసింపఁగన్. ౧౬-౨౩

తే॥ త్వరితగతి డాసి వాలిపు ♦ త్త్రకుఁడు దనుజుఁ, డరదమున నుండ నిల నిల్చి ♦ టనువుగాదు
క్రించుఁడన మైన నాపై ర ♦ హించి యెక్కు, మనుచు వేఁడఁగ సౌమిత్రి ♦ యనుమతించి

తే॥ వాని భుజములపైఁ దన ♦ పదములుంచి, యెక్కినిల్చె; వెన్నుని మోయు ♦ నెక్కిరింత
యీడితనికంచు వేలుపు ♦ లిచ్చమెచ్చి, విరులు కురియించి పొగడి దీ ♦ వించినారు

తే॥ వాలికొడుకు పెందేరెగు ♦ వలని కేగుఁ, బెరుఁగఁ బెసఁగు వింటికి నేగ ♦ వింటి కేగు
నడఁగ నడఁగు నెల్లేగిన ♦ నట్టులేగుఁ, బ్రభుని హృదయం బెఱింగి త ♦ త్పద్ధతిఁ జను.

తే॥ అంగదుని నేర్పుఁగని వాన ♦ రాధిపతులు, సంతసించి యార్చిరి సము ♦ త్సాహ మెసఁగ
కరిఘటలమీఁద రథ తురం ♦ గముల మీఁదఁ, గురిసె లక్ష్మణసాయక ♦ కుంభవృష్టి.

తే॥ మురజములు మ్రోసె రథనేమి ♦ మ్రోఁగెఁ దురగ, హేషలెసలారె శింజినీ ♦ ఘోషమడరె
కరుల ఘీంకృతుల్ హెచ్చె శం ♦ ఖములు మొరసెఁ, గ్రందెఁ దర్జన భర్జన ♦ గర్జనములు.

ఉ॥ కూలెను వారణంబులును ♦ కూలె రథంబులు కూలె నశ్వముల్
కూలెను కాల్బలంబులును ♦ కుప్పలు తిప్పలుగాఁగఁ గాలుఁదుర్
సోలెను తద్రణస్థలిని ♦ చూడఁగలేక సుమిత్రపట్టి దృ
గ్జాలము పోవు చోటులకు ♦ సాయకబృందము పోయి నాటఁగన్. ౧౬-౨౯

మ॥ అతికాయుం గని లక్ష్మణుం డనియె వి ♦ ల్లమ్ముల్ తగంబూని ద
ర్పితబుద్ధిన్ సమరంబు సేయ నిటకున్ ♦ వేవచ్చి యిట్లుంటకున్
గత మేదో తెలిపింపుమా యొకఁడవై ♦ కయ్యంబు గావించెదో?
పృతనావారము గూడఁ దండ్రి పగిదిన్ ♦ భీతుండవై పాఱెదో? ౧౬-౩౦

మ॥ అన ధీరుం డతికాయుఁ డిట్టులను నై ♦ న్యంబెల్ల నా కేల? నీ
వును నేనే యని సేయువార మిట వే ♦ ఱెవ్వల్ తక్కు వారున్ రణం
బును వీక్షించుచునుండ నాకడిమి పెం ♦ పున్ సొంపు శోభిల్లఁగా
నిను గూల్పం గలవాఁడ నందు లకెగా ♦ నేఁ డిట్లు పిల్పించుటల్? ౧౬-౩౧

ఉ॥ రాముఁడె కావనిమ్ము త్రిపు ♦ రద్విషుఁడే నిను కావనిమ్ము సు
త్రాముఁడె కావనిమ్ము సిరి ♦ రాయనితోడుగ లోకసత్తకం
బోమఁగనిమ్ము నీయసువు ♦ లుద్గతి నొందును నేఁడు ఘోర సం
గ్రామమునందు నిల్వుమని ♦ గర్వముయుండయి యొత్తె శంఖమున్

చ॥ అదివిని లక్ష్మణుండు దర ♦ హాసము చేయుచు నీవుపల్కు బె
ట్టిదు లిటరారు గెల్చినను ♦ డిందిన నేనొకరుండనే చుమీ
వదరక నన్ను గెల్వఁ బెర ♦ వారల గెల్చినవాఁడవౌదు నా
యెదురను నిల్వుమం చొక మ ♦ హేషువు వక్షము నాటనేయఁగన్

చ॥ వెదురయియున్న కాలునకు ♦ వేగ గుణంబు దగిల్చి దైత్యుఁ డా
ప్రదరము నంతరంబుననె ♦ వ్రయ్యలుచేసి సహించి కాచుకో
మ్మదరక యంచుఁ గ్రూర గర ♦ ళాగ్నులు గ్రక్కు శిలీముఖంబులన్
బదియును నూఱుగాఁగఁ దన ♦ వారలు సంతసమంద నేయుచున్. ౧౬-౩౪

తే॥ వాని శరముల నడుమనే ♦ వక్కలించి, లక్ష్మణుండేసె నాఱుకో ♦ లలఁ గుబేరు
నోర్చి వెలసిన యతికాయుఁ ♦ డుగ్రుఁ డగుచు, సన్నితూపులతో వాని ♦ నడఁచివైచె.

మ॥ పురుషశ్రేష్ఠుఁడు లక్ష్మణుండు గుణ మా ♦ పూర్ణంబుగా లాగి రౌ
ద్ర రసావేశము మీఱితోఁపఁ బదినా ♦ రాచంబులం జొన్పి మై
మఱువుం జించి నిశాతసాయకముల ♦ మైసోఁకఁగా నేసి య
త్తఱిఁ దత్సేనల రూపుమాపె నొకఁడుం ♦ దక్కంగ నీకుర్వడిన్. ౧౬-౩౬

ఉ॥ వెంటనె తేఱివాఁడు తన ♦ వీరకదంబము రూపుమాయుటన్
గంటికి బర్వఁగాఁగ నెడ ♦ గానక యమ్ములు పర్వి నిండుటల్
మంటలు గ్రక్కఁ గాంచి బహు ♦ మాత్రముగా శరవృష్టి మించి ము
క్కంటి యుగాంతవేళ నెస ♦ కంబుగ నేచినమాడ్కిఁ రేఁగఁగన్. ౧౬౩౭

ఉ॥ ఆకసమెల్ల నమ్ములు ది ♦ గంతము లమ్ములు భూమినమ్ము ల
మ్మూఁకలమేన నమ్ములు స ♦ ముత్కటమై యెటఁజూడ నమ్ము ల
స్తోకముగాఁగ నిండి వడిఁ ♦ ద్రోవఁగసాగెఁ బరస్పరంబు ని
శ్శ్రీకములయ్యె నగ్ను లద ♦ రెన్ గగనంబు ధరిత్రి శైలముల్. ౧౬౩౮

చ॥ మునిఁగిన తోఁకమూఁక తుది ♦ ముట్టకయే తలయెత్తనేర్చునే?
కినిసిన లక్ష్మణుం డితని ♦ గెల్చునె? యీయతికాయుఁ డంత్యకా
లునికడ నేర్చెనో కొల సి ♦ లుంగులు కూర్చుట? వీనినేర్పు నే
మనఁదగు? నంచు భీతిలి వి ♦ యచ్చరు లేగిరి దవ్వు దవ్వుగన్.

ఉ॥ అంగదు బాహులందు మెడ ♦ యందును వక్షమునందు నంప పిం
జం గఱి గానరా బహుళ ♦ సాయకముల్ వడి నాటి లక్ష్మణున్
ముంగలి గాననీక శర ♦ ముల్ నిగిడించి దరంబునొత్తి మిం
టంగల వేల్పుమూఁకలు వ ♦ డంక నొనర్చె మృగేంద్రనాదమున్.

తే॥ సెలయనంగనంగదుమేన ♦ సెలలు గ్రుచ్చి, సెలయుటలు లక్ష్మణుండు వీ ♦ క్షించి రౌద్ర
మూర్తియై శరవర్షంబు ♦ ముసర వాని, ధనువు విఱిచి సారథిని ర ♦ థ్యములఁ జంపె.

ఉ॥ వేఱొక తేరిపై కుఱికి ♦ వేఱొకవిల్లు ధరించి తాఁకు నా
కారి కుమారుపై రఘు వ ♦ రానుజుఁ డగ్నిశరంబు నేయఁగా
మాఱుగఁ గర్బురుం డనల ♦ మార్గణమేసి సహించుకొమ్ము పొం
గాఱఁగనీయకంచు దుర ♦ హంకృతి నార్చెఁ గప్పు ల్గలంగఁగన్. ౧౬౪౨

ఉ॥ హెచ్చును కుందు గానఁబడ ♦ నీయక రెండును పోరుచుండఁగా
హెచ్చిన లక్ష్మణాస్త్రము ల ♦ హీనజవంబున దైత్యు వక్షముం
గ్రుచ్చుచు వీఁపునన్వెడలఁ ♦ గుప్య దుదంచిత సింహమో యనన్
రెచ్చి సురారియున్ దిటవు ♦ ప్రీలక మాఱొనరించెఁ జేవమై. ౧౬౪౩

చ॥ మఱియును లక్ష్మణుండు శిత ♦ మార్గణముల్ వెసనేసి వాని ముం
దఱ గలవారి వెన్కఁగల ♦ దైత్యులు చూడఁగదగ్గయట్లు చిం
దఱలుగఁ జేయఁగా నసుర ♦ ధైర్యము వీడక బాణవర్షముం
గురియుచునుండె వానరుల ♦ కూటము డగ్గఱఁ జెంగకుండఁగన్. ౧౬౪౪

ఆ॥ అపరిమితముగాఁగ ♦ నస్త్రంబులను వాని, విడుచు రాముతమ్ము ♦ వీనులకడఁ
జేరి వీని శమనుఁ ♦ జేర్పుము బ్రహ్మాస్త్ర, మునన యనుచు ననిలుఁ ♦ డనియె నల్ల

తే॥ మంచిదని సంతసించి ల ♦ క్ష్మణుఁడు కడఁగి, తొడిగి మంత్రపూర్వకముగ ♦ ద్రుహిణశరము
నేయ నది యుగ్రుఁడగునతి♦కాయు శిరము, మింటఁగొనిపోయె సంతకు♦నింటికడకు

క॥ కష్టములు తొలఁగెనని సుర, లిష్టంబున విరులు గురిసి ♦ యెసఁగిరి చింతన్
దుష్టులు దైత్యులు పాఱిరి, శిష్టులుఁ గేశవరు లుల్ల ♦ సిల్లిరి మిగులన్ ౧౬౪౭

చ॥ జయము గడించి లక్ష్మణుఁడు ♦ సమ్మతి నంగదునుండి క్రిందికిన్
రయమున డిగ్గె నాతని ప ♦ రాక్రమలాభముఁ గాంచినట్టి ప్ర
త్యయమున నింద్రజిత్తు నిఁకఁ ♦ దప్పక నాశమునొందు నన్న ని
శ్చయమున నవ్విభీషణుఁడు♦చాలఁ బ్రశంస యొనర్చె నయ్యెడన్. ౧౬౪౮

—: నరాంతకుఁ డంగదుచేఁ జచ్చుట :—

ఉ॥ సుందరవక్షుఁడైన సుర ♦ సూదన పుత్త్రకుఁ డీల్గెనంచు నీ
చందన గంధిలంబగు వి ♦ శాల సువక్షముఁ జూచికొంచు వి
ల్లందముగాంచి పొంగుచు న ♦ యంబున నెచ్చటికేగెదింక నీ
యందము చందము న్నిలువ ♦ వంచు నరాంతకుఁ డగ్గలించుచున్.

చ॥ మిడుగుఱు లక్షులందు మిఱు ♦ మిట్టులు గొల్పుచు రాలఁ గిన్కయుం
దొడిఁబడి లేవ ధారణికి ♦ దూఁకి నరాజియు ఖేటకంబుఁ బెం
పడరఁగఁ దాల్చిరాఁ గపు ల ♦ గౌఘము వ్యోమము గప్పవైవఁ బు
ష్పొడివలె దూదిపింజలటు ♦ పోఁడిమిఁ దూల్చుచు డాయవచ్చినన్

చ॥ కని యొక వృక్షరాజముఁ బె ♦ కల్చి కరంబునఁ బూని వాలి నం
దనుఁ డెనరేఁగి రామవిభు ♦ దారుణ సాయకమట్లు తాఁకెఁ దాఁ
కిన క్షణమందె యంగదుని ♦ కేలధరించిన వృక్షమున్ నరా
లునఁ దెగనేసె నొక్కత్రుటి♦లోనఁ బరుల్ గనలేని నేర్పడిన్. ౧౬౫౧

తే॥ అంత రిక్తహస్తుండయి♦యంగదుండు, వెనుక కేగుట పాడికా♦దని తలంచి
పైకి లంఘించి చేరిచి♦పట్టె వాని, కాలు గే లడిదంబును♦కదలనీక.

ఉ॥ పట్టినవాని సాహసము ♦ పట్టుగ వేల్పులు కాంచి చేతులం
దట్టుచు నార్చి రంగదుఁడు ♦ దారుణముష్టి వధింపకే వెసం
బట్టము లాగి కొంచుఁ దెగ♦వాఱఁగ దేహము నిట్ట నిల్వునం
బట్టుగఁ జీల్చివైచెఁ గను ♦ పడ్డ సురారులు విహ్వలింపఁగన్. ౧౬౫౩

—: ఉన్మత్తుఁడు నీలునిచేఁ గూలుట :—

తే॥ పిడుగులనె మ్రింగఁజాలిన♦బెట్టిదుండు, పేర నున్మత్తుఁడనువాఁడు♦పెలుచ రేఁగి
తప్పఁద్రావి యున్మత్తదిన్న♦మొప్పు పగిది, మత్తుఁడై మత్తకరి నెక్కి♦యొత్తరించె.

సీ॥ గాలిగాకున్న నీ♦లీల వేగమ దేడ ?, జలధి గాకున్న నీ ♦ శబ్దమేడ ?
శమనుండె గాకున్న♦జనహింస యెటులగుఁ ?, బిడుగు గాకున్న నీ♦ చెడుగుగలదె ?
కోపమేరూపు గై♦కొనక యీ వడియేడ ?, జలదంబుఁ గాకున్న♦ స్తనిత మేడ ?
అల గజాసురుఁడె గాఁ ♦ డైన భీకర మేడ ? నడగొండగాకున్న♦నడచుటేడ ?

తే॥ అనుచుఁ గనుగొన్న వానరు♦లడలి బడలి, జడిసి బెడిసి పడుచు లేచి♦కడల దాఁకఁ
బరుగువాఱ విజృంభించి♦తిరుగఁదొడఁగె, మత్తుఁ డున్మత్తుఁ డెక్కిన♦మదగజంబు.

తే॥ వానరులువైచు పర్వత♦పంక్తులెల్ల, మావఁతుల యొడిసెలలకు♦మాఱుగావు
కపులువైచు పెందరువు లీఁ♦గలను దోలఁ, బనికిరావయ్యెఁ జెఱకుగాఁ♦బనికివచ్చె.

సీ॥ కాళ్లక్రిందంబడి♦కసకసయైనవి, వాలంపుక్రేటున♦నీలిగినవి
తుండంపు విసరునఁ♦గొండలఁబడినవి, కొమ్ముల క్రుమ్మునఁ♦గూలినవియు
నై మలమనుకులు♦సౌమిత్రిశరముల, దనుజు లొందినపాట్లు♦తప్పకొందఁ
గాంచి నీలుఁడు పెను♦కాంతాళమున నొక, సాలవృక్షముగొని♦లీలఁద్రిప్పి

తే॥ కొనుచురాఁగ నున్మత్తుఁడు♦కోలలైదు, పరపి సాలమ్ము ఖండించి♦వైవ వేఱు
కొండయొండు నీలుఁడు గుఱి♦గూడ నేయఁ, దునుకలుగఁజేసెఁ బదునైదు♦తూపులేసి.

తే॥ మరలనొక కొండ వెదకంగ♦మరలునంత, మరలనీయక నాగంబు♦మందరమును
చుట్టినట్టులా నాగంబు♦చుట్టె నీలు, నట్టు లిట్టులు కదలనీ♦యక కడింది. ౧౬౫౮

ఉ॥ సాహసముల్ బలంబు వ్యవ ♦ సాయము కౌతుకముల్ దిటంబు ను
త్సాహము ధైర్యముం గడిమి ♦ సర్వ మడంగెన యంచు సేన సం
దేహము నొందునంతఁ గపి ♦ ధీరుఁడు దారుణముష్టి దేవ సం
దోహము మేలు మేలని ను♦తుల్ పొనరింపఁగ వ్రచ్చె శీర్షముల్. ౧౬౫౯

తే॥ నేలకుం దాఁటి నీలుండు♦నిలుచునంతఁ, బొరలు నెత్తుట నేనుంగు♦పూఁడిపోవ
మింటనిలిచి యున్మత్తుండు♦మించియర్ధ, చంద్రసాయకంబులను వ♦ర్షముగ గుప్పె.

తే॥ నీలుఁ డూడఁదీసిన వజ్ర♦నిభ రదముల, నసుర సేయ నాతఁడు నొక♦యమ్ముచేత
వానినడఁచి వేఱొకతూపు♦తోన నీలు, నురము నాటఁగ నేసి బి♦ట్టఱచి యంత.

తే॥ వేఱు దంతిపై నెక్కి యొ♦ప్పారవచ్చె, వచ్చినం గని నీలుండు ♦ వానిమీఁది
కెగసి వింటితోఁడను వానిఁ♦దిగిచి యిభము, ముందునుంచె నుంచఁగ♦నది♦ముమ్మరించి,

తే॥ క్రుచ్చి కొమ్ములతోఁ గాలఁ♦ద్రొక్కి కరము, తోడనెత్తి విసరివేయ♦దుండగీఁడు
తప్పి చావక కోపంబు♦తటమటింపఁ, దనగజంబును తానె చిం♦దఱలుచేసె.

తే॥ అంత నీలుఁ డున్మత్తు ను♦రోంతరమున, బలిమిఁ బొడువంగ నెత్తురు♦బొళుకు బొళుకు
మనఁగఁ గ్రక్కుచు గ్రుడ్లుముం♦దునకునుఱుక, విలవిలందన్నికొనుచును♦పృథివినొఱఁగె.

—: బలమత్తుఁడు ఋషభునిచేఁ జచ్చుట :—

సీ॥ అన్నచావుంగని♦యత్యాగ్రహంబున, బలమత్తుఁడను మహా♦బలుఁ డొకండు
మృత్యువె తన్నిద్వా♦మించి యసత్యంబు, కంటె ఘనంబైన♦యొంటెతోడ
నరభసమునఁ బిశాచములు పూన్చిన తేరి, పైనెక్కి జగములు♦భయమునొంద
నఱచుచుఁ బిడుగుల♦తెఱఁగున వడివడి, శరములేయుచు వన♦చరులఁ దఱుమ
తే॥ ఋషభుఁ డెదిరించి కడు హుంక♦రించి నిలువు, మనుచు నదలింప దైత్యుఁ♦డాలిగొనుచు
నీవు పిన్నవాఁడవు చేవ♦నిన్ను గెలిచి, కలుగు దొడ్డపేరెయ్యది♦తొలఁగుమనుచు.
తే॥ మంతుకెక్కిన యాహను♦మంతుఁ బిలువు, రాముతమ్ముని పిలువుమా♦రణజితులను
చంపు పిదప మీపైఁగోప♦గింపఁదగును, పొమ్ముపొమ్మన ఋషభుండు♦పోలఁజూచి.

చ॥ పీనుఁగులన్ భుజించి మను♦పీనుఁగులంగొని నోటిక్రొవ్వుతోన్
మానుగ గెల్వవచ్చితివె? మందుఁడ! రోగమునొంది మందు సుం
తేనియు రోయకుండు మతి ♦ హీనుఁడ! లక్ష్మణుఁడేలరా? మరు
త్సూనుఁడునేల? నన్గెలుచు♦దోర్బలముండినఁ జూత మవ్వలన్. ౧౬౬౭

ఉ॥ పాఱక నిల్వుమంచు వెఱ ♦ పాఱక పల్కఁగఁగాంచి దైత్యుఁడున్
పాఱెదవంచు నెంచితిని ♦ పాఱక ధీరునిమాడ్కిఁ గాఱులన్
మాఱుగఁ బల్కుచుండిన న ♦ మానుషలీలల నాటలాడెదన్
మోఱకు! పోకుమంచు విలు ♦ మోపును బొమ్మలు లీల వంచుచున్.

సీ॥ పదిఱొమ్ము నాటంగఁ♦బరపి పదింట దే, హంబెల్ల రక్తమ♦యంబుసేయ
ఋషభుఁడు కడుఁజెల♦రేఁగ రక్కసుతేరు, బలిమిమై జలధిలోఁ ♦ బడఁగవైవ
బలమత్తుఁడును నీటఁ♦దలక్రిందుగాఁబడి, యిలుగక కలనికి♦నెగసిరాఁగ
నెగడెదవే యని♦నిశి నెదిరించిన, పగలు నా ఋషభుండు ♦ వానిఁబట్టి
తే॥ బాహుబలమున నలఁపంగఁ♦బచ్చిరక్త, మొడలనవరంధ్రముల వెలు♦వడియె; వాఁడు
మిడుక కట్టులే జీవముల్♦వెడలఁ బుడమిఁ, బడియె విల్లందిన నగంబు♦పడిన పగిది.

—: సుగ్రీవుఁడు కుంభుని చంపుట :—

మ॥ కినుకన్ వేఱొకచోటఁ జేవమెయి సు ♦ గ్రీవుండు కుంభుండు త
ద్రణ రంగమ్మునకే వినూతన మహా ♦ ద్ధత్యంబు సేకూర్చుచున్
దనుజుల్ నేల్పులు వానరుల్గని ప్రమో♦దంబుం భయంబొంద వీఁ
కను పైపై విజిగీషులై పెనఁగి రా♦కంపింప భూభాగమున్. ౧౬౭౦

క॥ కేసరులఁబోలి కిట్టుచు, మాసరముగ రుధిర మడర♦మలయుచు గాసిన్
వేసరక వీరగుణములు, భాసురముగఁ బోరి రుగ్ర♦బల దర్పములన్. ౧౬౭౧

క॥ కుంభుఁడు దండము ద్రిప్పుచు, నంభోరుహ మిత్రసూను♦నడిచె నతఁడు సం
రంభమున నొక్క తరువున, స్తంభింపఁగనేయ రెండు♦ధర విఱిగిపడెన్ ౧౬౭౨
క॥ సహియింపక చంపెదనని, మిహిరసుతుం డదను పొంచి ♦ మీఱి నిలువ తే
ని హితము కోరిన నీలుఁడు, మహీరుహము నొండు తెచ్చి♦మానుగ నిచ్చెన్.
క॥ దానిఁగొని పూన్కితోడను, వానరనాయకుఁడు వాని ♦ వక్షము పగులం
గానడిచె బలముకొలఁదిని, దానవతతి కలఁత చెంది♦తడఁబడి పాఱెన్. ౧౬౭౪
క॥ దెబ్బదినిన కుంభుఁడగిని, గుబ్బతిలన్ వజ్రహతిని♦కూలు నగము నా
గొబ్బునఁ బడెనని వానరు, లుబ్బినతఱి లేచి దనుజుఁ♦డుడుకుచు నెదలో.
క॥ భుజములపైఁ గొట్టిన నం, బుజమిత్ర సుతుండు నొచ్చి♦పోఁడిమిమై బా
ణ జవంబునఁ బఱచుచుఁ గ్రతు, భుజువైరియురంబు ముష్టిఁ♦బొడిచెం బెలుచన్.
క॥ అలపును సొలపును కానక, గెలుపోటము లేర్పఱించి ♦ కించిత్తేనిం
దెలుప నశక్యంబగుక్రియఁ, జలమున విజయాభిలాష♦జగడించి రొగిన్. ౧౬౭౭
క॥ పిడికై మదగజములు రెం, డెడయక పోరెడి వితాన♦నిరువురుఁ బెలుచన్
బొడుచుచుఁ బొడువుమనుచు నెడ, విడుపింతయు లేకయుండ్రి ♦ విజయశ్రీకై.
క॥ అమ్మాడ్కిని ముమ్మరముగఁ, గ్రమ్మిన సమరమ్ము జరుగఁ ♦ గమ్మరి దిమ్మన్
నమ్మోటపోటన దనుజు ను, రమ్మును కపిరాజు గ్రుమ్మె ♦ వ్రయ్యలుగాఁగన్
తే॥ అపుడునారక్కసుండు న♦న్నాలిగొండు, వా యనుచునవ్వ సుగ్రీవు ♦ నైదుతలల
పాముబోలిన హస్తమ్ము♦వానినోటఁ, జొచ్చి యసువులెడల నాల్కఁ ♦ బుచ్చివైచె.

—: నికుంభుని హనుమంతుండు కూల్చుట :—

తే॥ అన్నగతిగాంచిన నికుంభుఁ♦డాగ్రహించి, కదలె దెచ్చటికని కపి♦కాంతుఁ గదియ
నంతవానికి నంగదుఁ♦డడ్డుపడియె, నిరువురకు ఘోరముగఁ బోరు♦జరగె నపుడు.
క॥ శూలముగొన్న నికుంభుని, వాలిసుతుఁడు తాఁకెఁ దాల ♦ పాదపకరుఁడై
నీలగిరిపైకిఁ గాంచన, శైల మ్మురవడిని దూఁకు♦చందము దోఁపన్. ౧౬౮౨
క॥ శూలము దనుజుండెత్తఁగ, నాలో నంగదుఁడు మడియు♦నని జడియుచు వా
తూలసుతుఁ డేచి జ్వాలా, మాలా భీలాగ్ని కరణి♦మండుచుఁ దాఁకెన్.
క॥ తాఁకి మరుత్సుతుఁ డమరా, నీకప్రభు వజ్రమనఁగ ♦ నెగడిన ముష్టిన్
రాకాసి నికుంభుని తల, జోకం గడుపునకు డిగ్గఁ ♦ జొప్పించి చనెన్. ౧౬౮౪
క॥ మిగిలిన దనుజులకుఁ గపులఁ, దగిలెడి సత్త్వంబులేమిఁ ♦ దత్తఱపడుచున్
దిగులూని పఱవ వెనుకం, దగిలి కపీశ్వరులు సదమ♦దము చేసిరొగిన్. ౧౬౮౬
క॥ పరుగిడి గవని నరుగు తొం, దరచేఁ ద్రొక్కుళ్లుపడుచు♦దనుజులు పెక్కం
డ్రురలిరి శిబిరములకుఁ జని, కెరలిరి పెక్కండ్రు పుండ్లు♦కెలయుట కతనన్.

క॥ నోరెండఁగ నిలుకడచెడి, నీరెండని వేఁడి యసువు♦నీగినవారల్
దారి గనలేని క్రియఁ గ, న్నీరొలుకఁగఁ జచ్చు యామి♦నీ సంచారుల్. ౧౬౮౭

క॥ నింగికెగసి చని యసువులు, గ్రుంగఁగ నటనుండి మలల ♦ కోవునఁబడు వా
రంగము లవియఁగఁ గ్రేవులు, తొంగ ధరకు వ్రాలు నపశ♦దులు పెక్కండ్రుల్.

క॥ పరిచితులఁగాంచి దయ నీ, శరములఁ దీయుఁడన వారు♦నడలింప ననూ
త్కరము విడుచువారలు నుం, దిరముల బంధులకు గుర్తు♦తెలియనివారల్.

క॥ హరు లురలఁగఁ దడఁబడుచుం, గరులు దొరల ధరణిఁబడుచుఁ♦గాలెడు మలల
న్నొరిసెడు నరదంబులలోఁ, దిరుగుడువడి యిచ్చవడుచుఁ♦దెరలెడివారల్. ౧౬౯౦

సీ॥ గాయమ్ములొందిన♦కాయమ్ముల బరువు, మోవఁగాఁజాలక♦మూల్గువారు
వానరవేషులై♦దానవు లరుదేరఁ, దమవారి మోఁదఁగా♦సమయువారు
కనువిచ్చి యిండులఁ♦కడ దిగువారు చు, ట్టల జల మిమ్మని ♦ తెలచువారు
గ్రాగి చచ్చినవారు♦గ్రాగ నుంకించి యు, స్లే తేటిచూచుచు♦నిలుగువారు
తే॥ పుత్రులను మోచికొని వడిఁ బోవువారు, ప్రాణములు త్రోవలో విడఁ♦బాటువై చి
కనులు చెడ దారిదప్పి త్రొ♦క్కటము పడుచు, నడవలేక యట్టులె పడి♦ముడుఁగువారు

క॥ ఆ తెఱఁగుగాంచి పాటిన, దూతలు తడఁబడుచు వడిగఁ♦దో తెంచి సురా
రాతి పదంబులపైఁ బడి, యేతీరునఁ దెలుపుటనుచు♦నేడ్చిరి పెలుచన్. ౧౬౯౨

క॥ జరిగిన దేమని రాక్షస, వరుఁ డడుగన్ వారు మీరు ♦ పంపిన సేనన్
మరలిరి కొంద ఱనంగాఁ, దెఱఁగు వడదు నీదు సుతులు♦తీఱిరి దేవా! ౧౬౯౩

తే॥ అనుడు బాష్ప ప్రవాహ మ♦నర్గళముగ, విడిచి దుఃఖంబు మానంబు♦వీర మధిక
చింత కరుణ మదము కిన్క♦చిక్కఁగొనఁగ, రావణుఁడు భంగయుత వారి♦రాశిఁబోలె.

చ॥ కడలనుగాంచు వేలుపులఁ ♦ గాంచును వచ్చిన నిందఁ గాంచుఁ జే
యుడిదముఁ గాంచు నగ్గలిక ♦ హస్తముల న్నలఁచున్ ముఖంబు చే
ద్పడ వడినూర్చు నేడ్చు నగు ♦ వందురు సిగ్గిలుఁ గుందుఁ గూలు గ్రమా
న్పడు వెగడొందు బెండువడు ♦ వావిడుచున్ వనరుం గుమారిలున్.

చ॥ పుడమిఁ బెకల్పఁగాఁ దలఁచు♦వ్యోమముఁ గూల్పఁ దలంచుఁ బ్రాణులన్
బొడిపొడి సేయఁగాఁ దలఁచు♦బోటుల నెల్లరఁ గ్రుంపనెంచుఁ బె
న్జిడిముడిపాటుగాంచు మఱి ♦ చేష్టలుదక్కను పుంటిమీఁద ని
ప్పిడిన తెఱంగునన్ మది వ ♦ హించును పొక్కను ఱోలు బెగ్గిలున్

—: ధాన్యమాలిని రావణు నిష్ఠురోక్తులాడుట :—

ఉ॥ అచ్చట నున్నవారు పలు ♦ కాడక యూర్పులుపుచ్చ కెడ్డలో
ముచ్చిరుచుండ నచ్చటికి ♦ మూర్తి వహించిన దుఃఖమో యనన్

వచ్చిన ధాన్యమాలిని స్వ ♦ భర్తృపదంబుల వ్రాలె గ్రక్కునం
బొచ్చెములేని ప్రేమమయుఁ ♦ బుత్త్రకుఁ గోల్పడు కుందు నోర్వమిన్.

ఉ॥ గాజులు హారవల్లులును ♦ కంకణముల్ మొరయంగ ఫుల్ల పం
కేజ సుగంధి వక్షమును ♦ కేలఁ దొడింబడ బాఁదుకొంచు ని
స్తేజపు మోముపైఁ దుఱుము ♦ శీర్ణతనొంది పడంగ జాలికే
భాజనమైతి నంచు ధర ♦ పైఁ బొరలాడె భుజంగికైవడిన్. ౧౧౯౮

చ॥ ఇతరులకేని దుఃఖమది ♦ యెట్టిదొ నేరని కోమలాంగి దుః
ఖితయయి సర్వలోకములు ♦ కీడ్పడఁ గ్రుంగినరీతి నెంచుచున్
బతి వదనంబు గాంచుఁ దన ♦ పట్టిని మింగితివంచు నేడ్చు నా
వెత లుడుపంగ నేరు పృథి ♦ విం గలరంచుఁ దపించు నార్తమై. ౧౧౯౯

మ॥ బలవద్వీరుల దోర్బలం బని సడం ♦ పన్ లేవా? నీవీర్యమున్
జలధిం బూఁడెనొ? నీబలంబు చెడెనో? నాపల్కు లింతేని వీ
నులఁ జొప్పింపవొ? నమ్మతింపవొ వినన్? గూయిన్ విచారింపవో?
కలఁకం బొత్తిన కంటిపాప మరలం ♦ గాన్పింపవో? కానవో? ౧౨౦౦

మ॥ పురుహూతుం బవరంబునం గెలుచు స ♦ త్పుత్త్రుం గనన్ ధన్య యీ
తరుణీరత్న మటంచు నెల్లరును స్తో ♦ త్రం బొప్పఁగాఁ జేయఁగా
గరువంబొందినదాన నాకొడుకు లో ♦ కంబెల్ల హాహా యనన్
నరుఁ డొక్కండు వధించెనే? విధియు దు ♦ ర్న్యాయంబు పాటించెనే?

చ॥ కడచనె మున్నె యక్షుఁ డతి ♦ కాయుఁడొ యిప్పు డడంగె వీరులున్
మడిసిరి కుంభకర్ణుఁడును ♦ బ్రమందెఁ గుమారులలో సజీవియా
కొడుకొక యింద్రజిత్తె యిఁకఁ ♦ గూలును రేపట నంతమీఁద నొ
త్తిడి యొకరుండవే కడిమి ♦ దిగ్విజయం బొనరింప కుందువే? ౧౨౦౨

తే॥ గిట్టినట్టి సోఁకుల బ్రతి♦కింపఁగలవె? బుద్ధిచెడి కామివగు నీవు♦పుడమిమీఁద
బట్టగట్టుక యింకను♦బ్రదుకఁగలవె? సీతవలన మిగిలియున్న♦చెట్ట గలదె? ౧౨౦౩

చ॥ అనుపమ నీతిశాలి సుగు ♦ ణాకరుఁడైన విభీషణుండు ప
ల్కిన పలుకుల్ గణింప కవ ♦ గీర్ణ బలాఢ్యుని కుంభకర్ణు నా
తనయుని శత్రు శాత శర ♦ తండము పాలొనరించి నెమ్మదిం
గని పయి రాజ్య మేలుదువె? కాకులు గూబలు కూయుచుండఁగన్.

చ॥ అని పలురీతులం బలికి ♦ యున్నవ పిట్ట విధంబునన్ విలా
పన మొనరించి క్రేపు నెడఁ ♦ బాసిన ధేనువుభాతిఁ గుందుచున్
వనరెడు ధాన్యమాలినిని ♦ నాక శుభాంగులు కేలమీఁద నొ
య్యనఁగొని రాణివాసమున ♦ నాదటఁ జేర్చిరి కుస్తరించుచున్. ౧౨౦౪

తే॥ లంకలోఁ గల యసురు లె♦ల్లరును స్త్రీయు, పుత్త్రుఁ డీల్గిన చందానఁ♦బొగిలినారు
వేల్పు చెలులును నెనరున♦వెక్కినారు, తక్కువారల చింత లె♦త్తంగనేల ?
తే॥ కోసలము వీడి కానకుఁ♦గౌసలేయు, డేగుతఱి జనించిన దుఃఖ♦మెనసె లంక
నగరమందు గల్గిన దుఃఖ♦నాద మపుడు, పున్నమను వార్ధి ఘోషంబు♦పోల్కి నెగడె.

౧౮ నాగపాశ పటలము. (300)

తే॥ తలకు నొక వేసముగ దైత్య♦తరుణు లేడ్వఁ, గాంచి కారణ మెఱుఁగక♦కళవళించి
యింద్రజితుఁడు శంకించి దై♦త్యేంద్రుకడకు, నడచె నురవడి నశని చం♦దమున నపుడు.

మ॥ దెసలం గెల్చిన రావణుం డిపుడు కీ♦ర్తిం బూర్తి గోల్పోయెనో ?
అసువుల్ వీడెనొ ? మున్ను వచ్చి పుర దా♦హం బొప్పగాఁ జేయు గా
డ్పు సుతుం డంబుధితోడ లంక నిపు డు♦న్మూలింప యత్నించెనో ?
అసమానంబగు దుఃఖ మొందుటకుఁ గా♦ర్యంబేమి పాటిల్లెనో ? ౧౨౦౯

ఉ॥ ఏమి ఘటిల్లె నేఁడు వచి ♦ యింపుఁడి యం చెదురైనవారలన్
వేమరు ప్రశ్న సేయఁ బల ♦ వించి పడంకిరి కాని తెల్పమిన్
దామది సంకటంపడుచు ♦ దారుణవేగముతోడఁ బోయి క
న్నామెతగాఁగఁ గాంచె మది ♦ యంతట నెమ్మది చెంద రావణున్.

ఉ॥ కాంచి కలంక దేఱి కర ♦ కంజములన్ ముకుళించి యీ తట
స్థించిన దుఃఖ కారణము ♦ తేటపడం దెలుపుండి యన్న న
క్తంచర నాయకుం డనుఁ గృ ♦ తాంతుఁడు నీయనుజుం గ్రహించె ని
ష్కుంచితులైన కుంభుఁడు ని ♦ కుంభుఁడు నయ్యతికాయుతోఁ జనన్.

మ॥ వర ధానుష్కుఁడు మేఘనాదుఁ డటఁ ద ♦ ద్వార్తన్ వినం గన్నులం
గురు కోపాగ్ని విస్ఫులింగములు గ్ర ♦ క్కున్ వాతెఱన్ మూర్కొనన్
దురపిల్లున్ విదిలించు హస్తములఁ గుం ♦ దున్ దూపిలున్ గర్జిలున్
సురుగం దిక్కులు చూచుఁ జంపె నెవఁ డం♦చుం గాలఁ దాఁచున్ భువిన్.

ఉ॥ రాముని తమ్ముఁడుం బ్లవగ ♦ రాజు మరుత్సుతుఁ డంచుఁ దెల్పఁగా
నేమని పంపినాఁడవు న ♦ రేంద్రుల శక్తి యెఱింగియుండి యు
ద్దామ బలుండనైన నను ♦ దార్కొనఁ బంపక వారిఁ బంపి నీ
వే మరణంబు గూర్చితివి ♦ ద్వేషులు చంపి రనంగఁ జెల్లునే ? ౧౨౧౩

మ॥ సమరాజేయుని నాదు తమ్ముని ననిలోఁ ♦ జక్కాడు క్రూరాత్ము ర
క్తము తద్రంగమునందు తద్ధరణియే ♦ త్రావంగనీకున్న చో
సమరాధీశున కైదుమార్లు బల శౌ ♦ ర్య స్థైర్యముల్ వీడి యు
ద్ధమునం దోడుచుఁ బాఱువాఁడ నగుదున్ ♦ దైత్యేంద్ర చూడామణీ !

ఉ॥ క్రూర నగౌకసావళి స ♦ కుంఠిత శూరతఁ గొందికొంది సా
మీరి శిరంబు వ్రచ్చి కసి ♦ మీఱఁగ లక్ష్మణు కాలుసేతులం
గోరికఁ ద్రుంచి చిత్రవధఁ ♦ గ్రొవ్వక తక్కిన సమ్ముఖంబునన్
మోరల నెత్తు జంకు సుర ♦ ముఖ్యులు మిక్కిలి నవ్వకుందురే? ౧౭౧౫

చ॥ కడలిని దాఁటి జానకిని ♦ గాంచి వనంబును పాడుచేసి నీ
కొడుకును నేలరాచు నొక ♦ కోఁతిని దూతయటంచుఁ జంపకే
వెడఁగరి వౌచు వీడితివి ♦ వీడుట యింతకుఁ దెచ్చె బంధులం
గొడుకులఁ గోలుపోయితివి ♦ గోడివడెన్ సుఖ జీవితాయువుల్. ౧౭౧౬

—: ఇంద్రజితుఁడు శపథ వాక్యము లాడుట :—

మ॥ ఇఁకఁ జింతించియు లాభమేమి? మఱి ని ♦ న్నేమన్న మేలేది? వా
రక యాలోచన చేసియున్ ఫలమె? సంగ్రామంబునం దమ్ము నం
బక సంఘాతము పాలుచేసిన గుణ ♦ భ్రష్టాత్ము సౌమిత్రిఁ జం
పక లంకాపురిఁ జేర నేబ్రదుకు సం ♦ భావింపఁ జిత్తంబునన్. ౧౭౧౭

శా॥ నాగాస్త్రంబును ఖడ్గ పాశుపతముల్ ♦ నాణెంబుగాఁ గాచుచున్
భోగంబుల్ గొని కాలముం గడపు నా ♦ పోరం దదస్త్రంబు లు
ద్యోగ ప్రోద్ధతి నాకుఁ గానివయినన్ ♦ దుర్మృత్యువుం గొందు నీ
రాగ ప్రక్రియ సర్వమున్ విడిచెదన్ ♦ బ్రాయోపవిష్టుండనై. ౧౭౧౮

మ॥ అతికాయ ప్రియజీవ హారకు నుప ♦ ర్యాదు ల్గనన్ సంగర
క్షితిలోనుండి వియత్పథాన యమరా ♦ ద్గేహంబునం బ్రీతిమై
నతిథి ప్రక్రియ లందఁగాఁ బనుపకే ♦ వ్యర్థుండనే యైన నీ
సుతుఁడం గానిఁక విల్లు మోఁతకొఱకో? శోభాకృతిం జూపనో?

చ॥ అని శపథంబులాడు సుతు ♦ నక్కునఁ జిక్కఁగఁ జేర్చి రావణుం
డనునయ మార నిట్టులను ♦ నయ్యవు నీకు నసాధ్య కార్యముల్
పనిగొని చూచినం గలవె? వారని పుత్త్రక చింత దీఱ నీ
వనిఁ బగఱన్ వధింపఁగల ♦ వంచు హృదంతరమందు నమ్మితిన్. ౧౭౨౦

తే॥ అనుచుఁ బలికిన తండ్రికిఁ ♦ దనయుఁ డెఱఁగి, తూణములు నభేద్య కవచ ♦ బాణ ఖడ్గ
దృఢ శరాసనాదికములు ♦ తీరుగాఁగఁ, దాల్చి బయలుదేఱెను భయ ♦ దంపు ఠీవి.

తే॥ కమలజుఁడు చింత యించుక ♦ గలుగకుండ, వజ్రగిరిగొని కావించి ♦ వజ్రి కిచ్చె
నాథనువు వాని గెల్చిన ♦ యదనునందు, మేఘనాదుండు గొనియె న ♦ మోఘగరిమ.

తే॥ ఇంద్రుఁ జెఱనుంచినప్పుడె ♦ యింద్రజితుఁడు, కడఁకఁ గైకొన్న వేనిషం ♦ గములుగూడఁ
దఱుఁగుఁగాక యంబుధి యవి ♦ తఱిఁగిపోవు ♦ యమునిగుహఁబోలి నట్టివా ♦ యుంపదొనల

తే॥ తొల్లి యమరు లొనర్చిన♦దురము వేళ, కొండ విలుకాఁడు నలువ త♦క్కుంగలట్టి
యధికు లొసఁగిన పెక్కుది♦వ్యాయుధముల, నపుడు కైకొనె రావణి♦యనువుకొఱకు.

తే॥ పొలుచు క్రొత్తలంకాపురిఁ♦బోలినయది, శరభములు వేయి వేయి కే♦సరులుపూన్పఁ
బడినయది వేల్పులకు భంగ♦పఱుపరాని, దైన తేరెక్కె దైత్యేంద్రు♦నగ్రసుతుఁడు.

తే॥ కనక రథమన్నఁజాలునే? గరుడునకును, వృషభమునకును భయదమై♦వెంట నడచెఁ
గాక యొక్కనాఁడును ముజ్జ♦గంబులందు, ముందునడచిన యదికాదు♦పొడవు తేరు.

తే॥ చతురతం జూపి బవరంబు ♦ సలిపి వజ్రి, బలముక్రుంగ బంధించిన ♦ వలఁతివచ్చె
వచ్చెనని పిశాచాదులు♦వలచియాడు, గుఱుతువడ్డ టెక్కంబుచేఁ ♦ గొఱలు తేరు.

చ॥ బలయుత కాలకేయ వర♦వాహిని గగ్గులకాడుగా వడిన్
న్నలఁచిన చక్రముల్ త్రిదశ♦నాయకు పృష్ఠము గాయమొందఁగాఁ
జలిపిన మొగ్గలం గలిగి ♦ జానగు తేరది దిగ్గజంబులన్
గలఁచుచుఁ బాఱఁదోలినది ♦ గా వివరించుట గారవార్హమే? ౧౭౨౮

తే॥ అఖిలసురుల వీఁపుల గాక♦యాననములఁ, గనని యింద్రజిత్తట్టి స్యం♦దనము నెక్కె
తేరు లొకవేయి చుట్టిరా♦వీరసమర, దోహలత తేటమోమునఁ♦దోఁప నరిగె.

తే॥ వానితో నడచిన సేన ♦ వరుస లెక్క, పెట్టి తెలుపంగఁ దరమానె ♦ వినుతచరిత
విదుఁడు వాల్మీకి నల్వది♦వెల్వాలనుచుఁ, దెలిపె వేఱేరు లెక్కించి♦తెలుపువారు?

సీ॥ ధూమ్రనేత్రుఁడు రణ♦దోహలుండగు మహా, పార్శ్వుండు తేరి కా♦వలియొనర్ప
ఛత్రంబు పైనొప్ప ♦ శంఖాది రవములు, ఘనభోంతరముల ♦ బోరుకొనఁగ
లక్ష తేరులు చుట్టి ♦ రక్షయై రా వాని, కినుమడి గజములు♦వెనుక నడవ
మోహరించిన గుఱ్ఱ♦ముల గుంపు వెంటరాఁ, గాలిబంటులు ముందు♦గాఁగ నరుగ
తే॥ వీరవర్యుండు లంకాధి♦విభుని కొడుకు, శస్త్ర విజ్ఞాని మాయా వి♦శారదుండు
దురము లందారి తేఱిన♦దోర్బలుండు, జిత దిగీశుండు సంగ్రామ♦సీమఁ జేరె. ౧౭౩౧

మ॥ అతికాయుండు వధింపఁగాఁబడిన ప♦ల్కాలించి కోపంబుతో
దితిజాధీశుఁడొ గోత్రభిజ్జితుఁడొ యే♦తెంచెన్ రణ క్షోణికిన్
గృతహస్తుల్ రణకర్కశుల్ రిపుఁ గా ♦ ఓంపగ నానంచెదం
గుతుకంబారఁగ లక్ష్మణుండు నిలిచెన్♦ఘోరాహవ స్థానలిన్.

శా॥ వీరశ్రేష్ఠుఁడు లక్ష్మణుండు కని దో♦ర్వీర్యోద్ధతిన్ భూరి తూ
ర్యారావంబులతోడ వచ్చె నెవఁడా♦హంవీరుఁడన్నన్ మహో
దారుండైన విభీషణుండను మహా♦త్మా! ధీరమల్లుండు పా
కారిం గెల్చిన శూరుఁ డింద్రజితుఁడన్♦ఖ్యాతాభిధానుం డిలన్. ౧౭౩౩

ఉ॥ వాహిని నాయకుల్ ప్లవగ♦వారము రక్షణసేయ నెల్లరన్
వ్యూహముగాఁగ నిల్పి బల♦యుక్తిని పోరుటమేలు నేఁడు నం

దేహము లేదు విగ్రహము♦తీవ్రతరంబగు నిర్ణయించి ని
ర్వాహక పద్ధతి న్నడప ♦ భావ్యమగుం దలపోయు లక్ష్మణా! ౧౭౩౪

సీ॥ కీర్తిభూషణ! మన♦కీశ నాథుండును, జాంబవంతుండు కే ♦ సరి సుతుండు
వాలిపుత్త్రుండును ♦ నీలుండు తదితరుల్, నీతోడ నిలువంగ ♦ నిర్ణయింపు
లెక్కలేని సురలు ♦ ప్రక్కబలము గాఁగ, నిలిచిన యింద్రుండు ♦ నిలువలేక
యమృత బలంబున ♦ నసువుల దక్కించు, కొని బైటఁబడి బ్రదికెను నిజమ్ము

తే॥ వాసవుని రెట్టలం గట్టు♦వాఁ డిలఁకను, మాయ లేదు మాయవు హను♦మంతుఁ గూడఁ
గట్టినాతండు తగ వాని♦కార్ముకంపు, విద్దె నేర్పును వర్ణింప♦విలుగలదె? ౧౭౩౫

తే॥ అనుచుఁ బలుకంగ లక్ష్మణుఁ♦డనుమతించె, నంత మతిమంతుఁడగు హను♦మంతుఁ డెదను
చింతచేసి సౌమిత్రిపై ♦జిష్ణుజితుఁడు, వచ్చెనని పదటంబున♦బయలుదేఱె ౧౭౩౬

తే॥ శమనుఁడును కనుల్మూయంగఁ♦జాలియున్న, దనుజ సేనా భయంకర♦త్వంబు గాంచి
యింద్రజితుని సాహసకార్య♦మెఱిఁగి గాలి, పోలికను వచ్చి చేరెను♦గాలికొడుకు.

తే॥ అచ్చటనె మున్నె యుండినాఁ♦డంగదుండు, తక్కు దళపతు లచటికిఁ♦దాసినారు
సేనలం ద్రిప్పఁ గపిరాజు♦చేరినాఁడు, వరుసలుగఁ దీరి నిలిచెను♦వనచరాలి. ౧౭౩౮

క॥ కోపావేశము పొంగఁగ, నేపారుచు నెదుర నెదుర ♦ నేగెడి సేనల్
దీపించు రెండు జలధులు, కోపున యత్నించి తాఁకు♦కొమ్మరై తోఁచెన్. ౧౭౩౯

క॥ కనులు మనసు గలిగిన ఫల, ముసు సంపూర్తిగనె నేఁడు♦పొందఁగనగు నం
చనువుగ స్వర్గము బీడుగ, వనితలతో నిండి రమర ♦ వర్యులు నింగిన్. ౧౭౪౦

తే॥ రెండువాఁగు లొండొంటితో♦రెచ్చి తాఁకు, నెడల వీరగర్జనలు ఘీం♦కృతులు హేష
లబ్జఘోషముల్ వివిధ తూ♦ర్యమ్ము లడరి, వేలుపుల మూసికొనఁజేసె♦వీనుదోయి.

క॥ పట్టుఁడు కట్టుఁడు కొట్టుఁడు, తిట్టుఁడు నఱకుండు తినుఁడు♦త్రెంపుఁడు పొడువుం
డిట్టులముగ నేయుం డను, నిట్టి రవము శింజతో జ♦గము వడఁకించెన్. ౧౭౪౨.

క॥ తగులుటచే నంగంబులు, పగులుటచే మేన నుచ్చి ♦ పాఱుటచేతన్
నొగులుటచేఁ గూలుటచే, నెగులునఁ జలియించె ధాత్రి ♦ నిలుకడ చెడఁగన్

తే॥ ముసల ముద్గరాదులచేత♦మురియు తలలు, ఖర కరాసులచేఁ దెగి♦దొరలు తలలు
కదనరంగంబు నిండంగఁ♦గపుల వపువు, లురలె నటియించె విలవిల♦ధరణిఁ దన్నె.

క॥ పచ్చడియగు మస్తకములు, విచ్చిన మేనులను నెత్రు♦వెల్లువలం దా
కచ్చుగ మండెడు నడవిని, పచ్చి విటపములను పోలి♦పఱపై యుండెన్ ౧౭౪౫

తే॥ కఱకు రాకాసులం బట్టి♦కాలఁదన్ని, కేలనెత్తి నేలకు మోఁది♦తోళ్లు లొలిచి
మెడలు కొఱికి త్రోఁచియు రాచి♦నడుము విఱిచి, యతిశయోత్సాహ మంది
పె ♦ ల్లార్చెఁ గపులు. ౧౭౪౬

తే॥ తలలు ద్రెంచి కాళ్లులు ద్రుంచి♦ తఱిమి నఱకి, యీఁటెలం దూఁటి పోటుల♦ నెసక మడఁచి
కోఁతిమూఁకలఁ బెక్కంటిఁ♦ గూలఁ ద్రోచి, పొలసుదిండుల తండముల్ ♦ చెలఁగి యార్చె.

తే॥ కోఁతులను పేరఁ జను యమ♦ దూతలపుడు, వాలపాశంబు లురివైచి♦ వ్రేలనెత్తి
వ్రాలమోఁది దిగ్గిరఁ ద్రిప్పి♦ నేలఁ దాఁచి, పెక్కువిధముల వారి యూఁపిరులఁ గొనిరి.

తే॥ కాంతి నిలయమై నిప్పులు♦ గ్రక్కు కనుల, కోఁతిమూఁకలు తరులతోఁ♦ జేతులు తెగ
మేన బాఁకులు తూఱంగ♦ మిడిసిపడియె, వారి కుత్తుకల్ గొఱుకుచు♦ వారితోడ

తే॥ పడవ సేయు భల్లూకములు♦ పిడుగులట్లు, మెఱసి చని యేనుఁగులఁ జీల్చి♦ మెదడు నాని
తృప్తిగా శోణితము ద్రావి♦ ప్రాప్తలాభ, మున ముదంబంది జఠరాగ్ని♦ నణఁచికొనియె.

తే॥ రూపమున బలమున విని♦ రూఢి నొందు, ప్లవగములు దొడ్డతేరుల♦ పైకి మత్త
కరులపైకి హరులపైకి♦ శరులపైకి, నాయుధములపైఁ దలలపై♦ నరసి దుమికె.

తే॥ పీనుఁగుల తిప్పలందుండి♦ వెడలు రుధిర, వాహినులు పీనుఁగులఁ గొని♦ వనధిఁ జేరి
యచటి జలచరములకు నా♦హార మొసఁగెఁ, దెచ్చియిచ్చు నుదారుని♦ తెఱుఁగు నాని

తే॥ హనుమ కరములఁ గిరులచే♦ నఱవత్రైన, యసుర సేనలోఁ జెక్కుముల్ ♦ హరులు విండ్లు
గదలు కుంతముల్ తేరులు♦ కరులు ముక్కు, మొగము గనరాని తీరున♦ మురిసి వ్రస్సె.

తే॥ అంగదుఁడు వృక్షముల మోఁద ♦ నడుము నందు, పూఁడు కరులును హరులును ♦ పొలసు దిండ్లు
నైన యెడ యముఁ డింతయు♦ నదరులేక, తప్పినా జీవులని కేలఁ♦ ద్రవ్వి చూచె.

తే॥ నాల్గు విధముల సేనలు♦ నలఁగి కుప్ప, గూరిన రణస్థలిం గని♦ గొప్పఋషులు
పూర్వదేవాసురాజితోఁ♦ బోల్చి చూచి, దీని కది సరిగాదని♦ తెలిపినారు. ౧౭౫౫

చ॥ ఎడయక సోఁకుమూఁక తల ♦ యెత్తెను వానరసేన పీఁపులం
దడవుచుఁ బాఱఁజొచ్చెఁ గపి ♦ నాయకు లడ్డమువచ్చి పోరినం
జడిసినవారు క్రమ్మఱని ♦ జాడను కాంచి హసించి దూఱినం
బెడమఱలేదు వెల్లినదె♦ వేడ్కగఁ బోయినతీరె పోకగన్. ౧౭౫౬

—: వానర సేనా నాయకుల సమరము :—

క॥ శూలము పరశువు చేకొని, వాలిన లయ రుద్రుఁబోలి♦ పాదప కరుఁడై
నీలుఁడు నిలిచిన చోటనె, కాలుఁడు పాశము గడించి♦ కడఁక స్నలిచెన్. ౧౭౫౭

మ॥ జముఁ డధికార కార్యమును ♦ జాడగ పీడితినంచు భీతిలన్
గుముదుఁడు శత్రుసైన్యములఁ ♦ గుప్పలుగూల్చె నతండు వాయువో
యమృతమొ యగ్నియో యనఁగ♦ నార్చెను ముంచెను మాడ్చె రెండు హ
స్తముల నొనర్చె నిట్టులన ♦ సారెకు వర్ణన సేయ నెట్లగున్ ? ౧౭౫౮

చ॥ ద్రుమముల రాముతూపు తొలి ♦ తూపరముంచిన దేడుచెట్లు; లో
కమునఁ బ్రసిద్ధిఁ జెందిన న ♦ గమ్ములు నేడు; యడంచి మోఁదుటల్
తేమలక యుప్పుటల్ తలఁపు ♦ తీపగు నా ఋషభుండు వైచు వృ
క్షములకుఁ బర్వతంబులకుఁ ♦ గాంచఁగ లెక్కయె లేదు భూస్థలిన్. ౧౨౫౯

చ॥ కరులును తేరులున్ హరులు ♦ గల్గి భుజంగముఁబోలి క్రూరులై
వఱలిన రేయి ద్రిమ్మరుల ♦ వర్గము లెల్ల నశించు నేఁడనం
దరువులు త్రిప్పిత్రిప్పి బెడి ♦ దంబుగఁ జంపెను జాంబవంతుఁ డ
ద్దిర! ముదియొందియుం బులుసు ♦ తింత్రిణి వీడునె? చేవ హెచ్చదే ౧౨౬౦

మ॥ కరి పాఠీనములున్ దురంగమ తరం ♦ గంబుల్ చలత్స్యందనో
త్కర నౌకల్ బహుళాయుధ ప్రకర మ ♦ త్స్య గ్రాహముల్ గల్గు క
ర్బురవార్ధిన్ బనసాఖ్య మందర మొగిం ♦ గ్రోధాహి పాశంబుతోఁ
దరువంజొచ్చె జయేందిరా వర సుధా ♦ ద్రవ్యానుభోగాప్తికై. ౧౨౬౧

సీ॥ వసదంబులం జీల్చి ♦ కొని యూర్ధ్వలోకముల్, డాయు సంపాతి జ ♦ టాయువులన
మైందుండు ద్వివిదుండు ♦ మలసిరి డేగలు, పారువంబులఁ జంపు ♦ పగిది దోఁప
గవయుండు కొలఁకును ♦ కలఁచు గజంబునా, దనుజసైన్యంబు ను ♦ ద్దనడిఁ గలఁచె
నిల్చిన కాలు గ ♦ దల్చక కేసరి, దైత్యేభ కుంభముల్ ♦ త్రవ్వుచుండెఁ

తే॥ గపికులేంద్రులు కదన మీ ♦ కరణిఁ జలుపఁ, ♦ బాఱినట్టి కోఁతులు వచ్చి ♦ పోరఁదొడఁగె
నిర్జరారుల సైన్యంబు ♦ నిలుకడ చెడె, నింద్రజిత్తది గని కోప ♦ మినుమడింప. ౧౨౬౨

—: ఇంద్రజిత్తు వానరులపైఁ గసిమసఁగుట :—

తే॥ బాహులుప్పొంగ దిక్కులు ♦ పర్వతములు, చెవుడుపడ నార్భ్రమోయించి ♦ చిందమొత్తి
వేలుపులు జగములు కపుల్ ♦ వెగడు పడఁగ, సింహనాదంబు సేసె ను ♦ త్సేకమొప్ప.

తే॥ అశనులును సిగ్గిలఁగ మ్రోఁగు ♦ నహి విషాభ, శరము లిన్నియుం చెన్నంగ ♦ నెఱుకపడని
యట్లు మితిమీఱి పరపి వి ♦ యత్తలంబు, నవనితలమును బాణమ ♦ యంబు చేసె

క॥ కపివరు లేసిన తరువులు, నుపలంబులు విఱిగి పొడిగ ♦ నుర్విని రాలెన్
గపుల తల లెగసి పడియెం, దపతపమని ధరణిమీఁద ♦ దండడి యగుచున్. ౧౨౬౩

క॥ మితిమీఱి వెడలు శరములు, కుతికల నురముల నొడళ్లఁ ♦ గూరుచు దుయ్యన్
దత బలులగు వనచరపతు, లతిశ్రమము నొంది తూలి ♦ రవనిం బడుచున్. ౧౨౬౪

తే॥ ఒక ముహూర్తకాలములోన ♦ నొక్క వెల్వ, చిఱికి చెదరి బీభత్సమై ♦ చెడుట తోడఁ
గొండలం దేరఁ బోయిన ♦ కోఁతుల తల, లురల మలల వైచుచు మేను ♦ లుర్విఁ బడియె.

తే॥ తలలు త్రెంచి దాఁటిన బాణ ♦ తతులు ఫణుల, కరణిఁ బాతాళమునఁ జేరె ♦ ధరణి యెల్ల
మిట్టపల్లము సమమను ♦ మేర లేక, బట్టబయలుగా రక్తంబు ♦ పఱచె వడిని. ౧౨౬౫

చ॥ తొలఁగక చూచుచోఁ గనులఁ ♦ దూఱుచు నిల్వఁగ ఱొమ్ము గ్రుమ్మచుం
దొలఁగఁగఁ దాఁటుచోఁ బదులఁ ♦ ద్రుంచు చదల్చిన నాల్క లూడ్చుచుం
దొలఁగిన వీఁపు గ్రుచ్చుచు వి ♦ దుర్చు శరీరములెల్ల వ్రచ్చుచున్
దలఁచు నెడందపైఁ బడుచుఁ ♦ దార్కొనె నింద్రజి బాణ సంహతుల్.

మ॥ శరవర్షంబున మధ్య నేర్పడిన దృ ♦ శ్యశ్రేణి నొండైన ని
ర్జరులున్ రీతిఁ జూడలేరయిరి నా ♦ రాచంబులం గూర్చి యే
యు రుతుల్ దక్క వినంగలేరయిరి మృ ♦ త్యు క్రూర భీతిన్ వనే
చరు లల్లాటముతోడఁ బాఱుటలె కాం ♦ చంజాలి రంతంతటన్. ౧౨౨౦

మ॥ ఎదురైనట్టి వనేచరుల్ తునుకలా ♦ టీక్షించి యుత్సాహులై
యెదిరింపంగలవారు లేమిఁగని లం ♦ కేశాగ్రసూనుండు దు
ర్మదుఁడై యూరక నిల్చె దూరగతుఁడై ♦ మార్తండపుత్రుండు బె
ట్టిదుఁడై సాల మొకండు చేకొనుచు ము ♦ ట్టెన్ వానరుల్ మోదిలన్.

మ॥ తమసేనం జెదరించుచుం దొలఁగు నిం ♦ ద్రద్వేషిఁ దా డాసి ప్ర
య్యాని రక్షావిధిఁ జుట్టుఁ గ్రమ్ముకొను క్ర ♦ వ్యాదుల్ భయభ్రాంతులై
వెనుకంద్రొక్కఁగ సాలమున్ విసరెఁ ద ♦ ద్వీర్యంబు మేలంచుఁ బా
ఱిన శాఖామృగ పూగముల్ మరలి పే ♦ ర్చెన్ సంగరోద్వృత్తిమై.

మ॥ తన చుట్టుంగల సైన్యముల్ చెదరుటన్ ♦ దైత్యేంద్ర పుత్రుండు రేఁ
గిన కిన్కంగని మేలుమేలనుచు నా ♦ ల్గింటం బదింటం బలం
బున ఫాలంబును వక్షము న్మొగులఁగా ♦ మూర్ఛిల్లఁ గా నేసి చే
తి నగంబున్ బలుముక్కలై యెగురఁ గ ♦ త్తించెన్ బ్రకర్షమ్ముగన్.

ఉ॥ అయ్యెడ వాయునందనుఁడు ♦ హాలహలంబు విధాన రేఁగుచున్
జయ్యన నప్పళించుచు భు ♦ జంబుల నెట్టెదురం గడంగి యీ
కయ్యము దీనితో ముగియుఁ ♦ గా! యని వేలుపు లార్వ రక్కసుల్
బ్రుయ్యఁగ నేసె నొక్కగిరి ♦ భూతము లార్వఁగఁ గోఁతు లుబ్బఁగన్.

మ॥ ఇభజి ద్విక్రముఁ డింద్రజిత్తు నగి భూ ♦ భృద్రాజమున్ దూల్చి యా
రభటిన్ మారుతిఁ గాంచి యిట్లను శర ♦ వ్రాతంబుఁ బాటింపకే
రభసంబార శిలా ద్రుమంబుల సమి ♦ ద్రంగంబునం గెల్తువే
ర! భళీ! చంపకమాన నిన్నన జగ ♦ త్ప్రాణాత్మజుం డిట్లనున్. ౧౨౨౫

మ॥ వెడఁగా! మాకడ నున్నవారలు ధను ♦ ర్విద్యా ప్రవీణుల్; మలల్
పడుకుల్ ప్రాఁకులతోడఁ బోరుటకు నేఁ ♦ బ్రాప్తించితి న్నీకు; నీ
కడు క్రౌర్యంబును నేఁట రేపట నడం ♦ గం బాఱుఁ గ్రొవ్వేలరా?
కడఁక న్నేర్చిన కొన్ని పద్ధతు లిటం ♦ గాన్పించెద న్నిల్వరా. ౧౨౨౬

శా॥ నాతోఁ బోరెదా? లక్ష్మణ ప్రభునితో ♦ నాశంబుగాఁ బోరెదో?
నీ తండ్రిం దలదన్న వచ్చిన జగ ♦ న్నిత్యాత్ముతోఁ బోరెదో?
నీతంత్రమ్ములు సాగవింక ననిలో ♦ నిర్విణ్ణత న్నిల్చి పైఁ
బ్రేతాధీశుని చూడఁబో మ్మిదియె ప్రా ♦ ప్తించు న్నిజం బిట్లెదన్.

మ॥ అనుడున్ శక్రజితుండు రోషమున నా ♦ రా! ప్రల్లదీఁడా? వృథా
చనఁ డీ రావణి నాదు తమ్ము ననిలోఁ ♦ జక్కాడి దర్పించు ల
క్ష్మణు నాజిన్ వధియింతు నన్న ప్రతినన్ ♦ సాధింపఁగాఁ బూనినాఁ
డను నాతో నెదిరించుటన్న నిలఁ జె ♦ ట్లం గట్టఁ బారాడుటా?

మ॥ విలు చేఁబూని యొకండనే నిలిచి మీ ♦ విర్వీరులన్ మిమ్ముఁ గా
కులకుం బారణ చేసెద న్నిజము మీ ♦ కున్ శక్తి లేదేని వే
ల్పులఁ బాతాళ నివాసుల న్నరులఁ బ్రా ♦ పుం గూర్చుకొం డాజి మీ
తలలం ద్రెంపక గెల్వుగైకొనక నా ♦ తండ్రిం గనం బోదునే? ౧౭౭౯

తే॥ అనుచు విలుగొని డెబ్బది ♦ యమ్ములేయ, మేన గుత్తులుగా నవి ♦ మేపుకొనఁగఁ
గొండవలెఁ జలింపక వాయు ♦ జుండు నిల్చి, కేల నొకగిరి గొని పల్కె ♦ గేలిగాఁగ.

చ॥ మదకరు లెన్నియేని యొక ♦ మాత్రపు సింగము ద్రోల నిల్చునే?
పదరక లక్ష్మణుం డిటకు ♦ వచ్చెడు దాఁకను పోరుదేని నీ
ప్రదరము రాకమున్నె యిది ♦ వచ్చును నీయురమున్ వలంతివే
నదరక కాచికొమ్మనుచు ♦ నార్చుచు వైచె దశంబు ఘూర్ణిలన్. ౧౭౮౧

చ॥ అలవు జలంబు గల్గిన మ ♦ హాబల నందనుఁ డేసినట్టి య
మ్ముల పొలదిండి వక్షము న ♦ మాంతముగా వడిఁదాఁకి వ్రయ్యలై
పలపల రాలె దిక్కులను ♦ వహ్నిని గ్రాఁగిన యుక్కుడుంప దా
కలి పయి వ్రేయు సమ్మెట వి ♦ ఘాతమునం బఱివోవు కైవడిన్.

తే॥ అత్తఱిని మాయియగు నింద్ర ♦ జిత్తు రేఁగి, హనుమ యొమ్మున భుజముల ♦ నంటి దూసి
పోవ విషలిప్తమైన తూ ♦ పులను వేయి, పరపి డాయనీయక చలిం ♦ పంగఁ గొట్టె.

తే॥ పవనుఁ డదరి కలంపఁగాఁ ♦ బైఁడికొండ, లోపలనె కలగుండై న ♦ కోపు దోఁప
వెడలి మేనిపై రక్తంబు ♦ వెల్లిగాఁగ, నించుకంత సామీరి యో ♦ చించునంత.

తే॥ నీలుఁ డెడసొచ్చి జాల్వాలు ♦ నింగినంట, నరవడిని సూటిగా వైచె ♦ నొక్కకొండ
నడుమనే దానిఁ దుండ్లుగా ♦ నఱికివైచి, శక్ర విద్వేషి వికటహా ♦ సంబు చేసె.

ఉ॥ ప్రాణముతోడనున్న పెర ♦ వానరు లాసలు వీడఁగా సుప
ర్వాణులు భీతినొందఁ గపి ♦ వాహిని నాథుని దేహ మెల్లెడన్
బాణ విపాత ఘాతమున ♦ వారక రక్తము గ్రమ్మ నాతఁడున్
ద్రాణ యొకింత లేక ♦ ధర ♦ వ్రాలె నడుంకుచు విహ్వలించుచున్.

ఉ॥ మేరువె యంచుఁ గాదనుచు ♦ మీఱి వచింపఁగఁదగ్గ కొండలన్
వారక తెచ్చి యంగదుఁడు ♦ వైచెను రావణిమీఁదఁ జేతి వి
ల్లూరక యుండునే ? చెనక ♦ నోపునె ? తుండులుగాక యుండునే ?
తోరపు వింటిచే నవియు ♦ నుగ్గయి నుగ్గయి పిండియై పడెన్. ౧౭౮౭

ఉ॥ పుట్టలఁజేరు నాగముల ♦ పోలికఁ దీవ్రతరాస్త్ర సంతతుల్
గట్టిగ ఱొమ్ములన్ దొనసట ♦ గాళులఁ జేతులఁ గాఁడఁ దత్తఱన్
బట్టుగఁ బండ్లు గిట్టికొని ♦ బాధ సహింపఁగలేక యంగదుం
డట్టె ధరిత్రిపై సొలవు ♦ నందఁగఁ గాంచి సురారి యంతటన్. ౧౭౮౮

తే॥ తక్కు వానర వీరుల ♦ తనువులంట, బాణవర్షము గురియించి ♦ పఱవఁ దోల
నిలుచు నిలువున వడఁకుచు♦నిలిచినారు, తక్కువారలు దెసలలోఁ♦దాఁగినారు.

:— ఇంద్రజి ల్లక్ష్మణ యుద్ధము :—

చ॥ అదిగని లక్ష్మణుండు కడు ♦ నల్క విభీషణుఁ గాంచి వాహినుల్
సదమదమయ్యె నాయకులు ♦ స్రగ్గిరి కార్యము మించె యత్నమో
యుడవదలయ్యె నింద్రజితు ♦ నాజికిఁ బిల్చి వధింపకున్నచో
నిడివఱకైన పాట్లు ఫలి ♦ యించునె ? వీసర వోవదే యనన్. ౧౭౯౦

ఉ॥ వీనిని తాఁకి వేలుపులు ♦ వీఁపులు చూపిరి కాని యొక్కరుం
బూని జయింపలేద జగ ♦ ముల్ కడు కష్టములొందె వీనిచే
మానక వీని నిష్ఠు పరి ♦ మార్చి జగంబులఁ గాచి లోక స
మ్మానితకీర్తి నొందుమని ♦ మాని విభీషణుఁ డాడు నంతటన్. ౧౭౯౧

ఉ॥ ఇంద్రజితుండు లక్ష్మణుని ♦ యెట్టెదుటం గని వాఁడె వీఁడు నేఁ
డింద్రపదంబు గోరె నిపు ♦ డిచ్చెద వీనిని చుట్టు ముట్టుఁడీ
సాంద్రతరంబుగా ననుడు ♦ సైన్యము రేఁగి ధరిత్రిఁ జుట్టు నా
సంద్రము పోల్కిఁ జుట్టె రభ♦సంబున నార్చుచు నొక్క పెట్టునన్.

చ॥ బ్రదుకిఁక లేదు నీకని కృ ♦ పారహితాత్ములు స్యందనంబులన్
మదకరులన్ గుఱాలను క్ర ♦ మంబున రేఁపుచు మీఱి నన్నిటిన్
జిదుకుపలై పడంగ వెసఁ ♦ జించుచు లక్ష్మణుఁ డస్త్రరాజి బె
ట్టిదముగ నేసి వారల ప ♦ టిష్ఠతఁ ద్రుంచె సుపర్వు లుబ్బఁగన్.

చ॥ వడఁకె జగంబు ధారణియు ♦ బ్రద్దలువాఱె శర ప్రకర్షముల్
పిడుగులఁ గేరెఁ బీనుఁగుల ♦ పెంటలు మీఱె నసృక్ప్రవాహముల్
జడనిధిఁదూఱె రాక్షసుల ♦ సత్త్వము తాఱె బలీముఖంబు ల
య్యెడ శ్రమ దేఱె నింద్రజితు ♦ నెడ్డ బిడెంబును కూరె దండిగన్.

చ॥ ఎడపక లక్ష్మణుం డలుఁగు ♦ లేయ సురంబుల నాటె డాలుల
బుడమిని రాల్చె ర_క్తమున ♦ ముంచె గజమ్ములఁ గ్రుచ్చె వాజుల
గెడపెఁ బదాతి వర్గమును ♦ కేలును కాళ్లను ద్రుంచెఁ గాలుకై
వడి లయకాల రుద్రువడిఁ ♦ బార్థివ నందనుఁ డేచె నాజిలోన్. ౧౭౯౫

చ॥ మితిచెడి కూలు పీనుఁగుల ♦ మేకొని లెక్క యిడంగ నిర్జరుల్
మతిఁ దలపోసి కాదనుచు ♦ మాని శిలీముఖ వృష్టిఁగాంచి యి
వ్విత్తమును చూడఁ గాదనుచు ♦ వీరుని కార్ముకమందు స_ప్త మా
రుతములు స_ప్తమేఘములు♦రూఢిఁ జెలంగు నటంచు వింతగన్. ౧౭౯౬

తే॥ఒక్క యేనుఁగు మోమున♦నొక్కకోల,యొక్క గుఱ్ఱము మోమున♦నొక్క యలుఁగు
ఒక్క కాల్బంటు ఱొమ్మున♦నొక్క శరము, గాఁగఁ దెలిసె లక్ష్మణ వృష♦తక్కమ్ములచట.

ఉ॥ పుట్టుకతోడ గొప్ప యురు ♦ వున్ బొలదిండియుఁ గల్గి ఱెక్కలుం
బుట్టినవోటఁ గంకముల ♦ పోఁడిమి లక్ష్మణ బాణరాజముల్
నెట్టన యొక్క యొక్క రజ ♦ నీచర సంస్థిత గాత్రమందు ము
క్కొట్టఁగ వ్రాలియుండె మఱి ♦ యొక్క నిశాచరు పోల్కి యొండఁగన్.

తే॥ ఇంద్రజిత్తు రోషమునఁ బో♦రెసఁగఁ జేయ, ముప్పదైదు వెల్లువల క♦పులు మరించె
లక్ష్మణాస్త్ర జాలమున నా♦లమునఁ గూలు, నసుర శవములలో నవి♦యడఁగిపోయె.

ఉ॥ చేతులు త్రెవ్వి కాళ్లు తెగి ♦ చిందఱ వందఱ యయ్యె బొందడాల్
మూతులు వోయి యాంత్రములు ♦ ముందట జాఱి బలంబు త్రాఱి క
ట్టేతులు మాలి యాయుధ వి ♦ హీనములై పడఁ దక్కు నిర్జరా
రాతులు పాఱి రాసలకుఁ ♦ బ్రాణము తీపను పల్కు నిల్పుచున్. ౧౮౦౦

తే॥ నీరువట్టిన కడలిలో♦నిలిచినట్టి, మందరమువలె నొకఁడేని♦మాట తోడు
లేని మేఘనాదుఁడు త_త్త♦ళించి బొమలు, ముడిచి తేరిపై లక్ష్మణు♦మొనయవచ్చె

ఉ॥ మారుతి డాసి వీఁడు రథ ♦ మధ్యగతుండయి యుండ నేల నీ
వారుట యొప్పు చూపదు మ ♦ దంసగతుండవు గమ్ము నీవనం
గారవలీల లక్ష్మణుఁడు ♦ గాడుపుపట్టి భుజంబు నెక్కె బృం
దారకు లుల్లసిల్ల జల ♦ ద ధ్వయమో యనఁ దాఁకి రిద్దఱున్. ౧౮౦౨

ఉ॥ కాళికఁబోలి యొక్కరుఁడు ♦ కాలుని పోలి యొకండు భూరి భూ
గోళము దద్దఱిల్లఁ గుల ♦ గోత్రము లల్లలనాడఁ డంకృతుల్
మేళన మొందగా విశిఖ ♦ మేదుర నాదము పిక్కటిల్లె న
వ్వేళ ముఖమ్ములం గొఱికె ♦ భీకర లీలల నమ్ము లమ్ములన్. ౧౮౦౩

క॥ పిడుగులఁ బోలిన బెడిదపుఁ, దొడుగులు మఱి తొడుగు లేయఁ♦దునుఁగుచు రాలన్
దొడిఁబడి జగములు వడఁకుచుఁ, గడలి నడిమి నావవోలెఁ♦గళవళమందెన్

క॥ అరదంబును మారుతియును, పొరిపొరిఁ దిరుగంగ లంక♦పూర్తిగ నదరెన్
శరములు క్రమ్మటచేఁ దెలి, యరు లక్ష్మణుఁ డింద్రజిత్తు♦నమరుల కరయన్. ౧౮౦౫

చ॥ కర శర లాఘవంబు లొక ♦ కైవడి నుండవు స్థేమమున్ మహో
ద్ధురమగుఁ బోరు తీరు బహు ♦ దుస్సహమౌఁ గనఁజాలమంచు ఖే
చరులు వచింప నేత్రగత ♦ చర్యకు సైతము శంకగూరె నే
కరణి వచింపనౌ జరుగు ♦ కార్యము లిట్టివ యంచు గట్టిగన్. ౧౮౦౬

చ॥ జరిగిన దొక్కటే నెఱుఁగఁ ♦ జాలక యేమి ఘటిల్లె? నెవ్వరీ
కరణి దురంబు పూర్వము జ ♦ గంబునఁ గాంచిరి? మున్ను లే దనం
తరమును కల్గఁబోదు కను ♦ దమ్ములు ఱెప్పలు లేనివయ్యుఁ గాం
చు రుటము గానమైతి మని ♦ స్రుక్కిరి వేల్పులు వారిఁ గానమిన్. ౧౮౦౭

ఉ॥ వేలకొలంది భల్లములు ♦ వీరుఁడు రావణి మీఱి యేయఁగా
వేలకొలంది భల్లముల ♦ వేగమ లక్ష్మణుఁ డేసి త్రుంచెఁ బై
వేల ఫణీంద్ర బాణముల ♦ వెంటనె రావణి యేసె మాఱుగా
వేల ఫణీంద్ర బాణములు ♦ వీకున లక్ష్మణుఁ డేసి త్రుంచుడున్. ౧౮౦౮

తే॥ లక్ష యమ్ముల నింద్రారి♦లాగి యేయ, లక్షతో వాని నడఁచెను♦లక్ష్మణుండు
కోటి తూపుల రావణి♦కూర్చి పరపఁ, గోటితో వాని సౌమిత్రి♦కొట్టివైచె.

సీ॥ కంకపత్త్రమ్ములఁ♦గఱకు రక్కసుఁడేయఁ, గంకపత్త్రిములె రా♦ఘవుఁడు వైచె
నర్ధచంద్రాస్త్రమ్ము♦లసుర యేయఁగ నర్ధ, చంద్రాస్త్రములనె ల♦క్ష్మణుఁడు వైచెఁ
గోఱలఁబోలిన♦కోల లతం డేయ, నీతండు నట్టివే ♦ యేర్చి యేసెఁ
బాఱల మొనలున్న♦ప్రదరంబు లమరారి, యేయ నట్టివ యేసె♦నృప సుతుఁడు
తే॥ తమ్మి మొగ్గలఁ బోలు న♦స్త్రముల దైత్యుఁ, డేయ నట్టివ సౌమిత్రి♦యేసి త్రుంచె
వజ్ర ముఖ బాణములను క్ర♦వ్యాదుఁ డేయ, నట్టివే యేసి యడఁచె రా♦మానుజుండు.

సీ॥ త్రిశిరశ్శరంబులొ♦త్తిలి యిద్ద ఱేయంగ, నవి తాఁకి పొడియయ్యె♦నంబరమున
నంజలి యనెడి సా♦యకముల నిరువురు, వేనవే లేయంగ♦విఱిగె నవియుఁ
గుంజర శ్రవములన్♦పింజకోలల నిర్వు, రేసి రయ్యవి తాఁకి♦యిల నడంగె
రావియాకులఁ బోలి♦రాజిల్లు తూపుల, నిరువు రేయఁగ నవి♦యెడలి దొరలె
తే॥ నిట్టులేయుచు విఱుచుచు♦నెసక మెసఁగ, లోకములె యంపగములకు♦లోనుగాఁగఁ
జేసి యార్చిరి పొఁగిరి♦చెలఁగి రుబ్బి, రడరి రలరి రొప్పిరి తని♦వంద రైరి. ౧౮౧౧

ఉ॥ రావణి కల్ప మేఘములు ♦ ప్రోదినులం గురియించి ముంచు నా
కైవడి నేసి వాఁడి గొర ♦ కల్ వడిఁ గర్కటి ప్రీలునట్టు ల
ప్పావని మేను చేసి నర ♦ వర్యుని కంకటమందు గ్రుచ్చె బా
ణావలి వేనవేలుగ వి ♦ యచ్చరు లందఱు పిచ్చలింపఁగన్. ౧౮౧౨

తే॥ హనుమ యొడలి రక్తము గాంచి ♦ యసురు లెల్ల, నింద్రజితు చేయి మించిన ♦ దంచు నెంచి
వదనములఁ ద్రిప్పికొని కేలు ♦ విదిరిచికొని, వెగడుపడి రీతఁ డేకైక ♦ వీరుఁ డనుచు.

మ॥ రణ పాండిత్యము మీఱఁ గ్రూర విశిఖ ♦ వ్రాతంబులం గూర్చి ల
క్ష్మణుఁ డశ్వంబులఁ గూల్చి దైత్యు సిడమున్ ♦ ఖండించి కేరించి రా
వణి మైమర్వొను చించి సారథిని చం ♦ పంగొట్టె వెన్వెంటనే
గణనాతీతములైన బాణములఁ ద ద్గాత్రంబు భంజించుచున్. ౧౮౧౪

క॥ సారథి గూలినఁ డెక్కెము, వారువములు పడిన మేను ♦ వ్రస్సిన రణదు
ర్వారుండై లంకేశ కుమారుఁడు చలియింప కిట్లు ♦ మదియించె మదిన్. ౧౮౧౫

మ॥ నరుఁడే యీతని సాటి; కాదయినచో ♦ నారాయణుండే యగున్
గిరిశుండో పరమేష్ఠియో; దృఢమతిన్ ♦ గీశాళితో డిగ్గి మా
పురిలో మమ్మెదిరించి నిల్చు మనుజున్ ♦ మున్నెన్నఁడుం గాన మ
చ్చెరు వీసాహస మీచణత్వము రణ ♦ స్థేయత్వ మీ బీరమున్. ౧౮౧౬

తే॥ అనుచు వేఱొక తేరెక్కి ♦ యసురవరుఁడు, నిప్పు లురలంగ నిట్టూర్చి ♦ నేయి పోయు
నిప్పువలె మండి మిక్కిలి ♦ నెగడి క్రూర, విశిఖతతి దండడిగ గుప్పె ♦ విన్ను నిండ.

తే॥ శ్రేణులై కుప్పలై పాఱి ♦ శితశరముల, లక్ష్మణుం డేసి వానిఁ దో ♦ లించి వేయి
నారసము లింద్రజితు మేన ♦ నాటనేయ, వాఁడు వడిఁ గ్రుచ్చె సౌమిత్రి ♦ ఫాలమందు.

తే॥ నొవ్వ కించుకంతయు లక్ష్మ ♦ ణుండు వాని, ఱొమ్ము రంధ్రమ్ము లడర నూ ♦ ఱమ్ము లేసి
నొంప మేఘనాదుఁడు మేను ♦ కంప మొంద, నొఱఁగెఁ దేరిపై సుంత వి ♦ ల్లూఁతగాఁగ.

తే॥ కాలుఁడే యదాటునఁ దూఁకు ♦ కరణి తోఁప, హనుమ పురణించి యింద్రజి ♦ త్తరద మవనిఁ
గ్రుంగ వారువంబులు నలి ♦ గులిగఁ గూలఁ, దన్నె వాఁడును వేఱు స్యం ♦ దనము నెక్కె.

తే॥ ఇంద్రజితుఁడు పెక్కగు తేరు ♦ లెక్కుచు వడిఁ, గూల్చుకొనుచుండెఁ గాని యొ ♦
క్కొటియుఁ గాచి
కొని రణంబు సేయఁగ లేక ♦ కుములుచుండె, గడియలో వేయిరథములు ♦ మడఁగిపోయె.

క॥ దేవత లనుమని లక్ష్మణు, దీవించిరి విరులు గురిసి ♦ తేట మొగములన్
బ్రోవయి రాడిరి పాడిరి, పైవస్త్రము లార్చి రథిక ♦ పరితోషమునన్. ౧౮౧౭

తే॥ అంత నింద్రజిత్తునకు న ♦ త్యంత హితులు, సమసుఖాన్నపానులు వెస ♦ శత సహస్ర
సంఖ్యగల రక్కసులు మిత్తి ♦ సరస కీడ్వ, వచ్చి చేరి రచ్చటికిఁ గా ♦ వరముతోడ.

తే॥ హస్తిపకులును రథికులు ♦ నాశ్వికులును, కాల్బలంబులు కేల ఖ ♦ డ్గములు గదలు
దాల్చి గర్జలతోడ వా ♦ ద్యములు నిగుడ, ఖడ్గదీప్తులు కెలఁకులఁ ♦ గ్రమ్మవచ్చె.

తే॥ శరభ సింహ వారణ పిశా ♦ చముల ధ్వనులు, శింజినీ రవములు దెసల్ ♦ చెలఁగఁ బరవెఁ
బుడమి శవముల మయమయి ♦ యడరు కతన, స్యందనములచేఁ బెంధూళి ♦ క్రందుకొనదు

తే॥ అపుడు రావణు కొడుకొక్క♦యరద మెక్కి, దిశలు నిండ నారసములు♦దివిరి కురిసె
సాంధ్యరాగంబు లలిని ల♦క్ష్మణుఁడు మెఱసి, వాని నన్నిటిఁ దొలఁగించి♦వైచి యేచి.
తే॥ చుట్టుముట్టి రాకాసులు♦స్రుక్కవైచి, నవియు మోఁదినయవి యేసి♦నవియు నుగ్గు
నూచ మయ్యెఁ బైపై లక్ష్మ♦ణునిశరములు, గుదులుగా దైత్యశిరములఁ♦గ్రుచ్చుచుండె.
తే॥ ప్రేవులు భుజంగములు దంతి♦బృంద మగము, లురలు తేరులు పగిలిన♦తరణి నికర
మాయుధీయులు వారిచ♦రావళులుగ, రణధరిత్రి యొప్పారె సం♦ద్రంబు పగిది.
తే॥ కంటసరులు కుండలములు♦కటకములును, కవచములు వీరఘంట లం♦గదచయంబు
లురలి విలయవాతమున నం♦బరమునుండి, దొరలు నక్షత్రములవలె♦ మెఱసిపడియె.
తే॥ లక్ష్మణుం డింద్రజిత్తు నా♦లంబులోన, నాపి రాడనీయక శర♦వ్యూహ మమరఁ
జేసి దితిజుల మేనులఁ♦జించివైచెఁ, గుప్ప కుప్పలుగా నలుఁ♦గులను గూర్చి.
తే॥ లక్ష్మణుని వాహనంబు వా♦లమునఁ జుట్టి, నేలఁ దాఁచును మెడ నల్పుఁ♦గాలరాచుఁ
ద్రొక్కు మింటికి వైచును♦ద్రోచుఁ బొడుచు, విఱుచుఁ గఱచును బెదరించి♦తఱుము రిపుల
తే॥ ఉఱిమి చూచున దల్చుఁ బై♦కుఱుకుఁ గొఱుకుఁ, గరులఁ బట్టి విసరి వైచుఁ♦గడలిఁ బడఁగ
గుఱ్ఱముల పొట్ట లగులఁగాఁ♦గూలఁ దన్నుఁ, దేరు లొకటిపై నొకటి ఛే♦దిల్లఁ ద్రోచు:
క॥ హరులఁ గరుల నసురాళుల, విరులం బలె గిల్లు విఱుచు♦విటపముల క్రియన్
సరసర దూయును దళముల, వెరవునఁ బండ్లవలె రాల్చుఁ♦బిసుకుం బిండున్.
క॥ పన్నగములె దారములుగఁ, బన్నుగఁ గట్టంగఁబడిన ♦ పఱపగు తేరుల్
గ్రన్ననఁ గూల్చెను వేయిటి, నెన్నఁగ నొక గడియలో న♦హీనబలమునన్.
తే॥ విసము దిని మత్తుగొన్న మా♦నిసులు పిదప, మంచిమందు చే లేచిన♦మాడ్కిఁ బెక్కు
చోట్లఁ బడియున్న వానర♦స్తోమ మపుడు, తేఱి లేచి ప్రకోపంబు♦మీఱి పోరె.
తే॥ ఉగ్రకోపులై కవియుచు♦హుంకరించి, యింద్రజిత్తుపై శిలలు మ♦హీజములును
గిరులు వందలు వేలుగాఁ♦దెరలవైచి, యార్చి రొక్కపెట్టున వ్యో♦మ మగలు పగిది.
తే॥ వ్రేయ నవయవములు ఛిన్న♦భిన్నములయి, గంట లులియ శతాంగముల్♦ కార్మికాళి
యఱగొఱగఁ బనిచేసిన♦యరదములను, పోలి సంగ్రామమేదినిఁ♦ గ్రాలుచుండె.

ఉ॥ అంగదుఁ డొక్క సాలము న♦హంకృతిఁ గైకొని తెచ్చి యింద్రజి
త్తుం గని చచ్చితోరి భుజ♦దుర్దమ సత్త్వము గల్గునేని త్రో
వం గలవాఁడ వంచు వడి♦వైవఁగ నయ్యది దైత్యు గారవం
బుం గొఱ సేయు భంగి రథ♦ముం దొరలించెను నుగ్గునూచగన్. ౧౮౩౭
చ॥ తలఁపున వేల్పు లుల్లసిలి ♦ తాతకుఁ గల్గిన బన్న మియ్యెడన్
దొలఁగఁగఁ జేసెఁ బౌత్త్రుఁడని ♦ తోషము వొంగఁగ నార్చి రంత దో
ర్బలమున నుప్పరం బెగసి ♦ రావణి వేఱొక తేరి మీఁదికిన్
జలుకఁగ దాఁటి నిల్వ మని♦చూఁడి యలుంగుల నేసె వానిపై. ౧౮౩౮

ఉ॥ జీవము గొందునంచు మొగి ♦ సేయఁగఁ దక్కిన వానరావళుల్
రావణిఁ జుట్టుముట్టి బవ ♦ రంబునఁ జచ్చిన వారి శీర్షముల్
వాపురముల్ శతాంగములు ♦ వారణ తుండము లందినట్టి వే
వేవియొ తెచ్చి వైచి శర ♦ వృష్టి నడంచిరి మించి యార్చుచున్. ౧౮౪౦

ఉ॥ అంతటఁ బ్రాభవ స్థితియు ♦ హర్మ్య నివాసము నిద్రవీడు ధీ
మంతుఁడు పోరుచున్న చెడు ♦ మానిసిదిండుల నొక్కఁడేని కా
న్పింతమ యన్నఁ గాని కర ♦ ణిం బరిమాఱుప నింద్రజిత్తు దు
ర్దాంత రుషా పరీతుఁడయి ♦ తార్కొని నోర్వఁగరాక గ్రక్కునన్.

తే॥ సేనలం జౌరుకొని యండ♦శిఖరమంటి, నట్టి రక్తజలధి యీడ్వ♦ననువు దప్పి
రక్షణము చేసికొను చక్ర♦రక్షకులను, ధూమ్రనేత్రు మహాపార్శ్వఁ♦దొడరి కాంచె.

తే॥ పీనుఁగులు కొండలంబలెఁ♦బెరిఁగియుండ, జలదములు దాఁటలేదు భా♦స్కరరథంబు
దాఁటలేదు పక్షులుగూడ♦దాఁటలేదు, నిలుచు నిల్వున వారలు♦నిలిచిరల్లి.

తే॥ వారిమోములఁ గాంచి రా♦వణియుఁ గదిసి, వింత! మనసేన నలువది♦వెల్లువలను
లక్ష్మణుం డింతలోన స♦గ్గలపుఁ గినుక, నాశ మొనరించుటలు కాంచి♦నారె మీరు.

తే॥ అనుడు వార లింద్రారి! నీ♦వంతకంటె, నెక్కుడగు కపిసేన మా♦యింపలేదె?
సమఁడ వట్టి సంగ్రామమే♦సలిపితయ్య. చింతయేల యటంచు వ♦చించునంత.

తే॥ ఇంద్రజి ల్లక్ష్మణులు వెఁడి♦యేపుమీఱి, పోరఁదొడఁగిరి సౌమిత్రి♦మేరమీఱి
వేలకొలఁది శరములేయ♦విబుధవైరి, వేయుకొలఁదిఁ దున్మచునుండె♦వివిధగతుల.

తే॥ ఐదుపది నూఱు వేయి ప♦దాఱువేలు, మున్నురిముగఁ గోలల నేసి♦మూర్ఛదేఱి
పోర వచ్చిన వానర♦వీరవరుల, మరల దశకంఠ సూనుండు♦ధరణిఁద్రోచె.

తే॥ వనచరేంద్రుండు మున్నుగ♦వారు సోలి, పడఁగ నెదుట నిల్చిన సుర♦వైరి తూల
వెదురుటడవిఁగాల్చెడి జాత♦వేదు కరణి, మండు శరముల గుప్పె ల♦క్ష్మణుఁడు కడిమి.

తే॥ ఇంద్రజిత్తు మూర్ఛిల్లె స♦హింపలేక, కొమ్మలంబలె నిల్చుపో♦కులు నిరువురు
దాఁగియుండిన రాకాసి♦దళము కొంత, తోడుగాఁ బోరఁదొడఁగి రు♦త్సుకతవిడక.

తే॥ రథగజాదికములు లేని♦రాక్షసాలి, మీఱి త్రుటి మాత్రలోన సౌ♦మిత్రి కురియు
బాణవర్షంబున మునింగి♦ప్రాణములను, విడిచినారు కొందఱు పాఱఁ♦దొడఁగినారు.

తే॥ నీరువట్టుచేఁ గొందఱు♦నీరదముల, కెగసి నీర్ద్రావి వ్రణములఁ♦దగిలి నీరు
చొరఁగఁ జచ్చిరి కొందఱు♦దొరకకుండ, నాల్క లెండంగఁ జచ్చిరి♦నవసి నవసి.

మ॥ శరసంఘాత విదారితాంగులగు దో ♦ షాచారులం గొంద ఱు
ప్పరముం జేర వికీర్ణ కేశలయి సా ♦ మ్ముల్ రాలఁ జింతార్తిమైఁ
బరిచర్యల్ పొనరించు కాంతలఁ బరి ♦ ష్వంగమ్ము గావించి త
ద్వర జీవమ్ములతోడఁ జేరి రమలు ♦ స్వర్గీయ తల్పమ్ములన్. ౧౮౫౨

మ॥ శర నిర్ఘాత విశీర్ణ వక్షులు నిశా ♦ సంచారులం గొంద ఱు
ద్ధుర వేగంబున నిండ్లు సేరి హితులన్ ♦ దుఃఖంబుతోఁ గాంచి యా
చరణాబ్జంబులఁ జుట్టుగొన్న సుతులన్ ♦ సాఁకుండి యంచాంద్ర బా
లురు మోముల్ తనివారఁ గాంచుతఱిఁ గా ♦ లుం గాంచి రంత్యస్థితిన్.

శా॥ ఈసౌమిత్రి విజృంభణంబు క్షణ మి ♦ క్లేయున్న వెయ్యేల లం
కా సామ్రాజ్యము నాశమొందు నిజ మిం ♦ కన్ మేఘనాదుండు వి
శ్వాసుండౌటకు మున్నె డాఁగుఁడు గిరి ♦ ప్రాగ్భారమందంచు వి
శ్వాసాత్మీయుల కాడి కొందఱు గత ♦ శ్వాసాత్ములై రయ్యెడన్.

చ॥ నెఱఁకుల నాటియున్న శర ♦ నిర్గత శోణిత దిగ్ధ దేహు లు
క్కఱి యిలుసేర బంధులు న ♦ యంబునఁ దూపుల నూడ్పఁబూన ని
ట్టురివినఁ జత్తుమంచుఁ గడు ♦ నూర్పులు పుచ్చుచు మార్పుచెంది చే
మిరి యిదుపాలఁ బోలె విర♦మించిరి సర్వము మానులంబలెన్. ౧౮౫౫

ఉ॥ తేరులపై వడిం జనక ♦ తేజులమీఁదను పోక కాల్నడం
బోఱక దంతిమూఁపులను ♦ పాఱక సిగ్గున లంకలోనికిం
జేరక యందు వెల్పుల వ ♦ సింపక ప్రాణములందు తీపిచేఁ
దాటిరి కొందఱా శవ వి ♦ తానము క్రింద నొదింగి యూర్చుచున్.

చ॥ కురిసిన చోటనే కురియు ♦ క్రొమ్మొగులుంబలె లక్ష్మణుండు దు
ర్భరముగ నాయముల్ నలఁచి ♦ రావణిఁ జంపుదు నంచుఁ గత్తళం
బరవరసేసి వాని పివ ♦ శాత్ముఁగఁ జేయఁగఁ దేఱుదాఁక సం
గర మొనరింత మంచుఁ గలు♦కావలి వారలు డాసి యుగ్రులై. ౧౮౫౭

చ॥ అరదములన్ గడించి పొలు ♦ పారి ప్రభంజన సూను లక్ష్మణుం
గుఱిగొని బాణజాలముల ♦ గుప్పఁగ లక్ష్మణుఁ డాగ్రహించి చి
చ్చుఱ పిడుగట్టి నారసము ♦ లొక్కట నూఱుల నేసి తేరులన్
ఖురువులఁ దేరి చోదకుల♦ఖండము ఖండము సేయు నంతటన్. ౧౮౫౮

చ॥ విరథులు వారు పెన్ గదల ♦ పీఁకను కైకొని మారుతాత్మజున్
దరమిడి మోఁదఁబోవఁగ ను ♦ దగ్రత నాతఁడు వాని లాగుడున్
వెరవున పీన పీఁడు కడు ♦ పీఁగి వధించున యంచుఁ బాఱి రి
ద్దఱుఁ దిను నన్నమేని యొడఁ♦దం దలపోయక ప్రాణ రక్షకై. ౧౮౫౯

ఉ॥ కాలము తీఱమిన్ మఱియుఁ ♦ గాలున కింతయు జాడ తోఁపమిన్
గాలియుఁ జల్లఁగాఁగఁ దమ ♦ కాయములం జెనకంగ నిద్దురం
దేలి శ్రమంబునీఁగి మిహి ♦ తేఁకువ చేవయు నొంది వాలముల్
పోలఁగఁ ద్రిప్పుచుం గపులు♦మూర్ఛలఁదేఱిరి లేచి గుద్ధతిన్. ౧౮౬౦

తే॥ గవయ గంధమాదన గజ♦ద్వివిద మైంద, పనస జాంబవ దంగద♦ప్రముఖులెల్ల
వేలుపులు భద్రవాక్కుల♦వినుతి సేయఁ, దరుల గిరుల మోచికొని తె♦చ్చిరి కడంక.

తే॥ అంద ఱొక్క మొగినివై వ♦నసురవరుఁడు, ప్లవగ వీరులఁ గని కోప♦వివశుఁడగుచు
నింతయే గద మీచేవ♦ లేపు లనుచు, నవ్వి ఖండఖండములుగఁ♦ద్రెవ్వనేసె.

క॥ వినువక కోఁతులు జాలను, విసరుచు మునరుటను గాంచి♦విల్లును శరముల్
మసలని తోఁడుగ నిలిచిన, యసురుని యెడ సదయుపగిది♦నడఁగె నినుండున్.

క॥ శ్రుతులును స్మృతులును సత్యము, తత ధర్మము లెవని మహిమఁ♦దలపించునో త
త్కృతి నెఱుఁగని వెడఁగుల యెద, వితమున నిరు లన్ని దెసల♦విరివిగఁ గ్రమ్మెన్.

ఉ॥ పాతిక కాష్ఠలో నితని ♦ ప్రాణము తీసినఁ దీయవచ్చుఁ గా
కీతఁటి తప్పు దానవుల ♦ కిమ్మగు కాలము వచ్చు వచ్చుచో
నాతఁడు మింట సంచరిలు ♦ నట్లయినం గెలుపొందువాఁడు సు
మీ ! తడవేల యంచనుగ♦మించి విభీషణుఁ డాడు నయ్యెడన్. ౧౮౬౭

క॥ తనుచుట్టిన ప్లవగులపై, హనుమనిపై లెక్కలేని ♦ యంప గముల నే
సిన రావణిఁ దునుమఁగ స్యం, దన మొక నారసముతోడ♦ధరఁ బడఁగొట్టెన్.

—: ఇంద్రజిత్తు నాగపాశముచే లక్ష్మణాదుల బంధించుట :—

చ॥ రథమును లక్ష్మణుం డొక శ♦రమ్మునఁ గూలుచు నంతలో వియ
త్పథమున కేగి వీరి నహి ♦ పాశముచేఁ బడఁద్రోయ జీవముల్
వ్యథగొని వీడు వారలని ♦ యారసి రావణి మబ్బుఁ జేరె దు
ష్ప్రథితునిచే నిఁకెయ్యది పో ♦ సంగునో యంచమరుల్ వడంకఁగన్.

క॥ విల్లును తూణీరంబులు, పెల్లగు కోపంబు క్రౌర్య ♦ విధులుం గల యా
ప్రల్లదుఁడు మింటఁ జీకటి, నల్లని మేఘములలోఁ గ♦నంబడకుండెన్. ౧౮౬౮

తే॥ పంక్తికంధరసుతుఁడు త ♦ పఃఫలమున, వరబలంబునఁ గులగౌర ♦ వంబువలన
మంత్రబలముచేత నణువు♦మాడ్కి నూక్ష్మ, గాత్రుఁడై కానరాక మే♦ఘముల
నడఁగె. ౧౮౬౯

తే॥ అబ్జభవునైన హరినైన, నభవునైనఁ, గట్టి త్రోచిగా కూరక♦క్రమ్మఁజాలని
భుజగపాశంబు నభిమంత్ర♦పూర్వకముగఁ, గేలఁగైకొని వంచనా♦శీలుఁడంత. ౧౮౭౦

తే॥ అచటి వానరులును మాయ ♦ నరయలేక, కదనమున జంకి పాఱెన ♦ కాఁదలంచి
యుబ్బియార్చి గంతులువైచి♦రుత్సహించి, లక్ష్మణుఁడు నల్లయెడఁదఁ ద♦లంచి నవ్వె.

తే॥ జరుగునది కనలేక ల♦క్ష్మణుఁడు హనుమ, మూఁపునుండి ధాత్రికి దిగి♦చాప మంగ
దుని కరంబున నిడి మేనఁ♦దూఱికియున్న, శరము లూడఁగఁదీసి వి♦శ్రాంతిగొనియె.

క॥ రావణి నాగాస్త్రంబును, తీవరమున వదలె వదల ♦ దిశలెల్లను తే
జో విలసనముగఁ జేయుచు, నోవగ వడిఁ జుట్టె లక్ష్మ ♦ ణుని బాహువులన్

మ॥ సకల ప్రాణు లెదిర్చినన్ మసమునన్ ♦ జంకింతయున్ లేని య
య్యకలంకాత్ముఁడు లక్ష్మణుం డిటియఁ ద్రో ♦ యంగట్టు నిక్కట్టు నం
చకు మాయాబల మంచెఱుంగక యుదం ♦ చ త్సత్త్వ హీనస్థితిన్
నికటా భీల రణస్థలిన్ గగనమున్ ♦ వీక్షించె వే పల్మఱుల్. ౧౮౭౪

శా॥ ఈమాయల్ పొసగించు దొంగను త్రుటిన్ ♦ హింసించి బంధింతు వాఁ
డే మార్గంబునఁ బోవువాఁడనుచు ♦ న గ్రేశుండు సామీరి వే
వ్యోమప్రేక్షణుఁడైన యంతట దశా ♦ స్యున్ వాలి వాలంబు ప్రో
ద్దామ ప్రక్రియఁ జుట్టినట్టులు తద ♦ స్త్రంబంటి చుట్టెన్ వెసన్. ౧౮౭౫

తే॥ క్రూరదంష్ట్రలుగల పృదా ♦ కువులు తక్కు, వనచరులఁగూడ బంధించి ♦ వైచుసంత
బాహుబలముక్కి యేమియుఁ ♦ బాలుపోక, భ్రాంతి నొందిరి సమర భూ ♦ భాగమందు

ఉ॥ బంధితులైన కీశులోక ♦ పట్టున లేచుచు ప్రాలు చున్గులై
కంధిని గాంచి కంధరముఁ ♦ గాంచుచు వాలము నేలమోఁది పా
శంధమమేచఁ గాంచుచు గ ♦ ణించుచు లక్ష్మణుతీరు దుఃఖులై
యంధుల పోలె నుండిరి ర ♦ ణావని నేమియుఁ దోఁపకుండుటన్. ౧౮౭౭

క॥ ముడుఁగుదురు సత్త్వహీనత, నడుగుదురు విభీషణుఁ గని ♦ యరయఁ బ్రతిక్రియన్
మడుఁగుదురు నడుము నిలువక, యుడుగుదు రసువుల్ చలింప ♦ న గ్రేశులై.

ఆ॥ సంకటంబు దీర్చ ♦ చతురు లెవ్వరు గాలి, కన్న కొడుకు బ్రదికి ♦ యున్నవాఁడె?
యనుచుఁ గలఁగి మలఁగి ♦ మనువంశ్యుఁ డీస్థితిఁ, గనిన నెంతచింత ♦ గాంచునొక్కొ!

ఆ॥ అనుచుఁ బసవుచుండ ♦ నంబరమున నింద్ర, జిత్తు నిలిచి చూచి ♦ శితశరముల
వైచి కట్టువడిన ♦ వానరవీరుల, నొంచి కూల్చె నేమి ♦ యెంచఁగలదు! ౧౮౮౦

ఆ॥ కరువపైన ప్రాలు ♦ కరిమొగుళులు మహా, వాతమునను వ్రీలు ♦ వైనమొప్పఁ
దూపులొడలఁ జొచ్చి ♦ దూసిపోవఁ బ్లవంగు, లురలి సోలి నేల ♦ దొరలి నారు

క॥ శరములు వేలకొలఁది తన, శిరమున నురమునను నాటఁ ♦ జింతింపక యా
కరువలి కొడుకు సుమిత్రా, వరపుత్రుని స్థితికిఁ జాల ♦ వగఁ జెందె మదిన్. ౧౮౮౧

క॥ తక్కినవీరులు బాణము, లుక్కఱఁ జేయఁగఁ గూలి ♦ రుర్విని గాత్రం
బొక్కెడ నమ్ములు మిక్కిలి, గ్రుక్కిఁచిన నంగదుండు ♦ సోలకయుండెన్. ౧౮౮౩

తే॥ గచ్చకాయలవలె మేను ♦ గదుములైనఁ, గారుచిచ్చునఁ గాలు కాం ♦ తారమట్లు
మనసు మేనును మండఁగా ♦ మలసెఁ బ్లవగ, రాజు రక్తాబ్ధిఁ బొడముమా ♦ ర్తండుఁ డనఁగ.

చ॥ అసమ ఫణీంద్ర పాశమున ♦ నర్దితుఁడై యొడలెల్ల దొడ్డ నా
రసములు గ్రువ్వ నొచ్చియు భ ♦ రంబగు కష్టములోర్చి సంస్మృతిన్

విసివియుఁ గ్రోవఁజాలిన వి ♦ వేకము దార్ఢ్యము గల్గి కర్ములన్
వసమయి యాత్మ చిక్కవడు ♦ బాగున లక్ష్మణుఁ డుండె నయ్యెడన్.

సీ॥ శరములు కిరణ సం♦ చయముగా సోలు మై, యెడలఁ గాఱెడి నెత్తు♦రెండగాఁగ
దెసలఁ బేర్చిన రా♦క్షసులను చీఁకట్లఁ, జెలఁగిన లక్ష్మణ ♦ జలజ హితుఁడు
ఉదయాచలేంద్రంబు ♦ పదురున విలసిల్లు, సామీరి భుజ నభ ♦ స్థలిని పొలిచి
విషధరాక్రాంత స♦ద్బింబంబుతో మింటి, నుండి మంటఁ బడిన♦యొఱపుదోఁచి

తే॥ సోలెఁ దక్కిన వీరులు ♦ స్రుక్కిపడిరి; యిషువు లొడలెల్లఁ గప్పిన ♦ యింద్రజిత్తు
దున్నహంబైన బాధతోఁ♦దూలిపడుచు, నోట నెత్తురు గ్రక్కుచు♦నొచ్చి క్రుస్సి.

ఉ॥ చెప్పిన యంతవట్టు పని ♦ చేకుఱె నామది సంకటంబు వోఁ
జెప్పెడిదేమి రేపె యవ ♦ శిష్టము పూర్తి యొనర్తు నేఁటితోఁ
దప్పకతీఱె లక్ష్మణుఁడు ♦ తత్కృతనావళి మాసెనంచు నిం
పొప్పఁగ గెల్పు దెల్పు బహు ♦ ళోన్నత రావ మెదుర్కొనం జనెన్.

ఉ॥ ఈనెలు గ్రమ్మిన ట్లతిశ♦యించిన యమ్ములవాన నించు రా
ట్సూన పయోదముం దఱిమి♦చొక్కపు రావణియన్ విధుండు లం
కా నగరంబు సొచ్చి పుర ♦ కాంతల మేటి కటాక్ష వీక్షణా
నూన పయోజ తోరణ వి♦నూత్న కృతస్థలిఁ జేరె వెంబడిన్. ౧౮౮౮

తే॥ రత్న దీపముల్ కైకొన్న♦ రాజముఖులు, స్వరయుతంబుగ విజయంబు♦ పాడుసఖులు
ముందు వెనుకల రా దశ♦ముఖునుతుండు, తండ్రియున్న శుద్ధాంత సౌ♦ధంబు సేరె.

తే॥ చేరి కై మోడ్చి జరిగిన♦ తీరు దెలిపి, చింతవిడు మలసితి శ్రమ♦ కొంత దీఱఁ
బిదప వచ్చి విశదరీతి ♦ విన్నవింతు, సెలవె యని వడివడిఁ దన♦ నెలవు సేరె.

—: విభీషణుఁడు లక్ష్మణు నవస్థం గని దురపిల్లుట :—

మ॥ అటఁ జింతాకులుఁడై విభీషణుఁడు కా♦ర్యాలోచనం బంది చి
క్కటచే నైన దధింబలెం గలఁగి పొ♦ల్పుం దెల్వియుం దక్క య
క్కట క్రూరాత్ముఁడు చంపఁడయ్యె ననుఁ లో♦కంబంధు దుఃఖంబు లా
రటపెట్టం గడు నిందపాలయితి నో♦రాయంచు దూపిల్లుచున్. ౧౮౯౧

మ॥ చని కట్టంబడి యున్న లక్ష్మణుని రా ♦ జ ద్రాజభక్తిన్ సమి
త్తున జీవంబుల నప్పగించు కపి సం ♦ దోహంబులం గాంచి యే
మన లోకుల్నను నేమిగాఁ దలఁతురో♦ ప్రాణంబులన్ మేనఁ బూ
నిన పాపంబున నిందపాలయితిఁ జ♦న్నే? యంచుఁ గుందె న్మదిన్.

శా॥ చెంతన్ వర్తిలి సంచుపొంచి వధముం ♦ జేయించినాఁ డందురో?
వంతంగూర్పఁగఁ దోడితెచ్చి వధియిం ♦ పంబూనెనా యందురో?

పొంతం జేరెఁ బ్రతారణంబు సలుపన్ ♦ ముఖ్యుండుగా నందురో?
చింతింపంగలవారు తోఁచు కరణిన్ ♦ జిత్తంబులన్ మానవుల్. ౧౮౯౩

శా॥ పోరంజొచ్చిన యింద్రజిత్తు నపుడే ♦ పొంగెల్ల వే తూలఁగన్
దేరున్ సారథి గుఱ్ఱముల్ దొరలఁగాఁ ♦ దింద్రించి మర్దించి మ
ద్వీరత్వంబును చూపనైతి నని మి ♦ త్రిం బొందఁగా నైతి వే
సారం జింతిలి యేమి? నాకరణి ప♦శ్చాద్బుద్ధియుం గల్గునే? ౧౮౯౪

మ॥ దురమం దీ కపిసేనతోడ గెలుపో ♦ దుఃఖంబో చావో ముదం
బో రహిం బొందుచు నా తలంపు విశదీ ♦ భూతంబు చేయింప కి
ట్లరికింగాక శరణ్యమైన పతికిన్ ♦ వ్యర్థుండనై ధాత్రిలోఁ
గొఱవిం బోలిన వాఁడనైతి నిరు వాఁ ♦ గుల్ నష్టమై త్రుంగఁగన్.

మ॥ అనుచున్ వ్యాకులితాంతరంగుఁడయి శో ♦ కాక్రాంతుఁడై దిక్కుతోఁ
చని దీనస్థితు నవ్విభీషణుని తా ♦ పంబొంతయుం గాంచి వా
రని చింతం బరిహారపద్ధతుల నా ♦ రంజేయ సాధ్యంబె? యం
చనఘుం డేగి వచించె రామునకు నా ♦ ద్యంతంబు వృత్తాంతమున్

చ॥ కుమిలి తపించి లోన మఱొ ♦ కొండు నెఱుంగక పల్కకక్షులన్
నిమిషము లేక చూడకయు ♦ నీరును కార్చక కిన్కతోడ లో
కములను కాల్పు కాద కలఁ ♦ గం బలవింపక రాఘవుండు చి
త్తమునఁ దలంచె లక్ష్మణుఁడు♦తప్పక జీవియె యంచు ధీరతన్. ౧౮౯౭

చ॥ కలఁగక రామచంద్రుఁ డిఁకఁ ♦ గార్యము వేఱొకరుండు లేదటం
చలఘుమతిం దలంచుచు ర ♦ యంబున లేచి గమించి వేగ రే
వెలఁదుక నీలిచీర తడి ♦ పీడఁగఁ బిండఁగ నిండెనన్న యా
నలువునఁ గప్పు కప్పు కద ♦ న స్థలిఁ జేరె మనస్వి రీకృతిన్. ౧౮౯౮

ఉ॥ చేరి యిరుల్ తొలంగి విల ♦ సిల్ల ధనంజయ కాండమేయ వే
దోరెను చీఁకటుల్ పగటి ♦ తోయము నొందె రణస్థలంబు పెం
పార యుగాంతవేళ నిట ♦ లాక్షునిచే భువనంబులెల్ల నే
తీరు భజించు నట్టి పగి ♦ దిం గనుపట్టె సుదుస్సహంబుగన్ ౧౮౯౯

తే॥ దుర్గికావాస యోగ్యమై ♦ దుష్టగంధ, మైన రణరంగమునఁ గుణ♦పాద్రి పొంత
రుధిర పంకిలాంతర గతా♦యుధ పరీత, దేహుఁ దమ్ముని కాంచె ధా♦త్రీ విభుండు

తే॥ కాంచి పైఁబడి తనదు వ♦క్షంబడంగఁ, గౌఁగిలింగొని నిట్టూర్చి♦కనుల నీరు
గార్చి రవియొద్ద జలధార♦గార్చు కారు, మొగులనఁగ నొప్పె రఘుకుల♦పుంగవుండు.

ఉ॥ పుట్టియుఁ బుట్టు వొందని ప్ర ♦ ఫుల్ల సరోజదళాక్షుఁ డూర్చు నీ
ర్వట్టఁగ నేడ్చుఁ గుందుఁ బ్రద ♦ రంబుల నూడ్చును లక్ష్మణా యనున్

మట్టును ముక్కు-రంధ్రముల ♦ బుద్ధి కలంగఁగ సోలు దూపిలున్'
గొట్టుచు నున్న విప్పుడును ♦ గుండె లటంచు ముదం బెదం గనున్.

ఉ॥ మేచక దేహుఁ డక్కునకు ♦ మేనొఱఁగించుచు దువ్వ వ్యోమముం
జూచును నేలఁజూచు విలుఁ ♦ జూచు భుజంగమ పాశ బంధముం
జూచు సురేంద్రవైరి చను ♦ చొప్పును మూచు జగంబుఁ గూల్పఁగాఁ
జూచుఁ గడింది నొవ్వు కలఁ ♦ చున్ మహనీయుల పల్కులం గొనున్.

తే॥ నెఱిఁ బ్రమాణంబులం దాఁటి ♦ నిల్చినట్టి, రామవిభుఁడు వానర నిక ♦ రమును గాంచు
విధినిగాంచు నమ్ములఁ గాంచు ♦ వింటిఁగాంచుఁ, దహతహంబొందుఁ జిత్తంబు ♦ తత్తళింప.

ఉ॥ పిల్చి వచించియుండిన వి ♦ భీషణ! యిప్పుడె నాగపాశముం
దాల్చిన చేతులున్ శిరము ♦ ధారణి దుల్లఁగ నేయకుందునే?
కాల్చితి నామనంబు పని ♦ గానక పాడొనరించి తివ్విధిన్
నిల్చి ఫలంబె ప్రాణములు ♦ నీఁగిన పిమ్మట దేహ మూర్వరన్. ౧౯౦౫

ఉ॥ రాముని పల్కులన్ విని క ♦ రంబు వడంకు విభీషణుండు సం
గ్రామ భయంకరా! వినుము ♦ రావణి పోరొనరించు వేళ నీ
ప్రేముడి తమ్మునే గెలుపు ♦ వేఁడెన కాఁ దలపోయుచుంటి మీ
బూనియ నాగపాశ బల ♦ ముం గొని పుట్టినదయ్య! యింటివే. ౧౯౦౬

సీ॥ అతికాయు మస్తక ♦ మట్టకు నెడఁబాపి, నట్టి లక్ష్మణుఁడు ద ♦ శాస్యుఁ డిటకు
పుత్త్ర కారణ రోష ♦ మున వచ్చువాఁడని, తలఁచి యిచ్చోటనే ♦ నిలుచునంత
నలువది వెల్వల ♦ దళముతో నింద్రజి, త్తేతెంచి రణమున ♦ నేపు మీఱి
నలువది వెల్వల ♦ బలిముఖ సైన్యంబు, గండడించి త్రోచి ల ♦ క్ష్మణుని గదియ

తే॥ నతఁడు నల్వది వెల్వల ♦ పృతనఁ గూల్చి, వేయి తేరుల విఱిచి త ♦ ద్విక్రమంబు
చావు వఱకును తెచ్చి య ♦ స్త్రము లసంఖ్య, ములుగ గుప్పించి శోణిత ♦ మొలుకఁ జేసె.

తే॥ దడము లవిసెను నొచ్చి యొ ♦ క్కఁడుగ నిలిచెఁ, దప్పనేని మాయలు సేయు ♦
దనుజుఁ డనుచుఁ
దమ్ము నెచ్చరించితి నంతఁ ♦ దమ్మి నంటు, చరమగిరిఁ జేరె ననువుగా ♦ నిరులు మీఱె.

తే॥ మాయియగు నింద్రజిత్తు వ్యో ♦ మమున డాఁగి, నాగపాశంబు చేత సై ♦ న్యములతోడ
లక్ష్మణుని కట్టివైచె జా ♦ లంబు చేసి, బద్ధులైనారు వీరు చా ♦ వంగ లేదు. ౧౯౦౯

తే॥ పెనచికొనియున్న పాశంబు ♦ వీడునేని, వీరు లేవఁగలరు స్వల్ప ♦ విశిఖములకు
జీవముల వీడువారె? రా ♦ జీవనేత్ర! పాపములు ధర్మమును గెలు ♦ వంగఁగలవె?

తే॥ అనుడు రాముఁడీ పాశంబు ♦ నరుదుగాఁగ, నెవ్వఁడిచ్చె దీనికిఁ బ్రతి ♦ కృతియుఁ గలదె?
తెలిసినంత తెల్పుమ యనఁ ♦ బలుకు నా వి, భీషణుండు సద్గుణ గణ ♦ భూషణుండు

తే॥ బ్రహ్మయాగఫలంబుగాఁ♦బడసె దీని, శంకరుఁడు కొని జగమున♦జయమునొందె
భవునిగూర్చి చేసిన తపఃఫలముగాఁగ, నతఁడె వీనికి నొసఁగె నె♦య్యంబుకతన.

తే॥ దీనిచేఁ దొల్లియింద్రు బం♦ధించివైచె, దీనిచేతనె మన హను♦మానుఁగట్టె
నిర్జరులు స్వర్గపాలన♦నీఁగెనదియు, దీనివలనన సుమ్మి వై♦దేహినాథ! ౧౯౧౩

తే॥ పట్టినట్టి వారల ప్రాణ♦వాయువులను, పీల్చికొనికాక యూరక ♦ వీడిపోదు
అజ హరాదులకును త్రోవ♦నలవికాదు, తక్కువారల సంగతి♦తలఁపనేల? ౧౯౧౪

మ॥ అన నైరాశ్యముచెంది రాఘవుఁడు రో ♦ షాక్రాంత చేతస్కుఁడై
కని యీపాశము నిచ్చి నాతని శిరః ♦ ఖండంబు గావింతునా?
మును లోకంబులఁ గాల్చి బూది జలధిం ♦ బూడ్చింతునా? లంక నీ
వనధిన్ ముంతున? యేమిచేసినను పా ♦ పంబింత చేకూరునే? ౧౯౧౫

చ॥ వరముల నిచ్చి యీభుజగ ♦ పాశము నిచ్చిన వారె వచ్చి సం
బరమునఁ గాతురేని తగు ♦ మన్ననఁ గాంతురు కావరేని శం
కరుఁడు పురంబులేర్చిన తొ ♦ గం ద్రిజగంబు లొనర్తు బూదిగాఁ
బురహరుఁ డడ్డమైన సుర ♦ పూజ్యుఁడు ధాతయు నడ్డు నిల్చినన్. ౧౯౧౬

శా॥ నాతమ్ముండె మృతిం భజించిన భువిన్ ♦ మన్నింప నాకేది? వి
ఖ్యాతిం గూర్చునదేది? నిందయని ప ♦ ల్కందగ్గదేదీ? జగ
త్పూతంబై తగు ధర్మమేది? కన మ ♦ ర్త్యుల్ దివ్యులున్ నాయెడన్
బ్రాఁతిం జేరి భజించుచున్న ప్లవగ ♦ వ్రాతంబుతో సాటియే? ౧౯౧౭

మ॥ అని రోషాకులితాత్ముఁడై పలికి మా ♦ యన్నిచుఁ డొక్కండు చిం
తను కల్గింపఁగ నాగ్రహించి జగముల్ ♦ నాశంబు గావించుటల్
మను వంశేంద్రులకున్ హితంబె యని సం ♦ భావించి నిట్టూర్చి ముం
దున నూయిన్ వెను గోయి యయ్యె ననుచుం ♦ దూపిల్లు సందేహులన్.

తే॥ రెండు తుండంబులున్న వే♦దండ మొండు, తోత్రమునకు భయంబంద♦తూలి తలరు
సరణి రాముఁడు ధర్మపా♦శమ్ముఁదడవి, నన్నుఁ జంపదో యిదియని♦విన్ననొందె.

—: గరుడుఁడు రాఁగా నాగపాశము వీడుట :—

తే॥ ఈస్థితి యిఁకెట్టి పరిణతి♦నెనయునొక్కొ, యని వియచ్చరుల్ చింతించు♦నదనునందు
ప్రక్కనే యున్న గరుడుండు♦బ్రాఁతివలనఁ, గరఁగి చీఁకటిలో నటఁ♦గానవచ్చె.

సీ॥ కలఁగని హృదయంబు♦కలఁగుటచేఁ జింత, తగని డెందంబున ♦ నొగులువాఁడు
లంకేశుఁ గాంచిన ♦ లలి జగంబులఁ గాంచు, వడువున కారాట♦పడెదువాఁడు
పక్ష మారుత వేగ♦బలమున దిగ్దంతి, నేత్రముల్ మూయంగ♦నెగడువాఁడు
తన మేనికాంతి భూ♦తల వియత్తలములఁ, బట్ట పగలు చేయ♦వఱలువాఁడు

తే॥ దూరదర్శిచక్షువులతోఁ ♦ దోయజాక్షు, మేనుగాంచియుత్సాహంబు ♦ మీఱువాఁడు
కడలి తరఁగలు చెదరఁ జీఁ ♦ కటులు బెదర, వచ్చువాఁడు నభశ్చరుల్ ♦ మెచ్చువాఁడు.

సీ॥ పాపజాతి కలఁగఁ ♦ బాఁపజాతి నలఁగ, దర్శన స్పర్శనో ♦ ద్ధతి గలాఁడు
అరులు గిరులఁ దూఱ ♦ నిరులు దరులఁ జేర, బలువు చెలువు మేనఁ ♦ గలుగువాఁడు
అలరు లత్తుక మేను ♦ వెలరు కుత్తుక జాను, గలుగు వెలుఁగుతోడఁ ♦ జెలఁగువాఁడు
గుణ భూషణముల భా ♦ షణ భూషణముల స, న్మణి భూషణమ్ముల ♦ మలయువాఁడు

తే॥ ఒడలివలన వెన్నెల లెండ ♦ లొలయుచుండఁ, గనకగిరిమీఁది భానుని ♦ కరణి నొప్పి
శీర్షమున రత్నమకుటమ్ము ♦ చెన్నుగులుక, వైనతేయుండు జానకీ ♦ జాని డాసె.

సీ॥ కాలమేఘములీలఁ ♦ గ్రాలు మేనిని గాంచి, చిరము నమస్కృతుల్ ♦ సేయకుంట
ధ్వజముపై నుండి స ♦ ర్వ జగంబులనువొందఁ, గావించు వినుతులు ♦ గానకుంట
వాహనమై లోక ♦ వంద్యత్వము చిరమ్ము, మఱచిపోవఁగఁ జాలి ♦ నులయుచుంట
తల్లిని పాసిన ♦ పిల్లకై వడిఁ జాల, కాలంబు ప్రభుఁ బాసి ♦ క్రాఁగుచుంట

తే। తలఁచి తలఁచి మెత్తనగఁ జి ♦ త్తంబు కరఁగ, లోకమూలకారణ రమా ♦ లోల! వరద!
బ్రహ్మరుద్రాది దేవతా ♦ వంద్యనామ! రామ! చింత యేలనుచుఁ జే ♦ రంగవచ్చె.

తే॥ మాయ జగమిది సర్వంబు ♦ మాయ నీవు, మాయకాఁడవు నీదగు ♦ మాయ నెఱుఁగ
నెవరు వలఁతు లీమాయ ని ♦ న్నేమి సేయు? విశ్వజనక! విశ్వోదర! విశ్వసాక్షి!

సీ॥ ఆద్యమై కాంచి మ ♦ ధ్యమ్మయి పోషించి, యంత్యమై పరిమార్తు ♦ వరయ జగము
లన్నిట నుండు వి ♦ ప్రాప్తి యొసర్తువు, నరుఁడవై యొరులచే ♦ వరముగొందు
సీసములుగఁ గమ ♦ లాసన రుద్రులఁ, జేసి వారలతోడఁ ♦ జెలఁగుచుందు
తలఁపున సృష్టింతు ♦ తలఁపున విలయంబు, నెసఁగింతు వీవు ల ♦ యింపకుందు

తే॥ విట్టి పద్ధతి యిసుమంత ♦ యెఱుఁగఁగోర, నంధులంజేసి చీఁకటి ♦ యందు నిలుతు
వహహా! జాణతనంబో? పి ♦ న్నాటయేమొ? యరసి పలుకంగ నేరికి ♦ నైతి గాదు.

సీ॥ జీవిత మొసఁగుదు ♦ చెడక నైజస్థితి భావియం దుందువు ♦ వాంఛ గొనవు
దొరకనిత్తువు కొన్ని ♦ దొరకనీయవు కొన్ని, దొరకిన యవికూడ ♦ దోఁతు కొన్ని
పసిబిడ్డ నేడ్పించి ♦ పండిచ్చు కరణి దుః, ఖంపఁ జేయుదువు సు ♦ ఖంపనిత్తు
వాహారమగుదువు ♦ ప్రాణంబు నగుదు దో, బూచులాడుచునుందు ♦ తోఁచకుందు

తే॥ కానబహురూపుఁడనుచు నే ♦ కంబయనుచు, నందరానివాఁడంచు మా ♦ యావియంచు
జ్యోతియంచు నానందమ ♦ యుండవంచు, శ్రుతులు బహువిధంబులుగ వా ♦
క్రుచ్చుచుండు. ౧౯—౨౬

సీ॥ ఆస్తికు లౌనన ♦ నాస్తికుల్ లేదన, నెసఁగు నేర్పులకు దా ♦ విత్తువేల?
బహుళశంకలకుఁ దా ♦ వలమిత్తు వదియేల? మాయలతోడనే ♦ మలయుటేల?

పలువిధ మతములు ♦ ప్రబలనిచ్చుట యేల ? జనులు తన్నుఁ గలాడఁ ♦ గనుటయేల ?
పాపంబులను తోల్తఁ ♦ బండనిచ్చుట యేల ? మొలకలో గిల్లుట ♦ తెలియవేల ?
ఆ॥ మొలవ నిచ్చు టేల ? ముదుర నిలుపు టేల ? శ్రమలఁ బొంది తుదకుఁ ♦ జదుపనేల ?
తెలిసి తెలియకుండు ♦ తెరచాటు బ్రదుకేల ? సృష్టి పఱుపఁ గిట్టు ♦ చంపు టేల ? ౧౯౨
సీ॥ మఱచిన తెఱఁగేలఁ ♦ మఱవని వెరవేల ? యెఱుఁగకుండుటయేల ? ♦ యెఱుఁగు టేల ?
వదలియుండుటయేల ? వదలకుండుటయేల ? ♦ యంటియుండుటయేల ? యంటమేల ?
ఒక్కరూపంబేల ; పెక్కురూపము లేల ? తిను టేల తిండికై ♦ తిరుగు టేల ?
పుట్టించు టదియేల ? పొలియించు టదియేల ? నడుమఁ జిక్కులు వెట్టి ♦ నలఁచు టేల ?
తే॥ దేహమును పొందు టేల ? యీ ♦ త్రిప్పు టేల ? ధర్మ సంస్థాపనమునకో ? ధరణిజనుల
కెల్ల నాదర్శనమునకో ? యేమి తెలియు ? నీదు మాయలు కల్లలో ? నిక్కువములో ?
సీ॥ కర్మఫలంబుల ♦ కై జన్మ మొసఁగెదు, కర్మల నంటక ♦ కదలువారి
కానంద మొసఁగి త ♦ న్మానసంబుల నుందు, మునులకు మొదలి ము ♦ మూర్తులకును
జ్ఞానులౌ వారి క ♦ జ్ఞానులౌ వారికి, నెల్లవారికిఁ దెల్ల ♦ మెఱుఁగఁబడవు
పెనఁగినవారు చ ♦ చ్చినవారు కని దుఃఖ, మొందువారలయందు ♦ నుందువనుట
తే॥ యిప్పు డిచ్చట నీయొద్ద ♦ నెఱుఁగనయ్యె, వెడఁగు వెడఁగు వివేకి వి ♦ వేకమీవు
నీది స్థిరగుణం బెయ్యదో ? ♦ నిశ్చయముగ, నెఱిఁగి కొఱలేక యెఱిఁగింప ♦
నెవరి తరము ? ౧౯౫

తే॥ కార్తికేయకందము నోల్వఁ ♦ గడఁగునంత, లోన నేమియు లేకుండు ♦ జానుదోఁప
నీ వవతరించియును నిజ ♦ మెఱుఁగనీవు, నీదు మాయలఁ దెలియంగ ♦ నేరమయ్య !
తే॥ అని నుతించుచు గరుడుండు ♦ తనువుదీప్తిఁ, దమముఁ దోలుచు రాఁగాంచి ♦ దాశరథియు
వింతవాఁడెవఁ డని చూచు ♦ నంతలోన, వచ్చి చెంగట నిలిచె స ♦ ద్భక్తిఁ దోలఁక.
†చ॥ నిలిచినయంత నాగములు ♦ నెమ్మదిగా ధనముల్ గుణంబు ని
ర్మల యశముల్ గలట్టి విభు ♦ మన్ననఁ జెందిన వారి యంగదల్
తొలఁగిన చందమై కలువ ♦ తూఁటికి సన్నని దారమంతయుం
దెలియఁగ రాక మాయమయి ♦ తీఱె జగంబులు సంతసిల్లఁగన్. ౧౯౬
క॥ ఎఱకల కరువలిచేఁ దమి, పఱచుటయే గాక మేనఁ ♦ బ్రబ్బిన యలుఁగుల్
తొఱఁగెను దద్దులతోడను, నెఱి తెలివరి కంటఁ గట్టు ♦ నిందయుఁ బోలెన్
తే॥ క్రూరకర్మ లధర్మ లిం ♦ ద్రారులందు, మందునకు నొక్కఁడే నును ♦ ఱొందలేదు
క్రొత్తసృష్టిలో జీవుల ♦ కొమరుదాల్చి, వానరులు లేచి యుత్సాహ ♦ వంతులైరి.

---

† ఇంద్రజిత్తు ప్రయోగించిన నాగములు తిరువళ్లువర్ నెల్లూరున నుదారుండగు జటప్ప తమ్మని శరరాముని గాంచిన యాచకులయు బంధులయు ఆఁకలివలె తొలఁగినవి. అనియూలము.

ఉ॥ నీతివిదుండు రాఘవుఁడు ♦ నెమ్మది లేచి నమస్కరించు వి
ఖ్యాత చరిత్రు లక్ష్మణుని ♦ గాటముగాఁగఁ బరిష్వజించి యి
ట్లీతఱి బాముగూర్చు విధి ♦ యే తొలఁగించె నటంచు వానర
వ్రాతముఁ బ్రాణముం బలెఁ గ♦రంబున దువ్వుచుఁ బల్కెఁ దార్క్ష్యతో.

మ॥ స్థిర దోషాకరు లీల నొప్పు నఖ రా♦జింబొల్చు పుణ్యాత్మ! దు
ర్భర దుఃఖాంబుధినుండి తేల్చితి తపః♦ప్రాప్తార్థ పుణ్యంబు నాఁ
గరుణామూర్తివి నీకుఁ బ్రత్యుపకృతిం ♦ గావింప నేముందు? స
త్పురుషుల్ ప్రత్యుపకారమం గొనఁగ సం♦తోషింతురే యెవ్వెడన్?

శా॥ ఏమిం దోఁపక వేఁగుచున్న యిటకీ ♦ వే తెంచి మాప్రాణముల్
ప్రేమన్ వెండి యొసంగి కాచుటలతో ♦ విజ్ఞోపచారోక్తు లి
ట్లామోదంబుగఁ బల్కుచుంటివి మహా ♦ త్మా! దీనికిన్ సాటిగా
మేమేకానుక లీయఁగాఁగలము? మా♦మేరల్ మహాల్పంబులౌ. ౧౯-౩౮

శా॥ సందేహించుచునున్న ప్రాణముల ని ♦ చ్ఛంగూర్చు పూజ్యాశయా!
ముందెన్నండును చూడలేదు చెలిమిం ♦ బొల్పార దొక్కండు మా
యందుం గైకొనలేదు నీకుఁ గొఱయే ♦ యుండంబునన్ లేదు మా
చందంబారసి తెల్పు చేయఁదగు క ♦ ర్జం బెద్దియే నున్నచో. ౧౯-౩౯

మ॥ అను శ్రీరాముని ప్రేమపూర్ణ విమల ♦ వ్యాహార మాలించి య
ప్వినతాపుత్త్రుఁడు కేలుమోడ్చి యనఘా! విద్వి ద్వ్యథానంతరం
బున వత్తున్ మన ప్రాఁత చుట్టఱికమున్ ♦ మోదంబుతోఁ బూర్తిగా
విన వాక్రుచ్చెద పీడుకొలె యనుచున్ ♦ విచ్ఛేయుదుం గాంచుచున్.

చ॥ పిలువక వచ్చి జీవములఁ ♦ బ్రీతి నొసంగె నుదారుఁ డీతఁ డే
వలనను మాఱుమేలు మన ♦ పాల గ్రహింపఁడు లోకమందు పు
ణ్యులు తమయంత వచ్చి జని ♦ నొవ్వులఁ దీర్తురు గొప్పలాభముం
దలఁచియొ వారిదంబు జన ♦ తా ఘన తాపము పాపుచుండుటల్?

చ॥ అని రఘురాముఁ డాడఁగ మ ♦ హాబల సూనుఁడు దేవ! లక్ష్మణుం
డని మరణించె నంచు మిథి ♦ లాధిప నందన కుందు నొందుఁ గా
వున విజయోద్ధతి స్నిదురఁ ♦ బొందిన రక్కసిమూఁక భీతిలన్
గొనకొని సింహనాదము న ♦ కుంఠిత రీతి నొనర్తమా యనన్ ౧౯-౪౦

మ॥ ధరణీజాపతి మంచిదే యనఁగ స ♦ ప్తద్వీపముల్ సప్త సా
గరముల్ సప్త కులాచలంబులు కలం ♦ గన్ సప్త మేఘంబులున్
బరపై తాళుల రాల్ప దిక్కు లగలన్ ♦ బ్రహ్మాండ భాండంబు చిం
దఱగా వానరవీర సంతతి మహా ♦ ధ్వానంబు గావింపఁగన్. ౧౯-౪౧

మ॥ అకలంకాత్మ ధరాత్మజాత మదిలో ♦ నారాటముం గూర్పఁ ద్ర్యం
బకు వక్షంబునఁ గాఁడు మారుశరముల్ ♦ వక్షంబుఁ దొల్వంగ స
జ్జక సెజ్జం బొరలాడు పంక్తిముఖుఁ డా ♦ శబ్దంబు నాలించి యిం
చుక యోచించి నిజస్థితిం దెలియఁగాఁ ♦ జూచె౯ విలోలాత్ముఁడై. ౧౯౪౩

మ॥ జనకాజ్ఞ౯ జడలూని ధర్మమును సం ♦ స్థాపించి దుష్పాప వ
ర్తనులం గూల్పఁగఁ గంకణంబు గొను శ్రీ ♦ రాము౯ మనంబందు చిం
తన గావించుచు నున్న సీతయును సీ ♦ తాదేవిపైఁ బ్రేమ ని
ల్పిన మూర్ఛుండును తక్క నిద్రిలని జీ ♦ విం గాన మాలంకలో. ౧౯౪౪

మ॥ ఆ శబ్దంబును విన్న రావణుఁడు కో ♦ పావిష్టుఁడై లేచి యా
కీశవ్రాతము లక్ష్మణుండు ననిలోఁ ♦ గీడొంది రన్నట్టి సం
దేశం బెంతటి సత్యమో ? యినకులా ♦ ధీశాస శింజాన మా
కాశం బంటెను వానరావళుల పె ♦ న్గర్జా నినాదంబుతో. ౧౯౪౫

తే॥ రామ కోదండ మొసఁగె ని♦ర్ఘాతరవము, లక్ష్మణుని ధను వండగో♦శముఁబగిల్చె
హనుమ గర్జ శ్రవణభేరి♦యగలఁజేసెఁ, దరణిసుతు గర్జనంబు రో♦దసిని నించె.

తే॥ అంగదుం డార్చుచుండె నీ♦లాది కేశు, లుత్సుకత్వంబుచేఁ జేయు♦నుగ్రరవము
బ్రహ్మగోళంబులోన వె♦ల్పలను నిండెఁ, బాశమున నుండి వారు వీ♦డ్వడిరినిజము.

క॥ అనిలేచి పంక్తి కంఠుఁడు, చనియెను వడి నింద్రజిత్తు ♦ సదనంబునకు౯
మునువెనుకల ఖడ్గులు దీ, ప నికరములు వట్టి దనుజ♦వనితలు నడవ౯. ౧౯౪౬

తే॥ చేలములు జాఱుచుండఁగఁ♦గేలఁబట్టి, నెఱి కురులు వ్రేల మత్తైక్య, ♦నిదురకనులు
వ్రాలఁ దడఁబడు నడకతో♦వచ్చినారు, మధ్యమధ్యఁదూఁగుచుఁదటి♦న్మధ్యలపుడు.

తే॥ మద్యపానంబు కూర్కు నా♦మధ్యఁ గలఙు, కనుల బరువును తోఁచితోఁ♦పనివిధమ్ము
పాట లందెల కోఁదిడి శ♦బ్దమ్ముగలుగఁ, దడఁబడుచు నడచిరి దేవ♦తరుణులపుడు.

తే॥ మొగులునకుసల్పుగల్పించి♦పొగలునించి, పూలుతుఱిమినట్లుండు కొ♦ప్పులును నీల
నయనములును కెంబెదవులు♦నొరు గలుగు, పడఁతు లూఁగుచుఁ దూఁగుచుఁ♦
బడుచుఁ జనిరి. ౧౯౫౧

సీ॥ మధురసాలామృత♦మాధుర్యములఁజేర్చి, కలుకుల పలుకులు♦గాఁ గదించి
హరిణ మత్స్యాబ్జంబు♦లందలి సౌందర్య, ములఁ దీసి సోగ క♦న్నుల నమర్చి
తక్కు సుందర వస్తు♦తతినుండి కొన్నట్టి, మురువున నవయువ♦ములు సృజించి
చిత్రసృష్టిగ బ్రహ్మ♦చేసిన చెలువలు, దశముఖు నిరువెస♦దవిలి రాఁగఁ

తే॥ ప్లవగ భీకర రవములు♦చెవులఁబడుడుఁ, బిడుగు రొద విన్న భుజగుల♦వడువుగాఁగఁ
సింహ గర్జనమును విని♦చిదగొదవడుఁ, వారణముల చందము దైత్య♦వరులు పొంద.

తే॥ త్వరగఁ జని పెద్దకొడుకు సౌ♦ధంబుచేరి, గాయములనుండి నీచూరఁ♦గ్లమముసెంది
సింహఘాతంబుచేఁ జేవ♦చెడిన గజము, చెలువునను బెగ్గిలెడి యింద్ర♦జితునిగాంచె.

ఉ॥ లేచి నమస్కరించు దిట ♦ లేక కరంబులు శక్తిహీనతం
దోఁచు విధంబునన్ వినతి ♦ తో మెలమెల్లన మ్రొక్కు పుత్త్రకున్
జూచి యిదేమి చాల శ్రమ ♦ స్రుక్కితి? వేమి ఘటిల్లెఁ? జెప్పుమా
ద్వాఁచక యంచుఁ బల్కుఁలు లె ♦ దంగొని వేఁడఁ గుమారుఁ డిట్లనున్.

చ॥ కవచము పట్టు వీడినది ♦ గాటపు టొమ్మునఁ జెప్పరాని లా
ఘవమున దూసిపోయినవి ♦ కాండచయమ్ములు మేరమీఱి దా
నవకుల చంద్ర! మిక్కిలిగ ♦ నల్లయు వెల్వడె మేనుసోలె మా
య వలన లక్ష్మణుండు మృతి ♦ నందకయుండిన నేమియాదునో? ౧౯౫౫

చ॥ హరిహయుఁడున్ హరుండు హరి ♦ యర్కుఁడు మున్నగువారు సేయు సం
గరముల నింతగా నలయి ♦ కం గొనలే దిపు డాడునట్టి దీ
న రవము మున్నొకప్పుడుఁ గ ♦ నంబడ దమ్మనుజేంద్రు బల్మి య
జ్జరె! వివరించి తెల్ప నొక ♦ చాపముతోడిది గాదు నాయనా! ౧౯౫౬

చ॥ అనుజుని శక్తియిట్టి దగు ♦ నగ్రజు శక్తి తలంచి చూడఁగా
మనకది తెల్పఁగా వలఁతి ♦ మాత్రము గాదు పయిన్ మఱేమిగాఁ
జనునొ వచింపఁగాఁ దలఁపు ♦ చాలదు చూచెదుగాక గెల్వమే
మనకగు నంచు నిక్కుటలు♦మా పొరపాటగు మాను నాయనా! ౧౯౫౭

ఉ॥ వానరవీరులం దునిమి ♦ వారక లక్ష్మణుఁ గూల్చి గెల్వమున్
నేను గడించుటల్ వినుము ♦ నిక్కము మాయను నాగపాశముం
బూనుటచేతనే; యిఁకను ♦ భూమిజభర్త యొకండ నిల్చెఁ బైఁ
గా నగు కార్యమెల్ల జరు ♦ గందగు నంచు వచించు నంతటన్. ౧౯౫౮

ఉ॥ రావణుఁ డిట్లనున్ గుణ వి♦రావము లక్ష్మణు వింటినుండి పై
తావులు బ్రద్దలౌ నటులు ♦ త ర్కొనె వానర సింహనాదముల్
మేవుకొనెం దివంబు రణ ♦ మేదినిఁ బుట్టిన గొప్ప ఘోషముల్
నీవు వినంగలేదొ యన ♦ నివ్వెఱఁగొంది కుమారుఁ డిట్లనున్. ౧౯౫౯

ఉ॥ వారలు నాగపాశమున ♦ బంధితులైరి మొగంబులందు తే
జో రమ డిందెఁ జావక య ♦ సుప్రజ మొందుట సత్యమానొకో?
యేరికి దానిఁ దప్పిఁకొన ♦ నిమ్మగుఁ? దప్పిన దైవశక్తికిం
దూఱు ఘటిల్లదే? యనుచుఁ ♦ దూఱి తలంచుచు నుండు నంతటన్.

ఆ॥ వేగు లరుగుదెంచి ♦ విభునకు మ్రొక్కంగ, నాతఁ డాత్రపడుచు♦నడుగునంత
వారలిట్టు లర్థ♦వంతమౌ వాక్కులఁ, బలికి రధిక నయము♦భయము గదుర.

ఉ॥ పాశ నిబద్ధులై శర వి ♦ పాటిత దేహులునై రణంబునం
గీశులుఁ దమ్ముఁ డుండఁ బరి ♦ కించి యలంగి తపించి యేడ్చె సీ
తేశుఁడు మిక్కిలిం గినిసి ♦ యిత్తఱి లోకములెల్ల నొక్కటన్
నాశ మొనర్తునంచు జత ♦ నం బొనరించుచు నుండునంతటన్. ౧౯౬౨

చ॥ గరుడుఁడువచ్చె వాని యెస ♦ కంబగు రాకను గాంచి నాగముల్
తురతురఁ గట్లువీడి చిఱు ♦ తున్కలుగా నశియించె వారిౘము
మ్మరమగు మేనిగాయములు♦మాసెను మున్పటికంటెఁ దేటయున్
దిరము బలంబు గల్గి యటు ♦ తేఁకువ నార్చిరి వార లయ్యెడన్.

ఉ॥ నావుడు రావణుం డనియె ♦ నాదు కుమారుని నాగపాశ మీ
శేవను వైనతేయుఁడు ఘ ♦ టిల్లఁగ నాశిలెనేమి? వానికిం
గావర మింతగల్గెనె? వి ♦ కావిక లయ్యెను నా ప్రయత్నముల్
నా విధులిట్టులై వెలుఁగ♦నా గరువంబును మంటఁ గల్పనే? ౧౯౬౪

సీ॥ పదునాల్గు లోకంబు ♦ లుదరంబున నడంచి, పీడుచుండు ననెడి ♦ వెడ్డుకీర్తి
పడసిన వెన్నుండు ♦ బవరంబు నాతోడ, నొనరించు నాఁడు భీ ♦ తిని వహించి
జగములన్నియుఁ బెక్కు♦సార్లు చుట్టిననాఁడు, డాఁగురించి కడలి♦డాఁగునాఁడు
అల్ల వైకుంఠంబు ♦ కొల్లవెట్టిననాఁడు, నాశరమ్ము లురమ్ము ♦ నాటునాఁడు
తే॥ బరియలును వీఁపు బాహువుల్ ♦ నెఱఁకులంటఁ, గ్రుచ్చి తఱిమిననాఁడు నీ ♦ గ్రుడ్డిగరుడి
చూడదో? శక్తిలేదో? పి♦చ్చుకలమీఁది, కేగెనో! నాఁటి కడిమి నేఁ♦డెఱుఁగ దేమొ?

తే॥ కాఁగలది కాకమానదు♦కడచి బ్రదుకు, వారి నెట్లయినం జంప♦వలయుఁగాదె?
యీావ తగుదు చేయుము తార్క్ష్యుఁ♦డీలనొంద, ననుదు మేఘనాదుఁడు తండ్రి ♦ కనియె నిట్లు ౧౯౬౬

తే॥ నేఁడు మాత్రము శ్రమనీఁగ♦నిలిచి యెల్లి, వెడలి బ్రహ్మాస్త్రమున మనో♦వేదనంబు
నీకుఁ దొలఁగింతు ననిపల్కి♦నిర్జరారి, మంచిదని చేరెఁ దన తల్ప♦మందిరంబు.

శ్రీ శ్రీ శ్రీ

శ్రీ రామ.

కంబరామాయణము.

యుద్ధకాండము :: ఉత్తరభాగము

౧౯ సేనానాయక వధ పటలము. (౧౦౨)

తే॥ మిన్నలము పెడబొబ్బలు♦విన్న దైత్యు, లడరి శంఖ భేర్యాది వా♦ద్యములు చెలఁగ
సమర కౌతూహలంబు డెం♦దములఁ బొడమ, ససురవిభుఁ జేరి యానతి♦యడుగునంత.

తే॥ బవరమునకీవుసమ్మహా♦పార్శ్వతోడఁ, బొమ్ముధూమ్రాక్షయను దశ♦ముఖుని గాంచి
విన సహింపక దూతలు♦వీరుచేయు, చేఁత లించుక వినుఁడని♦చెప్పిరిట్లు. ౨

చ॥ రథములు వోవ వారణ తు♦రంగములెల్ల నశింప రాక్షసుల్
క్రుధగొని పోరునేసి యనిఁ ♦ గూలఁగ నింద్రజి యొంటి నిల్చుచో
వ్యథగొని లక్ష్మణాస్త్రములు ♦ వచ్చెనదో యిదో యంచుఁ గొంకుచున్
బథము దొలంగి వావిడిచి ♦ పాఱినవారలు ధీరులే యనన్. 3

తే॥ క్రూరకర్మంబులను జంకు♦గొంకు లేక, చేసి యలవాటు పడినట్టి♦చేయిగాన
దశముఖుం డదివిని ఘోర♦దావవహ్ని, కరణి మండుచు వారలఁ♦గట్టఁబనిచి. ౪

—: రావణుం డింద్రజితునిచక్రరక్షకుల ముక్కులుగోయ నాజ్ఞాపించుట :—

తే॥ వీరిసేవ యిట్టిది యంచు♦నూరివార, లెఱుఁగ నాసికగోసి యూ♦రెల్లఁ ద్రిప్పి
విఱువుఁ డంతియచాలును♦వేఱువలదు, పొండనఁగఁ గింకరులు కోయఁ♦బూనునంత.

ఆ॥ వలదు వలదటంచు♦వారల కడ్డంబు, వచ్చి యాఁపి పంక్తి♦వదనుఁ గాంచి
యేమిసేయఁదలఁచి♦తిది ధర్మమే? యంచు, మాల్యవంతుఁ డనియె♦మఱియునిట్లు.

చ॥ గెలిచినవార లోడుటయు ♦ గెల్వనివారలు వెండి గెల్చుటల్
తలఁపఁగ నైజమై పొసఁగు ♦ ధారణియందు మగంటిమిన్ సదా
చలనములేక నిల్చుకొనఁ ♦ జాలినవాఁ డొకరుండు కల్గునే?
వలపులఁ గూర్చుచుండు జయ ♦ పంకజగేహిని దాంతచిత్త యే? ౭

తే॥ పరబలం బించుకేనియు♦నరయవలదె?, తొల్లి నిర్జర సేనలు♦వెల్లివిరిసి
వచ్చి యోడవె? యంతతో♦ [illegible]

చ॥ వరుణుఁడు కంపితాంగుఁడయి ♦ పార్థివ వీరుని చేరవచ్చి తా
శరణమునొంది జీవముల ♦ జానుగ నిల్పుకొనంగఁజాలె నీ
పురువులు చూడ లెక్కకును ♦ పోల్పఁగఁజాలినవారె? ఘోర సం
గరమున వారితో నెదురఁ ♦ గా వశమే? యిది నీవెఱుంగవే? ౯

క॥ పొలిసె నలువది వెల్లువల్♦కలనియందు, వీరు ముప్పరే ప్రాణమ్ము♦లార నిలుపు
కొన్న వారు గావున వీరి♦కన్న నెవరు, ప్రథన చాతుర్యమును బయ♦ల్పఱచినారు?

చ॥ చెడియెను నాగపాశమును ♦ చేడ్పడి యర్థముకంటె హెచ్చుగా
మడిసె బలంబు నీవు నని ♦ మానవనాథుల నేర్పు పెంపు ను
గ్గడువుగఁ గాంచివచ్చితివి ♦ గాదె కుమారునితోడ నుండమిఁ
జెడుగుగ నెంచి ముక్కలను ♦ చెక్కదె? యియ్యది యుక్తకార్యమే?

తే॥ లక్ష్మణుని పేరుసెప్ప నీ♦లంకలోని, జనులు తమతలుపుల మూసి♦కొనెడివారు
ఎవరినాసిక గోసెదో♦యెంచిచూడు, జగము కలదాఁకఁ గోసిన♦సమయునేమి? ౧౨

తే॥ దూతయై వచ్చినట్టి వా♦తూలసుతుని, ఢాకకోడి ప్రెుక్కినవారు♦సోఁకులందు
పెక్కురున్నారు వారలు♦ముక్కలొంది, యున్నవారలు కోయక♦యుంటివేల?

ఉ॥ సీతను వీడమిం గలుగు ♦ చిక్కులచే మనవీరు లెందఱో
యీతల శత్రురాజి వధి ♦ యింపఁ బ్రతిజ్ఞలు చేసిపోయి రా
రీతిగఁ జేసివచ్చు నొక ♦ రిం గనమింతకు రామలక్ష్మణుల్
సీతలఁద్రొక్కి నిల్చి రిఁక ♦ నెవ్వఁడి నెల్లర ముక్కలూడ్చెదే? ౧౪

చ॥ అనవిని వారు డెందముల ♦ సంజిక యించుక మాని కేలు మో
డ్పును గదియించి దైత్యకుల ♦ ముఖ్యుని గాంచి క్షమింపుదేవ! మా
మనముల నెందు రోసినను ♦ మాయలు మోసము లేదు సంగరం
బున ఘటియించు దుస్థితులఁ ♦ బూర్తిగఁ దెల్పెద మాలకింపుమా. ౧౫

మ॥ విరథుండై తనయుండు శక్రజితుఁడే ♦ విన్వీథి కేతెంచి శం
బర మాయల్ పచరించి ప్రాణములతో ♦ బైల్వడ్డవాఁడయ్యె మా
తిరముల్ సెప్పఁగనేల? దేవ! యిఁక ధా ♦ త్రీనాథ శీర్షంబులన్
జరణాబ్జంబులచెంత నుంచెదము ని ♦ చ్చల్ నీవు మోదింపఁగన్. ౧౬

ఉ॥ పంపుము పంపితేని యన ♦ వద్య రణంబున నేఁట రేపటన్
చంపిర యంచొ చంపఁబడి ♦ చచ్చిర యంచునొ విందుగాని వం
శంపు గురుత్వమే చెడఁగ ♦ జాఱిరి తాఁటిరి పాఱిరంచు నీ
చంపు వచస్సులన్ వినఁగఁ ♦ జాలవు మన్ననచేసి పంపవే. ౧౭

చ॥ అని శపథంబు సేయుటయు ♦ నాయుధపాణుల బంతి వెల్వలన్
దనుజ వరేణ్యుఁ డంపె రథ ♦ దంతి తురంగము లన్నితోడుగా

ననుపుచు యజ్ఞశాత్రవు న ♦ హర్పతి శత్రుని మాల్యవంతుతో
ఘనుఁడగు వజ్రదంష్ట్రుని ని♦కాయముఁ గాయఁగఁ బంపు నంతటన్. ౧౮

ఆ॥ నింగి ప్రమింగె ధూళి♦నిర్జరేంద్రులు కనుల్, గప్పుసేన మేర♦గాంచలేక
కనులు మూసికొనిరి♦శరముల నెవరికి, నైతిగాక యుండె♦నరసి తెలుప. ౧౯

తే॥ కాళ్లు గలిగిన కొండల♦కరణినొప్పు, హస్తిఘటలపైఁ దెక్కెంబు♦లలల వీవఁ
గైదువు జలచరముల♦గతిఁ జలింప, నేమి రవముతో సేన వా♦ర్ధిని పోలె.

క॥ శరనిధికైవడి భేరులు, మొరసెను కరు లిరులతో న ♦ ముద్రముతో మ
చ్చరికముగొని గీపెట్టెను, హరులును సకిలించె మిత్తి♦యఱచినభంగిన్. ౨౧

క॥ నడగంద్రు నడచు జడుమున, నడవక సిడి లెక్కగొనక ♦ నాగంబులు పై
జడదముల జలముఁ బిల్పుచు, నడుగిడకయె నిలుచు నడచు ♦ నామిక తోడన్.

తే॥ కైదువులకాంతి భూషణ♦కాంతితోడఁ, దురగ వారణ స్యందన♦స్తోమములకుఁ
గల యలంకార కాంతితోఁ♦గలిసి పరవి, దశదిశల నున్న యిరులను♦తఱిమి చంపె.

తే॥ వచ్చు సేననుగని ధరా♦వరుఁడు కినిసి, దనుజచమువుతో వచ్చెడు♦ఘనుఁడు శక్ర
జితుఁడో కాఁడో తెల్పుమ యన♦శిష్టగుణ వి, భూషణుఁడు విభీషణుఁడు రా♦
మునకు ననియె. ౨౪

మ॥ గుహలోనుండి క్షుధాగ్ని రేఁపఁ బెలుచన్ ♦ ఘోషించుచున్ దుర్భయా
వహ రోమంబున నిప్పులం గురియుచున్ ♦ బాలేందురేఖా సమో
న్నహ దంష్ట్రా రుచులొప్పఁ దూణయులు ప్రక♦న్నం దాల్చి కైవింటితో
బహుళాభీలత వచ్చునాతఁడు మహా ♦ పార్శ్వుండు రాజోత్తమా!

క॥ జ్వాలాభీలములగు క్రూ, రాలస నేత్రములతోడ ♦ నలరారుచుఁ బె
న్నాలుక నార్చుచు వడి వా, తూలగతిన్ వచ్చువాఁడు ♦ ధూమ్రాక్షుఁడగున్.

ఆ॥ వదరుబోతు శూల♦పాణి! యీతల నీది, యా యటంచు డాయ♦నరుగువాఁడు
కాళులొప్పు కొండ♦కరణి వచ్చెడువాఁడు, వజ్రదంష్ట్రుఁ డనఁగఁ♦బరఁగువాఁడు

క॥ పెదవులఁ గొఱికెడు నాతఁడు, నెద గాలిని గెలుచు తురగ♦మెక్కినవాఁడు
న్మదుఁడు రణభయద రూపుఁడు, సదసద్జ్ఞ విహీనుఁడగు పి♦శాచుఁడు రాజా!

ఆ॥ వనధికంటె రవము♦వహ్నికంటెను వేఁడి, గలుగువాఁడు రథము♦గలుగువాఁడు
సూర్యశత్రు వనఁగ♦శోభిల్లువాఁడు త, త్ప్రాంతగతుఁడు యజ్ఞ♦వైరి యధిప! ౨౯

ఉ॥ ఎట్టని శాలి సస్యముల ♦ యెన్నులఁబోలు తురంగ సంఘముల్
బిట్టుగఁ గల్గువాఁడు రణ ♦ భీకర కర్ముఁడు నెట్టి కార్యముల్
వట్టుగఁ జేయఁగాఁ దగు త ♦ పః ఫలయుక్తుఁడు దూరదర్శియున్
గొట్టిన శూలినైత్తెడి య♦కుంఠిత సత్త్వుఁడు మాల్యవంతుఁడో. ౩౦

ఆ॥ అనుచుఁ దెలుపుచుండ♦నినకుల వరునకు, జయము జయ మటంచు♦సవ్వడించి
ప్లవగవరులు దనుజ♦బలములపై రాలు, తరులు గొనుచుఁ బోరఁ♦దఱిసినారు. ౩౧

ఆ॥ ప్రళయజలధినుండి ♦ వడగండ్లు రాలిన, కరణి విండ్లనుండి ♦ శరచయమ్ము
వెడలుచుండ శిరము♦లెడలి కోఁతులు పెద, వులను కొఱుకుచుట్టి♦యిలకుదొరలె.

ఆ॥ తరులు గిరులువైవఁ♦గరులును తురగంబు, లరదములును వీర♦వరుల శిరము
లాదిశేషు పడఁగ♦లడఁగంగఁ గుప్పలు, గూలిపడియెఁ గదన♦కువలయమున. ౩౩

తే॥ అమరవైరులు వైచు చ♦క్రములు త్రెంప, బాహువులు పాదములు పెను ♦ వాలములును
విఱిగి మోచిన గిరులతోఁ♦దరులతోడ, నడఁగి గ్రుక్కుమిక్కురనక♦పడియె హరులు.

తే॥ పరువడిం దెసలకు దాఁటు♦పాటవంబు, నెలయు ఘోటకరాజి నా♦శ్వికులు లేఁచి
వీచినట్టి తోమరములు♦వీరవర శ, రీరములఁ గ్రొచ్చి పుడమిని♦ఁ ద్రెంచి చొచ్చె.

తే॥ బిఱ్ఱుబిఱ్ఱున వనచరుల్ ♦ వీచు శిలలు, పడగ లురలంగ వోఘల ♦ పండ్లురాలఁ
దలలు వ్రీలఁ బాతకుల గొం ♦ తులును తునుఁగ, నేనుఁగులు పీనుఁగులుగాఁగ ♦ నిలను గూల్చె. ౩౬

తే॥ కరక లురలంగ గుహలకుఁ♦బరుగులిడెడు, చిలువలంబోలియాశ్వికుల్♦చెలఁగవైచు
శూలములు కుంతములు వాన♦రాలి యొడళ్లు, లందుచొచ్చి యుచ్చును సొమ్మ♦యలఁత యొసఁగ. ౩౭

తే॥ వారణములు తోఁకల మోఁదు♦వానరులను, దొలఁగివారలు కాళులఁ♦ద్రుంత్రుఁ వాని
కొంద ఱవ్వాని నెత్తి ర♦క్షోగణంబు, చదియవైచి యార్తురు రణ♦క్ష్మాతలమున.

తే॥ ముందునకుఁ ద్రోచికొని వచ్చి♦పొందనేయు, కపుల రాలచే నసురలు♦కలనఁబడిరి
వారి విండ్లనుండి వెడలు♦నారసములఁ, దునిసి పండ్లిగిలించి కోఁ♦తులును కూలె. ౩౯

మ॥ ధర నౌత్సుక్యముఁగూల్చ హేతువగు దు ♦ ర్దారిద్ర్య చింతార్తి యం
తరమం దెక్కుడుగల్గ వేదనను వం ♦ తంగుందు ఖిన్నాత్మ ము
క్కోరయంబట్టఁగ నూపి రూడునను లో♦కోక్తి క్రమంబంది వా
నర శైలంబుల స్యందనాశ్వములు భి ♦ న్నంబొంద నిల్చెఁ హరుల్. ౪౦

తే॥ మరణమొంద నాధోరణుల్♦మత్తకరులు, రక్తనదములఁ డెక్కెముల్♦రాజిలంగఁ
దిరిగె మాలుము లందఱుఁ♦ద్రెళ్లునంతఁ, గడలి స్వేచ్ఛతోఁ దిరుగాడు♦కలములట్లు.

క॥ పోఁడిమి చెడి యాశ్వికతతి, పాడఱఁ బంకమునఁ బడుచు ♦ వాంతుల రక్తం
బోడిగిలఁ గ్రక్కుచుండెడు, బాడబములు బాడబమ్ము♦ పగిదిందోఁచెన్ ౪౨

తే॥ వానరులు వైచు కొండల♦వలన నలఁగి, రూపుమాసిన దనుజుల♦కోపుచూడఁ
జిరము కూడిమాడిన వారి♦చెలులె వచ్చి, చూచి గుర్తింపరానట్టి♦చొప్పు గలిగె.

తే॥ హనుమ యెదిరించె ధూమ్రాక్షు♦నంగదుండు, మాఱుకొనియె మహాపార్శ్వ♦
మాల్యవంతుఁ
జెనకె నీలుండు పనసుండు♦ మొనసి తాఁకె, మాయియగు పిశాచుని రణ♦క్ష్మాతలమున
తే॥ సూర్యశత్రుని మార్కొనె♦సూర్యసుతుఁడు, యజ్ఞశత్రుఁ డీడాడె రా♦మానుజన్ము
వీరుఁడగు వజ్రదంష్ట్రుండు♦ బారిసమరు, చున్న ఋషభుని డీకొనె♦నుత్సహించి. ౪౫
ఆ॥ దనుజ నాయకులును♦వనచర నాయకుల్, కదనమందు దాఁకి♦కసిమసంగి
యొకరి నొకరు గెలువ♦నుత్సహించుచుఁబోరి, రుగ్రగతుల వేల్పు♦లుదరి బెదర.
ఆ॥ అట్లు పోరుచున్న♦యవ్వేడఁబదిలోన, నాఱువెల్లువలను♦హాౘియంబు
నలఁచె మిగిలినట్టి ♦ నాలుగు వెల్వాల, వెదకి లక్ష్మణుండు ♦ వేఁటలాడె. ౪౭
తే॥ కలిసినట్టి చందంబునఁ♦గాక యుదధి, రక్తజలధియే యిదియను♦రాణనొప్పె
ముత్తెములు గురిగింజల♦పోలుపుదాల్చె, మత్స్యములు పగడంబుల♦మాడ్కినలరె.
తే॥ జలధి యెల్లను రక్తమై♦వెలుఁగుచుండ, పలువిధంబుల రత్నముల్ ♦ పద్మరాగ
నరణిఁ గనుపట్టెఁ గుంభిమ♦స్తముల శుక్తు, లందుగల ముత్తెములునొక్క♦యంగమయ్యె.
తే॥ ముమ్మరంబగు పోరిట్లు♦ మొనయు తఱిని, మాఱుకొన్న చీఁకటులను♦మదగజములఁ
దునిమి నెత్తుటఁ దోఁగి యె♦ఱ్ఱనయి లేచె, ననఁగ భానుండు తోఁచె బూ♦ర్వాద్రిమీఁద.
తే॥ రాక్షసాంధకారముఁ దోలి♦రామరవియు, నిరులఁ దోలిన తరణియు♦నిరువు రొప్ప
జగము తమమను పేరు నా♦శంబు నొంద, నుల్లసిల్లిన గతిఁ గాంతి♦యొప్పమీఱె.
తే॥ తమము తొలఁగ రుధిర సాగ♦రమును కరులు, తెప్పఁ దేలిన జలధియుఁ♦గుప్పలైన
కుణప గణములు మితిమీఱి♦రణతలమున, నచ్చెరువుగఁ దోఁచెను భీతి♦పిచ్చలింప.

చ॥ ఉదయ గిరీంద్రమందు రవి ♦ యొప్పఁగ నెత్తురు వెంచలందునన్
మెదడుల పంకియం దొదిఁగి ♦ మిక్కిలి చుక్కలు తెక్కలున్న యా
ప్రదరములన్ శిలీముఖ వి ♦ వారము వ్రాలఁగఁ జచ్చువారివా
వదనములన్ జలేజములు ♦ వారక పూచిన చంద మేర్పడెన్. ౫౩

తే॥ కరులు హరులును తేరులు♦కలిసిపడిన, తలము విలయవాయువు వీవఁ♦గలఁగఁ బాఱి
యంబుదములు నక్షత్రంబు♦లమరరథము, లురలి ధరణిని కూలిన♦యొప్పుదోఁచె.
తే॥ విరియుకురులతో దనుజసుఁ♦దరులువచ్చి, యలమికొనఁ దమపతుల మే♦నులు రణోర్వి
వల్లులలమిన పెను వృక్ష♦వాటి కూలి, యున్న తెఱఁగునఁ గానంగ♦నొప్పెనపుడు.
తే॥ తమకు కౌసులు పీనస్త♦నములు రక్త, దీర్ఘ కుంతలములు గల♦తెఱవలు తమ
వరుల మస్తముల్ గొనకటఁ♦దిరుగుచుండ, భూతములఁబట్టి చీల్చెరి♦పొడము కినుక.
తే॥ ప్రియుని యవయవములఁ గూర్చి♦పెట్టి యొకతె, గుండెలను ప్రేవులను నక్క♦
గొనుచుఁబోవఁ
దఱుము త్రాణయులేక సం♦తాపమంది, కూలి జీవంబులను పాసి♦కూడెఁ బతిని. ౫౭

చ॥ పతుల భుజంబులం గొనుచుఁ ♦ బాఱెడు నక్కలఁ గాంచి దీన వా
క్ప్రతతుల వేఁడియుం గవిడక ♦ పర్విడ వెంబడినేగి కైదువుల్
కుతికిలఁగూలునట్లు వడిఁ ♦ గ్రుచ్చుకొనం గడునొచ్చి యేడ్చుచుం
వెతగొని ప్రాణముల్ తమకి ♦ వీడిరి చేడెలు కొంద ఱయ్యెడం. ౫౯

తే॥ కుణపరాసులలోఁ దగు♦లొక్కన్న పతుల, గాత్రముల వెదకుచునుండు♦కలువకంటు
లడవులం దమనంటులు♦విడిచిచనఁగఁ, దిరుగులాడు నాఁడునెమిళ్ల♦కరణి నుండ్రె.

తే॥ మడిచియున్నయూడులతోడఁ♦గెడసియున్న, చెలువులంగనిజారత్వ♦చిహ్నములను
మఱుఁగుపఱుచుచున్నారను♦మార్గబుద్ధిఁ, గినుకగొనిరి కొందఱు గోల♦వనితలచట.

తే॥ పతులమేనుల గుఱుతిడ♦వలనుగాక, జీర్ణ కవచంబులం దీసి♦చెట్టలపయిఁ
దమ నఖక్షతములఁ గని♦తలరి తలరి, పనవి కొందఱు జీవముల్♦పాసినారు. ౬౧

తే॥ అశ్రుపూరిత నయనలై♦యంబుజాస్య, లొక్క కొందఱుపతుల రో♦యుచుఁగడంకఁ
బీనుఁగులనుండి వెలువడు♦వెల్లులందు, పడి మునింగి జీవంబులఁ♦బాసినారు. ౬౨

—: ధూమ్రాక్షుండు హనుమంతునిచేఁ గూలుట :—

క॥ హనుమయు ధూమ్రాక్షుఁడు మం, దునకు వెనుక కడరి యడఁగి♦తూఁగొనుచును పై
కొనుచును సములై పోగిరి, వినుద్రిమ్మరు లెల్లఁగాంచి♦విస్మయపడఁగం. ౬౩

క॥ అసురయు నిరువది తూపుల, వెస మారుతి ఱొమ్ముదాఁక♦వీడిన నతఁడుం
విసిగి కసిమసఁగి పైఁబడి, పసచెడ నద్దనుజు తేరు ♦ భగ్నము చేసెం. ౬౪

క॥ తే రవియ నింగి కెగసిన, వీరుని కైనున్నవిల్లు ♦ విఱిచెను రామ
స్మారమణు తమ్ముఁ డురవడి, మారుతియును వాని నీడ్చి♦మహికిం దార్చెం. ౬౫

తే॥ ఈడ్చి కడలి దాఁటినకాల ♦ నెగసి తన్ని, నిప్పు లుమిసెడు శిరమును♦త్రిప్పిత్రిప్పి
యూడ్చి కడలిలోఁబడనూకి♦యుబ్బరించి, యార్చె వానరావళులు మే♦లనుచుఁబొగడ.

—: మహాపార్శ్వుఁ డంగదునిచేఁ జచ్చుట :—

క॥ కోపము కన్నుల మిక్కిలి, దీపములవిధాన మండఁ♦దివిరిన పొగలుం
ధూపములఁబోల నొదవిన, తాపములను లెక్కగొనక♦దర్పితమతులై. ౬౬

క॥ సాహసముమీఱ విజయో, త్సాహంబున నొకరికొకరు♦తగ్గక శర సం
దోహమున గిరుల నమర, ద్రోహి మహాపార్శ్వుఁ డంగ♦దుండును పోరెం. ౬౭

క॥ కరిపై నుండ వినరుగతి, శరవింశతి నంగదుని భు♦జము నాట నిశా
చరుఁ డేయ రేఁగి రాక్షసు, నరదముఁ బైకెత్తి తిరుగ♦నవనికి వైచెం ౬౮

తే॥ విరథుఁడై వింటి నావల♦విసరివైచి, మొనసి కుప్పించి దైత్యుఁ డ♦మోఘుమైన
శూలముం గొని ప్లవగరా♦ట్సూను వక్ష, మునకు నూటిగా గుఱిచూచి♦పూని యేసె.

క॥ మది సాధారణ శూలం, బిది గాదని యెంచి రామ♦నృపవరుఁడు మహా
ప్రదరంబునఁ దుత్తుమురుగాఁ, జెదరిపడఁగ నేసె సురల♦చిత్తము లలరన్. ८०
తే॥ శ్రీరఘుప్రవరునకు జే♦జే యటంచు, వంగదుండు మహాపార్శ్వ♦నడఁచి త్రొక్కి
పదములంబట్టి మిక్కిలి♦పంగటింపఁ, జెలఁగి నడిమికి రెండుగాఁ♦జీల్చివైచె. ८१

—: నీల మాల్యవంతుల యుద్ధము :—

తే॥ మాల్యవంతుండు నీలుండు♦మాఱుపడక, కదన మొనరించుచుండఁగఁ♦గాంచిసురలు
తొల్లి యింద్రుఁడు పంక్తి వ♦క్త్రుండు పోరు, సరణి నున్నది యని విరుల్♦చల్లినారు.
తే॥ నీలుఁ డొక్క శైలము వైవ♦మాలియన్న, విల్లు విఱిగె వాఁడును విల్లు♦విడిచి వాలు
పలక గొని యదలించుచు♦నిలువుమనుచు, నేలకుం దాఁటి యుక్కున♦నీలుఁ దాఁకె.
ఆ॥ వారలట్లు పోరు♦వడిఁగాంచి యెడసొచ్చి, కుధర మొక్కఁడెత్తి♦కుముదుఁడేసె
నుగ్గునూచ మగుచు ♦ భగ్గున మండుచు, నసుర తేరు గూలె ♦ నంతమీఁద. ८९
తే॥ వృక్ష మొక్కండు నీలుండు♦విసర దాని, మాల్యవంతుండు వాలున♦మాల్చివైచి
నీలు తలఁద్రెంప నెత్త నా♦కేలుతునిఁగి, నేలఁబడఁగూల్చె సౌమిత్రి♦నిశితశరము.
తే॥ శంపవంటి ఖడ్గముతోడ భు♦జంబు తెగియుఁ, గ్రమము చెడక దురము సేయు♦కఱకు సోఁకుఁ
గాంచి యిది యర్ధరఘుతోడి♦కయ్యమనుచు, నవలఁబోరక సౌమిత్రి♦యువలికేగె. ८८
తే॥ ఘనభుజుని రామునొద్దకుఁ♦జనుచునున్న, లచ్చుమనుఁ గాంచి యమరులు ♦ మెచ్చిపొగడి
రెవ్వ రీరీతి వీరత్వ♦మెసఁగియున్న, సమరధర్మంబు పాటించు♦చతురులనుచు. ८७
తే॥ యజ్ఞశత్రుండు వచ్చి రా♦మానుజున్ను, నిలిపి పొఱకుమని శర♦నికరమేయ
నాతఁడొక వాఁడియమ్ముచే♦నక్కవగుల, నేసి, కూల్చి యవ్వల రామ♦నృపుని చేరె.
తే॥ యజ్ఞశత్రుఁడు విలుద్రిప్ప ♦ నవనిఁగూలె, గండుమీఱి కాలంగేలఁ♦గ్రతువులందు
జార్చుశిలలు లేవయ్యె వై♦శ్వానరుండు, స్వేచ్ఛగాఁ గుండములయందు♦వెలుఁగసాగె.
తే॥ తనదు జనకుని మున్నొక♦తడవ యడ్డగించి పేరొందు రవిశత్రు♦నిఁటడంచి
తంఢ్రికిం దగు పుత్త్రుఁడన్♦తరము గాంచె, సూర్యపుత్త్రకుఁ డారణ♦క్షోణియందు ८०

—: ఋషభ వజ్రదంష్ట్రుల సమరము :—

తే॥ అగ్గలంబుగఁ దనతోడ♦నని యొనర్చు, వజ్రదంష్ట్రుని పెను తేరు♦వసుధఁగూల
హరులు సారథియును చది♦యంగ నొక్క, భూధరేంద్రమ్ముగొని ఋష♦భుండు వైచె.
తే॥ తెరుచదియఁ గార్ముకమును♦పాఱవైచి, దండముంగొని నేలకు♦దాఁటి పిడుగు
కరణి వజ్రదంష్ట్రుఁడు వాని♦శిరము మోఁదెఁ, జచ్చెఁ జచ్చెన యని కపుల్♦పిచ్చలింప

తే॥ వ్రేటుగొన్నట్టి ఋషభుఁడు♦వీఁక చెడఁగ, మరణవేదన నొందుచు♦మఱుఁగుచుండ
హనుమఁ డెడసొచ్చి యాదైత్యు♦నసురులంటఁ, బొడువవాఁడునుదండానఁ♦బొదివికొట్టె.
తే॥ కొట్టి చను వజ్రదంష్ట్రుని♦గూర్చిపట్టి, దండమును లాగికొని వాని♦పండ్లు లూడఁ
గొట్టి శిరమును మోఁది యా♦క్రూరుపేరు, వ్యర్థముగఁ జేసి శమనుని♦పాలికనిపె.

—: పిశాచుని యుద్ధము :—

తే॥ పనసుఁ డేయఁగ జివ్వఁన♦బలుకుఠాలు, మేనిఁజీఱఁ బిశాచుండు♦మిగులఁ గినిసి
తోమరముగొని వైవ ను♦త్తుంగభుజుఁడు, నెత్తు రోలుకుచుఁ బనసుండు♦నేలఁ బొరలె.
సీ॥ జలదమం దున్నాఁడొ? జలధిపై నున్నాఁడొ?, నేలపై నున్నాఁడొ? నింగిఁగలఁడొ?
వేలకొలంది గు♦ఱ్ఱాలు పాఱెడి నన్న, వడువున వాని త♦త్తడియుఁ దిరిగె
నేలఁ గాలూనక♦తేలికఁ దిరుగాడుఁ, గంటిచూపులకంటెఁ♦గ్రన్న నేగు
నెదకంటె వడినేగు♦నెచటనో గలదను, నంతలో డాయుచుఁ♦జెంత నిలుచు
తే॥ గరుడుకన్నను వడినేగు♦తురగముపయిఁ, దిరుగుచున్న పిశాచుని♦తీవ్రశక్తి
నోఁఱగికూలెఁగుప్పగఁబ్లవం♦గోత్కరంబు,తత్కృతముగాంచియటసుమి♦త్రాసుతుండు
ఉ॥ చండతరోగ్రుఁడై యనల♦సాయకముల్ బలువింటఁ గూర్చి యు
ద్దండ భుజాబలంబు చెలఁగఁ ♦ దార్చి పిశాచుని ఘోర శీర్షముం
జెండిన యంతఁ జేడ్పడక♦చేఁగల శూలము వీడకుండ నా
మొండెము మున్నుచేయు కొలఁ ♦ బూని నటించెను కొంతసేపటన్.
తే॥ క్షేమవార్తలు సీతకుఁ♦జెప్పుకరణిఁ, దుమ్మెదలు రొదచేసెను♦దిమ్ముపుట్ట
ధర్మదూతలు చేరిరి♦దక్షిణమున, కసుర దూతలు లంకకు♦నరిగినారు. ౮౯
ఆ॥ అరిగి విభుని చేరి♦యంజలి ఘటియించి, విజయవార్త దెలుపు♦వీలులేమిఁ
జింతతోడ జవము♦చేవయుఁ గల మన, సేన మడిసె ననుచుఁ♦జెప్పినారు. ౯౦

౭౦ మకరాక్ష వధ పటలము. (౩౮)

క॥ చారుల వార్తలు విని లం, కా రమణుఁడు సంతపించి♦కాలాహి క్రియన్
దోరంపు టూర్పు పుచ్చఁగ, నారసి మకరాక్షుఁ డిట్టు♦లనియెం గడిమిన్. ౯౧
మ॥ అనిలోఁ దండ్రి ఖరున్ వధించిన మహా ♦ హంకారులం ద్రుంపఁగా
నను పంపం దలపోయ కుంటివి తగ ♦ న్నాశౌర్యముం గాంచవో?
యనుపంగాఁ గలవంచు నోర్చితిని చిం ♦ తావాప్తి నీకేల? భూ
జనులా నన్నెదిరించువారు? సుమన ♦ స్సంఘంబులున్ లెక్కయే? ౯౨
ఉ॥ కన్నుల నీరు ధారలుగఁ ♦ గార్చుచు నేడ్చుచుఁ గన్నతల్లి దా
ఖిన్నత నొంది భర్త నడఁ ♦ గించిన వాని శిరమ్ము ద్రొక్క గా

కెన్నఁగ నూత్రముం దొఱఁగ ♦ నేనని పంతము పూనియున్న దా
జన్నియు పూర్తి గావలదె ? సాధ్వికి వీరకుమారుఁ డుండియున్. ౯౩

చ॥ పనుపుము నన్ను పోరి కని♦ప్రాంజలియై మకరాక్షుఁ గాంచి యా
దనుజవరేణ్యుఁ డిట్టులను ♦ ధైర్యమె తోడగుఁ గాక నీచిరం
తనమగు వైరముం దొలఁగ ♦ దానవవైరుల మస్తకంబులం
గొని యిటు తెమ్ము పొమ్మనుడుఁ ♦ గోరిక మీఱఁగ వాఁడు పొంగుచున్.

చ॥ విలుగొని తేరు నెక్కి కడు ♦ వేడుక వాహిను లైదుకోట్లు చం
డ లలిత రీతిఁ దన్నొలయ ♦ డంబుగ దానవనాథుఁ డంపు వె
ల్వాలు మఱి యిర్వదిం గదిసి ♦ వారిధి పొంగిన భంగి దోఁపఁ గా
హాళములు దుందుభుల్ చెలఁగ ♦ నమ్మకరాక్షుఁడు పోయె నుద్ధతిన్. ౯౫

శా॥ రాజద్రీతిని చక్రరక్షకులుగా ♦ రక్తాక్షుఁడున్ శంఖుఁడున్
దేజోవంతులు తోడరా నుడుగణా ♦ ధీశుంబలెన్ వాహినీ
రాజిం దన్మకరాక్షుఁ డొప్పెను రజో ♦ రాగంబు వర్ధిల్లె ది
గ్రాజుల్గన్నులు మూయ వేలుపుల మా♦ర్గంబు న్నిరోధించుచున్. ౯౬

తే॥ ధ్వజపటంబులు రవి కర♦ప్రతతిఁ గప్ప, మదకరుల శీకరంబులు♦మలయుచుండఁ
గదలు దానవసేనచేఁ♦గపిచయంబు, శ్రమము పూర్తిగాఁ దొలఁగె నా♦సమయమందు.

తే॥ గీఁకలును నకిలింపులు♦కేకలొలయఁ, బణవ కాహాళ దుందుభి♦స్వనము లులియ
సింహనాదంబు లెల్లెడఁ♦జెలఁగి యుండ, గోళములు నిండ జీవులు♦గొవరువోయె.

ఉ॥ వాఁడియు వేఁడియుం బొగడు ♦ పాడియుఁ బోఁడియుఁ గల్గు సైన్యముల్
వేడుక వాదుకల్ విడిచి ♦ బీరము చూపుచుఁ బోరు సేయుచున్
వీడక వాదుకన్ బఱపు ♦ విండ్లును కండ్లును పూని యేయఁగా
నీడువ సాగె రక్తనదు ♦ లీడిగిలంబడు వారణంబులన్. ౯౯

ఉ॥ వానరులేయు శైలముల ♦ వారక చేతులఁ బట్టి వెండియున్
దానవులేయ మేఘములు ♦ తారకలున్ భువిరాల భూతముల్
పీనుఁగులన్ భుజించు పెను ♦ వీఁకను గేకలు వెట్ట భూమిపై
వానర సైన్యముల్ తలలు ♦ వ్రయ్యఁగఁ గూలెను కుప్పతిప్పలై. ౧౦౦

చ॥ దనుజుల కేలనున్న యడి ♦ దంబులు లాగి తదీయ శీర్షముల్
తునుమఁగ వారి కేలఁగల ♦ తోరపు మ్రాఁకులఁ బర్వతంబులన్
దనుజులు లాగికొంచు బెడి ♦ దంబుగ ఱివ్వునఁ బోవవైచుచున్
వనచర వార వక్షముల ♦ భగ్నము సేయుచుఁ బోరుచుండఁగన్. ౧౦౧

—: మకరాక్షుఁడు రామునితోఁ బోరి మడియుట :—

మ॥ మకరాక్షుం డెదురైన వానరతతిన్ ♦ మాయించి తత్సైన్య నా
యక గాత్రంబుల యంత్ర నిర్గళిత ఘో ♦ రాశ్మంబులంబోలు సా
యక రాజంబుల డుల్చుచున్ బవాళికో ♦ పాటోప మేపారఁ బా
వకులీలన్ రఘుచంద్రముం గదిసి గ ♦ ర్వస్ఫూర్తిమై నిట్లనున్. ౧౦౨

చ॥ సమరమునందు నాజనకుఁ ♦ జంపిన యప్పటినుండి నీతలన్
దుమురుగఁ జేసి నాకుఁగల ♦ దుర్దమకోప మడంపనుంటి; మా
నము చెడునంచు భీతిగొని ♦ నాయెడ వైరము పూనరైరి యా
సుమనసులుం ద్రిమూర్తులును ♦ నూటిగఁ బూసితి వీవు మానవా!

చ॥ అనవుడు మందహాసరుచి ♦ యాననమందునఁ దోఁప రాఘవుం
డనుఁ గసిదీర్చుకోఁ గడఁగి ♦ యక్కటతోడను వచ్చినాఁడవా!
జననముతోడ వీరులకు ♦ క్షాత్త్రము వచ్చుట సాజమేకదా!
మొనసితి యుక్తవాక్యతులఁ ♦ బూర్వవిరోధము మాన్చుకొమ్మనన్.

మ॥ అనలజ్వాలలు కన్నులం బఱవ నీ ♦ హంకారమున్ మాన్తుఁబొ
మ్మని యంతన్ మకరాక్షుఁ డుగ్రుఁడగుచున్ ♦ జ్యారావముంజేసి క్ర
న్నన నిన్నొక్కనిఁద్రుంచి కాక కసి మా ♦ నంబోవదంచున్ మహా
శని కల్పాశుగ వర్షముం గురిసె ర ♦ క్షఃపాళి యగ్గింపఁగన్. ౧౦౫

మ॥ జలజాతేక్షణుపై మరుత్సుతునిపై ♦ సౌమిత్రిపై మార్గణం
బులు నూఱాఱుల నేసి దుస్సహ తర ♦ ప్రోత్తేజుఁడై సంగర
స్థలి నారాచ మయంబుగాఁ బఱపి గ ♦ ర్జానాద గంభీరుఁడై
జలముం జేవయుఁ జూప రాముఁడు శరా ♦ సారంబుచే మాన్చుచున్.

చ॥ ఒక విశిఖమ్ము రాక్షసుని ♦ యుక్కఱ నక్కున నాటనేయఁగాఁ
దకపికలాడి వాఁడు కను ♦ దమ్ముల నిప్పులు రాల్చి లోక పో
షక యశు రామచంద్రు కవ ♦ చమ్మునఁ దూఱఁగఁ బెక్కు వాఁడి సా
యకముల నేసి యార్చెను వి ♦ యత్తలమందలి వేల్పు లల్కఁగన్. ౧౦౭

ఉ॥ రాముఁడు మందహాస రుచి ♦ ర స్థితి మోమునఁదోఁప సంగరో
ద్దామ కరంబునం దిగిచి ♦ దారుణ బాణము లేసి సారథిన్
నామ మడంచి రథ్య చర ♦ ణ స్థ ఖురంబులఁ ద్రెంచి చాపమున్
సాముగఁజేసి వక్షమునఁ ♦ జయ్యన నాఁటగఁ జొన్పు నంతటన్. ౧౦౮

చ॥ అరదము చాపముం ♦ జెడఁగ నమ్మకరాక్షుఁడు సొమ్మవోక నె
త్తురు వడిఁ గ్రక్కుచున్ ధరణి ♦ దూఁకక మింటికినేగి మేఘ సం

వరణ శరీరుఁడై విలయ ♦ వర్షము దాపురమయ్యెనో యనన్
సిరివిగ రాల్చెఁ జిచ్చులుకు ♦ పిడ్గులు తాలును గాలి వానగన్. ౧౦౯

చ॥ పిడుగులు లెక్కలేక పడ ♦ భీకర వాయువు వీవ మేఘముల్
మిడుకులఁ జిందఁగా సమర ♦ మేదినిలోఁ గల వానరావళుల్
మిడుకుచుఁ బోరలేక తమ ♦ మేనులు చిందఱ వందలై పడన్
మడిసిరి తక్కువార లసి ♦ మాని పలాయితులైరి భీతులై. ౧౧౦

ఉ॥ పాతిన పెక్కులం బొగలు ♦ వాతి కనుంగవ గానరామి ను
క్కాఱఁగ మేఘముల్ గవిసి ♦ యంతట నిప్పులవాన తాలతో
మీఱఁగ వానరుల్ మడియ ♦ మేద్పడ రాముఁడు కాంచి వీనికి
తీరు వరమ్మువేనొ? మఱి ♦ లెక్కలిమాయనొ గల్గెఁ జెప్పవే! ౧౧౧

చ॥ అనుడు విభీషణుండు కరు ♦ ణాకరు రాముని గాంచి దేవ! యీ
దనుజున కీ బలంబు ఫల ♦ దంబుగ వాయు సముద్రరాజు లి
చ్చినయది యన్న రాఘవుఁడు ♦ చేద్పడ దానిఁ దదస్త్రపాళిచేఁ
బొనుపడఁజేయ మాయలును ♦ పోయెను వార్ధిని వైచు నింగువై.

క॥ అదిగని మకరాక్షుఁడు తో, యదము నెనయు రూపుగొని వి ♦ యత్పథమందే
యొదిఁగి వనచర కదంబము, గుదిగ్రుచ్చఁగ శూలములను ♦ గుములుగ నేసెన్.

చ॥ అగపడకుండ డాఁగు మక ♦ రాక్షుఁ గనుంగొను చొప్పుగాన శ్రీ
వగఁ దెలియంగ వచ్చునని ♦ వారిజనేత్రుఁడు చింతతో మదా
శుగ హతి నొల్కు నెత్తు రొక ♦ చోఁ గనుపడ్డది యుద్ధి మాయచే
గగనమునందు దానవుఁడు ♦ గల్గిన తావని నిశ్చయించుచున్. ౧౧౪

ఆ॥ ఒక్క వాఁడియమ్ము♦నొగిఁ గూర్చి పఱపఁగా, వాని శిరము తునిఁగి♦వసుధఁ బడియె
నొడలు పుడమి దొరలు♦చుండిన యంతన, మ్మాయ స్వప్నమట్లు♦మాసిపోయె.

—— : రక్తాక్షుఁడు శంఖుఁడు నల పనసులచే నంతమొందుట : ——

తే॥ మకరనేత్రుండు తెగిపడి♦మడియఁగాంచి, రథముపై గ్రీష్మభానుని♦రాణనొప్పి
శరదముంబలె శరములఁ♦గురిసి గాలి, వీఁకవచ్చు రక్తాక్షుని♦దాఁకె నలుఁడు. ౧౧౬

ఉ॥ తాఁకి శరోత్కరంబులు వి ♦ తానితమై చన సాలసాలముం
గైకొనివీచి త్రోచుచును ♦ గ్రక్కున నేనుఁగుఁ గాంచి యుర్వడిం
బైకొను సింగమో యనఁగ♦భాసిలి దూఁకఁగ దైత్యుఁ డుగ్రుఁడై
వీఁకను తుండ్లుచేసి పెను♦వీకున నార్వ నలుం డదాటునన్. ౧౧౭

ఉ॥ తొమ్మును వంచి నక్క తల ♦ ద్రుంచి గుభాలున రక్తనేత్రు శీ
ర్షమ్మున దూఁకి నాసికను ♦ చక్షువులం జెవులందు వేఁడి ర

త్తమ్మును గ్రొవ్వు బైలుపడఁ ♦ గాఁ బెనుముష్టిని తాఁచి కాలితో
గ్రమ్మన ద్రొబ్బె నేలకుఁ బు ♦ రందర ముఖ్యులు మెచ్చి యుబ్బఁగన్.

ఆ॥ కొండమీఁదఁ బడిన ♦ కొరడు విధంబున, నలుఁడు రక్తనేత్రు ♦ తలను దుమికి
చదియఁబొడువఁగన్న ♦ శంఖుండు లయకాల, రుద్రుభంగిఁ బొంగి ♦ క్రుద్ధుఁడగుచు.

చ॥ నిలునిలుమంచు చదల్చి నలు ♦ నిక్కునఁ దాఁకఁగ నేగఁ గాంచి పే
రలుకను దాఁటుచుం బనసుఁ ♦ డా సురవిద్విషు నడ్డగించెఁ జే
యలుఁగులు తొమ్మిదింట నుడి ♦ యన్ వడి శంఖుఁడు గొట్ట నేతిచే
వెలిఁగెడి యగ్నిపోలెఁ గపి ♦ వీరుఁడు మండి చనెం గుభాలునన్. ౧౨౦

చ॥ పరువిడి తేరితో నసుర ♦ బాధ బలంబున నెత్తె నెత్తినన్
సురఁగెక శంఖుఁ డిమ్మగ వ♦సుంధరకుం దిగునంత వానిపై
నరదము వైవ వాని యొడ ♦ లయ్యెడ ఘట్టని వచ్చి క్రొత్త నె
త్తురు ప్రవహింపఁగా నసువు ♦ దోరెను వేలుపు లుబ్బ యార్వఁగన్.

ఆ॥ చక్రవర్తి సుతుల♦శరములచేతను, హరుల నఖర శైల♦తరులవలన
నసురబలము చెడ ని♦రాయుధులగు దూత, లరిగి రమరవైరి♦కంత దెలుప. ౧౨౧

౨౧ బ్రహ్మాస్త్ర పటలము. (౨౩౧)

మ॥ అనిలోనన్ ఖరపుత్రుఁ డీల్గుటయు ర ♦ క్తాక్షుండు శంఖాఖ్యుఁడున్
దనుజానీకముతోడఁ గూలుటయు నా ♦ దైత్యేంద్రుఁ డాలించి యిం
ద్రుని గర్వం బడఁగించు పుత్త్రు నిటకుం ♦ దోడ్తెండనన్ లెంక లు
వ్వున నేతెంచి తదాజ్ఞఁ దెల్ప నతఁడున్ ♦ బుద్ధిన్ విచారించుచున్. ౧౨౩

ఉ॥ పోయినవార లాగతిని ♦ పోయిరొకో యనఁ జారు లోప్రభూ!
పోయిన వారలెల్ల మఱి ♦ పోయిన వారలె గాక నీవలెన్
గాయముతోడ లంకకును ♦ గ్రమ్మఱి నట్టిరు లేరు సుమ్మనన్
హా యని లేచి యింద్రజితుఁ ♦ డంతకుపోలిక వచ్చె నుగ్రుఁడై. ౧౨౪

ఉ॥ వచ్చి దశాస్యుఁ జేరి గరు ♦ వంబున వందన మాచరించి నీ
చెచ్చెర నంపు సేనలు న ♦ శించెన కాయని విన్నవాఁడ నా
మచ్చరులైన రాఘవుల ♦ మస్తకముల్ ప్లవగాళి శీర్షముల్
గ్రచ్చఱఁ దెత్తు మోదమును ♦ గాంచెదు నీవును సీత ముందటన్. ౧౨౫

చ॥ అమరుల కోర్కులెల్లను హ ♦ తాశలు గావుత నేఁడు పోయెదన్
దమకక యుండుమా యనుచుఁ ♦ దండిరి యాజ్ఞను పూని వేయి సిం
గములు వహించు తేరిపయిఁ ♦ గ్రాలుచు వెల్వడె వెంబడిం దురం
గమ రథ దంతి సద్భట ని ♦ కాయము లర్వది వెల్వ లేగఁగన్ ౧౨౬

తే॥ పటహ కుంభికామురజ త♦మ్మట హుడుక్క, దుందుభులును తుత్తుంభికల్♦తుడుముఢక్క
కొమ్ములును తిమిలలును సం♦కులును కలిసి, చెలఁగ నెల్లవారి చెవులఁ♦జెవుడు చేసె.

ఉత్సా॥ ద్విరద చయము మీఁద నులియు ♦ భేరిరవముతోడ మఱి
బరఁగె వాని ఘీంకృతులును ♦ పట్టిడలను ఘంటికల్
తురగ హేషతోడ మొరసెఁ ♦ దోలుపట్టి గజ్జియల్
విరిసె నేమి రవముతోడ ♦ వీర కటక రావముల్. ౧౩౨

సీ॥ శంఖ కాహళ తూర్య♦శబ్దముల్ జలద ని, స్వనముతో డీకొని♦జయము నొందె
కరి హయ రథ సింహ♦గర్జనములు పిడు, గుల ఘోషమును మీఱి♦గెలుపునొందె
శ్రావ్యవాద్య ధ్వనుల్♦సంగీత రవములు, పీయూష రుచులపై♦విజయమందె
నారి రవంబులు♦సర్వ లదల్పులు, కడలి మ్రోఁతను క్రిందు♦పడఁగఁజేసె

తే॥ నాల్గు సంద్రంబులంబోలి♦నాల్గు తెగల, మెట్టపోగు లేపిన ధూళి♦యీడుకడచి
సైన్యవారాశిఁ గను సుర♦చంద్రముఖుల, యశ్రువారాశి నొక్కట♦నడఁచివైచె.

తే॥ఇంద్ర సౌధము లనఁదగి♦యెసక మెసఁగు, నరదములు వేలకొలఁది త♦న్నలమిరాఁగ
గ్రహములెల్లనుకొలువసా♦గరముమీఁదఁ, జెలఁగుగ్రహరాజునానింద్ర♦జితుఁడువెలసె.

తే॥ మెడయు ముక్కును కన్నులు♦కడుపు కాళ్లు, ప్రక్కలును గోళ్లు తోఁకయుఁ♦
జొక్కపడఁగఁ
గొంచ మొగ్గరముం దీర్చి♦మించి ప్లవగ, సేన నోరయ రావణియు సం♦సిద్ధుఁ డయ్యె.

తే॥ జంభభేది యిచ్చిన కల్ప♦జలదరవము, నెసయు వలమురి చిందంబు♦దనుజవిభుని
తనయుఁ డొత్తె సుపర్వులు♦తల్లడిల్లఁ, గలఁకనొంది ప్రాణులు కకా♦వికలు గాఁగ.

తే॥ తద్రవము చెవిఁబడ నుప♦ద్రవమునొంది, సింహ గర్జన మాలించి♦చెదరి పాఱు
వారణంబులక్రియ ఱాత♦వైచినట్టి, కుండ పెంచిక లట్లయ్యెఁ♦గోఁతిమూఁక. ౧౩౩

తే॥ శింజినీరవమున వాని♦చెవులుప్రీలె, మనసు కలఁగె నుత్సాహంబు♦మంటఁ గలిసెఁ
బరుగులిడఁ గాళ్లు తడఁబడెఁ♦గరములందు, పొదలు సాధనములు జాఱెఁ♦బెదవులెండె

క॥ పవన సుతుఁ డంగదుఁడు రా, ఘవులు విభీషణుఁడు సైన్య♦గణ నాయకులున్
రవిసుతుఁడు తక్కఁ దక్కిన, ప్లవగులు తత్తఱిలి విఱుగఁ♦బాఱిరి భీతిన్ ౧౩౪

క॥ సేనాపతులును రాక్షస, సేనలు ముందునకు సాఁగి ♦ జీమూతంబుల్
పూనిక నలమిన యనువున, వానరులం జుట్టెఁ గడఁక♦వర్ధిల్లంగన్ ౧౩౬

క॥ హనుమని భుజములపై శ్రీ, వనజదళాక్షుండు వాలి♦వరతనయునిపైఁ
గొనకొని లక్ష్మణుఁ డెక్కెను, ఘన సమరోత్సాహ విధము♦కడలుకొనంగన్.

క॥ వారల భుజములపై న, వ్వీరవరులు విండ్లుదాల్చి♦విశ్రుత ఖగరా
డ్గోరాజులపై రాజిలు, నారాయణ రుద్రులనఁ ద♦నర్చిరి కలనన్. ౧౩౭

క॥ బలిముఖ సేనావీరులు, మలలు తరులు గొనుచు మాఱు♦మలయఁగ దారిం
దిలకించి రాఘవుఁడు వెను, కల నుండఁగఁగోరి పలికెఁ ♦ గారణఫణితిన్. ౧౩౯

ఆ॥ క్రూరుఁ డింద్రజిత్తు ♦ ఘోరాస్త్రములు వీడ, సాగునేని మీర♦లాఁగలేరు
చోటు మాకు విడిచి♦చూచుచునుండుఁడు, విమతు లొందుమార్పు♦వింటినేర్పు.

ఆ॥ అనిన రాము పలుకు ♦ లాలించి కపివరు, లల్లనిలిచి రంత ♦ నధిపసుతులు
నిశిత విశిఖ నిచయ♦నిర్ఘాత వర్షంబు, కురిసి రమరవైరి♦కోటిమీఁద. ౧౪౧

మ॥ త్రుటిలోఁ దమ్ము గవించు నా దనుజ సం ♦ దోహమ్ము నాశమ్ము సెం
దుటకై చూపిన రామ లక్ష్మణ ధను ♦ ర్దోర్దండ పాండిత్య సం
ఘటనం బేమని చెప్పవచ్చుఁ గనక ♦ క్ష్మాభృ ద్ధనుర్ముక్త ధూ
ర్జటి బాణ త్రిపురాసురాలిక్రియ నా ♦ శంబయ్యెఁ దత్సైన్యముల్.

—: తన సైన్యముపాటు నింద్రజితుఁడు కాంచుట :—

చ॥ శవములు కుప్పలై పడెడు ♦ చందముఁ దెల్పఁగవచ్చుఁగాని వీ
రు వడిరి వారు కూలిరని ♦ రూఢిగఁ జెప్ప నశక్యమైన రా
ఘవుల పరాక్రమ క్రమము ♦ కంటికి తెప్పలు పెట్టకుండ నా
హవమునఁ గాంచుచుండె నమ ♦ రారి శరాసన మూని తేరిపై. ౧౪౩

చ॥ కరులు మరించె నంచుఁ దుర ♦ గంబులు గూలినవంచు స్యందనో
త్కరములు నుగ్గులయ్యెనని ♦ కర్బురవర్గము నీల్గెనంచు నా
యరదము పోవఁ ద్రోవ గన ♦ దంచు నభస్థలి నంటు ప్రేత భూ
ధరములఁగాంచి హా యని వి♦తాకు గడించుఁ దపించు దూపిలున్. ౧౪౪

చ॥ సమరము సేయుచున్న నెఱ ♦ జాణలొ యిద్దఱె చచ్చువారొ ని
క్కముగ వచింప నాఱుపది ♦ కాఁదగు వెల్వలు; శాపశక్తిచే
నమరవిరోధి సేనల ల ♦ యంబొనరించిరి చాపశక్తిచేఁ
దుమురొనరింపలేద యిది♦దోర్బలమో ? మఱి యింద్రజాలమో ? ౧౪౫

మ॥ శరవర్షమ్మును గాంచు రక్తనదులం♦జక్కంగఁ జూచుం గళే
బర శైలమ్ములఁ గాంచుఁ గూలిన కరి ♦ వ్రాతంబు నీక్షించు నొ
డ్డొఱకంబై పడు వాజిరాజిఁగని ని ♦ ట్టూర్చున్ రఘుస్వామి సుం
దర బాహు ద్వయిఁ గాంచు దానవ మహాం♦తంబున్ విలోకించుచున్.

చ॥ శిరముల కొండలం గనును ♦ చెండిన మొండెములన్ గణించుచున్
గొఱవులపోల్కి నాల్కలిడు ♦ కోలలఁగాంచు మరించువారలం
బోరిపోరి గాంచుఁ దేరుల స ♦ ముద్ధత దంతుల వాజులన్ భటో
త్కరముల వేయిటిం దొలిచి ♦ దాఁటు శరాళుగ పద్ధతిం గనున్. ౧౪౭

చ॥ అఱువది వెల్లువల్ వయిచు ♦ నమ్ములు చక్ర గదాసి కుంత తో
మరములు ఫెళ్లుఫెళ్లుమని ♦ మ్రగ్గుచుఁ వేణువనంబు గాలు వై
ఖరిగొని తారసిల్లకయె ♦ కాడ్పడుచుండుట దైత్య సైన్యముల్
ధరణిని వ్రాలుచుండుటయుఁ ♦ దక్కక రావణి కాంచె నాజిలో. ౧౪౮

చ॥ కడుపులు మోఁదికొంచుఁ జని ♦ కాంతులపైఁ బడి దానవాంగనల్
తడఁబడ నేడ్చుచుండు నిన ♦ దంబు వినన్ రదపంక్తి గీఁటుచున్
బుడమి శిరంబు లూడిపడ ♦ మొండెములాడుచు నుంటఁజేసి య
క్కడ దిగ వీలులేమిఁ బయిఁ ♦ గ్రాలు ఖగంబులఁ గాంచె నయ్యెడన్.

ఉ॥ సింగము లెట్టు లట్టడరి ♦ చెచ్చెర నాజిఁ జరించుచుండు నా
యంగద మారుతాత్మజుల ♦ యాశుగపద్ధతిఁ గాంచలేమి నిం
దంగద వాయుజుల్ బహు స ♦ హస్రగణంబులు క్రుమ్మరంగ ని
ల్వంగను చోటులేదు నరు ♦ లం గన సిద్ధలోకో కలారనున్.

ఉ॥ మోదరవంబు సేయు సుర ♦ ముఖ్యులఁ గాంచును వారి కేల నిం
పాదిగనున్న పుష్పముల ♦ నారయు స్వీయ భుజంబులం గనున్
జాదుగఁ జూచుమేర గనఁ ♦ జాలిన పీనుఁగు తిప్పలం గనున్
వేదుఱుగన్న వానిక్రియ ♦ వీక్షణసేయును దిక్కు లన్నిటిన్. ౧౫౧

తే॥ లెక్కకును మీఱి కూలిన ♦ రక్కసులను, కోరి కాంచియుఁ బొఱిన ♦ కోఁతిమూఁక
శక్రజిద్భీతి కలఁకయు ♦ జాఱనీక, దురము పొనరించు నాసతో ♦ మరలదయ్యె.

—: హనుమని సింహనాదము :—

ఉ॥ బృందములైన యాఱుపది ♦ వెల్వలు నాల్గువిధాల సైన్యముల్
మ్రందఁగ రాఘవేంద్రుల ప ♦ రాక్రమ పద్ధతిఁ గాంచి యంజనా
నందనుఁ డుల్లసిల్లి జత ♦ నంబున బాహువు లప్పళించి యా
నందముతోడ భీకర ని ♦ నాద మొనర్చె రిపుల్ దిగుల్గొనన్. ౧౫౩

ఉ॥ కొందఱు గుండియల్ వగులఁ ♦ గొందఱు గూబలు వ్రీల ధాత్రికిన్
స్యందనమందునుండి దిగఁ ♦ జాఱిరి కొందఱు కేలఁ గైదువుల్
క్రిందికి జాఱ విహ్వలతఁ ♦ గీడ్పడి వ్రాలిరి లంకలోని వా
రెందఱొ నెత్రుగ్రక్కి గతి ♦ యించిరి మారుతి సింహ గర్జనన్. ౧౫౪

ఉ॥ కోఁతి యొకం డొనర్చు పెను ♦ కూఁతకు జంకిన పందలార! మీ
చేఁతలు తెల్లమయ్యె నిఁకఁ ♦ జెప్పెడిదేమి? నశించినారలే;
ఈఁతకు మించి లోఁతుగల ♦ దే? యని రావణి ముందువోవఁగా
బ్రాఁతిగలట్టి కొందఱొగిఁ ♦ బ్రాపుగ వచ్చిరి ధీర చిత్తులై. ౧౫౫

—: లక్ష్మణుఁడు రాము ననుజ్ఞ గొని యింద్రజితునితోఁ బోరుట :—

శా॥ కేలన్ సజ్య శరాసనంబు వెలయం ♦ గీలించి సౌమిత్రి య
వ్వేళన్ రాముని గాంచి మ్రొక్కి సురజి ♦ ద్వేగుండు ఘోరాహి పా
శాలిం గట్టుడు సత్త్వహీనతను సై ♦ న్యశ్రేణిఁ గావంగలే
కాలంబందున నోడినాఁడనను పే ♦ రయ్యెం ద్రిలోకంబులన్. ౧౫౭

శా ఈవే కన్గొనుచుండ నాశరముచే ♦ నీదైత్యు మస్తంబు నీ
దేవవ్రాతము మెచ్చఁ ద్రుంచి పెను ధా ♦ త్రిం జేర్పకున్నన్ భవ
త్సేవాకార్య మదెట్లు సార్థకమగున్ ? దివ్యర్ద్దతుల్ దక్కునే ?
నా వంశం గల నిందయుం దొలఁగునే ? నాణెంబు సిద్ధించునే ? ౧౫౮

క॥ ఈ పోఁకుఁ జంపనేనిన్, నీ సేవాఫలము నాకు ♦ నెగడదు నరకా
వాసంబు చెందువాఁడను, నీసదమల పదములాన ♦ నిక్కము రామా ? ౧౫౯

తే॥ అనిన పల్కులు విని సుర♦లలరినారు, జగములెల్లను మిక్కిలి♦సంతసిల్లె
ధర్మదేవత మోదించె♦ధర్మరాజు, పొంచి మించి యదను పరీ♦క్షించుచుండె.

చ॥ అనఘుఁడు సుందరస్మిత ము ♦ ఖాంబుజుఁడై తన తమ్ముఁ గాంచి యీ
దనుజ వరేణ్య సూనుని వ ♦ ధంబునకుం దొరకొన్న వాఁడ వి
ష్ణుని కనువైన బుద్ధి బల♦భాగ్యము లందితి రక్షణంబు శి
క్షణ మొనరించు విష్ణువును ♦ శంభుఁడు నీకిల సాటి యౌదురే ? ౧౬౦

తే॥ నయము నీకగునట్ల యౌ♦నర్పుమనుడుఁ, జెలఁగి సౌమిత్రి కడఁకతోఁ♦జెంద మొత్తె
నంగదుఁడు రథ్య సింహంబు♦లడలిబడల, బొబ్బవెట్టె శంఖమ్ము రా♦ముండు నూఁదె.

తే॥ శూల కుంత గదా భింది♦పాల ముసల, ముద్గరాదిక సాధన♦ములను వాన
కరణిఁ గురిసి దైత్యులు భూమి♦కళవళింప, ముసరికొని లక్ష్మణుని చుట్టు♦ముట్టినారు.

తే॥ లక్ష్మణుని శిత ఘోర భ♦ల్లములవలన, నింగినుండి రాలెడి ఋక్ష♦నికరమట్లు
పలపలన రాలి తునియలై♦పడ రణస్థ, లంబు సాధన ఖండ మ♦యంబ యయ్యె.

తే॥ ఒక్క తొడుగున నేయు శ♦రోత్కరమున, వేయి యరదంబు లిరుసులు♦విఱిగి కూలు
తురగములు చచ్చు సారథు♦లురలుచుండ్రు, రథిక శిరములు నెవయు వా♦రణములవియు.

తే॥ విఱుగుఁ జట్టముల్ చక్రముల్ ♦ విఱుగు విండ్లు, విఱుగు సైంధవముల కాళ్లు♦విఱుగు డాళ్లు
విఱుగు గొడుగులు బొమిడికల్ ♦ విఱుగు మురజ, భేరి కాహళాదికములుఁ♦విఱుగుచుండు.

తే॥ ఇట్టి యరదంబు లివి వీరు♦లిట్టివారు, వాజులిట్టివి యిట్టివి♦వారణమ్ము
లనుచు నేర్పఱుపఁగ రాక♦యవని ఛిన్న, భిన్నములుగఁ దార్మాఱయి♦విఱిగి కూలె.

తే॥ తెగి శరంబులతో నింగి♦కెగసి చన్న, యువక శిరములు తండ్రుల♦యొడులయందు
పడియె జనకుల శిరములు♦కొడుకులున్న, యరదములయందు వినిమయ♦మందఁబడియె.

తే॥ శర శరాసన యుత హ స్త♦సముదయంబు, గ్రేవ్వి ర క్త హ్రదంబులఁ♦దేలియాడ
శృంగములతోఁ జలధి సంచ♦రించుచుండు, చొట్టమీలు ప్రకాశించు♦చొప్పుదోఁచె.
తే॥ క్రూర నారాచములు త్రుంచి♦త్రోయుచుండఁ, గెరలి పడు గొడుగులును కెం♦
కేళ్ళమ్ము లడిద
ములును ర క్తవాహినిలోన♦మునుఁగుచుండు, పలు వగల జల పక్షుల♦పగిదిఁదోఁచె.
తే॥ కంబళమ్ము లమ్ములు విండ్లు♦కై దువులును, సిడము లింధనములుగాఁగఁ♦బడసి వీర
వర రుషా దృశాగ్ని నుడికి♦పక్వమైన, ప్రేతములఁ బ్రీతితోఁ దినె♦భూత గణము.
తే॥ కొన్ని చక్రముల్ విఱుగంగఁ♦గూలెఁగొన్ని, త్రాళ్లు తెగగుఱ్ఱములుజాఱి♦ర క్త పంక
మందు మునిఁగెను సారథుల్♦స్రంద కొన్ని, పరుగులిడె నరదము లిచ్ఛ♦వచ్చు పగిది.
తే॥ మినుకుచుండు మణుల కాంతి♦నెనసి ర క్త, పంకమునఁ బూఁడి యెఱ్ఱని♦ప్రభలుచిమ్ము
రథ నికాయముల్ మారుతి♦రాఁజఁబెట్ట, మంట లంకలో భర్మ హ♦ర్మ్యములఁబోలె.
క॥ శ్రీరాముఁడు హనుమంతుని, ప్రేరేఁచుచు నపుడు బాణ♦వృష్టిం గురియన్
దేరులు పొడిపొడియై భువిఁ, దీఱఁగ రావణికి నొక్క♦తేరే మిగిలెన్　౧౨౩
క॥ పలు మొకములఁ బూన్చిన రథ, ములు రథికులతోడఁ గూడఁ♦బుయిలోడిన వా
రలఁ గని కుత్సించుచు నో, టిలక దనుజ విభు సుతుండు♦టెక్కునఁ బలికెన్　౧౨౪
చ॥ ఇరువురు కూడి పోరెదరొ? యేపున నొక్కరె పత్తురో? చమూ
త్కరములతోడుతం దొడరి ♦ కాలుని ప్రోలికిఁ బోవఁజూతురో?
యిరవుగ నిచ్ఛగించినది ♦ యేదియొ తెల్పిన నట్టి తీరునన్
దుర మొనరింతు నంచలుక ♦ తోఁ నన లక్ష్మణుఁ డంత నిట్లనున్.　౧౨౫
చ॥ అడిద మొ కార్ముకమ్మొ మఱి ♦ యాయుధ మెయ్యది యిమ్మొ దానినే
వడిఁగొనిరమ్ము నిన్నదిరి ♦ ప్రాణము తీయఁ బ్రతిజ్ఞ చేసితిన్
జెడు తెరువైన మాయలిఁకఁ ♦ జెల్లవు నిక్కపు బీరమున్నచో
బడిబడి డాఁగ కెచ్చటికిఁ ♦ బాఱక నిల్వుము నీచ! నావుడున్.　౧౨౬
చ॥ జనకుని తమ్ములం దొలుతఁ ♦ జంపిన రాముని వెన్కఁ జంపెదన్
దునిమెద నిన్ను మున్నగనె ♦ దోర్బల సంపద మీఱ నట్టు లేఁ
జెనకి వధింపనేని దశ ♦ శీర్షుని పుత్త్రుఁడ నైతినన్న యా
ఘనతయు నాకుఁ దక్కునె? జ ♦ గంబులు దీనికి నమ్మతించునే?.　౧౨౭
క॥ లక్ష్మణ! నాశరములకున్, లక్ష్మణముగఁ జేసి నిన్ను♦లలిఁ గూల్పనిచో
లక్ష్మి వరించునె నన్నున్, లక్ష్మణ నామంబు సార్థ♦లక్ష్మం బగునే?.　౧౨౮
క॥ అఱువది వెల్వల సైన్యము, లఱిమురిఁ గావించు మీర♦లడలుచుఁ జూడన్
నుఱిమెద డెబ్బది వెల్వలఁ, గొఱవడు మీ జీవములను♦గ్రోలెద నవలన్.

ఉ॥ కాను ఖరుండ దూషణుఁడఁ ♦ గాను త్రిశీర్షుఁడఁ గుంభకర్ణుఁడన్
గాను జగంబు గెల్చు దశ ♦ కంఠుని పుత్త్రుఁడ వీరసింహుఁడన్
మానవులార! తమ్ములకు ♦ మా పినతండ్రులకున్ ద్వదీయమా
శోణితమందు తర్పణము ♦ సుద్దిగఁ జేయఁగఁ బూని వచ్చితిన్. ౧౮౦

ఉ॥ నావుడు లక్ష్మణుం డను మ ♦ నంబునఁ దర్పణ చింత నూనితే?
చావఁగనున్న వారికిని ♦ చచ్చినవారికి నెల్లవారికిన్
సేవానరించు వారలకు ♦ నీకు విభీషణుఁ డున్నవాఁడిటన్
జీవన తర్పణంబు దయ ♦ సేయుగఁ దద్వ్యసనంబు మానుమా. ౧౮౧

సీ॥ అనుడు మనసు మండ♦నసురేంద్ర నూనుండు, పాలకడలిఁబోలి♦పరవియున్న
యగచర వరులపై♦నంగదుపై మారు, తాత్మజుపై లెక్క♦కడఁగ రాక
చిటచిటఁ బెటపెటఁ♦జిటిలుచుఁ బోవు మా, ర్గణముల నేసి సం ♦ గ్రామ భూమి
శరమయంబుగఁ జేసి♦సౌమిత్రిపై రామ, విభునిపై బెడిదంపు♦విశిఖ తతుల

తే॥ నాటనేసి గర్జించె న♦ప్పాట వాని, కార్ముకము మండలాకృతిఁ♦గాంచియుండెఁ
గేలుదోయి వడింగాంచి♦ఖేచరులును, అనిమిషాక్షుంబులం గేల♦నదిమికొనిరి.

తే॥ లక్ష్మణుండు ప్రత్యస్త్ర బ ♦ లంబువలన, వాని శరవర్ష మడఁగించి♦వ్యర్థపఱచె
వెడఁగువాని యసత్యవా♦గ్బృందములను, ప్రాడ్వివాకుండు నేర్పున♦ఁ ద్రాల్చు పగిది.

ఉ॥ ధర్మముకాని హేతువు ను ♦ దారుఁడు రాముఁడు గౌరవించుచున్
గార్ముక మెత్తఁడయ్యె దశ ♦ కంఠకుమారుని పైని; లక్ష్మణున్
వర్మముపోల్కిఁ గావ నెడఁ ♦ బాయక ప్రక్కన నిల్చియుండె దు
ష్కర్మము సాధుకర్మమును ♦ సంగరరంగము నాక్రమింపఁగన్. ౧౮౪

ఉ॥ వాఁడి శరంబు లొండొకటి ♦ వారక తాఁకి జ్వలించుచుండుటన్
మాఁడెను శైలవర్గములు ♦ మాఁడెను చాల్పుగఁ బైఁడి మేడలున్
మాఁడెను సాగరంబులును ♦ మాఁడెఁ జరాచర జీవరాసులున్
మాఁడెను దానవావళులు♦మాఁడెను వానర సైన్య సంతతుల్. ౧౮౫

మ॥ శరవర్షంబు నడంచి లక్ష్మణుఁడు పం ♦ చాస్యంబులన్ డెక్కముల్
మురియల్ సేయఁ గళావిహీన రవినాఁ ♦ బొల్పొంది యింద్రారి య
య్యరదంబందున నిల్చి శత్రు బల సం ♦ హారంబు గావించుచున్
మొరయించెం దన చింద మంగదు మరు ♦ త్పుత్త్రున్ వెతారించుచున్.

శా॥ చిందంబొత్తిన వాని కంకటము వి ♦ చ్ఛేదంబు గావించుచున్
జందం బొప్పఁగ లక్ష్మణుండును ధను ♦ ష్టంకారముంజేయ నా
నందాశ్రుల్ తొలఁకాడఁ జిర్నగవునన్ ♦ గాకుత్థ్సవర్యుండు సైఁ
గం దెల్పన్ భువనంబులెల్లఁ బగులం ♦ గర్జించి రవ్వానరుల్. ౧౮౭

శా॥ జీమూతంబుల డాఁగి రావణి కడున్ ♦ శీఘ్రంబునన్ రాఘవ
స్వామిం గాంచి సుమిత్రపట్టి యితనిం♦జక్కాడకే వీడినన్
నేమం బింతయులేక వానరతతిన్ ♦ నిర్మూలమే సేయు నీ
పామం బోలిన క్రూరుఁ ద్రుంచెదను నా ♦ బ్రహ్మాస్త్ర యోగంబునన్.

మ॥ అని పల్కన్ రఘురాముఁ డిట్టులను బ్ర♦హ్మాస్త్రంబు సంధించి యే
సిన లక్ష్యం బెదిలేమి లోకములు ని♦శ్శేషంబు గావించుఁ గా
వున నస్త్రేయుట పాడిగా దొకనికై ♦ పూనిక్కన్ జగన్నాశముల్
బొనరింపం దగునయ్య? మానుమన నా ♦ పుణ్యాత్ముఁడున్ మానుడున్.

చ॥ మొఱఁగిన మేఘనాదుఁడును ♦ భూపతి పుత్త్రుల భావనంబు లో
నెఱిఁగి విరించనాస్త్రమునె ♦ యేయఁదలంచి యధర్మయుక్తిఁ జా
గఱ యొనరింప నీకరణి ♦ కాదని యచ్చటు వీడి లంకకున్
వెఱచిన చందమొంది కపి ♦ వీరులు చూడఁగఁ బాఱె నెవ్వడిన్.

చ॥ చదలఁ బురంబుఁ ద్రోవ వెస ♦ జాఱిన రావణిఁ గాంచి వానరుల్
కదనము సేయజంకి తన ♦ కాళ్లకు బుద్ధి వచించెనంచు స
మ్మదమునఁ గేకవెట్టి రప ♦ మార్గము వట్టిన కీశవర్గముల్
బదపడి వచ్చి యాడుచును ♦ పాడుచు గెల్పు వహించె నుద్ధతిన్. ౧౯౧

చ॥ చిలికిన పాలసందరము ♦ చెన్నునఁ జాలఁ గలంక నొందె కీ
శుల రఘువర్యులన్ దునుమఁ ♦ జూచి విధాతృశరంబు మున్నుగాఁ
దలపడి వీడఁగాఁ దలఁచి ♦ దైత్యుఁడు పోవు టెఱుంగలేక యా
జలజ హితాన్వయుల్ దనుజ♦సంగతి యేమఱి సంగరస్థలిన్. ౧౯౨

తే॥ వాహనంబులపైనుండి♦వసుధకు దిగి, తూణ కార్ముక కవచముల్♦తొలఁగి విశ్ర
మంబు గొనిరి వారల విశ్ర♦మంబు మెచ్చి, చదలనుండి వేల్పులు పూలుఁ♦జల్లినారు.

తే॥ కపుల కోలాహలము మింటిఁ♦గలఁతవెట్ట, నచట నుండుటకును నిర్జ♦రారి తొడఁగి
నలువశర మేయుటకు సహా♦నంబు సేయ, లేనివానికై వడిఁ గ్రుంకె♦భానుఁ డపుడు.

తే॥ అగ్గలిక బవరము సేసి♦యలసియున్న, దడములకు వలసిన యంత♦కుడుపు లేదు
కణఁకఁ దెప్పింపుమా విభీ♦షణ! యటంచు, జానకీజాని చేసె నా♦జ్ఞాపనంబు.

తే॥ చిత్తమని తగువారలఁ♦జేర్చికొనుచుఁ, గడలి దాఁటిచనియె నొక్క♦గడియలోన
ధాతృకుల కలశాబ్ధి చం♦ద్రముఁడు; పిదప, రామచంద్రుండు లక్ష్మణ♦స్వామిఁ గాంచి.

తే॥ ఒనర దివ్యాస్త్రములను వి♦ధ్యుక్తవిధుల, నర్చనము సేసి యేయుట♦యంచితమగు
నరిగి వచ్చెదఁ బూజకు♦నంతదనుక, సైన్యములఁ గావుమని రణ♦స్థలిని వీడె. ౧౯౩

తే॥ జనకుఁ గని యింద్రజిత్తాజి♦జరగుటయును, వారు బ్రహ్మాస్త్రమును విడు♦వంగనుంట
దెలుప నిశ్చేష్టుఁడై చేయఁ♦దలఁచినట్టి, కార్యమెదియని తను దశ♦కంఠుఁ డడుగ.

తే॥ చంపనెంచిన శత్రులఁ ♦ జంప వలను, గలుగ మానకుమంచు వి ♦ జ్ఞులు వచింత్రు
అట్లుచేయుట మానవు ♦ లరయరాక, నలువశర మేయఁబూనితి ♦ నయముతోడ.

ఆ॥ వార లెఱిఁగి రేని ♦ ప్రత్యస్త్రమున నడఁ, గింత్రు చంప నిచ్చ ♦ గింత్రు వేల్మి
చేసి మఱుఁగునుండి ♦ చెడు తపోబలుల జీ, వముల క్షణములోనఁ ♦ బాపు టరవు.

క॥ నను వారు మఱచునట్లుగ, దనుజ నికర మంపు దేని ♦ తరువాతనె నా
పని తడలేక ముగియునన, ననియె మహోదరునితో ద ♦ శాస్యుండు వెసన్. ౨౦౧

క॥ ఘోరాకారులు త్రిశూల, ధారు లకంపనుని దొట్టి ♦ దైత్యగణముతోఁ
బోరికిఁ జని నరవానర, వీరుల జీవములఁ గొల్ల ♦ వెట్టుము కడిమిన్. ౨౦౨

తే॥ గొప్పమాయలు పన్ని ర ♦ క్షోగణమున, కిమ్ముగాఁగ గాఢాంధకా ♦ రమ్ము గూర్చి
సంగరస్థలి రాముల ♦ క్ష్మణులఁ గూల్చి, నాకుఁ దోడ్పడి పెక్కుమ ♦ న్ననలఁగొనుము.

తే॥ అనుడుఁ దన్నెప్పుడంపునా ♦ యనుచునుత్స, హించుచున్న మహోదరుఁ ♦ డెక్కెఁ దేరు
కొండఁ జుట్టిన గారుల ♦ కొమరు దాల్చి, సోఁకుమూఁక దైత్యాన్వయుఁ ♦ జుట్టి వెడలె.

—: మహోదరుని యుద్ధము :—

తే॥ కన్నుమేర దూరము కరి ♦ ఘటలుపోయెఁ, బరుగువాఱెఁ దేరులు లెక్క ♦ పక్కలేక
త్రోవ యశ్వమయంబయి ♦ తోఁచె సుభట, వర్గమా నేలయీనిన ♦ పగిదినుండె. ౨౦౫

తే॥ సాధనములును నిశితదం ♦ ష్ట్రలును భూమ, ణములు వెన్నెల లెండలు ♦ క్రమము చెడక
కాయఁ గోడెల గుంపుల ♦ కరణి నడచె, దైత్యగణములు కలనికి ♦ ధాత్రి యదర.

తే॥ క్రిక్కిఱిసిన టెక్కెంబులు ♦ నిక్కి గగన, మెల్లఁ గప్పుచు గాలికి ♦ మెల్లఁ గదలి
జలదములు పలపల రాలఁ ♦ గలఁచివైచె, నజుని కన్నులఁ గప్పెను ♦ రజము రేఁగి.

తే॥ ద్విరదపర్వతములనుండి ♦ దిగుచునుండు, మదఝరంబులు హయ ఫేన ♦ మహితములయి
వెడలి యడవుల తరుశిలా ♦ వితతిఁ ద్రోచి, కొనుచుఁ బాఱి కలసిపోయె ♦ వనధియందు.

క॥ మెఱపులు మెఱసెను పెదవులు, గొఱుకు కఱకు సోఁకుమూఁక ♦ కుడిచేతులలో
నెఱసిన యాయుధములు నెఱిఁ, గఱకఱ మిడుఁగుఱుల రాల్చి ♦ క్రందుకొనంగన్.

తే॥ అసురవిభుఁడు పంపిన చతు ♦ రంగ బలగ, ణంబు లంకాపురంబు ద్వా ♦ రంబు మెల్ల
వెలివిడుట చూడఁ దొల్లి స ♦ బ్ధిజలమెల్లఁ, ద్రావి తఱిచూచి వీడిన ♦ తపసిఁబోలె.

తే॥ శంఖ కాహళ భేరికా ♦ స్వనము వీర, నినదమును గుణరుతి రథ ♦ నేమిరవము
గీఁకలును సకిలింపులు ♦ కెరలి లోక, గర్భవలె నడంచికొనె జ ♦ గంబునెల్ల ౨౧౧

ఉత్సా॥ సేన ముమ్మరముగఁ గలను ♦ చేరెఁ బ్లవగబృందమున్
బూని యతిశయించి డాసెఁ ♦ బోరుసేయ దైత్య నం
తానమేయు నంపగములఁ ♦ దరుల గిరుల నడ్డుచున్
వానరాలి కినిసి కెరలి ♦ వారి కడఁక మానిచెన్. ౨౧౨

ఉత్సా॥ శిలలను గుఱిచూచి వైచి ♦ చెలఁగు కపుల జాతికిన్
నలుగు రైదుగురుగ నలఁగి ♦ నాశమైరి రక్కసుల్
కలభములు గుఱాలు గూలెఁ ♦ గఱకుసోఁకు కైదువుల్
మలయుదాఁకఁ గీశచయము ♦ మడిసి పడియెఁ గుప్పలై. ౨౧౩

ఉత్సా॥ పరశు శూల ముసల భిండి ♦ పాల దండ వలయ ము
ద్గర ముసుండి కుంత ఘన గ ♦ దా పృషత్క పాశ తో
మర నికాయములును మించి ♦ మర్కటములు వైచు పెం
దరుల గిరుల నుగ్గుచేసి ♦ ధరణిఁ ద్రోచెఁ గీశులన్. ౨౧౪

ఉత్సా॥ మెఱుఁగు టాయుధముల నొడుపు ♦ మీఱ వైవఁ బ్లవగముల్
కఱకు సోఁకు మూఁక యెదుటఁ ♦ గడఁగి నిలువ నోపమిన్
వెఱచి పాఱె రక్త నదులు ♦ వీఁగు తిప్ప లడ్డమై
తఱుమ వీలు గాకపోయె ♦ దైత్య జనుల కయ్యెడన్. ౨౧౫

తే॥ సమర భూమిని మరణించి ♦ యమరభూమిఁ, జొచ్చి వేలుపులైన కీ♦శులను గూడి
చిర మభిలషించు కోర్కెలు♦చెల్లె ననుచు, నలమికొని తిరిగిరి మేన♦కాదు తెలమి

తే॥ క్రూర హింసయే నైజమౌ♦గుణము గాఁగ, ధర్మమార్గంబు ద్రొక్కని♦దనుజవరుల
మేటి సురలుగఁ జేయు సౌ♦మిత్రిశరము, కంటెఁ బావన వస్తు వొ♦క్కండు కలదె?

తే॥ విక్రమంబున నూర్మి శా♦విభుఁడు దురము, సలిపి యామ్యాస్త్రమున దైత్య♦సంఘ
స్వర్గమున కంప నచ్చట♦స్థలము లేక, నింగియెల్లను వారమై♦నిండినారు. [ములను

—: ఆంజనేయుండు కుంభకర్ణుని వజ్రదండము గొని దైత్యుల నుఱుమాడుట :—

క॥ అమరులఁ దఱిమిన యది లో, కముల నలఁచినదియుఁ గుంభ♦కర్ణునిచేతన్
సమరముల వెలయునది యగు, సుమహిత దండమును వాయు♦సూనుఁడు గొనియెన్.

ఉ॥ మేరు సమానధీరుఁడు స ♦ మీర కుమారుఁడు వజ్ర దండమున్
దీరుగ హస్తమందున గ ♦ దించి మహోద్ధతి విక్రమించె దు
ర్వార కృశాను రేతుఁడొ ప్ర ♦ భంజనుఁడో లయకాల రుద్రుఁడో
వారని కోప భీకరత♦వచ్చిన కాలుఁడొ యన్న కైవడిన్. ౨౨౦

క॥ వీరుల శీర్షంబులపై, వారణ కుంభముల మీఁద♦వారువములపైఁ
దేరులపైఁ జెలరేఁగెను, మారుతి యెల్లెడలఁ దాన ♦ మలసి హరిక్రియన్. ౨౨౧

క॥ అడరిన వారల నగ్గము, పడువారల నలఁచి త్రొక్కి ♦ బవరపునేలన్
గడు బీభత్సం బొనరిచి, పొడవడఁచెఁ ద్రివిక్రమేశు ♦ పోల్కిఁ జెలఁగుచున్. ౨౨౨

చ॥ కనుల శిరంబులం జెదరి ♦ కాంతులు చిందిన మౌక్తికంబులన్
దిరమగు మేని కళ్కు వడి ♦ దేర నభంబును దాఁకు నున్నతిన్

బరఁగె మరుత్సుతుండు లయ ♦ వాయువు వీవఁగ ఋక్షజాలముల్
తరణి విధుండు సంతతము♦తారెడి మేరువుమాడ్కి నొప్పుచున్. ౨౨౩

చ॥ బలితపుఁగేల దండమును ♦ బాఢముగా ధరియించి మేదినిన్
బలముగ మోఁదు చాడ్పునను ♦ బాఁదుచు దైత్యులు చాఁపకట్టుగన్
నలఁగి ధరిత్రిఁ దాఱఁగ గ ♦ ణంబులుగా రథ దంతి వాజులన్
నలినలి నజ్జు నజ్జుగ నొ ♦ నర్చి చలం బెసలార గర్జిలెన్. ౨౨౪

క॥ నదులైన శోణితంబున, మద గజముల బురదచేసి ♦ మారుతి కాలన్
మదయుతులం దాటించుచు, మదమెత్తిన దిగ్గజంబు♦మాడ్కిం దిరిగెన్. ౨౨౫

ఉ॥ కోడెల చంద మొంది రథ ♦ కుంజర వాజుల మీఁద వచ్చుచున్
బోఁడిమి చూపి పెక్కురణ ♦ ముల్ పొనరించి జయేందిరా సతిం
గూడిన వారలన్ దనుజ ♦ కోటుల దండముతోడ మోఁది యిం
కేడదు లంక లంకె యని ♦ యేడ్తెఱఁ బంపెను స్వర్గ సీమకున్. ౨౨౬

తే॥ భానుపుత్ర కుముద నీల ♦ పనస జాంబ, వద్గజాంగదాదులు రణా♦వనిని చొచ్చి
దైత్య సేనాపయోధిలోఁ♦దవిలి యీఁదు, చుండి రెఱుఁగక తమలోన♦నొకరి నొకరు.

తే॥ లెక్కలేని రక్కసులను ♦ చిక్కనంత, వఱకు దుక్కిడుమారంబు ♦ నెఱయఁజేసి
యుగ్ర నరసింహుక్రియ రేఁగి♦యున్న గాలి, పట్టి యారణస్థలి నకం♦పనుని గాంచె.

—: హనుమంతుఁ డకంపనుం జంపుట: —

తే॥ గాడిదలు వేయిపూన్చిన కనకరథము, పైని విలుపూని వెలుఁగొందు♦దానవుం డ
కంపనుఁడు పూర్వమున జగ♦త్కంటకుండు, తారకుండు కుమారుచే♦దోరినతఁడు.

తే॥ ముగురు మూర్తులు మఘవుండు♦మొనసివచ్చి, తాఁకినను ప్రాణములఁగొను♦దంట
గలుగు నీకోఁతి కనుచు న♦కంపనుండు, వీనిఁ దెగటార్పఁగా నేది♦వెరవటంచు. [తనము

తే॥ అడ్డుపడకున్నచో రాక్ష♦సాంతకుఁడయి, వసుమతి నదైత్యముగఁజేయు♦వాఁడు
చంపవలయున యనుచు న♦కంపనుండు, దర్పమున నంపవానతోఁ♦దారసిల్లె. [వీఁడు

తే॥ మొగులుతో నగ్గియును గాలి♦తగులుపగిది, బలముతో నకంపనుఁడుత♦న్నలమునంత
వజ్రబాహుండు మారుతి♦వజ్రదండ, మమరఁద్రిప్పెను దనుజ మ♦ధ్యంబునందు.

ఆ॥ అసురు లేచి యేసి ♦ విసరి పొడిచి త్రెంచు, వీరసాధనములు ♦ విఱిగిరాల
దనుజ తనువు లురల♦దండంబు ద్రిప్పుట, హనుమ కపుడు చాల♦నలవుపడియె.

ఆ॥ విలయ పవన హతికి♦వీఁగని మేరువు, కరణి నిలుచు హనుమ ♦ కఱకుసోఁకు
మూఁక చూచుచుండఁ♦బోకార్చెఁ దుంగమా, తంగ తురగ రథ క♦దంబకముల.

ఆ॥ నేఁడు వీని సురల ♦ నెలవున కనిపి రా, ఘవుల నోర్చి పంక్తి ♦ కంధరునకు
జయము గూర్చి యమర ♦ జాల కష్టమ్ముల, నిలుపువాఁడ ననుచు♦నిక్కి యసుర.

ఆ॥ కటము లదరఁ బండ్లు♦పటపటఁ గొఱుకుచుఁ, గనులఁ బొగలు నగ్ని♦కణము లురల
రథము తోలఁ బంచి♦రాక్షస వీరుండు, హనుమఁ జేరుచుండ♦నతఁడు డాసె.

ఆ॥ పిడుగు గముల యట్లు♦మిడుఁగుఱుల్ కెలఁకుల, రాల్చునవి సురాళి♦రక్తములను
చవి మెఱింగినట్టి♦శరరాజముల నకం, పనుఁడు హనుమ యురము ♦ వగులనేసె.

ఆ॥ వాత నెత్తు♦రొలుక వాయుపుత్త్రుఁడు సొమ్మ, సిల్లి యించుకంత♦సేపులోనఁ
దేఱి తేరితోడ♦సారథిఁ జదిపిఁ గా, డిదలఁ ద్రొక్కి త్రొక్కి♦ప్రిదుల నలఁచె.

ఆ॥ వీనితోడఁ బెనఁగి♦వింటితో గెలుచుట, కడిఁది యనుచు నయ్య♦కంపనుండు
విశ్వకర్మ యొసఁగు♦వీరదండము కేలఁ, గొనుచు దూఁకి డాసె♦హనుమపైకి.

క॥ ఇరువురుఁ గుడియెడమలుగాఁ, దిరుగుచు డాయుచును పొంచి♦తెగువకు వెరవుం
బరికించుచుఁ బాయుచు బడిఁ, దఱియుచు దండములతోడఁ♦దాఁకిరి పెలుచన్.

క॥ తడవిరి తట్టిరి నిక్కిరి, యడఁగిరి వ్రేసిరి తొలంగి♦రార్చిరి భుజముల్
మడిచిరి విడిచిరి పొడిచిరి, కడిమిని ప్రకటించి సమము♦గాఁ బోరిరొగిన్. ౨౪౧

తే॥ కల్లతో వైరముంగొన్న♦గాడ్పుపట్టి, యంజనాద్రితోఁ బగగొన్న♦యసురయురముఁ
దాఁప దండంబుతో దానిఁ♦దట్టవైచెఁ, గాని వలకేలు తునిఁగి రం♦గమునఁ బడియె.

తే॥ తలరియును పిఱుతివియక ♦ దైత్యుఁడంత, నెడమచేతఁ బావనిఱొమ్ముఁ ♦ బొడిచెఁ బొడువఁ
బోటు వజ్రగిరిం దాఁకు♦వాటమగుచు, దనుజు కేల్త్రెచ్చె మారుతి♦కినిసి రేఁగె.

ఉ॥ దండధరాభుఁడౌ హనుమ ♦ దండధరుండయి విస్ఫుర ద్భుజా
దండ విహీనుఁడై కరము ♦ దండ విహీనత నుంటఁ జూచి యు
ద్దండ భుజాంతరంబు భుజ ♦ దండముచే వడిమోఁద దైత్యుఁడున్
గండలతోడ శోణితము ♦ గ్రక్కను గ్రాగుచుఁ గ్రక్కు నై వడిన్.

తే॥ పిదప నాచేతితోఁ గూబ ♦ లదరమోఁది, వాని వీరనాకమునకుఁ ♦ బంపునంత
హనుమనిం గని సింగముం♦గనిన హరిణ, వితతి యట్టు లసురసేన♦విరియఁ బాఱె.

పంచ॥ అకంపనుండు గూలఁగా ను ♦ దారిసేన ప్రాలఁగా
అకంపితాంగులై ప్లవంగు ♦ లార్చి పేర్చి యాడఁగా
నకాలకాలుఁ బోలి లక్ష్మ ♦ ణాఖ్యుఁడేయు తూపులన్
వికావికల్ గడించిపాఱె ♦ వీరదైత్య సంఘముల్. ౨౪౬

—: మారుతి లక్ష్మణుని వెదకుచుఁబోవుట :—

తే॥ ధీరుఁడగు లక్ష్మణుని వింటి♦నారిమ్రోఁత, వినని కతన నెవ్వరికేమి♦పొనరెనొక్కొ
కదనరంగంబునందని♦కరువలి సుతుఁ, డెడఁదఁ దలఁచి కొందలమందె♦నింట్రపడియె.

తే॥ దితిజసేనలో నాగ్నేయ♦దిక్కునుండి, యంగదుం డేడు యోజనా♦లరిగియుండె
వాని కవ్వల నుండెను♦భానుసూనుఁ, డతని కాతల లక్ష్మణుఁ♦డడరుచుండె. ౨౮౮
తే॥ ఒకరికొకరికి నాల్గేసి♦యోజనములు, దూరమయ్యెను కపులకు♦దురమునందు
నీటిపైఁ బాఁచినా సేన♦నెగడ లక్ష్మ, ణునకు హనుమకు మూఁడు యో♦జనములుండె
తే॥ లక్ష్మణాఖ్యుని గను నభి♦లాష తన్ను, పురికొలుపఁ జండమారుత♦సరణిఁ జనుచుఁ
జింత వీడంగఁ దగు యుద్ధ♦చిహ్నములను, కొన్నిటిని గాంచి మారుతి♦కొంత తనిసె.
తే॥ దంతి దంతముల్ ఛత్రబృం♦దములు రత్న, హారములు మీలవలెఁ ద్రుళ్లు♦
నాయుధములు
కలిసి పరువిడుచుండు ర♦క్తప్రవాహ, ములను కాంచెను హనుమ యా♦స్థలములందు.
ఆ॥ ముట్టిపోరు పగఱ♦మూఁకపై వైచిన, శరచయంబు శీర్ష♦సమితితోడఁ
జదలఁజేరి మరలఁ♦జెదరి శిలావృష్టి, పగిదిఁబడుచు నుండు♦వానిఁగాంచె. ౨౯౨
ఆ॥ దనుజులేయు నాయు♦ధములు లక్ష్మణశర, వితతి వలన విఱిగి♦ప్రతతరవము
తోడ ఋక్షచయము♦దొరలిన చందానఁ, బ్రభలతోడ నురలి♦పడుటగాంచె.
తే॥ ఎడపడక సుమిత్రాసుతుఁ♦డేయు విశిఖ, బృందమెల్లెడఁ దామయై♦చేసికంటి
ఘన జటామండలంబనఁ♦గ్రాలువాని, నంజనానూనుఁ డయ్యెడ♦నలరికాంచె. ౨౯౪
తే॥ మేనిపై రక్తధారలు♦మేవుకొనఁగ, నంధతమసంబ రేయిరా♦జని యెఱింగి
కాలమెత్తిన దీపపుఁ♦గంబములనఁ, దనరి తిరుగుచున్న కబంధ♦వనముఁగాంచె.
ఆ॥ వీరవరులు మడియఁ♦దేరులు కరులును, హరులుఁ గాళ్లు నొవ్వఁ♦బరుగువాఱి
రక్షలేని రాజు♦రాజ్యమందలి ప్రజ, వలె నశించుచుండు♦వానిఁగాంచె. ౨౯౬
తే॥ అతిశయంబుగ లక్ష్మణుఁ♦డడరి పోరఁ, గలనఁ గూలిన క్రూరరా♦క్షసుల రక్త
సాధన శరీర తతులను♦సాగరవన, పర్వతంబులఁ బావని♦పరఁగఁ గాంచె ౨౯౭
తే॥ విలయవాయువువలె నేగి♦వెదకిరుధిర, వాహినుల దాఁటియండక♦టాహా మగలె
నగలె ననఁదగు సౌమిత్రి♦యల్లెనాడు, విని ముదంబున హనుమ గ♦ర్జనము సేసె.
ఆ॥ ఎల్లవారి సేమ♦మెఱుఁగంగ నగునని, హనుమ డాసి వినతుఁ♦డైనయంత
విజయశీలి రాజ♦వీరుండు సౌమిత్రి, యొలమిఁ గౌఁగిలించి♦యిట్టులనియె. ౨౯౯
ఉ॥ ఎక్కడ నున్నవారు కపు ♦ లెక్కడ నుండె దినేశ పుత్త్రకుం
డెక్కడ వాలి ముద్దుకొడు ♦ కెక్కడ తక్కినవారు సేనలో
నొక్కటియేని యే నెఱుఁగ ♦ నొయ్యన మారుతి! తెల్పుమయ్య యె
వ్యెక్కడ నేమియేమి ఘటి ♦ యించె వినంగఁదలంతు నెవ్వడిన్. ౩౦౦
తే॥ రణముఁబోలెనైంద్రవ్యాక♦రణముదనుజ, గణముభూవరణము మేర♦గాంచుహనుమ
యతని పలుకులు విని యిట్టు♦లను దురాన,నొకరి నొకరు గానరు నుంత♦యును నిజమ్ము.

తే॥ తెలియఁదగునుపాయంబొంకు♦గలదునీవు, చేయఁదగుదురక్కసి మాయ♦చేఁతలెల్లఁ
దొడరి పాశుపతమ్మునఁ♦దొలఁగఁదోలు, నీదు సేవకు లెల్లరు♦నిన్ను గాంత్రు.

తే॥ అనుడు సౌమిత్రిలెస్సయౌ♦ననుచు రామ, విభునిమదిఁ బ్రొక్కి శరమును♦వింటఁగూర్చి
పాశుపత మంత్రము పఠించి♦పావులపయి, నేయ నయ్యస్త్రరాజ మ♦జేయమగుచు.

తే॥ అడరి వెదురుటడవిఁ గాల్చు♦నగ్గివోలె, నెదుటఁబడు వస్తువులతోడ♦నెల్ల దనుజ
గణము వీడక క్షణములోఁ♦గాల్చివైచెఁ, దొలఁగె నిరులును కపులకుఁ♦గలఁకువడఁగె.

తే॥ పాశుపతముచేఁ బెనుమాయ♦నాశమందు, టెఱిఁగి యమ్మహోదరుఁ డని♦మఱుఁ
గుపడియె
భ్రమము తొలఁగంగ సకల ప్ల♦వంగు లలరి, పాడుచాడుచు లక్ష్మణుఁ♦గూడినారు.

తే॥ కపులలో నెవ్వరును నొవ్వి♦గాంచకునికి, శంకవీడి సౌమిత్రి హ♦ర్షమ్మునొందెఁ
జుట్టి యార్చిరి ప్లవగు ల♦త్సుకతమీఱ, సురలు విరులను కురిసిరి♦పొరవులేక.

క॥ దూతలు దశకంఠునకు వి, నీతులగుచుఁ దెలుప నతఁడు♦నిజమా? యన వి
ఖ్యాతమగు పాశుపతమున, నా తెఱఁగయ్యె నని పలుక♦నగుఁగా కనుచున్. ౨౬౭

క॥ తనయునకుఁ దెలుపుఁడన వే, చనివారలు తెలుప నతఁడు♦చకితుండగుచున్
హనుమఁడు విభీషణుఁడు గవి, తనయుం డినకులజు లెచటఁ♦దగిలి రనంగన్. ౨౬౮

ఉ॥ రాముఁడు సంగరస్థలికి ♦ రాఁడొకకొండను చేరినాఁడు మా
యా మహిముండు నీదు పిన ♦ యయ్య వనాటుల కోగిరంబుకై
యీమహి దాఁటిపోయెఁ బర ♦ మేశ్వరు నస్త్రము వీడు మున్నుగా
వ్యోమమునందు డాఁగెను మ ♦ హోదరుఁ డియ్యది వార్త నావుడున్.

చ॥ ఇది యదనంచు నెంచి దను ♦ జేంద్రసుతుం డొకమఱ్ఱిఁ జేరి యా
పదపడి బ్రహ్మరక్షసులు ♦ పట్టుగఁ దోడ్పడఁ బూని వేలిమిన్
జిదుగులు నేయి నూవులును ♦ చియ్యయు నల్లనిమేఁకనెత్తురుం
జిదుముచు శాస్త్రయుక్తముగఁ ♦ జేసి ముగించెను శ్రద్ధపెంపునన్. ౨౭౦

తే॥ దహనకీలలు మంచిగం♦దంబుతోడ, వలదిరిగి శుభసూచన♦వఱలఁజేయ
సహజ దుర్గుణనిధి యగు♦శక్రజిత్తు, జయము మనదని కడు సంత♦సమున లేచె.

క॥ మాయావిమేటి శంబర, మాయం బచరించి గగన♦మార్గమ్మున దై
తేయులె కనరాకుండఁగఁ, బోయి యడఁగె మొగుళులందు♦పొంచి యదనుకై.

క॥ అత్తఱి మహోదరుం డొక, క్రొత్త మతక మూని యింద్రు♦కోలము గొని యు
న్మత్త చతుర్దంతి పయిన్, మొత్తము వేలుపులఁగూడి♦మొనసెను పోరన్. ౨౭౩

క॥ దనుజు లమర వేషంబుల, మనుజులతో వనచరేంద్ర ♦ మండలములతో
నని సేయఁ దొడఁగ భీతిలి, కనుకని సైన్యంబులెల్ల ♦ గడగడ వడఁకెన్. ౨౭౪

క॥ వెలిగారు నెక్కి యింద్రుఁడు, వెలలె రణము సేయ మునులు♦వేల్పులు మనతోఁ
జలమూన హేతువేమని, మలఁగిరి వానరులు దిగ్భ్ర♦మంబునఁ గలఁకన్ ౨౭౫
క॥ రాముని తమ్ముఁడు హనుమని, మోముంగని మునులు సురలు♦మోహారమున రా
నేమి కొఱగామి జరగెనో, సామీరీ! తెలుపఁగలవె ♦ శక్యంబేనిన్. ౨౭౬

—: ఇంద్రజిత్తు లక్ష్మణాదులపై బ్రహ్మాస్త్ర మేయుట :—

క॥ అని యడుగుచుండు తఱి రా, వణి నిర్మానుషము నిష్ప్ల♦వంగం బగుఁ గా
కని బ్రహ్మాస్త్రం బేసెను, కని వేల్పులు మనములందు ♦ కళవళపడఁగన్. ౨౭౭
తే॥ పులుఁగులట్టులు వెలుఁగులు♦యలుఁగుగములు, లక్ష్మణుని మేననాట ని♦ల్వారముతప్పి
తెలివి తొలఁగంగ మత్తేభ♦మిలను పడిన, చందమున సొమ్మసిల్లి భూ♦స్థలిని వ్రాలె.
తే॥ ఇంద్రుఁడిట్టి యకార్యంబు ♦ నేలచేసె, వీని నేనుఁగుతో నెత్తి ♦ విసరివైతు
ననుచు లేచిన హనుమపై♦నలుఁగు లడర, నలుగులంపడి యూతండు♦నవని వ్రాలె.
తే॥ కనకగిరియందు మోదుగు♦ననిచినట్లు, నెత్తు రొడలెల్లఁ బరవంగ♦నిశిత సాయ
కములు నాటుటచేఁ దెల్వి♦కలఁకవాఱ, నెలవు దప్పి భాస్కరసూతి♦నేల వ్రాలె.
తే॥ పిడుగుపాటుచే మగసింగ♦ముడిగినట్లు, పోలుపుచెడి వాలిసూనుండు♦పుడమి వ్రాలె
జాంబవంతుని కనుల వ♦క్షమునఁ బెక్కు, కోలలంట నాతఁడు రణ♦క్షోణి నొఱఁగె.
తే॥ వేయిశరము లురముచొచ్చి♦దూయునంత, నలుఁడుసమవర్తి ముఖదర్శ♦నంబుచేసె
ముదితుఁడై వచ్చి యముఁడు కు♦ముదుని పిల్వ, నాతఁ డాతని వెనువెంట♦నరిగినాఁడు.
సీ॥ ఋషభుండు స్వర్గపు♦రింజేరె నీలుండు, రంభతోఁగూడంగ♦రాణ నేగెఁ
బెద్దనిద్దురఁ జెందె ♦ పనసుండు మైందద్వి, విదులు నాకముఁజూడ♦వెడలినారు
కేసరి యిహమును ♦ వేసరి వీడెను, గవయుండు భూమిని ♦ కౌఁగిలించె
శతబలి శతమఖు ♦ సన్నిధి కరిగెను, షేణుండు కైలాస ♦ శిఖరిఁ జేరె
తే॥ తొలఁగి తప్పించుకొన వీలు♦గలుగకునికిఁ, జాఁపకట్టుగ నా రణ♦స్థలిని పడిన
కపులు వెదవైచు నాఱుమొ♦ల్కలను పోలి, ధరణి నందులే కొత్తుగా♦నెఱసియుండె.
తే॥ దేవసుందరుల్ వ్రాలి ని♦ద్రించుపోల్కి, భూమిపైఁబడ్డ ప్లవగ స♦మూహమపుడు
క్రమ్మి రక్తమెల్లెడలఁబ♦ర్వఁగఁ బ్రవాళ, వనముగల క్షీర వారాశి♦పగిదిఁదోఁచె.
తే॥ కపులు స్వర్గంబుచేర వే♦ల్పులు గాంచి, యతిథిపూజ లొనర్చి య♦నామయంబు
లడిగి యలరించి పదపడి ♦ యవని కిపుడ, పదఁడనుచు వేగ బలవంత♦పఱచినారు
తే॥ అర్చనంబు చేసితిరి బ్ర♦హ్మాస్త్రమునకు, మీరు మరణింపఁదగినట్టి♦వారుకారు
రామదాస దాసులును క♦ర్మములఁగట్టు, పడక స్థిరముక్తి వరియించు♦వారు నిజము.
శా॥ మాకార్యం బొనరించుపొంటె భువి జ ♦ న్మంబందియున్నారు మీ
రా కాకుత్థ్సుని తోడు వీడకుఁడు మీ ♦ ప్రాణంబె మా ప్రాణముల్

మీకే హానియులేదు రాముకొఱకై ♦ మీ జీవముల్ వీడుటన్
మాకు న్న్యాయకులైతి రాకతన మా ♦ మర్యాదలం బొందుఁడీ. ౨౮౮

మ॥ అనివారల్ పరిచర్యచేసి రిట జ ♦ న్యక్షోణి సౌమిత్రి కా
నన సంచారులతోడ నీగ్లై ధరజా ♦ నాథుండు రాఁడయ్యెఁ దా
మనఁగా నేర్చునెయంచు నింద్రజితుఁ డు♦న్మత్త ప్రలాపంబుతోఁ
జని లంకేశున కంతయుం దెలుప నా♦శంకించి వాఁడిట్లనున్. ౨౮౯

ఉ॥ రాముఁడు చావలేదు గద ♦ రా జయమెట్లగు నీకు నన్న ను
ద్దాముఁడు మేఘనాదుఁ డనుఁ♦దండ్రి! భయంబున రాఘవుండు సం
గ్రామధరిత్రి వీడె నెటు♦గాంచినఁ దమ్ముఁడు మిత్రవర్గమున్
భూమిని కూలియుండఁ గని ♦ పోఁడిమి నిల్వఁగలాఁడె దిట్టయై? ౨౯౦

తే॥ అని సమాధానపఱచి లం♦కాధిపతిని, తన గృహంబున కేగె రా♦వణి మహోద
రుండు తన యింటి కేగె వీ♦రుండు రామ, భూవరుఁడు వేఱుచోఁ బని♦పూనియుండి

—: శ్రీరాముఁడు మరలివచ్చి పొలికలనిం గాంచుట :—

మ॥ కరపంకేజము లెత్తువాఱ నిలుకన్ ♦ గల్పోత్తరీతిన్ మహా
శరజాలంబులఁ బూజసేసి యువలన్ ♦ సంగ్రామ రంగంబు గాం
చు రహిన్ జీఁకటిఁ దోలఁ జేకొఱవిగా ♦ శోభిల్లు నాగ్నేయమా
శరముం గైకొని వచ్చి కాంచెఁ గలనన్ ♦ సైన్యస్థితిం దత్తఱన్.

చ॥ శవమయమైన రంగమును ♦ సంశయ రోష విషాద దిగ్భ్రమల్
మివులఁగ నొక్కటొక్కటిగ ♦ మీఱఁగఁ గాంచుచు రక్షణంబునం
దవులక యప్రమత్తులయి ♦ తారియుఁ దాఱిన కీశరాజి రా
ఘవుఁడట నొక్క నొక్కనిగఁ ♦ గాంచె మహాకులితేక్షణస్థితిన్. ౨౯౩

శా॥ సుగ్రీవుం దన కన్నుదామరల న ♦ గ్రశులగాఱ వీక్షించి యీ
ప్రగ్రీవంబిటు వ్రాలఁగాఁ దగినదే ♦ భావింపఁగా నంచు న
వ్యగ్ర స్వాంతముతోడ నవ్వలన వి ♦ ద్వద్వంద్య భక్తావన
ప్రాగ్రీయున్ శ్వసనాత్మజుం గనియె నే♦త్రంబుల్ కుమారిల్లఁగన్. ౨౯౪

మ॥ వనధిం దాఁటి నిశాచరావళుల గ ♦ ర్భక్షోభముం జేసి యా
జనక క్ష్మావిభు పుత్త్రి సేమమును వి ♦ జ్ఞాపించి నా ప్రాణముల్
తనియం జేయుట యిట్టులౌటకొ? మహా♦ధన్యాత్మ! నీవక్షమున్
దనుజ క్రూర శరంబు దూసి చనియెం♦ద్రాఁచోర్చె నాగాంతకున్. ౨౯౫

మ॥ మును బ్రహ్మాద్యమరుల్ మునీశ్వరులు న ♦ మ్మోదంబుతో నిచ్చు దీ
వనలున్ జానకి యిచ్చు దీవనలు ని ♦ ర్వ్యర్థంబులై బీటఁబో

సిన బీజంబుల చందమై చెడియె నట్ ♦ సేవించి నాకొందు నిం
దను పాపంగలవాఁడనై పడితె నా ♦ దౌర్భాగ్య సంపత్తిచే? ౨౯౬

శా॥ రాజ్యాంతే నరకం ధ్రువ మ్మనెడి వా ♦ క్యన్నేర్చియున్ లోభినై
రాజ్యాకాంక్షను తండ్రిఁ జంపుకొని యా ♦ రణ్యంబులం జొచ్చియున్
బూజ్యుండైన జటాయు జీవముల నేఁ ♦ బోకార్చితిన్ బ్రాభవ
ప్రాజ్యశ్రీ నను పొందునే? యధిక దౌ ♦ ర్భాగ్యుండ నిక్కంబుగన్. ౨౯౭

ఉ॥ అన్నను చంపి తమ్మునకు ♦ నా కపిరాజ్య మొసంగినట్టి యే
నెన్న సమస్తముం జెఱుప ♦ నెంచిన వాఁడన నైతి మీకిలన్
బన్నము గూర్చితిన్ భువన ♦ భారముగా బ్రదుకంగఁబుట్టితిన్
బన్నుగ నంచు నవ్వలికిఁ ♦ బాఱఁగఁజూచె మనంబు కందఁగన్. ౨౯౮

మ॥ వృషవర్గంబునఁ గోడెమాడ్కిఁ దనుపై ♦ వీక్షింప నొప్పారు హ
ర్యృషభున్ వాలికుమారుఁ జూచి కడు ని ♦ ర్వేదించి డెందంబునన్
విషముం దిన్న విధిం దపించి యుఁక నే ♦ విల్లంది నిల్చుండి యి
వ్విషమావస్థను మాన్పలేనయితి నా ♦ విక్రాంతులం గాల్పనే? ౨౯౯

—: శ్రీరాముఁడు లక్ష్మణుం గని పరితపించుట :—

ఆ॥ అనుచు నవలికేగి ♦ యట నంపశయ్యపై, నీఁగ గములు మేన ♦ మూఁగు కరణి
విశిఖతతులు గ్రువ్వ ♦ వశమతి యహిశాయి, పగిదినున్న తమ్ము ♦ నొగిలి కాంచె.

ఆ॥ ఎడఁద యుడికె నొడలు ♦ వడఁకెఁ బిడుగుపాటు, వలనఁగూలు తరువు ♦ పగిదిఁ బడియె
గడియదాఁక నూర్పు ♦ విడువఁ డేమొఱుఁగఁడు, కాలుచేయి కనులు ♦ కదలలేదు.

ఉ॥ తమ్ముని కౌఁగిలించికొని ♦ ధారణి వ్రాలిన తన్ను నెమ్మదిం
గొమ్మని పల్కువారలును ♦ కొండలమందకు మన్న వారలున్
లెమ్మని పల్కువారలును ♦ లేరొక మిత్రుఁడుఁ బ్రాణయుక్తుఁడై
యమ్మహి లేఁడ యొంటి జని ♦ యంగద నెవ్వఁడు తీర్చువాఁడొకో?

ఆ॥ మొండెములు పిశాచ ♦ ములు భూతములును నక్కలును పతులవెదకు ♦ కామినులును
మిగిలియుండెఁ గాని ♦ మేనఁ బ్రాణములున్న, వాఁడొకండుఁ గాన ♦ రాఁడు కలన.

ఆ॥ అమరసతులు వగచి ♦ రమరులు వెగచిరి, మహితజగము విష్ణు ♦ మయముగాన
రాము చింత గని చ ♦ రాచర తతియేడ్చె, నేడ్వకుండు నెద్ది ♦ యిహాముననందు? ౩౦౪

ఆ॥ నలువమోము వాడెఁ ♦ దల వ్రాల్చెఁ బశుపతి, బంధుచింత దెలిపి ♦ ఫలముగలదె?
పగయు వెక్కియేడ్చెఁ ♦ బాపదేవత యేడ్చె, దుఃఖమయముగాఁగఁ ♦ దోఁచె జగము.

ఆ॥ ఇంచుకంత తెలివి ♦ నెనసి శ్రీరాముండు, కనులు తెఱచి యనుజుఁ ♦ గాంచి కాంచి
దివముఁ జేరె నింకఁ ♦ దిరుగఁ డనుచు నెదఁ, బొగిలె నొగిలెఁ గ్రుంగె ♦ గ్రుంగె గ్రుంగె

చ॥ ధరణిఁ దృణంబుగాఁ దలఁచి ♦ తమ్మున కిచ్చితిఁ దండ్రి మాటచేఁ
దెరలకయుంటి జానకియు ♦ దెప్పరమందఁగ నోర్చియుంటి నో
క్కరుఁడవు నీవుగల్గిన సు♦ఖమ్ము సమస్తముఁ గల్గునంచు నీ
కరణిని నన్నువీడి చనఁ ♦ గాఁ దగవే? నిను వీడియుందునే? ౩౦౭

ఉ॥ తల్లియుఁ దండ్రియుం దపముఁ ♦ దమ్ముఁడుఁ బుత్త్రుఁడు సంపదాలి నా
కెల్లను నీవకావె? యది ♦ యేగిన నీవు కలాఁడవంచు నా
యుల్లమునం గుమారిలక ♦ యుంటి సమస్తము నేఁడుపోయె న
న్నొల్లవ యేమి? కాదు కడు ♦ నుగ్ర శిలా కఠినాత్ముఁ డేనకా?

చ॥ వ్రణమయమైన కాయమునఁ ♦ బ్రాణముఁ గానము చావకుంటి నా
కణఁక యదెట్టిదైన నగుఁ ♦ గాసల నన్నుభజించి కష్టముల్
తొణఁకక యోర్చి యోగిరము ♦ తూఁగును మానిన ధీరచిత్త! యీ
రణభువి నేఁటికిట్లు నిదు ♦ రం గొన నేటికి? లెమ్ము నాయనా! ౩౦౯

ఉ॥ ఎండకు వానకోర్చి శ్రమ ♦ యింతయు లెక్క యొనర్పకుండఁ గో
దండము నూని కాచు గుణ ♦ ధామ! రణస్థలి నొంటివీడి తె
న్నుండుట నాయమేమి? నను♦నూల్కొని యెవ్వరుకాచువారు? నా
గుండియ లెట్టివంచుఁ గనఁ ♦ గోరితె? పంతములేల? నాయనా! ౩౧౦

చ॥ హృదయము జీవ మొక్కటని ♦ యెంచిన పల్కు నిరర్థమైనచో
నెద నెనరున్నదంట నిజ ♦ మే యగునేమి? విశుద్ధమూర్తి నీ
పిదపను జీవముల్ విడక ♦ వెక్కుచునుంటిని నీకుఁ జుట్టమై
వదలకయున్నదీ తనువొ? ప్రాణములో? కనరాదు నాయనా? ౩౧౧

ఉ॥ యాగముగాచి శంకర శ ♦ రాసన మెక్కిడి ప్రీల్చి యచ్చటన్
భోగములొంద నొనను కు ♦ బుద్ధిని గొంటిని కాలకూటమున్
రాగము దానిపై నునిచి ♦ రాజును బంధులనెల్లఁ గాల్చితిన్
ద్యాగము లేమిచేసితిని? ♦ తక్కక మృత్యువు మీకుఁ గూర్చితిన్. ౩౧౨

ఉ॥ భూమిపయిన్ వహించు పను ♦ మోహముచే ననలంబు పుంటిపైఁ
బ్రామినరీతిఁ దల్లికొక ♦ బాధను కూర్చితి నంతమాత్రమా?
రామపయిన్ వహించు ఘన ♦ రాగముచే నిటువంటి చెడ్డ పో
రాములు మీకుఁ గూర్చితిఁ గ ♦ రంబుగ నెల్లరబోఁటి వాఁడనే?

చ॥ మరణము నొందితీవు కను ♦ మాలపు మేనును నేను వీడెదన్
భరతుఁడు రాజ్యమేలఁ డిఁక ♦ బంధులు తల్లులు దుఃఖవారిధిన్
దరలి నశించువార లొక ♦ ధర్మముకై వెఱపొంది పేఁగఁగా
జరగిన దింత యొడ్డొలవ ♦ జన్మము నాయది యెంత ధన్యమో? ౩౧౪

క॥ జననీ జనకుల బంధుల, ననుఁగుల నాకొఱకు విడిచి ♦ యడవుల వెంటన్
నను వీడకుండు తండ్రీ! నిను వాసియు నిలువఁగలనె♦నిముసంబేనిన్. ౩౧౫

ఉ॥ ఉత్తమ కామినిం బలిమి ♦ నొక్క దురాత్ముఁడు కొరవైవఁగా
సత్తమ సన్నుతంబయిన ♦ చక్కటి వాని వశంబుచేరుచో
నిత్తఱి నూరకుంట తగ ♦ వే? త్రిజగంబుల వ్రాల్పకున్న నే
నెత్తిన జన్మమేల? ధరి ♦ యించిన చాపమునేల? కాల్పనే? ౩౧౬

క॥ ఖరునకుఁ గాకాసురునకు, విరాధునకు సప్తసాల ♦ వృక్షమ్ములకున్
శరధికి వాలికి మాత్రమె, సరగున నా శరము తూఱి♦చనఁజాలినదో? ౩౧౭

చ॥ ప్రతినను నిర్వహింపుమని ♦ పంపితిఁ దోడుగ నుండనైతి నీ
జత విడకుందునేని దను ♦ జప్రభుపుత్త్రుని మేని రక్తమున్
క్షితిపయిఁ జిందఁజేసి నిను ♦ చేకొని రక్షణసేయకుందునే?
గతజల సేతుబంధనము ♦ గాఁ దలపోసిన నేమి యబ్బెడిన్? ౩౧౮

ఉ॥ తమ్ములు బంధులుం బ్రజలుఁ ♦ దల్లులు నేగతి నున్నవారొ యం
చుమ్మలికించుచుందురు మ ♦ హోత్సుకతం గనఁబోదమయ్య లే
లెమ్మ యయోధ్యయందు బహు ♦ లీలల మన్మకుటాభిషేక మి
ష్టమ్మునఁ జేయువార లది ♦ సమ్మతమే కద రమ్ము చూడఁగన్. ౩౧౯

తే॥ నాగపాశంబుచేఁ గట్టి♦నలఁచినపుడు, ప్రాణముం దీసినపుడు నీ♦పజ్జలేక
హా! సుహృద్ద్రోహ పద్ధతి ♦ ననుసరించు, నన్నుగని లోకులెల్లరు♦నవ్వకుండ్రె?

శా॥ లంకారాజ్య రమన్ విభీషణుని కు ♦ ల్లాసంబుతో నిచ్చి ని
శ్శంకం దచ్ఛపథంబు దీర్ప కిపుడే ♦ చావంగనున్నాఁడ నే
వంకం గల్పితి నాదుకీర్తి మఱియున్ ♦ వంశంపు సత్కీర్తికే
యంకంబొందు గడించినాఁడ జను లా ♦ హా యంచు నిందింపఁగన్.

క। అని పరిపరి విధముల వా, పోనుచు లోనఁ గుమిలి కుమిలి♦క్రుంగుచు నాలిం
గన మొనరిచి తను మఱచుచు, మునిఁగెన్ మైథిలి విభుండు♦మూర్ఛానిద్రన్.

—: వేలుపుల విలాపము :—

క॥ ఇనకులుని గాంచి ఖచరులు, కనుఁగవఁ గరములఁ గదించి ♦ కళవళపడుచున్
గొనకేమి పరిణమించునొ? యని చింతాకులితు లగుచు ♦ నారటపడుచున్.

సీ॥ సుఖదుఃఖరహిత! నీ♦శుద్ధస్వరూపంబు, దెలియంగ శక్తిమం♦తులము గాము
నీ యుదరంబున ♦ నిఖిల జగంబులు, నమరియున్న తెఱంగు ♦ నరయలేము
జరిగిన యదియును ♦ జరుగుచున్నదియును♦జరుగనున్నది నుంత♦యెఱుఁగలేము
నిను వినుతించి నీ♦నిర్దేశపద్ధతి, మెలఁగుట దక్కొండు ♦ తెలియలేము

తే॥ దితిజవధచేసి దుఃఖముల్ ♦ తీర్పుమనుచు, వేఁడఁ గరుణించి యారీతి ♦ వెలసితీవు
ధర్మమును గాచు పూన్కి నీ ♦ దాఁగి నిలిచి, మాయనాటక మాడుచు ♦ మమ్ముఁ గలఁతె?

ఉ॥ కందులమైన మాకొరకు ♦ కష్ట పరంపర దీర్పవచ్చు నా
నందము గూర్పవచ్చుఁ గడు ♦ నమ్మకతోడను గంపెడాసతో
సుందరరూప! నిన్నెపుడుఁ ♦ జూచుచునుందు మదేమి మాయ? నీ
చందము విస్మరింపఁ బెడ ♦ జాడలఁ ద్రిప్పఁగ నుత్సహించెదే? ౩౨౫

మ॥ పరమేష్ఠీ! బహుళాండముల్ నిఖిల జీ ♦ వస్తోమముం జేసి యం
దిరవారన్ వెలి లోపల న్నిలిచి లో ♦ నిందించుచున్ వీడుచున్
బరిపోషించుచు వేఱుగా నిలుచుచున్ ♦ భావింప సాలీఁడు నై
నరవో నూలున గూఁడు గట్టు క్రియ సం ♦ యోజింతు సర్వేశ్వరా?

మ॥ ఇది దుఃఖంబులఁ గూర్చు లీల లనుచో ♦ నేచింత నిన్నంటు? ని
య్యది సమ్మోదనలీలలే యగును చు ♦ మ్మంటంటకుం జాల మా
పద మేమొందిన నీదు ప్రేమయు దయా ♦ భాగ్యంబు నిండారు ధీ
యొదలు న్నీవయి తేఱకున్న నిట ని ♦ న్నోర్వదార్వఁగా నేర్తుమే? ౩౨౭

చ॥ కనఁబడుపోల్కిఁ దోఁచి ♦ మఱి కానకయుండు నమేయరూప! మే
దిని నవతారమొందితని ♦ తేఁకువ నుంటిమి నీవు దుఃఖముల్
మనమున నొందఁ దాళఁగల ♦ మా? జగదీశ్వర! నీవ మానఁగా
మొనయుదుగాక మే మొకట ♦ మోతుమె? విత్తుమె? నీదు మాయలన్.

మ॥ అజసూనున్ ఘను నంబరీషు భవుఁ బ్ర ♦ హ్లాదుం దశాస్యానుజున్
గజరాజుం గని గాచినట్టి కరుణా ♦ కల్యాణ వీక్షారుచుల్
నిజ మీపాటికిఁ జూప కిట్టు లడలన్ ♦ నిశ్చింతమై నుందుమే?
భజనానందులమైన మాకు విమల ♦ ప్రజ్ఞాన మీయంగదే! ౩౨౯

క॥ పలువిధుల నిట్లు వేల్పులు, పలవించిరి మనుజభావ ♦ బంధురగుణుఁ డ
జ్జలజాక్షుఁడు తమ్మునిపైఁ, గల ప్రేమమువలన మూర్ఛ ♦ గని యట్లుండన్. ౩౩౦

ఉ॥ చారులు గాంచి రావణుని ♦ సన్నిధి కేగి యెఱింగి శక్రజి
త్క్రూరశరాళిచేఁ బ్లవగ ♦ కోటియుఁ దమ్ముఁడుఁ గూలియుండుటల్
వారక చూచి శోక వన ♦ వహ్ని దహింప గతించె రాఘవుం
డా రణభూమియందె పగ ♦ యాఱెను సంతసమందుమా యనన్. ౩౩౧

౨౨. మూర్ఛిత రామలక్ష్మణ సందర్శన పటలము. (౩౨)

ఉ॥ దూతలు కల్లలాడరని ♦ దుష్ట నిశాటుఁడు రావణుండు మో
దాతిశయంబుచేఁ బురము ♦ నందు జయంబును చాటఁబంచుచున్

నేతి వసంత మాడుఁడని ♦ నిచ్చలు ద్రవ్యముచల్లి దూతలం
బ్రీతులఁజేసి వేగ పిలి ♦ పించి మరుత్తుని గాంచి యిట్లనున్. ౩౩౨

తే॥ కలనఁ జచ్చిన దనుజుల ♦ గాత్రములను, త్వరగ నంబుధిఁ బడవైచి ♦ మరలు దీని
నొరు లెఱింగిన నీతల♦ను త్తరింతు, ననుడు వాఁడట్లు కావించె♦నాక్షణమున. ౩౩౩

చ॥ దురమున రామలక్ష్మణుల ♦ దుస్థ్సితి మైథిలి కన్నులారఁగా
స్థిరముగఁ గాంచి కాక తన ♦ చిత్తము మార్చదు నమ్మదంచు నా
సుర వనితావళిం బనుపఁ ♦ జుట్టఱికంబున గేలిచేయుచున్
దురితముగా విమానమునఁ ♦ దోడ్కొనిపోయిరి వారు జానకిన్. ౩౩౪

మ॥ పతి సౌందర్యముదక్క నొండొకటి భా ♦ వంబందు నెక్కొల్ప కీ
క్షితముం జేయని ధాత్రిజాత పతి ని ♦ స్థ్సేమస్థితిన్ సంగర
క్షితిఁ దార్కొఱుగ నుండఁ గాంచి తనువుం ♦ జిత్తంబు విజ్ఞాన జీ
వితముల్ స్రుక్క జలేజ మగ్నిఁబడు న♦ట్లోఁకం గుమారిల్లుచున్. ౩౩౫

సీ॥ విలపింప వేల్పుల ♦ వెలఁదులేడ్చిరి హారు, సామేననున్న యీ ♦ శ్వరియునేడ్చెఁ
గమలవాసిని యేడ్చె♦గంగ బోరున నేడ్చె, బ్రాహ్మియేడ్చెను ముని♦పత్నులేడ్చి
రదయలౌ సోఁకుల ♦ యతివలు నేడ్చిరి, జనకజ జనని మే ♦ దినియునేడ్చె
శ్రుతులేడ్చె ధర్మదే♦వత యేడ్చెఁ బాపంబు, నెల్లవారలకంటె♦ నెక్కుడేడ్చెఁ

తే॥ దక్కువారలయేడ్పులఁ ♦ దడవనేల? ఎచటనుండిన వారచ్చ ♦ టచట నిలిచి
యేడ్చినారలు వైదేహి♦యేడ్చియేడ్చి, యుల్లమెరియ నిల్వక సొమ్మ♦సిల్లి వ్రాలె.

ఉ॥ చేరువనున్న యద్దనుజ ♦ చేటిక లత్తఱి లేవనెత్తి ప
న్నీరు మొగంబునం జిలికి ♦ నేర్పుమెయిం జలిసేవ సేయఁగా
ధారణిజాత కన్దెఱచి ♦ తల్లడమందుచుఁ గంపమొందుచున్
నీరద దేహుఁ గాంచి తన ♦ నేత్ర యుగంబును మోఁదెఁ బల్మఱుల్.

తే॥ వహ్నిఁబడిన వల్లికవలె♦ వాడు నుడుకు, వడఁకు విహ్వలించును వెక్కు♦నడఁగు మడఁగుఁ
ద్రుళ్లు గద్గదకంఠయై రోదనంబు, సేయు జీవంబు లురియాడఁ♦జిక్కు స్రుక్కు

తే॥ పడును పొరలుఁజెమర్చు బె♦గ్గడిలు నడలుఁ, దెలివిదప్పును లేచు వి♦దిర్చుఁ గేలు
దీనదృష్టుల దిక్కులు♦ తేఱిచూచుఁ, దలరు! దపియించు మొఱపెట్టుఁ♦బలవరించు.

ఉ॥ నీయెడఁ బ్రేమగల్గి నిను ♦ నిత్యము గొల్చెడువారిఁ గాచుచున్
నీయెడ వైరమూను రజ ♦ నీచరపాళులఁ ద్రుంచుచుండు మ
న్నాయకు నండనుండకిటు ♦ నాశము గోరినవారిఁ జేరితే?
నీ యవలక్షణంబు గమ ♦ నింపఁగ నిట్టిదె? ధర్మదేవతా! ౩౪౦

తే॥ ధర్మపద్ధతులం గాక ♦ తక్కు త్రోవ, లందు పోసి యుత్తముల క ♦ డిందిసేగి
చూడ నిచ్చగించితె? యిది ♦ వేడుకేమి? దుర్విధీ! నీవు దీనిచే ♦ దొడ్డవగుదె?

ఉ॥ పాపినినైన యేను నిటు ♦ వంటి పరిస్థితిఁ గాంచి సైఁపఁగా
నోపను ధర్మరాజ! దయ ♦ యుంచి ననుం గొని పొమ్ము పుణ్యమా
నాపతి నన్నుఁ బావుటలు న్యాయమె? రావణుతోడఁ జేరితే?
పాపఫలంబు నాకుఁ గుడు ♦ పంగఁ దలంచిన త్రోవ యిద్దియే? ౩౮౪

చ॥ తొలఁగని యంధకారమునఁ ♦ ద్రోచుట న్యాయమె? నాథ! యోకృపా
జలనిధి! నాతపఃఫలమ! సత్యదయాపర! యిన్నినాళు లీ
సిలుగు సహించియుండినది ♦ చెన్నఱు నీస్థితి గాంచు కోసమా?
తలఁగని నా దురాగతమె ♦ తార్చెను నీకు నకాలమృత్యువున్

మ॥ అమరప్రార్థితజన్మ! ఆగమ సువే ♦ ద్యా! దేవ దేవేశ! జ
న్మము గావం జనుదెంచి యంత మిథిలా ♦ నాథానుదేశంబునన్
బ్రమథాధీశ్వరు చాపమున్ విఱిచి నా ♦ పాపాలపుట్టైన హ
స్తముఁ జేపట్టుట యిట్టి యాపదకు ల ♦ క్ష్యంబౌటకా? రాఘవా!

మ॥ కడుపుం గాల్చెడువార్త కన్నకడుపౌ ♦ కౌసల్య విన్నంతనే
విడుచుం బ్రాణము లంత నాయనుజులున్ ♦ వీక్షింతురే జీవికన్?
చెడుగుల్గోరిన కైక యియ్యదియె తాఁ ♦ జింతించి కావించెనో?
చెడితిన్ సర్వవిధంబులం జెడితి ని ♦ స్సీ! నా భవం బెట్టిదో? ౩౮౫

మ॥ వలదన్నన్ వెనువెంట వచ్చితిని క్ర ♦ వ్యాదాలితో సూడు నా
వలనం గల్గెఁ బసిండి లేడికయి ని ♦ ర్బంధించి విన్నంపితిన్
గెలన న్నిల్చిన లక్ష్మణుం గఠిన వా ♦ గ్దగ్ధంబులం గ్రుచ్చి యా
వలికిం బంపితి సర్వ మాపదలకే ♦ పాల్సేయనే యయ్యోఁగా? ౩౮౬

ఉ॥ పాపఫలంబుచే నడవ ♦ భావ్యముగాని యరణ్యసీమకే
మోపిక నేగునాఁడు ప్రియ ♦ మొందగఁ బిల్చి కుమార! రాఘవుం
డాపదనొందునే నతని ♦ కన్నను మున్నె మరింపుమంచు నా
జ్ఞాపనసేయు తల్లి నుడి ♦ జాడనె కూలితె? తండ్రి! లక్ష్మణా! ౩౮౭

చ॥ చివుళులు పువ్వులుం బఱపి ♦ చెన్నరు తల్పమునందు నిద్దురం
దవిలి త్యజించినట్టి గుణ ♦ ధన్యుఁడ! లక్ష్మణ! నిత్యశీల! దా
నవ ధను రుగ్ర ముక్త శర ♦ నవ్య సుతల్పమునందు చల్లనన్
మివులఁగఁ గూర్కి సెంద మది ♦ మేకొని వ్రాలితి వేమి? నాయనా!

తే॥ మఖము లొనరించి సద్ధర్మ ♦ మార్గమునను, ధరణిపాలన మొనరింపఁ ♦ దగిన నీవు
నన్ను చేపట్టి సత్యవా ♦ జ్ఞయము ధర్మ ఫలము కృశియింప వగలఁ బా ♦ ల్పడితి నాథ!.

తే॥ కులిశమునన్నైనఁ బగులని♦గుండె గలిగి, పనవి ఫలమేమి ఖేదంబు♦పాయునట్లు
నీరజాక్షుపైఁబడి మర♦ణింతుఁగాక, యనుచుఁ బడఁబోవఁ ద్రిజట తా♦నడ్డువచ్చె.

—: త్రిజట సీత నూఱడించుట :—

తే॥ తన తపఃఫల రూపమై♦తనరు త్రిజట, సాంత్వనంబులు పలుకంగ♦సాహసించి
సకుల నవలికిఁ ద్రోసి జా♦నకిని డాసి, కౌఁగిలి నెపంబునం జెవి♦గఱచి పలికె.

తే॥ మాయజింకను పంపుట♦మాయ జనకు, ననుపుటయు నాగపాశ బం♦ధనవిముక్తి
యించుకేని విచారింప♦కిట్లు జీవ, ములను వీడఁ దలంచితే? ముద్దుతల్లి!. ౩౪౨

ఉ॥ గణ్యతపఃఫలంబు కల ♦ గన్న ఫలంబును మీరు దండకా
రణ్యమునం జరించుతఱి ♦ రాజిలు చేఁతలు ధర్మదేవతా
పుణ్యఫలంబునం బొడము ♦ పూరుషవర్యుని రాము వీర్య సా
ద్గుణ్యములుం దలంప నొక ♦ దుర్మరణం బతనిన్ జయించునే?. ౩౪౩

మ॥ ముగుదా! రాముని మేన నొక్క విశిఖం ♦ బున్నాట కున్నట్టి యా
పగిదిం గానవొ? నీ మఱంది మొగముల్ ♦ భావింప మార్తాండు రీ
తిగ భాసిల్లుచునుండె లక్ష్మణుఁడు మి♦త్తిం బొందలేదమ్మ! రి
త్తగ దుఃఖమ్ముల నొందకమ్మ! యిది స ♦ త్యం; బేల సందేహముల్?

మ॥ మరణంబే భజియించునేని త్రిజగ ♦ న్మాన్యుండు రాముండు దు
ర్భరమై లోకము లన్నియుం జెడవె? భా ♦ స్వచ్చంద్ర బింబంబులున్
ధరణిన్ వ్రాలవె పట్టుదప్పి? పురజి ♦ ద్ధాత్రాదులు న్నిల్తురే?
స్థిరమై ధర్మము లోకముల్ నిలువఁగాఁ ♦ జింతింప నీకేటికిన్? ౩౪౪

ఉ॥ నీవరశక్తిచే హనుమ ♦ నీరసజీవుఁడు గాఁడు వ్యర్థమై
పోవదు నీసతీత్వమున ♦ పోఁడిమి యూరక చింతసేఁతయున్
భావుకరీతిగాదు సుర ♦ వర్యుల కోర్కులు రిత్తగావు రా
జీవ భవాస్త్ర పీడయు వి♦శీర్ణము కాఁగలదమ్మ! జానకీ! ౩౪౫

చ॥ మునుల నిలింపులం గనఁ ద్రి ♦ మూర్తులఁ గాంచిన పోల్కి రామల
క్ష్మణులను కాంచి హస్తముల ♦ మస్తములం దొడవించి మోద భా
వనముల నున్నవారు భయ ♦ పద్ధతి మానుము సాగరంబు నూ
తను వడిఁజొచ్చి నీరములఁ ♦ ద్రావుట చూడము మేదినీసుతా? ౩౪౬

చ॥ పతి మరణింప సూత్రమును ♦ పాయఁగనున్న సతీ మతల్లులన్
హితమతి! యీ విమానము వ ♦ హింపదు జార్చును తారకాణ లి
వ్వితమునఁ జెక్కు లున్నయవి ♦ వేఱిఁడి చందము నొందకమ్మ! నీ
పతి సుఖయమ్యోఁ గొందలము ♦ పాయుము నమ్ముము నన్ను తల్లిరో!

చ॥ అనుడు ధరాత్మజాత హృద ♦ యంబున నించుక తేటి యాసతిం
గని నిను తల్లిగాఁ దలఁచి ♦ కాలము ద్రోచితి నీదుపల్కు లె
ష్ఠను వృథగావు నేఁటి నిసి ♦ పోయెడుదాఁక భరింతు జీవముల్
నిను మదిఁ దెప్పగాఁ దలఁచి ♦ నిల్చితినమ్మ! శుభమ్మ నీకగుఁన్. ౩౫౯

చ॥ సతులకు భూషణంబు లగు ♦ సాధుగుణంబుల నీటఁ గల్పియున్
బతి ముఖదర్శ నాశ నను ♦ బాధలఁ బెట్టఁగ జీవముల్ భరిం
చితి నెటులెట్టులో గురుత ♦ చెడ్డ శరీరము వీడుటన్నఁ గ
ష్టతరముగాదు తల్లి! త్రిజ ♦ టా! యని మైథిలి నెమ్మదిం గనెన్. ౩౬౦

చ॥ స్థిరుఁడగు జీవు నివ్వసుమ ♦ తిన్ విడిపించి బలంబుచేత న
స్థిరమగు దేహమున్ భ్రమము ♦ చేఁగొని యంబరవీథిఁ గాల కిం
కరులు గమించులీల జన ♦ కప్రభు పుత్త్రిని రాక్షసాంగనల్
శరముల మీఁద నుంచికొని ♦ క్రమ్మఱినారు బిరాన లంకకున్. ౩౬౧

౨౩ సంజీవన శైల పటలము. (౧౧౭)

క॥ ఇనకులుని యాజ్ఞ వనులకుఁ, జనిన విభీషణుఁడు భోజ్య♦సామగ్రులు చే
కొని మరలి పాళెమునకుం, బనిచి యవల వచ్చి సమర♦వసుధం గాంచెన్ ౩౬౩

తే॥ బ్రహ్మశాపంబుచే మృతిఁ ♦ బడసినట్లు, వనచరావలి మెల్లను♦వ్రాలి నేలఁ
జాఁపకట్టుగఁ బడియుండు♦సరణిఁ గాంచి, హా! యనుచు నేమిఁ దోఁచక♦యట్టె నిలిచె.

క॥ జరిగిన సంగతి సుంతయు, నరయుని దనుజేంద్రుఁ డంత ♦ నటమట పడుచున్
బరుగునఁ జని లక్ష్మణుతో, ధరణిని వ్రాలిన నృపాల♦తనయుని గాంచెన్. ౩౬౪

ఉ॥ ప్రేమకుఁ బ్రాణ మస్థులు శ ♦ రీరము ముఖ్యములంచుఁ గాదటం
చీ మహిఁ బల్కవచ్చు రహి ♦ యించు పదావలిఁ గూర్చి నేర్పుచేఁ
బ్రేమకు సాటియైన దొక ♦ పేర్మిగుణంబు జగానఁ గల్గునే ?
ప్రేమగుణమ్ము మేర గని ♦ పెట్టిరె వేల్పులు నేఁటికేసియున్ ? ౩౬౫

ఉ॥ ఓరువలేని సంకటము ♦ నొంది తపించియు నెమ్మనంబునన్
వీరికిఁ జేటు లేదను వి ♦ వేకము నమ్మక ముంటఁ జేసియే
యూరక ప్రాణముల్ విడక ♦ యొప్పుగ శీలన మాచరించి కిం
గారుపడంగఁ దగ్గ దొక ♦ కాఱియ లేదని నిమ్మళించుచున్. ౩౬౬

తే॥ అజ శరంబుచేఁ గలిగిన ♦ దనియు నదియు, నింద్రజిత్తుచే సౌమిత్రి♦కినసె ననియు
నతనికై రాముఁ డీరీతి♦సడలి సోలె, ననియుఁ దలపోసి ప్రతికృతి♦యరయసాగె.

ఉ॥ శోక నిపీడితాంగుఁడయి♦శోషిలు రాముఁడు తేఱువెన్క న
స్తోకమతిం దలంతమనఁ ♦ దోడగు తమ్ముఁడు చావఁ బిమ్మటన్

జాక సహించి నిల్వఁ డటు ♦ సాగిన ధూర్తులకే జయంబిలన్
జేకుఱునంచుఁ గన్నుఁగవ ♦ చిత్తడి నొందఁగ నించె నశ్రువుల్. ౩౬౮

మ॥ ఫణిపాశంబు తొలంగినట్టి కరణిన్ ♦ బ్రహ్మాస్త్రముల్ వీడు ల
క్ష్మణ నాశంబును లేదు త్రెళ్లిపడు నీ ♦ శాఖామృగ వ్రాతముల్
బ్రణుతిన్ జీవము లొందు ధర్మము స్థిరన్ ♦ వర్ధిల్లు మాయావి రా
వణ దుర్మానికి రాక్షసాలికి జయ ♦ ప్రాశస్త్యముం గూడునే? ౩౬౯

క॥ తేఱుటకు మున్నె యాపద, తీఱఁగఁ దోడ్పడెడి వారు ♦ త్రెళ్లక యెవ రు
న్నారో వెదకెదఁగాకని, కోరికతో నెమకెఁ జేతఁ ♦ గొఱవిం గొనుచున్.

ఆ॥ పెదవి మడిచి కేలు♦పెనవైచికొని వేఁడి, వాఁడిచూపు జంకె♦పోఁడి మెఱయు
వారణముల కుప్ప♦పైఁబడియున్న సా, మీరిఁ గాంచి కనుల♦నీరు నించి. ౩౭౦

ఆ॥ అసువు లున్నవనుచు♦నరసి రక్తము వెల్లు, వ్రణములందు గ్రుచ్చు♦కొన్న శరము
లొక్కటొకటిగాఁగ♦నొయ్యన వెడలించి, మొగులు జలము చల్లె♦మొగము మీఁద.

ఆ॥ ఒడలు గగురు పొడిచె ♦ వెడవెడ నావియు, వచ్చె నావులింత ♦ వచ్చెఁగనులు
విచ్చెఁ దెలివివచ్చె♦నుచ్చరించెను రామ, రామ యనుచు మంత్రి♦రాజ మతఁడు.

చ॥ అలరును దుఃఖముం బెనఁగు ♦ లాడ విభీషణుఁ డంజనా సుతుం
జెలువుగఁ గౌఁగిలించికొన ♦ శ్రీరఘువీరుని యవ్యయంబు నిం
పెలయఁగఁ బ్రశ్నసేసి సుఖ ♦ యే యను వాక్యము వీనుదోయికిన్
గెలివిడి గూర్చె జే యనుచుఁ ♦ గేలు మొగిడ్చె మరుత్సుతుం డటన్.

ఉ॥ తమ్మునిమీఁది ప్రేమ బలి ♦ తమ్మగు చింతఁ దపించి సోలినాఁ
డిమ్మగఁ దేఱ రామవిభుఁ ♦ డేమగునో యని సంశయించెదం
జుమ్మని దైత్యనేత యనఁ ♦ జూచుచు మారుతి భల్లుకేశ్వరుం
డిమ్ముల నున్నవాఁడె యతఁ ♦ డెచ్చటనుండు వచింపవే యనన్. ౩౭౫

చ॥ అతనిని కాంచలేదు మృతి ♦ నందెనొ యేమొ యెఱుంగ జానకీ
పతి విషయంబు చూడుమనఁ ♦ బావని భల్లుకరాజు నిత్య జీ
వితుఁడు వివేకి మేలు నొద ♦ వింపను సేగిఁదొలంప దక్షుఁడో
బ్రతికితిమయ్య పోదమన ♦ వైశమ యిర్వురు చేరి రోయుచున్. ౩౭౬

తే॥ పోవుచుండఁగ నొకచోట♦ముసలితనము, వలన పెలలునాటిన నొప్పి♦వలనఁగలఁక
వలన మైకమొందియు జాంబ♦వంతుఁ డిరవు, రరుగుదెంచుచుండుట నడి♦యరసి
యెఱిఁగె.] తిరిగిరారు

తే॥ రాముఁడో హనుమంతుఁడో♦రాక్షసుండో, సురలొ మునులొ పగఱు వోయి ♦
కాన వచ్చువారలు కావఁ♦గడఁగువారె, కావలయునని నెమ్మది♦గాంచె నతఁడు.

తే॥ వచ్చి చేరువ నిలిచిన♦వారిఁ గనులు, తెఱచి కనలేక యెవ్వరో♦ తెలుపుఁ డీర
లనుడు బ్రతికితిమను విభీ♦షణుని పలుకు, సవ్వడింబట్టి యాగసి♦నంతసించి.
తే॥ అవలివాఁ డెవఁడని మారు♦తాత్మజుఁడను, నుత్తరము విని జయము మ♦రుత్తనూజ!
మంటిమిఁకఁ బునర్జన్మంబు♦గొంటిమయ్య, యనుచు మెల్లనఁ గనువిచ్చి♦యతనిఁ గాంచి.

చ॥ ఒడలి శరంబు లూడ్చికొని ♦ యుబ్బి యెలుంగులతేఁడు పావనిం
గడుకొని కౌఁగిలించికొని ♦ కంజ భవాస్త్రమయయ్యు రాఘవుం
దొడరి కలంపఁజాల దని ♦ దొడ్డగ నమ్మిగ గద్దునాకు నా
పుడమి కుమారిభర్త పని ♦ పూని యొనర్చినదేమి చెప్పుమా? ౩౮౧

చ॥ అనుడు మరుత్సుతుండను మ ♦ హాత్ముఁడు లక్ష్మణు పాటుగాంచి మూ
ర్ఛను మునిఁగెన్ స్మృతింగొనినఁ ♦ గ్రమ్మఱ నేమగు నో యెఱుంగఁజా
ల ననిన జాంబవంతుఁ డను♦లక్ష్మణుఁ దేర్పఁగ నే వచించు త్రో
వను చని మందు తెమ్ము కపి ♦ వర్గమె కాదు జగమ్ము నూల్కొనన్.

సీ॥ ఉదధిని దాఁటి తొ ♦ మ్మిదివేల యామడ, లరిగినఁ గాంతు హి ♦ మాచలమ్ము
నొగి నది ద్విసహస్ర ♦ యోజనాయతినొప్పు, నదిదాఁటి యోజన♦మరుగునంత
హేమకూటము వచ్చు ♦ శ్రీ మహితంబది, వెసదాఁటి తొమ్మిది♦వేల యోజ
నము లేగ నిషధశై♦లము గల్గు దానిని, గడచి యవ్వల నంత ♦ నడవ చనిన
తే॥ కనకశైలంబుఁ గానంగఁ♦గలవు దాని, విరివియుండు ముప్పదిరెండు♦వేల యోజ
నాలు పిమ్మటఁ దొమ్మిది♦వేల యోజ, నములు గడచిన నీలశై♦లమును గాంతు.

సీ॥ ఆమల రెండువే♦లామడల పొడవు, విలసిల్లు దాని క ♦ వ్వలను నాల్గు
వేల యామడ లేగ♦లీలను గాంతువు, మందులుగల నల్ల♦మలను నీవు
గాంచినంతనె మన♦కడగండ్ల కడలికిఁ, బారంబు గాంతువు♦వాయుపుత్ర!
అందు ప్రాణము లిచ్చు♦మందొండు మఱియొండు, చెదరు సంగంబుల♦జేర్చునొండు
తే॥ చెడిన రూపంబుఁ గ్రొత్తగాఁ♦జేర్చునొండు, వికలమగు నస్థు లతుకు మూ♦లికయు
దనరు సంజీవకరణి సం ♦ ధానకరణి, శస్త్ర సౌవర్ణ్యకరణి వి ♦ శల్యకరణి [ననఁగఁ

చ॥ త్రిదశులు క్షీరవారిధి మ ♦ థించిన యత్తఱిఁ బుట్టె నోషధుల్
పదిలము గాఁగ నుంచి రట♦వారలు విష్ణువు మున్ ద్రిలోకముల్
పదములఁ గొల్చునాఁడు కడు ♦ భక్తిఁ బ్రదక్షిణ మేనుసేయు న
య్యదనున దాని తత్త్వము మ ♦ హర్షులు తెల్ప నెఱింగితిన్ సఖా!

ఉ॥ వానిని గాచువారు సుర ♦ వర్యులు పెక్కురు వారిఁ జక్రముం
బూనికఁ గాచు నీవరిగి ♦ ప్రొద్దుదయింపక మున్నె తెచ్చుచో
భానుకులేశులుం బ్లవగ ♦ వర్గము జీవములొందు ధర్మమున్
మానుగ నూల్కొనున్ జగతి ♦ మాఁడును దైత్యకులంబు నావుడున్.

—: ఆంజనేయుండు సంజీవనిం దేఁబోవుట :—

మ॥ ఇది కర్తవ్యమ యింతలో రఘుకులా ♦ ధీశుండు తబ్బిబ్బు నం
గదయుం బొందకయుండఁ దేరుపుఁ డుమశ ♦ కాలంబు గాకుండఁ దె
చ్చెద దివ్యౌషధు లెట్టులేని యని పెం ♦ చెన్ దేహ మాకాశ మొ
ప్పిదమౌ శీర్షకభాతి దోఁపఁగ జగ ♦ ద్వీరుండు సామీరి తాన్. ౩౮౭

మ॥ గ్రహ ఋక్షంబులు తారహారముల వీఁ ♦ కందోఁచెఁ గ్రుంగారెఁ బా
దహతిం భూమి భుజాంతర ప్రథిమ సా ♦ ధ్యంబే ప్రమాణింపఁగన్?
గ్రహియింపందగె బాహువుల్ దిశల లం ♦ కాద్వీప మందింక నె
వ్వహిఁ దా రెండవ పాదముంపఁ దల మే♦పాటిం గనన్ లేదుగా! ౩౮౮

ఉత్సా॥ వాలువంచి కేలుసాచి ♦ వాయి మడిచి పాదమున్
నేలనూని ఱొమ్ము విఱిచి ♦ నిక్కపొడువ రోమముల్
లీల మెడను గ్రుంచి రామ ♦ లీల సంస్తుతించుచున్
గాలి కొడుకు నింగి కెగసెఁ ♦ గామచారియై చనన్. ౩౮౯

ఉ॥ లంక పయోధి మున్గిన క ♦ లంబన నొప్పఁగ నుప్పరంబునన్
వంకలు చిన్నతిప్పలును ♦ పాదపముల్ వడితోడ లేచె ని
ర్వంకలఁ దూలి సంద్రమునఁ ♦ బడ్డది దేవ విమాన పంక్తి య
థ్రంకమ్మై మహాబ్ధి దిగి ♦ భంబుల బోరుకులార్చె నత్తఱిన్. ౩౯౦

చ॥ ఒఱగిన పూరువేగమున ♦ నుత్తర దిక్కునకున్ మహీధ్రముల్
శరదములుం గలంగెఁ దరు ♦ జాలము కానల మండె రాపిడిన్
గరువలియుం బయోధి వెను ♦ కంబడఁ జిత్తములున్ వెనుంబడన్
గురుగతి వాయుసూతి చనఁ♦గోయని యార్చిరి వేల్పు లుబ్బుచున్. ౩౯౧

మ॥ జలముజ్జ్మండలి దాఁటి చంద్రపథమున్ ♦ సంధించి యుగ్రాంశు మం
డలమున్ మీఱి తరించి ఋక్షపథమున్ ♦ డాకొంచు దద్భోగ భూ
ములతో నబ్జజు లోకముం గడచి చూ ♦ పుల్ పోవఁగారాని య
గ్గలికన్ మారుత నందనుండు చనియెన్♦గాకుత్స్థ కార్యార్థియై. ౩౯౨

సీ॥ వైనతేయుఁడు వడి♦వైకుంఠమున కేగు, వాఁడని కొందఱు♦పలికినారు
తెలిపిట్టపై నెక్కి♦నలువ స్వలోకంబు, నందువాఁడని కొంద♦ఱాడినారు
శూలిగాకున్న నీ♦లీల నెవ్వఁడు చనఁ, గలఁడని కొందఱు♦తలఁచినారు
తలఁచిన రూపంబు♦దాల్చి లీలలు సల్పు, వెన్నుఁడె యని కొంద♦ఱెన్నినారు
తే॥ బాగుగాఁ జూతమని కొంద♦ఱేగి వెంట, ననుసరింపఁజాలక వృథా♦యాసమంది
రమణఁజని పునరావృత్తి♦రహితమైన, మోక్షపద మందువాఁడని♦మ్రొక్కినారు.

తే॥ రూపమున్నది యని జ్యోతి♦రూపమనుచు, జ్ఞానరూపుఁడనుచుఁ బవ♦మానరూపుఁ
డనుచు సర్వకారణుఁడగు♦హరియటంచుఁ, బలువిధంబుల విజ్ఞులె♦తలఁచినారు.

తే॥ పరవి బ్రహ్మాండమెల్ల నం♦బరముగప్పి, నట్టి హనుమని వడిచేత♦నడరినట్టి
శబ్దయుత వాతమున దిగీ♦శాన శిరము, లల్లలాడె నజాండంబు♦తల్లడిల్లె. ౩౯౫

క॥ ఒలి ధారవోయ జగములఁ, గొలువఁగ హరి గొప్పరూపు♦గొన మునులును వే
ల్పులు సంతసిలిన తెఱఁగున, నలరిరి హనుమని మహోద♦యాకృతివలనన్ ౩౯౬

క॥ సుర సిద్ధ కింపురుష కి, న్నర విద్యాధరులు చల్లు♦ననలును గందం
బిరవార నెఱయ విరిసిన, హరిచందన మట్లులొప్పె♦హనుమంతుఁ డటన్ ౩౯౭

క॥ హిమవంతముఁ జేరఁగ నం, దమరిన తపసులును విబుధు♦లలరుచు నీకా
ర్యము ఫలియించుత మని రటఁ, బ్రమథవరుని నగముఁ గాంచి♦పావని యుబ్బెన్

క॥ ఈశాన్యాధీశుఁడు కై, లాసంబును గని కరంబు♦లను మొగిచిన యా
కీశవరుఁగాంచి ప్రేమా, వేశంబున నుమకుఁజూపె♦వేడుకపడుచున్. ౩౯౯

క॥ ఇతఁడేగుచోట యను నా, సతికి హరుఁడు రామ దూత ♦ సంజీవనికై
హితమతిఁ జనియెడు లంకా, పతి నాశము రేపుచూడఁ♦బదమా యనియెన్.

క॥ హరిచక్రమువలెఁ జనియెడి, కరువలికొడు కచటు కడచి ♦ క్షణికంబగు కా
మ రతులఁ దనిసెడు సురగణ, మిరవుకొనిన హేమకూట ♦ శృంగము కాంచెన్.

క॥ మనసునకు జ్ఞాననేత్రం, బునకు విధికి నందకుందు♦పొలమునఁజను పా
వని కనియెఁ బైని భువనము, లను కొలిచెడి కజ్జనా న♦లరు కనకాద్రిన్. ౪౦౨

క॥ అనిమిషులేమియుఁ దోఁపక, కనుచుండఁగఁ గీశవరుఁడు♦కాంచనగిరిపైఁ
జని కనె నీదీవికిఁ జే, రెనయించిన జంబువును స ♦ మీప్సితమతియై ౪౦౩

ఆ॥ మేరుశిఖరమందు♦సొరైన యజపురిఁ, గాంచి దాని నడుమఁ♦గనక పీఠి
నలరు నలువఁగాంచి♦యలరారు మనముతో, వందనంబు సేసె♦వాయు సుతుఁడు.

క॥ సురతరు వనమున భక్తులు, పరవశులై వినుతిసేయఁ♦బ్రణవ రవమునన్
హరి శ్రీభూ తరుణులతోఁ, దిరుఁడయి వేంచేయఁ గని ను♦తించుచు నవలన్.

తే॥ అంద యీశాన్యభాగంబు♦నందుకోటి, భానుసంకాశ ఘృణి భాస♦మానుఁడగుచు
భక్తు లర్చించు పూల కు♦ప్పలకు నడుమఁ, గ్రాలు భవ భవానులఁగాంచి♦ కేలు మోడ్చె.

తే॥ చంద్రువలెవెలిగొడుగుశీ♦ర్షమ్ముమీఁద, వెలయ సుందరుల్ చామరల్♦వీచుచుండఁ
ద్రిదశు లలరి కొల్వఁగ నొప్పు♦దేవ విభుని, కాంచి ముదమంది కేల్మోడ్చి♦కడచిచనియె.

తే॥ విరిసియున్న కల్పకతరుల్♦వెలయ రుచిర, కాంతు లొప్పారు నిర్జరా♦గారమైన
కనకగిరి శిఖరమున ది♦క్పతులఁ గన్న, లలరఁ గని యాంజనేయుండు♦హర్షమందె

ఉ॥ మేరువుదాఁటి వైశమ స మీర కుమారకుఁడు త్తరస్థలిన్
జేరి దినేశుఁ డస్తగతిఁ జెందమి నొక్కక్షణంబయేని రే
వాఱక యుంటఁ జేసి యది భానుఁడు పుట్టినకాఁ దలంచి దై
వాఱిన చింత మున్గెఁ దన పట్టిన కార్యము భంగమౌటకున్. ౩౦౯

ఉ॥ భూపతి మూర్ఛదేఱుటకు మున్నుగ నోషధు లిచ్చి లక్ష్మణున్
లేపఁగ నెంచి వచ్చితి మ లీమస బుద్ధిని పాడుచేసితిన్
రేపడు మున్నె మారుతి జ రీలున వచ్చున యంచుఁ గాచువా
రేపగిదిం జరింతు? నిఁక నెయ్యది కార్యము? సర్వముం జెడెన్. ౪౧౦

చ॥ అతుల వివేకశాలి యగు నాహనుమానుఁడు మానసంబునం
దతితర చింతనొందియు ర యంబునఁ దేఱి యుదీచియం దహ
ర్పతి యుదయించునే? కనక పర్వతమున్ రవి చుట్టునంచుఁ బం
డితులు వచించు వారలని డెందము కుందు తొలంచె న త్తఱిన్. ౪౧౧

చ॥ మరణములేక చింతయను మాటయులేక సతంబు భోగమే
యురవుగనొప్పి యాలుమగ లొక్కశరీరమ యొంది ప్రేమ మో
గిరముగ నిష్టగోష్ఠిఁ దిల కించుచు జీవులు సంచరించు ను
త్తర కురు భూములం గనుచు దాఁటె మరుత్సుతుఁ డుగ్రవేగుఁడై.

తే॥ అటఁ గపర్దియు హరి కమలాసనుండు, నెలవుకొన యోగ్యమై త్యాగి నిశ్చలుండు
నైన ధర్మప్రభుని రాజధానిఁబోలు, పట్టణములఁ గాంచుచుఁబోయెఁ బవనసుతుఁడు.

తే॥ మేరువునకంటెఁ బొడవుగ మీఱి యజుని, పట్టముం గొనువాఁడును భవము లేని
వాఁడు నగు కపివీరుండు పోఁడిమిని త్రి, విక్రముని పోలు నీలాద్రి వెలయఁ గాంచె.

తే॥ ఇరులఁజోతులు జిమ్ము న గ్గిరిని దాఁటి, జాంబవంతుడు తెలిపిన శైలమును మ
హామహీ దీప్తులను మింటి నధికకాంతి, మంతముగఁ జేయు చిన్నియం బట్టికాంచె.

తే॥ కాంచిదిగె దిగినంత న క్కరువ్రకుంగె, దానిఁగాచు దేవతలును తటమటపడి
నిలుకఁ జెంది సన్నిధి నిల్చి నీ వెవండ, విటకు వచ్చిన కారియ మేది? యనుడు.

ఉ॥ వచ్చిన కార్యముం ద్రిదశ వంద్యుఁడు మారుతి సాలుమూల వా
క్రుచ్చిన వారలున్ మదిని కొంకక గ్రైకొనిపోయి పిమ్మటన్
దెచ్చి యథాస్థితి న్నిలుపు ధీవర! యంచు నదృశ్యులౌ తఱిన్
దిచ్చు మొగంబు చెందెఁ బొడ తెంచి సుదర్శనమున్ రయంబునన్.

చ॥ ఉడుగక యోషధుల్ వెదకు చుండినఁ గాలముమీఱుఁ గార్యమున్
జెడు నటుగాన నీశిఖరిఁ జేకొని పోవుట యుత్తమంచు నె
వ్వడిఁ బెకలించి యెత్తికొని వాయుకుమారకుఁ డంబరస్థలిన్
బెడిదపు టమ్మువోలెఁ గడు వేగమ తీవ్రున వచ్చుచుండఁగన్. ౪౧౨

—: జాంబవద్విభీషణులఁ గాంచి రాముఁడు పరితపించుట :—

చ॥ వెరవరి జాంబవంతుఁడు వి ♦ వేకి విభీషణుఁ డేగుదెంచి దా
శరథి పదాంబుజంబు లెల ♦ సంబున నొత్త నెలర్చె భామినీ
వర హృదయాంబుజాత మధు ♦ పమ్ములు సత్కరుణా స్వరూపముల్
వరదములుం బవిత్రములు ♦ పంకజసామ్యములైన నేత్రముల్. ౪౧౮

చ॥ కనుగవ నీరునించుచు వ ♦ గర్చెడు వారలఁ గాంచి నీవు పో
యిన పనిమేలె? జీవము వ ♦ హింతె? విభీషణ! బ్రహ్మపుత్ర! నీ
కును శుభమేకదా? సమసి ♦ కూలె నమ స్తబలంబు తమ్మితో
నొనరుపఁ దగ్గదొండు తెరు♦వున్న వచింపుఁడు మీరు శీఘ్రతన్.

చ॥ పుడమికుమారి వల్ల మతి ♦ పోయిన నాస్థితి చెప్పనేల? యీ
పుడమి కలంతకాలమును ♦ పోవని నిందను మోచినాఁడఁ ద
మ్ముఁడు నను మాయజింక యిది ♦ పోవలదన్నను నాఁడు దాని ప
ట్కెడవక పోవుటం గద వ♦హించితిఁ గూర్చితి నిన్ని చెట్టలున్. ౪౨౦

ఉ॥ రావణుఁగాంచి చేవను దు ♦ రం బొనరించితిఁ జంపనైతి నా
జీవములైన యిందఱకుఁ ♦ జేటొనఁగూర్చితి బొమ్మతూపుచే
రావణిఁ గూల్తునన్న సమ ♦ రస్థలి ధర్మముగాని పద్ధతిం
బోవకుమంచుఁ దమ్మునకుఁ ♦ బోయితి నడ్డము కీడు దెచ్చితిన్. ౪౨౧

ఉ॥ తమ్మునితోడ నుండక వె ♦ తారము దుర్విధి గూర్పఁబోలు న
న్నమ్మల పూజసేయ నెడ ♦ కంపెను సోదరులెల్ల రాజి రం
గమ్మునఁ గూలి రింద్రజితు ♦ గండడఁగింపక లక్ష్మణుండు నా
కమ్మును చేరె నావెడఁగు ♦ కర్జము కూర్చె మహార్తి వీరికిన్. ౪౨౨

ఉ॥ ఇచ్చట నిట్టి పల్కు వచి ♦ యించుచు నిల్చు టపేక్షణీయమే?
ముచ్చల రావణాదులను ♦ పోర వధించి సురాలికిన్ ముదం
బచ్చుగఁ గూర్చి వారికొను ♦ సయ్యది యెయ్యది లేదు వీరలన్
హెచ్చిన ప్రేమఁగూడ దివి ♦ కేగుటయే తగుత్రోవ నాకగున్. ౪౨౩

ఉ॥ ఏటికి సీత? రాజ్యరమ ♦ యేటికి? నేఁటికిగీర్తి? ధర్మమిం
కేటికి? బంధు లేమిటికి? నేటికి ♦ శౌర్యము? సత్య మేటి కి
ల్లేటికి? వాకి లేమిటికి? నేటికి ♦ సత్కృతు? లేల వైరముల్?
సాటి యొకింత లేని యను ♦ జన్ముఁడు స్వర్గము చేరు పిమ్మటన్. ౪౨౪

చ॥ సెనరు వినిమ్ఫలంబు గన ♦ నెయ్యపుఁ దమ్ముఁడు లేని పిమ్మటన్
దనుజులనెల్లఁ బోకడచి ♦ దర్పము చూపుదునేని చౌర్య వం

చనములు గల్గువాఁడనె ని ♦ జం బగుదుర్ మఱికాదయేని బ
చ్చెనబొమనోదు నిత్తఱిని ♦ జీవము వీడుటె యుక్తకార్యమా. ౪౨౫

ఉ॥ తండిరిఁ గోలుపోయి పెద ♦ తండ్రి యనందగు నజ్జటాయువుర్
దండకయందు గోలుపడి ♦ తమ్ముని మిత్రుల నక్కవాలికిం
గండగ నిచ్చి సౌఖ్యములఁ ♦ గామినితోఁ గొనెనంచుఁ గర్ణముల్
పుండయి పుచ్చి విచ్చి పురు♦వుల్ పడఁ దిట్టదె సాధులోకముర్. ౪౨౬

ఉ॥ తమ్ముఁడు లేక సీతఁ గొని ♦ ధారణినేల నయోధ్యకేగుచోఁ
దమ్ముని వీడివచ్చితె ను ♦ తా! యనుతల్లి సుమిత్ర మోము నే
నెమ్మెయిఁగాంచి యేమి వచి ♦ యింతును? రక్కసివాతఁ బెట్టితిం
బొమ్మని పల్కకంటె నసు♦వుల్ విడుటెంతయు మేల కాదొకో? ౪౨౭

తే॥ అనుచుఁ బలువిధంబుల నిట్టు♦లడలుచున్న, పుండరీకాక్షు జాంబవం♦తుండు కాంచి
దేవ! విలపించుచుండినఁ♦దెలివి మాయుఁ, దెన్నుదోఁపదు వినుమొక్క♦విన్నపంబు.

—: జాంబవంతుఁడు రాముని తేర్చుట :—

తే॥ అరిది సద్గుణావళులకు ♦ నాటపట్టు, వైన నీవు నిన్నెఱుఁగవు ♦ గాని నేను
నిన్ను మున్నె యెఱుంగుదుఁ♦దెన్నుదప్పి, సంభ్రమించిన సురల యా♦సలు నశించు.

ఆ॥ కదనమందు కీశ♦గణములఁ దమ్ముని, ప్రాణములను గొన్న♦ప్రదర మత్య
మోఘమైన యజుని ♦ ముఖ్యాస్త్ర మనియెదు, నాతలంపు నిజము ♦ నలిననేత్ర!

తే॥ పరఁగ బ్రహ్మాస్త్రమే యేయఁ♦బడునయేని, సమరమున దేవదానవ♦సమితినేని
చెలగియే తీరు నిన్నేమి♦చేయలేక, వదలినది యింతకంటె మో♦దదము గలదె?

తే॥ ధీరుఁడగు హనుమానుండు♦తెలివినంది, పసవుచో నది తగదని♦పంపినాఁడ
నోషధులు గొని తెచ్చుట♦కుత్తరమున, కాతఁడిప్పుడ వచ్చు నీ♦లాబ్దదేహ! ౪౩౧

తే॥ హిమగిరిని మేరువుం దాఁటి♦యేగియున్న, యాంజనేయుండు వచ్చుస♦యాక్షణమున
నీ మనశ్చింత లెల్లను♦నీఁగు నిజము, నిముస మూఱడుమా! జగ♦న్నియతచరిత!

ఉ॥ మార జితాంగ! యేను నజ ♦ మాధవ శంభులు తక్క నెవ్వరుర్
దీరుగ నోషధి స్థితులఁ ♦ దెల్పఁగలేరు సుపర్వ దానవుల్
క్షీరపయోధిఁ ద్రచ్చుతఱిఁ ♦ జిక్కిన వానిని విష్ణుచక్రమే
వారక కాచుచుండు నవి ♦ వర్ధిలు నక్కురుభూమి కవ్వలర్. ౪౩౪

తే॥ ఇందనుక నేరిచే స్పృ శి♦యింపఁబడవు, నలువకైనఁ బ్రాణము లీయఁ♦గలిగినయవి
పరఁగు సంజీవకరణి సౌ♦వర్ణకరణి, యన విశల్య సంధాన క♦రణు లనంగ. ౪౩౫

తే॥ ఓషధులు నిక్కముగ వచ్చు♦నుమ్మలికము, వదలు ధర్మమే ప్రోవచూ♦పంగ హనుమ
వచ్చుఁ దేఁగలఁ డతనికి♦వలనుపడని, పనియుఁ గలదె? యోచింపుమా! భవవినాశ!

తే॥ అనుచు శ్రీరామభూపతి • యతని పలుకు, విని ముదంబందుచుండు నం • తనె మహార
వంబు డీచిని పుట్టి సం • ద్రంబు పొరలెఁ, జండమారుత మేతెంచె • జవము మెఱయ.

తే॥ ఉడుగణంబులు వడిదప్పి • యురలె సూర్య, మండలము పోయి ద్విజరాజ • మండలమును
చేర నందలి జింక కృ • శించె దగను, మొగుళు లొండొంటిఁ దేఁటుల • మొగిని తాఁకె

తే॥ వేల్పు పూఁగుత్తులును విను • వీథి కెగసె, భూధరమ్ములు భ్రమఁకులఁ • మునుపటివలెఁ
గడలి లోఁబడె మారుతి గర్జనంబు, చేసె రామాదుల యెడంద • చింత దొలఁగ.

ఆ॥ భువియు దివియు మేఘ • ములు సాగరంబులు, తక్కినవియు నొక్క • తరుణమందె
గొప్ప రవము చేయు • గొమరున నుండెను, గాడ్పుపట్టి సేయు గర్జనంబు. ౪౪౦

ఆ॥ పాలవెల్లిఁ జిలుక • వైకుంఠు నాజ్ఞ మం, దరముఁ దెచ్చుచున్న • గరుడు కరణి
నొప్పె నురుజవమున • నోషధీశైలంబుఁ, బరఁగఁ దెచ్చుచున్న • వాయుసుతుఁడు.

ఆ॥ పవనుఁ డా త్రికూట • పర్వతంబుఁ బెకల్చి, తెచ్చుకరణి హనుమ • తెచ్చెఁ దెచ్చి
ననుచునుండ నతఁడు • నవనికి దిగియె న, మ్మల నభంబునంద • నిలిచె దిగక. ౪౪౨

ఆ॥ మంద మారుతమ్ము • మందులతో వీచి, యెల్ల వారియొదలు • పల్లవింప
భానుసుతునితోడ • వానరావళి యార్చు, నట్లు చేసె విబుధు • లలరుచుండ. ౪౪౩

ఆ॥ విబుధ వినుతు లగుచు • విందులై యుండిన, కపులు మందుగాలి • కలయ వీవ
సొగసు చేవ దిటవు • నెగడఁ గాలు జయించి, నక్కవాత మట్టి • గ్రుక్కినారు.

ఆ॥ అసుర తనువు లెల్ల • నంబుధిఁ బడుటచే, బ్రదుకవయ్యెఁ దక్క • పడవలును చి
గిర్చి ప్రాణమొందఁ • గీశుల విషయంబు, విప్పి చెప్పవలెనె • విశద ఫణితి! ౪౪౫

ఆ॥ అలుఁగు లూడె గాయ • ములు చల్లనై పూఁడెఁ, గలయ నేత్రతార • కలు చలించె
జగము వినుతి సేయ • సౌమిత్రి తెలివందెఁ, గూర్కునుండి మేలు • కొన్నమాడ్కి.

ఆ॥ సప్త సాగరములు • సంక్షోభ మందంగఁ, గపులు సేయు వీర • గర్జనముల
లేచె లక్ష్మణుండు • లేఖుల భద్రగీ, తముల లేచు శేష • తల్పు భంగి. ౪౪౭

ఆ॥ లేచినట్టి యనుజు • లేఁచిన భుజములఁ, గౌఁగిలించుకొన్న • కంజ నయను
చింతతోడ సురల • చింతయు జగముల, చింత తఱిగి విఱిగి • చెదరిపోయె. ౪౪౮

క॥ చెన్నుగ నాడిరి వేలుపు, టన్నులు కిన్నరుల గీతి • కారవ మింపై
మిన్నలమె మునులు నిగమపుఁ, బన్నములు పఠించి రవని • పండువు సేసెన్ ౪౪౯

క॥ వేదంబులు ఘోషించెను, వేదవిదుల విజ్ఞతయును • వికసించెను స
మ్మోదము నొందె జగము సం, భోదము లంభోధు లుఱిమి • పొలుపుం బొందెన్

క॥ కొల తొలఁగిన యాపిమ్మట, నలువశరము జానకీ మ • న స్సదనునకున్
వలగొని కరుణించితివని, పలికి వినతిమై నద్భుత్య • భావము నందెన్ ౪౫౧

చ॥ ఎడఁద దురంత చింత నశి ♦ యింప ముదశ్రు పరీత నేత్రుఁడై
పుడమికుమారి భర్త కపి ♦ ముఖ్యుని వాయుతనూజుఁ గౌఁగిటన్
దడవి మదీయ వంశమును ♦ ధారణిలో యశమంద నిల్పి నా
యొడలిని విక్రయించికొని ♦ యుంటివి వేఱొకఁ డున్నె చేయఁగన్.

ఉ॥ మా కుల పూర్వులెల్లరు క్ర ♦ మంబునఁ బెంచిన ధర్మపద్ధతుల్
నాకతన న్నశింప మర ♦ ణంబె భజించితి మేము నీవ యి
క్ష్వాకుకులంబు నిల్పితివి ♦ ప్రాక్తన ధర్మములెల్ల నెక్కొనన్
నీ కరుణం బదంపడి జ ♦ నించిన వారము సుమ్ము పావనీ! ౪౫౩

ఉ॥ ప్రాణముఃపోవువేళ నొద ♦ వంగల పుణ్యులు తామొనంగు నా
ప్రాణముతోడ వారలకుఁ ♦ బ్రత్యుపకారముచేఁత సామ్యమే?
ప్రాణము లిచ్చు మాత్ర మన ♦ భావ్యమె యిప్పని? ముందటన్ జగ
త్ప్రాణ కుమారకా! యరుల ♦ ప్రాణము లూడ్చితి దూఱు వోవఁగన్

ఉ॥ సోదరుమీఁది ప్రేమమున ♦ స్రుక్కితి లోక మెఱుంగ నిట్టి యా
మోదము నీవు గూర్చుటను ♦ ముందటి దుఃఖము మిక్కిలిన్ సుఖ
శ్రీదముగాఁ దలంతుఁ జిర ♦ జీవివి సాయము యుక్తవేళ నా
కాదటఁ గూర్చినాఁడ వటు ♦ లౌటనె నిల్చె జగంబు మేలిమిన్. ౪౫౫

ఉ॥ ఎల్లరు ప్రాణముల్ విడక ♦ యిమ్మగు సౌఖ్యము లందునట్లు మే
లుల్లసిలంగఁ జేసి తోక ♦ యుమ్మల మందక శాశ్వతుండవై
చెల్లుమ యంచుఁ బల్కెఁ గపి ♦ శేఖరు లుత్కట వీరనాద సో
ద్యల్లసితాస్యులై రి పవ ♦ నాత్మజుఁ డుబ్బున మ్రొక్కి యిట్లనున్. ౪౫౬

ఉ॥ తమ్ములవైరిఁ బడ్చి యమ్ము ♦ తమ్మును తమ్మున కీయఁజాలనే?
క్రుమ్మి దివమ్ము నందమృత ♦ కుంభము దెచ్చి యొసంగఁజాలనే?
యిమ్ముగఁ బాలవెల్లి మథి ♦ యించి సుధం గొని తేరఁజాలనే?
బమ్మను పట్టి తెచ్చి తల ♦ వ్రాఁతని మార్పఁగఁజాలనే? ప్రభూ! ౪౫౭

చ॥ గురుతరమైన నీకరుణ ♦ గూడిన నియ్యది కార్యమే? యనన్
నిరవధి సత్త్వసంయుత వ ♦ నేచర సింహామ! యొంత కెంత కే
నరువాఁడవైన నీవు కల ♦ యంతకు నాపద మమ్ము చేరునే?
బెరసితిమేము సౌఖ్యములు ♦ పేరిమితోనని రాముఁ డాడఁగన్. ౪౫౮

చ॥ అతులితశౌర్యశాలి! పవ ♦ నాత్మజ! యిమ్మల యింద యుండినన్
దితిజకులంబు చావదు వ ♦ ధింపనుచాలము కావునన్ యథా
స్థితి నట దీనినుంచి చను ♦ దేరుమ వైళమ యంచు భల్లుక
క్షితిపతి పల్కెఁ బావని వి ♦ శిష్టమతిం గొనియేగె శైలమున్. ౪౫౯

౨౪ హాలాపాన నటన పటలము (౨౧)

క॥ ఇట నిట్లు జరుగుచుండఁగ, నట రావణుఁ డుబ్బి కుతుక♦మంది వినోద
స్ఫుట హాలా జనిత విశం, కట యువతీ నటన లీలఁ♦గాంచుచు నుండెన్ ౪౬౦

తే॥ అమరకాంతలు విద్యాధ♦రాంగనలును, దైత్య వనితలు నాగ సుం♦దరులు యక్ష
మధురవాణులు సిద్ధ బం♦భర సువేణు, లెల్లఁ దెందేఁపలై వచ్చి♦రుల్లసిల్లి. ౪౬౧

తే॥ రంభయును తిలోత్తమయు నూ♦ర్వశియు మేన, కయు ఘృతాచియు బహువిధ ♦ క్రమ నినద
వాద్యములతోడ లయరాగ♦భావ సరణి, చెడక పాడుచు నాట్యంబు♦చేసినారు.

చ॥ ప్రచలిత కుండలంబులు ప్ర ♦ భా తిలకంబులు లోలనేత్రముల్
విచికిల దంతముల్ మధుర ♦ పేశల క్రమ సుధాధరంబులున్
ప్రచుర మనోహరాలక వి ♦ భాసిత తన్ముఖ చంద్రబింబముల్
రుచిరముగా వెలింగె ముఖ ♦ రోచులు రాగము నొందుచుండఁగన్.

ఉ॥ తేటలు వాఱు చిర్నగవు ♦ తెల్పును భూమల తేఁతయొడయున్
మూటలుగట్టు దీప గణ ♦ ముల్ వెలిఁగింపఁగఁ జాలు మేని డా
ల్పాటులు జీరువాఱఁ గను ♦ వారల తెల్విని పోలి మీటుచున్
బాటలుగా నిరుల్ మరుల ♦ పాలయి క్రుంగఁగసాగె నయ్యెడన్. ౪౬౪

చ॥ చదువులచేత సత్పథిని ♦ చాఁగుచు భావి నెఱుంగు పెద్దలన్
ముదమున నాశ్రయింప గుణ ♦ ముల్ దెలివిం గడు విస్తరించు న
ప్పుదురున మీఁదు గాన కిల ♦ బ్రక్కలఁబైఁ బ్రసరింపఁజేయు దు
ర్మదుల పరాక్రమంబు వలె ♦ మైకము నవ్వడిఁ బర్వె నెల్లెడన్. ౪౬౫

ఉ॥ నవ్వులు మించె దంతముల ♦ నాణెము వెల్వడె స్వేదబిందువుల్
మవ్వముగా నెలర్చె లఘి ♦ మంబుగ వాతెఱలుం జలించె వే
నివ్వటిలెం గనుంగొనల ♦ నీటగు రక్తిమ నిక్కఁ గన్బొమల్
కవ్వికొనెన్ మొగంబులను ♦ గాటపుఁ దెల్లఁదనంబు వారికిన్. ౪౬౬

చ॥ తలముడులెల్ల వీడుచు ని ♦ తంబములం దగ దాఁటి వ్రేల మే
ఖలలు పటాలితోడుత ది ♦ గంబడ మానముఁగాచెఁ గేశముల్
తులువలు దుండగంబులకుఁ ♦ దూకొన నుత్తము లడ్డువచ్చి దీ
నుల కగు బన్నముల్ తొలఁగ ♦ నూకఁదలంచుట యుక్తమేకదా?.

తే॥ మదన మృగయుండు పొది నుంచు♦ప్రదరమనఁగఁ, దగిన కన్నులతో నున్న♦ మగువ లపుడు
స్రుతిని కలియక వెఱ్ఱిప♦ద్ధతులతోడఁ, బాడి రవ లయతో నప♦స్వరముతోడ.

తే॥ వేణునాదంబును జయించు♦విమలరవము, గలుగు చెలువలు పాటల♦గతులు దప్పి
కాకి యటువుతో సుధయందు♦కల్లుచేర్చు, తీరు దోఁపంగఁ బాడిరి♦తెలివిచెడఁగ.

తే॥ కాంచ నింద్రజాలమె యను♦కరణిఁ దోఁచు, భావ విస్ఫూర్తి నభినయ♦పద్ధతులను
తెలుపు జాణలు నోటితో♦ద్విపముఁ బలికి, తేరు కరములతోఁ జూపు♦వారలైరి.

తే॥ ఆడుదురు పాడుదురు నవ్వి♦యేడుతురును, తూలుదురు సోలుదురు చాల వ్రేలుదురును
నీలుగుదురు తూఁగుదురును♦మూలుగుదురు, మ్రొక్కుదురు స్రుక్కుదురు మీఁటి♦
నిక్కుదురును.

తే॥ మదిని గలదాని నంతయు♦మఱుఁగుపఱుప, లేక వెలిఁగక్కునారలు♦లేమ లట్టి
తెఱఁగుఁ గాంచి నిల్చిన జితేం♦ద్రియుల రోమ, కూపముల నెల్ల మదన ల♦కోరు లడరె

చ॥ భ్రమరములంబలెం జలన ♦ భావము నొందెడు కన్నులెట్టనై
యమరెను రక్తిమంబగు ము ♦ ఖాంబుజముల్ తెలుపొంద దైత్య వం
శమునకు భావినాశమును ♦ జాడఁగఁ దెల్పెడి పోల్కిఁ గన్పడెన్
ద్రుమ మొకటైనఁ బుష్ప నికు ♦ రుంబము వేఱుగఁ బూచెనో యనన్.

తే॥ యముని కుంతంబు మదనుని♦యలుఁగు నుపమ, గాఁగఁ జెప్పిన నొప్పని♦కన్నులుగల
చెలులు హారంబులను రశ♦నలను వస్త్ర, ములను కొప్పులలోపల♦ముడిచికొనిరి

తే॥ మందహాసరుచుల్ గల♦మందగమన, లిట్టి గతులొందఁ గని మోద♦మొనయుచున్న
రావణాసురు శ్రవణరం♦ధ్రములఁ జొచ్చెఁ, గపి సమూహంబు చేసిన కలకలంబు.

తే॥ పాట లాటలు కేకలు♦వాద్యరవము, లలుక లూఱటల్ కొంకు మా♦టలు కటాక్ష
ములును తక్కుచేష్టలు బలి♦ముఖుల గర్జ, వలన వేడికిఁ బువులట్లు♦వాడిముడిఁగె

తే॥ కట్టుఁగంబములందె నా♦గములు సోల, వాజులుం దూల నసురుల♦పసిమి మాల
రామలక్ష్మణ శింజినీ♦రావ మడరె, వార్ధిఁ ద్రచ్చిన నాఁటి ర♦వంబు కరణి. ౪౭౭

చ॥ తరుణుల కూటముల్ కపి క ♦ దంబము వోలెఁ గనంబడంగ మం
దరము కలంప నొప్పు భయ ♦ దంబగు సంద్రమునాఁగ మానసం
బఱిమిఱి సెంద నత్తఱి ని ♦ శాంతమ యయ్యె దశాస్యు మోము చం
దురునకుఁ ద్రోవరానిదయి ♦ తోఁచెను పట్టపగల్ విధంబునన్. ౪౭౮

చ॥ వినవిన బంధురాకృతిని ♦ వేగులు వచ్చి దశాస్య కంఠ పు
ష్ప సరము లందుచేరి పగ ♦ వారలు ప్రాణములొంది చాల నం
తసమున నున్నవారనని ♦ దం దిగులొంది లతాంత శయ్యపై
మసలుట మాని తత్తఱను ♦ మంత్ర నిశాంతము చేరె గ్రక్కునన్. ౪౭౯

౨౫. మాయాసీతా పటలము (౯౭)

తే॥ చేరి వృద్ధులాప్తులు నింద్ర♦జితుఁడు సైన్య, పతులు విన జరిగిన దెల్లఁ♦బలుకునంత
మాల్యవంతుండు చింతమై♦మనసువాడఁ, దెలిపె నిట్లు రావణునకు♦ధీరమతిని.

చ॥ చెడు దలఁపూని దానవులఁ ♦ జెచ్చెర నంబుధి వైవకున్న ని
య్యెడ ననువుల్ నిజంబుగ వ ♦ హించియె యుందువె తప్పె నీదు దుం
దుడుకునఁ బంకజాసనుని ♦ తూపె నిరర్థకమాట వానరుల్
కడుఁగొని పైపయిం దొడరఁ ♦ గా నొకయుద్ధును లేదు రావణా! ౪౯౧

చ॥ కలఁక యొకింత గానని జ ♦ గత్పరిపాలు కటాక్షదృష్టిచేఁ
జెలంగి క్షణంబులోనఁ జని ♦ చేవ మహౌషధి భూధరేంద్రముఁ
బలిమిఁ బెకల్చి తెచ్చిన య ♦ వార్యబలుండు మరుత్సుతుండె కా
వలయును తక్కువారలకుఁ ♦ బల్కఁ దలంప నొనర్ప శక్యమే? ౪౯౨

చ॥ మలఁగొని పోయినట్టి యల ♦ మారుతి మేరు ధరాధరంబు ని
ట్టలముగఁ దెచ్చి వైచిన న ♦ డంగమె? లంకను కెల్లగించి భూ
స్థలిఁ దిరుగంగ వైచిన ని ♦ శాచర వర్గము నిల్వనేర్చునే?
ములుచఁదనంబు మాని తల ♦ పోయుట కార్యము నిర్జరాంతకా!. ౪౯౩

చ॥ జగముల నెల్ల నొక్కపరి ♦ చావఁగ మోఁదఁగఁ జాలువాఁడు సా
ధుగుణమునం ద్రిమూర్తులకుఁ ♦ దోడుగ నాల్గవమూర్తియంచు నెం
చఁగఁ దగువాఁడు మారుతి ని ♦ జంబిఁకఁ జావకయున్నవారలఁ
నెగడఁగఁ జూచుటల్ తగవు ♦ నెమ్మది నీవ తలంచిచూడుమా. ౪౯౪

శా॥ వాలిం గూలఁగనేసి గొప్ప జలధిం ♦ బంధించి లంకాపురిం
గాలుంబోలిన కుంభకర్ణు ననిలో ♦ ఖండించు శ్రీరామ భూ
పాలుం బుద్ధ్యుద సన్నిభుల్ దనుజు ♦ లా? బాధించి చక్కాడు వా
రేలా యీ యడియాస? రాఘవునకుం ♦ బృథ్వీజ నర్పింపుమా. ౪౯౫

చ॥ పొలిసిరి వార్ధిఁ ద్రావి దివి ♦ భూమిని పేర్చి వహింపఁజాలు శూ
రులు; రణధాత్రినుండి యసు ♦ రుల్ చనుదెంచినవారు నీవు నీ
తొలమి సుతుండు దక్క మఱి ♦ యెవ్వరు? గెల్చుట సున్న! వట్టి యా
సలఁబడి ప్రాణముల్ విడువఁ ♦ జాఁగుట యెన్నఁగ శూరకార్యమే?.

చ॥ అనుటయుఁ బంక్తికంఠుఁడు భ ♦ యంకరరీతి నదల్చి నీదు వి
న్ననువులు మేలుమేలు పలు ♦ కాడకు రాక్షసులెల్లఁ గూలినం
బనుపడకుండఁ గైదువులు ♦ వ్యర్థములైనను నాసికాగ్రమం
దనువుగ నావి యున్న వఱ ♦ కంబుజనేత్ర నొసంగ నెట్టులుం. ౪౯౭

ఉ॥ జీవితముల్ వినాశమొగిఁ ♦ జేసికొనం ధరణీతనూజ న
త్యావిలబుద్ధిఁ దేను మది ♦ నవ్యయ సౌఖ్యము లందఁగోరియే
యీవగఁ దెచ్చితిం బ్రదుక ♦ నిచ్చయె యున్న నిరర్థకంబుగా
జీవితముల్ భరించుచు వ ♦ సింపుఁడు నేన జయింతు నెల్లరం. ౪౯౮

చ॥ అనుడుఁ గుమారుఁ డిట్టులను ♦ నబ్జభవాన్వయ వార్ధిచంద్రమా!
విను మొకమాట యేను రఘు ♦ వీరుఁడు తక్కఁగఁ దక్కువారిపై
వనజభవాస్త్రముల్ విడుచు ♦ వాఁడను కానది వాని దేహముల్
జెనకకయే తొలంగినది ♦ చిత్రము దీనిఁ దలంపఁగా నగున్. ౪౮౯

ఉ॥ తీరుగఁ జర్చసేయ నిది ♦ తేలికగాదు రఘుప్రభుం డసా
ధారణ మానవుండు పిన ♦ తండ్రి వచించిన గర్వ మోహ ని
స్తారులు యోగు లెల్లపుడు ♦ ధ్యానముసేయుచునుండు నా జగ
త్కారకుఁడే యటంచుఁ గొతు ♦ కం బనిలేక యెఱుంగనయ్యెడిన్.

చ॥ అది యటులుండని మ్మరుగ ♦ నైనది యైనది చింతయేల? నీ
మది ప్రమదంబు నొంద నొక ♦ మార్గము చూతు నికుంభిలాస్థలిన్
గుదిరిక నొక్కవేలిమిని ♦ కూరిచి పూర్తియొనర్తు దుర్గుణా
స్పదుఁడు విభీషణుం డెఱుఁగ ♦ భంగముసేయున యంచుఁ గుందెదన్.

సీ॥ ఐన విభీషణుఁ♦డరయకుండెడు భంగి, సీత యాకృతి యొండు♦సృష్టిచేసి
యువతీస్థితిం గాంచి ♦ యున్నతి నందిన, హనుమంతు నెదుట దా ♦ నిని వధించి
పరఁగ నయోధ్యపై♦కరుగుచుంటిన యని, పలుక వారలు ప్రమాను♦పడి యలంగు
వారు జానకి చచ్చె♦ఫలమేమి యిందని, తమ్ములు హితులు బాం♦ధవులు పురము

తే॥ తెరలి నాశమొందున యని♦మరలువారు, మరలకున్నను హనుమంతుఁ♦బురికిఁ బంపి
యెఱుఁగుదాఁక దుఃఖముభరి♦యింపలేర, యంతలో నాదు వేలిమి♦నట ముగింతు.

చ॥ ముగిసినయంత వచ్చి కపి ♦ ముఖ్యుల రాఘవులన్ వధించి నీ
కు గెలుపు గూర్తునంచుఁ దన ♦ కూరిమి పుత్త్రుఁడు పల్క సంతసం
బు గలుగఁ బంక్తికంఠుఁ డను ♦ మోదము చూపెను మేఘనాదుఁడున్
జిగమిష మాయసీతను సృ ♦ జింపఁగ నుత్తరువందె నంతటన్. ౪౯౩

—: వానరులు లంకం గాల్చుట :—

మ॥ అట సుగ్రీవుఁడు రాఘవుం గని మహా ♦ త్మా! దైత్యు లున్నట్టి యీ
పుటభేదంబు దహింపఁగావలయు నా ♦ మోదంబు చూపింపవే
యటులైనన్ రిపురాజి వచ్చుననఁ గం ♦ జాక్షుండు యోచించి కా
ల్చుటయే యొప్పని యాజ్ఞయీయఁ బ్లవగుల్ ♦కోలాహలోత్సాహులై.

మ॥ కొఱవుల్ చేకొని తన్మయంబుగ రణ ♦ క్షోణీ తలంబెల్ల నొ
త్తరమై కన్పడనేగి దైత్యనగర ♦ ద్వారంబున న్నిల్చి వీ
చిరి కంపాలతపోల్కి నుల్కలటు ల ♦ చ్ఛిద్రంబులై యొల్లచో
వఱలెన్ దైత్య వినాశసూచకముగా ♦ వారింపరాకుండఁగన్. ౪౯౫

ఉ॥ లంకను కీశులేసిన య ♦ లాతము లెల్లెడఁబర్వి మున్ను నా
యంకుఁడు వార్ధిపైఁ బఱపు ♦ నగ్ని శరంబు విధాన రేఁగి న
ల్వంకలఁ గాల్పఁ బక్షుల ర ♦ వంబులు దానవకోటి కూకలుఁ
సంకటపాటులుం దెలుప♦శక్యమె? కోఁతులు పెక్కులై చనన్. ౪౯౬

మ॥ ఒక ప్రమాద్ద్రిమ్మరి మున్నువచ్చి యొగి ని ♦ య్యూరెల్ల, దుర్వార వ
హ్నికి నాహారము సేసిపోయె నిపుడో ♦ యిన్నంచుఁ దెల్పంగ లె
క్కకు రానట్టి వలీముఖావళులు లం ♦ కంజొచ్చి నింకెట్లు చా
వక జీవించెదు వారమంచు భయ ది ♦ గ్భ్రాంతాత్ములై రందఱున్.

ఆ॥ లోక వినుతుఁడైన♦కాకుత్స్థ తిలకుండు, వహ్ను లుమియు బాణ♦వర్గమేయ
గోపురంబు విఱిగి ♦ కూలి త్రికూటంబు, పైనిఁబడియెఁ గపులు ♦ ప్రమదమంద.

తే॥ మందు మలఁ గొనిపోయిన ♦ మారుతి వడి, వచ్చి కంఠీరవ రవంబు♦వఱలఁజేయ
విన్న లంక గరుడపక్షు ♦ భీమనరుతి, వినిన నాగలోకస్థితి.♦ నెనసె నపుడు. ౪౯౯

శా॥ మాయాకార్య విశారదుండు జముతో ♦ మార్కొడ్డి గెల్పొందు దై
తేయేంద్రాత్మజుఁ డుద్ధతుండయి మరు ♦ ద్వీథిన్ మహారంభుఁడై
మాయాజానకి కొప్పు వట్టికొని భీ ♦ మప్రౌఢి ఖడ్గంబుచే
వ్యాయామంబు వెలుంగఁ దిప్పుచు జగ ♦ త్ప్రాణాత్మజున్ డాయుచున్.

శా॥ మీరీ జానకికై దురంబు కడుఁబే ♦ ర్మిం జేయుచున్నారు ర
క్షోరాజన్యుఁ డుపేక్షచే విడిన నీ ♦ క్రూరాత్మ నేఁజంపెదన్
దీరున్ సర్వము మీకు మాకు నన భీ ♦ తిన్ వాయుపుత్త్రుండు మా
యారంభంబులు సర్వముం జెడియె నేఁ ♦ డంచున్ మదిన్ స్రుక్కుచున్.

శా॥ తప్పింపంగ నుపాయమేదియును చి ♦ త్తంబందు కన్పట్టమిన్
నిప్పుం ద్రొక్కిన రీతిఁ దత్తఱిలి స ♦ న్నీతిం బ్రశంసించుచు
యొప్పంబోలు నటంచు నిట్టులను గ ♦ ణ్యోదార ! యీపద్ధతుల్
మెప్పా? నీతియొ? యోగ్యమో? తగవొ? మే♦ల్మింగూర్చునో? తెల్పుమా?

మ॥ అరవిందాసన వంశ్యుఁడై సకల శా♦స్త్రార్థంబుల న్నేర్చి యీ
కరణిన్ స్త్రీని వధించుటల్ పరమ దు ♦ ష్కార్యంబుగా నేర్వవో?
ధరణీ వ్యోమములే వడంకునవి చి ♦ త్తంబందు భావింపవో?
కరుణన్ దీనిని మాని తేని కని లో ♦ కంబెల్లఁ గీర్తింపదే? ౫౦౩

మ॥ కరుణాదూరత యేల? వంశ గురుతల్ ♦ కాలుష్యముం జెందు దు
ర్భరమౌ నింద వహింతు నైచ్య మబలన్ ♦ బాధించి చక్కాడుటల్
స్థిరమౌ కీర్తి నశించు రౌరవము ప్రా ♦ ప్తించున్ మహాపాతకం
బురవే సేయఁగ రాచపుట్టువునకున్ ♦ యోచింపుమా రావణీ! ౫౦౪

మ॥ అన నా రావణి నవ్వి యిట్టులనుఁ బ్లగ ♦ వ్యాదుల్ సుఖంబంద నొ
ప్పని పేరాసల నొందు దుర్మతులు గీ ♦ ర్వాణుల్ నిరాశం జన౯
దనుజవ్రాతము తండ్రియుం జెడఁగ నా ♦ ద్యంతైన బీజంబు దీ
నిని వేఁటాడుటకంటె నన్నుమగు పు♦న్నెంబున్న యొద్దే యిల౯.

శా॥ ఈ కేతెంచిన చేత క్రుళ్లినది నేఁ ♦ డే మీ యయోధ్యా౯ సుదు
ర్వార క్రోధము మీఱఁ గాల్చెదను కా ♦ వ౯ శక్యమైయున్న నా
నారాచంబుల పాలుగాక ధరణీ ♦ నాథానుజుల్ తల్లులు౯
బౌరుల్ జీవిత మందఁ జూచుకొనుఁడీ ♦ వాగ్వాద మింకేటికి౯? ౫౦౬

: — ఇంద్రజిత్తు మాయాసీత తలఁదఱుఁగుట : —

తే॥ ఇపుడ యీపుష్పకంబున♦నేగువాఁడఁ, బ్రార్థనమున ఫలములేదు♦ప్లవగ! నీచ!
సకలలోకంబు లెదురైన♦నగ్గువాఁడ, నే? యనుచు సీత కంఠంబు♦నేయఁ దిరిగి.

క॥ కరుణింపుము నజకకు మని, తరుణియుఁ బ్రార్థించుచుండ♦దయగొనక నిశా
చరుఁడు సరాలునఁ గైతవ, ధరణిజ శిర ముత్తరించి♦తటుకునఁ జనియె౯. ౫౦౭

తే॥ తెరలి పుష్పక మెక్కి యు♦దీచి దిశకు, నింద్రజితుఁ డరుగఁగఁ దపె♦యించి హనుమ
పృథివిఁ బడియెను వజ్ర ప్ర♦భిన్నశైల, లీల సర్వచేష్ట లుడిగి♦తూలి సోలి. ౫౦౯

తే॥ పోయినట్టులె పోయి యా♦పుణ్యజనుఁడు, మరలి చేరె నికుంభిల♦మఖము సేయ
మనసు సురుఁగంగ మారుతి♦మాఁడి వాడి, కలఁగి మలఁగి నలఁగి తేఱి♦పలవరించె.

మాలిని॥ బలముచెడఁ గృశించు౯ ♦ భామినీ దీపమంచు౯
దలరి మదిఁ గలంచు౯ ♦ దైవమే లేదె యంచు౯
తలఁచి తలఁచి యూర్పుం ♦ దల్లి యంచంగలార్పు౯
అలఁగి దెసలఁ గాంచు౯ ♦ హా చెడెం గార్యమంచు౯ ౫౧౧

క॥ కింకనొని యసురపైబడ, నుంకించును వగపుతోఁవ♦నుర్విం గూలు౯
శంకగొను జంకు వడఁకుఁ ద, లంకుం దలమోఁదికొను ని♦లంబడి పొరలు౯.

తే॥ మా కతలుముగిసినవి ము♦ల్లోకములకుఁ, దమము తొలఁగినదని మదిఁ♦దలఁచునంత
మరల నిసివచ్చె దుష్ట క♦ర్మములు ప్రబలెఁ, జెనఁటి కత్తిచే లక్ష్మిని♦తునిమె నకట!

శా॥ కారాగారమునం దగుల్వడిన లో ♦ క ప్రార్థ్య సౌజన్య లం
కా రక్షోధిపునుండి వీడ్వఱచు పీఁ ♦ క౯వచ్చి శోకంపుఁ గీ
కారణ్యంబున నేఁ దగుల్వడితిఁ బా ♦ పాత్ముండు వైదేహి న
ట్లారాటింపఁగఁ జూచుచుండితిఁ గదా ♦ వ్యర్థుండనై బిమ్మిటి౯. ౫౧౪

చ॥ పరమ తపస్వినిం ముగుదఁ ♦ బావన నన్నులమిన్న జానకి౯
జెఱ విడిపింపగా నిటకుఁ ♦ జేరినవాఁడను కాను దానవొ

త్కరముల నాజిలోఁ దునుమఁ ♦ గాఁ జనుదెంచిన వాఁడఁగాను దు
ర్మరణము తల్లి యొంద బవ ♦ రంబున కిందఱఁ దోడి తెచ్చితిన్. ౧౧౫

ఉ॥ జానకిఁ గానలందు కనఁ ♦ జాలక చింతిలుచున్న రామ భూ
జానికి లంకలో జనక ♦ జాతను జూచితినంచుఁ బల్కి స
మ్మానము నొందు నోటనె కు ♦ మార్గుఁడు రావణి చంపఁజచ్చె నం
చేనె వచింపఁగా వలసె ♦ నేటికిఁ గాల్పనె నాదు జన్మమున్?. ౧౧౬

చ॥ కడలిని దాఁటి లంక నొగిఁ ♦ గాలిచి సేతువుగట్టి మేరువుం
గడచి మహౌషధీ శిఖరి ♦ గారవమారఁగఁ దెచ్చి నీసముల్
పుడమిని లేరు లేరనెడి ♦ భూరి యశంబు గడించినట్టి నా
యుడిగము బీఱువోయెను ప ♦ యోనిధి నింగువ గల్పు కైవడిన్. ౧౧౭

ఉ॥ సీతను కత్తిచేఁ దునుము ♦ చెన్నటి నప్పుడ చంపనైతి న
బ్జాతముఖిన్ సమక్షమునఁ ♦ జంపుచునుండఁగఁ జూచుచుంటి నీ
పాతక జీవితంబు నెడఁ ♦ బాయఁగ జంకుచు నుంటి నింక నా
నీతకముల్ జగంబులు గ ♦ ణించి హసింపకయున్నె? యక్కటా!. ౧౧౮

మ॥ అని చింతించుచు రావణాత్మజుఁ డయో ♦ ధ్యాపట్టణం బేర్చఁగాఁ
జనియెన్ వానిని వెంబడించిన రఘు ♦ క్ష్మాభర్త నాజాడ యే
మిని కాన్పింపమి నేమిగా వగచునో? మీఁదేమి కానున్నదో?
కనకున్నాఁడను తెల్పఁగాఁ జనుటె యో ♦ గ్యంబైన కార్యంబగున్. ౧౧౯

చ॥ జరిగినదెల్లఁ దెల్పెదను ♦ జానకిభర్తకు నాతఁ డయ్యెడన్
మరణము నొందునేని యట ♦ మాఁడెద నట్టులు కాక యాతఁడే
కరణి వచించు నానరణిఁ ♦ గార్య మొనర్చెద రిత్తచింత నే
నొరయుట యేల? యంచిన కు ♦ లోత్తము చెంగట వ్రాలె గ్రక్కునన్.

ఉ॥ వ్రాలి తపించి మానసము ♦ ప్రాణము దేహము వాడ నూర్చుచున్
సోలుచుఁ దూలుచున్ మిగుల ♦ స్రుక్కుచు వెక్కుచు నేలఁగూల సం
శీలుఁడు రాముఁ డాతనిని ♦ చేరఁగఁజేరి వచింపుమయ్య! యి
ట్లేల తపింప? హేతువది ♦ యెయ్యదొ గొప్పది యుండు మారుతీ! ౧౨౧

చ॥ నుడువుమ యన్న నాతఁడు క ♦ నుంగవ నశ్రులు గ్రమ్మ మేఘనా
దుఁడు జనకాత్మజన్నలికి ♦ ద్రోచెన యంచు వచించి యాపయిన్
నుడువ కొడల్ గదల్పక క ♦ నుంగవ యార్పక యూర్పుపుచ్చకు
గ్గడువగు చింతనొంది యొక ♦ కైవడి మ్రాన్పడి యుండెనత్తఱిన్. ౧౨౨

ఉ॥ ఆ పలుకుల్ చెవింబడిన ♦ యంతనె కేశవరేణ్యు లెల్లరున్
రాపడి వాతఘాతమున ♦ మ్రాఁకులు గూలినయట్లు రామ రా

మా! పరమాత్మ! యేదిగతి ♦ మాకని రాముని పాదసన్నిధిన్
దాపముచేత జెగ్గిలి వి ♦ తాకున గూలిరి ధారుణీస్థలిన్. ౫౧౩

ఉ॥ చిత్రమువోలె సూర్యకుల ♦ శేఖరుఁ డొక్క క్షణంబు నిల్చి సౌ
మిత్రికి మాఱుపల్కడక ♦ మిత్రులఁ జూడక మత్తుఁ డేనియున్
ధాత్రిని నుంతయైన మదిఁ ♦ దాళఁగలే నభిమాన మక్కునం
దోత్రము మాడ్కఁ గ్రుమ్మ నసి ♦ దూలి ధరాస్థలి వ్రాలె గ్రక్కునన్.

ఉ॥ అగ్రజు చింతఁ గాంచి తమ ♦ కైన సుదుస్థితిఁ గాంచి కార్య మ
వ్యగ్రతనుండి యిమ్మవడి ♦ వచ్చియు నాశము చెందఁగాంచి వీ
రాగ్రణి లక్ష్మణుండు హృద ♦ యంబును మేనును వాడఁ దల్లి ప్ర
త్యగ్రత వీడు క్షేపువలె ♦ నారటమందుచు వ్రాలె మేదినిన్. ౫౧౫

చ॥ మదిని విమర్శపైఁ బ్రబలి వి ♦ మర్శ యొనర్చి విభీషణుండు త
న్నెద కుదియింప నార్తిగొని ♦ యేమియుఁ దోఁపక గెల్పులేమి దు
ర్మదుఁడగు మేఘనాదుఁడు ధ ♦ రాసుతచే దనుజాళికెల్ల నా
పద ఘటియించె నంచుఁ గర ♦ వాలునఁ ద్రుంచెనొ యంచు జంకుచున్.

ఉ॥ చల్లనినీరు మోముపయిఁ ♦ జల్లి పదంబులు మేను నొత్తఁగా
మెల్లనఁ గన్నువిచ్చి రఘు ♦ మేదినినాథుఁడు చూచె లక్ష్మణుం
డుల్లము సంచలింప నన ♦ నొయ్యనఁ గాంచి యితండు జీవముల్
తెల్లము వీడుహాఁ డనుచుఁ ♦ దేర్చఁదలంచి సహించి యిట్లనున్. ౫౧౭

ఉ॥ అల్పులు దెప్పరంబు తఱి ♦ నార్తిని క్రుంగి కృశించువార ల
య్యల్పవిధంబు నీకుఁ దగు ♦ నా? పగవారలు నవ్వఁ జిత్త సం
కల్పము మాని యన్యయపు ♦ గౌరవముం దిగనాడి ధర్మపుం
బోల్పును వీడి యిట్లు దిట ♦ ముం జెడఁ జింతిలఁగాదు రాఘవా!. ౫౧౮

మ॥ అనఘాయుర్బలిదేవతన్ సుజన లో ♦ కారాధ్యు వై దేహి నొ
క్కసురుం డంటి వధించె నంచు నిటు శో ♦ కాక్రాంత చిత్తుండవై
మసలంజెల్లునె? యక్ష నాగ మఖభు ♦ జ్ఞానీంద్రులై రేనియున్
వసుధన్ సజ్జన హింససేయ వడి న ♦ వ్వారిన్ వధింపందగున్. ౫౧౯

మ॥ జగముల్ చేడ్పడకుండుటా? దనుజ దౌ ♦ ర్జన్యంబు లిర్రేచుటా?
నిగమ వ్యాపృతి సాగుటా? తగవు పు ♦ ణ్యంబుల్ ధర న్నిల్చుటా?
తెగి సాధుల్ నశియించుటా? మనము నా ♦ ర్తింగుంది శోకించుటా?
పగవారల్ బ్రదుకొందఁగా మన ధను ♦ ష్పాండిత్య ముక్కాఱుటా?

మ॥ త్రుటిలో లంకను బూదిచేసి దనుజుల్ ♦ త్రోఁ ద్రోపుతోఁ బోవు ది
క్కటముల్ గాల్చి దివంబు గూల్చి మది శాం♦తంబందుటల్ మాని త్రో

క్కటపాటొంది శిరంబు వ్రాల్చికొని దుఃఖిం ♦ పంబందుచుండేని యు
క్కట! యీ పేదతనంబు వీరజగముల్ ♦ ఖ్యాపించి యగ్గించునే? ॥330

చ॥ పురమున నిట్టి ధర్మమును ♦ పూనియె రాజ్యమువీడి కానలం
జొరఁబడి దేవిఁ గోలుపడి ♦ సుక్కుచు లంకకుఁ జేరి యిందు దు
ర్భరమగు దుఃఖమొంది వసి ♦ వాడుచు ధర్మము ధర్మమంచు ని
బ్బరికము గొందుమేని యుడి ♦ వంబున కీడ్వరె కట్టి శాత్రవుల్. ॥332

చ॥ వగపు భరింపలేక మన ♦ ప్రాణము వీడితిమేని లోకముల్
పగతుఁడు పట్టి తెచ్చి తన ♦ భార్యను మ్రోల వధింప రాముఁడా
పగతుని కొందికొంది కసి ♦ వాయఁగఁ జంపెడి శక్తిలేక సి
గ్గు గొని మరించె నంచు నిను ♦ గుహ్వరించిగొని నిందనేయవే? ॥333

మ॥ తగ సీవై ఖరి వీరధర్మము సుమి ♦ ద్రా పుత్రకుం డాడుచో
వగలో మున్గిన సూర్యసూతి యొక స్వ ♦ ప్నంబంది మేల్కన్న సో
యగమై లేచి పరాకులేల వడి దీ ♦ పాగ్నిం బతంగ క్రియన్
నగయుం జూచు దశాస్యు లోమ్మపయి లం ♦ ఘింపంగ రండో వెసన్.

శా॥ లంకా పట్టణముం బెకల్చి వడి నే ♦ లంగూల్చి యిల్లాండ్రతోఁ
జంకం బిడ్డలతో సుహృజ్జనులతోఁ ♦ జక్కాడి యన్యాయ మీ
పొంకంబంచు నిలింపు లడ్డుపడినం ♦ బొంగార్చి లోకం బద్దై
త్యాంకంబై చనఁజేసి తీఱవలెఁ గా ♦ ర్యంబిద్ది రండో వెసన్. ॥334

శా॥ ధర్మంబే యగుఁగాక యేరసిగ దు ♦ ర్ధర్మంబె యౌఁగాక దు
ష్కర్మారంభుల దుంపఁ దెంప కిటు శో ♦ కస్వాంతులై యుంట న
త్కర్మం బెట్లును కాదు రండనుచు మా ♦ ర్తండాత్మజుం డాడఁగా
నిర్మక్తంబులఁ బోలి లేచి రతనిన్ ♦ వెన్నంటి శాఖాచరుల్. ॥336

శా॥ ఉత్సేకించుచు లేచు వానరుల యు ♦ ద్యోగంబు వీక్షించి నం
విత్సంయుక్తుఁడు వాయుసూతి యిఁక మీ ♦ విన్నాణముల్ చాలు దు
ర్మాత్సర్యంబునఁ గోసలంబు పయి కిం ♦ ద్రద్వేషి దండెత్తె మీ
యుత్సాహంబులు వ్యర్థమయ్యె నని దై ♦ త్యోద్దేశముం దెల్పుడున్.

—: ఇంద్రజిత్తయోధ్య కేగెనని విని రాముఁడు చింతించుట :—

తే॥ తల్లులును తమ్ములు మహా ర్తిఁ ♦ దపముచేయు, చున్న కోసలంబునకు దై ♦ త్యుండుపోయె
ననెడు వార్త చెవింజొర ♦ ననఘు మనము, కలఁగినది మతి మిక్కిలి ♦ కలఁగఁ బాఱె.

శా॥ క్షీరాంభోనిధి యోగనిద్ర విడి వ ♦ చ్చెన్నాఁగఁ జింతా మహా
పారావారము తీర మొంది త్రుటియుం ♦ బంటింప కూటాను సీ

తా రామా రమణుండు చిత్తమునఁ గాం ♦ తాళంబు కంపంబు దు
ర్వారంబై చన నిల్చె సంక్షుభిత వా ♦ రాశిక్రియన్ గాసిమై. ౧౩౯

శా॥ నాయీ దుర్విధి సీతతోఁ గడచి యం ♦ తం దీఱదయ్యెం గదా?
మాయం జేయఁగఁ బూని మాకులము ని ♦ మ్మాత్రాన శాంతించునే?
యేయెవ్వారలఁజేరి యింకను మహిన్ ♦ హింసింపఁగా నున్నదో?
యీయార్తిం దొలఁగించు త్రోవ గలదే? యేమౌదురో తమ్ములున్?

శా॥ చేతోవేగ విమాన మెక్కిచను నా ♦ చెన్నంటి యొక్కింత కా
లాతీతం బొనరింపకుండ నవలీ ♦ లన్ సర్వ నాశంబుగా
భూతిం గల్పను దుర్భగుండ నగు నా ♦ భూభార జన్మంబుచే
సీతం గోల్పడి యిందునందు జన ని ♦ శ్శేషంబు గావించితిన్. ౧౪౧

మ॥ మరణం బింకను నాకు రాదుగద నన్ ♦ మన్నించు నా తండ్రులున్
ధరణీజాతయు రాక్షసాళివలనం ♦ దల్లుల్ సుహృద్బాంధవుల్
పురవాసుల్ మరణింపఁజూచినది యీ ♦ పుణ్యంపు జన్మంబు నా
కరణిన్ మున్నెవఁ డుద్భవించె కుల ని ♦ ర్ఘాతంబుగా మేదినిన్. ౧౪౨

మ॥ ఇట వర్తిల్లిన దేదియుం దెలియలే ♦ కింద్రంబుఁ బొందంగ వా
రట నాతమ్ము లెఱింగి తారసిలినన్ ♦ యీమ్మాటుఁ దేపారి యు
త్కట దర్వీకర పాశబద్ధులనుగాఁ ♦ గావింపఁ బక్షీంద్రుఁడా
దట నేతెంచునె? మందుఁ దేరఁగ జగ ♦ త్ప్రాణాత్మజుం డుండునే?

మ॥ అనఘా! వ్యోమమునన్ వడిన్ జను సుపా♦యం బున్నచోఁ దెల్పుమా
కన నీ యున్నవి యుండనీ వదలనీ ♦ క్రవ్యాదయుద్ధంబు గం
గనె పోనిమ్ము దురాత్మునిం ద్రజితు న ♦ క్షుంబుల్ చిరంజీవు లి
చ్చను చంచూపుటిఁ దోఁడి తిన్న యవలన్ ♦ సాధింతు నన్యేచ్ఛలన్.

మ॥ అన సౌమిత్రి నిరోధియై పలుకు నా ♦ ర్యా! సంగరంబందు మా
ర్కొని కైకేయి తనూజుఁ గట్టుటకు నా ♦ క్రూరాత్ముఁడో మేఘ గ
ర్జనుఁడే కాదు త్రిలోకముల్ చెనకినన్ ♦ జాకుండఁగా నిల్చునే?
ననుగా నెంచితివేమి యాభరతు? న ♦ న్నా! బుద్ధి తార్మాఱుగన్.

మ॥ యము నా రావణి తానె ప్రేమమున నా ♦ హ్వానించి కొంపోయి సై
న్యముతో ధారణిఁ ద్రెళ్లియుండుటయె నీ ♦ వచ్చోట వీక్షింతు ని
క్కము సందేహములేల చింత విడుమా ♦ కానున్న కార్యంబు పం
క్తిముఖున్ వాని కళత్రముల్ మిగుల దుః♦ఖింపంగఁ జెండాడుటే. ౧౪౬

మ॥ అని సౌమిత్రి వచింప వాయుసుతుఁ డూ ♦ హాపోహముల్ సేయఁగాఁ
బనియే? మద్భుజ పీఠినెక్కుఁడు మనో ♦ భావంబుతోఁ జేరెదన్

బనుపఁ శాత్రవులఁ వధించి త్రుటిలో ♦ వత్తుఁ మహాసేనతో
డని ధాత్రిం బెకలించికొంచుఁ జనువాఁ ♦ డం దెల్పుఁ డేదిష్టమో?

శా॥ చంపఁ వచ్చిన మేఘనాదునకు భూ ♦ సంజాత గిట్టింపు ద
ప్పింప న్నీతులు పల్కుచుంటి నవలఁ ♦ బిర్వీకునఁ గెల్చి బా
ధింపఁ మూర్ఛిలినాడఁ గాదయినచో ♦ దేవిఁ దుగాత్ముండు దాఁ
జంపన్నేర్చునె? చంపి జీవములతో ♦ సాగంగ వాఁడోపునే? ౫౪౮

మ॥ కడఁకఁ వాయు మనో జవంబులు కలం ♦ కం బొంద వెన్నంటి యా
దుడుకం డీల్గఁగ నత్తిపై దుమికెదఁ ♦ దుర్దాంత నిర్ఘాతమఁ
నడి ముందేగి యయోధ్యఁ జేరెదను సం ♦ భావింపుఁ డేదర్వామో
తడయఁ లాభమె? యన్న దాశరథులు ♦ ద్దామక్రియన్ లేవఁగఁ

మ॥ కని దైత్యేశ్వరుఁ డొక్క విన్నపము ని ♦ ల్కం బొందుఁడీ దుఃఖినై
మన సేమాత్ర వశంబుగాక యపు డ ♦ మ్మాడ్కిఁ భ్రమం బొందితిఁ
దనుజుం డా ధరణీజఁ జంపుట యస ♦ త్యంబంచు నూహించెదఁ
జన సంస్తుత్యను తాఁకి వాఁడు బ్రతుకం ♦ జాలండు నిక్కంబుగఁ. ౫౫౦

—: విభీషణుఁడు తుమ్మెదయై జానకిం గాంచి వచ్చుట :—

చ॥ పరమ పతివ్రతం జెనక ♦ భస్మము గాదె జగత్త్రయంబు? ని
బ్బరమున నట్లయైన నొక ♦ పాట నయోధ్యకుఁ బోక చూడ న
చ్చెరువగు నన్నియుం జిటిక ♦ సేపున సత్య మెఱింగివత్తుఁ జె
చ్చెరవులు మాని యుండుఁడని ♦ చివ్వనఁ దుమ్మెద రూపుతోఁ జనెఁ.

ఉ॥ తుమ్మెద రూపుగొంచు గుణ ♦ ధుర్యుని రాఘవవర్యు ధీర చి
త్తమ్మువలెఁ వెనం బఱచి ♦ తాల్మి నశోక వనంబుఁ జేరి చి
త్రమ్ము బలెఁ వినిశ్చలతఁ ♦ దాల్చి తపించెడు రాముదేవి నా
త్రమ్మునఁ గాంచెఁ గాంచఁ గను ♦ దమ్ములు హృజ్జలజమ్ము శాంతిలెఁ.

శా॥ నా దుఃఖమ్ములు మేనితోడనె తొలం ♦ గంబోలు నంచూర్చు రా
మా దీపాభము నోర్పుమై త్రిజట స ♦ మ్మానోక్త్యులం దేర్పఁ జిం
తా దాహంబును మాని వానర మృగేం ♦ ద్ర ధ్యాన మాలించి స
మ్మోదం బందుచు జీవముల్ నిలుపు న ♦ మ్ముగ్ధం గనె భక్తిమై ౫౫౩

తే॥ మాయయని దిగులునుచింత♦మానియవ్వి,భీషణుండు రావణి నికుం♦భిలకుఁ గ్రతువు
సేయఁ జనెనని బహుళ దై♦తేయసేన, లరుగుచుండుటయును మది♦నరసి కాంచె.

చ॥ క్రతువుస యజ్ఞియంబులు క ♦ రంబుగఁ దృప్తి యొసంగు మాఱుగాఁ
గుతిల ఘొసంగఁ జేయునని ♦ కూర్చు నధోగతి నంచుఁ గుందుచుఁ

త్రితభుజాలెల్ల గాసిలుట ♦ గాంచి విభీషణుఁ డింద్రజిత్తు కు
త్సితమది దొడ్డదంచుఁ జను ♦ దెంచి రఘూత్తముఁ గాంచి యిట్లనున్.

ఉ॥ దేవి సుఖాన నున్నయది ♦ తేర్చెదు వారలు నున్నవారు ని
ర్జీవితగాదు క్రొత్తడికిఁ ♦ జేటును కల్గునె? మాయచేసి యా
రావణి శత్రు దుర్జయ క ♦ రంబగు వేలిమి సేయఁబోయినాఁ
డావిధిఁ బూర్తిచేసి మన ♦ యందఱఁ జంపఁ దలంచె రాఘవా! ౫౫౬

తే॥ అని విభీషణుఁ డాడిన♦యంత నేడు, జగము లేడుదీవులు నేడు♦సాగరములు
చేరి ఘోషించు చందాన ♦ నారవంబు, చేసి రాడిరి పాడిరి♦చెలఁగి కపులు.

౨౬. నికుంభిలా యాగ పటలము. (౧౮౩)

శా॥ శ్రీరాముండు విభీషణుం దడవి యా ♦ శ్లేషించి మిత్రంబ! యీ
మారాముల్ వివరించి కష్టముల నా ♦ మం బొర్ప నీవుంటి ధీ
శూరుం డంజని పుత్త్రుఁ డుండెఁ బరమే ♦ శుం డుండెఁ గావించు పు
ణ్యారంభంబును కద్దు తక్కు బల ధై♦ర్య స్ఫూర్తు లున్నట్టివే. ౫౫౮

చ॥ అని వినుతింపఁగా శిరము ♦ నాతఁడు వంచి మహీశ! యాగ సి
ద్ధిని గొనునేని వానిని వ ♦ ధించుట దుష్కరమౌను గెల్పియున్
దనుజులకే లభించు నట ♦ దక్షత లక్ష్మణుతోడ నేగి వే
ల్మిని చెడఁజేసి దైత్యు నవ ♦ లీల వధింతు మనుజ్ఞ యిమ్మనన్. ౫౫౯

ఉ॥ మంచిది యట్లె చేయుఁడని ♦ మన్నన చేసి సుమిత్ర పుత్త్రు వీ
క్షించి గరాను కైతవము ♦ చేసి విరించి శరంబు నేయఁ గో
పించి తొలంతు గాని ప్రతి ♦ భీషణభంగిఁ దదస్త్రమే ప్రయో
గించిన లోకజాలములు ♦ గీడ్పడు నవ్విధి చేయఁబోకుమా. ౫౬౦

ఉ॥ పాశుపతంబు వైష్ణవము ♦ పాయక యేయునయేని వానితో
నే శమియింపఁజేయు మరి ♦ నేర్పున మాయలు పన్నునేని త
న్నాశము ధర్మపద్ధతి నొ ♦ నర్పుము ముమ్మరమైన పోరునన్
గ్లేశము దైత్యుఁడొందఁ బరి ♦ కించి వధింపుము లావు పెంపునన్. ౫౬౧

శా॥ రోసంబారఁగ బాణవృష్టి నొగి శ ♦ త్రుండొప్పఁ గుప్పింప బా
ణాసారంబునఁ ద్రోపఁజేసి యరి హ ♦ స్తాధిక్యముల్ తగ్గుచో
గాసింబొంద నెఱుంకు లంట నిశితో ♦ గ్ర స్ఫార నారాచముల్
చేసుద్దిం జతగూర్చి యేసి శమనం ♦ జేర్పింపుమా లక్ష్మణా! ౫౬౨

తే॥ ఎదిరి విడుచు దివ్యాస్త్రంబు♦లెఱిఁగి వాఁడు, విడుచునంతలోఁ బ్రత్యస్త్ర♦వితతి నేసి
యడ్డుపెట్టుము వాని యా♦హాముల నాస్య, చిహ్నములచేఁ బరీక్షించి♦చేయు పోరు.

తే॥ అనుచుఁ బెక్కు పాయములు వ్యూ♦హములమర్మ, ములను దెల్పి జగద్భ క్త♦సులభుఁడైన
విష్ణుచేతి కార్ముకమిది వేడ్క దీనిఁ, గొనుము శత్రులఁ గూల్పుమ♦యనుచు నొసఁగె.
తే॥ దీనిఘనమహిమమగ స్త్య♦మౌనిమున్ను, దెలుపమనసుననాటంగఁ♦దెలియుదుకద!
ఈ సహస్రశీర్షుని యంబ♦కాసనము వి, రించనుఁడు తొల్లి వేల్మి కా♦వించిపొందె.
తే॥ తోయజాక్షుండు దాల్చిన♦తూణమిద్ది, యక్షయ శరంబు గొనుమని♦యలరనిచ్చి
యలమి యుత్సాహవాక్యంబు♦లెలమినాడి, సెల వొసంగెను జానకీ♦చిత్తహారి.
తే॥ మునులు ఖేచరులుబ్బిదీ♦వనలు సేయ, సంగరోత్సాహుఁడగుచు ల♦క్ష్మణుఁడుత్రిపుర
ముల దహింపవెడలు రుద్ర♦మూర్తివోలెఁ, బ్లవగబలములతో నష్టు♦పయనమయ్యె.
తే॥ పవనసూతి ప్రభృతి వీర♦వరులతోడ, వెడలు మనుచుండు శ్రీరామ♦విభునిపాద
జలజములు మదిలోన వె♦ల్పలను తోఁపఁ, దలను దాల్చి నడచె వీర♦ధర్మధనుఁడు.
ఉ॥ రాముఁ బ్రదక్షిణించి సమ ♦ రంబునకుం జను లక్ష్మణుండు ప్రో
ద్దామక వామహస్తమున ♦ దార్ఢ్య శరాసనముల్ ధరించి సు
త్రామ భయాపహారియగు ♦ దక్షిణహస్తమునన్ శరంబు సొ
రై మెఱయంగఁ బట్టి పగ ♦ యాదలఁ దచ్చెద నంచు వెల్వడెన్ ౧౬౯
ఉ॥ తన్నడఁబాయకుండు తన ♦ తమ్ముఁడు వీడి చనంగఁ గాంచుచున్
మున్ను మునీంద్రుతోడ మఖ ♦ ముం బరిరక్షణసేయ నేగుచోఁ
దన్నను తమ్ముఁ బో విడిచి ♦ తాటక తండ్రి వహించు తల్లడన్
గ్రన్నననొందె జీవములు ♦ కాయము వీడఁగ లేని కైవడిన్. ౧౭౦
ఉ॥ కేల నలాతముల్ గొనుచుఁ ♦ గీశులు కొండలు కోనలున్ వడిన్
జాలుగ దాఁటి లోకముల ♦ జానుగఁ గద్పునఁ దాల్చుచుండు సం
శీలుఁడు మత్తియాకువయిఁ ♦ జేరి యడంగిన వైనమొంది దై
త్యాలి రవంతచోట నడఁ ♦ గారు నికుంభిలఁ గాంచి రెల్లరున్. ౧౭౧
సీ॥ ఆ మేఘనాదుని ♦ హోమాగ్నికుండముఁ, జక్రాయుధము వరు ♦ సలుగఁ జుట్టి
కాపాడుచున్నట్టి♦యేపున బడబాగ్నిఁ, గడలిచుట్టిన యెస ♦ కమున సైన్య
సమితి వ్యూహముపన్ని♦చక్రవాళమునంటి, జగమెల్లఁ జుట్టంగఁ♦జాలియుండెఁ
బొడవైన నల్లని ♦ యొడళులపై నెత్తు, వెంద్రుకల్ మిన్నంది ♦ వెలుఁగుచుండ
తే॥ రామవిభుఁడు కోపమున వా♦రాశిమీఁద, వహ్నిసాయకమేయ నం♦బరమునంటి
కడలి మండుచుండినమాడ్కి♦గానఁబడుచు, నుండె దానవబలములు♦గండుమీఱి.
తే॥ గుణరవములేని వింధ్యేంద్ర♦ధనువుఁబోలెఁ, జిందములుసంద్రముననుండు♦చెన్నుదోఁచె
ఖేరులులియని మబ్బుల♦తీరుదాల్చె, హరులుఁ గరులును చాంచల్య♦మరయకుండె.
క॥ చలియింపని జలధివలె, న్నిలిచి మొరయకుండు యామి ♦ నీచర సేనం
దిలకించి వనచరావళి, తులకించి రవించె మిన్ను ♦ తూంట్లు పడంగన్. ౧౭౨

క॥ గర్జించిన కపులకుఁ బ్రతి, గర్జన మొనరించె దనుజ♦గణములు భేరుల్
గర్జించె రెండు మొయిళులు, గర్జలతో ఢాల నంబ♦కంబులఁ గురిసెన్.

క॥ కొలఁకున హంసలు వ్రాలెడు, పొలుపునఁ దళతళల కైదు♦వులు వనచర సే
నలపైఁ బరవెను ధరపైఁ, బలపలమసి తలలుఁ గేలుఁ♦బదములు రాలెన్.

క॥ వానరులు ఢాలు ప్రాఁకు ల, నూనముగా మునర విసర♦నొత్తుగఁ దలలున్
మేనులు పండ్లును కైదువు, లానకములు తునిఁగి విఱిగి♦యవనిసి రాలెన్ ౧౭౭

క॥ పరశు కరవాల తోమర, శర కుంత గదా ముసుండి♦సాధనముల ని
ర్జరవైరు లేయ వనచర, శిరములు కడుపులును వ్రస్సి♦చిందెను ధరపై. ౧౭౮

తే॥ ఎప్పుడీసేన సమయుటో♦యెపుడు వేల్మిఁ,జెఱుచుఁ టిప్పని యొడసేయఁ♦జెడుసమస్త
మని విభీషణుఁ డారాము♦ననుజుఁ గాంచి, పలికి లెమ్మని తొందర♦పఱచె నపుడు.

తే॥ అచటి కింద్రాదులును చతు♦రాననుండు, యక్ష కిన్నర కింపురు♦షాదులెల్ల
వచ్చి నింగి నిండిరి రాని♦వారు లేరు, లక్ష్మణేంద్రజిత్తుల నేర్పు♦లావు చూడ.

చ॥ రథముల గుంపు వారణ వ♦రంబుల పెంపు జ్వలించు దంష్ట్రికా
యుధముల పంపు వార్వముల♦యుద్ధతిసొంపును సోఁకు తెంపు సం
గ్రథితములై నభంగి మొగ♦రంబున నిల్చిన జంపు సంగర
క్రథనము సంపు వాద్యముల♦అంపును తెల్ప నశక్య మయ్యెడన్.

శా॥ సేనం జొచ్చి సుమిత్రపట్టి శర వృ♦ష్టిం గూర్చి యేపారఁగా
నానానేకప యూథముల్ రథ విమా♦న వ్రాతముల్ సుందరా
జానేయంబులు దానవ ప్రకరముల్♦సంఘంబులై కూలి లం
కా నీవృత్పథమందయేగి యమ లో♦కంబందె నొక్కుమ్మడిన్. ౧౮౧

చ॥ శరములచేఁ దునింగిన గ♦జంబుల దేహ మహోదరంబు లా
దురమునఁ గొండలం దొనల♦తోయము తోఁపఁగఁజేసె రాక్షసో
త్కర శిరముల్ మదేభములు♦త్రవ్విన పల్లములందు గూలి ని
ర్జర రిపు యజ్ఞ కుండమున♦రాఁజిన ద్రవ్యములట్లు రాజిలెన్. ౧౮౩

శా॥ ధూళిం గ్రుంగిన హారి సన్మకుట సం♦దోహంబు భల్లూక దం
తాళుల్ గ్రుమ్మఁగ మిన్కుమిన్కుమని రం♦గై వెల్గు వల్మీకముం
బోలెన్ గ్రువ్విన బాణజాలములతోఁ♦బొల్పారె రక్తాపగల్
వేలన్ మీఱి పయోధిఁ జేరెఁ గుణపా♦భీల ప్రపంచంబుతో. ౧౮౪

క॥ గొడుగులు కాఁడలు విఱుగం, బుడమిని రక్తప్రవాహ♦మున మునుఁగుటచే
నుడుపతి విధుంతుదునిచే, వడి మ్రింగంబడి వెలుంగు♦పగిదిం దోఁచెన్. ౧౮౫

క॥ తుండంబులతో మదగజ, తండంబులు త్రుంగి రుధిర♦తటినింబడి యు
ద్దండగతి నడచు నౌకా, కాండంబుల పగిదిఁ దరలి♦కడలిం జేరెన్. ౧౮౬

తే॥ కుణపములఁ దినఁగోమాయు♦గణము నిండెఁ, గాకులును గ్రద్దలునుచేరెఁ♦గడుపునింప
బోరునలు వచ్చె రాబందు♦పులుఁగు లడరె, లక్ష్మణుని విలువిద్దియ♦లావుమెచ్చి.

తే॥ చిచ్చులుమియు శరంబులు♦ద్రవ్వి మండఁ, జేయఁ గప్పదుబొంతలు♦చేర్చి కాల్ప
వెదురుటడవులు మండిన♦విధము దనర, మండిచెడెఁ గొంత వేదండ♦తండమపుడు.

క॥ భల్లుక నఖములు రాక్షస, మల్లుర శిరములను గ్రొచ్చి ♦ మలయించుట పె
న్గొల్లం బుట్టల గములం, బెల్లగిలం ద్రోచు పగిది ♦ విలసిల్లె నటన్. ౫౮౯

తే॥ సింహ విక్రములగు నింద్ర♦జితుని భటులు, రథికు లాధోరణులును తౌ♦రంగికులును
క్రమ్మి వర్షమ్ముపోలె నా♦యమ్ములందు, గ్రుమ్మ నమ్ములతోడనే♦గూలె హరులు.

క॥ అటనటఁ దునిఁగిన యంగము, లటనటఁ దినఁగోరి పులుఁగు♦లటనట బెరయం
జొటజొటమని కాఱిన నె, త్తుటఁ బుటుకున మునిచి కడిగెఁ♦దుటుముల శిరముల్

క॥ ఒకటి వెనుక నొకటిగ నట, నకటా వికటముగ వ్యూహ♦మమరిన సేనా
నికటమునఁ బెటిలఁ దేరులఁ, బ్రకటంబుగఁ గూల్చె రాఘు♦వ శ్రేష్ఠుఁ డొగిన్.

క॥ విలయానిల హతిచేఁ గొం, డలు మొయిళులు పాటవముచె♦డం దుల్లిన యా
పోలుపునఁ దలలును మేనులు, గులగులలై నెగసి హోమ♦కుండమునఁ బడెన్.

క॥ నక్తంచర శిరములు తను, ముక్తములై సంతతంబు♦మోఁదుటచే శా
స్త్రోక్తముగ నిలుపు కుంభ మ, లక్తక ఘటమట్లు మురిసి♦లవలవ యయ్యెన్. ౫౯౪

క॥ కరి తురగ భట శిరంబుల, నరుదారఁగ నీడ్చికొని ర♦యంబునఁ జని నె
త్తురుటేళ్లు యాగశాలఁ, బరవి మఖానలము చల్లఁ♦బడి చెడ మునిచెన్. ౫౯౫

క॥ అడిదములతోడి కరములు, పిడుగులవడువునఁ బడంగఁ♦బీనుఁగు లయ్యెన్
దడఁబడి యెనుములు మేఁకలు, కడు నాహుతికొఱకుఁ గట్టు♦కంబంబులతో.

క॥ తమ మదగజములు గూలఁగఁ, దమ మేనులు చినుఁగకున్న♦దాశరథి మహా
స్త్రములకు జడిసి నిరుత్సా, హమున రుధిర తటినులంద♦యడఁగిరి సోఁకుల్.

క॥ పదములు శిరములు నొవ్వఁగఁ, బ్రదరంబులు గ్రువ్వ నిలిచి♦పడఁకెదువారున్
పిదపిద ప్రేవులు వెలివడ, నదవదలై సోలువారు ♦ నైరి సురారుల్. ౫౯౮

క॥ కినుకగొని రణము సలుపుచుఁ, దనువులు వ్రీలంగ సోలు♦దనుజుల స్కంధం
బున మోచుచుఁ బ్రేవులు వీఁ, పున వెలివడఁ ద్రోచికొనుచుఁ♦బోయిరి దనుజుల్.

క॥ జన్నపుఁ బాత్రంబులు వి, చ్ఛిన్నములై వస్తువితతి ♦ చెదరఁగ నట్టల్
పన్నుగ నాడెను ద్రవ్యో, త్సన్నంబై యజ్ఞశాల♦సదమదమయ్యెన్. ౬౦౦

క॥ గాలివలె వినముకై వడి, సాలీంద్రుర కదురుగతి రు ♦ జా సన్నిభమై
పాలంబడు చేమిరివలె, నాలంబునఁ గలఁగి దాన♦వావలి సమసెన్. ౬౦౧

ఆ॥ గొప్పగాలివలనఁ♦గూలిన వృక్షజా, లంబు గల వనంబు♦డంబు పంబి
కూలియున్న సైన్య♦కోటిని రావణి, పొగిలి నొగిలి ఖిన్నుఁ♦డగుచుఁ గాంచె.

ఆ॥ కరుల హరుల కుణప♦గిరులును విచ్ఛిన్న, రథచయంబు దనుజ♦రక్తనదులు
మృతభటాళి తక్క♦మేదిని వేఱొండు, బయలు గనఁడు పంక్తి♦వదన సుతుఁడు.

ఆ॥ వేలకొలఁది దనుజ♦వీరుల నొకమాన, వుని శరాలి పీఁచ♦మణఁచి త్రుంపఁ
గుప్పలైన పీన్గు♦తిప్పలు గాకను, ఊనియున్న యొకనిఁ♦గానఁడయ్యె. ౬౦౪

ఆ॥ నాల్కలెండ మేను♦నడుఁకంగ నేతెంచి, కొంద ఱసురు లతనిఁ♦గూడినారు
నడవలేక తోడు♦పడయక కొందఱు, త్రోవలందె కూలి♦దొరినారు. ౬౦౫

ఆ॥ కుండమాఱిపోవఁ♦గుండలు పగులంగ, నాఱుచుండ ధూమ♦మడరు నగ్ని
చెన్నునంది యింద్ర♦జితుఁడు జపించు మం, త్రమ్ము మఱచివచ్చె♦రంగమునకు.

ఆ॥ అట్టివేళ యందు♦హతశేషులైన రా, క్షసులు భీతులగుచు♦శక్రజితుని
డాయ వెంట మిత్తి♦డాసినపగిది వా, నరులు వెంబడించి♦యరిగినారు. ౬౦౭

ఆ॥ శతసహస్ర పద్మ ♦ సంఖ్యయౌ సైన్యంబు, నిమిషమాత్ర నీల్గి♦సమయునంత
లక్ష్మణుని ధనుర్వి♦లాసంబు చింతయు, నలుక యతని మదిని♦కలఁతపఱచె.

ఆ॥ భూమి యొడలు వడఁకి♦పొగులు చందంబైన, రణ పరాక్రమంబు♦రాక్షసమృతి
కనిన సురలు మునులు♦కరములు తట్టుచు, నవ్వుచుంట గాంచి♦నానయొందె.

క॥ మానముచెడ యజ్ఞమ్మున, మానముచెడ మంత్రగతియు♦మాఁడగ సేనా
మానముచెడ వంశము న, మ్మానముచెడఁ గుంది పంక్తి♦మస్తకసుతుఁడున్.

క॥ సేనలు పొలిసెను మిగిలిన, దానవులుం బొలియ శంక♦దగులఁగనేలా?
పూనిక చెడె యాగము నిఁక, మానక నెఱవేర్త మనుట♦మాంద్యమె కాదా?

ఆ॥ వేల్మికుండమందు ♦ వేల్చిన యగ్నియుఁ, బొగలతోడ నడఁగెఁ♦బోరుసేయ
వచ్చి యరులు దనుజ♦వరులను చంపిరి, తెల్లమయ్యెఁ జెడుగుఁ♦దెలుపు నన్న.

ఉ॥ ఎన్నఁగ వైరి దాపునన ♦ యిట్లు మగంటిమి క్రుంచనేల? కా
నున్నది కాకమాన దిది ♦ యోధుల పద్ధతి గాదు తుచ్ఛులౌ
నిన్నర వానరావళుల ♦ నెక్కటి గెల్వఁగలేని దోర్బల
స్కన్నుఁడ నైతినే? పగఱఁ ♦ జంపఁ గడంగక క్రుంగి యుందునే?

ఉ॥ వేలిమి కోలుపోయె నని ♦ వేఁగుచు నూఁగుచు నుండ ఖేచరుల్
మేలిమి దూల్చి నీబలము ♦ మించుట యింద్రునియొద్దనే చుమీ!
మాలెనె యిందటంచు నవ ♦ మానవిధంబున గేలిసేయరే?
బాలిశులన్ వధింతునని ♦ పట్టుగ రావణి లేచునంతలో. ౬౧౪

క॥ మురిసిన కరి తురగంబులు, విరిసిన సైన్యములు నగుచు విటతాటముగా
ధరఁగూల్చి రగచరులు త, న్నొరసిన దనుజులును భీతి♦నొంది వడంకన్. ౬౧౫

క॥ తాఱుచు నొదుఁగుచుఁ గ్రిందికిఁ, దూఱుచు నడఁగిన సురారితుటుములు వాఁడిం
దేఱిన లక్ష్మణశరముల, నాఱెన్ జతరములు ప్రస్విన్నయాంత్రము లురలన్. ౬౧౬

క॥ నరవరు శరములతో వా, నరు లేసిన తరులు గిరులు ♦ నక్తంచర సా
గరమున గాలియు నుఱుములు, మెఱుములతో దిగిన మొగులు♦మెయివడిఁ దోఁచెన్.

క॥ చెల్లాచెదరై సేనలు, త్రుళ్లఁగఁ దరువొండు వీచి ♦ దుష్టుల యనువుల్
గొల్లగొను పవనసూనుం, డుల్లసమున నింద్రజితున ♦ గొగి నిట్లనియెన్. ౬౧౮

—: హనుమంతుఁ డింద్రజితు నుపాలంభించుట :—

ఉ॥ మాయ లసత్యముల్ పెరుఁగ ♦ మాగిలియైన దురాత్మ! నీచ! నీ
మాయలు చెల్లనేమి? జన ♦ మాన్యను చంపకు మన్నతోడనే
కోయుదువే శిరంబు? మఱి ♦ కోసలదేశము గొల్లలాడఁగాఁ
బోయితె పుష్పకంబుపయి? బొంకులమారి! నరాశనాధమా! ౬౧౯

శా॥ చక్రవ్యూహముతో నికుంభిలను నీ ♦ చా! చొచ్చుటల్ కాంతుమే?
వక్ర క్రూరతఁ గోసలంబునకుఁ జా ♦ వం బోయితే? వారలన్
విక్రాంతిం బరిమార్చి వచ్చితివె? నీ ♦ వేల్పుల్ గొనల్ సాగనే?
యక్రోధంబున బుద్ధిసెప్ప విను నా ♦ యంబేని లేదయ్యనే? ౬౨౦

మ॥ ఉరగాధీశుని మించి భూభరము ను ♦ ద్యోగించు సద్ధర్మయా
భరతుం గాంచి బలంబు చూపి యతనిన్ ♦ బంధించితే? శంబరా
సురు నిర్జించిన చక్రవర్తి తనయుఁ ♦ సుజ్ఞాని శత్రుఘ్ను ని
ర్భర ధైర్యంబునఁ జేరి నీదగు ధను ♦ ష్పాండిత్యముం జూపితే? ౬౨౧

మ॥ అనల జ్వాలలఁ జిమ్మ చష్టదిశలన్ ♦ వ్యాపించు సౌమిత్రి మా
ర్గణముల్ నీయురమున్ శిరంబు బరులుం ♦ గంఠంబు లంఘ్రుల్ కటిన్
దునుమంగా నవరంధ్రముల్ రుధిర మే ♦ దో మాంసముల్ గ్రక్క లం
కను డాకొంచు నొనర్చు జాలములు ని ♦ క్కం బేగడి న్నేఁటితో.

మ॥ ఫణిపాశంబొ యమోఘ పాశుపతమో ♦ బ్రహ్మాస్త్రమో మాయలన్
గనియా వెన్నుని చక్రమో యెదియొ మీ ♦ గౌరవ్య మద్దానిఁ గై
కొని వేంచేయుఁడి చేయుఁడీ యముఁడు మీ ♦ కోసంబు తా వేచియుం
డెను తిట్టాడుచుఁ దామసించుటలు నాఁ ♦ డెంబొన మీబోఁటికిన్?

చ॥ వరములు మాయలందు నెఱ ♦ వాదితనంబు బలాత్కరించి ని
ర్జరులకడం గ్రహించిన శ ♦ రమ్ములు దేహబలమ్ములున్ యథా
స్థిరముగ నున్నవేకద? గ్ర ♦ సింతుము గ్రుంగుదు మన్న మాత్ర ని
ద్వైరగొని పాటినారమె? క ♦ వింపక ముక్కుడి షక్కి యేలరా?

మ॥ నిటలాక్షుండు విరించనుండు హరియుఁ ♦ నిర్భీతులై డాసి యొ
క్కటనిల్ గాచిననైనఁ జచ్చుటయె ని ♦ క్కంబయ్యె నీనాఁడు డా
పటి ప్రక్కల్ చలియింపకున్నవియె? మీ ♦ ప్రాణాలకున్ ముప్పు సం
కటపాటుం గొని తెచ్చుకొంటి రిఁకఁ ద ♦ క్కంజూచినం దప్పునే? ౬౨౫

మ॥ నినుచంపన్ శపథంబు చేసె నిట ము ♦ న్నే లక్ష్మణార్యుండు డా
సెను నీసేనల వేఁటలాడె నిను పి ♦ ల్చెం గాచియున్నాఁడు నీ
వొనరింపంగల వేల్మికిన్ గుణరవం ♦ బోంకార మంత్రంబుగా
వినిపించెం దడవేల రమ్ము బలి గా ♦ వించుం దదీయాగ్నికై. ౬౨౬

మ॥ జగదీశుం డొనరించు ఘోర రణ య ♦ జ్ఞంబందు వేల్పంగ బా
గుగ యోచించిరె ని న్నుపాకృతముగాఁ ♦ గొంపోవ సౌమిత్రి యా
శుగుఁడై యాశుగపాణియై వెడలె న ♦ స్తోకానుమోదాత్ములై
నెగడం బర్విరి నిర్నిమేషులును మా ♦ నిశ్రేష్ఠులున్ మింటిపై. ౬౨౭

—: మేఘనాదుఁడు హనుమనికిం బ్రత్యుత్తర మిచ్చుట :—

మ॥ అని సౌమిత్రి వచింప మండిపడి దై ♦ త్యాధీశ సూనుం డనున్
హనుమా! నాకడ నిట్లు చప్పిడిగ వ్య ♦ ర్థాలాపముల్ సేయఁగాఁ
జనునే? సంగరమందు చచ్చి మరలన్ ♦ సాధించి ప్రాణంబులన్
మును చావొందుట విస్మరించితిరె? మీ ♦ ముగ్ధత్వ మిట్లుండునే?

శా॥ ఆ సౌమిత్రియె వచ్చుఁగాక ధరజా ♦ తాధీశుఁడే వచ్చుఁగా
కేసంజీవనియేని మీకమరుఁ గా ♦ కేమైన నౌఁగాక నా
చే సంగ్రామమునందు వానర నర ♦ శ్రేణుల్ నిరుత్సాహులై
వేసారం బడుపాటులెల్ల నమరుల్ ♦ వీక్షింపకే యుందురే? ౬౨౮

శా॥ చేతం గార్ముకమొప్ప సుందర భుజ ♦ స్తోమంబు పొల్పార నీ
కోఁతుల్ మానవులున్ మనోగతులు సం ♦ క్షోభింప నాకంబు దు
ర్భీతిం జొచ్చిన వెంబడించి బహుళా ♦ స్త్రం గూర్చి హింసింతుఁ బై
పూఁతల్ మందులు మాఁకులున్ వితగఁ ♦ బోవున్ జావు నిక్కంబగున్.

మ॥ క్రతువిఘ్నం బొనరించి వీరజయముం ♦ గైకొంటిమం చుబ్బుచున్
బ్రతుకుం బొందితిమంచుఁ బ్రేలు ఘన వీ ♦ రమ్మన్యులారా! వృథా
మతి రజ్జుల్ చదురాడుచుండుఁ డిదె మీ ♦ మస్తంబు లీ సంగర
క్షితిపై దుల్లఁగఁ జేయు నాశరము లా ♦ క్షేపించు వాక్యమ్ములై. ౬౩౦

ఉ॥ మీవలె నోటితో వదరి ♦ మించి జయించెడు వాఁడు గాఁడుసూ!
రావణి రెండు మాఁటలు దు ♦ రంబున నోడితి రింత సంభ్రమం

జేవిధి గెల్వఁగూర్చు ? నని ♦ నేతురో? నిల్తురో? చత్తురో? వడిం
జేవ డొఱంగి పాఱుదురొ? ♦ చిందఱ నేఁ గొనునట్టి వేళకున్. ౬౩౨

చ॥ నిలువుఁడు నిల్వుఁడం చదరి ♦ నిప్పులు రాలఁగఁ జూచి కంకటం
బొలయు ధరించి తూణముల ♦ నొప్పఁగఁ దాలిచి వీరకంకణం
బులు గల కేలఁ గార్ముకము ♦ పూని శతాంగమునెక్కి శింజినిం
బలువుగఁ గూర్చి టంకృతి సు ♦ పర్వ భయంకర లీలఁ జేయుచున్.

ఉ॥ చిందమునొత్త ఖేచరులు ♦ చిత్తములన్ జడుపొంది గొప్పయా
క్రందు దురంబు నేఁటికి భ ♦ రంబుగఁ గల్గెను వేల్మి విఘ్నమిం
బొందుటచేత లక్ష్మణుని ♦ భూరి శరంబున నింద్రజిత్తు నేఁ
డొందును చావు నంచు మది ♦ నుబ్బుచునుండిరి చూచువేడుకన్. ౬౩౪

ఉ॥ వాని గుణధ్వనిన్ విని ప్ల ♦ వంగులు లావును విస్మరించి చే
నూనిన పర్వతంబులు త ♦ రూత్కరముల్ దిగజాఱఁ దాలిమిన్
లేని కతంబునం బడుచు ♦ లేచుచుఁ బాఱిరి కల్పవేళ ఝం
ఝానిల వేగ ఘాతమున ♦ నంబుధి నీరము విచ్చుచందమై. ౬౩౫

ఉ॥ కాలుని జీవితంబునకుఁ ♦ గాలుఁడు రావణి లేచి యోరి వా
తూలసుతా! ప్రతాపవిధి ♦ తోఁపఁగ నాడుచు దొడ్డచేతులన్
ఱాలు ధరించి నిల్చితి దు ♦ ర♦ బొనరింపఁగ మేలుమేలు నీ
చాలిక సాహసంబును ప్ర ♦ శంస్యము లోఁడక నిల్వుమీ వెసన్. ౬౩౬

ఉ॥ వీరుఁ డిటుల్ వచించి బలు ♦ విల్లు ధరించి యొసంగ నంజనీ
దారకుఁ డూనియున్న వసు ♦ ధాధరమున్ వడిఁద్రిప్పివైచె నిం
ద్రారి మహాజవంబున వి ♦ యత్స్థలి జివ్వన వచ్చు శైలమున్
దూరమునన్ విశీర్ణమయి ♦ తూలఁగఁ గొట్టెను వాఁడి కోలలన్.

చ॥ మఱియొక శైలముం గొని య ♦ మానుష సత్త్వము వెల్లడించుచున్
గిరగిరఁ ద్రిప్పి మారుతిని ♦ కేలు పదంబు లురమ్ము కంఠముం
శిరము శిలీముఖ ప్రతతి ♦ చే నొగిలించె వియచ్చరుల్ నిశా
చరు కర లాఘవంబు గనఁ ♦ జాలక యద్భుతమంద నయ్యెడన్. ౬౩౮

క॥ ధరణీధర నికటంబున, నిరులం దొలఁగించు నేత్రు♦లుఱుపున బాణో
త్కర కిరణంబుల మారుతి, తరుణారుణ తరణి సరణిఁ♦దద్దయు వెలసెన్. ౬౩౯

క॥ హనుమఁడు సోలఁగఁ గినుకం, గొని యంగదముఖ్యు లెదురు♦కొనిరి వివస్వ
త్తనయుం డచటికిరా వ, చ్చిన వారలఁ గాంచి యసుర♦చిడిముడిపడుచున్. ౬౪౦

ఉ॥ శక్రజితుండు పల్కు నొగిఁ ♦ జావఁదలంచి యెదిర్చె నేనియున్
విక్రమధామమైన హరి ♦ వీరత దంతులఁ గూల్చుఁగాని దు

ర్వక్ర ముఖంబులతో పిఱికి ♦ పందలఁ గోఁతులఁ జంపఁజూచునే?
సక్రమ కీర్తిగల్గునొకొ ♦ చంపియుఁ? జావక తెండు లక్ష్మణున్. ౬౪౧

ఉ॥ పావని ధైర్యశౌర్య బల ♦ పారము లేక లెఱింగియుంటి ర
ప్పావని పడ్డపాటు గని ♦ వానికి మించిన వారిఁబోలె నీ
రావణి పైకి వత్తురె? చి ♦ రంతన కీశులె కారె మీరు? క్రొం
జేవ గడించి వచ్చితిరె? ♦ చేరుఁడు కానల జీవితార్థులై. ౬౪౨

చ॥ మనుజుల నాకుఁ జూపి బహు ♦ మానము లందుఁడీ యంచుఁ బల్కు నా
దనుజు వనేచరుల్ కినిసి ♦ తార్కొని భూధర భూజ బృందముల్
గొని వయివంగ రావణి య ♦ కుంఠిత సాయక వృష్టిఁజేసి య
వ్వనచర వారముల్ బల జ ♦ వంబులు క్రుంగి ముడుంగ నేసినన్. ౬౪౩

చ॥ బలిముఖ మేదినీధ్రముల ♦ పై దనుజాశుగ కల్పమేఘ మ
త్యలఘు తరంబుగాఁ గురియ ♦ నద్రిచర ప్రతతుల్ నశించె నా
బలియుని వేల్మియుం జెడియె ♦ వానిని వెండియుఁ బాఱిపోవ నీ
కొలసి వధింపుమా యని ర ♦ ఘూత్తముతోడ విభీషణుం డనెన్. ౬౪౪

చ॥ వడివడి లక్ష్మణుండు దశ ♦ వక్త్రకుమారుని డాయునంత సా
ల్మిడి విడఁదేఱి మారుతి సు ♦ మిత్రసుతుం గని నాభుజంబులం
దొడిఁబడకుండ నెక్కుమని ♦ తోడనె మూఁపునఁదాల్చి పేర్మిఁ జె
న్నొడిదము బేడిదమ్ము వడి ♦ యుం గొనఁబేర్చె విచిత్రరీతులన్ ౬౪౫

—: ఇంద్రజి ల్లక్ష్మణుల యుద్ధము :—

ఉ॥ వేయి మొయిళ్లు లొక్కటగు ♦ పేఁక నెనంగిన మేఘనాదుఁడున్
వేయి గుఱ్ఱాలఁ బూనిచిన ♦ పేరిమి గల్గిన తేరి నెక్కఁగా
వేయి వెలుంగు పోఁడిమిని ♦ వీరుఁడు లక్ష్మణుఁ డాజి రాజిలెన్
వేయి మొన ల్నరాజి యన ♦ వేడ్కఁ బ్రవర్తిలె నాంజనేయుఁడున్. ౬౪౬

చ॥ నిదుర తొలంగినట్టి గుణ ♦ నీరధి లక్ష్మణుఁ డగ్ను లుమ్మెచున్
భిదురములట్లు పోవునవి ♦ వీడని కర్మము లట్టు లేచు నం
గదయను రోగముం గలవి ♦ కంక నిభంబులు చిత్తవేగమై
పొదలెడు క్రొన్ని తూపులను ♦ పూనిక నేసె సురారి సూనుపై. ౬౪౭

ఉ॥ అట్టివ యన్ని యమ్ములన ♦ రాద సుతుం డరివోసి యేసి తా
నెట్టన సాగరంబు లవ ♦ నీధ్రము లంబరముల్ దిశాతటుల్
పట్టుగఁ గానరాక యిఁక ♦ బాణములే భువి లేవనంగ మే
ముట్టఁగ నంపవానఁ దగ ♦ ముంచి గుణధ్వనితోడ నార్వఁగన్. ౬౪౮

ఉ॥ పిచ్చుక పింఛులట్లు మొగి ♦ వెల్వడు తూపుల లక్ష్మణుండు తాఁ
జెచ్చెరనేసి వాని నిర ♦ సించుచుఁ ద్రుంచె; శిలల్ మలల్ తరుల్
పచ్చడిగాఁగఁ ద్రొక్కు లయ ♦ వాయువుఁబోలిన బాసవాళ్ల పి
న్మచ్చరి స్యందనమ్మును స ♦ మంచిత మారుతి పాదయుగ్మమున్.

క॥ ఇరువురు తమయొడఁ గొఱఁతల, నరయంగానీక నమత ♦ నందుచుఁ బోరన్
పెరలేరు లేరు వీరికి, దొర యని నిర్జరులు వెఱఁగు ♦ దొరసిరి తమలో. ౬౯౧

మ॥ శర సందోహము లంబర స్థలమునన్ ♦ జన్చున్నవో లేవొ ని
ర్జర నేత్రంబులు చూడవయ్యె మనసుల్ ♦ జడ్డయ్యె లెక్కింపఁగా
బరిమాణంబున కందవయ్యె నడుమన్ ♦ భంగించి యాఁదేనియున్
జొరదయ్యెన్ వ్రణరాజి దక్క నెదియుం ♦ జూపట్ట దమ్మేనులన్.

తే॥ నెఱసి శింజినీధ్వని నిండు ♦ నింగియందు, పిడుగులంబలె నెగడిన ♦ వేఁడివాఁడి
సెలలు దెసలెల్లఁ బొగగ్రమ్మఁ ♦ జిమ్మ రేఁగెఁ, జుక్కలును మింట నల్లనై ♦ సురిఁగి పోవ.

చ॥ దిశల దిశాంతరంబుల వి ♦ దీర్ణ మొనర్చుచు శింజినీ రుతం
బశనుల కైవడిన్ మొరసె ♦ నంచులుచేరిన విండ్లనుండి క
ర్కశ విశిఖమ్ము లుగ్రగతిఁ ♦ గ్రమ్మెడు నెవ్వడి వ్యోమభూమియున్
వశమఱఁగా మిడుంగుఱులు ♦ వర్తిలఁజేసె భయంకర స్థితిన్. ౬౯౩

చ॥ శరధియు వట్టి తున్గిపడు ♦ సాయక బృందము నిండ నెండియున్
శరధియ యయ్యెఁ బ్రొద్దు శశి ♦ చందముతోఁచెను రక్తముం జెడన్
తరువులు బొగ్గులయ్యె జల ♦ దంబులు మాఁడెను చుండు కంపు దు
ర్భరముగఁ బిక్కటిల్లె నిరు ♦ వాఁగుల సేనలు పాఱె భీతిమై. ౬౯౪

ఉ॥ పీనుఁగులయ్యె నేనుఁగులు ♦ ప్రేతములయ్యెఁ దురంగ జాతముల్
జానుతొఱంగి యంగములు ♦ స్రగ్గి మడంగె శతాంగ జాలముల్
మానము తగ్గఁ దగ్గ నను ♦ మానము వర్ధిల మానవాద సం
తానము ప్రమాల్చె సాయక వి ♦ తాన మరుల్ విసుమాన మొందఁగన్

సీ॥ కొన్ని వంగుచుఁ బోయెఁ ♦ గొన్ని పొంగుచుఁ బోయెఁ, గొన్ని కూడుచుఁ బోయెఁ ♦ గొన్ని మాఁడెఁ
గొన్ని వ్రాలుచుఁబోయెఁ ♦ గొన్ని వ్రేలుచుఁబోయెఁ, గొన్ని మెరిసిపోయెఁ ♦ గొన్ని విరిసెఁ
గొన్ని కుడికినేగెఁ ♦ గొన్ని యెడమకేగె, సౌమిత్రి యేసిన ♦ శరచయములు
కొన్ని యనిలుఁ బోలెఁ ♦ గొన్ని యనలుఁ బోలెఁ, బిడుగులఁ బోలెను ♦ జడధిఁబోలె

తే॥ కొన్ని ధారాధరంబును ♦ కొని ధరాధ, రంబుఁ గొన్ని రుద్రాట్టహా ♦ సంబుఁగొన్ని
స్వేదజలమును పోలెఁ గ ♦ వ్యాద సుతుఁడు, వైచు తూపులు రణభూమిఁ ♦ బరవువేళ.

క॥ వెల ముగుదల కడచూపుల, వలె నుక్కు జిరాలమీఁద ♦ బాహులపై మో
ములపైఁ బదములపై శర, ములు ప్రాలెం బీల్చి పిప్పి♦పోనరుచు నానర్. ౬౫౭

శా॥ లోకంబుల్ పరికంపమొందఁ గ్రతుభు ♦ గ్లోకంబు వీక్షించి యి
ట్లే కాలంబున దేవదానవ రణం ♦ బేచోట వర్తిల్లె ? న
జ్యాకృష్టిధ్వని దిగ్గజంబుల వడం ♦ కాడించెఁ గల్పాంతమా
జోకల్ గానంగవచ్చెఁ దప్పిరి గతుల్ ♦ సూర్యేందు శుభ్రాంశుఁడుల్.

చ॥ కులగిరులుం జలించె నని ♦ కుందుచు వేల్పులు చూచుచుండ సోఁ
కుల మెకిమీఁాని పట్టి విలు ♦ కోపులు చేరఁగ లాగి కొన్ని య
మ్ముల రఘువర్యు వక్షమునఁ ♦ బూనిక నాటఁగనేయ నాతఁడుల్
దలఁకక వాని బొందడము♦తచ్చన లాడుచుఁ జించె ప్రేల్మిడిన్. ౬౫౯

క॥ ఐరావతమును నిర్జర, వీరుల నేఁచిన నిశాత ♦ విశిఖమ్ముల న
మ్మారుతి భుజములఁ గ్రుచ్చ బ, లారి జితుం డడరి యేసి♦యటమట పఱచెన్.

క॥ హనుమానుఁ డస్తగిరిపై, దినకరువలెఁ గానిపింపఁ ♦ దెలిసి కినుక ల
క్ష్మణుఁ డెటుఁ బోనీయక మా, ర్గణములఁ బఱపించి దైత్య♦రథముంగూల్చెన్

క॥ అమరులు ముమ్మూర్తులు మో, దము నందిరి వేఱుతేరు♦దనుజుఁడు గొని రో
సమునఁ బది విశిఖములు మ, ర్మము లంటఁగనేసి సింహ♦రవ మొనరించెన్.

చ॥ వివశత నొంది యొక్క త్రుటి ♦ వీకునఁ దేఱిన లక్ష్మణుండు దా
నవు ననరుల్ చుఱుక్కుమన♦నారసముల్ వడినేసె నాఁతడుం
బావరునఁ ద్రోవఁజూచియును ♦ పోతర మంది గిరీశు తన్నుచే
నవమతి నొందు కాలుగతి♦నక్కట ! యక్కునఁ బోటు చేకొనెన్. ౬౬౩

మ॥ శిత నారాచ మొకండు వానిమఱువుల్ ♦ ఛేదించి వక్షంబు ను
ద్ధతిఁ దూఁటాడుచు దుస్సెఁ బృష్ఠమున ను ♦ ద్దం డాశుగం బొందు సం
గతిగా బాహువు గ్రుచ్చె నొక్కఁడు పతా♦కం గూల్చె మూర్ఛాస్థితిన్
దితిజాధీశ కుమారుఁ డొందె క్షణ మా ♦ దిత్యుల్ ముదంబందఁగన్.

ఉ॥ శోణిత ధార లుప్పతిల ♦ శోణగిరిం బలెఁ గొంతసేపు గీ
ర్వాణ విరోధి యుండి పిద ♦ పం దగఁ దేఱి రుషాతిశాయితన్
ద్రాణయు నిన్మడింపఁ బ్రబద♦రంబు లసంఖ్యములేసి తత్తను
త్రాణముఁ జింపఁబూన నవి ♦ తాఁకుచు నెట్టగయుం గలంగుచున్.

చ॥ మఱియును కొన్ని బాణముల ♦ మారుతి నేయఁగ వాని లక్ష్మణుం
డఱిముఱిసేసి రావణి వ ♦ రాంగము వక్షము నొవ్వనేసి బె
ట్టఱ నొక కోలచే దనుజు ♦ నల్లెను ద్రెంచి మహోగ్రలీల బి
ట్టుఱవుగ హుంకరించెఁ బురు ♦ హూత విరోధి మనంబు బెగ్గిలన్.

ఉ॥ మాన్యత వీఁడు దాల్చినది ♦ మాధవువిల్లా? గిరీశువిల్లా? సా
మాన్యుఁడు గాఁడు కత్తళము ♦ క్రాలదు వీనిని గెల్వశక్యమే
జన్యమునందు నాకని వి ♦ శంకితుఁడై దనుజేంద్రసూతి చై
తన్యము దక్కి నిల్చుట యె ♦ దం దలపోసి విభీషణుం డనున్. ౬౬౭

చ॥ హరిహయు గెల్చి పొల్చిన ద ♦ శాస్య కుమారుని గెల్చితీవు చి
త్తరువుగ నిల్చె వాఁడు మది ♦ తల్లడమందె నిమేషమేని జా
పిర మొనరింప కియ్యకొన ♦ పెంపరలాడుమ యంచుఁబల్కి హె
చ్చరిక యొనర్చ లక్ష్మణుఁడు ♦ సమ్మతిఁజూపుచు నుండు నంతలో. ౬౬౮

సీ॥ కాలునిలీలఁ గాం♦తాళంబు గొని రేఁగి, యసురపుత్త్రుం డని♦లాస్త్రమేసె
లక్ష్మణాఖ్యుండు చె♦లంగి నవ్వుచు వాయు, దేవతాక శరానఁ♦దిగిచె దాని
ననలాస్త్రమును దైత్యుఁ♦డరివోసి పరపంగ, దాని నాతండు న♦ద్దాన నడఁచె
వారుణాస్త్రంబు బ♦లారిజితుం డేయఁ, దచ్ఛరంబున దాని♦త్రాణ నణఁచె
తే॥ భాస్కరాస్త్రంబు రావణు♦పట్టి విడువ, మిత్రశరముతో దాని సౌ♦మిత్రి త్రుంచె
చచ్చితివ చచ్చితివ యని♦మచ్చరించి, దనుజసుతుఁడు బ్రహ్మాస్త్రంబు♦ మొనసియేసె
తే॥ భవుఁడుమఘవుఁడునలువతా♦పసులుసురలు,తలరిసౌమిత్రికిఁజిరాయు♦వొలయుఁగాత
మంచుఁ బలుక నాతఁడు విజృ♦భించిమిడుఁగు,లడరఁగుప్పుచువచ్చున♦య్యస్త్రముఁగని.

ఉ॥ చేవ తొలంగి వీఁడు మును ♦ చేసిన పోరునఁ గంజజాస్త్రమున్
ద్రోవఁ దొలంగియేయఁ గడ ♦ ద్రోవఁగలేక యడంగె నంచు నీ
కైవడి నిప్పుడుం దొడఁగెఁ ♦ గావున నూరకయుంట పాడి గా
దీ వనజాస నాస్త్రమున ♦ నే యుపసంహరణంబు చేసెదన్. ౬౭౧

చ॥ జగము సుఖించుఁగాక యెల ♦ సంబునఁ బోరొనరించు రావణిన్
దిగువకయుండఁ గా కితని ♦ దివ్య శరం బుపశాంతి నొందుఁగా
కగుత జయంబు ధర్మమున ♦ కంచు నజాస్త్రము వీడె వేల్పులా
సుగుణ గణంబులం గుఱిచి ♦ శూరుని లక్ష్మణు సన్నుతించుచున్. ౬౭౨

చ॥ జగము సుఖించుఁగాక యని ♦ చాటి వచించె దురాత్ము రావణిన్
దెగ వధియింపఁడయ్యె రణ ♦ ధీరుఁ డితండు విరించనాస్త్రమున్
దగ నుపసంహరింపు మనెఁ ♦ దక్కఱి బుద్ధిని చూపఁడయ్యె నీ
సుగుణ గణంబు లెయ్యెడలఁ ♦ జూడమ యంచు నుతించుచుండఁగన్.

చ॥ అనలముతోడ డీకొనఁగ ♦ హ్రాదిని వచ్చినభంగి వచ్చి ల
క్ష్మణుని శరంబు దైత్యు విశి ♦ ఖంబు నడంచి నభంబు నర్వమున్
బొనుపడ నొక్క జ్వాలగ స ♦ ముద్ధతి నేచిన వేఱుతూపుచే
నణఁచె విషార్త వేదన వి ♦ షాంతరయుక్తి నడంచుకైవడిన్. ౬౭౪

ఉ॥ లక్ష్మణు శౌర్య సాహస బ ♦ లంబులఁ గాంచి నిలింపు లష్టదిక్
లక్ష్మి నెఱుఁగ్చు రాఘవుల ♦ లావు దలంప నశక్యముల్ భువిన్
బక్ష్మము పాటియేని గల ♦ వా? యన శంభుఁడు పల్కె మీరలున్
సూక్ష్మమతిన్ గణింప కిటు ♦ స్థూలమతిం దలపోయఁ జెల్లునే? ౬౭౫

మ॥ నర నారాయణు లీ నరాకృతులు వి ♦ జ్ఞానేశ్వరుల్ దుష్ట సం
హరణార్థం బవతారమందిరి జగ ♦ ద్వ్యాపారు లాద్యుల్ జగ
ద్భరణ ప్రాభవు లవ్యయాత్ములు జగ ♦ త్కల్యాణ సంధాయకుల్
కరుణాపూర్ణులు వీరలం గలఁచునే ♦ కంజాసనా ద్యస్త్రముల్? ౬౭౬

శా॥ సామాన్యాకృతులొందియుం బ్రకృతి సం ♦ సర్గంబు లేకుండి మా
యామేయావరణాంతరస్థులయి పూ ♦ ర్వాకారముల్ తోఁప నీ
కీమాడ్కిం జరియించు వా రఖిల భూ ♦ తేశాను లీయర్థమున్
మీమీ చిత్తములంద యుంచుకొనుఁడీ ♦ మీకయ్యెడున్ భద్రముల్.

ఉ॥ చేమిరి పాలలోఁ గలియు ♦ చెల్వున జీవులయందు భక్తహృ
త్తామరసంబులే యవస ♦ థంబుగఁ గొన్న మృణాలభోజి ని
త్యామల పూర్ణతత్త్వము ధ ♦ రాత్మజభర్త నిజమ్ము ధర్మమున్
భూమిని గాచు పొంటె నిటు ♦ పుట్టె మహాత్ముల వేఁడికోలునన్. ౬౭౮

చ॥ అని శశిమౌళి పల్కఁగ వి ♦ యచ్చరు లచ్చెరువంది శంకరా!
విని కని యుంటి మయ్యు నవి ♦ వేకమునం దన మాయచే నెఱుం
గని వహి నందియుంబుగొని ♦ కానటబీసట నొందుచుందు మా
త్మను గల శంక లెల్లఁ గడు ♦ దవ్వుగఁ బోయిన వంచు నుండఁగన్. ౬౭౯

శా॥ మాయాశీలుఁడు రావణాత్మజుఁడు దు ♦ ర్మానంబు పాటించి నీ
యాయుష్కాలము నేఁటితో ముగిసె నో ♦ య్యం బ్రోడవే యైనచో
నాయీ యేటును గాచికొమ్ము యనుచున్ ♦ నారాయణాస్త్రంబు మం
త్రాయత్తంబుగఁ జేసి యేసె జగ మా ♦ హాకారముల్ సేయఁగన్. ౬౮౦

చ॥ శిరములమీఁదఁ గేల్మొగిచి ♦ సిద్ధ మునీంద్ర సురాదు లెల్లరున్
హరిహరి యంచుఁ గాచికొన ♦ నారవముం బొనరించి రమ్మహా
శరము కరమ్ములన్ మొగుచు ♦ జంతుకదంబము నంటదన్న తీ
రరసిన లక్ష్మణుం డెదుర ♦ నచ్యుతుఁ డేనని నిల్చె నెంచుచున్. ౬౮౧

మ॥ జ్వలన జ్వాలల వెల్వరించుచు జగ ♦ జ్జాలంబులం గాల్చు మం
దల నేతెంచు మహాస్త్రముం దొలఁగి పోఁ ♦ దప్పించుకో నెంచ కం
చల నున్నట్టి సుమిత్ర పుత్త్రుఁగని వై ♦ ష్ణవ్యాంబకం బంటకే
తలఁగం బాటి ప్రదక్షిణంబు గొని యం ♦ తర్ధాన మందెం ద్వరన్. ౬౮౨

చ॥ వనచరు లుల్లసిల్లిరి త ♦ పస్వులు లోకము గాచితంచు మో
దనమున గంతులేసిరి ము ♦ దంబున వేల్పులు దేవ సుందరుల్
మనమున నుబ్బి గొబ్బున ను ♦ మంబులు చల్లిరి బ్రహ్మయుఁ భవుం
డును వినుతించి రాడిరి క ♦ డుంగడు సంతసమంది రెల్లరుఁ. ౬౮౩

మ॥ బలహీనంబయి వైష్ణవాస్త్ర మడఁగెఁ ♦ భావింప వీఁడెవ్వఁడో ?
జలజాక్షుండో ? యెవ్వఁడేని యగుఁగాక ♦ శంకింపనేలా ? జగ
ద్విలయంబుం గలిగించు పాశుపతముఁ ♦ వేకూర్చి యీ బాలిశుఁ
జలమారఁ వధియించువాఁడ నని యొం ♦ చం జిత్తమం దుద్ధతిఁ ౬౮౪

ఉ॥ రావణి నిశ్చయంబును స ♦ రాలున దివ్యలెఱింగి యేదిరా
త్రోవ ? జగంబు జీవ నికు ♦ రుంబముతో నశియించునేమొ నేఁ
డీవహి వీనిచేత ? నెదు ♦ రెయ్యది ? దీని సహించు వారలీ
దేవతలందు గల్గరని ♦ దీనత నొంది కలంగుచుండఁగఁ. ౬౮౫

చ॥ ఇతరు లెఱుంగకుండినది ♦ యీడును లేనిది మున్ను వానికిఁ
జితమదనుండు సత్తపము ♦ సేయఁగ మెచ్చి యొసంగు నయ్యమో
ఘ తర మహాస్త్రముఁ మది న ♦ ఖండితభక్తి భజించి లక్ష్మణుఁ
మృతునిగఁ జేసి క్రమ్మఱను ♦ మేవడి నంచు వచించి యేయుడుఁ.

సీ॥ అయ్యస్త్ర మంత గ ♦ దాసి తోమర కుంత, పరశు ముద్గర శూల♦వాల నాగ
గరళ భూత ప్రేత♦కాల నిర్ఘాతాది, బహుళ రూపంబులఁ ♦ బరఁగి విలయ
కాలాగ్ని సప్త సా♦గరములు చండ మా, రుతమును తోడరా♦క్షితి మునుంగు
తఱిఁ గప్పు చీఁకట్లు♦నెఱసిన వననొప్పి, సౌమిత్రి యురము ల♦క్ష్యంబుగాఁగఁ

తే॥ గెరలిలోకత్రయము గిర♦గిరనఁదిరుగు, కరణిఁ దోఁపంగ నుడియుచుఁ♦గడఁగిరాఁగ
వానరులు వేలుపులు ముని♦వరులు జడిసి, మొగిసి కనలేక కన్నులు♦మూసికొనిరి.

సీ॥ గడగడ వడఁకుచు♦నొడలు చెమర్పంగఁ, గని విభీషణుఁడు ల♦క్ష్మణ ! యిదేమి ?
దీనిఁ దొలంగించు♦తెరువెయ్యదియు లేదె ? యన నుత్తరముగ హా♦సంబొనర్చి
వానర వీరులు♦పాదసన్నిధి డాసి, యభయ మభయ మంచు♦ నఱచునంత
నలుకకుఁ డలుకకుఁ♦డని చేయి వీచుచు, జగము లల్లలనాడు♦చందముగని

తే॥ పాశుపతమును ధ్యానించి♦భావమందు, దీని నడఁపుము వేఱొండు♦తెగువ వలవ
దనుచు నొకశర మరివోసి♦మొనసి విడిచి, త్రుటిని తన్మహాస్త్రముబలో♦ద్యోగమడఁచె.

మ॥ దివిఁ గోలాహలముల్ చెలంగె మొరసెఁ ♦ దివ్యానక స్తోమముల్
భువి శాఖామృగముల్ మదించె వెన నం ♦ భోరాసు లుప్పొంగె నా
ర్జవ ఘోషంబుల నించె మేఘములు ధ ♦ ర్మాంబుబ్బె మోదించి రా
ఘవుఁ గాంచెఁ జయలక్ష్మి శిక్షిత కటా ♦ క్ష శ్రీల హేలాగతిఁ.

మ॥ లయకాలంబున సర్వలోకములు వై ♦ క్లబ్యంబుగా జీవ సం
చయము న్నాశము సేయు రుద్రుని మహా ♦ స్త్ర క్రూర వేగంబు నీ
రయమై వ్యర్థముగా నొనర్చిన సుమి ♦ త్రాపుత్త్రక స్థైర్యముఁ
దయివాఱం గని దిగ్భ్రమించి నిలిచెన్ ♦ దైత్యేంద్ర సూనుండటన్.

శా॥ దివ్యాస్త్రంబు బడిపోయె నంచు మది సం ♦ దేహంబు గైకొక యా
క్రవ్యాదుండు ప్రయోగ చాతురిమ ము ♦ గ్రంబై ప్రకాశింపఁగా
నే వ్యాపన్నత నొందనేల యని కై ♦ నేర్పొప్ప సౌమిత్రిపై
నవ్య స్థేమము మీఱనేసె నిభజి ♦ న్నాదంబు గావించుచున్. ౬౯౧

శా॥ సుగ్రీవాదులు వేసరిల్లక మహా ♦ క్షోణీధ్రముల్ దెచ్చి సం
వ్యగ్ర ప్రక్రియ నున్న రావణిపయిన్ ♦ వైవన్ విజృంభించి పం
క్తిగ్రీవాత్మజుఁ డంపఱం గురిసి త ♦ ద్వేగంబు వారించి య
త్యుగ్రుండై కని తత్పితృవ్యుఁ బలుకున్ ♦ సోత్ప్రాస వాక్యంబులన్.

—: మేఘనాదుఁడు విభీషణు నిందించుట :—

శా॥ జాతి భ్రష్టునిమాడ్కి నన్వయ యశ ♦ స్సౌశీల్యముల్ జార్చి దు
ర్ఖ్యాతి ప్రీతిని మర్త్యమాత్రుల తదం ♦ ఘ్రుల్ వట్టి సేవించుచున్
ఖ్యాతిం దొరిచి వారి పాటలకు వె ♦ న్కం దాళముల్ వైచుచున్
నీతిన్ మాలి చరించు నీదుశిరమున్ ♦ నేలం బడం గూల్చెదన్. ౬౯౩

శా॥ వీక్షామాత్రన కంపమొంది క్రతుభు ♦ గ్బృందంబు సేవించినన్
నిక్షేపంబులు కూడినన్ భువన ని ♦ ర్ణేతృత్వమే యబ్బినన్
శిక్షామాన పరాక్రమ స్థిరగుణుల్ ♦ సీత్కారముల్సేయు నీ
కుక్షిక్షుద్భవ నీచ జీవితము నో ♦ క్రూరాత్మ! వాంఛింతురే? ౬౯౪

మ॥ జలముల్ గల్గినచోటనే గలుగు మ ♦ త్స్యశ్రేణి దైత్యేశ్వరుం
డెలమిన్ భాసిలుచోటనే దనుజులున్ ♦ దృష్టింపఁగా నుంద్రు వా
రలు చేటొందిన వేళలన్ బ్రభునకై ♦ ప్రాణంబు లర్పింత్రు నీ
వలెఁ గాఁజాలరు ; లంక నే యసురులం ♦ బాలింతువో మీఁదటన్ ?

ఉ॥ పూర్వము వేల్పుపెద్దఁ దన ♦ బొడ్డునఁ గాంచిన మాయి కేశవున్
గర్వము సర్వముం జెడ వ ♦ గర్చుచుఁ బాఱఁగఁ దోలి యొక్కచే
శర్వుని పర్వతంబు గొనఁ ♦ జాలిన మత్పిత రాజ్యభారమున్
నిర్వహణంబు సేయుటలు ♦ నీవిటు కోరుటకా ? కులాధమా ? ౬౯౬

మ॥ అరవిందాసన వంశమందు జననం ♦ బందంబుగా నందుటన్
సురలు న్నిన్ను భజింత్రు పుణ్యజన దూ ♦ ష్యుండైన నీవిప్పుడో

నరులం గొల్చుచు నన్నసంపదల మ్రిం ♦ గం జూచుచున్నావు నీ
కరయన్ మానమనంగ నున్నదియె? మా ♦ యంబాను మాతోడనే.

శా॥ నిందం గూరిచి నిందచేసి కులమున్ ♦ నీచెల్లెలిం బట్టి యా
క్రందింపం దయమాలి ముక్కుచెవులన్ ♦ ఖండించు దుష్టాత్ములన్
సందేహింపక తెచ్చినాఁడ విఁక జ్యే ♦ ష్ఠభ్రాతఁ జంపించి లం
కం దైవాఱఁగ నేలుకొందువు గదా? కష్టాత్మ! వంశాదనా! ౧౯౮

చ॥ గురు హిత బంధుమిత్రులను ♦ కూలిచి కైకొను మేల్మికంటెఁ బే
దఱికమె మేలుకాదె? రణ ♦ ధారణిఁ గూలిన యన్నతోడనే
పొరలుచు నేడ్తువో? ముదముఁ ♦ బొంది బళే! యని కేకవెట్టెదో?
నరు గెలుపు న్నుతించెదవొ? ♦ నారక మందెదొ? వంశ దూషణా!

మ॥ పరుగుల్ వాఱిన కాల కింకరుల గ ♦ ల్వంజేయువారా నరుల్?
తెరలన్ మందులచేత జీవములు సం ♦ ధిల్లంగ నిల్పుందు వా
రరయన్ గెల్తురె? యన్న సంపదల నీ ♦ వందంగ నర్హుండవే?
శిరముం ద్రుంపక వీడితిన్ జగము నన్ ♦ సెగ్గించునన్ శంకమై. ౨౦౦

శా॥ భ్రాతృద్రోహివి నీమొగంబు గనినం ♦ బాపంబు సిద్ధించు నీ
నేతృత్వంబు సహించునే జగము? నీ నీ ♦ తంబు లాలించునే?
రోఁతల్ చేఁత లటంచు దూఱు ప్రభుపు ♦ త్రుం గాంచి చిర్నవ్వునన్
నీతి ప్రౌఢి విభీషణుండు పలికెన్ ♦ నిర్ణీత చిత్తస్థితిన్. ౨౦౧

ఉ॥ ధర్మమె తోడగున్ మహి న ♦ ధర్మము తోడుగఁ గొంచుఁ బెక్కు దు
ష్కర్మము లాచరించి నర ♦ కంబునఁ గూలఁగ జాలకుంటి న
త్కర్మముఁ జిక్కఁబట్టితిని ♦ కల్లలు వీడితిఁ బంక్తిమస్తకుం
దర్మిలి నిందితంబులకు ♦ నాన వహించిన దాఁకఁ దమ్ముఁడన్. ౨౦౨

మ॥ కలుద్రావన్ బరదారఁగోర గిలుబున్ ♦ ద్రవ్యంబు నాశింప మూ
ర్ఖులఁ జేరన్ బెరసొత్తులం బలిమిఁ గై ♦ కోఁబోవ నత్కర్ములన్
గలహింపన్ బరనిందనంబు తలఁపన్ ♦ గావింప నింద్యమ్ములన్
ఖలులన్ దుర్వ్యభిచారులన్ విడుచుటల్ ♦ కారాని కార్యంబొకో?

మ॥ త్రిజగంబుల్ వినుతించు తత్త్వమగు నా ♦ దేవేశు నర్ధాంగి పూ
త జగన్మాత పతివ్రతా తిలకమున్ ♦ ధర్షించి బాధించుటల్
త్యజియింపం దగునంటి దీననగు నా ♦ తప్పేమి? నీ తండ్రి య
ల్క జనింప న్ననువెళ్లఁగొట్ట నట ని ♦ ల్వంబోలునే తెల్పుమా?

ఉ॥ క్రొవ్వున ధర్మముం గనక ♦ కోపము కామము వేల్పుగా మదిన్
నివ్వటిలం దలంచు మిము ♦ నిత్య సుఖంబులె యొందనిమ్ము మ

మ్మవ్విధినేని నింద యొల ♦ యింపఁగ శౌరవ మందనిమ్మిర్లన్
ద్రివ్వలు సాగు దుష్కృతము ♦ త్రెవ్వక యుండునె? ధర్మమోడునే?

ఉ॥ జ్ఞానులకున్ సుగమ్యుఁడగు ♦ సత్యవిహారుని రాముఁ జేరితిన్
మానుగ సర్వలోకములు ♦ మన్నన నేసెదుఁ గాక నిందయే
వూని యొనర్చుఁగాక భువిఁ ♦ బొందుఁడు మీరలు మేలునేని కీ
డేనియు నంచు మాలముడి ♦ యిట్టటు నార్చుచుఁ బల్కె విస్మితన్.

ఉ॥ రావణి పల్కె నీతలఁచు ♦ రాజ్యము మేలుములెల్ల నిల్చునే?
నా వలకేలనున్న యొక ♦ నారసమంటినఁ దీఱుఁగాక నేఁ
డావలి కెట్టులేగె దని ♦ యల్కను తార్క్ష్యుని పోలు బాణమున్
జావుమ యంచు వీడెఁ దన ♦ చాపముఁ జక్రముఁ బోల లాగుచున్.

తే॥ కీలయనఁ బిడుగన భవు♦శూలమనఁగ, వచ్చుటను గాంచి మిత్రుండు♦చచ్చెఁ జచ్చె
ననుచుఁ బ్లవగు లాక్రోశింప♦నమరులెన్న, మించి సౌమిత్రి సడుమనే♦త్రుంచె దాని

క॥ తన విశిఖము తునియఁగ రా, వణి వెండియు భల్లమొండు♦వడినేయ విభీ
షణుఁ దాఁకనీక నడుమనె, తునుకలుగా లక్ష్మణుండు♦తుండించె వెసన్. ౨౦౯

శా॥ తన్నుం జంపఁగ నుద్యమించె నను కాం♦తాళంబునన్ సత్య సం
పన్నుండైన విభీషణుండు ఘన భా♦స్వద్దండముం బూని యా
పన్నుండైన బలారి జిద్రథము న♦శ్వశ్రేణితో సారథిన్
ఛిన్నాభిన్నము చేసి యార్చెఁ బ్లవగ ♦ శ్రేష్ఠుల్ ప్రమోదింపఁగన్.

చ॥ చెడిన రథంబుపై నిలిచి ♦ చిందఱగొన్న దశాస్యసూతి నె
వ్వడిని సుమిత్రపట్టి పయి ♦ వానరపాళిపయిం బిత్రృవ్యుపై
జడిగొను పోల్కి శాతశర ♦ సంఘములేసి రణస్థలంబు నె
త్త్యొడఁగన రక్తసిక్తముగ♦నేడ్తెఱఁ జేసి మదించి యార్చుచున్. ౨౧౧

చ॥ మురియుని తేరులేక వెస ♦ ముమ్మరమైన దురంబు సేయఁగా
నరిది యటంచు మానసము ♦ నందు దలంచి క్షణంబులోన నం
బరతల వీథి కేగె నను ♦ వార్త కపీశ్వర వర్గమందు తీ
వరపడి పర్వెఁ బంక్తిముఖు ♦ భర్మ గృహంబున కేగె నత్తఱిన్. ౨౧౨

౨౨ ఇంద్రజి ద్వధ పటలము (౨౧)

మ॥ గగనంబందు మొయిళ్ల డాఁగె నను శం ♦ కంబొంది మున్వోలెఁ బె
ల్లుగ మాయల్ పచరించు నంచుఁ బ్లవగుల్ ♦ మోమోడి కన్చుండ నా
శుగ వేగంబున మేను రక్తమయమై ♦ స్రుక్కింపఁగా వచ్చు మె
చ్చగు పుత్త్రుంగని రావణుండు చలిత ♦ వ్యాపారుఁడై యిట్లనున్. ౨౧౩

ఉ॥ పూనిన నీమఖంబు పరి♦పూర్తి వహించి యొనంగదంచు నీ
మేని వ్రణంబులే తెలిపె ♦ మిక్కిలి క్లాంతిని పొంది కంపముం
బూని ఖగేంద్రుఁగన్న యహి ♦ పోలిక నుంటివి కారణంబు నా
వీనులు మానసంబు విన ♦ వేగిరపాటు వహించెఁ దెల్పవే. ౨౧౪

చ॥ అనవుడు నిట్లనున్ దశ ము ♦ ఖాత్మజుఁ డూనిన మాయలెల్ల నీ
యనుజుఁడు దెల్ప వారలొగి♦ యజ్ఞము విఘ్నము సేసి రంత నేఁ
గనలి పరాక్రమంబు నొడి ♦ కంబును తెంపును చూపి పోరితిన్
వనజజ విష్ణు రుద్ర శర ♦ వారము లక్ష్మణుఁ డోర్చె నేమనన్! ౨౧౫

చ॥ అతులిత వైష్ణవాస్త్ర మొగి♦నా రఘువర్యుఁ బ్రదక్షిణించి కుం
చితగతి నేగెనన్న విర ♦ చింపఁగ వెండి మహాస్త్ర మొక్క డం
చితముగ నున్నదేమి? కడు♦చేటు మనంబునఁ గోరి కోరి యీ
వితమునఁ దెచ్చికొంటి విది♦వీడున యెన్నివిధాలఁ జూచినన్? ౨౧౬

చ॥ కడఁగి విరించినాస్త్రము జ ♦ గమ్ము నశించున యన్న భీతిచేఁ
దొడుగఁడు దాన నే గెలుపు ♦ తోఁ జనుదెంచితి మున్ను నేఁడు నా
కడఁకలు సాగవయ్యెఁ జులు ♦ కన్ స్వబలంబున నన్ను గూల్పఁగాఁ
దొడఁగె జగంబు లొక్కరుఁడె ♦ దోరుప శక్తుఁడు లక్ష్మణుం డనా!

ఉ॥ జంకితినంచు నెంచకుము ♦ జానకిపైఁ గల యాస వీడినన్
గింకను వీడి శాంతి నవ ♦ గీర్ణ చరిత్రులు రాఘవప్రభుల్
లంకను వీడువారు మన ♦ లన్ క్షమియించెదు వారు నీ సుహృ
త్కింకర పుత్త్రబంధు బల ♦ కీర్తులు మాయక నిల్చు నావుడున్. ౨౧౮

చ॥ భుజములు సంచలింప రద ♦ ముల్ నవచంద్రికలన్ వెలార్ప బే
రజముగ నవ్వి రావణుఁడు♦రాజన యొప్పఁగ నింక నీవు భూ
భుజుల పయిన్ దురంబునకుఁ♦బోవవు భీతియుఁ జింతయేల? య
క్కజముగ నేన యేగి యొన ♦ కంబున వారలఁ జంపి వచ్చెదన్. ౨౧౯

ఉ॥ ఉండినవారు గెల్తురని ♦ యుండెదువారు జయింతురంచు నీ
దండితనంబు నాకు నుచి ♦ తంబుగఁ దోఁచెడు నంచు నమ్మి యీ
కొండిక యొంటరమ్ము మది ♦ గోరి పొసంగ వహింప లేదు మ
చ్చండ భుజాబలంబు నెల ♦ నంబున నమ్మియె కొంటి నీపగన్. ౨౨౦

ఉ॥ పేదతనంబు తెల్పితివి ♦ పేరిమి వింశతి చండబాహు సం
పాదిత కీర్తి గేయములు ♦ పాడుకొనన్ జగమందు నిర్జరుల్
మోదిలి చూచుచుండ నని ♦ బుద్బుద దేహము పాతుఁగాక యీ
పైదలి వీడువాఁడ ననువార్తయుఁ బుట్టునె నోట? బాలకా! ౨౨౧

చ॥ ఇలను జయంబు నేను గడి ♦ యింపక పోయిన రామ నామమున్
నిలుచునయేని నాయభిధ ♦ నిల్వక పోవునె? యీల్గు లెన్నఁడేఁ
గలదియు కాదె? యెల్లరను ♦ కాలము మ్రింగుచు నున్నదే కదా?
కలదు లయంబు జీవులకుఁ ♦ గల్గదు కీర్తికి నాశ మెన్నఁడున్. ౭౨౨

చ॥ విడిచితి సీతనన్న నుడి ♦ వీనులఁ బడ్డ క్షణంబులోపలం
బొడవునఁ గిట్టి కట్టి కొని ♦ పోదురుగాక నిలింపు లింతకున్
జడియుదురే? జగంబులఁ బ్ర ♦ శస్త బలంబున గెల్చి కీర్తిం
బడసిన యేను నప్పిఱికి ♦ పందలు పొందెడు చావు చత్తునే? ౭౨౩

ఉ॥ పెక్కు లిఁకేల? నీవరిగి ♦ వేశ్మముచేరి శరీర మెల్లెడం
దక్కక గ్రుచ్చుకొన్న నిశి ♦ త ప్రదరంబులఁ బుచ్చివైచి నీ
త్రొక్కటపాటు దీర్చికొని ♦ దుఃఖము వోవఁగ నిద్రసేయు మే
నొక్కడ నేగువాఁడ నని ♦ యుగ్రత లేచుచుఁ దేరు లెమ్మనన్.

చ॥ జనకుని పాదపద్మములఁ ♦ జాఁగిలి చేతులు మోడ్చి నాపయిం
గనలకుమీ క్షమింపుమి జ ♦ గజ్జన విశ్రుత గేయ! యిప్పుడే
చనియెద సంగరంబునకు ♦ శాంతిలు మే మరణించు వెన్క నై
నను కలరూపు నాదు ♦ వచనంబుల నీకు నెఱుంగ నయ్యెడున్. ౭౨౫

చ॥ అని రథమెక్కి పద్మజ భ ♦ వాదు లొసంగిన యాయుధంబులం
గొని తగ నర్థి కోటులకుఁ ♦ గోరికలెల్ల నొసంగి బాష్పవారి
కణములు నిండినట్టి కడ ♦ కన్నులఁ దండ్రిని చూచి చూచి నె
మ్మనము దృఢంబు చేసికొని ♦ మార్తుర మీఁదికిఁ బోవ వెల్వడెన్.

ఉ॥ లంకను గల్గు దైత్యులు క ♦ లంగుచు నిన్నెడఁ బాయలేము మ
మ్మంకిలి సేయఁబోకు మిదె ♦ యుండెద వత్తుము చత్తుమంచు న
ల్వంకలఁ జుట్టిరా జనకు ♦ వారక కన్నిడి కావుఁడీరు నా
యంకులతోడ శాత్రవుల ♦ నంతకు ప్రోలికి నంపి వచ్చెదన్. ౭౨౭

మ॥ అని యూరార్చఁగ దైత్యకామినులు చిం ♦ తాక్రాంతలై కాంచి నా
యన! నీముద్దుమొగంబు చూడకెటులీ ♦ ప్రాణాలతో నుందుమో
చనుదెంచెం గదె కాళరాత్రియయి యీ ♦ తన్మాపుత్రి యీలంకకున్
జనువారల్ చనువారలే గద! వినా ♦ శం బిట్లు రాఁగూడునే? ౭౨౮

చ॥ అని విలసింప వారల క ♦ టాక్ష పరంపర దాఁటిపోయె; మా
యను గొని దాఁగి యింద్రజితుఁ ♦ డావలికేగెనొ? మోసచేయఁడే
మనెదు విభీషణా! యనుచు ♦ నాడుచు లక్ష్మణుఁడుండ వాని స్యం
దన విరవం బకాండ జల ♦ ద ధ్వనినాఁ గవిసెన్ శ్రవంబులన్. ౭౨౯

సీ॥ పసిఁడి కంబములతో ♦ వఱలు టెక్కెంబులు, పిడుగులఁబోలిన♦బిట్టు రవము
వరరత్న ఖచితమై♦మెఱపుల కిల్లయి, ముల్లోకముల కేగ♦మొనయునదియు
జలధులు గలఁగంగ♦జగములు వడఁకంగ, దిగ్గజంబులు తెల్వి♦స్రగ్గి మ్రగ్గఁ
బ్లవగబలము గుండె♦లవియఁ గులాద్రులూ, టాడ ధూళియు రేఁగ♦నవని వీఁగ
తే॥ శేషు శిరములు చలియింపఁ♦జేరెరథము, రాక్షసులగర్జనంబు ఘో♦రముగఁ జెలఁగె
నింద్రజితుఁడు క్రూరాస్త్రంబు♦లేసి యార్చె, లక్ష్మణుండు ప్రత్యస్త్రంబు♦లంగవించె.

ఉ॥ మాయలు దుస్తరంబు లతి ♦ మానుషముల్ గల వీని నిప్పుడే
మాయఁగఁజేయవేని జయ ♦ మార్గము నవ్వలఁ గాంచలేవు ను
మ్మాయను నవ్విభీషణుని ♦ మేలి వచస్సుల నాదరించి దై
తేయునిమీఁద లక్ష్మణుఁడు♦తేపలుగాఁ గురియించె బాణముల్. ౨౩౧

చ॥ ఇరువురు నెచ్చుకుందు కన ♦ నేర్పడకుండఁగ దూపులేయఁగా
శరమయమయ్యె బెట్టిదపు ♦ శబ్దముతో రణరంగమెల్ల వా
నరులును దానవుల్ చెదరి♦నక్కెరి పల్లములందు మబ్బుల
ట్లిరువురు మీఱి మీఱి కురి ♦ యించిరి దొడ్డుగ బాణవర్షముల్. ౨౩౨

చ॥ నడుమనె దానవాస్త్రములు ♦ నాశము నెందఁగ రాఘవాస్త్రముల్
తొడరి యతిక్రమించి కొని ♦ తూఱుచు రావణి మేనిరక్తముం
గుడిచెను దానవాస్త్రములు ♦ కొన్ని మరుత్సుతుమేనఁ బుట్టలో
నిడుపని పోల్కెఁ దూఱ గమ ♦ నింప కుపేక్ష యొనర్చె నాతఁడున్.

మ॥ విషముంబోలిన తూపులం బఱపి పృ ♦ థ్వీనాథపుత్త్రుండు రా
క్షసనాథాత్మజు బొందడంబు సురలెం ♦ చం ద్రుంచె దైతేయు నా
రసముల్ లక్ష్యము దప్పచున్ గుఱికిఁ జే ♦ రంబోక క్రుంగారుచున్
బసమాలెం గ్రథనక్రియల్ చలుపు త్రో ♦ వన్ సత్త్వహీనంబులై.

మ॥ విలువిద్దెం దన నేరుపుం బలము గా♦న్పింపంగ వీలుండమిన్
బలభిద్ద్వేషి పులస్త్యమాని తనకున్ ♦ వాత్సల్య సంపూర్ణుఁడై
కలనం దోడని యిచ్చు కుంతమును వీ ♦ కన్ వైవ మాసింద్ర వా
గ్బల నంకాశ శిలీముఖంబున నడం ♦ గం ద్రుంచె సౌమిత్రియున్. ౨౩౫

ఆ॥ మేకు లూన్చినట్లు♦మేన లక్ష్మణ శరా, వళులు పొడువ నింద్ర♦వైరి మరల
నలుఁగు లేయుచుండ♦నాతని తూణంబు, తునిఁగిపడఁగ రాము♦ననుజుఁడేసె

ఆ॥ తేరు గలుగ వీఁడు♦తెరలఁడు లొంగఁడు, ననుచు హరుల నేసి♦యడఁగకునికిఁ
బగ్గములును తెగమి♦పరికించి సారథి, శిరముద్రుంచి వైచెఁ♦జిత్రగతుల. ౨౩౬

ఆ॥ ఇంద్రియములు కలఁచి♦యేఁపఁ దపించు త, పస్వి మనముపోలెఁ♦బడుపుఁజెలి ప
తివ్రతాత్వ నరణిఁ♦దిండ్రించి స్వేచ్ఛను, పూనెఁ జోదకుండు♦లేని తేరు. ౨౩౭

తే॥ పరుగువాఱుహయములఁబట్టి♦పఱపి తాను,తనయురంబెతూణముగఁగ్రు♦చ్చినశరముల
వారివారి లక్ష్మణుపయి♦మారుతిపయిఁ, బెరలపై నేసి చేసెను♦వీర రవము. ౨౩౯

శా॥ వీరాగ్రేసరుఁ డీతఁ డీతని మహా ♦ వీరత్వ మెందేనియుం
బేరుం గాంచిన శూరవార విలస ♦ ద్వీరత్వ మాత్రంబొకో ?
పోరన్ మృత్యువు డాసినన్ గడఁకయుం ♦ బ్రోద్ధత్వముల్ వీడ రె
వ్వారో వారలె శూరులంచు విరులన్ ♦ వర్షించి రాఖేచరుల్. ౨౪౯

శా॥ నాయమ్ముల్ తనమేనఁ దీసి పఱపెన్ ♦ నామీఁదనే చెల్లరే !
యాయమ్ముల్ మనమున్ గలంగువడి నా ♦ యమ్ముల్ ప్రసారించినన్
గాయమ్ముల్ గణియింపఁడున్ సురుఁగఁ డు♦త్క్రంపింపఁడున్ సోలఁడున్
మాయమ్మాన గడ వీనితోఁ గడిమి సా ♦ మర్థ్యమ్ము లిబ్భూమిపై. ౨౪౧

మ॥ అని సౌమిత్రియు మెచ్చి యాడఁ గని వీఁ ♦ డాకాశముం జేరునో
ఘనమాయల్ పచరించునో పగటనే ♦ ఖండింపు మీదైత్యు దం
దన వల్దంచు విభీషణుండు పలుకన్ ♦ దర్పంబు క్రుంగారు నీ
దనుజుం డెక్కడి కేగువాఁడని సుమి ♦ త్రాసూతి మందస్మితిన్. ౨౪౨

చ॥ ఎచ్చటికేగినన్ విడక ♦ యేగి మదీయ శిలీముఖంబు లీ
క్రుచ్చును గ్రుచ్చి చంపు? బల ♦ మున్ జలమున్ దిగఁబాఱె వీఁడికన్
జచ్చెడువాఁడ కాక మఱి ♦ చావక తప్పి చనంగ నేర్చునే?
చిచ్చుఱ పిడ్గులట్టి కడు ♦ చేవ చెలంగు నలుంగు లుండఁగన్. ౨౪౩

తే॥ అనెడు సంతట రక్తకా♦యంబుతోడ, శరము లను వేయి కరములు♦పరపుచుండఁ
గనకరథముపై నభమున♦జనఁగ లేచు, నింద్రజితుమాడ్కి రవి యుద♦యించె మింట.

తే॥ తెల్లవాఱె మింటను వెల్గె♦దినకరుండు, రక్కసులఁబోలు జీఁకటుల్ ♦స్రుక్కి సమరె
వంచనములెల్లఁ బొలియ రా♦వణియుఁ గూలె,ననుచు నఱచిరి వేలుపు♦లంబరమున.

తే॥ కీర్తికర భుజబలశూర ! కృత్తివాసుఁ, డొసఁగు తేరుండఁ గేల వి♦ల్లెసఁగు చుండ
వీఁడు చావఁడయ్య! యని వి♦భీషణుండు, లక్ష్మణుని హెచ్చరించె నా♦లంబునందు.

మ॥ శర సంధాన చతుర్ముఖుండయిన యా ♦ సౌమిత్రి యీ పచ్చనౌ
ఖరువుల్ చావవు పల్లెమట్లుగల చ ♦ క్రంబుల్ తునాతునకలై
మురియంబోవని నిశ్చయించి చతురన్ ♦ మూలంబు గుర్తించుచున్
విరియంగాఁ గడచీలలన్ విఱిచె వె ♦ వ్వేఱై పడం జక్రముల్. ౨౪౨

తే॥ చీలలూడఁ జక్రంబులు♦చెదరి వేఱు, పడగ నరదంబు చెడె వారు♦వములు తరువు
గొడ్డటం బడఁగొట్టఁ బ♦క్షులు కలంగు, కరణి సత్త్వహీనంబులై ♦ధరణిఁ ద్రావాలె.

క॥ రథ మవియఁగ నందలి యా, యుధముల నొండొండ వైచి♦యుడివోవ వియ
త్పథి కరిగి యసుర జగములు, నిధన భయం బంది కలఁగు♦నెఱి గర్జించెన్. ౨౪౯

క॥ మేఘనిభ దేహుఁడగు నా, మేఘరవుఁడు పొంచి దొడ్డ♦మేఘములందే
మేఘముకైవడి శిలల న, మోఘముగా గురిసె వరము♦పోఁడిమివలనన్. ౨౫౦

తే॥ దిక్కు దోఁపక వానరుల్♦స్రుక్కి శిరము, లురము లగలంగ ధారణి♦నురలఁ గాంచి
లక్ష్మణుఁడు త్రివిక్రము మేని♦లలి నభంబు, విశిఖ కాయమానంబు గా♦వించివైచె.

తే॥ వైశ్రవణి యెదిరించు స♦త్త్వము కృశించె, నల్లనైన యాకాశంబు♦నడుమ నొక్క
యెత్తుమొగులు నా నుండిన♦యింద్రజితుని, మేనిజాడ లక్షించె సౌ♦మిత్రి యపుడు.

క॥ ధనువు తునుఁగకుండిన నా, ధనువుగొను కరంబు తునిఁగి ♦ ధరణిం బడదే
యని తలఁచి త్రెవ్వనేసెను, ఘనకరముఁ గంకణాది ♦ కముతో నురలన్. ౨౫౩

ఆ॥ విలయ మారుతంబు ♦ వీవ మేఘంబింద్ర, ధనువుతోడఁ బడిన♦యనువుదోఁప
వానిచేయి వడియె ♦ నూనిన ధనువుతో, మణి విభూషణములు♦మలసి వెలుఁగ.

తే॥ బాలచంద్రుదు శేషుఁడు పట్టు♦పగిది నొప్పు, వ్రేళ్లతోఁ జుట్టి పట్టిన ♦ వింటితోడఁ
దరులు శిలలు కపులు నల్గ ♦ దనుజుకరము, ధాత్రిఁ బడి తకపికలాడి ♦ తల్లడిల్లె.

తే॥ సూర్యుఁ డురలక చంద్రుఁడు♦స్రుక్కకుండఁ, మేరుగిరి దొరలక శక్ర♦వైరి కరము
పడుటగని యంత్రముంబోలు♦బ్రతుకునందు, మోహమేలని విబుధ స♦మూహమనియె.

ఉ॥ అంచిత పుణ్యు లక్ష్మణుని ♦ యస్త్రము చేత నసత్య మల్పమా
నంచుఁ దలంచు రావణుని ♦ యగ్రసుతుండు కలంకచిత్తుఁడున్
వంచకుఁడైన యింద్రజితు ♦ బాహువు త్రెవ్వి ధరిత్రిఁగూల రా
త్రించరులెల్లఁ గాంచి తల ♦ ద్రెవ్విన తీరునఁ గుంది రయ్యెడన్. ౨౫౭

ఉ॥ వానరనాయకుల్ చెలఁగి ♦ వారక సింహరవంబు సేయుచున్
దానవసేనలం దఱిమి ♦ దంత నఖావలిచేఁ బదాహతిన్
బీనుఁగు పెంటచేసి యల ♦ వేల్పుల లోకము క్రొత్త సంసృతుల్
జానుగ నిండి మెండుకొను ♦ చక్కటి తక్కక చేసి రత్తఱిన్. ౨౫౮

ఉ॥ నీలగళుండు మున్ను కరు ♦ ణించి యొసంగిన గొప్పశూలమున్
గేల ధరించి శత్రు నవ ♦ గీర్ణచరిత్ర మెఱుంగలేని నిన్
నేలకుఁ ద్రోచి కాక మఱి ♦ నీలుగనంచు మహాసటుండనన్
గాలియనంగఁ జిచ్చునఁగఁ ♦ గ్రాలి దశాస్యకుమారుఁ డేఁచఁగన్. ౨౫౯

మ॥ పరమార్థం బగునేని రాఘవుఁడు స ♦ త్త్వం బూఁదియున్నేని యు
ర్వర ధర్మంబు జయించునేని బలభి ♦ త్ప్రత్యర్థి శీర్షం బిలన్
దొరలుంగాకని లక్ష్మణుండు విలస ♦ ద్దోస్సార మేపారఁగా
శర మాకర్ణము లాగి వీడె జగముల్ ♦ సంతోషముం బొందఁగన్. ౨౬౦

తే॥ చక్రశూలబ్రహ్మాస్త్ర వ♦జ్రములు సిగ్గు, నొందనమ్మహాశర మగ్ను♦లుమియుచుఁజని
యింద్రజితుని శిరము ద్రుంచి♦యిలను గూల్చి, వేలుపుల పూలవానలో♦వెలసిమలసె.

సీ॥ తెగిన శిరంబు పై♦కెగిరి పడకమున్నె, విలయ మారుతముచే♦విఱిగి పడిన
పిడుగులు మెఱుపులు♦బెడిదంబులగు కాల, మేఘమ్ముకై వడి ♦ మేఘనాదు
నొడలు శూలముతోడఁ♦బొడుచుకొన్నట్టియు, మ్ములతోడ బరువయి♦పుడమిఁబడియె
దంష్ట్రలనెడు విధు♦ద్వయముతో గురు శుక్రు, లను కుండలములతో♦ఘన విశీర్ణ
తే॥ కేశ పాశమనెడి రక్త♦కిరణవితతి, తోడ రవిమండలము కాల♦ధూతమగుచు
ధరణి కొఱఁగిన తెఱఁగునఁ♦దనరి వాని, తలయు దబ్బునఁ బడియె ను♦ద్దండభంగి.

ఉ॥ జీవుఁడు దేహ సంస్థితిని ♦ చెందక యవ్వలి కేగినంత నా
త్రోవనె యంతరింద్రియ త ♦ తుల్ చనుకై వడి రాక్షసావళుల్
రావణి కూలునంత సమ ♦ రస్థలి నాయుధరాజి వీడుచుఁ
ద్రోవ యెఱుంగ రాక పలు ♦ త్రోవలఁబోయెను దిక్కు తోఁపమిన్ .

శా॥ అస్త్రాభ్యాస విశారదుండయిన హ ♦ ర్యశ్వారి యుక్కాఱఁగా
నిస్త్రింశంబగు దైత్యపాలనము వ ♦ న్నెల్ మాసె వంచార్చుచున్
వస్త్రంబుల్ వెస వీచుచున్ సురలు వై ♦ వశ్యంబునన్ ప్రేమమున్
శస్త్రం బూనిన జైనదేవతల యో ♦ జం బూని రప్పట్టునన్. ౨౬౪

మ॥ అరవిందాసనుఁడున్ మహేశ్వరుఁడు కం ♦ జాక్షుండు నింద్రాది ని
ర్జరులున్ దిచ్చు మొగంబుగాక నర వ ♦ ర్గంబుల్ వనాటావలుల్
పెరిమం జూడఁగఁ జాలకాలము నభో ♦ వీథిన్ మనోమోద సం
భరిత ప్రేమను నిల్చినారలు మహా ♦ పర్వంబు సంధించుచున్. ౨౬౫

మ॥ అనిలో రావణిచే నిశాచరులచే ♦ నంత్యస్థితిం బొంది మా
లిన కీశావలులెల్ల జీవముల నో ♦ లిం గాంచి పూర్వంబు కం
టెను సత్త్వం బొదవంగ లేచిరి విరా ♦ డ్గేయాను కంపాప్తి స
ద్గుణులం బీడ లలంపవన్న సుజనో ♦ క్తుల్ కల్లలౌనే ధరన్ ? ౨౬౬

తే॥ అసుర తలగొని ముందుగ♦నంగదుండు, జరగె వేలుపు లొత్తుగఁ♦జల్లుచున్న
విరుల పందిరిక్రింద వా♦నరుల నడుమ, హనుమపైఁ జన సౌమిత్రి♦యన్నకడకు.

క॥ పొనుపడు ఖేదంబును మఱి, పెనుపడు మోదంబు గలుగు ♦ పృథ్వీపతి సం
తనపడఁ గేలం దలఁగొని, మునుపడ నరుదెంచు వాలి♦పుత్త్రుం గనియెన్ ౨౬౭

క॥ చందురు కలఁకంబలె నా, కుం దనరిన నింద తొలఁగ♦గురుతర కీర్తిం
జెందితి ధర్మము కరుణిం, పం దలఁగని కీడు రాని♦భాగ్యముఁ గలదే? ౨౬౮

క॥ లంకాధిపతి కుమారు వి, శంకటగతి లక్ష్మణుండు♦చంపఁగఁ గరమం
దంకించి శిరము దెచ్చితి, వింకే నెత్తితిని శిరము♦నెనసితి జయమున్ ౨౭౦

సీ॥ వేలుపుల్ దలయెత్త ♦ వేదముల్ తలయెత్త, ధర్మంబు తలయెత్తఁ ♦ దపములెత్త
మఘవుండు తలయెత్త ♦ మౌనులు తలయెత్త, సత్యంబు తలయెత్త ♦ సత్త్వమెత్త
జగములు తలయెత్త ♦ జనములు తలయెత్త, దయయును తలయెత్త ♦ నయమునెత్తఁ
క్షేమంబు తలయెత్త ♦ నేమంబు తలయెత్త, శాంతియుఁ దలయెత్త ♦ దాంతి యెత్త
తే॥ సత్పథంబులు తలయెత్త ♦ సాధులెత్త, ముక్తిచింతయుఁ దలయెత్తఁ ♦ బుణ్యమెత్త
సంగదా! తలదెచ్చితి ♦ వధిక ముదము, హత్తినాఁడవు నేఁ దల ♦ యెత్త ననుచు.

ఉ॥ ఏమగునో యటంచును జ ♦ యింపదె ధర్మమె యంచు లక్ష్మణ
స్వామియె గెల్చునంచు విసు ♦ వాసముతోఁ దనరాక సంతత
ప్రేమను వేచు నా భరతు ♦ వీఁకను తమ్మునిరాక వేచు నా
రాముఁడు కన్నులార నెదు ♦ రం గనె డాయుచునున్న లక్ష్మణున్.

మ॥ పగవానిం దెగటార్చి వచ్చిన ప్రియ ♦ భ్రాతన్ బ్రతీక్షించుచో
మిగులం గన్నుల రాలు నశ్రువులు నె ♦ మ్మిన్ వచ్చెనో? నెమ్మదిం
బొగులన్ వచ్చెనొ? మోదధారలొకొ? యె ♦ మ్ముల్ నీరుగాఁ జేయు జా
లి గదింపన్ వెలివడ్డ ధారలొకొ? శ్రీ ♦ లింపన్ సుసాధ్యంబొకో? ౨౨౩

శా॥ సంతోషామృతధారలున్ బ్రవిమలో ♦ త్సాహంబు నుత్కంఠ వి
క్రాంత స్ఫూర్తి వెలుంగ సన్నిహితుఁడౌ ♦ రామాంఘ్రి సాన్నిధ్యమం
దంతఃప్రీతి సమర్పణంబు సలిపెన్ ♦ బ్రాణాంతమందైన వి
క్లాంతిం బొందని వీర లక్షణ విధా ♦ క్రాంత ద్విషన్మస్తమున్. ౨౨౪

మ॥ తలఁ జూచున్ జయలక్ష్మిఁ దాల్చిన భుజా ♦ స్తంభంబుఁ జూచున్ మహా
బలసూనుం బరికించు లక్ష్మణ ధను ♦ ర్బాణంబులన్ గాంచు వే
ల్పుల చేష్టల్ దిలకించు లక్ష్మణుని తెం ♦ పుం దేటి చూచున్ ముదా
కలనన్ మీఱిన రాముఁ డేమియు నెఱుం ♦ గన్ లేక మౌగ్ధ్యంబునన్.

సీ॥ అసదృశుఁడును సుగు ♦ ణాంభోధి రాముఁడు, తనపాదములకు వం ♦ దన మొనర్చు
తమ్ముని కాలాంబు ♦ దమును సంధ్యారాగ, మెనసిన చందాన ♦ నిమ్మ మెఱయ
నీలాచలముమీఁద ♦ బాలభాను మయూఖ, ములు ప్రసరించిన ♦ పోలుపు వెలయ
ఱొమ్మున భుజమునఁ ♦ గ్రమ్మిన రుధిర క, ణమ్ములు తనమేనఁ ♦ బమ్ముకొనఁగ
తే॥ గాటముగఁ గౌఁగిలించి నా ♦ కడకు జనక, పుత్త్రి వచ్చి చేరినదని ♦ ముదము గొంటి
ధరణిఁ దమ్ములఁ గలుగు వాఁ ♦ డరుల కలుకఁ, డనెడు వాక్యంబు నెలకొల్పి ♦ తయ్య నేఁడు,

తే॥ అనుచుఁ దమ్ముని భుజముల ♦ నలరుచున్న, తూణములఁ దీసి భుజ తను ♦ త్రాణములను
విడిచి వ్రణముల మెల్లనఁ ♦ దుడిచి యొత్తి, శ్రమముపోకార్చి తాను మో ♦ దము వహించె.

తే॥ పురుషపుంగవ! యీ గెల్పు ♦ పొరయుటరయ, నీవలనఁ గాదు హనుమంతు ♦ నేర్పువలనఁ
గాదు దైవంబుచేఁ గాదు ♦ కాదు నిజము, మన విభీషణుచే సని ♦ వినుతిచేసె.

౨౮. రావణ శోక పటలము. (౬౧)

తే॥ దరులు గలరక్త జలధిని♦దాఁటి దైత్య, దుఃఖసాగరమును దాఁటి♦దూత లపుడు
గుహను చొచ్చు మచ్చునఁ బెను♦గోపురంపు,ద్వారమునఁ జొచ్చి రావణు♦దరికిఁ జనుచు
క॥ ముంగిళ్లను నిలిచిన దై,త్యాంగన లతిదుఃఖజలధి♦యదుగునఁబడి క్రుం
గంగని నేఁటికి లంకయె, క్రుంగె మహాంభోధి ననుచుఁ♦బోయిరి దూతల్.
ఆ॥ పండ్లు నోరు మనసు ♦ ప్రాణంబులును గాలుఁ, గేలు వడఁకుచుండ ♦ గిలి కుదింప
నీకుమారకుండు ♦ నేఁటికి లేఁడయ్యె, ననిరి చారు లాద ♦ శాస్యుఁజేరి. ౭౮౧
ఆ॥ అచట నుండినట్టి ♦ యమరులు నమర మూ, నినులుఁ దక్కువారు ♦ నేఁడు జగమె
నాశమందు ననుచు♦నడుఁకుచు దెసలకుఁ, బరుగులిడిరి పంక్తి ♦ వదనుఁ బాసి.
ఆ॥ కినుకఁ గనులనుండి ♦ కిత్తి కణంబులు, రాల నుతిమిచూచి ♦ రావణుండు
కత్తిదూసి చరుల ♦ కంఠముల్ తెగనేసి, కేలు వడఁక నేలఁ ♦ గూలినాఁడు.
ఆ॥ పుత్త్రశోకవహ్ని ♦ ముఖములఁ బుట్టి ని, శ్వాసమునఁ బెరింగి ♦ చక్షులందు
వెలిఁగి దెసలఁ బరవి♦విలయాగ్ని యే దశ, వదనుఁ జేరె ననఁగఁ♦బ్రజ్వరిల్లె. ౭౮౪
ఆ॥ ఒడలు వడఁకఁ బుడమిఁ♦బడి యడలుటచేత, నవని శేషుఁ డదరి♦యులుకులపడ
వెలలు కోపవహ్ని♦వలన బాడబమె పై, కుబుక జడధి యుడుకు♦నోజ నుడికె.
తే॥ తాపవహ్నియుఁ బైపయిఁ♦దనరు ప్రేమ, వనట యడరఁగ నిరువది♦కనులనుండి
యురలు బాష్పప్రవాహంబు♦కరఁగి యుబికి, పరవి పరుగిడు తామ్రద్ర♦వంబుఁబోలె.
క॥ కటకటపడి రదనంబులఁ, బటపట గీఁటుచును పిడుగు♦వలె బెడిదముగా
నటమటపడ నిల మోఁదెను, తటపటమని జీవతతి యొ♦దల్ సుడివడఁగన్. ౭౮౭

ఉ॥ కాలిన పుంటిపైఁ గరఁగఁ ♦ గాఁచిన శూలము దూర్చినట్లుగాఁ
దాళఁగలేక క్రుక్కు వసు ♦ ధంబడు సోలును లేచుఁ క్రుంగుఁ జిం
తాలసుఁడై కలంగుఁ దన ♦ యా! యను హా! యను విహ్వలించు నిం
కేల జగంబు జీవధన ♦ మేగిన పిమ్మట దేహమేలనున్. ౭౮౮

ఉ॥ నాయన! యింత చెట్ట యగు ♦ నా యను నింద్రవిరోధ మింతయే
నాయను నన్నుపీడఁదగు ♦ నాయను వేల్పులు సంతసింపఁ జ
న్నాయను నేను నిల్వఁగల ♦ నాయను శౌర్యము మంటిపాలు గా
నాయనుఁ బౌరుషం బడఁగె ♦ నాయను జీవము పాసెనాయనున్. ౭౮౯

క॥ శూలియుఁ గెలియ నవ్వన, మాలియు నెదిరింపలేక♦మలఁగినవారల్
లీలగ హేలగ గెలిగ, మేలుగ విహరించువారు♦మీఁద మదమునన్ ౭౯౦
క॥ ఖేచరుల విమానంబులు, గోచరమే కాకయుండుఁ♦గోటి కొంకడున్
నీచుల రణ విజయంబున, నేచెల! యీలంకమీఁద♦నెగయునె యింకన్ ? ౭౯౧

క॥ దూతలు పలికిన తీరున, నాతులు వయొకండు తునుమ♦నడఁగితివే ? నీ
చేతలనే తలపోయఁగ, రాతులు యమదూత లెగచి♦రా నిన్నలమన్ ? ౯౨

తే॥ అనుచు లేచును నాయనా♦యనుచుఁ బిలుచుఁ, బడును పలవించుఁ దూలును♦పుడమిఁ బొరలు
నుడుకుఁ బరితపించుఁ జెమర్చు♦నుఱిమిచూచుఁ, గనులుమూయునులోలోనఁ♦గళవళించు.

క॥ ఒకశిరము పుత్త్రకా! యను, నొకశిర మిఁక రాజ్యభార♦మోపుదునె కటా!
యకటా వికటంబగు నను, నొకశిర మరినోట నిన్ను♦నుంచితినె ? యనున్. ౯౪

క॥ ఒకశిరము పోయితే! యను, మొకమొకటి మృగేంద్రుఁ జంపి♦మించెనె యను వే
ఱొక శిరము రాఁగదే యను, సుకముగ నను తడవకున్న♦ స్రుక్కరుగ దనున్.

క॥ ఒకశిరము హరి గిరీశ, స్వకరాయుధములకు నపయ♦శముగూర్చి వికా
విక నవ్వు నీమొగము చూ, పక పోయితె యింకఁజూడఁ♦బనుపడునె ? యనున్

క॥ ఒకశిరము నీవు చన్నం, గకవికయగు నామనంబు♦కష్టించుచుఁ దో
డొకయింతలేక మలఁగును, సుకుమారా! తండ్రిఁ దేర్పఁ♦జూడవొకో ? యనున్

క॥ ఒకశిరము నిర్జరేంద్రుని, మకుటముఁ దివియంగ నలరి♦మగువలు సుమముల్
ప్రకటించి చల్ల వెలసిన, మొకమును పొలికలనిఁ గాంతు♦మో ? యని పొగులున్

క॥ ఒకశిరము యక్షవనితలు, వికట భవద్గుణ రవంబు♦విని తమతమ కు
త్తుకలఁ గల సూత్రములఁ దడ, వికొనుట నిఁకమీఁద లేక♦విహరింతు రనున్

క॥ ఒకశిర మపార బలద, ర్పక! నీ సన్నిధికి వచ్చి ♦ వైవస్వతుఁ డం
దిక నసువులు గొనఁజాలం, డిఁక నసువిడి యేజగమున♦కేగితివో! యనున్ ౧౦౦

క॥ అని యిటు పనవుచు రావణుఁ, డనిలజవంబునను సంజ ♦ యోకస మనఁగాఁ
జను పొలికలనికిఁ జని తన, తనయు కళేబరము నచటఁ ♦ దడవంజొచ్చెన్.

క॥ సేవకులగు సుర లసురలు, రావణుతోఁ బరుగులిడిరి ♦ రణరంగమునన్
భూవలయంబుఁ జరాచర, జీవవితతితోడ నేమి ♦ సేయునొ ? యనుచున్. ౧౦౨

ఉ॥ క్రన్ననఁ బంక్తికంఠుఁ గని ♦ కంక పిశాచ గణంబు లయ్యెడన్
ఖిన్నతనొందినట్లు పరి ♦ కించి ప్రలాపముసేసెఁ గొన్ని పెన్
విన్ననయొందెఁ గొన్ని పల ♦ వించి పదంబులఁ ద్రావెఁ గొన్ని యా
పన్నతఁ గొన్ని చేరె శవ ♦ వారణ కాయ నికాయ మధ్యమున్. ౧౦౩

చ॥ కొడుకు కళేబరంబుఁ గనఁ ♦ గోట్లకొలందిగఁ జచ్చి కుప్పలై
పడిన తురంగ సంఘముల ♦ వారణవారములన్ భటాలి నం
గడముల శీర్ణమైన ఘన ♦ గాంగ శతాంగములందు నంతటన్
గడఁకను ద్రొచ్చిత్రొచ్చి వెద♦కందొడఁగెన్ దినమెల్ల నయ్యెడన్. ౧౦౪

మ॥ హృదయావేగము నేయిచే నడరు వ ♦ హ్నింబోలి వర్ధిల్ల నం
గదచేఁ గన్నుల నీరుపొంగి పొరలన్ ♦ గ్రవ్యాదలోకేశుఁ డా
కదనక్షోణి బలిష్ఠ కార్ముక యుతో ♦ దగ్ర స్ఫార హీర ప్రభాం
గద విభ్రాజిత ఖండ దీర్ఘ కరముం ♦ గాంచె న్నగుల్ దిగ్గనన్. ౧౦౫

క॥ తూణీరము కేయూరము, బాణములును రాజిలంగఁ ♦ బన్నగమువలెన్
రాణించు కరము స్వకర, శ్రేణిం గీలించుకొనియెఁ ♦ జిత్తము తలరన్. ౧౦౬

క॥ తుది నిశ్వాసము గల దశ, వదనుఁడు కంఠమునఁ గనుల ♦ వక్షంబున నం
గదగొని యొత్తును మూర్కొను, బెదవులు చలియింప నేడ్చు ♦ విలవిలపోవున్.

చ॥ పడపడి వాని మేనుగని ♦ పట్టఁగరాని యలంత పెంపునన్
బెదవులమీఁద వక్షమునఁ ♦ బీనుఁగుపైఁ బడ బాష్పవాహినుల్
పదరి శిరంబులేని కుణ ♦ పంబును పట్టి పరిష్వజించి మై
యదరఁగ వెక్కివెక్కి యల♦యన్ విలపించు సురుంగు దూపిలున్. ౧౦౮

చ॥ కొడుకు నురంబు నాటిన ల ♦ కోరుల నూడ్చి యలంతి తుండ్లుగాఁ
జిడిముడి దీఱఁగా విఱుచుఁ ♦ జింతిలు మూర్ఛిలుఁ మేను మూర్కొనున్
దడవుఁ జలించు లేచు భువ ♦ నంబుల నొక్కట ద్రింగనెంచు న
ప్పుడమిని గూలు వంత తల ♦ మున్కలుఁగాఁ దపియించు గ్రమ్మఁదున్.

శా॥ ఈదైత్యేంద్రుని యల్క రాఘవులతో ♦ నే తీఱునో ? బ్రహ్మ రు
ద్రాదిత్యావలితోడఁ బోవునొకొ ? లో ♦ కాంతంబె కావించునో ?
యేదారిం జనువారమంచు సుర మా ♦ నీంద్రాదులెల్లన్ మనగి
ఖేదోన్మాద విచేష్టితాంగు లగుచున్ ♦ గీడ్పాటుమై నుండఁగన్ ౧౧౦

మ॥ దశకంఠుండు కుమారు శీర్షము సమి ♦ ద్ధాత్రిన్ బరీక్షించి యు
ష్ణశువుల్ గైకొనిపోయిరంచు వెగచున్ ♦ వక్షంబునం జేర్చుఁ బు
త్రశయంబున్ మదివుచ్చిపూయము వెలా♦ర్పన్ మండుచున్ మాఁడుచున్
దిశ లొక్కుమ్మడి బ్రద్దలై పగుల రో♦దించుం భువిం డొల్లుచున్. ౧౧౧

ఉ॥ దిక్కరులన్ గలంచి కడుఁ ♦ దేలిక శంకర శైలమెత్తి పెం
పెక్క జగంబులం గెలిచి ♦ యేపు వహించిన యేను నాసుతుం
డిక్కడ నేఁడు ద్రుంచు నరుఁ ♦ డెక్కటి కయ్యమునందు కూల్పఁగా
నుక్కఱి దీనతం గలఁగు ♦ చుంటిని దిక్కఱి బిక్కరించుచున్. ౧౧౨

చ॥ అలకను కాల్చి యింద్రపురి ♦ యందము ద్రుంగఁగ బాగ్గుచేసి యి
య్యిల నెదురెందు లేక చరి ♦ యించి జగంబుల నేలు నే రణ
స్థలిఁ దలఁ గోల్పడన్ దనువు ♦ జంబుకముల్ గ్రసియింపఁ గూలు గా
దిలి సుతుఁ గాంచి యాపిదపఁ ♦ దిన్నది కుక్కలకూడు నానొకో ?

చ॥ కొమరునితోడ వచ్చిన య ♦ కుంఠిత విక్రమశాలు లాజి దు
ర్దములగు రాక్షసుల్ సమర ♦ రంగము నం దొకరేని లేక జీ
వములఁ ద్యజించినారు కపి ♦ వర్గమునం దొకఁడేని చావఁడీ
క్రమము విచిత్రమయ్యె నని ♦ కాంచుచు నూరకయుంటెఁ జెల్లరే!

మ॥ సుర గంధర్వ భుజంగ యక్ష హరిణా ♦ క్షుల్ సిద్ధ సాధ్యాంగనల్
వర విద్యాధర కీరవాణులగు నీ ♦ భార్యల్ ప్రలాపించుచున్
వరుఁడేడీ శిరమేది చూపుఁడనుచుం ♦ బ్రశ్నింపఁగా నంతకున్
దురమందోర్చిన యేను వారి నెటు గాం ♦ తున్? బల్కు నోరాడునే?

మ॥ జయలక్ష్మింగొని యింద్రసంపదల ని ♦ చ్చం గోరినట్లెల్ల ని
శ్చయలీలం గొనిపొందితిం దుది మను ♦ ష్యస్త్రీకి నొక్కర్తుకై
యయయో! నీవొనరింపఁగాఁ దగిన యం ♦ త్యప్రక్రియల్ నీకు నే
నయి కావింపఁగఁ జేసికొంటిఁగద క ♦ ష్టాత్ముండ దౌర్భాగ్యుఁడన్. ౨౧౬

చ॥ అని బహుభంగులం బనవి ♦ యాత్మజు దేహము నెత్తి నెత్తిపైఁ
గొని దనుజాంగనల్ గదిసి ♦ కొందలమందుచు నేడ్చుచుండ లం
కను వడిఁజేరెఁ గాంచిన ఖ ♦ గంబులు నేడ్వఁగఁ బత్తనంబె న
క్కొనినది యాలగోడుగను ♦ గోలల గోడుగ బాలగోడుగన్. ౨౧౭

చ॥ కనులఁ బెకల్చికొంచుఁ దమ ♦ కంఠములన్ వడిఁ ద్రెంచికొంచుఁ గ్ర
న్నన హృదయంబుఁ జీల్చికొని ♦ నాలుక లూడిచికొంచు శీర్షముల్
మొనసి పగిల్చికొం చసుర ♦ పుత్త్రుని భార్యలు పల్వు రయ్యెడన్
మనసులు పుండ్లుగా నయిఁపు ♦ మాలి త్యజించిరి ప్రాణవర్గమున్. ౨౧౮

శా॥ తండ్రీ! యంచును దానవాంగనలు నా ♦ థా! యంచు దైత్యేంద్రుకో
డండ్రుం గుంపులుగూడి కట్టుకొని యే ♦ డ్వం దక్కు చెల్లెండ్రు ని
ల్లాండ్రుం బిడ్డలు జీవితాశలను రో ♦ యన్ గుంపులై వచ్చి రె
వ్వాండ్రుం జూడఁగఁ దెచ్చె నంతిపురికిం ♦ బౌలస్త్యుఁ డమ్మొండెమున్.

సీ॥ పుట్టకోవలఁ బద్మ♦ముల మోఁదుపగిది ను, రమ్ముఁ గరమ్ములఁ♦గ్రుమ్మికొనుచు
రశనను మోవనే♦రని సన్నకౌను పా, లిండ్ల భారమ్మున♦నింత్రపడఁగ
ముడివీడి వేనలి♦మడమలఁ దడవంగఁ, గన్నీరు మున్నీరు♦గాఁగ నలమ
నిప్పు ద్రొక్కినగతి♦నేలఁ బదములానఁ, బుత్త్రదుఃఖము పొంగి♦పొగలి ముంప

తే॥ మృగయశరభిన్నహృదయమై♦మేదినీధ్ర, మందుపొరలుమయూరినాఁ♦గొందలించి
కొడుకుమేనిపైఁ బ్రాణముల్♦కుతిలపడఁగ, వ్రాలి మందోదరి మనంబు♦తూలసోలె.

తే॥ కొంతసేపు తెలివిదక్కి♦కూలియుండెఁ, గొంతసేపు నిశ్చేష్టయై♦కూరుచుండెఁ
గొంతసేపు మౌనంబునఁ♦గుందుచుండెఁ, గొంతసేపు వెక్కుచుఁ బల్కు♦కుదురకుండె.

చ॥ తరుణ శశాంకుఁబోలెఁ బ్రమ ♦ దంబుగ వర్ధిలునాఁడె వాసవుర్
గరువమడంచి తెచ్చుటను ♦ గాంచఁగ నోచిన యేను మొండెమున్
బరువుగఁ జూడఁ బాల్పడితిఁ ♦ బాప కలంకిత చిత్తఁ గావునన్
మురువగు నీదు మోము గను ♦ పుణ్యము నంతయు నోచనైతిగా!

ఉ॥ చక్రిని శంకరుం జెనకి ♦ సంకటపెట్టితి వల్లనాఁడె దో
ర్విక్రమవర్య! నీయలరు ♦ విన్ననువొప్పు మొగంబుఁ జూడకే
శక్రభయంకరా! మనఁగఁ ♦ జాలుదునయ్య? యనంగరూప! నే
నీక్రియ వీరమాత నని ♦ యెత్తెఱ నొందుట దీనిఁ జూడనే? ౮౨౩

ఉ॥ కాళుల గల్లుగల్లుమని ♦ గజ్జెలు మ్రోయఁ జరించునాఁడె సిం
గాలను పట్టి యీడ్చికొని ♦ కాఱియవెట్టుచు మేడ ముంగలన్
లీలగఁ గట్టివైచి పలు ♦ లీలలఁ దేలుచు నుంటఁ జూడఁగాఁ
జాలుదునయ్య! యింక మరు ♦ జన్మము నెత్తిన నోము నోచినన్. ౮౨౪

ఉ॥ హస్తముచాఁచి పిల్వఁగ శ ♦ శాంకుఁడు భీతిలి వచ్చి నిల్వ నీ
శస్త కరంబుతో నతనిఁ ♦ జల్లగ దువ్వుచు భీతి మాన్చి నం
ప్రస్తుతమౌ కలంకముఁ గు ♦ రంగముగాఁ దలపోసి పట్టఁగా
నిస్తుల హస్తముం బఱపు ♦ నీటు గనుంగొన నెంతు రాఁగదే!. ౮౨౫

చ॥ స్కందునిబోలు సుందర! ని ♦ శాచర పన్నగ యక్ష దేవ శీ
తేందు ముఖుల్ విలాసముల ♦ హేలల లోఁగొననెంచి పువ్వుశ
య్యం దఱివేచి నిల్వ శ్రమ ♦ నంది సుఖంబుగ నిద్రసెందితో?
క్రందగు కయ్యమం దొనరు ♦ క్లాంతి తొలంగఁగ విశ్రమించితో! ౮౨౬

క॥ ముల్లోకంబుల గెలిచిన, బల్లిదుఁడగు సుతుఁడు నేడు ♦ బవరంబున ని
ట్లెల్లిదుఁడగు నొక మానవు, భల్లంబునఁ దెగియె నకట! పాపపు విధిచే.

ఉ॥ దూది వహుతాశిలో వలెనె ♦ దుర్దమ మానవ బాణ వహ్నిఁ గ్ర
వ్యాదులు చన్నవారు చని ♦ నట్టుల చచ్చెదువార క్రమ్మఱన్
లేదొక ప్రాణియైనఁ గబ ♦ ళించె దశాస్యుఁడు ధాత్రిజాత యన్
స్వాదు విషంబు రేపటికి ♦ సాధ్యమె యిట్టులు కాక తక్కఁగన్? ౮౨౭

మ॥ మది సంతాపము నిట్లు వెల్వఱచు న ♦ మ్మందోదరిం గ్రవ్యభు
క్సుదతుల్ చేతులమీఁద నెత్తుకొనుచున్ ♦ శుద్ధాంతమున్ జేర నం
గద వర్ధిల్లఁగ రాతిగుండెగల యా ♦ త్మాజాతయే హేతువౌఁ
గదయంచు గ్రగతి న్వధింపఁ జనె లం ♦ కానాథుఁ డత్యార్భటిన్ ౮౨౮

మ॥ పరుగుల్ వాఱుచునున్న రావణుని భా ♦ వంబున్ విమర్శించి ని
ల్వరమౌ కీర్తి నశించునే యనుచు ద్రో ♦ వన్ దెంపు తోడన్ మహో

దరుఁ డడ్డంబయి చాఁగిలంబడి యనుల్ ♦ దైత్యేంద్ర! కోపంబుచే
స్థిర కీర్తిం గొనిపోయి గంగఁ గలుపం ♦ జింతించెదే తొందరల్ ? ౨౩౦

ఉ॥ కీరితి మొత్తముం భువన ♦ గేయముగాఁ గొను రాక్షసేశ్వరా!
కోరితి లోకనాయకత ♦ గొంటివి కోరిన కోర్కి చెల్లఁగన్
జేరితి చేరరాని సుర ♦ సిద్ధ పదంబులఁ బల్మి పెంపునన్
మీఱితి వెల్లభోగముల ♦ మేకొనదేలఁ స్థిరాపనిందకున్ ? ౨౩౧

మ॥ సురసంఘంబులపై దిగీశ్వరులపై ♦ సుత్రాముపై వాలిపై
వర దిగ్వారణరాజిపై ధనదుపై ♦ నర్తిల్లు యుష్మచ్ఛ్వరా
చర భీతిప్రద చంద్రహాస మొక కం ♦ జాతాక్షిఁ దుండింపఁగాఁ
బరపన్ సిగ్గిలి క్రుంగఁగాక వనితా ♦ ప్రాణంబులం గోలునే ? ౨౩౨

మ॥ అబలన్ గోల లతాంతకోమల ననూ ♦ ద్యంపశ్య వైదేహిఁ గో
ప బల స్ఫూర్తి గడల్కొనం దునుముచో ♦ బ్రహ్మాదు లింద్రాదు ల
ల్పబలుం డల్పగుణుండు నీచకులుఁడున్ ♦ వ్రాత్యుండు భీతుండు మా
న బల స్థైర్య విహీనుఁడం చనరు లం ♦ టం గేలి గావింపరే ? ౨౩౩

ఉ॥ కాదిది రాజనీతియును ♦ కాదు సురావళి ధర్మరీతియున్
గాదిది సాధుపద్ధతియుఁ ♦ గాదు జయాంకము కాదు మోదమున్
గాదిది యిష్టసిద్ధియును ♦ కాదిది మేలిమి విక్రమస్థితిం
గాదు పులస్త్యవంశ్య! కొఱ ♦ గాని యపప్రథఁ దెచ్చికొందువే ? ౨౩౪

ఉ॥ రాముని కత్తితో నఱకి ♦ రాముని వెంశి జయించి లంకకున్
రా మతియించెదో ? చెలువ ♦ క్రుందిన, వారలు చింతతోడ నం
గ్రామము మానువారలను ♦ కారణమో ? యది వీరధర్మమో ?
రాముని గెల్వలేకుడిగె ♦ రాక్షసరాజను గోను మోసెదో ?. ౨౩౫

ఉ॥ నావుకు రావణుండు లల ♦ నన్ వధియించుట మాని రోసి వా
లావలఁ బాఱవైచి తన ♦ యర్మిలి పుత్త్రు శిరంబుతోడ రా
జీవవినోది వంశజుల ♦ శీర్షములన్ గొని కాక క్రమ్మఱన్
రావణి గాత్ర మందనక ♦ రంగఱ కుంచుఁడి తైలమం దనన్. ౨౩౬

౨౯ సేనా సందర్శన పటలము. (౫౨)

చ॥ కొడుకు శవంబుఁ దైలమున ♦ గుప్తి యొనర్చిరి దైత్యవైద్యు ల
య్యెడ దెసలెల్ల నిండి వకి ♦ యించుచు నుండిన రాక్షసావలిన్
గదుకొని పిల్వఁగాఁ జనిన ♦ కర్బురదూతలు వచ్చి లంకలో
నెడ మొకయింత నిల్చుటకు ♦ నేని కనంబడ దయ్యె నావుకున్. ౨౩౭

ఉ॥ ఎచ్చటనున్నదంచు దను ♦ జేశుఁడు ప్రశ్నయొనర్ప దేవరా!
అచ్చుపడంగ నిండె కల ♦ దంచు వచించుట కెట్లుచెల్లు? వా
తోచ్ఛలితాంబుధిప్రకర ♦ ముల్బణమంద జగంబు చాల కు
న్నచ్చున నెల్లెడం బరవి ♦ యార్చుచునున్నది సేన మత్ప్రభూ! ౮౩౮

క॥ పదరజము నిండి యంబర, పదమునఁ గాలూని విబుధ♦వర్యులు నడవన్
గదిరిచి మితిమీఱిన మన, చదలము గన నరుదుగాఁగఁ♦జనుదెంచె విభూ! ౮౩౯

సీ॥ కత్తులు మెఱుపుల♦కరణిఁ బ్రకాశింప, మేఘసందోహంబు♦మెఱయుమాని
భేరీరవమునకు♦మాఱొడ్డి జలదముల్, చెలఁగి యెక్కుడను గ♦ర్జింపవయ్యె
నాసేనవలె నల్ల♦నై యుండలేమి జీ, మూతముల్ వెల్లనై♦ముడిఁగి యొదిఁగెఁ
జతురంగ బలమెల్ల♦జలధిపై నడతెంచె, నన నొక యుపమాన♦మరయఁగలదె?
తే॥ బలము మితిమీఱి పైపయిఁ♦బరవుచుండ, నూర్ధ్వజగము లొండొంటిలో ♦ నొదిఁగి తూఱెఁ
జంద్ర తారకల్ నెలవుల♦జాఱ విడిచెఁ, దరణి విధిలేక తనత్రోవ♦దాఁటి చనియె.

చ॥ గగనము ముట్టి మేరుగిరి ♦ కైవడి వెల్గుచుఁ దీసియున్న నా
ల్గు గవఁకులందు చొచ్చిన య ♦ కుంఠితసైన్యముచూడఁ గాలుఁడే
జగము భరింపఁజాలదని ♦ సాగరసప్తకముల్ మఱొక్కచో
మొగపడి చేర్చుచుండె ననఁ ♦ బొల్పు వహించి రహించె నయ్యెడన్.

చ॥ గవఁకులయందు యిక్కటము ♦ గాఁ జొరఁగాఁ దడవౌన యంచు దా
నవ బలముల్ విలంఘన మొ ♦ నర్చుచుఁ గోటను దాఁటె నన్నఁ దాఁ
దవిలి పయోధి సప్తకము ♦ ధారణి నొక్కటఁ జూడఁగోరు మా
నవువలె నెల్లసేనలు గ ♦ నంబడ గోపురమెక్కిఁ జూడఁగన్. ౪౧౮

మ॥ పరమార్థంబును విస్తరించి నిగమ ♦ వ్రాతంబు భాషించు వై
ఖరి దూతల్ విభజించి పల్కి రొక ది ♦ గ్భాగంబునందుండి యే
డ్తెఱ వేఱొక్క వలంకుదాఁకఁ బరిపూ ♦ ర్తిం బొందు సంద్రంబునాఁ
బఱపై నట్టి చమూ సమూహముల నా♦పౌలస్త్యుతో నిమ్ముగన్. ౮౪౩

ఉత్సా॥ వీరు ఠేకుదీవివారు ♦ వేల్మిఁ బుట్టినారు బృం
దారకులను మోహజలధిఁ ♦ దార్చి ముంచినారు పై
వారిదములఁ దాఁకు నంత ♦ వారు మేని పొడవునం
దారి తేఱినారు మాయ ♦ నార్పు సంగరంబులన్. ౮౪౪

ఉత్సా॥ వీరు దబ్బదీవివారు ♦ విక్రమమున నంతకుం
గేరువారు విజయలక్ష్మిఁ ♦ గేలఁబట్టువార లీ

వీరివలన స్వర్గలక్ష్మి ♦ వీడినారు వేలుపుల్
శూరవరులు సమరమందు ♦ శూలికేని యోడరున్. ౨౪౫

ఉత్సా॥ వీరు బూరుగనెడు దీవి ♦ వెలయువారు వాసవున్
బోరఁ గెలిచి పాకవైరి ♦ పురము కొల్లగొట్టినా
రార భవుని వరబలమున ♦ నధికసత్త్వ గౌరవుల్
కారుచిచ్చువంటి కినుక ♦ కనలు గల్గు వారలున్. ౨౪౬

ఉత్సా॥ వీరు కొంచదీవివారు ♦ వేల్పు కాణయాచియా
మేరువును సముద్రమందు ♦ మించి త్రోయఁబూనఁ బా
కారి మొదలుగాఁగ నమరు ♦ లదరి బెదరి వీరలం
జేరి వేఁడికొనుచు నట్టి ♦ చేఁత మాన్చి రొక్కెడన్. ౨౪౭

తే॥ వీరలు ప్్రవాళగిరి నుండు♦వారు శుక్రు, నికి నిశాచరాంగనకు జ♦నించినారు
కలశ వారాశి వరటిపోఁ♦గలఁచినారు, బలము పదికోట్లు లెక్కకుఁ♦గలుగువారు.

తే॥ వీరు చిఱుగాలి సతతంబు♦వీచుచుండు, గంధమాదన వాసంబు♦గలుగువారు
హాలహాలమున కిరులకు♦నన్నలనఁగ, నొప్పువారు లెక్కకు మీఱి♦యుండువారు.

తే॥ మలయమను గొప్ప మల జల♦మధ్యమందు, గలదు వీరలందలివారు♦సలువ వీరి
వలన జగములు నశియింపఁ♦గలవటంచుఁ, దలఁచి ప్రార్థించి యచ్చోట♦నిలిపినాఁడు.

తే॥ వీరు సప్తాంబుధుల కధి♦కారులైన, పుష్కరదీప్వవాసులు♦భూరి బలులు
పమ్మెటలు శూలములు గదల్♦చక్రములు ము, సుండులును విండ్లు ధరియించి ♦
యుండువారు. ౨౫౧

తే॥ వీరు జువ్విదీవిని కలఁ♦వారలు తమ, తల్లిపనుపున ధారణి♦దాఁటి చక్ర
వాళగిరియందు జముగెల్చి♦బంధనమున, వైచి నలువ కోరికపయి♦వదలినారు.

తే॥ మీరు వసియింప నవని వి♦స్తారమైన, చోటులేదు పాతాళంబుఁ♦జొరుఁడి యని వి
రించి పంపఁగ నందుండి♦ప్రేమచేత, వచ్చు బేతాళహస్తులౌ♦వారు వీరు ౨౫౩

తే॥ నిరృతివంశజుల్ వీరలు♦నీకు హితులు, సురలతోనుండి త్రావనె♦త్తురులు లేమి
విసిగి వచ్చిరి సప్తపృ ♦ థ్వీధరముల, నెత్తువా రంబుధులఁ ద్రావ♦నెనఁగువారు.

ఉ॥ వీరలు తొల్లి క్రోడమయి ♦ వెన్నుఁడు కోఱల నెత్తునంత నీ
ధారణి మోహముంగొను క ♦ తంబున జాతిన శోణితంబు బం
గారముగాఁగ దానిఁగొని ♦ క్రచ్చుఱఁజేసిన వీరఘుంటికల్
పారుగఁ దాల్చి రష్టదిశ ♦ లన్ దమ గారుల నిల్పినారలున్. ౨౫౫

క॥ ఈక్రవ్యాదులు భూరి ప, రాక్రమమునఁ గొఱఁతలేక ♦ రాజిలుదురు పా
దక్రాంతి శేషుఁడును ని, ద్రాక్రమమును వీడి యలయఁ♦గ్రాలెడువారల్. ౨౫౬

ఉ॥ కాళిక యోడునట్లు కళ ♦ కంఠుఁడు నృత్యముసేయుచుండఁ గాం
తాళమునొందు నామె కను ♦ దమ్ముల వెల్వడు కోపవహ్నిలోఁ
గాలతరాకృతుల్ భవము ♦ గాంచి రపార బలాఢ్యులెన్న బే
తాళ సహోదరాళి యనఁ ♦ దగ్గ నిశాటులు వీరు రావణా! ౮౫౮

చ॥ ఉరవడి వింట్లు కేలఁగొని ♦ యుత్తరదిక్కునఁ జేరుచున్న యీ
వరబల శౌర్యవర్తనులు ♦ పాపము పుట్టిననాఁడె పుట్టి నా
రరయఁగ దివ్వె లుంచిన గు ♦ హాద్వితయంబన నొప్పు కన్నులం
బెరసిన వార లల్గునెడ ♦ వీడరు చంపక తల్లినేనియున్. ౮౫౯

తే॥ వీర లుగ్ర నిటలనేత్ర♦వీతిహోత్రు, నుండి పుట్టినవారు మ♦హోగ్రగుణులు
వార లూఁతగా మృత్యుదే♦వతకు ముందు, పుట్టినట్టివారలు♦చండ భూరిబలులు.

ఉ॥ శూలములం ధరించి మును ♦ చొప్పడ నిల్చిన యామినీచరుల్
శూలి పదమ్ము వక్షమున ♦ సోకఁ గృతాంతుఁడు క్రక్కునెత్తుటన్
బోలఁగఁ బుట్టినారలు న ♦ మూహ బలాఢ్యులు వీర లబ్ధిలో
హాలహాలంబు పుట్టుతఱి ♦ నన్నలుగా జనియించు రాక్షసుల్. ౮౬౦

ఉ॥ వారలు వార్ధిఁద్రచ్చుతఱి ♦ వాసుకి క్రక్కు విసంబు నెత్తి నే
ర్పారఁగ నుంచు బాడబము ♦ నం దుదయించిన ఘోర దేహకుల్
వారిద మంటు నగ్నిశిఖ ♦ వంటి శిఖల్ గల వీరు శర్వదు
ర్వార శరాగ్నికీలఁ ద్రిపు ♦ రంబులు గాలఁ జనించి రందులన్. ౮౬౧

ఉత్సా॥ ఇందఱని గణించి తెలుప ♦ నిట్టి వార లనుటకున్
డెందమునకు నూహయే క ♦ డింది యగును మాయలున్
బొందు వర బలంబులున్ ద ♦ పోబలంబులెల్లఁ దె
ల్పం దలంప యుగములెన్ని ♦ పట్టునో? ప్రభూత్తమా! ౮౬౨

ఉ॥ ఒక్కఁడొకండె వానరుల ♦ నుర్వరనాథకుమారు లిర్వురన్
జక్కఁగఁ జేయఁజాలుదురు ♦ సంఖ్య వచింపఁగఁబూను వారలున్
గ్రక్కున వేయివెల్లలన ♦ గట్టిగ నవ్వారె విన్నవారలున్
లెక్కయొనర్ప మానమును ♦ లేదు జగంబున రాక్షసేశ్వరా!. ౮౬౩

మ॥ అని దూతల్ వచియింప రావణుఁడు నే ♦ త్రానంద సంపూర్ణుఁడై
కని నాదీవనలన్ వచించి తగు న ♦ త్కారంబులంజేసి యా
దనుజాధీశులఁ దోడితెండనఁగ దూ ♦ తద్దెల్ప సేనాను ల
త్యనురాగంబునఁ బూలు సల్లుచు తదీ♦యాంఘ్రిద్వయిన్ మ్రొక్కఁగన్.

మ॥ అసురాధీశ శిరస్తతీ మకుట ర ♦ త్నాంకూర రాగప్రభా
ప్రవర ద్దివ్య పదారవిందుఁడగు క్ర ♦ వ్యాద ప్రభుం డంతటం

గుశలప్రశ్నముచేసి మీకతన మా ♦ కోర్కుల్ ఫలంబందె నం
తనమయ్యెన్ భవదాగమంబు విజయో ♦ దర్కంబుగా నెంచెదన్. ౨౬౫

మ॥ అని వాక్రువ్వఁగ వారలున్ దనుజ నా ♦ థా! మాకు నీవుండఁగా
ఘన దోస్స్థైర్య తపోబలంబులును గ ♦ ల్గం బొందు దుస్సాధ మెం
దు నొకండేదియు లేదు మీరలును దై ♦ త్యుల్ దార మిత్రాదులున్
మనముల్ వాడి తపింప నేదొనఁగు సం♦ప్రాప్తించెనో తెల్పరే. ౨౬౬

మ॥ అన ధాత్రీజ నిమిత్తమై తన కయో ♦ ధ్యాధీశుతో వైరమున్
బెను కయ్యంబును తత్ఫలంబు తెలుపన్ ♦ బీభత్సగావించిరా
వనచారుల్ ? పదచారులైన మనుజుల్ ♦ భంజించిరా ? కుంభక
ర్ణుని వీరోత్తము నింద్రజిత్తు ననుచున్ ♦ రోషోద్ధతిన్ నవ్వుచున్. ౨౬౭

మ॥ మము పిల్పించుట శేషునుండి ధరణిన్ ♦ మార్పింపఁ గా దబ్ధి నీ
రములం ద్రావఁగఁగాదు సప్తకుల భూ ♦ ధ్రంబుల్ విపాటించి వా
స్తములం దోర్చఁగఁగాదు కాయ గసరుల్ ♦ సాపాటుగాఁ గానలన్
దమి వర్తించు ప్లవంగకోటి దునుమన్ ♦ దైత్యేంద్ర! రప్పించితే? ౨౬౮

ఉ॥ ఏపు విమర్శయేల యని ♦ యేచి కరంబులు తట్ట మేలుమే
లీవని మెచ్చువచ్చె నని ♦ హేలగ దైత్యులు నవ్వఁ బుష్కర
ద్వీప నిశాచరేంద్రుఁ డతి ♦ భీరుఁడు వహ్ని కరంబులెత్తి మీ
కైవులు కూడవం చడఁచి ♦ కర్బురనాథుని కాంచి నమ్రుఁడై. ౨౬౯

చ॥ దనుజవరేణ్య! వీరల వి ♦ ధంబును సైఁపుము శాంతమూను మా
మనుజ వరేణ్యులొందు బల ♦ మానములం దెలియంగ వేఁడెదన్
జనవునఁ దెల్పుఁడీ యనుడుఁ ♦ జక్కటి యంతయు మాల్యవంతుఁ డి
ట్లని వచియించెఁ దేటపడ ♦ నర్కకులేంద్రుల విక్రమంబులన్. ౨౭౦

—: మాల్యవంతుఁడు సేనాపతులకు రామ విక్రమాదులు తెలుపుట :—

చ॥ మిగిలిన విక్రమాఢ్యులగు ♦ మీరలు వాలి నెఱింగియున్నవా
రు గద కులాచలంబుల ని ♦ రోధముగాఁ దనకాలఁ దన్ని న
న్నగచరు రామమార్గణ గ ♦ ణంబున నొక్కఁ డురంబుఁ జీల్చి యా
శుగగతి జీవవాయువుల ♦ జుఱ్ఱుట యచ్చెరువందురే కదా ?. ౨౭౧

మ॥ మడిసెం గాన విరాధుఁడున్ గడచనెన్ ♦ మారీచుఁడున్ బేరుమ్రా
ల్పడ నందే ఖరదూషణ త్రిశిరులున్ ♦ స్వర్గంబుఁ బ్రాపించి రొ
క్కఁడ యొక్కండగు వింటితోఁ గడపె ర ♦ క్షస్సైన్య సంతానమున్
గడెలోనన్ రఘువర్యు బాహుబల ము♦ద్ఘాటింపఁగా నేటికిన్?. ౨౭౨

చ॥ ఇచటికి వచ్చి మీరడుగ ♦ నేల? మహోదధి మండి మాఁడియుం
టచటని త్రోవలోఁ గనరొ? ♦ యారయరో? వినియుండరో? వృథా
వచనము లేల? పిన్నపుడె ♦ భర్గునిచాపము ద్రుంపఁ బుట్టు నా
ప్రచుర రవంబు మీచెవుల ♦ వ్రాలదొ? నిద్దుర వోయి యుంటిరో?

తే॥ లంకయెల్లలో దైత్యబ♦లంబు వేయి, వెల్వ లుండిన వాసేన♦వీరవరుల
రెండు విండ్లె సంయమనిని♦నిండునట్లు, చేసినవి వివరంబుగఁ♦జెప్పనేల? [యింద్ర

తే॥ కుంభకర్ణుండు మీప్రభు♦కొడుకులును ప్ర, హస్త ముఖ్య నాయకులు మా♦యావి
జితుఁడు తక్కువీరులు మృతిఁ♦జెందినారు, నేఁటిదనుక నుంటి మిచట♦నేను నితఁడు.

ఆ॥ మూలబలము గలదు♦మున్నాఱు వెల్లువల్, దానివంతు నేఁడు♦తనరుచుండెఁ
గాలవశత మీరుఁ ♦ గదలివచ్చితి రిఁక, వారి వీరవరుల♦బలము వినుఁడు. ౮౭౬

ఆ॥ ఒక్కకోఁతి వచ్చి♦ యొగి లంకఁగాల్చి దా, నవుల దునిమి యక్షు♦నవని రాచి
ధరణివిభుఁడు పంపు♦దౌత్యంబు నెఱవేర్చి, దంటయగుచు జలధి♦దాఁటిపోయె.

చ॥ కరువలఁ జేర్చి వారినిధిఁ ♦ గట్టె దశాస్యుని ప్రోలుసొచ్చి దు
ర్భరముగఁ బోరుసేయు కపి ♦ వారము గట్టిన కట్ట త్రోవలో
నరయరొ? మేరుశైలమున ♦ కవ్వల నొప్పెడు మందుకొండఁ జె
చ్చెర నొకకోఁతి తెచ్చెఁద్రుటి ♦ సేపున నట్టివి వారిసైన్యముల్ ౮౭౮

ఆ॥ ఈ దురంబు గలుగు♦హేతువు సీతనాఁ, బరఁగు గరితయగును♦పరమసాధ్వి
మీరె గెలిచి రండు♦వారె గెల్వఁగనిండు, వినిచినాఁడఁ గన్న♦విన్న తెఱఁగు.

తే॥ అనుడు వహ్ని దశాస్యుని♦గని బలములు,మడియుచుండ నాజికిఁ బోవ♦మాను టేల?
యనఁగ నది యెల్లిదంబని♦యరుగకుంటి, ననుచు దైత్యేశుఁ డాడంగ♦నతఁడు మఱియు.

మ॥ అది మాపాలికి నుంచినారలొకో? వృ ♦ ద్ధాచార సంవేదియై
ముదుకండౌ మన మాల్యవంతు పలుకుల్ ♦ ముఖ్యంబుగా నెంచి యొ
ప్పిదమౌ తద్విధి సంధిచేసికొనుచో ♦ బింకంబుగా నుండు న
య్యది మించెన్ జలుకందనం బగును చే♦యంబోవ నీమీఁదటన్. ౮౮౧

ఉ॥ జానకి వీడినంత ననిఁ ♦ జచ్చిన యక్షుఁడు మేఘనాదుఁడున్
దానవవీరులున్ మనకు ♦ దక్కెడువారలె? యట్టిచేఁతయున్
మాన విహీనకార్యమగు ♦ మానక యుద్ధముచేసి యుద్ధతిన్
మానవవీరులం బిలుకు♦మార్చుట యుత్తమకార్య మియ్యెడన్. ౮౮౨

చ॥ అని వచియించి వహ్ని కల ♦ యం గని లేవఁగ రాక్షసాలి నీ
వనికిఁ జనంగనేల? చని♦యల్పుల రక్తము గ్రోలి క్రమ్మఱన్
గనియెదమయ్య మి మ్మటులు ♦ గాక దురంబున నోటగాంచుచోఁ
బినుఁగు కులంబునం బొడము ♦ వీస్గులమే యని బాస లాడఁగన్. ౮౮౩

30 మూల బల వధ పటలము. (౨౩౫)

తే॥ నేను నొకప్రక్కనేగి యా♦నీచ కవుల, యావిద్రావెద మీర లా♦యర్కకులుల
నొక్క మొగిఁగ్రమ్మి జీవవా♦యువులఁ గ్రోలి, శిరములం దెండనుచు దశ♦శీర్షుఁడనియె.
క॥ మొనగాండ్రు మొనలతో వెసఁ, జనుటంగని ముందుగాఁగఁ♦జనుఁడీ యనుచున్
దన మూలబలము నంపుచు, దనుజాధీశుండు లేచెఁ ♦ దమి మదిఁ బొదలన్.
క॥ పరికరములు నిండిన తన, యరదమ్మున నెక్కి మునులు♦నమరులు కలఁగన్
వనచరులమీఁది కొక ది, క్కున నేగెను యాతుధాన ♦ కుంజరుఁ డలుకన్.
తే॥ వీరవర్యులు ప్రస్థాన♦భేరి ప్రేయఁ, బనిచి కేకలువెట్ట మిం♦టను ధరిత్రి
దెసల నిండారియున్న య♦ద్దితిజ బలము, కలఁగి రేఁగిన జలనిధి♦కరణి నేగె.
క॥ పరమేష్ఠియండమున సా, గర భూ భూధర పయోద ♦ గగనచర చరా
చరకోటిఁబోలె సైన్యము, పురి యొప్పెను పొట్టివడుగు♦పోఁడిమివోలెన్. ౭౭౭
తే॥ పాడిఁగబళించి కరుణను♦పంటఁగఱచి, క్రౌర్యమునఁ బాపముల నోడి♦గట్టుకొన్న
వారు రంగుచే నెడఁదచే వారిదములఁ, గేశములచేతఁ గీలలఁ గేరువారు. ౭౭౮
తే॥ జలధి జలము పాఱఁగఁ జల్లి♦జలచరముల, మ్రింగి పిడుగులఁ గుండలా♦కృతిగఁదాల్చి
కంధరములొల్చి వలువలు♦గా ధరించి, తిరుగుక్రూరులు యమభయం♦కరులు వారు.
ఉ॥ కొండలు దమ్ము దాఁటుటకుఁ ♦ గ్రుక్కిన ఱాలుగ నొప్ప వారిము
క్త్రండము కాలియందెలుగ ♦ గజ్జెలుగాఁగ భుజంగబృంద ము
ద్దండతఁ జుట్టి వాయువును ♦ తార్క్ష్యుని చేరిచి కట్టికొంచు భే
రుండ పదక్రమంబు పదు ♦ రుంగొని యేగెడువారు ధీరతన్. ౭౮౦
సీ॥ ఆఁకలివేళ కా♦హారంబు లేనిచోఁ, గ్రుంగ కేనుంగుల♦మ్రింగువారు
వేళకు నీరు ల♦భింపదేని మొయిళ్లఁ, బిడిచి జలంబులఁ♦గుడుచువారు
కొండ లెగురవైచి♦దండంబుతోఁ గొట్టి, యలవున గడిదేఱి♦నట్టివారు
జిల మెత్తెనేని క్రొ♦న్నెలఁ బట్టి తమమేని, దురద వోవంగ రు♦ద్దుకొనువారు
తే॥ శిలలఁ బొడిచి చేశక్తి వీ♦క్షించువారు, చెలఁగి పిడుగులఁబోలె గ♦ర్జించువారు
చక్రశూల దండ ప్రాస♦సాధనముల, హరిహరాంతకగుహుల గె♦ల్పొందువారు.
తే॥ ఒక్క రొక్కరు జగముల♦నోడుచువారు, కలిసిరేని జగంబులఁ♦గలఁచువారు
తిరిగిరేనియు జగములు♦తిరుగుఁదోడ, నడతురేనియు జలధులు♦నడచుఁదోడ. ౭౮౩
తే॥ ఎన్ని మొగుళులు గలవన్ని♦యేన్గులుండు, నెన్ని యేన్గులుండు రథమ్ము♦లన్నియుండు
నెన్ని తేరులో గుఱ్ఱంబు♦లన్నియుండు, నెన్నిగుఱ్ఱాలొ భటసంఖ్య♦యంతయుండు.
తే॥ గజ తురగ సేన మణిగణ♦ఖచిత కనక, భూష ణాలంకృతంబులై♦పొలుపుమీఱుఁ
గాని కై సేయకున్న దొం♦డేనిలేదు, స్యందనములఁ దెల్పఁగ నవ♦సరమె లేదు.

తే॥ ఎత్తుధూళి యాకాశంబు♦నెల్లఁగప్ప, నీరదంబుల నల్పు గా♦న్పింపదయ్యె
కరుల మదజలధారలు♦గలియుకతన, జలధులందలి యుప్పన♦సమసిపోయె. ౮౯౬

ఉ॥ మూలబలంబు నొక్కపరి ♦ పూన్కి వెలార్చెదు కోట వాకిళుల్
పోల జగంబులెల్లఁ దన♦పొట్ట నడంచి యనంతర స్థితిన్
గోశములోలి వెళ్ళఁజుచు ♦ కొండిక యా వటపత్త్రశాయి లీ
లా లసితాస్య పద్ధతిఁ జె ♦ లంగె మహాద్భుతరీతి నత్తఱిన్. ౮౯౭

ఉ॥ ఆచతురంగ సైన్యముల ♦ హావడి సైఁపఁగ లేక శేషుఁడున్
మోచు భరంబు దొడ్డగుడు ♦ మ్రొగ్గెను వానరబృంద మప్డు దృ
గ్గోచరమైన సేనఁ గని ♦ కోయని భీతి నుదిచి వార్ధి వే
లాచల సీమఁ జేరె హల ♦ హాలము గన్న సురాళికై వడిన్. ౮౯౮

తే॥ చక్రవాళ మెల్లగఁ గల♦జలధి తీర, భూమి వదిగాఁగ దుష్కర్మ♦ములును విధియుఁ
గాలుఁడును వేఁటరులుగ నై ♦ త్యాలి మృగమ, యుంబుగా నొకవేఁట య♦య్యవని జరిగె.

ఉ॥ వీరుల సింహనాదములు ♦ వీరణముల్ రథనేమి రావముల్
వారణ ఘీంకృతుల్ తురగ ♦ వారము హేషలు విండ్ల ఘోషలున్
భేరుల భాంకృతుల్ చెలఁగి ♦ భీకరలీల జగ ల్లయంబు వే
ళారవమట్లు పెంపెసఁగెఁ ♦ బ్రాణులు తల్లడమంది కుందఁగన్. ౯౦౦

ఉ॥ ఆయుధ మత్స్యముల్ మద గ ♦ జాయత నక్రము లశ్వవీచికల్
వ్రేయఁగ నూఁదఁగా నఱవ ♦ వెల్వడు ఘోషము కోప దృష్టులన్
ప్రాయపుఁ జొట్టమీలు రథ ♦ రాజి నగంబులు సౌరుమీఱె నై
తేయ గభీర మూల బల ♦ తీవ్ర మహాంబుధి లోక భీతిగన్. ౯౦౧

చ॥ అసురబలంబు వచ్చికల ♦ యట్లను త్రొక్కుటచేత వారణ
ప్రసర మదాంబుపూరమున ♦ బంకగఁ బంకము గాఁగ లంక నె
క్కనముగ బ్రుంగుఁగాని యొన ♦ కంబునఁ బల్వురు నింగిమీఁద నొ
ప్పెసఁగఁ జరెంచుచేఁత నెల ♦ యింపక క్రుంగక నిల్చె నత్తఱిన్. ౯౦౨

—: వేలుపు లసురబలముఁ గాంచి శంకించుట :—

ఉ॥ కాంచిరి వేలుపుల్ ధరణిఁ ♦ గాంచిరి వారిధి మింటి యుచ్చియుం
గాంచిరి దిక్కు లెన్మిదియుఁ ♦ గాంచిరి పెల్లుగ నిండు టెక్కముల్
గాంచిరి యొల్లచోటులను ♦ గాంచరు బీడుగ నున్న కందువన్
గొంచెమయేని భీతిలిరి ♦ కుందిరి కంపము నొంది రుక్కఱన్. ౯౦౩

చ॥ జగములనున్న యెల్లరు ని ♦ శాచర రూపములంది కైదువుల్
మిగులఁగఁ దాల్చి సంగరము ♦ మేకొని వచ్చిరొ? సాగరంబులే

యగణిత రూపధారణము ♦ నంది పితామహు నాజ్ఞచేత నీ
పగిది గదించెనో యని ను ♦ పర్వులు భావనసేసి జంకుచున్. ౯౦౪

ఉ॥ భర్గునిచేరి మేమొదుఁగఁ ♦ బాఱుచు నిల్వఁగఁ జోటులేదయో
నిర్గమనంబు సేయుటకు ♦ నేరము ప్రాణము లింక నుండునే?
స్వర్గమునున్నె? యీభువన ♦ జాలము నిల్వఁగలేదు మాకు నీ
దుర్గతి వీడదేమి? కన ♦ దుర్భరమయ్యెడి నోర్చు టెట్టులో? ౯౦౫

ఉ॥ వేవురు రాము లొక్కటయి ♦ వేయి సమల్ సమరంబు సేసినన్
రావణసేన చావ దొక ♦ రాముఁ డనిం బొనరింప నేమగున్?
వావిరిఁ గాంచినంతఁ దమ ♦ ప్రాణము లెక్కఁగఁ బట్టికొంచుఁ గీ
శావలి పాఱఁగాఁదొడఁగె ♦ నక్కట! తండ్రి! యిఁకేది త్రోవయో!

తే॥ అనుడు శర్వుండు మీఱ రించు♦కైన శంక, నొందఁబనిలేదు వీరల♦నిందఱ విధి
యిటకుఁ దెచ్చె నాశంబు సే♦యించుకొఱకు, నని సమాధానపఱచె న♦య్యమర వరుల.

—: వానరులు మూలబలముఁ గాంచి పాఱుట :—

ఉ॥ పుట్టలనుండి త్రాఁచుల స ♦ మూహము వెల్వడఁగాంచి భీతిమైఁ
దిట్టలు తిట్టలై పరువు ♦ దేఱెడి మూషికరాజికైవడిన్
మిట్టి బలీముఖంబులు త ♦ మిన్ నృపవర్యుల లెక్కసేయ కె
ట్టెట్టులు దోఁచె నట్టటు ల ♦ హీన భయంబునఁ బాఱె నెవ్వడిన్. ౯౦౮

ఉ॥ కొన్ని పయోధిలోఁ బడియెఁ ♦ గొన్ని ప్లవంబుల రోసె సేతువున్
గొన్ని తరించెఁ గందరలఁ ♦ గొన్ని యడంగెను కొన్ని యూఁదెఁ ది
మ్మన్నలు కొన్ని ప్రాఁకులకు ♦ హోవడి దాఁటెను కొన్ని నింగిపైఁ
బన్నుగ నేగెఁ గొన్ని వెసఁ ♦ బాఱఁగలేక యలంగి చేడ్పడెన్. ౯౦౯

ఉ॥ కట్టినసేతువే మనకు ♦ గండము దెచ్చును వెంబడింతు రి
క్కట్టుగ యామినీచరులు ♦ గావున దీనిని త్రెంచిపోద మి
ప్పట్టున నంచుఁ గొన్నియనె ♦ వారలు మింటను కూడ వత్తు రిం
కెట్టని కొన్నిపల్కెఁ గొని ♦ యెల్లెడ నిండిరి సోఁకులే యనన్. ౯౧౦

తే॥ అర్కసుతుఁ డాంజనేయుండు♦నంగదుఁడును, రాము వీడకుండిరి తక్కు♦రాఱువెల్ల
పఱవసాగెఁ బయోధియుఁ♦బల్లటిల్లె, నరసె నంతయు రామభూ♦వరుఁడు కనుల.

సీ॥ ఈగొప్ప కూటువ♦లింతకాలం బెట, నుండె నెప్పుడు వచ్చె♦నొదుఁగుబడిగ
వినిపింపుమని రామ♦విభుఁడు ప్రశ్నింప వి, భీషణుఁ డిట్లను♦ వెరవుతోడ
నన్నిదిక్కులయందు♦నన్నిదీవులయందుఁ, గ్రిందిలోకములందుఁ♦గ్రిక్కిఱించి
నెలకొన్న దానవా♦నీకంబు దూతలు, చని తోడితెచ్చిరీ♦సైన్యమందు

తే॥ ముందువచ్చెడు మూఁకయే♦మూలబలము, వెనుక రాక్షసబృంద మ♦వ్విట లేదు
దుష్కృతము ముందరికిఁ ద్రోవఁ♦దొడరివచ్చె,విధియుఁగాలంబునొనరించు♦ప్రేరణమున.

మ॥ అని నాచిత్తము తెల్పుచున్న దన న ♦ బ్జాక్షుండు చిర్నవ్వుతో
గనలుం గన్నుల కెంపు దోఁపఁ ద్రుటిలోఁ ♦ గ్రవ్యాద సందోహముల్
కను నప్పాటులఁ జూచుచుండుఁడు మత్తే ♦ కార్యంబు చింతింపకుం
డని కీశాలికిఁ దెల్పి తోడుకొని ర ♦ మ్మా యంగదా! నావుడున్ ౯౧౩

మ॥ అతఁడున్ వారలఁ జేరి యో గిరసలా ♦ రా! నిల్చి నాపల్కులన్
శ్రుతులం జేర్పుఁడు వెండి పొండనినఁ గీ ♦ శుల్ కొందఱాలింప న
మ్మతి గాన్పింపక పాఱి రవ్వలకు న ♦ మ్మానించుచుం గొంద ఱే
మతి బోధించెదువాఁడవంచు నిలువన్ ♦ మన్నించుచు న్నవ్వుచున్

ఉ॥ దేనికి జంకిపాఱెదరు ♦ తేఁకువ మీరలు దెల్పుఁడన్న న
మ్మానితుఁ గాంచి వారలును ♦ మన్నఁడ! చూడవొ? సోఁకుమూఁకలన్
బూనికఁ బోరి చచ్చి మఱి ♦ పొందెడి దెయ్యది? యింద్రజిత్తుచే
నైన యవాంత్రముల్ తలఁప ♦ నైనను చాలుదుమేమి చెప్పుమా?

ఉ॥ వెన్నుఁడు గట్టువిల్తుఁడును ♦ వేల్పులు నోడిరి సోఁకుఱేని య
ప్పిన్ననిచేత నాతనికి ♦ వీఁగినవారలె వీరు! వీరలన్
మన్నియ లిద్దఱేఁచి యని ♦ మార్కొని గెల్చెదువార లౌదురే?
తిన్నగఁ జూడుమీ యునుఱు ♦ తీపని మున్విననేమి? యంగదా! ౯౧౬

తే॥ చిలువతాలుపుతోఁ బచ్చ♦వలువతాల్పు, నలువతో నింతికాపుంజు♦గలిసి దురము
సలిపి పెక్కువేలేండ్లొక్క♦పొలసుదిండి, గెలువలేరైరి వీరలా♦గెలుచువారు? ౯౧౮

తే॥ కోఁతిగుంపు లన్నిటి నొక్క♦కూళ యెఱచి, దిండి మ్రింగుటకుం జాల♦కుండు వీరి
కూటువుల నొకప్రొద్దెల్లఁ♦గూడియేని, పలుకువెలఁది మగండేని♦ తెలుపఁగలఁడె?

తే॥ తలలు పది చేతు లిరువది♦కలవు పొలసు, దిండియొకిమీనికని వెఱ♦తివుచుచుండె
నిచటఁ గల మన మగవారి♦ కేమి వేయి, తలలు రెండువేల్చేతులు♦గలవె చెపుమ?

తే॥ కుంభకర్ణుని చేవిల్లు♦కూడియెత్తఁ, జేవ లేకుంటి మాతని♦చేఁత లీవు
నెఱుఁగుదువుకద పసివాఁడ♦విట్లువచ్చి, యుంటి వినుద్రిమ్మరులకంటె♦నోపఁగలమె?

తే॥ హనుమ బలిమియు సుగ్రీవు♦నలవు రామ, లక్ష్మణుల వింటినేర్పు త♦లంచి చూడఁ
దమ్ము తము♦గాచుకొనునంత♦తరముగావు, మనలఁగాచుటెక్కడిమాట? మఱవఁదగును

ఉ॥ రాముఁడె యేలనేమి? మఱి ♦ రావణుఁడేలిననేమి లోకముల్
తాము నశింపకున్నఁగద♦తక్కినవెల్లఁ; భుజించి డాఁగఁగా
భూమిధరంబులందు ఫల ♦ ముల్ జలముల్ గుహలుండె మమ్ము నీ
వేమిటి కింకఁ బిల్చెద వ ♦ హీనగుణాకర! యాజ్ఞ యీఁగదే! ౯౨౨

చ॥ విరవిరవోయి వార లిటు ♦ వేఁడఁగ నంగదుఁ డాలకించి యు
చ్చెరువున జాంబవంతుఁగని ♦ చెల్వుగ నిట్లను సూర్యునొద్ద వ్యా
కరణము నేర్చినట్టిఁడగు ♦ గాడుపుపట్టికి నుద్దియైన నీ
వరయఁగ నిట్టులైన మఱి ♦ యజ్ఞుల సంగతి చెప్పనేటికిఁ ? ౯౨౩

ఉ॥ పన్నగతల్పుఁడే భువన ♦ పావనుఁడౌ రఘురాముఁడంచు మా
కన్నఁగ బోధసేసి వెల ♦ యించితి మున్నిపు డిట్టి మూర్ఖులన్
దిన్నఁగఁ దెల్పి పోఁడిమిని♦దేర్చక భీతిలితేని కీర్తియున్
విన్ననువేమగున్ ? గుదిసి ♦ బీరము మానుట వీరధర్మమే ? ౯౨౪

చ॥ అదరునఁ గీర్తి వోవిడిచి ♦ యూఱడిపాలయి యెందువోయినన్
బ్రదుకఁగనౌనె! కాలుఁ డెదు♦ర న్నిలువన్ ? సుధయంచు నంజుడున్
విదితముగాఁగ నిచ్చినప్ర ♦ వీణుల మాదుము నమ్మియున్న న
ద్విదులను మోనపుచ్చి యని ♦ వీడిన నింతకుఁ జావుమేలుగా! ౯౨౫

తే॥ దేవదానవుల్ చేరి మ ♦ థింపలేని, పాలవెల్లిని చిలికిన ♦ వాలి నొక్క
కోలనేసిన బలము ల♦కోరివలనఁ, గడలిఁ గాల్చుట మఱచితో ? ♦కానవొక్కొ?

చ॥ దనుజ బలంబు లెన్నయిన ♦ ధర్మములేదట ధర్మ మున్న చెం
తనె జయముండు నిశ్చయ మ ♦ ధర్మము ధర్మము నెందుగెల్వ లే
దనుట వినంగలేదొ ? యిది ♦ యా మతిమంతునిరీతి ? పిచ్చివా
నినిబలెఁ బందలం గలిసి ♦ నీవును పాఱుట యుక్తకార్యమే ? ౯౨౬

చ॥ అనుటయు సిగ్గుచే నవన ♦ తాననుఁడై యను జాంబవంతుఁ డీ
వను టుచితంబయైన నిపు ♦ డచ్చటఁజేరిన సోఁకుమూఁకలం
గనుటకునేని యాత్మ ధృతి ♦ గాంచుటకేని పినాకికేనియున్
జనునొకో ? యల్ప వానరుల ♦ సంగతి నెంచఁగ దోసమున్నదే ?

ఉ॥ కాంచితి దేవదానవుల ♦ కయ్యము మాలిని మాల్యవంతు మున్
గాంచితిఁ గాలనేమి మధు ♦ కైటభులన్ గనకాక్షు సోదరుం
గాంచితి హాలహాలమును ♦ కాంచఁగలే దిటువంటివారలన్
మించి యముండునే నధిగ ♦ మించి విరోధము గొన్నె వీరితో ? ౯౨౭

సీ॥ బలముకంటెను వర ♦ బలము గల్గినవారు, మాయల గడిదేఱి ♦ మలయువారు
కడలి యిసుకకంటెఁ♦గడులెక్క గలవారు, కలికంటె నెద చెడ్డ ♦ గలుగువారు
కృతహస్తు లతితరా ♦ కృతులు వీరలఁగన్న, యమరవర్గమె భయ♦మందుచుండ
మనకు దిట్టతనంబు♦మఱివచ్చునేమి ? యి, ట్లున్న నెట్లున్నఁ జా♦వున్ననైన

తే॥ పోరునకు జంకిపాఱుట♦మేరగాదు, యశము తొలఁగును గౌరవ♦మబ్బ దిక్క
మైన నొకమాట శ్రీరాము♦నాననంబు, నెదుట నిల్చుట యెట్లు? మో♦మెత్తుటెట్లు ?

తే॥ భల్లుకేంద్రుఁ డిట్లాడంగ ♦ వజ్రభిన్న, శైలవత్తుండు శ్వేతాద్రి ♦ వ్రాలినట్టి
కారుమబ్బునాఁ దెల్లని ♦ గారు మీఁద, వెలయువజ్రికి మనుమండు ♦ పలికెనిట్లు.

తే॥ జయము నోటమి యెదిరించు ♦ టయును చంపు, టరయ వీరుల కెన్నండు ♦ జరుగునదియ
నిలిచినార లిచ్చటనాదు ♦ పలుకుల విని, కాన మీరలును విమృశ్య ♦ కారులెచుమి.

చ॥ పదరకుఁడీ భయంబు మదిఁ ♦ బాయుఁడి యెల్లర మొక్కటయ్యు నె
య్యాదియు నొనర్పలేము మన ♦ యజ్ఞతలెల్ల క్షమించు రాముఁడే
యెదిరిచి గెల్చెనేని జయ ♦ మేర్తెఱఁ గాంతము కాదయేని పా
యుద మసువుల్ రణంబున ర ♦ ఘూద్వహు తోడనె రండు లెండనన్.

ఉ॥ పాఱినవార మైతిమి య ♦ పప్రథ మోచి జగంబు దూఱఁగాఁ
బాఱిన వారలెల్లరు ని ♦ వర్తిలనిండని భల్లుకేశ్వరుం
దూఱటలాడ నెల్ల కపు ♦ లొయ్యన వచ్చిరి రామచంద్రుఁడున్
దారిన గొప్పసేనఁగని ♦ తమ్ముని మోమును కాంచి యిట్లనున్. ౯౩౪

చ॥ అసురబలంబు లెన్నయిన ♦ నంజిక లేదవి మచ్ఛరాగ్నులన్
దుస తునఁ గాలిపోవునవి ♦ దూదివలెం బనిచేటులేదు నీ
వసమునఁ గాచుచుండుము వ ♦ నాటులనెల్లర నెచ్చరంబునన్
దెసలకుఁ బాఱినారు గద ♦ దిక్కొకయింతయు లేని దీనతన్. ౯౩౫

శా॥ ఈసేనన్ మనమీఁదికంపి యసురా ♦ ధీశుండు వెన్నాటునన్
మోసల్ సేసి ప్లవంగులం దొడరి యే ♦ పుంజూపి వేఁటాడుచో
నీసామర్థ్యము చూపి వానిబలము ♦ న్నిర్చేసి యీసేనలన్
గాసిం బొందఁగనీక కావఁదగు నా ♦ కర్ణింపు మీ ప్రార్థనన్. ౯౩౬

ఉ॥ వీరలఁ గూర్చి నామది త ♦ పించుచునున్నది యెచ్చరింతతో
మారుతితోడఁ గీశకుల ♦ మాన్యునితో సిటనుండుఁ డందు నా
కేరును తోడు లేరనుచు ♦ నెంచి తపించిన మోనమబ్బు నా
శ్వేరము నోటముం గలుగు ♦ వెక్కసమా నన లక్ష్మణుండనున్. ౯౩౭

మ॥ అదియే యుక్తముకాక నీకడన మే ♦ మర్థించి నిల్చున్నచో
నిది రక్షోబల మిద్ది కార్ముకబలం ♦ బిట్లుండెనంచున్ వియ
త్పదులంబోలెను చూచుచుం దమ ధను ♦ ష్పాండిత్యముల్ మెచ్చి మే
లదిరా యంటలు దక్క నీకగు సహా ♦ యత్వంబు వేఱుండునే? ౯౩౮

సీ॥ అనిపల్కి సౌమిత్రి ♦ యటనుండిలేవ మా, రుతివచ్చి జానకీ ♦ పతికి మ్రొక్కి
యానీచవానరు ♦ నెగ్గాడ కీభుజ, ములమీఁదఁ గూర్చుండి ♦ కలనుసేఁత
యుక్తంబు; కాఁజేసి ♦ యొగివెన్క నిల్చిన, నాసేవ ఫలియించు ♦ వాసి ననుదు
నీకసాధ్యంబయి ♦ లోకసాధ్యంబైన, పనియొండు గలుగునే ♦ పవనపుత్ర!

తే॥ రావణుఁడు దాపునకు వచ్చి♦రణముచేసె, నేని యూర్మిళావిభునకు♦నీవుతోడు
పడకయున్న విజయమెట్లు♦పడయఁగలము? వనచరుల నెట్లు దక్కించు♦కొనఁగఁగలము?

తే॥ ఇంద్రజిత్తుపైకి లక్ష్మణు♦నెచ్చరించి, పంపినదియు నీతోడనే♦వాని నతఁడు
గెలిచినదియుఁ నీవల్లనే♦గెలువవలసి, యున్నదింకను తోడు నీ♦వున్నకతన. ౯౪౦

మ॥ అతులోత్సాహముతో స్వధర్మముగ సౌ ♦ ఖ్యంబుల్ విసర్జించి న
మ్మతి నాతోడనవచ్చు లక్ష్మణుని ప్రే ♦ మంగాచి సుగ్రీవు సం
గతి నీవుండి చరాచరప్రతతి దుగి ♦ ఖంబుల్ తొలంగించి స
న్మతి ధర్మంబును నిల్పుమా యని రఘు ♦ క్ష్మావల్లభుం డవ్వలన్. ౯౪౧

మ॥ నీవును తమ్ముతో నిలిచి ♦ నిర్జగవైరు లొనర్చు నీచ మా
యావిధులెల్ల నారసి ర ♦ యంబునఁ దెల్పకయున్న సాగునే?
రావణమర్దనంబు సమ ♦ రంబున నీవకదా విభీషణా!
భావి శుభప్రవృత్తి కిల ♦ బంధుర శక్తియు జీవగఱ్ఱయున్. ౯౪౨

తే॥ అనిన రాముని వాక్యంబు♦లాదరించి, పావనియు విభీషణుఁడు సు♦గ్రీవుఁ డధిక
మోదమంది వానరసైన్య♦ములను కావ, సమ్మతించిరి చనిరి ల♦క్ష్మణునితోడ.

మ॥ దనుజధ్వంసి నమస్క్రియల్ సలిపి కో ♦ దండమ్ము చేసంది శిం
జిని నెక్కించి విశాల వక్షమున ర ♦ క్షీభూతమౌ కంకటం
బును లీలన్ ధరియించి యక్షయ శర ♦ ప్రోద్దీప్త తూణీరమున్
వెనుకం దాల్చి రణాగ్రమందు నిలిచెన్ ♦ విక్రాంతి గంభీరుఁడై. ౯౪౪

ఆ॥ నూఱుయోజనముల♦దూరంబు నిండిన, సేన ముందు నిలుచు♦మానిమీఁద
నసురసేనవైచు♦నాయుధ వితతు లా, కసముగప్ప సురలు ♦ కాంచి భీతి. ౯౪౫

శా॥ రామా! భక్తభయాపహారక తను ♦ త్రాణంబ! నీలాంబుద
శ్యామా! రాక్షసభీమ! ధార్మిక జగ ♦ త్సంస్థాపనా! నీవు గా
కీమానంబగు దైత్యసేన కెదురై ♦ యెవ్వాఁడు నిల్వంగ ని
చ్ఛామోదంబున నోపు? మాహృదయ వాం ♦ ఛాపూర్తి గావింపవే!

మ॥ అని ప్రార్థింపఁగ మానులున్ సకల ధ ♦ ర్మాచార సంపన్నులున్
దనుజాధిక్యము రాము నొంటియు మహా♦దైన్యంబుతోఁ గాంచుచున్
గనులన్ బాష్పము లొడ్డుచున్ మనము వై♦క్లబ్యంబు నొందంగ రా
మునకున్ మంగళ మబ్బుఁగాతమని ప్రా ♦ ర్థింపఁగన్. ౯౪౭

తే॥ తక్క సిద్ధసాధ్యాదులు♦దాశరథికి, విజయమగుఁగాత దైత్యాలి♦విఱుగుఁగాత
నేఁటితోడఁ బాపమ్ములు♦నీఁగుఁగాత, మనిరి దనుజవీరులు కాంచి♦యచ్చెరువున.

చ॥ నిలుకడ తప్పి వానరులు ♦ నిల్వక పాఱిన శత్రుసేనలో
నిలిచి శరాసనంబుగొని ♦ నిశ్చలుఁడై మనమీఁది కెక్కటిన్

గెలువఁగ నెంచిరాక తన ♦ గెల్పునకంటెను దొడ్డకాదె? యి
ట్టులమున గ మాల్యవంతుఁడు వి♦డంబన సేయునె? బొంకులాడునే? ౯౪౯

మ॥ మును దేవాలి పురారితో రథికులై ♦ మున్నాడిరాఁ దార్క్ష్యుపై
మన సద్వంశవినాశకుండయిన య ♦ మ్మాయావి వైకుంఠుఁడున్
ఘనుఁడై వచ్చి యెదిర్చె; వీఁడొక ధను ♦ ష్కాండంబుతోఁ గాల్నడన్
మనపై నెత్తెఁ జలంబు సాహసము సా ♦ మర్థ్యంబు మెచ్చోఁగదా!

మ॥ హరులున్ దేరులు గొరులున్ శరభ సిం ♦ హవ్రాతముల్ క్షుబ్ధ సా
గర సంకాశములై యెలర్పఁ గనుచున్ ♦ గౌతూహల స్వాంతుఁడై
త్వరితోత్కంఠత రండురండనుచు నా ♦ హ్వానించుచున్నాఁడుగా!
ధర నిల్లివ్వఁడు నిల్చి పిల్చి మరలెన్ ♦ దర్పించి ప్రాణాలతో. ౯౫౧

—: శ్రీరాముఁడు రాక్షస బలముల నుఱుమాడుట :—

మ॥ అనిగర్జించు చఖర్వ గర్వమునఁ గు ♦ ప్యద్ఘోర సింహంబు వా
రణ యూథంబులు చుట్టినట్లు బలద ♦ ర్పభ్రాంతులై రాక్షసుల్
తను ముట్టంగని మేలుమేలనుచుఁ గో ♦ దండంబునన్ శింజినీ
నినదంబుం బరఁగించె రాముఁడు లస ♦ న్నిర్ఘాత ఘోషప్రక్రియన్. ౯౫౨

శా॥ మాఱెన్ సాగర ధారలొక్క మొగి న ♦ మ్మాతంగ యూథంబులన్
దాఱెన్ వేగము వారువంబులకుఁ గ్రో ♦ ధంబుల్ దిగంబాఱఁగాఁ
దీఱెన్ వీరుల శౌర్యధైర్యములు భీ ♦ తిం భ్రాంతి నిండారుటన్
మీఱెన్ దాహము నోళులెండె మనముల్ ♦ మేంౘ్రడించె దైత్యాలికిన్.

చ॥ తురగ పిశాచ సింహములు ♦ దుర్భ్రమచే నడ తారుమాఱుగాఁ
బరుగులువాఱె తేరులను ♦ పాడుగఁ గూల్చె మతంగజంబులున్
వెఱగొని మావటీంద్రఁ దమ ♦ భీకర హస్తముతోడ నీడ్చి యు
ర్వరఁ గొని మోఁది యిచ్చవడిఁ ♦ బాఱెను క్షోభము పుట్టె సేనలో.

చ॥ ఖచరులు దుర్నిమిత్తములఁ ♦ గాంచి నిశాచర నాశ సూచక
ప్రచరములంచు నంతసిలి ♦ పాడిరి యాడిరి క్రూరరాక్షసుల్
విచలితులయ్యె రోషమున ♦ వీఁగక పైకొన రామభద్రుఁడున్
గుచరులమీఁద బాణముల ♦ గుప్పెను లెక్కకు మిక్కుటంబుగన్. ౯౫౫

సీ॥ హరులపైఁ గరులపై ♦ శరభ సింహములపై, వీరులపై వారి ♦ తేరులపయి
శిరములపై శరా ♦ సనములపై భట, శిరములపై వారి ♦ యురములపయిఁ
గరములపైఁ బరం♦పరలుగా శరములు, గురియింప నురలెను♦కుంజరములు
దొరలెను వీరుల ♦ శిరముల కరణిని, తురగోత్కరంబులు ♦ దురమునందు

తే॥ విఱిగి యఱిముఱిమైపడు ♦ విండ్లవలెనె, సిడములునుపొడిపొడి యయి ♦ పుడమిఁబడియె
చంద్రరేఖలవలె నిశా ♦ చరుల కోఱ, దంతములు పలపలరాలి ♦ ధరణిఁగూలె.

సీ॥ నుడిగాలితో జడి ♦ వడిమైన చండాస, రామ నిశాత మా ♦ ర్గణము లొలయఁ
దుంగ మాతంగ తు ♦ రంగ శతాంగ భ, టాంగ సంఘంబులు ♦ త్రుంగి పడియె
నోష్ఠంబు గొఱుకుచు ♦ నుండు దంతంబులు, కోపంపుఁ జూపులఁ ♦ గొఱలు కనులు
కరవాలు వీడని ♦ కరములు గర్జిల్లు, మూర్ధముల్ పరుగిడు ♦ మొండెములును

తే॥ పాఱు రక్తప్రవాహముల్ ♦ మీఱితునిఁగి, పడెడి యవయంబులతోడఁ ♦ బ్రధనభూమి
చూడ బీభత్సమయ్యె ర ♦ క్షోగణముల, యాయుధము లొక పనియేని ♦ చేయవయ్యె.

సీ॥ అమ్ములతోఁ గార్ము ♦ కమ్ములు తెగుమున్నె, కత్తులూనిన కేలు ♦ కత్తిరిల్లఁ
గేలకు మున్నగాఁ ♦ గాళులు తెగుచుండ, నొకటిపై నూఱు సా ♦ యకము లరుగఁ
దురగంబులకు మున్న ♦ ఖురములు తెగుచుండు, ఖురములతోడఁ జ ♦ క్షువులు పోవుఁ
జక్షువులకు మున్న ♦ వక్షముల్ వ్రీలును, వక్షాలతోఁ జీలు ♦ వదనములును

తే॥ తప్పిపాఱినదొక్క త ♦ త్తడియు లేదు, శ్వాసమార్చుటకేని రా ♦ క్షసుల కెడము
లేమిఁదబ్బిబ్బులై వారు ♦ రాము నొంచు, వెరవు దొరకక యూరక ♦ యురలుచుండ్రి.

సీ॥ చనఁ దలఁపకమున్నె ♦ చచ్చి పడుచునున్న, శవ నివహము దాఁటి ♦ చనఁగలేక
చన్న వేలకువేలు ♦ శరములు తాఁకనో, క్కరథంబు నూఱు ము ♦ క్కలుగ విఱుగు
నంబకంబులు పంచి ♦ యనరు లంటఁగ మున్న, చచ్చినపోల్కి గ ♦ జంబు లురలు
నెనిమిది దిక్కుల ♦ నెనసి యొక్కమ్మడిఁ, బమ్మిన వీరులా ♦ వలికిఁ బోరు

తే॥ అరదములు బార దూరంబు ♦ నరుగలేదు, వారణంబు లూరక వ్రాలి ♦ వసుధఁగూలె
తురగసంఘంబులును పని ♦ తోఁచ కుడిగె, భటులు బలిమైరి మిత్తికి ♦ బరువు తగ్గి.

మ॥ జలజాక్షుం డొకయస్త్రమేయ శతమై ♦ సాహస్రమై నూఱు కో
టుల ప్రాణంబులఁ దీయునన్న నుడి నాఁ ♦ డు న్నేఁడు సత్యంబుగాఁ
గలనం జచ్చినవారి నెంచి విధి లె ♦ క్కల్ తప్పు గావించెఁ బ్రా
ణులఁ గొంపోయెడి కాలుఁడెంతపడెనో? ♦ నో వెంత దానొందెనో? ౯౬౦

శా॥ నీరంధ్రక్రియ వారిదాఘు విగళ ♦ న్నిర్ఘాత సందోహముల్
జాఱం గాలు నరణ్యలీల శర సం ♦ జాతానల జ్వాలలన్
సారంగంబులపై శతాంగములపై ♦ జాల్వారు టెక్కంబు లే
దారింబోయెనొ? బూదియై శ్వసనుఁ డు ♦ ద్దండించి కొంపోవఁగన్.

చ॥ తునిఁగిన శూల కుంత శర ♦ తోమర సంఘము తూపుత్రోపుచే
వననిధిఁ జొచ్చి చుట్టును ర ♦ వంబునఁ ద్రావఁగ నీరు వట్టి జే
వనచరరాశి చచ్చె నట ♦ వండలిగట్టి పయోధి యెండఁగన్
వనజ హితాన్వయప్రభు న ♦ వారణ బాణ జవంబు నేమనన్? ౯౬౧

చ॥ అరి మద భంజనుం డయిన ♦ యర్కకులేశు నిశాత సాయకో
త్కరము పురత్రయంబు వడి ♦ దాహ మొనర్చిన వైష్ణవాస్త్రముల్
కరణిని పోయి దానవ ని ♦ కాయ శిరగీ పద హస్త సంఘముల్
జెఱచుచుఁ జూడఁజేసినది ♦ సుందర హేమ శతాంగపాళితో. ౯౬౩

చ॥ ద్విరదచయంబుమీఁది భట ♦ తీవ్రతరాయుధ శస్త్ర హస్తముల్
ధరణిని వ్రాఁచుఁబాముల వి ♦ ధంబునఁ గూలుచుఁ ద్రుళ్లె నోష్ఠముం
గఱచిన శీర్షవర్షము ల ♦ కాండ పయోద హుతాశనాశనుల్
పఱచిన తీరుగాఁ బడియె ♦ భాస్కరవంశ్యు శరాసనోద్ధతిన్. ౯౬౪

చ॥ విలయ పయోదముల్ గురియఁ♦జేర్చిన వారిధియట్లు సంగర
స్థలము రహింప రక్తమునఁ ♦ దాఱెను తేరులు మావటీఁడ్రతోఁ
బోలుచు మతంగజంబులును ♦ ప్రూఁడెఁ బదాతిచయంబు ప్రూఁడెఁ దే
జులు పడి ప్రూఁడెఁ గొన్నినుడి ♦ చుట్టి భ్రమించెను దిక్కుఁదోఁపమిన్.

క॥ తెగి పైకెగిరిన శిరములు, తగులు ననెడి భీతి సురలు ♦ తలఁగిరి ధరకున్
దిగుతలలు శిలలపోలికఁ, దగులుననుచు భూజనములు ♦ తాఁటిరి దెసలన్. ౯౬౬

చ॥ ప్రళయ పయోదధారల తె ♦ ఱంగున రామ శరాళి పర్వ నా
కలఁకునఁ ద్రెవ్వు హస్తములు ♦ వ్రాఁగిన కన్నులతోడ ఖేచరా
వళిఁగని మేఘమాలికల ♦ భంగిని నింగిని నిండుచున్ మహా
నిల హతిచే విమానములు ♦ నేలను కూలు విధంబునం బడున్. ౯౬౭

సీ॥ కొందఱు దివ్యాస్త్ర ♦ బృందంబుఁ గొందఱు, గదలను గొందఱు ♦ ఖడ్గములను
గొందఱు ప్రాసముల్ ♦ కొందఱు తోమరాల్, కొందఱు ముద్గరాల్ ♦ కూడివైవఁ
గొందఱు తాఁకిరి ♦ కొందఱు దుమికిరి, కొందఱు తిట్టిరి ♦ కొట్టినారు
కొందఱు పొడిచిరి ♦ కొందఱు విడిచిరి, కొందఱు విసరిరి ♦ కొంద ఱుగ్ర

తే॥ దృష్టిఁ జూచిరి కొందఱు ♦ తెరలినారు, కొంద ఱార్చిరి డాఁగిరి ♦ కొంద ఱుర్కఁ
గ్రమ్ము కారుమబ్బులవలెఁ ♦ గ్రమ్మి తుదకుఁ, బడిరి సమరస్థలము బట్ట ♦ బయలుగాఁగ.

సీ॥ ఏసిన వేసిన ♦ యెత్తిన పట్టిన, యాయుధముల రామ ♦ సాయకములు
విఱుచుచుఁ బైపయి ♦ బెరసి గజావలి, నురలఁద్రోచు గుఱ్ఱాల ♦ దోరలఁదాఁచు
శిరములగోయును ♦ శరములఁద్రోయును, విండ్లువిఱుచు మేలు ♦ గండ్లు పఱుచుఁ
గవచముల్ భేదించుఁ ♦ గరముల ఛేదించు, స్థైర్యంబుఁ బోకార్చు ♦ శ్రమముఁగూర్చు

తే॥ బలముఁదోలఁగించుశిలలను ♦ నలఁగ దంచుఁ, దరువులంద్రుంచు వైచిన ♦ గిరులఁద్రెంచు
అహహ! యేమందు రాఘవు ♦ నస్త్రలీల, బట్టబయలయ్యె రాక్షస ♦ ప్రధనభూమి.

లయగ్రాహి॥
కాలు తెగి కేలు తెగి♦వ్రేలు తెగి వాలు తెగి♦మేలు తెగి రాక్షస క♦రాలి తెగిపోవన్
గూలెఁ గరితండములు♦వ్రాలె ఖురసంఘములు♦తూలె భటబృందములు♦వ్రీలె రథపాళుల్
వేఁడిగోలఁ దిరన్ విశిఖ♦జాలములు తక్కుఁగల♦కీలలెగఁజిమ్మెడి క♦రాళ పరిఘాదుల్
లీల నొకకేల ఘన♦ఖేల గొనునోలి బల♦శాలి వనమాలి తన♦కోలలఁ గవించెన్.

తే॥ లెక్కలేని దోషాచరు♦లొక్కపెట్ట, నొక్క నరుపైన శరవృష్టి♦మిక్కుటముగఁ
గురిసి రామబాణములచేఁ♦గొండలట్లు, దొరలి పొరలిరి దురమున♦శిరములూడ.

తే॥ వేయికరుల చేవగలదై♦తేయుల కొక, శరమువంతున శ్రీరామ♦చంద్రుఁడేసె
రక్తవాహినిఁ గూలి తీ♦రములఁజేర, లేక పెక్కునుఁగులు వార్ధి♦లీనమయ్యె.

తే॥ తెగునుకొండలు వలయముల్♦తెగును గదలు, విఱుగుఁ గుంతముల్ దంతముల్♦విఱుగుఁ గరులు
హరులుఁ దేరులు విఱుగు క్ష♦ణార్ధమందు, రామబాణ మొకొంటిచే♦రణమునందు.

తే॥ జగము లేకకాలంబునఁ♦జంపఁజాలు, జముఁడు మంత్రులు దూతలు♦చరణయుగము
గలుగువారొటఁ బరుగిడి♦యలసినారు, పొలియు నసురుల యసుఖుల♦మోవలేక.

ఉ॥ కుప్పలు కుప్పలై కలనఁ♦గూలిన దంతులు తేరు లశ్వముల్
తిప్పలు తిప్పలై పెరిఁగి♦దివ్యులమార్గము నంటుచుండినన్
దెప్పెఱినట్టు లట్టలొగిఁ♦దేలి నటింపఁగఁ జచ్చుపీనుఁగుల్
తెప్పునఁ బ్రాణమొందెనని♦దిగ్భ్రమఁబొఱెను జీవసంఘముల్. ౯౭౫

ఉ॥ నల్లనిభానుఁబోలి కిర♦ణంబులు చిందెడు రాఘవుండు పైఁ
జల్లినయట్లు రక్తకణ♦జాలము పర్వ యుగాంతవేళ భా
సిల్లెడు భానుమూర్తియనఁ♦జిందిన శాత్రవరక్తమందు రం
జిల్ల మునింగి లేచు ముని♦సేవ్యుని భార్గవుఁబోలె శోభిలెన్. ౯౭౬

ఉ॥ చిచ్చుఱపిడ్గులట్టి రఘు♦శేఖరు తూపులు క్రమ్మ మస్తముల్
వ్రచ్చి నశించుచుండఁ దమ♦వారలు చచ్చుట చూడలేక వి
వ్వచ్చము నోర్చి యుత్సుకత♦వ్రాల్చక మూఁగిన సోఁకుమూఁకలున్
గ్రచ్చుఱ నీఁగలట్లయిరి♦రాముఁడు కల్లునుపోలె నయ్యెడన్. ౯౭౭

ఉ॥ క్రమ్మిన దానవావళుల♦కంఠములం దెగనేసి వ్యోమ మం
దమ్ముల యాటలాడెఁ దగ♦నచ్చునగండ్లను గ్రచ్చకాయలన్
జిమ్మెడిలీల శీర్షములఁ♦జిమ్ముచు నస్త్రవిధాన నైపుణిన్
బమ్మిన తేరులం గరుల♦భగ్నమొనర్చెను నుగ్గునుగ్గుగన్. ౯౭౮

చ॥ పలువురుప్రాణముల్ విడిరి ♦ పల్వురు పాఱిరి నూటి తప్పఁగాఁ
బలువురు దాఁటుచుం బొరలి ♦ బన్నము నొందిరి కుంది కంది లోఁ
గలఁగిరి మండి మాఁడిరి పొ♦కాలిరి నిక్కిరి ప్రక్కి రాంత్రముల్
వలనుగఁ జెక్కి రేడిచిరి ♦ వంది రెదిర్చిరి పోరి చచ్చిరిన్. ౯౭౯

తే॥ కవచ కుండల కేయూర♦కటక మకుట, కంఠికా హారవితతులు♦కలనఁ దునిఁగి
దొరలు వారిమేనులనుండి♦త్రుంగి యురలి, మొగులు గములందు మించుల♦పగిదిమెఱసె.

సీ॥ వెనుకనున్నాఁడు ముం♦దున నున్న వాఁడొగి, వదనమందున్నాఁడు♦హృదినిగలఁడు
తలలపై నున్నాఁడు♦మలలపై నున్నాఁడు, కెలఁకుల నున్నాఁడు♦క్రిందఁగలఁడు
మింటిపై నున్నాఁడు♦మంటిపై నున్నాఁడు, కత్తుల నున్నాఁడు♦కరులమీఁద
ఖురువులమీఁదను♦తరువుల మీఁద స్యం, దనములమీఁద నం♦తటను గలఁడు

తే॥ నాయెదుట నాయెదుట నిల్చి♦నాఁడు నీదు, కనులనున్నాఁడు కోదండ♦కరుఁడటంచు
కలఁకుసోఁకులె భ్రమసి వా♦చఱచునట్లు, మించి యెల్లయెడల సంచ♦రించె నతఁడు.

చ॥ జలధులయందు లోకముల ♦ శత్రు సమూహములందు పెక్కు మా
యలఁగొని కామరూపముల ♦ నందు నిశాచరరాజి చింతనం
బుల నెదలందు వెల్పలను ♦ పొల్పుగ నిల్చినవాఁడు మెల్పునన్
బళిబళియంచుఁ బల్కఁదగు ♦ పద్ధతినొప్పెను రాముఁ డెల్లెడన్. ౯౮౧

శా॥ నానానూన విధాన చారముల వి ♦ న్నాణంబుతో నుండె నీ
భూనాథుండను బుద్ధిలేక మఱుఁగై ♦ పోయెంగదాయంచు వి
జ్ఞానానంద మయాత్ముఁడై మఱచెఁ గ ♦ ర్జంబంచు గీర్వాణు ల
జ్ఞానావస్థ భజించి దిగ్భ్రమల నా ♦ శంకించి రప్పట్టునన్. ౯౮౩

క॥ చండానిల వేగంబున, ఖండిత తరుకాండమట్లు ♦ కర్బుర గణముల్
తుండములై దెసలం బడ, భండనమునఁ దిరిగె రామ ♦ భద్రుఁడు పెలుచన్.

క॥ హరులు కరులు వీరభటులు, నరదంబులు గిరులఁబోలె ♦ నవనిం బెరుఁగన్
గిరినుండి గిరికి దాఁటెడు, కరణిం దిరుగంగవలసెఁ ♦ గాకుత్స్థుఁ డటన్ ౯౮౬

క॥ అంబరమంటెడు ధ్వజ చీ, నాంబరములతోడ గొప్ప ♦ యంబారులతో
డం బూఁడి మునిఁగె గురు ర, క్తాంబుధిలోఁ గరి ఘటలు ప్ల ♦ వావలి కరణిన్.

క॥ తెగిన సురారుల శిరములు, నెగసి మరలఁ బుడమిఁ బడెడి ♦ నియతిం జూడన్
దగ విజయులక్ష్మి చేకొని, యెగురవయుచు జలజ వితతి♦కెనయై యుండెన్. ౯౮౭

క॥ వాలమ్ములఁ గరములతో, వాలమ్ములు గగము విఱిగె ♦ వాలెమ్మిగ జీ
వా లమ్ములుకుల కెరయై, వాలమ్ములఁ బోలు ♦ దైత్యవర్గము నమసెన్. ౯౮౮

క॥ ఖేటకములు తునిఁగిపడెన్, ఘోటకముల తలలతోడఁ ♦ గూఁటువ లగుచున్
బూటకములు కిమ్మయి చను, హాటక కోటీర మస్త ♦ కావలితోడన్. ౯౮౯

క॥ క్రూరుల దంష్ట్రిలు తెగి తమ, గోరుల మేనులను చొచ్చి ♦ కోరుమొగులునం
దూఱ లసద్భాల శశిం, గేరు లలిని తోఁచెఁ జూచు ♦ గీర్వాణులకున్. ౯౯౦
క॥ అక్కుటిలుల పెనుకోఱలు, మిక్కుటమగు కరి రదములు ♦ మేదిని నిండన్
జెక్కురు కల్పంబులఁ గల, పెక్కురు నెల లోకటఁ జేరు♦పేరిమినొప్పెన్. ౯౯౧
క॥ అసురుల తనుగిరులందున, విసరముగాఁ బొడమి దెసల ♦ విరిసిన రక్త
ప్రసరమున నచటి జనములు, పసరములును చనియె నెక్కి ♦ పర్వతములకున్.
క॥ నిండె దివి జీవతతిచే, నిండెం భువి దానవ శవ ♦ నివహముచేతన్
నిండె శరధి రక్తముచే, నిండె సురల కనులు రామ ♦ నిపుణత్వముచే. ౯౯౩
క॥ కయిదువులు రక్త నదముల, పయి వడివడిఁబోయి బహుళ ♦ వనచర వితతిన్
బయి దవిలి నరగఁ ద్రుంపఁగఁ, జెయిదంబులు తెఱఁగ విఱిగి♦చేడ్పడి చచ్చెన్.
మ॥ బలహీనుండగు నొక్కమానవుఁడు పై ♦ పైఁ బేర్చి దోషాచరా
వలి కావించిన వ్యూహముం జెఱచి త ♦ త్పాండిత్యముం జూపి దై
త్యుల ఖండింపఁగఁ బండ్లు గీఁటుచును వ్య ♦ ర్థంబోలె నిట్లుండుటా?
యలుచుం జంపెదనంచు వహ్ని కడు రో ♦ షాయత్తుఁడై లేచుచున్.

—: వహ్ని దానవసేనలఁ బ్రోత్సహించుట :—

చ॥ ములుకులు వచ్చి పైఁబడక ♦ మున్నె నిశాచరు లంద ఱొక్కపై
యలుగుఁలపాటు నొంద కొగి ♦ నాతనిపైఁ బడ నల్గి చావఁడే?
జలధులపోల్కిఁ గానఁబడి ♦ చప్పిడి చేఁతలఁ జేయుచుందురే?
మలకలు మాని పైఁబడుఁడు ♦ ప్రాల్పుఁడు లెండని ప్రోత్సహింపఁగన్.
పంచచా॥ చలంబుతోడఁ గర్బురుల్ వి ♦ చారదూరులై వెసన్
బలంబు చూపి యొక్కకొండ ♦ పైని పెక్కు మేఘముల్
జలంబు చిందు భాతి నైక ♦ సాయకంబు లేసి తా
వలంబు తూలఁ దర్జనంబు ♦ భర్జనంబు సేయఁగన్ ౯౯౭
ఉ॥ జివ్వున రామబాణములు ♦ రేఁగుచు శీర్షము లెన్నొ చెందుచున్
ద్రెవ్వగఁజేయ రాక్షసులు ♦ తీఱిరి కూలిరి చాఁపకట్టుగా
నువ్వున నాడిపాడెను మ ♦ హోద్ధతి నార్చెఁ బిశాచ సంఘముల్
కవ్వున నోటిలోఁ గొఱవి ♦ కట్టలు నావల దివ్వెలట్లుగాన్. ౯౯౮
తే॥ రక్తపంకిల వార్ధి వ ♦ స్త్రముగఁ దాల్చి, రక్తచందన మలఁది ధ♦రా పురంధ్రి
పెద్దపెండ్లిఁ జూడఁగ వచ్చు♦పేరఁటాలి, కరణి నొప్పారె నారణ♦స్థలమున.
తే॥ ఘృత సురాక్షీర దధి లవ♦ణేక్షు శుద్ధ, వననిధులు రక్తమయమయి♦పరఁగు కతన
సప్తవారిధులను పేరు♦జాఱవిడి, యొక్క రక్త తోయధి యన ♦ నొప్పె నపుడు.

క॥ తోడుగుట యొకపరియైనను, వెడలు శిలీముఖము లెన్న♦వేలకు వేలె
ప్పుడు వధము పూర్తియగు న, ప్పుడు లేనెలఁబోలు విల్లు♦పొడవయి నిలుచున్

సీ॥ ఎత్తినవారలు♦నేసిన వారు గ, ర్జించిన వా రెది ♦ రించువారు
వడిగొను వా రోడి♦పాఱినవారు కో, పించినవారు మ♦దించు వారు
తొడరిరి యడరిరి♦తొడఁకిరి వడఁకిరి, మడఁగిరి బెడిసిరి♦మడిసినారు
చూడ్కులు మనసులు♦చూడ నూహింపఁగఁ, దగిన యంతటి సమ♦ర్థములు కావు
తే॥తొడిగినవి వేయియులుగులు♦వడిగఁబోయి, చంపుటయొసహస్రముకాదు♦శతసహస్ర
మట్టిదే వడి యుద్దేశ♦మట్టిదె యగు, దానవ శరాళి తము గావ♦లేనివయ్యె.

సీ॥ ముందుభాగమ్మును♦ మొగమును రెండు ప, క్షములును పృష్ఠమ♦ధ్యములు గలుగు
ఘనశరవ్యూహమ్ము♦కాకుత్స్థకులజుండు, సూదియుఁ జొరలేని♦చొప్పు పన్ని
నాయమ్ము లొగినేగి♦యాయమ్ములం గ్రుచ్చు, వలఁకుల దుస్సి య♦వ్వలికి నేగు
నాయమ్ములకుగుఱి♦యైనరక్కసులు చ, చ్చుటగాక యెదిరి గె♦ల్చుటయుఁగలదె?
తే॥ విలయకాలానలముఁబోలి♦యలుఁగు లడర, నెండుటడవులఁ బోలిరి♦యొడ్డె యసుర
వరులు; రామబాణములు వా♦గురనుపోల, దనుజగణములు తగులు మ♦త్స్యములఁబోలె.

తే॥ చండ మారుత మట్లు దా♦శరథి యొప్పఁ, జెదరు మలలకైవడి శుక్ర♦శిష్యు లుండ్రి
విలయ కాలసాగరమట్లు♦వీర రామ, భద్రుఁడుండఁ బ్రాణులఁ బోలి♦వారలుండ్రి

మ॥ మొదలై సృష్టియొనర్చి మధ్యమగుచున్ ♦ బోషించి యంతంబునై
తుది గావించు పరాత్పరుండు దనుజ ♦ స్తోమంబుకై కల్పమై
పొదలన్ దారు చరాచరంబుల విధం ♦ బుం బొందె రా రాఘవుం
డుదధి ప్రోత్థ విషంబు గాఁ జనిరి మ♦త్స్యౌఘంబుగా రాక్షసుల్ ౧౦౦౫

ఉ॥ వంచనఁ గూటసాక్ష్యము స ♦ భం బలుకాడి ధనంబు గూర్చు నా
కుంచిత నీతివర్తనుని ♦ కుంఠిత వంశముఁ బోల రాక్షసుల్
ప్రాంచిత ధర్మముం జెనసె ♦ రాముఁడు; తాను విషాంబువై చనన్
గ్రంచర దాని క్షామమునఁ ♦ ద్రావిన బీదలయ్యెరి దానవుల్. ౧౦౦౬

చ॥ ఒక శతవాహినుల్ మునిగి ♦ యున్నతఱిన్ జలరాశి లంకయున్
సకలము నొక్కటై సమ ర ♦ సంబుగఁ గన్పడ దానవాంగనల్
కకవికనొంది యేదియును ♦ కానక చిత్త కలంకమొంది కా
ళ్లు కుదియ నెట్లుపోక దిగు♦లుం గొని కూలిరి మున్గి రందులన్. ౧౦౦౭

తే॥ డాసిన సురారు లసువులఁ♦బాసినారు, కుప్పలై నింగి నంటెను♦కుణప చయము
ఎదిరి నెత్తుకు పోలేక♦యొదురు తిరిగె, వెనుకనున్న సైన్యంబు ముం♦దునకువచ్చె.

క॥ లేఁచిరి కరి శరభాదుల, పేచిరి తోమర గదాది ♦వివిధాయుధముల్
త్రోచిరి సేనల ముందున, కేచిరి ప్రాణంబు తీసి♦యెఱుఁగక వారల్

ఆ॥ రండిరండి మీరు వ♦రంబుల బలములఁ, దెండితెండి తెచ్చి ♦ యిండియిండి
నాశరముల కనుచు♦దాశరథి వచించి, పేర్చి శితశరంబు♦లేర్చి యేసె. ౧౧౧౦

చ॥ తమతమ సేన లవ్వలికిఁ ♦ దారఁగనీయక సైన్యనాథులే
తమకముతోడ నడ్డుపడి ♦ తార్చుచుఁ జచ్చినవారి దాఁటుచున్
దుముల రణంబుకై యతిమి ♦ త్రోయుట డాయుట గాంచి నిర్జరుల్
కమిలి త్రినేత్రుఁగాంచి మొద ♦ కూరిమితో వచియించి రివ్విధిన్. ౧౧౧౧

ఉ॥ రాణువలోన నొక్కొకరు ♦ రావణుకంటెను ముమ్మడుంగు వి
న్నాణులు వారిలెక్క గణ ♦ నంబునకందదు వంచి మించుచున్
జాణతనాన డాసి రిఁక ♦ జానకినాథుఁడొ యొక్కరుండు మా
షోణిమి మాల్చినట్టి బల ♦ పూర్ణులు దానవు లేమి మూఁడునో ? ౧౧౧౨

ఉ॥ రాఘవుఁ డేయునట్టి ప్రద ♦ రమ్ముల నంతరమంద త్రుంచుచున్
మేఘము లట్లు క్రమ్ముకొని ♦ మించిరి ముంచిరి వీరలన్ మహా
మోఘముగా శపించి యను ♦ పుంజము తీసినఁ దీయవచ్చు బా
ణౌఘముచే జయింపఁ దర ♦ మా మముబోఁటికి మీకుఁ దక్కఁగన్ ?

చ॥ అని వచియింప శూలి భయ ♦ మందకుఁడయ్య సురారు లెందఱై
న నగిని దూదిఁగాల్చు వయి ♦ నంబున రామ శరాగ్ని కాల్చు నే
మనుపె వచింపనే ? యమృత ♦ మున్ గరళం బపపాడి చక్కటిన్
గొనకొని గెల్చెనేనియును ♦ క్రూరులు రాఘవు గెల్వనేర్తురే ? ౧౧౧౪

చ॥ తలఁచినచో విభీషణుఁడు ♦ తక్క జగంబున జీవయుక్తుఁడై
యలుచు నిశాటుఁడున్న యొకఁ ♦ డాదట సత్కృపగల్గ ధర్మమున్
బొలుచును మీరు దాఁగుటకు ♦ భూధర కందర లింక రోయఁగా
వలవదు నేఁటితో దనుజ ♦ వంశము మాయు నిబద్ది నానుడుల్. ౧౧౧౫

చ॥ అని హరుఁడాడ బ్రహ్మయు య ♦ థార్థమ యంచు వచింప వేల్పుల్
మనమున నెమ్మదిం గొనిరి ♦ మానవనాథుఁడు మండలీకృత
స్వనిత ధనుఃప్రమోదమున ♦ శాత శిలీముఖ వృష్టిఁగూర్చి వా
లిన దనుజోత్తమాంగక శి♦లీంధ్ర సమూహము సృష్టిచేయఁగన్. ౧౧౧౬

చ॥ అనఘుని చుట్టుకొన్న దను ♦ జావలి స్వర్గముచేరి యచ్చటన్
మనుటకుఁ జోటులే కలయు ♦ మ్రాలిన మేనులు తత్తళింపఁగన్
దునిఁగిన యాశ్వీక ప్రతతి ♦ తోడన దివ్య శరీరమంది మే
దినిఁ దమ గుఱ్ఱముల్ పొరలి ♦ ద్రెళ్లుట గాంతురు మింట నిల్చుచున్.

ఉ॥ అంబుధులందు శైలముల ♦ యందు వనంబుల యం దెడారులన్
బంబిన నాకమందు కను ♦ పాఱెడు మేరకుఁ దేఱిచూచినన్

డంబుగ నట్టులన్ దలల ♦ డాఁచుచుఁ దేల్చుచుఁ గొంచుఁబోవు ర
క్తాంబు నదీనదంబు లుర ♦ వై కనుపట్టెను తొల్కరింబలెన్. ౧౧౯
చ॥ ఎదిరిచినట్టి యోధవరు ♦ లేడ్తెఱ మాలి నశింప వాహినుల్
నడమదమంద వెన్కఁగల ♦ సైన్యము పాఱెడు త్రోవఁజూడ నం
గదగొని వారినాయకులు ♦ కాంచి వివేక విహీనులార! పా
ఱెదరె? బిడెంబులేదె? యని ♦ రేఁపఁగ తేఁచులపోల్కి వారలున్.
చ॥ చెవుడు పడంగ లోకము వి ♦ శీర్ణతనొంద మొయిళ్లు దేవతా
నివహ శిరంబు లూఁగ నవ ♦ నీధరముల్ చలియింప వైచు కై
దువులు మెఱుంగుపిడ్గు లను ♦ తోయముఁగొల్పఁ దమస్సమూహముల్
దవిలి యెదిర్చినాఁగ బల ♦ దర్పములన్ దనుజాలి క్రమ్మఱెన్. ౧౨౦
ఉ॥ రాముఁడు రందురండని స ♦ రాగముతో నతిథి ప్రకాండమున్
ధామమునం దెదుర్కొను వి ♦ ధంబున నేగి పృషత్క వృష్టి గా
రాములు చూపఁ డెక్కెములు ♦ రాలె దిశాంతములందు వార్యముల్
భూమిని గ్రుమ్మెఁ గూలె రథ ♦ ముల్ పవి భిన్న మహాద్రులోయనన్.
సీ॥ శకలంబులై పడు♦స్యందనాంతరములఁ, దసియక కంకగృ♦ధ్రములఁ దూఱి
బలితంబులగు కళే ♦ బరముల లాగంగ, భానుబింబము మాఱు ♦ పాటునొంద
గ్రహగతుల్ దప్పంగఁ♦గడలియు సుడియంగ, సారెకై వడి భూమి♦సరగఁ దిరుగ
ధర్మంబు సమవర్తి ♦ ధనువు పిశాచము, లట్టలు గదిసి నా♦ట్యంబు సేయ
తే॥ భవుడు నింద్రుండు పద్మసం ♦ భవుఁడు మునులు, విబుధులును దిక్పతులు మోద♦ వివశులగుచుఁ
బిల్లగంతులువైచి యా ♦ వింటి నేర్పు, దిట్టతనము సాహసము నుతించినారు.
తే॥ సమసి చతురంగబలములు♦సాగరములఁ, జెదరుచుండ దుగ్ధాంబుధిఁ♦జిలుకు దేవ
దానవుల చేతులంబలెఁ దఱిమిపాఱు, కఱకు సోఁకుల కాళులు ♦ గతులు దప్పె
తే॥ రథగజాశ్వ భటాది వ♦ర్గములయందు, గాయములఁ గలిగించు రా♦ఘువ కఠోర
సాయకంబు లాసేన నెం♦చంగఁజుక్క, లుంచు కగణినిచొచ్చె న♦త్యుత్కటముగ.
తే॥ సమసెరాణువల్ మిగిలిన♦స్వల్పబలము, స్రుక్కి ప్రక్కకొదుఁగుడాఁగుఁ♦దక్కనుచు
వాగి నవలికిఁ బోనీక♦బాణచయము, వలన నొకకోట గట్టె మై♦థిలి విభుండు.
తే॥ బలియురైన మాలిని మాల్య♦వంతునిమధు, కైటభులఁబోలి జగములఁ♦గలఁచినట్టి
కవచధారులు రాముఁడు♦కట్టిన శర, దుర్గమును దాఁటఁ జాలక♦త్రొక్కువడిరి.
తే॥ చచ్చినట్టివార లెదుటఁ ♦ జచ్చుచుండ, రేఁపఁబడిన వారింబలె ♦ రేఁగి బడబ
క్రాఁచఁదెరలిన శరనిధి ♦ కరణినొక్క, ప్రక్క కేతెంచి వహ్నితోఁ ♦ బలికిరిట్లు.

తే॥ త్రిపురవైరి జనార్దన ♦ త్రిదశవిభులు, మనబలము త్రుంచలేకయే ♦ మరలినారు
ఒక్కమానవుఁ డీవేళ ♦ నుక్కుమీఱి, కలఁచుచున్నాఁడు రాక్షస ♦ గణమునెల్ల.

తే॥ ఒక్కఁడే జగముల గెల్వ ♦ నోపువాఁడు, వేయివెల్వల తఁటుమొక్క ♦ వ్రేలుమిడిని
గెలిచె నేమనఁగలదింకఁ ♦ జెలఁగి యీఁగ, గరుడ వితతి జయించిన ♦ కరణియయ్యె

తే॥ బ్రహ్మతోడ భవుండు గీ ♦ ర్వాణచయము, వచ్చి నింగిని కనఁబడు ♦ వారుగాని
కానరాఁడు వెన్నుండందు ♦ గానఁజూడ, నతఁడె యితఁడగు నను సంశ ♦ యంబు వుట్టె

తే॥ పద్మసంఖ్య బలంబిట్లు ♦ పాడువడియె, నొక్కవెల్లువ శోషించి ♦ యున్నదింక
నేమి చింతించి రాఁగల ♦ దేమిఫలము?, తలపుఁడన్న వహ్నియు నిట్లు ♦ పలుకఁదొడఁగె

చ॥ మృతికిఁ గలంగి క్రమ్మఱుదు ♦ మేని దశాననునాస్యపద్మమే
గతిఁ దిలకించువారము? జ ♦ గంబున నెట్లపకీర్తి మోఁచి జీ
వితమును ద్రోచువార మది ♦ వీడి యశస్కర మార్గమందు స
ద్గతి యొదవంగ నీభవము ♦ ధన్యముగా విడువంగ మేలగున్. ౧౦౩౫

ఉ॥ సంకటపాటునం దవల ♦ జాఁగి మెలంకువతో మెలంగఁగా
లంకను వీడిపోవఁగఁ ద ♦ లంచినఁ గోలలకోట దాఁటలే
ముంకున నెల్ల రేకమతి ♦ నొక్కట రాముని చుట్టు ముట్టుచున్
జంకెనతోడఁ జంపుదము ♦ చత్తము యోగ్యత యయ్యెదేయనన్.

తే॥ అన్నినదులు సముద్రంబు ♦ నందు లీల, శలభములు దీపమునఁబడు ♦ చందమునను
విధియె సిగఁబట్టి యీడ్వ వి ♦ ద్విడ్గణంబు, డాసి రాముని చుట్టెఁ గ ♦ డంకతోడ

తే॥ గోగణంబు నడుమనున్న ♦ క్రోలుపులిని, పోలు రాఘవుపై సోఁకు ♦ మూఁకలపుడు
పరశు తోమర కుంత ము ♦ ద్గర ముసుండి, వాల శస్త్రాదులను పట్టి ♦ వైచినారు.

—: రాముండు గాంధర్వాస్త్రము సంధించి విడుచుట :—

క॥ గాంధర్వాస్త్రము రాముఁడు సంధించె దదీయ దివ్య ♦ శరము ఫణీంద్రున్
గంధిని గరుడుని పోనకు, గంధవహుని పోలి యడరి ♦ కడువడి నరిగెన్. ౧౦౩౬

ఉ॥ అక్షులుమూఁడు మోము లయి ♦ దగ్ధశరీరము గల్గు కోల ఫా
లాక్షునిమేనిఁబోలి యొక ♦ టైదయి యేఁబది నూఱు వేలునై
లక్షలు కోట్లునై పర బ ♦ లంబున నొక్కని కొక్క రాము రూ
పక్షిగతంబుగా నడరి ♦ యంపఱఁ గూలిచె నొక్క వ్రేల్మిడిన్. ౧౦౩౭

సీ॥ ఏడుదీవులయందు ♦ నెనిమిది దిక్కులఁ, బాతాళమందును ♦ పర్వతములఁ
బంక్తికంధరునకుఁ ♦ బ్రతినిధులై ప్రేమ, పాత్రులై దిన నిశా ♦ పతులఁ గూర్చి
హారంబుగాఁ జేసి ♦ యక్కున ధరియింపఁ, జాలు సమర్థుల ♦ చ్చటికి వచ్చి
మనలోన నొకని నీ ♦ మనుజుండు గెలిచిన, రావణుసైతఁ మో ♦ ర్వంగఁగలఁడు

ఆ॥ కాన నొక్కఁడొకఁడె♦కాకుత్స్థుతోడఁ గ, య్యంబుసేఁత మేలొ? యందఱొక్క
మొగినిఁ గ్రమ్మి వాని♦ముంచుకొనుట మేలొ? యనుచు వహ్ని నడుగ♦నాతఁడనియె.

ఉ॥ ఒక్కఁడొకండుగాఁ జని ర ♦ ణోత్కటు రాముని గెల్వలేము మీ
రెక్కడి వార్తలాడెదరొ? యిప్పటి సంస్థితిఁజూడరో? యనన్
రక్కసులెల్లఁ గూడి బవ ♦ రం బొనరించుటె యుక్తమంచు విం
డ్లెక్కిడి నంకులొత్తి దెస ♦ లెల్లను బీఁటలువాఱ నార్చుచున్. ౧౦౩౯

చ॥ భుజములు దట్టుచు న్నిలువ ♦ భూరి భయంకర లీల రాక్షస
వ్రజములఁ జంపియున్ దనివి ♦ వారని రాముఁడు వారిఁగాంచి య
క్కజముగ శింజినీధ్వని జ ♦ గద్భయదంబుగఁ జేసె లోకముల్
నిజపదిఁ గొల్చు సూర్యశశి ♦ నేత్రుని శంఖవిరావమో యనన్. ౧౦౪౦

ఉ॥ పెక్కురు శాస్త్రవిద్వరులు ♦ భీకర సక్రమ యుద్ధకోవిదుల్
వెక్కురులై దివౌకసుల ♦ వెంటఁ జరించిన దైత్యబంధులన్
ముక్కులఁ గోసినారలు ప్ర ♦ మోద మనస్కులు కాలకాలు నే
లెక్కయొనర్పనట్టి మద ♦ లీలలఁ దేలెడివారు రాక్షసుల్. ౧౦౪౧

చ॥ పిడుగులు రేఁగినట్లు మద ♦ భీషణ వారణరాజి యేచిస
ట్లడరి సమీరకన్నిపుణి బ ♦ యల్పడఁ బెక్కువిధాల నయ్యెడన్
నడచిరి వారి యాయుధగ ♦ ణంబుల నేత్రములందు పెల్లుగా
మిడుఁగుఱు లుప్పతిల్లి గిలి ♦ మిక్కిలి కూర్చెను ఖేచరాలికిన్. ౧౦౪౨

తే॥ నేమిరావంబు కింకిణీ♦నినదములును, సింహనాదంబు ఘీంకృతి♦శింజిని రుతి
హేషలును భుజాస్ఫాలన♦హేల లాయు, ధముల రవము లేచెను బెడి♦దంబుగాఁగ.

తే॥ వారు రావణుఁబోలిన♦వారు తాము, లీల గెలువని లోకంబు♦లేదు తత బ
లిష్ఠు లాదైత్యులను రణ♦నిష్ఠతోడ, జానకీజాని యెదిరించె♦సంగరమున. ౧౦౪౪

సీ॥ వారలు పెల్లేచి ♦ వైచు చక్రాది సా, ధనముల నడుమనే ♦ తునియఁజేసి
వారి ఱొమ్ము లగల్చి ♦ తేరులతోడఁ బ, రిధి బింబములు నాధ♦రిత్రిఁగూల్చెఁ
గైదువుల్ వట్టిన ♦ కరములు మేనులు,మెఱుఁగులతోఁ బొల్చు ♦ మేఘములన
భువిఁ ద్రావాలెఁ దెగి శర♦ములతోడఁ బడుకేలు, ఫణులు కొమ్మలతోడఁ♦బడుటఁబోలె

తే॥ వార్ధిఁజేరె నెత్తుటియేట♦వారణములు, కొఱఁదలంబలె గుఱ్ఱముల్♦కొఱలుచుండె
నాయుధంబులు చోఱమీ♦లనఁ జలించె, ఖేటకంబులు తాఁబేళ్ల♦క్రియను పొరలె.

తే॥ వాతహతిచేతఁ దెరల కం♦బములతోడఁ, గూలు పడవలవలె నేనుఁ♦గులు సిడంపుఁ
గంబములతోడ రుధిరాప♦గాప్రవాహ, మందు మునిఁగె హాహాకార మతిశయింప.

తే॥ తునిఁగి రక్తవాహినియందు♦దొరలుచున్న, కరములందుశరముల్ బట్టి♦కవ్వియుండఁ
గమలనాళంబులను నోటఁ♦గవ్వికొన్న, పావురంబు కూటంబుల♦పగిదిఁ దోఁచె.

తే॥ పటికరాలతోఁ జేయంగఁ♦బడి విఱిగిన, తేరిచక్రంబులు పయోధి♦తెరల నడుమ
నురలఁబడు పూర్ణచంద్రబిం♦బోత్కరంబు, నాఁగ నలరారెఁ గనులకు♦నాశ్చమగుచు.

శా॥ మాయలచే జయంబుగొను ♦ మార్తుర ధర్మ నియుక్తిఁ జంపఁగా
నాయితపడ్డ రాఘవు శ ♦ రాసన ముక్కట వంగునంత దై
తేయ శిరోమహీధ్రములు ♦ తెట్టువలై గొనయమ్ము వంగఁగా
నీయక వచ్చివచ్చి పడి ♦ యిట్టటు లాడఁగనీయ వింతయున్. ౧౦౪౯

తే॥ వక్షములఁజొచ్చి రుధిరంబు♦వట్టఁ ద్రావు, పక్షయుతశిలీముఖములు♦ప్రసవములను
పక్షములు వెలినుండంగఁ♦గుక్షి నిండ, మధువుగొను శిలీముఖముల♦మాడ్కి నొప్పె.

తే॥ యోజనాయతమగు సమ♦రాంగణమున, రమణ లోకైకవీరుఁడౌ♦రాముఁడొంటి
మయిని పాదచారి యగుచు♦మృధము సేయు, చొక్కజాములోఁదిరుగంగ♦నొప్పెనతఁడు.

చ॥ నిలిచినవారి యెట్టెదుట ♦ నిల్చుచుఁ బోయెదు వారి ముంగలం
బొలుచుచు నెందుచొచ్చినను ♦ పొందుగ నడ్డమువోయి రాక్షసుల్
బెలుకుఱ నిల్చుచున్ విసుగు♦వేసటలేక వధించుచుండ దై
త్యులు వెఱఁగంది కంబమునఁ♦దోఁచు నృసింహుఁడె యంచు నెంచుచున్.

ఉ॥ ఇచ్చటనుండె నిందుగలఁ ♦ డిచ్చటఁ దోఁచె మలంగె నాకడన్
వచ్చెను వీఁడెయంచు భ్రమ ♦ వాఱి శరంబులు కూర్చి యేర్పై
నెచ్చటనేని వైచి మఱి ♦ యొద్దుచు దైత్యులు తమ్ముదామె పె
న్మచ్చరమూని చంపుకొని ♦ మూఁడిరి పెక్కురు తద్రణస్థలిన్. ౧౦౫౩

ఉ॥ ఒక్కఁడు రాముఁడంట యది ♦ యొప్పునె? నూర్గురు కల్ల వేవురున్
నిక్కము కాదు లక్షయన ♦ నేరము కోటియనంగ దబ్బఱౌ
పెక్కురు పెక్కుకోట్లు రఘు ♦ వీరులు గల్గుదురంట సత్యమా
నిక్కడనంచు నేలయన? ♦ నెల్లెడ దానయి నిండెఁ జెల్లరే! ౧౦౫౪

ఉ॥ అంతట వీరరామమయ ♦ మై కనుపట్ట నిశాచరాలి ది
గ్భ్రాంతి వహించి యొక్కొకరు ♦ రాముఁడు నాకడఁ జిక్కెనంచు దా
వంతము లేఁగ నంచెదురు ♦ పడ్డ సురారులఁ జంపుకొంటచేఁ
గొంత యలంత తగ్గెను క ♦ కుత్స్థ కులాబ్ధి సుధాంశుమూర్తికిన్.

చ॥ అరదములం గుఱ్ఱాలపయి ♦ హస్తులపై వనరాశిమీఁద నం
బరమున నున్నవాఁడనుచు ♦ భ్రాంతిని యెందును పోవలేక ని
వ్వెరగొని నిల్చి చుట్టుచును ♦ వ్రేయుచు మించి పరాక్రమించు కం
ధర నిభ దేహు వేగ బల ♦ దర్పములం గనుచుండ్రి రక్కసుల్.

ఉ॥ నిండిన భండనస్థలిని ♦ నీరజనేత్రు బలిష్ఠ చండ కో
దండ విలగ్న ఘంటికలు ♦ దంధణ మ్రోఁగిన యప్పుడెల్ల వే

దండ తురంగ సంఘములు ♦ ధారణిఁ గుప్పలు కూలుచుండు బ్ర
హ్మాండము దద్దఱిల్లు దను ♦ జాంగన పాళికి రాలు నశ్రువుల్. ౧౦౫౭

ఉ॥ వచ్చినవారి తేరులను ♦ చావక పోరెడి వారి తేరులం
దచ్చుగలాగి వంచిన శ ♦ రాసముతో వడిఁగానవచ్చుటల్
గ్రచ్చుఱఁ బోరుసేయ నొడి ♦ కంబున రాఘవుఁ డొక్క తేరిపై
వచ్చిన చందమొంది కను ♦ వారికిఁ దోఁచె రణాంగణంబునన్. ౧౦౫౮

మ॥ ఒకకోదండమ యున్నఁ దూణమొకఁడై ♦ యున్నన్ శరస్తోమమా?
తుకముల్ మీఱుచు వర్షబిందువుల సం ♦ దోహంబుకంటెన్ విశే
షకమయ్యెం దనకేలు వేయికరముల్ ♦ సాగించు కార్యంబు త
క్కక కావించె సహస్రహస్తములు వీఁకన్ రెండుగా నయ్యెనో? ౧౦౫౯

మ॥ ఒకమోమై మనుజాకృతిం బొలుచు నీ ♦ యుగ్రంపు దృశ్యం బన
త్యకమా నిక్కడ నిక్కమేర్పడె నసం ♦ ఖ్యాకంబులౌ దైత్యసై
నిక సంఘాతము చేసినట్టి దురముల్ ♦ నేర్పార సంపూర్తిగా
నొకమో మేవిధి గాంచఁగల్గుఁ? దలలె ♦ న్నో పద్మ సంఖ్యేయముల్!

మ॥ నిటలాక్షుండు చతుర్ముఖుండు శరముల్ ♦ నిర్ణీతి లెక్కించి యు
త్కటమాటల్ గణియింపలేక యిది శ ♦ క్యంబౌనె? యంచున్ విశం
కట మోదాత్మకులై నిశాచరుల సం ♦ ఖ్యంగాంచి యీలెక్క వే
యుటయుం బోలద యంచు మానుకొని రా ♦ యుద్దేశ మప్పట్టునన్.

ఉ॥ సేనలు వేయి వెల్లువలు ♦ చెందిన దొక్కని కొక్క బాణ మం
చూని వచింప నైతియగు ♦ నో? యొకటొక్కటి నూఱు తునకలై
మేనులు కూలియుంట గన ♦ మిక్కిలి పెక్కులు వాని జానకీ
జానియె యేసెనే? యని ప్ర♦శంస యొనర్చిరి వాసవామరుల్. ౧౦౬౨

చ॥ గొడుగులు నాయుధమ్ములును ♦ గుఱ్ఱము లేన్గులు రాక్షసావళుల్
సిడములు తేరులుం దెగి న♦శింపఁగ వైచిన బాణరాజి లె
క్కిడఁ దరమౌనె? యేటిపని? యీతని లాఘవలీల గాంచుటల్
విడిచి మఱొక్కచేత తగ♦వే? యని పల్కిరి తాపసోత్తముల్. ౧౦౬౩

తే॥ కదనతలమెల్ల నవయవ♦ఖండసమితి, చెదరిపడియుంట యొప్పెను♦సృష్టికర్త
జగములను సృష్టిసేయఁగా♦జతనుపఱచి, వేఱువేఱ యుంచిన యంగ♦బృందమనఁగ.

తే॥ వీరవర్యులు పదికోట్లు♦ఘోరరీతి, నిధనమొంద సాధారణా♦యుధము లేసి
చావనేల దివ్యాస్త్రసం♦చయము విడిచి, కూల్తుమని తక్కు రక్కసుల్♦కూడినారు.

తే॥ మొనసినా రాయణాస్త్రంబు♦మొదలుచేసి, యజుని యస్త్రంబుదనుకఁ గ♦లట్టిదివ్య
శరములేసిరి వారు దా♦శరథిమీఁద, నతఁడు వానితోడన వాని♦నణఁచివైచె.

మ॥ కొని దివ్యాస్త్రము లేయుచో జగము సం ♦ క్షోభించి పుష్పంబు ల
గ్నిని పడ్డట్టులు నాశమై చనును వా ♦ నిం ద్రిప్పలే రీఖలుల్
కనుకన్ శాత శిలీముఖంబులని యీ ♦ క్రవ్యాదులం గూల్చఁ గా
కని సీతాపతి యట్టులే పఱపి మా ♦ యంజేసె నాదైత్యులన్. ౧౦౬౭

తే॥ వేయివెల్లువలైన వి♦ద్వేషిసేన, మొత్తముగ రణమున జీవ♦ములను పాసె
బరువు తొలఁగ వసుంధర♦శరధినుండి, సరగఁ బైకుబ్బి లేచెను♦చాలవఱకు. ౧౦౬౮

సీ॥ వారణంబులు వేయి♦ తేరులు పదివేలు, వారువంబులు కోటి♦ వాహినీశు
లొక వేవురు నశింప♦నొక కబంధము లేచి, రణరంగమందు న♦ర్తనము సేయు
వేయికోట్ల కబంధ♦వితతి యాడిన రామ, కార్ముకమున నున్న♦గంట మొరయు
నాగంట యొక యేడు♦నఱగడియలసేపు, మగియక గణగణ♦మ్రోఁగుచుండె

తే॥ తలఁపు నెఱవేఱెనని సురల్♦కలఁక విడిరి, నిశ్చలత సందె ధర్మంబు♦నిశ్వసించెఁ
దలలు పైకెత్తె శేషుండు♦తాపసులును, మఘవుఁడును గుండెబరువును♦మాన్చికొనిరి.

ఉ॥ పొందిన కల్మి తమ్మునకుఁ ♦ బొల్పుగ నిమ్మని నిచ్చి వేలుపుల్
చెందిన పూర్వపుణ్యమునఁ ♦ జెచ్చెరఁ గానకు వచ్చి యందు వి
ల్లంది సమస్తజీవులకు ♦ నబ్బిన యాపద దీర్చినట్టి రా
జేందుని గాంచి నోరుగల ♦ యెల్లరు మ్రొక్కిరి జే యొనర్చుచున్.

తే॥ వేలుపులు పూలు నల్లుచు♦వినుతిసేయ, రాముఁ డొప్పారె నారణ♦రంగమందు
భూతములు నిండినక్కలు♦పొలయుచుండు, మసనమందొంటినిల్చు త్ర్యం♦బకునిపోల్కి.

మ॥ కదనక్షోణి విరించనాండముగ ర♦క్తశ్రేణి జీవాలిగాఁ
దుదికాలంబున నెల్లజీవులను సం ♦ తుష్టిం బునస్సృష్టికై
యుదరంబందున నుంచుకొన్న తన పూ♦ర్వోదార రూపంబునే
మదనాకారుఁడు పోలెనంచు వినుతిం♦పం బూని రింద్రామరుల్. ౧౦౭౦

మ॥ కలఁకన్ వీడి సురాలి చల్లిన దళత్ ♦ కల్ప ప్రసూనంబులన్
గలతావుల్ తన నేదదీర్పఁ బ్రబల ♦ క్రవ్యాద సంఘంబులన్
బొలియంజేసిన రామభద్రుఁడు సమి ♦ ద్భూభాగమున్ వీడి ని
ర్మలుఁడా ప్రేముడి తమ్ముఁజూచు తమి యా ♦ త్మం దన్ను ప్రేరేఁపఁగన్

తే॥ ఇచటనిల్లయ్యె నచటనా♦యనుజుతోడఁ, గపులతో రావణుఁడు వచ్చి♦కడఁకరణము
నేసెనేమొ? లక్ష్మణుఁడేమి♦చేయఁగలిగె?, ననుచుఁదొందరగా రాముఁ♦డరిగెనటకు.

ఉ॥ మర్కటనాయకుల్ రణము ♦ మానరు మిన్నక తక్కువారలా
యర్కజు నాజ్ఞమీఱి యిటు ♦ లాఱడి నొందుట భావ్యమే? సమి
త్కర్కశులై విరోధితతిఁ ♦ ద్రత్తము చత్తముగాక యూరకే
తర్కములేల యంచు వడిఁ ♦ దార్కొని వచ్చిరి పోరొనర్పఁగన్. ౧౦౭౪

౩౧ రావణ శక్తి పటలము (౫౦)

తే॥ వేయి తురగంబులం బూన్చి♦వేవెలుంగు, మండలముఁగేరు తేరెక్కి♦భండనమున
సురలగెల్చిన విల్లును♦శరధిఁదాల్చి, రావణుఁడు చేరె వడి సమ♦రస్థలంబు. ౧౦౭౬

తే॥ మనుజులం జుట్టి వధియింపుఁ♦డనుచు వేయి, వెల్లువల కాజ్ఞయిడి కపి♦మల్లురపయిఁ
దాన పోవ నిచ్ఛించి యా♦సేననంపి, వేఱ క్రేవకు నరిగె న♦వ్వీరవరుఁడు ౧౦౭౭

తే॥ నూఱుకోట్ల రథంబు లి♦న్నూఱుకోట్ల, తురగములు పదికోటుల♦కరులఘటలు
నంత కినుమడియగు సుభ♦టాలితోడ, నాఁడు రావణుఁడేగె ర♦ణంబుసేయ

తే॥ త్రిజగములయందు నవలి ప్ర♦దేశములను, కలఁకునకు రండురండని♦పిలుచునట్టి
భేరి కాహళ శంఖాది♦భీషణరుతి, మాఱుమ్రోఁగఁగ జెలరేఁగె ♦ మహితరీతి.

తే॥ వంచితామర విధి పరి♦పాక రూపుఁ, డసురనాథుఁడు దశకంఠుఁ♦డమిత చమువు
తోడ ధాత్రి యుదర సమి♦ద్దోహలుఁడయి, వచ్చుచుండుట గాంచెను♦వానరాళి.

ఉ॥ కాంచి దురంబులోఁ దను ని ♦ కాయము వీడుటె వీరధర్మమా
నంచుఁ గృతాంతుఁడుఁ బడఁకు ♦ నట్లు భుజంబుల నప్పళించి గ
ర్జించుచు మ్రాఁకులన్ గిరులఁ ♦ జేకొని వ్యూహము తీర్చిపేర్చి లం
ఘించుచు రండు రండనుచుఁ ♦ గేరుచుఁ గేకలు వైచె నుద్ధతిన్. ౧౦౮౧

తే॥ ఉనుఱు లీయఁ గాఁబోలు న♦య్యసురసేన, వడివడిగ వచ్చి తాఁకెను♦వానరులను
ఉభయులకు మధ్య నిప్పుక♦లుప్పతిల్లె, వాని నడుమనె రక్తప్ర♦వాహ మడరె.

తే॥ తుండులైన మొండెంబుల♦నుండి లేచి, తలలు నింగికి నెగసె నా♦తలలనుండి
నెగయు నెత్తురు చుక్కలా♦నింగిఁ బరవ, నంబరంబెల్ల రణరంగ♦మట్లు తోఁచె.

చ॥ అదవదయైన రాక్షస బ ♦ లాంబుధి నంబులనెత్తు చేతులన్
మదజల మానవచ్చిన ప్ర ♦ మత్త శిలీముఖ కోటి క్రమ్మఁగన్
నదమదమంది భద్రగజ ♦ సంహననంబులు వ్రస్సివ్రస్సి పె
ల్లిదమగు నెత్తుటేర్లఁ బడి ♦ లియ్యము లయ్యె మునింగి తేలుచున్.

చ॥ మగువలు తొల్లి నవ్వులను ♦ మన్ననలన్ సురతంపుఁ జిన్నెలన్
దెగువయు దుఃఖముం దొడరఁ ♦ దేఱక యెన్నువ చేసి పాడుచున్
దగవుగఁ గంకణ ధ్వనులు ♦ తాళము వైవఁగ నేడ్చియేడ్చి యీ
పగ వలదంచుఁ బ్రాణములఁ ♦ బాసిరి భర్తలఁజేరి రయ్యెడన్. ౧౦౮౫

క॥ నాశము నొందెడు తుది తఱి, నాశిల్లు జగంబులట్లు ♦ నారక్షణచే
నాశము నందని సేనకు, నాశమొదవె ననుచు దైత్య♦నాయకుఁ డడలెన్

క॥ తరువులు శిలలే యసి ము, ద్గర శూలాదికము విఱిచి♦దనుజుల తలలన్
దొరలించెఁ దాళ ఫలముల, కరణిని రావణుఁడు కాంచి♦కళవళమందన్. ౧౦౮౭

క॥ పావనియును సౌమిత్రియుఁ, గ్రోవియుఁ గండెయునుపో లెఁ♦గొఱలుచుఁ దునుమన్
బ్రేవుల ప్రోవులు వెలువడ, మావులు రథపాళితోడ♦ మ్రగ్గుచుఁ బడియెన్. ౧౮౮

క॥ విలుదాల్చిన కాలునివలె, విలసిల్లుచు లక్ష్మణుండు♦విరివిగఁ జదిపెన్
బలయుత బలిముఖ నఖ రద, ముల వాఁడిమి దనుజసేన♦పోఁడిమి వీడన్. ౧౮౯

క॥ ఇఁక నొక క్షణ మిట్లే యూ, రక చూచుచు నుంటినేని♦రాక్షస తతి నం
తకుఁడెల్లఁ గొల్లగొని పో, వక యుండునె యనుచుఁ బంక్తి♦వదనుఁడు కినుకన్.

చ॥ శ్వసనుని వేగముం బిడుగు ♦ వంటి బలంబును పర్వతంబులన్
బసయుఱఁ దొల్చు శక్తియును ♦ పద్మభవాండము దాఁటు చేవయున్
దెసలను గొల్చు నేర్పు గడి ♦ దేఱిన యంతక కింకరత్వమున్
బొసఁగిన శాత సాయక స ♦ మూహ పరంపర లేసె గ్రక్కునన్. ౧౯౧

ఆ॥ కినుక రేఁగి పోరు♦దనుజవిభుఁడు నడు, రేయి యడరు కాళి♦రీతినుండె
నెగచి వీచు గాలి♦కెగసిన దూది పిం, జల విధానఁ బ్లవగ♦చయము లయ్యె.

ఆ॥ పాఱుచున్న కపుల♦భయమును సౌమిత్రి, తెలిసి భీతి నొంద♦వలదు వలదు
నిలువుఁ డనుచు నాంజ♦నేయుని భుజముల, నెక్కి పంక్తివదను♦నెదుటికేగె.

ఆ॥ ఎదిరి నిలువ దాన♦వేంద్రుండు వందలు, వేలుగాఁగ వాఁడి♦కోలలేసెఁ
బ్రతిశరంబు లేసి♦రామానుజుఁడు వాని, నడుమఁ బొడిగఁ జేసి♦పుడమిరాల్చె.

తే॥ రాల్చు సౌమిత్రి భుజము లు♦రంబు నాటు, నట్లు దశవదనుండు పె♦క్కమ్ములేసె
కొన్ని డాసి మేనిని గ్రుచ్చెఁ♦గొన్ని దూసె, లక్ష్మణుండు కినిసి శర♦లాఘవమున.

ఆ॥ వానిఁ గలఁత పఱుప♦వైశ్రవసుండును, వీని గెలువ నరిది♦వింటిచేత
వీని విడిచి చూపు♦వీరత్వ మదియేది, వీడరాదు వీని వీడరాదు. ౧౯౬

శా॥ దివ్యాస్త్రంబుల నేయ వ్రాల్చి సమవ ♦ ర్తిం బిల్చి చూపించుఁ గ
ర్తవ్యం బేది? తదగ్రజుంబలె జగ ♦ త్సర్వంబు బాణాగ్నికిన్
హవ్యప్రాయముగా నొనర్పఁ గలవాఁ ♦ డర్ధక్షణంబందె ని
ష్క్రవ్యాదంబుగ భూమిఁ జేయఁ దలఁచెన్ ♦ సాధించు టెచందమో?

ఆ॥ మున్ను బ్రహ్మ పడయు♦మోహనాస్త్రం బొందు, కలదు భవునినేని♦గెలువఁగలది
దానివైచి సమర♦ధాత్రిని వీనిని, కూలఁ ద్రోతు ననుచుఁ♦గోరి తొడిగె. ౧౯౮

మ॥ విడువం గాంచి విభీషణుండు రణహం ♦ వీరా! మహాస్త్రంబుచే
నడుఁకం జేసెడి లోకమెల్ల నిది నీ ♦ నారాయణాస్త్రంబుచే
నడఁపం జొప్పడు నన్న లక్ష్మణుఁడు త ♦ ద్వ్యాపృత్తిఁ దద్రీతిగా
నడఁపం గాంచి దశాననుం డనుజు వి ♦ న్నాణంబుకై మండుచున్.

మ॥ ఒగి వీఁడుండి నిశాచరావళుల మా ♦ యోపాయముల్ దెల్పుచున్
దగురీతి న్నడపింపఁగా మనకు నే ♦ తన్నాశ మిట్లబ్బె దు

ర్భగు దుష్టాత్ముఁ గులాపకారకుఁ గుల ♦ భ్రష్టున్ విశంసించి యిం
బుగ మద్వంశ కలంకముం దుడిచెదం ♦ బో యంచుఁ గోపాత్ముఁడై.

చ॥ మయుఁడు కుమార్తె నిచ్చుతఱి ♦ మాన్యత నిచ్చిన శక్తిఁ గిన్కతో
రయమున వైచె నద్దియొక ♦ ప్రాణి నెదిర్చిన ధాతనేని చం
పియె మరలంగఁ జాలినది ♦ భీకరమై యరుదేరఁ గాంచి దు
ర్భయమునఁ దప్పికో నొక యు♦పాయము లేదను నవ్విభీషణున్. ౧౧౦౧

చ॥ వెఱవకు మంచు లక్ష్మణుఁడు ♦ వేగమ యడ్డమువచ్చి వాఁడి యం
పఱ పఱపన్ మునీంద్రునకుఁ ♦ బాపి యొసంగిన శాపమట్లు వీ
సరవడ వేలుపుల్ మునులు ♦ చచ్చెను చచ్చె విభీషణుండు దు
ర్భరమని పల్కుచుండ విని ♦ రాముని తమ్ముఁ డుదగ్ర వేగుఁడై.

చ॥ మరణము నొందినన్ యశము ♦ మాఁడదు ధర్మము నిల్చు నుత్తముల్
గురుసుఖ మందువారు తన ♦ కున్ శరణంబని వచ్చువాని డె
ప్పరమున పీడరాదనుచు ♦ వక్షముఁ జూపుచు వచ్చె నడ్డుగన్
వెఱగొని వానరుల్ విబుధ ♦ బృందము హా! యని పిచ్చలింపఁగన్.

మ॥ అతనిం దాఁటి విభీషణుండు చనఁగా ♦ నయ్యుర్వ్యరన్ మీఱి వా
లి తనూజుండు దృఢాత్ముఁడై యెదుట ని ♦ ల్చెన్ వానిఁ ద్రోపాడి స
న్మతి సుగ్రీవుఁడు పోయె నాతనికి ము ♦ న్వాతాత్మజుం డేగె నీ
యతిశాయిత్వ మహత్త్వముం దెలుప శ ♦ క్యంబౌనె యెవ్వారికిన్?

—: రావణ శక్తిచే లక్ష్మణుఁడు మూర్ఛిల్లుట :—

ఉ॥ అందఱకంటె ముందునకు ♦ నార్యుఁడు లక్ష్మణుఁ డేగి దీని నేఁ
గొందెద నుండుఁ డుండుఁ డని ♦ కూరిమి మిత్రుల మాన్చి శక్తియున్
డెందము గ్రుచ్చి దూయ గురు ♦ ధీరత వక్షము చూపి నిల్చె నా
చందము గాంచి వేల్పులును ♦ చయ్యనఁ గన్నులు మూసి రయ్యెడన్.

తే॥ పదరి యెచటి కేగెదవని ♦ పట్టరాని, చండ కోపాన మండుచు ♦ దండము గొని
రావణుని రథ రథ్య సా ♦ రథులఁ జదియు, భీషణంబుగ మోఁదె వి ♦ భీషణుండు.

క॥ రోషమున రావణుండు వి, భీషణుపై మారుతిపయి ♦ వేఁడి యలుఁగు లా
ఘవగతి నేసి బహు సం, తోషముతో మరలె విజయ ♦ ధూర్వహమతియై.

క॥ నే శరణొందిన యీ జగ. దీశుని తమ్ముండు సోల ♦ నీవెటకు ముదా
వేశమునఁ బోయెదని యా, క్రోశించి విభీషణుండు ♦ కోపమునఁ జనన్. ౧౧౦౪

మ॥ వశమయ్యెన్ జయలక్ష్మి మోద భరిత ♦ స్వాంతుండనై మీఁద నీ
పశువుం జంపిన నేమిలాభమని సం ♦ భావించి పౌలస్త్యుఁ డ

ద్దిశ కన్నెత్తియుఁ జూడ కయ్యనుజు వి ♦ ద్వేషంబు లెక్కించి క
ర్కశతం జూపక వ్యోమ మార్గమున లం ♦ కం జొచ్చె సంరంభియై.

తే॥ పట్టరాని దుఃఖంబున♦వాయివిడిచి, పనవి లక్ష్మణు పదముల♦పైని వ్రాలి
ఘోషణం బొనరించె వి♦భీషణుండు, వనచరులు దుఃఖ జలనిధి♦మునిఁగినారు.

తే॥ ఇతఁడు మరణింప జీవించి♦యేమిఫలము? విభుఁడు రాఘవుఁ డింక నే ♦ వింపలేఁడు
అనుచు నెద సుడివడ నేడ్చె♦దనుజరాజుఁ, గాంచి భల్లూకనాథుఁ డీ♦కరణిఁబలికె.

చ॥ తలఁచిన యంతలో సకల ♦ తామరసాండము చుట్టి యోషధుల్
సొలవక తెచ్చి యియ్యఁదగు ♦ శుద్ధమనస్కుఁడు మారుతాత్మజుం
డిల మనపాలనుండ నిటు ♦ లేడువ నేటికి? చూడు లక్ష్మణుం
డెలుఁగఁడు వంతయేటికి వ ♦ హింపుఁడు స్థైర్యము మేలుగల్గెడుఁ. ౧౧౧౨

చ॥ అని యనిలాత్మజాతు నర ♦ మందలి తూపుల నూడ్చివైచి యీ
యనుజుఁడు మూర్ఛ మునిఁగినఁ ద ♦ దగ్రజుఁ డోర్చునె? కాంచికాంచి నె
మ్మనమున మాని మిమ్మరులు ♦ ముగ్గుచునుండుట చూచిచూచి యీ
యనువున నూరకుంట తగు ♦ నా? సకలంబును మాకు నీవెకా? ౧౧౧౩

చ॥ అని వచియింప వాయుసుతుఁ ♦ డాతని యిచ్చ యెఱింగి యాక్షణం
బున గగనస్థలి న్నెగసి ♦ పోయెను వారల చూపుదాఁటి యా
పనియును పోవు మార్గమును ♦ ప్రాఁతవియాటఁ జనంగ నోషధుల్
గొని చనుదేర నాతనికిఁ♦గూరునె తామసముల్ శ్రమంబులుఁ. ౧౧౧౪

చ॥ హనుమయు మందుదెచ్చె నొక ♦ యాటగ నోషధిమీఁది వాయువుల్
పనుపడఁ బాఱునంత స్మృతి ♦ వచ్చెను చచ్చినవారి జీవముల్
నునుపుగ నిచ్చుమందునకు ♦ నొచ్చిన వారల నొప్పి తీర్చుటల్
ఘనమగు కార్యమౌనె? ప్లవ♦గ వ్రజమెల్లను లేచె నెమ్మదిఁ. ౧౧౧౫

చ॥ అమరులు వానరుల్ ముదము ♦ నందఁగ లక్ష్మణమూర్తి లేచి వే
గమున సమీరపుత్త్రకుని ♦ కౌఁగిలిఁ జేర్చె విభీషణుండు సే
మము భజియించునే యనుచు ♦ మన్నన నాతనిఁగాంచి మోద బా
ష్పము లురలంగ రావణుఁడు ♦ చచ్చె వధూనికర కచ్చె ముక్తియుఁ.

చ॥ బ్రదికితి మెల్లవారమును ♦ పాడియె యాచరణీయమంచు నొ
ప్పిదమగు తారకాణఁ గపి ♦ వీరుఁడు మారుతి చూపె నన్న కే
య్యది యిఁక దుర్ఘటంబగు ? ని ♦ హంబు పరంబును కూర్చు కర్మలం
దెదఁ దలపంగ ధర్మమె సు♦మీ జయముల్ సకలంబు నిచ్చెడిఁ. ౧౧౧౬

మ॥ అని భాషించుచు నందఱుం గలిసి నం ♦ యద్భాగముం దాఁటి రా
ముని చేరం జని తత్పవిత్ర చరణాం ♦ భోజాతముల్ సోఁక మ్రొ

క్కిన నాతండును సంతసించి యటనా ♦ కృత్యంబుఁ బ్రశ్నింపఁగా
వినిచెం బూర్తిగ జాంబవంతుఁడు విన ♦ వీరుండు చోద్యంబుగన్. ౧౧౧౮

ఉ॥ పావనిఁ జేరి గాటముగ ♦ బ్రీతిఁ గవుంగిలిఁ జేర్చి నాయనా!
యీవొకఁ డుండఁ గానిపని ♦ యేదియు మేదిని లేదు పోరిలో
రావణుఁడన్ గృతాంతుని పు ♦ రంబును చేరినవాఁడె నీకు మో
దావహ జీవితంబును చి ♦ రాయు రుదంచిత కీర్తు లబ్బెడున్. ౧౧౧౯

శా॥ మోదముతోడ బాష్ప జల ♦ ముల్ ప్రవహింపఁగ జీవుఁజేరు మై
చైదముతోడ దుఃఖము నా ♦ సంగి దివింగను తండ్రిరాఁగ ను
త్పాదిలునంత సంతసము ♦ భావము చెందఁగ ప్రొక్కుతమ్ము న
త్యాదర మారఁగా వలమి ♦ యంగము దువ్వుచు రాముఁ డిట్లనన్.

చ॥ శరణమునొందు ప్రాణికగు ♦ చావును మాసిచి కాచుపొంకె సం
గరమున నీదు ప్రాణములఁ ♦ గాంక్ష యొసర్చక యిచ్చినందుచేఁ
బరమ పవిత్రమైన రవి ♦ వంశ గురుత్వము నిల్పితయ్య? యా
తరుణమునందు నీకదియ ♦ తప్పని కర్జము వత్స! లక్ష్మణా! ౧౧౨౧

చ॥ కలఁగక పావురంబుకయి ♦ కాయము కోసి యొసంగినట్టి ని
ర్మలగుణి తాతయా శిబిఁ గ ♦ రం బుపమింపఁగ నొప్పితయ్య! యు
ర్వరఁ గరుణామయాత్మకులు ♦ స్వాశ్రితపాళికిఁ జెట్ట యబ్బుచోఁ
గరఁగుదు రార్తి క్రేపునకుఁ ♦ గల్గిన ధేను వలంగుకై వడిన్. ౧౧౨౨

చ॥ అని వినుతించి సమ్ముదము ♦ నంది రణంబునకై ధరించి యుం
డిన కవచాదు లొక్కటొక ♦ టిం గడుమెల్లనఁ దీసి యాంజనే
యుని కరమందు వెట్టి యొక ♦ యున్నత శైలమునందు విక్రమం
బును తొలఁగించు కొంచుబును ♦ పోకకు ముచ్చట లాడుచుండఁగన్.

—: ౩౨ వానర రణరంగ దర్శన పటలము :— (౩౬)

ఉ॥ సేనలతోఁ గపీంద్రుఁడును ♦ చేరిక నిల్చి భజించుచుండఁగా
వానరు లాదటన్ సమర ♦ భాగముఁ దక్కక కాంచి దిగ్భ్రమం
బూని వడంకుఁచున్ బిడెము ♦ నొందిరి కీశ కులేశుఁ డీవ యీ
దానవ సైన్య మంతయు వి ♦ దారణ చేసితె యంచుఁ బల్కఁగన్.

ఉ॥ రాఘవుఁడున్ విభీషణుని ♦ బ్రీతిగఁ గాంచి దురంబునందు దై
త్యౌఘముఁ జూవుమన్నఁ గడు ♦ నుత్సుకులై ప్లవగాధ్యులెల్ల లెం
డో ఘనులార! చూతమని ♦ యుబ్బుచు లేచిరి రామశౌర్య ధీ
లాఘవ లక్ష్యశుద్ధుల కొలంది గనుంగొను వేడ్క సంధిలన్. ౧౧౨౪

ఉ॥ కాంచిరి బెగ్గడిల్లిరి వ♦గర్చిరి తూలిరి బెగ్గలించి రా
కుంచితులైరి గుండియలు ♦ కొట్టుకొనన్ దడియాఱె నోష్ఠముల్
మించిన భీతి మొల్లనన ♦ మేను లధీనములయ్యె నంత మో
దించిరి పొంగి రుబ్బిరి మ ♦ దించిరి తత్స్థితిఁ జెల్ప శక్యమే ! ౧౧౨౮

ఉ॥ వీరశవ స్థితుల్ గనఁగ ♦ భీతికి సంఖ్యకుఁ జూచు నేతఱన్
మేరకు మీఱి యున్న దిట ♦ మీఁద విభీషణ! యగ్రగామివై
వీరల పుట్టు పూర్వములు ♦ విస్తరరీతి వచింపు మేము పెం
పారఁగ విన్పఁ గాంచు చర♦ముంగలవారము నా నతండనున్. ౧౧౨౯

తే॥ కాకములు పందిరింబోలెఁ ♦ గ్రమ్మియున్న, రక్తపంకమౌ రణమున ♦ రామ బాణ
నిహతిఁ గుప్పలు తిప్పలై ♦ నీల్గియున్న, వారణంబులఁ జూడుఁడ ♦ వానరగతి.

క॥ వడిగల రామశరంబుల, బెడిదులు ప్రాణముల వీడి ♦ పెంటలఁ గునుకం
బడిన వడువయ్యెఁ గనుఁడీ, పుడమిధరము మీఁది నాగ ♦ పుంజములక్రియన్.

క॥ కూలిన దనుజుల ముఖములు, వేలా పులినమ్ములందు ♦ విరిసిన రాజీ
వాలిం బోలుం గనుఁడీ, యేలా వర్ణింప రాఘు ♦ వేష్వాస విధుల్ ? ౧౧౩౦

క॥ శరసంఘాతముచేఁ బె, న్నరదంబులు విఱిగి శోణి ♦ తాపగలబడిన్
శరనిధుల కలములం బలె, జరగుచు నుండుటలు గనుఁడి ♦ సంతస మెనఁగన్. ౧౧౩౧

క॥ వారణములు ప్రాణంబుల, తో రుధిరాపగలఁ జిక్కి ♦ దొరలుచుఁ బారా
వారమునఁ దిమింగిలముల, తీరునఁ దేలాడుచుంట ♦ తేటగఁ గనుఁడీ ౧౧౩౨

క॥ నయగతుల నట్టలాడఁగ, లయగతులం దాళముల నె ♦ లర్చు పిశాచో
చ్చయగతులఁ జూడ నటనో, భయగతులం జెనయఁబోలు ♦ భరతాచార్యున్.

క॥ అరివీర సముదయంబుల, నరములు యంత్రములఁ బోలె ♦ నడచెడు కాళ్లం
బిరిగొని తగులం ద్రోచుచు, తిరుగు పిశాచములఁ గనులు ♦ తెఱచి కనుండీ. ౧౧౩౪

తే॥ నగము తెగిన మేనులతోడ ♦ సామజమ్ము, లొఱవలై పడి యొండొంటి ♦ నొంటికొనఁగఁ
గొన్ని పెనుగుండ్లవలెఁ దోఁచెఁ ♦ గొన్ని యెన్న, నిరుదలలగొరులం బలె ♦ మెఱసెఁ గనుడిఁ.

తే॥ చండకోపము వికటహా ♦ సమునఁ జూపు, మొగము లెల్లనుపొగలతో ♦ సెగలు సెగయు
హోమకుండంబులం బోలి ♦ యొప్పుచుంట, కాంచినారలె శాఖామృ ♦ గంబులార !

తే॥ సమదగజములపై నుండి ♦ జాఱిపడిన, చామరంబులు వీరాస్య ♦ సరసిజముల
నొఱగి నిద్రనొందెడు మరా ♦ ళోత్కరంబు, చెలువు చెన్నారు వానిఁ గాం ♦ చితిరె చెప్పుఁడ

క॥ దంతంబులు రుధిరోద, న్వంతంబులఁ దడిసి సాంధ్య ♦ నభమునఁ దేజో
వంతములగు బాల కళా, వంతుని రేఖాచయంబు ♦ వడువునఁ దోఁచెన్. ౧౧౩౮

చ॥ శర ధనురాది సాధన వి ♦ శాలములైన రథోత్కరంబుపై
ద్విరదచయంబుపై నిలిగి ♦ ద్రెళ్లిన వీరుల కన్నుదోయి యం
దురలిన నిప్పుచే నుడికి ♦ యున్న పలాలము మెక్కి భూతముల్
హారువుగఁ ద్రేన్చుచున్ మురిసి ♦ యాడుచునుండుట తేటి కాంచుఁడీ!.

చ॥ దిగఁబడి పాటి సంద్రమునఁ ♦ దెర్లిన యాక్షతజ ప్రవంతిలో
నెగఁబడి చొట్టమీలు తమ ♦ యిచ్చకొలందిని వచ్చి యాజి నే
నుఁగులను గాంచి యెందును క ♦ నుంగొన లేదివి క్రొత్తయయ్యొ నే
మృగములొ యంచుఁ గ్రమ్మఱి గ♦మించుచు నుండుట కాంచినారలే!

క॥ మింటం జచ్చిన శవములు, మంటం జరియించు వారి♦మస్తకములపై
నొంటించి పడఁగ సోలుచు, నింటరపడు సతులఁ గంటి♦రే కవులారా! ౧౧౪౧

తే॥ నింగియందు సారంగ తు♦రంగచయ శ, తాంగములయందు చచ్చిన♦యసురవరుల
రొండలి నల్లచుక్కలుపడ♦నడిమిమింట, భానుఁడున్నను లేఁ బ్రొద్దు♦పగిదిఁదోచె.

తే॥ వాయు జవమునఁ జసిన దై♦తేయులు తెగు, కతన మింటనంటిన రక్త♦కణములెల్ల
వెల్లువంబోలెఁ దోఁపంగఁ♦దెల్లనైన, విధుఁడు సూర్యునిపోలెఁగ♦న్పించుఁగనుఁడి!

క॥ దివి భువి జలనిధి రిక్కలు, పువులును మధుపములు కర్ణ♦ములు మాఱఁగ భూ
జ వితతి దళంబు లన్నియుఁ, జివుళులవలెఁ దోఁచుచున్న♦చిత్రము గనుఁడీ! ౧౧౪౪

మ॥ కెరటంబుల్ గజదంత మౌక్తికములన్ ♦ గ్రేఁదొట్టి త్రోవంగఁ బెం
దరువుల్ గూలఁగఁ బక్షిసంఘములు సం ♦ తాపించి కూయంగఁ జా
మరముల్ టెక్కెము లాతపత్రములు క్ర ♦ మ్మన్ ఫేన బృందంబుగా
దరులై పీనుఁగు లొప్పఁగాఁ బఱచు ర ♦ క్తప్రాఁదినుల్ గాంచుఁడీ!

మ॥ కరి యూథంబులు తీరభూములు భుజా ♦ స్కంధాలు సర్పాలుగాఁ
దురగశ్రేణి తరంగపాళి కర సం ♦ దోహంబు నక్రాలిగా
నరి వీరాస్యము లంబుజాతములుగా ♦ నాంత్రంబులే నాచుగాఁ
బెరనుల్ వండలియైన నల్లమడువుల్ ♦ వీక్షింపుఁ డిప్పట్టునన్. ౧౧౪౬

తరువోజ॥

కరవాలములను నా♦గళ్లుగాదున్ని, కర మొప్పఁ బలల పం♦కమ్మున నల్ల
విరవారు నీడను♦వేదండ మహిష, వితతి పొరలుచుండ♦వీరులన్ కృషిక
వరులు మస్తములను♦పద్మముల్ మొలవ, వరుసఁ గలుపు దీసి♦వైచిన పగిదిఁ
గెరలిన యీరణ♦క్షేత్రంబు గనుఁడి, కీశవర్గములార! క్రేఁగంటనైన. ౧౧౪౭

తే॥ రాక్షసుల పెనుమేనులు♦రాలుచుండ, రామ కోదండ శింజినీ♦రావ మొప్ప
నవనిఁ బీటలు వాఱఁగా♦నందు చొచ్చు, శోణితాపగలం బుట్టు♦నుడులఁ గనుఁడు!

మ॥ భుజముల్ గ్రీవ లురంబులుఁ గవుసులుఁ ♦ ముంగాళ్లు ముంజేతులుఁ
గిజురుఁ నజ్జుగ దంచి త్రుంచి యట ది♦గ్వీథుల్ విదారించి య
క్కజమై చొచ్చె రసాతలంబనుచుఁ బ♦ల్కంగ వచ్చు గాకీ మతం
గజ వాహాదుల రామ మార్గణము నొ ♦ క్కండేని వీక్షింతు గే! ౧౧౮౯

సీ॥ అమృతంబుతో నుద♦యంబందు గజములు, పదికోట్లు మేఘముల్♦వారినిధులు
వట్టినను మదంబు♦వట్టని వజహోమ, కుండజ కరులు పం♦ద్రెండుకోట్లు
ప్రాణముల్ పోయిన ♦ రక్తంబు వట్టినఁ, బొగరు మాననివియుఁ ♦ బూర్వదంతి
వంశంబు గలయవి ♦ పదునాల్గు కోట్లును, బ్రహ్మ కకుబ్భర ♦ వహనకార్య
తే॥ మునుపకుండుటచే నూర♦కున్న యవియు, నపర దిక్కరి వంశంబు♦నందు పొడము
పద్మసంఖ్య యింద్రుండిచ్చు♦వాసితోడ, వేయికోట్లు లెక్కకురావు♦పెరల యీవి.

సీ॥ కలశ వారాశిలోఁ ♦ గలిగిన వేలకో, లందు లీగుజ్జంబు ♦ లందు గలవి
వరుణుని గెల్చిన ♦ తరుణమందునఁ గొన్న, యవి నిధీశుఁడు పోవు♦నపుడు విడిచి
పోయిన యవి కోటి♦పౌనర విద్యాధర, ప్రభుఁ డొసంగిన యవి♦పద్మ సంఖ్య
తక్కువార లొసంగు ♦ తత్తడులకు లెక్క, లేవు సైంధవముల♦ప్రోవు లివ్వి
తే॥ యెల్లలోకంబులందుండి ♦ యెల్ల దీవు, లందునుండి వచ్చినయది ♦ యసురసేన
మూలబలము వచ్చినయది♦ముగిసినదియు, నని విభీషణుఁ డనఁ బ్లవ♦గాలిచూచి.

ఉ॥ మిత్రవరేణ్య! యిట్టు లని ♦ మేమవిరోధి బలంబు చూపినన్
జిత్రముగాఁగఁ జూచినను ♦ చెందదు దీనికి నంత మెన్నఁడున్
గోత్రవిభుం గనుంగొనెడి ♦ కోపుననున్నది చాలునిఁక్డ సా
మిత్రి ధరాత్మజావిభు స ♦ మీపము చేరఁగఁ బోదమా యనన్.

చ॥ సరియన నందఱుం గలిసి ♦ సారసనేత్రుని చెంతఁ జేరి య
త్యురుతరభక్తి మ్రొక్కి సమ ♦ రోర్విని రాముఁడు చూపు సాహస
స్ఫురదతి విక్రమంబులను ♦ చోద్యముగాఁ బలుమాఱు లెంచుచున్
జరుగగనున్న కారియము♦చక్కటి యారయుచుండి రచ్చటన్. ౧౧౯౩

33. రావణ రణరంగ దర్శన పటలము. (౨౭)

తే॥ సురలుకష్టంబులొందవా♦నరులబలము, క్రుంగఁదతిమిలక్ష్మణుఁగూల్చి♦పొంగివచ్చు
మోదమున రావణుఁడు తన♦పురము చేరి, యుత్సవముచేయ మదిలోన♦నుత్సహించె.

క॥ తనమీఁది ప్రేమచేతం, జనుదెంచి దూరంబు సేయు ♦ సంగడికాంద్రం
దనుపఁగ వివిధ పదార్థము, లనువొందఁగ వండుఁడనుచు♦నాజ్ఞాపించెన్. ౧౧౯౫

క॥ వేలుపుల వడిగ రండని, మీలోకమునందు గలుగు ♦ మేలి సుఖములన్
గీలింపుం డీ లంకను, జాలము వలదనుచుఁ జండ ♦ శాసన మొసఁగెన్. ౧౧౯౬

ఆ॥ మంచి కల్లు మంచి ♦ మాంసంబులును వస్త్ర, ములును చందనంబు ♦ పుష్ప వితతి
తానమునకు నీరు ♦ తల్పంబులును దళ, వదను నగరు చేర ♦ వచ్చి నిండె.

తే॥ తావి సంపెఁగ తైలంబు ♦ తలలకంటి, తావినీట బోర్కాడించి ♦ తనియ భోజ్య
వస్తువులనిడి తల్పముల్ ♦ వలసినట్లు, సవరణలు సేయ వచ్చి ర ♦ ప్సరస లటకు.

క॥ పాడిరి కొందఱు పొలుపుగ, నాడిరి కొందఱు నలంతు ♦ లరుదని పొగడన్
గూడిరి కొందఱు సెజ్జల, వేఁడిన సిద్ధులకుఁ బోలె ♦ వెలసిన వెల్లన్. ౧౧౫౯

ఆ॥ రాజసుతులు మొదలు ♦ రాక్షసావళిదాఁకఁ, గొలువు సేయుచున్న ♦ కోడెకాండ్ర
కింద్రభోగ మప్పు ♦ డింపారఁ గలుగుట, వలనఁ గలుగు గెలివి ♦ కలవిలేదు.

తే॥ ఇట్టు లుల్లాసమున నున్న ♦ యింద్రవైరి, విభుని యెదుటికి వచ్చిన ♦ వేగులప్పుడు
కేలు మోడిచి చెవిడాసి ♦ మూలబలము, సమసిన విధంబు వ్రాక్రువ్వ ♦ సాగినారు.

ఆ॥ వడఁకుచున్న మేలు ♦ వరటిన నాల్కలు, బెదరు చూపులెడఁద ♦ పిదపిదమనఁ
దక్కు తాఱి నత్తిఁ ♦ దడఁబడు పలుకులు, తొలఁక దూతలిట్లు ♦ వలికినారు. ౧౧౬౦

ఆ॥ విజయశీల! చనిన ♦ వేయి వెల్లువలును, రణమునందు నిలిచి ♦ రాము నేక
కార్ముకమున నేడు ♦ గడియలలో ప్రమాలె, నిందు కుడుచు విందు ♦ లెవ్వరింక?

చ॥ బలిమిని దేవభోగముల ♦ బ్రాఁతిగ దైత్యుల కిందు కూర్పఁగాఁ
దలఁచితి సీతలంపులు వృ ♦ థాచనె లంకను గల్గువారె యి
య్యిలఁ గల వార లౌదురు మ ♦ ఱెందును లేరెవరింక పీన నీ
బలముల కంతిమక్రియలు ♦ పాయక యీయెడఁ జేయఁగాఁ దగున్.

చ॥ మితి యొనరింపరాక యను ♦ మేయ ముదంబును పొందియున్న యా
దితిజవరేణ్యుఁ డా చరులు ♦ తెల్పిన పల్కులు విన్నయంతనే
యతిభయ దుఃఖ కోపముల ♦ నంది ప్రచండ తరోగ్ర దృష్టులన్
బ్రతిమనుపోలి నిల్చి వెఱ ♦ పాఱఁగఁ గాంచుచు నుండి యవ్వలన్.

క॥ బలవంతులు నాకంటెను, పలువురు నరు నొకని ధనువు ♦ వలన నొకండున్
గలికమునకైన మిగులక, నలఁగిరె యిది నమ్మఁజాల ♦ నమ్మంజాలన్. ౧౧౬౬

చ॥ అనవిని మాల్యవంతుఁడను ♦ నయ్యది సంశయమందఁ దగ్గదే!
పనిచిన దూతలే తసుకు ♦ పల్కుదురే? నరుఁడొక్కఁ డిందఱిన్
దనుజుల నేలఁగూల్చు టది ♦ దబ్బఱగాదు సమస్త జీవులన్
బనిగొని కల్పవేళ బలి ♦ వారెడు రుద్రుఁడు నొక్కఁడే కదా? ౧౧౬౨

శా॥ సంకల్పంబున సృష్టిచేసి జగముల్ ♦ సంరక్షయున్ నాశమున్
బొంకం బారఁగఁ జేయువాఁడు గుణ సం ♦ పూర్ణుండు సర్వేశ్వరుం
డింకన్ సందియమేల యాతఁడగుఁ జు ♦ మ్మీ యంచు సీతమ్మఁ డా
తంకం బేమియులేక పల్కిన దస ♦ త్యంబౌనె? లంకేశ్వరా! ౧౧౬౪

ఉ॥ ప్రాణులు భోజ్యమైన యొక ♦ వస్తువు గైకొను నైజరీతి ; ని
ర్వాణము గూర్చి యన్నిటిని ♦ వహ్నిభుజించును మీఱుచో జగ
త్ప్రాణుఁడు కొండలం దృణము♦గ్రమ్మఁకులఁ ద్రొబ్బులఁ గూలఁద్రోచు నా
త్రాణకు నొక్క మేరగల ♦ దా వచియింపఁగ ? రాక్షసేశ్వరా ! ౧౧౧౯

చ॥ చెలఁగుచు నింద్రభోగములఁ ♦ జెందిన కాలము కద్దు తత్థ్సితుల్
తొలఁగినదంట నిక్కమున ♦ దూరముగాదు ప్రతిక్రియా విధుల్
గలుగవు నీకునై లయము ♦ గాంచిరి బంధులు శిష్టవర్గముల్
మెలఁగెడి త్రోవఁ బొమ్మనుడు ♦ మిక్కిలి కిన్క నిశాటరాజనున్. ౧౧౨౦

శా॥ సౌమిత్రిం దెగటార్చితిం గలన నా ♦ శక్తిం బ్రయోగించి దు
ర్వ్యామోహంబున మగ్నుఁడై సమసెదున్ ♦ రాముండు శాఖామృగ
స్తోమంబుల్ నశియించు మూలబలముల్ ♦ శుష్కింపనీ యూడనీ
యేమైనం బనియేమి ? గెల్పు తుది నా ♦ దే యయ్యె నిన్నాళ్లకున్.

ఉ॥ శోషితదైత్య హృచ్ఛశి వి♦ధుంతుదు నట్టులు చారుఁడొక్కఁడు
ద్ఘోషముతోడ మోఁకరిలి ♦ కొంకుచు వాయు కుమారకుండు ది
వ్యౌషధులోలిఁ దెచ్చి పొలు ♦ పొందఁగ నీయఁగ లక్ష్మణుండు త
ద్భేషజ శక్తి లేచెఁ దెలి ♦ విం గొనినారలు వానరోత్తముల్ ౧౧౨౨

తే॥ అనుడు నమ్మాక పెనునంది♦యంబు కలఁప, గోపురము మీఁదికిం జని♦దాపురించు
సైన్యనాశంబు సత్యంబు♦నరగఁ గాంచె, వాడు కన్నులతో మది♦నూఁడుచుండ.

క॥ పోరున మరణించిన యా, వీరుల వనితలు సబాష్ప♦వీక్షణ లగుచున్
బోరున విలపించెడు దీ, నా రావము శ్రవము లగల♦నాతఁడు వినియెన్. ౧౧౨౪

తే॥ ద్విరదముల నీడ్చుకొని పెను♦దరుల నొరసి, యేగు రక్తనదులలోన♦నీఁదులాడు
చుండు శాకినీ డాకినీ♦మండలులను, గుండె లగలంగ దశకంధ♦రుండు గాంచె.

తే॥ జంబుకంబుల రవము రా♦గంబుగాఁగ, భూత కరతలధ్వని తాళ♦ములుగ రామ
బాణ నిహత కబంధముల్♦ప్రాణమున్న, నటుల పోల్కి నటించుచుం♦డుటను గాంచె.

చ॥ కవిసి పిశాచముల్ పతుల ♦ గాయములం దమ కేలు చొన్పి క్రొం
గవుచును వెల్కి నీడ్చుటను ♦ గాంచి రుషాభర చిత్తలై సతుల్
దివిభువి దిక్కులం దతిమి ♦ దెత్తుల గ్రుడ్లను తీయుచుంట దా
నవకుల సార్వభౌముఁడు మ ♦ నంబు దిగాలనఁ గాంచెఁగన్నులన్.

శా॥ జాతీయంబులఁ బోలి లెక్కకును హె ♦ చ్చైచ్చ యొప్పు రామాస్త్ర నం
జాత ప్రస్ఫుట దైత్యరక్తముఁ బిశా ♦ చశ్రేణి యుప్పొంగి యా
బూతిం ద్రావుచుఁ గ్రక్కుపోల్కిఁ దనకున్ ♦ ద్రెమ్మొగ్గైన వీచీముఖ
స్ఫీతిన్ ముందుగఁ ద్రోచు నాజలధిఁ గాం ♦ చెన్ రావణుం డయ్యెడన్.

సీ॥ దెసలు బీటలు వాఱఁ♦దివిరి మహోగ్రనా, దము సేయు కపి సము♦దయము గాంచెఁ
గువలయ మడఁగఁ ద్రొ♦క్కుచు నర్తనము సేయు, దైత్య కబంధ బృం♦దంబుఁ జూచెఁ
దనభీతి పొలివోవఁ ♦ గనులు పెద్దవి చేసి, కొన్ని నిలింపుల ♦ గుంపు గనియె
గుండెలు పగుల నా ♦ క్రోశించి గోపుర, మందుండి వివశుఁడై ♦ క్రిందఁ బడియెఁ
తే॥ పిదప నట్టహాసంబుతోఁ బెదవులెండఁ, గినుకతో మిణుంగుఱు లేచు♦కనులతోడ
కలుష హృదయంబుతో వచ్చి♦కొలువుచేరె, రావణుండు సంగర జితై♦రావణుండు.

౩౪. రావణ రథారోహణ పటలము. (౩౫)

తే॥ చేరి లంకయందిఁక నున్న♦సేనయెంత, యంత మొత్తము మాయితము సే♦యంగఁ బనుపు
వేగ మ్రోయింపు ప్రస్థాన♦భేరి యిపుడ, యని మహోదరు వీక్షించి♦యాజ్ఞయిడియె.
తే॥ భేరి విన్న వెంటనె రణ♦శూరులైన, సేన పదునాల్గు కోటులు♦చేరె నొకట
విజనమై కళా శూన్యమై♦ పేదవడియెఁ, గాఁపురము లేని పగిది లం♦కాపురమ్ము.
తే॥ ఐహికాముష్మిక ఫలంబు ♦ లందఁ జేయు, పూజనము పరమేశున♦కొసఁగఁ జేసి
కోరువారల కర్థముల్ ♦ కోరినంత, యిచ్చి రావణు డనికి నా ♦ యత్తపడియె.

చ॥ ఝగములతోడి నీలగిరి ♦ సంగతి వేవురు భాస్వరుల్ వెలుం
గు రహిని దాల్చి బ్రహ్మ మును ♦ కోరిన యింద్రుని కీయఁ దాను సం
గరమునఁ దన్ను గట్టుతఱిఁ ♦ గాన్కఁగఁ బుత్తున కిచ్చినట్టి వ
జ్ర రుచిరమై యభేద్యమయి ♦ రాజిలు కత్తళ ముద్ధతంబుగన్. ౧౧౮౨

తే॥ మందరమ్మున వాసుకి♦మలసినట్లు, పొలుచు దట్టిపై నడిదంబు♦వెలయఁ జెరివి
కనకగిరిఁ జుట్టి వచ్చెడు♦గ్రహములట్లు, పొనరు రతనాల కటిసూత్ర♦మును ధరించి.
తే॥ గరుడి తెక్కలు విరిసిన ♦ కరణినొప్పు, గులుకుఁ గుచ్చెళ్లు నవరించి♦మెలికవడిన
పట్టువస్త్రంబు విచ్చిన♦పగిదిఁ దనరు, రజత ఫణినాఁగఁ జను కాసె♦రమణఁ జుట్టి.
తే॥ మెఱుఁపులంబట్టి కూర్చిన♦ తెఱఁగు సింహ, సముదయంబులు గర్జించు♦చందమునను
రవళిసేయుచు శత్రుల♦చెవులు వ్రచ్చు, గజ్జెలం గూర్చు నందెలఁ♦గాళ్లఁ దాల్చి.
ఆ॥ పిడుగు నులివు విన్న♦బెదరు సర్పంబుల, కరణి విన్నయంత♦నరులు సురలు
వెఱచి పాఱునట్టి♦భీషణ రవ మొప్పు, వీరమద్దియలను♦వెలయఁ దాల్చి. ౧౧౮౩
తే॥ నాలుకలు చాఁచు పాములఁ♦బోలియున్న, చేతు లిరువదింటికి నఱ♦చేతులకును
వ్రేళులకును గోధా చర్మ♦విస్ఫుటంబు, లైన కవచంబులను పొలు♦పందఁ దొడిగి.
తే॥ పాఁపరాజును పోలిన♦పాశములను, భుజములం దాల్చి కరసాన♦పొనరఁ బట్టు
తఱిని రవినుండి రాలిన♦కిరణరాశి, లలిని కాంతు లొలుకు కుండ♦లములఁ దాల్చి.
తే॥ బాలభానుని కిరణముల్♦ప్రాగ్గిరిపయి, వ్రాలు తెఱఁగున నొప్పారు♦రక్తగంధ
మలఁదినట్టి బాహులమీఁద♦నర్కఁ బోలు, కుండలంబుల కాంతులు♦నిండి పరవ.

సీ॥ చంద్రునితోడి ఋ♦క్షముల చందంబునఁ, దారహారంబు కం♦ధరను గ్రాల
ద్వాదశాదిత్యులు♦వనధిపైఁ దోఁచిన, పగిది రత్నకిరీట ♦ పంక్తి తనరఁ
బెక్కుచంద్రుల పోల్కి♦విలసిల్లు ముత్యాల, గొడుగులు తలలపై♦బెడఁగునూప
సంజ పాలికలందు♦శశుల నుంచినలీల, గుహవంటి నోళులఁ♦గోఱలొప్ప [లొలుకు
తే॥ ముత్తెములు కూర్చుటం జేసి♦మురువు తెలుపు, నుదుటి వీరపట్టంబులు♦మదము
దిగ్గజమ్ములపట్టంబు♦ తెఱఁగు దాల్చి,ముందఱికిఁ బ్రక్కలకుఁ గాంతి♦ మొనయుచుండ.
తే॥ పాలయులుకవహింయించిన♦పూవుఁబోండ్ల,పదములకు మ్రొక్కని కిరీట♦పంక్తికాంతి
భాస్కరుని గెల్చి మించిన♦పగిది నిరుల, తోరపుం గుంపులను వెలి♦దోలుచుండ.
తే॥ స్వర్గ మర్త్య పాతాళముల్♦సగవిగెలిచి, లీలఁదాల్చిన విజయమా♦లికలతోడ
చెలుల దృష్టులచేఁ జాల♦చెలువుగులుకు, తుమ్మి పూమాల యురమున♦నెమ్మిఁదాల్చి.
తే॥ పురికి నగడితగా నున్న♦శరధి యిసుక,కాలమును మీనములు విద్య♦కలిమి యుపమ
పడవు పంచభూతమ్ములు♦చెడినఁ జెడని, యశముఁ బోలిన తూణీర♦మమరఁదాల్చి.
తే॥ఒక్క మొగిమూఁడులోకంబు♦లెక్కినను వ, హింపఁగలయదితురగరా♦హిత్యమయ్యు
తలఁపు మాత్రానఁ బోనంగఁ♦దగిన తేరు, రమ్మనిన యంతవచ్చి య♦గ్రమున నిలిచె.

చ॥ అమృతముతోడఁ బుట్టినవి ♦ యర్క జవాశ్వ కులంబులోని వం
గముగ మరుత్తుచే బడబ ♦ గర్భమునం జనియించినట్టి వ
భ్రమున జలంబునం దనల ♦ వాయు పథంబులఁ బోవునట్టి వా
చ్చెము గనరాని యశ్వములు ♦ చెల్వుగవేయి రథంబు లాగఁగన్.

సీ॥ కనక దిగ్గజ కంఠ♦ఘంటికా నిభములౌ, గంటలు వేకోట్లు♦గలిగినయది
అండంబులను విక్ర♦యమునకుఁ గొనఁజాలు, వెలలేని మణులచే♦వెలసినయది
మునులు సురలు యుద్ధ♦మున నోడువార లౌ, సంగు కైదువుల నె♦సంగినయది
శూలి శూలంబు వి♦ష్ణుని చుట్టుకైదువు, విఱిగిన విఱుగని♦యొఱపుగలది
తే॥ విబుధులేనియు నూహించి♦విస్తరింప, లేని శిల్ప నైపుణిచే వె♦లింగినయది
సత్యముంబోలె మహిమకుఁ♦జాలినయది, విజయలక్ష్మికి నిలయ మా♦విభుని తేరు
తే॥ అట్టితేరిని వలగొని♦యసుర విభుఁడు, శాస్త్రరీతి నర్చించి యా♦చక కదంబ
మునకుఁ దృప్తి యాత్రాదాన♦ మొనరఁజేసి, వంది మాగధుల్ సేవింప♦నందుచేరె.
తే॥ ఎదల దార్ఢ్యంబుగొనియున్న♦యింద్రముఖ్యు, లప్పు డదిగనిచాంచల్య♦మందినారు
ఇంద్రియముల గెల్చిన తాప♦సేంద్రులును స, మస్త జీవులు భీతిల్లి♦మలఁగినారు.

చ॥ సమరము సేయఁబూనితిని ♦ సర్వజగంబులు మెచ్చ నేటి కు
త్క్రమణము తప్పదింక రఘు ♦ రామునకో మఱి నాకొ ? ధారణీ
కుమిలి నశించుచెల్వ బుపి ♦ కూఁతురొ ? యమ్మయుకూఁతురో ? యటం
చమలిన మేఘభీషణ మ ♦ హాధ్వని రావణుఁ డాడె నత్తఱిన్. ౧౨౦౦

సీ॥ పదికుత్తుకల మీఁదఁ♦బదితలల్ బొమిడికల్, ములతోడ రవుల చొ♦ప్పున వెలుంగ
నిరువది హస్తంబు♦లిరువది కైదువు, లలరంగఁ దాల్చి ని♦శ్చలత నెసఁగ
భూజనంబులు స్వర్గ♦మునవారు భీతిలఁ, బెకలి నభంబు చీ♦లికలుగాఁగ
శైలముల్ వగులంగ♦నేల బీఁటలు వాఱ, సూర్యుండు తన గతి♦నూటిదప్పఁ
తే॥ జంద్రుఁడమృతంబు చిందించి♦స్రగ్గి కుంద, వేలుపుల విమానంబులు♦వ్రీలి కూల
సింహనాదంబు గావించె♦సిద్ధ సాధ్య, గణము బెదరంగ నా జగ♦త్కంటకుండు.

క॥ ఘోర రణము గలిగినదను, ధీరతతో శింజినీ రు♦తిం గావించెన్
మీఱిన భయమున ఖేచర, దారలు దమ సూత్రములను♦తడవికొనంగన్.

సీ॥ ఇన శశాంకులు చలి♦యించెదు తెఱఁగు చూ, పించు పాథోరాశి♦మించిపోంగఁ
గల చరాచరములు♦గందరగోళంబు, నొంద ననంతుండు♦కుంది కుమిలి
శిరములు వే విది♦ర్చికొని భూమికి లేచి, వచ్చెనా నసురారి♦వచ్చె ననికిఁ
గన్నులు బడబాగ్ని♦కంటె మిక్కిలి గ్రాల, వచ్చిన రావణు♦వైనమునకు
తే॥ ప్రాణివర్గంబు కలఁత ని♦ర్జరుల చింత, పర్వతావనీ గగన వి♦భ్రమణ రీతి
జలధి చలనంబు రవి సుతా♦దులు గ్రహించి, యేమి కారణమని శంక♦నెనసినారు.

తే॥ అండగోళమే పగిలిన♦దనఁగఁ దోఁచు, గొప్పశబ్దంబు తడఁబాటు♦గొంప లెరియు
కాలమునఁబుట్టు కలఁతయుఁ♦గలిగెననుచుఁ, గతము నెఱుఁగక లేచె న♦క్కపిచయంబు.

తే॥ సాగరములును శైలముల్♦జలదములును, స్వర్ణగిరియును నభమున♦జరుగు కరణిఁ
దోఁపఁ దేరెక్కి బంతి కు♦త్తుకల వాఁడు, బలముతో వచ్చు నాకల♦కలము గనిరి.

మ॥ కని భూనాయక లెమ్ములెమ్ము దనుజ ♦ క్ష్మాపాలవర్యుండు తా
ననిసేయం దమకించి వచ్చెఁ దన పై ♦ న్యాగ్రీయ భాగంబు డా
సెను శాఖామృగముల్ భయంబునఁ జలిం ♦ చెన్ వేలుపుల్ తెల్వి మా
లిన వారైరని యవ్విభీషణుఁడు తె ♦ ల్పెన్ రామ భూజానికిన్.

౩౫. రామ రథారోహణ పటలము. (౨౮)

మ॥ కరముల్ మోడిచి నోళ్ళులెండఁ దనువుల్ ♦ కంపింప బెగ్గిల్లుచున్
వెరఁ దబ్బిబ్బును పొందు కీశచయమున్ ♦ వీక్షించి రాముండిఁకన్
వెరఁగుం బొందకుఁడంచు లేచె విబుధుల్ ♦ వేఁడంగ దుగ్ధాబ్ధిపై
నురగేశానుని సెజ్జ వీడు తఱి ను ♦ ద్యోతించు చందంబునన్. ౧౨౦౮

ఉ॥ లేచి కృతాంతు వాలమును ♦ లిక్కఁగఁ దెల్పు నరాజిఁ జెక్క నా
ఖేచరపాళికిన్ భువన ♦ కీర్తిత పూతకు సీతకున్ సదా
యేచు మహార్తియున్ జలధి ♦ నీఁదఁగఁ దెప్ప లభించె నేఁటికిన్
జూచుచు నుండుఁడీ రణము ♦ శోభిలు పద్ధతి యంచుఁ బల్కుచున్.

ఉ॥ రాముని దేహముఁ గవచ♦రాజము గప్పినదంచుఁ జెప్పఁగా
నేమిఫలంబు? భావమున♦నెంచిన మాత్ర సమస్త వస్తువుల్
రామునిచేరు వేఱొకటి♦రాముఁడు లేనిది లేదు సర్వముఁ
రాముఁడె కాఁగఁ గంకటము♦రాముఁడు కాదొకొ మాటలేటికిఁ?

తే॥ హస్తములకు నంగుళులకు♦నమరఁ గవచ, ములను తొడిగి జగమ్ములఁ♦గలుగు ద్రవ్య
ముల విధంబున మితిలేని♦యలుఁగులు గల, శరధి వీఁపునఁ దాల్చె దా♦శరథి యపుడు.

ఉ॥ నిర్జరులార! సంగరము♦నేఁటికిఁ బూర్తిని చెందు మీకు నా
దుర్జనుచే భయంబు నిఁక♦దోరెను రాక్షసు నోర్వఁ గయ్యపుం
గర్జమునందు రాముఁ డెస♦కంబున నుండఁగ మీరథంబు నిం
దూర్జిత సత్త్వుఁ డాతనికి♦నొప్పగ నంచు భవుండు తెల్పఁగఁ. (౨౧౧

చ॥ సురలును సమ్మతింప బల♦సూదనుఁ డయ్యెడ నారథంబు శ్రీ
వరునకు నాలయంబుగను♦భక్తి నొనర్చెదనంచు మాతలిఁ
బరఁగ నలంకృతుల్ సలిపి♦వైభవ మెమ్మనఁ దెచ్చె నాతఁడుఁ
బరమ శివుండు బ్రహ్మయును♦భావములం బ్రమదంబు నొందఁగఁ.

సీ॥ చందురు బింబంబు♦క్రింది పటువుగాఁగ, నున్న చందంబున♦నుల్లసిల్లి
కులపర్వతముల యు♦క్కును గల శిఖరంబు, తక్కు నంగంబులు♦దధిమగలిగి
వర్షర్తు మాస ది♦వారాత్ర భూత భ, విష్య తత్కాలంగ నం♦వితతినొప్పి
తారకాహార య♦క్తంబయి యష్ట మహా నాగ పాశ సం♦దానితమయి

తే॥ దెసలె ప్రక్కలుగా మేఘ♦విసరమే ప, తాకలుగఁ బంచభూత స♦త్త్వంబు నమరి
ప్రళయ జలధి ఘోషమె నేమి♦రవముగాఁగ, నడరు నింద్రుని తేరు పు♦ణ్యముల సొగు.

సీ॥ నలువ పుట్టిన విష్ణు♦నాభి పద్మంబును, పోలిన నాగెంపు♦మొగ్గ లమరి
జగదుదరుని శేష♦శయ్య యంతటి పటు, పంది వేదంబులు♦యజ్ఞములును
సాగరంబులు కుల♦శైలముల్ భువనముల్, త్రేతాగ్నులును పంచ♦భూతములును
తపము లింద్రియములు♦దశదిశల్ రేయియుఁ, బగలు గుఱ్ఱాలుగాఁ♦బరిఢవిల్లి

తే॥ నిలుచు తేరిని కని మ్రొక్కి♦నిర్జరాలి, ప్రభుని యాజ్ఞను వచ్చితి♦రామ విభున
కని జయము గూర్చి మమ్మను♦మనువు మనుచుఁ, బ్రసవములు చల్లి పూజించి♦పంపిరంత.

చ॥ మాతలి చోదితంబయి వి♦మాన పథంబున నుండి కర్మ సం
ఘాత విరోధి జ్ఞానమనఁ♦గ్రాలుచుఁ జిత్తముఁబోలి వేగ వి
ఖ్యాతి యొసంగు తేరు వడి♦నాఁ బఱతెంచి మహీజ చిత్త కం
జాత దినేశు సన్నిధిని♦చయ్యన వ్రాలె ఖగేంద్రు కైవడిఁ.

ఉ॥ అర్యము తేరుగాదు విల♦యానల కాంతియుఁగాదు భూమిభృ
ద్వర్యము గాదజాదుల న♦వారణ మాయ విమానమేమొ? యే

కార్యముపొంచె నేరు కడఁ♦కం డగ నంపి రెవండవీవు? ప్రా
చుర్యము గాఁగఁ దెల్పుమనఁ ♦ జోదకుఁ డార్యున కంత నిట్లనున్.

ఉ॥ ఓమహనీయ భాస్కర కు ♦ లోదధి సోమ! గుణాభిరామ! శ్రీ
రామ! నిశాచరాన్వయ వి ♦ రామ! పురారియు ధాత తొల్లి సు
త్రాముని కిచ్చి రీ రథము ♦ దార్ఢ్యముచే జగమెల్ల మోచు ను
ద్దామ జవంబు నొందినది ♦ దాశరథీ! విహరింపు దీనిపై. ౧౨౨౨

సీ॥ కామ రూపంబును♦కామ సంచారంబు, గలయది వెన్నుని♦కడుపువంటి
పటువయి నీతూపు♦వడిగల్గి యెద గాలి, కనులను ద్రిమ్మఁగఁ జా♦లినది దివియు
భువియను భేదంబు♦పొరయని దగ్నిని, జలమునందును పోవఁ ♦ జాలినయది
సాగరంబులు భూమి♦జగములు స్థితులలో, మార్పొందు నట్లిది♦మాఱకుండు

తే॥ నలువ చిలువతాలుపు వేలు ♦ పులును మునులు, శ్రద్ధమెయిఁ దెల్ప మఘవుండు ♦ సాంద్రభక్తిఁ
బంపె నిందెక్కి నీ పగ♦వాని గెలుమ, యనుచు సర్వ హృదయ చణుఁ♦డానరఁ బలుక.

మ॥ దనుజాధీశ్వరు మాయయో యనుచుఁ జి♦త్తంబందు సీతేశ్వరుం
డనుమానింపఁగ రథ్యముల్ నిగమ వా ♦ క్యశ్రేణిఁ బ్రార్థించి యీ
తని వాక్యంబుల నమ్ముఁడీ యితఁడు వృ♦త్రద్వేషి పోత్రుండు నీ
యనుజన్మంబలె నుండు మాతలిచుమీ ♦ యంచుం బ్రశంసింపఁగన్.

మ॥ అనుజుండున్ హనుమ ద్విభీషణులు స ♦ త్యంబిద్ది నిశ్శంకమౌ
నన దుష్కర్మము లెండ సత్కృతులు స ♦ మ్యగ్రీతి మిట్టాడఁ బొ
ల్పున నవ్వేల్పుల కేలుమోడ్పు లెసఁగన్ ♦ భూదారుఁ డాతేరు మె
ల్పున నారోహణ మాచరించె జగముల్ ♦ మోదంబునం బొందఁగన్.

౩౬. రావణ వధ పటలము. (౨౫౩)

భుజంగప్రయాతము॥
జగద్వీరుఁడౌ రామ♦చంద్రుండు ప్రీతిన్, నగరాతి తేరెక్కి♦నం గాంచి దివ్యుల్
ఖగాధీశ్వరు న్మాని♦కాకుత్స్థుపై నా, శుగాత్మాంశు పైనింబ్ర♦సూనాలి చల్లన్.

ఆ॥ తేరు నడమఁగాక ♦ దివ్యుల బలములు, రాముఁ జెందుఁగాక ♦ రావణుండు
చచ్చుఁగాక దనుజ ♦ జాయ లేడ్తురుగాక, యనుచు నమరవర్యు ♦ లాడుచుండ.

ఉ॥ రాముఁడు తేరిపైఁ గదలె ♦ రావణుఁ డయ్యది గాంచి మండి సు
త్రాముని మీఁది కిన్కను ర ♦ దంబులు గీఁటుచుఁ దేరు సంగరో
ద్దాముని మీఁదికిం జన న ♦ దల్చుచు సారథి కేఁపి ఘోర సం
గ్రామము సేయు కోర్కి తన ♦ రన్ బఱపించెను గాలికై వడిన్. ౧౨౨౩

ఉ॥ ఇచ్చిరి తేరు వేల్పులు ది ♦ నేశ కులేశున కింక రాముఁడే
వ్రచ్చు దశాస్యునంచు మును♦పాఱిన కీశులు ధీరచిత్తులై
వచ్చి గిరీంద్రముల్ శిలలు ♦ వైచిరి రావణుమీఁద నాతఁడుఁ
జెచ్చెర వానిఁద్రుంచి యొక ♦ సింహరవం బొనరించు నంతటన్.

చ॥ చెవులను చిల్లు లేర్పడఁగ ♦ శింజిని రావము సింహనాదముల్
దవులఁగ శంఖ దుందుభి మృ ♦ దంగ రవంబులు కాహళ ధ్వనుల్
వివిధములైన గర్జనలు ♦ వెల్వడ దిక్కులతో నజాండమే
పవిలిన చందమై స్వనము♦పర్వె జగంబులు చేష్ట దక్కఁగన్. ౧౨౨౫

తే॥ మాతలిం గాంచి రాముండు♦మహిత చరిత! యుత్సహించిన శాత్రవో♦ద్యోగవిధము
నదను నాయభిప్రాయంబు♦నల్ల నెఱిఁగి, తేరు నడపుదు గాకని♦ తెలుప నతఁడు.

ఉ॥ నీతలఁపున్ దురంగముల ♦ నేర్పును శత్రుల చిత్తమున్ రణ
స్ఫీతియుఁ దారతమ్యమును ♦ సంకటపా టనుకూలపాటు మీ
నీతియుఁ బట్టుపట్టు గమ ♦ నించి చరించినఁగాక నాదు వి
ద్యాతిశయంబు సార్థమగు ♦ నా? యని తృప్తుని చేసె రాఘవున్.

తే॥ ఇంద్ర రథముపై రాఘవుఁ♦డేగుదెంచె, నిరువురకు మీకు ఘోరసం♦గరము జరగు
నేను సాక్షినై యుండంగ♦నేల? యేమి, యాజ్ఞయని మహోదరుఁడు ద♦శాస్యు నడిగె.

ఉ॥ సింగము దంతిపై కుఱుకు ♦ చెల్వున దూఁకెద రాము మీఁదికిన్
బొంగడఁగించెదన్ సురల ♦ పొంగును క్రుంగఁగ నీవు లక్ష్మణుం
సంగరమం దెదిర్చిన ని ♦ జంబుగ నాకు జయం బొసంగు దా
యంగునఁ జెంగనీక తెగ♦టార్చుము వాని ననంగ నాతఁడున్. ౧౨౨౯

—: రామునిచే మహోదరుండు కూలుట :—

చ॥ మరలి మహోదరుండు చను ♦ మార్గమునం దెదురైన రామ భూ
వరుఁగని యీనృపాలకుని ♦ పైకి రథంబును పోవనిమ్మనన్
వెరవరియైన సారథియు ♦ వీఁడెవఁడియై చననేల? పంక్తి కం
ధరు లోక వేవురైన చనిన ♦ దాశరథిం జెనకంగ నేర్తురే! ౧౨౩౦

ఉ॥ వాని గభీర ధైర్యమును ♦ వాని ముఖస్థితి నుంత కాంచుచో
వానిఁ దొలంగిపోవుటయె ♦ వారని క్షేమ పథంబు నావుడున్
వాని మహోదరుండు గని ♦ ప్రల్లద మాడెద వోరి నాదు కో
పానకుఁ బాత్రమై బ్రదికి ♦ బట్టయుఁ గట్టెదవే దురాత్మకా! ౧౨౩౧

ఉ॥ నీదగు కుత్తుకం గోఱికి ♦ నెత్తురు ద్రావిన దోసమున్నదే?
పైదలిఁ బోలువాఁడవని ♦ పల్కిన వాఁడుఁ గిచుక్కు నాక నీ

తా దయితుం గుఱించి యర ♦ దంబును తోలెను వారికయ్యెడన్
మోదన ఖేదనమ్ములుగ ♦ ముమ్మరమైన దురంబు సంధిలెన్. ౧౨౩౨

తే॥ వారువంబులు తేరులు♦వారణములు, వీరభటులును గలసైన్య♦వారిరాశి
రామశర బడబా వహ్ని♦ద్రావివైచెఁ, గ్రుదటి మహోదరుఁ డొంటియై♦దొరయ నిలిచె.

తే॥ ధ్వజముపైఁ దేరిపై వాగె♦పట్టియున్న, పోథపై వాఁడు సాయక♦పూరమొదవఁ
జేసి దిక్కులు గ్రీల గ♦ర్జించె రామ, విభుఁడు మందహాసంబు గా♦వించె సరవి.

చ॥ భవ నముఁడొక్క బాణమున ♦ వాని శరాసముఁ ద్రుంచి రెంటిచేఁ
గవచముఁ జించి వెంట భుజ♦గంబులఁ బోలిన కేలుఁద్రెంచి దా
దవులఁ బడంగఁ దచ్ఛిరము ♦ దారుణరీతిగ నుత్తరించె దా
నవుని తలంపు లొండయిన ♦ నాశిల వేఱొకటయ్యె నయ్యెడన్. ౧౨౩౫

పంచచా॥ మహోదరుండు ద్రెవ్వఁ గాంచి ♦ మానవాదుఁ డుగ్రుఁడై
యహోయటంచుఁ దేరు ద్రోల ♦ నాజ్ఞచేయ రాఘవుం
డోహో సమస్తసేన చావ ♦ కున్న వాఁడు లొంగడం
చుహూంకృతిం భజించునంత ♦ నుత్తరించె వారలన్. ౧౨౩౬

సీ॥ అత్తఱిఁ గలిగె లం♦కాధినాథునకు దు, శ్శకునముల్ గొన్నియు♦త్సాహమడఁగ
నండంబులను ముంచు♦నట్టు లుప్పొంగెడు, వననిధు లెల్లను♦వట్టిపోవఁ
జండవాయువు వీవఁ♦జలియించు పర్వత, సరణి నా నెడమభు♦జంబు లదరెఁ
బిడుగులు రాలెను♦భీకరంబుగ రక్త, వర్షంబు గురిసె వా♦ర్వములు వడఁకె

తే॥ ప్రభలు దక్కిన సూర్యుని♦పరిధి చుట్టె, నాల్క లెండెను వింటికో♦నలును విఱిగెఁ
బుష్పమాలిక లందుండి♦పొలచు వీచె, గృధ్రములు వ్రాలె వీణె కే♦క్కియముమీఁద.

తే॥ తురగముల కన్నులందుండి♦తొఱఁగె నీరు, కరులు బురదలో దిగఁబడు♦కరణి నొందె
మనుజులా గెల్చు వారని♦దనుజ విభుఁడు, వాని లెక్కింపఁడయ్యె గ♦ర్వంబు కలిమి.

తే॥ విలయ వాయువుచే జగ♦ద్వీథియందు, గలుగు వస్తువుల్ చెదరిన♦కరణి దనుజ
వరుని రథవేగమునకు వా♦నరులు చెదరి, విమతులై భీతిగొని త్రోవ♦విడిచినారు.

సీ॥ కర్మంబు జ్ఞానంబు♦కరణి నవిద్యయు, విద్యయు శేషుండు ♦ విహగరాజు
రాత్రియుఁ బవలు హి♦రణ్యకశిపు నృసిం, హులఁబోలె దిగ్గజ♦యుగళి యట్లు
ఎవఁ డాదిదేవుఁ డం♦చెదిరించి పోరిన, రుద్రాచ్యుతుల శేవ♦రోషమడర
దశకంధరుండును♦దశరథసూనుండు, రణరంగమున మహా♦రంభులైరి

తే॥ కాంచుచున్నట్టి రుద్ర వి♦రించులకును, కరతలంబులు మిక్కిలి♦కంపమొంద
రావణుఁడు శంఖమొత్తె ని♦ర్జరులు బెగడ, రాముఁడును పాంచజన్యంబు♦రమణనూఁదె.

తే॥ శ్రీశు పంచాయుధంబులు♦సేవసేయఁ, గోరి రాముని సన్నిధిఁ♦గొలిచి నిలిచె
వేదములు తన్నెఱుంగని♦విధిని రామ,చంద్రవిభుఁడును వానిఁగాం♦చకయ యుండె.

తే॥ దిక్కులునుజలధులుధరి♦త్రియునభంబు, కులమహీధ్రముల్ బ్రహ్మాండ♦గోళమదర
దాశరథికి సారథియయి♦తనరుచున్న, మాతలియు నింద్రు చింద మి♦మ్మడిగనొత్తె

తే॥ రావణుఁడు వడినేయు నా♦రాచ వితతి, సోకుటకు మున్నె ఖేచర♦శ్రీకటాక్ష
చయ మనంతమై శ్రీరామ♦చంద్ర విభుని, భుజయుగళి సోఁకె నేమి కాఁ♦బోవు ననుచు.

క॥ ఇరు రథములందు పూన్చిన, తురగములు పరస్పరంబు♦తూఁకొని లోకో
త్కరముల భ్రమింగం జాలిన, సరభస కోపమునఁ జూచె♦నకిలింతలతోన్. ౧౨౪౪

క॥ దానవ నాథుని వీణా, గాన చణతఁ దెలుపు క్రమ♦కలిత ధ్వజమున్
మానవనాథుని తేరునఁ, బూనుచు సింద్రధ్వజంబుఁ♦బోరిపోరి మోఁదెన్.

క॥ దనుజవిభు శింజినీధ్వని, వననిధి సప్తకముఁ గలఁచి♦వైచినయది య
మ్మనుజ విభుని జ్యానినదము, వనజభవాండములఁ గలఁచి♦వైచెను తోడ్తోన్.

క॥ హనుమంతుఁ డాదిగాఁ గల, వనచరు లెది సేయుటకును♦పాల్పోవక న
క్కొని యూరక నిశ్చేష్టత, గొని చూచుచునుండి వారి♦ఘోర రణంబున్.

క॥ వెరఁగంది విబుధ వరులె, వ్వరు గెల్తురొ యనుచు నెఱుఁగ ♦ వలను పడక ని
బ్బరము చెడి యుండు నందుం, దిరుగుచు మీఁదెఱుఁగలేక ♦ తెరలిరి భీతిన్.

తే॥ రామ శరము లంబరమున♦రాణనిండ, వేలుపులు చల్లుచుండిన♦విరులచే న
లంకృతంబులై రాజిల్లు ♦ లలినితోఁచె, దుష్టులకుఁ దోడుపడునట్టి♦తుచ్ఛు లెవరు?

తే॥ వీరశేఖరుఁడగు రామ♦విభుని ధనువు, పరులు తాఁకఁగ లేని రా♦వణుని ధనువు
మింట నింద్ర చాపద్వయి♦మెఱసి యెదిరి, నిలుచు చందాన మిఱుమిట్లు♦గొలుపుచుండె.

తే॥ నాఁడు లంకాధినాథుం డొ♦నర్చినట్టి, శింజినీ రావమును గొప్ప♦సింహరవము
నేఁటికిం దెల్పుఁ బో యను♦నియతినొంది, జలదములు జలధులును ఘో♦షణము నించు.

తే॥ దనుజనాథుని తీక్ష్ణంపుఁ♦గనులనుండి, చెదరి వెలువడి మిణుఁగుఱుల్ ♦చిటపటమని
నింగి కెగయంగ నందుండు♦నీరదములు, కరఁగి పలపల రాలెను♦ధరణిమీఁద.

తే॥ కలఁగె దిక్కులు జలధులు♦కలఁగె సురల, కాలుగేలును కలఁగె లం♦కయుఁ గలంగె
కలఁగ దయ్యెను రాముని♦కడఁక నుంత, రావణుని యట్టహాస దు♦ర్లలితచేష్ట.

తే॥ ధరణియందును మెఱపులు♦పరవునట్లు, జలదములనుండి పిడుగులు♦జాఱునట్లు
కదనమున వైచు కైదువుల్ ♦కాంతి చయము, ప్రక్కలం జోరఁ బలపల♦రాలుచుండె.

—: రామ రావణ సమరము :—

తే॥ విల్లుగొని చంపఁ గోరక♦తల్లడిల్ల, రాము రథముతోఁ బైకెత్తి♦భ్రమయఁద్రిప్పి
భూమిపై మోఁదిమోఁది చం♦పుదునటంచు, దలఁచుఁబదరు నిదానించు♦దశముఖుండు.

క॥ మెఱపులవలె దశ దిశలన్, మెఱయుచు వడినేగు సెలల♦మెలపునఁ దేరిం
బరియలుగఁ జేసి వీనిం, జెఱగొందున యని తలంచుఁ♦జిత్తములోనన్. ౧౨౫౭

తే॥ పదరుచున్న మనస్సునఁ♦గొదరుచున్న, కనలు మిడుఁగుఱు ల్లేచెడు♦కనుల చూపు
లోలయ దనుజనాథుఁడు విల్లు♦వెలయ వంచి, పెక్కు మార్గణముల నేసి♦విన్నగప్పె.

క॥ ఉఱుముల నిప్పులవలె జము, నెఱఁకుల నాటినవి సురల♦నియమంబులఁ బెం
పఱఁ జేసినవి ఫణీంద్రుని, యొఱపుం బోలిన శరమ్ము♦లుక్కఱ నేసెన్.

క॥ మేరువును తొలిచి యంతన్, వారక యండములఁ జీల్చి♦పైకొను నంచా
ధోరణి సుర లనుకొన్నవి, శ్రీరాముఁడు చెంగనీక♦చెలగె న్నడుమన్.

తే॥ బలయుతుని పని దుష్కర్మ♦ఫలముచేత, నడుమఁ జెడినట్లు లంకాధి♦నాథు విశిఖ
వితతి నడుమన విఱుగంగ♦విసుగులేక, విలయ జలదంబు లలి శర♦వృష్టి గురిసె.

తే॥ కప్పె మింటిని దిక్కులఁ♦గప్పె గిరులఁ, గప్పెఁ గన్నులఁ గప్పెను♦కడలిఁ గప్పెఁ
బుడమిఁ గప్పె విజ్ఞానుల♦బుద్ధిఁ గప్పె, నిరులు గప్పె ఖేచరులకు♦మరులు గప్పె.

తే॥ కాలగళుఁడు దక్కఁగఁ బెరల్♦కనులు మూసి, కొనిరి వజ్రభిన్నములగు♦కుధర సమితి
వ్రీలి చెదరుకై వడి వాన♦రాలి చెదరె, నవని విభుఁడు వారల భీతి♦నడఁపనెంచె.

క! రామ ధనుర్ముక్త శర, స్తోమమ్ములు పరఁగు టీవి♦తోయము పెరిఁగెన్
గామి దనుజ శరవులు దు, ష్కామ కృతఫలంబు వోలెఁ♦గడపడి సమసెన్.

క॥ త్రుటిలో లక్షల కొలఁదిగ, బటుతర శరములను విడిచెఁ♦బలలాశి యటం
దటుకున నడుమన విఱిచెను, చటులోద్ధత విశిఖ తతుల♦జలజాక్షుండున్. ౧౨౬౪

క॥ చండ సమర దక్షుండగు, గండఁడు రావణుఁడు ముసల♦ఖడ్గ ఘనగదా
దండ పరశు శూలాదులఁ, దండంబులు గాఁగఁ బఱపె♦దాశరథిపయిన్. ౧౨౬౫

క॥ మేఘ శ్యామల దేహు న, మోఘ శరము లొక్కటొకటి ♦ మొన వేయింటన్
బ్రాఘోష మొనర విఱిచెను, శ్లాఘించుచు సురలు కరత♦లంబులఁ జఱవన్. ౧౨౬౬

ఆ॥ ఇట్లు పోరు సమత♦నెనయుచుండఁగ రేఁగి, యీఁటె పోటు గొన్న♦యేన్గు భంగిఁ
బంక్తిముఖుఁడు పట్టె♦పదికేలఁ బది విండ్లు, పదులు పదులుగాఁగఁ♦బఱపె సెలలు.

ఆ॥ రామ విశిఖ తతులు♦రావణ సాయక, తండ మెల్లయెడల♦నిండుకతనఁ
బోరుగాంచు పంచ♦భూతంబు లాడిగాఁ, బ్రమదపాటు గగురు♦పాటు మానె

తే॥ అత్తఱిని దశకంఠుని♦స్యందనంబు, మందరమ్మొ మారుతి తెచ్చు♦మందు మలయొ
మొగిఁ ద్రిపురములొ గంధర్వ♦నగరమొక్కొ, యనఁగ వ్యోమ పథంబున♦నలరినిలిచె

తే॥ తేరిపై మింట దనుజుండు♦తెఱపిలేని, బాణవర్షము గురియింపఁ♦బద్మమిత్ర
కులుఁడు చూచుచుండంగనే♦కోఁతిమూఁక, చచ్చి చావక తెరలు ద♦శం భజించె

తే॥ రాముఁ డదిగని మనసేన♦మ్రాలుచుండె, నింక నాలసించినఁ గార్య♦మిమ్ముదప్పు
వాని మకుట మస్తకముల♦వసుధఁ గూల్తుఁ, దేరు మింటి కరుగనిమ్ము♦సారథి! యన.

తే॥ చిత్తమని మాతలియు నట్ల♦ చేయునంత, నలఘు రథమును చంద్ర మం♦డలముపైకి
వచ్చు నినమండలము వోలె♦ వచ్చినిలిచెఁ, దేరు తేరెదురై చుట్టి♦ దిక్కులందు.

తే॥ వారిదంబులు దెసలకుఁ♦ బాఱిపోయె, రిక్కలును వలవల మని♦ యుక్కిరాలె
శైలశిఖరము ల్వ్రీలెగె దా♦శరథి రథము, రావణ రథంబుఁ జుట్టు నా♦రభసమందు.

తే॥ తిరుగు నిలుచుఁబై కెక్కును♦ దిగును తగ్గు, దాపలించి వలపలించి♦ దాఁటుచుండ
నద్రి కూటముల్ జలధులు♦ నండతండ, ములును కుమ్మరిసారె చో♦ ప్పునను దిరిగె.

తే॥ క్షణములో నెట కేనియు♦ జరుగుచున్న, రథములం గాంచి సుర లది♦ రాము నరద
మిద్ది రావణు రథమని♦ యెఱుఁగ లేక, యొనరఁ దిరుగుచున్నవి తాఁకు♦ చున్న వనిరి.

తే॥ చక్రములు తాఁకఁ, బడని బు♦క్షములు నిప్పు, చిందఁ గాలని శైలముల్♦ చీలకుండు
దిశలు నెత్తురు గ్రక్కని♦ దేహిచయము, కానరాకుండె నాయుద్ధ♦ కాలమందు.

సీ॥ చూచుచునున్నట్టి♦ ఖేచరులును వారు, నాకలోకమున ను♦న్నార లంద్రు
చంద్రలోకంబునఁ ♦జరియించు వారంద్రు, మందర శైలంబు♦ నంది రంద్రు
పాలసంద్రము మీఁదఁ♦ బరఁగు వారందురు, జలధుల కవ్వల♦ జరగి రంద్రు
ఉత్తర వనరాశి ♦ నున్నవా రందురు, ప్రాగ్దిశఁ జేరిన ♦ వార లంద్రు

తే॥ వారిదంబులయందున్న♦ వారలంద్రు, నేఁడు లోక సంహారంబె♦ నెగడునంద్రు
క్రమ్మఱనె తేరు లంద్రు తు♦రంగ తతులు, కావు నిక్కంబు కడనాఁటి♦ గాడ్పులంద్రు.

క॥ సప్త ద్వీపములందును, సప్తగిరులయందు సప్త♦జలధులయందుఁ
సప్త జగంబులయందును, తృప్తి గొనక యనిలుఁబోలె♦ దిరిగెం దేరుల్. ౧౨౬౮

క॥ పుడమికి వలువగ నొప్పిన, కడలులలో దీవులఁ జ♦గముల గిరుల ని
ల్లడ సొత్తులవలెఁ గైదువు, లడరిపడియె వానపోల్కి♦ ననురుండేయఁ. ౧౨౬౯

తే॥ అవియు జగముల నలయించు♦ నలవుగలిగి, మలసి రామసాయకముల♦ వలననడుమఁ
దునిఁగి తునియలై ధరణిపై♦ దొరలెఁ గాక, వేఱుకార్యంబు గావింప♦ నేరవయ్యె.

క॥ గిరులపయి శరనిధులపయి, శరదంబులపయిని సకల♦జగములలోనఁ
దిరిగిన యరదంబులు వడిఁ, దిరిగి యరిగె లంకపైకి♦ దితిజులు బెగడఁ. ౧౨౭౦

క॥ సారథులు రేఁచి నడపిన, వారువములు నేదగొనవు♦ వాడవు శ్రాంతిం
గూరవు నిలువవు మేఁతయు, గోరవు చెమరింప వడఁగి♦ క్రుంగవు త్రుటియుఁ.

తే॥ భిదురకరుఁ డంపు తేరి న♦భేద్యగరిమ, వఱలు నశని కేతనమును♦ పంక్తిముఖుఁడు
నిప్పు లురలెడి కన్నుల♦ నెగడఁ జూచి, యర్ధ చంద్ర భల్లంబున♦ నవనిఁ గూల్చె.

తే॥ ఆధ్వజంబు పిడుగువోలె♦ నంబుధిఁ బడి, మునుఁగఁ గాఁచిన యినుపక♦డ్డిని జలమున
నద్ద నుడికిన వడువున♦ నంబురాశి, యుడికి యింకి వట్టినయది♦ యుత్కటముగ.

శా॥ నాద బ్రహ్మము కై వడిన్ సతతము♦న్నాశంబు లేకుండు శ్రీ
వైదేహీ విభు తేరి సారథిఁ దద ♦ శ్వ వ్రాతమున్ బ్రవ్యభు
గ్న్యాదారుండు నిశాత సాయకములన్ ♦ గుప్పించి నొప్పింపఁగా
నాదిత్యాన్వయ వార్ధి సోముఁ డెడ న ♦ త్యంతాగ్రహోదగ్రుఁడై.

ఉ॥ తమ్మని వక్షమందు నిశి ♦ తమ్మగు నమ్ములు నాటునాఁటి కం
టమ్మదిఁ దాపమొందెను ప♦టిష్ఠత దైత్యుఁడు విల్లు వంచి క్రూ
రమ్ముగ నారసమ్ములను ♦ క్రమ్మఁగ నేయఁగ రామచంద్రు చం
దమ్మను గానలేమిఁ బ్రమ ♦ దమ్మను వీడిరి వేల్పులయ్యెడన్ ౧౨౮౬

ఉ॥ క్రుంచెను కాంతు లగ్నులును ♦ కుంభిని సంచలనంబునందె స్తం
భించెను గాలి యొడినవి ♦ మేఘసమూహము లార్చిరెల్ల రా
త్రించరు లర్కచంద్రులకుఁ ♦ దెర్వులు దప్పెను దిగ్గజంబులున్
వంచెను శీర్షముల్ జగము ♦ వాడెను ఘోషము మానె నంబుధుల్.

ఉ॥ మేరువు నంచలించెను †ని ♦ మిత్తము దెల్ప విశాఖరిక్క నం
గారకు డాక్రమించెఁ బ్లవ ♦ గ ప్రభు చంద్రుఁడు లక్ష్మణుండు సీ
తారమణున్ రహించి కను ♦ దమ్ములఁ గానమి దొడ్డ యూథపుల్
జేరని దంతులట్లు వెతఁ ♦ జెందిరి కందిరి యున్మలించుచున్. ౧౨౮౮

చ॥ వనచర వర్గముం దలరి ♦ వారధి వారిధిఁ గూర్చి కట్టుచో
వనచర బృందముల్ కలఁగు ♦ వైనము నొందిరి రాముఁడంత హే
చ్చిన కినుకన్ నిశాత శర ♦ చిత్ర మహోత్కట వృష్టిఁ జేసి యా
దనుజుని సాయకంబుల వి ♦ దారణ చేసి వెలింగి యయ్యెడన్. ౧౨౮౯

చ॥ అమరులు నుల్లసిల్లఁ బ్లవ ♦ గావలి మోదిల జ్ఞానతత్త్వ వి
త్తమగు ధరాత్మజా విభుఁడు ♦ దానవనాథుని కేలనున్న చా
పములఁ బదింటిఁ దున్కలు న ♦ భంబున కేగఁగఁ ద్రుంచె శాత భ
ల్లములు పదింబదిం బఱపి ♦ ల స్తకముల్ మిగులంగఁ జేతులన్. ౧౨౯౦

తే॥ కడలిపోల్కి గంభీరుఁడౌ ♦ గరుడుఁడపుడు, దనుజవిభుని కార్ముకములు ♦ తునుఁగుచుండ
నిర్జరుల దుఃఖ నికరముల్ ♦ నీఁగవచ్చి, తనరె సినవంశ్యు తేరి కే ♦ తనముగాఁగ.

చ॥ క్షణమున లోకముల్ దిరుగఁ ♦ జాలిన తార్క్ష్యుఁడు రాము తేరిపైఁ
గణఁక వహించి కేతనము ♦ గా వెలయంగ నిఁ కేల చింత లా

† కోసలానాంచ నక్షత్రం వ్యక్త మింద్రాగ్ని దైవతం
ఆక్రమ్యాంగారక స్తస్థౌ విశాఖామపి చాంబరే.
కోసలుల నక్షత్రము ఇంద్రాగ్ని దైవతము అగు విశాఖను అంగారకుఁ డాక్రమించెను. అది
కోసలుల కరిష్ట దాయకము. (వాల్మీ. యుద్ధ. ౧౦3 సర్గము 33 శ్లో॥

చనుఁడె యుపేక్షమై నిలుచు ♦ చందమె చాలదె? యంచు నిర్జరుల్
ప్రణుతి యొనర్చి సూనములు ♦ వర్షముగాఁ గురియించి రొప్పుగన్.

క॥ పటుశరముల సీతాహృ, త్పుటవాసి సురారి కవచ ♦ మున నచటచటం
బెటబెటఁ బెటులఁగ రక్తము, జొటజొట వెలువడఁగఁ గొట్టె♦నూటి శరములన్.

తే॥ దిశలఁ దాఁకుచు మేఘపం♦క్తిని చెదర్చు, శిఖర మొప్పు దైత్యుని వీణ♦సిడము రెండు
సాయకంబుల జానకీ♦జాని యేసి, నేల గూల్చెను నిర్జరుల్♦నెగడి పొగడ. ౧౨౯౪

ఉ॥ రావణుఁ డత్తఱిం గదిసి ♦ రాముఁడు తచ్ఛరరాజి నొవ్వమిన్
భావన సేసి యారకొన ♦ భావ్యము గాదని యెంచి యంధకా
రావహమైన దివ్యశర ♦ మాత్మఁ దలంచి భజించి యెత్తి ధా
త్రీవరుపై వడిం బరపె ♦ దివ్యులు కాంచి వెఱం గలంగఁగన్. ౧౨౯౫

సీ॥ అందుండి వెలువడి♦నట్టి కొన్నిటి మొగం, బులు తీండ్ర చండ్ర ని♦ప్పులను గ్రక్కెఁ
గొన్నిటి మోములు♦క్రొన్నెత్తురు వెలార్చె, సురముఖములు మహా♦సుర ముఖములు
భూత ముఖంబులు♦భుజగ ముఖంబులు, విషముబు నించు ది♦గ్వ్రిఘులందు
తరణి చంద్రులఁ గప్పఁ♦దమమును కల్పించు, నొకచోట నెండయు♦నొనరఁ గూర్చుఁ

తే॥ జండమారుత మొక్కచో♦నరగవీచు, వర్ష మొక్కచోఁ గురియించు♦వఱదలొక్క
దెసను గల్పించుఁ బిడుగులఁ♦దివిరి రాల్చు, భ్రాంతి గలిగించి ముంచు సం♦గ్రామభూమి.

చ॥ ఇరులు సమస్తముం బొదువ ♦ నెల్లరు పాపఫలంబుఁ బొందు వై
ఖరిని కలంకనొంద జన ♦ కాంతుఁడు పాశుపతంబు నేయ నా
యిరులు తొలంగె లోకముల♦కెల్లను స్వప్నమువో మెలంకువల్
పొరసిన చందమై వెలసెఁ ♦ బుణ్యఫలం బనుభూతియౌ గతిన్. ౧౨౯౬

ఉ॥ సత్యము సన్నిధిం జెడు న ♦ సత్యముకై వడి సమ్మహాస్త్ర మా
దిత్య కులేశుచేఁ జెడఁ బ్ర ♦ దీప్త రుషాప్తిని పండ్లు గీఁటుచున్
దైత్యవిభుండు రాముపయి ♦ దారుణ బాణము లేసి చేసె నా
దిత్యులు బెగ్గడిల్ల జల ♦ ధి ప్రతిమాన మృగేంద్ర నాదమున్. ౧౨౯౭

తే॥ నింగి వారల కీర్తుల♦మ్రింగినదియు, జముని కడుపు నింపినది వా♦సవుని కడలు
గూర్చినదియు విద్వేడ్ప్ర శా♦ఘోరతరము, నైన యాసురాస్త్రము నేసె♦దానవుండు.

శా॥ ఆయస్త్రంబు మహోగ్ర రూపమునఁ ద ♦ న్నంకించు బాణౌఘముం
బాయం ద్రోచుచు రాముసన్నిధికిఁ బో ♦ వం జూచి గీర్వాణు లె
ట్లో యంచుం దపియింప రాఘవుఁడు సం ♦ యోజించి నిర్భీతి నా
గ్నేయాస్త్రంబున నాసురాస్త్రమును క్రం ♦ గించెం గపుల్ హాయనన్.

చ॥ శమనుఁడు జంకినన్ గడిమి ♦ జంకక వార్ధులఁ గ్రోలఁజాలి భూ
ధ్రములను నుగ్గుసేయుచు స ♦ దాగతి గెల్వఁగఁ జాలు నస్త్ర బృం

దములను దైత్యవల్లభుఁడు ♦ దాశరథిన్ వడిఁ గప్పివైచె నా
క్రమమును కాంచి వేల్పులు భ ♦ రమ్మగు భీతి భజించి రొక్కటన్.

ఉ॥ కొందఱు హస్తలాఘవముఁ ♦ గొందఱు మాయబలంబు స్థైర్యమున్
గొందఱు దైత్యకోపమును ♦ గోరి నుతింపఁగఁ గొందఱింక మా
యం దులకింప పీలు గల ♦ దా యని కొందఱు పూర్వమెన్నఁడున్
గ్రందగు నిట్టి కయ్యమును ♦ గానమ యంచు వచించుచుండఁగన్.

క॥ ఇన కులజుఁడు గగనము గ, ప్పిన క్రూరాస్త్రంబులెల్ల ♦ భేదిల్ల వెసన్
ఘన శరములఁ దునిమి వెలిం, గెను తమ మడఁచిన ప్రచండ ♦ కిరణునిపోలెన్.

క॥ అధిక తపో బలయుత సుర, మథనుఁడు బహుసంగరముల ♦ మలసిన యమర
ప్రధనమున గెలుపు నొసఁగిన, క్రథనాద్భుత శీలమయ శ ♦ రంబును పఱపెన్.

క॥ స్రుక్కిరి త్రిదశులు లోకము, లుక్కఱెనని చచ్చితిమని ♦ యూర్చుచుఁ బ్లవగుల్
మక్కి దెసలకుం బరుగిడి, ర క్కాకుత్స్థుఁడును దాని ♦ యంతర మెఱిఁగెన్. ౧౩౦౫

క॥ భూమిని రాముని జీవిత, మే మునిఁగిన దన్న పగిది ♦ నెసఁగిన శరమున్
రాముఁడు గాంధర్వాస్త్రము, చే మాలిచి నడుమఁ జీల్చి ♦ చిందఱచేసెన్. ౧౩౦౬

క॥ వికటించిన మధుఁడు హిర, ణ్యకశిపుఁడు జగత్త్రయం బ ♦ ణంచినయది పూ
నిక నలువ యొసఁగినది యగు, ప్రకృష్ట దండంబు నెత్తి ♦ రావణుఁ డేసెన్. ౧౩౦౭

తే॥ మునుపు తారకాసురుఁడు వే ♦ ల్పుల మొగములఁ, గుతిలపడ దానిచేతనే ♦ చితుకఁ గొట్టెఁ
గల్పకాలంబు దనుక జ ♦ గంబులెల్లఁ, జేరి దొరలింప దొరలని ♦ చేవగలది. ౧౩౦౮

క॥ అండము జలఘటముం బలె, ఖండములై కూలునని జ ♦ గంబులు కలఁగన్
దండము చండగతిని కో, దండధరుని సన్నిధికిని ♦ దాయఁగవచ్చెన్. ౧౩౦౯

క॥ కమలాక్షుఁడు కని యా దం, డము నింద్రుని వేగనుల క ♦ డంగక శత ప
త్త్రము మొగ్గను పోలిన య, స్త్రము వైచి యొనర్చె వేయి ♦ శకలంబులుగన్.

క॥ చండతరంబుగఁ గార్ముక, పాండిత్యముఁ జూపు రాముఁ ♦ బరిమార్పని యీ
దండాట లేల యని పొల, దిండియు మాయాస్త్రమున వ ♦ ధింపఁ దలంచెన్.

దండకము॥

పూజించి యుగ్రాక్షుఁ గీర్తించి చందంబు న్యాసంబు విధ్యుక్త ధర్మంబుతో సేవ గా
వించి మాయాస్త్రమున్ వింట సంధించి శ్రీరాముపై నేయ నాయస్త్ర మాయా
విధిం జేసి పూర్వంబు శ్రీరామ సౌమిత్రి బాణంబులన్ ధారణిం గూలియున్నట్టి
దైతేయులున్ లేచి హర్యక్ష నాదంబు గావించి రాయింద్ర జిత్తు న్నికుంభుండు
కుంభుండు సేనానులున్ మిన్నుమన్నున్ వెసంగప్పి రా కుంభకర్ణుండు గాన్పించి
బిట్టార్చె సంగ్రామ రంగంబునందుం దురంగ వ్రజంబున్ శతాంగోచ్ఛ్రయ శ్రేణి

సారంగ సంఘంబులుం జేరి వేవెల్లువల్ శంభుచేతన్ వరంబంది ప్రాణంబులం బొంది యింబారఁగాలేచు చందంబునన్ లేచి బృందారక వ్రాతముల్ చూడ దిగ్భ్రాంతి గల్గించి మున్ గెల్చు నవ్వీరులం బిల్చి మాశక్తిఁ జూడుండు మమ్మోడ యోడించి నారంచుఁ జేరెత్తి రారండు ఖండాలుగాఁ గోసి పిండాలుగాఁ జేసి వేమ్రింగకే పోదుమే యంచు నిట్లార్భటింపంగ నాగంబులా భోగి లోకంబు నందుండి ధాత్రిన్ విదారించు కొంచిట్టు లేతెంచె నా నొప్పి భూతంబులున్ శాకినీ డాకినీ ప్రేతరాసుల్ జనించెన్ దమంబందు జన్మించిధర్మంబులన్ మ్రాల్చు సత్త్వాధ్యులున్ ధామసత్త్వంబులౌ నాయుధస్తోమముం బట్టి చిత్రంబుగాఁ గ్రాల దంష్ట్రారుచుల్ బాలచంద్రాకృతిన్ వ్రాల దిగ్దేశముల్ నిండి సింగంబులం బోలి గర్జించి చౌగంటులం బోలి వావిప్పి నానావిధాభీల జాజ్వల్య మానానల జ్వాలలం జింద వీక్షించుచున్ దూషణ ద్వేషణోద్భీషణ స్ఫార దుర్భాషణంబుల్ ప్రపంచించుచుండన్ రఘు స్వామి వీక్షించి యేమాయయో నీకు భావంబునం దోఁచునేనిన్ విచారించి వాక్రుత్తువే యన్న నవ్వేధయున్ దేవదేవేశ! యీదేవ విద్వేషి కర్మారు వేశ్మంబునన్ నూదు లమ్మంగ నేతెంచు వానిం బలెం బూని నీమీఁద మాయాస్త్ర మిక్లేసి క్షోభింపఁగాఁ జేయ భావించియున్నాఁడు నీపేరు విన్నంత నీనామ మన్నంత భావించి నంతం బటాపంచలై పోవుఁ బాపంబు లెల్లన్ జగన్నాయకా! నిన్ను నీమాయ యేమేని కావింపఁగాఁ జాలునే? నీదుమాయం దరింపంగ మౌనీంద్రులున్ నేరరన్నన్ విదేహాత్మజానాథుఁ డౌఁగాక యీమాయ యేదేని యౌఁగాక యంచున్ విచారించి జ్ఞానాస్త్రమున్ వింట సంధించి యేయంగ ధర్మంబు త్రోవన్ జనన్ జ్ఞాన సంపత్తి నజ్ఞాన బంధంబుల న్నీఁగు లాగై జగంబెల్ల విభ్రాంతిఁ బోనాడి స్వాస్థ్యంబు నొందెన్. ౧౩౧౨

మ॥ గర కంఠుండు చతుర్ముఖుండును మదిం ♦ గాలుష్యముల్ తీఱ సం
గర మందియ్యెడ లోక కంటకులకుం ♦ గార్శ్యంబు నాశంబు చే
కుఱఁ గాంక్షించుచు నుండ దైత్యుఁడు మహా ♦ క్రూర ప్రభావ స్ఫుర
ద్వర శూలంబును నూటిగా విసరె నీ ♦ తానాథుపై గ్రక్కునన్.

తే॥ విబుధులకు నాకులత గూర్చి ♦ వేయిగంట, లొరసి మొగయు వీరుల బల ♦ యోగ్యతలను
వితత యొనర్చు శూలము లోక ♦ భీకరముగఁ, దొడరి వచ్చుట రామభ ♦ ద్రుండు కాంచె.

తే॥ నెఱసి త్రేతాగ్నులనుమించి ♦ మెఱసిగాడ్పు, దెసలకొదుఁగంగ జగములు ♦ దిగ్భ్రమింపఁ
గనులు మిఱుమిట్లు గొనవచ్చు ♦ కఠిన శూల, సాధనము గని సురలును ♦ సంచలించి.

తే॥ నీ వినాశంబు మదిగోరి ♦ రావణుండు, వైచె శూలంబు దీనిని ♦ సైఁచి త్రోచు
శక్తి నీకుఁ గా కొరులకు ♦ జగతి లేదు, గెలుము గెలుమని తడఁబడఁ ♦ బలికినారు.

తే॥ పిడుగులును వచ్చువడిఁ గాంచి ♦ బిడియ పడఁగఁ, దన్ను మఱవక ధ్యానించు ♦ తత్పరులకు
నాస్తికులు సేయుచుండు వి ♦ ఘ్నంబులట్లు, రామశరములు వితయయి ♦ రాలుచుండ.

తే॥ అరసి రాముఁడు దివ్యసా♦యకము లేయ, నవియు డాసి డాయకమున్నె♦యడఁగుచుండఁ
బుణ్యశాపముం బోలె న♦మోఘగరిమ, శూల మరుదేర నాతఁడు♦చూచె నరక.

తే॥ వేలుపులు దిక్కుతోఁ పర♦వెనన పడిరి, ధర్మదేవత కాళులు♦తడఁబడంగఁ
దన్ను మఱచె రాముఁడు భయ♦దంబుగాఁగ, నడరె శూలమనుచు లోన♦నాకులించె.

శా॥ సంహారోద్యమ మొప్ప శూలము జగ ♦ చ్చాంచల్యముం జేయుచుక్
రంహోదగ్రత రామచంద్రు పయికిక్ ♦ రాఁజూచి రౌద్రస్థితిక్
సింహప్రక్రియ హుంకరింప నది వి ♦ చ్ఛిన్నంబుగాఁ దూలె దు
ర్వ్యాంహో దూషితు యత్నముం బలె సురల్ ♦ బ్రహ్మాదులుక్ మోదిలక్.

తే॥ పోయినట్టి ప్రాణంబులఁ♦బొందినక్రియ, నొంది రగచరుల్ ఖేచరు♦లుమ్మలంబు
విడిచి యాడిరి పాడిరి♦విరులవాన, గురిసి వేఁడిరి రావణుఁ♦గూల్పు మనుచు.

మ॥ అనివార్యంబగు శూలముక్ దన మహా ♦ హంకార హుంకార భీ
షణ నాదంబున బీఱువో నడఁచె నీ ♦ సంగ్రామ భీముక్ దురం
బున సాధించుట డెప్పరంబను తలం ♦ పుం బొంది దేవారి త
మ్ముని వాక్యంబుఁ దలంచె; దుర్మదమొకో ♦ పోకార్చు విజ్ఞానముక్ ?

మ॥ వరశక్తిక్ శరశక్తి నెల్ల నిచటక్ ♦ వ్యర్థంబు గావించె వీఁ
డరయక్ భర్గుఁడు కాఁడు విష్ణువును కాఁ ♦ డంభోజ సంభూతి కాఁ
డిరవారంగఁ దపస్వి కాఁడు జనలో ♦ కేశానుఁడుం గాఁడు దు
స్తర సంసార భవాబ్ధి తారక మహా ♦ తత్త్వంబుగా నెంచెదక్. ౧౩౨౩

మ॥ పరమాత్ముండగుఁగాక వేఱు మఱి యె ♦ వ్వాఁడైన నౌఁగాక ని
ర్భర శౌర్యంబున గెల్చితిక్ జగములక్ ♦ బ్రాంచద్వశం బందితిక్
బిఱుదీయం బనియేమి ? గెల్చిన జగ ♦ ద్విఖ్యాతి సిద్ధించు సం
గర రంగంబున నిల్గినం గుదకు మో ♦ క్షంబబ్బు నేలా వెతల్ ? ౧౩౨౪

మ॥ అని చింతించి కడంకతో నిర్మృతి ది ♦ వ్యాస్త్రంబు ధ్యానించి దా
నిని వింటం దెగఁదీసి రామునిపయిక్ ♦ వీడంగ దుర్వార ని
స్వన హాలాహల భీకర జ్వలిత జి ♦ హ్వా దంష్ట్రి కోగ్ర స్ఫటల్
ఘోనరక్ వెల్వడె సర్పజాలము నభో ♦ భూభాగముల్ గప్పుచుక్.

ఉ॥ శేషునికంటె దొడ్డవియుఁ ♦ జేఁదఱ గొన్నవి లోకజాలముక్
శేషము లేక మ్రింగునవి ♦ చిల్మ ముఖంబులఁ గ్రక్కుచుక్ మహా
భీషణ లీలఁ బర్వ నరి ♦ వీర భయంకరమూర్తి దానవ
ద్వేషి ఖగేంద్రసాయకము♦దీఁడుచు నేసె ఫణుల్ నశింపఁగక్. ౧౩౨౬

ఉ॥ రావణు నస్త్రమాయ బవ ♦ రంబునఁ బర్విన యంతమాత్రకుం
జేవఁ దనర్చు పక్షములు ♦ చిన్నదపుం బలువన్నె మేనులుక్

లావగు చంచువుల్ నఖ బ ♦ లంబును శోభిలుచుండు వైనతే
యావలి నిండిపోయె నెట ♦ నారయఁ దార్క్ష్యమయంబుగా నటన్.

ఆ॥ లెక్కలేని గరుడ♦పక్కులు నోట ని, ప్పులు వెలుఁగఁ బరవ♦మొనసి సురలు
పక్షులగుచు నోట ♦ వహ్నులఁ గొని లంకఁ, గాల్ప వచ్చినట్టి♦కరణి దోఁచె.

తే॥ ఫణి ఫణావళుల్ నిప్పుల♦పగిది వెలుఁగఁ, గమల నాళంబులను నోటఁ♦గవ్వికొన్న
కరణి నాగకులంబులఁ♦గాళ్లఁ బట్టి, చంచు ఖర నఖరముల దా♦రించి వైచె.

ఆ॥ అట్టి తతిని వినత♦పట్టి ఱెక్కలగాలి, వలన భవుని మేన ♦ నలరుచున్న
మండనంబులెల్ల ♦ మఱిమఱి చలియించెఁ, దక్క వానిఁ గూర్చి♦తడవనేల ?

ఆ॥ గండఁడైన రావ ♦ ణుండు మనంబున, మండి యూర్పుపుచ్చి♦భండనమునఁ
జండ విశిఖ తతుల ♦ దండిగాఁ గురిసి కో, దండి కూపిరాడ ♦ కుండఁ జేసె.

ఆ॥ రామ మార్గణములు ♦ రావణు శరముల, రాల్చి మీఱి యేగి ♦ రాక్షసేంద్రు
పృష్ఠ వక్షమందు ♦ పుంఖముల్ గనఁబడఁ, జొచ్చి పొడిచి యానె♦శోణితంబు.

చ॥ ఇరువురు హెచ్చుతక్కువ లొ ♦ కింతయుఁ గన్పడనీక ఘోర సం
గర మొనరించుచుండ శితి ♦ కంఠ శిలోచ్చయ మెత్తినట్టి క
ర్బురపతి నేర్చియున్న రణ ♦ పుష్కల విద్యలు తోఁపవయ్యె భూ
వరునకు నంతకంతకును ♦ వర్ధిలె లాఘవ సత్త్వ సంపదల్, ౧౩౩౩

—: రాముఁడు రావణుని తలలఁ దెగనేయుట :—

తే॥ నిర్జరవిరోధి బలము క్షీ♦ణించు నదను, గాంచి యొక యర్ధచంద్రాశు♦గంబుచేత
రావణునియొక్కతలద్రెంచె♦రామవిభుఁడు, బాపపంక్తినొక్కటిఁగూల్చు♦పగిదిదోఁప.

తే॥ వాయుశేషుల పందెంపు♦బవరమందు, శ్వసనుచే మేరు శిఖరంబు♦జలధిఁగూలు
చందమున రావణుశిరంబు♦శరధిఁగూలె, రామచంద్రు నమోఘ శ♦రంబుచేత.

తే॥ అమరసంఘంబులు త్రికూట♦మడఁగునట్లు, దుమికిగంతులు వైచుచుఁ♦ద్రొక్కులాడి
పాడి వినుతించి తలపాగ♦లూడఁదీసి, విసరి యొకరిపై నొక్కరు ♦ వేసికొనిరి.

తే॥ ప్రాణి చచ్చియుఁ దనకర్మ♦బలముచేత, మరలఁ బుట్టిన చందాన♦మదువునోటి
తోడఁ దల యుదయించె న♦ద్భుతము గాఁగఁ, దపముచేఁ గాక యట్టిది♦తనరు టరిది.

క॥ తెగినవి తెగలేదని వగ, వఁగఁ దగి త్రుటిలోన మొలచి♦పార్థివ తిలకున్
దెగనాడుచుఁ బగ మాఁడుచు, వగఁ జూచుచుఁ బదరె వదరెఁ ♦ బండ్లం గొఱికెన్.

క॥ విషముం గ్రక్కుచుఁ జెచ్చెర, విషధిం బడి శీర్షమపుడు ♦ విషధర శయనుం
డిషణమున నెత్తు మేదిని, మిష లేచి తదీయ విషము♦మేకొని త్రావెన్. ౧౩౩౯

క॥ అశని వశమగు పసం గొని, దశముఖముల హుంకరించి♦దశముఖుఁడు వెసన్
దశరథ సూనునిపై దశ, విశిఖమ్ములు చొరఁగఁ గ్రోధ♦వివశత నేసెన్. ౧౩౪౦

ఆ॥ అక్షరముల కాద్య ♦ మైన యకారంబ, యైన రామవిభుఁడు ♦ వీని శిరము
తెగిన మొలచు ననుచు ♦ వగచి కరంబును, ద్రుంచివైచె నధిక ♦ దోర్బలమున.
తే॥ బాణమునఁదునిఁగినచేయి♦పట్టియున్న,యాయుధముల వేఱొకచేయి♦యందుకొన్న
పగిది మొలచిన హస్తంబు♦వట్టుకొనియెఁ, దెగుట మొలచుట కాంచిన♦ధీరులెవరు?
క॥ మాతలి బలమును ద్రుంచం, జేతమునఁ దలంచి యమర♦జేత తెగిన యా
చేతిని మొలచిన చేఁగొని, భీతిని ఖేచరులు పఱవ ♦ బిట్టుగ విసరెన్. ౧౩౪౩.
ఆ॥ పంక్తివదను తెగిన ♦ బలితంపు బాహువు, బాఢముగ నురంబు♦వగులఁదాఁక
నొచ్చి శోణితంబు ♦ నోరఁ గ్రక్కుచు రాము, తేరి చోదకుండు ♦ తెరలి సోలె
క॥ సొలసిన మాతలి యసువులఁ, దొలఁగింపఁ దలంచి యసుర ♦ తోమరమును డా
పలికేలఁ ద్రిప్పి వైవఁగ, జలజాక్షుఁడు నడుమ దానిఁ ♦ జదియఁగ నఱకెన్.
క॥ వెండియుఁ గరలాఘవ శర, చండతఁ జూపంగఁ దలఁచి ♦ చండాంశు కులీ
నుం డొక్కొక్క శిరంబును, ఖండించెను నూఱుమార్ల ♦ ఖండిత లీలన్.
క॥ శిరములు దిశాంతరంబుల, శరధుల ధరయందు గిరుల♦సానువులందున్
దొరలి దొరలి పిడుగుల క్రియ, గురు రవమునఁ బడియె లక్ష♦కోట్లుగఁదోడ్తోఁ.
క॥ గోత్రంబుల వ్రీల్చెను న, క్షత్రంబుల మోఁదెఁ గడలి♦జలచరములకున్
జిత్రమగు చావు గలుగ, శ, రత్రుటిత శిరంబు లా శ♦రంబులఁ ద్రావెన్. ౧౩౪౮
తే॥ ధరణిఁ బుణ్య ఫలానుభూ♦తంబులైన, పిదప నొత్కృష్ట్య మెల్లను♦ప్రిదులుగాదె?
శవములం దినఁ దిరుగు పి♦శాచసమితి, తనయెదురఁ దనకన్నులఁ♦ద్రవ్వి తినియె.
క॥ ఇరువది కరములఁ బట్టిన, పరశు ముసల ఖడ్గ కుంత♦పట్టిస ఘన తో
మర దండాదుల రావణుఁ, డురవడిమై నేసె రాఘ♦వోర్వీశు పయిన్. ౧౩౫౦
క॥ పురుషోత్తముఁడగు రాముఁ డ, సురవర్యు దురాన గెలువఁ♦జొప్పడు వెరవే
కరణి యని యరసి వానిన్, శరరాజి నలంకరింపఁ♦జను నను బుద్ధిన్. ౧౩౫౧
క॥ ఱొమ్మున భుజములపై నే, త్రమ్ముల జిహ్వలను తగ నె♦ఱంకులలో ద
ట్టమ్ముగ నమ్ముల గ్రుచ్చి శ, రమ్ముల నిలయ మనఁజేసె♦రావణు మేనిన్. ౧౩౫౨
క॥ వదనములఁ గనుల భుజముల, నెదనాటిన శరము లచట ♦ నిష్ఠంబుగఁ బె
ల్లిదమగు రక్తము ద్రావక, వదరి యవల దూసి నెఱసె ♦ బ్రహ్మాండమునన్.
తే॥ రోమకూపంబులందు శి♦రోధులందు, జీవములఁ గ్రుంగఁదీసి దూ♦సిన శరాళి
వలనఁ జలమును పగయును♦వట్టపడఁగ, విహ్వలించెను మిక్కిలి♦విబుధవైరి.

—: రావణుఁడు మూర్ఛిల్లుట :—

తే॥ అమరనగరి నూఁకేగిన♦యసురవిభుఁడు, వనధిలోనుండి యెదురీఁది♦వచ్చినట్టి
మత్స్యములు రక్తమును గ్రోల♦మానుపడుచుఁ, దేరిపై సోలిపడియెను♦తెలివిదప్పి.

తే॥ దుష్టకర్మము భువినుండి♦ దోరెననుచుఁ, బొంగి గంతిరి కపులు వే♦ల్పులును మిగులఁ
బ్రభుఁడు మూర్ఛిల్లె ననుచు సా♦రథి రథంబు, నవ్వలికిఁ గొనిపోయె ర♦థ్యములఁద్రిప్పి.

తే॥ స్వర్గవాసుల నొప్పించు♦పద్ధతులను, నిశ్చయించి చేసెడు రజ♦నీచరాళిఁ
గూల్ప దీక్ష వహించు కా♦కుత్థ్స విభుఁడు, తెలివి దప్పిన రావణుఁ♦ద్రెంపఁడయ్యెః

తే॥ అరిదియగు తపోబలమున్న♦యసురవిభుని, తెలివి వచ్చిన పిమ్మటఁ♦ద్రెంప వలను
గాదు గావున నిప్పుడే♦కసిమసంగు, మనుచు మాతలి ప్రేరేఁప♦ననఘుఁడనియె.

తే॥ ఆయుధంబులు చే జాఱ♦నలసి సొలసి, యున్న శత్రుని రణధర్మ♦ముజ్జగించి
చిక్కెనని చంపరా దది♦శిష్టపథము, గాదు నాయెడఁదకు నిచ్చ♦కంబుఁ గాదు.

తే॥ అనిన యతని సత్పద్ధతి♦కాత్మ నలరి, మెచ్చి పొగడెను మాతలి♦మెచ్చకుండు
విబుధు లెవ్వరు ? పదపడి♦వేల్పు లడల, సొమ్మ దేఱి లేచెను దశా♦స్యుండు కడిమి.

క॥ అలుక తొలఁకు చూపులతో, సొలపు దెలిసి లేచి రాక్ష♦సుండు సకల ది
క్కులఁజూచి రాముఁ డెచటం, దెలియమి సారథిని చండ ♦ దృష్టిం జూచెన్.

శా॥ ఓరీ ! వంచక ! నీకు రక్షకుఁడనై ♦ యుత్కృష్టుఁగాఁ జేసి నీ
గారామారఁగఁ జూచుచుండ నను లో ♦ కంబెల్ల భీతాత్ముగా
దూఱంజేసితి వాలి గొంచు మన శ ♦ త్రుల్ నవ్వ దుష్కీర్తియుం
గూరంజేసితి నిన్ను ద్రుంతునని య♦ల్గుం దూయ నుంకింపఁగన్. ౧౩౬౨

ఉ॥ సారథి దైత్యనాథు పద ♦ సన్నిధి వ్రాలి నమస్కరించి లం
కా రమణా ! మదీయ పథ ♦ కంబిది చెడ్డది గాదు దొడ్డగా
నారసి నీ యమర్ష హృద ♦ యంబున శాంతి వహింతు గాక నా
సారథి ధర్మముం దెలిసి ♦ సల్ప్రితి దీన దోసంగు గల్గునే ? ౧౩౬౩

ఉ॥ విక్రమ కార్యముల్ నెఱపి ♦ వీఁగితి సోలితి వందె నిల్పుచో
నక్రమ మొందు నాతగవు ♦ ప్రాణములుండవు నీకు నిక్కమీ
సక్రమపద్ధతుల్ జగతి ♦ సారథిజాతికి నిత్య ధర్మముల్
ప్రక్రమ భంగమేల యొక ♦ పాటి జయింపుము శత్రు నాజిలో. ౧౩౬౪

ఉ॥ స్వామి ససత్త్వుఁడో విగత ♦ సత్త్వుఁడొ యారయుచుండి దొడ్డ కా
రామి ఘటించుచోఁ బ్రభుని ♦ ప్రాణ చయంబున కొక్కసేగి రా
రామి దలంచి కంచరముఁ ♦ గ్రంచరఁ గొంచుఁ దొలంగిపోక పో
రామియె ? నాదు దోసమన ♦ రాదు మదిం బరికించి చూడుమా ?

ఆ॥ అనుచుఁ బలుక దాన♦వాధ్యుండు కరుణించి, తేరుద్రిప్ప మనఁగ♦సారథియును
రాము నెదుట నిల్పె♦ రావణుఁ డంతట, రణము సేయ సాగి♦ రాముమీఁద. ౧౩౬౫

ఉ॥ వందలు వేలుగా విశిఖ ♦ వర్షము గూర్పఁగఁ జూచి ఆచ్చమై
నందఱు వీఁడు క్రొత్త దను ♦ జాధిపుఁడే యని పిచ్చలింప మే

ల్చందము లాఘవంబు గురు ♦ సత్త్వము సాహసముఁ జెలార్చి సం
క్రందన సన్నుతుండు రఘు ♦ రాముఁడు నొవ్వ దురంబు సేయుడున్.

చ॥ అనలము రాఁజుచుండఁ బొగ ♦ నార్చుట శక్యము గానికై వడిన్
ధనువు కరంబునం దనర ♦ దానవనాథుని గెల్వ దుర్ఘటం
బని తలపోసి భాస్కర కు ♦ లాధ్యుఁడు రాముఁడు ఘోరసాయకం
బున దనుజేంద్రు విల్లు పరి ♦ భగ్నముగా నొనరించె గ్రక్కునన్. ౧౩౬౮

చ॥ నలువయొసంగు కార్ముకము ♦ నాశముగా దశకంఠుఁ డుగ్రుఁడై
బలువిడి విండు లొక్కొకటి ♦ పట్టుచునుండఁగఁ ద్రుంగుచుండఁగా
నలిగి జయేందిరా రమణి ♦ యవ్వలికేగ ముసుండి ముద్గరం
బులు గద తోమరాదులను ♦ భూరి బలంబున వైచె నొక్కటన్. ౧౩౬౯

శా॥ వానిం ద్రుంచి నభోంతరంబునని దు ♦ ర్వార స్ఫుర ద్బాహు స
త్త్వానూనుండగు పీఁడలంతుల జనం ♦ డగ్గంబు గాఁడంచు వి
జ్ఞానశ్రేష్ఠుల కంటిపాపలను వి ♦ న్నాణంబుగాఁ దూఱి తా
నానారీతులఁ జిత్తమందు సురజి ♦ న్నాశంబు చర్చించుచున్. ౧౩౭౦

—: రాముఁడు బ్రహ్మాస్త్రముచే రావణుం గూల్చుట :—

మ॥ తుది బ్రహ్మాస్త్రముచేత వీని యసువుల్ ♦ త్రుంగింతుఁ గాకంచు దా
మదిఁ దీర్మానము చేసి రాఘవుఁడు స ♦ మ్మానించి తన్మంత్రముస్
బదరంబుం దరు భంజకంబు కపిరా ♦ డ్వక్షో మహీధ్ర చ్ఛిదా
భిదురంబుం గొని బిట్టుగాఁ దిగిచి యు ♦ ద్భీమంబుగా నేసినన్. ౧౩౭౧

క॥ ఎరవలియును కరువలియును, దరి యరయఁగరాని శరము ♦ ధాత్రృ సబీజా
క్షరమై నలు మొగములతోఁ, బఱచె దరుల బెరయు నిరులు♦పఱవ వెలుఁగుచున్.

సీ॥ విలయ కాలంబున♦విలుసిల్లు భానుండు, మిడుగుఱుఁ బురువను♦వడువు దోఁప
ధరణియు దిశలు నం♦బరమును జగములు, దిట దప్పి దిర్దిరఁ♦దిరుగుచుండ
సర్వ లోకేశ్వరు♦చక్రంబుతోఁ జేరి, నలువ యస్త్రమధిక♦బలమునొంది
మూఁడు కోట్లాయువు♦మొనసి చేయు తపంబు, వనజాసనుం డిచ్చు♦వరచయంబు

తే॥ దిశల గెలిచిన తద్భుజో♦దీర్ణ బలము, శిథిల మొందంగ వక్షంబుఁ♦జించి చొచ్చి
ప్రాణవాయువులం గ్రోలి♦పరఁగ నవల, దుండుకుని పెను వీ♦పున♦దుస్సిపోయె

ఉ॥ ఆహవమందు దానవుఁ డ ♦ హంకృతి దూలఁగఁ గూలఁ గాంచి కో
లాహలముం బొనర్చి చద ♦ లం గల వేల్పులు చల్లు పూలతో
భూహితముస్ వచించి యటఁ ♦ బోయి పయో జలరాశిఁ దేలి వై
దేహీ హృదీశు తూణమునఁ ♦ దేఁకువఁ జొచ్చెఁ దదంబకం బొగిన్.

శా॥ శ్రీరామాస్త్ర విభిన్న వక్షుఁడయి య ♦ క్షీణ ప్రతాపుండు ర
క్షోరాజన్యుఁడు శీర్ణ భూషణ తతుల్ ♦ క్షోణిం బ్రకీర్ణంబుగాఁ
గ్రూరోగ్రాక్షుల మిణ్గురుల్ చెదరఁ బి ♦ ద్గుం బోలు ఘోషంబుతోఁ
తేరం జాఱి యధోముఖుండగుచు ధా ♦ త్రిం గూలె దుష్కర్మచే.

ఉ॥ కోప మడంగ మానసము ♦ క్రుంగఁగ మాయ తొలంగ కామభృ
త్తాపము ప్రమంగ సత్త్వ నము ♦ దగ్రత చెంగ యశం బొదుంగ నా
లాపిత దుర్వచస్సులు క ♦ లంగ దశాస్య ముఖంబు లుత్తటిన్
దాపసులం గలంచు బెడి ♦ దంబునకంటె వెలింగె ముమ్మడిన్. ౧౩౭౬

చ॥ అరదము ధాత్రికిం దిగుడు ♦ నంబుద దేహుఁడు డిగ్గి క్రవ్యభు
గ్వరుని శరీరమున్ దనివి ♦ పాఱఁగఁ గాంచఁ దలంచి డాసి త
వరుని సుహృద్వరుం బలెను ♦ భావనసేయుచుఁ జూచె; లోక భీ
కరుఁడగు శత్రువైన మృతి ♦ గాంచిన పిమ్మట మిత్రుఁడే కదా! ౧౩౭౭

—: రాముఁడు రావణుని వీఁపునందలి గాయములఁగాంచి శంకించుట :—

చ॥ మరలి దివంబు చేరుమని ♦ మాతలి నంపి సుమిత్రసూతియున్
దరణిసుతుండు మారుతియుఁ ♦ దక్కటి వీరులు చుట్టిరా వెసన్
బరులకు వీఁపు చూపని సు ♦ పర్వవిరోధి గురు స్వరూపమున్
బొరిపొరిఁ జూడసాగె సుర ♦ పుణ్య ఫలోదిత మూర్తి యింబుగన్.

ఆ॥ రామ సాయకమున ♦ రణధాత్రిఁ గూలిన, రావణుని పది శి ♦ రంబులపయిఁ
బృష్ఠభుజములందు ♦ వీకున నాడిరి, కపులు గిరులమీఁద ♦ గంతినట్లు

తే॥ వాని మొగులఁ బోలిన పృష్ఠ♦భాగమందు, ద్విరద రదన ఖండంబులు♦విధుని రేఖ
లట్లు తొడవులై యొప్పు వ్ర♦ణాంకములు క, లంకముం బోలి గాన్పించు♦లలినిగాంచి.

ఉ॥ జానకికై జనించిన రు ♦ షా భరణంబు దురాత్ముఁడైన యా
దానవురూపుతోఁ దఱిగి ♦ తాఱఁగ రాముఁడు శత్రు పృష్ఠ భా
గాన స్ఫుటంబుగాఁ దెలియు ♦ గాయము కాయను గాంచి నా మహా
నూన పరాక్రమంబు వెలుఁ♦గొందదుగా! యనెఁ బిన్ననవ్వుతో. ౧౩౮౧

చ॥ జగముల గెల్చి యేనరినఁ ♦ జచ్చు కతంబున రావణుండు తాఁ
బగతుర మున్నెదిర్చి పొల ♦ పంబుగఁ జేసిన పోర వీఁపునన్
దగిలిన పుంటికాయలు వి ♦ తావిత చేసెను మద్బలిష్ఠ దో
ర్యుగళ పరాక్రమంబు నని ♦ రోధ కలంకముఁ గూర్చి చెల్లరే! ౧౩౮౨

తే॥ కార్తవీర్యునిచే వీఁడు ♦ కట్టువడిన, చరిత విని వీనితోడి మ ♦ చ్చరము నాకు
నొదవెగా యని లజ్జించు♦చుండ నిపుడు, వీని వీఁపు గాయంబులు♦కానఁబడియె.

తే॥ మచ్చరుల గెలి యశమును ♦ మలినపఱుప, వెన్ను పగఱకుఁ జూపిన ♦ వీనివలన
గలుగు గెలుపుమెచ్చందగు♦గెలుపుగాదు, దీనివలనఁగీర్తియురాదు♦తెగడు దక్క.

తే॥ అనినవినివిభీషణుఁడుదుగ♦ఖాగ్రశుకణము,లొలుకఁబరితప్తహృదయుఁడై♦పలికెనిట్లు
ప్రభువరా! యసమంజస ♦ వాక్యములను, నీవ పలుకంగ నేమన ♦ నేర్తునయ్య!

చ॥ భుజములు వేయిగల్గిన నృ ♦ పుండును వాలియు నొందినట్టి యా
విజయము నిక్కమైనదియొ? వేల్పుల శాపముచేతఁ గల్గె నం
బుజదళనేత్ర! లోక పరి ♦ పూత పయింగల కామబాధచే
గజిబిజి చెంది దీర్పడియెఁ ♦ గాక యలంతులఁ బోవువాఁడొకో? ౧౩౮౬

చ॥ కడిమి నిరస్త శాత్రవము ♦ గా భువనంబు లొనర్చి పేర్చి యె
య్యెడ నెదురేది లేక చరి ♦ యించుచు దిగ్గజ దంత సంఘముల్
తొడిఁబడి యొడ్డ్వఁ గ్రుచ్చికొని ♦ తోఁచు కిణంబులుగాక శత్రు లె
క్కడ? యితనిం జయించి వెను ♦ గాయము సేయుట యెడ? భూవరా!

క॥ ఆయువి వక్షంబునకుం, జేయని తొడవులుగ యముని♦చేతి మహాదం
డాయుధము హనుమ ముష్టియు, నీయనువున వెలికిఁద్రోప♦నిటు గన్పడియెన్.

చ॥ చెలసిన కాలకూట మొగిఁ ♦ జిచ్చుఱకంటిని మ్రింగినన్ మహా
బలయుత సర్పజాలములు ♦ పక్షులరాయని గెల్చినన్ జగం
బులఁ గల వీరవర్యుల ప్ర ♦ పుష్ట భుజాంతర సీమఁ జేర్చి య
గ్గలికను నాటు కైదువులు ♦ గాఁడఁగజాలవు వీని తొమ్మునన్. ౧౩౮౯

మ॥ చతురంభోధి పరీత భూతలము దం ♦ ష్ట్రం గ్రుచ్చి క్రీడంబు స
మ్మతితో నిల్పిన మీఁద లోకములు మా ♦ మంద్రాటలున్ ద్రిమ్మటల్
వెత లేనాఁటికిఁ దీఱునంచు మది నొ ♦ వ్వం బొంది నీచేత నీ
గతి లంకేశుఁడు పొంద వీని మృతి నిం♦క న్నమ్మకుండెం గదా! ౧౩౯౦

మ॥ అన నాఁగాకని రాఘవుండు మది న ♦ త్యంతంబు విశ్వాసముం
గొని నీయన్నకు సాంపరాయిక విధుల్ ♦ గూడంగఁ జేయించి ర
మ్మనుమానంబును వీడుమా ధరణి వై ♦ రాదుల్ మనుష్యుండు చే
తనుఁడై యుండెడు నంతదాఁకనె చుమీ ♦ ధర్మజ్ఞ! చింతింపుమీ!

ఆ॥ అనుచు నతని నంపి♦యడలు దీఱఁగ వచ్చి, మోదమంది తనకు♦మ్రొక్కుచున్న
నిఖిల నిర్జరాది♦నిచయంబుఁ గనువేడ్క, నెదురుగాఁగ నడచె♦నినకులుండు. ౧౩౯౨

—: విభీషణుని చింత :—

ఆ॥ అన్న దొనఁగులెల్ల♦మన్నింపఁదగినవి, పొమ్మనంగ నతఁడు♦పోయి యగ్ర
జన్ముఁగాంచి పట్టఁ♦జాలని పెనుచింత, లోన మునిఁగిపడియె♦వాని మీఁద. ౧౩౯౩

ఆ॥ జగతి జీవులెల్ల♦జాలినొందఁగ ఖేచ, రులును మానులును క♦రుణ వహింప
రాలుఁ గరఁగ నేడ్చి♦రావణు పైఁబడి, పలవరించె నిట్లు♦బహు విధముల. ౧3౯४

సీ॥ హా లోకభీకర! హా మేరునిభ ధీర! అద్వంద్వ శూర! మా♦యా ప్రకార!
ఉండుచోఁ ద్రిదశ కు♦లోన్మూలి వైతివి, చచ్చుచో నసుర వం♦శముఁ జెఱచితి
మ్రింగిన గరళంబు♦మేకొని చెఱచు జా, నకి యను విసము కా♦నఁగనె చంపు
వలదని యానాఁడె♦పలుకఁగ వినవైతి, విఁక నేఁటికి వినంగ♦నిచ్చగింతె?

తే॥ పర కళత్రంబుఁగొంట య♦భావ్యమంటిఁ,దొలఁగరాని యపఖ్యాతి♦దొరయునంటిఁ
గొరవలదంటి వైరంబు♦కూడదంటి, వంశము నశించునంటి నా♦పలుకులింతె?

శా॥ నాఁడగ్నిం బడినట్టి వేదవతి యీ ♦ నాఁ డుర్వరా జాతయై
యీడంబోవక దైత్యనాశమునకై ♦ యిచ్చోటికిం జేరె నీ
జాడ ల్వలదని యెంతచెప్పినను రో ♦ షస్ఫూర్తి మన్నింప కీ
క్రీడాగోడము చేసికొంటి కుల శౌ♦ర్యప్రా విభూత్యున్నతుల్. ౧3౯౬

ఉ॥ కారుణికుండు రాముఁడని ♦ కామిని నిమ్మని సంధిమేలనం
గా రహిం పీడకుంటి వర ♦ గౌరవముల్ పది శీర్షముల్ వృథా
ధారణిఁ బొర్లుచున్నయవి ♦ తప్పక నాపలుకిప్పుడైన నీ
తా రమణుం డనాది పర ♦ తత్త్వము చుమ్మని నమ్మితే దివిన్. ౧3౯౭

శా॥ వీరస్వర్గము చేరితో? నలువ మే ♦ ల్పీటం బ్రవేశించితో?
తారాద్రిం దగఁ జొచ్చితో? యెవఁడు ని♦న్దాకొంచు నీజీవ సం
చారంబుం గొనిపోయె? కాలుఁడొ? లస ♦ చ్చంద్రాంశువుల్ నేఁడు చ
ల్లారం గల్గెనె? మారనాటకము నేఁ ♦ డైనం దుదిం బొందెనే? ౧3౯౮

చ॥ మగనిని చంపుచేత తన ♦ మానసమందిడి చుప్పనాక యీ
పగ గొనితెచ్చి యిచ్చి తన ♦ పంతము నెగ్గఁగఁ జేసికొన్న దీ
పగిదిగ నారకానఁ గల ♦ పాపులు స్వప్నసుఖ మొందు పుణ్యులున్
బగటుగ నైరి యెల్లిదపుఁ ♦ బాటున నేరి మొగంబు గాంతువో?

మహాస్రగ్ధర.

విజయశ్రీ పంకజాక్షిన్ ♦ విమలగుణయుతన్ ♦ విశ్వ సాహిత్య లక్ష్మిన్
భుజమేధా శక్తి యుక్తిన్ ♦ భువన విజయ వి♦స్ఫూర్తి నాసించు చేతుల్
త్రిజగన్మాతన్ బ్రపూతన్ ♦ త్రిదశగణనుతన్ ♦ బృథ్వి సంజాత సీతన్
బొజుఁగై స్పర్శించు నిచ్చన్♦భువిని తడవఁగాఁ♦ బూర్ణ సంసిద్ధి గంటే! ౧४౦౦

తే॥ అనుచుఁ బనవు విభీషణు♦ననలికేడ్చి, విధి నెఱింగియు మతిచెడ♦వెగవనేల?
లెమ్ము కాఁగల పనుల నా♦లింపు మనుచు, భల్లుకేశుండు లేపి సాం♦త్వనముపలికె.

—: మండోదరి విలాపము :—

మ॥ విరియం బాఱిన కేశపాశములతో ♦ వ్రేలాడు హారాలితో
నురుఁగం బాఱిన ఘూర్ణ చిత్తములతో ♦ జొబ్బిల్లు కన్నీటితోఁ
గరముల్ ద్రొమ్మున మోఁదికొంచు వడి లం ♦ కానాథు కాంతల్ వరా
మరినల్ లేని విధంబునన్ జరగిరా ♦ మండోదరీ యుక్తలై. ౧౪౦౨

తే॥ పొలుచు సత్యంబు ధర్మంబు♦భూతదయయుఁ, గలుగుకులమునఁ బుట్టిన♦ఘనుఁడుసిగ్గు
వదలి చేయు కార్యమువలె♦వాయి విడిచి, యేడ్చు కాంతలరవ మెల్ల♦యెడలఁ బరఁగె.

తే॥ కాలియందెలు మొఱవెట్ట ♦ గజ్జెలేడ్వఁ, గొంద ఱేగుదెంచిరి రణ♦క్షోణి కప్పుడు
కొందఱు పురందరుని పగఁ♦గూలె ననుచు, నచటనే జీవముల వీడి♦రవని దొరలి

తే॥ ఘోర శోకంబు గందర♦గోళపఱుప, నందముం జెడఁ దొడవులు♦చిందుచుండఁ
గనుల నశ్రుజాలము మబ్బు♦కరణిఁ గురియ, వనరి విన్నుత్రోవఁ గొందఱు♦వచ్చినారు.

తే॥ తలలు మోఁదుకొనెడువారు♦తడవువారు, కనుల నీరూర నా దశ♦కంఠు బాహు
పీఠముల మీఁదఁబడి నూత్న♦విగత భర్తృ, శోకమున నేమి యెఱుఁగక♦సుక్కినారు.

తే॥ పదములును ద్రొమ్మి భుజములు♦వదనములును, తొడిఁబడఁగఁ బలుమాఱులు♦ తడవి తడవి
యేడ్చియేడ్చి నాలుక♦లెండఁబాఱ, తెలివి దప్పి ధారణిపయిఁ♦దెరలినారు.

ఉ॥ పొందరు మున్ను దుఃఖములఁ ♦ బొందిన నెప్పుడొ పొల్లయల్కయే
పొందుదు రద్దియుం దుదిని ♦ పూర్ణ సుఖప్రద మంచు నెమ్మదిం
గొందురు దైత్యకాంత లిటు ♦ గూరిన యార్తి భరింపలేక యా
డెందముపైని వ్రాలి రట♦డిందిన ప్రాణము రోయుకై వడిన్. ౧౪౦౩

తే॥ జక్కనులు రక్కసులు నాగ♦చంద్రముఖులు, సిద్ధ సఖులు విద్యాధర♦స్త్రీలభేద
మోహముంచుటచే శోక♦మున మునింగి, తడవి తనివి సనక చాలఁ ♦ దల్లడిలిరి.

తే॥ ధర్మము నశింప నెదఁజేర్చు♦ధరణిజాత, మీఁది మరులున మమ్ము ప్రే♦మింపవైతి
దానిచేఁగాదె యీగతి♦తనరె నీకు? దాని వదలి మమ్మిఁపుడైన♦దనుపరాదె?

తే॥ అనుచు గోల మండోదరి♦యలమటించి, కడలిపై మించు వ్రాలిన♦కరణి విభుని
వక్షమున వ్రాలి శిలలును♦వృక్షములును, కరఁగి తోడన పలవింపఁ♦గనికరించె,

చ॥ అసుర విభుండు తా మరణ ♦ మందిన పిమ్మట నేను నందుటల్
దొసఁ గతి దుర్భరం బమిత ♦ దుర్భర మక్కట! నాదు సన్నిధిన్
బొసఁగిన యిర్వి నీమకుట ♦ భూషిత శీర్షములే? కదించి నా
వ్యసనము మాన్పవో? వదన ♦ పద్మ వికాసము చూపవో యిఁకన్?

చ॥ ఎలరిచి వెండికొండ భరి ♦ యించిన నీ పెనుమేని లోపలన్
వెలుపల నూవుగింజ యెడ ♦ వీడక తొల్చి యసుప్రజంబు ని
ట్టలముగ రోయుతీరొ? పద ♦ టంబున జానకిమీఁది ప్రేమ లో
పలఁ గలదంచు నారసిన ♦ పద్ధతియో? యిది రామబాణముల్!

చ॥ అలయక రాము తూపులు గు ♦ హాముఖముంబలె ఱొమ్ముఁదొల్చి య
వ్వలఁ జనియున్న వక్కట! త ♦ పంబును దార్ఢ్యము వీర్యముం జెడన్
బొలిసితివే? యిఁకేది గతి? భూ♦రితరోగ్ర శరంబొకండు ని
మ్మళముగఁ గ్రోలె జీవముల ♦ మానుష శక్తియు నింత యొప్పునే?

మ॥ వనితాజాతికి భూషణంబయిన యా ♦ వైదేహి యందంబు త
ద్ఘన పత్నీత్వము దైత్య నాసికయు లం ♦ కారాజు కామంబు రా
ముని కాంతార నివాస నిర్ణయ విధం ♦ బుం గూడి జంభారి చే
సిన పుణ్యంబుగఁ బూర్తియై పరిణమిం ♦ చె న్నాకు నేఁడీగతిన్.

చ॥ అమరుల దిగ్గజంబుల ను ♦ మాపతి ధాత్రు ముకుంద జిష్ణులన్
సమరమునందు మించిన య ♦ సాధ్య బలాఢ్యున కెచ్చటన్ వినా
శము కలదే యటంచు నెల ♦ సంబున నుండితి నీ మహాతపః
క్రమ ఫల జీవితంబునకు ♦ రాముఁడు పుట్టెఁ గృతాంతుఁడై భువిన్.

చ॥ కొమరుగ నొందు మూఁడు నఱ ♦ కోటికి మేర వచింపరాని స
త్త్వమునకు జీవితానకుఁ ద ♦ పఃఫలరాశికి నింక నాశ మే
క్రమమున వచ్చునంచు మది ♦ గాఢ తరంబుగ నమ్మియుంటి సీ
తమ యను ఘోర హాలహాల ♦ మక్కట యన్నిటి మింగె వేల్మిడిన్!

చ॥ జగము స్వభావ మిట్టిదని ♦ సత్య మెఱుంగు సమర్థు లెవ్వ రీ
జగముల నెల్ల గెల్చిన ప్ర ♦ శస్త బలిష్ఠులు నిల్చిరేమి? యిం
చగు విలు తేటి నారి పువు ♦ టమ్ములు గల్గిన శంబరారికే
యగడుపడంగఁ జిక్కిన బ♦లాఢ్యుని నాశము చేయరే నరుల్! ౧౪౧౯

తే॥ రాము నెంచితి నాది నా♦రాయణునిగఁ, దెలియ కిట్టు లుత్తముని ప♦త్ని నిచెఱగొని
వచ్చితివి తత్ఫలం బను♦భావ్యమయ్యె, నిప్పుడైన నియ్యది నీకు♦నెఱుఁగరాదొ!

మ॥ అని చింతాకులితాత్ముఁడై పనవి య♦త్యంతంబు దుష్ప్రాప వే
దన నిండారఁగ శీర్ణ హారము గుత ♦ ద్వక్షంబు హస్తంబుతోఁ
దనియం జేరిచి తృప్తిమై నతని నా ♦ థా! యంచుఁ బేర్వాడి యం
తన నిశ్వాసము నిల్పె జీవములు నం ♦ తర్లీనమై పోవఁగన్. ౧౪౨౦

తే॥ అమరకాంతలు విద్యాధ♦రాంగనలును, మునిసతులు నాగ తరుణులు♦మనుజ సఖులు
పెక్కుగతుల మందోదరి♦పెద్దతనము, వేయి నోళ్ల శ్లాఘించి ర♦వ్వేళయందు.

సీ॥ అంత విభీషణుఁ♦డంతరంగంబునఁ, జింతించి క్రమరీతిఁ♦జచ్చుకొలిపి
సంస్కారముల నెల్ల♦శాస్త్రోక్తముగఁ జల్పి, శవముల నుంచెఁ గా♦ష్ఠములమీఁద
వాద్య స్వనము లెల్ల♦వారి రవంబుల, వినరీక మిక్కిలి♦విస్తరించె
సిడమును తెల్లని♦గొడుగును తోడరా, నతని పత్నులును వె♦న్నంటి నడవఁ
తే॥ జుట్టివచ్చి యిర్వురకుఁ జి♦చ్చును రగిల్చి, చేయఁదగు క్రియలెల్లను♦చేసి యవలఁ
దక్కువారికిఁ గూడ నా♦తండె యుక్త, కర్మము లొనర్చె బడి నుద♦కంబుతోడ.
ఆ॥ అవల వచ్చి రాము♦నంఘ్రి పద్మములకు, మ్రొక్క నతఁడు నతని♦పొనుఁగు గాంచి
లోక సహజ మిద్ది♦నీకు నుమ్మలిక మి, ట్లొందు టుఱవె యనుచు♦నూఱడించె.

౩౭ శ్రీరామ నివర్తన పటలము. (౩౫౭)

తే॥ బహువిధ శాస్త్ర మర్మంబులఁ♦బకృతి నైజ, ధర్మముల నెఱిఁగించి యా♦దైత్యరాజు
నూఱడించి లక్ష్మణుఁ గని♦యొప్పమీఱ, నిట్టులనియె రాముఁడు ప్రేమ♦మెనకొనఁగ.
ఆ॥ అర్కసుతుఁడు మారు♦తాత్మజుఁడును తక్క, కపివరులును వెంటఁ♦గదల నేగి
నీతియుతుఁడు యామి♦నీచర విభునకుఁ, బట్టమొనర నీవు♦కట్టుమయ్య. ౧౪౨౫
క॥ అని యాజ్ఞచేసి పంపఁగ, ననిమిషులు దిగీశు లప్పు♦డగునంతకుఁ బ్రే
మను శక్తి కొలఁదిఁ దోడ్పడి, పనులొనరించిరి విశేష♦పరతంత్రులుగన్. ౧౪౨౬
ఆ॥ పుణ్య తీర్థములను♦మొగులు జలంబుల, జలధి జలము హార♦సమితి సింహ
పీఠి బొమిడికమ్ము♦ప్రీతితో వేల్పులు, తెచ్చి కొఱఁతలేక♦యిచ్చినారు. ౧౪౨౭
ఆ॥ అజుని యాజ్ఞవలన♦హరిణముఖుండు మ, యుండు వచ్చి హరిహ♦యుఁడు భవుండు
పొగడఁదగిన పగిదిఁ♦బూజ్య విధంబుల, మంటపంబు గూర్చె♦మండనముల.
తే॥ విధియుతంబుగా బ్రహ్మాది♦విబుధవరులు, పుణ్యతీర్థాభిషేకంబు♦పొసఁగఁ జేయ
నన్న యాజ్ఞానుసారి రా♦మానుజుండు, ప్రీతి మకుటంబు పెట్టె వి♦భీషణునకు.

ఉ॥ నీలగిరీంద్ర శృంగమున ♦ నీరజ మిత్రుఁడు తోఁచు చందమై
నీలమణీ విభాసిత వి ♦ నిర్మల పీఠి విభీషణుండు మో
దాలసుఁడై కిరీటయుతుఁ ♦ డై తగు బంధువులైన పూర్వ దే
వాలి భజింప వాసవుని ♦ యందమునన్ వెలుఁగొందె నత్తఱిన్. ౧౪౩౦

తే॥ సురలు కల్పక సుమములఁ♦గురిసినారు, తావి పూవుల సిద్ధ సా♦ధ్యావలులును
చిందఁజేయఁ ద్రిమూర్తులు♦శిష్టమాని, జనము లాశీస్సుమంబులఁ♦జల్లినారు.
తే॥ నవ్యమకుట భూషణుఁడు దా♦నవవిభుండు, భక్తితోడను సౌమిత్రి♦పాదసరసి
జాతములకుఁ బ్రణామంబు♦నరవిఁజేసి, పలికె విశదఫణితి నెల్ల♦వారు వినఁగ.
తే॥ ఏను శ్రీరాము సన్నిధి♦కేగి మరలి, వచ్చునందాఁక నీలంకఁ♦బ్రాభవమునఁ
గొఱఁతలేక పాలింపంగఁ♦గోరినాఁడ, ననుచుఁ బ్రార్థించి యొప్పించి♦యచటి కరిగె.

తే॥ కపికులేంద్రునితోడ నం♦గదునితోడ, వచ్చి పదముల కెఱఁగిన♦వాని దైత్య
విభుని రామచంద్రుండు సం♦ప్రీతితోడ, నలమి మృదు భాషణంబుల♦నల్లననియె.

చ॥ పనిగొని మూఁడు లోకముల ♦ వారు నుతింపఁగ దేవతాలికిన్
జనులకు నీతిపద్ధతికిఁ ♦ జక్కటికిం దగురీతి నిల్చి శ్రీ
యును సుకృతంబు కీర్తియు స ♦ మున్నతి నొందఁగ రాజ్యభారమున్
గొని సుఖమందుమా యనుచుఁ♦గొన్ని హితోక్తులు పల్కె విమ్మటన్.

—: హనుమంతుఁడు సీతకు రామ విజయము తెల్పుట :—

చ॥ హనుమనిఁ గాంచి నీవు జన ♦ కాత్మజ యున్న వనంబు చేరి యిం
దొనరిన యెల్ల సంగతుల ♦ నొప్పుగఁ దెల్పుమ యన్న నాతఁడున్
జనివిని వాయువేగమునఁ ♦ జావని జానకి యున్నచోటికిన్
జని వసి వాడియున్న విర ♦ జాజికి వర్షముఁబోలెఁ గన్పడెన్.

చ॥ కనఁబడి మ్రొక్కి భానుకుల ♦ కాంతుని నామము నుచ్చరించుచున్
దనియక గంతులేయుచును ♦ తాళము వైచుచుఁ బాటపాడుచున్
జనకజ తన్ను గాంచియె ని ♦ జంబు గనుంగొనఁ బెక్కురీతులన్
గునియుచు నెట్టకేని సుమ ♦ కోమలి పాదము డాసి యిట్లనున్. ౧౪౩౭

చ॥ శుభము శుభమ్ము మంగళము ♦ శోభన దేవతకున్ జయమ్ము మే
లుభయములు తల్లికిన్ దనుజ ♦ సూదనజాయకు భద్రముల్ సుర
ప్రభృతులు సంతసింప రఘు ♦ రామ మదేభము యామినీచర
వ్యభిజన సారసాకరము ♦ నంకిలి వీడి కలంచెఁ దల్లిరో! ౧౪౩౮

ఉ॥ రావణ మత్త నాగమును ♦ రామ మృగేంద్రము చించిచెండె ర
క్షోవిభు మస్తకంబులు వ ♦ సుంధర దొర్లెను వాని బాహువుల్
ప్రేవులు నక్కలీడ్చెను శ ♦ రీరము మీఁద నెఱంగె గ్రద్దలున్
గావరు కన్నులం బొడిచి ♦ కాకులు దిన్నవి సంగరస్థలిన్. ౧౪౩౯

క॥ తోషమతి రామునాజ్ఞ వి, భీషణు నియమమున లంక ♦ వీథుల సుర వి
ద్వేషుల కాంతలు దక్కఁగఁ, భాషింపఁగ నొక్క యసుర ♦ బ్రతుకండయ్యెన్.

క॥ అమృతము మించిన యావా, క్యములన్ విని యొక్క కళను ♦ గల రేక క్రమ
క్రమమున వర్ధిలి యంకము, సమసిన విధుఁబోలి జనక ♦ జాత వెలింగెన్

ఆ॥ రాహు గళితమైన ♦ రాజ బింబమువలె, ధరణిజాత ముఖము ♦ తనరఁ గాలుఁ
గేలు తొమ్ము మనము ♦ లీలఁ బూరించెను, మేరలేక ముదము♦మీఱుకతన.

ఆ॥ కార్శ్యమొందియున్న♦కాంతయంగములెల్లఁ, బెద్దవగుచుమిగులఁ♦బెరుఁగఁజొచ్చె
వాడియున్న వల్లి♦వర్షంబుచేత నా, నా ముఖముల నెలసి ననుచు భంగి. ౧౪౪౩

చ॥ భ్రుకుటియు వంగెఁ జెల్వముగ ♦ ఱొమ్ము చెమర్చెఁ దలం పొకండుగా
నొకటి వచించునట్టిదిగ ♦ నొప్పె సముత్కముచేతఁ బక్వమై
రకమగు ప్రేమ కల్లువలె ♦ భ్రాంతిని గొల్పెన? యేమివింత? జా
నకి కెది పల్కఁ దోఁచక మ♦నంబున నూరక యుండె నివ్వెరన్. ౧౪౪౪

ఉ॥ నీతియుతుండు సద్గుణి మ ♦ నీషి మరుత్సుతుఁ డద్దికాంచి త
ల్లీ! తరమెంచరాని యెన ♦ లేని కుతూహలమొంది యుత్తరం
బీతని కేమి యిత్తునని ♦ యెంచఁగ లేకిటు లూరకుంటివో?
కోఁతి యసత్యమాడె నను ♦ కొంటివా? యన్న వచించు నామెయున్.

చ॥ అనదృశమైన యుత్కలిక ♦ యాదట యన్నియు రేఁగి నన్ను నా
వనమున నుండనీకిటులు ♦ పల్లటసేసెను పక్కణింప నే
దెనయును తోఁపనీయమిని ♦ తెప్పిఱకుంటిని నిబ్బరంపు సం
తస మది చిత్త విభ్రమము ♦ దార్కొనఁ జేయదె? మారుతాత్మజా!

ఉ॥ నీ వలనాఁడు నాచెఱను ♦ నీఁగెద నంచభయం బొసంగి యా
కై వడి మన్మనో నిలయుఁ ♦ గ్రచ్చఱఁదెచ్చి దురాన దైత్యులన్
వావిరిఁ గూల్చి తద్విజయ ♦ వార్తను తెల్పిన పుణ్యమూర్తి ని
న్నేవిధి సత్కరింతునని ♦ యేమియుఁ దోఁచకయుంటిఁ బావనీ! ౧౪౪౬

మ॥ ఇన వంశోత్తముఁ దోడితెచ్చితివి నా ♦ హీనస్థితిం దెల్పి మ
ద్ఘన దుఃఖంబులఁ బాపినాఁడవు త్రిలో ♦ కంబుల్ ప్రసాదించినన్
తనయా! యస్థిర లక్ష్ములవ్వి నత మ ♦ స్త ప్రాంజలుల్ దక్క నే
యనువుం దోఁచదు వాంఛయున్నను ప్రియం ♦ బారంగఁ దెల్పంగదే!

చ॥ అనవుడు వాయుజుండు హృద ♦ యంబున నుబ్బి నమస్కరించి మ
జ్జననివి నీముదంబె యగు ♦ జానగు నా యభివాంఛలెల్ల ని
న్మనుకులచంద్రు సన్నిధి స ♦ మర్పణసేయ మనంబుగోరు సే
వనమునకంటె మేలయిన ♦ భాగ్యము నాకొకటేని లేదిఁకన్. ౧౪౪౮

మ॥ త్రిజగత్సన్నుత జాతిరత్నము క్రియన్ ♦ దీపించు స్త్రీరత్నమున్
ద్రిజటం దక్కఁగ నిన్నలంచి బహుళా ♦ ర్తిం గూర్చు నీరాక్షసీ
వ్రజము న్నా కసిదీఱ దంచుటకు సం ♦ రంభించె డెందంబు చే
రజము ల్పల్కిన వీరి నాలుకల వై ♦ రంబూడఁగా నూడ్చెదన్. ౧౪౫౦

చ॥ పలుకఁగరాని ప్రల్లదము ♦ పల్కుచుఁ బైఁబడి మ్రింగువార మం
చులుకఁగఁ జేసి చీల్తుమని ♦ యుత్తలపెట్టుచు నొంచుచుండు నీ
పలువల జాతి చెల్వలను ♦ పాద నఖంబుల ఛిన్న భిన్నముల్
సలిపెద నీవరం బొసఁగు ♦ చాలు రహించెద నంచు వేఁడఁగన్. ౧౪౫౧

చ॥ చెలువలు భీతిమైఁ జెదరి ♦ సీతపదంబుల వ్రాలి తల్లి! నీ
యలఘుపదంబులే శరణ ♦ మంచు విధేయత వేఁడ నంజికల్
వలదని మాటయిచ్చి కపి ♦ వర్యుని గాంచి విశుద్ధ మానసా!
తలఁపకు వీరిఁ జంపుటకుఁ ♦ దప్పులు వీరలయందు గల్గునే? ౧౪౫౨

ఉ॥ రావణు బోధచే నటులు ♦ రాయిడి చేసిరి కాని వీరికిన్
భావములందు నాయెడల ♦ వైరము గల్గద యస్వతంత్రలున్
నావిధి యిట్లు నన్నకరు ♦ ణంబుగ నేఁచుచు నుండెఁగాక యో
పావని! వీరు కుబ్జవలెఁ ♦ బాపులు గారు సహింపఁగాఁ దగున్. ౧౪౫౩

ఉ॥ పాప కులంబునం బొడమి ♦ పాపములం దలవాటుపడ్డ దు
ర్లేపులె మైన నావలని ♦ ప్రేమను వీరి మనంబులందు సం
తాపము గూర్పఁ జూడకుము ♦ ధర్మగుణాలయ! పుణ్యమూర్తి! నా
ప్రాపును గోరి రియ్యది వ ♦ రంబుగ నాకొఱ కీయ వేఁడెదన్. ౧౪౫౪

చ॥ అనవుడు వేఁడుకోల? యిది ♦ యాజ్ఞయ కాదె? కృపాసముద్రవౌ
జననివి! తల్లి పల్కు లెద ♦ జార్చు సుతుండు సుతుండె? మేలు! నీ
ఘనమతి నెంచి నట్ల యగుఁ ♦ గాకని పావని కేలుమోడ్పు గై
కొని యటనిల్చి జానకి క♦ళుంఠిత మోదముఁ గూర్చుచుండఁగన్. ౧౪౫౫

చ॥ అచట విభీషణుం బిలిచి ♦ యార్యుఁడు సీత నలంకరించి నీ
విచటికిఁ దోడితెమ్మన న ♦ భీష్టము నందినభంగిఁ బొంగి యు
బ్బుచు దనుజప్రభుం డరిగి ♦ భూసుత సన్నిధి శీర్షక ప్రభల్
రుచిరముగా ధరం బరవ ♦ మ్రొక్కి నయంబు భయంబు పెంపునన్.

శా॥ తల్లీ! కోరిన శత్రు వీర జయ మా ♦ త్రంబయ్యె రాముండు నిన్
వాల్లభ్యంబునఁ జూడఁగోరె దరిసిం ♦ పన్ వచ్చి రంగస్థలం
బెల్ల న్నిండిరి వేల్పు లచ్చటికి వే ♦ యింపారఁ దో డ్తేర న
న్నుల్లాసంబునఁ బంపె లెమ్ము లలి ను ♦ ద్యోగింపు కై సేఁతకున్. ౧౪౫౭

ఉ॥ నావుడు సీత యిట్టులను ♦ నాయిట నున్న విధంబు లెన్నగా
దేవతలున్ దినేంద్ర కుల ♦ దీపుఁడు మానులు నాకలోక రా
జీవ దళాక్షులుం గనుట ♦ సెబ్బఱ గాదది యింతలింత లే
నీవిధి నొందియుం దుదకు ♦ నెట్లు రహింతు నలంకృతుల్ గొనన్. ౧౪౫౮

తే॥ అనుచు జానకి వచియింప ♦ నసురవిభుఁడు, తల్లిరో! రామునాజ్ఞ చం ♦ దంబు నిట్లు
విన్నవించితి నన నామె ♦ విభునియాజ్ఞ, యిట్టులేయైన సరియని ♦ యియ్యకొనియె.

—: అప్సరసలు సీత నలంకరించుట :—

తే॥ జనకజ నలంకరింప న♦ప్సరస లేగు, దెంచి తిరుమంజనము సేయఁ♦దివిరి తగిన
పునుఁగు కస్తురి గంధ చం♦దనము తావి, తైల జలములఁ జేకూర్చి♦దాసినారు.

ఉ॥ స్త్రీల సులక్షణంబులకు ♦ క్షేత్రము క్రొత్తడి జాతి సొమ్ము మే
ల్లీలల కెల్ల మచ్చు కడ ♦ లిఁక వెలిదేఱిన వెన్నతోడు ధ
ర్మాలికిఁ దల్లియైన జన ♦ కాత్మజ యొంటి జడన్ వదల్చె రం
భా లలితాంగి వేదముల ♦ వ్యాసుఁడు నేర్పిన విచ్చుకైవడిన్. ౧౪౬౧

చ॥ తరమగు దొండఁబోలుచు సు ♦ ధామధురోక్తుల నొయ్యనొయ్య వె
ల్వఱచెడు నోట ముత్తెముల ♦ నంటి రదంబులఁ దోమి నెత్తిపైన్
బరిమళ తైలమంటి మను ♦ వట్టిన రత్నము సానవట్టు న
ప్పరుసున గీత మంగళ ర ♦ వంబులతో జలమార్చి రచ్చెలుల్. ౧౪౬౨

చ॥ పవడపుఁ దీవ నారజపుఁ ♦ బాల నురుంగున మూసియుంచు న
ప్పవిదిని చందనం బలఁది ♦ వక్షముపైఁ దగఁ జెందిరంబు సాం
కవమును మెత్తి మేల్కుసుమ ♦ కన్నియ వన్నియ పట్టుచీరయున్
సవరణచేసి మేఖలను ♦ సొరుగఁ దాల్చిరి సన్నకౌనుపై. ౧౪౬౩

సీ॥ ఇంద్రాణి తాల్పంగ♦నిమ్మగు రిక్కల, రహినొప్పు తారహా♦రంబుగూర్చి
విద్రుమోష్ఠమునకు♦విమలమౌ కుంకుమ, రసముఁబో ల్తాంబూల♦రసము దడవి
నంతనగాఁగ వ♦సంతంబు చుట్టి హా, రతి యెత్తి దేవతా♦రక్షచేసి
యబ్జమండలము నం♦దంకమ్మృగంబన, హైమ విమానంబు♦నందు చేర్చి

తే॥ విబుధకాంతలుతనుచుట్టి♦వెలసియుండఁ, గఫులుదైత్యులు గుంపులై ♦క్రందుకొనఁగ
వెడలఁ బాఱ నల్లల్ల వి♦భీషణుండు, నీరద శ్యామ గాత్రు స♦న్నిధికి వచ్చె.

తే॥ ఇవల మునులు సురలు వారి♦యింతులును ప్ర, మోదమున గుంపులై చేరి ♦ మురియుచుండఁ
దక్కువార లానంద వా♦ర్తలు నచించు, చింపుగాఁ జూచు వేడ్క వ♦హించి క్రమ్మ.

ఉ॥ ఉత్తమవంశ దీపిక య ♦ యోనిజ సాధ్వి పవిత్ర సద్గుణో
దాత్త చరిత్ర సీతను ము ♦ దంబునఁ జూడఁగఁ గోరి గుంపులై
యొత్తుగఁ గూడి త్రోవ యిడ ♦ కుండఁగ దైత్యులు దండపాణులై
మొత్తి యదల్చి త్రోచిరి ప్ర ♦ మోదుల మోములు నల్లఁ బాఱఁగన్.

క॥ అత్తఱి రాముఁడు నందియు, మొత్తిన చిత్తంబుతోడ♦నుద్భ్రాంతంబున్
దత్తఱయగు ఛేలన ముని, సత్తము లట జరుగు తీరు ♦ చయ్యనఁ దెలుపన్.

క॥ అది వినియు వినక మున్నే, పెదవులు చలియింప దైత్య ♦ విభుఁగని యీబె
ట్టిదముల నీవుండఁగఁ జే, యుదురే? తగునయ్య ప్రేమ ♦ యుతుల నలంపన్?

క॥ కదనంబుఁ జూచు వేడుకఁ, బదువులుగా వచ్చియున్న ♦ వారి నురక యి
ట్లదలించుచు దండింపం, బదరి యనుమతించు నతఁడు♦ప్రాజ్ఞుండగునే? ౧౪౧౯

ఉ॥ శూలియుఁ జక్రియు న్నలువ ♦ సుందరులన్ విడనాడి వచ్చుటల్
పోలునె; తక్కు వేలుపుల ♦ పొల్పులఁ దెల్పఁగనేల? తాపస
స్త్రీలును పూరుషుల్ ముదము ♦ చే నిటురా నదలించి మోఁదుచుం
దోలుట క్రూరకృత్యమగు♦దోసము సుమ్మిటు సేయఁగూడునే? ౧౪౨౦

ఆ॥ సాధు జనుల నిట్లు ♦ సడ్డసేయక యడఁ, గించి తఱుమఁగొట్టు ♦ టించుగాదు
వలదటంచుఁ గినిసి ♦ పలుక విభీషణుఁ, డడలుతోడ నోడలు ♦ వడఁక నిలిచె.

శా॥ సీతాదేవి రణాంగణంబును సమీ ♦ చీనంబుగాఁ జూచి త
ద్భూతక్షోణిని కంకగృధ్ర బలి భు ♦ గ్భూతాలికిం బందువుల్
ప్రీతించేసిన రామభద్రు విలస ♦ ద్వీరాంక వేషంబు నెం
తో తృప్తింగనఁ దత్తఱించు హృదయాం ♦ దోళంబుతో వచ్చుచున్.

శా॥ నా పూతత్వము తేటగాఁ దెలిపి పై ♦ నా నాథు వీర్యంబు ను
ద్దీపింపం బొనరించి నాకులము కీ ♦ ర్తి న్నిల్పి యాలోకమున్
జూపం బూనిన మారుతాత్మజున కి ♦ చ్చో నా సతీత్వంబు సు
శ్రీ పెంపొందఁగ నిశ్చలంబగు చిరం ♦ జీవిత్వ మీఁ జాలునే? ౧౪౨౩

శా॥ నామేనిప్పు డశుద్ధమయ్యె నసువుల్ ♦ నాశిల్లి నట్లేయగున్
బ్రేమంబొక్కటి చూడ నాసగొని యు ♦ ర్విన్నిల్చె; వేఱొండు చే
తో మోదంబును కూర్ప లేదనుచు సం ♦ తోషించి సౌదామినీ
జీమూతం బననొప్పు చాపయుత రా♦జీవాక్షు వీక్షించెఁదాన్. ౧౪౨౪

చ॥ తొడరి సురాంగనామణులు ♦ తోడనురాఁగ విమానమందు వ
చ్చెడి జనకాత్మజాత తన ♦ జీవములన్ మరలన్ వహించు వ
వ్వడువున డిగ్గెఁ దన్ముఖము♦భాస్కర వంశ పయోధి సోముఁ డ
య్యెడ హృదయాంబుజం బలర ♦ నిమ్మగు సొమ్ముగఁ గాంచునట్లుగన్.

మ॥ ప్రతిజన్మంబున జీవితేశుఁడయి తో ♦ డ్పాటొంది దుర్జన్మ దుగ
ఖతతుల్ ద్రోచి ముదంబుగూర్చు నిజ హృ♦త్కాంతున్ మనోమోదన
స్థితి వీక్షించి భజింపఁగంటి నిఁక నే ♦ జీవించియున్నన్ సరే
గతియింపన్ సరె యంచు వీడినది యా ♦ కంజాక్షి హృత్తాపమున్.

క॥ ప్రేమస్వరూపుఁడగు శ్రీ, రాముఁడు వీక్షించె జనక ♦ రాజ కుమారిన్
రామాజన తిలకము సా, ధ్వీమణి సద్ధర్మకీర్తి ♦ దేవతను రహిన్. ౧౪౨౭

క॥ గ్రీష్మలత పోల్కినున్న వ, పుష్మతి తనపాదములకు ♦ మ్రొక్కినఁ గని యా
యుష్మంతుఁడు గనెఁ గన్నుల, శుష్మ మురలఁ జూచు దండ♦శూకముపోలెన్.

—: శ్రీరాముఁడు సీతను కఠినోక్తు లాడుట :—

మ॥ నియతిం దప్పిన దైత్యునింటఁ గుల హా ♦ నిం గూర్చి నీచాన్నముల్
ప్రియమారన్ భుజియించి శీలమును బా ♦ విం ద్రోచి యున్నాళ్లు దు
ష్క్రియలన్ లజ్జను వీడి చావక యిటుల్ ♦ జీవంబుతో నుండి యే
భయముల్ లేకిట కేల వచ్చితివి? సం♦భావింతు నంచెంచితో? ౧౪౭౯

చ॥ నిను చెఱ వీడ్చి చేకొనఁగ ♦ నీరధి గట్టి నిశాచరాన్వయం
బును మొదలంటఁ గూల్చి రణ ♦ భూమిని రావణు సంహరింపలే
దినకుల గౌరవంబు మఱి ♦ యేను వహించిన ఱట్టుచేఁ గలం
కను వహియించు నంచుఁ గడఁ♦కం జనుదెంచితి వైరిఁ గూల్చితిన్.

చ॥ అమృతము మీఁదికంటె నధి ♦ కాసను ప్రాణుల మేని మాంసముల్
నమలుచు నాసవంబు వ్యస ♦ నంబుగ నానుచునుండి మాయెడన్
సుముఖత చూపుచుండు టెఁకెఁ ♦ జొప్పడునే మరణించుదాఁకఁ? బ్రే
మమున నొసర్చు విందు లవి ♦ మామది కెంత రుచించునో కదా? ౧౪౮౧

తే॥ పావన కులంబునం జనిం♦పక ధరిత్రిఁ, గీటకము వలె జన్మించి♦కీడుపడఁగ
సత్ప్రవర్తన మడుగంట♦జార్చి జన్మ, సంపదకుఁ దగుపని పూర్తి♦సలిపినావు.

చ॥ ఇలువడి సత్ప్రవర్తన మ ♦ నీర్ష్య యసీచత శ్రీకరత్వముల్
లలిత విచక్షణత్వము క ♦ లంకములేని మనంబు కీర్తియుల్
గులసతి లక్షణంబు లవి ♦ కూల్చితి పట్టుగ నీదు పుట్టుచే
విలస దుదారతం గనని ♦ పృథ్విపు కీర్తిని పోలె దుర్మతీ! ౧౪౮౩

ఉ॥ ఉత్తమ వంశజాతలు వి ♦ యోగము గల్గినవేళ నింద్రియ
స్వాత్త నడంచి శీలమున ♦ భంగము కాని దిటంబు గల్గి నం
పత్తను భోగహీనతఁ ద ♦ పం బొనరింతురు మాన రక్షకై
చత్తురు గాని నీకరణి ♦ సౌఖ్యము లందరు శీల నాశినీ! ౧౪౮౪

చ॥ నిలువక పొమ్ము నామదిని ♦ నీదగు చేష్టలు ఱంపమట్లు గం
డ్రలుగను కోయుచుండె నెద ♦ వ్రయ్యఁగఁ జావుము కాదయేని నీ
వలచిన చోటికేగి సుఖ ♦ వర్తన నుండుము నిన్ను గైకొనం
గొలుపదు బుద్ధి యంచుఁ గొఱుఁ ♦ గ్రుచ్చిన భంగి నదల్చి పల్కఁగన్.

చ॥ ఇనకులు పల్కులన్ విని య ♦ హీన గుణాత్మకులైన వేలుపుల్
మునులును వానరుల్ దనుజ ♦ ముఖ్యులుఁ దక్క నఖి జనంబులున్
మనము కలంగఁబాఱ మఱు ♦ మాట వచింపఁగలేక బోరునన్
భనవిరి విహ్వలించిరి ప్ర ♦ పాతము సెందిరి సోలి ధాత్రిపై. ౧౪౮౬

శా॥ నేలం జూచుచు నిల్చినట్టి కరుణా ♦ నిష్పంద వారాశి సం
శీలవ్రాతము కాణయాచి త్రిజగ ♦ చ్ఛ్రీదాత్రి వైదేహి ని
ర్వేలా దుఃఖ పయోధి ముగ్ని వ్రణముల్ ♦ వేధింప బెగ్గిల్లు నా
లీలం గంపిలెఁ గుండె హా యనియె వ్రా ♦ లెన్ ధాత్రిపై దబ్బునన్.

శా॥ రామ క్ష్మావిభు వాక్కు నెత్తిపయి ని ♦ ర్ఘాతంబునాఁ గ్రుమ్మఁగా
భూమిం గూలిన సీత కర్మ మట సం♦బోధింపఁగా లేచి వాగ
క్షామ క్షోణిఁ దపించు నేణి జల భృ ♦ త్కాసారముం గాంచి పో
నేమార్గంబును లేమిఁ దల్లడిలు న ♦ ట్లీగెం దలంకించుచున్ ౧౪౭౮

ఉ॥ నీరును నెత్తురుం గలిసి ♦ నేత్రములం దిగజాఱ నేడ్చుచున్
దోరక నేను ప్రాణముల ♦ తో మనినట్టి ఫలంబు తాఁకఁగా
నేరని యిట్టి వాక్యముల ♦ నే వినఁ గావలయున్ మదీయ దు
ర్వార దురంత దుష్క్రియలు♦ప్రాపుఁగ నేరి మఱేమనందగున్? ౧౪౭౯

మ॥ కరుణా సాగర! మారుతాత్మజుఁడు లం ♦ కం జేరి వీక్షించి నీ
వర కారుణ్యముఁ గూర్చి పల్కుచు సమా ♦ శ్వాసించెఁ గాకున్న భూ
భరమై యే మనుదాననే? యతఁడు నా ♦ బన్నంబుల న్నీకు వి
స్తర ఫక్కిన్ వచియింపఁడో? వినుత దూ ♦ తత్వంబు తాఁ జేయఁడో?

మ॥ పురుషోత్తంసమ! యింతకాలము శ్రమం ♦ బుం గొంచుఁ గాపాడు సు
స్థిర చారిత్రము సత్తపస్స్థితియుఁ బా ♦ తివ్రత్యముల్ సర్వమున్
బర మర్మజ్ఞ విచక్షణం బయిన నీ ♦ భావంబు వీక్షింపమిన్
బరిసెన్ వీసరవోయె వీఱిడి ప్రలా ♦పం బట్లు వ్యర్థంబుగన్. ౧౪౮౧

మ॥ స్థిర పత్నీత్వము గల్గు దాన నన నా ♦ చిత్తంబె సాక్ష్యంబగున్
సరసీజాననుఁడేని నాదు హృదయ ♦ స్థైర్యంబు మార్పంగ లేఁ
డిరవారంగ రఘూద్వహుండె సభ న ♦ న్నిట్లాడుచో నింక మ
ద్వరు భావంబును మార్ప నేర్పుగల దై♦వ మ్మెక్కఁ డున్నే యెటన్?

చ॥ అజ హర చక్రులుం గరత ♦ లామలకంబుగ సర్వ కార్యముల్
త్రిజగములం దెఱుంగుదురు ♦ తేఁకువఁ గాంతల చిత్త సంస్థితుల్
నిజముగఁ గాంచలేరు మఱి ♦ నిర్మల నిష్ఠఁ బతివ్రతాత్వ మ
క్కజముగ నెవ్వరింకఁ గనఁ ♦ గా నొనరింతు? ఫలంబు నేమగున్?

ఉ॥ కావునఁ గాయమున్ విడుటె ♦ కార్యమగున్ భవదాజ్ఞ యట్టి స
ద్భావయుతంబ కాన నెడఁ ♦ దం గొదుకం బనియేమి యుండు? నా
చావును గోరుచుండె విధి ♦ చక్కటి యంచు మఱిందిఁ గాంచి య
న్నా! వనమందు వోలెనె యొ♦ నర్పుము ప్రస్తర మొందు వహ్నితో.

ఉ॥ నాయన! పుణ్యరూప! రఘు ♦ నాథుఁడు పల్కిన పల్కు వింటె? నా
కీ యవశిష్టకార్యము ర ♦ హింం బుయిలోటము మాని క్రచ్చఱం
జేయుమ యన్న నాతఁడును ♦ చేడ్పడి దుస్సహ వేపమాన చిం
తాయత నాంతరంగుఁడయి ♦ యన్న మొగంబును గాంచె న త్తతిన్.

మ॥ జలజాక్షిణు నమ్మతిం దెలుపు సం ♦ జ్ఞం గాంచి స్వప్రాణముల్
వలవంజాలని లక్ష్మణుండు వగతో ♦ వాపోవుచున్ వెక్కుచున్
బెలుచం గట్టెలు తెచ్చి పేర్చి యనలున్ ♦ బ్రేరేఁచె వైదేహి ని
శ్చల చిత్తంబునఁ జేరవచ్చె జనముల్ ♦ సంతాపముం బొందఁగన్.

—: సీత యగ్నిం జొచ్చుట :—

సీ॥ లోకజనని వహ్ని ♦ లో డిగ డాయంగ, వేదంబులెల్ల వా♦విడిచి యేడ్చె
ధర్మదేవత యెదఁ♦దల్లడిల్లెను ప్రద, క్షిణము సేయఁగఁ బ్రాణి♦గణములేడ్చె
నమరకాంతలు బోరు♦మన్ని విలపించిరి, బ్రహ్మయుఁ గూడని♦పగిది యనిమె
హారుఁ డక్రమంబనె♦హరిరాజు బెగ్గిలె, భల్లుకేంద్రుఁడు పార♦వశ్యమొందె
తే॥ విన్నఁదనమొందె వెగచి వి♦భీషణుండు, సుక్కి సుక్కి సౌమిత్రియు♦సొమ్మవోయె
చెడితిరా యంచుహనుమ బ్రా♦న్పడియెరామ,విభుఁడునిర్విణ్ణుఁడై చాల♦వెగడుగుడిచె.

సీ॥ అనుచితంబని సుర♦లన్యాయమని సాధ్యు, లాగడంబని యక్షు♦లనుచునుండ
ఎడకడయని సిద్ధు♦లెగ్గని యురగులు, తగని పాడియని గం♦ధర్వు లనఁగ
గరుడు లాక్రందింప♦ఖగములు విలపింపఁ, బంచభూతంబులు♦పరితపింప
దనుజులు మిడుకంగ♦మనుజులు నడుకంగ, స్థావర జంగమ♦తతి గలంగ
తే॥ శేషుఁడొదుఁగంగలోకముల్♦శోషిలంగ, గ్రహచయంబులు తమతమ♦గతులుదప్ప
సాగరంబులు రోదన♦స్వనము నింప, ధారణీజాత యగ్నిం బ్ర♦దక్షిణించె. ౧౪౯౮

చ॥ వలగొని నిల్చి రామ పద ♦ వారిజముల్ మదినుంచి యో మహా
నల! సకల క్రియాధికర ♦ ణా! వినివారిత లోక కల్మషా!
చలమతినై మనంబున వ ♦ చస్సునఁ గర్మల నెన్నఁడేనియున్
గలఁక వహింతునేని నను♦గాల్పుము బూది యొనర్పు పావకా! ౧౪౯౯

తే॥ నియతి నిట్లు ప్రార్థించి యా♦నీరజాక్షి, తనదు గాఁచిదైన చెం♦దమ్మియందు
చొచ్చునది వోలెఁ జిచ్చునఁ♦జొచ్చి నిలిచె, సర్వ జీవులు మనముల♦సంతపింప.

చ॥ అవనిని సర్వభక్షకుఁడ ♦ నై యపవిత్రుఁడనైన యేను నీ
యవనిజ సోఁకుచేత విమ ♦ లాత్ముఁడ నయ్యెదనంచు నుబ్బి నా
పవన సఖుండు నగ్గరిత ♦ పావన పావక కీల మాఁడి రా
ఘువు కడ కేగుదెంచెఁ గర ♦ కంజములన్ వహించి జానకిన్. ౧౫౦౦

మ॥ పతి వీక్షించిన కిన్కచే నయిన తా ♦ పస్వేద బిందు వ్రజ
స్థితి యొక్కింతయు మాఱలేదు జడలోఁ ♦ జెల్వారు నవ్యాబ్జ సం
తతి సుంతేనియు వాడలేదు కనుమీ ♦ తాత్పర్య యుక్తుండవై
దితి వంశాంతక! నిష్ఫలం జెదలు ధా ♦ త్రిం దాఁకునే యెన్నఁడేన్?

శా॥ నా దౌర్బల్యము సుంతయేని మది నె ♦ న్నంబోక కోపంబుతో
వైదేహిం గన నామె స్వీయ మహిమా ♦ వహ్నిం దగుల్వడ్డ నా
దా దౌర్భాగ్యము నేమియందు? మఱి నా ♦ యత్యాహితం బేదియున్
లేదే? నాపయిఁ గిన్క యేలొకో? జగ♦ల్లీలా మహానాటకా! ౧౫౦౩

మ॥ అని ప్రార్థింపఁగఁ గాంచి లోకములు స్వా ♦ స్థ్యంబొందె బెగ్గిల్లి సో
లిన ప్రాణంబులు నెమ్మదిం గొనియె వి ♦ క్లేశంబు సంధిల్లఁగా
ముని పత్నుల్ సురదైత్య కాంతలును స ♦ మ్మోదాత్మలై యేచి ల
జ్జను పాటింపక గంతులేసి రెవరా ♦ సంతోషముం బొందరో? ౧౫౦౪

మ॥ గురు మోదంబున వానరావళు లొగిన్ ♦ కోలాహల ధ్వానముల్
పరఁగం జేసెను రాముఁ డయ్యెదనునన్ ♦ వైశ్వానరుం గాంచి దు
శ్చరితం దీని దహింపకిట్లు కరుణన్ ♦ శాంతుడవై కాచు టె
వ్వరి యాదేశము? నీవెవండ? వన భా ♦ స్వద్వహ్ని తా నిట్లనున్.

సీ॥ నే నగ్ని దేవుండ ♦ నీదేవి వైదేహి, తనదు పాతివ్రత్య ♦ దహనుచేత
దహియింప సహియింప ♦ దలము గాకిటు నిను, శరణంబు వేఁడితి ♦ సంశయింతు
వేలొకో యెఱిఁగియు ♦ నెఱుఁగనికైవడి, జగములయందున ♦ సతులు పతుల
నెడసియుండిన సంశ ♦ యించుట సందేహ, ములఁ బలువిధములఁ♦గలఁకలేని

తే॥ కరణిఁ దొలఁగించుకొనుట నా♦కడన జరుగు, చుండుటయు లోక సహజమై ♦ యుండుఁగాని
యామెచే నేను శుద్ధుండ నగుచునుండ, నామె పరిశుద్ధురాలని♦యనఁగనేల?

సీ॥ సత్యశీలుండగు ♦ సామీరి పలుకుల, మన్నించి చేపట్ట ♦ కున్న నీవు
శంకానివృత్తి ని♦శ్చయరీతిఁ జూపు నా, నయ వాక్యముల నెంత♦నమ్మఁగలవొ?
అమరులు మునులు లో♦కములు హాహాకార, మొనరించుచుండుట♦వినఁగ రావొ?
ధర్మంబు వీడి య♦ధర్మంబుపై బుద్ధిఁ, గూర్చు విధంబెందు♦నేర్చికొంటి?

తే॥ పూతచారిత్ర కోపంబె♦పూనునేని♦మొగులు కురియునే? మేదిని♦పగులకున్న?
తగవు నిలుచునె? జగములు♦తలరకున్న?, అంబుజభవుండు గడగడ♦లాడకున్న?.

తే॥ అనుచు వచియించి తపియించు♦నగ్ని విబుధ, వరులు గొనియాడ జీవులు♦వనటనీఁగ
సీతఁ గొని తెచ్చి రాముని♦చెంత నిలుప, నతఁడు కారుణ్య సహితుఁడై♦యనియె నిట్లు.

ఉ॥ నీవు సమస్త జీవులకు ♦ నీతి తొలంగని సాక్షివౌటచేఁ
బావని లోక నిందలకుఁ ♦ బాత్రముగానిది సీత యంచు సం
భావనసేసి పల్కితివి ♦ బంధురరీతిఁ బరిగ్రహించెదన్
దేవిని వానరావళియు ♦ దేవతలుం బరితోషమందఁగన్. ౧౫౦౯

మ॥ అని వాక్రువ్వ సమస్తలోకము లపా ♦ రానందముం బొందె బ్ర
హ్మను గీర్వాణులు గాంచి తాన తన మా ♦ యన్నిల్చి సామాన్యుఁడౌ
జనునిం బోలెను తన్నుఁ దా నెఱుఁగకీ ♦ చందాన నున్నట్టి రా
ముని పూర్వస్థితిఁ దెల్పవే యనుడు వే ♦ ల్పుంబెద్ద తానిట్లనున్. ౧౫౧౦

—: రాముని పురుషోత్తమత్వమును నలువ వెల్లడించుట :—

శా॥ శ్రీరామా! పురుషోత్తమా! రవికుల ♦ శ్రేష్ఠుండవే నీవు? నా
మేర న్నిల్చిన యల్పబుద్ధి నగు న ♦ న్నిష్టోక్తి సైరింపు నీ
తీరుం దెల్పఁగ శక్తిలే దుపనిష ♦ త్సిద్ధాంత తత్త్వంబ వా
ధారాధేయము లీవ సర్వమును నీ ♦ తత్త్వంబ లోకేశ్వరా! ౧౫౧౧

మ॥ తొలి తత్త్వంబగు మాయయున్ మరల నం ♦ దుంబుట్టు తత్త్వంబు ల
వ్వలఁ బైనుండెడు జీవుఁడున్ దనకుఁ బై ♦ భాస్వత్ప్రభారాశివై
తలఁపం దెల్ప వచింపరాని పరమా ♦ ర్థం బీవ నీమాయచేఁ
గలుగు న్నిల్చు నశించు లోకములు సం ♦ కల్ప ప్రభావంబునన్.

చ॥ తొలిస్థితివైన సృష్టియును ♦ తుట్టతుదిం గల నాశమున్ సదా
చెలఁగని నీస్థితి న్నిగమ ♦ శీర్షములే పరమార్థమంచు ని
న్నొలసి వచించుఁగాని మఱి ♦ యొక్కరి నిక్కడ కేగుదెంచు వా
రలఁ గలవానిఁ దెల్పవు ప ♦ రాత్పర! సర్వ జగన్నియామకా! ౧౫౧౨

చ॥ శివునకు నాకు నింద్రునకు ♦ శిష్ట జనాళికి జీవరాశికిన్
దవిలియుఁ దాలకుండు పర ♦ తత్త్వము నీవని కాంక్షచేసి ని
క్కువము నెఱుంగు పుణ్యజన ♦ కోటి భవాంబుధి దాఁటి దేవతా
స్తవన విశేష పాత్రమగు ♦ సత్యపదంబును గొంద్రు రాఘవా! ౧౫౧౪

మ॥ తలిదండ్రుల్ తమ జన్మకారకులుగాఁ ♦ దర్కించు నజ్ఞుల్ ధరా
స్థలిలో సంసృతి పాశ బద్ధులయి సం ♦ తాపించి తత్త్వార్థమున్
దెలియంజాలక చావు పుట్టువుల యా ♦ త్రిం గుందుచున్నారు వి
జ్ఞులు నీతత్త్వ మెఱింగి ముక్తులయి సం ♦ శోభింతు రెల్లప్పుడున్. ౧౫౧౫

చ॥ ఇరువది యైదు తత్త్వముల ♦ కీవలి తత్త్వము నీవుగాక వే
రొరువుఁడు లేఁడటంచు శ్రుతు ♦ లొక్కటఁ జాటుచునుండ నుత్తముల్

కరులగు వారు దీని కిఁకఁ ♦ గాపలెనే వ్యవహార ధర్మమం
దొరిమిక సాక్షి నమ్మటకు ♦ నుత్తర సాక్షిని పోలె నిద్ధరన్ ౧౫౧౭

మ॥ అనుమానాదిక సప్రమాణగతి నూ ♦ హాపోహముల్ నేఁత నీ
గన సాహాయ్యపడంగలేవు వనజా ♦ క్షా! వేద శీర్షంబులున్
నిను నీ డావటికంబు పూర్తిగఁ గనన్ ♦ లేకున్న విజ్ఞాన వీ
క్షణచే జాడగ నిర్ణయించి తెలుపున్ ♦ సర్వేశ! సర్వాత్మకా! ౧౫౧౮

ఉ॥ నీ కరుణా విశేషమును ♦ నెమ్మి వహింపని వారి కింద్రియో
ద్రేకము విఘ్న కారకము ♦ దివ్య భవద్గుణ రూపలక్ష్మి న
స్తోకముగా నెఱుంగుటకుఁ ♦ దూకొని యింద్రియ శక్తిఁ గ్రుంచ నీ
శ్రీ కమనీయ పాద సర ♦ సీరుహ చింతన దక్క నున్నదే? ౧౫౧౯

శా॥ నీకుం బుట్టువు లేదు మాయయుఁ దొలి ♦ న్నీనుండియే పుట్టె నీ
యాకాశాదిక పంచభూతములు త ♦ త్త్వాదుల్ ప్రపంచంబు మా
యాకార్యంబులు కల్పకాలమున మా ♦ యన్ డిందు నమ్మాయ నీ
యాకారంబున డిందు నీకు విలయం ♦ బా లేదు నిత్యాత్మకా! ౧౫౨౦

మ॥ మించుం బోలె క్షణంబులో నడఁగు ని ♦ మ్మిథ్యా ప్రపంచంబు సృ
ష్టించం బెంచఁగ ధర్మము న్నిలుప సు ♦ శ్రీసంప నేకాకివై
ప్రాంచద్రీతిని నన్ను వెల్వఱుతు వం ♦ త్యంబందు నాశంబు గ
ల్పించం బూనెదు డాఁగియుండవును తృ ♦ ప్తిం గానరా వెన్నఁడున్.

శా॥ నారూపంబున సృష్టిచేసి జగముల్ ♦ నారాయ ణాఖ్యుండవై
యారం బోషణ చేసి శూలివయి సం ♦ హారంబు గావింతు వీ
వారా! రే పవళుల్ దినేశ్వరుఁడు ప్ర ♦ త్యక్షంబుగాఁ జేసి లో
కారాధ్యుండును లోకబంధుఁడగు చా ♦ యం బొంది సర్వేశ్వరా!

శా॥ సంపన్నాంధత నొందు మా మదము నా ♦ శంబంద నక్తంచరుల్
చంపన్ యత్నముచేసి పాఱఁదఱుమన్ ♦ సంరక్షకై నిన్నె ప్రా
ర్థింపన్ మాకయి పెక్కుజన్మములు ప్రీ ♦ తిం బొందుచున్నావు నీ
కింపుం గూర్చెడి యాటలో విధులొకో ♦ యీకార్యముల్? రాఘవా!

మ॥ ప్రణవార్థంబు నెఱుంగువారె పరమా♦ర్థంబైన నీతత్త్వమున్
గణనీయంబుగఁ గాంచువారలును ము ♦ క్తద్వేషులున్ ముక్త బం
ధనులున్; దక్కినవారు సంచలిత త ♦ త్త్వజ్ఞానులై జన్మ కా
రణ మాయంబడి ముక్తి మార్గమును చే ♦ రం బోవ రెన్నాళ్లకున్.

క॥ నీరూప మిట్టిదయ్యును, గారామున జగములెల్లఁ ♦ గాంచి పెనిచి ధ
ర్మారూఢిఁ జూపు జననిని, కారాని వచస్సులాడి ♦ కలఁపకు తండ్రీ. ౧౫౨౪

—: శంకరుఁడు దశరథు నటకుఁ బిలిపించుట :—

క॥ అని నలువ పలుకఁ బశుపతి, యను నీవు జగంబులకు న ♦ నాదివి త్రిజగ
జ్జననియగు సీత లక్ష్మిరమె, యనఘా! నీచరిత నీవ ♦ యరయఁగలేవో? ౧౫౨౫

మ॥ జనలోకేశ్వర! సీత పీడఁదగు దు ♦ శ్చారిత్రయే? లోక పా
వన చారిత్రను శంకచేసి విడువన్ ♦ భావింతువేనిన్ జగ
జ్జని సందోహము తల్లడిల్లి తుది నా ♦ శంబందు నశ్లాట దే
విని నిందించుట మాని చేకొనుము మా ♦ వేడ్కొలునన్ రాఘవా!

చ॥ పశుపతి యిట్లు పల్క నుత ♦ బాధ వియోగ మహోగ్ర వేదనా
వశమున జీవము ల్విడిచి ♦ వైష్ణవలోకము నొందియున్న యా
దశరథుఁ జేరి సీతనయు ♦ దండకు వచ్చి తదీయ చిత్త క
ర్కశతను మాన్పి మోదము జ♦గంబులకుం గలిగింపవే యనన్. ౧౫౨౭

మ॥ భవు నాజ్ఞం గొని ప్రేమపాత్రమగు క్ర ♦ వ్యాదాన్వయధ్వంసి రా
ఘవు వీక్షించు కుతూహలంబు మది నూఁ ♦ గంజేయు నుత్కంఠయుం
దవులం బంక్తిరథుండు భూమికి దిగెన్ ♦ దంద్రిన్ నమీక్షించి దా
నవభీముండగు రామభద్రుఁ డెరఁగెన్♦దత్పాద పద్మద్వయిన్. ౧౫౨౮

చ॥ తెలచిన సూను బాహువులఁ ♦ దియ్యములోఁ దగ గ్రుచ్చి యెత్తి కౌఁ
గిలిగొని బాష్పవారిఁ జిలి ♦ కించుచుఁ జెక్కుఁగఁజేర్చి నా భవం
బిలఁ గడు ధన్యమయ్యెనని ♦ యింద్రియవారము తృప్తి నెందఁగాఁ
దొలఁగ వియోగవేదనయు♦దుర్భర మోదముతోడ నిట్లనున్. ౧౫౨౯

ఉ॥ కేకయరాజపుత్త్రి మది ♦ గీడ్పడఁ గోరు వరంబు శూలమై
యూఁకున నామదిం దొలుచు ♦ చుండెఁ గుమారక! నేఁటిదాఁక నీ
లోకహితంబు పేర్మి నత ♦ లోక జయేందిర చేరి మించు ను
శ్రీకమనీయ వక్షమిటు ♦ చేరఁ దొలంగెను నేఁడు నాయనా! ౧౫౩౦

ఉ॥ ఉత్తమ పుత్త్రులం గని మ ♦ హోన్నతి నొందిన వారు మత్పదా
యత్త రజంబునేని సమ ♦ మందని యుద్ధుర గౌరవంబు నా
కిత్తఱిఁ గూర్చినాఁడవు మ ♦ హేచ్ఛను నీవలనన్ గడించితిన్
సత్తమలోక సౌఖ్యమును ♦ శాశ్వతకీర్తి జగత్త్రయంబునన్. ౧౫౩౧

మ॥ మును నాచేత నమస్కృతుల్ గొనిన వే ♦ ల్పుల్ తాపసశ్రేష్ఠులున్
నను సంస్తోత్రము సేయ నిప్పటి జగ ♦ న్మాన్యాంగముం జూడుమా
వనజాతాసను నుద్దిగా వినుత భా ♦ వస్ఫూర్తిఁ గల్పించి తీ
వని సంతోషము మీఱఁ బల్క మిథిలా ♦ ధ్యక్షాత్మజం జూడఁగన్.

చ॥ జనకజయుఁ మహా వినయ ♦ సంగతయై పద పంకజాత వం
దన మొనరింప నామెను ము ♦ దంబున లేవఁగనెత్తి ప్రేమమూఁ
దనుక శిరంబు మూరుకొని ♦ తల్లిరో! నీవలన న్నిజంబుగా
ననకుల ముజ్జ్వలించె లభి♦యించెను నాకును నిత్య సౌఖ్యముల్. ౧౫౩౩

శా॥ పాతివ్రత్యబలంబు లోకులకుఁ దె ♦ ల్పంబూని నీభర్త యీ
రీతిఁ పీతియుతోగ్రవహ్ని దుముకం ♦ బ్రేరేఁచు నవ్వార్త నీ
చేతంబందున నిల్పకమ్మ! జనముల్ ♦ చిత్తంబు శంకించుచో
హేతిన్నిల్పి పరీక్షసేయుటలు బ్రాఁ ♦ తే? కోపము న్మానుమా!

ఉ॥ బంగరు నిప్పునం దిడుట ♦ వన్నియ హెచ్చొనరింపఁ జుమ్మ! సా
రంగ విలోచనా! సుగుణ ♦ రాజిత చిత్తుఁడు నీమగండు మీఁ
దం గొనరాదు అట్టు వసు ♦ ధాస్థలి నంచుఁ దలంచి యిప్పు డీ
యంగమునన్ విధించి వెల ♦ యంగ నొనర్చె భవన్మహత్త్వముఁ.

చ॥ పరమ పతివ్రతా మణుల ♦ పాలి విభూషణమా! ధరిత్రియే
వరతర జన్మభూమి యగు ♦ వైష్ణవ లోకమునుండి ధారణీ
భరమును మాన్పఁబూంచె ఖగ ♦ వాహనుతోడ జనించి తీవు నీ
యురు గుణరాశికిం గలఁగ ♦ రొంటున రొక్కటి? లోకపావనీ? ౧౫౩౬

చ॥ అని వచియించి యించుకయు ♦ నల్క వహింపని శాంతచిత్త యీ
జనకజ యంచు డెందమున ♦ సంతసమంది యనంతరంబు నె
మ్మనమును ప్రేమ కట్టుటయు ♦ మచ్చికతోడ విభుండు తన్నుదా
ఘనముగఁ గౌఁగిలించుకొను ♦ కైవడి నక్కునఁ జేర్చె లక్ష్మణున్,

మ॥ కనుల న్నీరు జటాభరంబుఁ దడుపన్ ♦ గాటంబుగాఁ జేర్చి యో
తనయా! యన్నను వెంటనంటి సుఖ ని ♦ ద్రాభుక్తులం ద్రోచి యా
తనిఁ గాపాడుచు లెక్కలేని భవ బం ♦ ధంబుల్ వెసం ద్రోచి నా
ఘన చిత్తాధుల నీఁగినాఁడవు కదా ♦ కారుణ్య వారాన్నిధీ! ౧౫౩౭

మ॥ బలు మాయావిని మేఘనాదు ననిలో ♦ భంజించి గెల్పొందు నీ
బల చాతుర్యము లెల్లవేళలను గీ ♦ ర్వాణుల్ ప్రశంసించు వా
రలు లోకంబుల గాసివెట్టు దనుజ ♦ వ్రాతంబుఁ జెండాడి ని
ర్మల ధర్మంబును నిల్పినాఁడవు జగ ♦ న్మాన్యుండవై పుత్త్రకా! ౧౫౩౮

చ॥ అని వచియించి రామ విభు ♦ నర్మిలిఁ గాంచి గుణప్రపూర్ణ! నీ
కొనరఁగ నీయ సాధ్యమగు ♦ నొండు వరంబును వేఁడుమన్న న
య్యనఘుఁడు పల్కె మిమ్ము మొగి ♦ నవ్వలి లోకమునందు గాంచి మ
న్నన దగ వేఁడనుంటి నది ♦ నాకు లభించె నిఁకేమి కోరుదున్?

చ॥ అయినను కోర్కె యొండు గల ♦ దయ్య! మనంబున దుష్ట శీలఁగాఁ
గయికొని చూడ రోఁతవడు♦కైకయుఁ దత్తనుజుండు నాకుఁ ద
ల్లియు ననుజుండుగా నవఘు♦ళింప వరంబు ననుగ్రహింపుమీ
యెయికొని యన్న నెల్లరును ♦ మేలని మెచ్చిరి రాము చిత్తముల్.

మ॥ అకలంకుండగు తమ్ముఁ డట్టి యతఁడే ♦ యాఁ బట్టభంగంబు త
క్కక కావించి తపస్విరూపమును పైఁ ♦ గాంతారవానంబు గొం
కక నీకిచ్చిన క్రూరదైత్యయగు నా ♦ కైకేయిపైఁ గోప మిం
చుకయుం దగ్గద యంచుఁ దండ్రి యన ర ♦ క్షోమర్దనుం డిట్లనున్.

మ॥ పొరపొచ్చెంబులు లేక యుండఁగఁ బ్రజల్ ♦ బోషింపఁగాఁ బూను నా
ధరణీభారము సర్వపాపములకున్ ♦ స్థానంబయా నంచు వి
ద్వరులెల్లన్ వివరింపఁగా నెఱిఁగి త ♦ త్కార్యంబు నీకొంట నా
నెరసైయున్నది గాక తల్లియెడ మ ♦ న్నింపన్ దొసంగున్నదే? ౧౫౪౩

చ॥ వర బల మానముం గడచి ♦ వర్తిలు రాఘవుఁ డిట్లు వల్కఁ బం
క్తిరథుఁడు కిన్కమానెఁ బరి ♦ కించిన విన్న మునీంద్ర నిర్జరుల్
వరములు రెండు కోరె మును ♦ వారక కైకయు రాముఁ డిప్పుడున్
వరములు రెండె కోరెనని ♦ వందుల పోల్కె నుతించి రయ్యెడన్. ౧౫౪౪

మ॥ సకలామోదక సత్య రక్షణముకై ♦ శస్తంబుగాఁ గీర్తి వ
ర్ధక దేహంబును గొన్న భూ విభుఁడు నీ ♦ తారామ సౌమిత్రులన్
బ్రకటప్రేమను భూమిపై నిలువ నా ♦ జ్ఞాపించి యా రెండు కో
రికలన్ వారల కిచ్చి తా మరలెఁ గీ ♦ ర్తింపంగ బృందారకుల్. ౧౫౪౫

—: వేలుపులు రాముని కోరిక లొసంగుట :—

ఉ॥ కూటువలైన ఖేచరులు ♦ కూర్మిని రాముని గాంచుచున్ నిరా
ఘాటముగాఁగ నీవలచు ♦ కార్యము కూర్తుము కోరుమన్న నీ
పోటునఁ గూలినట్టి కపి ♦ ముఖ్యులు ప్రాణములొంద వార లే
చోటునఁ జేరినన్ వలయు ♦ చొక్కపు టోగిర మొందఁ గోరుదున్.

చ॥ వరదులు బ్రహ్మరుద్రులు త ♦ పస్వులు నిర్జరులున్ గకుప్పతుల్
పరము ననంతు నవ్యయు భ ♦ వప్రకరంబులఁ ద్రుంచు నచ్యుతున్
పరిపరి రీతులం దనియఁ ♦ బ్రార్థనముల్ పొనరించి నీకృపా
నిరతిని పొందుఁగావుత వ ♦ నేచరవర్గము కోరినట్లనన్. ౧౫౪౬

చ॥ కదనము పూను నాటఁగొలె ♦ గండటి నీల్గిన వానరావళుల్
ముదమున జీవముల్ గొని ప్ర ♦ పూర్ణబలంబున లేచి పోరికై

పొదలుచు హుంకృతుల్ సలిపి ♦ మోములు కన్నులు తృప్తినొంద శ్రీ
సదనుని గాంచి జే యనుచు ♦ సందడి సేయుచు డాయు నంతటన్. ౧౫౪౭

సీ॥ వేల్పులు రాముని♦వేడ్కతోఁ గాంచి యి, ట్లనిరి వివేచించి♦యాదిదేవ!
వనచరసేనతో♦వచ్చి కృష్ణాష్టమి, వేళ సువేలపై♦విడిసి నాఁడె
పోరు ప్రారంభించి♦పోలసుదిండులఁ గూల్చి, పౌలస్త్యు నని నమా♦వాస్యఁ ద్రుంచి
లోకంబులకు మేలు♦జోకతోఁ జేసితి, విట్టులే పదునాలు♦గేండ్లు కడచె
తే॥ నేఁడు పంచమి నీవేగి♦నియతు భరతుఁ, జేరవేసి యాతఁడు గూలుఁ♦జిచ్చునందు
సరగ నడువుమ యని పల్కి♦సన్నుతించి, తమ నివాసంబులకు నాజ్ఞఁ♦దరలినారు.

—: సీతా రామ లక్ష్మణులు పుష్పకము నధిరోహించుట :—

తే॥ గడువు నేటితోఁ దీఱె త♦మ్ముఁడు గతింప, మా కులంబును నశియించు♦మాట లేదు
కాన నేఁడె చేరఁగఁదగు♦కర్జమునకు, వలయు సాధన మున్న దే♦ తెలుపవయ్య!
సీ॥ రాముఁ డిట్లని తత్త♦ఱంపడఁగని విభీ, షణుఁడను దేవ పు♦ష్పకము కలదు
పౌలస్త్యుఁడు కుబేరు♦భంగించి కొన్నది, వానికిఁ బరమేష్ఠి♦దీని నొసఁగె
నుత్తమ జనముల ♦ చిత్తంబులంబలెఁ, బరిశుద్ధమైనది ♦ వనచరాళు
లెల్ల రెక్కినఁ జలి ♦ యింప దందేగినఁ, గోరి నేఁడె యయోధ్యఁ♦జేరవచ్చు
తే॥ ననుడు వడిగఁ దెప్పింపుమా♦యనుచు రామ
చంద్రుఁ డానతి యిడలోక♦చయ ముఁబోలు
పఱపు వేయి సూర్యులఁబోలు♦మెఱుపు గలుగు
పుష్పకంబు దైత్యేంద్రుఁడు♦పొసఁగఁ దెచ్చె.
తే॥ పుష్పకము ధారణికి డిగ్గ♦భూవరుండు, నేఁడు నిజముగ నాకోర్కి♦నెగ్గుననుచుఁ
దలఁచి దాని నధిష్ఠించె♦దత్తఱమున, విరులు విచ్చల విడిగ ఖే♦చరులు చల్ల.
తే॥ త్రిజట కేల్మోడ్పఁ గాంచి వై♦దేహి నీవు, లంక కధిదేవతంబోలి♦లలితరీతి
శుభము లొందుదు గాకని♦సుభగు సజ్జఁ, జేరె సూర్మిళేశుఁడు నధి♦ష్ఠించెనంత.
ఆ॥ విలయ వేళ నాఁటి♦వెన్నుని యుదరంబుఁ, బోలి గగనమందు♦పొలుపు గొలుపు
పుష్పకమున నున్న♦భూపాలచంద్రుండు, హితులఁగాంచి ప్రేమ♦నిట్టులనియె.
తే॥ నలువ వంశంబు నీదాట♦తలఁపుమయ్య, నిన్ను చేరువారికి మేలె♦నించుమయ్య
పెంపు సొంపార లంకఁ బా♦లింపుమయ్య, యనుచు నవ్విభీషణునకు♦నాజ్ఞయొసఁగె.
తే॥ పంక్తికంధరు నీభుజ♦బలమువలనఁ, గూలిచితి దురమునఁ గ్లాంతి♦గూరియున్న
వానరులఁగొని నీపుర♦వరముఁ జేరి, సుఖివి గమ్మని సుగ్రీవుఁ♦జూచి యనియె.
తే॥ మీమనోబలోత్సాహ స♦మ్మేళనమునఁ, గాక యేనింత పని సేయఁ♦గలనె! వాలి
తనయ! భల్లుకేశ్వర! నీల! పనస! యనుచు, ముదితుఁడై పల్కి సామీరి♦ముదలయడిగె.

ఆ॥ వారు దిగులుతోడఁ♦బ్రాణంబులు నొడల్లు, వడఁకఁ గనుల నీరు♦పుడమిఁ దడుప
నిన్ను వీడి జీవ♦నిచయంబు భరియింపఁ, జాలమనుచు మఱియు♦జాలినొంది.

ఆ॥ కోసలంబు చేరి♦గురుతర పట్టాభి, షేక వేషమందు♦స్మితముఁ గాంచి
పరమ మోదమంది♦మరలునట్లుగఁ గృప, సేయవయ్య వేడ్క♦చెలఁగు ననుచు.

మ॥ విమలప్రేమ విభీషణాదులు కపుల్ ♦ వేడంగ శ్రీరాముఁ డ
ర్యమవంశాంబుధిసోముఁ డా హితుల చి ♦ త్తావేగముం గాంచి సం
భ్రమ మేపారఁ గలంగకుం డిదియె నా ♦ భావంబు మిమ్మిట్లు దుః
ఖమునం ద్రోచి గడించు భాగ్యమది యే ♦ క్కండేని నాకుండునే?

మ॥ భరతత్రాణము వేగిరింప నిటులే ♦ భాషించితిన్ మిమ్ములం
బరిశోధింపఁగఁ గాదనం గపులు భా ♦ స్వత్పుత్త్రుఁడున్ దైత్య భూ
వరుఁడున్ మారుతి బొందితో సురపురిం ♦ బ్రాపించు చందాన సం
బరమున్ మోదము నొంది మ్రొక్కి రెలమిం ♦ బాటించి భూజానికిన్.

తే॥ కపులతోడ సుగ్రీవుని♦గాఢ్ఫ్వనొడుకు, నల విభీషణుఁ దక్కువా♦రలను వడిగ
నెక్కఁడీ విమానం బని♦యెలమి రామ, చంద్రముఁడు సెలవిచ్చెను♦సంభ్రమమున.

తే॥ పలుకువార్త్తయే వెనుబడు♦పగిది నేడు, పదుల వెల్వాలు వానర♦పతి విభీష
ణుండు నంగదుఁ డాంజనే♦యుండు నెక్కి, యొక్క ప్రక్కఁ జేరిరి చాల♦నుత్సహించి.

తే॥ పదియునాలుగుజగముల♦ప్రాణులొక్క, మొగినికూర్చున్న నుస్థలంబు♦మిగిలియుండు
దద్విమానమహిమ కర్మ♦తతి దహించు, జ్ఞానులకెగాక తెలుప భూ♦జనుల కరిది.

క॥ వనచరులు వనచరేంద్రుఁడు, దనుజులు దనుజేంద్రుఁడును ము♦దంబునఁ గొలువన్
జనకజతోఁ దమ్మునితో, మనుజేంద్రుఁడు వెలసె వేల్పు♦మన్నని క్రియన్. ౧౫౬౫

తే॥ పుష్పకమ్ము గొప్ప జగమ్ముఁ♦బోలి వెలయ, రాముఁడయ్యెడ లోకకా♦రకుఁడు నిర్వి
కారుఁడు నిరంజనుఁడు స్వప్ర♦కాశ పుంజ, మగు పరంజ్యోతి పరమాత్ముఁ♦డనఁగనొప్పె.

క॥ వానరనాథుండును లం, కానాథుఁడు దైత్యచయము ♦ కపి బృందంబుల్
మానవనాథుని యాజ్ఞను, మానవ రూపములఁ గొనిరి ♦ మక్కువతోడన్.

తే॥ తూర్పు పడమరలకు నేగు♦తోయజహితుఁ, డప్పు డుత్తరమున కేగు♦ననువుమెఱసి
వెడల నవ్విమానము రామ♦విభుఁడు జనక, జాతఁ గని యిట్లు పల్కె సం♦ప్రీతుఁడగుచు.

—: రాముఁడు సీతకు త్రోవలోని చిత్రములఁ జూపుట :—

చ॥ మనము కలంకమాని కను ♦ మా యిది నే మది నెంచినట్టు లం
కను వలగొంచుఁ బోయెడిది ♦ కాంచుము తూరుపు వాకిలిన్ బ్రహ
స్తుని మన నీలుఁ డిచ్చటనె ♦ దోర్బల యుక్తి నడంచి కూల్చె ద
క్షిణమున ద్వారమిద్ది పరి ♦ కింపు సుపార్శ్వుఁడు చచ్చె నిచ్చటన్.

చ॥ ఇది పయిదిక్కు వాకిలిట ♦ నింద్రజితుఁ మన లక్ష్మణుండు పెం
పొదవ వధించె నియ్యదియె ♦ యుత్తర మార్గము రావణుండు బె
ట్టిదముగ పోరు సల్పి యిట ♦ డించె శిరంబులు కేలు లెక్క లే
కదుఁగఁగఁ దున్మి తున్మి మడి♦యించితిఁ దుట్టతుదిన్ వరాంగిసీ! ౧౫౭౦

సీ॥ కపులు వారిధిఁ దాఁటఁ♦గడఁగి చిత్రంబుగాఁ, గట్టిన సేతువు ♦ గాంచు మబల!
తలిదండ్రులకు గురు♦వులకు బంధులకుఁ జే, సిన కీడు దీని ద♦ర్శింపఁ దొలఁగుఁ
దొల్లి యింద్రున కంజి ♦ తోయధిం జొచ్చిన, గంధమాదన మదే♦కంటె సుదతి!
తత్పర్వతంబుతోఁ ♦ దవిలి యీ వారధి, పొలుచుటచేఁ బరి ♦ పూతమయ్యె

తే॥ జాహ్నవీ గౌతమీ సర♦స్వతుల సింధు, యమున నర్మద కావేరు♦లందు మునఁగు
వారి పాపముల్ తొలఁగు న♦ప్పగిది నిందు,మునిఁగి దీనిఁ జూచినఁ బాప♦ములు తొలంగు.

సీ॥ పశుహంతకులు పితృ ♦ పంచక హంతలు, పసిబిడ్డలం జంపు ♦ పాప గుణులు
పడఁతుల నఱకిన ♦ పొడువలు తపసులఁ, దొడఁగి హింసించిన ♦ దుండగీంద్రు
శరణార్థులం ద్రుంచు ♦ నఱజాతి పలువలు, వచ్చి భక్తిని సేతు♦ వారి మునఁగఁ
బాపంబులను వీడి ♦ పరిశుద్ధులై వేల్పు, లగుదురు పడవ లిం ♦ దరుగుకొఱకు

తే॥ వింటికొనచేత వంతెన ♦ విఱుచు చోటఁ, దానమాడిన పంచ పా♦తకము లీఁగి
యిరువదొక్క జన్మంబుల ♦ నింద్రభోగ, ములను పొంది సుఖింతురు ♦ జలజనేత్ర!

తే॥ నిటలనేత్రుని జటయందు♦నిలుచు గంగ, సేతువగు భాగ్యమును నేను♦ చెందనైతి
నంచు గొప్ప తపంబు గా♦వించుచున్న, దనిన దీని గౌరవమున♦కలవియున్నె!

క॥ వరుణుం డిట నా పావక, శర వహ్నికి నోర్వలేక ♦ శరణము చొచ్చెన్
వరవర్ణిని! కాంచితె క్ర, మ్మఱ దీని నగస్త్యుఁ డుండు ♦ మలయాచలమున్.

చ॥ సురుచిరగాత్రి! చూడుమిది ♦ సుందరశైలము విష్ణువాసమున్
వరమతి వేంకటాచలము ♦ భక్తిని కాంచుము నీ మనంబు నే
నరసితి వాయుపుత్త్రుఁడు ప్రి ♦ యంబున నన్ దొలుదొల్తఁ జూచు చో
టరయుము ఋశ్యమూక మిది♦యన్నులమిన్న! మనోహరంబుగన్. ౧౫౭౫

తే॥ అమిత బలశాలి శత్రు భ♦యంకరుండు, శూలిభక్తుండు నగు వాలి♦కూలినట్టి
సీమ యిది యది చూడు కి♦ష్కింధ సూర్య, సుతుఁడు పాలించు నగరంబు♦శోభనాంగి.

చ॥ అనుటయు సీత సంతసిలి ♦ యార్య! కపీంద్రులు పెక్కు వెల్లువల్
మన మలరంగ గొప్ప బహు ♦ మానముతోఁ గొలువంగ నుండు ని
న్ననుసృతి సేయు నే నొకతె ♦ నై యరుదెంచుట లెస్సగాదు నీ
యనుఁగులు వారివారి లలి ♦ తాంగులతో నరుదేరఁ గోరెదన్. ౧౫౭౭

చ॥ పిలువుఁడి యన్న జానకి య♦భీష్టము రాముఁడు సూర్యసూతితోఁ
దెలుపఁగ నాతఁడుం బిలిచి ♦ తెమ్మని మారుతిఁ గాంచి పల్కె నా

బలియుఁడు పూతమానసుఁడు ♦ భావ్యము యంచరు దెంచి వానరీ
కులములఁ దోడి తెచ్చె రఘు ♦ కుంజరు పత్ని మనంబు పొంగఁగన్.

ఉ॥ పావని వెంట వచ్చిన ప్ల ♦ వంగసతుల్ తమ ఖేనికిన్ ధరి
త్రీ వరపుత్రికిన్ రఘు వ ♦ రేణ్యులకుం దగ మ్రొక్కి తాము సం
భావన సేయఁ దెచ్చు శుభ ♦ వస్తువులెల్లను మ్రోలనుంచి సీ
తా వనితా లలామను ము♦దంబునఁ గొల్చుచు నిల్చి రయ్యెడన్ ౧౫౭౯

చ॥ నడచె విమాన మర్కకుల ♦ నాథుఁడు పిమ్మట సీత కిట్లనెన్
మడఁతిరో! కాంచితే భువన ♦ మాన్య జలాన్విత గౌతమీ నదిన్
జిడిముడినొంద వంచకపు ♦ జింక కనంబడె నిందె యందు నీ
యెడయిక దాపురింపఁ గృశి ♦ యించితి మత్తగజేంద్ర గామినీ! ౧౫౮౦

చ॥ ఇది తపసుల్ వసించి తపి ♦ యించెడు దండక చిత్రకూట మి
య్యది భరతుఁడు వచ్చి నను ♦ ప్రార్థన సేసిన దింద ప్రేముడిం
బొదలఁగ నీవు పెంచినవి ♦ పూ లత కూనలు మందహాస సం
పద చెలువొంద శాఖ లను ♦ బాహులతో నిను పిల్చెఁ జూడుమా.

ఉ॥ ఓ జనకేంద్ర పుత్రి! కను ♦ ముగ్ర తపోబల శాలియైన భర
ద్వాజుఁడు శిష్యవర్గము ము ♦ దంబునఁ గొల్వఁ దపంబె రూప ము
త్తేజిత రీతి నొందె నన♦దేఁకువఁ గేలను దండ కుండికల్
భ్రాజిల వచ్చుచుండె మన ♦ రాక యెఱింగి యెదుర్కొనన్ వడిన్.

—: భరద్వాజుఁడు శ్రీరామాదులకు విందువెట్టుట :—

తే॥ అనుచుఁ దమ విమానము దిగ ♦ నాజ్ఞయిడఁగ, దేవలోకమే భూమికి♦దిగినపగిది
నిలువ రామచంద్రుఁడు ముని♦నేత కెదురు, చని తదీయాంఘ్రియుగము మ ♦
స్తమునఁ దడవె.

తే॥ వత్సలత తొలఁకఁగ భర♦ద్వాజమౌని, దీవన లొసంగి రాముని♦తివిరి యెత్తి
యలమిశిరము మూర్కొనియశ్రు♦జలము చేతఁ, దోయజాక్షుని జటలలో♦ధూళిఁగడిగె.

తే॥ సీతయును లక్ష్మణుండును♦చేరి కేలు, మోడ్చ నాతండు దీవించి♦ముదము వలన
మనసు కరఁగంగ నమృతంబు♦తనకుదొరకు, చందమున నుబ్బి తా వివ♦శత్వమందె.

తే॥ దనుజపతి వనచరపతి♦తక్కువారు, చేరి చేమోడ్ప వారి నా♦శీర్వదించి
వేద ఘోషంబుతో శిష్య♦వితతితోడఁ, బర్ణశాలకుఁ గొనిపోయె♦వారి నతఁడు.

తే॥ శాస్త్రయుతముగ నతిథి పూ♦జలను సలిపి, శ్రమము పోకార్చి పదపడి♦ప్రవిమలార్క
వంశదీపకు శ్రీరామ♦భద్రుఁ దనివి, సనక మఱిమఱి కని యిట్టు♦లనియెఁ దుదకు.

క॥ మునులు నరులు సుమనసులును, ఘనముగ భీతిల్లఁ గ్రూర♦కర్మంబులు నె
ట్టన సేయు దనుజ కులములఁ, దునిమితి లోకముల మేలు♦తోట్టఁగ రామా!

మ॥ ఖర మారీచ విరాధులన్ వనమునన్ ♦ ఖండించి సాలంబులన్
శర మొక్కంటను తోల్చి యింద్రతనుజుం ♦ జక్కాడి వారాశి దు
ర్భర కోపంబున మాడ్చి రావణుని త ♦ ద్వంశంబు నిర్వంశమై
పరఁగం గూల్చితి వెల్ల లోకములకున్ ♦ బ్రాపింపఁగా శ్రేయముల్.

తే॥ చిత్రకూటంబు వీడి ద♦క్షిణమునందు, గలుగు చెడుగుల నన్నిటిఁ♦దోలఁగఁజేసి
మరలి వచ్చెదు దనుక ని♦న్మఱవలేదు, వచ్చితివి నేఁడు విందవై♦వఱలుమయ్య!

చ॥ కరమున విల్లు దాల్చి జ ♦ గంబుల గాసిలఁజేయు దుష్టులన్
దెఱచితి వెల్ల జీవులకు ♦ సేమము సేకుఱె సర్వదా తపో
నిరతియు నిల్చె మాకుఁ గరు ♦ ణించితి నీశపథంబు చిత్త మా
భరతుని మీఁది వత్సలతఁ♦బర్విడుచున్నది నీకు రాఘవా! ౧౫౧

చ॥ అతఁడును మైచెమర్పఁ గను ♦ లందున నశ్రులు రాల వంది ని
శ్చితమతి లేక వేగుటయుఁ ♦ జింతను దక్షిణ దిక్కు చూచుచున్
వితమతి దుఃఖమే తనువు ♦ వీఁక భజించిన చంద మొంది నీ
కతయె తలంచుచున్ గడ యు ♦ గంబుగఁ ద్రోచెడు నేఁడు రాఘవా!

చ॥ విసుగుచు నింద్రియావళుల ♦ వీఁక నడంచి దినంబుఁ గాయలన్
గసరులఁ దిన్చు సౌఖ్యములఁ ♦ గాంచక కత్తృణ తల్పమందు దా
నినులఁ దోలంచుచున్ సతము ♦ నిన్నె జపించుచు రాజధానికిన్
వసిగొని పోక పల్లియను ♦ వాసము చేయుచునుండు రాఘవా! ౧౫౩

క॥ పదితల లిరువది కరములు, విదితంబుగ నేలఁగూల ♦ వింశతి బాహుం
గదనమునఁ గసిమసంగుచుఁ, జదిపిన రఘువీర! నిన్నె ♦ జపియింతు సదా.

క॥ అలీల మాని పలుకఁగ, శూలియు వనమాలి తమ్మి ♦ చూలి నుతింపం
జాలిన మీఁదయచే నేఁ, బోలఁగ ధన్యుండనైతిఁ ♦ బుణ్యచరిత్రా! ౧౫౪

మ॥ అని సీతాపతి తెల్ప మానియును రా ♦ మా! నీయభీష్టంబు దీ
ర్పను నాచిత్తము తత్తఱించె నన శ్రీ ♦ రాముండు కీశవ్రజం
బునకున్ మీవనమందు కాయ గసరుల్ ♦ పుష్పానవంబుల్ జలం
బును నిండారఁగ నుండుఁగాక యన నా ♦ పుణ్యుండు సంతుష్టుఁడై.

శా॥ కాకుత్స్థాన్వయ! నీకు నీహితులకుం ♦ గావింతు సేవిందు నేఁ
డీ కాంతారము దేవలోకమగు నా ♦ యిష్టంబు సంధిల్ల న
స్తోకప్రేమను పొందుఁ డంచొక హవి♦స్సున్ వేల్వఁగాఁ గన్ననన్
నాకం బచ్చటి కేగుదెంచెఁ గపులా♦నందంబునం బొందఁగన్. ౧౫౬

శా॥ సుగ్రీవాదులకున్ మహేంద్ర విభవ ♦ స్తోమంబు నిండార నా
ర్యాగ్రీయాన్వయ మండనాకృతికి రా ♦ జాన్నంబు చేకూర్ప న
వ్యగ్రుండై రఘురామ భూపుఁడు జగ ♦ త్ప్రాణాత్మజుం గాంచి నం
దిగ్రామంబున కీవు మున్నుచని మ ♦ ద్వృత్తాంతముం దెల్పుచున్.

చ॥ భరతుని శీలమున్ దలఁచు ♦ భావములెల్లను పోలఁగాంచి చె
చ్చెరఁ జనుదెంచు మెన్నఁగ వి ♦ శిష్ట పథంబగుఁ బోయి రమ్మనన్
సరియని మారుతాత్మజుఁడు ♦ చయ్యన వాయుపథంబునందు తం
డిరి వడి చిత్తవేగమును ♦ డిందుపడం జని పోవు త్రోవలో. ౧౫౯౯

తే॥ గుహుని గని రాము సేమమ్ము ♦ కోర్కెఁ దెల్పి, యవలి కేగెను రాఘవుఁ ♦ డసురవధము
సేయుపద్ధతిఁ గంటిమి ♦ చిత్తమలర, భరతు వర్తనఁ గందమీ ♦ పట్టునందు. ౧౬౦౦

—: భరతుఁడు రాముని రాకకై బరితపించుట :—

సీ॥ ప్రతిదినంబును రామ ♦ పాదుక లర్చించి, యింద్రియంబు లడంచి ♦ యొరఁగువాఁడు
అన్నిచోటులఁ గల ♦ యనుకంప యొకచోటఁ, బూర్ణరూపము గొన్న ♦ పోల్కెవాఁడు
కలిగియు నొల్లక ♦ కాంతార వాసుల, యోరెమే భుజియించు ♦ చుండువాఁడు
చూచిన వెతతోడఁ ♦ జూచు దక్షిణదిక్కు, గాక వేఱొక దెస ♦ గననివాఁడు

తే॥ అన్న వాక్కు లెన్నటికి స ♦ త్యములుగావు, వచ్చునని జీవముల నిల్పి ♦ వలచువాఁడు
కుడుచు నీటికి జీవాత్మ ♦ కును నిజంబు, జీవ మా రాముఁడని చింత ♦ సేయువాఁడు.

తే॥ రామ పట్టాభిషేక నీ ♦ రంబు గాంచి, శోక బాష్పవాహిని దరి ♦ గాంచలేని
భరతుఁ డానాఁడు జానకీ ♦ వరుఁడు వచ్చు, దినముఁ గూర్చి యాలోచింపఁ ♦ దివిరినాఁడు

తే॥ తాను లెక్కించు లెక్కలోఁ ♦ దప్పుగలదో, యనుచు గణకులఁ బిలిపించి ♦ యడుగ వారు
తీఱు నేఁటితో వనవాస ♦ దీక్ష యనుచుఁ, బలుక భరతుఁడు మనమున ♦ భయము చెందె.

క॥ సంపద్భోగంబుల మది, నుంపని పుణ్యుండు నొచ్చి ♦ యుమ్మలికముతోఁ
గంపముతో ననుకంప జ, నింపఁగ నిట్టూర్చి తుదకు ♦ నేలన్ వ్రాలెన్.

శా॥ నామీఁదం గృపగల్గునో కలుగదో ♦ నాయార్తి లెక్కింపవో
నామాటల్ మదినుంతువో యనుపవో ♦ నాకీడు మన్నింపవో
నామోముం దిలకింపఁగాఁ దలఁపవో ♦ నాచిత్తముం గానవో
ప్రేమం దల్లులనైనఁ గాంచుటకు రా ♦ వే సత్కృపం జూపవే ? ౧౬౦౫

శా॥ నాదౌర్భాగ్యము చేత నీకు నటవిన్ ♦ దాపించిరే శాత్రవుల్ ?
నీదాయల్ హరి శంభులైన ననిలో ♦ నిల్వంగనే నోర్తురే ?
కాదే నింకను కొన్నియేండ్లు భరత ♦ క్ష్మాపాలుఁడే రాజ్యమున్
మోదంబారఁగ నేలనిమ్మనుచు నా ♦ మోదించితే ? యగ్రజా !

చ॥ అడవిని యుండుగాక మరి ♦ యాద నయోధ్యకె వత్తుగాక నీ
యెడఁద యదెట్టులుండె నటు ♦ లే జరపింతువుగాక యేదియున్
దడవక నాప్రతిజ్ఞ ఫల ♦ దంబు నొనర్చుటె నాకుఁ గర్జమా
విడిచెద నగ్నిలోనఁ బరి ♦ వేదన దీఱ మదీయ జీవముల్. ౧౬౦౭

మ॥ అనుజన్మా! యిటురమ్ము చేరువకు ని ♦ న్నర్థింతు నొక్కండు నీ
వనుకంపంగొని యా వరంబు దయచే ♦ యన్ వేఁడెదన్ రామచం
ద్రుని యేవార్తయు వీనులం బడదు నా ♦ దుష్కర్మ సంప్రాప్తి న
గ్నిని నేఁజొచ్చెద నన్న వచ్చుదనుకన్ ♦ వీక్షింపు మీరాజ్యమున్.

మ॥ అన శత్రుఘ్నుఁడు విహ్వాలించుచు హాలా ♦ హాలంబు భక్షించు వి
న్ననువుం దోఁప వడంకి నేలఁబడి య ♦ న్నా! యేమి దోసంబు నీ
కొనరింపం దలపెట్టినాఁడ? మది ని ♦ ట్లూహింపఁగాఁ బోలునే?
నను శిక్షింపఁ దలంచితేల? యిదియున్♦నాచేయు దుష్కర్మమో?

చ॥ జనకుని సత్యవాక్యునిగఁ ♦ జల్పఁగ నన్న వనిం జొరంగ నే
వన మొనరింపఁ గానలకు ♦ బ్రాఁతిగఁ దమ్ముఁడొకండు పోవ రా
ముని పునరాగమావధియుఁ ♦ బోవఁగఁ దమ్ముఁ డొకండు జీవముల్
తనుకఁగ వీడుచుండఁ గడ♦తమ్ముఁడు రాజ్యము సేయుఁ జెల్లరే? ౧౬౧౦

చ॥ అడవుల నన్నయుండఁ బుర ♦ మందలి భోగములందెఁ దమ్ముఁడన్
నుడి జగమాడునంచు మది ♦ నొచ్చి తపించుచునుండి యగ్నిలోఁ
బడుచును పిన్నతమ్ముఁ డొద ♦ వంగలఁడంచుఁ దలంతుకాక యీ
యెడరు సహించి యేబ్రదికి♦యేలఁగఁబోలునె యీ ధరాస్థలిన్? ౧౬౧౧

శా॥ శత్రుఘ్నుం డిటు పల్కఁగా భరతుఁ డి ♦ చ్చ న్నొచ్చి యల్లైన నే
ధాత్రిం బాలన సేయుచుంటి నని కా ♦ దా రామభద్రుండు తా
నీ త్రోక్కాటము గూర్చుచుం దడసె వ ♦ హ్నిం జొచ్చి యే నీల్గుచోఁ
బుత్రప్రేమను కావవచ్చు జనమున్ ♦ బుణ్యాత్మ! నిప్పుంపవే. ౧౬౧౨

—: కౌసల్య భరతు సమాధానపఱచుట :—

మ॥ భరతుం డిట్లు వచించు వార్త వడిగాఁ ♦ బ్రాఁకన్ జనంబెల్లఁ ద
త్తఱపాటొందెఁ బతివ్రతామణి కృపా ♦ ధౌరేయ కౌసల్య దు
స్తర తాపంబున సాహసంబు వలదో ♦ తండ్రీ! జగంబెల్ల ని
ర్భర దుఃఖంబునఁ గ్రుంగి కూలు ననుచున్ ♦ వచ్చెన్ విచారంబునన్.

చ॥ తలముడి వీడ మేన్వడఁకఁ ♦ దత్తఱపాటున వచ్చు తల్లి న
య్యలఘుఁడు కాంచి యామె చర ♦ ణాంబుజముల్ తలసోఁక మ్రొక్కఁగాఁ

దలియుఁ గుమారు శీర్షమును ♦ తక్కక యక్కునఁ జేర్చి నాయనా!
వలదిటు సాహసంబు మము ♦ వారక కాచు సుతుండ వీవెకా! ౧౬౧౪

ఉ॥ నీ జనకుం డొనర్చినది ♦ నీ పెదయన్న వనంబు చేరుటల్
నాజగజంపు దుష్కృత గ ♦ ణంబు ఫలంబగుఁ గ్రమ్మఱిల్లమిన్
నాజనన ప్రభావమగు ♦ నాయన! నీదొసఁగేది యిందు? నీ
వీ జగ మీ విధాన నశి ♦ యింపఁగఁ జేయుట యుక్త కార్యమే? ౧౬౧౫

ఉ॥ నీవగినిం జొరం దలరి ♦ నీప్రజయుం బడు సేనయుం బడున్
జావక మేము నిల్తుమొకొ? చానలు మమ్మల వెంబడింపరే?
చావదె ధర్మమున్? జగము ♦ సర్వము కూలదె వీటతాటమై?
యీవిధి పాపకర్మమని ♦ యెంచవొ? యేమి తలంచి తీవ్యొడన్? ౧౬౧౬

చ॥ ధర్మయుతంబులై తనరు ♦ దద్దయు నీపను లెల్లకాలమున్
ధర్మ విహీనపద్ధతిని ♦ తారుట గానమ యెన్నడేని నీ
ధర్మ గురుత్వ సంపదలఁ ♦ దక్కక నీవెఱుఁగంగ లేదు నీ
శర్మద సత్త్వధర్మములు ♦ శాశ్వతముల్ యుగపాళి మాఱినన్. ౧౬౧౭

ఉ॥ ఉత్తమ పుత్త్ర! రామవిభు ♦ లొక్కటఁ బెక్కగు కోట్లు కూడినన్
బొత్తిగ నిన్ను ప్రేమమయుఁ ♦ బోలఁగఁ జాలుదు రేమి? పుణ్యమే
యిత్తెగ రూపమొందిన ర ♦ హిన్ వహియించిన నీవు పోవఁగా
రుత్తమె కాదె ప్రాణి నికు ♦ రుంబముతోడ నజాండ మియ్యెడన్. ౧౬౧౮

ఆ॥ మాపు రాకయున్న ♦ రేపె రాఁగలఁడు నా, తలఁపు పొల్లుగాదు ♦ తప్పనేని
రామవిభున కేదొ ♦ రారాని యెడరు ప్రా, ప్తించె నంచు నెడఁద ♦ నెంచవచ్చు.

తే॥ నీవె శాస్త్రధర్మంబులు ♦ నీవుతక్క, శాస్త్రధర్మంబు లొకఁడైన ♦ జగతిలేదు
ఒకఁడు మరణించె ననియెంచి ♦ యుర్వినున్న, ప్రాణికోటులఁ జంపఁ బొ ♦ ల్పడఁగఁదగునె?

ఉ॥ ఉర్విని చావు పుట్టుకలు ♦ యోగ వియోగములున్ సుఖాదులున్
సర్వము కర్మజాల ఫల ♦ సంభవమౌటఁ దలంచి సాత్త్వికుల్
గర్వము మోహమున్ వదలి ♦ కాంతురు నిశ్చల సౌఖ్యమంచుఁ దా
నిర్వృతి గూర్చు రామ జన ♦ నిం గని కైక కుమారుఁ డిట్లనున్. ౧౬౨౧

తే॥ రాము సత్య వాక్యము దిన ♦ రాజవంశ, శీలమును చెడ జీవింపఁ ♦ జాల నాదు
ప్రతిన నెఱవేర్చుకొందు నీ ♦ పలుకువినని, దొసఁగు క్షమియింపు మమ్మరో ♦ విసుగుగొనక.

ఉ॥ ఏనును సత్యపాలనకు ♦ నిమ్ముగ జీవము వీడు జేసికిన్
నూనుఁడనే కదా! జనకు ♦ సూక్తుల నొదలఁ దాల్చుటెన్నఁగా
జానకిజానికే విధియొ? ♦ జానుగఁ దక్కినవారి కుర్వరన్
బూనిక నెగ్గఁ జేసికొనఁ ♦ బోలదొ? యెక్కడి పాడి? తల్లిరో! ౧౬౨౩

ఉ॥ తల్లి వచస్సు మీఱమియుఁ ♦ దండ్రి నుడుల్ జవదాటకుండుటల్
పెల్లుగ నింపఁ బాత్రమగు ♦ ప్రేమ సమూలముగాఁగఁ ద్రుంచుటల్
చెల్లిన దొక్క రామునకె ♦ చెల్లదు నాకది చచ్చి నామదిన్
వెల్లడి చేసెదన్ గలువ ♦ బృందముఁ బాసెదఁ జూడుఁ డిందఱున్.

—: హనుమంతుఁడు భరతుని చేరుట :—

చ॥ అని భరతుండు చేరఁజని ♦ యగ్నిఁ బ్రదక్షిణ మాచరింపఁగా
జనముల గోడు క్రందుకొని ♦ చయ్యన వ్యోమము ముట్ట నా ఘన
స్వనముల నాలకించి రభ ♦ సంబునఁ గార్యము మించెనంచు న
య్యనిల సుతుండు తత్తఱము ♦ నందుచు డాసె మహోగ్రవేగుఁడై.

ఉ॥ డాయుచు రామచంద్రుఁడు క ♦ డంకను వచ్చుచు నున్నవాఁడు న
త్యాయతనంబ దైన భవ ♦ దాయువు వోయెనయేని రాఘవుం
డీయిల నవ్వలం బ్రదుక ♦ నీకొనునే ? యని పల్కి తూఱి యం
దాయితమైన యగ్ని నతఁ ♦ డాఱిచి బొగ్గులు చేసె ప్రేల్మిడిన్. ౧౬-౨౬

చ॥ పదపడి వచ్చి యాభరతు ♦ పాద సరోజయుగంబు భక్తి నె
న్నదురు స్పృశింప మ్రొక్కుచు న ♦ నుం బరిపూత చరిత్ర! దాసుఁగా
మదిఁ దలఁపందగున్ సుజన ♦ మాన్యుని రాముని రాక కెన్న న
ల్పది గడె లింక నున్నయవి ♦ వారక మీరు గణించి చూడుఁడీ.

శా॥ నా వాక్యంబుల యం దసత్య మది యు ♦ న్నన్ మీకు నే ముందుగా
నీ వహ్నింబడి కూలువాఁడ ధరజా ♦ ధీశుం డిదో వచ్చెఁ బ్రా
ద్ధావర్తించి జనించుదాఁక నిలుమా ♦ యామీఁద రాఁడేని నీ
వీ వైశ్వానరులోనఁ జేరుము మనో ♦ భీష్ట ప్రకారంబునన్. ౧౬-౨౭

తే॥ వచ్చుచోఁ బ్రేమమున భర♦ద్వాజమౌని, నిలిపి విందువెట్టఁగ వేఁడ♦నిలిచినాఁడు
తామసింపఁడు నీమీఁది♦తత్పరతను, నీరజాక్షుండు సంశీల♦నిరత! భరత! ౧౬-౨౮

—: భరతుఁడు రాముని రాక విని యానందించుట :—

[జూపఁ

తే॥ అతఁడు ప్రేమతోఁ బంపిన♦యానవాలు, కలదు చూడుమా యనుచు నం♦గరముఁ
గాంచినంత నయ్యది వారి♦కనులఁ జొచ్చి, ప్రాణముల నిల్పె నమృతంబు♦పగిదినొప్పి.

తే॥ రోదనము వోయి యానంద♦రుతము చెలఁగె, వేఁడి కన్నీరు చల్లనై ♦ వెడలసాఁగె
ప్రాలియుండిన తలలెల్లఁ♦బైకిలేచెఁ, జేతులెల్లను హనుమ నా♦శీర్వదించె. ౧౬-౩౧

క॥ పలుమఱు హనుమకు మ్రొక్కుచుఁ, జెలఁగి నటనసేయు సుగుణ♦శీలుఁడు భరతుం
డలఘుని ముద్రిక నక్కున, నలమెఁ గనుల నద్దికొని యె♦నానందించెన్. ౧౬-౩౨

తే॥ వేఱుదుగిఖంబు లేనట్టి♦విమలగుణుఁడు, భరతుఁడపుడునిక్కముగ్రొత్త♦భరతుఁడయ్యె
భుజములుప్పొంగె మేనును♦బూరటిల్లె, నతని యానంద మదిచెప్ప♦నలవియగునె ?

తే॥ నలువుగాఁ బ్రేమ మధికమై♦నవ్వు నేడ్చు, నిక్కి గంతులు వైచును♦నేలఁబడును
చేష్టదక్కఁ బూరించును♦చెమ్మరించు, మలసి తిరుగు మారుతికి న♦మస్కరించు.

క॥ ఆడుం డాడుఁడు రాముని, గూడుఁడు కూడుండి యతని♦కొమరగు కీర్తిం
బాడుఁడు పాడుఁడు వెతలను, వీడుఁడు వీడుండి యితని♦వినుతింపుఁడనున్. ౧౬౩౬

తే॥ కఠినమానస యగు కైక♦కడుపునొచ్చ, ననుచుఁ బెద్దలకున్ మ్రొక్కి♦నవనిపులకు
మ్రొక్కఁ జెలువలకును మ్రొక్కి♦మ్రొక్కికొనును, పృథివిఁ గల్గువంటి దె
నుమహా ♦ ప్రేమగుణము. ౧౬౩౭

తే॥ పిదప భరతుండు హనుమంతుఁ♦బ్రీతిఁగాంచి, యెవ్వఁడవు తెల్పుమా విన♦నిచ్చగింతు
విప్రవేషంబుతో వచ్చు♦విబుధపతివా ?, ముగురు మూర్తుల నొకఁడవై♦తగుదువనిన.

చ॥ అతనికి నాంజనేయుఁ డను ♦ నంజనిపుత్త్రుఁడ వానరుండ మా
రుతిని దినేంద్రనందనుని ♦ రూఢిగఁ గొల్చుచునుండు జానకీ
పతికి హితంబు జీతమును ♦ బత్తెము గోరక కూర్చు దానుఁడన్
నుతగుణపూర్ణ ! నీకడ క ♦ నుంగున వచ్చితిఁ గామరూపినై. ౧౬౩౮

క॥ నాయల్పరూపమును నీ, వీయెడఁ గన నిచ్చగింతు ♦ వే యని మార్చెన్
కోయని నిర్జరు లార్వన్, భీయును మోదంబు నెడఁద♦వికవిక సేయన్. ౧౬౩౯

తే॥ పవనసూనుని దొడ్డరూ♦పంబుగాంచి, భరత శత్రుఘ్ను లతి మాత్ర♦బద్ధమనిరి
సకల జనములు సుడివడి♦చావకున్న, దిగ్భ్రమం జెంది పెల్లుభీ♦తిల్లినారు. ౧౬౪౦

తే॥ వాయుపుత్త్రక! మేమాడు♦వాక్కులెల్ల, నీచెవుల కందునంతటి♦నిన్వనంబు
కలవి కావు కావునఁ దొల్లి♦కరణి నిలిచి, నీ మహా రూప మడఁపుము♦నియతచరిత !

తే॥ అనుచుఁ బ్రార్థింపఁ దనవేడ్క♦ననుసరించి, పిన్నరూపంబు గైకొన్న♦విబుధనుతున
కమిత సంపదలను భూష♦ణాంబరముల, నుపదగాఁ గైకపుత్త్రకుఁ♦డొసఁగెఁ బ్రీతి.

తే॥ మత్త గజము లుత్తమజాతి♦మణులు తురగ, చయములును పాఁడి గోవులు ♦
స్యందనములు
మంచి కేదారములను స♦మ్మాన పూర్వ, కముగ నొసఁగెను హనుమకుఁ♦గైకసుతుఁడు.

తే॥ తమ్ము నీక్షించి మన పౌర♦తతికి నెల్ల, రామవిభు నెదుర్కొన బంధు♦రాజితోడ
బయలు దేఱుఁడియనియన్ని♦వాడలందు, తెలియఁజాటింపఁజేయుము♦తెఱఁగుఁగాఁగ.

తే॥ తోరణములు గట్టించి వీ♦థుల నలంక, రింప రథగజాశ్వంబుల♦రీతిగాఁగఁ
బొలుపు సేయింప మంగళ♦పూర్ణకుంభ, ములను పెట్టింప వలయు వా♦రలను పనుపు.

తే॥ క్రమముగాభరద్వాజునా♦శ్రమమువఱకు, ముత్తెములపందిరులమర్చి♦పురమునెల్లఁ
గ్రొత్తదగునట్లు సేయించి♦కొమరు మీఱ, మంగళారావములను చె♦లంగఁజేయు.

తే॥ అనుడు శత్రుఘ్నుఁ డప్పుడ ♦ యరుగుదెంచి, శుద్ధగుణయుతుఁడును బహు ♦ శ్రుతుఁడు హితుఁడు
మంత్రియును బ్రాజ్ఞుఁడైనసు♦మంత్రుఁ గాంచి, భరతునాజ్ఞను వివరించె♦బంధురముగ.

సీ॥ ఆవార్త చెవిఁజొచ్చి♦నంత సుమంత్రుఁ డ, త్యానందమునఁ దన్ను♦తాన మఱచి
భేరులు మ్రోగించి ♦ వీథివీథికిఁ జని, కకుబంత విశ్రాంత♦కలిత కీర్తి
రావణ సమవర్తి♦రామమూర్తికి నెదు, రేగ్గాలు సేయఁగ రాచ♦కొమరులు బల
వితతులు పురజనుల్♦వేడ్కతోఁ గైసేసి, కొని రండనుచు మీరు♦ఘోషణంబు

తే॥ నేసి రండని కింకర♦శ్రేణి నంప, వారు చాటించి రంత న♦ప్పలుకు విన్న
ప్రజలు కోలాహలము సేయఁ♦బత్తనంబు, పూర్ణ చంద్రోదయాంబుధి♦పోలుపునొందె.

సీ॥ రాము నెదుర్కొన♦రండను చాటింపు, పేదకుఁ బెన్నిధి♦విధమ యయ్యె
రాముపెండ్లికి మున్ను♦రండని చాటించు, కరణి నొప్పారెను♦మురజ రవము
అఱువదివేల య♦క్షౌహిణుల బలంబుఁ, బౌరకాంతామణుల్♦పౌరవరులు
రాజకుమారులు♦ప్రార్థించు సంపద, యెన్నరైన చందాన♦ముదమునొంది

తే॥ పొదలి నడచిరి తల్లులు♦ముగురు పసిఁడి, శిబికలందెక్కి వెడలిరి♦శిష్టజనులు
బంధువులు పరివేష్టింప♦భరతరాజు, లీలగా హనుమంతుని♦కేలువట్టి. ౧౬౪౯

తే॥ రామభద్రుని పాదుకలు శీ♦ర్షకము గాఁగ, నిరుగెలంకులఁ బైఁడిచా♦మరలు వీవ
గజఘటలు మున్నుగా నేగఁ♦గలితపాండు, రాతపత్రంబు నీడలో♦నరుగుదెంచె.

మ॥ కృప మమ్మేలిన రామచంద్రు నెదురం ♦ గేల్వట్టి సామీరితో
న్నృప సంపూజ్యుఁడు పాదచారియయి తా ♦ నేతెంచుచున్నాఁడు వ
చ్చు పథంబందున రాలు వేఁడిగొని కా ♦ ల్చుం గోమలాంఘ్రి ద్వయం
బపచారంబని దాఁటెనో యన నిసుం♦డస్రాద్రిఁ జేరెన్ వెసన్. ౧౬౫౧

—: భరతున కాంజనేయుఁడు రాము నుదంతంబు దెల్పుట :—

తే॥ భరతుఁ డయ్యెడ మారుతి♦వదనము గని, రామచంద్రుఁ డిన్నాళ్లు గా♦రవముతోడ
నెచ్చటెచ్చట నుండె? నే♦మేమిచేసె?, వివరముగఁ దెల్పవే యన♦వినిచె నతఁడు.

తే॥ పురమునందుండుటయుఁ దల్లి♦వరమువలన, వనులకేగుటయును నీవు♦వచ్చి యతని
వేఁడి పాదుకలం గొని♦వెడలుటయును, తెలుప నేటి కవ్వలి కత♦దెలుపువాఁడ.

ఉ॥ దండకయందు చేర ముని ♦ తండము రాక్షస హింసఁ దెల్పి నీ
యండను చేరినార మిఁక ♦ నాపద దీరిచి కావుమన్నఁ గో

దండధరుండు రాక్షస వ ♦ ధం బొనరించె దశాస్యుఁగూల్చె ను
ద్దండ పరాక్రమంబున య ♦ థావిధిఁ దెల్పెద నాలకింపుమా. ౧౬౫౪

చ॥ తన యునికిన్ గ్రహించి రిపుఁ ♦ దప్పక పౌరులు మాటిమాటికిం
బనుపడ వచ్చివచ్చి తన ♦ భావము మార్చెదరంచు దండకా
వనమును చేరుచోఁ జెనక ♦ వచ్చు విరాధుని గూల్చి యవ్వలన్
దనుజులఁ గూల్ప మానులకుఁ ♦ దా నభయం బొనఁగెన్ మహాత్మకా!

మ॥ పదియేం డచ్చటనుండి రాఘవుఁడు త ♦ ద్వాక్యప్రకారంబుగా
నుదధిం ద్రావు నగస్త్యుఁ జూడఁ జని యా ♦ యుత్కృష్ట దేవర్షి కాం
క్ష దలిర్పంగ ముకుందు కార్ముకము న ♦ క్షయ్యంపుఁ దూణీరముం
బ్రదరంబుల్ తరవారి బొందడము గా ♦ రంబార నీయం గొనెన్. ౧౬౫౬

మ॥ అవలన్ వారు జటాయువుం గలిసి నె ♦ య్యంబార సేవించి పం
చవటిం జేరి కుటీరమందు దినము ♦ ల్సాగించుచుండంగ దా
నవి యొక్కర్తుక చుప్పనాక యెదురై ♦ నారీమణిన్ జానకిన్
దవదాహంబును పోలె ముట్టి కొని పోఁ ♦ దర్కింప సౌమిత్రియున్.

మ॥ కని యా రక్కసి కర్ణనాసిక లొగిన్ ♦ ఖండింప నాదైత్యయుం
గినుకం బోయి ఖరాదులం గలిసి యా ♦ కీడ్పాటు దెల్పంగఁ ద
ద్దనుజుల్ కోప సమేతులై బలముతో ♦ దర్పించి శ్రీరామచం
ద్రునితోఁ గయ్యముసేసి మాఁడి రగినిం ♦ దూదింబలెం గ్రచ్చఱన్.

శా॥ లంకాద్వీపము చేరి శూర్పణఖ పౌల ♦ స్త్యున్ సమీపించి తా
నంకం బొందిన పద్ధతిం దెలిపి మీ ♦ నాంకధ్వజంబో యనం
బొంకం బారు విదేహకన్య చెలువం ♦ బుం దెల్పి ప్రేరేఁపఁగా
లంకేశుండును వచ్చె సీతఁ గొని పో ♦ లంకించి మారీచుతో. ౧౬౫౯

శా॥ మారీచున్ హరిణంబుగాఁ బనిపి తా ♦ మాసీంద్ర వేషంబుతో
శ్రీరామాంగన యున్నభూమిని పెక ♦ ల్చెం దేరిపైఁ బెట్టె నా
దారిం బోవఁగనీక యడ్డు విహగేం ♦ ద్రస్వామిఁ జక్కాడె లం
కారాజ్యంబునఁ గార నుంచె జనక ♦ క్ష్మాపాల కన్యామణిన్. ౧౬౬౦

మ॥ ఎలయింపం గమకించి దవ్వులకుఁ ద ♦ న్నీడ్పించు మారీచు రా
ట్కుల సింహుండగు రాఘవుండు విశిఖ ♦ క్రూరాహతిం గూల్చి య
వ్వల వైదేహిని రోయుచున్ జనకుఁడౌ ♦ పక్షీంద్రు వీక్షించి కొం
దలపాటొంది నమాచరించె వడి నౌర్ధ్వ ప్రక్రియల్ భక్తిమై. ౧౬౬౧

సీ॥ పదపడి సీతను ♦ వెదకుచు దక్షిణ, దిశ కేగు దెంచుచుఁ ♦ దివిరి పట్టు
వికృత రూపుఁ గబంధు ♦ వికటశాపము మాన్పి, శబరి చేసిన యుప ♦ చారములను

[ప్రేమను గైకొని♦యామె తెల్పిన త్రోవ, నిన సుతుఁ జేరి స్నే♦హించి వాలి
వలనఁ గల్గిన దుఃఖ♦ములఁ దీర్తునని యభ, యము దయచేసి సా♦లములఁ గూల్చి

తే॥ వాలి వక్షంబు భేదించి♦ప్లవగ రాజ్య, మును దినేంద్రసూతికిఁ బ్రేమ♦మున నొసంగి
వానకాలంబు కడచు న♦వ్వాలసుతోడు, పడఁగ రమ్మనిపంపె న♦బ్జానుసుతుని.

సీ॥ గజుఁడును గవయుండు♦గంధమాదనుఁడును, పనసుండు నీలుండు♦వాలిసుతుఁడు
శరభుండు ఋషభుండు♦శతబలి మైందుండు, ద్వివిద జాంబవదాది♦వీరవరులు
డెబ్బది వెల్లువల్♦ప్రబ్బిన సేనతో, వానకాలము దాఁటఁ♦బ్లవగ విభుఁడు
వచ్చి యచ్చట నన్ని♦వలఁకుల సీతను, వెదకు పద్ధతులను♦విశదపఱచి

తే॥ నాల్గుభాగము లాఁగ సై♦న్యంబుచేసి, యొక్కొక విభాగ మొక్కొక♦దిక్కు వెదకి
వడిగ నెలలోనఁ గ్రమ్మఱి♦వచ్చునట్లు, కఠిన శాసన మొనరించి♦కడఁక నంపె.

ఉ॥ అంగద జాంబవంతులు ర ♦ యంబున దక్షిణదిక్కుచేరి న
న్నంగనఁ గాంచి రమ్మనఁగ ♦ నంబుధి దాఁటితి లంకఁ జేరితిన్
రంగుగ సీతఁగాంచి రఘు ♦ రాముని వార్తల విన్నవించి యా
సంగతి రామచంద్రునకుఁ ♦ జక్కఁగఁ దెల్పితి నంత నందఱున్. ౧౬౬౪

ఉ॥ దక్షిణవార్ధిఁ జేరుతఱిఁ ♦ దక్కక రాముని శౌర్యసంపదల్
రాక్షసరాజుతోఁ దెలిపి ♦ రామునికాంతను వీడకున్న నీ
యక్షయ లక్ష్మి నాశమగు ♦ నన్న విభీషణుఁ దిట్టి దానవా
ధ్యక్షుఁడు వెళ్లఁగొట్ట నతఁ ♦ డార్యుని జేరఁగవచ్చెఁ బ్రీతిమై. ౧౬౬౫

శా॥ కాకుత్థ్సుం డభయం బొసంగి వెస లం ♦ కారాజ్య మవ్వేళనే
వీఁకం బట్టము గట్టి శాంతియుతుఁడై ♦ వీరుండు ప్రార్థింపఁగా
నాకర్ణింపమి రోషభీషణ ముఖుం ♦ డై చూడ సప్తాంబుధుల్
చీకాకై జలమింకి మాఁడెను సుర ♦ శ్రేష్ఠుల్ వితాకొందఁగన్. ౧౬౬౬

ఆ॥ శరణు శరణమంచు♦వరుణుండు ప్రార్థించెఁ, దరులు గిరులు ప్లవగ♦వరులుదెచ్చి
వనధిఁబూడ్చి దనుజ♦వరుని లంకనుఁచుట్టి, చేసినారు వీర♦సింహరవము. ౧౬౬౭

శా॥ కైలాసంబుఁ బెకల్చు బాహువులు ది ♦ క్సారంగ శృంగంబు లా
భీల ప్రక్రియ నాటినట్టి యురముల్ ♦ వీకైన శీర్షంబులున్
లీల న్నేలకు వ్రాల్చి వాని యనుజున్ ♦ వేటాడి రాముండు ని
ర్మూలించెన్ దనుజాన్వయంబు ప్రమదం ♦ బుం బొంద బృందారకుల్.

ఆ॥ దనుజ యువక వరులు♦దనుజేంద్ర సుతులును, లక్ష్మణాస్త్రములకు♦లక్ష్యమైరి
సంగరాంగణంబు♦శవమయమయ్యెను, సురలు మునులు ముదము♦చోద్యమంద.

ఆ॥ అమర సిద్ధ సాధ్య♦యక్ష గంధర్వాదు, లెలమి సతులతోడ♦నిలకు వచ్చి
వినతి నిలిచి బహుళ♦వినుతులు చేసిరి, తొలఁగె లోకములకు♦దొసఁగు లనుచు,

చ॥ అమరఁగ రావణాదులకు ♦ నంతిమకార్యములెల్ల సద్విధి
క్రమమునఁ జల్పుమం చసుర ♦ కాంతు విభీషణు నంపి జానకీ
రమణిని కోపగించి యెదు ♦ రన్ శుచినిల్పి పరీక్షచేసి శాం
తము వహియించె రాఘవుఁడు ♦ ధాతృహరేంద్రులు సంస్తుతింపఁగన్.

చ॥ అసదృశ సత్యవాక్యుఁడగు ♦ నాజి విమానమునందు వచ్చి సం
తసమున మ్రొక్కు సూనులను ♦ తత్పరతన్ బిగి కౌఁగిలించి మె
చ్చి సడలు మోదవారి నభి ♦ షేకముచేసి విదేహకన్యకన్
గొనరని ప్రేమతోడఁ గయి ♦ కొమ్మన రాముఁడు సమ్మతించుచున్.

ఉ॥ పెంచిన తల్లి కైకపయిఁ ♦ బేరిమి నాము కుమారుపైని ము
న్నుంచిన నిష్కళంక లన ♦ దుత్కట భావము నుంచ వేఁడెదన్
గొంచక యీవరమ్ము నొనఁ ♦ గూర్పుమ యన్న నొసంగి సత్యస
త్త్వాంచితమూర్తి మీఁజనకుఁ ♦ డాదటఁ జేరె ముకుందలోకమున్. ౧౬౨౩

చ॥ పదపడి వేల్పులున్ మనసు ♦ పాటిన పెక్కువరంబులీయ డె
బ్బదియగు వెల్లువల్ దనుజ ♦ బంధులు రాక్షస వీరనాథు ల
ర్వది యగు నేడుకోటు లల ♦ రంగ విభీషణుఁ డిచ్చెఁ బుష్పకం
బదియుచుమీ వియత్పథము ♦ నందు జవంబున వచ్చుచుండెడిన్. ౧౬౨౪

ఆ॥ నెమ్మి రాఘవుండు ♦ నిన్ను దలంచుచుఁ, దమ్ముతోడ జనక ♦ తనయతోడ
సకల హితులతోడఁ ♦ జని భరద్వాజుని, యాశ్రమ స్థలంబు ♦ నందు చేర.

తే॥ ఆతఁ డాతిథ్య మీయంగ ♦ ననువుపఱుప, నిన్నుగాంచి యీముద్రిక ♦ నీకుఁ జూపి
యూఱడింపంగ నన్నంపె ♦ నురవడి మెయి, రామచరిత మిట్టిది మహా ♦ రాజ తిలక!

మ॥ భరతుండంతయు సావధానమతియై ♦ పాటించి యాలించి ని
ర్భర మోహాద్భుత సంభ్రమంబు లెద నా ♦ రం గూరి మల్లాడ నా
దర పాత్రుండయి యొక్కతమ్ముఁడు సమి ♦ ద్ధాత్రిన్ సహాయుండుగా
వరసాహ్యంబు వినంగనోచితిని డా ♦ ర్భాగ్యుండ నేనియ్యెడన్. ౧౬౨౫

ఆ॥ అనుచుఁ బలికి భరతుఁ ♦ డధిక నిర్వేదంబు, తోడఁ గాలినడక ♦ తోడ హనుమ
తోడ నడచిచేరెఁ ♦ దోయజాప్తుఁడు తొలి, గట్టు నెక్కుమున్నె ♦ గంగ కడకు.

శా॥ ఘోరాకారుల రావణాదులను ద్రె ♦ క్కొల్పేసి యుద్యజ్జయ
శ్రీరాజిల్లఁగ రాఘవుండు నగరిన్ ♦ శ్రీదేవి భూదేవి త
న్నారాధింప మహాభిషిక్తుఁడగు నం ♦ చానందుఁడై పూర్వ ది
గ్వీరుం డంపిన కానుకాయో యనులలిన్ ♦ విభ్రాజిలెన్ భానుఁడున్.

మ॥ అకలంకుం డటఁ గాలకృత్యములు నొ ♦ ప్పారంగఁ గావించి పా
దుకలన్ భక్తిని పూజచేసి మఱి వా ♦ తూలాత్మజుం గాంచి దై

త్యకులాహివ్రజ పక్షిరాజ! రవితే ♦ జా! నీదు వాక్యావళుల్
వికటార్థంబును పొందఁగానగునె యీ ♦ విశ్వంభరన్? మారుతీ!

మ॥ కపిసైన్యంబులు దైత్యవాహినులసం ♦ ఖ్యాకంబులై వచ్చుచో
విపులక్షోణి భరింపలేక వెగడున్ ♦ వేపొంద ధూళివ్రజం
బుపరి వ్యోమముఁ గప్పదే? యులబలం♦బుద్వేలమై లేచి స
ప్త పయోరాసుల ఘోషణంబు పగిదిన్♦వర్తిల్లదే? పావనీ! ౧౬౭౧

మ॥ పరివారంబులు నిండియుండెను భర ♦ ద్వాజాశ్రమం బింక ద
వ్వరయన్ లేదు ప్రశాంతమై యమరునే ♦ యావీడుపట్టింతగా
బరువై నామది సంశయించెను జగ ♦ త్ప్రాణాత్మజా! జానకీ
శ్వరుఁ డెందుండెనొ తెల్పరాదె? యనుడున్ ♦ సామీరి తానిట్లనున్.

మ॥ వ్రతసంపన్న! మునీశ్వరుండు సురలన్ ♦ బ్రార్థించి కల్పింప స
న్మతిఁ బుష్పాసవ కందమూల ఫల సం ♦ పత్తిం బ్రసేవించి నో
ళ్లతిమాత్రంబుగ నార్పలేని గతిచే ♦ నట్లుండెఁ గాదేని ని
ద్రితమై యుండఁగఁ బోలు నిక్కమిది చిం ♦ తింపంగ నీకేటికిన్? ౧౬౭౩

—: గుహుఁడు రాముం గానవచ్చుట :—

ఉ॥ కన్నులపండువై తనరఁ ♦ గాంచెదు రామునిరాక నిప్పుడే
పన్నగ నంచు సాంత్వనము ♦ పల్కఁగ నచ్చట మానివిందు నా
పన్నజన ప్రసన్నమతి ♦ ప్రాఁతిగ మిత్రులతోడఁ దృప్తిమైఁ
గొన్నతటిన్ గుహుండు కను♦గోఁ జనుదెంచెను గొప్పసేనతో. ౧౬౭౪

ఉ॥ వచ్చి మనంబు కన్నులును ♦ వాఁచిన పోల్కిని గాంచి కాంచి పై
నిచ్చఁ బ్రదక్షిణించి రహి ♦ యించి పదంబుల వ్రాలి రాముఁడున్
గ్రుచ్చి కవుంగిలించుకొని ♦ కూరిమి మీఱఁగ క్షేమవార్తలన్
బెచ్చుగఁ బ్రశ్న సేయ రఘు♦వీరుని చూచి గుహుండు ప్రీతిమై. ౧౬౭౫

ఉ॥ వారక దాసుపై భవ ద ♦ పార కృపారస దృష్టి గల్గుచో
దార సుతాదు లౌదురె యు ♦ దార హితుల్? వెనువెంటనంటి నే
వారతి నున్న లక్ష్మణుని ♦ భాగ్యము నోచని దుర్భగుండ నా
కారయ క్షేమసంపదల ♦ కంతముగల్గునె? రాక్షసాంతకా! ౧౬౭౬

మ॥ అని చింతించు గుహుం గనుంగొని ఘన ♦ శ్యాముండు రాముండు తొ
ట్టిన ప్రేమంబున నీవు నాభరతుకం ♦ టెన్ జూడ వేఱయ్యెదే?
ఘన సౌఖ్యంబులు గల్గుగాత మన నా ♦ కైవర్తకస్వామి భ
క్తిని భూజాతకు లక్ష్మణాఖ్యునకు ప్రమొ ♦ క్కన్ వారు దీవింపఁగన్.

తే॥ గుహుని రవిసుతాదులకుఁ బె♦ న్గూర్మిఁ జూపి, యితఁడు మన స్నేహితుఁడు జీవ♦ హితుఁడు గాంగ
భూములకు ఱేఁడు గుహుఁడను♦పుణ్యచరితుఁ, డనుచుఁ దెలుప నెల్లరుఁగొని♦యాడిరతని.

క॥ ఎల్లరు నిష్టాగోష్ఠిగ, నుల్లాసంబునను గలిసి♦యుండఁగ రవి రం
జిల్లెను పడమటికొండన్, ఫుల్లాబ్జాక్షుఁడు స్వకృత్య♦ముఁలఁ దీర్చికొనెన్. ౧౬౮౯

తే॥ సీతతో రామచంద్రుండు♦సెజ్జఁ జేర, గుహుఁడు సౌమిత్రియును గపి♦కోటి దనుజ
నికరమును పరివేష్టించి♦నియతినుండఁ, బెల్లు మాటల భల్లునఁ♦దెల్లవాఱె. ౧౬౯౦

శా॥ పంకేజాక్షుఁడు కాల్యకృత్యముల ని♦ర్వర్తించి మౌనీంద్రు మో
దాంకంబైన యనుజ్ఞగైకొని విమా♦నారూఢుఁడై యోగి ని
శ్శంకప్రేమమయాంతరంగుఁడగుచున్♦ సాగింప వెన్నంట నా
తంకంబేమియు లేక వెల్వడియె మి♦త్రవ్రాతముల్ గొల్వఁగన్. ౧౬౯౧

తే॥ పుష్పకంబు శీఘ్రంబుగఁ♦బోవుచుండఁ, జందమైన శిల్పంబుల♦నంద మొంది
యింద్రపురి ధిక్కరించుచు♦నెసఁగు స్వపుర, దుర్గ కుడ్యముల్ కనులకుఁ♦దోఁచెఁ దనియ.

తే॥ అనుఁగులంగని వర్ణింప♦నలవికాని, యశమునొందిన సూర్యాన్వ♦యాధిపతుల
రాజధాని కానఁగవచ్చె♦రాజిలంగఁ, గాంచుఁడన లేచి కేలోడ్చి♦కాంచినారు.

—: భరతుఁడు శ్రీరామాదులం గాంచుట :—

తే॥ గగనమందు పెక్కురు దివా♦కరులకాంతి, గలిగి వెలుఁగు విమానంబు♦కానఁబడఁగ
నదిగొ వచ్చె రాఘవుఁడని♦యాంజనేయుఁ, డలరి కేకలువైచి ప్ర♦క్కలకుఁ జూచి.

క॥ కమలాక్షుఁడు కపిసేనయుఁ, గమలవదన లక్ష్మణుండు♦కన్నులు తనియన్
బ్రమదమున నేగుదెంచిరి, తమిఁ గనుమని చూపె భరత♦ధాత్రీశునకున్. ౧౬౯౨

ఆ॥ ఎల్లలోక వాసు♦లెక్కినఁ జోటింత, యొనరునదియు సాటి♦యొనరనిదియు
జిగి దిశాంతములకుఁ♦జిమ్మునదియునైన, పుష్పకంబు గాంచె♦భూరియశుఁడు.

తే॥ మేరు గుహను మెఱుముతోడి♦మేఘభాతి, పుష్పకమున జానకితోడ♦భూవరుండు
కానరాఁ గాంచె భరతుండు♦ కన్నవారి, కలకలము లేచి లంకను♦కడచిచనియె.

శా॥ స్నాయు వసా వికార మలి♦నమ్మగు దేహము వీడి సత్యమున్
బాయక కోరి విష్ణు భువ♦నంబు భజించిన తండ్రిఁ గాంచు నా
తోఁయమునొంది కానలకుఁ♦ దూలిన ప్రాణమువంటి యుల్లస
త్తోయజనేత్రుఁ గాంచె భర♦ తుండు కుతూహలియై గహించుచున్.

తే॥ దోవుపోయిన వస్తువు♦దొరకినట్లు, వెతలు దొలఁగంగ సమ్మోద♦వివశుఁడగుచు
భువనవంద్యునకుం గేలు♦మోడ్పఁదలఁచి, భరతుఁడప్పుడు పావని♦కరము వీడె.

క॥ హనుమంతుఁ డప్పుడు గగన, మ్మున వచ్చు విమానమునకు♦మున్నుగఁ జని రా
ముసకుఁ బ్రియమ్ముగ వందన, మొనరిచి యిట్లనియెఁ బ్రేవ♦కొదిఁగి నిలుచుచున్.

ఆ॥ వహ్నిఁబడఁగనున్న♦భరతుని చేరి మీ, జాడ దెలిపి సాహ♦సంబు మాన్పి
యెల్లరకును మోద♦మొసఁగించితిని వారు, వచ్చి రనుడు ధాత్రి♦వరుఁడు నలరి.

ఉ॥ మారుతి! దుర్భరంబులగు ♦ మామెడరుల్ బహుళంబులయ్యె నీ
వారని సత్కృపామతి ని ♦ వారణచేసెను మాతపఃఫలం
బీ రహిఁ నీస్వరూపమున ♦ నేడ్తెఱవచ్చి తోలంగఁదోలె నీ
పారము లేని మేలునకుఁ ♦ బ్రత్యుపకార మొకండు కల్గునే? ౧౭౦౨

చ॥ నిరతము తోడునీడయగు ♦ నిన్నును నాతలిదండ్రులం గృపా
శరధిని లక్ష్మణున్ భరతుఁ ♦ జయ్యన నొక్కొకమాటలోనఁ ద
ద్గురుగుణ సంపదల్ దెలుపఁ ♦ గూడునె? సన్నుతశీల! దానవ
ద్విరద మృగేంద్ర! మేరు సమ ♦ ధీర! మదీయ తపఃఫలాకృతీ! ౧౭౦౩

తే॥ ప్రథితగుణుఁడు రాఘవుఁ డిట్లు♦పలుకుచుండఁ, బాదుకలఁ దలఁదాల్చిన♦పావనుండు
వ్రతములం గృశియించిన♦వాఁడు కేలు, మోడ్పుగలవాఁడు భరతుఁడు♦మొనసి డాసె.

తే॥ తల్లి గుణములకుం బగ ♦ దాయ కోస, లమ్మునేలిన యేలిక ♦ తమ్ముగుఱ్ఱ
వచ్చెఁ గనుమని చూపె శ్రీ♦వల్లభునకు, ధర్మములకెల్ల సాక్షిగాఁ♦దనరు హనుమ

క॥ కాంచిన రాముఁడు దశరథుఁ, గాంచిన తఱినొందు కౌతు♦కంబును పొందెన్
మించి తనమేను పులకల, నించెన్ గనుదోయి జలము♦నించెను తోడ్తోన్. ౧౭౦౬

క॥ కాంచెద జనులఁ బౌరుల, నంచితులన్ గురుల బాంధ♦వావలినెల్లన్
గాంచెదఁగాకని మనమున, నెంచిన యంతన విమాన ♦ మిలకుం దిగియెన్.

క॥ క్రిందికి దిగిన విమానం, బందఱకును పుణ్యఫలము ♦ లందింపంగా
బృందారక లోకమునకు, నొందం గొని చను విమాన♦మో యన నొప్పెన్.

సీ॥ ఎడపడియున్న క్రే♦పెనయ గోవును డాయు, వలనుగాఁ గన్నత♦ల్లులకు నొప్పె
మాయ నీఁగిన వారి♦మనము లయించు జ్యో, తీరూపమునఁ దప♦స్విసతుల కొప్పె
వ్యాధిచే నీఁగిన ♦ ప్రాణముల్ మరల వ, చ్చినపోల్కి కోసల♦జనుల కొప్పెఁ
గన్నవారల కెల్లఁ ♦ గన్నతల్లిగ నొప్పె, మగువలకు మధువు♦పగిది నొప్పె

తే॥ భరత శత్రుఘ్నులకుఁ గను♦పాపలట్లు, ప్రేమగలవారలకు సురా♦మృతము కరణి
నొప్పె నప్పుడు తమువీడి♦యున్న రామ, భద్రు నాగమనము కను♦పండు వగుచు.

ఉ॥ రాముఁడె జీవమై తనరు ♦ రాజ్యమునందు నయోధ్యయందు రా
మామణులున్ జనంబులును ♦ మానిత శుద్ధ మనోజ్ఞ భావ సు
స్థేమము లొందినారు నుర ♦ సేవ్యుని రాకను హేమపుత్త్రికా
స్తోమము జీవమొందుక్రియ ♦ శోభిలినారు ముదంబు పెంపునన్. ౧౭౧౦

తే॥ చందనముగందవాడియుఁబు-ష్పములువెన్న, తురగఫేనంబుగజమద-తోయములును
మోద బాష్పముల్ గలిసి స♦ముద్రజలము, పగిది నుప్పొంగెఁ బ్రవహించె♦వసధిఁజేర.

చ॥ ధరణికి డిగ్గఁ బుష్పకము ♦ తల్లులు తమ్ము లరుంధతీవిభుం
డురవుగ నెక్కునంతఁ బురు ♦ షోత్తముఁ డప్డు వసిష్ఠు పాద పం
కరుహము లంటఁ మ్రొక్కఁ దమ ♦ కంబున నాతఁడు లేవనెత్తి యా
దరమునఁ బెక్కుమార్లు తన ♦ దప్పి యడంగఁ గవుంగిలింగొనెన్.

చ॥ పదపడి లక్ష్మణుండు పద ♦ వందనముం బొనరింప దీవనల్
ముదమునఁ జేయుచున్ శిరము ♦ మూర్కొనె జానకి వచ్చి మ్రొక్కఁగా
సదయుఁడు సర్వసౌఖ్యము లె ♦ సంగుతమంచు వచించెఁ బ్రీతి గ
ద్గదిక రవంబుతోడఁ బుల ♦ కమ్ములకుం గులకమ్ముగా నొడల్. ౧౭౧౩

మ॥ తొలుతన్ రాముఁడు కైకయంఘ్రులకు సం ♦ తోషంబుతో మ్రొక్కి య
వ్వలఁ దక్కుంగల తల్లులం దెలవ న ♦ వ్వారల్ మహోత్కంఠతోఁ
బలుమాఱుల్ తల మూరుకొంచుఁ దనువున్ ♦ బాఢంబుగా దువ్వుచున్
జెలఁగన్ మోద జలాభిషేచనము తు ♦ ష్టింజేసి రప్పట్టునన్. ౧౭౧౪

మ॥ పొలుపొందన్ ధరణీ తనూజయు యథా ♦ పూర్వంబుగా వారికిం
దెలవన్ మా కులదీపమంచుఁ బొదువన్ ♦ దీవించి రావెన్కఁ ద
ల్లులకున్ లక్ష్మణుఁ డర్థి మ్రొక్కఁ దనువుల్ ♦ పూరింప నొక్కండవే
జలజాతేక్షణు తమ్ముఁడైతివని రా ♦ శంసించి దీవించుచున్. ౧౭౧౫

సీ॥ పాదుకలను తన ♦ భక్తిని గానుక, గా సమర్పించి త ♦ ద్ఘన పదముల
వ్రాలిన భరతుని ♦ పోలంగఁ గని రామ, విభుఁడు మిక్కుటమగు♦వెత గదించి
నాల్కయెండఁగ నొక్క♦పల్కని వచియింప, నేరక నివ్వెఱ ♦ నిలిచి తనువు
ప్రాణంబు లొకటగు ♦ పగిది బిగ్గఁ గవుంగి, లించి మిక్కిలి పల ♦ వించి సోలి

తే॥ యశ్రుధారల లేఁత సొ♦రడఁగఁ దిరులు, గట్టి దూసి క్రమ్మిన జడల్♦వట్టితడవి
శిరము మూర్కొని క్రేపును♦చేరు మొదవు, చందమునను౦డెఁ దనియక♦చాలతడవు.

చ॥ వినుత మహేంద్ర భోగ పద ♦ విం దృణకల్పముగాఁ ద్యజించి స
న్మునివర వేష చర్యలను ♦ పూని యశంబు గడించు తత్పవి
త్రుని చరణాంబుజంబులకు ♦ మ్రొక్కెను భక్తిని లక్ష్మణుండు త
ద్ఘన పద రేణువుల్ శిరముఁ ♦ దాఁకి పవిత్రత గూర్ప నొయ్యనన్.

చ॥ పనముల నగ్రజన్ము పద ♦ వారిజముల్ భజియింపఁ దోడుగాఁ
జని శ్రమకోర్చి నిద్రయును ♦ చక్కియఁ జేరఁగ నీక త్రోచి జీ
వనముల నప్పగించి వసి ♦ వాడిన మేనిని దీర్ఘబాహులం
దనువుగఁ గౌఁగిలించె భర♦తాఖ్యుఁడు దేహము పావనంబుగాన్. ౧౭౧౮

మ॥ దురితధ్వంసియుఁ బిన్నతమ్ముఁడగు శ ♦ త్రుఘ్నుండు సీతాహృదీ
శ్వర సౌమిత్రుల పాదపద్మములు శీ ♦ ర్షంబంటఁగా మ్రొక్క వా
రరుదా ప్రేమను కౌఁగిలించికొని ♦ మి శ్రాస్రంబులం జార్చి ని
ర్భర మోదంబున నల్వురుం బొదలి రా ♦ ర్ద్రింబైన చిత్తంబులన్.

మ॥ జనకక్ష్మావిభు పుత్త్రికిన్ ♦ భరతుఁడున్ శత్రుఘ్నుఁడున్ మ్రొక్కఁగాఁ
దనుఁ దావచ్చిన శీర్షకంబు తొలఁగం ♦ దాటించు శీర్షంబు కై
ట్టన ముల్లోకములం జయించు దనుజా ♦ ధ్య ప్రార్థనం ద్రోచు కా
ళ్లు నొకొండొండు స్పృశించి పావనత పొ ♦ ల్పుం బొందె ధన్యంబులై.

చ॥ విమలుల సూర్యపుత్త్రక వి ♦ భీషణ జాంబవ దంగదాదులన్
క్రమముగఁ జూప వారలు భ ♦ రంబగు భక్తి నమస్కరించి రా
సుమహితచిత్తులన్ దనుజ ♦ సూదను తమ్ములు ప్రేమ మీఱఁగా
సముచిత రీతులం దనియ ♦ సత్కృతులం బొనరించి రత్తఱిన్. ౧౭౨౧

చ॥ సచివులు దండనాథులును ♦ సంగడిరాజులు రా సుమంత్రకుం
డచటికి వచ్చి సమ్మదము ♦ నంగద పోరొనరింప మ్రొక్కి యీ
యచలకు భారమై తొడరు ♦ నాపద లేదిఁక నంచుఁ బల్కఁగా
నుచిత విధమ్మున న్నరవ♦రోత్తముఁ డాదృతిఁ గాంచె వారలన్ ౧౭౨౨

ఆ॥ సేనలెల్ల వచ్చి♦సేవింప నందఱఁ, బుష్పకంబులోనఁ♦బొలుపుమీఱ
నిలువుఁడనఁగ వచ్చి♦నిలిచి లక్ష్మణునకు, భూమిదేవి సుతకు♦మ్రొక్కినారు.

చ॥ విరుల సరంబు లెల్లెడల ♦ ప్రేలు విమానము చూడఁ బంకజో
దరు నుదరంబొ వార్ధి యమృ ♦ తంబులఁ గ్రోలు నగస్త్యు దొడ్డయా
కరతలమో సమానమగుఁ ♦ గాదని ఖేచరు లబ్రమందుచున్
విరులను చల్లినారు రఘు ♦ వీరుని కీరితి నుగ్గడించుచున్. ౧౭౨౪

సీ॥ భేరి రావములు శం♦ఖారావములు బ్రాహ్మ, ణాశీరవంబు గ♦జాశ్వరవము
కాహళధ్వనులు మం♦గళ నినాదంబులు, భూనభోంతరములు♦బోరు కలఁగ
నంబుధి ఘోషంబు♦డంబు విడంబించి, తేఖుల రవముతో♦లీనమయ్యె
మహిత విమానంబు♦రహిలేచి యటనుండి, సాకేతపథమున♦సాగుచుండి

తే॥ యవనితోడను భూజను♦లమరపురికిఁ, గదలు పగిది శక్రుండు స్వ♦ర్గంబుతోడ
నిలకు వచ్చుచందంబున♦నెనసి వెలసి, పొలుపుతోడ నంది గ్రామ♦మునకువచ్చె.

—: ౩౮ శ్రీరామ పట్టాభిషేక పటలము :— (౪౨)

మ॥ స్థిరశీలుండగు రామచంద్రముఁడు నం ♦ దిగ్రామముంజేరి ము
న్నరవై యున్న జటాభరంబు లట నా ♦ యుష్కర్మచే నూడ్చి భూ

వర వేషోచిత మండనంబు లిరవా ♦ ప్పం దాల్చి రత్నద్యుతిన్
బురుహూతుంబలెఁ బొల్చెఁ దమ్ములు లస ♦ ద్భూషాలిచే శోభిలన్.

శా॥ ఆకాశస్థలి నంటి నిక్క ధ్వజ వ ♦ స్త్రాంచ త్కరాబ్జంబులన్
సాకేతంబున కేగుదెండనుచు నా ♦ సం బిల్చు చందాన న
స్తోక ప్రాభవ మండిత ప్రభలతో ♦ శోభిల్లు స్వాయోధ్యకున్
శ్రీకంజాక్షుఁడు చేర నెక్క రథమున్ ♦ శ్వేతాశ్వ సంయుక్తమున్.

తే॥ కొమరుగాలక్ష్మణుఁడు తెల్ల♦గొడుగునూనఁ, జామరంబుశత్రుఘ్నుఁడు♦చాఁచివీవ
దివిరి భరతుఁడు బంగారు♦ తేరు దోల, నుత్సుకుండయి రాముఁ డ♦యోధ్యకేగె.

ఉ॥ వానరనాథుఁడున్ దనుజ ♦ వర్యుఁడు భద్ర గజాలమీఁద స
మ్మానిత రీతి నెక్కి యిరు ♦ మైఁ జనుదేరఁగ నంగదుం డసం
ఖ్యాక జనంబు సందడుల ♦ నారఁగఁబాపుచు ముందుపో హనూ
మానుఁడు వెంబడించెను స♦మంచితభక్తి భజించి కాల్నడన్. ౧౭౨౯

చ॥ సమధిక గౌరవంబులకు ♦ స్థానములైన మనుష్య రూపముల్
ప్రమదముతోడఁ గైకొని ♦ సు ♦ వాసిత చందన గంధ ఘుంఘుమల్
కమియఁగ వానరుల్ హరుల ♦ గంధగజంబుల మీఁద నెక్కి స
క్రమముగ ముందు వెన్కలను ♦ ప్రక్కల నేగుచునుండి రొయ్యనన్.

చ॥ ద్విపదములన్ బసిండి మణి ♦ తేరులఁ దేజుల నెక్కి ఛత్ర చా
మర విభవంబుతోడ నృప ♦ మాన్య కిరీటములోడ నొప్పు భూ
పరు లెనమండ్రు పంద్రుగురు ♦ భక్తిని నూరెల నిల్చి కొల్చుచున్
సరస మృదూక్తులన్ హిత య ♦ శస్కర వార్తలఁ బల్కుచుండఁగన్.

చ॥ కపికుల కామినుల్ విబుధ ♦ కాంతల రూపము లొంది నిశ్చల
చ్చపలలభంగి హస్తినులఁ ♦ జక్కని గోడిగ లెక్కి చుట్టి రా
విపులకుమారి రిక్కగమి ♦ వెల్గు నిశాకర బింబమో యనన్
దివురులు గట్టు కాంతులను ♦ తేజిలి యేగె విమానమందునన్. ౧౭౩౨

చ॥ ఖచరులు మానులుం బరమ ♦ కౌతుకమందఁ బ్రసూన వర్షమున్
బ్రచురము గాఁగఁ జింద ధర ♦ స్వర్ణ లతాంత మయంబ యౌట నా
యచల వసుంధరాఖ్య యట ♦ సార్థకమై తనరారె రాట్కృపా
విచలిత దృష్టి హేమమయ ♦ వృష్టిఁ బ్రపాతమొనర్చె నిట్లనన్. ౧౭౩౩

ఉ॥ వెన్నెల కాలమందొనరు ♦ పీత జలంబగు వారిదంబు నా
నెన్నఁగ నిన్నినాళ్లు మద ♦ మింతయుఁ గార్పని వారణావళుల్

మన్నని రాకఁగాంచి తమ ♦ మక్కువ లోపల నిల్వఁజాలమిన్
బ్రన్ననఁ ద్రోచికొంచు వెలి ♦ వచ్చెనొకో యనఁ గార్చె నత్తతిన్.

ఉ॥ మూఁగలు మాటలాడుక్రియఁ ♦ బోఁడిమి హేమలొనర్చె వార్యముల్
బాగుగఁ బుష్పవాటికలు ♦ పల్లవితంబులు పుష్పితంబులై
మేఁగెను పువ్వుఁబోండ్ల మెల ♦ మేనులు బంగరు రంగుమీఱె రా
మాగము మెప్పె ధాత్రిని చ ♦ రాచర కోటికి మోద దాయియై.

ఉ॥ రాజ్యము నేలఁగాఁ దగిన ♦ రాముఁ డయోధ్యను చేరి తల్లులన్
బూజ్యుల మ్రొక్కి వేల్పులకుఁ ♦ బూజ లొనర్చి వసిష్ఠు నాజ్ఞమైఁ
బ్రాజ్య ధరాధిదేవియును ♦ పద్మ నివాసిని యుల్లసిల్లఁగా
భోజ్య పదాన్నదంబయిన ♦ భూపతి హర్మ్యముఁ గాంచె నయ్యెడన్.

చ॥ వలువలు వీడఁ జూడకయు ♦ భామలు ధీరులు జాఱుచున్న దు
వ్వలువల మాటిమాటికిని ♦ వారక వీడక చెక్కికొంచు మే
నులు గమనింపనైరి తమి ♦ నూల్కొన నానవమాని చొక్కుచున్
వలువలు జాఱఁగా జరగు ♦ బాగున నొప్పిరి చూచువేడుకన్. ౧౨౩౭

ఉ॥ తొండరచే భుజిష్యకల ♦ దువ్వలువల్ నృపతుల్ ధరించుచున్
జందనగంధు లుద్ది తెలి ♦ చల్వలు పూరుషరాజి తాల్చుచున్
గ్రందుగనున్న గుంపునఁ జొ ♦ రం గలపంబు లలందకున్న నం
దందొరయంగ నిమ్మడిగ ♦ నంటె శరీరము లా జనావలిన్. ౧౨౩౮

ఉ॥ రామ వియోగమైన తఱి ♦ రాములు మోద విహీనలై సదా
నోములు నోచుచుం బతి వి ♦ నోదము లొందకయుండు వారలున్
రాముని రాకతో శుభ క ♦ రంబగు భూషలచేత మేనులన్
భామలు దాఁచినారు తమ ♦ భర్తల చిత్తము పల్లవింపఁగన్. ౧౨౩౯

తే॥ సుర కలాపంబుతో మను♦జుల కలాప, మొరసికొనుటచే నర దేవ♦తరుణులకును
పతులు డాసిన తఱినొక♦కతము కనని, యలుక వొడమె భర్తలమీఁది♦యరమరికను.

చ॥ భరతుని గాంచి రాఘవుఁడు ♦ పావన శీలుని సూర్యపుత్త్రుఁ గ
ర్బురపతిఁ దక్కువారలను ♦ మోదముతోఁ గొనిపోయి యిందు చి
త్తరువులఁ జిత్రదృశ్యములఁ ♦ దన్పుగఁ జూపు మనంగ నాతఁ డ
త్యురుతర గౌరవంబున మ ♦ హోత్సుకతన్ గొనిపోయె లోనికిన్. ౧౨౪౧

—: సుగ్రీవాదులు నగరునందలి చిత్రదృశ్యములఁ గాంచుట :—

తే॥ మిత్రవర్గంబు వెంటరా♦మిహిరకులుఁడు, పెక్కు కక్ష్యలు దాఁటి గం♦భీరమగుచు
మేరువుంబోలె విలసిల్లి♦శ్రీరహించు, సద్మమైన శుద్ధాంతంబు♦సరగఁ జొచ్చె.

చ॥ రవిజ విభీషణాదులు సు ♦ రత్న మయూఖచయంబు లెల్లెడన్
బ్రవిమలకాంతులన్ వివిధ ♦ భంగులఁ జిమ్మటచే భయంబునం
దవిలి మనంబు భావములు ♦ తత్తఱిలం దడఁబాటు నివ్వెరన్
మివుల భజించి మేడుపడి ♦ మేగలి తెప్పల నార్పరైరటన్. ౧౭౪౩

చ॥ హరియురమందు రాజిలు మ ♦ హామణియట్లు వెలుంగు సౌధమున్
వెరగొని కాంచి యెవ్వ రిది ♦ వేడ్క సృజించిరొ తెల్పవే యనన్
భరతుఁడు కుక్షితంద్రికిఁ ద ♦ పఃఫలమై చన మున్ను మెప్పునన్
సరసిజ సంభవుం డొసఁగు ♦ సౌధ వరం బిది నాఁగ వారలున్. ౧౭౪౪

తే॥ కమలవాసిని కిది మేటి♦కాణయాచి, వర్ణనము సేయ మాబోఁటి♦వారు వలఁతు
లగుదురే? యని కేల్మోడ్చి♦యవలనున్న, మండపము చూడఁ బోయిరి♦మందగతుల.

తే॥ రావణానుజాదులు సౌధ♦రాజ మహిమ, వినుతి సేయుచు నుండఁగ♦నినసుతుండు
శ్రీరఘూత్తము పట్టాభి♦షేక దినము, నరయకుండు టేలొకొ యని♦భరతునడిగె.

తే॥ వార్ధుల జలంబు బహుపుణ్య♦తీర్థజలము, వచ్చి చేరుట యొకనాఁటి♦పనియె యనుచు
భరతుఁడాడఁ గపీంద్రుండు♦వాయుపుత్త్రు, మోము గాంచునంత నతండు♦భూమి దాఁటె.

తే॥ కులగురుని తక్క ఋషులను♦పిలువుమనుచు, భరతుఁడనఁగ సుమంత్రుండు♦సరగ నేగి
శిష్య మిత్రబృందముతో వ♦సిష్ఠుఁదోడఁ, బిలుచుకొనివచ్చెఁ దత్సభా♦నిలయమునకు.

శా॥ భక్తిం గైకసుతుండు మానికి నమో ♦ వాకంబు లర్పింప స
న్ముక్తుం డమ్ముని ప్రేమమైఁ దిరముగా ♦ భూదేవి శ్రీదేవియున్
రక్తిఁ జెంద మహేంద్రుచందమున శ్రీ ♦ రాముండు పట్టంబు సం
సక్తిం బొందఁగ రేపె గల్గు శుభ మా♦సాదించు లగ్నంబనన్. ౧౭౪౯

క॥ సురగురు సములౌ తాపస, వరులును రామాభిషేక♦భాస్వల్లగ్నం
బిరవుగ స్వర్ణాక్షరముల, విరచించిర లేఖ లవని♦విభులకు నంపన్. ౧౭౫౦

క॥ దూతలు త్రిలోక వాసుల, కాతతమతిఁ దెల్ప వినిన♦యందఱు నిలువం
జేతము లొల్లమి వచ్చిరి, ప్రీతిన్ వారలను లెక్క♦పెట్టఁగ వశమే? ౧౭౫౧

తే॥ అల వసిష్ఠుతో భరతుఁడు♦నర్కసుతుఁడు, రావణానుజుఁ డంగద♦ప్రముఖ నిఖిల
దనుజ భల్లూక వానర♦మనుజవరులు, కలిసి శ్రీరాము నొద్దకుఁ♦గడఁకఁ జనిరి.

క॥ పట్టాభిషేకమునకున్, నెట్టన శుభదినము రేపె♦నియమిత విధులన్
బట్టుగఁ జేయుము దశరథు, పట్టీ! యని గురుఁడు తనదు♦భవనము చేరెన్.

క॥ నలువ పనుప మయుఁడు శుభా, కలనమునకు రాఘవేంద్రు♦గౌరవమునకున్
వలసినలలి లోకోత్తర, లలితచతుర మండపం బ♦లంకృతిసేసెన్. ౧౭౫౪

ఆ॥ సప్తసాగరముల♦జలములు పుణ్యతీ, ర్థముల జలముఁ దెచ్చి♦తగినచోట్లఁ
బవన తనయుఁడుంచె♦బంధుర పద్ధతి, నంద అరసి వెలఁగు♦నందుకొనఁగ. ౧౭౫౫

తే॥ కువలయేశులు తెల్లని♦గొడుగుతోడ, భద్రకరులపై రత్నకుం ♦ భముల నునిచి
వివిధ వాద్య ధ్వనులు రేఁగి♦విస్తరింప, సరయు జలములఁ దెచ్చిరి♦సరభసమున.

తే॥ వజ్రపాదముల్ మాణిక్య♦ఫలక మమరు, పసిఁడిగద్దె స్ఫటిక మండ♦పమున నొనర
నుంచి రందుపై భుజకీర్తు♦లుల్లసిల్లు, బాహులు వెలుంగ సీతతోఁ♦బ్రభుఁడుచేరె.

—: రాముఁడు పట్టాభిషిక్తుఁ డగుట :—

సీ॥ మంగళగీతంబు ♦ లంగు చెలంగ వే, ద ధ్వనులలర చిం♦దంబు లడర
బహువిధ వాద్యముల్♦ప్రబలంగఁ దాళ మృ, దంగ రావము లుదా♦త్తతఁ జెలంగ
సురలు క్రొవ్విరుల నొ♦త్తరముగఁ గురియంగ, మొదటి వేలుపు మొట్ట♦మొదట వచ్చి
యభిషేక మొనరించె♦నవ్వలఁ బశుపతి, మానులు విప్రులు♦మంత్రివరులు

తే॥ పౌరవృద్ధులు కపిరాజు♦వాయుజుఁడు వి, భీషణుండు మున్నగువారు♦పెరిమతోడ
వచ్చి యభిషేక కార్యంబు♦వాంఛితార్థ, సిద్ధిగాఁగ రాఘవునకుఁ ♦ జేసినారు.

శా॥ ఆనాఁ డొక్కపదంబునే కడుగు ది ♦ వ్యాంభఃప్రసారం బుమా
ధీనుం డెక్కువ మక్కువం గొనుచు నె ♦ త్తిం దాల్చె నాబ్రహ్మయే
యీనాఁ డంగము పూర్తిగాఁ గడుగఁగా ♦ నీనీర మేచోట నీ
శానుం డాదటఁ దాల్చునో యనుచుఁ గాం ♦ తుం జూచి రింద్రామరుల్.

చ॥ మరకత పర్వతం బొకటి ♦ మానుగఁ దోయజరాజిఁ బూచి పెం
దరఁగల నాని రెండు కను ♦ దమ్ములు వీనుల నంటుచుండు నొ
ప్పురవగు నెమ్మితోఁ జెలఁగు ♦ నోజ భజించిన రాము నున్నత
స్ఫురదురు రూపముం గనిన ♦ పుణ్యులు ద్రెంచిరి బంధ దుఃఖముల్.

మ॥ అభిషేక క్రియలెల్ల సక్రమముగా ♦ నారన్ మహాప్రేమ లో
లుభులై మానులు తోడ్పడన్ బనులు చా♦లున్ మూలగా బ్రహ్మ స
న్నిభుఁడా శిష్ట వసిష్ఠమౌని జరుపన్♦నింపెన్ సుమంత్రుండు గో
త్రభిదుం గొల్చు మొనంగు కల్పకము నా♦ద్రవ్యంబు లవ్వేళకున్. ౧౭౬౧

సీ॥ శ్రీరామ పాదుకా♦సేవాభి నిరతుండు, భరతుండు ఛత్రంబుఁ♦బట్టినిలువ
సౌభ్రాత్ర నిధులు ల♦క్ష్మణుఁడు శత్రుఘ్నుండు, వినతులై చామరాల్♦వీచుచుండ
నిత్యానపాయిని♦నిఖిల జగన్మాత, సీత వామాంక సం♦స్థితి రహింప
శ్రీరామ ముద్రికా ♦ చిత్త సంధావని, పావని పదపీఠ♦మై రహింప

తే॥ హరి నిశాచర సామంత♦వరులు బలసి, రామకృత విక్రమములు కీ♦ర్తనము సలిపి
గొలువ రాముఁడు సకల స♦ద్గుణ గణాఢి, రాముఁ డవ్వేళఁ బట్టాభి♦రాముఁడయ్యె.

ఉ॥ శ్రీయును భూమియుం జెలఁగు ♦ శ్రేష్ఠ భుజుండగు రాఘవుండు సం
శ్రేయము లుల్లసిల్లఁగ † వ ♦ సిష్ఠుఁడు దీవనతోడ నుంచు శో
భాయత రత్న శీర్షకము ♦ భవ్య ముహూర్తమునందు భద్ర సం
ధాయి ధరించె లోకము లు♦దార ముదంబునఁ దేలియాడఁగన్. ౧౭౬౩

ఉ॥ శ్రీమకుట మ్మయోధ్యను వ ♦ సిష్ఠుఁడు మిక్కిలుచుండు మక్కువన్
రాము శిరమ్మునం దునుప ♦ రంజిలి మూఁడు జగంబులందు ని
ద్రా మది నెల్ల జీవులకుఁ ♦ దత్పరతం దమ నెత్తిమీఁద ను
ద్దామముగాఁగ నుంచిన వి ♦ ధమ్మునఁ బొమ్మ ముదమ్ము సొమ్ముగన్.

ఉ॥ నోములు చాలకాలముగ ♦ నోచి పదంపడి కోరి పొందు ను
ద్దాము నెడన్ వియోగపడి ♦ తాపము చెంది కృశించి పిమ్మటన్
సేమము నొందు ధారణి వి ♦ శిష్టుని రాముని డాసినంతనే
ప్రేమను దీర్ఘ బాహువుల ♦ బిగ్గఁ గవుంగిలిఁ జేర్చె వేడ్కన్మై. ౧౭౬౫

తే॥ శాస్త్రముఖుని వసిష్ఠుఁడు తెల్పు♦సరణి రామ, విభుఁడు భరతుని శిరమున♦విమలమకుట
మారనిడి పాలనవిధంబు♦లప్పఁజెప్పి, లీల నిత్య సుఖములఁ దాఁ♦దేలుచుండె.

౩౯. వీడుకోలు పటలము (౩౮)

తే॥ భూమిదేవికిఁ దోడవగు♦భూరి రత్న, ఖచిత హేమ మండపమున♦నుచిత పీఠ
మందు మెఱుపును మేఘంబు♦చెందినట్లు, జానకీ రామచంద్రు లా♦సీనులైరి

తే॥ పూర్వగిరిమీఁది రవివలె♦ముకుటమలర, మెఱుపుకరణిముక్తాహార♦ముఱిది వెలుఁగ,
భువన జీవనదాయి జీ♦మూత భాతి, సింహపీఠిపై వెలసెను♦శ్రీకరుండు.

తే॥ మరకతాద్రిపై వెన్నెల♦మాడ్కి చెలుల, కరములందలి వెల్ల చా♦మరలు కదల
నమర నాగ విద్యాధర♦యక్ష సిద్ధ, సాధ్య గంధర్వ గణములు♦సన్నుతింప.

చ॥ తిలకము గల్గు నెన్నుదురు ♦ తీయని జాబిలి తేట వెన్నెలల్
జిలుకఁగ మింటనున్న చలి ♦ చీకటి గొంగ దినక్రమంబునన్
బొలుపఱు రావణాద్యసుర ♦ ముఖ్య వినాశక కీర్తి రూపమున్
జెలువున వెల్లవెల్లి విల ♦ సిల్లి శిరంబుపయిన్ రహింపఁగన్. ౧౭౭౦

† తిరువణ్ణైయ్ నెల్లూరి జటప్ప వంశీయులగు పూర్వు లందీయఁ గైకొని వసిష్ఠుఁడు రత్న కిరీటము శ్రీరాముని శిరమున నుంచెనని మూలము.

ఉ॥ మంగళ గీతముల్ చెలఁగ ♦ మాన్యుల దీవన లెచ్చిరిల్లఁ ద
న్వంగులు పాటపాడుచు ర ♦ సానుగుణంబుగ నర్తిలంగ ని
స్సంగులు నుల్లసిల్ల గుణ ♦ సంగులు మోదమునొంద వాద్యముల్
రంగుగ మ్రోఁగఁ గాహళ వి ♦ రావము పైఁవయి మిన్నుముట్టఁగన్.

చ॥ రవియును సిగ్గిలన్ వెలుఁగు ♦ రత్న కిరీట విభాసులైన మా
నవపతులెల్ల వచ్చి తమ ♦ నవ్య కిరీట చిరత్న రత్న ప
ల్లవ రుచు లంఘ్రి పంకజ వి ♦ లాస వికాసము వన్నె చిన్నెలం
దవిలి విలక్షణంబగు వి ♦ ధంబున మార్పడ మ్రొక్కుచుండఁగన్. ౧౭౭౩

చ॥ సచివులు చేరికం గొలువ ♦ సైన్యపతుల్ జయశబ్దముల్ వచిం
చుచు వినుతింపఁ దమ్ములును ♦ నూరెల నుండఁగ వంది మాగధుల్
రుచిరముగా యశోబ్ధి లహ ♦ రుల్ విజయాంక వినూత్న గీతికా
ప్రచయముతో నుతింపఁ జెలు ♦ వల్ పఠియింపఁగ.మంగళ స్తుతుల్.

క॥ నృపవరులు దనుజవరులుం, గపివరులును పౌరవరులు♦కై వారంబుల్
నిపుణత నొనరింపఁగ రహిఁ, విపంచికల వైణికులు ప్ర♦వీణత చూపన్. ౧౭౭౪

తే॥ దినకర సుతుండు దానవా♦ధీశ్వరుండు, డాసి సేవించి వహి సుచి♦తాసనములఁ
గూరుచుండ రాముఁడు నిండు♦కొలువుసేయు, చుండు తఱివచ్చె గుహుఁడుసే ♦
వోత్కమతిని.

తే॥ పులి కళానంబు దట్టిగాఁ♦బూని కత్తి, నడుమునం జెక్కి నావిక♦నాయకుండు
పరిజనంబుతో వచ్చి శ్రీ♦వరుఁ బ్రదక్షి, ణించి సేవించి యొకవంక♦నిలిచె నొదిఁగి.

క॥ కరుణామయుఁడగు శ్రీరఘు, వరుఁడు తనదిటంపుఁ బ్రేమ♦వారలపై సుం
దర సుస్మితవిధిఁ జూపుచు, నురవుగఁ బలుకాడి యొసఁగె♦నుచితాసనముల్.

తే॥ సత్ప్రవర్తనమున గురు♦జ్ఞానులైన, వార లుచిత వాక్యజ్ఞులు♦ధీరవరులు
నిఖిల కళలఁ బ్రవీణులు♦నీరజాక్షుఁ, గొలిచి తమతమ నేర్పుల♦వెలువరింప.

క॥ నరపతులును తక్కిన వన, చరపతులును దనుజపతులు♦సరసిజనేత్రున్
స్థిరభక్తిఁ గొలిచి యొఱుఁగక, జరపిరి తేలికగ వేడ్కఁ♦జన రెండునెలల్. ౧౭౭౯

ఉ॥ కారణజన్ముఁడైన రఘు ♦ కాంతుఁడు లోకము సంతసింప నీ
తీరున గద్దెపైఁ గొలువు ♦ దీరి ప్రియంబున వచ్చియున్న య
వ్వారల గారవించి పను ♦ పం దలపోసి పశువ్రజంబు బం
గారము క్షేత్రముల్ మణి ని♦కాయ మొసంగెను విప్రకోటికిన్. ౧౭౮౦

క॥ వలసినవి వలసినంతగ, వలచిన యాచకజనంబు♦పరిమోదమునం
దేలఁగ నొసఁగి పదపడి భూ, పుల రమ్మనికోరె రాఘు♦వుఁడు ప్రియమారన్.

క॥ హరులును శిబికలు తేరులు, కరులును మాన్యములు రత్న♦కాంచన భూషాం
బరము లవారిగఁ గానుకఁ, బెరిమను మన్నించి పిదప♦వీడ్కొలొసఁగెన్.

క॥ శంబర మర్దనునకుఁ దా, నింబుగ జనియించు వేళ♦నింద్రుఁ డొసఁగు ర
త్నంబుల కడెములతోఁ జీ, నాంబర తురగాదు లొసఁగె♦నర్క సుతునకున్.

క॥ మును కమలాసనుఁ డిక్ష్వా, కున కొసఁగిన యంగదములఁ♦గొమరుగఁ దనపే
రును సార్థపఱుప నెంచెనొ, యనఁగ నొసఁగె నంగదునకు♦నధికప్రేమన్. ౧౭౮౪

క॥ మఱియును ముక్తాహారము, కరి తురగ స్యందనములు♦కనకాంబరముల్
కరుణించి పిన్నతండ్రికి, నిరవుగఁ దోడగుమ యెల్ల♦యిమ్ముల ననియెన్. ౧౭౮౫

మ॥ ప్రియమారంగఁ గటాక్ష వీక్షణములన్ ♦ వీక్షించి సామీరి న
వ్యయ సాహాయ్య మొనర్చినట్టి ఘను లె♦వ్వారయ్య నీశేవ? నే
దియుఁ గన్పింపదు నీకుఁ బ్రత్యుపకృతిం ♦ దిట్టంబుగాఁ జేయ న
క్షయకీర్తీ! నను గాఁగిలించికొనుమా ♦ గాటంబుగా మారుతీ! ౧౭౮౬

శా॥ మా దేహంబులు నీయవే యనుడు ♦ కై మాటించి వాయూసి నీ
యాదేశంబె యుపాయనంబు మఱి యా ♦ లా? బిడ్డలా? నాకు నీ
పాద ద్వంద్వమె చాలునన్న రఘు భూ♦పాలుండు కేయూర హా
రాదుల్ దువ్వలువల్ మతంగజ తురం♦గాఢ్యంబు లర్పించుచున్.

మ॥ తలిరుంబోఁణి కనర్ఘమైన యొక ము ♦ క్తాదామ మిప్పించి యిం
దుల నెవ్వాని కొసంగ నీమనము సం♦తోషించు నవ్వానికే
లలి నీయం దగు దీవనన్ దన మనకి ♦ క్లాంతిం బ్రమార్జించు క
ర్వలి పట్టింగని యిచ్చె జానకి దయా♦ర్ద్రి స్వాంతయై గ్రక్కున్.

క॥ రిక్కల కాంతులఁ బైకొని, రిక్కల రాయనికి నుపమ ♦ రీతిఁ జెలఁగుచున్
వాక్కాంత యొసఁగు నానర, మొక్కఁడు గాకొక్కఁ డొసఁగె♦నురు భూషణముల్.

క॥ కటకములు హారములు దు, ప్పటములు కేయూరములును♦పటు తురగ మదో
త్కట కరుల నరదముల ను, ద్భట వీరుని నలుని పిలిచి ♦ పార్థివుఁ డొసఁగెన్.

క॥ అతులిత భూషల నొసఁగెను, శతబలికి నమూల్యరత్న♦జవనాశ్వములన్
దతమతి కేసరి కొసఁగెను, ప్రతిలేని సువస్తువులను♦వారని కరుణన్.

ఆ॥ ద్వివిద తార నీల♦గవయ జాంబవదాది, వీరవరులఁ బిలిచి♦ప్రియములాడి
వలసినంత కనక♦వస్తు వాహనముల, నిచ్చనిడి కటాక్ష♦దృష్టిఁ జూచె. ౧౭౯౨

తే॥ గుణ గణాంచిత ఖని వి♦భీషణునిగాంచి, కలుషదూర ! నీసములు నీ♦కంటె లేరు
పసిఁడి కినుము సమంబగు♦పట్టునందు, నేని నీకు సమానులు♦గానరారు. ౧౭౯౩

తే॥ అనుచువినుతించిప్రియమున♦నమరులిచ్చు, కటకములుభద్రజాత్యనే♦కపచయంబు
కనక చేలముల్ కాంభోజ♦ఘనతురంగ, ములను కడు సుగంధ ద్రవ్య♦ముల నొసంగె.

తే॥ శృంగిబేర పురీశు నా♦రంగఁ గాంచి, నీకుఁ దెలుపంగ వలసిన♦నియతు లెవ్వి
యనుచు శ్వేతాశ్వ నికరముల్♦కనక రథ చ,యంబు పీతాంబరము లిచ్చి♦నింబుమీఱ

మ॥ హనుమ జ్జాంబవ దంగద ద్వివిద తా ♦ రాది ప్లవంగేశులన్
దినరాజాత్మజుఁ గాంచి పీడుఁడనుచుం ♦ దెల్పం దలంపంగనై
నను కారానిదె మైన మీపురములన్ ♦ నాణెంబుతో మేలు సం
తనగాఁ గాచుట నాకు ధర్మమగుఁ గా ♦ నన్ వేఁడెదన్ గావుఁడీ.

మ॥ దనుజాధ్యక్షున కాదటన్ వెడలుచో ♦ ధర్మంబుగాఁ దెల్పి మీ
మనముల్ దూరము కావ యంచుఁ బలుకన్ ♦ మన్నించి దైతేయ కీ
శ నిషాదాధిపు లెంతయున్ విడువ ని ♦ చ్ఛన్ లేనివారయ్యు రా
ముని వాక్యంబులు మస్తమం దిడుటయే ♦ ముఖ్యంబుగా నెంచుచున్.

తే॥ భరత లక్ష్మణ శత్రుఘ్న ♦ ధరణిజాత, లను వసిష్ఠు ముగ్గురు తల్లు♦లను గుణాభి
రాము రాముని వలగొని♦ప్రణుతిచేసి, సెలవుగొని మరలిరి తమ♦నెలవుసేర.

తే॥ గుహుని శృంగిబేరమ్మునఁ♦గూర్మి విడిచి, యగచరేంద్రుని కిష్కింధ♦యందు వదలి
కర్బురులు పరివేష్టింప♦గగనవీథి, దైత్యపాలుండు తనరాజ♦ధానిఁ జేరె. ౧౭౯౯

సీ॥ మిత్రులఁ బంపి య♦మ్మిహిర కులేశుండు, తక్క సుహృజ్జన♦తతులతోడ
నీతిమంతుండై య♦నీతిని సద్ధర్మ, హితుఁడయ్యు ధర్మంబు♦నెత్తకుండ
వర్ణాశ్రమాచార♦పరిపాలకుం డయ్యెఁ, దల్లి కూఁతుల నొక్క♦తమిని చూచి
తమ్ములు తన కను♦దమ్ములై వర్తిల్ల, జనులు తండ్రి యటంచు♦జనవుచూప

తే॥ క్షీరసాగరమందున ♦ శేషతల్ప, మందు యోగనిద్రను వీడి ♦ యవతరించి
చెడుగులం ద్రోచి మేలు ర♦క్షించు రామ, చంద్రుఁడేలె జగంబులు♦చలువనొంద.

మ॥ జగదారాధ్యుఁడు రాముఁడై పుడమిలో ♦ జన్మించి దుష్టాత్ములన్
దగ ఖండించి ధరాతలంబున లస ♦ ద్ధర్మంబు నెక్కొల్పి పూ
జ్యగతిం బొల్చిన జానకీ విభుని స ♦ చ్చారిత్రమున్ భక్తి రెయిం
దఁగఁ బల్కన్ వినినన్ సుఖించి యట మీఁ♦దం గాంత్రు కైవల్యమున్.

మంగళ మహాశ్రీ

మంగళము రామునకు ♦ మంగళము తమ్ములకు
మంగళము సంతతము ♦ మైథిలికి వేడ్కన్
మంగళము మారుతికి ♦ మంగళము భారతికి
మంగళము నీతికిని ♦ మానమున కెల్లన్
మంగళము భక్తికిని ♦ మంగళము ధాత్రికిని
మంగళము దీని విను ♦ మాన్యులకుఁ బేర్మిన్
మంగళము పాడికిని ♦ మంగళము ప్రేమకును
మంగళము మంగళము ♦ మంగళమహాశ్రీ.

క॥ శ్రీరామచంద్రు చరితము
శ్రీరామ కృపా కటాక్ష ♦ సేవధి బలిమిన్
శ్రీరామ సుకవి వర్యుఁడు
శ్రీరామార్పణముగా ర ♦ చించెను భక్తిన్.

శ్రీ శ్రీ శ్రీ

శ్రీ విక్టోరియా జూబ్లి ముద్రాక్షరశాల, చిత్తూరు, 20-7-53, కా. 1000.